మన చట్టాలు

దళిత స్త్రీ శక్తి (DSS)

ఆంధ్రప్రదేశ్

ప్రచురణ : **దళిత స్త్రీ శక్తి**

ప్రతులు : **2000**

ప్రతులకు : **దళిత స్త్రీ శక్తి**

యస్ ఆర్ టి - 95, వీధి నెం - 3,

జవహర్ నగర్, చిక్కడపల్లి,

ఫోన్ : 040 - 2760 1557

ఫ్యాక్స్ : 040 - 2760 6777

ఇమెయిల్ : dalit_sthree_sakthi@yahoo.co.in

ప్రింటింగ్ : **సప్తగిరి ఆఫ్‌సెట్ ప్రింటర్స్**

డోర్.నెం. 6-11-16,

11/2 అరండల్‌పేట,

గుంటూరు - 2

ఫోన్ : 0863 - 2252009

విషయ సూచిక

1.	కుటుంబ హింస నుండి మహిళల రక్షణ చట్టం 2005	1	- 44
2.	షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగలపై అత్యాచారాల నిరోధక చట్టం 1989	45	- 64
3.	పౌర హక్కుల పరిరక్షణ చట్టం 1955	65	- 71
4.	జాతీయ షెడ్యూల్డు కులాల కమీషన్ చట్టం 2003	72	- 74
5.	జాతీయ షెడ్యూల్డు తెగల కమీషన్ చట్టం 2004	75	- 77
6.	జాతీయ మహిళా కమీషన్ చట్టం 1990	78	- 83
7.	ఆంధ్రప్రదేశ్ మహిళా కమీషన్ 1998	84	- 85
8.	మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993	86	- 104
9.	సమాచార హక్కు చట్టం 2005	105	- 130
10.	న్యాయ సేవా అధికార చట్టం 1987	131	- 173
11.	ఆంధ్రప్రదేశ్ దేవదాసీ (సమర్పణను నిరోధించు) చట్టం 1988	174	- 175
12.	సఫాయి కర్మచారులకు పని కల్పించడం, మట్టి దొడ్ల నిర్మాణ నిషేధ చట్టం 1993	176	- 184
13.	అనైతిక తరలింపు నిషేధ చట్టం 1956	185	- 207
14.	పూర్వ గర్భధారణ మరియు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994	208	- 227
15.	వైద్య పర్యవేక్షణలో చేయబడే గర్భవిచ్ఛిత్తి చట్టం 1971	228	- 230

16. హిందు వివాహ చట్టం 1955 231 - 245

17. కుటుంబ న్యాయస్థానాల (ఫ్యామిలీ కోర్టులు) చట్టం 1984 246 - 253

18. ప్రత్యేక వివాహ చట్టం 1954 254 - 273

19. వరకట్న నిర్మూలన చట్టం 1961 274 - 278

20. విడాకుల చట్టం 1869 279 - 293

21. ముస్లిం వివాహాల రద్దు చట్టం 1939 294 - 300

22. భారత క్రైస్తవ వివాహ చట్టం 1872 301 - 320

23. బాల్య వివాహాల నిరోధక చట్టం 1929 321 - 322

24. బాల కార్మిక నిషేధం మరియు నియంత్రణ చట్టం 1986 323 - 331

25. బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ చట్టం 2005 332 - 338

26. బాలల ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 339 - 372

27. బాలల న్యాయ (సంరక్షణ మరియు రక్షణ) చట్టం 2000 373 - 400

28. ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్థల్లో వేధింపు నిరోధక చట్టం 1997 401 - 408

29. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 409 - 426

30. మరణ వాంగ్మూలం. 427 - 427

మా మాట

భారతదేశంలో ఉద్యమ నేపథ్యం పరిశీలించినట్లయితే ఎన్నో హెచ్చుతగ్గులు పోరాటక్రమాలు అర్థమవుతాయి. అనేక వుద్యమాలతో పాటు హక్కుల ఉద్యమాలు పెద్దపాత్ర కలిగివున్నాయి. హింస, అత్యాచారాలు, దాడులు జరిగినపుడు న్యాయ పోరాటం చెయ్యాలంటే తప్పని సరిగా మేధావుల పాత్ర వుండాలి. వారి నాయకత్వంలో ఉద్యమాలు జరిగేవి. ఉద్యమాలు కొందరి నాయకుల పర్యవేక్షణలో వారి నాయకత్వం కింద వుండడం అనేది ఇంతవరకూ చలామణీ అయ్యింది. ఏది చెప్పితే అది చెయ్యడం, ఎలా చెప్పితే అలా చెయ్యడం, ఎక్కడికి రమ్మంటే అక్కడికి వెళ్ళడం దగ్గర నుండి మమ్ములను మేము రక్షించుకోగలం వరకు పోరాటాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మేధస్సు అనేది కొందరి సొత్తు కాదు, నాయకత్వం అనేది ఏ వర్గానికీ సొంతంకాదు అనే ఉద్దేశ్యంతో పునాది స్థాయి నుండి బలోపేతం అవ్వాలనీ, హింసలకు, వేదనలకు నిలయాలైన దళిత పల్లెలు మేల్కోవాలనీ అన్ని రంగాల్లో ప్రధాన స్రవంతిలోకి రావాలనే ఉద్దేశ్యంతో దళిత స్త్రీలను, దళిత బాలికలను చైతన్యవంతం చేసేపని 'దళిత స్త్రీ శక్తి' చేపట్టింది. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా అణచబడిన స్త్రీలలో చైతన్యం రావాలి. మనకు ఆకలివేస్తే మనం తింటేనే ఆకలి తీరుతుంది, ఎవరో తింటే మన ఆకలి తీరదు అని చెప్తూ అనేక మార్పులకు దళిత స్త్రీలను సమాయత్తం చేస్తుంది. 'దళిత స్త్రీలపై హింసను అంతమొందించాలి', అంటే జరిగిన హింసకు జరగాల్సిన చర్యలు చేపట్టాలి. మళ్ళీ జరగకుండా వుండాలంటే దళిత స్త్రీలపై, బాలికలకై హింస జరిగిన సందర్భాల్లో నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలి. ఇలా జరగాలంటే ఇంతవరకు ఏఏ పద్ధతుల్లో, ఎలా నిందితులు తప్పించుకున్నారో వాటిపట్ల అవగాహన ఏర్పర్చాలి. మనకు రాజ్యాంగ పరంగా వున్న అనేక ప్రత్యేక చట్టాలను, సదుపాయాలను సామాన్య స్త్రీలు అందుకునేట్టు తీసుకురావాలి. వారిపై జరిగే అన్యాయాలకు వారే నాయకత్వం వహించి ఆత్మగౌరవ పోరాటం చెయ్యాలి. ఈ సంకల్పంతోనే దళిత స్త్రీ శక్తి పనిచేస్తున్న గ్రామాల్లో మహిళా కలయికల నాయకులను

తయారుచేసి అనేక శిక్షణల నివ్వడం జరిగింది. ప్రధానమైన చట్టాలు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశ్యంతోనే ప్రతినిత్యం పనికొచ్చే కొన్ని ముఖ్యమైన చట్టాలను తెలుగులోకి అనువదించాలని ఈ పనికి పూనుకున్నాం. ఈ చట్టాలన్నీ ఇంగ్లీషులో వుండడం వలన, పోలీసు, న్యాయపరమైన అంశాలన్నీ సామాన్య మానవులకు అందని ద్రాక్షల్లా, బూచిలా మారాయి. అందుకే చాలా కష్టతరమైనప్పటికీ కొంతమంది మేధావుల సాయంతో ఈ పనికి పూనుకున్నాం. ఈ చట్టాలను దళిత స్త్రీలు, సామాన్యులు అందుబాటులోనికి తెచ్చుకుని కార్యకర్తలుగా మరింత చురుకైన పాత్ర పోషించడానికి కరదీపికలా వుపయోగపడుతుందని ఆశిస్తున్నాము. ఆంగ్లంలో వుండే చట్టాలను తెలుగులోనికి అనువదించడం అంత సులభం కాదు. ఈ అనువాదానికి సహకరించిన అనేకుల్లో కొందరి కృషి లేకపోతే మాత్రం ఈ పని సాధ్యమయ్యేది కాదు.

శ్రీ ప్రొ. ఎ. సుబ్రహ్మణ్యం, రిజిస్ట్రార్, ఆంధ్రప్రదేశ్ న్యాయ విశ్వవిద్యాలయం, శ్రీ కావూరి సుధ, యం. మాధవి – ఎ.పి. న్యాయ విశ్వవిద్యాలయ లెక్చరర్లు, గెద్దా ప్రకాశరావు రిసెర్చి స్కాలర్, సెంట్రల్ యూనివర్సిటి వారు అనువాదంలో ఎంతో కృషిసల్పి దళిత స్త్రీ శక్తి ఉద్యమానికి చేయూతగా నిలిచి, ఘనతను దక్కించుకున్నందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

'మన చట్టాలు' దళిత స్త్రీల, బాలికల ఆత్మగౌరవ పోరాటానికి అండగా నిలిచి రాబోయే తరాలకు హింసలేని సమాజాన్ని అందించడానికి ఉపయోగపడుతుందని ఆశ.

జై భీమ్‌లతో

దళిత స్త్రీ శక్తి

1. కుటుంబ హింస నుండి మహిళల రక్షణ చట్టం 2005

కుటుంబహింస నుండి మహిళల రక్షణచట్టం-నేపథ్యం :

మానవహక్కులు మగవారికి మాత్రమేనన్న అవగాహన, ధోరణి నుంచి 'మహిళాహక్కులూ మానవహక్కులే' అన్న నినాదం వరకు జరిగినహక్కుల ప్రయాణం సుదీర్ఘమైనదే. 1948 లో సార్వజనీన మానవ హక్కుల ప్రకటన వచ్చిన తర్వాత 1993 న వియన్నా మానవహక్కుల ప్రకటన వరకు అంటే 45 సంవత్సరాలు పట్టిందన్నమాట. మహిళలు గొంతు విప్పకుండా, పిడికిలి బిగించకుండా ఇది జరగలేదు. జరగాల్సిందంతా అయిపోలేదు; ఎక్కువే ఉంది. కుటుంబహింస వ్యతిరేక రక్షణ ఒక మెట్టు మాత్రమే. దీనికి ముందు మహిళా హక్కుల గుర్తింపు ఒకటొకటే జరుగుతూ వచ్చాయి.

స్త్రీలపట్ల అన్ని విధాల వివక్షకు వ్యతిరేకంగా ఒప్పందం :

దీనినే Convention on Elimination of All Forms of Discrimination Against Women (CEDAW) అంటారు. 1946 లో ఐక్యరాజ్య సమితి ఏర్పరిచిన కమీషన్ అన్ని రంగాలలో స్త్రీల స్థితిగతులపై ఓ సమగ్ర నివేదిక రూపొందించింది. ఈ నివేదిక ఆధారంగా 1979 డిసెంబర్ 18న ఐక్యరాజ్య సమితి స్త్రీలపట్ల అన్నివిధాల వివక్షకు వ్యతిరేకంగా ఒప్పందం ఆమోదించింది. ఇది అంతర్జాతీయ చట్టంగా, ఒడంబడికగా 1981 సెప్టెంబర్ 3న అమలులోకి వచ్చింది. స్త్రీల సమానత్వ స్థాయిని గుర్తిస్తూ, వారి అభ్యున్నతికి దోహదపడేందుకు అవసరమైన అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఏ రంగంలోనయినా లింగం ఆధారంగా ఎటువంటి ఆంక్షలుగాని, వ్యత్యాసం గాని చూపితే అది లింగవివక్షే అవుతుందని ఈ ఒప్పందం నిర్వచిస్తుంది. ఆరుభాగాల్లో 30 నిబంధనలతో రూపొందిన ఈ ఒప్పందం అన్ని కోణాలనుంచి మహిళల సమానత్వానికి, సాధికారతకు అజెండా పొందుపర్చింది. ప్రపంచంలో సగం అయిన మహిళలను మానవహక్కుల పరిధిలోకి తెచ్చేందుకు ఈ ఒప్పందం దోహదమయింది. చట్టంలోహక్కులు వచ్చినా మనస్సుల్లో మార్పు అంత సులభంగా వచ్చేదేంకాదు. అందుకే అంతర్జాతీయ మహిళా సమావేశాలు, ఐక్యరాజ్య సమితి మహిళా దశాబ్దం (1980-1990) లాటివి, మరెన్నో అంతర్జాతీయ ప్రకటనలు, సమావేశాలు జరిగాయి. వీటిలో 1993 లో వియన్నాలో జరిగిన ప్రపంచ మానవ హక్కుల సమావేశం, 1995 లో జరిగిన బీజింగ్ అంతర్జాతీయ మహిళా సమావేశం ప్రముఖమైనవి. మహిళలపై వివక్ష, హింసను నిర్మూలించే దిశగా జరిగిన కృషిలో ఇవన్నీ మైలురాళ్ళు. వీటన్నింటి ఫలితంగా CEDAW లోని అంశాలను అమలుపర్చాలనే వత్తిడి అన్ని దేశాల ప్రభుత్వాలపై పెరిగింది. ఇప్పటికి 160 దేశాలు CEDAW ను అంగీకరించాయి. అంటే ఆ ఒప్పందం ప్రకారం మహిళల హక్కులను తమ దేశ చట్టాలలో, ఆచరణలో, విధానాలలో అమలుపరుస్తామని ఒప్పుకున్నాయి. అందుకే మనదేశంలో కూడా CEDAW కు అనుగుణంగా చట్టాలు, విధానాలు రూపొందించమని మహిళాసంఘాలు ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి శాసన మార్పులు ఎన్నో సాధించుకున్నారు. అందులో భాగమే ప్రస్తుతం వచ్చిన కుటుంబహింస నుంచి మహిళలకు రక్షణ చట్టం 2005.

కుటుంబహింస :

కుటుంబహింస చాలాపాతదే. దాని గురించి మాట్లాడడం దానిని అరికట్టే ప్రయత్నం మాత్రమే ఇటీవలిది. కుటుంబహింస అంతర్జాతీయం. ఇంట్లో ఆడవారిని (భార్య, అక్క, చెల్లి, తల్లి తదితరులు) కొట్టటంలో అన్ని దేశాల మగవారూ ఒకటే. యునిసెఫ్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఒక పరిశోధనలో ప్రపంచవ్యాప్తంగా కుటుంబహింస 20 నుంచి 50 శాతం వరకు ఉంది అని నిర్ధారించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన నివేదికలో కుటుంబ హింస ప్రపంచవ్యాప్తంగా ఎంతో విస్తృతంగా ఉందని తేలింది.

ఇంట్లో సొంత వారి వద్ద ఎక్కడైతే రక్షణ ఉండాలో మహిళలకు అక్కడే రక్షణ కరువవుతుంది. నాలుగు గోడలమధ్య జరిగేది కనుక బైటికి పొక్కదు. పొక్కినా వాడి పెళ్లాం వాడు కొట్టుకుంటాడు, తిట్టుకుంటాడు అడిగేందుకు మనమెవరం అనేది ఉండనే ఉంది. కుటుంబహింస అంతర్జాతీయం కనుక దాన్ని అరికట్టే ప్రయత్నాలూ అంతర్జాతీయంగానే జరిగాయి. "మహిళలకు వ్యతిరేకంగా జరిగేహింస అంతమొందించేందుకై ఐక్యరాజ్యసమితి ప్రకటన 1993" లో మొదటిసారిగా కుటుంబహింసను నిర్వచించింది. ఈ నిర్వచనం చాలా విస్తృతంగా ఉండి మహిళలపై కుటుంబంలో జరిగే హింసను అన్ని కోణాల నుంచి నిషేధించింది. ప్రతినిత్యం, జీవితపర్యంతం హింసకు గురవుతూ ఏ నిమిషానికి ఏం జరుగుతుందో అన్న భయంతో పూర్తిగా మానవహక్కులు కోల్పోయి జీవించే మహిళల్ని ఈ నిత్య హింసనుంచి రక్షించాల్సిన బాధ్యత రాజ్యాంగ యంత్రం నిర్వర్తించాలని ఐక్యరాజ్యసమితి ఈ ప్రకటనలో సూచించింది. ఈ ఐక్యరాజ్య సమితి ప్రకటన మహిళల గురించి హింసపై మాత్రమే కేంద్రీకరించి రూపొందించిన మొట్టమొదటి అంతర్జాతీయ చట్టం. తర్వాత వచ్చిన ఎన్నో పరిణామాలకు ఈ ప్రకటన నాంది అయ్యింది.

1994లో మహిళలపై హింసను ప్రత్యేకంగా అధ్యయనం చేసి అందుకు ప్రభుత్వాలను బాధ్యత వహింప చేసేందుకు మానవహక్కుల కమీషన్ ఆధ్వర్యంలో ఓ కమిటి నియమితమైనది. 1995 బీజింగ్ అంతర్జాతీయ మహిళా సమావేశం రూపొందించిన 12 వ్యూహాత్మక ఉద్దేశ్యాల ప్రకటనలో మహిళలపై హింసను అరికట్టడం ముఖ్యమైనది. 1979 నాటికే వచ్చిన మహిళలపై అన్ని విధాల వివక్ష వ్యతిరేక ఒప్పందం (CEDAW) లో మహిళలపై హింస గురించి ప్రత్యేక ప్రస్తావన లేకపోయినా ఆ ఒప్పందం అమలుకై నియమితమైన కమిటి 1992 లో మహిళలపై హింస, వివక్ష అవుతుందని తన సిఫార్సులలో (నెం. 19) పేర్కొనింది. అయితే 1999 లో ఈ ఒప్పందానికి అనుబంధంగా రూపొందించిన Optional Protocol - II లో మహిళలపై హింసకు వ్యతిరేకంగా కమిటికి ఫిర్యాదులు చేసుకునే సౌకర్యం వుంది. ఈ పరిణామాల నేపధ్యంలో కొన్ని దేశాల కూటములు మహిళలపై హింసకు వ్యతిరేకంగా తమ ప్రాంతాలలో వర్తించే ప్రాంతీయ ఒడంబడికలు రూపొందించుకున్నాయి. అవి : మహిళలపై హింసను అరికట్టడం, శిక్షించడం, నిర్మూలించడం పై అంతర అమెరికన్ ఒప్పందం; మానవుల, ప్రజలహక్కులపై ఆఫ్రికన్ ఒప్పందం; దీనికి అనుబంధంగా మహిళా హక్కులపై Optional Protocol.

ఈ ప్రకటనలు, ఒడంబడికలే కాక అంతర్జాతీయంగా కుటుంబ హింసపై అధ్యయనం, కుటుంబ హింసకు వ్యతిరేకంగా ప్రచార ఉద్యమం ఎంతో జరిగింది. తత్ఫలితంగా కుటుంబహింస నుంచి మహిళలకు రక్షణ కల్పిస్తూ 44 దేశాలలో చట్టాలు వచ్చాయి.

ఈ అంతర్జాతీయ పరిణామాల నేపధ్యంలో భారతదేశంలో కూడా మహిళా ఉద్యమాలు కుటుంబహింసకు వ్యతిరేకంగా ఉద్యమించటంతో 1980 దశకంలో శిక్షాస్మృతిలో సవరణలు వచ్చాయి. భారత శిక్షాస్మృతిలో 498ఎ, 304బి, సెక్షన్లు 1983, 1986 లలో చేర్చబడ్డాయి. భార్యను కట్నం కోసం క్రూరంగా హింసించడం, వరకట్న హత్యలు ప్రత్యేక నేరాలుగా నిర్వచించబడ్డాయి. ఐతే ఈ నేరాలు వరకట్నం కోసం జరిగినట్లు చూపించవలసి రావటం వలన ఇతరత్రా కుటుంబ హింస ఈ సెక్షన్లు క్రింద రాదు. అంతే కాక ఈ నేరాలు భార్యలపై జరిగే హింసకు మాత్రమే వర్తిస్తాయి. ఇతర మహిళలపై (అక్క, చెల్లి, తల్లి) జరిగే కుటుంబ హింసకు వర్తించదు.. అంతే కాక కుటుంబహింసకు గురవుతున్న మహిళలకు రక్షణ, నష్టపరిహారము తదితర అన్ని అంశాలను సమగ్రముగా ఒకే గొడుగు క్రిందకు తీసుకువచ్చే చట్టం ఏదీలేదు. ఈ నేపథ్యంలో అనేక సంఘాలు కుటుంబ హింసపై ఓ సమగ్ర చట్టం కోసం డిమాండ్లు లేవనెత్తారు. ఒక నమూన చట్టం రూపొందించి అలాంటి చట్టం ఉండాలని ప్రచారం జరిపారు. దేశవ్యాప్త డిమాండ్లకు స్పందించి పార్లమెంటు 2001లో కుటుంబ హింసపై ఒక బిల్లు ప్రవేశపెట్టింది. ఐతే ఈ బిల్లు అంతా లొసుగుల మయం అని పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చింది. మహిళాసంఘాల, ప్రజాస్వామ్య సంస్థల వ్యతిరేకతను చూసి ఆ బిల్లును చట్టం చేయకుండా మార్పులకై స్టాండింగ్ కమిటికి పంపించారు. స్టాండింగ్ కమిటి పరిశీలనా, మార్పుల అనంతరం చట్టం వచ్చింది.

కుటుంబ హింస నుండి మహిళల రక్షణచట్టం - 2005

(2005 లో 43 వ చట్టం)

రాజ్యాంగంలో మహిళలకు పొందుపరచబడిన హక్కులను సమర్థవంతంగా రక్షించేందుకై కుటుంబ హింసకు గురౌతున్న మహిళల రక్షణ కొరకై కుటుంబ హింస తత్సంబంధిత అంశాలపై ఈ చట్టం చేయటం జరిగింది.

సార్వభౌమ్య భారతదేశం ఏర్పడిన 56వ సంవత్సరంలో పార్లమెంటులో ఈ చట్టం ఈ క్రింది విధంగా చేయబడుతుంది.

ఉద్దేశాలు మరియు కారణాల ప్రకటన

1. కుటుంబహింస మానవహక్కుల సమస్యే అనే దాంట్లో సందేహం లేదు. కుటుంబహింస అభివృద్ధిని కుంటుపరుస్తుంది. 1994 వియన్నా ఒప్పందం, 1995న బీజింగ్‌లో ప్రకటించబడిన కార్యాచరణ ప్రణాళిక ఈ అంశాన్ని సూచిస్తున్నాయి. CEDAW కు సంబంధించిన ఐక్యరాజ్యసమితి కమిటి తన సాధారణ సిఫారసు నెం. XII (1989) లో అన్ని దేశాలు తమ తమ దేశాల్లో మహిళలపై హింసకు వ్యతిరేకంగా, ప్రత్యేకించి కుటుంబహింసకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని సూచించింది.
2. కుటుంబహింస ఎంతో విస్తృతంగా వుంది. కానీ ఇది చాలావరకు ప్రజాబాహుళ్యం దృష్టికిరాదు. ప్రస్తుతం ఒక మహిళను ఆమె భర్తగానీ, అతని బంధువులుకానీ హింసిస్తే అది భారత శిక్షాస్మృతి 498A క్రింద నేరం. సివిల్ చట్టాలలో కుటుంబహింస గురించి పూర్తి ప్రస్తావనలేదు.
3. ఈ నేపధ్యంలో భారతరాజ్యాంగంలోని అధికరణం 14, 15, 21 ని దృష్టిలో వుంచుకొని మహిళలను కుటుంబహింస నుంచి రక్షించే వుద్దేశ్యంతో సివిల్ చట్టాలలో తగిన పరిహారం పొందుపర్చాలని తద్వారా సమాజంలో కుటుంబహింసను అరికట్టాలని ఒక చట్టం చేయదల్చింది.

4. తదనుగుణంగా ఈ బిల్లు ఈ క్రింది విషయాలను పొందుపర్చేందుకు ఉద్దేశించింది.

i) హింసను ప్రయోగించే వ్యక్తితో అదే ఇంట్లో వుండే మహిళగానీ లేదా అతనితో రక్త సంబంధం ద్వారాగానీ, వివాహం వల్ల గానీ, దత్తతవల్ల గానీ అతనితో కలిసి వుంటున్న మహిళల కొరకై ఈ చట్టం వుద్దేశించబడింది. అంతే కాకుండా ఉమ్మడి కుటుంబంలోని కుటుంబ సభ్యులతో కూడిన సంబంధాలు కూడా వర్తిస్తాయి. సోదరి, విధవరాలు, తల్లులు, వంటరిస్త్రీలు లేదా హింసిస్తున్న పురుషునితో కలిసి జీవిస్తున్న వారందరికీ కూడా ఇప్పుడు చేయబడుతున్న చట్టం యొక్క రక్షణ వర్తిస్తుంది. ఈ బిల్లు ద్వారా భార్య లేదా అతనితో వివాహసంబంధంతో జీవిస్తున్న మహిళలకు తమ భర్త లేదా పురుషభాగస్వామి బంధువులపై ఫిర్యాదు చేసే అవకాశం కూడా కల్పించడమైనది. కానీ సదరు భర్త లేదా పురుషభాగస్వామి యొక్క బంధువులయిన మహిళలు అతని భార్యలే అతని మహిళాభాగస్వామిపై ఫిర్యాదు చేయడానికి లేదు.

ii) ఈ బిల్లు కుటుంబ హింసను విస్తృతంగా నిర్వచించింది. వాస్తవంలో హింసించడం లేదా హింసను ప్రయోగించ బోతున్నాడనే భయాన్ని కలిగించడం రెండూకూడా కుటుంబహింస క్రిందకే వస్తుంది. భౌతిక, లైంగిక, మౌఖిక, భావపూరిత, ఆర్థిక పరమైన హింసలన్నీకూడా కుటుంబహింస నిర్వచనం క్రిందకే వస్తాయి. మహిళను లేదా ఆమె బంధువులను చట్టవ్యతిరేకమైన వరకట్న వేధింపులకు గురిచేయడం కూడా కుటుంబహింస నిర్వచనం క్రిందికి తేవడం జరిగినది.

iii) భద్రతతో కూడిన నివాస హక్కులను ఈ బిల్లు మహిళలకు కల్పిస్తుంది. ఒక మహిళకు తన మెట్టినింట్లో నివసించే హక్కును కల్పిస్తుంది. అది ఉమ్మడి కుటుంబం గానీ, లేదా భాగస్వాముల ఇల్లు గాని లేదా మహిళకు ఆ ఇంటిపై హక్కులు వున్నా లేకున్నా ఈ నివసించే హక్కు కల్పించడమైనది. ఈ నివసించే హక్కును మేజిస్ట్రేటు ఉత్తర్వులు ద్వారా ఆ మహిళ పొందవచ్చు.

iv) బాధితురాలైన మహిళపై పురుషుడు కుటుంబహింస ప్రయోగించనీయకుండా రక్షించేందుకు ఉత్తర్వులు ఇచ్చే అధికారం మేజిస్ట్రేటుకు కల్పించడమైనది. ఫిర్యాదుకు గురైన పురుషుడు (ప్రతివాది) ఆమెపై కుటుంబ హింస జరపడం లేదా ప్రోత్సహించడం గానీ లేదా ఏదైనా ఇతర చర్యలు తీస్కోవడం గానీ లేదా ఆమె సంచరించే ప్రాంతంలోనికి ప్రవేశించడం గానీ, ఆమెతో సంభాషించేందుకు ప్రయత్నించడం గానీ, వారిద్దరూ ఉమ్మడిగా ఉపయోగించే ఆస్తులనుంచి ఆమెను వెలివేయడంగానీ, ఆమెపై లేదా ఆమెకు సహాయకులుగా వున్న బంధువులు, తదితరులపై హింస ప్రయోగించడం గానీ లాటి చర్యలు నిషేధిస్తూ మేజిస్ట్రేటు ఉత్తర్వులు ఇచ్చే అవకాశం కల్పించారు.

v) ఈ బిల్లు సంరక్షణ అధికారుల్ని నియమించడమేకాక బాధిత మహిళకు వైద్య పరీక్షలు, న్యాయ సహాయం, భద్రతతో కూడిన నివాసం తదితర సేవలనందించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు తమ సంస్థల్ని నమోదు చేసుకొనేందుకు అవకాశం కల్పిస్తుంది.

5. పై ఉద్దేశాల్ని సాధించేందుకు ఈ బిల్లు చేసారు. యిందులోని క్లాజులకు అనుబంధంగా వున్న వివరణలు బిల్లులోని వివిధ అంశాలను వివరిస్తాయి.

అధ్యాయం - 1

ప్రాథమిక విషయాలు

1. ఈ చట్టం పేరు, పరిధి అమలులోకి వచ్చే సమయం :

1. ఈ చట్టాన్ని కుటుంబ హింసనుండి మహిళల రక్షణ చట్టం 2005 అనవచ్చు.
2. జమ్మూ – కాశ్మీర్ రాష్ట్రం మినహా భారతదేశం యావత్తూ ఈ చట్టం వర్తిస్తుంది.
3. కేంద్రప్రభుత్వం నిర్ణయానుసారంగా రాజపత్రంలో ప్రకటించిన తేదీ నుంచి ఈ చట్టం అమలులోకి వస్తుంది.

2. నిర్వచనాలు :

సందర్భానుసారంగా వేరే అర్థం వస్తే మినహా, ఈ చట్టంలో ఈ క్రింది పదాలకు అర్థాలు ఇవి :

అ) 'బాధితవ్యక్తి' అనగా ప్రస్తుతం గాని, గతంలో గాని ప్రతివాది అయిన పురుషుడితో కుటుంబ సంబంధంలో ఉండి అతని వలన కుటుంబ హింసకు గురయినట్లు ఫిర్యాదు చేసిన మహిళ అని అర్థం.

ఆ) 'బాలలు' అనగా 18 సంవత్సరాలలోపు వ్యక్తి. సవతి తల్లి పిల్లలు వారు దత్తత ద్వారా, లేదా పెంచుకుంటున్న పిల్లలయినా ఈ నిర్వచనం క్రిందికే వస్తారు.

ఇ) 'నష్టపరిహారపు ఉత్తర్వులు' అనగా సెక్షన్ 22 క్రింద ఇచ్చిన ఉత్తర్వులు అని అర్థం.

ఈ) 'సంరక్షణ ఉత్తర్వులు' అనగా సెక్షన్ 21 క్రింద ఇచ్చిన ఉత్తర్వులు అని అర్థం.

ఉ) 'కుటుంబ సంఘటన నివేదిక' అనగా బాధితురాలి నుండి ఫిర్యాదు అందిన తర్వాత నిర్దేశించిన నమూనాలో కుటుంబహింస సంఘటనపై తయారు చేసిన నివేదిక అని అర్థం.

ఊ) 'కుటుంబ సంబంధం' అనగా ఇద్దరు వ్యక్తులు వివాహం చేసుకొని గాని లేదా వైవాహిక సంబంధంలాగా కలిసి జీవించియున్నా లేదా రక్త సంబంధంద్వారా లేదా దత్తత లేదా ఉమ్మడి కుటుంబ సంబంధం ద్వారా కలిసి ఒకేయింట్లో నివసించియున్నా లేదా ప్రస్తుతం జీవిస్తున్నా అది కుటుంబసంబంధం అని అర్థం.

ఎ) 'కుటుంబహింస' అనగా సెక్షన్ 3 లో నిర్వచించిన విధంగా జరిగేహింస అని అర్థం.

ఏ) 'వరకట్నం' అనగా వరకట్న నిషేధపు చట్టం 1961 సెక్షన్ 2లో నిర్వచించిన విధంగానే అర్థం చేసుకోవాలి.

ఐ) 'మేజిస్ట్రేటు' అనగా నేరవిచారణ స్మృతి 1973 ప్రకారం బాధితురాలు తాత్కాలికంగా నివసిస్తున్న ప్రాంతం లేదా ప్రతివాది నివసిస్తున్న ప్రాంతం లేదా కుటుంబహింస జరిగిన ప్రాంతాలలో అధికారం కల్గిన మొదటిశ్రేణి మేజిస్ట్రేట్ లేదా మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అని అర్థం.

ఒ) 'వైద్యసదుపాయం' అనగా ఈ చట్టం నిమిత్తం వైద్యసదుపాయంగా పరిగణించాలని ప్రకటించిన ఏదేని వైద్యసదుపాయం అని అర్థం.

ఓ) 'ఆర్థిక పరిహారం' అనగా ఈ చట్టంక్రింద విచారణ జరుగుతున్నప్పుడు మేజిస్ట్రేట్ ఉత్తర్వుల ప్రకారం ప్రతివాది బాధితురాలికి కుటుంబహింస వలన జరిగిన నష్టం మరియు ఖర్చుల నిమిత్తం చెల్లించవలసిన పైకము అని అర్థము.

ఔ) 'నోటిఫికేషన్' అనగా రాజపత్రంలో చేయబడిన ప్రకటన. 'ప్రకటించారు' అనే పదం తదనుగుణంగా అర్థంచేసుకోవాలి.

అం) 'నిర్దేశించిన' అనగా ఈ చట్టం అనుగుణంగా నిర్ధేశించిన నిబంధనలు అని అర్థం.

అ:) 'సంరక్షణ అధికారి' అనగా సెక్షన్ 8(1) అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అధికారి అని అర్థం.

క) 'సంరక్షణ ఉత్తర్వు' అనగా సెక్షన్ 18 క్రింద ఇచ్చిన ఉత్తర్వులు అని అర్థం.

ఖ) 'నివాసపు ఉత్తర్వు' అనగా సెక్షన్ 19(1) అనుగుణంగా ఇచ్చిన ఉత్తర్వు అని అర్థం.

గ) 'ప్రతివాది' అనగా బాధితురాలితో ప్రస్తుతం లేదా గతంలో కుటుంబ సంబంధం కలిగియుండి ఇప్పుడు బాధితురాలిచే ఈ చట్టం క్రింద పరిహారం కోసం ఆరోపణలకు గురయిన ప్రౌఢుడైన (adult) పురుషుడు. భార్యే గాక పురుషునితో వైవాహిక సంబంధంలాంటి జీవితం గడుపుతున్న మహిళ కూడ ఈ చట్టం క్రింద ఫిర్యాదుచేయవచ్చు.

ఘ) 'సహాయక సంస్థ' అనగా సెక్షన్ 10(1) క్రింద రిజిష్టర్ అయిన సంస్థ.

న) 'భాగస్వామ్య నివాస గృహం' (Shared House Hold) అనగా బాధితురాలు ప్రస్తుతం గాని గతంలో గాని ఒక్కతే గాని ప్రతివాదితో కలిసిగాని నివసించిన ఇల్లు. అంతేగాక తనకు తనుగాని ప్రతివాదితో కలిసి గాని సొంతదారుగా లేదా అద్దెకు గాని కలిగియున్న ఇల్లు, లేదా వీరిద్దరిలో ఎవరికైనా హక్కులు కలిగియున్న ఇల్లు. ప్రతివాది ఉమ్మడి కుటుంబానికి చెందిన ఇల్లు అయి ప్రతివాదికి లేదా బాధితురాలికి హక్కులు ఉన్నా లేకున్నా అటువంటి ఇల్లు కూడ ఈ నిర్వచనం క్రిందికే వస్తుంది.

చ) 'సంరక్షణ గృహం' (Shelter home) అనగా ఈ చట్టం నిమిత్తం సంరక్షణ గృహంగా రాష్ట్రప్రభుత్వంచే ప్రకటించిన ఏదేని గృహం.

అధ్యాయం - 2

కుటుంబ హింస

3. కుటుంబ హింస నిర్వచనం :

ప్రతివాది చేసే ఏదేని చర్యగాని, లోపం గాని, లేదా పని లేదా ప్రవర్తన గాని ఈ క్రింది పేర్కొనిన ఫలితాలకు దారి తీస్తే అది ఈ చట్టం క్రింద కుటుంబ హింస అవుతుంది.

అ) బాధితురాలి ఆరోగ్యం, భద్రత, ప్రాణం లేదా శరీర అవయవాలు లేదా సౌఖ్యజీవనం దెబ్బతీసే

విధంగా భౌతికంగా లేదా మానసికంగా గాయపర్చినా, హాని కల్గించినా అది కుటుంబ హింస అవుతుంది. భౌతిక, లైంగిక, మౌఖిక, ఉద్వేగపూరిత, ఆర్థిక పరమైన అన్ని రకాల హాని కుటుంబ హింస క్రిందికే వస్తుంది.

ఆ) వరకట్నం లేదా ఏదేని ఆస్తి లేదా యితర విలువగల్గిన వస్తువులు తెమ్మని బాధితురాల్ని లేదా ఆమె చుట్టాలను వేధించినా, గాయపర్చినా, హాని కల్గించినా అది కుటుంబ హింస అవుతుంది;

ఇ) ప్రతివాది చేసిన ఏ చర్యలైనా పైన పేర్కొన్న (అ) లేదా (ఆ) లోని ప్రభావాన్ని బాధితురాలిపై లేదా ఆమె చుట్టాలపై కల్గిస్తే అది కుటుంబ హింసే అవుతుంది;

ఈ) బాధితురాలికి భౌతికంగా లేదా మానసికంగా ఇతరత్రా గాయపర్చినా లేదా హాని కల్గించినా అది కుటుంబహింసే.

వివరణ : ఈ సెక్షను నిమిత్తం :

i) 'భౌతికహాని' అనగా ఏదేని చర్య లేదా ప్రవర్తన ద్వారా శారీరకంగా నొప్పి కల్గించడం, లేదా ప్రాణానికి అవయవాలకు లేదా ఆరోగ్యాన్ని హానిచేయడం లేదా ఆరోగ్యాన్ని కుంటుపర్చటం, బాధితురాలి అభివృద్ధిని ఆటంకపర్చటం లాంటివి అని అర్థం. దాడి చేయబూనుకోటం, బెదిరించడం, నేరపూరితమైన బలప్రయోగం చేయటం లాంటి చర్యలు కూడ భౌతిక హానిగానే పరిగణించాలి.

ii) 'లైంగికహాని' అంటే మహిళను కించపర్చే విధంగా, స్థాయిని దిగజార్చే విధంగా లేదా మరేవిధంగానైనా మహిళ గౌరవాన్ని న్యూనత పర్చే లైంగిక ప్రవర్తన అని అర్థం.

iii) 'మౌఖిక మరియు ఉద్వేగపూరితహాని' అంటే

అ) వెక్కిరింతలు, కించపర్చే మాటలు, న్యూనత కల్గించే పేర్లు పెట్టి ఎగతాళి చేయటం ముఖ్యంగా గొడ్రాలనో లేదా మగపిల్లలు లేరనో గేలిచేయడం మరియు,

ఆ) బాధితురాలికి ఇష్టమైన వారిని గాయపరుస్తామని పదేపదే బెదిరించడం

iv) 'ఆర్థిక హాని' అంటే

అ) బాధితురాలికి చెందవల్సిన ఆర్థిక వనరులు, అవి సాంప్రదాయహక్కుగా సంక్రమించినవి గాని లేదా కోర్టు ఉత్తర్వుల వల్ల చెల్లించవల్సినవి గాని కావచ్చు. అదేవిధంగా ఏదేని స్త్రీ ధనం ఆమె పేరున గానీ ఇతరులతో కలిసి భాగస్వామ్యంగా నున్నది గాని అంటే అటువంటి ఆస్తి నుండి రావల్సిన అద్దెలు లేదా భరణం కావచ్చు. ఇలా బాధితురాలికి న్యాయంగా చెందవల్సిన ఆర్థిక వనరులను ఆమెకు అందనీయకుండా చేసి తద్వారా ఆమె తన కుటుంబ అవసరాలకు లేదా తన పిల్లల అవసరాలకు ఇబ్బంది పడేట్లు చేయడం.

ఆ) కుటుంబ సభ్యురాలిగా బాధితురాలికి అనుభవించే హక్కును లేదా ఆమె పిల్లలకు చెందాల్సిన హక్కును లేదా ఆమెకు తన స్త్రీ ధనంగా చెందాల్సిన హక్కును నిరాకరించాలనే ఉద్దేశ్యంతో గృహోపకరణాలు, పరికరాలు, ఇతర స్థిర, చరాస్తులను, విలువగల వస్తువులను, బాండ్లను అమ్మివేయటం లేదా బదలాయించడం.

ఇ) ఉమ్మడి గృహంతో సహా ఇతర ఆర్థిక వనరులపై సౌకర్యాలపై, కుటుంబ సంబంధంగా బాధితురాలికి కల్గిన హక్కులను నిరాకరించడం లేదా నిషేధించడం.

వివరణ II : ప్రతివాది చేసిన ఏదేని చర్య, లోపం లేదా ప్రవర్తన ఈ సెక్షను క్రింద 'కుటుంబహింస' అవుతుందా లేదా అని నిర్ణయించేందుకు ఈ కేసు పూర్వపరాలు, సంబంధిత అన్ని వాస్తవాలు, పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.

అధ్యాయం - 3

సంరక్షణాధికారుల సహాయక సంస్థల అధికారాలు - విధులు

4. రక్షణాధికారికి సమాచారం, సమాచార మిచ్చిన వ్యక్తికి రక్షణ :

అ) కుటుంబహింస జరిగినదని గాని లేదా జరుగుతున్నదని గానీ, లేదా జరిగే అవకాశం ఉందని గాని తెలిసిన ఏ వ్యక్తి అయినా సంబంధిత రక్షణాధికారికి సమాచారం ఇవ్వవచ్చు.

ఆ) ఏ వ్యక్తి అయినా చిత్తశుద్ధితో పైన చెప్పిన సమాచారం ఇచ్చినందుకు అతనిపై ఎటువంటి సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనేందుకు లేదు.

5. పోలీసు అధికారులు, సహాయక సంస్థలు, మేజిస్ట్రేట్లు విధులు :

ఏదైనా పోలీసు అధికారికి లేదా సేవాసంస్థకు, సంరక్షణాధికారికి లేదా మేజిస్ట్రేటుకు కుటుంబహింస గురించిన ఫిర్యాదు అందినా, లేదా కుటుంబహింస జరిగిన సంఘటన వద్ద వారు ఉండినా లేదా వారికి కుటుంబహింస గురించి సమాచారం అందినా వారు బాధితురాలికి ఈ క్రింది విషయాలు తెలియజేయాలి.

అ) పరిహారం కొరకు బాధితురాలు అర్జీ చేసుకోవచ్చని తద్వారా సంరక్షణ ఉత్తర్వులు, ఆర్థిక పరిహారపు ఉత్తర్వులు, కస్టడీ ఉత్తర్వులు, నివాస ఉత్తర్వులు, నష్టపరిహారపు ఉత్తర్వులు, లేదా వీటిలో ఒకటి కంటే ఎక్కువ ఉత్తర్వులు గాని పొందవచ్చని తెలియజేయాలి,

ఆ) సహాయక సంస్థల సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పాలి,

ఇ) సంరక్షణ అధికారుల సేవలు అందుకోవచ్చని చెప్పాలి,

ఈ) న్యాయ సేవల చట్టం 1987 క్రింద ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని చెప్పాలి,

ఉ) భారత శిక్షాస్మృతి 1860 లోని సెక్షన్ 498ఎ క్రింద ఫిర్యాదు చేసే హక్కు ఆమెకు ఉందన్న విషయం తెలియజేయాలి, అయితే ఈ చట్టంలో ఉన్న దేనివల్ల కూడ ఏ పోలీసు అధికారీ తనకు నేరం జరిగినట్లు తెలిసినప్పుడు చట్ట ప్రకారం తీసుకోవాల్సిన చర్యలను తీసుకోకుండా ఉండేందుకు అడ్డంకి కాదని గుర్తుంచుకోవాలి.

6. సంరక్షణ గృహాల విధులు :

బాధితురాలు లేదా ఆమె తరపున సంరక్షణాధికారి లేదా సహాయక సంస్థ ఆమెకు రక్షణ కల్పించమని ఏదయిన సంరక్షణ గృహ నిర్వాహకులను కోరినప్పుడు వారు ఆమెకు తమ గృహంలో నివాసం కల్పించాలి.

7. వైద్య సౌకర్య కేంద్రం నిర్వాహకుల విధులు :

వైద్య సౌకర్యాల కేంద్రం నిర్వాహకులను బాధితురాలు లేదా ఆమె తరపున సంరక్షణాధికారి లేదా సహాయక సంస్థ ఆమెకు వైద్య సౌకర్యం కల్పించమని కోరితే వారు ఆమెకు తగిన వైద్య సౌకర్యాన్ని అందించాలి.

8. రక్షణాధికారుల నియామకం :

1. రాష్ట్రప్రభుత్వం ఓ ప్రభుత్వ ప్రకటన ద్వారా ప్రతి జిల్లా అవసరాలకు అనుగుణంగా తగినంత మంది రక్షణాధికారులను నియమించాలి. అంతేకాకుండా ఆ అధికారులు ఏ ప్రాంతం లేదా ప్రాంతాలలో తమ విధులను, అధికారాలను నిర్వర్తిస్తారో ఆ ప్రకటనలో పొందుపర్చాలి.
2. ఈ సంరక్షణాధికారులకు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు, అనుభవం ఉండాలి. సాధ్యమైనంత వరకు మహిళలనే సంరక్షణాధికారులుగా నియమించాలి.
3. సంరక్షణాధికారులు వారి క్రింది ఉద్యోగుల ఉద్యోగ నిబంధనలు ఎలా ఉండాలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశిస్తుంది.

9. సంరక్షణాధికారుల విధులు – వారి పని :

1. సంరక్షణాధికారి ఈ క్రింది విధులు నిర్వర్తించాలి :

   అ) మేజిస్ట్రేటు ఈ చట్టం అమలు పర్చే పనిలో అతనికి సహకరించాలి.

   ఆ) కుటుంబహింస జరిగినట్లు ఫిర్యాదు వచ్చిన తర్వాత ఆ కుటుంబ హింస సంఘటనపై నిర్దేశించిన పద్ధతిలో నివేదిక రూపొందించి ఆ నివేదికను మేజిస్ట్రేటుకు అందజేయాలి. నివేదిక నకళ్ళను సంబంధిత ప్రాంత పోలీసు అధికారికి, సహాయక సంస్థలకు పంపించాలి.

   ఇ) బాధితురాలు కోరుకున్నట్లయితే నిర్దేశిత పద్ధతిలో సంరక్షణ ఉత్తర్వులకై మెజిస్ట్రేటుకు అర్జీని పెట్టాలి.

   ఈ) బాధితురాలికి న్యాయ సేవాచట్టం 1987 అనుగుణంగా ఉచిత న్యాయసహాయం అందేట్లు చూడాలి మరియు ఫిర్యాదు చేసుకునేందుకు నిర్దేశించిన అప్లికేషను ఉచితంగా అందించాలి.

   ఉ) ఆ ప్రాంత మేజిస్ట్రేటు అధికార పరిధిలో న్యాయసేవలందించే సహాయక సంస్థలు, రక్షణ గృహాలు, సలహా కేంద్రాలు, వైద్య కేంద్రాల సమాచారం సేకరించి ఉంచుకోవాలి.

   ఊ) బాధితురాలికి అవసరమైతే ఆమెను ఓ రక్షణ గృహంలో ఉంచి ఆ విషయాన్ని సంబంధిత పోలీసు అధికారికి, మేజిస్ట్రేటుకు తెలియజేయాలి.

   ఎ) బాధితురాలికి శారీరకంగా గాయాలైతే ఆమెకు తగిన వైద్య సదుపాయం సమకూర్చి ఆ వైద్య నివేదికను సంబంధిత పోలీసు అధికారికి, మేజిస్ట్రేటుకు పంపించాలి.

   ఏ) సెక్షన్ 20 క్రింద ఆర్థిక పరిహార ఉత్తర్వులు నేర విచారణస్మృతి 1973 కనుగుణంగా అమలయ్యేట్లు చూడాలి.

ఐ) ఇవి గాక ఇతరత్రా నిర్దేశించబడే విధులు నిర్వర్తించాలి.

2. సంరక్షణాధికారి మేజిస్ట్రేటుకు లోబడి అతని పర్యవేక్షణలో ఈ చట్టం క్రింద మేజిస్ట్రేటు, ప్రభుత్వం సూచించిన విధులు నిర్వర్తించాలి.

10. సహాయక సంస్థలు :

1. మహిళలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతో వారికి న్యాయ, వైద్య, ఆర్థిక తదితర చట్టపరమైన సహాయాలు అందించే స్వచ్ఛంద సంస్థలు ఇందుకు సంబంధించి వర్తించే నిబంధనల కనుగుణంగా సహాయక సంస్థలుగా ప్రభుత్వం వద్ద నమోదు చేసుకోవాలి. సదరు సంస్థలు సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం 1860, లేదా కంపెనీల చట్టం 1956 లేదా ఇతర చట్టాల క్రింద ఏర్పడిన సంస్థలై యుండాలి.

2. పై సబ్‌సెక్షన్ క్రింద నమోదయిన సహాయక సంస్థలకు ఈ క్రింది అధికారాలుంటాయి.

   అ) బాధితురాలి కోరిక మేరకు కుటుంబహింస, సంఘటనపై 'కుటుంబహింస సంఘటన నివేదిక' ను నిర్దేశిత పద్ధతిలో తయారుచేసి సంబంధిత మేజిస్ట్రేటుకు, రక్షణాధికారికి పంపవచ్చు.

   ఆ) బాధితురాలికి వైద్య పరీక్షలు జరిపించి ఆ నివేదికను సంబంధిత మేజిస్ట్రేటుకు, పోలీసు అధికారికి పంపాలి.

   ఇ) బాధితురాలి కోరికమేరకు ఆమెను రక్షణ గృహంలో చేర్పించి ఆ నివేదికను సంబంధిత పోలీసు స్టేషనుకు తెలియజేయాలి.

3. ఈ చట్టానికి అనుగుణంగా కుటుంబహింసను అరికట్టేందుకై సహాయక సంస్థలు, వాటిలో సభ్యులు ఈ చట్టం క్రింద విధులను, పనులను చిత్తశుద్ధితో నిర్వర్తించినందుకు వారిపై ఎటువంటి ప్రాసిక్యూషన్ లేదా ఇతర చట్టపరమైన చర్యలు తీసుకోరాదు.

11. ప్రభుత్వ విధులు :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ క్రింది అంశాలకు సంబంధించిన అన్ని చర్యలు చేపట్టాలి :

   అ) ఈ చట్టాన్ని, ఇందులో అంశాలను విస్తృతంగా ప్రచారం చేయాలి. అందుకోసమై టెలివిజన్, రేడియో, వార్తాపత్రికల్ని తరచు వినియోగించుకోవాలి.

   ఆ) ఈ చట్టంలో అంశాలపై అవగాహన, చైతన్యం కల్పించేందుకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు, న్యాయమూర్తులకు, పోలీసు అధికారులకు తగినన్ని శిక్షణా తరగతులను నిర్వహించాలి.

   ఇ) కుటుంబ హింసపై దృష్టి సారించే విధంగా చట్ట, గృహ, శాంతి భద్రతలు, ఆరోగ్యం, మానవ వనరులు తదితర సంబంధిత మంత్రిత్వ శాఖలు, పాలనా శాఖల మధ్య సమన్వయం ఏర్పరిచి పటిష్టపరచాలి. ఈ సమన్వయ కార్యక్రమాన్ని తరచు సమీక్షించాలి.

   ఈ) కోర్టులతోసహా ఈ చట్టం క్రింద మహిళలకు సేవలందించాల్సిన వివిధ మంత్రిత్వ శాఖల ప్రవర్తనా నియమావళిని రూపొందించి అందుబాటులో ఉంచాలి.

అధ్యాయం - 4

ఉత్తర్వులు, పరిహారం పొందేందుకు విధానం

12. మేజిస్ట్రేటుకు దరఖాస్తు :

1. బాధితురాలు లేదా రక్షణ అధికారి లేదా ఆమె తరుపున మరెవరయినా ఈ చట్టం అనుగుణంగా ఒకటి లేక అంతకంటే ఎక్కువ పరిహారపు ఉత్తర్వులను కోరుతూ దరఖాస్తు చేయవచ్చు.

   అయితే అటువంటి దరఖాస్తుపై ఉత్తర్వులు ఇచ్చేందుకు ముందుగా మేజిస్ట్రేటు తనకు రక్షణాధికారి లేదా సహాయక సంస్థ నుండి వచ్చిన కుటుంబహింస సంఘటన నివేదికను పరిగణనలోకి తీసుకోవాలి.

2. పైన చెప్పిన సబ్ సెక్షన్ క్రింద బాధితురాలు ఆర్థిక పరిహారం కోరవచ్చు. ఈ సెక్షన్ క్రింద పరిహారం కోరటం ఆమె తనపై ప్రతివాది చేసిన కుటుంబ హింసకు నష్టపరిహారం కోరుతూ దావా వేసుకొనే హక్కుకు అడ్డంకి కాదు.

   అయితే ఈ చట్టం క్రింద నష్టపరిహారం పొందిన తర్వాత వేరే కోర్టు ద్వారా ఆమెకు నష్టపరిహారం చెల్లించమని డిక్రీ వస్తే ఈ చట్టం క్రింద ఆమెకు అందిన మొత్తాన్ని ఆ డిక్రీలో పేర్కొన్న మొత్తం నుంచి మినహాయించగా ఆ డిక్రీలో ఇంకా మిగిలిన మొత్తం ఏదయినా ఉంటే ఆ మిగిలిన మొత్తం రాబట్టుకునేందుకై ఆ డిక్రీని అమలుపర్చుకోవచ్చు. సివిల్ ప్రొసీజర్ చట్టం లేదా ఇతర చట్టాలలో ఎక్కడైనా ఇందుకు విరుద్ధంగానున్నా అవి ఈ సదుపాయాన్ని వినియోగించుకోటానికి అడ్డంకి కారాదు.

3. పైన సబ్ సెక్షన్ (1) క్రింద చేసుకునే ప్రతి దరఖాస్తు నిర్దేశించబడిన నమూనాలో, వివరాలతో ఉండాలి లేదా సాధ్యమైనంత అదే విధంగానన్నా ఉండాలి.

4. తనకు దరఖాస్తు అందిన తర్వాత మేజిస్ట్రేటు విచారణ ప్రారంభ తేదీ నిర్ణయించాలి. సాధారణంగా, ఇది దరఖాస్తు అందిన తర్వాత మూడు రోజులకి మించి ఉండకూడదు.

5. సబ్ సెక్షన్ (1) క్రింద స్వీకరించబడిన దరఖాస్తులను విచారణ మొదలయిన 60 రోజుల లోపే పరిష్కరించేందుకై మేజిస్ట్రేటు ప్రయత్నించాలి.

13. నోటీసు అందించడం :

1. సెక్షన్ 12 క్రింద విచారణ తేది నిర్ణయించగానే మేజిస్ట్రేటు సంరక్షణ అధికారికి నోటీసు ఇవ్వాలి. సదరు సంరక్షణ అధికారి నిర్దేశించిన పద్ధతి ద్వారా లేదా మేజిస్ట్రేటు ఆదేశాల కనుగుణంగా ప్రతివాదికి 2 రోజులకు మించకుండా ఆ నోటీసును అందించాలి. సరయిన కారణాలుంటే రెండు రోజులకు పైబడి మరికొంత వ్యవధిని మేజిస్ట్రేటు ఇవ్వవచ్చు.

2. నోటీసు అందించబడింది అని రక్షణ అధికారి నిర్దేశిత నమూనాలో ప్రకటిస్తే ప్రతివాదికి నోటీసు అందినట్లే పరిగణించాలి. నోటీసు అందకుంటే అది నిరూపించాల్సిన బాధ్యత ప్రతివాదిదే.

14. సలహా, సహకారాలు :

1. విచారణ ఏ దశలోనైనా మేజిస్ట్రేటు, ప్రతివాదిని లేదా బాధితురాల్ని లేదా ఇద్దరినీ, సహాయక సంస్థలలో సలహా, సహకారాలందించే నైపుణ్యం, అనుభవం గల సభ్యుడ్ని కలిసి సలహా తీసుకోమని ఆదేశించవచ్చు.

2. పై సబ్‌సెక్షన్ క్రింద కనుక ఆదేశాలిస్తే మేజిస్ట్రేటు తదుపరి విచారణ తేదీని రెండు నెలలు మించకుండా నిర్ణయించాలి.

15. సంక్షేమ కార్యకర్త సహాయం :

ఈ చట్టం క్రింద జరిగే ఏ విచారణలో నైనా మేజిస్ట్రేటు అవసరమైతే కుటుంబసంక్షేమాన్ని ప్రోత్సహించే కార్యక్రమాల్లో అనుభవజ్ఞులైన తనకు సరయిన వ్యక్తి అనిపించిన వ్యక్తిని తనకు సహాయకారిగా ఉండమని అడగవచ్చు. సదరు వ్యక్తి సాధ్యమైనంత వరకు మహిళ అయిఉండాలి. ఆమె బాధితురాలికి బంధువైనా కావచ్చు.

16. విచారణ గోప్యంగా జరగాలి :

పరిస్థితులను బట్టి మేజిస్ట్రేటు భావించినా లేదా విచారణలో ఇరువైపుల వారిలో ఎవరయినా కోరినా, విచారణను గోప్యంగా జరుపవచ్చు.

17. భాగస్వామ్య ఇంటిలో నివసించే హక్కు :

1. కుటుంబ సంబంధంలోనున్న ప్రతి మహిళకు తను భాగస్వామ్యంగా ఇంతవరకు జీవిస్తున్న ఇంటిలో ఆ ఇల్లు తన సొంతది అయినా కాకున్నా నివాసం ఉండే హక్కు ఉంటుంది. ప్రస్తుతం అమలులోనున్న చట్టాలలో ఏది ఈ హక్కుకు అడ్డంకి కారాదు.
2. చట్ట పరిధిలో మినహా భాగస్వామ్య ఇంటి నుంచి లేదా అందులో ఓ భాగం నుంచి బాధితురాలిని గెంటివేయడం లేదా బహిష్కరించడం లాంటిది ప్రతివాది చేయకూడదు.

18. రక్షణ ఉత్తర్వులు :

బాధితురాలికి ప్రతివాదికి తమ వాదనలు చెప్పుకునే అవకాశం ఇచ్చిన తర్వాత కుటుంబహింస జరిగి ఉండొచ్చు లేదా జరిగే అవకాశం వుంది అని మేజిస్ట్రేటుకు అనిపిస్తే బాధితురాలికి అనుకూలంగా రక్షణ ఉత్తర్వులు జారీచేస్తూ ప్రతివాది ఈ క్రింది చర్యలు చేయకుండా నిషేధించవచ్చు :

అ) కుటుంబ హింసకు సంబంధించిన చర్యలు చేయటం;

ఆ) కుటుంబహింస చర్యలను ప్రోత్సహించటం;

ఇ) బాధితురాలు పనిచేసే ప్రాంతానికి వెళ్ళటం, బాధితురాలు బాలిక అయితే ఆ బాలిక చదువుకునే పాఠశాల లేదా ఇతర ప్రాంతాలకు వెళ్ళటం;

ఈ) వ్యక్తిగతంగా, మౌఖికంగా, ఫోనుద్వారా, రాతపూర్వకంగా, ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా ఇతరత్రా ఏ రూపంలోనయినా బాధితురాలితో మాట్లాడే ప్రయత్నం చేయటం;

ఉ) మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా ఆస్తులను బదలాయించటం, బాధితురాలు, ప్రతివాది ఉమ్మడిగా అనుభవిస్తున్నా లేదా ప్రతివాది ఒక్కడి పేరునే ఉన్నవైనా బ్యాంకు లాకర్లు, అకౌంట్లను ఉపయోగించడం, ఆమె స్త్రీ ధనం చెందిన ఆస్తి, వారిద్దరి ఉమ్మడి లేదా ఏ ఒక్కరి పేరునున్న ఆస్తియైనా బదలాయించటం;

ఊ) బాధితురాలికి కుటుంబహింస నుండి బైటపడేందుకు సహకరించిన వారిపై ఆమెపై ఆధారపడిన వారిపై లేదా ఆమె బంధువులపై హింస ప్రయోగించటం;

ఎ) రక్షణ ఉత్తర్వులలో పేర్కొన్న ఏ యితర చర్యలైనా

19. నివాస ఉత్తర్వులు :

1. సెక్షన్ 12 క్లాజు (1) క్రింద దరఖాస్తు పై తీర్పు ఇచ్చేటప్పుడు కుటుంబహింస జరిగిందని మేజిస్ట్రేట్ సంతృప్తి చెందితే, నివాసపు ఉత్తర్వులు జారీచేయవచ్చు. ఆ ఉత్తర్వుల్లో.

అ) బాధితురాలు అనుభవిస్తున్న ఇంటినుంచి ఆమెను ప్రతివాది గెంటివేయకూడదని ఆదేశించవచ్చు. ఆ ఇల్లు అందరి భాగస్వామ్యంలోనిదయినా అందులో ప్రతివాదికి హక్కులు లేకున్నా బాధితురాలి అనుభవించే హక్కును చెరపరాదు.

ఆ) ఆ భాగస్వామ్య యింటినుంచి ప్రతివాది వెళ్ళిపోవాలని ఆదేశించవచ్చు.

ఇ) బాధితురాలు నివసిస్తున్న ఆ భాగస్వామ్యపు ఇంట్లో ఏ భాగంలోనికయినా ప్రతివాది అతని బంధువులు ప్రవేశించకూడదని ఆదేశించవచ్చు.

ఈ) భాగస్వామ్య ఇంటిని బదలాయించటం కాని ఇతరత్రా తాకట్టు పెట్టటం గాని చేయరాదని ప్రతివాదిని ఆదేశించవచ్చు.

ఉ) భాగస్వామ్య ఇంటిపై ప్రతివాదికున్న హక్కులను మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా వదిలేసుకోకూడదని ఆదేశించవచ్చు.

ఊ)బాధితురాలు భాగస్వామ్య ఇంట్లో అనుభవిస్తున్న స్థాయికి సమానంగా మరోచోట నివాసం ఏర్పాటు చేయమని లేదా అంత అద్దె చెల్లించమని ప్రతివాదిని ఆదేశించవచ్చు.

అయితే పైన పేర్కొన్న (ఆ) లోని ఆదేశాలు మహిళలకు వ్యతిరేకంగా ఇవ్వకూడదు.

2) బాధితురాలు లేదా ఆమె పిల్లల రక్షణార్థమై మరే ఇతర షరతులు లేదా ఉత్తర్వులు ఇస్తే మంచిది అని మేజిస్ట్రేటు భావిస్తే అటువంటి అదనపు ఉత్తర్వులు ఇవ్వవచ్చు.

3) కుటుంబహింస చేయనని పూచీకత్తుదార్లతో కూడిన లేదా సాధారణ సెక్యూరిటి బాండు రాసిమ్మని ప్రతివాదిని ఆదేశించవచ్చు.

4) పైన సబ్‌సెక్షన్ (3) లోని ఉత్తర్వులను నేర విచారణస్మృతి లోని అధ్యాయం VIII క్రింద ఉత్తర్వులతో సమానంగా పరిగణించి ఆ విధంగానే అమలుపర్చాలి.

5) పైన సబ్‌సెక్షన్లు (1), (2) లేదా (3) క్రింద మేజిస్ట్రేట్ ఉత్తర్వులిచ్చేప్పుడు, బాధితురాలికి లేదా ఆమె తరపున దరఖాస్తు చేసినవారికి లేదా ఆమెకు సహకరిస్తున్నవారికి తగిన రక్షణ కల్పించమని ఉ త్తర్వులు అమలయ్యేలా సహకరించమని సమీప పోలీసుస్టేషన్ అధికారిని ఆదేశించవచ్చు.

6) మేజిస్ట్రేటు పైన సబ్‌సెక్షన్ (1) క్రింద ఉత్తర్వులు జారీచేసేటప్పుడు, ప్రతివాది చెల్లించవలసిన అద్దె తదితర చెల్లింపులను నిర్ణయించేప్పుడు ఇరుపక్షాల ఆర్థిక అవసరాలను, స్థితిగతుల్ని పరిగణనలో తీసుకోవాలి.

7) ఈ రక్షణ ఉత్తర్వులను అమలు పర్చటంలో సహకరించమని సంబంధిత పోలీసు అధికారిని మేజిస్ట్రేట్ ఆదేశించవచ్చు.

8) బాధితురాలి స్త్రీ ధనం ఆస్తి, ఇతర విలువగల వస్తువులు లేదా ఆస్తుల్ని ఆమెకు వాపసు చేయమని మేజిస్ట్రేట్ ప్రతివాదిని ఆదేశించవచ్చు.

20. ఆర్థిక పరిహారం :

1) మేజిస్ట్రేటు సెక్షన్ 12 సబ్‌సెక్షన్ (1) క్రింద ఉత్తర్వులిచ్చేప్పుడు బాధితురాలికి మరియు ఆమె పిల్లలు ఎవరయిన ఉంటే వారికి ఈ కుటుంబ హింస వలన జరిగిన నష్టానికి అయిన ఖర్చులకు తగిన ఆర్థిక పరిహారం చెల్లించమని ప్రతివాదిని ఆదేశించవచ్చు. ఆర్థిక పరిహారం ఈ క్రింది విధంగా ఉండొచ్చు. కాని వీటికే పరిమితం కానవసరం లేదు:

   అ) సంపాదన కోల్పోయినందు వలన నష్టం;

   ఆ) వైద్య ఖర్చులు;

   ఇ) బాధితురాలి ఆస్తిని దేనినయినా విధ్వంసం చేసినందువలన, నష్టపరిచినందువలన లేదా ఆమె ఆధీనం నుంచి తీసివేసినందు వలన జరిగిన నష్టం; మరియు

   ఈ) బాధితురాలి, ఆమె పిల్లల మనువర్తి ఇది నేరవిచారణ స్మృతి సెక్షన్ 125 క్రింద లేదా ఇతర చట్టాల క్రింద ఇవ్వవచ్చు లేదా వాటికి అదనంగా ఇవ్వవచ్చు.

2) ఈ సెక్షన్ క్రింద ఇచ్చే ఆర్థిక పరిహారం న్యాయసమ్మతమైనదిగా, సరిపడంతగా ఉండాలి. ఆమె అంతవరకు జీవిస్తున్న స్థాయికి తగ్గట్టుగా ఉండాలి.

3) ఆయా కేసుల వాస్తవ పరిస్థితులను బట్టి ఈ ఆర్థిక పరిహారం ఒక్కసారిగా పెద్ద మొత్తంగా లేదా ప్రతి నెలా కొంతమొత్తం గాని ఇవ్వమని మేజిస్ట్రేటు ఆదేశించవచ్చు.

4) ఆర్థిక పరిహారపు ఉత్తర్వుల కాపీలను మేజిస్ట్రేటు ఇరుపక్షాలకు ఇవ్వటమేగాక ప్రతివాది నివసించే పరిధిలోని పోలీసు స్టేషనుకు కూడా పంపించాలి.

5) పైన సబ్ సెక్షన్ (1) క్రింద ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్న తేదీలోగా ప్రతివాది ఆర్థిక పరిహారాన్ని బాధితురాలికి చెల్లించాలి.

6) ఆర్థిక పరిహారపు ఉత్తర్వుల ప్రకారం ప్రతివాది తను చేయవలసిన చెల్లింపులు చేయని పక్షంలో మేజిస్ట్రేటు ప్రతివాది ఉద్యోగ యజమానిని లేదా అతనికి బాకీ చెల్లించవలసిన వారిని వారు ప్రతి వాదికి యివ్వవలసిన జీత బత్యాలను లేదా చేయవలసిన చెల్లింపులలో కొంతభాగం బాధితురాలికి చెల్లించమని లేదా కోర్టులో జమ చేయమని ఆదేశించవచ్చు. ఈ మొత్తాలను ఆమెకు రావల్సిన ఆర్థిక పరిహారం క్రింద జమ చేయవచ్చు.

21. సంరక్షణ ఉత్తర్వులు :

ఈ చట్టం క్రింద రక్షణ ఉత్తర్వుల కోసం గాని ఇతర పరిహారం కోసం దేనికైనా గాని విచారణ జరుగుతున్నప్పుడు ఏ దశలోనయినా మేజిస్ట్రేటు ఎవరయినా బాలలను బాధితురాలి సంరక్షణకు అప్పజెప్తూ

ఉత్తర్వులు జారీచేయవచ్చు. ఆ ఉత్తర్వుల్లోనే ప్రతివాది పిల్లలను కలిసేందుకు తగ్గ ఏర్పాటును సూచించవచ్చు. అయితే ప్రతివాది పిల్లలను కలిసే ఏర్పాటు వల్ల బాధితురాలికి లేదా పిల్లలకు హాని కల్గవచ్చనిపిస్తే ప్రతివాదికి అలా కలిసే అవకాశం ఇవ్వనవసరం లేదు. ఈ అంశం పై ప్రస్తుతం అమలులోనున్న ఇతర చట్టాలలో ఏమున్నా అది ఈ సెక్షన్ క్రింద అధికారాలకు అడ్డంకి కారాదు.

22. నష్టపరిహారపు ఉత్తర్వులు :

ఈ చట్టం క్రింద మేజిస్ట్రేటు తను జారీ చేసే ఇతర పరిహారాలకు అదనంగా, బాధితురాలికి కుటుంబహింస వల్ల జరిగిన నష్టానికి, గాయాలకు, మానసిక వేదనకు, భావోద్వేగ వ్యధకు తగిన పరిహారం చెల్లించమని ప్రతివాదిని ఆదేశించవచ్చు.

23. తాత్కాలిక ఉత్తర్వులు, ప్రతివాది పరోక్షంలో ఉత్తర్వులు జారీ చేసే అధికారం :

1. ఈ చట్టం క్రింద తను విచారణ చేపట్టిన ఏ కేసులోనయినా మేజిస్ట్రేటు తనకు న్యాయ సమ్మతమనిపించిన తాత్కాలిక ఉత్తర్వులను జారీ చేయవచ్చు.
2. దరఖాస్తు పరిశీలించగా ప్రతివాది కుటుంబ హింసకు పాల్పడి నట్లనిపించినా, లేదా కుటుంబ హింస జరిగే అవకాశం ఉందనిపించినా, మేజిస్ట్రేటు బాధితురాలి వద్ద నుంచి సెక్షన్ 18, 19, 20, 21 లేదా 22 లలో దేని క్రిందనయినా నిర్ధేశిత నమూనాలో అఫిడవిట్ తీసుకొని ఆ అఫిడవిట్ ఆధారంగానే ప్రతివాది పరోక్షంలో ఉత్తర్వులు జారీచేయవచ్చును.

24. కోర్టు ఉత్తర్వుల కాపీలను ఉచితంగా అందించాలి :

ఈ చట్టం అనుగుణంగా మేజిస్ట్రేటు ఉత్తర్వులను జారీ చేసినపుడు ఆ ఉత్తర్వుల కాపీలను ఇరుపక్షాలకు, ఆ సంఘటన జరిగిన పరిధిలోని పోలీసు స్టేషన్ అధికారికి, ఆ పరిధిలోని సహాయక సంస్థకు మరియు కుటుంబ హింస సంఘటన నివేదిక సమర్పించిన సహాయక సంస్థకు ఉచితంగా అందజేయాలని ఆదేశించాలి.

25. ఉత్తర్వుల కాలపరిమితి, సవరణలు :

1. సెక్షన్ 18 క్రింద జారీ చేసిన రక్షణ ఉత్తర్వులు బాధితురాలు తనను ఇక విడుదల చేయమని అర్జీ పెట్టుకునేంత వరకు అమలులో ఉంటాయి.
2. బాధితురాలు లేదా ప్రతివాది నుంచి దరఖాస్తు వచ్చినపుడు, మేజిస్ట్రేటు పరిస్థితులలో మార్పు వచ్చిందని తన ఉత్తర్వులను మార్చవచ్చని సంతృప్తి చెందితే అందుకు తగ్గట్టుగా ఉత్తర్వులలో మార్పు చేయటం గాని లేదా ఉత్తర్వులను రద్దు చేయటం గాని చేయవచ్చు.

26. ఇతర దావాలు, విచారణల్లో పరిహారం :

1) ఈ చట్టం అమలులోకి వచ్చేందుకు ముందుగాని ఆ తర్వాత గాని బాధితురాలు, ప్రతివాది మధ్య ఏదయినా సివిల్ కోర్టు, ఫ్యామిలి కోర్టు, లేదా క్రిమినల్ కోర్టులలో విచారణ మొదలయి ఉంటే ఆ కేసుల్లో ఈ చట్టం లోని సెక్షన్ 18, 19, 20, 21 మరియు 22 ల క్రింద పరిహారం కోరవచ్చు.

2) ఏదైనా సివిల్ లేదా క్రిమినల్ కోర్టుల్లో జరుగుతున్న దావాల్లో విచారణల్లో కోరిన పరిహారంతో పాటు, ఆ పరిహారానికి అదనంగా పైన సబ్‌సెక్షన్ (1) లో చెప్పిన విధంగా పరిహారం కోరవచ్చు.

3) అయితే ఈ చట్టం క్రింద గాక ఇతరత్రా దావాల్లో ఏదయిన పరిహారాన్ని పొంది ఉంటే ఆ విషయం మేజిస్ట్రేటుకు తెలియజేయాలి.

27. అధికార పరిధి :

1) ఈ చట్టం క్రింద కేసుల విచారణ మొదటి శ్రేణికి చెందిన మేజిస్ట్రేటు లేదా మెట్రోపోలిటిన్ మేజిస్ట్రేట్లుకి అధికారం ఈ క్రింది విధంగా ఉంటుంది.

   అ) బాధితురాలు స్థిరనివాసం లేదా తాత్కాలిక నివాసం లేదా వ్యాపారం లేదా ఉద్యోగం చేస్తున్న ప్రాంతం; లేదా

   ఆ) ప్రతివాది నివాసం లేదా వ్యాపారం లేదా ఉద్యోగం చేస్తున్న ప్రాంతం; లేదా

   ఇ) కుటుంబ హింస జరిగిన ప్రాంతం

పై ప్రాంతాలలో అధికారం కల్గిన కోర్టులకు ఈ చట్టం క్రింద సంరక్షణ ఉత్తర్వులు లేదా ఇతర ఉత్తర్వులు ఇచ్చే అధికారం, ఈ చట్టం క్రింద నేరాలను విచారించే అధికారం ఉంటుంది.

28. విచారణ పద్ధతి :

1) ఈ చట్టంలో ఏదయినా ప్రత్యేకంగా చెప్పబడియుంటే మినహా సెక్షన్లు 12, 18, 19, 20, 21, 22 మరియు 23ల క్రింద విచారణ గాని, సెక్షను 31 క్రింద నేరాల విచారణ గానీ నేరవిచారణ స్మృతి 1973 లో నిర్దేశించిన పద్ధతిలో జరగాలి.

2) అయితే సెక్షన్ 12 లేదా సెక్షన్ 23(2) క్రింద విచారణను పూర్తి చేసేందుకు మేజిస్ట్రేటు తమకు అనుకూలమైన పద్ధతిలో చేసేందుకు పై సబ్‌సెక్షన్ (1) అడ్డంకి కారాదు.

29. అప్పీలు :

మేజిస్ట్రేటు ఉత్తర్వులు బాధితురాలు లేదా ప్రతివాదులలో ఎవరికి చివరగా అందినదో ఆరోజు నుండి 30 రోజులలోగా సెషన్స్ కోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు.

30. రక్షణాధికారులు, సహాయక సంస్థ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు :

ఈ చట్టం అమలుకై, దీని క్రింద చేయబడిన నిబంధనల కనుగుణంగా విధులు నిర్వర్తిస్తున్న సందర్భంలో రక్షణాధికారులను, సహాయక సంస్థ సభ్యులను భారత శిక్షాస్మృతి సెక్షన్ 21లో నిర్వచించిన ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలి.

31. ప్రతివాది రక్షణ ఉత్తర్వులను ఉల్లంఘించినపుడు శిక్ష :

1) ఈ చట్టం క్రింద జారీ చేయబడ్డ రక్షణ ఉత్తర్వులు లేదా తాత్కాలిక రక్షణ ఉత్తర్వులను ప్రతివాది కనుక ఉల్లంఘిస్తే అది ఈ చట్టం క్రింద నేరం అవుతుంది. అందుకు ఒక సంవత్సరం వరకు కారాగారం లేదా ఇరవై వేల రూపాయల వరకు జరిమాన లేదా రెంటినీ విధించవచ్చు.

2) పై సబ్‌సెక్షన్ (1) లో చెప్పబడిన నేరం విచారణ సాధ్యమైనంతవరకు రక్షణ ఉత్తర్వులు జారీ చేసిన మేజిస్ట్రేటు నిర్వహించాలి.

3) పై సబ్‌సెక్షన్ (1) క్రింద విచారణ చేపట్టే నిమిత్తం నేర ఆరోపణలను నమోదుచేసేటప్పుడు ఆ నేరమే గాక కేసు పరిస్థితులను పరిశీలించగా భారత శిక్షాస్మృతి సెక్షన్ 498ఎ క్రింద లేదా అందులోని ఇతర సెక్షన్ల క్రింద గాని లేదా వరకట్న నిషేధ చట్టం క్రిందగాని కూడ నేరాలు జరిగినట్లు అనిపిస్తే ఆ నేరాలకు సంబంధించిన ఆరోపణలను కూడా నమోదుచేయవచ్చు.

32. నేరస్థాయి, రుజువు చేయటం :

1) ఈ చట్టం సెక్షన్ 31(1) క్రింద నేరం కాగ్నిజబుల్, నాన్ బెయిలబుల్ స్థాయి నేరం అవుతుంది. నేర విచారణ స్మృతి 1973 లో చెప్పినది ఏదయినా ఇందుకు విరుద్ధంగా ఉన్నా అది పరిగణించరాదు.

2) కోర్టు బాధితురాలి ఒక్కరి సాక్ష్యంపై ఆధారపడి సెక్షన్ 31(1) క్రింద నేరం రుజువైనట్లుగా నిర్ణయానికి రావచ్చు.

33. రక్షణాధికారి విధులు నిర్వహించకుంటే శిక్ష :

రక్షణాధికారి సరయిన కారణం లేకుండా, రక్షణ ఉత్తర్వుల్లో మేజిస్ట్రేట్ తనను ఆదేశించిన విధంగా విధులను నిర్వర్తించకపోయినా లేదా ఆదేశాలను తిరస్కరించినా అతనికి ఒక సంవత్సరం కారాగార శిక్ష లేదా ఇరవై వేల రూపాయల జరిమానా లేదా రెండింటినీ విధించవచ్చు.

34. రక్షణాధికారి చేసిన నేరాన్ని విచారణకు స్వీకరించటం :

రక్షణాధికారిపై నేరవిచారణ లేదా ఇతర న్యాయపరమైన చర్యలు తీసుకోవాలంటే ముందుగా రాష్ట్ర ప్రభుత్వం లేదా అందుకై నియమించిన అధికారి అనుమతి తీసుకుని ఫిర్యాదు చేయాలి.

35. చిత్తశుద్ధితో చేసిన చర్యలకు రక్షణ :

ఈ చట్టం క్రింద లేదా నిబంధనలు లేదా ఉత్తర్వులు అనుగుణంగా రక్షణాధికారి చిత్తశుద్ధితో చేసిన లేదా చేయదల్చుకున్న చర్యల వల్ల ఎవరికయినా నష్టం వాటిల్లిందని లేదా వాటిల్లబోతున్నదని కాని రక్షణాధికారిపై దావా లేదా ఇతర చట్టపర చర్యలు తీసుకునేందుకు లేదు.

36. ఈ చట్టం ఇతర చట్టాల బదులుగా కాదు :

ప్రస్తుతం అమలులోనున్న ఇతర చట్టాలకు ఈ చట్టం అదనంగా వుంటుందే గాని వాటి బదులుగా (వాటి స్థానంలో ఈ చట్టం వచ్చినట్లు) కాదు.

37. కేంద్ర ప్రభుత్వానికి నిబంధనలు చేసే అధికారం :

1) ఈ చట్టం అమలుకోసం అవసరమైన నిబంధనలను కేంద్రప్రభుత్వం రూపొందించి అవి రాజపత్రంలో ప్రకటించవచ్చు.

2) నిబంధనలను చేసేందుకై కేంద్ర ప్రభుత్వానికి పైన ఇవ్వబడిన అధికారాల అనుగుణంగా ప్రత్యేకించి ఈ క్రింది అంశాలపై నిబంధనలు రూపొందించాలి, దీనర్థం కేంద్ర ప్రభుత్వం అధికారాలు ఈ క్రింది నిబంధనలు చేసేందుకే పరిమితమని కాదు :

   అ) సెక్షన్ 8(2) అనుగుణంగా రక్షణాధికారి అర్హతలు, అనుభవం;

   ఆ) సెక్షన్ 8(3) అనుగుణంగా రక్షణాధికారి, అతని క్రింద పనిజేసే ఇతర ఉద్యోగుల ఉద్యోగ నిబంధనలు;

ఇ) సెక్షన్ 9(1) (బి) లో చెప్పబడ్డ కుటుంబహింస సంఘటన నివేదిక నమూనా, తయారు చేసే పద్ధతి;

ఈ) సెక్షన్ 9 (1) (సి) ప్రకారం రక్షణ ఉత్తర్వులకై మెజిస్ట్రేటుకు చేసుకునే దరఖాస్తు నమూనా, దరఖాస్తు చేసుకునే విధానం;

ఉ) సెక్షన్ 9(1) (డి) అనుగుణంగా ఫిర్యాదు చేసే నమూనా;

ఊ) సెక్షన్ 9(2) క్రింద రక్షణాధికారి నిర్వర్తించవలసిన ఇతర విధులు;

ఎ) సెక్షన్ 10(1) ప్రకారం సహాయక సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నిబంధనలు;

ఏ) సెక్షన్ 12(1) క్రింద పరిహారం కోరుతూ దాఖలు చేయవల్సిన దరఖాస్తు నమూనా మరియు అదే సెక్షన్‌లోని సబ్‌సెక్షన్ (3) ప్రకారం సదరు దరఖాస్తులో తెలియజేయవల్సిన విషయాలు;

ఐ) సెక్షన్ 13(1) ప్రకారం నోటీసులు ఇచ్చే విధానం;

ఒ) సెక్షన్ 13(2) ప్రకారం నోటీసు అందజేసినట్లు రక్షణ అధికారి తెలియజేసే పత్రం నమూనా;

ఓ) సెక్షన్ 14(1) క్రింద సహాయక సంస్థల సభ్యులకు సలహా, సహకారం ఇచ్చేందుకు అవసరమైన అనుభవం, అర్హతలు;

ఔ) సెక్షన్ 23(2) క్రింద బాధితురాలు ఇచ్చే అఫిడవిట్ నమూనా;

అం) ఇంకేవయిన నిర్దేశించవలసిన లేదా నిర్దేశించతగ్గ అంశాలు;

3) ఈ చట్టం క్రింద చేసిన ఏ నిబంధన అయినా అది చేసిన తర్వాత సాధ్యమైనంత త్వరగా పార్లమెంటు ఉభయ సభల సమావేశాలలో ప్రవేశపెట్టాలి. ముప్పై రోజుల కాలంలో ఈ సమావేశాలు ఒకే విడతగా లేదా రెండు లేదా అంతకంటే ఎక్కువ విడతలుగా జరిగినా లేదా ఆ తరువాత జరిగే సమావేశాలలో ఉభయ సభలు ఈ నిబంధనలను ఆమోదించాలి. ఉభయ సభలు ఏదయినా నిబంధనను తిరస్కరించవచ్చు లేదా మార్పు చేయవచ్చు. తదనుగుణంగా ఆ నిబంధన రద్దవటమో లేదా మార్చిన విధంగానో అవుతుంది. అయితే ఉభయ సభలలో ఈ నిబంధనలకు మార్పులు జరగటానికి ముందు ఆ నిబంధనల క్రింద తీసుకున్న చర్యలు చట్టపరమైనవిగానే పరిగణించాలి.

ఈ చట్టంలో ప్రస్తావించబడిన ఇతర చట్టాలలో సెక్షన్లు

సివిల్ ప్రొసీజర్ చట్టం 1908

సెక్షన్ 33. కోర్టు తీర్పు మరియు డిక్రీ :

విచారణ పూర్తయిన పిదప కోర్టు తన తీర్పును ప్రకటించాలి. ఆ తరువాత డిక్రీ మంజూరు చేయాలి.

సెక్షన్ 34. వడ్డీ :

కోర్టు ఏదయినా డబ్బు చెల్లించమని డిక్రీ ఇచ్చినపుడు ఆ డిక్రీలో దావా వేసిన రోజు నుంచి డిక్రీ తేదీ వరకు, అసలు చెల్లించవల్సిన తేదీ నుంచి దావా వేసే రోజు వరకు, డిక్రీ ఇచ్చిన రోజునుండి డిక్రీ అమలు అయ్యేవరకు వడ్డీ ఎంత చెల్లించాలో కూడా పేర్కొనాలి. సాధారణంగా ఇది సాలుకు ఆరు శాతం మించకూడదు.

అయితే వ్యాపార లావాదేవీలకు సంబంధించిన దావాలలో వడ్డీ ఆరుశాతం మించి ఉండవచ్చు. కక్ష్యదారుల వ్యాపార ఒప్పందం ప్రకారం ఉండాలి. అలాంటి ఒప్పందం లేకుండే జాతీయ బ్యాంకులు వ్యాపార సంబంధ లావాదేవీల్లో తీసుకునే వడ్డీకి సరిపడా ఉండాలి.

వివరణ – 1 :

ఈ సబ్ సెక్షన్‌లో జాతీయ బ్యాంకు అంటే బ్యాంకింగ్ కంపెనీలు (జాతీయీకరణ మరియు సంస్థల బదలాయింపు) చట్టం 1970, తర్వాత కొత్తపేర్లు పెట్టబడ్డ బ్యాంకులు అని అర్థం.

వివరణ – 2 :

ఈ సెక్షన్‌లో వ్యాపార లావాదేవి అంటే, పరిశ్రమలు, వర్తకం లేదా వ్యాపారం సంబంధించిన లావాదేవి అని అర్థం.

నేరవిచారణ స్మృతి - 1973

సెక్షన్ 2 : నిర్వచనాలు :

సందర్భాన్ని బట్టి ప్రత్యేక అర్థము రానియెడల సాధారణంగా ఈ చట్టములోని కొన్ని పదాలకు నిర్వచనం ఈ క్రింది విధముగా ఉంటుంది.

జె) విచారణాధికార పరిధి :

ఈ చట్టము ద్వారా ఒక మేజిస్ట్రేటుకు సంక్రమించిన అధికారాలు ఎంత పరిధికి విస్తరించి ఉంటాయో, ఆ మేజిస్ట్రేటుకి సంబంధించి ఆ ప్రాంతము అతని విచారణాధికార పరిధిగా పరిగణించాలి. ఇదే నిర్వచనం న్యాయస్థానము యొక్క విచారణాధికార పరిధికి కూడా అన్వయిస్తుంది. అందుకు సంబంధించిన నోటిఫికేషన్ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తుంది.

కె) మెట్రోపాలిటన్ ప్రాంతము :

సెక్షన్ 8 క్రింద మెట్రోపాలిటన్ ప్రాంతంగా ప్రకటించబడిన ప్రాంతము

యల్) విచారణకు స్వీకరింప తగని నేరము, కేసు :

పోలీసు అధికారి వారంటు లేకుండా అరెస్టు చేయుటకు వీలులేని నేరము లేక కేసును 'విచారణకు స్వీకరింపతగని నేరము లేక కేసు' అని అంటారు.

సెక్షన్ 6 : క్రిమినల్ న్యాయస్థానముల వర్గీకరణ :

హైకోర్టు, సుప్రీంకోర్టులే కాకుండా ప్రతి రాష్ట్రములోనూ క్రిమినల్ కేసులను విచారించు నిమిత్తము ఈ క్రింది కోర్టులు ఉంటాయి.

1) సెషన్సు కోర్టు.
2) మెట్రోపాలిటన్ ప్రాంతములలో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు కోర్టు. ఇతర ప్రాంతములలో మొదటి తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేటుకోర్టు.
3) రెండవ తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు.

4) కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ కోర్టు.

సెక్షన్ 7 : క్రిమినల్ న్యాయస్థానముల విచారణాధికార పరిధి :

1) ప్రతి రాష్ట్రము ఒక సెషన్స్ విభాగముగా పరిగణలోకి వస్తుంది. లేక ఒక రాష్ట్రములో ఒకటి కన్న ఎక్కువ సెషన్స్ విభాగములు కూడా ఉండవచ్చు. ఈ చట్ట పరిధిలో ఒకొక్క సెషన్స్ డివిజను ఒక్కొక్క జిల్లాగా పిలవడం జరుగుతుంది. లేక ఒక సెషన్స్ డివిజన్‌లో ఒకటికన్నా ఎక్కువ జిల్లాలు కూడా ఉండవచ్చు. అయితే ప్రతి మెట్రోపాలిటన్ ప్రాంతము ఒక సెషన్స్ డివిజన్ లేక జిల్లాగా పరిగణించాలి.

2) సెషన్స్ విభాగముల లేక జిల్లా సంఖ్యను, పరిధిని సవరించే అధికారము రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. అయితే, ఆ విధంగా సవరించే ముందుగా రాష్ట్ర హైకోర్టుతో సంప్రదించవలెను.

3) హైకోర్టుతో సంప్రదించిన పిదప ఒక జిల్లాను ఉపవిభాగములుగా విభజించు అధికారం, ఉప విభాగముల సంఖ్యను, పరిధిని సవరించు అధికారము రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది.

4) ఈ చట్టం అమలులోకి రాకముందు ఏర్పడిన సెషన్స్ విభాగములు, జిల్లాలు, ఉప విభాగములన్నీ ఈ చట్టం క్రింద ఏర్పడినట్లుగానే భావించాలి.

సెక్షన్ 8 : మెట్రోపాలిటన్ ప్రాంతము :

1) ఈ చట్ట పరిధిలో పది లక్షల మంది కన్నా ఎక్కువ జనాభా గల ప్రాంతమును మెట్రోపాలిటన్ ప్రాంతముగా ప్రకటించే అధికారం ప్రభుత్వానికి ఉంది.

2) ముంబాయి, మద్రాసు, కలకత్తా ప్రెసిడెన్సీలు, అహమ్మదాబాద్ నగరములు ఈ చట్టములోనికి వచ్చునప్పటి నుండి మెట్రోపాలిటన్ ప్రాంతములుగా పరిగణలోకి వస్తాయి.

3) మెట్రోపాలిటన్ ప్రాంతము యొక్క పరిధిని హెచ్చించు, లేక తగ్గించు లేక సవరించు అధికారము రాష్ట్ర ప్రభుత్వములకు కలదు. అయితే, ఏ విధముగా మార్చినా, ఒక మెట్రోపాలిటన్ ప్రాంత జనాభా మాత్రం పది లక్షలకు తగ్గరాదు.

4) ఏదైనా ఒక ప్రాంతము మెట్రోపాలిటన్ ప్రాంతముగా పరిగణింపబడిన తర్వాత ఏ కారణము వలన అయినా ఆ ప్రాంత జనాభా పది లక్షలకు తగ్గినట్లయితే, మెట్రోపాలిటన్ ప్రాంతముగా పరిగణించకూడదు (ఆ విధముగా రాష్ట్ర ప్రభుత్వము ప్రకటించవలెను).

   అయినప్పటికీ ఆ విధముగా ప్రకటించక ముందు ఆ ప్రాంతములోని మేజిస్ట్రేట్ లేక ఇతర న్యాయస్థానములలో గల కేసుల విచారణ యథాతథముగానే కొనసాగుతుంది.

5) ఉపనిబంధన (3) లో ఉదహరించిన విధముగా ఏదైనా ఒక మెట్రోపాలిటన్ ప్రాంతము యొక్క పరిధిని రాష్ట్ర ప్రభుత్వము తగ్గించినా లేక సవరించినా ఆ ప్రాంతములోని మేజిస్ట్రేట్, ఇతర కోర్టులలో అప్పటి వరకు నిల్వలో ఉన్న కేసుల విచారణపై ఎటువంటి ప్రభావము ఉండదు.

వివరణ : ఈ సెక్షన్‌కు సంబంధించి జనాభా అనగా ఒక నిర్దిష్ట సమయమునకు ముందు ఆఖరు సారిగా జరిగిన జనాభా లెక్కలననుసరించి నిర్ధారించిన జనాభా అని అర్థము.

సెక్షన్ 9 : సెషన్స్ న్యాయస్థానము :

1) రాష్ట్ర ప్రభుత్వము ప్రతి సెషన్స్ డివిజన్‌లోనూ తప్పని సరిగా ఒక సెషన్స్ న్యాయస్థానమును ఏర్పాటు చేయవలెను.

2) ప్రతి సెషన్సు కోర్టుకు ఒక న్యాయమూర్తి ఉండవలెను. ఆ న్యాయమూర్తి హైకోర్టుచే నియమించాలి.

3) ఒక్కొక్క సెషన్స్ డివిజన్‌లోను, అదనపు సెషన్స్ న్యాయమూర్తులను, సహాయక సెషన్స్ న్యాయమూర్తులను నియమించు అధికారము రాష్ట్ర ప్రభుత్వమునకు గలదు.

4) ఒక సెషన్స్ డివిజన్ యొక్క న్యాయమూర్తిని మరొక సెషన్స్ డివిజన్ యొక్క అదనపు న్యాయమూర్తిగా కూడా నియమించు అధికారము హైకోర్టుకు గలదు. ఆ విధముగా నియమించు సందర్భములో మరొక డివిజన్‌లో సదరు న్యాయమూర్తి ఎక్కడ నుండి తన విధులను నిర్వర్తించవలెనో హైకోర్టు నిర్దేశిస్తుంది.

5) కొన్ని సందర్భములలో ఒక సెషన్స్ జడ్జి స్థానము ఖాళీ కావచ్చును. అటువంటి సందర్భములలో సదరు న్యాయస్థానములో నిల్వలో ఉన్న లేక సదరు న్యాయస్థానముచే విచారించవలసియున్న అత్యవసర దరఖాస్తులను విచారణ నిమిత్తము అదే డివిజన్‌లోని మరొక అదనపు సెషన్స్ న్యాయమూర్తిని గాని, లేక సహాయక సెషన్స్ న్యాయమూర్తికి గాని బదిలీ చేయు అధికారము హైకోర్టుకు కలదు. ఆ సెషన్స్ డివిజన్‌లో అదనపు సెషన్స్ జడ్జీలుగాని సహాయక సెషన్స్ జడ్జీలుగాని, లేనట్లయితే, ఆ డివిజన్‌లోని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు బదిలీచేయు అధికారము హైకోర్టుకు గలదు.

6) సెషన్స్ కోర్టు ఏ ప్రదేశము లేక ప్రదేశములలో నెలకొల్పవలెనో హైకోర్టు నిర్దేశిస్తుంది. హైకోర్టు నిర్దేశించిన ప్రదేశము లేక ప్రదేశముల నుండి సెషన్స్ కోర్టు పనిచేస్తుంది. అయితే ఏదైనా ఒక ప్రత్యేక కేసు విచారణకు సంబంధించి కక్షిదారులకు, సాక్షులకు సౌకర్యముగా ఉంటుందని భావించిన పక్షములో సెషన్సుకోర్టును మరొక ప్రదేశమునకు మార్చవచ్చును. ఆ విధముగా మార్చు సందర్భములో ప్రాసిక్యూషన్ మరియు ముద్దాయిలతో ముందుగా సంప్రదింపవలసి ఉంటుంది.

వివరణ : ఈ చట్టమునకు సంబంధించి 'నియామకము' అనగా ఉద్యోగములో తొలిసారి నియామకముగా పరిగణించరాదు. బదిలీ లేక పదోన్నతి వలన జరుగు నియామకములు కూడా నియామకముగానే పరిగణలోకి వస్తాయి.

మంచి నడవడి గురించి హామీ ఇచ్చుట

సెక్షన్ 106 : శిక్ష విధించుతూ అల్లర్లు సృష్టించకుండా హామీ కోరుట :

1) ఈ సెక్షన్‌లోని ఉపనిబంధన (2) క్రింద ఉదహరించిన ఏదయినా నేరమునకు గాని లేక ఆ నేరమును ప్రోత్సహించినందుకు గాని సెషన్సు లేక మేజిస్ట్రేటు కోర్టు ఒక వ్యక్తికి శిక్ష విధించవచ్చు. ఆ సమయములో భవిష్యత్తులో ఆ వ్యక్తి శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా, అల్లర్లు సృష్టించకుండా ఉండే నిమిత్తము ఆ వ్యక్తి నుండి హామీ కోరటం సముచితమని ఆ న్యాయస్థానము భావించినట్లయితే, ఆ మేరకు హామీ ఇచ్చే సందర్భములో హామీదారులు ఉండాలని కూడా ఆదేశించవచ్చు. ఆ సందర్భములో మూడు సంత్సరముల కాలపరిమితి మించకుండా హామీ పత్రము వ్రాసి ఇవ్వవలసినదిగా కోరవచ్చు.

2) ఈ క్రింది నేరముల విషయములో హామీ పత్రమును కోరవచ్చు.

అ) భారతీయ శిక్షాస్మృతిలోని అధ్యాయము 8లో ఉదహరించిన నేరములు (153 ఎ, 153 బి, 153 సి సెక్షన్లు మినహాయించి).

ఆ) దౌర్జన్యము, బలప్రయోగము, తుంటరి చేష్టలతో కూడిన నేరములు

ఇ) భయోత్పాతము కలిగించు నేరములు

ఈ) శాంతి భద్రతలకు భంగం కలిగించు నేరములు

3) పై నేరములకు సంబంధించి దిగువ న్యాయస్థానము విధించిన శిక్ష అప్పీలులో గాని లేక మరొక విధముగా గాని కొట్టి వేసినట్లయితే హామీ పత్రము కూడా రద్దయిపోతుంది.

4) ఈ సెక్షను క్రింద హామీ పత్రమును కోరు అధికారము అప్పిలేటు న్యాయస్థానమునకు, అదే విధముగా రివిజను అధికారములు గల న్యాయస్థానములకు కూడా ఉంటుంది.

సెక్షన్ 107 : ముందు జాగ్రత్తగా అల్లర్లు సృష్టించకుండా హామీ కోరుట:

1) ఒక వ్యక్తి శాంతి భద్రతలకు భంగం కలిగించబోతున్నాడని (లేక) ప్రజాసంక్షేమమునకు విఘాతము కలిగించబోవుచున్నాడని, (లేక) శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడబోవుచున్నాడని కార్యనిర్వాహక మేజిస్ట్రేటుకు సమాచారము అందవచ్చు. అటువంటి సందర్భములలో శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా, ప్రజా సంక్షేమమునకు విఘాతం కలిగించకుండా అతని నుండి హామీ పత్రము పొందడం సమంజసమని సదరు మేజిస్ట్రేటు భావించవచ్చు. అప్పుడు ఆ మేరకు హామీపత్రము ఎందుకు కోరకూడదో సంజాయిషీ తెలుపవలసిందిగా కోరుతూ నోటీసు జారీ చేయవచ్చు. ఆ సందర్భములో హామీ దారులను కూడా కోరవచ్చు.

2) ఏ ప్రాంతములో అయితే ప్రజా సంక్షేమము లేక శాంతి భద్రతలకు భంగం ఏర్పడబోవుచున్నదని అనిపిస్తుందో ఆ ప్రాంతముపై విచారణాధికారముగల కార్యనిర్వాహక మేజిస్ట్రేటు ఈ సెక్షను క్రింద చర్యలను చేపట్టవచ్చు. అదే విధముగా ఒక కార్యనిర్వాహక మేజిస్ట్రేటు అధికార పరిధిలో నివాసముంటున్న వ్యక్తి తన అధికారపరిధి వెలుపల గల ప్రాంతములో శాంతి భద్రతలకు, ప్రజా సంక్షేమానికి భంగం కలిగించే అవకాశము ఉన్నప్పటికీ సదరు మేజిస్ట్రేటు ఆ వ్యక్తిపై ఈ సెక్షను క్రింద చర్యలను చేపట్టవచ్చు.

సెక్షన్ 108 : సత్ప్రవర్తన కొరకు హామీని కోరుట :

1. i) ఒక వ్యక్తి బుద్ధిపూర్వకముగా ఈ క్రింది చర్యలకు పాల్పడుతున్నట్లుగా ఒక కార్యనిర్వాహక మేజిస్ట్రేటుకు సమాచారము అందవచ్చును.

అ) భారతీయ శిక్షాస్మృతిలోని 124ఎ, 153ఎ, 153బి లేక 295 ఎ సెక్షన్ల క్రింద శిక్షార్హమైనవి ప్రచురణలు చేయుట, వ్యాఖ్యలు చేయుట (రాజద్రోహం, విభిన్న వర్గాల మధ్య వైషమ్యాలను పెంచుట, జాతీయ సమగ్రతను భంగపరచుట (లేక)

ఆ) తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తున్న న్యాయమూర్తిని అవమానపరచి అతని పరువు తీసే వ్యాఖ్యలు మొదలైనవి చేయటం లేక అతనిని భయోత్పాతానికి గురిచేయటం.

ii) భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షను 292లో ఉదహరింపబడిన అసభ్యమైన, అశ్లీలమైన వాటిని కలిగి ఉండటం, ముద్రించటం, తయారుచేయటం, దిగుమతి చేసుకోవటం, ఎగుమతి చేయటం, అమ్మటం, అద్దెకివ్వటం, పంపిణీ చేయటం, బహిరంగముగా ప్రదర్శించటం మొదలైన నేరములకు పాల్పడటం.

అటువంటి సందర్భములలో కనీసము ఒక సంవత్సర కాలంపాటు మంచి నడవడిని, సత్ప్రవర్తనను కలిగి ఉండే విధముగా ఆ వ్యక్తి నుండి వ్యక్తి గత హామీ పత్రమును గాని లేక హామీదారులతో కూడిన హామీ పత్రమునుగాని కోరాలని సదరు కార్యనిర్వాహక మేజిస్ట్రేటు భావించినట్లయితే, ఆ మేరకు అతనికి నోటీసు జారీ చేసి తగు సంజాయిషీ కోరవలసి ఉంటుంది.

2) అయితే ప్రెస్ మరియు రిజిస్ట్రేషన్ చట్టములోని నిబంధనల క్రింద రిజిష్టర్ కాబడిన ప్రచురణల యొక్క సంపాదకులు, ముద్రాపకులు, ప్రచురణ కర్తలపై ఈ చట్టము క్రింద ఎటువంటి నోటీసు జారీ చేయరాదు. ఆ విధముగా జారీ చేయవలెనన్న రాష్ట్ర ప్రభుత్వము యొక్క లేక రాష్ట్ర ప్రభుత్వము అందు నిమిత్తం నిర్ధేశించిన అధికారులనుండి గాని ముందుగా అనుమతి పొందవలెను.

సెక్షన్ 109 : అనుమానితుల నుండి సత్ప్రవర్తన హామీ తీసుకొనుట :

ఒక వ్యక్తి కాగ్నిజబుల్ నేరము చేయాలనే ప్రయత్నములో ఉండి ఆ సన్నాహములలో భాగముగా అజ్ఞాతంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నాడని కార్యనిర్వాహక మేజిస్ట్రేట్‌కు సమాచారము అందినట్లయితే, కనీసము ఒక సంవత్సరకాలము పాటు సత్ప్రవర్తన కలిగి ఉండేందుకు హామీ పత్రమును ఆ వ్యక్తి నుండి ఎందుకు కోరగూడదో సంజాయిషీ ఇవ్వవలసినదిగా నోటీసు జారీ చేయవచ్చు.

సెక్షన్ 110 : నేరచరిత్ర గలవారి నుండి హామీ పత్రము :

ఈ క్రింద ఉదహరించిన నేరస్థుల నుండి మూడు సంవత్సరముల కాలపరిమితికి తగ్గకుండా సత్ప్రవర్తన హామీ పత్రమును కార్యనిర్వాహక మేజిస్ట్రేటు కోరవచ్చు. ఆ విధముగా హామీ పత్రము ఎందుకు కోరకూడదో సంజాయిషీ ఇవ్వవలసినదిగా వారికి నోటీసు జారీ చేయవలసి ఉంటుంది. ఆ నేరస్థులు ఎవరనగా.

అ) వృత్తి రీత్యా బందిపోట్లు, దోపిడీ దొంగలు, కన్నపు దొంగలు, దొంగలు, (లేక) నకిలీ పత్రములు సృష్టించువారు (లేక)

ఆ) దొంగసొత్తని తెలిసి కూడా దానిని స్వీకరించుట వృత్తిగా కలిగిన వారు (లేక)

ఇ) దొంగలను దాచిపెట్టటం, వారిని రక్షించటం వృత్తిగా కలవారు, దొంగ సొత్తును దాచిపెట్టడం, దానితో లావాదేవీలు జరపటం వృత్తిగా కలవారు (లేక)

ఈ) అపహరణ, బలవంతముగా ఎత్తుకుపోవటం, జులుం, వంచన, తుంటరి చర్యలకు పాల్పడటం, ఆ నేరములు చేయుటకు ప్రయత్నించటం, ప్రోత్సహించటం వృత్తిగా కలిగినవారు. అలాగే భారతీయ శిక్షాస్మృతిలోని 12వ అధ్యాయము క్రింద, అదే చట్టములోని 489-ఎ, 489-బి, 489-సి, 489-డి సెక్షన్ల క్రింద శిక్షార్హమైన నేరములను చేయుట, చేయుటకు ప్రయత్నించుట, ప్రోత్సహించుట వృత్తిగా కలవారు (లేక)

ఉ) శాంతి భద్రతలకు భంగం కలిగించటానికి సంబంధించిన నేరములు చేయుట, చేయుటకు ప్రయత్నించుట, ప్రోత్సహించుట వృత్తిగా కలిగినవారు.

ఊ) (i) ఈ క్రింద ఉదహరించిన చట్టములలో ఉదహరించిన నేరములు చేయుట, చేయుటకు ప్రయత్నించుట లేక ప్రోత్సహించుట వృత్తిగా కలిగినవారు.

a) మందులు, పరిమళ ద్రవ్యముల చట్టము

b) విదేశీ మారక ద్రవ్యనిబంధనల చట్టము

c) ఉద్యోగుల ప్రావిడెంటుఫండు చట్టము

d) కల్తీ నిరోధక చట్టము

e) అత్యవసర వస్తువుల చట్టము

f) అంటరానితనము (నేరముల) చట్టము

g) కస్టమ్స్ చట్టము

ii) అవినీతి నిరోధక, చీకటి బజారు వ్యాపారము, ఆహారపదార్థములు, మందుల కల్తీకి సంబంధించి మరే ఇతర చట్టముల క్రింద శిక్షార్హములు (లేక)

ఎ) స్వేచ్ఛగా వదిలి పెడితే సామాజిక శ్రేయస్సుకు భంగము కలిగించే ప్రమాదకరమైన వ్యక్తులు.

సెక్షన్ 111 : షోకాజ్ నోటీసులు జారీచేయు విధానము :

ఈ అధ్యాయములోని 107, 108, 109, 110 సెక్షన్ల క్రింద జారీ చేయు షోకాజ్ నోటీసు లిఖిత పూర్వకముగా ఉండవలెను. ఆ వ్యక్తి ప్రవర్తన గురించి మేజిస్ట్రేట్‌కు అందిన సమాచారము యొక్క సారాంశము. ఎన్ని వేల రూపాయలకు బాండు ఇవ్వవలసినదీ, ఎంత కాలము ఆ బాండు అమలులో ఉండునదీ, హామీదారులు కూడా కావలసినదన్న ఎంతమంది కావలసినది మొదలైన వివరములన్నీ షోకాజ్ నోటీసులో ఉండవలెను.

సెక్షన్ 112 : నోటీసులోని వివరములను వివరించుట :

ఈ అధ్యాయములో ఎవరికయితే ఉత్తర్వులు జారీ చేయబడినవో, ఆ వ్యక్తి కనుక కోర్టులో ఉన్నట్లయితే, అతనికి ఆ ఉత్తర్వులను చదివి వివరించవలెను.

సెక్షన్ 113 : సమన్లు జారీ చేయుట :

ఉత్తర్వులు ఎవరికి జారీ చేయబడినవో, ఆ వ్యక్తి కోర్టులో లేని యెడల అతనికి మేజిస్ట్రేట్ సమన్లను జారీ చేయవలెను. ఒక వేళ ఆ వ్యక్తి కనుక జైలులో ఉన్నట్లయితే అతనిని తన ఎదుట హాజరుపరచవలసినదిగా జైలు అధికారిని ఆదేశిస్తూ వారంట్లను జారీ చేయవలసి ఉంటుంది.

అయితే, ఒక ప్రదేశములో శాంతి భద్రతలకు తక్షణ ప్రమాదము ఏర్పడినదని, ఆ వ్యక్తి లేక వ్యక్తులను తక్షణము అరెస్టు చేయనట్లయితే శాంతి భద్రతలను పరిరక్షించుట కష్టమని పోలీసు అధికారి లేక మరొక అధికారికి సమాచారము అందవచ్చు. ఆ సమాచారము వాస్తవమేనని మేజిస్ట్రేటు భావించినట్లయితే అతనిని తక్షణమే అరెస్టు చేయు నిమిత్తము అరెస్టు వారంటును జారీచేయవచ్చు.

సెక్షన్ 114 : సమన్లతో బాటు ఉత్తర్వులను కూడా అందచేయవలెను :

సెక్షన్ 113 క్రింద సమన్లుగాని, వారంటుగాని జారీ అయినప్పుడు, సెక్షన్ 113 క్రింద జారీ చేసిన ఉత్తర్వు యొక్క కాపీని కూడా దానితో జతపరచవలెను. సంబంధిత వ్యక్తికి అవి అందచేయవలెను.

సెక్షన్ 115 : న్యాయవాది హాజరగుట :

బాండు ఎందుకివ్వకూడదో సంజాయిషీ కోరుతూ ఒక వ్యక్తికి ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, తగిన కారణము ఉన్నయెడల, తన ఎదుట ఆవ్యక్తి హాజరు కాకుండా మినహాయింపు ఇచ్చు అధికారము మేజిస్ట్రేటుకు కలదు. అటువంటి సందర్భములలో అతనికి బదులుగా న్యాయవాది హాజరగుటకు అనుమతించవచ్చును.

సెక్షన్ 116 : విచారణ జరుగు విధానము :

1) తాను జారీచేసిన ఉత్తర్వుల సారాంశమును సెక్షన్ 111లో పొందుపరచిన విధముగా ఆ వ్యక్తికి న్యాయమూర్తి చదివి వినిపించిన తరువాత, ఏ సమాచారము ఆధారంగా తాను ఉత్తర్వులు జారీచేసాడో ఆ ఉత్తర్వులు వాస్తవములా కాదా అను విషయమై విచారణను ప్రారంభించవలసి ఉంటుంది. సమన్లద్వారా గాని లేక వారంట్లు ద్వారా గాని, ఆవ్యక్తి మేజిస్ట్రేటు ఎదుట హాజరైన సందర్భములలో కూడా పైన వివరించిన విధముగానే విచారణను ప్రారంభించవలసి ఉంటుంది.

2) విచారణ సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయవలసి ఉంటుంది. విచారణ జరుగుట, సాక్ష్యమును నమోదు చేయుట మొదలగు అంశములకు సంబంధించి సమన్లు కేసులో విచారణా విధానమును అనుసరించవలసి ఉంటుంది.

3) ఉపనిబంధన (1) లో ఉదహరించిన విధముగా విచారణ ప్రారంభించిన తర్వాత విచారణ పూర్తి అగులోగా శాంతి భద్రతలకు, ప్రజా సంక్షేమానికి తక్షణ ప్రమాదము ఏర్పడవచ్చు. ఏదయినా నేరము జరిగే ప్రమాదము కూడా ఏర్పడవచ్చు. అటువంటి సందర్భములలో విచారణ పూర్తి అగు వరకు సత్ప్రవర్తన కలిగి ఉండటానికి లేక గలాభాచేయకుండా ఉండటానికి అంగీకరిస్తూ హామీపత్రమును వ్రాసి ఇవ్వవలసినదిగా విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తిని మేజిస్ట్రేటు ఆదేశించవచ్చు. అంతేగాక హామీ పత్రము వ్రాసియిచ్చు వరకూ అతనిని కష్టడీలో ఉంచవలసినదిగా ఆదేశించవచ్చు. హామీ పత్రము వ్రాసి యిచ్చుటకు నిరాకరించినా, లేక విఫలమైనా, విచారణపూర్తి అగువరకూ కస్టడీలో ఉంచవలసినదిగా ఆదేశించవచ్చు.

అయితే –

ఎ) 108, 109, 110 సెక్షన్లు అన్వయించని వారినుండి సత్ప్రవర్తన బాండు కోరరాదు.

బి) ఉపనిబంధన 3 క్రింద బాండు కోరుసందర్భములలో బాండులో ఉండు నిబంధనలు, ఎంత మొత్తమునకు బాండు ఇవ్వవలసినది, హామీదారులను కోరుట, హామీదారుల సంఖ్య, వారు ఎంత మొత్తమునకు బాండు ఇవ్వవలసినది మొదలగు అంశములు సెక్షన్ 111లోని నిబంధనలను పోలిఉండవచ్చును. అంతకన్న కఠినముగా, భారముగా ఉండరాదు.

4) ఈ సెక్షనుకు సంబంధించి వృత్తి రీత్యా నేరస్తులు, స్వేచ్ఛగా వదిలిపెడితే శాంతిభద్రతలను సృష్టించగల ప్రమాదకరమైన వ్యక్తి మొదలైన అంశములు సాక్షమును బట్టి, లేక అతనికి గల పరపతిని బట్టి లేక మరొక విధముగా బుజువు కావలెను.

5) ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువ మందిపై ఒకే విధమైన చర్యలు తీసుకొను సందర్భములో వారందరినీ కలిపి విచారించవచ్చు లేక విడివిడిగా విచారించవచ్చు.

6) ఈ సెక్షను క్రింద విచారణ ప్రారంభించిన తేదీ నుండి 6 మాసాలలోపల పూర్తి కావలెను. (Shall be completed) ఆరు మాసముల లోపల పూర్తిగాని యెడల అందుకు గల ప్రత్యేక కారణాలను లిఖిత పూర్వకముగా రికార్డు చేయని యెడల, ఆరు మాసముల వ్యవధి పూర్తి అయిన వెంటనే, విచారణ రద్దయినట్లుగానే పరిగణించాలి.

అయితే, విచారణ జరుగుతుండగా ఎవరినయినా నిర్భంధములో ఉంచినట్లయితే వారిపై విచారణ ఆరు నెలలలోపల తప్పని సరిగా పూర్తి కావలెను. లేని యెడల విచారణ రద్దయినట్లుగానే పరిగణించాలి. (అనగా అతనిని వెంటనే విడుదల చేయవలెను)

సెక్షన్ 117 : తీర్పు లేక అంతిమ ఉత్తర్వులు :

విచారణ పూర్తి అయిన తరువాత, విచారణ సారాంశమును బట్టి అల్లర్లు సృష్టించకుండా గాని, లేక సత్ప్రవర్తన గురించి గాని, విచారణ జరిపిన వ్యక్తినుండి బాండు తీసుకొనుటకు తగిన సాక్ష్యాధారములు కలవని మేజిస్ట్రేటు అభిప్రాయ పడినట్లయితే, బాండు యివ్వవలసినదిగా ఆ వ్యక్తిని ఆదేశిస్తూ ఉ త్తర్వులు జారీచేయవలసి ఉంటుంది.

అదే సందర్భములో

ఎ) సెక్షను 111 క్రింద కోరబడిన బాండు కన్నా ఈ సెక్షను క్రింద కోరబడిన బాండు భిన్నముగా ఉండరాదు. హామీ మొత్తము గాని, కాలపరిమితి గాని, సెక్షను 111లో ఉదహరించిన దానికి మించి ఉండరాదు.

బి) హామీగా కోరిన మొత్తం అతి ఎక్కువగా ఉండరాదు. సందర్భానుసారంగా సమంజసంగా ఉండవలెను.

సి) బాండు యివ్వవలసినదిగా ఆదేశించిన వ్యక్తి మైనర్ అయినట్లయితే, అతను ఎటువంటి బాండును యివ్వనవసరం లేదు. అతని తరపున హామీ దారులు బాండును యివ్వవలసి ఉంటుంది.

సెక్షన్ 118 : సెక్యూరిటీ ప్రొసీడింగ్స్ కొట్టివేయుట :

సెక్షన్ 116 క్రింద జరిగిన విచారణలో ఒక వ్యక్తి నుండి ఏవిధమైన బాండు తీసుకొనవలసిన అవసరం లేదని మేజిస్ట్రేటు భావించవచ్చు. అప్పుడు ఆ మేరకు సెక్యూరిటీ ప్రొసీడింగ్స్‌ను రద్దుచేయవలసి ఉ ంటుంది. ఆ వ్యక్తి ఈ అధ్యాయములోని నిబంధనల మేరకు జైలులో ఉన్నట్లయితే, అతనిని వెంటనే విడుదలచేయవలసి ఉంటుంది.

సెక్షన్ 119 : బాండు అమలులోనికి వచ్చినట్లుగా భావన :

1) సెక్షన్ 106 లేక 117 క్రింద బాండు ఇవ్వవలసినదిగా ఒక వ్యక్తిని ఆదేశించినప్పటికి ఆ వ్యక్తి జైలులో ఉండి ఉండవచ్చును. అటువంటి సందర్భములలో జైలుశిక్ష పూర్తికాబడి ఆ వ్యక్తి జైలునుండి బయటకు వచ్చిన తేదీనుండి బాండు అమలులోనికి వచ్చినట్లు పరిగణించాలి.

2) మిగిలిన సందర్భములలో 106 లేక 117 సెక్షన్ల క్రింద ఉత్తర్వులు చేయబడిన తేదీ నుండి గాని, లేక మేజిస్ట్రేటు నిర్దేశించిన తేదీ నుండి గాని బాండు అమలులోనికి వచ్చినట్లుగా పరిగణించాలి.

సెక్షన్ 120 : బాండు షరతుల ఉల్లంఘన :

అల్లర్లు సృష్టించకుండా ఉండటానికి అంగీకరిస్తూ బాండు వ్రాసినప్పుడు అందులో నిబంధనలకు అతడు బద్ధుడై ఉండాలి. సత్ప్రవర్తన కలిగి ఉండటానికి అంగీకరిస్తూ బాండు వ్రాసిన సందర్భములకూ ఇదే నియమము వర్తిస్తుంది.

సత్ప్రవర్తన బాండ్ల విషయములో బాండు ఇచ్చిన వ్యక్తి బాండు కాలపరిమితి తీరకముందే జైలు శిక్ష విధించదగిన నేరము చేసినా, లేక నేరము చేసేందుకు ప్రయత్నించినా అటువంటి నేరము ప్రోత్సహించినా, బాండు షరతులను ఉల్లంఘించినట్లుగా పరిగణిస్తుంది. సదరు నేరం చేయడం, చేసేందుకు ప్రయత్నించటం, ప్రోత్సహించటమనేది ఎక్కడ జరిగినా బాండు షరతులను ఉల్లంఘించినట్లుగానే పరిగణించాలి.

సెక్షన్ 121 : అర్హతలేని హామీదారులను తిరస్కరించుట :

1) హామీదారులను కోరు సందర్భములలో, ఒక వ్యక్తికి హామీదారుడుగా ఉండు అర్హతలేదని మేజిస్ట్రేటు భావించినట్లయితే, అతనిని హామీదారునిగా తిరస్కరించు అధికారము మేజిస్ట్రేటుకు కలదు. ఒక మేజిస్ట్రేటు ఇదివరలో ఆమోదించిన హామీ దారులను కూడా, వారు అనర్హులని భావిస్తే తిరస్కరించవచ్చు. తనకు ముందు మేజిస్ట్రేటు ఆమోదించిన హామీదారులను కూడా ఇదే కారణముపై తిరస్కరించవచ్చును.

అయితే, హామీదారులను ఆమోదించకుండా తిరస్కరించుటకు ముందుగా వారు అర్హులా, అనర్హులా విషయముపై మేజిస్ట్రేటు విచారించవలెను. లేక విచారించవలసినదిగా తన క్రింద మేజిస్ట్రేట్‌ను ఆదేశించవలెను.

2) పైన ఉదహరించిన విధముగా విచారణ జరుపుటకు ముందుగా తన అర్హతను నిరూపించుకొనుటకు తగిన అవకాశమును హామీదారునికి, ఎవరికి హామీగా ఉండబోతున్నాడో ఆ వ్యక్తికి ఇవ్వవలెను. విచారణ యొక్క సారాంశము రికార్డు చేయవలెను.

విచారణలో ప్రవేశపెట్టబడిన సాక్ష్యములను బట్టి లేక ఉపనిబంధన (1) క్రింద నియమింపబడిన మేజిస్ట్రేటు యొక్క రిపోర్టును బట్టిగాని, ఒక వ్యక్తి హామీదారునిగా ఉండుటకు అనర్హుడని మేజిస్ట్రేటు భావించినట్లయితే హామీదారునిగా అతనిని తిరస్కరిస్తూ అందుకు తగినకారణములను రికార్డు చేయవలెను.

అయితే, అంతకుముందే ఆమోదించిన హామీదారులను తిరస్కరించబోవు సందర్భములో, ఎవరి తరపున హామీ ఇచ్చారో ఆ వ్యక్తికి ఆ విషయమును తెలిపి, ఆవ్యక్తి తన ఎదుట హాజరగుటకుగాను అవసరమైన సమన్లనుగాని, వారంటునుగాని జారీ చేయవలసిఉంటుంది.

సెక్షన్ 122 : బాండు ఇచ్చుటకు తిరస్కరిస్తే జైలుశిక్ష :

1) ఎ) సెక్షను 106 లేక 117 క్రింద బాండు ఇవ్వవలసిందిగా కోర్టు లేక మేజిస్ట్రేటు ఆదేశించినప్పటికీ, నిర్ణీత వ్యవధిలోపల ఆ వ్యక్తి బాండు ఇవ్వకపోవచ్చు. అటువంటి సందర్భములలో బాండు వ్యవధి తీరునంత వరకుగాని లేక బాండు ఇచ్చువరకు గాని అతనిని జైలులో ఉంచవలసి వస్తుంది.

బి) అల్లర్లు సృష్టించకుండా ఉండేందుకు అంగీకరిస్తూ, హామీదారులతో పని లేకుండా సెక్షన్ 117 క్రింద ఒక వ్యక్తి వ్యక్తిగత బాండు ఇచ్చిన తర్వాత, బాండు కాలవ్యవధి తీరకముందే అల్లర్లను సృష్టించటం ద్వారా బాండు నిబంధనలను ఉల్లంఘించవచ్చు. అటువంటి పరిస్థితులలో, మిగిలిన బాండు కాలవ్యవధి తీరు వరకు అతనిని అరెస్టు చేసి జైలులో ఉంచవలసినదిగా మేజిస్ట్రేటు ఉత్తర్వులు జారీ చేయవచ్చు. అదే సందర్భములో బాండు షరతులను ఉల్లంఘించినందుకు గాను అతనిపై చట్టపరమైన చర్యలను యధావిధిగా కొనసాగించవచ్చు. అందుకు ఈ ఉప నిబంధన అడ్డురాదు.

2) అల్లర్లు సృష్టించకుండా ఉండునిమిత్తము ఒక సంవత్సరముకన్న ఎక్కువ కాలపరిమితితో బాండు కోరబడిన సందర్భములలో ఆ వ్యక్తి బాండు ఇచ్చుటలో విఫలమైన యెడల ఆ విషయమును సెషన్సు న్యాయమూర్తికి తెలుపవలసి ఉంటుంది. అదే సందర్భములో, సెషన్సు న్యాయమూర్తి యొక్క ఉత్తర్వులు వెలువడు వరకు ఆ వ్యక్తిని జైలులో ఉంచవలసినదిగా మేజిస్ట్రేటు ఆదేశించవలసి ఉంటుంది.

3) ఉపనిబంధన (2) లో ఉదహరించిన సందర్భములు ఎదురయినప్పుడు మేజిస్ట్రేట్ యొక్క రిపోర్టును, సాక్షాధారములను సెషన్సు న్యాయమూర్తి పరిశీలించవలెను. సంబంధిత వ్యక్తి నుండి తగు సంజాయిషీ కోరవలెను. అతని వాదనను కూడా విన్న తరువాత సందర్భోచితమైన ఉత్తర్వులను సెషన్సు న్యాయమూర్తి వెలువరించవలెను.

ఏది ఏమయినప్పటికీ బాండు ఇచ్చుటలో విఫలమైనందున ఒక వ్యక్తిని ఎట్టి పరిస్థితులలోనూ మూడు సంవత్సరములకు మించి నిర్బంధములో ఉంచరాదు.

4) బాండు తీసుకొనుటకు సంబంధించి ఒకే కేసులో ఒకరికన్న ఎక్కువమంది ఉండి ఉండవచ్చును. ఉపనిబంధన (2) లో విషయము సెషన్సు న్యాయమూర్తికి రిపోర్టు చేయవలసి రావచ్చు. ఆ విధముగా రిపోర్టు చేయు సందర్భములో ఆ కేసులో ఉన్న మిగిలిన వారి విషయమును కూడా రిపోర్టులో ఉదహరింపవలసి ఉంటుంది. అప్పుడు మిగిలిన వారికి కూడా (2) మరియు (3) ఉపనిబంధనలోని అంశములు అన్వయిస్తాయి. అయితే, వారినుండి ఎంతకాలమునకు బాండు కోరడం జరిగిందో ఆ వ్యవధికి మించి వారిని నిర్బంధములో ఉంచరాదు.

5) ఉపనిబంధన (2) లేక (3) క్రింద ఒక కేసు సెషన్స్ న్యాయమూర్తికి రిపోర్టు చేయబడిన సందర్భములో, సెషన్స్ న్యాయమూర్తి ఆ కేసును అదనపు సెషన్సు న్యాయమూర్తికి గాని, లేక అసిస్టెంటు సెషన్సు న్యాయమూర్తికి గాని బదిలీ చేయవచ్చు. అటువంటి సందర్భములలో వారు సెషన్సు న్యాయమూర్తిగానే పరిగణించి తగు ఉత్తర్వులు జారీ చేయవచ్చు.

6) హామీ పత్రమును జైలు అధికారికి ఇచ్చినట్లయితే (ఆ వ్యక్తి జైలులో ఉన్న సందర్భములో) దానిని జైలు అధికారి వెంటనే సంబంధిత కోర్టుకు గాని లేక మేజిస్ట్రేటుకు గాని పంపవలసి ఉంటుంది. వారి ఉత్తర్వులను జైలు అధికారి అమలు చేయవలసి ఉంటుంది.

7) అల్లర్లు సృష్టించకుండా బాండు ఇచ్చుటకు విఫలమైన సందర్భములలో విధించదగిన జైలు శిక్ష సాధారణ కారాగార వాస శిక్ష అయి వుండవలెను.

8) సత్ప్రవర్తనకు సంబంధించిన బాండు ఇచ్చుటకు విఫలమైనట్లయితే, సెక్షను 108 అన్వయించు సందర్భములలో సాధారణ జైలు శిక్ష విధించవలెను. 109 లేక 110 సెక్షన్లు అన్వయించు సందర్భములలో సాధారణ జైలు శిక్షగాని, లేక కఠిన కారాగార శిక్షగాని విధించవచ్చు. అది కోర్టు లేక మేజిస్ట్రేటు విచక్షణపై ఆధారపడి ఉంటుంది.

సెక్షన్ 123 : బాండు ఇవ్వనందుకు అరెస్టు చేసినవారిని విడుదల చేయుట:

1) సెక్షను 117 క్రింద కార్యనిర్వాహక మేజిస్ట్రేటు జారీ చేసిన ఉత్తర్వులలో కోరబడిన విధముగా బాండు ఇచ్చుటలో విఫలమయిన కారణముపై ఒక వ్యక్తి నిర్బంధములో ఉంచబడిన సందర్భములలో, ఆ వ్యక్తి సమాజానికి గాని, మరెవరికి గాని ప్రమాదము కాదని జిల్లా మేజిస్ట్రేటు భావించినట్లయితే అతనిని విడుదల చేయవలసినదిగా ఆదేశించవచ్చు. మిగిలిన సందర్భములలో బాండు ఇచ్చుటలో విఫలమయిన కారణముపై ఒక వ్యక్తి నిర్బంధించినట్లయితే, ఆ వ్యక్తి సమాజానికి గాని, మరెవరికి గాని ప్రమాదముకాదని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు భావించినట్లయితే అతనిని విడుదల చేయవలసినదిగా ఆదేశించవచ్చు.

2) బాండు ఇవ్వలేక పోయినందు వలన ఒక వ్యక్తి నిర్బంధములో ఉంచినట్లయితే బాండు క్రింద కోరిన మొత్తమునుగాని, హామీదారుల సంఖ్య గాని, లేక బాండు యొక్క కాలపరిమితి గాని తగ్గించు అధికారము హైకోర్టుకు, సెషన్స్ కోర్టుకు, జిల్లా మేజిస్ట్రేటుకు (సెక్షను 117 క్రింద కార్యనిర్వాహక మేజిస్ట్రేటుకు ఉత్తర్వులు జారీ చేసిన సందర్భములలో), చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు (మిగిలిన సందర్భములలో) కలదు.

3) ఉపనిబంధన (1) క్రింద ఒక వ్యక్తిని విడుదల చేయు సందర్భములలో కొన్ని షరతులను విధించవచ్చును. లేక ఎటువంటి షరతులు లేకుండానే విడుదల చేయవచ్చును.

అటువంటి సందర్భములలో ఎంత కాలమునకు బాండు ఇవ్వవలసినదిగా తొలుత నిర్దేశింపబడిందో, ఆ వ్యవధి తీరిన వెంటనే ఈ ఉపనిబంధన క్రింద విధించు షరతులు కూడా రద్దయిపోతాయి.

4) ఉపనిబంధన (3) క్రింద ఎటువంటి షరతులు విధించవలెనో రాష్ట్ర ప్రభుత్వము నిర్దేశిస్తుంది.

5) ఉపనిబంధన (3) మరియు (1) క్రింద ఒక వ్యక్తిని విడుదల చేయు సందర్భములో విధించిన షరతులను ఆ వ్యక్తి ఉల్లంఘించినట్లయితే ఆ షరతులను రద్దు చేయు అధికారము జిల్లా మేజిస్ట్రేటు లేక చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్లకు (సందర్భాను సారముగా) ఉంటుంది.

6) ఉపనిబంధన (5) క్రింద ఒక వ్యక్తిని షరతులతో విడుదల చేస్తూ జారీ అయిన ఉత్తర్వులు రద్దు కాబడినట్లయితే, ఆ వ్యక్తిని వారంటు లేకుండా ఏ పోలీసు అధికారి అయినా అరెస్టు చేయవచ్చు. అరెస్టు చేసిన అనంతరం ఆ వ్యక్తిని జిల్లా మేజిస్ట్రేటు ఎదుటగాని లేక చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు ఎదుటగాని హాజరు పరచవలెను.

7) ఉపనిబంధన (6) క్రింద ఆ వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు, మొదట జారీ చేసిన బాండు క్రింద ఇంకా మిగిలియున్న కాలము వరకు ఆ వ్యక్తిని జైలులో ఉంచవలసినదిగా జిల్లా మేజిస్ట్రేటు లేక చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు ఉత్తర్వులు జారీ చేయవచ్చు.

8) ఉపనిబంధన (7) క్రింద నిర్బంధంలోనున్న వ్యక్తి ఆ తర్వాత మొదట జారీ చేసిన ఉత్తర్వులలో కోరిన విధముగా హామీ ఇవ్వకలిగినట్లయితే అతనిని వెంటనే విడుదల చేయవలెను.

9) ఈ అధ్యాయము క్రింద ఇచ్చిన ఒక బాండును ఎప్పుడైనా రద్దు చేయు అధికారము హైకోర్టు లేక సెషన్సు కోర్టుకు గలదు. ఇటువంటి అధికారమే తమ జిల్లాకు సంబంధించి జిల్లా మేజిస్ట్రేటు మరియు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్లకు కూడా కలదు.

10) ఒక వ్యక్తికి హామీదారుడిగా ఉన్న వ్యక్తి తన హామీ పత్రమును ఎప్పుడయినా రద్దు చేసుకొనవచ్చును. అందు నిమిత్తము తాను బాండు ఇచ్చిన కోర్టులో దరఖాస్తు చేసుకొనవలెను. అప్పుడు ఆ కోర్టు సంబంధిత వ్యక్తికి ఆ విషయము తెలియపరచు నిమిత్తము సమన్లను కాని, వారంట్లను కాని జారీ చేసి తగు ఉత్తర్వులు జారీ చేయవలెను.

సెక్షన్ 124 : కొత్త హామీదారులను కోరు సందర్భములు :

1) సెక్షను 121 లోని (3) వ ఉపనిబంధన క్రింద హామీదారులను తిరస్కరించిన సందర్భములలోను, అదే విధముగా హామీదారునిగా తనని తొలగింపవలసిందిగా కోరుతూ హామీదారుడే స్వయముగా సెక్షన్ 123 (10) క్రింద దరఖాస్తు చేసుకొనిన సందర్భములలోను న్యాయస్థానము ఉత్తర్వుల మేరకు సంబంధిత వ్యక్తి కోర్టుకు హాజరయినప్పుడు క్రొత్త హామీదారులను సమకూర్చుకొనవలసినదిగా ఆదేశించవలెను.

2) పై విధముగా చేయు ఆదేశములు సెక్షను 106 లేక 117 క్రింద జారీ చేయబడినట్లుగానే పరిగణించాలి.

అధ్యాయం - 9

భార్య, పిల్లలు, తల్లిదండ్రుల పోషణ

సెక్షన్ 125 : భరణము చెల్లింపుకు ఆదేశము :

1) ఎవరయినా ఒక వ్యక్తి తగినంత ఆర్థిక స్థోమత కలిగి ఉండి కూడా, సరి అయిన కారణము లేకుండా ఈ క్రింద ఉదహరించిన వారిని పోషించకుండా నిర్లక్ష్యము చేసినా, పోషించుటకు తిరస్కరించినా వారికి భరణము చెల్లింపవలసి ఉంటుంది.

   అ) తనకు తాను పోషించుకొనలేని భార్యను

   ఆ) తమను తాము పోషించుకొనలేని మైనరు ప్లిలలను (చట్టబద్దముగా జన్మించిన పిల్లలు, అక్రమముగా జన్మించిన పిల్లలు కూడా. వారికి వివాహము అయినదా లేదా అనునది అప్రస్తుతము).

ఇ) మేజర్లు అయినప్పటికీ, శారీరక లేక మానసిక అస్వస్థత లేక గాయము ఫలితముగా తమను తాము పోషించుకొనలేని స్థితిలో ఉన్న పిల్లలను (చట్టబద్దముగా జన్మించిన పిలలయినా, అక్రమముగా జన్మించిన పిల్లలయినా ఈ క్లాజు వర్తిస్తుంది. అయితే, వివాహమైన ఆడపిల్లలకు ఈ క్లాజు వర్తించదు).

ఈ) తమను తాము పోషించుకొనలేని తల్లిదండ్రులను

పైన ఉదహరించిన వారిని పోషించుటలో ఒకవ్యక్తి విఫలమయినట్లయితే, వారు భరణము నిమిత్తము మొదటి తరగతి మేజిస్ట్రేటు కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకొనవచ్చు. సమగ్ర విచారణ అనంతరం ఆ పిటిషన్‌లోని అంశములు వాస్తవములేనని మేజిస్ట్రేటు భావించినట్లయితే, నెలకు అయిదు వందల రూపాయల వరకు వారికి భరణము చెల్లించవలసినదిగా ఆ వ్యక్తిని మేజిస్ట్రేట్ ఆదేశించవచ్చు.

అంతేకాకుండా, మైనరు బాలికకు వివాహమైనప్పటికీ, ఆమె భర్త ఆర్థిక స్థోమత లేని వాడయినట్లయితే, ఆ బాలికకు మెజారిటీ వచ్చు వరకు తండ్రి భరణము చెల్లించవలెను.

వివరణ : ఈ అధ్యాయమునకు సంబంధించి

అ) మైనర్ అనే పదమునకు సంబంధించి భారత మెజారిటీ చట్టములోని నిర్వచనమే అన్వయిస్తుంది.

ఆ) భర్త నుండి విడాకులు పొందినా, లేక భర్తకు విడాకులిచ్చినప్పటికీ తిరిగి పునర్వివాహము చేసుకొనని స్త్రీ భార్యగానే పరిగణిస్తుంది.

2) ఈ సెక్షను క్రింద ఉత్తర్వులు జారీ చేయునపుడు దరఖాస్తు దాఖలు చేసిన తేదీ నుండి గాని, లేక ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుండి గాని భరణము చెల్లింపవలసినదిగా ఆదేశించు అధికారము మేజిస్ట్రేటుకు కలదు.

3) భరణము చెల్లింపవలసినదిగా మేజిస్ట్రేటు ఆదేశములు జారీ చేసినప్పటికీ ఆ వ్యక్తి సరి అయిన కారణము లేకుండా భరణము చెల్లించక పోవచ్చు. అటువంటి సందర్భములలో, భరణము చెల్లించని ప్రతి సందర్భములోనూ భరణము వసూలు నిమిత్తము మేజిస్ట్రేటు వారంటు జారీ చేయవచ్చును. జరిమానాల విధింపుకు చెందిన నిబంధనలే ఈ అంశమునకు వర్తిస్తాయి. అంతేగాకుండా, వారంటు అమలు చేయుటలో, భరణము చెల్లించనందుకు గాను ఆ వ్యక్తిని నిర్బంధించవలసినదిగా ఆదేశించవచ్చును. నెలరోజులకు తగ్గకుండా జైలుశిక్ష విధించవచ్చు.

అయితే, భరణము బకాయిపడిన ఒక సంవత్సరము లోపు మాత్రమే వసూలు నిమిత్తము దరఖాస్తు చేసుకొనవలెను. అప్పుడు మాత్రమే మేజిస్ట్రేటు వారంటును జారీచేస్తారు.

అదే సందర్భములో భార్యా, భర్తల విషయములో భార్య కనుక తనతో కలసి ఉండుటకు అంగీకరిస్తే ఆమెను పోషించుటకు భర్త తన అంగీకారము తెలుపవచ్చు. అయినప్పటికీ, అతనితో కలిసి ఉండుటకు భార్య తిరస్కరించవచ్చు. ఆ విధంగా తిరస్కరించుటకు గల కారణములను మేజిస్ట్రేటు పరిశీలించి తగు ఉత్తర్వులు జారీ చేయవలసి ఉంటుంది.

వివరణ : భర్త కనుక మరో స్త్రీని వివాహము చేసుకున్నా, లేక మరో స్త్రీని ఉంపుడుకత్తెగా ఉంచుకున్నా, భార్య అతనితో కలిసి జీవించుటకు తిరస్కరించుట సమంజసమైనదే.

4) వ్యభిచారం చేస్తున్న స్త్రీ, తన భర్త నుండి భరణం కోరుటకు అర్హురాలు కాదు. అలాగే, సరి అయిన కారణము లేకుండా భర్తతో కలిసి ఉండుటకు నిరాకరించిన భార్య కూడా భరణం కోరుటకు అర్హురాలు కాదు. అదే విధంగా పరస్పర అవగాహనతో, అంగీకారముతో భర్తనుండి దూరముగా ఉంటున్న స్త్రీ కూడా భర్త నుండి భరణము పొందుటకు అర్హురాలుకాదు.

5) ఈ సెక్షను క్రింద భార్యకు భరణము చెల్లించవలసినదిగా ఉత్తర్వులు జారీ అయిన తర్వాత, ఆమె వ్యభిచారము చేస్తున్నదని ఋజువు అయినా లేక సరి అయిన కారణము లేకుండా భర్తతో కలిసి ఉండుటకు తిరస్కరించిందని ఋజువు అయినా, భరణము చెల్లించవలసిందిగా జారీ చేసిన ఉత్తర్వులను మేజిస్ట్రేటు రద్దు చేయవచ్చు.

భారతీయ శిక్షాస్మృతి

సెక్షన్ 21 : ప్రభుత్వోద్యోగి

ఈ క్రింది తరహా ఉద్యోగులు ప్రభుత్వోద్యోగులుగా పరిగణలోకి వస్తారు.

1. ఈ సబ్‌క్లాజు తొలగించబడినది.
2. భారత పదాతిదళ, వైమానికదళ, నౌకాదళములలోని కమీషన్డ్ ఆఫీసర్లు.
3. న్యాయనిర్ణయము చేయు అధికారము గల న్యాయమూర్తులు
4. ఈ క్రింది చర్యలు చేపట్టు అధికారము గల న్యాయస్థానము యొక్క అధికారులు

   అ) న్యాయపరమైన లేక విషయపరమైన అంశముపై విచారణ జరుపుట, రిపోర్టు చేయుట

   ఆ) ఏదైనా ఒక దస్తావేజును తయారుచేయుట, ధృవీకరించుట లేక భద్రపరచుట

   ఇ) ఏదైనా ఆస్థిని స్వాధీనములో ఉంచుకొనుట లేక పరిష్కరించుట

   ఈ) న్యాయసంబంధమైన ఉత్తర్వులను అమలు చేయుట

   ఉ) ప్రమాణము చేయించుట

   ఊ) కోర్టు యొక్క ఒక ఉత్తర్వుకు భాష్యము చెప్పుట

   ఋ) న్యాయస్థానముచే జారీ చేయబడిన ఉత్తర్వులను అమలుచేయుటకు ప్రత్యేకముగా అధికారము పొందినవారు.

ఇందుకు సంబంధించిన లిక్విడేటర్లు, రిసీవర్లు, కమీషనర్లు కూడా న్యాయస్థానము యొక్క అధికారులుగానే పరిగణలోకి వస్తారు.

5. ఒక న్యాయస్థానమునకు లేక ప్రభుత్వోద్యోగికి సహాయపడి, సహకరించే న్యాయనిర్ణయ సంఘము యొక్క సభ్యులు, పంచాయితీ సభ్యులు.

6. ఏదైనా అంశమును తీర్మానించుటకు, లేక రిపోర్టు చేయుటకై న్యాయస్థానముగాని, మరేదైనా ప్రభుత్వాధికారిగాని, మధ్యవర్తి గాని లేక మరెవరినైనా గాని పంపవచ్చును. అటువంటి వ్యక్తులు లేక మధ్యవర్తులు కూడా ప్రభుత్వోద్యోగులు గానే పరిగణలోకి వస్తారు.

7. ఎవరినైనా నిర్బంధించి తన అధీనములో ఉంచుకొనుటకు అధికారము కలిగినవారు.

8. నేరములను నిరోధించుటకు, నేరములను గురించిన సమాచారమును అందజేయుటకు, నేరస్థులను న్యాయస్థానములకు అప్పగించుటకు, ప్రజాసంక్షేమమును, ప్రజా భద్రతను, ప్రజారోగ్యమును పరిరక్షించుటకు అధికారం పొందిన ప్రభుత్వాధికారులు.

9. ప్రభుత్వము తరపున ఏవైనా ఆస్థులను స్వాధీనపరచుకొనుటకు, తీసుకొనుటకు, అధీనములో ఉంచుకొనుటకు, అభివృద్ధి చేయుటకు బాధ్యత కలిగిన అధికారులు, ఏదైనా ఆస్థి విషయమై ప్రభుత్వము తరపున సర్వేచేయుటకు, ఒప్పందములు చేసుకొనుటకు అధికారం పొందిన అధికారులు; ప్రభుత్వము యొక్క ఆర్థిక ప్రయోజనములను దృష్టిలో నుంచుకొని రెవెన్యూ సంబంధమైన చర్యలను అమలుచేయుటకు, పరిశోధించుటకు లేక రిపోర్టు చేయుటకు అధికారమీయబడిన అధికారులు; ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనముల పరిరక్షణలో భాగముగా ఏదైనా ప్రభుత్వ శాసనము ఉల్లంఘించకుండా చూచు అధికారులు కూడా ప్రభుత్వోద్యోగులే.

10. ఒక గ్రామము లేక పట్టణము లేక జిల్లాలోని ప్రజలందరి ప్రయోజనం దృష్ట్యా ఏదైనా ఆస్థిని తీసుకొనుటకు, అధీనములో ఉంచుకొనుటకు, అభివృద్ధి చేయుటకు లేక సర్వే చేయుటకు, లేక మదింపు చేయుటకు, లేక పన్ను విధించుటకు అధికారముగల అధికారులు; అలాగే, ఒక గ్రామము లేక పట్టణము లేక జిల్లాలోని ప్రజల యొక్క హక్కులను నిర్ధారించు నిమిత్తము ఏదైనా పత్రమును తయారుచేయుటకు, లేక ధృవీకరించుటకు, లేక సంరక్షించుటకు నియమించిన అధికారులు.

11. ఓటర్ల జాబితాను తయారుచేయుటకు, ప్రచురించుటకు, లేక నిర్వహించుటకు లేక సవరించుటకు లేక ఎన్నికలను నిర్వహించుటకు నియమించిన వారందరూ ప్రభుత్వోద్యోగులే.

12. అ) ప్రభుత్వ సేవలో ఉంటూ జీతము తీసుకునేవారు, అలాగే ప్రభుత్వమునకు సేవలందించినందుకు గాను కమీషన్ గాని, ఫీజును గాని తీసుకునే వారు కూడా ప్రభుత్వోద్యోగులే.

    ఆ) కేంద్ర ప్రభుత్వ లేక రాష్ట్ర ప్రభుత్వ లేక ఒక ప్రాంతీయ చట్టం ద్వారా ఏర్పాటు చేసిన స్థానిక సంస్థలకు, కార్పోరేషన్లకు సేవలందిస్తూ వేతనం తీసుకొనేవారందరూ ప్రభుత్వ ఉద్యోగులే. అలాగే, కంపెనీల చట్టంలోని సెక్షన్ 617 క్రింద నిర్వచించబడిన ప్రభుత్వరంగ కంపెనీలలోని ఉద్యోగులుకూడా ప్రభుత్వ ఉద్యోగులే.

ఉదాహరణ : మున్సిపల్ కమీషనర్ ప్రభుత్వ ఉద్యోగిగా పరిగణించబడతారు.

వివరణ 1 : ప్రభుత్వము చేత నియమించినవారా లేదా అనే దానితో నిమిత్తము లేకుండా పైన వివరించిన వారందరూ ప్రభుత్వోద్యోగులే.

వివరణ 2 : ప్రభుత్వోద్యోగి అనే పదము ఎక్కడ ఉపయోగించినా, ప్రభుత్వ విధులను నిర్వర్తించే సందర్భము, లేదా ప్రభుత్వోద్యోగిగా వ్యవహరించు సందర్భము అని అర్థము చేసుకొనవలెను. విధి నిర్వహణ నియామకములో ఏమైనా చట్టపరమైన లోపములున్నప్పటికీ, ప్రభుత్వోద్యోగిగానే పరిగణలోకి వస్తారు.

వివరణ 3 : 'ఎన్నిక' అంటే శాసన సభ, మున్సిపల్ లేక ఇతర సంస్థలకు ఎన్నికలుగా పరిగణలోకి వస్తాయి. ఎన్నికలు ఏ పద్ధతి ప్రకారము జరిగాయి అన్నదానితో ప్రమేయము లేదు. ఎన్నికల నియమావళికి సంబంధించిన శాసనములకు అనుగుణముగా జరిగే ఏ ఎన్నిక అయినా ఎన్నికగానే పరిగణలోకి వస్తుంది.

సెక్షన్ 498 ఎ : ఒక వివాహిత స్త్రీని ఆమె భర్తగాని, లేక భర్త తాలూకు బంధువులుగాని క్రూరముగా హింసించినట్లయితే మూడు సంవత్సరముల వరకు జైలుశిక్ష విధించడం జరుగుతుంది.

వివరణ : ఈ సెక్షనుకు సంబంధించి క్రూరత్వము అంటే ఈ క్రింది విధముగా అర్థం చేసుకొనవలసి వుంటుంది.

అ) భర్త లేక అతని బంధువుల చర్యల వలన ఆ స్త్రీ ఆత్మహత్యకు పాల్పడు స్థితి ఏర్పడితే ఆ చర్యలు క్రూరమైనవిగా పరిగణలోకి వస్తాయి. అలాగే వారి చర్యల వలన ఆ స్త్రీ యొక్క మానసిక, శారీరక ఆరోగ్యము చెడిపోవుటకు అవకాశము ఉన్నట్లయితే అటువంటి చర్యలు కూడ క్రూరమైన చర్యలుగానే పరిగణలోకి వస్తాయి.

ఆ) ఏదైనా సొమ్మును గాని, ఆస్థిని గాని, విలువగల వస్తువులను గాని తీసుకురావలసిందిగా అక్రమముగా డిమాండు చేస్తూ ఆ స్త్రీని గాని లేక ఆమెకు సంబంధించిన బంధువులను గాని వేధించడం కూడా క్రూరత్వముగానే పరిగణలోకి వస్తుంది. అంతేగాక తాము కోరిన విధముగా సొమ్ము లేక ఆస్థి లేక విలువగల వస్తువులను తీసుకురావటంలో విఫలమైనందుకు గాను ఆమెను హింసించటం కూడా క్రూరత్వమే అవుతుంది.

కుటుంబ హింస నుండి మహిళల రక్షణ చట్ట నియమావళి 2006

కుటుంబ హింసనుంచి మహిళల రక్షణ చట్టం 2005 లోని సెక్షన్ 37 (43 of 2005) ప్రసాదించిన అధికారాలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కింద పేర్కొన్న విధంగా నియమాలను రూపొందించింది.

1. అమలు తేది :

1) ఈ నియమావళిని కుటుంబ హింస నుండి మహిళల రక్షణ నియమావళి 2006 అని పేర్కొనవచ్చు.

2) ఈ నియమావళి 2006 డిసెంబర్ 26 నుంచి అమలులోకి వస్తాయి.

2. నిర్వచనాలు :

సందర్భం మరోవిధంగా పేర్కొంటే తప్ప ఈ నియమావళిలో

ఎ) 'చట్టం' (Act) అంటే మహిళల కుటుంబ హింస నుండి రక్షణ చట్టం, 2005 (43 of 2005) అని అర్థం.

బి) 'ఫిర్యాదు' (Complaint) అంటే రక్షణ అధికారికి ఎవరయినా మౌఖికంగా గానీ లిఖిత పూర్వకంగా గానీ చేసిన ఆరోపణ

సి) 'కౌన్సిలర్' అంటే సెక్షన్ 14 లోని సబ్‌సెక్షన్ (1) కింద కౌన్సిలింగ్ ఇవ్వడానికి తగిన సామర్థ్యం ఉన్న సర్వీస్ ప్రొవైడర్ సభ్యుడు

డి) 'ఫారం' అంటే ఈ నియమావళికి అనుసంధానం చేసిన ఫారం

ఇ) 'సెక్షన్' అంటే చట్టంలోని సెక్షన్

ఎఫ్) చట్టంలో నిర్వచించినప్పటికీ ఈ నియమావళిలో ఉపయోగించని, నిర్వచించని పదాలకూ భావాలకూ చట్టంలో వాటికి కేటాయించిన ఆయా అర్థాలే ఉంటాయి.

3. రక్షణ అధికారుల అర్హతలు, అనుభవం :

1) రాష్ట్ర ప్రభుత్వం నియమించే రక్షణ అధికారులు ప్రభుత్వ సంస్థలకు, లేదా ప్రభుత్వేతర సంస్థలకు చెందినవారు కావచ్చు.

అయితే, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వవలసి ఉంటుంది.

2) చట్టం కింద రక్షణ అధికారిగా నియమితులయ్యే ప్రతివ్యక్తికీ, సామాజిక రంగంలో కనీసం మూడు సంవత్సరాల అనుభవం ఉండాలి.

3) రక్షణ అధికారి పదవీకాలం కనీసం మూడు సంవత్సరాలు ఉండాలి.

4) చట్టం పరిధిలోనూ ఈ నియమావళి పరిధిలోనూ తన విధులను సమర్థంగా నిర్వహించడానికి రక్షణ అధికారికి అవసరమయ్యే కార్యాలయ సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించాలి.

4. రక్షణ అధికారులకు సమాచారం :

1) గృహహింస జరిగిందని లేదా జరుగుతూ ఉందని లేదా జరగవచ్చని నమ్మడానికి తగిన కారణం ఉన్న ఏవ్యక్తి అయినా, దాన్ని గురించిన సమాచారాన్ని మౌఖికంగా గానీ లిఖిత పూర్వకంగా గానీ ఆ ప్రాంతంలో అధికార పరిధిగల రక్షణ అధికారికి అందించవచ్చు.

2) సబ్-రూల్ (1) కింద మౌఖికంగా రక్షణ అధికారికి సమాచారం అందించిన సందర్భంలో అతను లేదా ఆమె, దాన్ని లిఖిత పూర్వకమైన రీతిలోకి మార్పించి, ఆ సమాచారం అందించిన వ్యక్తి చేత సంతకం చేయించాలి. సమాచారం ఇచ్చిన వ్యక్తి, లిఖితపూర్వక సమాచారాన్ని ఇచ్చే స్థలంలో లేని సందర్భంలో, రక్షణ అధికారి సంతృప్తి చెంది, ఆ సమాచారం ఇచ్చిన వ్యక్తి గుర్తింపును రికార్డు చేయాలి.

3) రక్షణ అధికారి తాను రికార్డు చేసిన సమాచారం ప్రతిని వెంటనే సమాచారం ఇచ్చిన వ్యక్తికి ఉచితంగా ఇవ్వాలి.

5. కుటుంబ హింస సంఘటనల నివేదికలు :

1) కుటుంబ హింసకు సంబంధించిన ఫిర్యాదు అందుకొన్న మీదట రక్షణ అధికారి, ఫారం-1 లో కుటుంబ సంఘటన నివేదికను రూపొందించి, దాన్ని మేజిస్ట్రేట్‌కు సమర్పించాలి. గృహహింస జరిగిందనే ఆరోపణ వచ్చిన స్థలానికి సంబంధించిన స్థానిక అధికార పరిధి పరిమితులలోని పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ పోలీస్ అధికారికీ ప్రాంతంలోని సర్వీస్ ప్రొవైడర్‌లకూ నివేదిక ప్రతులు పంపాలి.

2) ఎవరయినా బాధిత వ్యక్తి అభ్యర్థనమేరకు ఎవరయినా సర్వీసు ప్రొవైడర్, ఫారం–1 లో గృహ సంఘటనా నివేదికను రికార్డు చేసి, దాని ప్రతిని గృహహింస జరిగిందంటున్న ప్రాంతంలో అధికార పరిధిగల మేజిస్ట్రేట్ కూ, రక్షణ అధికారికీ పంపవచ్చు.

6. మేజిస్ట్రేట్‌కు దరఖాస్తులు :

1) సెక్షన్ 12 క్రింద బాధిత వ్యక్తికి చెందిన ప్రతి దరఖాస్తు ఫారం – II లో లేదా సాధ్యమైనంత వరకూ దానికి సమీపంగా ఉండాలి.

2) సబ్–రూల్ (1) క్రింద తన దరఖాస్తును రూపొందించడంలోనూ దాన్ని సంబంధిత మేజిస్ట్రేట్‌కు పంపడంలోనూ బాధిత వ్యక్తి, రక్షణ అధికారి సహాయం తీసుకోవచ్చు.

3) బాధిత వ్యక్తి, నిరక్షరాస్యురాలయినట్లయితే రక్షణ అధికారి, దరఖాస్తునూ అందులోని అంశాలనూ ఆమెకు చదివి వినిపించి, వివరించాలి.

4) సెక్షన్ 23 లోని సబ్–సెక్షన్ (2) కింద ఫైల్ చేయవలసిన అఫిడవిట్‌ను ఫారం–3 లో ఫైల్ చేయాలి.

5) సెక్షన్ 12 కింద దరఖాస్తులను నేరన్యాయ ప్రక్రియా స్మృతి (Code of Criminal Procedure) 1973 (2 ఆఫ్ 1974) లోని సెక్షన్ 125 కింద రూపొందించిన రీతిలోనే పరిశీలించాలి. ఆదేశాలను కూడా అదే రీతిలో అమలుచేయాలి.

7. బాధితురాలు మేజిస్ట్రేట్ ఆదేశాలు పొందడానికి అఫిడవిట్ :

సెక్షన్ 23 లోని సబ్–సెక్షన్ (2) కింద ఏకపక్షీయ ఆదేశం పొందడానికి ప్రతి అఫిడవిట్‌నూ ఫారం–III లో ఫైల్ చేయాలి.

8. రక్షణ అధికారుల విధులు కార్యకలాపాలు :

1) రక్షణ అధికారి విధులు కార్యకలాపాలు ఈకింది విధంగా ఉంటాయి.

   i) బాధిత వ్యక్తి కోరినట్లయితే, చట్టం పరిధిలో ఫిర్యాదు రూపొందించడంలో ఆ వ్యక్తికి సహాయం చేయడం

   ii) ఇంగ్లీష్‌లో గానీ దేశంలోని ఏదయినా స్థానిక భాషలోగానీ ఉండే ఫారం–IV లో ఇచ్చినట్లుగా చట్టం పరిధిలో బాధిత వ్యక్తులకు గల హక్కుల గురించి ఆమెకు సమాచారం సమకూర్చడం

   iii) సెక్షన్ 12 లేదా సెక్షన్ 23 లోని సబ్–సెక్షన్ (2) కింద లేదా చట్టంలోని మరేవైనా నిబంధనల కింద లేదా చట్టంపరిధిలో చేసిన నియమావళి కింద ఏదయినా దరఖాస్తును రూపొందించడంలో సహాయం చేయడం

   iv) పరిస్థితిలో ఇమిడిఉన్న, సెక్షన్ 12 కింద చేస్తున్న దరఖాస్తుకి సంబంధించిన ప్రమాదాలను మదింపు వేసిన తరువాత బాధిత వ్యక్తితో సంప్రదించి, బాధిత వ్యక్తిపై తదుపరి గృహహింసను నివారించడానికి తగిన చర్యలతో సహా ఫారం–V లో 'భద్రత ప్రణాళిక'ను రూపొందించడం

v) రాష్ట్ర న్యాయ సహాయ సేవల సంఘం ద్వారా బాధిత వ్యక్తికి న్యాయ సహాయం అందించడం

vi) వైద్య సదుపాయం పొందడానికి తగిన రవాణా సమకూర్చడంతో సహా వైద్య సదుపాయం దగ్గర వైద్య సహాయం పొందడంలో బాధిత వ్యక్తికీ ఎవరయినా బాలుడికి/బాలికకూ సహాయం చేయడం

vii) నివాసం (shelter) చేరుకోడానికి బాధిత వ్యక్తికీ ఎవరయినా బాలుడికీ/బాలికకూ రవాణా సదుపాయం పొందడంలో సహాయం చేయడం

viii) చట్టం పరిధిలో చర్యలు చేపట్టడంలో వారి సేవలు అవసరం కావచ్చునని చట్టం ప్రకారం రిజిస్టరయిన సర్వీస్ ప్రొవైడర్‌లకు తెలియజేయడం; చట్టం ప్రకారం, సెక్షన్ 14 లోని సబ్-సెక్షన్ (1) కింద కార్య వ్యవహారాలలో (ప్రొసీడింగ్‌లలో) కౌన్సిలర్‌లుగా లేదా సెక్షన్ 15 కింద సంక్షేమ నిపుణులుగా నియమించడానికి తమ సభ్యుల వివరాలను కోరుతూ సర్వీస్ ప్రొవైడర్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడం.

ix) కౌన్సిలర్‌ల నియామకం కోసం దరఖాస్తులను పరిశీలించడంతోపాటు అందుబాటులో ఉన్న కౌన్సిలర్‌ల జాబితాను మేజిస్ట్రేట్‌కు పంపడం

x) తాజా దరఖాస్తులను ఆహ్వానించడం ద్వారా, అందుబాటులో ఉన్న కౌన్సిలర్‌ల జాబితాను మూడు సంవత్సరాల కొకసారి సవరించడంతోపాటు సవరించిన కౌన్సిలర్‌ల జాబితాను సంబంధిత మేజిస్ట్రేట్‌కు పంపడం

xi) 9, 12, 20, 21, 22, 23 సెక్షన్‌ల కింద లేదా చట్టంలోని మరేవయినా నిబంధనల కింద లేదా ఈ నియమావళికింద పంపిన నివేదిక ప్రతుల, పత్రాల రికార్డును నిర్వహించడం

xii) గృహహింస సంఘటనను రిపోర్ట్ చేసిన ఫలితంగా బాధిత వ్యక్తి పీడనకు లేదా వత్తిడికి లోను కాకుండా చూడటానికి బాధిత వ్యక్తికీ, పిల్లలకూ సాధ్యమైన సహాయం సమకూర్చడం

xiii) చట్టం ప్రకారమే కాకుండా ఈ నియమావళి కింద కూడా ఏర్పాటు చేసిన రీతిలో బాధిత వ్యక్తి లేదా వ్యక్తులకూ పోలీసుకూ సర్వీస్ ప్రొవైడర్‌కూ మధ్య అనుసంధానంగా వ్యవహరించడం

xiv) తన అధికార పరిధి ప్రాంతంలోని సర్వీస్ ప్రొవైడర్‌లు, వైద్య సదుపాయం, శరణాలయాల రికార్డులను నిర్వహించడం

2) సెక్షన్ 9, సబ్-సెక్షన్ (1)లో (ఎ) నుంచి (హెచ్) వరకు గల క్లాజుల కింద రక్షణ అధికారికి అప్పగించిన విధులు, ప్రకార్యాలకు తోడుగా ప్రతి రక్షణ అధికారికీ వారి విధులను నిర్ణయించడమైనది.

ఎ) చట్టం నిబంధనలతో పాటు ఈ నియమావళి ప్రకారం కూడా గృహహింస నుంచి బాధిత వ్యక్తులకు రక్షణ కల్పించడం

బి) చట్టం నిబంధనలతో పాటు ఈ నియమావళి ప్రకారం కూడా బాధిత వ్యక్తి మీద తిరిగి గృహహింస జరగడాన్ని నివారించడానికి తగిన చర్యలన్నీ తీసుకోవడం

9. అత్యవసర పరిస్థితులలో తీసుకోవలసిన చర్య :

బాధిత వ్యక్తి నుంచి లేదా గృహహింస జరుగుతుందని లేదా జరగవచ్చునని నమ్మకానికి తగిన కారణం ఉన్న మరెవరయినా వ్యక్తి నుంచి ఇ-మెయిల్ ద్వారా గానీ టెలిఫోన్ కాల్ ద్వారా లేదా అలాంటి మరోపద్ధతి ద్వారా విశ్వసనీయమైన సమాచారాన్ని రక్షణ అధికారి లేదా సర్వీస్ ప్రొవైడర్ అందుకొన్నట్లయితే, అలాంటి అత్యవసర పరిస్థితిలో సందర్భాన్ని బట్టి ఆ రక్షణ అధికారి లేదా సర్వీస్ ప్రొవైడర్ వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి, సంఘటన నివేదిక రికార్డు చేసి, చట్టం ప్రకారం తగు ఆదేశాలు పొందడానికి ఎలాంటి జాప్యం లేకుండా మేజిస్ట్రేట్‌కు సమర్పించాలి.

10. రక్షణ అధికారుల ఇతర విధులు :

1) మేజిస్ట్రేట్ లిఖిత పూర్వకంగా ఆదేశించినట్లయితే రక్షణ అధికారి :

ఎ) చట్టం ప్రకారం, బాధిత వ్యక్తికి ఏకపక్షీయ తాత్కాలిక సహాయం అందించడానికీ గృహ సందర్శనకు ఆదేశం ఇవ్వడానికీ సంబంధించి న్యాయస్థానానికి వివరణ అవసరమైనట్లయితే ఉమ్మడి (shared) కుటుంబ ఆవరణకి సంబంధించి గృహ సందర్శన నిర్వహించి, ప్రాథమిక విచారణ జరుపుతారు.

బి) తగు విధంగా విచారణ జరిపిన మీదట, ఉపలబ్దులు (Emoluments) ఆస్తులు, బ్యాంకు ఖాతాలు లేదా న్యాయస్థానం ఆదేశించినట్లుగా మరేవయినా ఇతర పత్రాలకు సంబంధించి నివేదిక ఫైల్ చేయాలి.

సి) బాధిత వ్యక్తికీ ఉమ్మడి కుటుంబానికీ సంబంధించిన బహుమతులు, ఆభరణాలతో సహా వ్యక్తిగత ఆస్తులను తిరిగి బాధిత వ్యక్తి స్వాధీనం చేయాలి.

డి) న్యాయస్థానం ఆదేశించినట్లుగా, పిల్లలకు తిరిగి తన దగ్గరికి తెచ్చుకోవడానికీ అతని పర్యవేక్షణలో వారిని చూసుకొనే హక్కులను సాధించుకోడానికీ బాధిత వ్యక్తికి సహాయం చేయడం

ఇ) న్యాయస్థానం ఆదేశించిన రీతిలో సెక్షన్ 12, సెక్షన్ 18, సెక్షన్ 19, సెక్షన్ 20, సెక్షన్ 21 లేదా సెక్షన్ 23 పరిధిలో ఆదేశాలతో సహా మేజిస్ట్రేట్ ఆదేశించిన రీతిలో చట్టం పరిధిలోని కార్య వ్యవహారాలలో ఆదేశాలను అమలు చేయడంలో న్యాయ స్థానానికి సహాయం చేయాలి.

ఎఫ్) ఆరోపిత గృహహింసతో ప్రమేయం ఉన్న ఏదయినా ఆయుధాన్ని స్వాధీనం చేసుకోవడంలో అవసరమైతే, పోలీస్ సహాయం తీసుకోవాలి.

2) ఎప్పటికప్పుడు చట్టం నిబంధనలను ఈ నియమావళిని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం లేదా మేజిస్ట్రేట్ తనకి అప్పగించేటటువంటి ఇతర విధులను కూడా రక్షణ అధికారి నిర్వహించాలి.

3) ఏదయినా కేసులో ప్రభావాన్వితమైన సహాయం అందించే ఆదేశాలకు తోడుగా కేసులను మరింత సమర్థంగా నిర్వహించడానికి గాను సాధారణ ఆచరణకు సంబంధించి కూడా రక్షణ అధికారులకు మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేయవచ్చు. అలాంటి ఆదేశాలను పాటించడం రక్షణ అధికారులకు తప్పనిసరి విధి.

11. సర్వీస్ ప్రొవైడర్‌ల నమోదు :

1) న్యాయ సహాయం, వైద్యం, ఆర్థిక లేదా ఇతర సహాయం అందించడంతో సహా ఏదయినా చట్ట సమ్మతమైన విధానం ద్వారా మహిళల హక్కులను ప్రయోజనాలను పరిరక్షించే లక్ష్యంతోనూ చట్టం పరిధిలో సర్వీస్ ప్రొవైడర్‌గా సేవలందించాలనే కోరికతో సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం 1860 (21 ఆఫ్ 1860) కింద నమోదయిన ఏదయినా స్వచ్ఛంద సంస్థ లేదా కంపెనీల చట్టం 1956 (1 ఆఫ్ 1956) కింద లేదా తాత్కాలికంగా అమలులో ఉన్న ఏదయినా ఇతర శాసనం కింద నమోదయిన కంపెనీ, సర్వీస్ ప్రొవైడర్‌గా నమోదు కోసం సెక్షన్ 10 లోని సబ్–సెక్షన్ (1) కింద రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలి.

2) రాష్ట్రప్రభుత్వం, అవసరమని భావించిన విచారణ జరిపి దరఖాస్తుదారు అర్హత గురించి సంతృప్తి చెందిన మీదట, దాన్ని సర్వీస్ ప్రొవైడర్‌గా నమోదుచేసి, నమోదు ధ్రువపత్రాన్ని జారీచేస్తుంది.

అయితే, తన వాదనను వినిపించుకొనే అవకాశం దరఖాస్తుదారుకు ఇవ్వకుండా ఏ దరఖాస్తూనూ తోసిపుచ్చడం జరగదు.

3) సెక్షన్ 10 లోని సబ్–సెక్షన్ (1) పరిధిలో నమోదు కోరే ప్రతి సంస్థకు లేదా కంపెనీకి కింద పేర్కొన్న అర్హతా నిర్ణయ ప్రమాణాలుండాలి అవి:

ఎ) సర్వీస్ ప్రొవైడర్‌గా చట్టం పరిధిలోనూ ఈ నియమావళి కింద నమోదుకోసం దరఖాస్తు చేసుకొనే తేదీకి ముందు కనీసం మూడు సంవత్సరాలుగా చట్టం ప్రకారం అది అందిస్తున్నటువంటి సేవలను అందిస్తూ ఉండాలి.

బి) నమోదుకోసం దరఖాస్తు చేసుకొన్న దరఖాస్తుదారు, వైద్యసదుపాయ కేంద్రాన్ని లేదా సైకియాట్రిక్ కౌన్సిలింగ్ కేంద్రాన్ని లేదా వృత్తి శిక్షణ సంస్థను నడుపుతున్నట్లయితే వాటిని నడపటానికి ఆయా వృత్తుల లేదా సంస్థలను నియంత్రించే ఆయా రెగ్యులేటరీ సంస్థలు రూపొందించిన అవసరాలను దరఖాస్తుదారు సంతృప్తి పరిచేటట్లు రాష్ట్ర ప్రభుత్వం చూసుకోవాలి.

సి) నమోదుకోసం దరఖాస్తు చేసిన దరఖాస్తుదారు, శరణాలయం నడుపుతున్నట్లయితే రాష్ట్ర ప్రభుత్వం, ఒక అధికారి లేదా మరేదయినా సంస్థ లేదా అది నియమించిన ఏజెన్సీ ద్వారా శరణాలయాన్ని తనిఖీచేయించి, నివేదిక రూపొందించాలి. ఆ నివేదికలో కింది అంశాలకు సంబంధించిన వివరాలను రికార్డు చేయాలి.

i) ఆశ్రయం కోరుతున్న వ్యక్తులను చేర్చుకోడానికి ఆ శరణాలయం గరిష్ట సామర్థ్యం

ii) మహిళలకు శరణాలయం నడపడానికి ఆ స్థలం సురక్షితంగా ఉండటం, శరణాలయానికి తగినంత భద్రతా ఏర్పాట్లు చేసి ఉండటం.

iii) శరణాలయంలో ఉన్న వ్యక్తుల ఉపయోగం కోసం ఫంక్షనల్ టెలిఫోన్ కనెక్షన్ లేదా మరి ఏదయినా ఇతర కమ్యూనికేషన్ మాధ్యమం నిర్వహిస్తున్న రికార్డు శరణాలయానికి ఉండాలి.

3) రాష్ట్ర ప్రభుత్వం, వివిధ ప్రాంతాలలోని సర్వీస్ ప్రొవైడర్‌ల జాబితాను సంబంధిత రక్షణ అధికారులకు అందించడంతో పాటు ఆ జాబితాను వార్తా పత్రికలలో ప్రకటించాలి లేదా తన వెబ్‌సైట్‌లో ఉంచాలి.

4) సర్వీస్ ప్రొవైడర్‌ల వివరాలను తగువిధంగా ఇండెక్స్ చేసిన రిజిస్టర్‌లను నిర్వహించడం ద్వారా రక్షణ అధికారి, సరయిన రికార్డులను నిర్వహించాలి.

12. నోటీస్‌లను పంపే విధానం :

1) చట్టం ప్రకారం కార్యవ్యవహారాలకు సంబంధించిన హాజరు కోసం పంపే నోటీసులలో గృహహింసకు పాల్పడ్డారనే ఆరోపణలకు లోనయిన వ్యక్తుల పేర్లు గృహహింస స్వభావం, సంబంధిత వ్యక్తిని గుర్తించడానికి అనువయిన ఇతర వివరాలు ఉండాలి.

2) నోటీస్‌లను కిందివిధంగా పంపించవలసి ఉంటుంది అంటే :

ఎ) చట్టం ప్రకారం జరగవలసిన కార్యవ్యవహారాలకు సంబంధించిన నోటీస్‌లను ప్రతివాది సాధారణంగా నివాసం ఉంటున్నాడని ఫిర్యాదుదారు పేర్కొనే చిరునామాకు లేదా ప్రతివాది లాభదాయకమైన పదవిలో నియమితుడై ఉన్న చిరునామాకు సందర్భాన్ని బట్టి రక్షణ అధికారి లేదా రక్షణ అధికారి తరపున నోటీస్ మీద చేయటానికి అతను నిర్దేశించిన మరెవరయినా వ్యక్తి పంపవలసి ఉంటుంది.

బి) నోటీస్‌ను ఆ సమయంలో ఆ స్థలానికి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఏ వ్యక్తికయినా నోటీస్ అందజేయవలసి ఉంటుంది. ఆవిధంగా అందించడం సాధ్యం కానట్లయితే, దాన్ని ఆ ఆవరణలో బాగా కనిపించే స్థలంలో అంటించవలసి ఉంటుంది.

సి) చట్టంలోని సెక్షన్ 13 కింద లేదా మరేదయినా నిబంధన కింద నోటీస్‌లు పంపడానికి సివిల్ ప్రొసీజర్ కోడ్, 1908 (5 ఆఫ్ 1908) లోని ఆర్డర్-V కింద నిబంధనలను లేదా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 (2 ఆఫ్ 1974) లోని అధ్యాయం-VI కింద నిబంధనలను ఆచరణ సాధ్యమైనంతవరకు పాటించాలి.

డి) అలాంటి నోటీస్‌లు జారీ చేయడానికి పాస్ చేసిన ఆర్డర్‌కు సంబంధించిన పర్యవసానాలు, చట్టంలోని సెక్షన్ 13 లేదా మరేదయినా నిబంధన కింద అలాంటి నోటీస్ పంపడానికి ఆర్డర్ రూపొందించడానికి ఫలప్రదమని భావించిన కార్యవ్యవహారం మీద ఆధారపడి, వరసగా సివిల్ ప్రొసీజర్ కోడ్, 1908 లోని ఆర్డర్-5 కింద లేదా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లోని అధ్యాయం-6 కింద పాస్ చేసిన ఆర్డర్‌కుండే వాటిలాగే ఉంటాయి. అంతే కాకుండా, ఆర్డర్-5, లేదా అధ్యాయం-VI కింద నిర్ణయించిన కార్యవ్యవహారానికి తోడుగా, చట్టంలో సమకూర్చిన, కాలవ్యవధికి కట్టుబడిన కార్యవ్యవహారాలను త్వరితంచేసే దృష్టితో అవసరమయ్యే ఇతర చర్యలకు కూడా న్యాయస్థానం ఆదేశించవచ్చు.

3) ప్రతివాది హాజరుకు నిర్ణయించిన తేదీకి స్టేట్‌మెంట్ మీద లేదా చట్టం ప్రకారం నోటీస్‌లు ఇవ్వడానికి అధికారం గల వ్యక్తి నివేదికకు సంబంధించి, ఫిర్యాదుదారు లేదా ప్రతివాది వాదనను విన్నమీదట,

ఏదయినా తాత్కాలిక సహాయం కోసం అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తుకు సంబంధించి న్యాయస్థానం సముచితమైన ఆదేశాలు పాస్ చేయవచ్చు.

4) ఉమ్మడి (shared) గృహంలోకి ప్రతివాది ప్రవేశించడాన్ని నిషేధిస్తూ రక్షణ ఉత్తరువు పాస్ అయినప్పుడు లేదా దూరంగా ఉండమని ప్రతివాదిని ఆదేశించినప్పుడు లేదా ఫిర్యాదుదారును కలుసుకోవద్దని ఆదేశించినప్పుడు బాధిత ఆహ్వానంతోసహా బాధిత వ్యక్తికి సంబంధించిన ఏ చర్యనూ సెక్షన్ 25 లోని సబ్-సెక్షన్ (2) నిబంధనల ప్రకారం, రక్షణ ఆదేశాన్ని తగు విధంగా సవరిస్తే తప్ప, న్యాయస్థానం ఆదేశం ద్వారా ప్రతివాది మీద విధించిన ఆంక్షను రద్దయినట్లు పరిగణించకూడదు.

13. కౌన్సిలర్‌ల నియామకం :

1) రక్షణ అధికారికి పంపిన, అందుబాటులో ఉన్న కౌన్సిలర్‌ల జాబితా నుంచి ఒక వ్యక్తిని, బాధిత వ్యక్తికి తెలుపుతూ, కౌన్సిలర్‌గా నియమించవలసి ఉంటుంది.

2) ఏ కార్యవ్యవహారాలలో కౌన్సిలర్‌లుగా నియమితులవడానికి కింది వ్యక్తులు అర్హులు కారు. ఆ వ్యక్తులు :

   ఎ) వివాదాంశంతో సంబంధం ఉన్న లేదా పార్టీలలో ఏ పార్టీదయినా సంబంధం ఉన్న వ్యక్తి లేదా అన్ని పక్షాలూ లిఖిత పూర్వకంగా నిరభ్యంతరాన్ని తెలిపితే తప్ప పార్టీలకు ప్రాతినిధ్యం వహించే వ్యక్తులు.

   బి) కేసులో లేదా దానికి సంబంధం ఉన్న ఏదయినా ఇతర దావా లేదా కార్యవ్యవహారాలలో ప్రతివాది పక్షాన వాదించిన న్యాయవాది (లీగల్ ప్రాక్టీషనర్).

3) సాధ్యమైనంత వరకూ మహిళలే కౌన్సిలర్‌లుగా ఉండాలి.

14. కౌన్సిలర్‌లు అనుసరించవలసిన పద్ధతులు :

1) న్యాయస్థానం లేదా రక్షణ అధికారి లేదా ఇరువురి సాధారణ పర్యవేక్షణలో కౌన్సిలర్ పనిచేయాలి.

2) బాధిత వ్యక్తికి లేదా ఇరుపక్షాలకూ అనువయిన స్థలంలో కౌన్సిలర్ సమావేశం ఏర్పాటు చేయాలి.

3) కౌన్సిలింగ్ అవసరమయ్యే అంశాలలో, ఫిర్యాదుదారు ఫిర్యాదు చేసినటువంటి గృహహింసకు పాల్పడనని ప్రతివాది హామీ ఇవ్వడమనే అంశం కూడా చేరి ఉంటుంది. కొన్ని సందర్భాలలో కౌన్సిలర్ సమక్షంలో కౌన్సిలింగ్ వ్యవహారాలలో తప్ప లేదా చట్టం లేదా అధికార పరిధిగల న్యాయస్థానం తీర్పు అనుమతించిన విధంగా తప్ప తాను కలుసుకోడానికి ప్రయత్నించనని లేఖ లేదా టెలిఫోన్, ఎలక్ట్రానిక్ మెయిల్ లేదా మరేదయిన మాధ్యమం ద్వారా మరేరీతిలోను కమ్యూనికేట్ చేయడానికి ప్రయత్నించనని హామీ ఇవ్వడంకూడా ఉంటుంది.

4) గృహహింస సంఘటన మళ్లీ జరగకుండా హామీ పొందే స్వభావంతో కౌన్సిలింగ్ ఉండాలనే విషయాన్ని మనస్సులో ఉంచుకొని కౌన్సిలర్, కౌన్సిలింగ్ వ్యవహారాలను నిర్వహించాలి.

5) కౌన్సిలింగ్‌లో ఆరోపిత గృహహింస సంఘటనను సమర్థించుకోడానికి ప్రతివాదిని అనుమతించకూడదు. కార్యవ్యవహారాలు, ప్రారంభం కావడానికి ముందు ప్రతివాదికి వాస్తవం తెలపాలి. గృహహింస చర్యను సమర్థించుకొంటూ ప్రతివాది చేసే వాదనను కౌన్సిలింగ్‌లో భాగంగా అనుమతించడం జరగదు.

6) బాధిత వ్యక్తి ఫిర్యాదు చేసినటువంటి గృహహింసకు తాను కారణం కాజాలనని ప్రతివాది, కౌన్సిలర్‌కు హామీ ఇవ్వవలసి ఉంటుంది. కొన్ని సందర్భాలలో, కౌన్సిలర్ సమక్షంలో కౌన్సిలింగ్ వ్యవహారాలలో తప్ప, ఫిర్యాదు దారును కలుసుకోడానికి ప్రయత్నించననీ లేఖ లేదా టెలిఫోన్, ఇ-మెయిల్, లేదా మరేదయిన మాధ్యమం ద్వారా కమ్యూనికేషన్ అందించడానికి ప్రయత్నించనని ప్రతివాది హామీ ఇవ్వవలసి ఉంటుంది.

7) బాధిత వ్యక్తి కోరుకున్నట్లయితే, సమస్య పరిష్కారానికి కౌన్సిలింగ్ ప్రయత్నాలు చేస్తారు.

8) కౌన్సిలర్ కృషి పరిధి పరిమితంగా ఉంటుంది. బాధిత వ్యక్తికి సంబంధించిన ఇబ్బందులను కౌన్సిలర్ అర్థం చేసుకోవాలి. ఆమె సమస్యల పరిష్కారానికి గల ఉత్తమ మార్గాన్ని కనుక్కోవాలి. అలాంటి పరిష్కారానికి గల మార్గాలను లేదా చర్యలను రూపొందించడం మీద ప్రాధాన్యం ఇవ్వాలి.

9) కౌన్సిలింగ్ నిమిత్తం పార్టీలు సూచించిన చర్యలను లేదా పరిష్కార మార్గాలను పరిగణలోకి తీసుకోవడంతోపాటు అవసరమైనప్పుడు పరిష్కారానికి సంబంధించిన షరతులను సవరించడం ద్వారా బాధిత వ్యక్తి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు సూచించడం ద్వారా వివాదానికి ఒక పరిష్కారాన్ని కనుక్కోడానికి కౌన్సిలర్ ప్రయత్నించాలి.

10) కౌన్సిలర్, భారతీయ సాక్ష్యాధారాల చట్టం, 1872 లేదా సివిల్ ప్రొసీజర్ కోడ్, 1908 లేదా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973లోని నిబంధనలకు కట్టుబడనవసరం లేదు. అతని చర్యకు నిజాయితీ, న్యాయ సూత్రాలు మార్గదర్శకంగా ఉంటాయి. బాధిత వ్యక్తి సంతృప్తి మేరకు గృహహింసకు స్వస్తిపలకడానికి తగిన మార్గం కనుక్కోవడం అతని లక్ష్యం. అలాంటి ప్రయత్నం చేయడంలో కౌన్సిలర్, బాధిత వ్యక్తి ఆకాంక్షలకూ వివేచనలకూ తగిన గౌరవం ఇవ్వాలి.

11) కౌన్సిలర్ సాధ్యమైనంత త్వరగా తన నివేదికను తగు చర్యకోసం మేజిస్ట్రేటుకు సమర్పించాలి.

12) కౌన్సిలర్, వివాహం విషయంలో ఒక పరిష్కారానికి వచ్చినట్లయితే పరిష్కారానికి సంబంధించిన షరతులను రికార్డు చేసి, వాటిని పార్టీల చేత ఆమోదింపజేయాలి.

13) పరిష్కారానికి గల సార్థకత గురించి సంతృప్తి చెందిన తరువాత, పార్టీలనుంచి ప్రాథమిక దర్యాప్తు చేసిన తరువాత, చేశామని ప్రతివాదులు అంగీకరించిన గృహహింస చర్యలకు తిరిగి పాల్పడమని ప్రతివాదులు హామీ ఇవ్వడంతో సహా అలాంటి సంతృప్తి గల కారణాలను రికార్డు చేసిన మీదట న్యాయస్థానం ఆ షరతులను, కొన్ని నిబంధనలతో గానీ నిబంధనలు లేకుండా గానీ అంగీకరించవచ్చు.

14) కౌన్సిలింగ్ నివేదిక విషయంలో సంతృప్తి చెందిన న్యాయస్థానం, పరిష్కారం షరతులను రికార్డు చేస్తూ పార్టీల సమ్మతితో ఒక ఆదేశం ఇవ్వవచ్చు. లేదా బాధిత వ్యక్తి అభ్యర్థన మేరకు పరిష్కారం షరతులను సవరిస్తూ ఆదేశం జారీ చేయవచ్చు.

15) కౌన్సిలింగ్ కార్యవ్యవహారాలలో పరిష్కారం కనుక్కోలేని సందర్భంలో, అలాంటి కార్య వ్యవహారాల వైఫల్యాన్ని కౌన్సిలర్, న్యాయస్థానానికి నివేదించవచ్చు. చట్టంలోని నిబంధనల ననుసరించి న్యాయస్థానం ఆ కేసును పరిశీలిస్తుంది.

16) కార్యవ్యవహారాల రికార్డును ఏదయినా అనుమాన ప్రమాణం ఏర్పరుచుకోడానికి ప్రాతిపదిక అయిన లేదా ఏదయినా ఆదేశం జారీచేయడానికి పూర్తిగా ఆధారమయిన కేసులోని రికార్డుకు సంబంధించిన మెటీరియల్‌గా భావించకూడదు.

17) బల ప్రయోగం, మోసం లేదా బలాత్కారం లేదా మరేదయినా అంశంతో ఇలాంటి తీర్పు (ఆదేశం) కోసం దరఖాస్తు పెట్టలేదని సంతృప్తి చెందిన మీదట మాత్రమే న్యాయస్థానం ఆదేశం జారీచేస్తుంది. అలాంటి సంతృప్తికి చెందిన కారణాలను ఆదేశంలో లిఖిత పూర్వకంగా రికార్డు చేయాలి. ఈ కారణాలతో ప్రతివాది ఇచ్చిన హామీ లేదా పూచీ కూడా ఉండవచ్చు.

15. రక్షణ ఆదేశాల ఉల్లంఘన :

1) బాధిత వ్యక్తి, రక్షణ ఆదేశం లేదా తాత్కాలిక రక్షణ ఆదేశ భంగం గురించి రక్షణ అధికారికి నివేదించవచ్చు.

2) సబ్-రూల్ (1) లో ప్రస్తావించిన ప్రతి నివేదిక లిఖితపూర్వకంగా ఉండాలి. దానిపై సమాచారం ఇస్తున్న వ్యక్తి సంతకం ఉండాలి.

3) రక్షణ అధికారి, అలాంటి ఫిర్యాదు ప్రతిని ఉల్లంఘనకు లోనయిన రక్షణ ఆదేశం ప్రతితోపాటు, సముచిత ఉత్తర్వులకోసం సంబంధిత మేజిస్ట్రేట్‌కు పంపాలి.

4) బాధిత వ్యక్తి కోరుకొన్నట్లయితే, రక్షణ ఆదేశం లేదా తాత్కాలిక రక్షణ ఆదేశ భంగం గురించి నేరుగా మేజిస్ట్రేట్‌కి లేదా పోలీస్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

5) రక్షణ ఆదేశానికి భంగం వాటిల్లిన తరువాత ఏ సమయంలో అయినా బాధిత వ్యక్తి సహాయం కోరినట్లయితే రక్షణ అధికారి వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సహాయం తీసుకోవడం ద్వారా ఆమెకు రక్షణ కల్పించాలి. స్థానిక పోలీస్ అధికారులకు రిపోర్టు ఇవ్వడానికి బాధిత వ్యక్తికి సహాయం అందించాలి.

6) భారతీయ శిక్షాస్మృతి, 1860 (45 ఆఫ్ 1860) సెక్షన్ 31, సెక్షన్ 498 ఎ కింద కొన్ని నేరాలకు సంబంధించి లేదా సంక్షిప్తంగా విచారించడానికి తగిన ఏదయినా ఇతర నేరానికి సంబంధించి ఆరోపణలు చేసినప్పుడు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 (2 ఆఫ్ 1974) కింద నిర్ణయించిన రీతిలో విచారించవలసిన నేరాలను న్యాయస్థానం వేరు చేయవచ్చు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ అధ్యాయం - XXI లోని నిబంధనల ప్రకారం సెక్షన్ 31 కింద రక్షణ ఆదేశ భంగానికి సంబంధించిన నేరాన్ని సంక్షిప్తంగా విచారించడానికి పూనుకొంటుంది.

7) ప్రతివాది లేదా అతని తరపున వ్యవహరిస్తున్న ఎవరయినా వ్యక్తి చట్టం పరిధిలో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల అమలుకు ప్రతిఘటించినట్లయితే, అలాంటి ఉల్లంఘనను చట్టం పరిధిలోనికి వచ్చే రక్షణ ఆదేశానికి లేదా తాత్కాలిక రక్షణ ఆదేశానికి భంగంగా భావించవలసి ఉంటుంది.

8) రక్షణ ఆదేశ భంగాన్ని లేదా తాత్కాలిక రక్షణ ఆదేశ భంగాన్ని వెంటనే ప్రాదేశిక అధికార పరిధిగల స్థానిక పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేయాలి. సెక్షన్ 31, 32 కింద శిక్షార్హమైన నేరంగా పరిగణించవలసి ఉంటుంది.

9) చట్టం ప్రకారం అరెస్టు చేసిన వ్యక్తిని బెయిల్ మీద విడుదల చేసేటప్పుడు న్యాయస్థానం, బాధిత వ్యక్తికి రక్షణ కల్పించడానికీ నిందితుడు న్యాయస్థానం ముందు హాజరయ్యేట్లు చూడటానికీ ఆదేశం ద్వారా కింది షరతులు విధించవచ్చు. ఆ షరతులలో కింది ఆదేశాలుంటాయి.

ఎ) 'గృహహింస'కు పాల్పడతానని, బెదిరించడం, లేదా పాల్పడటం నుంచి నిందితుడిని నివారించే ఆదేశం

బి) బాధిత వ్యక్తిని వేధించడం, ఆ వ్యక్తికి టెలిఫోన్ చేయడం, లేదా మరేదయినా సంబంధం పెట్టుకోవడం నుంచి నిందితుడిని నివారించే ఆదేశం

సి) బాధిత వ్యక్తి నివాసం నుంచి లేదా ఆమె సందర్శించడానికి అవకాశం ఉన్న ప్రాంతం నుంచి నిందితుడిని ఖాళీ చేయించడానికి లేదా దూరంగా ఉంచడానికి ఆదేశించే ఆదేశం

డి) తుపాకిని లేదా ఏదయినా ఇతర ప్రమాదకరమైన ఆయుధాన్ని స్వాధీనంలో ఉంచుకోడాన్ని లేదా ఉపయోగించడాన్ని నిషేదించే ఆదేశం

ఇ) ఆల్కహాల్‌ను లేదా ఇతర మత్తుపదార్థాలను వినియోగించడాన్ని నిషేదించే ఆదేశం

ఎఫ్) బాధిత వ్యక్తి రక్షణకు, భద్రతకు, తగినంత సహాయానికి అవసరమయ్యే మరేదయినా ఆదేశం

16. బాధితురాలికి ఆశ్రయం :

1) బాధితవ్యక్తి అభ్యర్థన చేసుకొన్నమీదట రక్షణ అధికారి లేదా సర్వీస్ ప్రొవైడర్, సెక్షన్ 6 కింద దరఖాస్తు చేయడం జరుగుతూ ఉందని స్పష్టంగా పేర్కొంటూ లిఖితపూర్వకంగా శరణాలయం ఇన్‌ఛార్జిని సెక్షన్ 6 కింద అభ్యర్థించవచ్చు.

2) రక్షణ అధికారి, సబ్-రూల్ (1) లో పేర్కొన్నట్లుగా అభ్యర్థించినప్పుడు, సెక్షన్ 9 లేదా సెక్షన్ 10 కింద రిజిస్టరయిన గృహ సంఘటన నివేదిక ప్రతిని ఆ అభ్యర్థనకు జోడించాలి.

అయితే శరణాలయంలో ఆశ్రయంకోసం అభ్యర్థించడానికి ముందు ఆమె, గృహ సంఘటన నివేదిక సమర్పించని కారణంగా చట్టం పరిధిలో, శరణాలయం, బాధిత వ్యక్తికి ఆశ్రయాన్ని తిరస్కరించకూడదు.

3) తన ఉనికి వెల్లడించవద్దని బాధిత వ్యక్తి కోరినట్లయితే, శరణాలయాలలో బాధితవ్యక్తి ఉనికిని శరణాలయం వెల్లడించకూడదు లేదా ఆ విషయం గురించి నిందితుడికి కమ్యూనికేట్ చేయకూడదు.

17. బాధితురాలికి వైద్య సదుపాయం :

1) బాధితవ్యక్తి లేదా రక్షణ అధికారి లేదా సర్వీస్ ప్రొవైడర్, సెక్షన్ 7 కింద దరఖాస్తు చేసుకోవడం జరుగుతూ ఉందని స్పష్టంగా పేర్కొంటూ లిఖితపూర్వకంగా సెక్షన్ 7 కింద వైద్య సదుపాయం ఇన్‌ఛార్జిని అభ్యర్థించవచ్చు.

2) రక్షణ అధికారి, అలాంటి అభ్యర్థన చేసినప్పుడు, ఆ అభ్యర్థనకు గృహసంఘటన నివేదిక ప్రతిని జోడించాలి.

అయితే, వైద్యసహాయం లేదా పరీక్షకోసం, వైద్య సదుపాయానికి, అభ్యర్థన చేసుకొనే ముందు ఆమె గృహ సంఘటన నివేదిక సమర్పించలేదనే కారణంగా చట్టం పరిధిలో బాధిత వ్యక్తికి వైద్య సహాయానికి తిరస్కరించకూడదు.

3) గృహ సంఘటన నివేదికను రూపొందించకపోయినట్లయితే, వైద్య సదుపాయానికి ఇన్‌ఛార్జిగా ఉన్న వ్యక్తి, ఫారం - 1 నింపి, దాన్ని స్థానిక రక్షణ అధికారికి పంపాలి.

4) వైద్య సదుపాయం, బాధితవ్యక్తికి ఉచితంగా వైద్యపరీక్ష నివేదిక ప్రతిని సమకూర్చాలి.

*****

2. షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగలపై అత్యాచారాల నిరోధక చట్టం 1989

షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన ప్రజలపై అత్యాచారాల నిరోధానికి, అత్యాచారాలు జరిగినప్పుడు అటువంటి నేరాలను విచారించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసేందుకు అత్యాచారాలకు గురైన బాధితులకు, సహాయ, పునరావాసాలు ఏర్పాటు చేసేందుకు ఈ చట్టం ఉద్దేశించ బడినది.

అధ్యాయము 1

ప్రారంభిక

1. 1) ఈ చట్టమును షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగలపై అత్యాచారాల నిరోధక చట్టము, 1989 అని పిలవవచ్చు.

2) ఇది జమ్మూ–కాశ్మీరు మినహా యావద్భారత దేశమునకు వర్తిస్తుంది.

3) ఇది కేంద్ర ప్రభుత్వము రాజపత్రములో ప్రకటించిన తేదీనుండి అమలులోకి వస్తుంది.

2. 1) ఈ చట్టములో సందర్భమునుబట్టి వేరే అర్థము వస్తే తప్ప

ఎ) "అత్యాచారము" అనగా 3 వ సెక్షను క్రింద శిక్షింపదగిన నేరము అని అర్థము.

బి) "స్మృతి" అనగా నేర విచారణాస్మృతి, 1973 అని అర్థము.

సి) "షెడ్యూల్డు కులములు మరియు షెడ్యూల్డు జాతులు" అనగా భారత రాజ్యాంగం ఆర్టికల్ 366 లో క్లాజ్ (24) మరియు (25) లలో చెప్పబడిన అర్థము కలిగి ఉంటుంది.

డి) "ప్రత్యేక న్యాయస్థానము" అనగా సెక్షన్ 14 లో చెప్పబడిన న్యాయస్థానము అని అర్థము.

ఇ) "ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటరు" అనగా సెక్షన్ 15 లో చెప్పబడిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటరు అని అర్థము.

ఎఫ్) ఈ చట్టములో ప్రయోగించియుండి ఇందులో నిర్వచింపక, స్మృతిలో గాని భారత శిక్షాస్మృతిలోగాని నిర్వచించిన పదములు సందర్భానుసారముగా భారత శిక్షాస్మృతిలో ఉన్న అర్థమునే కలిగియుండును.

2) ఈ చట్టంలో వేరే చట్టాల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు ఏదైనా ప్రాంతంలో ఆచట్టం అమలులో లేకుంటే దానికి అనుగుణంగా అక్కడ అమలులో వుండే చట్టం గురించి ప్రస్తావించినట్టు భావించాలి.

3. అత్యాచారాల నేరాలకు శిక్ష :

1. షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందని వ్యక్తి ఎవరైనా.

i) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తిని తినరాని, అసహ్యకరమైన పదార్థము లేదా పానీయము బలవంతముగా సేవించేట్లు చేసినా

ii) గాయపరిచే లేక అవమాన పరిచే లేక బాధించే విధంగా షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తి నివశించే ప్రదేశంలో కానీ పరిసర ప్రాంతములో కానీ, చెత్త, మృతకళేబరాలు, ఇతర అశుద్ధ పదార్థములను పడవేసినా.

iii) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తి బట్టలను బలవంతముగా ఊడదీసి ఆ వ్యక్తిని నగ్నంగా ఊరేగించినా లేక వారి ముఖాలకు, శరీరానికి రంగు వేసినా లేదా మానవ గౌరవానికి భంగం కలిగించే మరేపని చేసినా.

iv) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తికి అధికారులు కేటాయించిన లేదా ఆ వ్యక్తికి చెందిన భూమిని ఆక్రమించినా, సాగుచేసినా, ఆ భూమిని వేరే వారికి బదిలీ చేయాలని బలవంతం చేసినా.

v) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తి భూమి లేదా ఆవరణలో నుండి అక్రమంగా గెంటివేసినా లేదా ఆ భూమిపై, ప్రాంతంపై, నీటిపై, వారు అనుభవించే హక్కులకు ఆటంకం కలిగించినా,

vi) ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల నిమిత్తం ఆదేశించిన నిర్భంధ సేవ కాకుండా మరే విధంగానైనా షెడ్యూల్డు కులాలు మరియు తెగలకు చెందిన వ్యక్తిని బలవంతంగా బేగార్ లేక వెట్టి చాకిరీ చేయించడం లేదా నిర్భందపు పనులేమైనా చేయించినా లేదా ప్రలోభ పెట్టినా,

vii) చట్టం నిర్దేశించిన పద్ధతిలో కాకుండా షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తిని తాము నిర్దేశించిన పద్ధతిలో ఏదేని అభ్యర్థికి ఓటు వేయాలని లేదా వేయకూడదని మరే విధంగానైనా బలవంతం చేసినా,

viii) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తిపై అబద్ధమైన, దెబ్బతీసే విధంగా, లేదా బాధించే విధంగా దావా వేసినా లేదా క్రిమినల్ లేక ఇతర చట్టపరమైన చర్యలు చేపట్టినా,

ix) ప్రభుత్వ అధికారులకు తప్పుడు లేదా ప్రాముఖ్యం కాని సమాచార మిచ్చినా తద్వారా ఆ అధికారి షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తిపై తన అధికారాన్ని ఉపయోగించి గాయపరచడం లేదా బాధించే విధంగా చేసినా,

x) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వారిని బహిరంగంగా అవమాన పరచి వేధించినా,

xi) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన స్త్రీ పై దాడిచేసి లేదా ఆమెపై బలాన్నుపయోగించి స్త్రీ గౌరవాన్ని భగ్నం చేసినా,

xii) తన అధిపత్య స్థానాన్ని ఉపయోగించి షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన స్త్రీ ఇష్టానికి వ్యతిరేకంగా ఆమెను శారీరకంగా అనుభవించాలని చూసినా,

xiii) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలు ఉపయోగించే నీటిని, వాగులు, బావులు, ఇతర నీటి వనరులను వారికి పనికిరాని విధంగా పాడు చేసినా,

xiv) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలు సాంప్రదాయక హక్కుగా ఉపయోగించే బహిరంగ ప్రాంతం గుండా వారిని వెళ్ళవద్దని అడ్డు పెట్టినా లేదా ఇతర ప్రజలు ఉ పయోగించే దారి నుండి వారిని వెళ్ళ కూడదని ఆపినా,

xv) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల వారిని వారి ఇల్లు, నివాస ప్రాంతం లేదా ఇతర ప్రదేశం నుంచి బలవంతంగా వెళ్ళ గొట్టినా లేదా అందుకు కారణమైనా,

ఆరు నెలలకు తక్కువ కాకుండా ఐదు సంవత్సరముల వరకు శిక్ష మరియు జరిమానా విధించబడుతుంది.

2. షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందని వ్యక్తి :

i) ఉద్దేశ్య పూర్వకంగా అబద్ద సాక్ష్యం చెప్పటం లేదా సృష్టించడం ద్వారా షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా పడేటట్లు చేసినా, మరియు అటువంటి అబద్దపు, సృష్టించ బడిన తప్పుడు సాక్ష్యం వలన షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన అమాయక వ్యక్తికి మరణ శిక్ష విధించబడినా అటువంటి వ్యక్తికి మరణ శిక్ష విధించవచ్చు.

ii) ఉద్దేశ్య పూర్వకంగా అబద్ద సాక్ష్యం చెప్పటం లేదా సృష్టించడం ద్వారా షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వ్యక్తికి మరణ శిక్ష కాకుండా ఏడేళ్లు లేదా అంతకు ఎక్కువ శిక్ష విధించేటట్లు చేసినా, అటువంటి వ్యక్తికి 6 నెలలకు తక్కువ కాకుండా ఏడేళ్ళ వరకు శిక్ష విధించవచ్చు లేదా ఆ శిక్షను ఏడేళ్ళకు పైగా పెంచవచ్చు. జరిమానా విధించ వచ్చు.

iii) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వారి ఆస్తిని నష్టపరచు ఉద్దేశ్యంతో తగులబెట్టినా లేదా ఏదైనా ప్రేలుడు పదార్థముతో నష్ట పరచినా, వారికి ఆరు నెలలకు తక్కువ కాకుండా ఏడు సంవత్సరముల వరకు శిక్ష మరియు జరిమానా విధించవచ్చు.

iv) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వారి ప్రార్థనాలయములకు సంబంధించిన భవనములు గాని లేక వారు తిరుగాడే భవనములు గాని లేక వారి ఆస్తులుంచు భవనములు గాని నష్టపరచ వలెనను ఉద్దేశ్యంతో తగుల బెట్టిన లేదా ఏదైనా పేలుడు పదార్థములతో నష్ట పరచిన వారికి యావజ్జీవ కారాగార శిక్ష మరియు జరిమానా విధించవచ్చు.

v) ఇండియన్ పీనల్ కోడ్ (45 ఆఫ్ 1860) లో 10 సంవత్సరములు లేదా అంతకు ఎక్కువ శిక్ష పడే నేరాలు షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన వారిపై కాని వారి ఆస్థుల ఎడల గాని చేసిన వారికి యావజ్జీవ కారాగార శిక్ష మరియు జరిమానా విధించవచ్చు.

vi) ఈ అధ్యాయములో పేర్కొన్న నేరాలు ఏవైనా చేసినపుడు, నిందితుణ్ణి కాపాడు ఉద్దేశ్యంతో విచారణ కమీషన్ ముందు హాజరు కాకపోయినా లేదా నేరానికి సంబంధించి తప్పు సమాచార మిచ్చినా నేరానికి విధించే శిక్షను ఆ వ్యక్తికి కూడా విధించవచ్చు.

vii) ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా ఈ సెక్షనులో ఉన్న నేరాలను చేసినట్లయితే సంవత్సరానికి తక్కువ కాకుండా ఆ నేరానికి శిక్షా కాలం ఎంత ఉందో అంత వరకు శిక్ష పొడగించవచ్చు.

4. విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి శిక్ష :

షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా ఈ చట్టం ప్రకారం నెరవేర్చ వలసిన బాధ్యతలను ఉద్దేశ్య పూర్వకంగా నిర్లక్ష్యం చేస్తే ఆరు నెలలు తగ్గకుండా సంవత్సరం వరకు శిక్ష విధించవచ్చు.

5. రెండవ సారి నేరానికి శిక్షాకాలం పెంచింపు :

ఈ అధ్యాయంలో పేర్కొన్న నేరాలకు శిక్ష విధించబడిన వ్యక్తి మరలా రెండో సారి లేదా రెండవ నేరాన్ని చేసిన ఎడల ఒక సంవత్సరం తక్కువ కాకుండా ఆ నేరానికి పొందుపరచిన శిక్ష విధించవచ్చు.

6. ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షనులు వర్తింపు :

ఈ చట్టంలోని ఇతర అంశాలతో పాటు, ఇండియన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 34, అధ్యాయం (3), అధ్యాయం (4), అధ్యాయం (5), అధ్యాయం (5) ఎ, సెక్షన్ 149, అధ్యాయం (23) లను ఈ చట్టానికి అవసరమైనపుడు ఉపయోగించవచ్చు.

7. వ్యక్తుల ఆస్థులను జప్తు చేయుట :

1. ఈ అధ్యాయంలో పేర్కొన్న ప్రకారం నేరం చేసి శిక్ష విధించబడిన వ్యక్తి స్థిర చరాస్తులేవైనా నేరానికి ఉపయోగించ బడినట్లయితే అలాంటి ఆస్తులు ప్రభుత్వ పరమైనట్లుగా ప్రత్యేక కోర్టు లిఖిత పూర్వకంగా ప్రకటించవచ్చు.
2. ఈ అధ్యాయంలో పేర్కొన్న నేరాల క్రింద నిందితుడైన వ్యక్తి స్థిర చరాస్తులను స్వాధీనం చేసుకొని, విచారణ ముగిసిన తరువాత నేరం రుజువైన పక్షంలో ఆ ఆస్తులను జరిమానా విధించబడిన మేరకు జప్తు చేసే అధికారం ప్రత్యేక కోర్టుకు ఉన్నది.

8. ఈ అధ్యాయము క్రింది నేరము మోపబడిన అభియోగములో

ఎ) నిందితుడు ఈ అధ్యాయము క్రింది నిందమోపబడిన వ్యక్తికిగాని, అట్టి నేరము చేసినట్లు సహేతుకముగా అనుమానించబడిన వ్యక్తికిగాని ఏదేని ఆర్థిక సహాయము చేసినాడని రుజువైతే ప్రత్యేక న్యాయస్థానము, తద్విరుద్ధముగా రుజువు పరచబడినట్లయితే తప్ప, అట్టి వ్యక్తి నేరము చేసినట్లు పురోభావన చేయవలెను.

బి) కొందరు వ్యక్తులు సాముదాయికముగా ఈ అధ్యాయము క్రింద నేరము చేసినట్లు రుజువైనచో మరియు ఆ నేరము భూమిని లేక ఏదైనా ఇతర విషయము గురించి వున్న వివాదము యొక్క పర్యవసానముగా జరిగినదని రుజువైనచో, ఆ అపరాధము ఉమ్మడి ఉద్దేశ సాధనకై లేక ఉమ్మడి లక్ష్యసాధనకై జరిగినదని తలంచవలెను.

9. 1) స్మృతిలోని ఈ చట్టమునందు ఏదైన ఇతర నిబంధనలో వున్నట్లయితే రాష్ట్ర ప్రభుత్వము, ఏదైన జిల్లాలో లేక అందు ఏదైన భాగములో

ఎ) ఈ చట్టము క్రింద ఏదైనా నేరాన్ని నివారించుటకు లేక దాని విషయములో వ్యవహరించుటకు, లేక

బి) ఈ చట్టము క్రింద ఏదైన కేసు కొరకు లేక ఏదైన రకపు లేక వర్గపు కేసుల కొరకు తాము అవసరమని భావించినచో అలాంటి జిల్లాల్లో లేక అందలి భాగములో లేక సందర్భాను సారముగా అట్టి కేసుల్లో చట్టప్రకారం ఒక పోలీసు అధికారి వినియోగించదగిన అధికారములు, ప్రత్యేకించి వ్యక్తులను అరెస్టు చేయు, దర్యాప్తు జరుపు మరియు ఏదేని ప్రత్యేక న్యాయస్థానము సమక్షమున అభియోగమును తెచ్చు అధికారములను రాజపత్రము ద్వారా ఎవరైన రాష్ట్ర ప్రభుత్వాధికారికి అప్పగించవచ్చు.

2) ఈ చట్టము యొక్క లేక ఈ చట్టము క్రింద చేసిన ఏదైన నియమము, పథకము లేక ఉత్తర్వు యొక్క నిబంధనలను అమలుపరచుటలో సబ్ సెక్షన్ (1) లో నిర్దేశించిన అదికారికి పోలీసు అధికారులు, ఇతర ప్రభుత్వాధికారులు తోడ్పడవలెను.

3) స్మృతియొక్క నిబంధనలు, వీలైనంత మేరకు, ఎవరైన అధికారి సబ్ సెక్షన్ (1) క్రింది అధికారములను వినియోగించుటకు వర్తించును.

10. నేరం చేస్తాడని భావించిన వ్యక్తి ప్రాంత బహిష్కరణ :

1) ఎవరైనా వ్యక్తి, అధ్యాయం రెండులో పేర్కొన్న నేరాలను చేసే అవకాశం ఉందని ఏదైనా ఫిర్యాదు లేదా పోలీసు అధికారి నివేదిక ద్వారా నిర్ధారించుకున్న ఎడల ఆ వ్యక్తిని తనంతట తానుగా ఆ ప్రాంతం నుంచి కోర్టు సూచించిన సమయానికి, కోర్టు సూచించిన మార్గం గుండా వెళ్ళి పోవాలని ప్రత్యేక కోర్టు రాత పూర్వకంగా ఆదేశించవచ్చు. రెండేళ్ళ వరకూ ఆ ప్రాంతానికి వెళ్ళ కుండా కూడా కోర్టు ఆదేశాల్లో పేర్కొనవచ్చు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 లో పేర్కొన్న "షెడ్యూల్డు ఏరియా" లేదా ట్రైబల్ ఏరియా ప్రాంతాలకు కూడా ఇది వర్తిస్తుంది.

2) సబ్ సెక్షన్ (1) ప్రకారం ఏ పరిస్థితుల్లో కోర్టు ఆ ఉత్తర్వు జారీ చేసింది, ఆ వ్యక్తికి తన ఆదేశంతో పాటుగా తెలియజేయాలి.

3) ఇటువంటి ఉత్తర్వు జారీ చేసిన 30 రోజులలోపు ఉత్తర్వు ఎవరిపై జారీ చేయబడినదో ఆ వ్యక్తి కాని ఆ వ్యక్తి తరపు ఎవరైనా కాని పెట్టుకున్న లిఖిత పూర్వక అర్జీని పరిశీలించి కోర్టు ఈ ఉత్తర్వును ఎత్తివేయ వచ్చు లేదా మార్చవచ్చు.

11. 1) ఏదైన ప్రాంతమును వదలివెళ్లి పోవలసినదిగా 10 వ సెక్షన్ ప్రకారం ఆదేశము జారీయైన వ్యక్తి

ఎ) ఆదేశించినట్లుగా వెళ్లిపోనిచో; లేక

బి) అట్లు వెళ్లిపోయి, సబ్ సెక్షన్ (2) క్రింద ప్రత్యేక న్యాయస్థానము వ్రాతపూర్వకముగా ఇచ్చిన ఆజ్ఞతో తప్ప ఆ ఉత్తర్వులో నిర్దిష్టపరచినట్టి కాలవ్యవధి లోపల అట్టి ప్రాంతములో ప్రవేశించినచో;

ప్రత్యేక న్యాయస్థానము అతనిని అరెస్టు చేయించి ఆ న్యాయస్థానము నిర్దిష్టపరచునట్టి ప్రాంతము వెలుపలి స్థలమునకు పోలీసులు పంపించవచ్చు.

2) 10 వ సెక్షన్ క్రింద ఉత్తర్వుకు గురియైన ఏ వ్యక్తినైనను ప్రత్యేక న్యాయస్థానము వ్రాత పూర్వకమైన ఉత్తర్వు ద్వారా, ఏ ప్రాంతము నుండి అతడు వెళ్ళి పోవలెనని ఆదేశించటమైనదో ఆ ప్రాంతానికి అట్టి ఉత్తర్వులో నిర్దిష్టపరచినట్టి తాత్కాలికమైన కాల వ్యవధితోపాటు మరియు, అట్టి షరతులకు లోబడి తిరిగి వచ్చుటకు అనుమతిని ఇవ్వవచ్చు. విధించిన షరతులను తగురీతిగా పాటించుటకు జామీనుతో గాని జామీను లేకుండా గాని బాండు వ్రాసి ఇవ్వవలసినదిగా అతనిని కోరవచ్చును.

3) ప్రత్యేక న్యాయస్థానము ఎప్పుడైనను అతనికి ఇచ్చిన అనుమతిని ఉపసంహరించవచ్చు.

4) ఏ వ్యక్తియైనను, తాను ఏ ప్రాంతమునుండి వెళ్లిపోవలెనని ఆదేశించటమైనదో ఆ ప్రాంతముకు అట్టి అనుమతితో వచ్చినపుడు విధించిన షరతులను అతడు పాటించవలెను; తిరిగి వచ్చుటకు అనుమతించిన తాత్కాలిక కాలవ్యవధి ముగియగానే లేక అట్టి తాత్కాలిక కాలవ్యవధి ముగియుటకు పూర్వము అట్టి అనుమతిని ఉపసంహరించిన మీదట ఆ ప్రాంతము వెలుపలికి వెళ్ళిపోవలెను, మరియు క్రొత్తగా అనుమతి లేకుండా 10 వ సెక్షను క్రింద నిర్దేశించిన కాలపరిమితిలో మిగిలియున్న కాలములోపల ఆ ప్రాంతమునకు తిరిగి రాకూడదు.

5) విధించిన ఏవైనా షరతులను ఎవరైన వ్యక్తి పాటించనిచో లేక ఆ ప్రకారము వెళ్లిపోనిచో లేక అట్లు వెళ్లిపోయి క్రొత్తగా అనుమతి లేకుండా ఆ ప్రాంతములో ప్రవేశించినచో లేక అక్కడికి తిరిగి వచ్చినచో ప్రత్యేక న్యాయస్థానము అతనిని అరెస్టు చేయించి, ఆ న్యాయస్థానము నిర్దిష్టపరచునట్టి ప్రాంతము వెలుపలి స్థానములకు పోలీసు అనుమతితో తొలగింపజేయవచ్చును.

12. 1) 10 వ సెక్షను క్రింద చేసిన ఉత్తర్వుకు గురియైన వ్యక్తియొక్క కొలతలను, ఫోటోలను తీసుకొనవలెనని ప్రత్యేక న్యాయస్థానము కోరినచో, అట్టి వ్యక్తి పోలీసు అధికారిని అట్లు తీసుకొననీయవలెను.

2) సబ్ సెక్షన్ (1) లో నిర్దేశించిన ఎవరైన వ్యక్తిని అతని కొలతలను లేక ఫోటోలను తీసుకొన నీయవలెనని కోరినపుడు అట్టి కొలతలు లేక ఫోటోలు తీసుకొనకుండ ప్రతిఘటించినచో లేక తీసుకొననీయనిచో, వాటిని తీసుకొనుటకు అవశ్యకమైన పద్ధతులన్నింటిని ఉపయోగించుట చట్టసమ్మతమైనది.

3) కొలతలు లేక ఫోటోలు తీసుకొనకుండ సబ్ సెక్షన్ (2) క్రింద ప్రతిఘటించుట లేక వాటిని తీసుకొననీయకుండుట భారత శిక్షాస్మృతి 186 వ సెక్షన్ క్రింద నేరముగా భావించవలెను.

13. సెక్షను 10 ప్రకారం జారీ చేసిన ఉత్తర్వు ఉల్లంఘించినపుడు జరిమానా :

1) సెక్షన్ 10 ప్రకారం కోర్టు జారీచేసిన ఉత్తర్వును ఉల్లంఘించిన వ్యక్తికి జైలు శిక్ష ఒక సంవత్సరం వరకు విధించవచ్చు మరియు జరిమానా కూడా విధించవచ్చు.

అధ్యాయం - 4

ప్రత్యేక కోర్టులు

14. ప్రత్యేక కోర్టు :

నేర విచారణ త్వరితగతిన జరుగుటకు, హైకోర్టు, ప్రధాన న్యాయమూర్తి సమ్మతితో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు సెషన్సు కోర్టును, ప్రత్యేక కోర్టుగా నిర్దేశించి ఈ చట్టం క్రింద నేరములను విచారించే విధంగా అధికార గెజిట్‌లో ప్రచురించవచ్చు.

15. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ :

ప్రతి ప్రత్యేక కోర్టుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించ వచ్చు లేదా ఏడేళ్ళు న్యాయవాద వృత్తిలో ఉన్న న్యాయవాదిని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించి ఈ కేసులను విచారించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని తన అధికార గెజిట్‌లో ప్రచురించడం ద్వారా ఈ పనిచేయాలి.

అధ్యాయము - 5

వివిధ విషయములు

16. ఈ చట్టము క్రింద సామూహిక జరిమానా విధించి, దానిని వసూలుచేయుట కొరకు, అందుకు సంబంధించిన ఇతర విషయముల కొరకు పౌరహక్కుల పరిరక్షణ చట్టము 1955 యొక్క సెక్షన్ 10 ఎ నిబంధనలు వీలైనంత మేరకు వర్తించును.

17. శాంతి భద్రతల యంత్రాంగం చేపట్ట వలసిన ముందస్తు నిరోధక చర్యలు :

1. తమ పరిధిలోకి వచ్చు ప్రాంతములో షెడ్యూల్డు కులము లేదా తెగలకు చెందని వ్యక్తి లేదా వ్యక్తులు షెడ్యూల్డు కులాలు / తెగల వారిపై అత్యాచారము చేసే పరిస్థితి ఉన్నా లేదా అట్లు చేయగలమని బెదిరించినా మరియు అలా జరిగే అవకాశం ఉందని తాను భావించినా జిల్లా మేజిస్ట్రేట్ లేదా ఇతర ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ లేదా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయికి తగ్గని పోలీస్ అధికారి ఆ సమాచారం అందినపుడు విచారణ జరిపి అట్లు అత్యాచారం జరిగే అవకాశం ఉందని భావించినపుడు ఆ ప్రాంతంలో శాంతి భద్రతలు మరియు ప్రజా శాంతి నెలకొల్పేందుకు ముందస్తు చర్యలు తీసుకునేందుకై ఆ ప్రాంతాన్ని అత్యాచారం జరగబోయే ప్రాంతంగా ప్రకటించి తగు చర్యలు చేపట్టవచ్చు.
2. సబ్ సెక్షన్ (1) అమలు చేయుటకు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 7, 10 మరియు 11 అధ్యాయాలలోని అంశాలను ఉపయోగించవచ్చు.
3. సబ్ సెక్షన్ (1) లో తెలియపరచిన విధంగా అధికారులు, చర్యలు తీసుకొనుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని లేదా పథకాలను తయారు చేసి అత్యాచారాలను నిరోధించి షెడ్యూల్డు కులాలను, తెగలను వారిలో భద్రతా భావాన్ని కలిగించేందుకు సరైన ఆచరణ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వ గెజిట్ ప్రచురించవచ్చు.

18. ఈ చట్టపరమైన నేరాలకు ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 438 (ముందస్తు బెయిల్) వర్తించకుండుట : ఈ చట్టంలో పేర్కొన్న నేరాలు చేసిన వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 438 సెక్షన్ (ముందస్తు బెయిలు) వర్తించదు.

19. ఈ చట్టము క్రింద నేరము చేసినందుకు దోషియైయుండి పదునెనిమిది సంవత్సరముల వయసు దాటిన ఏ వ్యక్తికైనను స్మృతిలోని 360వ సెక్షన్‌లోని నిబంధనలు మరియు నేర పరివేక్షణ చట్టము, 1958 యొక్క నిబంధనలు వర్తించవు.

20. ఈ చట్టములో ఇతర విధముగా నిబంధించి ఉన్నట్లు తప్ప ఈ చట్టపు నిబంధనలు, తత్సమానమైనవి ఏమైన అమలునందున్న ఇతర చట్టాలను గాని, చట్టాలనుసరించి అమలు కలిగియున్న ఏదైన ఆచారములేక వాడుక లేక ఏదేని పత్రములో గాని దానికి అనుగుణముగా ఏమి ఉన్నప్పటికి, అమలు కలిగియుండును.

21. 1) కేంద్ర ప్రభుత్వము ఈ విషయమున చేయు నియమములకు లోబడి రాష్ట్ర ప్రభుత్వము ఈ చట్టమును కట్టుదిట్టముగా అమలు జరుపుటకు అవశ్యకమగునట్టి చర్యలను తీసుకొనవలెను.

2) ప్రత్యేకించి, పై నిబంధనలకు భంగము కలుగకుండా అట్టి చర్యలలో ఈ క్రిందివి చేర్చియుండవచ్చును.

ఎ) అత్యాచారములకు గురియైన వ్యక్తులు న్యాయము పొందుటకు వీలుగా వారికి న్యాయసహాయముతో సహా తగు సౌకర్యములను ఏర్పాటు చేయుట;

బి) ఈ చట్టము క్రింద నేరముల దర్యాప్తు, విచారణ జరుగుచున్నప్పుడు, అత్యాచారములకు గురైన వారితో సహా సాక్షులకు ప్రయాణ మరియు పోషణ ఖర్చులను సమకూర్చుట;

సి) అత్యాచారములకు గురియైన వారికి ఆర్థిక మరియు సాంఘిక పునరావాసమును కల్పించుట;

డి) ఈ చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించినందుకు అభియోగములను ప్రారంభించుట లేక పర్యవేక్షించుటకు అధికారులను నియమించుట;

ఇ) అట్టి చర్యలను రూపొందించుటలోను, అమలు పరచుటలోను రాష్ట్ర ప్రభుత్వమునకు తోడ్పడుటకు గాను, రాష్ట్ర ప్రభుత్వము సబబని తలచునట్టి సముచిత స్థాయిలలో కమిటీలను ఏర్పాటుచేయుట.

ఎఫ్) ఈ చట్టపు నిబంధనలను మరింత కట్టుదిట్టముగా అమలు పరచుటకుగాను చర్యలను సూచించు దృష్టితో ఈ చట్టపు నిబంధనలు అమలగుచున్న తీరును నిర్ణీత కాలములో సమీక్షించుటకు ఏర్పాటు చేయుట.

జి) షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల వారు ఏ ప్రాంతములలో అత్యాచారములకు గరైయ్యే ఆస్కారముకలదో ఆ ప్రాంతములను గుర్తించుట, వారికి భద్రతను కల్పించుటకై చర్యలను తీసికొనుట.

3) కేంద్ర ప్రభుత్వము, సబ్ సెక్షన్ (1) క్రింద రాష్ట్ర ప్రభుత్వములు తీసుకొనిన చర్యలను సమన్వయపరచుటకు ఆవశ్యకమగునట్టి చర్యలను తీసుకొనవలెను.

4) ఈ సెక్షన్‌లోని నిబంధనల ననుసరించి కేంద్ర ప్రభుత్వము మరియు రాష్ట్ర ప్రభుత్వములు తీసుకొనిన చర్యలను గుర్తించిన నివేదికను కేంద్ర ప్రభుత్వము ప్రతి సంవత్సరము పార్లమెంటు యొక్క ప్రతి సమావేశములో వుంచవలెను.

22. ఈ చట్టము క్రింద మంచి ఉద్దేశముతో దేనినైనను చేసేందుకు లేక చేయుటకు ఉద్దేశించుటకు కేంద్ర ప్రభుత్వము పై గాని, రాష్ట్ర ప్రభుత్వముపై గాని, ప్రభుత్వము యొక్క ఏ అధికారి పైన గాని, ఎవరైన ఇతర వ్యక్తిపై గాని దావా, అభియోగము లేక ఇతర చట్టబద్ధ చర్య ఏదియువుండదు.

23. 1) కేంద్ర ప్రభుత్వము ఈ చట్ట ప్రయోజనమును నెర వేర్చుటకు రాజపత్రములో అధిసూచన ద్వారా నియమములను చేయవచ్చును.

2) ఈ చట్టము క్రింద చేసిన ప్రతి నియమమును దానిని చేసిన పిమ్మట వీలైనంత త్వరగా, పార్లమెంటు ముందు ఆమోదానికి ఉంచాలి. పార్లమెంటు మొత్తం 30 రోజులు కాల వ్యవధితో ఉన్నప్పుడే ఈ నియమాన్ని ఆమోదానికి ఉంచాలి. ఉభయసభలు ఆ నియమం చేయాలనిగాని, చేయకూడదు అని గాని ఆమోదిస్తే తదనుగుణంగా ఆ నియమం అమలులోకి రావటం లేదా రాకపోవటం జరుగుతుంది. ఆ నియమానికి ఏవైనా మార్పులు చేయాలని ప్రతిపాదిస్తే, తదనుగుణంగా మార్చిన నియమాన్ని అమలు పరచాలి.

షెడ్యూల్డు కులాలు, తెగలవారిపై అత్యాచారాల నిరోధక చట్ట నిబంధనలు 1995

షెడ్యూల్డు కులాలు, తెగల వారిపై అత్యాచారాల నిరోధక చట్టం 1989 (33 ఆఫ్ 1989) లో సెక్షన్ 23 లో సబ్ సెక్షన్ (1) నుంచి సంక్రమించిన అధికారాలతో కేంద్ర ప్రభుత్వం ఈ క్రింది నియమాలను రూపొందించింది.

I. ఈ నిబంధనలు షెడ్యూల్డు కులాలు, తెగలవారిపై అత్యాచార నిరోధక చట్టం కింద రూపొందించిన నిబంధనలు 1995 గా పరిగణింపబడును. ఈ నిబంధనలు ప్రభుత్వ గెజిట్‌లో ప్రకటించిన వెంటనే అమల్లోకి వచ్చును. వీటిని మార్చి 31, 1995 న కేంద్ర ప్రభుత్వ గెజిట్‌లో ప్రకటించారు.

II. నిర్వచనాలు : ఈ నిబంధనల క్రింద ఇతరేతర సందర్భాల్ని మినహాయించి

i) చట్టం అంటే షెడ్యూల్డు కులాలు, తెగల వారిపై అత్యాచార నిరోధక చట్టం అని అర్థం.

ii) ఆధారపడిన వాళ్లంటే భార్యాబిడ్డలు, భర్తను కోల్పోయిన ఆడపడుచులు, బాధితుని కోడలు, మనుమలు, మనువరాళ్లు.

iii) అత్యాచారాలు తరచు జరిగే ప్రాంతాన్ని గుర్తించడం అంటే షెడ్యూల్డు కులాలు, తెగల వారిపై అత్యాచారాలు తరచు జరిగే అవకాశం ఉందనీ, లోగడ అత్యాచారాలు జరిగిన ప్రాంతాల్లో తిరిగి ఇలాంటి పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందనీ, తరచు అత్యాచారాలు జరిగే ప్రాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం తగిన కారణాలతో అత్యాచార నిరోధక చట్టం క్రింద ఆ ప్రాంతాన్ని ప్రకటించవచ్చు.

iv) ప్రభుత్వేతర సంస్థలు : సంస్థల రిజిస్ట్రేషన్ చట్టం క్రిందగాని మరే ఇతర చట్టం క్రిందనైనా ఏర్పడిన షెడ్యూల్డు కులాలు, తెగల వారి సంక్షేమం గురించి పాటుబడుతున్న స్వచ్ఛంద సంస్థలు.

v) అనుబంధం : అంటే ఈ నిబంధనలకి అనుబంధమని అర్థం.

III. అత్యాచారాలు షెడ్యూల్డు కులాలు, తెగల వారిపై జరగకుండా ఉండేందుకు రాష్ట్రప్రభుత్వం ఈ క్రింద పొందుపరచిన కొన్ని చర్యల్ని తీసుకుంటుంది.

i) అత్యాచారాలు జరిగే అవకాశం ఉందనుకున్న ప్రాంతాల్ని గుర్తించటం లేదా ఇంతకుముందు అత్యాచారం జరిగిన ప్రాంతాల్లో తిరిగి అలాంటి పరిస్థితి తలయెత్తే అవకాశం ఉందనుకొన్న ప్రాంతాన్ని గుర్తించటం.

ii) అత్యాచారాలు జరిగే ప్రాంతాల్ని సందర్శించి శాంతి, భద్రతల్ని నెలకొనేటట్లు చూడాల్సిందిగా జిల్లా మేజిస్ట్రేటు (కలెక్టర్) పోలీసు సూపరింటెండెంట్లని ఆదేశిస్తారు.

iii) అవసరమైతే ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న షెడ్యూల్డు కులాలు, తెగలు కాని ఇతర కులస్తుల నుండి బంధువుల నుండి అనుయాయుల నుండి, సిబ్బంది నుండి ఆయుధ లైసెన్సులు రద్దుచేసి వాటిని ప్రభుత్వం తన ఆధీనంలో ఉంచుకోవచ్చు.

iv) లైసెన్స్ లేని ఆయుధాల్ని స్వాధీనం చేసుకొని ఆయుధ కర్మాగారాన్ని నిషేధించవచ్చు.

v) షెడ్యూల్డు కులాలు, తెగల వారికి భద్రత నిమిత్తం అవసరాన్ని బట్టి వారికి ఆయుధ లైసెన్స్‌లు ఇవ్వాలి.

vi) చట్టాన్ని అమలు చేయటానికి రాష్ట్రం, జిల్లాస్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి వాటి సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం పొందవచ్చు.

vii) నిఘా మొదలైన ఇతర కమిటీలు ఏర్పాటుచేసి చట్టం అమలులో ఉండేటట్లు చూడాలి.

viii) షెడ్యూల్డు కులాలు, తెగలవారికి వారి హక్కుల్ని గురించి తెలియచెయ్యడానికి, ప్రభుత్వానికి సంబంధించిన ఇతర పథకాల్ని వివరించటానికి అవసరమైన యంత్రాంగాన్ని రూపొందించటం, వర్క్ షాపులు నిర్వహించటం వంటి కార్యక్రమాన్ని చేపట్టటం.

ix) ఈ పనికి తోడ్పడే ప్రభుత్వేతర సంస్థలకు ఆర్థిక సహాయం అందచేయడం.

x) ఈ ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు దళాల్ని నియమించటం.

xi) ఈ చట్టం అమలుకు సంబంధించిన దాఖలైన కేసుల్ని గురించి, శాంతి భద్రతల స్థితిగతుల గురించి మూడు మాసాలకు ఒకసారి సమీక్షించాలి.

IV. 1) ఈ చట్టం క్రింద ప్రభుత్వాలు దాఖలుచేసిన కేసుల నిర్వహణకు ప్రత్యేక న్యాయస్థానాల్లో కనీసం ఏడు సంవత్సరాలకు తక్కువ కాకుండా అనుభవం ఉన్న న్యాయవాదుల్ని ప్రాసిక్యూటర్స్‌గా జిల్లా మేజిస్ట్రేట్‌ని సంప్రదించి, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ నియమించాలి. ఈ నియామకం ప్రభుత్వ గెజిట్‌లో ప్రకటించిన మూడు సంవత్సరాల వరకు అమలులో ఉండును.

2) జిల్లా మేజిస్ట్రేట్ (కలెక్టర్) జిల్లా ప్రాసిక్యూషన్ అధికారి ప్రతి సంవత్సరం జనవరి, జూలై మాసాల్లో సమీక్షా సమావేశాల్ని ఏర్పాటుచేసి, ప్రత్యేక ప్రాసిక్యూటర్ పనితీరుపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించాలి.

3) ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సక్రమంగా తన శక్తి సామర్థ్యాలకు తగ్గకుండా విధిని నిర్వహించలేదని ప్రభుత్వం సహేతుకంగా విశ్వసిస్తే కారణాలు తెలుపుతూ పదవీచ్యుతుణ్ణి చేయవచ్చు.

4) జిల్లా మేజిస్ట్రేట్, జిల్లా ప్రాసిక్యూషన్ అధికారి ప్రతి నెల 20 వ తారీఖులోగా గానీ; 20 వ తారీఖునగాని అంతకు ముందు మాసంలో ఈ చట్టం క్రింద దాఖలైన కేసుల స్థితిగతుల్ని సమీక్షించి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికీ నివేదిక పంపాలి. ఈ దర్యాప్తుకి సంబంధించీ, ప్రాసిక్యూషన్‌కి సంబంధించి చేపట్టిన చర్యలూ, చేపట్టనున్న చర్యలూ ఈ నివేదికలో పేర్కొనాలి.

5) సబ్‌రూల్ (1) లో పేర్కొన్నట్లు కాక అవసరమను కొన్నప్పుడు కాని బాధితుడు కోరినపుడుగానీ, జిల్లా మేజిస్ట్రేట్ కానీ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కాని ప్రాసిక్యూషన్ నిర్వహించడానికి సీనియర్ న్యాయవాదిని నియమించవచ్చు. తగిన ఫీజు నిర్ణయించి చెల్లించే అధికారం కూడా వీరికి ఉంది.

6) ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఫీజును రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈ ఫీజు పానల్ న్యాయవాదులకు చెల్లించే ఫీజు కంటే ఎక్కువ ఉండాలి.

V. 1) ఈ చట్టం క్రింద జరిగిన నేరాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు మౌఖికంగా గానీ, లిఖితపూర్వకంగా గానీ తెలియచేయవచ్చు.

2) సమాచారం ప్రతిని సమాచారం అందించిన వారికి పోలీసులు ఉచితంగా ఇవ్వాలి.

3) సమాచారాన్ని స్వీకరించడానికి సంబంధిత పోలీసులు నిరాకరించినట్లైతే, సమాచారకులు ఆ సమాచారాన్ని జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కి, పోస్టులో పంపించవచ్చు. అలా పోస్ట్‌లో వచ్చిన సమాచారం పై స్వయంగా దర్యాప్తు చెయ్యడం కాని డిప్యూటీ సూపరింటెండెంట్‌చే దర్యాప్తు చేయించడంకాని చేసి, సంబంధిత పోలీస్ స్టేషన్‌కి సమాచారం పంపి ఇందుకై నిర్దేశించిన పుస్తకంలో రికార్డు చేయించాలి.

VI. జిల్లా మేజిస్ట్రేట్ కాని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కాని, పోలీస్ సూపరింటెండెంట్ కానీ, డి.యస్.పి. కానీ, సమాచారం అందిన వెంటనే అత్యాచారం జరిగిన ప్రాంతానికి వెళ్ళి ప్రాణ, ఆస్తి నష్టాన్ని బేరీజువేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలి.

ఎ) అత్యాచారం జరిగిన ప్రాంతాన్ని సందర్శించిన అధికారి బాధితుల, వారి కుటుంబ సభ్యులపై ఆధారపడిన వారి జాబితా తయారుచేయాలి.

బి) జరిగిన నష్టానికి సంబంధించి, బాధితులకు సంబంధించి సమగ్రమైన నివేదికను రూపొందించాలి.

సి) ఆ ప్రాంతంలో పోలీసు పహారా ఏర్పాటు చెయ్యమని ఆదేశించాలి.

డి) బాధితుల, బాధితుల తరపు సాక్షులకు వారి సానుభూతి పరులకు రక్షణ కల్పించాలి.

ఇ) బాధితులకు తక్షణ సహాయం అందించాలి.

VII. నిబంధన :

1. దర్యాప్తు అధికారి : డిప్యూటి సూపరింటెండెంట్ హోదాకి తగ్గని అధికారికి మాత్రమే ఈ చట్టం క్రింద దర్యాప్తు చేసే అధికారం ఉంటుంది. దర్యాప్తు అధికారిని రాష్ట్ర ప్రభుత్వం, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నియమిస్తారు. ఆ అధికారి గత అనుభవాన్ని, ధర్మబద్ధతను, సామర్థ్యాన్ని, కేస్‌లో ఉన్న సమస్యల్ని దృష్టిలో ఉంచుకొని, సరైన పద్ధతిలో వీలైనంత తొందరగా దర్యాప్తు చెయ్యగలడని విశ్వసించిన మీదటే దర్యాప్తు బాధ్యత అప్పగిస్తారు.

2) కేసు దర్యాప్తు ముఫ్ఫై రోజుల్లో పూర్తిచేసి, జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌కు నివేదిక పంపుతారు. ఆయన ఆ నివేదికను రాష్ట్ర ప్రభుత్వ పోలీసు డైరెక్టర్ జనరల్‌కు పంపుతారు.

3) ప్రతి మూడు మాసాలకు ఒకసారి రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ప్రాసిక్యూషన్ బాధ్యత నిర్వహిస్తున్న అధికారి, పోలీస్ డైరెక్టర్ జనరల్ సంయుక్తంగా దర్యాప్తులను సమీక్షిస్తారు.

VIII. షెడ్యూల్డు కులాలు, తెగల వారికై రక్షణ విభాగాన్ని ఏర్పాటు చేయడం :

1) షెడ్యూల్డు కులాలు, తెగలవారి రక్షణకి రాష్ట్ర రాజధానిలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు, ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు ఆధిపత్యంలో ఒక ప్రత్యేక విభాగం నెలకొల్పుతారు. అట్టి విభాగం : –

1. గుర్తించబడిన ప్రాంతాల్లో సర్వే జరపడం.

2. గుర్తింపబడిన ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణ.
3. గుర్తింపబడిన ప్రాంతంలో ప్రత్యేక పోలీసు దళాల్ని పంపమని గానీ, ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చెయ్యమని గానీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చెయ్యడం.
4. నేరం జరగడానికి గల కారణాల్ని పరిశీలించడం.
5. షెడ్యూల్డు కులాలు, తెగల వారికి అభద్రతా భావాన్ని తొలగించ యత్నించడం.
6. గుర్తించబడిన ప్రాంతాల్లోని శాంతి భద్రతల పరిస్థితిని ప్రత్యేక అధికారికీ, నోడల్ అధికారికీ తెల్పడం.
7. అధికార్లు నేరం జరిగిన ప్రాంతాన్ని సందర్శించిందీ లేనిదీ, వారు చేసిన దర్యాప్తు వివరాల్ని తెలుసుకోవడం.
8. నిబంధన (5) (3) క్రింద పోలీసు స్టేషన్ అధికారి సమాచారం రికార్డు చేసుకో నిరాకరించిన కేసుల్లో, పోలీసు సూపరింటెండెంట్ తీసుకున్న చర్యల్ని విచారించడం.
9. ప్రభుత్వ అధికార్ల ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి సంబంధించి విచారించడం.
10. ఈ చట్టం క్రింద నమోదైన కేసుల స్థితిని సమీక్షించడం.
11. ఈ విషయాలకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ నోడల్ అధికారికి నెలవారీ నివేదికను పంపాలి. ఈ నివేదిక ప్రతిని ప్రతినెలా 20 వ తేదీ నాటికి పంపాలి. అప్పటివరకూ తీసుకున్న చర్యల్ని, ఇకముందు తీసుకోనున్న చర్యల్ని విశదీకరించాలి.

IX. నోడల్ అధికారి నియామకం :

ప్రభుత్వ కార్యదర్శి హోదా కలిగిన అధికారిని నోడల్ అధికారిగా నియమిస్తారు. సాధ్యమైనంత వరకూ షెడ్యూల్డు కులానికి కానీ, తెగకి కానీ, చెందిన వారిని మాత్రమే నోడల్ అధికారిగా నియమించాలి. ఈ చట్టాన్ని అమలుపర్చే బాధ్యత కలిగిన అధికారులని అంటే దర్యాప్తు అధికారిని పోలీసు సూపరింటెండెంట్‌ని, జిల్లా మేజిస్ట్రేట్‌ని సమన్వయ పర్చడం ఈ అధికారి ప్రధాన బాధ్యత. ప్రతి మూడు నెలల కొకసారి నోడల్ అధికారి –

1. రాష్ట్ర ప్రభుత్వానికి చేరిన నివేదికను సమీక్షిస్తారు.
2. ఈ చట్టం క్రింద నమోదైన కేసుల్ని.
3. గుర్తించబడిన ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిస్థితిని.
4. బాధితులకీ, వారిపై ఆధారపడిన వారికీ ధన, వస్తు రూపేణ చేసిన సహాయాన్ని.
5. తక్షణం అవసరమైన గృహ, ఆహార, ప్రయాణ సౌకర్యాలు, కట్టుకునే బట్టలు వంటివి బాధితులకు వారిపై ఆధారపడిన వారికి అందించినది, లేనిది.
6. చట్టాన్ని అమలు పర్చడానికి తోడ్పడాల్సిన ప్రభుత్వేతర సంస్థలూ, షెడ్యూల్డు కులాలు, తెగల రక్షణ విభాగాలు తదితర సంస్థలూ, ప్రభుత్వాధికార్ల పనితీరును సమీక్షించడం నోడల్ అధికారి బాధ్యత.

X. ప్రత్యేక అధికారి నియామకం :

జిల్లా మేజిస్ట్రేట్‌నీ, పోలీసు సూపరింటెండెంట్‌నీ తదితర అధికార్లనీ సంస్థలనీ సమన్వయ పర్చడానికి

గుర్తించబడిన ప్రాంతాల్లో ప్రత్యేక అధికారిని నియమిస్తారు.

1. ప్రత్యేక అధికారి తక్షణ సహాయం, తదితర సౌకర్యాలు అందించడమే కాక తిరిగి అలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలి.
2. గుర్తించబడిన ప్రాంతంలో షెడ్యూల్డు కులాలు, తెగల వారిలో చైతన్యం కలిగించడానికి ఒక కేంద్రానికి ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయాలి. అంతేకాక షెడ్యూల్డు కులాలు, తెగల వారి కేంద్ర రాష్ట్ర చట్టాల క్రింద సంక్రమించిన హక్కులని బోధపర్చే బాధ్యత కూడా ప్రత్యేక అధికారిపైనే ఉంది.
3. ప్రభుత్వేతర సంస్థల మధ్యన సమన్వయం కల్పించడానికీ, వారికవసరమైన ఆర్థిక సహాయం చెయ్యడం కూడా ఈ అధికారి బాధ్యత.

XI. బాధితులకు వారిపై ఆధారపడిన వారికి, సాక్షులకి ప్రయాణపు ఖర్చులూ, రోజువారీ భత్యం, ప్రయాణ సౌకర్యాలు.

1. ఈ చట్టం క్రింద నమోదైన కేసుల్లో సాక్ష్యం చెప్పడానికి దర్యాప్తు జరిగే స్థలానికీ విచారణ జరిగే చోటుకి వచ్చే సాక్షులకీ, బాధితులకీ, వారిపై ఆధారపడిన వారికీ రెండో తరగతి రైలు టికెట్ కయ్యే ఖర్చుగానీ, బస్ చార్జీలు కానీ, వాస్తవంగా అయిన టాక్సీ చార్జీలు కానీ చెల్లిస్తారు.
2. ఈ ఖర్చులన్ని జిల్లా మేజిస్ట్రేట్ కానీ, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కానీ, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కాని చెల్లించే ఏర్పాటు చేస్తారు. బాధితులూ, వారి తరపు సాక్షులు కేసు దర్యాప్తు జరుగుతున్నప్పుడు దర్యాప్తు చేస్తున్న అధికారిని కానీ, జిల్లా మేజిస్ట్రేట్‌ని కానీ, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ని కానీ కలవడానికి వెళ్లినప్పుడు అయిన ఖర్చుల్ని కూడా చెల్లిస్తారు.
3. స్త్రీలూ, పిల్లలూ, అరవై సంవత్సరాలు పైబడిన వృద్ధులూ, సాక్షులైన పక్షంలో వారి వెంట, వారికి తోడుగా మరొకరిని తీసుకువెళ్లవచ్చు. తోడు వచ్చిన వారికి అయిన ఖర్చుల్ని కూడా చెల్లించవలెను.
4. సాక్షులకు వారిపై ఆధారపడిన వారికీ, తోడొచ్చిన వారికీ, దర్యాప్తు సమయంలోనూ, విచారణ జరుగుతున్నప్పుడు దినసరి భత్యాన్ని చెల్లిస్తారు. ఈ దినసరి భత్యం వ్యవసాయ కూలీల కనీస వేతనానికి తగ్గకుండా ఉండును.
5. దినసరి భత్యమే కాక సమయానుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానుసారం భోజన ఖర్చులు కూడా చెల్లిస్తారు.
6. ఈ ఖర్చులన్నీ జిల్లా మేజిస్ట్రేట్ కానీ, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కానీ, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వెంటనే చెల్లించాలి. అలా కుదరని పక్షంలో మూడు రోజుల్లోగా చెల్లిస్తారు.
7. చట్టంలోని సెక్షన్ 8 క్రింద జరిగిన నేరాలలో గాయపడిన వారికి అయ్యే వైద్య ఖర్చులన్నీ జిల్లా మేజిస్ట్రేట్ కానీ, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ కానీ, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కానీ చెల్లిస్తారు.

XII. 1. జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ సూపరింటెండెంట్ నేరం జరిగిన స్థలానికి వెళ్లి జరిగిన ప్రాణ నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని అంచనా వేస్తారు. అంతేకాక పరిహారం పొందడానికి అర్హులైన బాధితులూ, వారి

కుటుంబ సభ్యులూ, వారిపై ఆధారపడిన వారి జాబితా తయారుచేస్తారు.

2. ప్రథమ సమాచార నివేదిక రిజిస్టర్ చేసుకోవడం, నిందితుల్ని అరెస్ట్ చెయ్యడం వంటి చర్యలకి పోలీస్ సూపరింటెండెంట్ బాధ్యత వహిస్తారు.
3. నేరస్థలాన్ని పరిశీలించడం, దర్యాప్తు అధికారిని నియమించడం, అవసరమైన పోలీస్ సిబ్బందిని అక్కడ ఉంచి నేరం జరగకుండా నివారించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం పోలీస్ సూపరింటెండెంట్ బాధ్యత.
4. నిబంధనలకి అనుబంధంగా చేర్చిన అనుబంధం ఒకటి రెండు ననుసరించి బాధితులకి, వారిపై ఆధారపడిన వారికి, వారి కుటుంబ సభ్యులకీ, తక్షణ సహాయం అందించే బాధ్యత జిల్లా మేజిస్ట్రేట్‌పై, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లపై ఉంది. తక్షణ సహాయం అంటే ఆహారం, ఉండటానికి గూడు, కట్టుకోవడానికి బట్టలు, ప్రయాణ సౌకర్యాలు, తదితరమైన మనిషి మనుగడకి అవసరమైన యితర సౌకర్యాలూ అని చట్టం పేర్కొంది.
5. అధికారులు అందించే తక్షణ సహాయం బాధితులు మరే యితర చట్టాల క్రిందనైనా పొందే నష్టపరిహారంతో సంబంధం లేదు.
6. ఈ నిబంధనల అనుబంధంలో పేర్కొన్న కొలబద్ధల ననుసరించి పునరావాసం కానీ నష్టపరిహారం కానీ చెల్లిస్తారు.
7. అందించిన సహాయ పునారావాస సౌకర్యాల నివేదికని ప్రత్యేక న్యాయస్థానానికి సమర్పిస్తారు. అందించిన సహాయ సహకారాలు సరిపోవనుకొన్నప్పుడు, అవసరమైన మేరకు సహాయ సహకారాలు అందించమని ఆదేశించే అధికారం ప్రత్యేక న్యాయస్థానానికి ఉంది.

XIII. 1. షెడ్యూల్డు కులాలు తెగల వారి సమస్యల గురించి అవగాహన ఉన్న అధికారులను నియమించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది.

2. అన్ని స్థాయిలలోనూ అధికారులలో షెడ్యూల్డు కులాల తెగల వారి ప్రాతినిధ్యం ఉండాలి. ముఖ్యంగా పోలీస్ పోస్ట్‌లలోనూ, పోలీస్ స్టేషన్లలోనూ అనివార్యంగా ఉండాలి.

XIV. బాధితులకు సహాయ పురావాసాలు సమకూర్చడానికి అవసరమైన నిధులను రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో కేటాయించాలి. రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రెండుసార్లు జనవరి, జూలై నెలల్లో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పనితీరుని, ఈ చట్టం అమలుకు సంబంధించిన నివేదికల్ని రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించాలి.

XV. చట్టం అమలుపర్చడానికి అవసరమైన పథకం రూపొందించి రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో ప్రకటించాలి. ఆ పథకంలో ఈ విషయంలో ప్రభుత్వ శాఖల విధులనీ, బాధ్యతలనీ విశదీకరించాలి. అంతేకాక స్థానిక సంస్థల పాత్రనీ, ప్రభుత్వేతర సంస్థల పాత్రనీ కూడా వివరించాల్సి ఉంటుంది. ఈ పథకంలో ఈ క్రింద పేర్కొన్న విషయాల్ని కూడా వివరించాల్సి ఉంటుంది.

1. ఆర్థికంగానూ, వస్తురూపేణ అందించే తక్షణ సహాయ వివరాలు,
2. వ్యవసాయ భూమి, ఇళ్ల స్థలాల కేటాయింపు వివరాలు,
3. బాధితుల కుటుంబ సభ్యులకి కానీ, వారిపై ఆధారపడిన వారికి కానీ ప్రభుత్వంలోనూ, ప్రభుత్వరంగ సంస్థల్లోనూ ఉపాధి కల్పించడానికి అవసరమైన పథకాన్ని రూపొందించాలి.

4. పునరావాస పథకం,
5. అత్యాచారానికి బలైన వ్యక్తి భార్యకీ, పిల్లలకీ, పెన్షన్ చెల్లింపు. అత్యాచారానికి బలైన వ్యక్తి వికలాంగుడైనా, వయో వృద్ధుడైనా అతనికి పెన్షన్ చెల్లిస్తారు.
6. బాధితులకి అనివార్యంగా చెల్లించే నష్ట పరిహారం,
7. బాధితుల సాంఘిక ఆర్థిక స్థితిని మెరుగు పర్చడానికి అవసరమైన పథకం,
8. బాధితులకి గృహవసతి కల్పించడం,
9. షెడ్యూల్డు కులాలు, తెగల వారి స్మశాన వాటికను, నిత్యావసర వస్తువుల సరఫరానూ, మంచినీటిసౌకర్యాలను, ఆరోగ్య పరిరక్షణ చర్యలనీ, రోడ్ల నిర్మాణాల వివరాలను తెలపాల్సి ఉంటుంది.

ఈ పథకాల వివరాలనూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ శాఖ జిల్లా పోలీసు సూపరింటెండెంట్లకూ, పోలీస్ ఐ.జి.కీ. ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌కూ పంపాలి.

XVI. రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ మరియు ప్రచార కమిటీ :

1. ముఖ్యమంత్రి అధ్యక్షతన, హోంమంత్రి, ఆర్థిక మంత్రి, సంక్షేమ మంత్రి, పార్లమెంట్‌కి శాసనసభకి ఎన్నికైన షెడ్యూల్డు కులాలు, తెగల అభ్యర్థులూ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శి, పోలీస్ డి.జి.పి., హెడ్యూల్డ్ కులాలు, తెగల జాతీయ కమీషన్ డిప్యూటీ డైరెక్టర్, షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమ కార్యదర్శులతో కూడిన సభ్యులతో నిఘా కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలో 25 మందికి మించి సభ్యులు ఉండటానికి వీల్లేదు.
2. ఈ ఉన్నత స్థాయి కమిటీ జనవరి, జూలై మాసాల్లో సంవత్సరానికి రెండుసార్లు సమావేశం అవుతుంది. ఆయా సమావేశాల్లో చట్టం అమలుకు సంబంధించిన అంశాలని సమీక్షిస్తుంది. అంతేకాక రాష్ట్ర ప్రభుత్వానికి అందిన నివేదికల్ని పరిశీలించడం, సహాయ పునరావాస చర్యల్ని, అధికారుల పనితీరుని, కేసుల ప్రాసిక్యూషన్స్ కూడా ఈ కమిటీ సమీక్షిస్తుంది.

XVII. జిల్లా స్థాయి నిఘా విభాగం :

రాష్ట్ర స్థాయి నిఘా విభాగంచేసే పనులనే జిల్లా విభాగం చేస్తుంది. జిల్లాలో ఈ కమిటీని జిల్లా మేజిస్ట్రేట్ ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీలో శాసన సభ్యులూ, పార్లమెంట్ సభ్యులూ, పోలీసు సూపరింటెండెంట్, షెడ్యూల్డు కులాలు తెగకి చెందిన ముగ్గురు గ్రూప్ 'ఎ' అధికార్లు కానీ, గెజిటెడ్ అధికార్లుకానీ, అయిదుగురు షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన ప్రభుత్వేతర సాంఘిక సంస్థలకు చెందినవారు, ముగ్గురు ఇతర కులాలకు చెందిన ప్రభుత్వేతర సాంఘిక సంస్థలకు చెందిన వారూ, ఈ కమిటీ సభ్యులుగా ఉంటారు. జిల్లా మేజిస్ట్రేట్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఈ కమిటీకి అధ్యక్ష కార్యదర్శులుగా ఉంటారు. జిల్లాస్థాయి కమిటీ కనీసం మూడు నెలలకు ఒకసారి సమావేశం అవ్వాలి.

XVIII. సంవత్సరం నివేదికకు తగు సమాచారం :

ప్రతి మార్చి 31 వ తేదీ ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టం అమలు చేసేందుకు గత సంవత్సరంలో తీసుకున్న చర్యలు, ఏర్పాటు చేసిన వివిధ పథకాలు / ప్రణాళికలు గూర్చి ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపవలెను.

*****

నష్టపరిహారం

నెం.	నేరం	నష్టపరిహారం
1.	తినకూడని అసహ్యకరమైన పదార్థం తినుట లేదా త్రాగుట (సెక్షన్ 3(1)(i))	ప్రతి బాధితునికి 25,000 రూపాయలు లేదా అంతకు ఎక్కువ, నేరం యొక్క పద్ధతి తీవ్రతను బట్టి మరియు
2.	గాయపరచుట, అవమానపరచుట లేదా ఇబ్బంది పరచుట సెక్షన్ 3(1)(ii))	బాధితుడు అనుభవించిన దెబ్బలు, అవమానం, ఆర్థిక స్థితికి తగు విధంగా ధన సహాయం ఈ క్రింది విధంగా చేయాలి
3.	అగౌరవ పరిచే చర్య (సెక్షన్ 3(1)(iii))	1. చార్జిషీటు కోర్టుకు పంపినప్పుడు 25% 2. కింది కోర్టు నిందితులకు శిక్ష విధించిన వెంటనే 75%
4.	భూమిని అక్రమంగా ఆక్రమించు కొనుట లేదా సాగు చేయుట మొదలైనవి (సెక్షన్ (3(1)(iv))	నేర తీవ్రత స్వభావాన్ని బట్టి కనీసం 25,000 రూపాయలు అవసరాన్ని బట్టి భూమి/ ఆవరణ/నీటి సరఫరా ప్రభుత్వమే కల్పించాలి.
5.	భూమి, ఆవరణ నీరుకు సంబంధించి (సెక్షన్ 3(1)(v))	
6.	భిక్షమెత్తించడం లేదా బలవంతపు లేదా కట్టుబానిసత్వం (సెక్షన్ 3(1)(vi))	కనీసం 25,000 రూ॥ ప్రతి బాధితునికి చెల్లించాలి. ప్రధమ సమాచార నివేదిక స్థాయిలో 25%, కింద కోర్టులో శిక్ష పడిన వెంటనే 75% చెల్లించాలి.
7.	ఓటు హక్కుకు సంబంధించి (సెక్షన్ 3(1)(vii))	నేర తీవ్రతను బట్టి 20,000 రూపాయల వరకు ప్రతి బాధితునికి చెల్లించాలి.
8.	తప్పుడు, నష్టపరచే విధంగా ఇబ్బంది పరిచే విధంగా న్యాయ చర్యలు (సెక్షన్ 3(1)(viii))	25,000 రూపాయలు లేదా నష్టానికి, న్యాయ విచారణకు అయిన ఖర్చు తిరిగి చెల్లించడం.
9.	తప్పుడు సమాచారం (సెక్షన్ 3(1)(ix))	25,000 రూపాయలు లేదా నష్టానికి, న్యాయ విచారణకు అయిన ఖర్చు తిరిగి చెల్లించడం.

నెం.	నేరం	నష్టపరిహారం
10.	అవమానించటం, భయాందోళనలు కలిగించటం, మానసిక హింస (సెక్షన్ 3(1)(x))	నేర స్వభావాన్ని బట్టి ప్రతి బాధితునికి 25,000 రూపాయలు చెల్లించాలి. కోర్టులో చార్జిషీటు పెట్టేటప్పుడు 25%, మిగతా మొత్తాన్ని ముద్దాయికి శిక్ష పడినప్పుడు చెల్లించాలి.
11. 12.	స్త్రీని ఆమె అభిమానానికి భంగం కలిగేటట్లుగా చర్యలకి పాల్పడటం (సెక్షన్ 3(1)(xi)) స్త్రీని లైంగికంగా ఉపయోగించుకోవటం (సెక్షన్ 3(1)(xii))	నిందితులచే నేర చర్యకి గురైన ప్రతి బాధితునికి 50,000 రూపాయలు చెల్లించాలి. వైద్య పరీక్షల సమయంలో 50% మిగతా 50% నేర విచారణ పూర్తి అయిన తరువాత చెల్లించాలి.
13.	నీటిని కలుషితం చేయటం (సెక్షన్ 3(1)(xiii))	లక్షల రూపాయల వరకు లేదా కలుషిత నీటిని శుభ్రపరచటంతో సహా నీటి సదుపాయాన్ని పునరుద్ధరించే వరకు అయ్యే ఖర్చు, జిల్లా యంత్రాంగం నిర్ణయించిన సమయంలో డబ్బు చెల్లించాలి.
14.	రహదారులపై రాకపోకలకి సంబంధించిన సాంప్రదాయిక హక్కుల్ని నిరాకరించటం (సెక్షన్ 3(1)(xiv))	1,00,000 రూపాయల వరకు లేదా రహదారి హక్కుని పునరుద్ధరించేందుకు అయ్యే ఖర్చుతో పాటు, నష్టమేమైనా జరిగి ఉంటే, అందుకు నష్టపరిహారం మొత్తం చార్జిషీటు కోర్టుకి పంపేటప్పుడు 50%, కింది కోర్టులు నిందితులకి శిక్ష విధించేటప్పుడు మిగిలిన 50% చెల్లించాలి.
15.	ఎవరినైనా, వారు నివసించే ప్రదేశం నుండి వెళ్ళ గొట్టడం, (సెక్షన్ 3(1)(xv))	నివాస స్థలాన్ని లేదా నివాస హక్కుని పునరుద్ధరించటం, ప్రతి బాధితునికి 25,000 రూపాయల నష్ట పరిహారంతో బాటు, ఇల్లు, లేదా నివాసం ధ్వంసమైనట్లయితే ప్రభుత్వ ఖర్చుతో ఇంటిని నిర్మించటం, క్రింది కోర్టులో ఛార్జిషీటు పెట్టినప్పుడు నష్టపరిహారం మొత్తాన్ని చెల్లించాలి.

నెం.	నేరం	నష్టపరిహారం
16.	తప్పుడు సాక్ష్యం ఇవ్వటం, ఆస్తుల ధ్వంసం (సెక్షన్ 3(2)(1)) మరియు (iv)	కనీసం లక్ష రూపాయలు లేదా ఎంత మేరకు నష్టానికి గురైతే అంత మొత్తం నష్ట పరిహారం చెల్లించాలి. కోర్టుకు ఛార్జిషీటు పంపినప్పుడు 50%, మిగతా 50% నిందితులకి కింది కోర్టు శిక్ష విధించినప్పుడు చెల్లించాలి.
17.	భారత శిక్షాస్మృతి ప్రకారం 10 సంవత్సరాలు లేదా అంతకు మించి శిక్షపడే నేరాలకి పాల్పడినప్పుడు (సెక్షన్ 3(2)(v))	నేర స్వభావం, తీవ్రతని బట్టి ప్రతి బాధితునికి లేదా అతనిపై ఆధారపడ్డ వారికి కనీసం 50,000 వరకు చెల్లించాలి. షెడ్యూల్‌లో దీనితో పాటు ఇతర అంశాల గురించి ప్రత్యేకించి పేర్కొన్నట్లయితే, అప్పుడు చెల్లించే నష్ట పరిహారంలో కూడా తేడాలుంటాయి.
18.	ప్రభుత్వ ఉద్యోగి వలన ఇబ్బందులకి గురికావటం (సెక్షన్ 3(2)(vii))	నష్టాన్ని బట్టి అంతేస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలి. కోర్టులు ఛార్జిషీటు పెట్టినప్పుడు 50%, మిగతా 50% నిందితులకి కింది కోర్టులు శిక్ష విధించినప్పుడు చెల్లించాలి.
19. (ఎ) (i)	అంగవైకల్యం 100% శక్తి సామర్థ్యాలు కోల్పోవటం కుటుంబంలో సంపాదించే వ్యక్తి కానప్పుడు	కనీసం లక్ష రూపాయలు బాధితునికి చెల్లించాలి. ఎఫ్.ఐ.ఆర్. కట్టినప్పుడు 50%, చార్జిషీట్ కట్టినప్పుడు 25%, మరియు క్రింది కోర్టు నిందితునికి శిక్ష విధించినప్పుడు 25% చెల్లించాలి.
(ii)	కుటుంబంలో సంపాదించే వ్యక్తి అయినప్పుడు	కనీసం 2,00,000 రూపాయలు బాధితునికి చెల్లించాలి. ఎఫ్.ఐ.ఆర్. మరియు మెడికల్ పరీక్ష సమయంలో 50% చార్జిషీట్ కోర్టుకు పంపేటప్పుడు 25%, మరియు క్రింది కోర్టు నిందితునికి శిక్ష విధించినప్పుడు 25% చెల్లించాలి.

నెం.	నేరం	నష్టపరిహారం
(బి)	100% శక్తిహీనులైనచో	పైన తెలిపిన ఎ(i) మరియు ఎ(ii) లో నిర్ణయించిన ప్రకారం శాతాన్ని బట్టి చెల్లించ వచ్చు. డబ్బు చెల్లించే విధానం కూడా ఎ(i), ఎ(ii) లు పేర్కొన్న విధంగా ఉంటుంది. పోషించే శక్తిలేని వ్యక్తి 15,000 రూపాయలు పోషించే వ్యక్తికి 30,000 రూపాయలు తక్కువ కాకుండా చెల్లించాలి.
20.	హత్య / మరణం	కనీసం ప్రతి కేసుకు, 1,00,000 రూపాయలు 75% పోస్టుమార్టము తర్వాత చెల్లించాలి. మరియు 25% క్రింది కోర్టు శిక్ష విధించిన తర్వాత చెల్లించాలి.
(ఎ)	కుటుంబంలో సంపాదించే వ్యక్తి కానప్పుడు	కనీసం 2,00,000 రూపాయలు, 75% పోస్టుమార్టము తర్వాత చెల్లించాలి. మరియు
(బి)	కుటుంబంలో సంపాదించే వ్యక్తి అయినప్పుడు	25% క్రింది కోర్టు శిక్ష విధించిన తర్వాత చెల్లించాలి.
21.	బాధితులు హత్య, మరణం, మారణ కాండ, అత్యాచారం, సామూహిక అత్యాచారం, శాశ్వతంగా శక్తిహీనత్వం మరియు దోపిడీకి గురైనచో	పైన తెలిపిన వాటికి అదనంగా ధన సహాయం చేయాలి. అత్యాచారం జరిగిన తేదీ నుండి 3 నెలలలోపు సహాయం చేయాలి. (i) వారిపై ఆధారపడిన వితంతువు లేక వ్యక్తులు అయిన ఎస్సీ, ఎస్టీలకు నెలకి 1,000 రూ।లు పెన్షన్ అందించాలి. కుటుంబంలోని ఒక వ్యక్తికి ఉద్యోగం, వ్యవసాయ భూమి, బిల్లు అవసరం అయినచో వెంటనే కొని వారికి అందించాలి. (ii) బాధితుల పిల్లలకి విద్యకి అవసరమైన పూర్తి మొత్తాన్ని అందివ్వాలి. వారి పిల్లల్ని గురుకుల/ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించాలి. (iii) అవసరమైన బియ్యం, గోధుమలు, పప్పులు మరియు నిత్యావసర సరుకులు 3 నెలలకి సరిపడా అందివ్వాలి.
22.	ఇండ్లని పూర్తిగా నాశనం చేసినచో, కాల్చివేసినచో	ఇటుకలు/ లేక రాళ్ళతో కట్టిన ఇంటిని నిర్మించి లేదా పూర్తిగా ప్రభుత్వ ధనంతో కాలిపోయిన లేదా తగలబడిన ఇండ్లని నిర్మించాలి.

3. పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1955

ఈ చట్టం అస్పృశ్యతను బోధించినా, అవలంభించినా, ఆచరించినా వారిని శిక్షించుటకు ఉద్దేశించబడినది.

1. చట్టం పేరు, పరిధి, అమలు తేది :

1. పౌరహక్కుల పరిరక్షణ చట్టం 1955 గా ఈ చట్టాన్ని పిలవవచ్చు.
2. భారతదేశం మొత్తానికి ఈచట్టం వర్తిస్తుంది.
3. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన తేదీ నుంచి ఈ చట్టం అమలులోకి వస్తుంది.

2. నిర్వచనాలు :

సందర్భానుసారం మినహా ఈ చట్టంలోని పదాలకు అర్థాలు ఈ విధంగా వుంటాయి.

ఎ) 'పౌరహక్కు' అనగా ఏ వ్యక్తికయినా రాజ్యాంగంలోని అధికరణం 17 ప్రకారం అస్పృశ్యతను శాసనపరంగా నిర్మూలించే హక్కు కలిగి వుండడం.

ఎఎ) 'హోటల్' అనగా విశ్రాంతి తీసుకొను గదులు, లాడ్జిలు, కాఫీ మరియు తినుబండారాలు అమ్మే ప్రదేశాలు.

బి) 'స్థలము' అనగా ఇల్లు, భవనం, ఇతర కట్టడాలు, పరిసరాలు, గుడారాలు, వాహనాలు, ఓడలు.

సి) 'బహిరంగ వినోద స్థలాలు' అనగా ప్రజలకు వినోదం కలిగించే ప్రదేశాలు.

వివరణ : 'వినోదం' అనగా ప్రదర్శనలు, ఆటలు, పాటలు, మరియు ఇతర వినోద కార్యక్రమాలు.

డి) 'బహిరంగ ప్రార్థనా స్థలాలు' అనగా మతాలకు సంబంధించిన ప్రార్థనాస్థలాలు, ఆ ప్రదేశాలలో ప్రార్థనలు నిర్వహించడం.

i) ప్రార్థనా స్థలాలకు సంబంధించిన భూములు మరియు అనుబంధ ప్రదేశాలు.

ii) వ్యక్తులకు సంబంధించిన ప్రార్థనా స్థలాన్ని ప్రజలు ప్రార్థించు కొనుటకు అవకాశం కల్పించుట.

iii) అలాంటి వ్యక్తిగత స్థలాలను బహిరంగ ప్రార్థనా స్థలాలుగా పరిగణించవచ్చు.

డిఎ) 'నిర్ణయించబడిన' అనగా ఈ చట్టంలోని నిబంధనలను అనుసరించి.

డిబి) 'షెడ్యూల్డు కులాలు' అనగా రాజ్యాంగంలోని అధికరణం 366 (24) లో నిర్వచించిన కులాలు.

ఇ) 'దుకాణం' అనగా సరుకులను పెద్ద మొత్తంలో లేదా చిన్న మొత్తంలో అమ్మే ప్రదేశం.

i) వీధుల్లో, తోపుడు బండ్లపై, వాహనాలపై ఏ ప్రదేశాల్లోనైనా సరుకులను అమ్మడం.

ii) ఇస్త్రీ చేయు ప్రదేశాలు మరియు జుట్టు కత్తిరించు ప్రదేశాలు

iii) ఏ సేవలనైనా అందించు స్థలం

3. 'అంటరానితనం' కారణంగా మతపరమైన ఆంక్షలు విధించు వారికి శిక్షలు :

ఎ) అదే మతాన్ని పాటించు ఏ వ్యక్తినయినా బహిరంగ ప్రార్థనా స్థలాలలోనికి రానివ్వకుండా నిషేధించుట.

బి) బహిరంగ ప్రార్థనా ప్రదేశాలలో ప్రార్థనలు చేయనివ్వక పోవడం లేదా మత పరమైన ఇతర సేవలను చేయనివ్వక పోవడం పవిత్రమైన చెరువులు, నదులు, బావుల్లో స్నానాలు చేయనివ్వక పోవడం. ఇతర వ్యక్తులను అనుమతిస్తూ అంటరానితనం నెపంతో కొంతమంది వ్యక్తులను అనుమతించకపోవడం.

వివరణ : ఈ సెక్షను మరియు సెక్షను 4 ప్రకారం బౌద్ధులు, సిక్కులు, జైనులు, వీరశైవులు, లింగాయతులు, ఆదివాసీలు, బ్రహ్మ, ప్రస్థాన, తాన, ఆర్య సమాజ మరియు స్వామి నారాయణ సాంప్రదాయాలను అనుసరించేవారిని హిందువులుగా పరిగణిస్తారు.

4. సామాజిక పరమైన అంశాలపై ఆంక్షలు విధించువారికి శిక్షలు :

'అంటరాని తనం' నెపంతో ఏ వ్యక్తిపైన అయినా కింద ఉదహరించిన కారణాల వల్ల అభ్యంతరాలు తెలియపరిస్తే :

i. ఏదైనా దుకాణం, బహిరంగంగా తినుప్రదేశాలు, హోటళ్లు, వినోద ప్రదేశాలలోనికి నిషేధించడం.

ii. బహిరంగంగా తిను ప్రదేశాలలోని ప్లేట్లు, గ్లాసులు మరియు వంట సామాగ్రిని, హోటళ్ళు, ధర్మశాలలు లాంటి ప్రదేశాలలో ప్రజలను కాని లేదా కొంతమంది ప్రజలను కాని నిషేధించడం.

iii. ఏవైనా వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాలు చెయ్యకుండా నిషేధించుట.

iv. ప్రజలు వాడుకొను నదులు, చెరువులు, బావులు, నీళ్ళ పంపులు, చేతి పంపులు, స్నాన వాటికలు, స్మశానాలు, మరుగుదొడ్లు, రోడ్లు మరియు ఇతర బహిరంగ ప్రదేశాల్లో కొంతమందిని నిషేధించడం.

v. ప్రభుత్వ నిధులతో చేపట్టే సేవా కార్యక్రమాల నుంచి కొంతమంది వ్యక్తులను నిషేధించడం.

vi. ప్రజలకు సేవలను అందించుట కొరకు ఏర్పాటు చేయబడిన సేవాసంస్థల సేవలను కొంతమంది వ్యక్తులకు అందకుండా చేయడం.

vii. ప్రజల కొరకు నిర్ధారించిన రవాణా సౌకర్యాలను నిషేధించడం.

viii. ఏ ప్రదేశంలోనైనా గృహ నిర్మాణం కొనుగోలు, నివాసాలను నిషేధించడం.

ix. ప్రజల కొరకు నిర్ధారించబడిన ధర్మశాలలు, సరాయిలు మరియు ముసాఫిర్ ఖానాలలో ప్రవేశాన్ని నిషేధించుట.

x. సామాజిక పరమైన లేదా మతపరమైన ప్రదర్శనలను నిషేధించడం.

xi. నగల వినియోగాన్ని నిషేధించడం.

పైన పేర్కొనబడిన అంశాలన్నింటికి సంబంధించి, శిక్ష నెల నుంచి ఆరు నెలల వరకు సాధారణ జైలు శిక్ష మరియు రూ॥ 100 నుంచి రూ॥ 500 ల వరకు జరిమానా విధించబడును.

5. అంటరానితనం పేరుతో ఏ వ్యక్తినయినా ఆసుపత్రి లోపలికి అనుమతించని ఎడల కలుగు శిక్ష:

ఎ) సామాన్య ప్రజల కొరకు స్థాపించబడిన ఆసుపత్రులు, విద్యా సంస్థలు, హోటళ్ళు, వసతి గృహాల్లోనికి ఏ వ్యక్తినయినా అనుమతించకపోయినట్లైతే.

బి) సంబంధిత సంస్థలు ఏవ్యక్తిపట్లనయినా వివక్ష చూపినచో పైన పేర్కొనబడిన అంశాలకు సంబంధించిన శిక్ష :

ఒకనెల తగ్గకుండా ఆరునెలలు మించకుండా సాధారణ జైలుశిక్ష మరియు రూ॥ 100 ల కంటే పైన లేదా రూ॥ 500 లు మించకుండా జరిమానా విధించవచ్చు.

6. వస్తువుల అమ్మకం లేదా సేవలను నిరాకరించినచో శిక్ష :

వస్తువులను అమ్మిట విషయంలో లేదా సేవలను నిరాకరించడంలో అంటరానితనాన్ని పాటించినట్లయితే శిక్షార్హులు.

శిక్ష : నెలనుండి ఆరునెలల వరకు సాధారణ జైలుశిక్ష మరియు రూ॥ 100 నుండి రూ॥ 500 ల వరకు జరిమానా విధించబడును.

7. అంటరాని తనం వలన ఉత్పన్నమయ్యే ఇతర నేరాలకు శిక్ష :

1. ఎ) రాజ్యాంగంలోని 17వ అధికరణం ప్రకారం వచ్చే ఏ హక్కు నయినా అంటరానితనం పేరుతో నిరోధిస్తే.

బి) అవమాన పరచినా, గాయపరచినా, కించపరచినా, అడ్డుకున్నా మరియు ఇతర హక్కులను పొందకుండా చేసినా, బహిష్కరించినా.

సి) అంటరానితనాన్ని పాటించే విధంగా మాటల ద్వారాగాని, రాత ద్వారాగాని, సైగల ద్వారా గాని మరే ఇతర పద్ధతుల ద్వారా గాని ప్రోత్సహించినా.

డి) అంటరానితనం పేరుతో ఎవరైనా షెడ్యూల్డు కులాల వ్యక్తిని అవమానించినా అవమానించే ప్రయత్నం చేసినా.

శిక్ష : నెల నుండి ఆరునెలల వరకు సాధారణ జైలుశిక్ష మరియు రూ॥ 100 ల నుండి రూ॥ 500 ల వరకు జరిమానా.

వివరణ 1 : 'ఒక వ్యక్తి మరోవ్యక్తిని బహిష్కరించుట' అనగా,

ఎ) ఒక వ్యక్తి మరొకవ్యక్తిని ఏదైనా ఇల్లును, భూమిని ఉపయోగించుటకు, లేదా అద్దెకు, వ్యాపకానికి, ఆచారాలు పాటించుటకు, లేదా సామాన్య ప్రజలు చేయు పనులు చేయడానికి నిరాకరించినా

బి) ఇతర వ్యక్తులతో సామాన్యముగా కలిగివుండే సామాజిక, ఉద్యోగ వ్యాపార పరమైన సంబంధాలను నిరాకరించినా బహిష్కరణ అవుతుంది.

వివరణ 2 : ప్రకారం ఏ వ్యక్తి అయినా అంటరానితనాన్ని ప్రోత్సహించడం లేదా పాటించడం అంటే :

i. ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని అంటరానితనాన్ని ఏరూపంలో అయినా బోధించినా లేదా పాటించినా.

ii. చారిత్రాత్మకంగా, మతపరంగా, ఆచారపరంగా, తత్వపరంగా అంటరానితనం న్యాయమని భావించినా.

1.ఎ) రాజ్యాంగంలోని అధికరణం 17 ప్రకారం అంటరానితనం నిర్మూలన హక్కులను ఒక వ్యక్తి సాధించుకున్న కారణంగా ఆ వ్యక్తిపై లేదా ఆ వ్యక్తి ఆస్తిపై కక్ష సాధింపు చర్యకు పాల్పడితే అటువంటి నేరానికి రెండు సంవత్సరాలు కంటే ఎక్కువ సాధారణ జైలుశిక్ష మరియు జరిమానా.

2. ఏ వ్యక్తి అయినా –

i. ఒక సమూహానికి చెందిన వ్యక్తి పొందవలసిన హక్కులను నిరాకరించడం.

ii. అంటరానితనాన్ని పాటించని కారణంగా ఒక వ్యక్తిపై చేపట్టే ఎటువంటి చర్య అయినా.

అటువంటి నేరాలకు నెల నుండి ఆరునెలల వరకు సాధారణ జైలుశిక్ష మరియు 100 నుండి రూ॥ 500 ల వరకు జరిమానా.

7 ఎ. చట్ట వ్యతిరేకమైన నిర్భందపు పని ఈ క్రింది పరిస్థితులలో అంటరానితనం కింద పరిగణించ బడుతుంది :

1. ఎవరైనా వ్యక్తిచేత అంటరానితనం పేరుతో బలవంతంగా పాకీపని, మృతకళేబరాలు తీయించడం, బొడ్డుతాడు తీయించడం, వ్యర్థపదార్థాలు తొలగించడం లాంటి పనులు చేయించినా.
2. సబ్ సెక్షన్ (1) ప్రకారం అంటరానితనాన్ని పాటించిన వారిపై మూడు నెలల నుండి ఆరు నెలల వరకు సాధారణ జైలుశిక్ష మరియు వంద నుండి రూ॥ 500 ల జరిమానా.

వివరణ : 'బలవంత పెట్టడం' అనగా సామాజిక లేదా ఆర్థిక బహిష్కరణ.

8. కొన్ని సందర్భాలలో లైసెన్సుల రద్దు లేదా నిలిపివేత :

ఏదైనా వృత్తి, వ్యాపారానికి సంబంధించిన లైసెన్సులను ఈ చట్టంలోని సెక్షన్ 6 కింద విచారణ చేయబడుతున్న వ్యక్తికి చెందినవైనచో, ఆ లైసెన్సులు మంజూరు చేసిన సంబంధిత అధికారుల అధికారాలను కోర్టు కలిగి వుంటుంది. ఈ విషయానికి సంబంధించి కోర్టు నిరభ్యంతరంగా లైసెన్సులను రద్దు లేదా నిలిపివేసే అధికారం కలిగివుంటుంది.

వివరణ : 'లైసెన్సు' అనగా అనుమతి పత్రం లేదా అనుమతి.

9. ప్రభుత్వ నిధుల నిలిపివేత లేదా పునరుద్ధరణ :

ఏదేని ప్రభుత్వ నిధులతో నడపబడు ట్రస్టు లేదా ప్రార్థనా స్థలం లేదా విద్యా సంస్థ యాజమాన్యం ఈ చట్ట పరిధిలో విచారణ చేయబడుతూ పై కోర్టులో క్వాష్ లేదా అప్పీలు తిరస్కరించబడినచో, ఆ కేసు పూర్వాపరాలను బట్టి ప్రభుత్వ నిధులను లేదా గ్రాంటులను నిలిపివేసే లేదా పునరుద్ధరించే అధికారాలను ఈ సెక్షన్ కలిగి వుంటుంది.

10. నేరమును ప్రోత్సహించుట :

ఏ వ్యక్తి అయినా ఈ చట్టం కింద నిర్వహించిన నేరాలను ప్రోత్సహించినచో వారు ఈచట్టం కింద వర్తించే శిక్షకు అర్హులు.

వివరణ : ఈ చట్టం కింద ప్రభుత్వాధికారి చేపట్టే విచారణ ఉద్దేశ పూర్వకంగా నిర్లక్ష్యం చేసినచో వారిని ప్రోత్సాహకులుగా పరిగణించవచ్చు.

10 ఎ. సమష్ఠి జరిమానా విధించడంపై రాష్ట్ర ప్రభుత్వ అధికారాలు :

1. ఏదేని ఒక రాష్ట్ర ప్రభుత్వం తగిన ఆధారాలు కలిగి ఒక ఏరియాలోని వ్యక్తులపై సమష్టిగా జరిమానా విధించవచ్చు. ఈ జరిమానా ఈ చట్ట పరిధిలోని నేరాలను చేయుట వల్ల అటువంటి నేరస్థులకు రక్షణ కల్పించడం, సాక్ష్యాలను తారుమారు చేయడం, దాచిపెట్టడం, అటువంటి నేరాలను ప్రోత్సహించడం వల్ల వ్యక్తులపై జరిమానా విధించడం జరుగుతుంది. హైందవ ఉమ్మడి కుటుంబాలపై కూడా ఈ జరిమానా విధించవచ్చు. ఈ జరిమానా విధించబడిన వ్యక్తి సబ్ సెక్షన్ (3) క్రింద పిటీషన్ వేసుకున్నచో విచారణ పూర్తయిన తదుపరి జరిమానా విధించబడుతుంది.
2. సబ్ సెక్షన్ (1) కింద విధించబడిన సమష్టి జరిమానాను తెలియపరచుట కొరకు ప్రభుత్వం దండోరా ద్వారా కానీ ఇతర పద్ధతుల ద్వారా కానీ ఆ ప్రాంత ప్రజలకు తెలియపర్చవచ్చు.
3. ఎ. ఏ వ్యక్తి అయినా సబ్ సెక్షన్ (1) కింద విధించబడిన జరిమానా వల్ల బాధింపబడినట్లయితే ఆవ్యక్తి నిర్దేశిత సమయానికల్లా పిటీషన్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి కానీ లేదా ప్రభుత్వం సూచించిన ఏ అధికారికైనా కానీ వెయ్యాలి.

   అటువంటి పిటిషన్‌పై రుసుము వుండదు.

   బి. రాష్ట్ర ప్రభుత్వం పిటీషన్‌ను విన్న తర్వాత తగు ఉత్తర్వులను జారీచేయును. సదరు ఉత్తర్వుల ప్రకారం జరిమానా మాఫీ కావచ్చు లేదా తగ్గించవచ్చు.
4. రాష్ట్ర ప్రభుత్వం సబ్ సెక్షన్ (3) పరిధిలో నుండి ఏ వ్యక్తి అయినా నిర్దోషి అని నిర్ధారించిన తరువాత ఆ వ్యక్తిపై విధించిన జరిమానాని తొలగించవచ్చు.
5. సదరు జరిమానా ఏ వ్యక్తిపైన అయినా విధించబడినచో వారు హైందవ ఉమ్మడి కుటుంబం అయినచో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 ప్రకారం జరిమానా చెల్లించవలెను.

11. నేరం మరలా చేసినపుడు విధింపబడు అదనపు జరిమానా :

ఈ చట్టం కింద శిక్షను అనుభవిస్తున్న సమయంలో మరొక నేరం కింద తిరిగి శిక్షార్హులైనచో

ఎ) రెండవ నేరమునకు ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం వరకు సాధారణ జైలుశిక్ష మరియు రూ॥ 200 ల నుంచి రూ॥ 500 ల వరకు జరిమానా.

బి) మూడవ మరియు తదితర నేరములకు 1 సం॥ నుండి 2 సం॥ల వరకు జైలుశిక్ష మరియు 500 నుంచి 1000 రూ॥ల వరకు జరిమానా.

12. కొన్ని సందర్భాలలో కోర్టుల నిర్ధారణ :

షెడ్యూల్డు కులాలకు సంబంధించిన వ్యక్తిపై ఈచట్టం పరిధిలో ఏదైనా నేరం జరిగినచో దానిని ఎవరూ ప్రతిఘటించనిచో అటువంటి నేరమును అంటరానితనం కింద కోర్టు నిర్ధారిస్తుంది.

13. సివిల్ కోర్టుల పరిధులు :

1. సివిల్ కోర్టులు ఈ యాక్టులో వున్న సెక్షన్ నిబంధనలకు విరుద్దంగా రూలు, ఆర్డరు, డిక్రీ లేదా ఆర్డర్లు జారీ చేయరాదు.

2. ఒక వ్యక్తిమీద అంటరానితనాన్ని పరిగణిస్తూ తదనుగుణంగా ఎలాంటి డిక్రీ లేదా ఆర్డరును ఒక సాంప్రదాయ బద్ధంగా ఇవ్వరాదు.

14. కంపెనీలు చేసే నేరాలు :

1. ఏదైనా ఒక కంపెనీ ఈచట్టం కింద నేరం చేసినట్లయితే సదరు కంపెనీ లోని బాధ్యత వహించు వ్యక్తి శిక్షార్హులు. కానీ సదరు బాధ్యతాదారు ప్రమేయం లేనట్లు నిర్ధారించబడినా లేదా నేరం జరగకుండా తగు చర్యలు చేపట్టినా ఆ వ్యక్తి శిక్షకు అర్హులు కారు.
2. సబ్ సెక్షన్ (1) ప్రకారం కంపెనీ యొక్క డైరెక్టర్, సెక్రటరీ, మేనేజర్ యొక్క ప్రమేయంతో నేరం చేసినట్లయితే అటువంటివారు శిక్షార్హులు.

వివరణ :

ఎ) కంపెనీ అనగా సంఘము లేదా వర్తక సంఘము లేదా వ్యక్తుల సమూహము.

బి) వర్తక సంఘంలో డైరెక్టరు అనగా ఆ సంఘంలోని ఒక భాగస్వామి.

14ఎ. నమ్మికపై చేపట్టిన చర్యకు రక్షణ :

1. ఈచట్టం ప్రకారం నమ్మికతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేపట్టిన చర్యలకు వ్యతిరేకంగా ఎలాంటి విచారణ జరుగదు.
2. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈచట్టం పరిధిలో చేపట్టిన చర్యలకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించవలసిన అవసరం లేదు.

15. నేర విచారణ కోర్టుల బాధ్యత :

1. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 ప్రకారం అన్ని నేరాలు విచారించదగినవే. 3 నెలలు దాటి శిక్ష పడే నేరాలు తప్ప మిగతావన్నీ మొదటి తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ లేదా మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులలో విచారణ జరుగును.
2. దీనిలో భాగంగా ప్రభుత్వాధికారులు నేరం చేసినట్లయితే ఏకోర్టు విచారణ చేపట్టరాదు.

ఎ. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగయినట్లయితే

బి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగయినట్లయితే

15ఎ. ఏ వ్యక్తి అయితే అంటరానితనానికి గురవుతారో ఆ వ్యక్తికి సంక్రమించు హక్కులను పరిరక్షించు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది.

1. కేంద్ర ప్రభుత్వము చేయు నిబంధనలకు లోబడి అంటరానితనం నిర్మూలనా చట్టం ప్రకారం బాధితులకు సంక్రమించాల్సిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది.
2. సబ్ సెక్షన్ (1) లోని నిబంధనల ప్రకారం ఈ దిగువ చర్యలను చేపట్టవచ్చు.

i) అంటరానితనానికి గురైన వ్యక్తికి న్యాయ సహాయంతో సహా ఇతర సౌకర్యాలను హక్కుల పరిరక్షణలో భాగంగా కల్పించాలి.

ii) ఆఫీసర్లను నియమించి విచారణ విధానాలను పర్యవేక్షించడం.

iii) ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయుట.

iv) ఆయాస్థాయిల్లో కమిటీలను ఏర్పాటుచేసి వాటిద్వారా ఈచట్టం అమలు కొరకు రాష్ట్ర ప్రభుత్వానికి సహకారమందించుట.

v) చట్టం సరిగా అమలవ్వడం కోసం నిర్ధారిత సమయాల్లో సర్వేలు నిర్వహించడం.

vi) అంటరానితనం ప్రభావిత ప్రాంతాలను గుర్తించి నిర్మూలన కొరకు తగిన చర్యలు చేపట్టుట.

3. సబ్ సెక్షన్ (1) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే చర్యలకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తుంది.

4. ప్రతి సంవత్సరము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈచట్టం అమలుపై తాము చేపట్టిన చర్యలపై వార్షిక నివేదికను పార్లమెంటు ఉభయ సభలకు సమర్పిస్తుంది.

16. ఇతర చట్టాలకు భిన్నంగా చేయబడిన చట్టం :

ఇప్పటి వరకు వున్న చట్టాలలో అంటరానితనంపై వున్న అస్పష్టతను తొలగిస్తూ మరింత పరిష్టంగా అమలు జరపడం కోసం ఈచట్టాన్ని అమలులోకి తీసుకురావడం జరిగింది.

16 ఎ. ప్రొబెషన్ ఆఫ్ అఫెండర్స్ యాక్ట్ 1958 :

ఈ చట్ట ప్రకారం నేరం చేసిన వ్యక్తి 14 ఏళ్ళు పైబడినట్లయితే ఈ చట్టం వర్తిస్తుంది.

16 బి. నిబంధనలు చేయు అధికారం :

1. కేంద్ర ప్రభుత్వం ఈచట్టం అమలు కొరకు నిబంధనలు చేసే అధికారం కలిగివుంది.

2. ఈ నిబంధన పార్లమెంటు ఉభయసభల్లో ఆమోదం పొందిన తరువాత మాత్రమే ఆచరణలోనికి వస్తుంది.

*****

4. జాతీయ షెడ్యూల్డు కులాల కమీషన్ 2003

1. రాజ్యాంగంలోని అధికరణం 338 ని సవరిస్తూ అధికరణం 338 A ని కొత్తగా జోడిస్తూ 89 వ సవరణల చట్టం ద్వారా 2003 వ సంవత్సరములో జాతీయ షెడ్యూల్డు కులాల / తెగల కమీషన్ అమలులోకి వచ్చింది. ఫిబ్రవరి 19, 2004 న వీటిని విభజిస్తూ అనగా జాతీయ షెడ్యూల్డు కులాల కమీషన్, జాతీయ షెడ్యూల్డు తెగల కమీషన్‌గా ఏర్పాటు చేశారు.

2. జాతీయ షెడ్యూల్డు కులాల కమీషన్ – పని విధానం :

జాతీయ షెడ్యూల్డు కులాల కమీషన్ కేంద్ర కార్యాలయం న్యూఢిల్లీలో ఉంటుంది. ఈ కమీషన్‌కు 12 రాష్ట్ర కార్యాలయాలు వున్నాయి. ఈ రాష్ట్ర కార్యాలయాల ద్వారా వివిధ రాష్ట్రాలలోను, కేంద్రపాలిత ప్రాంతాలలోను షెడ్యూల్డు కులాల సంక్షేమం కొరకు రూపొందిస్తున్న విధానాలు మరియు మార్గదర్శకాలపై దృష్టిసాధించి వాటియొక్క పురోభివృద్ధిపై కమీషన్‌కు తెలియపర్చుట. షెడ్యూల్డు కులాల సంక్షేమానికి అవరోధం కల్పిస్తూ వివిధ రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలు చేసే విధాన నిర్ణయాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి అవసరమైన చర్యలు చేపట్టే విధంగా చూడటం. కమీషన్ రాష్ట్రపతికి సమర్పించే నివేదికలో షెడ్యూల్డు కులాల సంక్షేమం మరియు పరిరక్షణ కొరకు చేపట్టిన వివిధ పథకాల అమలు మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవలసిన జాగ్రత్తలను సూచిస్తూ వీరి సామాజిక, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం మరియు రక్షణకు అవసరమైన సూచనలు చేస్తుంది. ఈ నివేదికలను పార్లమెంట్ ఉభయ సభలకు సమర్పిస్తారు. సంబంధిత అంశం ఏదైన రాష్ట్రానికి చెందినదైతే ఆ నివేదిక నకలును ఆ రాష్ట్ర గవర్నర్‌కు పంపించి ఆ రాష్ట్ర శాసన సభకు సమర్పించేటట్టు చూస్తారు.

3. కమీషన్ యొక్క విధులు మరియు నియమాలు :

భారత రాజ్యాంగంలోని అధికరణం 338 ప్రకారం కమీషన్‌కు ఈ దిగువ ఉదహరించిన విధులను మరియు నియమాలను నిర్ణయించడమైనది.

a) షెడ్యూల్డు కులాల వారికి రాజ్యాంగం ప్రకారం మరియు ఇతర చట్టాల ప్రకారం సంక్రమించిన పరిరక్షక అంశాలను పరిశోధించడం మరియు పర్యవేక్షించడం ఈ పరిరక్షక అంశాలు పని తీరును మూల్యాంకనం చేయుట

b) షెడ్యూల్డు కులాల వారి హక్కులు మరియు పరిరక్షక అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను విచారించుట

c) షెడ్యూల్డు కులాల వారికి సంబంధించిన సామాజిక, ఆర్థికాభివృద్ధి ప్రణాళిక ప్రక్రియలో పాల్గొని తగు సూచనలు చేయుట. కేంద్ర పాలిత ప్రాంతాలలోను మరియు ఇతర రాష్ట్రాలలో వారి అభివృద్ధిని మూల్యాంకనం చేయుట.

d) షెడ్యూల్డు కులాల వారి సామాజిక ఆర్థికాభివృద్ధి కొరకు నిర్ధారించబడిన వివిధ సంక్షేమ పథకాల అమలు మరియు ఇతర అంశాలపై తమ వార్షిక నివేదికను సమయానుకూలంగా రాష్ట్రపతికి సమర్పిస్తారు.

e) షెడ్యూల్డు కులాల రక్షణ, సంక్షేమం, సామాజిక – ఆర్థికాభివృద్ధి మరియు ఇతర సంరక్షణాంశాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్టంగా అమలు చేయుటకోసం, సూచనలను చేపట్టవలసిన చర్యలపై నివేదికలను రూపొందించుట

f) రాష్ట్రపతి అప్పగించిన పార్లమెంట్ చేసిన శాసనాల ద్వారా సంక్రమించిన విధులకు అనుగుణంగా షెడ్యూల్డు కులాల రక్షణ, సంక్షేమం, అభివృద్ధి మరియు వారిని పైస్థాయిలోకి తీసుకురావడం కొరకు అవసరమైన చర్యలు చేపట్టుట

4. కమీషన్ యొక్క అధికారాలు :

క్లాజ్ 5 లోని సబ్‌క్లాజ్ (a) అంశాలకు సంబంధించి విచారణ చేపట్టిన మరియు సబ్‌క్లాజ్ (b) లో ఉదహరించిన ప్రకారం ఫిర్యాదుల విచారణకు సంబంధించి కమీషన్‌కు సివిల్ కోర్టులతో సమానంగా క్రింది అంశాలపై అధికారాలు కలిగి ఉంటుంది.

a) వ్యక్తులను హాజరు పరిచి విచారించుట

b) అవసరమైన పత్రాలను సంపాదించి సమర్పించుట

c) అఫిడవిట్‌ల ద్వారా సాక్ష్యాలను సేకరించుట

d) ఏదైనా కోర్టు లేదా కార్యాలయం నుంచి ఏదైనా రికార్డ్‌ను లేదా నకళ్ళను పొందవచ్చు

e) సాక్షులు మరియు పత్రములను పరిశీలించుటకు సమన్లు / సమాచారం జారీ చేయుట

f) నిబంధనలు ప్రకారం రాష్ట్రపతికి అప్పగించిన ఏ అంశాన్నైనా పరిశీలించుట

షెడ్యూల్డ్ కులాల కమీషన్ యొక్క నియమాలు 2004

1. పేరు మరియు ప్రారంభ తేది :

1. ఈ నియమాలను జాతీయ షెడ్యూల్డు కులాల కమీషన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు సభ్యుల నియమాలు 2004 గా పిలవవచ్చు.

2. 89 వ రాజ్యాంగ సవరణ అమలులోకి వచ్చిన నాటినుండి ఈ నియమాలు అమలులోకి వస్తాయి.

2. నిర్వచనాలు :

సందర్భంలో నేరుగా ఉదహరిస్తే తప్ప చట్టంలోని పదాల అర్థాలు :

1. 'అధికరణం' అనగా రాజ్యాంగంలోని అధికరణం

2. 'అధ్యక్షులు' అనగా కమీషన్ యొక్క అధ్యక్షులు

3. 'కమీషన్' అనగా అధికరణం 338 A ప్రకారం ఏర్పాటైన జాతీయ షెడ్యూల్డు కులాల కమీషన్

4. 'సభ్యులు' అనగా కమీషన్ సభ్యులు

5. 'షెడ్యూల్డు కులాలు' అనగా అధికరణం 366 లోని క్లాజ్ 24 లో ఉదహరించిన రీతిగా

6. 'ఉపాధ్యక్షులు' అనగా కమీషన్ ఉపాధ్యక్షులు.

3. అర్హతలు :

1. షెడ్యూల్డు కులాల వారి అభ్యున్నతి కొరకు నిస్వార్థ సేవలు అందించిన, శక్తి సామర్థ్యాలు, నీతి నిజాయితీలు కలిగిన వ్యక్తులను అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు సభ్యులుగా నియమిస్తారు.
2. సబ్‌రూల్ (1) లోని నిబంధనలకు లోబడి :

   A. షెడ్యూల్డు కులాలకు సంబంధించి ప్రముఖ సామాజిక, రాజకీయ కార్యకర్తలను అధ్యక్షులుగా నియమించవచ్చు. అట్టి వ్యక్తి తన సేవల ద్వారా షెడ్యూల్డు తెగల వ్యక్తులలో విశ్వాసాన్ని పెంపొందించాలి.

   B. ఉపాధ్యక్షులుగా మరియు సభ్యులుగా కనీసం ఇద్దరిని షెడ్యూల్డు తెగలకు సంబంధించిన వ్యక్తులను నియమించాలి.

   C. సభ్యులలో కనీసం ఒకరు మహిళయై వుండాలి.

4. ఆఫీసు కాలపరిమితి :

1. నియమాలలో ఉదహరించిన రీతిగా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు సభ్యులు వారి కార్యాలయంలో పని ప్రారంభించిన నాటినుండి మూడు సంవత్సరముల వరకు పదవిలో వుండాలి.
2. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు సభ్యులు రెండుసార్లు కంటే ఎక్కువసార్లు ఆ హోదాలో నియమితులు కాకూడదు.

*****

5. జాతీయ షెడ్యూల్డు తెగల కమీషన్ 2004

1. రాజ్యాంగంలోని అధికరణం 338ని సవరిస్తూ అధికరణం 338 A ని కొత్తగా జోడిస్తూ 89 వ సవరణల చట్టం ద్వారా 2003 వ సంవత్సరములో జాతీయ షెడ్యూల్డు కులాల / తెగల కమీషన్ అమలులోకి వచ్చింది. ఫిబ్రవరి 19, 2004 న వీటిని విభజిస్తూ అనగా జాతీయ షెడ్యూల్డు తెగల కమీషన్, జాతీయ షెడ్యూల్డు కులాల కమీషన్‌గా ఏర్పాటు చేశారు.

2. జాతీయ షెడ్యూల్డు తెగల కమీషన్ కేంద్ర కార్యాలయం న్యూ ఢిల్లీలో ఉంటుంది. కమీషన్‌కు ఆరు ప్రాంతీయ కార్యాలయాలను ఆరు రాష్ట్రాలలో నెలకొల్పడమైనది. ఈ ఆరు ప్రాంతీయ కార్యాలయాలు కమీషన్‌కు అతి ముఖ్యమైనవి. ఇవి వాటికి కేటాయించిన రాష్ట్రంలో జరిగే ప్రక్రియను, విధానపరమైన నిర్ణయాలను మరియు షెడ్యూల్డు తెగల వారికి సంబంధించిన ఇతర అంశాలను పరిశీలిస్తూ, పర్యవేక్షిస్తూ కేంద్ర కార్యాలయానికి నివేదికలు పంపిస్తుంది. కేంద్ర కార్యాలయంలో ఈ దిగువ శాఖలు పనిచేస్తుంటాయి.

1. పరిపాలన
2. సమన్వయ విభాగం
3. పరిశోధన విభాగం – I
4. పరిశోధన విభాగం – II
5. పరిశోధన విభాగం – III
6. పరిశోధన విభాగం – IV

పరిశోధన విభాగాలు I – IV చాలా ప్రధానమైన కార్యనిర్వాహక విభాగాలు. ఈ విభాగాలు తమకు కేటాయించిన ప్రాంతాలలోని షెడ్యూల్డు తెగల జాతులకు సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన అభివృద్ధి, ఉద్యోగ పరమైన భద్రత అంశాలను పరిశీలిస్తుంది.

3. కమీషన్ విధులు :

1. షెడ్యూల్డు తెగల వారికి రాజ్యాంగం ప్రకారం మరియు ఇతర చట్టాల ప్రకారం సంక్రమించిన పరిరక్షక అంశాలను పరిశోధించడం మరియు పర్యవేక్షించడం, ఈ పరిరక్షణ అంశాల పనితీరును మూల్యాంకనం చేయుట.
2. షెడ్యూల్డు తెగలవారి హక్కులు మరియు పరిరక్షణ అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించుట.
3. షెడ్యూల్డు తెగలవారికి సంబంధించిన సామాజిక, ఆర్థికాభివృద్ధి ప్రణాళిక ప్రక్రియలో పాల్గొని పలు సూచనలు చేయుట, కేంద్రపాలిత ప్రాంతంలోను మరియు ఇతర రాష్ట్రాలలో వారి అభివృద్ధిని మూల్యాంకనం చేయుట.
4. షెడ్యూల్డు తెగలవారి సామాజిక, ఆర్థికాభివృద్ధి కొరకు నిర్ధారించబడిన వివిధ సంక్షేమ పథకాల అమలు మరియు ఇతర అంశాలపై తమ వార్షిక నివేదికను సమయానుకూలంగా అధ్యక్షుల వారికి సమర్పించుట.

5. పార్లమెంట్ ఉభయసభలు చేసిన చట్టాలు మరియు నిబంధనల ప్రకారం షెడ్యూల్డు తెగలవారికి సంబంధించిన మరియు ఇతర విధులను అధ్యక్షులు వారికి అప్పగించిన వాటిని నిర్వహించుట.
6. షెడ్యూల్డు తెగలవారి రక్షణ, సంక్షేమం, అభివృద్ధి మరియు పురోగతికి సంబంధించిన ఇతర విధులను కూడా కమీషన్ నిర్వహిస్తుంది.

4. కమీషన్ యొక్క అధికారాలు : (రాజ్యాంగంలోని అధికరణ 338 A లోని క్లాజ్ 8 ప్రకారం)

1. విచారణ చేయుట కొరకు కమీషన్ సివిల్ కోర్టుతో సమానంగా అధికారాలు కలిగి ఉంటుంది :

A) వ్యక్తులను హాజరుపరిచి విచారించుట

B) అవసరమైన పత్రాలను సంపాదించి సమర్పించుట

C) అఫిడవిట్‌ల ద్వారా సాక్ష్యాలను స్వీకరించుట

D) ఎదైనా కోర్టు లేదా కార్యాలయం నుంచి ఏదైనా రికార్డ్‌ను లేదా నకళ్ళను పొందవచ్చు

E) సాక్ష్యాలు మరియు పత్రములను పరిశీలించుటకు కమీషన్‌లను జారీచేయుట

F) నిబంధనల ప్రకారం అధ్యక్షుల వారికి అప్పగించిన ఏ అంశాన్నైనా పరిశీలించుట

జాతీయ షెడ్యూల్డు తెగల కమీషన్ నియమాలు 2004

1. పేరు మరియు ప్రారంభ తేది :

1) ఈ నియమాలను జాతీయ షెడ్యూల్డు తెగల కమీషన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు సభ్యుల నియమాలు, 2004 గా పిలవవచ్చు.

2) 89 వ రాజ్యాంగ సవరణ అమలులోకి వచ్చిన నాటినుండి ఈ నియమాలు అమలులోకి వస్తాయి.

2. నిర్వచనాలు :

సందర్భంలో నేరుగా ఉదహరిస్తే తప్ప చట్టంలోని పదాల అర్థాలు :

1) 'అధికరణం' అనగా రాజ్యాంగంలోని అధికరణం.

2) 'అధ్యక్షులు' అనగా కమీషన్ యొక్క అధ్యక్షులు.

3) 'కమీషన్' అనగా అధికరణం 338 A ప్రకారం ఏర్పాటైన జాతీయ షెడ్యూల్డు తెగల కమీషన్

4) 'సభ్యులు' అనగా కమీషన్ సభ్యులు

5) 'షెడ్యూల్డు తెగలు' అనగా అధికరణం 336 లోని క్లాజ్ 24 లో ఉదహరించిన రీతిగా

6) 'ఉపాధ్యక్షులు' అనగా కమీషన్ ఉపాధ్యక్షులు

3. అర్హతలు :

1) షెడ్యూల్డు తెగలవారి అభ్యున్నతి కొరకు నిస్వార్థ సేవలు అందించిన, శక్తిసామర్థ్యాలు, నీతి నిజాయితీలు కలిగిన వ్యక్తులను అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు సభ్యులుగా నియమిస్తారు.

2) సబ్‌రూల్ (1) లోని నిబంధనలకు లోబడి :

a షెడ్యూల్డు తెగలకు సంబంధించి ప్రముఖ సామాజిక, రాజకీయ కార్యకర్తలను అధ్యక్షులుగా నియమించవచ్చు. అట్టి వ్యక్తి తన సేవల ద్వారా షెడ్యూల్డు తెగల వ్యక్తులలో విశ్వాసాన్ని పెంపొందించాలి.

b ఉపాధ్యక్షులుగా మరియు సభ్యులుగా కనీసం ఇద్దరిని షెడ్యూల్డు తెగలకు సంబంధించిన వ్యక్తులను నియమించాలి.

c సభ్యులలో కనీసం ఒకరు మహిళయై ఉండాలి.

4. ఆఫీసు కాలపరిమితి :

1) నియమాలలో ఉదహరించిన రీతిగా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు సభ్యులు వారి కార్యాలయంలో పని ప్రారంభించిన నాటినుండి మూడు సంవత్సరముల వరకు పదవిలో ఉండాలి.

2) అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు సభ్యులు రెండుసార్లు కంటె ఎక్కువసార్లు ఆ హోదాలో నియమితులు కాకూడదు.

*****

6. జాతీయ మహిళా కమీషను చట్టం 1990

జాతీయ మహిళా కమీషనును ఈ చట్టం ద్వారా ఏర్పాటు చేస్తూ దీనికి సంబంధించిన అంశాలను పరిశీలించడం.

అధ్యాయం - I

ప్రాథమిక అంశాలు

1. పేరు, పరిధి, అమలు తేదీ :

1. ఈ చట్టాన్ని జాతీయ మహిళా కమీషను చట్టం 1990 గా పిలవవచ్చు.
2. జమ్మూ, కాశ్మీర్ మినహా ఈ చట్టం భారతదేశం యావత్తూ వర్తిస్తుంది.
3. కేంద్ర ప్రభుత్వం రాజపత్రంలో ఆమోదించిన తేది 30-8-1990 నుండి అమలులోకి వచ్చింది.

2. నిర్వచనాలు :

ఈ చట్టంలో సందర్భానుసారం, ఏమైనా మార్పులుంటే తప్ప.

ఎ. 'కమీషన్' అనగా సెక్షను 3 ప్రకారం ఏర్పాటు చేయబడిన జాతీయ మహిళా కమీషను.

బి. 'సభ్యులు' అనగా కమీషన్ సభ్యులు మరియు మెంబరు కార్యదర్శి.

సి. 'నిర్ధేశించబడిన' అనగా ఈ చట్టంలోని నియమాలలో నిర్ధేశించిన విధముగా

అధ్యాయం - II

జాతీయ మహిళా కమీషన్

3. జాతీయ మహిళా కమీషన్ ఏర్పాటు :

1. ఈ చట్టంలోని విధులు, బాధ్యతలు నిర్వహించుట కొరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ మహిళా కమీషన్‌ను ఏర్పాటు చేస్తుంది.
2. కమీషన్ ఈ క్రింది విధంగా వుంటుంది.

ఎ. స్త్రీల విషయాల పట్ల చిత్తశుద్ధి కలిగిన వ్యక్తిని 'అధ్యక్షులు'గా కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది.

బి. చట్టాలు రూపొందించడం, కార్మిక సంఘాలు, స్త్రీల శక్తి సామర్థ్యాలను పెంపొందించే, స్త్రీలపై పనిచేసే స్వచ్ఛంద సంస్థలు, నిర్వహణ, ఆర్థికాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, సాంఘిక సంక్షేమం మొదలగు అంశాలలో అనుభవం వున్న 5 గురు వ్యక్తులను సభ్యులుగా కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది.

కనీసం నియమించిన 5 గురు వ్యక్తులలో ఒకవ్యక్తి షెడ్యూల్డు కులం నుండి మరియు ఒక వ్యక్తి షెడ్యూల్డు తెగల నుండి నియమించబడాలి.

సి. కేంద్ర ప్రభుత్వం ఈ దిగువన ఉదహరించిన అనుభవం వున్న వ్యక్తిని మెంబరు కార్యదర్శిగా నియమిస్తుంది.

i. నిర్వహణ, సంస్థాగతమైన నిర్మాణం లేదా సామాజిక ఉద్యమాలలో అనుభవం కలిగిన వ్యక్తి.

ii. సరైన అనుభవం కలిగిన కేంద్ర ప్రభుత్వ సివిల్ సర్వీసు అధికారి లేదా అదే స్థాయిలో వున్న ఆల్ ఇండియా సర్వీసు అధికారి.

4. అధ్యక్షులు మరియు సభ్యుల ఉద్యోగ నిబంధనలు మరియు కాలపరిమితి:

1. అధ్యక్షులు మరియు సభ్యుల ఉద్యోగ కాలపరిమితి మూడు సంవత్సరాలు మించరాదు లేదా కేంద్ర ప్రభుత్వ నిర్ణయానుసారం.
2. అధ్యక్షులు లేదా సభ్యులు (మెంబరు కార్యదర్శి మినహాయించి) కేంద్ర ప్రభుత్వానికి విన్నవిస్తూ తమ రాజీనామా పత్రాన్ని సమర్పించవచ్చు.
3. ఈ దిగువన ఉదహరించిన పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం అధ్యక్షులు లేదా సభ్యులను తొలగించవచ్చు.

ఎ. దివాళాతీసి ఉన్నట్లయితే

బి. ఏదైనా నేరం కింద శిక్ష విధించబడి ఆ శిక్ష కేంద్ర ప్రభుత్వం దృష్టిలో నీతి బాహ్యమైనదనిపించిన ఎడల

సి. ఎవరైనా మతిస్థిమితం కోల్పోయారని సంబంధిత కోర్టు నిర్ధారించిన ఎడల

డి. పనిచేయుటకు నిరాకరించినా లేక పనిచేయలేకపోయినా

ఇ. కమీషన్ ముందస్తు అనుమతి లేకుండా మూడు వరుస మీటింగులకు గైర్హాజరయినచో

ఎఫ్. అధ్యక్షులు, లేదా సభ్యుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఎడల

పైన ఉదహరించిన క్లాజుల ప్రకారం ఏ సభ్యులనైనా తొలగించే ముందు వారి వాదనను వినిపించుకొనుటకు తగు అవకాశం కల్పించాలి.

4. సబ్‌సెక్షన్ రెండు వలన ఏర్పడిన ఖాళీలో కొత్త సభ్యులను నియమిస్తారు.
5. అధ్యక్షులు మరియు సభ్యుల ఉద్యోగ నిబంధన, జీతబత్యాలు నిర్ధారించిన ప్రకారం వుంటాయి.

5. కమీషన్‌లోని ఇతర అధికారులు మరియు సిబ్బంది :

1. ఈచట్టం ప్రకారం కమీషన్ యొక్క విధుల సక్రమ నిర్వహణ కొరకు అవసరమయ్యే అధికారులు మరియు సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది.
2. అధికారులు మరియు సిబ్బంది యొక్క జీతబత్యాలు మరియు ఉద్యోగ నిబంధన నిర్ధారించిన ప్రకారం వుంటాయి.

6. మంజూరైన నిధుల నుండి జీతాలు మరియు ఇతర అలవెన్సులను చెల్లించాలి :

సెక్షన్ 5 లో వుదహరించిన రీతిగా అధ్యక్షులు, సభ్యులు, అధికారులు, ఇతర సిబ్బందికయ్యే జీతబత్యములు మరియు పెన్షన్లు, నిర్వహణ ఖర్చులను సెక్షన్ 11 లోని సబ్‌సెక్షన్ (1) లో వుదహరించిన ప్రకారం వచ్చిన నిధుల నుండి చెల్లించాలి.

7. కమీషన్‌లో ఏర్పడిన ఖాళీలు కమీషన్ నిర్ణయాలకు అడ్డంకి కారాదు:

కమీషన్‌లో ఏర్పడిన ఖాళీల వలన కమీషన్ చేపట్టే ఏపని లేదా నిర్ణయాన్ని చెల్లదని భావించరాదు.

8. కమీషన్‌లోని కమిటీలు :

1. ప్రత్యేకమైన అంశాలపై అంశాల వారీగా కమిటీలను కమీషన్ ఏర్పాటు చేస్తుంది.
2. సబ్ సెక్షన్ 1 ప్రకారం కమిటీలకు సభ్యులను కో ఆప్ట్ చేసే అధికారం కమిటీ కలిగి వుంటుంది. ఈ సభ్యులు కమీషన్ మెంబర్లు కానేరరు. ఈ సభ్యులు ఆయా కమిటీ మీటింగులకు హాజరై విధాన నిర్ణయాల్లో పాల్గొంటారు కాని వారికి ఓటు హక్కు వుండదు.
3. ఈ కో ఆప్ట్ చేయబడిన సభ్యులకు నిర్ధారించబడిన రీతిలో సమావేశాలకు హాజరైనందుకు అలవెన్సులకు అర్హులు.

9. కమీషన్ నిర్వహించు పద్ధతి :

1. అవసరాన్ని బట్టి కమీషన్ లేదా కమిటీ సమావేశాలను అధ్యక్షులు నిర్ణయించిన సమయము మరియు ప్రాంతంలో నిర్వహిస్తారు.
2. కమీషన్ తాను పని చేయవలసిన పద్ధతిని తానే నిర్ణయించుకొని కమిటీల పని విధానాన్ని కూడా నిర్ణయిస్తారు.
3. కమీషన్ చేసే అన్ని నిర్ణయాలను సభ్య కార్యదర్శి లేదా కమీషన్ నిర్ణయించిన మరే ఇతర అధికారి అయినా సభ్య కార్యదర్శి తరపున ధృవపర్చాలి.

అధ్యాయం - III

కమీషన్ యొక్క విధులు

10. కమీషన్ యొక్క విధులు :

1. కమీషన్ ఈ క్రింద వుదహరించిన అన్నీ లేదా కొన్ని విధులను చేపడుతుంది.
   ఎ. రాజ్యాంగంలోను, ఇతర చట్టాలలోను మహిళలకివ్వబడిన రక్షణకు సంబంధించిన అంశాలను దర్యాప్తు చేసి పరిశీలించడం.
   బి. ఆ రక్షణలు ఎంతవరకు పనిచేస్తున్నాయో ఎప్పటికప్పుడు నివేదికల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలి.
   సి. అట్టి రక్షణలను పూర్తిగా అమలు పరచడానికి గాని, మహిళల స్థితులు మెరుగుపరచడానికి గాని తగిన సిఫారసులతో నివేదిక ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియచేయడం.
   డి. మహిళలకు సంబంధించి రాజ్యాంగ సూత్రాలు, ఇతరత్రా చట్టాలలోని సూత్రాలను ఎప్పటికప్పుడు పున:సమీక్షలు చేసి అందులోగల లోపాలు గాని, లోటులుగాని, తప్పులు కాని ఉంటే వాటిని సవరించమని సలహా యివ్వడం.
   ఇ. మహిళలకు సంబంధించిన రాజ్యాంగంలోని అంశములకు ఉల్లంఘన జరిగితే, ఆయా అధికారుల వద్దకు ఆ సమస్య తీసుకువెళ్లడం.

ఎఫ్. మహిళల హక్కులు కాలరాయడం, మహిళల రక్షణకు ఉపయోగింపబడే చట్టాలను సరిగా అమలు జరపక పోవడం, మహిళల సంక్షేమము, పరిహారము మొదలైన వాటికి సంబంధించి ప్రభుత్వాలు చేసే నిర్ణయాలను అమలు జరపక పోవడం వంటి ఫిర్యాదులను ఎవరి నుండైనా తీసుకోవడం లేదా వారంతట వారే పరిగణనలోనికి తీసుకొని పరిశీలించడం, వాటిని అధికారుల వద్దకు తీసుకువెళ్ళడం.

జి. మహిళలపై దౌర్జన్యాలు, మహిళలపై వివక్షతకు సంబంధించిన ప్రత్యేక సమస్యలను పరిశోధించడానికి పిలుపు మరియు అవి నిరోధించడానికి అవసరమైన వ్యూహాలను సిఫార్సు చేయడం.

హెచ్. మహిళలు అన్ని రంగాలలో ప్రాతినిధ్యం వహించడానికి అవసరమైన చర్యలు, వారు అభివృద్ధి చెందకపోవడానికి గల కారణాలు, వృత్తి పరమైన అనారోగ్యములు మొదలైన వాటి గురించి విద్యా పరమైన పరిశోధనలు చేపట్టడం.

ఐ. మహిళా సార్థకత ప్రణాళిక విధాన నిర్ణయాలలో పాలు పంచుకొని సలహాలు యివ్వడం.

జె. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో మహిళల అభివృద్ధిని అంచనా వేయడం.

కె. మహిళలను నిర్భంధించిన ప్రదేశాలు కాని, జైళ్ళను కాని, ఇతరత్రా బంధింపబడియున్న చోట్లను గాని తనిఖీ చేసి అవసరమైతే వారికి పరిహారాలు అధికారుల వద్ద చేబట్టడం.

ఎల్. ఎక్కువ మంది మహిళలు ఇమిడియున్న వ్యాజ్యాలలో వారికి ఆర్థిక వనరులు ఏర్పాటు చేయడం.

ఎమ్. మహిళలకు సంబంధించిన విషయాలలోను, ముఖ్యంగా వారి కష్టాలకు సంబంధించి ప్రభుత్వము వారికి ఎప్పటికప్పుడు నివేదికలు యివ్వడం.

ఎన్. కేంద్ర ప్రభుత్వము వారు పంపిన ఇతరత్రా విషయాలు అమలు పరచడం.

2. జాతీయ మహిళా కమీషను వారు పైన చెప్పిన (1) (బి) క్రింద పంపిన నివేదికలను కేంద్ర ప్రభుత్వము వారు ఎప్పటికప్పుడు పార్లమెంటులో ప్రవేశపెట్టాలి. వాటిని ఆమోదిస్తే వాటిపై వారు ఎట్టి చర్యలు తీసుకున్నారో కూడా తెలియజేయాలి.

3. ఆ నివేదిక పూర్తిగా కాని, పాక్షికంగా గాని రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినది అయితే, కమీషను వారు ఆ నివేదిక నకలు రాష్ట్ర ప్రభుత్వము వారికి కూడా పంపాలి. వారు ఆ నివేదికను రాష్ట్ర శాసనసభ ముందుంచి దానిని ఆమోదిస్తే దానిపై వారు జరిపించిన చర్యలు, ఒకవేళ దానిని ఆమోదించకపోతే ఎందుకు ఆమోదించలేదో కారణాలను తెలియజేయాలి.

4. మహిళా కమీషను వారు పైన చెప్పిన (1) (ఎ), (1) లేక (ఎఫ్) లో చెప్పబడిన విషయాలను దర్యాప్తు చేసేటప్పుడు

ఎ) సాక్షులను నిర్భందంగా హాజరు పరచి వారినుండి వాంగ్మూలము తీసుకోవడం.

బి) పత్రాలను కనుగొని వాటిని సంపాదించడం.

సి) ప్రమాణ పత్రాల ద్వారా సాక్షుల విచారణ.

డి) కోర్టునుండి గాని, కార్యాలయము వద్ద నుండి గాని రికార్డులను రప్పించడం, నకలు తీసుకోవడం.

ఇ) సాక్షులను విచారించడానికి గాని, పత్రాలను చూడటానికి గాని కమీషన్లను నియమించడం.

ఎఫ్) ఇతరత్రా యివ్వబడిన అధికారులతో సహా ఒక సివిలు కోర్టుకు ఏవిధంగా విచారణ అధికారాలు ఉంటాయో అన్ని అధికారాలు కూడా ఈ కమీషనుకు ఉంటాయి.

అధ్యాయం - IV

ఆర్థిక విషయాలు, జమాఖర్చులు మరియు తనిఖీ

11. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు :

1. పార్లమెంటు ఆమోదం పొందిన తరువాత ఈ చట్టం ప్రకారం విధులు నిర్వహించుట కొరకు కమీషన్ అవసరమైన నిధులను గ్రాంటు రూపంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది.
2. సబ్ సెక్షన్ 1 లో ఉదహరించిన రీతిగా ఈ నిధులను చట్టప్రకారం నిర్వహించవలసిన బాధ్యతల నిమిత్తం కమీషన్ ఖర్చు చేస్తుంది.

12. జమా ఖర్చులు మరియు తనిఖీ :

1. కేంద్ర ప్రభుత్వం నిర్ధారించిన ప్రకారం కమీషన్ జమాఖర్చులను సరైన పద్ధతిలో నిర్వహిస్తూ అవసరమైన రికార్డులను మరియు వార్షిక నివేదికలను భారతదేశపు కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ సహకారంతో కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది.
2. కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ తాము నిర్ణయించిన కాలపరిమితిలో కమీషన్ యొక్క జమా ఖర్చులను తనిఖీ చేస్తారు. అందుకయ్యే ఖర్చును కమీషనే కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్‌కు చెల్లించాలి.
3. కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ లేదా ఆయన నియమించిన ఏ వ్యక్తి అయినా కమీషన్ యొక్క జమాఖర్చులను తనిఖీచేసే సమయంలో మిగతా తనిఖీలలో వారు కలిగియున్న హక్కులను, అధికారమును కలిగి యుంటారు. వారు కోరిన ఎటువంటి వివరాలనైనా, పత్రములైనా, రశీదులైనా, పుస్తకాలైనా కమీషన్ వారికి అందజేయాలి.
4. కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ జమా ఖర్చులను ధృవీకరించిన తర్వాత ఆయన ఇచ్చిన నివేదికను జతపర్చి కమీషన్ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిఏటా సమర్పించాలి.

13. వార్షిక నివేదిక :

కమీషన్ తన వార్షిక నివేదికను తాము చేపట్టిన పూర్తి కార్యక్రమాల వివరాలతో ప్రతి ఆర్థిక సంవత్సరానికొకసారి కేంద్ర ప్రభుత్వానికి అందజేయాలి.

14. వార్షిక కార్యక్రమాల మరియు ఆర్థిక నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టాలి :

కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా కమీషన్ యొక్క వార్షిక కార్యక్రమాలు మరియు ఆర్థిక నివేదికలు, కమీషన్ సూచనలపై తాము తీసుకొను చర్యలను వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు సమర్పించాలి. ఏవైనా అంశాలను కేంద్ర ప్రభుత్వం అంగీకరించని పక్షంలో వాటికి తగిన కారణాలను మరియు సూచనలను పార్లమెంటుకు తెలియజేయాలి.

అధ్యాయం - V

ఇతరములు

15. అధ్యక్షులు, సభ్యులు మరియు ఇతర సిబ్బంది ప్రజా సేవకులే :

భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 21 ప్రకారం కమీషన్ యొక్క అధ్యక్షులు, సభ్యులు, అధికారులు మరియు ఇతర సిబ్బంది ప్రజా సేవకులుగా పరిగణించబడతారు.

16. కేంద్ర ప్రభుత్వం కమీషన్‌ను సంప్రదిస్తుంది :

స్త్రీలకు సంబంధించిన ఎటువంటి విధాన నిర్ణయాలైనా చేపట్టే విషయంలో కేంద్రప్రభుత్వం కమీషన్‌ను సంప్రదిస్తుంది.

17. నియమాలు చేసే అధికారం :

1. ఈ చట్టంలోని అంశాలను చేపట్టుట కొరకు అవసరమైన నియమాలను కేంద్ర ప్రభుత్వం తయారుచేసి తమ రాజ పత్రం ద్వారా ప్రకటిస్తుంది.
2. ఈ నియమాలు అన్నిటికీ లేదా కింద వుదహరించిన కొన్నిటికి వర్తిస్తాయి.
   - ఎ. సెక్షన్ 4 లోని సబ్ సెక్షన్ (5) ప్రకారం అధ్యక్షులు మరియు సభ్యుల ఉద్యోగ నిబంధనలు, చెల్లించవలసిన జీత బత్తెములు మరియు సెక్షన్ 5 లోని సబ్ సెక్షన్ (2) ప్రకారం అధికారులు మరియు ఇతర సిబ్బంది ఉద్యోగ నిబంధనలు, చెల్లించవలసిన జీతబత్తెములు.
   - బి. సెక్షన్ 8 లోని సబ్ సెక్షన్ మూడు ప్రకారం కమిటీలకు కో ఆప్ట్ చేయబడిన సభ్యులు సమావేశానికి హాజరైనపుడు చెల్లించవలసిన బత్తెములు.
   - సి. సెక్షన్ 10 సబ్ సెక్షన్ (4) లోని క్లాజ్ (ఎఫ్) లో వచ్చే ఇతర అంశాలు.
   - డి. సెక్షన్ 12 సబ్ సెక్షన్ (1) ప్రకారం నిర్ధారించబడిన పత్రంలో వార్షిక జమాఖర్చుల పట్టికను నిర్వహించుట.
   - ఇ. సెక్షన్ 13 ప్రకారం వార్షిక నివేదికను తయారు చేయవలసిన సమయం మరియు నిర్ధారించబడిన పత్రం.

   ఎఫ్. అవసరమయిన మరి ఏ ఇతర అంశంకానీ లేక అప్పగించబడిన అంశం.
3. ఈ చట్టం కింద చేసిన ప్రతి నియమాన్ని ఆ వెంటనే రాష్ట్ర శాసనసభముందు 30 రోజులపాటు ఒకే సమావేశంలో కానీ, లేక రెండు అంతకుమించిన సమావేశాల్లో కానీ వుంచాలి. ఒక సమావేశం తర్వాత రెండవ సమావేశం ముగిసేముందు, లేక ముందు చెప్పిన వరుస సమావేశాలు ముగిసేముందు సభ ఒక నియమాన్ని సవరించాలని గానీ, లేక అసలు ఆ నియమం వుండకూడదని కానీ నిర్ణయించిన పక్షంలో ఆ నియమం ఆ నిర్ణయం ప్రకారం సవరించిన రూపంలో అమలవుతుంది, లేక రద్దయిపోతుంది. అయితే ఆ విధమైన సవరణగానీ, రద్దుగానీ ఆ నియమం క్రింద అంతకు ముందు చేసిన పనులపై ప్రభావం చూపించరాదు.

*****

7. ఆంధ్రప్రదేశ్ మహిళా కమీషన్ 1998

1998 మార్చి 19 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాజపత్రం ద్వారా ఆంధ్రప్రదేశ్ మహిళా కమీషన్ చట్టం రాష్ట్ర శాసనసభ ఆమోదం పొందిన తరువాత అమలులోకి వచ్చింది.

చట్టం నెం. 9-1998 :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని స్త్రీలయొక్క స్థితిగతులను మెరుగుపరుచుట కొరకు మరియు వారిపై జరిగే అన్యాయాలను విచారించుట కొరకు మహిళా కమీషన్‌ను ఏర్పాటు చేయడమైనది.

కమీషన్ యొక్క కార్యక్రమాలు :

1. అమలులోవున్న చట్టాలు స్త్రీలకు సమానంగా మరియు సరిగా ఉపయోగపడేలా చట్టాలను అధ్యయనం చెయ్యడం.
2. స్త్రీలకు సంబంధించిన చట్టాలయొక్క పనితీరును పర్యవేక్షించడం.
3. స్త్రీలకు సమాన అవకాశాలు వచ్చేలా రాష్ట్ర మరియు ప్రభుత్వ సంస్థల్లో జరిగే నియామకాలను పర్యవేక్షించుట.
4. స్త్రీలకు సంబంధించిన జైళ్ళను, వసతి గృహాలను, మరియు ఇతర సంబంధిత స్థలాలను తనిఖీచేయుట.
5. స్త్రీలు / బాలికలపై జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి, న్యాయం జరిగేట్టు చూడడం.
6. అధ్యయనం జరిపిన తర్వాత స్త్రీల సంక్షేమం కొరకు చేపట్టవలసిన చర్యలను ప్రభుత్వానికి సిఫార్సు చేయుట.

కమీషన్ చేపట్టే నేర స్వభావాలు :

1. కుటుంబ హింస, కట్నం వేధింపులు
2. లైంగిక వేధింపులు
3. పనిచేసేచోట వేధింపులు
4. ఉద్యోగపరమైన అంశాలు
5. మాయమగుట, అత్యాచారం మరియు అపహరణకు సంబంధించిన కేసులు.

కమీషన్‌కు చేతిద్వారా లేదా పోస్టు ద్వారా అందే అర్జీలను నమోదుచేసి కేసు విచారణను చేపడతారు. కేసుయొక్క తీవ్రతనుబట్టి కమీషను ఈ క్రింది పేర్కొన్న చర్యలు చేపడుతుంది.

1. కౌన్సిలింగ్ కొరకు పిలిపించుట.
2. సంబంధిత అధికారుల వద్దకు వెళ్ళమని కమీషన్ సలహా ఇచ్చుట.
3. కేసును నమోదుచేయమని పోలీసుస్టేషన్‌కు పంపించుట.
4. విచారణ జరిపిన పిదప తగుచర్య తీసుకోవలసిందిగా సంబంధిత అధికారులవద్దకు పంపించుట.
5. కుటుంబహింస చట్టంకింద కేసు నమోదు చేయవలసిందిగా సంరక్షణాధికారుల వద్దకు పంపించుట.

చట్టనియమాలు మరియు ఇతర సదుపాయాలు :

1. కమీషన్ వివరాలు, ఉద్దేశం :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని స్త్రీలయొక్క స్థితిగతులను మెరుగుపర్చుట కొరకు మరియు వారిపై జరిగే అన్యాయాలను విచారించుట ఈ కమీషన్ యొక్క ఉద్దేశ్యం.

2. కమీషన్ యొక్క అధికారాలు మరియు విధులు :

రాష్ట్ర మహిళా కమీషన్ విచారణ చేపట్టు చర్యలలో సివిల్ కోర్టుతో సమానమైన స్థాయిని సిపిసి 1908 ప్రకారం కలిగియుండును.

ఈ క్రింద వుదహరించిన అంశాలలో :

A. వ్యక్తులను హాజరుపరిచి విచారించుట

B. అవసరమైన పత్రాలను సంపాదించి సమర్పించుట

C. అఫిడవిట్ల ద్వారా సాక్ష్యాలను స్వీకరించుట

D. ప్రభుత్వ కార్యాలయాల నుండి రికార్డులను పొందుట

E. సాక్ష్యుల విచారణ కొరకు కమీషన్లను జారీచేయుట

3. నిర్ణయాధికారప్రక్రియ, పర్యవేక్షణ మార్గాలు మరియు జవాబుదారీతనం:

కమీషన్ చేపట్టు ఏ విచారణయినా భారతశిక్షాస్మృతిలోని సెక్షన్‌లు 193 & 228 మరియు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 లోని సెక్షన్ 195 ప్రకారం కోర్టుతో సమానంగా న్యాయపరమైన అధికారం కలిగివుంటుంది.

4. విధుల నిర్వహణ కొరకు కమీషన్ ఏర్పర్చుకొన్న నియమాలు :

స్త్రీలపై జరిగే అన్యాయాలను విచారించుట కొరకు ఆంధ్రప్రదేశ్ మహిళాకమీషన్ నిబంధన 9(1) ప్రకారం అడ్‌హాక్ కమిటీల ఏర్పాటు మరియు కమీషన్ సమావేశమైనపుడు నిబంధన 19(1) ప్రకారం నిర్ణయాలు తీస్కొనుట.

5. నియమ నిబంధనలు, ఉత్తర్వులు, సంస్థాపరమైన పుస్తకాలు మరియు రికార్డులను కమీషన్ మరియు సిబ్బంది కలిగివుండి తమ విధులను నిర్వహించుట : ఆంధ్రప్రదేశ్ మహిళా కమీషన్ చట్టం 9, 1998 ద్వారా జారీచేసిన చట్టం.

6. ఈ కమీషన్ యొక్క విధుల నిర్వహణ కొరకు అధ్యక్షులు మరియు ఆరుగురు సభ్యులు ఈ కమీషన్‌లో వుంటారు. ఈ కమీషన్ కాలపరిమితి 5 సంవత్సరాలు.

7. నిబంధన 9(i) ప్రకారం ఆంధ్రప్రదేశ్ మహిళా కమీషన్, కమీషన్ యొక్క ఇద్దరి సభ్యులతో కమిటీని ఏర్పాటుచేసి వారి ద్వారా తమ విధులను, బాధ్యతలను నిర్వర్తిస్తుంది.

*****

8. మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993

జాతీయ మానవ హక్కుల సంఘం, రాష్ట్ర మానవ హక్కుల సంఘాల ఏర్పాటుకు, మానవ హక్కుల పరిరక్షణకు న్యాయస్థానాల ఏర్పాటు తదితర అంశాలకై ఈ చట్టం 44 వ గణతంత్ర సంవత్సరంలో చేయబడింది.

ఉద్దేశాలు, కారణాలు :

1. ఐక్యరాజ్య సమితి 16.12.1966 న ఆమోదించిన అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక హక్కుల ఒడంబడికకు భారతదేశం భాగస్వామి. ఈ ఒడంబడికలో ఉన్న మానవ హక్కులు చాలా వరకు భారత రాజ్యాంగంలో వున్నాయి.
2. దేశ విదేశాలలో మానవ హక్కులపై జరుగుతున్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని పారదర్శకత కొరకు అలాంటి ఆందోళనలను ఎదుర్కోవడానికి సామాజిక వాస్తవాలలో మార్పులను, చెలరేగుతున్న హింసా స్వభావాలను ప్రభుత్వం సమీక్షిస్తోంది.
3. ముఖ్యమంత్రుల సమావేశాలలో, వివిధ సదస్సులలో, వివిధ రాజకీయ పార్టీల సమావేశాలలో, మానవ హక్కులపై చర్చ జరిగింది. ఈ చర్చలలో వ్యక్తమైన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పార్లమెంటులో ఈ బిల్లు ప్రవేశపెట్టబడింది.

అధ్యాయం - I

1. చట్టం పేరు, అమలు తేదీ:

ఈ చట్టం మానవ హక్కుల రక్షణ చట్టం 1993 అని పిలువబడుతుంది. ఇది భారతదేశం అంతటా వర్తిస్తుంది. రాజ్యాంగం యొక్క మూడవ షెడ్యూలులో నమోదునకు సంబంధించిన విషయముల మేరకే ఈ చట్టం జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో వర్తిస్తుంది. ఈ చట్టం సెప్టెంబరు 28, 1993 నుంచి అమలులోకి వచ్చింది.

2. నిర్వచనాలు:

1. సందర్భాన్ని బట్టి వేరే అర్థం వస్తే మినహా ఈ చట్టంలో పదాల అర్థాలు ఈ క్రింది విధంగా వుంటాయి.
   a) సాయుధ బలగాలు అనగా నౌకాదళం, సైనికదళం మరియు వైమానిక దళమే కాకుండా భారత ప్రభుత్వ మరే ఇతర సాయుధ బలగాలన్నీ అని అర్థం.
   b) అధ్యక్షులు అనగా జాతీయ మానవ హక్కుల సంఘానికి లేదా రాష్ట్ర మానవ హక్కుల సంఘానికి అధ్యక్షులు.
   c) సంఘం అనగా సెక్షన్ 3 కింద ఏర్పాటు చేయబడిన జాతీయ మానవ హక్కుల సంఘం.
   d) మానవ హక్కులు అనగా భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన లేదా అంతర్జాతీయ మానవ హక్కుల ఒడంబడికలో చెప్పబడిన భారతీయ న్యాయస్థానములచే గుర్తింపు పొందిన స్వేచ్ఛ, సమానత్వ, ఆత్మగౌరవానికి సంబంధించిన హక్కులు.

e) మానవ హక్కుల కోర్టు అనగా సెక్షన్ 30 కింద చెప్పబడిన మానవ హక్కుల కోర్టు.

f) అంతర్జాతీయ ఒడంబడిక అనగా ఐక్యరాజ్యసమితి ఆమోదం పొందిన 1966 నాటి పౌర, రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక హక్కులు.

g) సభ్యులు అనగా సంఘము యొక్క లేదా రాష్ట్ర సంఘము యొక్క సభ్యులు, అధ్యక్షులు కూడా ఇందులో భాగమే.

h) అల్ప సంఖ్యాక వర్గ జాతీయ సంఘ చట్టం అనగా 1992 సెక్షన్ 3 కింద ఏర్పాటు చేయబడిన అల్ప సంఖ్యాక వర్గ జాతీయ సంఘం.

i) షెడ్యూల్డు కులాల, జాతుల జాతీయ సంఘం అనగా రాజ్యాంగం 338 వ అధికరణం ద్వారా ఏర్పాటు చేయబడ్డ జాతీయ షెడ్యూల్డు కులాల, జాతుల సంఘం.

j) మహిళా జాతీయ సంఘం అనగా మహిళల చట్టం 1990, సెక్షన్ 3 ద్వారా ఏర్పడ్డ జాతీయ మహిళా సంఘం.

k) ప్రకటన అనగా ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురించబడిన ప్రకటన.

l) నిర్దేశించిన అనగా ఈ చట్టం అనుగుణంగా చేయబడిన నిబంధనలు.

m) ప్రభుత్వోద్యోగి అనగా భారత శిక్షాస్మృతి యొక్క సెక్షన్ 21లో చెప్పబడిన విధంగా అర్థం చేస్కోవాలి.

n) రాష్ట్ర మానవ హక్కుల సంఘం అనగా ఈ చట్టం క్రింద ఏర్పాటు చేయబడిన రాష్ట్ర మానవ హక్కుల సంఘం

2. ఈ చట్టంలోని నియమాలు జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రంలో వర్తించని సందర్భాల్లో ఆ రాష్ట్రంలోని ఇతర నిబంధనలు వర్తిస్తాయి.

అధ్యాయం - II

జాతీయ మానవ హక్కుల సంఘం

3. జాతీయ మానవ హక్కుల సంఘం ఏర్పాటు :

1. ఈ చట్టం నిర్దేశించిన విధులు, అధికారాలు నిర్వహించుటకు జాతీయ మానవ హక్కుల సంఘంను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడమైనది.

2. ఈ సంఘంలో

a) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వ్యక్తి అధ్యక్షునిగాను

b) సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తిగాని లేక న్యాయమూర్తిగా పనిచేసిన వ్యక్తి గాని సభ్యుడుగాను

c) హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి గాని లేక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వ్యక్తి గాని సభ్యుడు గాను

d) మానవ హక్కుల పరిజ్ఞానం, అనుభవం వున్న ఇద్దరు వ్యక్తులు సభ్యులు గాను వుంటారు.

3. జాతీయ అల్పసంఖ్యాక సంఘం అధ్యక్షులు, జాతీయ షెడ్యూల్డు కులాల, జాతుల సంఘం అధ్యక్షులు, జాతీయ మహిళా సంఘం అధ్యక్షులు కూడా ఈ సంఘంలో సభ్యులే. వీరు సెక్షన్ 12 లో (b) నుండి (j) వరకు చెప్పబడ్డ విధులు నిర్వహిస్తారు.
4. ఈ సంఘం విధులు, అధికారాలు పర్యవేక్షించడానికి ఒక ఉన్నత కార్యదర్శి వుంటారు. ఇతనే ఈ సంఘం ప్రధాన కార్య నిర్వహణాధికారి.
5. సంఘం ప్రధానకార్యాలయం ఢిల్లీలో వుంటుంది. కాని దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా సంఘం కార్యాలయాలు కేంద్రప్రభుత్వం అనుమతితో నెలకొల్పవచ్చు.

4. అధ్యక్షుల, సభ్యుల నియామకం:

1. ఈ సంఘం అధ్యక్షుల, సభ్యులను భారత రాష్ట్రపతి నియమిస్తారు. ఈ నియామకం ఈ క్రింది సభ్యులతో కూడిన కమిటీ సిఫారసుల ఆధారంగా చేయాలి.
   a) అధ్యక్షులుగా ప్రధానమంత్రి
   b) సభ్యులుగా లోకసభ స్పీకర్
   c) సభ్యులుగా కేంద్ర గృహమంత్రిత్వ శాఖామంత్రి
   d) సభ్యులుగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు – సభ్యులు
   e) రాజ్యసభలో ప్రతిపక్ష నాయకులు – సభ్యులు
   f) రాజ్యసభ ఉపాధ్యక్షులు సభ్యులు

కాని సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తిని కానీ, హైకోర్టు ప్రస్తుతన్యాయమూర్తిని కానీ సంఘంలో సభ్యులుగా నియమించే ముందు భారత ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించాలి.

2. సంఘంలో ఏవైనా ఖాళీలు పూరించకపోయినా, ఇతర సభ్యుల, అధ్యక్షుల నియామకం తప్పుకాదు.

5. సంఘ సభ్యుని తొలగింపు:

1. సంఘ అధ్యక్షుని గాని, సభ్యులను గాని చెడు ప్రవర్తన అనే కారణంపై ఈ క్రింద చెప్పబడిన రెండవ క్లాజు అనుగుణంగా తొలగించే అధికారం రాష్ట్రపతికి వుంటుంది. కానీ ఈ తొలగింపుకు ముందుగా సుప్రీంకోర్టు సదరు చెడుప్రవర్తనపై విచారణ జరిపి నిర్ధారించాలి. అటు పిమ్మటే రాష్ట్రపతి తన అధికారాన్ని వినియోగించాలి.
2. ఈ క్రింది సందర్భాలలో అధ్యక్షులు లేదా సంఘసభ్యులను రాష్ట్రపతి తొలగించవచ్చు.
   a) దివాళా తీసినట్టు కోర్టు ఉత్తర్వులొచ్చినపుడు
   b) సంఘం బాధ్యతలతోపాటు మరేదైనా ఇతరత్రా ఆదాయ సంపాదనలో కూడిన పనిచేస్తుంటే
   c) మానసిక స్థితి సరిగా లేకపోతే
   d) ఏదైనా న్యాయస్థానం పిచ్చివానిగా ప్రకటిస్తే

e) ఏదైనా నీతి బాహ్యమైన నేరానికి సంబంధించి శిక్షపడితే (ఆ నేరం నీతి బాహ్యమైనదా, కాదా అనేది రాష్ట్రపతి నిర్ణయించాలి).

6. సభ్యుల కాలపరిమితి :

1. సంఘ అధ్యక్షుల పదవి 5 సంవత్సరముల వరకు లేదా 70 సంవత్సరముల వయస్సు వరకు ఏది ముందుగా వస్తే తదనుగుణంగా వుంటుంది.
2. సభ్యుల పదవి 5 సంవత్సరముల వరకు వుంటుంది. రెండవసారి కూడా సభ్యులుగా నియమించవచ్చు. సభ్యుల వయస్సు కూడా 70 సంవత్సరాలు మించరాదు.
3. అధ్యక్షులు గాని, సభ్యులుగాని తమ కాలపరిమితి తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరరాదు.

7. అధ్యక్షుల బాధ్యతలు సభ్యులు నిర్వహించడం:

1. సంఘ అధ్యక్షులు చనిపోయినా, రాజీనామా చేసినా, ఇతరత్రా అధ్యక్ష స్థానం ఖాళీ అయినపుడు మరో అధ్యక్ష నియామకం జరిగే వరకు సభ్యుల్లో ఒకరిని అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించమని రాష్ట్రపతి ఆదేశించవచ్చు.
2. అధ్యక్షులు సెలవులో వుండి గానీ, మరే కారణంగా అయినా బాధ్యత నిర్వర్తించలేనపుడు ఆ బాధ్యతను నిర్వర్తించమని ఎవరైనా సభ్యున్ని రాష్ట్రపతి ఆదేశించవచ్చు.

8. సభ్యుల జీతభత్యాలు నిబంధనలకు అనుగుణంగా వుంటాయి. ఇది వారు చేరిన తరువాత వారికి వ్యతిరేకంగా మార్చడానికి వీలులేదు.

9. పదవుల్లో ఖాళీలు సంఘ కార్యకలాపాలకు అడ్డంకి కాదు. సంఘంలో ఏవైనా ఖాళీలు వున్నంత మాత్రాన లేదా నిబంధనలలో పొరబాట్లు వున్నంత మాత్రాన సంఘ కార్యకలాపాలను ప్రశ్నించడానికి లేదు. సంఘ నిర్ణయాలు రద్దుకావు.

10. సంఘ పని విధానం :

1. సంఘం సమావేశాలు ఎప్పుడు, ఎక్కడ జరగాలో సంఘ అధ్యక్షులు నిర్ణయిస్తారు.
2. సంఘ పని విధానం తనకు తాను నిర్దేశించుకుంటుంది.
3. సంఘం యొక్క ఆదేశాలను, నిర్ణయాలను సంఘ ఉన్నత కార్యదర్శి ధృవపరుస్తారు.

11. సంఘ సిబ్బంది, అధికారులు :

1. సంఘ అధికారులను, సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. వారి స్థాయి ఈక్రింది విధంగా వుంటుంది.
   a) సంఘ ఉన్నత కార్యదర్శిగా కేంద్ర ప్రభుత్వంలో కార్యదర్శి హోదా కలిగిన వ్యక్తిని నియమిస్తారు.
   b) సంఘం దర్యాప్తు వ్యవహారాలను చూసేందుకు పోలీసు డైరెక్టర్ జనరల్ హోదా మరియు అతని కింద పనిచేసే సిబ్బందిని నియమిస్తుంది.

2. అదే విధంగా నిబంధనలకు అనుగుణంగా ఇతర కార్యనిర్వాహక, సాంకేతిక సిబ్బందిని సంఘం నియమించుకుంటుంది.

3. అధికారుల, ఇతర సిబ్బంది జీత భత్యాలు నిబంధనలకు అనుగుణంగా వుంటాయి.

అధ్యాయం - III

సంఘం అధికారాలు, విధులు

12. సంఘం విధులు :

సంఘం ఈ క్రింది విధులను నిర్వర్తిస్తుంది.

a) తనంతట తానుగా గానీ, బాధితుని ఫిర్యాదు మేరకు గానీ ఈ క్రింది అంశాలను విచారిస్తుంది.

   i) మానవ హక్కుల ఉల్లంఘన లేదా ప్రోత్సాహం.

   ii) మానవ హక్కుల ఉల్లంఘనను నిరోధించడంలో ప్రభుత్వ ఉద్యోగి నిర్లక్ష్యం.

b) ఏదైనా కోర్టులో మానవ హక్కులకు సంబంధించి వివాదం నడుస్తుంటే ఆ విషయంలో సదరు కోర్టు అనుమతితో జోక్యం చేసుకోవచ్చు.

c) ఏదైనా రాష్ట్ర ప్రభుత్వానికి ముందుగా తెలియపర్చి ఆ రాష్ట్రంలో కారాగారాలు, వ్యక్తులను నిర్బంధించే ఇతర నివాసాలను సందర్శించి వారి స్థితిగతులను అధ్యయనం చేసి దానిపై తగు సూచనలు ఇవ్వవచ్చు.

d) రాజ్యాంగంలో మరియు చట్టాలలో పొందుపరచిన మానవ హక్కుల సంరక్షణలను పరిశీలించి అవి సరిగా అమలయ్యేందుకు సూచనలివ్వవచ్చు.

e) ఉగ్రవాదం తదితర మానవ హక్కుల సంరక్షణను కాలరాసే విషయాలను పరిశీలించి వాటిని సరిదిద్దేందుకు తగు చర్యలను సూచించవచ్చు.

f) అంతర్జాతీయ మానవ హక్కుల ఒప్పందాలను, ఒడంబడికలను అధ్యయనం చేసి అవిసరిగా అమలయ్యేందుకు తగు సిఫార్సులు చేయవచ్చు.

g) మానవ హక్కుల పరిధిలో పరిశోధనలను చేయడం, ప్రోత్సహించడం

h) సమాజంలో అన్నిరంగాల్లో మానవహక్కుల చైతన్యాన్ని, సంరక్షణను పెంపొందించేందుకు ప్రచురణలు, ప్రసారాలు, సెమినార్లు నిర్వహించవచ్చు.

i) మానవ హక్కుల రంగంలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల కృషిని ప్రోత్సహించవచ్చు.

j) మానవ హక్కుల అభివృద్ధి కొరకై ఇతర అవసరమైన కార్యక్రమాలు చేపట్టవచ్చు.

13. విచారణకు అధికారాలు :

1. ఈ చట్టం కింద ఫిర్యాదుల్ని దర్యాప్తు జరిపేందుకై సంఘానికి సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని విచారణ అధికారాలన్నీ వుంటాయి. మరియు ఆ అధికారాలు ఈ క్రింది అంశాలపై వుంటాయి.

   a) సాక్షుల్ని సమన్ల ద్వారా రప్పించి వారిచే ప్రమాణం చేయించి విచారించే అధికారం.

   b) ఏదైనా పత్రాన్ని వెతికి పట్టుకురమ్మని చెప్పే అధికారం.

c) అఫిడవిట్ల ద్వారా సాక్ష్యాల్ని స్వీకరించడం

d) ఏదైనా ఆఫీసు నుంచి గానీ, కోర్టు నుంచి గానీ ప్రభుత్వ రికార్డులను తెప్పించుకోవచ్చు.

e) అవసరమైన పత్రాలను, సాక్షులను విచారించేందుకు కమీషన్లు నియమించవచ్చు.

f) ఇవిగాక నిబంధనలు ఇతర అంశాలపై అధికారం కల్పించవచ్చు.

2. సంఘం తన విచారణకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వమని ఏవ్యక్తినయినా అడగవచ్చు. అలా అడిగినపుడు సదరు వ్యక్తిపై ఆ సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత వుంటుంది. లేదంటే సెక్షన్ 176, 177 భారత శిక్షాస్మృతి వర్తిస్తుంది. అయితే సమాచారం అడగబడిన వ్యక్తికి ఏదైనా మినహాయింపు వర్తిస్తే అందుకు లోబడి వుండాలి.

3. నేరవిచారణ స్మృతిలోని సెక్షన్ 100 కు లోబడి సంఘానికి సంబంధించిన అధికారులు ఏ గృహంలోకైనా, ప్రాంతంలోకైనా, జొరబడి తమకు కావలసిన పత్రాలను తీసుకొనవచ్చు. ఇది సంఘంలోని గజిట్ ఆఫీసర్ పైబడిన ర్యాంకు అధికారులకు మాత్రమే వుంటుంది.

4. మానవ హక్కుల సంఘం సివిల్ కోర్టుకు సమానం. ఈ సంఘం ఎదుటగా సెక్షన్ 175, 178, 179, 180 లేదా 228 భారత శిక్షాస్మృతి క్రింద నేరాలు జరిగితే వాటిని సంబంధిత మేజిస్ట్రేటుకు విచారణకై పంపించవచ్చు.

5. సంఘం వద్ద జరిగే ప్రతీ విషయం కోర్టుల్లో జరిగే ప్రక్రియతో సమానంగా పరిగణించి భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 193, 228, 196 ను అన్వయించాలి. అదే విధంగా నేరవిచారణ స్మృతిలోని సెక్షన్ 195 ప్రకారం సంఘాన్ని సివిల్ కోర్టుతో సమానంగా చూడాలి.

14. దర్యాప్తు :

1. సంఘం తన దర్యాప్తు అవసరాల నిమిత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దర్యాప్తు అధికారులను ఆయా ప్రభుత్వాల అనుమతితో వినియోగించుకోవచ్చు.

2. పైన చెప్పబడిన అధికారులు సంఘం ఆధీనంలో పనిచేస్తారు. అందుకై వారు సంఘం ఆదేశాల ప్రకారంగా,

a) ఏ వ్యక్తినైనా పిలిచి విచారించవచ్చు.

b) అవసరమైన పత్రాలను దాఖలు చేయమని ఆదేశించవచ్చు.

c) ప్రభుత్వ ఆధీనంలోని రికార్డులను, లేదా నకళ్ళను తెప్పించు కొనవచ్చును.

3. ఎవరైనా వ్యక్తి పైన ఉదహరించిన అధికారుల దగ్గర ఇచ్చే సాక్ష్యం కమీషన్ ముందు ఇచ్చే సాక్ష్యం లాగానే పరిగణించాలి. ఇందుకు సెక్షన్ 15 వర్తిస్తుంది.

4. పైన ఉదహరించిన అధికారులు తమకు అప్పజెప్పిన విచారణను పూర్తిచేసి సంఘం నిర్ణయించిన కాలపరిమితి లోగా సంఘానికి నివేదిక అందజేయాలి.

5. అలా సమర్పించబడిన నివేదిక పట్ల సంఘం సంతృప్తి చెందాలి. అందుకొరకై అవసరమైతే తనకు నచ్చిన రీతిలో విచారణ జరిపించుకోవచ్చు. అవసరమైతే అధికారుల ముందు సాక్ష్యమిచ్చిన వ్యక్తులను మరలా విచారించవచ్చు.

15. సంఘం ఎదుట వ్యక్తులు ఇచ్చే సాక్ష్యం :

సంఘం ఎదుట ఒక వ్యక్తి ఇచ్చిన సాక్ష్యాన్ని వారికి వ్యతిరేకంగా సివిల్ లేదా క్రిమినల్ విచారణ ఉపయోగించకూడదు. అయితే సదరు వ్యక్తులు అబద్దపు సాక్ష్యం చెప్పినట్లయితే ఆ నేరం నిరూపించేందుకు ఆ సాక్ష్యాలను వాడవచ్చు.

అయితే అలా వాడుకోదలచిన సాక్ష్యం,

a) సంఘం అడిగిన ప్రశ్నకు జవాబుగా ఆ వ్యక్తి చెప్పివుండాలి, లేదా,

b) సంఘం విచారిస్తున్న విషయానికి సంబంధించినదై వుండాలి.

16. ఎవరి హక్కులకైనా భంగం వాటిల్లినపుడు వారి వాదనలు వినేందుకు అవకాశం ఇవ్వాలి. సంఘం తను చేస్తున్న విచారణలో,

a) ఏ వ్యక్తి నడవడిక గురించి అయినా విచారించాల్సిన అవసరం వుందనిపించినపుడు, లేదా

b) ఏ వ్యక్తి ప్రతిష్ట అయినా తన విచారణ వల్ల దెబ్బతింటుం దనిపించినపుడు

సదరు వ్యక్తికి తనను తను సమర్ధించుకునేందుకు, తన వాదనలు వినిపించుకునేందుకు తగిన అవకాశం ఇవ్వాలి. అయితే ఒక సాక్షి చెడు నడవడికను బహిర్గత పరిచేందుకు ప్రశ్నించినపుడు ఈ సెక్షన్‌లో చెప్పబడిన వాదనలు వినిపించుకునే అవకాశం లేదా సమర్ధించుకునే అవకాశం వర్తించదు.

అధ్యాయం -IV

సంఘం పని విధానం

17. ఫిర్యాదులపై విచారణ :

సంఘం తనకు అందిన మానవహక్కుల ఉల్లంఘనల ఫిర్యాదులపై విచారణలో భాగంగా,

i) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సంబంధిత అధికారులను ఉల్లంఘనలపై నిర్ణీత కాలపరిమితిలోగా నివేదిక ఇవ్వమని అడగవచ్చు, అయితే

   a) నిర్ణీత సమయంలోగా తాము అడిగిన నివేదిక ఆయా ప్రభుత్వాల నుంచి రానపుడు సంఘం తనంతట తానే విచారణ చేపట్టవచ్చు.

   b) నిర్ణీత సమయంలో నివేదిక వచ్చినట్లయితే, ఆ నివేదిక ప్రకారం ఆయా ప్రభుత్వాలు జరిపిన విచారణ మరియు తీసుకున్న చర్యల పట్ల సంఘం సంతృప్తి చెందితే ఇక తదుపరి విచారణ చేయకుండా ఫిర్యాదు దారునికి ఇదే విషయం చెప్పి ఫిర్యాదుపై ఇక చర్యలు తీసుకోకుండా ఉండవచ్చు.

ii) పైన చెప్పబడిన విషయాలకు ఇబ్బంది లేకుండా ఏదయినా ఫిర్యాదు ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకుని విచారణ చేపట్టవచ్చు.

18. విచారణ తదుపరి చర్యలు :

ఈ చట్టం క్రింద విచారణ పూర్తయిన పిదప సంఘం ఈ క్రింది చర్యలేవైనా చేపట్టవచ్చు.

1. విచారణ ద్వారా మానవహక్కుల ఉల్లంఘన జరిగినట్లు తేలినా, ఎవరైనా అధికారి నిర్లక్ష్యంగా

వ్యవహరించి హక్కుల ఉల్లంఘనను నిరోధించలేదని తేలినా, సదరు వ్యక్తులపై క్రిమినల్ తదితర చర్యలు తీసుకోమని సంబంధిత ప్రభుత్వాలకు సిఫార్సు చేయవచ్చు.

2. రిట్లు, ఆదేశాలు, ఉత్తర్వులు తదితర సబబైన ఆదేశాలు ఇవ్వమని సుప్రీంకోర్టు, హైకోర్టులను అభ్యర్థించవచ్చు.
3. బాధితునికి లేదా కుటుంబసభ్యులకు నష్టపరిహారం చెల్లించమని సంబంధిత ప్రభుత్వాన్ని లేదా సంస్థకు సిఫార్సు చేయవచ్చు.
4. క్రింది (5) వ క్లాజుకు లోబడి విచారణ నివేదికను ఫిర్యాదు దారునికి లేదా అతని ప్రతినిధికి ఇవ్వవచ్చు.
5. విచారణ రిపోర్టు, తమ సిఫార్సులతో కలసి సంబంధిత ప్రభుత్వానికి పంపించినపుడు, ఆయా ప్రభుత్వాలు ఒక నెలలోగా లేదా సంఘం నిర్దేశించిన కాలపరిమితిలోగా ఆ నివేదికపై తమ అభిప్రాయాలు, తీసుకున్న లేదా తీసుకోబోతున్న చర్యలు తెలియచేస్తూ సంఘానికి పంపించాలి.
6. సంఘం తన విచారణ నివేదికను, సిఫార్సులను, దానిపై సంబంధిత ప్రభుత్వ అభిప్రాయాలు, చర్యలను ప్రచురించాలి.

19. సైనిక బలగాలకు సంబంధించిన విధానాలు :

1. ఈ చట్టంలో ఏమి చెప్పినప్పటికీ, సైనిక బలగాలపై మానవ హక్కుల ఉల్లంఘన ఫిర్యాదులపై సంఘం ఈ క్రింది విధానం అవలంబించాలి.
   a) తనంతట తానుగా కాని ఏదైనా అర్జీ వచ్చినపుడు గాని కేంద్ర ప్రభుత్వాన్ని నివేదిక అడగాలి.
   b) నివేదిక వచ్చిన తర్వాత ఫిర్యాదుపై తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటం గాని లేదా సంబంధిత ప్రభుత్వానికి సిఫార్సులు చేయటం గాని చేయవచ్చు.
2. కేంద్ర ప్రభుత్వం మూడు నెలల్లోగా లేదా సంఘం అనుమతిస్తే ఆపైనగాని సదరు సిఫార్సులపై తీసుకున్న చర్యలు తెలియజేయాలి.
3. తన నివేదిక, సిఫార్సులు, వాటిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను సంఘం ప్రచురించాలి.
4. పై విధంగా ప్రచురించిన నివేదిక నకలును అర్జీ ఇచ్చిన వ్యక్తికి ఇవ్వాలి.

20. వార్షిక మరియు ప్రత్యేక నివేదికలు :

1. ప్రతి ఏటా సంఘం తన వార్షిక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలి. ఏదైనా ప్రత్యేక అంశంపై తక్షణ నివేదిక ఇవ్వాలని సంఘం భావిస్తే వార్షిక నివేదిక వరకు ఆగకుండా ప్రత్యేక నివేదికనివ్వవచ్చు.
2. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా వార్షిక ప్రత్యేక నివేదికలను పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టాలి. ఆయా నివేదికలతో పాటు సంబంధిత సిఫార్సులపై తీసుకున్న చర్యలను కూడా జతపర్చాలి.

అధ్యాయం -V

రాష్ట్ర మానవ హక్కుల సంఘాలు

21. రాష్ట్ర మానవ హక్కుల సంఘాల ఏర్పాటు :

1. ఆయారాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర మానవ హక్కుల సంఘాలను ఏర్పాటు చేయాలి. ఆ సంఘాలు ఈ అధ్యాయంలో చెప్పబడిన విధులు, అధికారాలు నిర్వర్తించాలి.
2. రాష్ట్ర మానవ హక్కుల సంఘం ఈ క్రింది విధంగా వుంటుంది.
   a) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వ్యక్తి అధ్యక్షులుగా వుంటారు.
   b) హైకోర్టు ప్రస్తుత న్యాయమూర్తి లేక న్యాయమూర్తిగా పనిచేసిన వ్యక్తి ఒక సభ్యులుగా
   c) రాష్ట్రంలో ప్రస్తుత జిల్లా న్యాయమూర్తిగాని లేక జిల్లా న్యాయమూర్తిగా పనిచేసిన వ్యక్తి గాని ఒక సభ్యులుగా
   d) మానవ హక్కులకు సంబంధించిన అవగాహన లేక అనుభవం వున్న ఇద్దరు వ్యక్తులు సభ్యులుగా
3. రాష్ట్ర మానవ హక్కుల సంఘానికి ప్రధాన కార్యనిర్వాహక అధికారిగా ఒక కార్యదర్శి వుంటారు. అతను సంఘం నిర్దేశించిన విధులు నిర్వహించాలి.
4. రాష్ట్ర మానవ హక్కుల సంఘం ప్రధాన కార్యాలయము రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతంలో నెలకొల్పాలి.
5. రాష్ట్ర మానవ హక్కుల సంఘం రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూలులోని రెండు, మూడవ జాబితాలకు సంబంధించిన మానవహక్కుల ఉల్లంఘన పైన మాత్రమే విచారణ జరపాలి. అయితే ఏదైనా అంశంపై జాతీయ మానవ హక్కుల సంఘం లేదా ఏ ఇతర చట్టబద్ధమైన సంఘం అప్పటికే విచారణ చేపట్టి వుంటే ఆ అంశంపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం విచారించకూడదు.

ఇదే విషయం జమ్మూకాశ్మీర్‌కు సంబంధించి పైన చెప్పబడిన రెండు, మూడు జాబితాల అంశాలకు బదులు కేవలం 3వ జాబితాలోని అంశాలు మాత్రమే అని చదువుకోవాలి.

22. రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షులు, సభ్యుల నియామకం :

1. రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షులు, సభ్యులను సంబంధిత రాష్ట్ర గవర్నర్ నియమిస్తారు. ఈ నియామకం ఈ క్రింద సూచించిన సభ్యులతో కూడిన కమిటీ సిఫారసు మేరకు జరగాలి.

   a) ముఖ్యమంత్రి – అధ్యక్షులు
   b) శాసనసభ స్పీకర్ – సభ్యులు
   c) రాష్ట్ర గృహ శాఖామంత్రి – సభ్యులు
   d) శాసనసభలో ప్రతిపక్ష నాయకులు – సభ్యులు

ఏదైనా రాష్ట్రంలో శాసనమండలి వున్నట్లయితే ఆ శాసనమండలి అధ్యక్షులు, ప్రతిపక్ష నాయకులు కూడా సభ్యులుగా వుంటారు. రాష్ట్ర హైకోర్టు లేదా జిల్లా కోర్టు ప్రస్తుత న్యాయమూర్తుల్ని నియమించే

ముందు సంబంధిత రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించాలి.

2. అధ్యక్షులు, సభ్యులు నియామకం సదరు కమిటీలో ఖాళీలు వున్నందువల్ల చెల్లకుండాపోదు.

23. రాష్ట్ర మానవ హక్కుల సంఘ సభ్యుల తొలగింపు :

1. రాష్ట్ర మానవ హక్కుల సంఘ అధ్యక్షులను గాని, సభ్యులను గాని వారి దుష్ప్రవర్తన నిరూపించబడిన తరువాత భారత రాష్ట్రపతి మాత్రమే తొలగించాలి. అయితే అంతకు ముందు సుప్రీంకోర్టు సూచించిన విధంగా విచారణ జరిగి సుప్రీంకోర్టు సదరు సభ్యులను తొలగించమని సిఫార్సు చేయాలి. ఇదికాక కింద సబ్ సెక్షన్ (2) ప్రకారం కూడా తొలగించవచ్చు.

2. పైన చెప్పిన దానితో సంబంధం లేకుండా అధ్యక్షులను, సభ్యులను రాష్ట్రపతి ఈ క్రింది సందర్భాలలో తొలగించవచ్చు.

   a) దివాళా తీసినపుడు

   b) పదవిలో వుంటూ ఇతర ఆదాయం సంపాదించే పనిచేస్తుంటే

   c) మానసికంగా, శారీరకంగా పనిచేయలేని స్థితిలో వున్నపుడు

   d) పిచ్చివానిగా కోర్టు ప్రకటించినపుడు

   e) రాష్ట్రపతి అభిప్రాయంలో నీతి బాహ్యమైన నేరానికి శిక్షపడినపుడు

24. రాష్ట్ర సంఘం యొక్క సభ్యుల పదవీ కాలం :

1. ఏ వ్యక్తి అయినా అధ్యక్షులుగా నియమింపబడిన తేదీ నుండి అయిదు సంవత్సరముల వరకు, లేదా డెబ్భై సంవత్సరముల వయసు వరకు ఏది ముందు అయితే అంతవరకు పదవిలో కొనసాగుతారు.

2. ఏ వ్యక్తి అయినా సభ్యునిగా నియమింపబడి ఆ వ్యక్తి ఆ పదవిలో చేరిన తేది నుండి అయిదు సంవత్సరముల వరకు ఆ పదవిలో కొనసాగుతారు. తరువాత ఆ వ్యక్తి మరొకసారి సభ్యులుగా నియమింపబడవచ్చును. అయితే ఏ సభ్యులూ డెబ్భై సంవత్సరముల వయస్సు దాటిన తరువాత పదవిలో కొనసాగరాదు.

3. అధ్యక్షులు లేదా సభ్యులు పదవి విరమించిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఏ ఉద్యోగము చేయరాదు.

25. కొన్ని సందర్భాలలో సభ్యులు అధ్యక్ష బాధ్యతను నిర్వహించుట :

1. అధ్యక్షులు చనిపోయినా, పదవికి రాజీనామా చేసినా, లేదా మరే విధంగానైనా ఆ పదవిలో ఖాళీ ఏర్పడినప్పుడు, సభ్యులలో ఒక సభ్యుని అధ్యక్ష బాధ్యతలు నిర్వహించవలసినదని గవర్నరు ఆదేశము జారీ చేయవచ్చును.

2. అధ్యక్షులు శెలవులో వున్నపుడు లేక ఇతర కారణాల వలన పదవీ బాధ్యతలు నిర్వహించలేనప్పుడు సదరు అధ్యక్షులు తిరిగి బాధ్యతలు తీసుకొను వరకు సభ్యులలో ఒక సభ్యుని అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించవలసినదని గవర్నరు ఆదేశము జారీ చేయవచ్చును.

26 రాష్ట్ర సంఘ సభ్యుల సర్వీసు షరతులు, నిబంధనలు :

సభ్యులకు చెల్లించు జీతబత్తెములు మరియు వారి సర్వీసు షరతులు, నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించు విధంగా ఉంటాయి.

అయితే సభ్యునికి చెల్లించబడు జీతబత్తెములు, మరియు సర్వీసు షరతులు, నిబంధనలు వారు పదవులలో చేరిన తరువాత వారికి నష్టము కలుగునట్లుండరాదు.

27. రాష్ట్ర సంఘం యొక్క ఇతర అధికారులు, సిబ్బంది :

1. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సంఘంనకు

a) రాష్ట్ర ప్రభుత్వములో కార్యదర్శి హోదాకు తక్కువ హోదా లేని అధికారిని రాష్ట్ర సంఘానికి కార్యదర్శిగాను, మరియు

b) పోలీసు ఇన్స్‌పెక్టర్ జనరల్ హోదాకు తక్కువకాని అధికారి క్రింద అవసరమని తలచునట్టి పోలీసు అధికారులను, రాష్ట్ర సంఘం వ్యవహారములను సమర్ధవంతంగా నిర్వహించుట కొరకు దర్యాప్తు సిబ్బందిని నియమిస్తుంది.

2. రాష్ట్ర ప్రభుత్వముచే ఇందు కొరకు చేయబడిన సంబంధిత నియమములకు లోబడి, రాష్ట్ర సంఘం తమకు అవసరమని తలచు పరిపాలక, సాంకేతిక, శాస్త్ర సిబ్బందిని నియమిస్తుంది.

3. అధికారుల, మరియు సబ్‌సెక్షన్ (2) క్రింద నియమింపబడిన సిబ్బంది యొక్క జీతబత్తెములు మరియు సర్వీసు నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వముచే నిర్ణయించబడిన విధముగా ఉంటాయి.

28. రాష్ట్ర సంఘం యొక్క వార్షిక మరియు ప్రత్యేక రిపోర్టు :

1. రాష్ట్ర సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి తన వార్షిక నివేదికను సమర్పించాలి. రాష్ట్ర సంఘం వార్షిక నివేదిక సమయం వరకు వాయిదా వేయుటకు వీలు లేకుండా త్వరగా లేక ప్రముఖంగా నివేదిక సమర్పించవలసి యున్న సంఘటనలేవైనా ఉన్నట్లు రాష్ట్ర సంఘం అభిప్రాయ పడినట్లయితే అట్టి నివేదికను సమర్పించవచ్చు.

2. రాష్ట్ర సంఘం అందచేసిన వార్షిక నివేదికను, ప్రముఖ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం వాటిపై తీసుకున్న లేక తీసుకొనబోవు చర్యలతో సహా రాష్ట్రంలో రెండు శాసనసభలున్నట్లయితే రెండు సభలకు లేక ఒకే శాసన సభ ఉన్నట్లయితే దానికి అందచేయాలి. ఒక వేళ ఏవయినా సిఫారసులను అంగీకరించినట్లయితే అందుకు కారణములను కూడా తెలియచేయాలి.

29. జాతీయ మానవ హక్కుల సంఘానికి సంబంధించిన కొన్ని నిబంధనలు రాష్ట్ర మానవ హక్కుల సంఘానికి వర్తించవు :

క్రింద సూచించబడిన మార్పులకు లోబడి సెక్షన్లు 9, 10, 12, 13, 14, 15, 16, 17, 18 యొక్క నిబంధనలు రాష్ట్ర సంఘానికి వర్తిస్తాయి. అట్టిమార్పులు –

a) "సంఘం" అను దానిని "రాష్ట్ర మానవ హక్కుల సంఘంగా" అన్వయించుకోవాలి.

b) సెక్షన్ (10) యొక్క సబ్ సెక్షన్ (3) లో "ఉన్నత కార్యదర్శి"కి బదులు "కార్యదర్శి" అని మార్చబడినది.

c) సెక్షన్ (12) లోని క్లాజు (f) వదిలివేయబడినది.

d) సెక్షన్ 17 లోని క్లాజు (i)లో "కేంద్ర ప్రభుత్వం లేక మరే" అను పదములు వదిలి వేయబడినవి.

అధ్యాయం - VII

ఆర్థిక సహాయం, అక్కౌంట్లు, ఆడిటింగు

32. కేంద్ర ప్రభుత్వంచే ఆర్థిక మంజూరి :

1. పార్లమెంటు నియమముల ప్రకారం ఆర్థిక వినియోగ నిర్ణయం చేసిన తరువాత ఈ చట్టం యొక్క ప్రయోజనముల ఉపయోగం కొరకు కేంద్ర ప్రభుత్వం తమకు సబబుగా పైకమును సంఘంకు మంజూరి చేస్తుంది.

2. అధ్యాయము 5 లోని విధులను నిర్వహించుటకు సంఘం తమకు తోచిన విధములో ఖర్చుపెడుతుంది. అట్టి పైకము సబ్‌సెక్షన్ (1) లో సూచింపబడిన మంజూరి నుండి ఖర్చు చేయబడినట్లు పరిగణించబడుతుంది.

34. జమ-ఖర్చుల లెక్కలు, ఆడిటింగు :

1. జమ – ఖర్చుల వివరాలను, సంబంధిత రికార్డును సంఘం నిర్వహించాలి. కంట్రోలరు ఆడిటర్ జనరల్‌ను సంప్రదించిన మీదట కేంద్ర ప్రభుత్వముచే నిర్ణయించబడిన పద్ధతిలో సంఘం జమ-ఖర్చుల వార్షిక నివేదికను తయారు చేయాలి.

2. సంఘం యొక్క జమ – ఖర్చుల లెక్కలు కంట్రోలరు ఆడిటర్ జనరల్‌చే నిర్ధారింపబడిన కాలవ్యవధిలో ఆడిట్ చేయబడతాయి. ఈ ఆడిటింగ్ సందర్భంలో అయిన ఖర్చులను సంఘం కంట్రోలరు ఆడిటర్ జనరల్‌కు చెల్లించవలసి ఉంటుంది.

3. కంట్రోలరు మరియు ఆడిటర్ జనరల్, మరియు సంఘం జమ-ఖర్చులను ఆడిట్ చేయుటకు ఆయనచే నియమింపబడిన అధికారి ఈ చట్టం క్రింద సంఘం జమ-ఖర్చులను ఆడిట్ చేస్తున్నప్పుడు వారు, ప్రభుత్వ జమ-ఖర్చులను ఆడిట్ చేస్తున్నప్పుడు సాధారణంగా కలిగి ఉండు హక్కులు మరియు ప్రత్యేకాధికారములు కలిగి ఉంటారు, మరియు ప్రత్యేకంగా అక్కౌంటు పుస్తకములను, జమ-ఖర్చులు వాటి వోచర్లు దాఖలు చేయమని కోరు హక్కుతో పాటు సంఘం ఆఫీసులలో వేటినైనా తనిఖీ చేయు అధికారము కలిగి ఉంటారు.

4. ఆడిట్ రిపోర్టుతో సహా కంట్రోలరు మరియు ఆడిటరు జనరలు లేక ఆయనచే ఇందుకొరకు నియమింపబడిన అధికారిచే ధ్రువపరచబడిన సంఘం అక్కౌంట్లు సంఘంచే ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వానికి పంపించబడాలి. అట్టి ఆడిట్ రిపోర్టు అందిన వెంటనే కేంద్ర ప్రభుత్వం దానిని పార్లమెంటు ఉభయసభలలో ఉంచాలి.

35. రాష్ట్ర సంఘం యొక్క జమ-ఖర్చుల లెక్కలు, ఆడిటింగు :

1. జమ-ఖర్చుల వివరాలను, సంబంధిత రికార్డును రాష్ట్ర కమీషను నిర్వహించాలి. ఆడిటర్ జనరల్‌ను సంప్రదించిన మీదట రాష్ట్ర ప్రభుత్వంచే నిర్ణయించబడిన పద్ధతిలో రాష్ట్ర సంఘం జమ ఖర్చుల వార్షిక నివేదికను తయారు చేయాలి.

2. సంఘం యొక్క జమ-ఖర్చుల లెక్కలు కంట్రోలరు మరియు ఆడిటర్ జనరల్‌చే నిర్ధారింపబడిన కాలవ్యవధిలో ఆయనచే ఆడిట్ చేయబడతాయి. ఈ ఆడిటింగ్ సందర్భములో అయిన ఖర్చులను రాష్ట్ర సంఘం కంట్రోలరు మరియు ఆడిటర్ జనరల్‌కు చెల్లించవలసి ఉంటుంది.

3. కంట్రోలరు మరియు ఆడిటర్ జనరలు, మరియు రాష్ట్ర సంఘం జమ ఖర్చులను ఆడిట్ చేయుటకు ఆయనచే నియమింపబడిన అధికారి ఈ చట్టము క్రింద రాష్ట్ర సంఘం జమ-ఖర్చులను ఆడిట్ చేస్తున్నప్పుడు, వారు ప్రభుత్వ జమ-ఖర్చులను ఆడిట్ చేస్తున్నప్పుడు సాధారణంగా కలిగి ఉండు హక్కులు మరియు ప్రత్యేకాధికారములు కలిగి ఉంటారు, మరియు ప్రత్యేకంగా అక్కౌంటు పుస్తకములను, జమ-ఖర్చులు, వాటి వోచర్లు దాఖలు చేయమని కోరు హక్కుతో పాటు రాష్ట్ర సంఘం ఆఫీసులలో దేనినైనా తనిఖీ చేయు అధికారము కలిగి ఉంటారు.

4. ఆడిట్ రిపోర్టుతో సహా కంట్రోలరు మరియు ఆడిటరు జనరలు లేక ఆయనచే ఇందుకొరకు నియమింప బడిన అధికారిచే ధ్రువపరచబడిన రాష్ట్ర సంఘం అక్కౌంట్లు రాష్ట్ర సంఘంచే ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వానికి పంపించబడాలి. అట్టి ఆడిట్ రిపోర్టు అందిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దానిని రాష్ట్ర శాసనసభలో ఉంచాలి.

అధ్యాయం- VIII

ఇతరములు

36. సంఘం పరిధిలో లేని విషయములు :

1. ఒక రాష్ట్ర సంఘం ముందుగాని లేక ప్రస్తుతం అమలులో ఉన్న ఏ నియమము క్రింద అయినా ఏర్పాటు చేయబడిన సంఘం ముందుగాని విచారణలో ఉన్న ఏ విషయమైనా సంఘం విచారించరాదు.

2. మానవ హక్కులు ఉల్లంఘన జరిగి ఒక సంవత్సర కాలం పూర్తిఅయినప్పుడు ఆ ఆరోపణపై సంఘం గాని, లేక రాష్ట్ర సంఘం గాని దానిపై విచారణ చేయదు.

37. ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు :

ప్రస్తుతం అమలులో ఉన్న ఏవైనా నియమములలో ప్రభుత్వం అవసరమని తలచినట్లయితే మానవ హక్కుల ఉల్లంఘన వల్ల తలెత్తిన నేరములను విచారించుటకు, మరియు దోషులను శిక్షించుటకు ప్రభుత్వం ఒకటిగాని లేక అంతకు మించి గాని అవసరమనుకొను పోలీసు అధికారులతో దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేయవచ్చు.

38. సద్భావనపై చేపట్టిన చర్యకు రక్షణ :

ఈ చట్టము క్రింద గాని, లేక దాని క్రింద చేయబడిన నియమములు లేక ఆదేశములను పురస్కరించుకొని సద్భావనతో చేపట్టిన చర్యలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, సంఘం, రాష్ట్ర సంఘం అధికారముతో ఏదయినా రిపోర్టు సద్భావనతో ప్రచురించినా లేక కార్యకలాపములు చేపట్టినా అట్టి కేంద్ర ప్రభుత్వమునకు, రాష్ట్ర ప్రభుత్వమునకు, సంఘంనకు, రాష్ట్ర సంఘంకు లేక వాటి ఆదేశములపై వ్యవహరించు ఏ సభ్యునికి ప్రతికూలములో ఎట్టి దావాగాని లేక శాసనిక కార్యకలాపములు గాని ఉండరాదు.

39. సభ్యులు, అధికారులు, ప్రభుత్వోద్యోగులు :

రాష్ట్ర సంఘం యొక్క విధులను నిర్వహించుట కొరకు నియమింపబడిన ప్రతి అధికారి, భారత శిక్షాస్మృతి

యొక్క సెక్షను 21లో సూచింపబడినట్లు ప్రభుత్వోద్యోగిగా పరిగణింపబడతారు.

40. నియమముల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ అధికారములు :

1. ఈ చట్టము యొక్క నిబంధనలను నిర్వహించుటకు కేంద్ర ప్రభుత్వము నోటిఫికేషన్‌చే నియమములను చేస్తుంది.
2. ప్రత్యేకముగాను మరియు సదరు అధికారములకు భంగము కలుగకుండా ఈ నియమములు క్రింద సూచింపబడిన అన్ని లేక కొన్నివిషయములలో కలిగి వుంటాయి అవి :
   a) సెక్షన్ 8 క్రింద సభ్యుల యొక్క జీతబత్తెములకు మరియు వారి సర్వీసు యొక్క షరతులకు, నిబంధనలకు
   b) సంఘంచే పరిపాలక, సాంకేతిక, శాస్త్రపరిజ్ఞాన సిబ్బంది నియామకమునకు లోబడి మరియు సెక్షన్ 11 యొక్క సబ్‌సెక్షన్ (3) క్రింద వారికి చెల్లించబడు జీతబత్తెములకు
   c) సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (1) లోని క్లాజు (f) క్రింద నిర్ణయించుటకు అవసరమగు సివిలు న్యాయస్థానము యొక్క ఏ ఇతర అధికారమైనా
   d) సెక్షన్ 34 యొక్క సబ్ సెక్షన్ (1) క్రింద సంఘంచే తయారు చేయబడు జమ-ఖర్చుల వార్షిక నివేదిక నమూనా
   e) నిర్ణయించబడిన లేక నిర్ణయించబోవు మరే ఇతర విషయమైనా
3. ఈ చట్టం క్రింద చేయబడిన ఏ నియమమైనా వీలయినంత త్వరలో దానిని 30 దినముల వరకు పార్లమెంటు సమావేశములో ఒక సమావేశములోగాని లేక రెండు లేక మూడు వరుస సమావేశములలో గాని ఉంచాలి. సమావేశము లేక పైన చెప్పబడినట్లు రెండు లేక మూడు సమావేశములలో 30 దినములు ముగియగానే ఆ నియమము ఉభయ సభలలో చేసిన రద్దు క్రింద అంతకు ముందు చేసిన వాటికి ఎట్టి భంగము కలుగకుండా ఉంటుంది.

41. నియమముల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ అధికారములు :

1. ఈ చట్టం యొక్క నిబంధనలు నిర్వహించుటకు రాష్ట్ర ప్రభుత్వము నోటిఫికేషను చేసి నియమములను చేస్తుంది.
2. ప్రత్యేకంగాను మరియు సదరు అధికారములకు భంగము కలుగకుండా ఈ నియమములు క్రింద సూచింపబడిన అన్ని లేక కొన్ని విషయములకు ఉంటాయి : అవి –
   a) సెక్షన్ 26 క్రింద సభ్యుల యొక్క జీతబత్తెములకు మరియు వారి సర్వీసు యొక్క షరతులకు, నిబంధనలకు,
   b) రాష్ట్ర సంఘంచే పరిపాలక, సాంకేతిక, శాస్త్ర పరిజ్ఞాన సిబ్బంది నియామకమునకు లోబడి మరియు సెక్షన్ 27 యొక్క సబ్‌సెక్షన్ (3) క్రింద వారికి చెల్లించబడు జీతబత్తెములకు
   c) సెక్షన్ 35 యొక్క సబ్ సెక్షన్ (1) క్రింద రాష్ట్ర ప్రభుత్వముచే తయారుచేయబడు జమ-ఖర్చుల వార్షిక నివేదిక నమూనా.

3. ఈ సెక్షన్ క్రింద రాష్ట్ర ప్రభుత్వముచే చేయబడిన ప్రతి నియమము అది అయిన తరువాత వీలయినంత త్వరలో శాసనసభకు ఉభయసభలున్నట్లయితే రెండు సభలలోను, ఒకే సభ ఉన్నట్లయితే ఆ సభలోను ఉంచాలి.

42. ఆటంకములను తొలగించు అధికారము :

1. ఈ చట్టములోని నిబంధనల అమలులో ఏవయినా ఆటంకములు వచ్చినట్లయితే, ఈ చట్టము యొక్క నిబంధనలో ఏవయినా అసందర్భముగా ఉన్నట్లు భావించినట్లయితే అట్టి ఆటంకములను కేంద్ర ప్రభుత్వం అధికార గెజిట్‌లో ప్రచురించిన ఆదేశము ద్వారా వాటిని తొలగించవచ్చును.

అయితే ఈ చట్టము అమలులోనికి వచ్చిన తేదీ నుండి రెండు సంవత్సరములు తరువాత అట్టి ఆదేశము చేయరాదు.

2. ఈ సెక్షన్ క్రింద చేయబడిన ప్రతి ఆదేశము అది జారీ చేయబడిన తరువాత సాధ్యమైనంత త్వరలో దానిని పార్లమెంటు ఉభయసభలలో ఉంచాలి.

43. రద్దు, మినహాయింపు :

1. మానవ హక్కుల రక్షణ ఆర్డినెన్స్, 1993 ఇందుమూలముగా రద్దుచేయబడినది.
2. ఈ రద్దులో ఏమి ఉన్నప్పటికీ ఈ ఆర్డినెన్సు క్రింద చేసినదేది అయినా, లేక ఏ చర్య అయినా తీసుకొనిన అవి ఈ చట్టము యొక్క తత్సమానమైన నిబంధనల క్రిందనే తీసుకొనినట్లు భావింపబడుతుంది.

జాతీయ మానవ హక్కుల సంఘం నిబంధనలు - 1994

మానవ హక్కుల రక్షణ చట్టము, 1993 (1994లో 10వది) యొక్క సెక్షన్ 10 లోని సబ్ సెక్షన్ (2) చే రూపొందించబడిన అధికారములను పురస్కరించుకొని జాతీయ మానవ హక్కుల సంఘం ఈ క్రింది నిబంధనలు చేసింది. అవి –

1. పేరు, అమలు తేదీ :

1. ఈ నిబంధనలను జాతీయ మానవహక్కుల సంఘం నిబంధనలు, 1994 అని పిలువబడతాయి.
2. ఈ నిబంధనలు 1994 మార్చి 1వ తేదీ నుండి అమలులో ఉంటాయి.

2. నిర్వచనాలు :

సందర్భాన్ని బట్టి వేరే అర్థం వస్తే మినహా ఈ నిబంధనలోని పదాలు ఈ క్రింది విధంగా ఉంటాయి.

a) "చట్టము" అనగా మానవ హక్కుల రక్షణ చట్టము, 1993.

b) 'అధ్యక్షులు" అనగా సంఘం యొక్క అధ్యక్షులు.

c) "సంఘం" అనగా జాతీయ మానవ హక్కుల సంఘం.

d) "సభ్యులు" అనగా అధ్యక్షులతో సహా సంఘంలోని సభ్యులు

3. సంఘం యొక్క ప్రధాన కార్యాలయము :

సంఘం యొక్క ప్రధాన కార్యాలయము ఢిల్లీలో ఉంటుంది.

4. సమావేశములు నిర్వహించు స్థలము :

సంఘం తన సభలను, సమావేశములను సాధారణంగా ఢిల్లీలోనున్న ఆఫీసులో నిర్వహిస్తుంది. అయితే సంఘం తమ ఆదేశముపై అట్టి సభలు, సమావేశాలు, వారికి అనుగుణంగా భారతదేశంలో ఎక్కడైనా జరుపుకోవచ్చు.

5. సమావేశములు జరుపు పద్ధతి:

సంఘం సాధారణంగా ప్రతి నెలలో మొదటి మరియు మూడవ వారాలలో సెలవు దినములలో తప్ప సమావేశమవుతుంది. అయితే సంఘం యొక్క అధ్యక్షులు తనంతట తాను గాని లేక సభ్యులలో ఒకరు లేదా ఎక్కువ మంది కోరిక మీద గాని త్వరగా చర్చించవలసిన విషయమేదయినా ఉన్నట్లయితే దానిని చర్చించుటకు ప్రత్యేక సమావేశమేర్పాటు చేయవచ్చును.

6. సచివాలయ సహాయము :

అధ్యక్షుల ఆదేశముపైన లేక అవసరమని అభిప్రాయపడినప్పుడు కమీషన్ యొక్క ఇతర అధికారులతో సహా ఉన్నత కార్యదర్శి అట్టి సమావేశములకు హాజరు కావలసి ఉంటుంది.

7. చర్చించాల్సిన అంశములు :

అధ్యక్షులతో సంప్రదించి ఉన్నత కార్యదర్శి కమీషను యొక్క ప్రతి సమావేశములో చర్చించబోవు అంశాలను తయారుచేసి, ఆ అంశములపై వివరణ తయారు చేయుటకు సచివాలయమునకు పంపాలి. అట్టి వివరణ సాధ్యమైనంత వరకు స్వయం సంపూర్ణంగా ఉండాలి. చర్చనీయాంశ పట్టికలోని అంశములకు సంబంధించిన ఫైళ్ళు సంఘం సంప్రదింపునకు తయారుగా ఉంచాలి. చర్చనీయాంశముల పట్టిక ప్రతి సభ్యునికి సమావేశానికి రెండు రోజులు ముందుగా తెలియచేయాలి. కాని సమావేశములో నిర్ణయము మాత్రమే చేయవలసి ఉన్నట్లయితే అట్టి అంశముల జాబితా తయారు చేసి తెలియచేయాలి.

8. ఫిర్యాదుల పరిష్కారానికి విధానము :

1. ఏదైనా ఫిర్యాదు సంఘానికి అందినప్పుడు సంఘం దానిని నమోదు చేసి క్రమ సంఖ్యనిచ్చి అధ్యక్షుల ప్రత్యేక లేక సాధారణ ఆదేశములపై ఏర్పాటు చేయబడిన ఏక సభ్యుని ముందు ఫిర్యాదు అందిన వారంలోపు ఉంచాలి. విచారణ చేయు సభ్యుడు ఫిర్యాదులోని ప్రాముఖ్యతననుసరించి ఫిర్యాదు స్వీకరించుట కొరకు దానిపై అంతిమ నిర్ణయం చేయుట కొరకు ఇద్దరు సభ్యులకు తక్కువ కాని బెంచి తగినదని అభిప్రాయపడినప్పుడు సదరు ఏక సభ్యులు దానిని ఇద్దరు సభ్యులున్న బెంచికి అప్పగించవచ్చు. అట్టి నిర్దేశం అందిన మీదట అధ్యక్షులు ఇద్దరు లేక అంతకు మించిన సభ్యులతో ఏర్పాటు చేయబడిన బెంచికి ఆ ఫిర్యాదు అప్పగించాలి.

సంఘం సాధారణంగా క్రింద సూచింపబడిన విధంగా ఫిర్యాదులుంటే స్వీకరించదు.

a) ఫిర్యాదు ఏ సంఘటనపై చేయబడిందో అట్టి సంఘటన జరిగి ఒక సంవత్సర కాలం దాటితే

b) కోర్టులో వున్న కేసులకు సంబంధించి

c) స్పష్టత లేని, పేరులేని, లేక మారు పేరుతో ఉన్న ఫిర్యాదులు స్వీకరించబడవు.

d) నిస్సార స్వభావమున్న ఫిర్యాదులు

e) సంఘం పరిధిలో లేని ఫిర్యాదులు

2. ఫిర్యాదులపై ఎలాంటి రుసుము వసూలు చేయబడదు.

3. ఫిర్యాదుకు దారి తీసిన విషయము యొక్క వివరములు స్పష్టత కలిగి ఉండాలి. సంఘంచే సత్వర చర్య తీసుకొనబడుటకు ఫిర్యాదు ఇంగ్లీషులో గాని లేక హిందీలో గాని ఉండాలి. ఫిర్యాదు సమర్పించుకొనుటలో సౌలభ్యం కోసం రాజ్యాంగం యొక్క ఇంగ్లీషు షెడ్యూలులో చేర్చబడిన ఏ భాషలోనైనా ఫిర్యాదును సంఘం స్వీకరించవచ్చును. అవసరమైన సందర్భములలో అభియోగములను బలపరచుట కొరకు మరింత సమాచారము, మరియు ఆధిడవిట్లను సంఘం కోరవచ్చును.

4. సంఘం సందర్భోచితంగా ఫిర్యాదులను టెలిగ్రామ్ ద్వారాను మరియు ఫ్యాక్స్ ద్వారా స్వీకరించవచ్చును.

5. కాలపరిమితి కారణంపై ఫిర్యాదును తిరస్కరించుటకు సంఘంకు అధికారముంటుంది.

6. ఫిర్యాదు అందిన మీదట సంఘంచే దర్యాపు చేయబడుటకు లేదా దానిపై దర్యాప్తు జరిపించాలా లేదా అనే విషయంపై అధ్యక్షులు సంఘాన్ని ఆదేశిస్తారు.

7. అధ్యక్షులు, సంఘం ఏ ఫిర్యాదుపైన నిర్ణయం తీసుకున్నదో అట్టి ఫిర్యాదుపైన సచివాలయము సంబంధిత ప్రభుత్వము/అధికారి నుండి ఆ ఫిర్యాదుపై రిపోర్టు నిర్ణీత కాలవ్యవధిలో అందించవలయునని కోరవచ్చును.

8. సంబంధిత అధికారి నుండి అట్టి రిపోర్టు అందిన మీదట సంఘం పరిశీలనకై కేసు యొక్క యోగ్యతలపై సవివర నివేదిక తయారు చేయబడాలి.

9. సంఘం యొక్క ఆదేశములను మరియు సిఫారసులను ఈ చట్టము యొక్క సెక్షన్లు 18, 19 లలో సూచింపబడినట్లు సంబంధిత ప్రభుత్వమునకు / అధికారికి మరియు అర్జీదారునికి అందింప చేయాలి.

10. సంఘం తన నివేదనపై అర్జీదారుని లేదా అతని తరపున మరే ఇతర వ్యక్తినయినా వ్యక్తిగత విచారణ చేయవచ్చు. అట్టి ఇతర వ్యక్తిని సంఘం అభిప్రాయంలో తమ ముందు ఉన్న విషయం యొక్క నిర్దిష్ట పరిష్కారం కొరకు విచారించాలి, మరియు అవసరమైనచో రికార్డులను తెప్పించి వాటి ఆధారంపై సాక్షిని విచారించాలి. అర్జీదారుని ప్రతిష్టకు భంగం కలుగకుండా ఉండే విధంలో అర్జీదారుని ఫిర్యాదు, దానిని బలపర్చు విషయములపై సాక్షిని క్రాసు పరీక్ష చేయుటకు అర్జీదారునికి తగిన అవకాశమిచ్చి సంఘం సబబయిన విచారణ చేయాలి.

11. సంఘం యొక్క బృందముచే గాని, లేక సంఘం ఆదేశంపై మరే ఇతర వ్యక్తి అయినా విచారణ సాగించినప్పుడు విచారణపై రిపోర్టును విచారణ పూర్తి అయిన వారంలోపున గాని లేక సంఘంచే అనుమతింపబడిన మరికొంత గడువులో గాని సమర్పించాలి. రిపోర్టుపై సరి అయిన నిర్ణయము తీసుకొనుటకు అవసరమైన విచారణ సరిగా జరుగలేదని లేక నిజము తెలుసుకొనుటకు మరికొంత విచారణ అవసరమని సంఘం అభిప్రాయపడినచో ఆ కేసును తిరిగి విచారణ చేయవలసినదని సంఘం ఆదేశించవచ్చు. రిపోర్టు అందిన మీదట సంఘం తనంతట తానుగాని లేక రిపోర్టు ద్వారా గాని, కేసు తమచే విచారించబడుతుందని ఆదేశమిచ్చి అట్టి విచారణలో సాక్ష్యము తీసుకొనవచ్చు.

12. అధ్యక్షుల అభ్యర్థనపై సంఘం, దాని సభ్యులు ఏ విషయముపైన అయినా అక్కడికక్కడే అధ్యయనం చేయుటకు ఏ స్థలమైనా సందర్శించినప్పుడు, మరియు అట్టి అధ్యయనం ఒకరు లేక ఎక్కువమందినే చేపట్టబడినప్పుడు అట్టి అధ్యయనానికి సంబంధించిన రిపోర్టు సాధ్యమైనంత త్వరలో సంఘంకు అందచేయాలి.

9. సమావేశ వివరాలు :

a) సంఘం యొక్క ప్రతి సమావేశ వివరములు అట్టి సమావేశంలో గాని లేక సమావేశము పూర్తి అయిన వెంటనే గాని ఉన్నత కార్యదర్శి లేక ఆదేశము ప్రకారము మరే ఇతర అధికారిగాని రికార్డు చేయాలి. ఆ వివరములను అధ్యక్షుల ఆమోదము కొరకు వారికి అందచేయాలి. అట్లు ఆమోదము పొందిన తరువాత ఆ వివరములు సంఘ సభ్యులందరికి సాధ్యమైనంత త్వరలో సర్కులేట్ చేయబడాలి, ఏదెట్లయినా తరువాత జరుగబోవు సమావేశమునకు ముందు సర్కులేట్ చేయబడాలి.

b) సంఘం స్వీకరించిన ప్రతి విషయము యొక్క ముగింపు అభిప్రాయముగా రికార్డు చేయబడుతుంది. ఏవయినా భిన్నాభిప్రాయములున్నట్లయితే అవి దానిలో భాగంగా రికార్డు చేయబడతాయి. బేధాభిప్రాయాలు ఉన్నట్లయితే అధిక సంఖ్యాబల అభిప్రాయ ప్రాతిపదికపై చర్య తీసుకొనబడుతుంది.

c) కొనసాగింపు చర్యలపై నిర్దిష్టంగా అధికారమీయబడితే తప్ప లేక సమావేశము యొక్క నిర్ణయాలు అధ్యక్షులు ఖాయము చేస్తే తప్ప సంఘం యొక్క సచివాలయము అట్టి వివరములపై చర్య తీసుకొనరాదు.

10. సమావేశ వివరాల రికార్డు :

ప్రధాన కార్యదర్శిచే రుజువు చేయబడిన ప్రతి సమావేశ కార్య వ్యవహారములను సంఘం నిర్వహించాలి, మరియు ప్రతి అంశమునకు సంబంధించిన కార్య వ్యవహారములను సరైన చర్యలు తీసుకొనుటకు గాను సంబంధిత ఫైలులో ఉంచాలి. అభిప్రాయములను సంబంధిత రికార్డుతో ఉంచి సౌలభ్యం కోసం వాటి కాపీలకు క్రమసంఖ్యనిచ్చి గార్డు ఫైలులో ఉంచాలి.

11. తీసుకున్న చర్య యొక్క రిపోర్టు :

చర్య అవసరము లేదని తెలియ చేయబడిన అంశములపై తప్ప మిగిలిన అంశములపై అంతకు ముందు జరిగిన సమావేశములలో తీసుకున్న నిర్ణయములపై తీసుకున్న ప్రస్తుత దశ సంఘంనకు తరువాత సమావేశములలో తెలియ చేయబడాలి.

12. ప్రధాన కార్యాలయం వెలుపల వ్యాపార లావాదేవీ :

సంఘం గాని లేక కొంతమంది సభ్యులు గాని, అంతకు ముందుగానే అధ్యక్షులు అనుమతించినప్పుడు, ప్రధాన కార్యస్థానము వెలుపల వ్యాపార లావాదేవీలు కొనసాగించవచ్చును. అయితే ఈ చట్టము క్రింద ఏ విచారణలోనైనా కక్షిదారులను విచారించవలసి ఉన్నట్లయితే అట్టి ప్రయోజనమునకు కనీసం ఇద్దరు సభ్యులతో కూడిన బెంచి ఏర్పాటు చేయవలసి ఉంటుంది.

13. ఆదేశముల మరియు నిర్ణయముల ప్రామాణీకరణ :

1. సంఘం యొక్క ఆదేశములు మరియు నిర్ణయములు ప్రధాన కార్యదర్శిచే గాని లేక ఆధీన కార్యదర్శి హోదాకు తక్కువగాని హోదా గల సంఘ అధికారిచే గాని ప్రామాణీకరణ చేయబడాలి.

2. విచారణ రిపోర్టు కాపీ, సంఘంచే విషయముపై తీసుకొనబడిన నిర్ణయము, దానిపై జారీ చేయబడిన ఆదేశముల కాపీలను అర్జీదారునికి లేదా అతని ప్రతినిధులకు ఎట్టి రుసుము లేకుండానే అందచేయబడాలి.

3. "రహస్యము" అని సంఘంచే వర్గీకరింపబడిన ఏ డాక్యుమెంటు అయినా కక్షిదారులు కోరినట్లయితే, వాటికైన ఖర్చులకు గాను సబబైన రుసుము చెల్లించి వాటిని పొందవచ్చును. కాపీలను వీలయినంత త్వరలో – కోరిన వారంలోపు అందజేయాలి.

14. వార్షిక రిపోర్టు :

చట్టము యొక్క సెక్షను 20 (1) లో సూచింపబడిన విధంలో సంఘం, ఏప్రిల్ మొదట తారీఖు నుండి మరుసటి సంవత్సరం మార్చి 31 వరకున్న కాలమునకు, వార్షిక రిపోర్టును కేంద్ర ప్రభుత్వమునకు మరియు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వమునకు సమర్పించవలసి ఉంటుంది. అసలు రిపోర్టు అధ్యక్షులు మరియు సంఘ సభ్యులచే సంతకములు చేయబడి, జాగ్రత్త చేయబడాలి. డ్రువీకరింపబడిన కాపీ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వమునకు మే నెలలో పంపించాలి.

15. ప్రత్యేక రిపోర్టు :

సంఘం చట్టము యొక్క సెక్షన్ 20(1) లో సూచింపబడినట్లు నిర్దిష్ట విషయములపై ప్రత్యేక రిపోర్టును పంపవచ్చు.

16. ఫిర్యాదులపై, విచారణలపై రిపోర్టు :

చట్టము యొక్క సెక్షను 18 లేక 10కి సంబంధించే ప్రతి రిపోర్టు, సంఘం కార్యవ్యవహారములను పూర్తి చేసిన వారంలోపు సంబంధిత ప్రభుత్వానికి, అధికారికి, లేదా వ్యక్తికి పంపబడాలి. సంబంధిత ప్రభుత్వము యొక్క లేక అధికారి యొక్క వ్యాఖ్యానము అందిన ఒక వారం లోపు కమీషను, చట్టము యొక్క సెక్షన్లు 18(6) లేక 19 (3) లో సూచింపబడిన విధముగా దానిని ప్రచురించాలి.

17. రిపోర్టు ముద్రణ :

సంఘం సచివాలయమునకు సాధ్యమైనంత త్వరలో పూర్తి చేయబడిన నెలకు మించకుండా వార్షిక రిపోర్టును, ప్రత్యేక రిపోర్టును అతి జాగ్రత్తతో ముద్రించవలసిన బాధ్యత ఉంటుంది.

18. దర్యాప్తు బృందం :

పోలీసు డైరెక్టర్ జనరల్ హోదాకు తక్కువకాని వ్యక్తి ఆధ్వర్యంలో ఇద్దరు పోలీసు సూపరింటెండెంట్లతోను, ఆరుగురు డిప్యూటీ సూపరింటెండింట్లతోను మరియు 24 మంది పోలీసు ఇన్స్‌పెక్టర్లతోను సంఘంకు స్వంతంగా ఒక దర్యాప్తు బృందం ఉంటుంది. ఏ సమయంలోనైనా దర్యాప్తుదారులుగా లేక పరిశీలకులుగా దర్యాప్తులో సహకరించుటకు సంఘం బైట వారిని సముచిత సంఖ్యలో ఏ కేసు కొరకైనా నియమించవచ్చును.

19. ఈ నిబంధనలచే వర్తింపబడని ఏ విషయమైనా తలెత్తినప్పుడు సంఘం సముచిత ఆదేశములిచ్చుటకు అధికారము కలిగి ఉంటుంది. ఈ నిబంధనలలో ఎప్పటికప్పుడు చేర్పులు, తొలగింపులు విపులీకరించుటకు మరియు మార్పులు చేయుటకు సంఘంకు అధికారముంటుంది.

*****

9. సమాచార హక్కు చట్టం 2005

సమాచార హక్కు చట్టం 2005 యొక్క ముఖ్య ఉద్దేశ్యం వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖలలో పారదర్శకత మరియు జవాబుదారీతనం తీసుకురావడం కోసం, ఆయాశాఖలలో వున్న సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం కేంద్ర సమాచార కమీషన్, రాష్ట్ర సమాచార కమీషన్లను నెలకొల్పడం ఈ చట్టం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

అధ్యాయం - I

ప్రాథమిక అంశాలు

1. పేరు, పరిధి, అమలుతేదీ:

1. ఈ చట్టాన్ని సమాచార హక్కు చట్టం 2005 గా పిలవవచ్చు.
2. ఈ చట్టం భారతదేశమంతా వర్తిస్తుంది. జమ్మూ, కాశ్మీర్ మినహా.
3. సెక్షన్ 4 లోని సబ్‌సెక్షన్ (1), సెక్షన్ 5 లోని సబ్‌సెక్షన్ (1), (2), సెక్షన్ 12, 13, 15, 16, 24, 27, 28 తక్షణం అమలులోనికి వస్తాయి.

ఈ చట్టంలోని ఇతర నిబంధనలు దీనికి చట్టరూపం వచ్చిన తరువాత 120 వ రోజున అమలు లోనికి వస్తాయి.

2. ఈ చట్టంలో, సందర్భానుసారం ఏమైనా మార్పులు ఉంటే తప్ప

ఎ) "సముచిత ప్రభుత్వం" అనగా ప్రభుత్వ అధికారం కలిగి ప్రభుత్వం చేత నెలకొల్పబడిన ప్రభుత్వ నియంత్రణలో వున్న ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ, నిధులు పొందుతూ ఈ దిగువన ఉదహరించ బడిన వారి చేత నెలకొల్పబడినవి.

i) కేంద్ర ప్రభుత్వంగానీ, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వం గానీ స్థాపించిన,

ii) రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అధికార యంత్రాంగాలు, రాష్ట్ర ప్రభుత్వం.

బి) "కేంద్రసమాచార కమీషన్" అనగా సెక్షన్ 12 లోని సబ్‌సెక్షన్ (1) కింద ఏర్పాటయ్యే కేంద్ర సమాచార కమీషన్.

సి) "కేంద్ర పౌర సమాచార అధికారి" అనగా సెక్షన్ 5 లోని సబ్‌సెక్షన్ (1) కింద నియమితులయ్యే కేంద్ర పౌర సమాచార అధికారి. అదే సెక్షన్‌లోని సబ్ సెక్షన్ (2) కింద నియమితులయ్యే కేంద్ర పౌర సమాచార సహాయ అధికారి కూడా ఈ కోవకే చెందుతారు.

డి) "ప్రధాన సమాచార కమీషనర్", "సమాచార కమీషనర్" అనగా సెక్షన్ 12 లోని సబ్‌సెక్షన్ (3) కింద నియమితులయ్యే ప్రధాన సమాచార కమీషనర్, సమాచార కమీషనర్.

ఇ) 'సామర్థ్యం కలిగిన అధికారి' అనగా

i) లోక్‌సభ, రాష్ట్రశాసనసభ, కేంద్రపాలిత శాసనసభలకు సంబంధించి స్పీకర్, రాష్ట్ర విధానమండలులకు సంబంధించి అధ్యక్షులు.

ii) సుప్రీంకోర్టుకు సంబంధించి భారత ప్రధాన న్యాయమూర్తి.

iii) హైకోర్టుకు సంబంధించి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి.

iv) రాజ్యాంగం ప్రకారం, రాజ్యాంగం కింద నియమితులైన పరిపాలనాధికారి.

v) రాజ్యాంగంలోని ఆర్టికల్ 239 కింద నియమితులైన పరిపాలనాధికారి.

యఫ్) 'సమాచారం' అనగా రికార్డులు, పత్రాలు, మెమోలు, ఇ-మెయిల్స్, అభిప్రాయాలు, సలహాలు, పత్రికా ప్రకటనలు, సర్క్యులర్లు, ఉత్తర్వులు, లాగ్‌బుక్స్, కాంట్రాక్టులు, నివేదికలు, పేపర్లు, శాంపిళ్ళు, మోడల్స్, డేటా సహా ఎలక్ట్రానిక్ రూపంతో పాటు ఏరూపంలో నయినా ఉన్న సమాచారం. అమలులో ఉన్న మరే చట్టం ప్రకారమయినా ప్రభుత్వ యంత్రాంగం సంపాదించదగిన ఏ ప్రయివేటు సంస్థకు సంబంధించిన సమాచారమయినా ఈ చట్టం ప్రకారం సమాచారమే.

జి) "నిర్ణీత" అనగా ఈ చట్టం కింద రూపొందిన నిబంధనల ప్రకారం ప్రభుత్వంగానీ, సమర్థాధికారి గానీ నిర్ణయించిన విధంగా

హెచ్) "అధికార యంత్రాంగం" అనగా ఈ క్రింది పద్ధతులలో ఏర్పాటయిన ప్రభుత్వ, స్వపరిపాలనా సంస్థలు"

ఎ) రాజ్యాంగం కింద లేదా రాజ్యాంగం ద్వారా

బి) పార్లమెంట్ రూపొందించిన ఏ చట్టం ప్రకారమయినా

సి) రాష్ట్ర శాసనసభలు రూపొందించిన మరే చట్టం ప్రకారమయినా

డి) సముచిత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ లేదాఉత్తర్వు ద్వారా

i) సముచిత ప్రభుత్వం సొంతమయిన, నియంత్రణలో ఉన్న లేదా నిధులు పొందుతున్న సంస్థలు.

ii) ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సముచిత ప్రభుత్వం నుండి నిధులు అందుకుంటున్న ప్రభుత్వేతర సంస్థలు కూడా అధికార యంత్రాంగం కిందకే వస్తాయి.

ఐ) "రికార్డు' అనగా

ఎ) ఏదయినా పత్రం, రాతప్రతి, ఫైలు (బి) ఏదయినా మైక్రో ఫిల్ము, మైక్రోఫిష్ (ఫైలు చేయడానికి వీలయిన మైక్రోఫిల్ము), పత్రం ఫాక్సిమిలి ప్రతి (సి) అలాంటి మైక్రోఫిల్ముల నుంచి తీసిన చిత్రం లేక చిత్రాలు (అదే సైజులో గానీ, పెద్దవిగా చేసి గానీ) (డి) కంప్యూటర్ లేదా మరేదైనా పరికరం ద్వారా ఉత్పత్తి అయ్యే సమాచార సంపత్తి.

జె) "సమాచార హక్కు" అనగా ఏ అధికార యంత్రాంగం నియంత్రణ కింద ఉన్న సమాచారాన్నయినా ఈ చట్టం కింద పొందగలిగే హక్కు :

i) పనులనూ, పత్రాలనూ, రికార్డులనూ తనిఖీ చేసే హక్కు

ii) రికార్డులలో ఉన్న సమాచారాన్ని ఎత్తి రాసుకోవడం, వాటి నకళ్ళు, సర్టిఫైడ్ కాపీలు తీసుకోవడం.

iii) సమాచార సంపత్తి సర్టిఫైడ్ శాంపిళ్ళు తీసుకోవడం.

iv) డిస్కెట్లు, ప్లాపీలు, టేపులు, వీడియో క్యాసెట్ల రూపంలో, లేక మరే విధమైన ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న సమాచారాన్ని పొందడం; అలాంటి సమాచారం కంప్యూటర్‌లోగానీ, మరో విధమైన పరికరంలో గానీ నిక్షిప్తమై ఉండే ప్రింట్ అవుట్ల ద్వారా దానిని పొందడం కూడా ఈ హక్కులో భాగం.

కె) "రాష్ట్ర సమాచార కమీషన్" అనగా సెక్షన్ 15 లోని సబ్‌సెక్షన్ (1) కింద ఏర్పాటయ్యే రాష్ట్ర సమాచార కమీషన్.

ఎల్) "రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్", "రాష్ట్ర సమాచార కమీషనర్" అనగా సెక్షన్ 15 లోని సబ్‌సెక్షన్ (3) కింద నియమితులయ్యే రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్, రాష్ట్ర సమాచార కమీషనర్.

ఎమ్) "రాష్ట్ర పౌర సమాచార అధికారి" అనగా సెక్షన్ 5 లోని సబ్‌సెక్షన్ (1) కింద నియమితులయ్యే రాష్ట్ర పౌర సమాచార అధికారి. అదే సెక్షన్‌లోని సబ్‌సెక్షన్ (2) కింద నియమితులయ్యే రాష్ట్ర పౌరసమాచార సహాయ అధికారి కూడా ఈ కోవకే చెందుతారు.

ఎన్) 'తృతీయ పక్షం' అనగా అధికార యంత్రాంగం సహా. సమాచారం కోసం అభ్యర్థించే పౌరుడు కాక ఇతర వ్యక్తి ఎవరైనా.

అధ్యాయం - II

సమాచార హక్కు అధికార యంత్రాంగాల విధులు

3. ఈ చట్టంలోని నిబంధనలకు లోబడి పౌరులందరికీ సమాచారాన్ని పొందే హక్కు ఉంటుంది.

4. 1. ప్రతి అధికార యంత్రాంగమూ

ఎ) ఈ చట్టం ప్రకారం సమాచార హక్కు అమలయ్యేందుకు వీలైన రీతిలో తమ దగ్గరున్న అన్ని రికార్డులనూ పట్టికలు, పద సూచికలతో సక్రమంగా నిర్వహించాలి. కంప్యూటర్‌లోకి ఎక్కించదగిన అన్ని రికార్డులలోని సమాచారం అందుబాటులో ఉండేందుకు వీలుగా, వనరుల లభ్యతపై ఆధారపడి సహేతుకమైన కాలపరిమితిలోపు ఆ రికార్డులలోని సమాచారాన్ని దేశవ్యాపిత నెట్‌వర్క్‌లో ఎక్కించేందుకు చర్యలు తీసుకోవాలి.

బి) ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత 120 రోజులలోగా ఈ క్రింది వాటిని ప్రచురించాలి.

i) ఆ అధికార యంత్రాంగానికి సంబంధించిన వివరాలు, పనులు, విధులు.

ii) దాని అధికారులు, ఉద్యోగులకున్న అధికారాలు, విధులు,

iii) పర్యవేక్షణ, జవాబుదారీతనానికి సంబంధించిన మార్గాలతో పాటు, నిర్ణయప్రక్రియలో అనుసరించే విధానాలు.

iv) కార్యనిర్వహణలో పాటించే సూత్రాలు.

v) దాని దగ్గర ఉన్న, లేక నియంత్రణలో ఉన్న, లేదా కార్య నిర్వహణలో దాని ఉద్యోగులు పాటించే నియమ నిబంధనలు, ఆదేశాలు, మాన్యువళ్లు, రికార్డులూ,

vi) దాని దగ్గర ఉన్న లేక నియంత్రణలో ఉన్న పత్రాల రకాలకు సంబంధించిన ప్రకటన.

vii) దాని విధానాల రూపకల్పన కోసం, లేక వాటి అమలు కోసం పౌరులతో సంప్రదింపులు జరిపేందుకూ, లేక వారి ప్రాతినిధ్యం స్వీకరించేందుకూ ఏదైనా పద్ధతి ఉన్నట్లయితే ఆ వివరాలు.

viii) దానిలో భాగంగా గానీ, లేక సలహాలు ఇచ్చేందుకు గానీ, ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువ మంది సభ్యులతో బోర్డులు, కౌన్సిళ్ళు, కమిటీలు, ఇతర సంస్థలు ఏర్పాటయి ఉంటే వాటి వివరాల ప్రకటన; ఈ బోర్డులు, కౌన్సిళ్ళు, కమిటీలు, ఇతర సంస్థల సమావేశాలకు ప్రజలను అనుమతిస్తున్నదీ లేనిదీ, ఆ సమావేశాల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉన్నదీ లేనిదీ.

ix) దాని అధికారులు, ఉద్యోగుల సమాచార సంపుటం.

x) దాని అధికారులు, ఉద్యోగులు పొందే నెలవారి వేతనం, దాని నిబంధనల ప్రకారం ఉన్న పరిహారం చెల్లింపు వ్యవస్థ వివరాలు.

xi) అన్ని ప్రణాళికలు, ప్రతిపాదిత వ్యయాలు, జరిపిన చెల్లింపుల వివరాలు విడివిడిగా పేర్కొంటూ దాని కింద ఉన్న అన్ని ఏజెన్సీలకూ కేటాయించిన బడ్జెట్ వివరాలు.

xii) సబ్సిడీ పథకాల అమలు తీరు, వాటికి కేటాయించిన నిధులు, ఆ పథకాల లబ్దిదారుల వివరాలు.

xiii) అది మంజూరు చేసే రాయితీలు, పర్మిట్లు, అనుమతులను పొందుతున్న వారి వివరాలు.

xiv) దానికి అందుబాటులో ఉన్న లేక నియంత్రణలో ఉన్న సమాచారాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో కుదించి ఉంటే ఆ వివరాలు.

xv) ప్రజల కోసం ఏదైనా గ్రంథాలయం. లేక పఠనాలయం నిర్వహిస్తూ ఉండి ఉంటే వాటి పనివేళలతో పాటు, సమాచారం పొందేందుకు ప్రజలకున్న సదుపాయాల వివరాలు.

xvi) పౌర సమాచార అధికారుల పేర్లు, హోదాలు, ఇతర వివరాలు.

xvii) నిర్ణయించిన తీరుగా ఇతర సమాచారం ఏదైనా, ఆ తర్వాత ఈ ప్రకటనలన్నీ ప్రతి ఏడాదీ తాజా సమాచారంతో సరిచేసి మళ్ళీ ప్రకటించడం.

సి) ముఖ్యమైన విధానాలను రూపొందించేటప్పుడు గానీ, ప్రజలపై ప్రభావం చూపించే నిర్ణయాలను ప్రకటించేటప్పుడు గానీ వాటికి సంబంధించిన అన్ని వాస్తవాలనూ ప్రచురించాలి.

డి) పాలనాపరమైన, లేక అర్ధన్యాయ (క్వాసీ జ్యుడీషియల్) నిర్ణయాలకు గల కారణాలేమిటో ఆ నిర్ణయాల ప్రభావానికి లోనయ్యే వ్యక్తులకు వివరించాలి.

2. సమాచారాన్ని పొందడం కోసం ప్రజలు వీలైనంత తక్కువగా ఈ చట్టాన్ని ఆశ్రయించేట్లు చూడటం కోసం సబ్‌సెక్షన్ (1) లోని క్లాజ్ (బి) నిర్దేశిస్తున్న రీతిగా ప్రతి అధికార యంత్రాంగమూ ఎవరూ కోరకుండానే వీలైనంత ఎక్కువ సమాచారాన్ని ఇంటర్నెట్‌తో సహా వివిధ ప్రసార సాధనాల ద్వారా క్రమానుగతంగా ప్రజలకు అందించేందుకు కృషి చేయాలి.

3. సబ్‌సెక్షన్ (1) నిర్దేశిస్తున్న విధంగా వ్యవహరించేటప్పుడు, ప్రతి సమాచారాన్ని ప్రజలకు తేలికగా అందుబాటులో ఉండే రూపంలో, రీతిగా విస్తృతంగా వ్యాప్తి చేయాలి.

4. అన్ని రకాల సమాచారాలనూ వ్యాప్తి చేసేప్పుడు ఎంత చౌకగా ఆ పని చేయగలం. స్థానికంగా వాడుకలో ఉన్న భాష, సమాచార వ్యాప్తికి స్థానికంగా బాగా ఉపకరించే పద్ధతులు; సమాచారం తేలికగా, వీలైనంత వరకూ ఎలక్ట్రానిక్ రూపంలో కేంద్ర పౌర సమాచార అధికారికి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారికి అందుబాటులో ఉండటం, రుసుము లేక ప్రసార మాధ్యమాల వ్యయం లేక ప్రచురణ వ్యయం అందుబాటులో ఉండటం వంటి విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి.

వివరణ : సబ్ సెక్షన్ (3), (4) కు సంబంధించి వ్యాప్తి చేయడం అనగా నోటీసు బోర్డులు, వార్తాపత్రికలు, బహిరంగ ప్రకటనలు, మీడియా ప్రసారాలు, ఇంటర్నెట్ లేక అధికార యంత్రాంగం కార్యాలయాలను తనిఖీ చేయడం సహా ఇతర మార్గాల ద్వారా సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం.

5. 1. ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత 100 రోజులలోగా ప్రతి అధికార యంత్రాంగమూ, ఈ చట్టం కింద సమాచారాన్ని కోరేవారికి ఆ సమాచారాన్ని అందించడం కోసం అన్ని పాలనా యూనిట్లు, లేక కార్యాలయాలలో ఎంతమంది అవసరమో అంతమంది కేంద్ర పౌర సమాచార అధికారులను లేక రాష్ట్ర పౌర సమాచార అధికారులను నియమించాలి.

2. సబ్‌సెక్షన్ (1) లోని నిబంధనలకు విరుద్ధం కాని రీతిలో ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత వంద రోజులలోగా ప్రతి అధికార యంత్రాంగమూ ప్రతి సబ్ డివిజన్ స్థాయిలో లేక ఇతర జిల్లా విభాగాల స్థాయిలో సమాచారం కోసం దరఖాస్తులనూ లేక అప్పీళ్లనూ స్వీకరించేందుకు ఒక అధికారిని కేంద్ర పౌర సమాచార సహాయ అధికారిగా లేక రాష్ట్ర పౌర సమాచార సహాయ అధికారిగా నియమించాలి. అలా స్వీకరించిన దరఖాస్తులను లేక అప్పీళ్లను ఆ అధికారులు వెంటనే కేంద్ర పౌర సమాచార అధికారికి లేక రాష్ట్రపౌర సమాచార అధికారికి లేక సెక్షన్ 19 లోని సబ్‌సెక్షన్ (1) కింద నిర్దిష్టపరిచిన సీనియర్ అధికారికీ లేక కేంద్ర సమాచార కమీషన్‌కు లేక రాష్ట్ర సమాచార కమీషన్‌కు పంపాల్సి ఉంటుంది. సమాచారం కోసం దరఖాస్తునూ లేక అప్పీలునూ కేంద్ర పౌర సమాచార సహాయ అధికారికీ లేక రాష్ట్ర సమాచార సహాయ అధికారికీ అందించిన పక్షంలో దానికి జవాబు ఇచ్చేందుకు సెక్షన్ 7 లోని సబ్‌సెక్షన్ (1) కింద నిర్ణయించిన కాలపరిమితికి అయిదు రోజులు కలపాల్సి ఉంటుంది.

3. సమాచారం కోసం వచ్చిన ప్రతి అభ్యర్థననూ ప్రతి కేంద్ర పౌర సమాచార అధికారి లేక ప్రతి రాష్ట్ర పౌర సమాచార అధికారి పరిశీలించాలి. సమాచారం కోరుతున్న వ్యక్తులకు సహేతుకమైన స్థాయివరకూ సహకారం అందించాలి.

4. కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి తమ సక్రమ విధి నిర్వహణకు అవసరం అని భావించిన పక్షంలో మరే ఇతర అధికారి సహకారాన్నయినా కోరవచ్చు.

5. సబ్‌సెక్షన్ (4) కింద కేంద్ర పౌరసమాచార అధికారి లేక రాష్ట్ర పౌరసమాచార అధికారి ఇతర అధికారుల సహకారాన్ని కోరినపుడు ఆ అధికారులు ఆ కోరిన సహకారాన్ని అందించాలి.

అటువంటి సందర్భాలలో ఈ చట్టంలోని నిబంధనల ఉల్లంఘన కిందకు రాకుండా ఉండేందుకు ఆ సహకారం అందించే అధికారులను కేంద్ర పౌర సమాచార అధికారి, లేక రాష్ట్ర పౌర సమాచార అధికారిగా పరిగణిస్తారు.

6. 1. ఈ చట్టం కింద సమచారాన్ని కోరదలచుకున్నవారు ఇంగ్లీషులో లేక హిందీలో లేక స్థానిక అధికార భాషలో రాతపూర్వకంగా లేక ఎలక్ట్రానిక్ రూపంలో నిర్ణీత రుసుముతో పాటు తమ అభ్యర్థనను ఈ క్రింది వారికి పంపించాల్సి ఉంటుంది;

ఎ) కేంద్ర పౌర సమాచార అధికారికి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారికి లేక సంబంధిత అధికార యంత్రాంగానికి,

బి) తాము కోరుతున్న సమాచారం వివరాలను పేర్కొంటూ కేంద్ర పౌర సమాచార సహాయ అధికారికీ లేక రాష్ట్ర పౌర సమాచార సహాయ అధికారికీ సమాచారం కోరుతున్నవారు లిఖిత అభ్యర్థన ఇవ్వలేని పక్షంలో మౌఖికంగా వారు చేసిన అభ్యర్థనను రాతలో పెట్టేందుకు కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారియుక్తమైన సహాయమంతా వారికి అందించాలి.

2. సమాచారం కోరుతున్న దరఖాస్తుదారు ఎవరైనా అందుకు గల కారణం ఏమిటో వివరించాల్సిన అవసరం లేదు. తనకు కబురు చేసేందుకు అవసరమైన వివరాలు మినహా ఎలాంటి వ్యక్తిగత వివరాలు కూడా సమర్పించాల్సిన పనిలేదు.

3. ఒక సమాచారం కోసం అధికార యంత్రాంగానికి ఒక దరఖాస్తు అందినపుడు,

i) ఆ సమాచారం మరో అధికార యంత్రాంగం దగ్గర ఉన్నప్పుడు, లేక

ii) ఆ సమాచారం మరో అధికార యంత్రాంగం పనులకు ఎక్కువగా సంబంధించినదయినపుడు, దరఖాస్తు అందుకున్న అధికార యంత్రాంగం ఆ దరఖాస్తునుగానీ, లేక రెండవ అధికార యంత్రాం గానికి సంబంధించిన భాగాన్నిగానీ ఆ అధికార యంత్రాంగానికి పంపించి అలా పంపిన విషయాన్ని దరఖాస్తుదారునికి తెలియ జెప్పాలి. ఆ దరఖాస్తును పంపడం వీలైనంత త్వరగా జరగాలి. అయితే దరఖాస్తు అందుకున్న నాటినుంచి అయిదు రోజులు మించకూడదు.

7. 1. సెక్షన్ 6 కింద సమాచారం కోసం ఒక అభ్యర్థన అందినప్పుడు కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి సెక్షన్ 5 లోని సబ్ సెక్షన్ (2) సెక్షన్ 6 లోని సబ్‌సెక్షన్ (3) నిబంధనలకు సంబంధించి వీలయినంత త్వరగా, అభ్యర్థన అందిన నాటినుంచి 30 రోజులలోపు నిర్ణయించిన రుసుము చెల్లించిన దరఖాస్తుదారునికి ఆ సమాచారం అందించాలి; లేదా సెక్షన్లు 8, 9 నిర్దేశిస్తున్న కారణాల ప్రకారం అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు తెలియజెప్పాలి. దరఖాస్తుదారు కోరిన సమాచారం ఓ వ్యక్తి ప్రాణానికి లేక స్వేచ్ఛకు సంబంధించిన దయితే అభ్యర్థన అందిన 48 గంటల లోపు ఆ సమాచారం అందించాలి.

2. సబ్‌సెక్షన్ (1) లో నిర్దేశించిన కాలపరిమితి లోపు కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర

పౌర సమాచార అధికారి సమాచారం కోసం అందిన అభ్యర్థనపై నిర్ణయం ప్రకటించకపోయినట్లయితే, ఆ అభ్యర్థనను కేంద్ర, పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి తిరస్కరించినట్లు లెక్క.

3. సమాచారాన్ని అందించడానికి అయ్యే ఖర్చుకోసం మరికొంత రుసుము వసూలుచేసి ఆ సమాచారం అందించాలని కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి నిర్ణయించినట్లయితే, ఆ రుసుము చెల్లించాల్సిందిగా కోరుతూ సంబంధిత దరఖాస్తుదారునికి కబురు పంపాలి. ఆ కబురులో.

   ఎ) దరఖాస్తుదారు కోరిన సమాచారం అందించేందుకు చెల్లించాల్సిన మరికొంత రుసుము వివరాలు ఉండాలి. సబ్‌సెక్షన్ (1) కింద నిర్ణయించిన రుసుము లెక్క ప్రకారం మొత్తం రుసుము ఏ విధంగా లెక్కవేసిందీ తెలియజెపుతూ ఆ రుసుము డిపాజిట్ చెయ్యాల్సిందిగా కోరాలి. కబురు పంపిన రోజు నుంచి రుసుము డిపాజిట్ అయ్యే రోజు వరకూ పట్టిక వ్యవధిని సబ్‌సెక్షన్ (1) లో పేర్కొన్న 30 రోజుల కాలపరిమితి నుంచి మినహాయించాలి.

   బి) రుసుముకు సంబంధించిన నిర్ణయం, సమాచారం అందించే పద్ధతి పునఃపరిశీలనను కోరేందుకు దరఖాస్తుదారుకు ఉన్న హక్కును, అందుకు ఉన్న కాలపరిమితినీ, అనుసరించాల్సిన పద్ధతులనూ, అప్పీలు ఎవరిముందు దాఖలు చేయాలో ఆ వివరాలను కూడా తెలియజెప్పాలి.

4. ఈ చట్టం క్రింద ఒక రికార్డునుగానీ, అందులో భాగాన్ని కానీ దరఖాస్తుదారుకు చూపించాల్సి వచ్చినప్పుడు, ఆదరఖాస్తుదారుకు అంగవైకల్యం ఉన్నప్పుడు, కేంద్ర పౌరసమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి ఆ వ్యక్తి ఆ సమాచారాన్ని పొందే విధంగా తనిఖీ చేసుకునేందుకు తగిన విధంగా సహాయం అందించాలి.

5. సమాచారాన్ని అచ్చురూపంలోనో, ఎలక్ట్రానిక్ రూపంలోనో అందించాల్సినపుడు, నిర్ణయించిన రుసుమును, సబ్‌సెక్షన్ (6) కు లోబడి, దరఖాస్తుదారు చెల్లించాలి. సెక్షన్ 6 లోని సబ్‌సెక్షన్ (1), సెక్షన్ 7 లోని సబ్‌సెక్షన్లు (1), (5) నిబంధనల ప్రకారం ఆ నిర్ణయించిన రుసుము సహేతుకంగా ఉండాలి. సముచిత ప్రభుత్వం నిర్ణయించిన దాని ప్రకారం దారిద్ర్యరేఖ దిగువన ఉన్నవారి నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయరాదు.

6. సబ్‌సెక్షన్ (1) లో నిర్దేశించిన కాలపరిమితిలోపు సమాచారం ఇవ్వడంలో అధికార యంత్రాంగం విఫలమయిన సందర్భంలో సబ్‌సెక్షన్ (5) లో ఉన్న ఏ మాటతోనూ నిమిత్తం లేకుండా దరఖాస్తుదారుకు ఆ సమాచారం ఉచితంగా అందించాలి.

7. కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి సబ్‌సెక్షన్ (1) కింద ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సెక్షన్ 11 కింద తృతీయపక్షం సమర్పించిన వాదనను పరిగణనలోకి తీసుకోవాలి.

8. సబ్‌సెక్షన్ (1) కింద ఒక అభ్యర్థనను తిరస్కరించిన పక్షంలో కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి దరఖాస్తుదారుకు ఈ క్రింది విషయాలు తెలియచెప్పాలి.

i) అభ్యర్థనను తిరస్కరించడానికి గల కారణాలు.

ii) తిరస్కరణపై అప్పీలు చేసుకునేందుకు ఉన్న కాలపరిమితి.

iii) అప్పీలు విచారించే అధికారి వివరాలు.

9. అధికార యంత్రాంగం వనరులు చాలా ఎక్కువస్థాయిలో ఖర్చయ్యే సందర్భంలోనూ, ఆ రికార్డు భద్రత, రక్షణ ప్రమాదంలో పడుతుందన్న సందర్భంలో తప్ప దరఖాస్తుదారు అడిగిన రూపంలోనే సమాచారం అందించాలి.

8. 1) ఈ చట్టంలో ఉన్న దేనితోనూ నిమిత్తం లేకుండా ఈ క్రింది రకాల సమాచారాలను పౌరులకు అందించాల్సిన బాధ్యత లేదు.

ఎ) భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రతలపై ప్రతికూల ప్రభావం చూపించే సమాచారం. దేశభద్రత, వ్యూహాత్మక, వైజ్ఞానిక, ఆర్థిక ప్రయోజనాలపై, విదేశాలతో సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపించే సమాచారం. ఏదైనా నేరాన్ని ప్రేరేపించే సమాచారం.

బి) ఫలానా సమాచారాన్ని ప్రకటించకూడదని ఏదైనా న్యాయస్థానం లేక ట్రిబ్యునల్ ఆదేశించి ఉన్న పక్షంలో అలాంటి సమాచారం, సమాచార ప్రకటన కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందనుకుంటే అలాంటి సమాచారం.

సి) సమాచారం వెల్లడి పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ హక్కులను ఉల్లంఘించేదయితే అలాంటి సమాచారం.

డి) వాణిజ్యపరమైన గోప్యత, వ్యాపార రహస్యాలు, మేధోసంపత్తికి సంబంధించిన సమాచారం, సమాచారం వెల్లడి వల్ల పోటీరంగంలో తృతీయపక్షానికి హానికలిగేట్లయితే అలాంటి సమాచారం. విశాల ప్రయోజనాల దృష్ట్యా ఈ తరహా సమాచారాలను వెల్లడి చేయాల్సిందేనని సమర్థాధికారి భావించిన పక్షంలో మాత్రం వెల్లడి చేయవచ్చు.

ఇ) విశ్వాసబద్ధమైన సంబంధం రీత్యా ఒక వ్యక్తికి అందుబాటులో ఉన్న సమాచారం. విశాల ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఈ తరహా సమాచారాన్ని వెల్లడి చేయాల్సిందేనని సమర్థాధికారి భావించిన పక్షంలో దానిని కూడా వెల్లడి చేయవచ్చు.

యఫ్) ఏదైనా విదేశీ ప్రభుత్వం నుంచి విశ్వాసబద్ధంగా అందిన సమాచారం.

జి) ఏదైనా సమాచారం వెల్లడివల్ల ఏ వ్యక్తి ప్రాణానికైనా లేక భౌతిక భద్రతకయినా హానికలుగుతుందంటే అలాంటి సమాచారం. చట్టాల అమలుకోసం, భద్రతా ప్రయోజనాల కోసం గోప్యంగా సమాచారం అందించిన లేక సహాయపడిన వారి గుర్తింపునకు దారితీసే సమాచారం.

హెచ్) దర్యాప్తు ప్రక్రియనూ, నేరస్థులను పట్టుకునేందుకూ, ప్రాసిక్యూట్ చేసేందుకూ అవరోధాలు కల్పించే సమాచారం.

ఐ) మంత్రిమండలి, కార్యదర్శులు, ఇతర అధికారుల సమాలోచనల సహా కాబినెట్ పత్రాలు. మంత్రి

మండలి తీసుకున్న నిర్ణయాలను, అందుకు గల కారణాలను, ఆ నిర్ణయాలకు ప్రాతిపదిక అయిన సమాచారాన్ని ఆ విషయం సంపూర్ణంగా ముగిసిన తర్వాత వెల్లడిచేయాల్సి ఉంటుంది. ఈ సెక్షన్‌లో నిర్దేశించిన మినహాయింపుల కిందకు వచ్చే సమాచారాన్ని మాత్రం వెల్లడి చేయరాదు.

జె) ప్రజా కార్యకలాపాలు, ప్రజా ప్రయోజనాలతో నిమిత్తం లేని వ్యక్తి గత సమాచారం. వ్యక్తుల వ్యక్తిగత జీవితాలలోకి తొంగిచూసే అవాంఛనీయ అవకాశం కల్పించే సమాచారం. విశాల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ తరహా సమాచారాల వెల్లడి ఉచితమేనని కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి లేక అప్పిలేట్ అధికారి భావిస్తే ఈ సమాచారాలను కూడా వెల్లడి చేయవచ్చు. పార్లమెంటుకు లేక రాష్ట్ర శాసనసభకు అందించదగిన ఎలాంటి సమాచారాన్నయినా ఏ వ్యక్తికయినా అందించవచ్చు.

2. అధికార రహస్యాల చట్టం, 1923 తో లేక సబ్‌సెక్షన్ (1) ప్రకారం ఇవ్వదగిన మినహాయింపులతో ఎలాంటి నిమిత్తం లేకుండా, రక్షిత ప్రయోజనాలకు కలిగే హాని కన్నా ప్రజా ప్రయోజనాలకు కలిగే మేలు ఎక్కువని అధికార యంత్రాంగం భావించిన పక్షంలో అలాంటి సమాచారాన్ని వెల్లడి చేయవచ్చు.

3. సబ్‌సెక్షన్ (1) లోని క్లాజులు (ఎ),(సి), (ఐ) లోని నిబంధనలకు సంబంధించి సెక్షన్ 6 క్రింద సమాచారం కోసం అభ్యర్థన అందిన రోజుకు 20 సంవత్సరాల ముందు సంభవించిన ఎలాంటి సంఘటన, విషయానికి సంబంధించిన సమాచారాన్ని అయినా కోరినవారికి అందించవచ్చు. ఆ 20 సంవత్సరాల గడువు ఏ రోజు నుంచి లెక్కించాలన్న ప్రశ్న తలెత్తినపుడు కేంద్ర ప్రభుత్వ నిర్ణయమే తుది నిర్ణయం అవుతుంది. ఈ చట్టంలో నిర్దేశించిన అప్పీళ్ల అవకాశం దీనికి కూడా వర్తిస్తుంది.

9. సమాచారం అందించడం వలన రాజ్యానికి చెందినది కాకుండా ఒక వ్యక్తికి చెందిన కాపీరైట్ ఉల్లంఘన జరిగే పక్షంలో అలాంటి సమాచారం కోసం వచ్చిన అభ్యర్థనను కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి సెక్షన్ 8 లోని నిబంధనలకు భంగం కలగకుండానే తిరస్కరించవచ్చు.

10. 1. వెల్లడినుంచి మినహాయింపు ఉన్న సమాచారం అన్న కారణంతో ఒక అభ్యర్థనను తిరస్కరించిన సందర్భంలో ఈ చట్టంలోని నిబంధనలతో నిమిత్తం లేకుండా, మినహాయింపు పొందిన సమాచారం కాక ఆ రికార్డులో ఉన్న ఇతర సమాచారాన్ని విడదీసి చూపగలిగిన పక్షంలో అలాంటి సమాచారాన్ని అందించవచ్చు.

2. సబ్‌సెక్షన్ (1) కింద రికార్డులోని కొంత భాగాన్ని మాత్రమే వెల్లడి చేయాలని నిర్ణయించినపుడు కేంద్ర పౌరసమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి దరఖాస్తుదారుకు ఈ కింది విషయాలు తెలియజెపుతూ నోటీసు ఇవ్వాలి.

ఎ) కోరిన రికార్డులో వెల్లడినుంచి మినహాయింపు పొందిన భాగాన్ని విడదీసి మిగతా భాగాన్ని మాత్రమే వెల్లడి చేస్తున్న విషయం.

బి) ఆ నిర్ణయానికి గల కారణాలు. నిర్ణయానికి ముందు పరిశీలనలో వెల్లడి అయిన అంశాలు, వాటికి సంబంధించిన విషయాలు.

సి) నిర్ణయం తీసుకున్న వ్యక్తి పేరు, హోదా.

డి) ఈ వ్యక్తి నిర్ణయించిన రుసుము వివరాలు, దరఖాస్తుదారు చెల్లించాల్సిన రుసుము వివరాలు.

ఇ) నిర్ణయం పునఃపరిశీలన కోరేందుకు దరఖాస్తుదారుకున్న హక్కులు, వసూలు చేసే రుసుము వివరాలు. పునఃపరిశీలన కోరేందుకు గల మార్గాలు. సెక్షన్ 19 లోని సబ్‌సెక్షన్ (1) కింద నియమితులైన సీనియర్ అధికారి లేక కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ వివరాలు. పునఃపరిశీలన కోరేందుకు ఉన్న కాలపరిమితి, పద్ధతి ఇతర వివరాలు.

11. 1) తృతీయ పక్షానికి చెందిన సమాచారం లేక తృతీయ పక్షం అందించిన సమాచారం. దానిని గోప్యమైనదిగా ఆ తృతీయ పక్షం భావిస్తున్నపుడు అలాంటి సమాచారాన్ని చట్టం కింద వెల్లడి చేయాలని కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి భావించినపుడు, ఆ సమాచారం కోసం అభ్యర్థన అందిన అయిదు రోజులలోగా కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి సదరు తృతీయ పక్షానికి ఆ అభ్యర్థన గురించి రాతపూర్వకమైన నోటీసు ఇవ్వాలి. దరఖాస్తుదారు కోరిన రికార్డు లేక సమాచారం, లేక అందులో కొంతభాగం వెల్లడి చేయాలని భావిస్తున్నట్లు తెలుపుతూ, అలా వెల్లడిచేయవచ్చో లేదో మౌఖికంగాగానీ, లిఖితపూర్వకంగా గానీ దాఖలు చేయాల్సిందిగా తృతీయ పక్షాన్ని ఆ నోటీసులు కోరాలి. సమాచారాన్ని వెల్లడిచేయాలన్న నిర్ణయం తీసుకునే ముందు తృతీయపక్షం దాఖలును పరిగణలోకి తీసుకోవాలి. చట్టం పరిరక్షిస్తున్న వాణిజ్య వ్యాపార రహస్యాలను మినహాయించి ఏదైనా సమాచారం వెల్లడి తృతీయ పక్షానికి కలగించే హానికన్నా ప్రజా ప్రయోజనాలకు చేకూర్చే మేలు ఎక్కువని భావించినపుడు ఆ సమాచారాన్ని వెల్లడి చేయవచ్చు.

2. సబ్‌సెక్షన్ (1) కింద ఒక తృతీయ పక్షానికి నోటీసు ఇచ్చినపుడు, ఆ నోటీసు అందిన నాటినుంచి పదిరోజులలోగా సమాచారం వెల్లడి ప్రతిపాదనపై తమ వాదన దాఖలు చేసేందుకు సదరు తృతీయపక్షానికి అవకాశం ఇవ్వాలి.

3. సెక్షన్ 6 కింద సమాచారం కోసం అభ్యర్థన అందినపుడు, సబ్‌సెక్షన్ (2) కింద తమ వాదన వినిపించేందుకు తృతీయపక్షానికి అవకాశం ఇచ్చిన తర్వాత అభ్యర్థన అందిన నాటి నుంచి 40 రోజులలోపు, సెక్షన్ 7 లోని నిబంధనలతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రజాసమాచార అధికారి లేక రాష్ట్ర ప్రజా సమాచార అధికారి ఆ సమాచారాన్ని లేక రికార్డును లేక అందులో భాగాన్ని వెల్లడి చేయాలో వద్దో నిర్ణయించి తన నిర్ణయాన్ని నోటీసు ద్వారా తృతీయ పక్షానికి తెలియజేయాలి.

4. సబ్‌సెక్షన్ (3) కింద ఇచ్చిన నోటీసులో, ఆ నోటీసు అందుకున్న తృతీయపక్షానికి అందులోని నిర్ణయంపై సెక్షన్ 19 కింద అప్పీలుకు వెళ్లేందుకు హక్కు ఉందని కూడా తెలియపరచాలి.

అధ్యాయం - III
కేంద్ర సమాచార కమీషన్

12. 1. ఈ చట్టం కింద సంక్రమించిన అధికారాలను వినియోగించేందుకు, అప్పగించిన కార్యాలను నిర్వహించేందుకూ కేంద్ర సమాచార కమీషన్ అనే సంస్థను కేంద్ర ప్రభుత్వం అధికార గజిట్‌లో

నోటిఫికేషన్ ద్వారా స్థాపిస్తుంది.

2. కమీషన్‌లో కిందివారు ఉంటారు.

ఎ) ప్రధాన సమాచార కమీషనర్,

బి) పదిమందికి మించకుండా అవసరమైన సంఖ్యలో కేంద్ర సమాచార కమీషనర్లు,

3. ప్రధాన సమాచార కమీషనర్‌ను, కేంద్ర సమాచార కమీషనర్లను ఒక కమిటీ సిఫారసు మేరకు రాష్ట్రపతి నియమిస్తారు. ఆ కమిటీలో కిందివారు ఉంటారు.

i) ప్రధానమంత్రి, కమిటీకి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.

ii) లోక్‌సభలో ప్రతిపక్షనేత.

iii) ప్రధానమంత్రి నామినేట్ చేసే ఒక కేంద్ర క్యాబినెట్ మంత్రి.

(**వివరణ :** లోక్‌సభలో గుర్తింపు పొందిన ప్రతిపక్ష నాయకుడు లేని సందర్భంలో ప్రతిపక్ష పార్టీలలో అతి పెద్ద పార్టీ నాయకుడిని ప్రతిపక్షనేతగా పరిగణిస్తారు).

4. కేంద్ర సమాచార కమీషన్ కార్యకలాపాల సాధారణ పర్యవేక్షణ, దిశానిర్దేశం, నిర్వహణ అధికారాలు ప్రధాన సమాచార కమీషనర్‌కు సంక్రమిస్తాయి. ఈ అధికారాల వినియోగంలో ప్రధాన సమాచార కమీషనర్‌కు కేంద్ర సమాచార కమీషనర్లు సహాయపడతారు. కేంద్ర సమాచార కమీషనర్ ఈ చట్టం కింద స్వతంత్ర పతిపత్తితో మరే అధికారానికీ, ఆదేశాలకూ లోబడకుండా వినియోగించే అన్ని అధికారాలనూ, నిర్వహించే అన్ని పనులనూ కేంద్ర సమాచార కమీషనర్ వినియోగించవచ్చు, నిర్వహించవచ్చు.

5. ప్రధాన సమాచార కమీషనర్, సమాచార కమీషనర్లు ప్రజాజీవనంలో సుప్రసిద్ధులై ఉండాలి. వారికి విశాలమైన విషయ పరిజ్ఞానం, చట్టం, శాస్త్ర సాంకేతికరంగాలు, సామాజిక సేవ, మేనేజ్‌మెంట్, జర్నలిజం ప్రసార మాధ్యమాలు, కార్యనిర్వహణ పరిపాలనలో అనుభవం ఉండాలి.

6. ప్రధాన సమాచార కమీషనర్ లేక సమాచార కమీషనర్ పార్లమెంటు సభ్యులుగానీ, రాష్ట్రాలు లేక కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభ సభ్యులుగానీ అయి ఉండరాదు. ఆర్థికంగా లాభం చేకూరే ఏ ఇతర పదవిలోనూ ఉండరాదు. ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం ఉండకూడదు. ఏ ఇతర వ్యాపారాన్ని గానీ, వృత్తిని గానీ నిర్వహిస్తూ ఉండకూడదు.

7. కేంద్ర సమాచార కమీషన్ కేంద్ర కార్యాలయం ఢిల్లీలో ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ముందుగా ఆమోదం పొందిన తర్వాత కేంద్ర సమాచార కమీషన్ ఇండియాలోని ఇతర ప్రాంతాలలో కార్యాలయాలు నెలకొల్పవచ్చు.

13. 1. ప్రధాన సమాచార కమీషనర్ పదవీ స్వీకారం చేసిన నాటి నుంచీ అయిదేళ్ళ పాటు పదవిలో ఉంటారు. ప్రధాన సమాచార కమీషనర్ పునర్నియామకానికి అవకాశం లేదు. ఏ సమాచార కమీషనర్ కూడా 65 ఏళ్ల వయస్సు వచ్చిన తర్వాత పదవిలో ఉండేందుకు వీలులేదు.

2. ప్రతి సమాచార కమీషనర్ పదవి చేపట్టిననాటి నుంచి అయిదేళ్లపాటు, లేక 65 ఏళ్ళ వయస్సు

వచ్చే వరకూ, ఏది ముందయితే అంతవరకూ పదవిలో ఉంటారు. పదవీ విరమణ తర్వాత పునర్నియామకానికి అవకాశం లేదు. ఈ సబ్‌సెక్షన్ కింద పదవీ వివరణ చేసే ఏ సమాచార కమీషనర్‌కు అయినా సెక్షన్ 12 సబ్‌సెక్షన్ (3) లో నిర్దేశించిన విధంగా ప్రధాన సమాచార కమీషనర్‌గా నియామకం పొందే అర్హత ఉంటుంది. ఆ విధంగా ప్రధాన సమాచార కమీషనర్‌గా నియామకం పొందిన సమాచార కమీషనర్ ఈ రెండు పదవులలోనూ కలిపి అయిదేళ్లకు మించి పదవిలో ఉండరాదు.

3. ప్రధాన సమాచార కమీషనర్ లేక సమాచార కమీషనర్ పదవిలో ప్రవేశించే ముందు రాష్ట్రపతి ఎదుటగానీ, ఈ పనికోసం రాష్ట్రపతి నియమించిన మరో వ్యక్తి ముందుగానీ మొదటి షెడ్యూలులో పొందుపరిచిన పద్ధతిలో పదవీ ప్రమాణ స్వీకారం చేయాలి.

4. ప్రధాన సమాచార కమీషనర్ లేక సమాచార కమీషనర్ ఎప్పుడయినా గానీ స్వదస్తూరితో రాష్ట్రపతికి లేఖ రాసి పదవికి రాజీనామా సమర్పించవచ్చు. సెక్షన్ 14 లో నిర్దేశించిన రీతిలో ప్రధాన సమాచార కమీషనర్‌ను లేక సమాచార కమీషనర్‌నూ పదవి నుండి తొలగించవచ్చు.

5. వేతనాలు, ఎలవెన్సులు, ఇతర సర్వీసు నియమ నిబంధనలు :

ఎ) ప్రధాన సమాచార కమీషనర్‌కు ప్రధాన ఎన్నికల కమీషనర్‌తో సమానంగా ఉంటాయి.

బి) సమాచార కమీషనర్‌కు ఎన్నికల కమీషనర్‌తో సమానంగా ఉంటాయి. ప్రధాన సమాచార కమీషనర్ సమాచార కమీషనర్ నియామకం పొందిన సమయంలో, గతంలో కేంద్ర ప్రభుత్వం కింద లేక రాష్ట్ర ప్రభుత్వం కింద చేసిన సర్వీసుకు పెన్షన్ తీసుకుంటున్నట్లయితే (వికలాంగులకు, గాయపడిన వారికి ఇచ్చే పెన్షన్ కాకుండా) ఒకేసారి చెల్లింపు కోసం మార్పిడి చేసుకున్న పెన్షన్, గ్రాట్యూటీ మినహా ఇతర పదవీ విరమణ లాభాలతో సమానమైన పెన్షన్ సహా ఆ మొత్తాన్ని వేతనం నుండి మినహాయిస్తారు. ప్రధాన సమాచార కమీషనర్, సమాచార కమీషనర్ తమ నియామకం సమయంలో, గతంలో కేంద్ర చట్టాల కింద లేక రాష్ట్ర చట్టాల కింద ఏర్పాటయిన కార్పొరేషన్లలో చేసిన సర్వీసుకూ, లేక ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యం లోని లేక నియంత్రణలోని ప్రభుత్వ కంపెనీలలో చేసిన సర్వీసుకు పదవీ విరమణ లబ్దిపొందుతున్నట్లయితే ఆ లబ్దికి సమానమైన పెన్షన్ మొత్తాన్ని మినహాయించి వేతనం చెల్లిస్తారు. ప్రధాన సమాచార కమీషనర్, సమాచార కమీషనర్ల నియామకం తర్వాత వారి వేతనాలు, అలవెన్సులు, సర్వీసు నియమ నిబంధలను వారికి నష్టం కలిగించే రీతిలో మార్చడం జరగదు.

6. ఈ చట్టం కింద నిర్వహించాల్సిన కార్యాలను సమర్థవంతంగా నిర్వహించడం కోసం అవసరమైన అధికారులనూ, ఉద్యోగులనూ కేంద్ర ప్రభుత్వం ప్రధాన సమాచార కమీషనర్‌కూ, సమాచార కమీషనర్లకూ అందిస్తుంది. ఆ అధికారులకూ, ఉద్యోగులకూ చెల్లించాల్సిన వేతనాలు, ఎలవెన్సుల విషయంలో, సర్వీసు నియమ నిబంధనల విషయంలో నిర్ణీత పద్ధతిలో వ్యవహరిస్తారు.

14. 1. సబ్‌సెక్షన్ (3) లోని నిబంధనలకు లోబడి ప్రధాన సమాచార కమీషనర్‌నూ, లేక ఏ సమాచార

కమీషనర్ అయినా, నిరూపిత అనుచిత ప్రవర్తన. అశక్తిత కారణాలతో ఒక్క రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా మాత్రమే పదవి నుంచి తొలగించవచ్చు. రాష్ట్రపతి సూచన మేరకు సుప్రీంకోర్టు విచారణ జరిపి అనుచిత ప్రవర్తన లేక అశక్తత కారణంగా ప్రధాన సమాచార కమీషనర్‌ను, లేక సమాచార కమీషనర్‌ను పదవి నుంచి తొలగించవచ్చని నివేదించిన తర్వాత రాష్ట్రపతి ఆ ఉత్తర్వు జారీ చేయాలి.

2. సబ్‌సెక్షన్ (1) కింద ప్రధాన సమాచార కమీషనర్ లేక సమాచార కమీషనర్‌పై విచారణకు సుప్రీంకోర్టుకు సూచించిన తర్వాత, ఆ విచారణ జరుగుతున్న సమయంలో సదరు ప్రధాన సమాచార కమీషనర్ లేక సమాచార కమీషనర్‌ను సుప్రీంకోర్టు నివేదిక అంది ఉత్తర్వు జారీ చేసేంతవరకూ రాష్ట్రపతి సస్పెండ్ చేయవచ్చు. అవసరం అనుకున్న పక్షంలో కార్యాలయంలోకి ప్రవేశించకుండా నిషేధించవచ్చు.

3. సబ్‌సెక్షన్ (1) లోని నిబంధనలతో నిమిత్తం లేకుండా ప్రధాన సమాచార కమీషనర్‌ను లేక సమాచార కమీషనర్‌ను రాష్ట్రపతి తన ఉత్తర్వుల ద్వారా ఈ క్రింది కారణాలతో పదవి నుంచి తొలగించవచ్చు.

ఎ) దివాళా తీసినట్లు నిర్ణయమైనపుడు,

బి) ఏదైనా నేర నిరూపణ జరిగి, ఆ నేరం నీతిబాహ్యమైనదని రాష్ట్రపతి భావించినపుడు,

సి) పదవీకాలంలో తన విధి నిర్వహణతో సంబంధం లేని ఇతర పనులను ఆర్థిక లాభం కోసం చేసినపుడు.

డి) శారీరకంగా లేక మానసికంగా దుర్భలులై పదవిలో కొనసాగేందుకు పనికిరాకుండా పోయారని రాష్ట్రపతి భావించినపుడు.

ఇ) ప్రధాన సమాచార కమీషనర్ లేక సమాచార కమీషనర్ తమ విధి నిర్వహణకు నష్టం చేకూర్చే అవకాశం ఉన్న ఆర్థిక ప్రయోజనాలనూ, ఇతరత్రా ప్రయోజనాలనూ పొందినపుడు.

4. కేంద్ర ప్రభుత్వం లేక దాని తరపున చేసుకున్న ఏ ఒప్పందం, కాంట్రాక్టులోనయినా ప్రధాన సమాచార కమీషనర్ లేక ఏ సమాచార కమీషనర్ అయినా ఏ తరహాలోనయినా ఆసక్తి చూపించినా, కల్పించుకున్నా సబ్‌సెక్షన్ (1) లో పేర్కొన్న అనుచిత ప్రవర్తనకు పాల్పడినట్లు లెక్క. ఏదయినా ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీ లాభాలు, ఆదాయాలు, రాబడులలో సభ్యుడిగా కాక మరో విధంగా పాలుపంచుకున్న సందర్భం కూడా అనుచిత ప్రవర్తన కిందకు వస్తుంది.

అధ్యాయం - IV

రాష్ట్ర సమాచార కమీషన్

15. 1. ఈ చట్టం కింద సంక్రమించిన అధికారాలను వినియోగించేందుకూ, అప్పగించిన కార్యాలను నిర్వహించేందుకు ... (రాష్ట్రం పేరు) సమాచార కమీషన్ అనే సంస్థను రాష్ట్ర ప్రభుత్వం అధికార గజిట్‌లో నోటిఫికేషన్ ద్వారా స్థాపిస్తుంది.

2. రాష్ట్ర సమాచార కమీషన్‌లో కిందివారు ఉంటారు.

ఎ) రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్.

బి) పదిమందికి మించకుండా అవసరమైన సంఖ్యలో రాష్ట్ర సమాచార కమీషనర్లు.

3. రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్‌ను, రాష్ట్ర సమాచార కమీషనర్లనూ ఒక కమిటీ సిఫారసు మేరకు గవర్నర్ నియమిస్తారు. ఆ కమిటీలో కిందివారు ఉంటారు.

i) ముఖ్యమంత్రి, కమిటీకి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.

ii) శాసనసభలో ప్రతిపక్షనేత.

iii) ముఖ్యమంత్రి నామినేట్ చేసే ఒక రాష్ట్ర క్యాబినెట్ మంత్రి.

(**వివరణ :** శాసనసభలో గుర్తింపు పొందిన ప్రతిపక్షనాయకుడు లేని సందర్భంలో ప్రతిపక్ష పార్టీలలో అతిపెద్ద పార్టీ నాయకుడిని ప్రతిపక్ష నేతగా పరిగణిస్తారు.)

4. రాష్ట్ర సమాచార కమీషన్ కార్యకలాపాల సాధారణ పర్యవేక్షణ, దిశానిర్దేశం, నిర్వహణ అధికారాలు రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్‌కు సంక్రమిస్తాయి. ఈ అధికారుల వినియోగంలో రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్‌కు రాష్ట్ర సమాచార కమీషనర్లు సహాయపడతారు. రాష్ట్ర సమాచార కమీషన్ ఈ చట్టం కింద స్వతంత్ర ప్రతిపత్తితో మరో అధికారానికి, ఆదేశాలకూ లోబడకుండా వినియోగించే అన్ని అధికారాలనూ, నిర్వహించే అన్ని పనులనూ రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ వినియోగించవచ్చు, నిర్వహించవచ్చు.

5. రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్, రాష్ట్ర సమాచార కమీషనర్లు ప్రజాజీవనంలో సుప్రసిద్ధులై ఉండాలి. వారికి విశాలమైన విషయ పరిజ్ఞానం, చట్టం, శాస్త్ర సాంకేతిక రంగాలు, సామాజిక సేవ,మేనేజ్‌మెంట్, జర్నలిజం, ప్రసార మాధ్యమాలు, కార్యనిర్వహణ, పరిపాలనలో అనుభవం వుండాలి.

6. రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ లేక రాష్ట్ర సమాచార కమీషనర్లు పార్లమెంటు సభ్యులుగానీ, రాష్ట్రాలు లేక కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభ సభ్యులుగానీ అయి ఉండరాదు. ఆర్థికంగా లాభం చేకూరే ఏ ఇతర పదవిలోనూ ఉండరాదు. ఏరాజకీయ పార్టీతోనూ సంబంధం ఉండరాదు. ఏ ఇతర వ్యాపారాన్ని కానీ, వృత్తిని కానీ నిర్వహిస్తూ ఉండకూడదు.

7. రాష్ట్ర సమాచార కమీషన్ కేంద్ర కార్యాలయం రాష్ట్ర ప్రభుత్వం అధికార గెజిట్‌లో ప్రకటించిన చోట ఏర్పాటవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముందుగా ఆమోదం పొందిన తర్వాత రాష్ట్ర సమాచార కమీషన్ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో కార్యాలయాలు నెలకొల్పవచ్చు.

16. 1. రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ పదవీ స్వీకారం చేసిన నాటి నుంచీ అయిదేళ్లపాటు పదవిలో ఉంటారు. రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ పునర్నియామకానికి అవకాశం లేదు. ఏ రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ అయినా 65 ఏళ్ల వయస్సు నిండిన తర్వాత పదవిలో ఉండేందుకు వీలుకాదు.

2. ప్రతి రాష్ట్ర సమాచార కమీషనర్ పదవి చేపట్టినప్పటినుంచి అయిదేళ్లపాటు, లేక 65 ఏళ్ల

వయస్సు వచ్చే వరకూ ఏది ముందయితే అంతవరకూ పదవిలో ఉంటారు. పదవీ విరమణ తర్వాత పునర్నియామకానికి అవకాశం లేదు. ఈ సబ్‌సెక్షన్ కింద పదవీ విరమణ చేసే ఏ రాష్ట్ర సమాచార కమీషనర్‌కు అయినా సెక్షన్ 15 లోని సబ్‌సెక్షన్ (3) లో నిర్దేశించిన విధంగా రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్‌గా నియామకం పొందే అర్హత ఉంటుంది. ఆ విధంగా రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్‌గా నియామకం పొందిన రాష్ట్ర సమాచార కమీషనర్ ఈ రెండు పదవులలోనూ కలిసి సగటున అయిదేళ్లకు మించి పదవిలో ఉండరాదు.

3. రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ లేక రాష్ట్ర సమాచార కమీషనర్ పదవిలో ప్రవేశించే ముందు గవర్నర్ ఎదుటగానీ, ఈ పనికోసం గవర్నర్ నియమించిన మరో వ్యక్తి ముందుగానీ మొదటి షెడ్యూలులో పొందుపరచిన పద్ధతిలో పదవీ ప్రమాణ స్వీకారం చేయాలి.

4. రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ లేక రాష్ట్ర సమాచార కమీషనర్ ఎప్పుడయినా స్వదస్తూరితో గవర్నర్‌కు లేఖ రాసి పదవికి రాజీనామా సమర్పించవచ్చు. సెక్షన్ 17 లో నిర్దేశించిన రీతిలో రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ లేక రాష్ట్ర సమాచార కమీషనర్‌ను పదవినుంచి తొలగించవచ్చు.

5. వేతనాలు, ఎలవెన్సులూ, ఇతర సర్వీసు నియమనిబంధనలు :

ఎ) రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్‌కు ఎన్నికల కమీషనర్‌తో సమానంగా ఉంటాయి.

బి) రాష్ట్ర సమాచార కమీషనర్‌కు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సమానంగా ఉంటాయి. రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్, రాష్ట్ర సమాచార కమీషనర్ నియామకం పొందిన సమయంలో, గతంలో కేంద్ర ప్రభుత్వం కింద లేక రాష్ట్ర ప్రభుత్వం కింద చేసిన సర్వీసుకు పెన్షన్ తీసుకుంటున్నట్లయితే (వికలాంగులకూ, గాయపడిన వారికీ ఇచ్చే పెన్షన్ కాకుండా) ఒకేసారి చెల్లింపు కోసం మార్పిడి చేసుకున్న పెన్షన్, గ్రాట్యూటీ మినహా ఇతర పదవీ విరమణ లాభాలతో సమానమైన పెన్షన్ సహా ఆ మొత్తాన్ని వేతనం నుండి మినహాయిస్తారు. రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్, రాష్ట్ర సమాచార కమీషనర్ తమ నియామకం సమయంలో, గతంలో కేంద్ర చట్టాల క్రింద లేక రాష్ట్ర చట్టాల కింద ఏర్పాటయిన కార్పొరేషన్లలో చేసిన సర్వీసుకూ, లేక కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యంలోని లేక నియంత్రణలోని ప్రభుత్వ కంపెనీలలో చేసిన సర్వీసుకూ పదవీ విరమణ లబ్ధి పొందుతున్నట్లయితే ఆ లబ్ధికి సమానమైన పెన్షన్ మొత్తాన్ని మినహాయించి వేతనం చెల్లిస్తారు. రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్, రాష్ట్ర సమాచార కమీషనర్ నియామకం తర్వాత వారి వేతనాలు, ఎలవెన్సులు, సర్వీసు నియమ నిబంధనలు వారికి నష్టం కలిగించే రీతిలో మార్చడం జరగదు.

6. ఈ చట్టం కింద నిర్వహించాల్సిన కార్యాలను సమర్థవంతంగా నిర్వహించడం కోసం అవసరమైన అధికారులనూ, ఉద్యోగులనూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్‌కూ, రాష్ట్ర సమాచార కమీషనర్లకూ అందిస్తుంది. ఆ అధికారులకూ, ఉద్యోగులకూ చెల్లించాల్సిన వేతనాలు, ఎలవెన్సుల విషయంలో సర్వీసు నియమ నిబంధనల విషయంలో నిర్ణీత పద్ధతిలో వ్యవహరిస్తారు.

17. 1) సబ్‌సెక్షన్ (3) లోని నిబంధనలకు లోబడి రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్‌ను, లేక ఏ రాష్ట్ర

సమాచార కమీషనర్‌నయినా నిరూపిత అనుచిత ప్రవర్తన, అశక్తత కారణాలతో ఒక్క గవర్నర్ ఉత్తర్వు ద్వారా మాత్రమే పదవి నుంచి తొలగించవచ్చు. గవర్నర్ సూచన మేరకు సుప్రీంకోర్టు విచారణ జరిపి అనుచిత ప్రవర్తన లేక అశక్తత కారణంతో రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్‌నూ లేక రాష్ట్ర సమాచార కమీషనర్‌ను పదవినుంచి తొలగించవచ్చని నివేదించిన తర్వాత గవర్నర్ ఆ ఉత్తర్వు జారీచేయాలి.

2. సబ్‌సెక్షన్ (1) కింద రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్, రాష్ట్ర సమాచార కమీషనర్‌పై విచారణకు సుప్రీంకోర్టును కోరిన తర్వాత, ఆ విచారణ జరుగుతున్న సమయంలో సదరు రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్‌ను లేక రాష్ట్ర సమాచార కమీషనర్‌ను, సుప్రీంకోర్టు నివేదిక అంది ఉత్తర్వు జారీ చేసేంతవరకూ గవర్నరు సస్పెండ్ చేయవచ్చు. అవసరం అనుకున్న పక్షంలో కార్యాయలయంలోకి ప్రవేశించకుండా నిషేధించవచ్చు.

3. సబ్‌సెక్షన్ (1) లోని నిబంధనలతో నిమిత్తం లేకుండా రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్‌ను లేక రాష్ట్ర సమాచార కమీషనర్‌ను గవర్నరు తన ఉత్తర్వుల ద్వారా ఈ క్రింది కారణాలతో పదవి నుండి తొలగించవచ్చు.

   ఎ) దివాళాతీసినట్లు నిర్ణయమైనప్పుడు,

   బి) ఏదైనా నేర నిరూపణ జరిగి ఆ నేరం నీతి బాహ్యమైనదని గవర్నర్ భావించినపుడు,

   సి) పదవీకాలంలో తన విధి నిర్వహణతో సంబంధం లేని ఇతర పనులు ఆర్థికలాభం కోసం చేసినపుడు,

   డి) శారీరకంగా లేక మానసికంగా దుర్భలులై పదవిలో కొనసాగేందుకు పనికి రాకుండా పోయారని గవర్నర్ భావించినపుడు

   ఇ) రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ లేక రాష్ట్ర సమాచార కమీషనర్ తమ విధి నిర్వహణకు నష్టం చేకూర్చే అవకాశం ఉన్న ఆర్థిక ప్రయోజనాలనూ, ఇతరత్రా ప్రయోజనాలనూ పొందినపుడు.

4. కేంద్ర ప్రభుత్వం, లేక దాని తరపున చేసుకున్న ఏ ఒప్పందం, కాంట్రాక్టులోనయినా రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ లేక ఏ రాష్ట్ర సమాచార కమీషనర్ అయినా ఏ తరహాలోనయినా ఆసక్తి చూపించినా, సంబంధం కల్పించుకున్నా సబ్‌సెక్షన్ (1) లో పేర్కొన్న అనుచిత ప్రవర్తనకు పాల్పడినట్లు లెక్క. ఏదయినా ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీ లాభాలు, ఆదాయాలు, రాబడులలో సభ్యుడిగా కాక మరో విధంగా పాలుపంచుకున్న సందర్భంలో కూడా అనుచిత ప్రవర్తన కిందకు వస్తుంది.

అధ్యాయం - V

సమాచార కమీషన్ల అధికారాలు, విధులు

అప్పీలు, జరిమానాలు

18. 1. ఈ చట్టంలోని నిబంధనలకు లోబడి ఏ వ్యక్తి నుంచి అయినా ఫిర్యాదు స్వీకరించి విచారణ జరపడం కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ విధి, ఆ ఫిర్యాదుల సందర్భాలు:

ఎ) కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి నియామకం జరగని కారణంగా సమాచారం కోసం అభ్యర్థన అందించలేని పక్షంలో, కేంద్ర పౌర సమాచార సహాయ అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార సహాయ అధికారి సమాచారం కోసం వచ్చిన దరఖాస్తునో, అప్పీలునో స్వీకరించకుండా, దీనిని కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి లేక సెక్షన్ 19 లోని సబ్‌సెక్షన్ (1) లో పేర్కొన్న సీనియర్ అధికారి లేక కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్‌కు పంపని పక్షంలో.

బి) ఈ చట్టం కింద అభ్యర్థించిన సమాచారాన్ని అందించేందుకు నిరాకరించిన పక్షంలో,

సి) ఈ చట్టం కింద సమాచారం కోసం ఇచ్చిన అభ్యర్థనకు నిర్దేశించిన కాలపరిమితిలోగా జవాబు రాని పక్షంలో,

డి) సమాచారం కోసం చెల్లించాల్సి వచ్చిన రుసుము సహేతుకంగా లేదని దరఖాస్తుదారు భావించిన పక్షంలో,

ఇ) ఈ చట్టం కింద తనకు అసంపూర్తిగా తప్పుదోవ పట్టించే విధంగా, తప్పుడు సమాచారం అందించారని దరఖాస్తుదారు భావించిన పక్షంలో,

యఫ్) ఈ చట్టం కింద సమాచారాన్ని కోరడం, రికార్డులను అందుబాటులో ఉంచడానికి సంబంధించిన మరే ఇతర విషయాలలోనయినా,

2. ఫిర్యాదును విచారించేందుకు తగిన కారణాలు ఉన్నాయని కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ భావించిన పక్షంలో దానిపై విచారణకు ఆదేశించవచ్చు.

3. ఈ సెక్షన్ కింద ఏ విషయంలోనయినా విచారణ జరిపేటప్పుడు కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్‌కు సివిల్ ప్రొసీజర్ కోడ్, 1908 కింద ఏ దావానయినా విచారించేటప్పుడు సివిల్‌కోర్టుకు ఎలాంటి అధికారాలు ఉంటాయో ఈ క్రింది వాటికి సంబంధించి అలాంటి అధికారాలు ఉంటాయి.

ఎ) వ్యక్తులకు సమన్లు జారీ చేసి వారు హాజరు అయ్యేట్లు చేయడం. మౌఖికంగా లేక లిఖిత పూర్వకంగా వారు సాక్ష్యం ఇచ్చేట్లు చేయడం. పత్రాలు లేక ఇతర వస్తువులను సమర్పించేట్లు చేయడం.

బి) పత్రాలు వెలికి తీసి వాటిని తనిఖీ చేయడం.

సి) అఫిడవిట్ రూపంలో వాంగ్మూలం స్వీకరించడం

డి) ఏ కోర్టునుంచి అయినా లేక కార్యాలయం నుంచి అయినా ప్రభుత్వ రికార్డులు, లేక వాటి కాపీలను తెప్పించుట.

ఇ) సాక్షులను విచారించేందుకు లేక పత్రాలు పరిశీలించేందుకు సమన్లు జారీ చేయడం.

యఫ్) నిర్ణయించిన విధంగా మరే ఇతర విషయమయినా

4. పార్లమెంటు లేక రాష్ట్ర శాసనసభలు చేసిన ఏ ఇతర చట్టంలోని నిబంధనలు అడ్డుగా ఉన్నప్పటికీ, కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ ఈ చట్టం కింద ఒక ఫిర్యాదుపై విచారణ

జరుపుతున్న సందర్భంలో, అధికార యంత్రాంగం నియంత్రణలో ఉండి ఈ చట్టం వర్తించే ఏ రికార్డునయినా పరిశీలించవచ్చు. అలాంటి రికార్డులను ఏ కారణంతోనయినా సమాచార కమీషన్ ముందు ఉంచకపోవడం కుదరదు.

19. 1. సెక్షన్ 7 లోని సబ్‌సెక్షన్ (1) లేక సబ్‌సెక్షన్ (3) లోని క్లాజు (ఎ) లో నిర్దేశించిన కాలపరిమితిలోగా జవాబు దొరకని వ్యక్తి ఎవరైనా, లేక కేంద్ర పౌర సమాచార అధికారి లేదా రాష్ట్ర పౌర సమాచార అధికారి తీసుకున్న నిర్ణయంతో అసంతృప్తి చెందిన వారైనా ఆ కాలపరిమితి ముగింపు తరువాత లేక నిర్ణయం అందిన తరువాత 30 రోజులలోగా అప్పీలు చేసుకోవచ్చు. కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారికి, సంబంధిత అధికార యంత్రాంగంలో సీనియర్ హోదాలో ఉన్న అధికారికి ఆ అప్పీలును నివేదించాలి. 30 రోజుల గడువు ముగిసిన తర్వాత అప్పీలు వచ్చిన సందర్భంలో ఆ ఆలస్యానికి తగిన కారణాలు ఉన్నాయని ఆ సీనియర్ అధికారి భావించిన పక్షంలో ఆ అప్పీలును స్వీకరించవచ్చు.

2. కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి సెక్షన్ 11 కింద తృతీయపక్షానికి చెందిన సమాచారాన్ని వెల్లడి చేయాలని నిర్ణయించిన సందర్భంలో ఆ నిర్ణయంపై అప్పీలు చేయాలని తృతీయపక్షం భావించినట్లయితే ఆ నిర్ణయం వెలువడిన 30 రోజులలోగా అప్పీలు చేయాలి.

3. సబ్‌సెక్షన్ (1) కింద వచ్చిన నిర్ణయంపై రెండవసారి అప్పీలు చేయదలిస్తే ఆ నిర్ణయం తీసుకుని ఉండాల్సిన తేదీ నుంచి కానీ నిర్ణయం అందిన రోజు నుంచి కానీ 90 రోజులలోగా కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ ముందు అప్పీలుకు వెళ్ళవచ్చు. 90 రోజుల గడువు దాటి రెండవ అప్పీలు వచ్చిన సందర్భంలో ఆ ఆలస్యానికి తగిన కారణం ఉందని కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ భావించిన పక్షంలో దానిని స్వీకరించవచ్చు.

4. కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి నిర్ణయంపై వచ్చిన అప్పీలు తృతీయ పక్షానికి చెందిన సమాచారానికి సంబంధించినదయితే కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ ఆ తృతీయపక్షానికి తమ వాదన వినిపించుకునేందుకు తగిన అవకాశం ఇవ్వాలి.

5. ఏ అప్పీలు విచారణలోనయినా అభ్యర్థనను తిరస్కరించడం న్యాయబద్ధమేనని నిరూపించాల్సిన బాధ్యత ఆ తిరస్కరించిన అధికార యంత్రాంగంపైనే ఉంటుంది.

6. సబ్‌సెక్షన్ (1) లేక సబ్‌సెక్షన్ (2) కింద వచ్చిన అప్పీళ్ళను అవి అందిన తర్వాత 30 రోజులలోగా పరిష్కరించాలి. ఈ కాలపరిమితి పొడిగించాల్సి వస్తే అప్పీలు దాఖలయిన నాటి నుంచి మొత్తం 45 రోజులలోగా అప్పీలును పరిష్కరించాలి. ఆ పొడిగింపునకు గల కారణాలను రాతపూర్వకంగా నమోదు చేయాలి.

7. కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ వెలువరించిన నిర్ణయాలను తప్పనిసరిగా అందరూ కట్టుబడాలి.

8. కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్‌కు ఈ కింది నిర్ణయాధికారాలు ఉన్నాయి.

ఎ) ఈ చట్టంలోని నిబంధనలు అమలు జరిపేందుకు అవసరమైన ఏవైనా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికార యంత్రాంగాన్ని ఆదేశించడం, ఆ చర్యలలో ఈ కిందివి కూడా భాగాలు.

i) ఎవరైనా కోరిన పక్షంలో ఒక ప్రత్యేకమైన రూపంలో సమాచారం అందుబాటులో ఉంచడం.

ii) కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారిని నియమించడం.

iii) నిర్దిష్టమైన సమాచారాన్ని లేక కొన్ని విభాగాల సమాచారాన్ని ప్రచురించడం.

iv) రికార్డుల నిర్వహణ, మేనేజ్‌మెంట్, విధ్వంసానికి సంబంధించి అనుసరిస్తున్న పద్ధతులలో కొన్ని అవసరమైన మార్పులు చేయడం.

v) అధికార యంత్రాంగంలోని అధికారులకు సమాచార హక్కుపై శిక్షణ ఇచ్చే సదుపాయాలను హెచ్చించడం.

vi) సెక్షన్ 4 లోని సబ్‌సెక్షన్ (1), క్లాజు (బి) అమలుపై వార్షిక నివేదిక రూపొందించడం.

బి) ఫిర్యాదుదారుకు కలిగిన నష్టాన్ని కానీ ఇతర కష్టాన్ని కానీ పరిహారం ద్వారా పూడ్చాల్సిందిగా అధికార యంత్రాంగాన్ని ఆదేశించడం.

సి) ఈ చట్టంలో నిర్దేశించిన విధంగా జరిమానాలు విధించడం.

డి) దరఖాస్తును తిరిస్కరించడం.

9. కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ తన నిర్ణయాన్ని, అప్పీలు అవకాశం ఉంటే ఆ వివరాలతో సహా ఫిర్యాదుదారుకూ, అధికార యంత్రాంగానికీ నోటీసు ద్వారా తెలియపరచాలి.

10. కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ అప్పీలు విచారణను నిర్ణీత పద్ధతిలో జరపవచ్చు.

20. 1. ఫిర్యాదుపై లేక అప్పీలుపై కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ నిర్ణయం తీసుకునే సమయంలో, కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి సరైన కారణం లేకుండా దరఖాస్తును స్వీకరించలేదని భావించినా, తగిన కారణం లేకుండా సెక్షన్ 7 లోని సబ్‌సెక్షన్ (1) కింద నిర్దేశించిన కాలపరిమితిలోపు సమాచారం అందించలేదని భావించినా, సమాచారం కోసం అభ్యర్థనను దురుద్దేశంతో తిరస్కరించారని భావించినా, లేక తెలిసి కూడా తప్పుడు, అసంపూర్తి తప్పుదోవ పట్టించే సమాచారం అందించారని భావించినా, అభ్యర్థనలో కోరిన సమాచారాన్ని ధ్వంసం చేశారని భావించినా, మరేవిధంగా నయినా సమాచారం అందకుండా అడ్డుపడ్డారని భావించినా; దరఖాస్తును స్వీకరించేంత వరకూ లేక సమాచారం అందించేంత వరకూ రోజుకు 250 రూపాయిల చొప్పున జరిమానా విధించవచ్చు. మొత్తం మీద ఆ జరిమానా 25 వేల రూపాయలను మించకూడదు. జరిమానా విధించే ముందు కేంద్ర పౌర

సమాచార ఆధికారికి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారికి తమ వాదన వినిపించేందుకు తగిన అవకాశం ఇవ్వాలి. తాను సహేతుకంగా, జాగ్రత్తగానే వ్యవహరించానని నిరూపించుకునే బాధ్యత కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారిపైనే ఉంటుంది.

2. ఫిర్యాదుపై లేక అప్పీలుపై నిర్ణయం తీసుకునే సమయంలో, కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి సరైన కారణం లేకుండా పదే పదే దరఖాస్తును స్వీకరించలేదని, లేక సెక్షన్ 7 లోని సబ్‌సెక్షన్ (1) కింద నిర్దేశించిన కాలపరిమితిలోపు సమాచారాన్ని అందించలేదనీ కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ భావించిన పక్షంలో, లేక సమాచారం కోసం అభ్యర్థనను దురుద్దేశంతో తిరస్కరించారని భావించినా, లేక తెలిసి కూడా తప్పుడు, అసంపూర్తి తప్పుదోవ పట్టించే సమాచారం అందించారని భావించినా, అభ్యర్థనలో కోరిన సమాచారాన్ని ధ్వంసం చేశారని భావించినా, మరే విధంగానయినా సమాచారం అందకుండా అడ్డుపడ్డారని భావించినా ఆ కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారిపై వారికి వర్తించే సర్వీసు నిబంధనల కింద క్రమశిక్షణా చర్య తీసుకోవలసిందిగా సిఫారసు చేయాలి.

అధ్యాయం - VI

ఇతరములు

21. ఈ చట్టం కింద లేక ఈ చట్టం కింద రూపొందిన రూల్స్ కింద మంచి చేస్తున్నానన్న నమ్మకంతో ఎవరేం చేసినా, చేసేందుకు ఉద్దేశించినా అందుకు వారిపై ఎలాంటి దావాలు వేయడం, ప్రాసిక్యూట్ చేయడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం కుదరదు.

22. అధికార రహస్యాల చట్టం 1923, అమలులో ఉన్న మరేదైనా చట్టం లేక మరేదైనా చట్టం వల్ల అమలులో ఉన్న పత్రంలో ఈ చట్టంతో పొసగని అంశాలు ఎలాంటివి ఉన్నప్పటికీ ఈ చట్టంలోని నిబంధనలు అమలులో ఉంటాయి.

23. ఈ చట్టం కింద ఎలాంటి ఆదేశం జారీ అయినా దానిపై దావాను గానీ, దరఖాస్తును గానీ, ఇతర విచారణలను గానీ ఏ న్యాయస్థానం చేపట్టరాదు. ఈ చట్టం కింద అప్పీలు చేయడం మినహాయించి ఆ ఆదేశాలను ప్రశ్నించడం కుదరదు.

24. 1. రెండవ షెడ్యూలులో పేర్కొన్న ఇంటిలిజెన్సు, భద్రతా సంస్థలకు, ఆ సంస్థలు ప్రభుత్వానికి సమర్పించే ఎలాంటి సమాచారానికీ ఈ చట్టం వర్తించదు. అవినీతి ఆరోపణలు, మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారం అయిన పక్షంలో ఈ సబ్‌సెక్షన్ నుండి మినహాయింపు ఉంటుంది. మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారం కోరినప్పుడు కేంద్ర సమాచార కమీషన్ ఆమోదం తర్వాత మాత్రమే అలాంటి సమాచారం అందించాల్సి ఉంటుంది. కేంద్ర సమాచార కమీషన్ ఆమోదం తర్వాత అభ్యర్థన అందిన దగ్గర నుంచి 45 రోజులలోగా, సెక్షన్ 7లోని నిబంధనలతో నిమిత్తం లేకుండా, సమాచారం అందించాల్సి వుంటుంది.

2. కేంద్ర ప్రభుత్వం తాను నెలకొల్పిన మరో ఇంటిలిజెన్సు లేక భద్రతా సంస్థను, అధికార గెజిట్‌లో

ప్రచురించడం ద్వారా రెండవ షెడ్యూలులో చేర్చవచ్చు. అలాగే ఇప్పటికే అందులో ఉన్న ఏదైనా సంస్థను తొలగించవచ్చు. అలాంటి నోటిఫికేషన్ ప్రచురించగానే ఒక సంస్థ షెడ్యూలులో చేరినట్టుగానో లేక తొలగిపోయినట్లు గానో లెక్క.

3. సబ్‌సెక్షన్ (2) కింద జారీ చేసిన ప్రతినోటిఫికేషన్‌నూ పార్లమెంటు ఉభయసభల ముందు ఉంచాలి.

4. రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన ఇంటిలిజెన్స్, భద్రతా సంస్థలకు ఈ చట్టం వర్తించదు. ఆ ఇంటిలిజెన్స్, భద్రతా సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం అధికార గెజిట్‌లో నోటిఫికేషన్ ద్వారా పేర్కొనవచ్చు. అవినీతి ఆరోపణలకు సంబంధించిన సమాచారం అయినప్పుడు ఈ సబ్‌సెక్షన్ నుంచి మినహాయింపు ఉంటుంది. మానవహక్కుల ఉల్లంఘనకు సంబంధించిన సమాచారం అయితే, రాష్ట్ర సమాచార కమీషన్ ఆమోదం పొందిన తర్వాత, సెక్షన్ 7 లోని నిబంధనలతో నిమిత్తం లేకుండా, అభ్యర్థన అందిన నాటి నుండి 45 రోజులలోగా ఆ సమాచారం అందించాల్సి ఉంటుంది.

5. సబ్‌సెక్షన్ (4) కింద జారీ చేసిన ప్రతి నోటిఫికేషన్‌నూ రాష్ట్ర శాసనసభ ముందు ఉంచాలి.

25. 1. కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ ఆచరణలో ఎంత త్వరగా సాధ్యం అయితే అంత త్వరగా ప్రతి ఏడాది ఆఖరులో, ఈ చట్టంలోని నిబంధనల అమలుపై ఒక నివేదిక రూపొందించి దాని కాపీని సముచిత ప్రభుత్వానికి పంపాలి.

2. ఈ సెక్షన్ కింద నివేదిక రూపొందించడం కోసం ప్రతి మంత్రిత్వ శాఖ లేక డిపార్టుమెంటు తమ పరిధిలోని అధికార యంత్రాంగాలకు సంబంధించిన సమాచారం సేకరించి కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్‌కు సమర్పించాలి. ఆ తరహా సమాచారం సమర్పించడం, రికార్డులను నిర్వహించడం కోసం అవసరమైన అన్ని అంశాలు పాటించాలి.

3. ప్రతి నివేదికలో ఆ సంవత్సరానికి సంబంధించి ఈ క్రింది అంశాలు ఉండాలి.

ఎ) ప్రతి అధికార యంత్రాంగానికీ వచ్చిన అభ్యర్థనల సంఖ్య.

బి) దరఖాస్తుదారులకు సమాచారం అందివ్వకూడదన్న నిర్ణయాల సంఖ్య, ఈ చట్టంలో ఆ నిర్ణయాలకు ప్రాతిపదికగా ఉన్న నిబంధనల వివరాలు, ఎన్నిసార్లు ఆ నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవల్సి వచ్చింది.

సి) కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్‌కు అందిన అప్పీళ్ళ సంఖ్య. ఆ అప్పీళ్ళ వివరాలు, ఆ అప్పీళ్ళ ఫలితాలు.

డి) ఈ చట్టం అమలుకు సంబంధించి ఏ అధికారిపైన అయినా క్రమశిక్షణా చర్యలు తీసుకుని ఉంటే ఆ వివరాలు.

ఇ) ఈ చట్టం కింద ప్రతి అధికార యంత్రాంగం వసూలు చేసిన రుసుముల వివరాలు.

యఫ్) ఈ చట్టం స్ఫూర్తినీ, ఉద్దేశ్యాలనూ అమలులో పెట్టేందుకు అధికార యంత్రాంగాల తరపున ఏదైనా కృషి జరిగి ఉంటే అందుకు సంబంధించిన వాస్తవ సమాచారం.

జి) ఏదైనా ఒక ప్రత్యేకమైన అధికార యంత్రాంగానికి సంబంధించిన సిఫార్సులతో సహా సంస్కరణలకు సంబంధించిన సిఫారసులు, ఈ చట్టం లేక సమాచార హక్కును అమలులోకి తీసుకురావడానికి ఉపకరించే మరే చట్టం అయినా, వాటి అభివృద్ధి, వికాసం, ఆధునీకరణ, సంస్కరణ, సవరణలకు సంబంధించిన సిఫార్సులు.

4. కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వం లేక రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ఆఖరులో ఆచరణలో ఎంత త్వరగా సాధ్యం అయితే అంత త్వరగా పార్లమెంటు ఉభయసభల ముందు లేక రాష్ట్రాలలో రెండు సభలు ఉంటే రెండు సభల ముందు లేక విధానసభ ఒకటే ఉంటే ఆ సభముందు ఉంచాలి.

5. ఒక అధికార యంత్రాంగం ఈ చట్టం కింద తన విధులు నిర్వహించడం ఈ చట్టం నిబంధనలకూ, స్ఫూర్తికీ అనుగుణంగా లేదని కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ భావించిన పక్షంలో ఆ విధానాలు అందుకు అనుగుణంగా ఉండేందుకు తీసుకోవల్సిన చర్యలను ఆ అధికార యంత్రాంగానికి సిఫారసు చేయవచ్చు.

26. 1. ఆర్థిక వనరులు, ఇతర వనరులు అందుబాటులో ఉన్నంత మేరకు సముచిత ప్రభుత్వం కింది చర్యలు చేపట్టాలి.

ఎ) ఈ చట్టంలో నిర్దేశించిన హక్కులను వినియోగించుకునే విషయంలో ప్రజలు, ముఖ్యంగా అణగారిన వర్గాల ప్రజల అవగాహనను పెంపొందించడం కోసం కార్యక్రమాలను రూపొందించి నిర్వహించడం.

బి) క్లాజ్ (ఎ) లో పేర్కొన్న కార్యక్రమంలో పాలుపంచుకోవడం, అలాంటి కార్యక్రమాలు తామే చేపట్టడం కోసం అధికార యంత్రాంగాలను ప్రోత్సహించడం.

సి) తమ కార్యకలాపాల గురించి అధికార యంత్రాంగాలు సరైన సమయంలో, సమర్థవంతంగా ఖచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు అందించేట్లు చూడడం.

డి) కేంద్ర పౌర సమాచార అధికారులు లేక రాష్ట్ర పౌర సమాచార అధికారులకు శిక్షణ ఇవ్వడం అధికార యంత్రాంగాలు ఉపయోగించుకోవడం కోసం శిక్షణా సామాగ్రిని రూపొందించడం.

2. ఈ చట్టం కింద సంక్రమించిన హక్కులను వినియోగించుకోదలచిన ఏవ్యక్తికి అయినా అవసరమయ్యే సమాచారంతో, తేలికగా అర్థం అయ్యే రీతిలో ఒక గైడును సముచిత ప్రభుత్వం, ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత 18 నెలలలోగా అధికార భాషలో ముద్రించాలి.

3. సముచిత ప్రభుత్వం, అవసరమైన పక్షంలో సబ్‌సెక్షన్ (2) లో సూచించిన మార్గదర్శక సూత్రాలను ఎప్పటికప్పుడు సవరించి ప్రచురించవచ్చు. సబ్‌సెక్షన్(2) సాధారణ లక్షణాలకు భంగం వాటిల్లని రీతిలో ఈ కింది విషయాలపై మార్గదర్శక సూత్రాలను ప్రచురించవచ్చు.

ఎ) ఈ చట్టం లక్ష్యాలు.

బి) సెక్షన్ 5 లోని సబ్‌సెక్షన్ (1) కింద ప్రతి అధికార యంత్రాంగంలో నియమితులైన కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి చిరునామా, ఫోన్ నెంబరు, ఫ్యాక్స్ నంబరు, దొరికిన పక్షంలో ఇ-మెయిల్ అడ్రస్.

సి) కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారికి సమాచారం కోసం అభ్యర్థన అందించే విధానం, రూపం.

డి) ఈ చట్టం ప్రకారం ఒక అధికార యంత్రాంగంలోని కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి నుంచి దరఖాస్తుదారుకు అందే సహాయం, ఆ అధికారుల విధులు.

ఇ) కేంద్ర సమాచారం కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ నుండి అందగల సహాయం.

యఫ్) ఈ చట్టం ద్వారా సంక్రమించిన హక్కులు, ఈ చట్టం నిర్దేశిస్తున్న విధులకు సంబంధించి ఏదన్నా జరిగినా, ఏదన్నా జరగకపోయినా, సమాచార కమీషన్ అప్పీలు చేసుకోవడంతో సహా చట్టంలో ఉన్న అన్ని పరిష్కార మార్గాలు.

జి) సెక్షన్ 4 ప్రకారం వివిధ విభాగాల రికార్డులను స్వచ్ఛందంగా వెల్లడి చేయడానికి సంబంధించిన నిబంధనలు.

హెచ్) సమాచారం అందుబాటు కోసం చెల్లించాల్సిన రుసుము నోటీసులు,

ఐ) ఈ చట్టం ప్రకారం సమాచారం అందుబాటు కోసం ఏవైనా రూల్స్ రూపొందించినా, సర్క్యులర్‌లు జారీ చేసినా వాటి వివరాలు.

4. సముచిత ప్రభుత్వం, అవసరం అయిన పక్షంలో తప్పనిసరిగా మార్గదర్శక సూత్రాలను ఎప్పటికప్పుడు సవరించి ప్రచురించాలి.

27. 1. ఈ చట్టంలోని నిబంధనలను అమలు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం అధికార గెజిట్‌లో ప్రచురించడం ద్వారా రూల్స్ రూపొందించవచ్చు.

2. పైన చెప్పిన అధికారం సాధారణతకు భంగం కలగని రీతిలో ఈ కింది విషయాలన్నింటికీ లేక వాటిలో కొన్నింటికీ సంబంధించిన రూల్స్ రూపొందించవచ్చు.

ఎ) సెక్షన్ 4 లోని సబ్‌సెక్షన్ (4) కింద వ్యాప్తి చేయాల్సిన విషయాల మాధ్యమానికి లేక ముద్రణకూ అయ్యే ఖర్చు ధర,

బి) సెక్షన్ 6 లోని సబ్‌సెక్షన్ (1) కింద చెల్లించాల్సిన రుసుము.

సి) సెక్షన్ 7 లోని సబ్‌సెక్షన్ (1), (5) కింద చెల్లించాల్సిన రుసుము.

డి) సెక్షన్ 13 లోని సబ్‌సెక్షన్ (7) ప్రకారం, సెక్షన్ 16 లోని సబ్‌సెక్షన్ (6) ప్రకారం అధికారులకూ, ఇతర ఉద్యోగులకు చెల్లించాల్సిన వేతనాలు, అలవెన్సులు, వారి సర్వీసు నియమ నిబంధనలు.

ఇ) సెక్షన్ 19 లోని సబ్‌సెక్షన్ (10) ప్రకారం అప్పీళ్ళపై విచారణకు కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ అవలంబించవలసిన పద్ధతి.

యఫ్) నిర్ణీత పద్ధతిలో నిర్ణయించవలసిన మరే విషయమయినా.

28. 1. ఈ చట్టంలోని నిబంధనలను అమలు చేయడం కోసం అధికార గెజిట్‌లో ప్రచురించడం ద్వారా సమర్థ అధికారి రూల్స్ రూపొందించవచ్చు.

2. పైన చెప్పిన అధికారం సాధారణతకు భంగం కలగని రీతిలో ఈ కింది విషయాలన్నింటికీ, లేక వాటిలో కొన్నింటికి సంబంధించి రూల్స్ రూపొందించవచ్చు.

i) సెక్షన్ 4 లోని సబ్‌సెక్షన్ (4) కింద వ్యాప్తి చేయాల్సిన విషయాల మాధ్యమానికి లేక ముద్రణకూ అయ్యే ఖర్చు ధర.

ii) సెక్షన్ 6 లోని సబ్‌సెక్షన్ (1) కింద చెల్లించాల్సిన రుసుము.

iii) సెక్షన్ 7 లోని సబ్‌సెక్షన్ (1) కింద చెల్లించాల్సిన రుసుము.

iv) నిర్ణీత పద్ధతిలో నిర్ణయించవలసిన మరే విషయము లోనయినా.

29. 1. ఈ చట్టం కింద చేసిన ప్రతిరూల్‌నూ ఆ వెంటనే కేంద్రప్రభుత్వం పార్లమెంటు ఉభయసభల ముందు, 30 రోజుల పాటు ఒకే సమావేశంలో గానీ లేక రెండు అంతకు మించిన సమావేశాలలో గానీ ఉంచాలి. ఒక సమావేశం తర్వాత రెండవ సమావేశం ముగిసే ముందు, లేక ముందు చెప్పిన వరుస సమావేశాలు ముగిసే ముందు ఉభయసభలు ఒక రూల్‌ను సవరించాలని గానీ, లేక అసలు ఆ రూలు ఉండకూడదని కానీ నిర్ణయించిన పక్షంలో ఆ రూల్ ఆ నిర్ణయం ప్రకారం సవరించిన రూపంలో అమలవుతుంది. లేక రద్దయిపోతుంది. అయితే ఆ విధమైన సవరణగానీ, రద్దుగానీ ఆ రూల్ కింద అంతకుముందు చేసిన పనులపై ప్రభావం చూపించరాదు.

2. ఈ చట్టం కింద చేసిన ప్రతిరూలును, నోటిపై చేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం విధాన సభ ముందు ఉంచాలి.

30. 1. ఈ చట్టంలోని నిబంధనల అమలుకు ఎలాంటి అవరోధం ఎదురయినా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టంలోని నిబంధనలకు విరుద్ధం కాని రీతిలో ఆ అవరోధాలను తొలగించేందుకు అవసరమనిపించిన రీతిలో అధికార గెజిట్‌లో ఉత్తర్వులను ప్రచురించడం ద్వారా తగిన నిబంధనలను రూపొందించవచ్చు. ఈ చట్టం అమలులోకి వచ్చిన నాటి నుంచీ రెండేళ్ళ తర్వాత ఈ రకమైన ఉత్తర్వులను ప్రచురించేందుకు వీలులేదు.

2. ఈ సెక్షన్ కింద ప్రచురించిన ప్రతి ఉత్తర్వును పార్లమెంటు ఉభయసభల ముందు ఉంచాలి.

31. సమాచార స్వేచ్ఛ చట్టం, 2002 దీనితో రద్దయిపోయింది.

సమాచార హక్కు చట్టం నియమాలు 2005

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజపత్రం ద్వారా 13.10.2005 న సమాచార హక్కు చట్టం 2005 కు సంబంధించిన నియమాలు జారీ చేసింది.

ప్రకటన

సమాచార హక్కు చట్టం 2005 లోని సెక్షన్ 27 నందు గల సబ్‌సెక్షన్ 2 లోని క్లాజులు (బి) (సి) ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ క్రింద పేర్కొన్న విధంగా నియమాలను తయారు చేయడమైనది.

నియమాలు

1. పేరు, అమలు తేది:

1. ఈ నియమాలను ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు నియమాలు 2005 గా పిలవవచ్చు.
2. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజపత్రం ద్వారా 13.10.2005 నుండి అమలులోనికి వస్తుంది.

2. నిర్వచనాలు:

ఈ నియమాల్లో సందర్భానుసారం, ఏమైనా మార్పులుంటే తప్ప.

ఎ) 'రాష్ట్రం' అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

బి) 'చట్టం' అనగా సమాచార హక్కు చట్టం 2005.

సి) 'సెక్షను' అనగా చట్టం యొక్క సెక్షను.

డి) 'కమీషను' అనగా చట్టంలోని సెక్షన్ 15(1) ప్రకారం నియమించిన రాష్ట్ర సమాచార కమీషన్.

ఇ) అన్ని పదాలు మరియు భావాలు చట్టంలో నిర్వచించిన విధంగా వుంటాయి.

3. సమాచార సేకరణ నిమిత్తం చెల్లించవలసిన దరఖాస్తు రుసుము :

ఈ చట్టంలోని సెక్షన్ 6 లోని సబ్‌సెక్షన్ (1) ప్రకారం సమాచార సేకరణ కొరకు చేసుకున్న దరఖాస్తు రుసుమును డిమాండు డ్రాఫ్టు ద్వారా లేదా బ్యాంకర్స్ చెక్ ద్వారా చెల్లించవచ్చు. డి.డి.లేదా చెక్కును అకౌంట్స్ ఆఫీసర్ లేదా నిర్ణయించిన అధికారి పేరు మీద చెల్లించి రసీదును పొందవలెను.

రుసుము వివరాలు:

ఎ) గ్రామస్థాయిలో సమాచార సేకరణ కొరకు ఎలాంటి రుసుము చెల్లించవలసిన పనిలేదు.

బి) మండలస్థాయిలో సమాచార సేకరణ కొరకు ఒక్కొక్క దరఖాస్తుకు రూ॥5 లు చెల్లించవలెను.

సి) ఇతర స్థాయిల్లో సమాచారం పొందుట కొరకు 10 రూపాయిలు చెల్లించవలెను.

4. సమాచారాన్ని ఇచ్చుట కొరకు రుసుము:

ఈ చట్టంలోని సెక్షన్ 7 లోని సబ్‌సెక్షన్ (1) మరియు (5) ద్వారా సమాచారాన్ని ఇచ్చుట కొరకు డి.డి.లేదా బ్యాంకర్స్ చెక్ ద్వారా రుసుమును అకౌంట్స్ ఆఫీసర్ లేదా మరే ఇతర అధికారుల పేర్లపై చెల్లించి రశీదు పొందవలెను.

రుసుము వివరాలు :

ఎ) రుసుము చెల్లించి పొందు సమాచారం:

ముద్రించబడిన సమాచారం, మ్యాప్స్, ప్రణాళికలు, ప్లాపీలు, సీడీలు, ఇతర రూపాల్లో నిర్ధారించిన రుసుము చెల్లించి పొందవచ్చును.

బి) రుసుము చెల్లించకుండా ఇతర సమాచారం:

1. ముద్రించబడిన సమాచారం పొందుటకు ఒక్కొక్క పేజికి రూ॥2 లు
2. ముద్రించబడిన సమాచారం (ఎ4 లేదా ఎ3 కంటే పెద్ద) పొందుటకు ఎంత ఖర్చయితే అంత చెల్లించవలెను.
3. మ్యాప్‌లు మరియు ప్రణాళికలకు అయ్యే అసలు ఖర్చు.
4. ఫ్లాపీలలో, సీడీలు మరియు డీవిడీలలో సమాచారం పొందుట కొరకు:

   ఎ) 1.44 MB ఫ్లాపీ కొరకు రూ॥50 లు

   బి) 700 MB సీడీ కొరకు రూ॥100 లు

   సి) డి.వి.డి., సీడి కొరకు రూ॥200 లు

5. నమూనాలు మరియు మోడల్స్ కొరకు అయ్యే అసలు ఖర్చు.
6. రికార్డుల తనిఖీ, గంట వరకు రుసుము లేదు. తరువాత ప్రతి 15 ని.లకు రూ॥5 లు చెల్లించవలెను.
7. పోస్టు ద్వారా సమాచారం పంపవలసినట్లయితే నిర్ధారించబడిన రుసుముతో పాటు పోస్టు ఖర్చులు కూడా చెల్లించవలెను.

*****

10. న్యాయసేవా అధికార చట్టం 1987

ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు మరియు పౌరులకు ఇతర కారణాల వల్లగానీ, ఆర్థికంగా గానీ, న్యాయం పొందు అవకాశం కోల్పోకుండా ఉచితంగా, నాణ్యమైన న్యాయాన్ని న్యాయవ్యవస్థ ద్వారా అందరికీ సమానంగా అందజేయుట కొరకు మరియు లోక్ అదాలత్‌లను నిర్వహించడం లాంటి కార్యక్రమాలు కోసం న్యాయసేవా అధికార చట్టం ఉద్దేశించబడినది.

అధ్యాయం - I

ప్రాథమికం

1. చట్టంపేరు, పరిధి, అమలు తేదీ :

1. ఈ చట్టాన్ని న్యాయసేవా అధికార చట్టం 1987 అనిపిలవవచ్చు.
2. ఈ చట్టం భారతదేశం అంతా వర్తిస్తుంది. జమ్మూ, కాశ్మీర్ మినహా.
3. ఈ చట్టం కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన తేదీ నుండి అమలవుతుంది.

రాష్ట్రాలలో ఆయా రాష్ట్రాలు ప్రకటించిన తేదీ నుండి అమలవుతుంది.

2. నిర్వచనాలు :

1. ఈ చట్టంలోని పదాలకు అర్థం సందర్భాలు వేరుకానిచో

ఎ) 'కేసు' అనగా ఏ న్యాయాస్థానంలోనైనా విచారించబడుతున్న దావా లేదా వ్యవహారం.

ఎఎ) 'కేంద్రీయ అధికారం' అనగా సెక్షన్ 3 ప్రకారం జాతీయ న్యాయసేవా అధికారం.

ఎఎఎ) 'న్యాయస్థానం' అనగా సివిల్, క్రిమినల్, రెవెన్యూ న్యాయస్థానములు, ట్రిబ్యునళ్ళు లేదా చట్టానికి అనుగుణంగా తాత్కాలికంగా ఏర్పాటు చేయబడిన ఇతర అధికారం ద్వారా న్యాయపరమైన లేక న్యాయాన్ని పోలియున్న విధులను నిర్వహించుట.

బి) 'జిల్లా అధికారం' అనగా సెక్షన్ 9 ప్రకారం జిల్లా న్యాయసేవ అధికారం

బిబి) 'హైకోర్టు న్యాయసేవల కమిటీ' అనగా సెక్షన్ 8ఎ ప్రకారం ఏర్పాటు చేయబడిన హైకోర్టు న్యాయసేవల కమిటీ.

ఎ) 'న్యాయసేవలు' అనగా ఏదైనా న్యాయస్థానం లేదా ఇతర కార్యాలయాల్లో లేదా ట్రిబ్యునళ్ళలో జరుగు కేసులు లేదా న్యాయవ్యవహారాల్లో సహాయపడుట మరియు న్యాయపరమైన సలహాలనిచ్చుట.

బి) 'లోక్‌అదాలత్' అనగా అధ్యాయం 4 ప్రకారం ఏర్పాటు చేయబడిన లోక్ అదాలత్.

సి) '[ప్రకటన' అనగా ప్రభుత్వ రాజపత్రంలో చేసిన ప్రకటన

డి) 'నిర్ణయించబడిన' అనగా ఈ చట్టం ప్రకారం నిర్ణయించబడిన నిబంధనలు.

యఫ్‌యఫ్) 'నిబంధనలు' అనగా ఈ చట్టం కింద చేయబడిన నిబంధనలు.

ఇ) 'పథకం' అనగా కేంద్ర అధికారం తయారు చేసే ఏ పథకమైనా రాష్ట్ర, జిల్లా అధికారాల ద్వారా ఈ చట్టాన్ని అమలు చేయుట.

యఫ్) 'రాష్ట్ర అధికారం' అనగా సెక్షన్ 6 ప్రకారం రాష్ట్ర న్యాయసేవా అధికారాన్ని ఏర్పాటు చేయుట.

జి) 'రాష్ట్రప్రభుత్వం' అనగా రాజ్యాంగంలోని 239వ అధికరణం ప్రకారం కేంద్రపాలిత ప్రాంతాలలో పరిపాలనాధికారిని రాష్ట్రపతి నియమించుట.

హెచ్) 'సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీ' అనగా సెక్షన్ 3ఎ ప్రకారం ఏర్పాటు చేయబడిన సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీ

ఐ) 'తాలూకా న్యాయసేవల కమిటీ' అనగా సెక్షన్ 11ఎ ప్రకారం ఏర్పాటు చేయబడిన తాలూకా న్యాయసేవల కమిటీ.

2. ఈ చట్టంలో ఉదహరించబడిన అంశాలు ఏ ఇతర చట్టాల్లో లేదా దానిలోని అంశాలు ఏ ప్రాంతంలోనైనా లేని ఎడల అందుకు సమానమైన ఇతర చట్టాలను పరిగణించవచ్చు.

అధ్యాయం - II

జాతీయ న్యాయసేవల అధికారం

3. జాతీయ న్యాయసేవా అధికారం యొక్క ఏర్పాటు :

1. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలుపరచుటకు అప్పగించిన అధికారాలను వినియోగించుటకు మరియు విధులను నిర్వహించుటకు జాతీయ న్యాయసేవా అధికారం అనే సంస్థను ఏర్పాటు చేయవలెను.

2. కేంద్ర అధికారంలో ఈ క్రింది సభ్యులుంటారు.

   ఎ) భారత ప్రధాన న్యాయమూర్తి ప్యాట్రన్ ఇన్ చీఫ్‌గా వ్యవహరిస్తారు.

   బి) భారత ప్రధాన న్యాయమూర్తి సలహాతో రాష్ట్రపతిచే నియమించబడిన పదవిలో ఉన్న లేదా పదవీ విరమణ చేసిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి కార్యనిర్వాహక అధ్యక్షుని హోదాలో ఉంటారు.

   సి) భారత ప్రధాన న్యాయమూర్తి సలహా మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించబడిన అనుభవం, అర్హతలు గల ఇతర సభ్యులు తగు సంఖ్యలో ఉంటారు.

3. భారత ప్రధాన న్యాయమూర్తి సలహా మేరకు కేంద్రప్రభుత్వం ఒక అధికారిని కేంద్ర అధికారిక మెంబర్ సెక్రటరీగా నియమించి ప్రభుత్వం నిర్ణయించిన లేక అధికారిక కార్యనిర్వాహక అధ్యక్షునితో అప్పగించిన అధికారాలను, విధులను నిర్వహించుట.

4. కేంద్రప్రభుత్వం కేంద్ర అధికారిక సభ్యుల మెంబరు సెక్రటరీల పదవీ కాలాన్ని, ఇతర ఉద్యోగ షరతులను భారత ప్రధాన న్యాయమూర్తి నిర్ధారించవలెను.

5. భారత ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన తరువాత కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంఖ్యలో అధికారులు మరియు ఇతర ఉద్యోగులను కేంద్ర అధికారం ఈ చట్ట ప్రకారం సమర్థవంతంగా విధులను నిర్వహించుట కొరకు నియమించవచ్చు.
6. భారత ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన పిదప కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఈ సంస్థ ఉద్యోగులూ; ఇతరసిబ్బంది వేతనాలు, ఇతర బత్తెములు పొందవచ్చును.
7. కేంద్ర అధికారం పరిపాలనా ఖర్చులు కేంద్ర మెంబర్ సెక్రటరీ, అధికారులు, ఇతర సిబ్బంది యొక్క జీత భత్యములు, ఫించన్లను భారత ప్రభుత్వం సంచిత నిధి (Consolidated fund of India) నుండి చెల్లించాలి.
8. కేంద్ర అధికారి యొక్క ఆదేశాలు, నిర్ణయాలు మెంబరు సెక్రటరీచే గాని లేదా కార్యనిర్వాహక అధ్యక్షునిచే అనుమతి పొందిన ఇతర అధికారిచే గాని ధ్రువీకరించవలెను.
9. కేంద్ర అధికార సంస్థ నియామక లోపంగాని, లేక ఈ సంస్థలో ఖాళీలు ఉన్నా కేంద్ర అధికార సంస్థ యొక్క చర్యలు గాని, వ్యవహారాలు గాని నిష్ప్రయోజనం కాదు.

3ఎ. సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీ :

1. కేంద్రీయ అథారిటీ నిర్ణయించిన నిబంధనల ప్రకారం అధికారాలను, కర్తవ్యాలను నిర్వహించుటకు కేంద్రీయ అథారిటీ సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీని ఏర్పాటు చేయవలెను.
2. ఈ కమిటీలో ఈ దిగువ సభ్యులు ఉంటారు.

ఎ) సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్యక్షునిగా వుంటారు.

బి) భారత ప్రధాన న్యాయమూర్తి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన అనుభవం, అర్హతలు గల తగినంత మంది ఇతర సభ్యులను నియమిస్తారు.

3. భారత ప్రధాన న్యాయమూర్తి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన అనుభవం, అర్హతలు గల ఒక వ్యక్తిని ఈ కమిటీకి కార్యదర్శిగా నియమిస్తారు.
4. కేంద్రీయ అథారిటీ నిబంధనల ప్రకారం ఈ కమిటీ సభ్యులూ కార్యదర్శి యొక్క పదవీ కాలం ఉద్యోగ నిబంధనలు నిర్ణయింపబడును.
5. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంఖ్యలో ఈ చట్టం కింద కార్యకలాపాలు సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులను, సిబ్బందిని భారత ప్రధాన న్యాయమూర్తి సలహా మేరకు కమిటీ నియమించుకొనవచ్చును.
6. ఈ కమిటీ అధికారులకు ఇతర ఉద్యోగులకు జీతభత్యములు ఉద్యోగ నిబంధనలకు లోబడి భారత ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన పిదప కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ఉండును.

4. కేంద్రీయ అథారిటీ ఉద్దేశాలు :

ఈ దిగువ తెల్పిన అన్నియూ లేదా కొన్ని ఉద్దేశాలను కేంద్రీయ అథారిటీ నిర్వహించవలెను.

ఎ) ఈ చట్టం కింది న్యాయసేవలను అందించుటకు అవసరమైన విధానాలను, సూత్రాలను నిర్ణయించుట;

బి) ఈ చట్టంలోని అంశాల కింద న్యాయసేవలను అందించుట కొరకు తక్కువ ఖర్చుతో ప్రయోజనకరమైన కార్యక్రమాలను రూపొందించుట;

సి) తమ ఆధీనంలో నున్న నిధులను సద్వినియోగం చేయుట, రాష్ట్ర, జిల్లా అథారిటీలకు తగు నిధులను కేటాయించుట:

డి) సాంఘిక న్యాయానికి సంబంధించిన కేసులలో అనగా వినియోగ దారులూ, పర్యావరణ పరిరక్షణ, బలహీనవర్గాలకు సంబంధించిన ప్రత్యేక విషయాలలో సంఘసేవకులకు న్యాయనైపుణ్యాలలో శిక్షణ నిచ్చుటకు తగిన చర్యలు తీసుకొనుట;

ఇ) గ్రామీణ ప్రాంతాలు, మురికివాడలు, కార్మికవాడలలోని బలహీన వర్గాలు వారి హక్కులు తెలుసుకొనేటట్లు చేయుటకూ ప్రజాకోర్టుల ద్వారా వారి వివాదాలను పరిష్కరించుకొనుటలో ప్రోత్సహించుట కొరకు న్యాయసలహా శిబిరాలను నిర్వహించుట;

యఫ్) సంప్రదింపులు, ఏకసభ్య లేక పంచాయితీ మధ్యవర్తిత్వ పరిష్కారం లేదా రాజీ ప్రయత్నాల ద్వారా వివాదాలను పరిష్కరించుకొనునట్లు ప్రోత్సహించుట;

జి) పేదవారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని న్యాయసేవల విషయంలో పరిశోధన చేపట్టుట, ప్రోత్సహించుట;

హెచ్) రాజ్యాంగంలోని 4ఎ అధ్యాయంలో తెలుపబడిన పౌరుల ప్రాథమిక విధులకు వారు బద్ధులై ఉండుటకు కావలసిన చర్యలన్నింటినీ చేపట్టుట;

ఐ) న్యాయసహాయ కార్యక్రమాలను తరచూ పర్యవేక్షించుట, మూల్యాంకనము చేయుట మరియు ఈ చట్టముకింద ధన సహాయము పొంది పాక్షికంగా గాని, సంపూర్ణంగా గాని అమలు జరుపబడిన కార్య క్రమాలకు స్వతంత్ర మూల్యాంకనమును సమకూర్చుట.

జె) ఈ చట్టం ప్రకారము న్యాయసేవల పథకాలకు సమకూర్చబడిన నిధుల నుండి వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలు, రాష్ట్ర, జిల్లా అథారిటీలు చేపట్టు కార్యక్రమాల కొరకై ధన సహాయం చేయుట;

కె) భారతీయ బార్ కౌన్సిల్‌తో సంప్రదించిన పిదప విశ్వవిద్యాలయాలలో న్యాయ కళాశాలలోను మరియు ఇతర సంస్థలలోనూ న్యాయవిధాన సంస్థలను స్థాపించి విద్యా కార్యక్రమాలను ప్రవేశపెట్టి మార్గదర్శకత్వాన్ని రూపొందించి వాటి పనితీరును పర్యవేక్షించుట;

యల్) ప్రజలలో న్యాయసంబంధమైన విజ్ఞానం మరియు అవగాహనను త్వరితగతిని పెంపొందించుచూ, సమాజ సంక్షేమ శాసనాలు, ఇతర చట్టాలు పరిపాలనా చర్యలు, కార్యక్రమాల ద్వారా బలహీనవర్గాలకు కల్పించబడిన హక్కులు, ప్రయోజనాలు, రాయితీల గురించి వారికి తెలియచేయుట;

ఎమ్) ముఖ్యంగా షెడ్యూల్డు కులాలు మరియు తెగలు, స్త్రీలు, గ్రామీణ మరియు పట్టణ కార్మికుల కొరకు ప్రజల మధ్య పనిచేయు స్వచ్ఛంద సేవా సంస్థల సహాయమును పొందుటకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొనుట;

ఎన్) రాష్ట్రీయ అథారిటీలు, జిల్లా అథారిటీలు, సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీ, హైకోర్టు న్యాయసేవల కమిటీలు, తాలూకా న్యాయసేవల కమిటీలు, స్వచ్ఛంద సంఘసేవా సంస్థలు మరియు ఇతర న్యాయసేవల వ్యవస్థలు పనిచేయు విధానాన్ని సమన్వయ పరచి సమీక్షించుట, న్యాయసేవల కార్యక్రమాలు తగిన విధంగా అమలు జరుగునట్లు అవసరమైన సలహాలు ఇచ్చుట.

5. ఇతర సంస్థల సమన్వయముతో కేంద్రీయ అథారిటీ పనిచేయుట:

కేంద్రీయ అథారిటీ ఈ చట్టం క్రింద తన విధులను నిర్వహించుటలో పేదవారికి అవసరమైన చోట న్యాయసేవలందించుటకు పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, విశ్వవిద్యాలయాలు మరియు ఇతర సంస్థలతోను సమన్వయముతో వ్యవహరించవలెను.

అధ్యాయం - III

రాష్ట్ర న్యాయసేవల అథారిటీ

6. రాష్ట్ర న్యాయసేవల అథారిటీ నిర్మాణం :

1. ఈ చట్టం కింద తనకు అప్పగించిన అధికారాలను వినియోగించుటకూ, విధులను నిర్వహించుటకూ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ అని పిలువబడు సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి;
2. రాష్ట్ర అథారిటీలో ఈ దిగువ సభ్యులు ఉంటారు;
   ఎ) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్యాట్రన్ ఇన్ చీఫ్‌గా వ్యవహరిస్తారు.
   బి) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహాతో రాష్ట్ర గవర్నర్‌చే నియమించబడిన పదవిలో ఉన్న లేదా పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి కార్యనిర్వాహక అధ్యక్షుని హోదాలో వుంటారు.
   సి) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహాతో రాష్ట్ర ప్రభుత్వంచే నిర్ణయింపబడిన అనుభవమూ, అర్హతలూ గల రాష్ట్ర ప్రభుత్వంచే నియమించబడిన ఇతర సభ్యులు వుంటారు.
3. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన పిదప రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉన్నత న్యాయసర్వీసుల నుండి జిల్లా జడ్జి హోదాకు తగ్గని ఒక అధికారిని, రాష్ట్రీయ అథారిటీ కార్యనిర్వాహక అధ్యక్షుని ఆధీనంలో విధులను నిర్వహించుటకూ రాష్ట్ర ప్రభుత్వము లేదా కార్యనిర్వాహక అధ్యక్షులు కల్పించిన అధికారాలను నిర్వహించుటకూ మెంబరు – సెక్రటరీగా నియమించవలయును. అలా కానిచో, సబ్ సెక్షన్‌లో పేర్కొన్న అర్హతలు లేకపోయినప్పటికీ, స్టేట్ అథారిటీ ఏర్పాటు చేయుటకు పూర్వము రాష్ట్ర న్యాయ సహాయ, సలహా బోర్డుకు కార్యదర్శిగా పనిచేస్తున్న వ్యక్తిని మెంబరు – సెక్రటరీగా ఐదేళ్ల వరకూ పనిచేయుటకై నియమించవచ్చును.
4. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సలహామేరకు రాష్ట్రప్రభుత్వం అథారిటీ యొక్క సభ్యుల, మెంబర్ – సెక్రటరీ యొక్క పదవీకాలం ఇతర షరతులు నిర్ణయిస్తుంది.
5. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహామేరకు ఈ చట్టం కింద ఈ సంస్థ విధులను సమర్థవంతంగా నిర్వహించుట కొరకు తగిన సంఖ్యలో అధికారులను, ఇతర సిబ్బందిని రాష్ట్రీయ అథారిటీ నియమించాలి.

6. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన మీదట రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఈ సంస్థ ఉద్యోగులు ఇతర సిబ్బంది వేతనాలు, ఇతర అలవెన్సులు పొందుటకు అర్హులవుతారు.
7. రాష్ట్రీయ అథారిటీకి సంబంధించిన పరిపాలనకు అగు ఖర్చులను, మెంబర్-సెక్రటరీ, అధికారులు, ఇతర సిబ్బంది యొక్క వేతనాలు, అలవెన్సులు పింఛనులతో సహా రాష్ట్ర సంఘటిత నిధి నుండి భరించాలి.
8. రాష్ట్రీయ అథారిటీ యొక్క ఆదేశాలు, నిర్ణయాలు, మెంబర్ -సెక్రటరీచే గానీ, లేదా ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌చే అనుమతి పొందిన ఏ ఇతర అధికారిచే కానీ ధృవీకరింపబడాలి.
9. రాష్ట్రీయ అథారిటీ నియామక లోపం కానీ లేదా ఈ సంస్థలో ఖాళీలు ఉన్నా రాష్ట్రీయ అథారిటీ యొక్క ఏ చర్యలుగానీ, వ్యవహారంగానీ నిష్ప్రయోజనం కాదు.

7. రాష్ట్రీయ అథారిటీ ఉద్దేశాలు :

1. కేంద్రీయ అథారిటీ యొక్క విధానాలను, నిర్దేశాలను రాష్ట్రీయ అథారిటీ అమలు చేయాలి.
2. సబ్‌సెక్షన్ (1) లో తెలిపిన విధులకు విరుద్ధంగా లేకుండా ఈ దిగువ తెలిపిన అన్నీ లేదా కొన్ని కర్తవ్యాలను రాష్ట్ర అథారిటీ నిర్వహించాలి.
   ఎ) ఈ చట్టంలో పొందుపరచిన ప్రమాణాలకు సరిపడిన వ్యక్తులకు న్యాయసహాయం అందించుట;
   బి) హైకోర్టు కేసులతో సహా అన్ని కేసులను నిర్వహించాలి;
   సి) నివారణాత్మక, వ్యూహాత్మక న్యాయసహాయ కార్యక్రమాలను చేబట్టుట;
   డి) కేంద్రీయ అథారిటీని సంప్రదించిన పిదప రాష్ట్ర అథారిటీ నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఇతర విధులను నిర్వహించాలి.

8. రాష్ట్రీయ అథారిటీ, కేంద్రీయ అథారిటీ నిర్దేశాలకు లోబడి మరియూ ఇతర సంస్థల సమన్వయంతో కలిసి పనిచేయాలి

రాష్ట్రీయ అథారిటీ ఈ చట్టం కింద తన విధులను నిర్వహించుటలో తగురీతిలో పేదవారికి న్యాయసేవలను అందించుటకు పనిచేసే ఇతర ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ఇతర సంస్థలతోనూ, సమన్వయంతో వ్యవహరిస్తూ, ఈ విషయంలో కేంద్రీయ అథారిటీ లిఖిత పూర్వకంగా ఇచ్చే సలహాలను పాటించాలి.

8ఎ) హైకోర్టు న్యాయ సేవల కమిటీ :

1. రాష్ట్రీయ అథారిటీ నిర్ణయించిన నిబంధనల ప్రకారం అధికారాలను, కర్తవ్యాలను నిర్వహించుటకు రాష్ట్రీయ అథారిటీ హైకోర్టు న్యాయసేవల కమిటీని ఏర్పాటు చేయాలి.
2. ఈ కమిటీలో ఈ దిగువ సభ్యులు ఉంటారు;
   ఎ) పదవిలో ఉన్న హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షునిగా వ్యవహరిస్తారు.
   బి) రాష్ట్రీయ అథారిటీ నిబంధనల కింద నిర్ణయించిన అర్హతలు అనుభవం గల తగినంత మంది

ఇతర సభ్యులను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియమించును.

3. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన అనుభవం, అర్హతలు గల ఒక వ్యక్తిని ఈ కమిటీ కార్యదర్శిగా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియమించాలి.
4. రాష్ట్రీయ అథారిటీ నిబంధనల ప్రకారం ఈ కమిటీ సభ్యుల, కార్యదర్శి పదవీకాలం, ఉద్యోగ నిబంధనలు నిర్ణయింపబడాలి.
5. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన పిదప రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంఖ్యలో ఈ సంస్థ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించుటకు, అధికారులను, ఇతర ఉద్యోగులను ఈ కమిటీ నియమించుకోవచ్చును.
6. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన పిదప రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఈ కమిటీ అధికారులు ఇతర ఉద్యోగుల వేతనాలూ అలవెన్సులు పొందుటకు అర్హులగుదురు.

9. జిల్లా న్యాయసేవల అథారిటీ :

1. ఈ చట్టం కింద తనకు అప్పగించిన అధికారాలను వినియోగించుటకు విధులను నిర్వహించుటకూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక న్యాయసేవల అథారిటీని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిని సంప్రదించిన పిదప రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.
2. జిల్లా అథారిటీలో ఈ దిగువ సభ్యులుంటారు.

   ఎ) జిల్లా న్యాయమూర్తి అధ్యక్షునిగా వుంటారు.

   బి) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహా మేరకు రాష్ట్ర ప్రభుత్వం అనుభవమూ, అర్హతలూ కలిగిన సభ్యులను ఎంపిక చేసుకోవాలి.
3. జిల్లా అథారిటీ అధ్యక్షుణ్ణి సంప్రదించిన పిదప రాష్ట్రీయ అథారిటీ రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీసునకు చెందిన సబార్డినేట్ జడ్జ్ లేదా సివిల్ జడ్జీ స్థాయికి తగ్గని, జిల్లా న్యాయసర్వీసులో పనిచేయుచున్న వ్యక్తిని తనకు అధ్యక్షునిచే అప్పగింపబడిన అధికారాలను, విధులను అధ్యక్షుని ఆధీనంలో నిర్వహించుటకు కార్యదర్శిగా నియమించాలి.
4. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహామేరకు రాష్ట్రీయ అథారిటీ యొక్క సభ్యుల మరియు మెంబరు సెక్రటరీ యొక్క పదవీకాలము, ఇతర షరతులు రాష్ట్రప్రభుత్వం నిర్ధారింపవలెను.
5. ఈ సంస్థ విధులను సమర్థవంతంగా నిర్వహించుట కొరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంఖ్యలో అధికారులను, ఇతర సిబ్బందినీ హైకోర్టు న్యాయమూర్తి సలహామేరకు జిల్లా అథారిటీ నియమించవచ్చును.
6. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు, ఇతర అలవెన్సులు, జిల్లా అథారిటీ అధికారులు ఇతర ఉద్యోగులు పొందుటకు అర్హులవుతారు.
7. ప్రతి జిల్లా అథారిటీకి సంబంధించిన పరిపాలన, నిర్వహణకు అయ్యే ఖర్చులను మెంబరు – సెక్రటరీ, అధికారులు, ఇతర ఉద్యోగుల యొక్క వేతనాలు, అలవెన్సులు పింఛనుతో సహా రాష్ట్రీయ సంఘటిత నిధి నుండి భరించాలి.

8. జిల్లా అథారిటీ యొక్క ఆదేశాలు, నిర్ణయాలు మెంబర్ – సెక్రటరీ కానీ, లేదా అధ్యక్షునిచే అనుమతి పొందిన ఏ ఇతర అధికారిచే కానీ ధ్రువీకరింపబడాలి.

9. ఈ సంస్థలో ఏవైనా ఖాళీలు ఏర్పడినంత మాత్రం చేత కానీ, జిల్లా అథారిటీ ఏ చర్య లేక కార్యక్రమం నిష్ప్రయోజనం కానేరదు.

10. జిల్లా అథారిటీ ఉద్దేశాలు :

1. రాష్ట్ర అథారిటీ జిల్లా అథారిటీకి కాలానుగుణంగా అప్పగించిన కర్తవ్యాలను ప్రతి జిల్లా అథారిటీ విధిగా నిర్వహించాలి.

2. సబ్‌సెక్షన్ (1) లో తెలిపిన కర్తవ్యాలకు విరుద్ధంగా లేకుండా ఈ దిగువ తెలిపిన అన్నీ లేదా కొన్ని కర్తవ్యాలను జిల్లా అథారిటీ నిర్వర్తించాలి.

   ఎ) తాలూకా న్యాయసేవల కమిటీ కార్యకలాపాలను జిల్లాలోని ఇతర న్యాయసేవలను సమన్వయ పరచుట;

   బి) జిల్లాలలో లోక్ అదాలత్‌లను నిర్వహించుట;

   సి) రాష్ట్ర అథారిటీ నిర్ణయించిన నిబంధనల ప్రకారం ఇతర విధులను నిర్వహించుట;

11. కేంద్రీయ అథారిటీ నిర్దేశాలకు లోబడి ఇతర సంస్థల సమన్వయంతో జిల్లా అథారిటీ పనిచేయుట:

జిల్లా అథారిటీ ఈ చట్టం కింద కర్తవ్యాలను నిర్వహించుటలో తగు రీతిగా పేదవారికి న్యాయసేవలు అందించడంలో పనిచేసే ఇతర ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, విశ్వవిద్యాలయాలతో, ఇతర సంస్థలతోనూ, సమన్వయంతో కేంద్రరాష్ట్ర అథారిటీలు లిఖితపూర్వకంగా ఇచ్చే నిర్దేశములకు అనుగుణంగా నడుచుకోవలెను.

11ఎ. తాలూకా న్యాయ సేవల కమిటీ :

1. ప్రతి తాలూకా లేదా మండలానికి లేదా కొన్ని తాలూకాలు లేదా మండలాల సముదాయమునకు, తాలూకా న్యాయసేవల కమిటీ అని పిలువబడే ఒక కమిటీని రాష్ట్రీయ అథారిటీ ఏర్పాటు చేయాలి.

2. ఈ కమిటీ కింది విధంగా ఉంటుంది.

   ఎ) ఈ కమిటీ పరిధిలో పనిచేయు సీనియర్ సివిల్ జడ్జీ అధ్యక్షుడుగా ఉండును.

   బి) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సలహామేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన అర్హతలు, అనుభవం కల్గి యున్న సభ్యులు రాష్ట్ర ప్రభుత్వంచే నియమించబడతారు.

3. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంఖ్యలో ఈ సంస్థ కార్యకలాపాలు సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులను, ఇతర సిబ్బందిని ఈ కమిటీ నియమించుకోవచ్చు.

4. ఈ కమిటీ అధికారులకు, ఇతర ఉద్యోగులకు జీత భత్యాల అర్హత, ఇతర ఉద్యోగ నిబంధనలు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన పిదప రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిన విధంగా ఉండును.

5. ఈ కమిటీ పరిపాలనా నిర్వహణకు అగు వ్యయాన్ని జిల్లా అథారిటీ జిల్లా న్యాయసహాయ నిధి నుండి భరించాలి.

11బి. తాలూకా న్యాయసేవల కమిటీ ఉద్దేశాలు :

తాలూకా న్యాయసేవల కమిటీ ఈ క్రింది ఉద్దేశాలను కానీ, లేదా కొన్నింటిని కానీ నిర్వహించవచ్చును.

ఎ) తాలూకాలోని న్యాయసేవల కార్యకలాపాలను సమన్వయపరచుట.

బి) తాలూకాలోని ప్రజాకోర్టులను నిర్వహించుట మరియు

సి) జిల్లా అథారిటీ తనకు అప్పగించిన ఇతర కర్తవ్యాలను నిర్వహించుట.

అధ్యాయం - IV

న్యాయసేవలు పొందుటకు హక్కులు

12. న్యాయసేవలు పొందుటకు నిర్ణయ ప్రమాణాలు :

ఈ క్రింది నిర్ణయ ప్రమాణాలకు సరిపడు ప్రతి వ్యక్తి కేసులను నమోదు చేసుకోవడానికి లేదా కేసులను ఎదుర్కొనుటకు న్యాయసేవలకు అర్హులవుతారు.

ఎ) షెడ్యూల్డు కులాలు లేదా తెగలకు చెందిన వ్యక్తులు.

బి) భారత రాజ్యాంగం 23వ అధికరణం ప్రకారం పేదలు, బిచ్చగాళ్ళు మరియు అక్రమ రవాణాకు గురైన వ్యక్తులు.

సి) స్త్రీలు, బాలలు:

డి) వికలాంగుల చట్టం 1995 లోని సెక్షన్ 2 (1) ప్రకారం అంగవైకల్యం కలిగిన వ్యక్తులు.

ఇ) సామూహిక విపత్తులు, కుల వైషమ్యాలు, వరదలు, కరువు, భూకంపాలు లేదా పారిశ్రామిక విపత్తులు మొదలగు అవాంఛనీయ పరిస్థితులలో చిక్కుకున్న వ్యక్తులు:

యఫ్) పారిశ్రామిక కార్మికులు:

జి) అక్రమ రవాణా (నిరోధక) చట్టం 1956 (104 ఆఫ్ 1956) సెక్షన్ 2జి లో ఉదహరించిన విధంగా రక్షక గృహంలోని నిర్భందీయులు లేదా బాలల న్యాయచట్టం, 1986 (53 ఆఫ్ 1986) లోని సెక్షన్ 2జె ప్రకారం బాలల రక్షణ గృహాలలో ఉన్నవారు లేదా మానసిక ఆరోగ్య చట్టం, 1987 (14 ఆఫ్ 1987) సెక్షన్ 2జి ప్రకారం మానసిక చికిత్సాలయం లేదా ఆసుపత్రులలో ఉన్నవారు.

హెచ్) కేసు సుప్రీంకోర్టులో కాకుండా ఇతర కోర్టులలో ఉన్నప్పుడు అట్టి వ్యక్తి యొక్క సంవత్సర ఆదాయం రూ. 9000/- లోపు లేదా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ పరిమితికి మించకుండా ఉన్నవారు, కేసు సుప్రీంకోర్టులో ఉన్నప్పుడు సంవత్సరిక ఆదాయం రూ. 12,000/- తక్కువగా లేదా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ పరిమితి లోపు ఉన్న వ్యక్తులు.

13. న్యాయ సేవలకు హక్కుదారులు :

1) సెక్షన్ 12 లో తెలుపబడిన ప్రమాణాలను చూపించినవారి కేసు నడుపుట కానీ, ఎదుర్కొనుటకు కానీ ప్రాథమికంగా బలం ఉన్నదని సంబంధిత అధికారులను సంతృప్తి పరచిన వారు న్యాయ సహాయం పొందుటకు అర్హులు.

2) సంబంధిత అధికారులు నమ్మలేని కారణం ఉంటే తప్ప, ఒక వ్యక్తి తన ఆదాయం తెలుపు అఫిడవిట్ న్యాయసేవలు పొందుటకు అర్హతను కలుగజేస్తుంది.

అధ్యాయం - V

ఆదాయం, జమాఖర్చులు మరియు ఆడిట్

14. కేంద్ర ప్రభుత్వ నిధులు :

ఈ చట్టం యొక్క ఉద్దేశ్యాలను అమలు పరచుటకు కేంద్ర ప్రభుత్వం ఉచితమని భావించిన ధనాన్ని పార్లమెంటు చట్టసమ్మతమైన ఆమోదం పొందిన తర్వాత కేంద్రీయ అథారిటీకి నిధుల రూపంలో అందజేయాలి.

15. జాతీయ సహాయ నిధి:

1. కేంద్రీయ అథారిటీ, జాతీయ న్యాయసహాయ నిధిని ఏర్పాటు చేయాలి. దీనిలో ఈ కింద వివరింపబడిన విధంగా ధనసేకరణ చేయాలి.
   ఎ) సెక్షన్ 14 కింద కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ల ద్వారా ఇచ్చే ధనం;
   బి) ఈ చట్టం కోసం ఏ ఇతర వ్యక్తి అయినా కేంద్రీయ అథారిటీకి ఇచ్చే గ్రాంట్లు లేదా విరాళాలు;
   సి) కోర్టు ఉత్తర్వుల ద్వారా లేదా ఏ ఇతర వనరుల నుండి కానీ కేంద్రీయ అథారిటీ అందుకొను ధనం;
2. జాతీయ న్యాయసహాయ నిధిని కింది అవసరాలకు ఉపయోగించాలి.
   ఎ) రాష్ట్రీయ అథారిటీలకు ఇచ్చే గ్రాంట్లతో సహా ఈ చట్టం కింద తెలిపిన న్యాయసేవలకు అగు ఖర్చుల నిమిత్తం;
   బి) సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీకి న్యాయసేవల ఖర్చుల నిమిత్తం;
   సి) కేంద్రీయ అథారిటీ చేసే ఏవైనా ఇతర అవసరమైన ఖర్చుల నిమిత్తం

16. రాష్ట్ర న్యాయసహాయనిధి:

1. రాష్ట్రీయ అథారిటీ న్యాయసహాయనిధిని ఏర్పాటు చేయాలి. దీని కోసం కింద వివరింపబడిన విధంగా ధనసేకరణ చేయాలి.
   ఎ) ఈ చట్టం కింద కేంద్రీయ అథారిటీ ఇచ్చే ఏ గ్రాంట్లు అయినా,
   బి) ఈ చట్టం ఉద్దేశ్యాలు అమలు పరచు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం కానీ, లేదా ఎవరైనా ఇతర వ్యక్తులు రాష్ట్ర అథారిటీకి ఇచ్చిన గ్రాంట్లు లేక విరాళాలు,
   సి) కోర్టు ఉత్తర్వులు ద్వారా కానీ, లేదా ఏ ఇతర మార్గాల ద్వారా కానీ రాష్ట్రీయ అథారిటీ అందుకొను ఏదైనా మొత్తం.
2. రాష్ట్ర న్యాయసహాయ నిధిని కింది అవసరాలకు ఉపయోగించాలి.
   ఎ) సెక్షన్ 7లో తెలిపిన కర్తవ్యాలకు అగు ఖర్చులు;

బి) హైకోర్టు న్యాయసేవల కమిటీ అందించు న్యాయసేవల ఖర్చుల నిమిత్తం;

సి) రాష్ట్రీయ అథారిటీ చేసిన ఏవైనా ఇతర అవసరమైన ఖర్చులు.

17. జిల్లా న్యాయ సహాయ నిధి :

1) ప్రతి జిల్లా అథారిటీ ఒక జిల్లా న్యాయసహాయ నిధిని ఏర్పాటు చేయాలి. దీని కొరకు ఈ క్రింద వివరించిన విధంగా ధనసేకరణ చేయాలి.

ఎ) ఈ చట్టం కోసం రాష్ట్రీయ అథారిటీ జిల్లా అథారిటీకి ఇచ్చే ఏవైనా గ్రాంట్లు లేదా ఇతర మొత్తాలు.

బి) రాష్ట్రీయ అథారిటీ అనుమతితో ఈ చట్టం కోసం ఎవరైనా వ్యక్తులు జిల్లా అథారిటీకి ఇచ్చే విరాళాలు లేదా గ్రాంట్లు.

సి) కోర్టు ఉత్తర్వుల ద్వారా ఏ ఇతర వనరుల ద్వారా కానీ, జిల్లా అథారిటీ అందుకొను ఏవైనా మొత్తాలు.

2. జిల్లా న్యాయసహాయనిధిని కింది అవసరాలకు ఉపయోగించాలి.

ఎ) సెక్షనులు 10, 11బి లలో తెలుపబడిన కర్తవ్యాల ఖర్చుల నిమిత్తం.

బి) జిల్లా అథారిటీ చేసే ఏవైనా అవసరమైన ఇతర ఖర్చులు.

18. జమాఖర్చులు మరియు ఆడిట్

1. కేంద్రీయ అథారిటీ, రాష్ట్రీయ అథారిటీ లేదా జిల్లా అథారిటీలు (తర్వాత ఈ సెక్షనులో వీటిని అథారిటీ అని చెప్పబడును) సరియైన లెక్కలు మరియు ఇతర సంబంధిత రికార్డులు తయారుచేయాలి. భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను సంప్రదించిన పిదప కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన పద్ధతిలో వార్షిక ఆదాయ వ్యయ జమాఖర్చుల పట్టికను తయారుచేయాలి.

2. భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పొందుపరచిన నియమిత కాలాలలో అథారిటీ జమా–ఖర్చులను ఆడిట్ చేయించాలి. అట్టి ఆడిట్‌కు అయ్యే ఖర్చును సంబంధిత అథారిటీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు చెల్లించాలి.

3. భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ లేదా వారు నియమించిన ఏవ్యక్తినైనా ఈ చట్టం కింద అథారిటీ జమాఖర్చుల ఆడిట్ చేయుటకై పుస్తకాలు, పద్దులు, సంబంధిత రశీదులు, ఇతర పత్రాలు, కాగితాలు ప్రవేశపెట్టమని అడిగే హక్కు ఉన్నట్లు అదే హక్కులు, అధికారాలు కల్గి ఉంటారు. అథారిటీ యొక్క ఏ కార్యాలయంనైనా తనిఖీ చేసే అధికారం కల్గి ఉంటారు.

4. భారత కంప్ట్రోలర్ – ఆడిటర్ జనరల్ లేదా వారిచే నియమింపబడిన ఎవరైనా వ్యక్తి ధృవీకరించిన అథారిటీలు పద్దులు ఆడిట్ రిపోర్టుతో సహా కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్ణయించిన ప్రకారం అథారిటీలు ప్రతి సంవత్సరం సమర్పించాలి.

5. సబ్–సెక్షన్ (4) కింద పద్దులు ఆడిట్ రిపోర్టు తనకు సమర్పించబడిన వెంటనే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ఉభయసభల ముందుంచాలి.

6. సబ్-సెక్షన్ (4) కింద పద్దులు ఆడిట్ రిపోర్టును తనకు అందిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర శాసనసభ ముందు ఉంచాలి.

అధ్యాయం - VI
ప్రజాకోర్టు

19. ప్రజాకోర్టుల నిర్వహణ :

1. ప్రతి రాష్ట్రీయ అథారిటీ జిల్లా అథారిటీ, సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీ, ప్రతి హైకోర్టు న్యాయసేవల కమిటీ, తాలూకా న్యాయసేవల కమిటీలు తమ పరిధిలో తమకు సరియని తోచిన సమయాలలో, స్థలాలలో, వారి ప్రాంతాలలో ప్రజాకోర్టులను నిర్వహించుకోవచ్చును.
2. ప్రతి ప్రజాకోర్టులలోనూ నిర్దేశించిన సంఖ్యలో ఈ దిగువ పేర్కొన్న సభ్యులుండవలెను.

   ఎ) పదవిలో ఉన్న పదవీ విరమణ చేసిన న్యాయాధికారులు:

   బి) ఇతర వ్యక్తులు

సంబంధిత ప్రాంతాల్లో ప్రజాకోర్టు నిర్వహించే రాష్ట్రీయ అథారిటీ లేదా జిల్లా అథారిటీ లేదా సుప్రీంకోర్టు న్యాయ సేవల కమిటీ లేదా హైకోర్టు న్యాయసేవల కమిటీ లేదా తాలూకా న్యాయసేవల కమిటీలు నిర్ణయించిన విధంగా ఉంటారు.

3. సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీ నిర్వహించే ప్రజాకోర్టులలో పాల్గొనే సబ్-సెక్షన్ (2)(బి) లో పేర్కొన్న ఇతర వ్యక్తుల అర్హతలు మరియు అనుభవము సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన పిదప కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాలి.
4. సబ్-సెక్షన్(3) లో తెలిపినవి కాకుండా ఇతర ప్రజాకోర్టులలో పాల్గొనే సబ్-సెక్షన్(2)(బి) లో పేర్కొన్న ఇతర వ్యక్తుల అర్హతలూ, అనుభవమూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన పిదప రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాలి.
5. వివాదాలలోని వాది ప్రతివాదుల మధ్య ఈ క్రింది విషయాలలో రాజీ కుదుర్చుటకు గాని, వారి తగాదాలను పరిష్కరించుటకు గాని అధికారాన్ని ప్రజాకోర్టు కలిగియుండును.

   i) ఇంతకు ముందు విచారణలో ఉన్న ఏదైనా కేసు లేదా

   ii) ఏ విషయాల కొరకై ప్రజాకోర్టు ఏర్పాటు చేయబడినదో అట్టి విషయం ఏదైనా న్యాయస్థానపు అధికారపు పరిధిలో ఉన్ననూ దాని దృష్టికి తీసుకొని రానటువంటిది. ఏ చట్టం కింద రాజీకి వీలుపడనటువంటి నేరానికి సంబంధించిన కేసులు ప్రజాకోర్టు పరిధిలోనికి రావు.

20. ప్రజాకోర్టు న్యాయవిచారణ చేయు కేసులు :

1. సెక్షన్ 19 (5) క్లాసు (i) లో ఉదహరించిన కేసులు

   i) ఎ) ఇరుపక్షాలు ఇష్టప్రకారం

   బి) వాది ప్రతివాదులలో ఎవరైనా ప్రజాకోర్టులో పరిష్కార నిమిత్తమై తమ కేసులను పంపుటకు

దరఖాస్తు పెట్టుకొనిన యెడల కోర్టువారు ప్రాథమిక అంచనాల ప్రకారం దాని పరిష్కారానికి సావకాశము ఉన్నదని తృప్తి చెందినచో అట్టి కేసు ప్రజాకోర్టునకు పంపాలి.

ii) కోర్టువారు ప్రజాకోర్టుచే సదరు కేసు పరిష్కరింపబడగలదని తృప్తి చెందినచో అట్టి కేసు ప్రజాకోర్టునకు పంపాలి.

సబ్ క్లాజ్ (బి) లోని క్లాజు (i) లేక (ii) కింది కేసు సంబంధిత పార్టీలకు విన్నపములు చేసుకొనుటకు తగిన అవకాశం ఇవ్వనిదే సదరు న్యాయస్థానము కేసులను ప్రజాకోర్టులకు పంపరాదు.

2. ప్రస్తుతము అమలులో ఉన్న చట్టములు ఎట్లున్ననూ, సెక్షన్ 19(1) కింద ప్రజాకోర్టును నిర్వహించే అధారిటీ లేక కమిటీ ఎవరైనా పార్టీల నుండి సెక్షన్ 19(5) (2) కింద తమ విషయము ప్రజాకోర్టుకు పంపవలసిన అవసరమున్నదని విజ్ఞప్తి అందిన మీదట, ఏ విషయమైననూ ప్రజాకోర్టుకు పరిష్కారం కోసం పంపవచ్చును.

ఎదుటి పక్షము వారిని వినుటకు అవకాశము కల్పించనిదే ఏ కేసయిననూ ప్రజాకోర్టుకు పంపరాదు.

3. సబ్‌సెక్షన్ (1) మరియు (2) కింద ప్రజాకోర్టుకు పంపబడిన ఏ కేసయిననూ వాటిలోని ఇరుపక్షముల వారి మధ్య రాజీ చేయుట, లేదా పరిష్కారం చేయుటకై పూనుకోవలెను.

4. ఈ చట్టం కింద తనకు పంపబడిన ఏ కేసయిననూ త్వరగా పరిష్కరించుచూ, న్యాయము, సహృదయత ఇతర న్యాయసిద్ధాంతములను దృష్టిలో ఉంచుకొని పార్టీల మధ్య రాజీ కుదుర్చుట కానీ, పరిష్కారం చేయుటకు కానీ పూనుకొనవలెను.

5. సంబంధిత పార్టీల మధ్య రాజీ కుదరని పక్షంలో పరిష్కరించడానికి వీలుకాని కేసుల రికార్డులను, ప్రజాకోర్టు సబ్‌సెక్షన్ (1) కింద తనకు పంపబడిన కేసులను చట్టబద్ధంగా పరిష్కరించడానికి సదరు కోర్టుకు త్రిప్పి పంపవలెను.

6. సబ్‌సెక్షన్ (2) ప్రకారం తనకు పంపబడిన కేసులలోని సంబంధిత పార్టీల మధ్య రాజీ కుదరని లేదా పరిష్కరించడానికి వీలుకాని వాటిని సాధారణ న్యాయస్థానంలో పరిష్కరించుకోమని సలహాలివ్వవలెను.

7. సబ్–సెక్షన్ (5) కింద కోర్టుకు తిప్పి పంపబడిన కేసులను అట్టి కోర్టులో ఈ కేసు సబ్‌సెక్షన్ (1) కింద పంపబడినప్పుడు ఏ స్థితిలో ఉన్నదో అచ్చటి నుండి విచారణ కొనసాగించవలెను.

21. ప్రజాకోర్టు తీర్పు :

1. సెక్షన్ 20 (1) కింద ప్రజాకోర్టుకు పంపబడిన కేసులలో రాజీ కుదుర్చుట లేదా పరిష్కారం ద్వారా ఇచ్చే తీర్పులను, సాధారణ సివిల్ కోర్టుల తీర్పులు లేదా ఇతర కోర్టుల యొక్క ఆర్డరులతో సమానంగా భావించవలెను. మరియు అట్టి కేసులలో చెల్లింపబడిన కోర్టు ఫీజు, కోర్టు ఫీజు చట్టము 1870 (7 ఆఫ్ 1870) లో తెలుపబడిన విధంగా తిరిగి ఇవ్వబడును.

2. ప్రజాకోర్టు ఇచ్చే ప్రతి తీర్పు తిరుగులేనిది. వివాదములోని అన్ని పక్షాలవారు దానికి బద్ధులై ఉండాలి మరియు ఈ తీర్పుపై ఏ కోర్టుకైననూ అప్పీలుకు వెళ్లవీలులేదు.

22. ప్రజాకోర్టు యొక్క అధికారములు:

1. ఈ చట్టం క్రింద ప్రజాకోర్టులు ఈ క్రింద వివాదాలను పరిష్కరించు సందర్భంలో సివిల్ ప్రొసీజర్ కోడ్ (5 ఆఫ్ 1908) కింద ఒక సివిల్ కోర్టుకు ఉండే అన్ని అధికారాలనూ కల్గి ఉంటుంది.

   ఎ) ఏ సాక్షినైననూ కోర్టులకు పంపించుట మరియూ అతనిచే ప్రమాణము చేయించి సాక్ష్యములు తీసికొనుట.

   బి) ఏదైనా దస్తావేజులను కనుగొనుట, వాటిని కోర్టుకు సమర్పింపజేయుట.

   సి) అఫిడవిట్‌ల ద్వారా సాక్ష్యమును స్వీకరించుట.

   డి) ఏదైనా కోర్టుకానీ, కార్యాలయము నుండి కానీ పబ్లిక్ రికార్డు, లేదా పత్రములను వాటి నకలు పంపమని ఆదేశించుట.

   ఇ) నిర్ధారించిన ఇతర అంశములు

2. సబ్-సెక్షన్ (1) లో తెలుపబడిన అధికారముల భావమునకు విరుద్ధం కాకుండా ప్రతి ప్రజాకోర్టు తన ముందున్న వివాదమును పరిష్కరించుటలో అమలు చేయుటకు, విచారణా పద్ధతిని నిర్ణయించుకొనుటకు అధికారము కల్గియుండును.

3. ప్రజాకోర్టులో జరుగు కార్యకలాపాలన్నియూ, భారతీయ శిక్షాస్మృతిలోని 193, 219 మరియూ 228 సెక్షనుల కింద జరిగినట్లు భావించవలెను. మరియూ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 లోని సెక్షన్ 195 మరియు అధ్యాయం 26 ల కింద ప్రతి ప్రజాకోర్టును సివిల్‌కోర్టుగా భావించవలెను.

అధ్యాయం - VI ఎ

కేసు వేయుటకు ముందు రాజీ మరియు పరిష్కారం

22ఎ. నిర్వచనాలు :

ఈ అధ్యాయంలో సెక్షన్ 22, 23 కొరకు, సందర్భాలు వేరైతే తప్ప.

ఎ) 'శాశ్వతమైన ప్రజాకోర్టు' అనగా సెక్షన్ 22బి (1) ప్రకారం శాశ్వతమైన ప్రజాకోర్టులను ఏర్పాటు చేయుట.

బి) ప్రజల సేవార్థ నిమిత్తం అనగా

   i) గాలి, నీరు, రోడ్డు, రవాణాసౌకర్యాలు

   ii) తంతి తపాలా, టెలిఫోను సౌకర్యాలు

   iii) ఏదైనా ఒక సంస్థ ద్వారా ప్రజలకు విద్యుత్తు లేదా నీటి సరఫరా చేయుట

   iv) ప్రజల సౌకర్యార్థం కొరకు పరిశుభ్రత

   v) వైద్య సౌకర్యాలు

   vi) ఇన్సూరెన్సు సౌకర్యాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సౌకర్యార్థం చేపట్టే ఏ ఇతర ప్రయోజనకర సౌకర్యాలు.

22బి. శాశ్వత ప్రజాకోర్టుల ఏర్పాటు :

1. సెక్షన్ 19 ప్రకారం కేంద్ర అథారిటీ లేదా రాష్ట్ర అథారిటీ అవసరమైన ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం శాశ్వత ప్రజాకోర్టులను ఏర్పాటు చేయుట.
2. సబ్‌సెక్షన్ 1 ప్రకారం గుర్తించబడిన ప్రాంతాల్లో నెలకొల్పిన శాశ్వత ప్రజాకోర్టులు ఈ క్రింది అంశాలు కలిగి వుంటాయి.
   ఎ) శాశ్వత ప్రజాకోర్టు అధ్యక్షులుగా జిల్లా జడ్జిగాని అదనపు జిల్లా జడ్జి గాని లేదా ఆస్థాయిలో వున్న ఏ ఇతర న్యాయాధికారినయినా నియమించవచ్చు.
   బి) కేంద్ర అథారిటీ లేదా రాష్ట్ర అథారిటీకి ప్రజల సౌకర్యార్థం సేవలు చేయుటకు అనుభవం వున్న ఇద్దరు వ్యక్తులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచిస్తాయి.

క్లాజ్ (బి) ప్రకారం కేంద్ర, రాష్ట్ర అథారిటీలు నెలకొల్పిన శాశ్వత ప్రజాకోర్టులకు నియమించబడిన అధ్యక్షులు మరియు సభ్యుల నియమనిబంధనలు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు వర్తిస్తుంది.

22సి) శాశ్వత ప్రజాకోర్టులు విచారణ చేపట్టే కేసులు :

1. వివాదములకు లోనైన వ్యక్తులు కోర్టులను సంప్రదించే ముందు పరిష్కారం కోసం ప్రజాకోర్టులను సంప్రదించవచ్చు. ఏ చట్టం కింద విచారించదగనివి శాశ్వత ప్రజాకోర్టు పరిధి లోనికిరావు.

పదిలక్షల కంటే ఎక్కువ విలువగల ఆస్థి వ్యవహారాలు శాశ్వత ప్రజాకోర్టు పరిధిలోనికిరావు.

కేంద్ర అధారిటీ సూచన మేరకు కేంద్ర ప్రభుత్వం పరిధిని పెంచినట్లయితే పైన పేర్కొన్నది శాశ్వత ప్రజాకోర్టు పరిధిలో పరిష్కరించవచ్చు.

2. సబ్ సెక్షన్ 1 ప్రకారం శాశ్వత ప్రజాకోర్టులలో ఫిర్యాదు నమోదయిన పిదప ఇరుపక్షాలవారు ఏ సంబంధిత కోర్టులను ఆశ్రయించరాదు.
3. సబ్‌సెక్షన్ 1 ప్రకారం శాశ్వత ప్రజాకోర్టులలో అర్జీలు దాఖలైన పిదప
   ఎ) ఇరుపక్షాలను రాతపూర్వకమైన కేసు వివరాలు, వివాదాస్పద అంశాలు, వాస్తవాలు, కేసుకు సంబంధించిన ఇతరత్రా ప్రతులను సమర్పించవలసిందిగా ఆదేశిస్తుంది.
   బి) పరిష్కరించకముందు అవసరాన్ని బట్టి అదనపు ప్రతులను సమర్పించవలసిందిగా ఆదేశిస్తుంది.
   సి) ఇరుపక్షాల నుండి స్వీకరించిన ప్రతులను వాది ప్రతివాదులకు అందించి సమాధానాలను సమర్పించవలసిందిగా ఆదేశిస్తుంది.
4. సబ్‌సెక్షన్ 3 ప్రకారం అవసరమైన ఆధారాలనన్నింటినీ అందుకున్న తర్వాత వీటన్నింటినీ అధ్యయనం చేసి వివాదం యొక్క పరిస్థితులను పరిగణనలోనికి తీసుకుని సరైన పద్ధతుల్లో ఉభయపక్షాల మధ్య రాజీ ప్రయత్నాలు చేస్తుంది.
5. సబ్‌సెక్షన్ 4 ప్రకారం శాశ్వత ప్రజాకోర్టులో నిర్వహించు రాజీప్రక్రియ నిష్పక్షపాతంగా ఉభయపక్షాలకు కావలసిన సహాయ సహకారాలనందిస్తుంది.

6. శాశ్వత ప్రజాకోర్టుకు ఉభయపక్షాలు సహకరిస్తూ కావలసిన సమాచారాన్ని అందిస్తూ, పరిష్కారం కోసం సహకరించాలి.

7. రాజీపరిష్కారం కోసం శాశ్వత ప్రజాకోర్టు కొన్ని షరతులతో కూడిన నిర్ణయాలను పొందుపర్చి ఉభయపక్షాలకు ఆమోదయోగ్యమైన తర్వాత ఇరుపక్షాల చేత షరతుల పత్రం మీద వారి సంతకాలు తీసుకుని తీర్పు పత్రాన్ని ఇరుపక్షాలకు అందిస్తుంది.

8. సబ్‌సెక్షన్ 7 ప్రకారం ఇరుపక్షాల మధ్య అంగీకారం కుదరని పక్షంలో ఈ వివాదం నేరపూరితమైనది కాని పక్షాన శాశ్వత ప్రజాకోర్టు నిర్ణయం తీసుకుంటుంది.

22డి) శాశ్వత ప్రజాకోర్టు ప్రక్రియ:

ఏదైనా ఒక వివాదంలో రాజీ ప్రక్రియను చేపట్టేటపుడు సహజ న్యాయసూత్రాలు, నిష్పక్షపాత వైఖరి, సమానత్వం, న్యాయసంబంధమైన ఇతర సూత్రాలను పాటిస్తూ సిపిసి 1908, ఇండియన్ ఎవిడెన్స్‌యాక్టు 1872 కి కట్టుబడి వుండాల్సిన అవసరం లేదు.

22ఇ) శాశ్వత ప్రజాకోర్టుల తీర్పే అంతిమం:

1. శాశ్వత ప్రజాకోర్టులో ఇచ్చే తీర్పుకు ఇరుపక్షాలు కట్టుబడి వుండటమే కాకుండా అంతిమతీర్పు అయ్యి వుంటుంది.

2. ఈ తీర్పును సివిల్‌కోర్టు ఇచ్చే డిక్రీకి సత్సమానమైనదిగా పరిగణించాలి.

3. ఈ తీర్పు ఎక్కువమంది శాశ్వత ప్రజాకోర్టు సభ్యులు ఇచ్చిన తీర్పు అయ్యి వుండాలి.

4. ఈ శాశ్వత ప్రజాకోర్టులో ఇచ్చిన అంతిమతీర్పుకు భిన్నంగా ఎలాంటి లావాదేవీలు, ఏ కోర్టు పరిధుల్లోను జరుపకూడదు.

5. శాశ్వత ప్రజాకోర్టు ఇవ్వాలను తీర్పును సంబంధిత సివిల్‌కోర్టుకు బదలాయిస్తే, ఆ కోర్టు పరిధిలో ఇచ్చే డిక్రీగా పరిగణించి తీర్పునిస్తుంది.

అధ్యాయం - VII

ఇతరములు

23. అథారిటీలు, కమిటీలు మరియు ప్రజాకోర్టులలోని సిబ్బంది మరియు సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణింపబడుదురు;

కేంద్రీయ అథారిటీల, రాష్ట్రీయ అథారిటీల, జిల్లా అథారిటీల సుప్రీంకోర్టు న్యాయసర్వీసుల కమిటీల, హైకోర్టు న్యాయసర్వీసుల కమిటీల మెంబరు సెక్రెటరీతో సహా సభ్యులు, తాలూకా న్యాయసేవల కమీటీల మరియు అట్టి అథారిటీ కమిటీల అధికారులు, సిబ్బంది మరియు ప్రజాకోర్టుల సభ్యులను భారత శిక్షాస్మృతి (45 ఆఫ్ 1860) సెక్షన్ 21 అర్థంలో ప్రభుత్వ అధికారులుగా భావించాలి.

24. సదుద్దేశంతో తీసుకున్న చర్యలకు రక్షణ :

ఈ క్రింది వారిపై దావా, అభియోగము లేదా చట్టబద్ధమైన చర్యలు చెల్లనేరవు.

ఎ) కేంద్ర ప్రభుత్వము లేక రాష్ట్ర ప్రభుత్వము;

బి) ది ప్యాట్రన్ -ఇన్ చీఫ్, కార్యనిర్వాహక అధ్యక్షులు, సభ్యులు లేదా మెంబర్ - సెక్రటరీ లేదా అధికారులు లేదా కేంద్రీయ అథారిటీ యొక్క ఇతర ఉద్యోగులు.

సి) ప్యాట్రన్ - ఇన్-చీఫ్, కార్యనిర్వాహక అధ్యక్షులు, సభ్యులు, మెంబర్-సెక్రటరీ లేదా అధికారులు లేదా రాష్ట్రీయ అథారిటీ యొక్క ఇతర ఉద్యోగులు.

డి) చైర్మన్, సెక్రటరీ, సభ్యులు అధికారులు లేదా సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీలు, హైకోర్టు న్యాయసేవల కమిటీలు, తాలూకా న్యాయసేవల కమిటీలు లేదా జిల్లా అథారిటీలలోని ఉద్యోగులు లేదా

ఇ) ప్యాట్రన్-ఇన్-చీఫ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు, చైర్మన్, సభ్యుడు, మెంబర్-సెక్రటరీ, సబ్-క్లాజులు (బి) నుండి (డి) వరకు తెలుపబడిన వారి నుండి అధికారం పొందిన ఏ ఇతర వ్యక్తి, ఈ చట్టం క్రింద లేదా దీనిలోని ఏదైన నియమ నిబంధనల క్రింద సద్దుదేశంతో చేసినా లేదా చేయ తలపెట్టిన ఏదైనా చర్యలు.

25. ఈ చట్టమునకు ఇతర చట్టములను అధిగమించు అధికారము :

ప్రస్తుతము అమలులో ఉన్న ఏ ఇతర చట్టంలోని లేక అట్టి వాని క్రింద జారీచేసిన ఉత్తర్వులలోని అంశాలు ఈ చట్టంతో పొంతన లేని యెడల ఈ చట్టంలోని అంశములదే పైచేయిగా ఉండును.

26. అవరోధములను తొలగించు అధికారము:

1. ఈ చట్టము అమలు చేయుటలో ఎదుర్కొను అవరోధములను తొలగించుటకు ఇందులోని అంశములకు లోబడి కేంద్ర ప్రభుత్వము అవసరమైన నిబంధనలను అధికార రాజపత్రములో ప్రచురించవచ్చును. అట్టి నిబంధనలు ఏవీ ఈ చట్టము, రాష్ట్రపతి ఆమోదము పొందిన 2 సం॥ల తర్వాత జారీచేయరాదు.
2. ఈ సెక్షన్ క్రింద చేసిన నిబంధనలను వీలైనంత త్వరితముగా పార్లమెంటులోని ఉభయసభల ముందుంచవలెను.

27. కేంద్ర ప్రభుత్వమునకు నిబంధనలు చేయు అధికారము:

1. భారత ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన తర్వాత కేంద్ర ప్రభుత్వము ఈ చట్టములోని అంశములను అమలుచేయుటకై నిబంధనలను జారీ చేయవచ్చును.
2. ఈ పై అధికారమునకు వ్యతిరేకముగా లేకుండా అట్టి నిబంధనలు ఈ క్రింద అన్నీ లేక కొన్ని అంశములకు సంబంధించి ఉండవచ్చును.

   ఎ) సెక్షను 3 సబ్‌సెక్షన్ (2) (సి) క్రింద కేంద్రీయ అథారిటీ యొక్క ఇతర సభ్యుల సంఖ్య, అనుభవము, అర్హతలు.

   బి) సెక్షను 3 సబ్‌సెక్షన్ (3) క్రింద కేంద్రీయ అథారిటీ, మెంబర్ - సెక్రటరీ అనుభవము, అర్హత.

   సి) సెక్షన్ 3 సబ్‌సెక్షన్ (4) క్రింద కేంద్రీయ అథారిటీ మెంబర్, సెక్రటరీ మరియు ఇతర

సభ్యుల పదవీ కాలము, ఉద్యోగ నిబంధనలు.

డి) సెక్షన్ 3 సబ్‌సెక్షన్ (5) క్రింద కేంద్రీయ అథారిటీ క్రింద పనిచేయు అధికారులు మరియు ఇతర సిబ్బంది యొక్క సంఖ్య.

ఇ) సెక్షన్ 3 సబ్‌సెక్షన్ (6) క్రింద కేంద్రీయ అథారిటీలో పనిచేయు అధికారులు మరియు ఇతర సిబ్బంది యొక్క ఉద్యోగ నిబంధనలు, జీతము, ఇతర అలవెన్సులు.

యఫ్) సెక్షన్ 3 సబ్‌సెక్షన్ (2) (బి) క్రింది సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీ సభ్యుల సంఖ్య, అనుభవము, అర్హత.

జి) సెక్షన్ 3ఎ సబ్‌సెక్షన్ (3) క్రింద సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి యొక్క అనుభవము అర్హత.

హెచ్) సెక్షన్ 3ఎ సబ్‌సెక్షన్ (5) క్రింద సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీ ఆధీనములో పనిచేయు అధికారుల మరియు ఇతర సిబ్బంది, ఇతర ఉద్యోగుల సంఖ్య మరియు అదే సెక్షన్‌లోని సబ్‌సెక్షన్ (6) క్రింద తెలుపబడిన వారి ఉద్యోగ నిబంధనలు, జీతము మరియు అలవెన్సులు.

ఐ) సెక్షన్ 12 క్లాజ్ (హెచ్) క్రింద సుప్రీంకోర్టు ఎదుట విచారణలో ఉన్న కేసులకు సంబంధించు ఉచిత న్యాయసేవలు పొందు వ్యక్తి సాలీనా ఆదాయము యొక్క గరిష్ఠ పరిమితి.

జె) సెక్షను 18 క్రింద కేంద్రీయ, రాష్ట్రీయ, జిల్లా అథారిటీల జమాఖర్చులు వ్రాయు పద్ధతి.

కె) సెక్షన్ 19(3) ప్రకారము సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీ ఏర్పాటు చేయు ప్రజాకోర్టుల ఇతర సభ్యుల అనుభవములు, అర్హతలు.

ఎల్) సెక్షన్ 22 సబ్‌సెక్షన్ (i) (e) క్రింద ఇతర అంశములు.

ఎల్ఎ) సెక్షన్ 22 (బి) లోని సబ్‌సెక్షన్ (2) ప్రకారం చైర్మన్ మరియు ఇతర సభ్యుల నియామకం.

ఎమ్) నిర్దేశింపబడిన ఇతర అంశములు.

28. రాష్ట్ర ప్రభుత్వమునకు నిబంధనలు తయారుచేయు అధికారము :

1. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన తరువాత రాష్ట్ర ప్రభుత్వము ఈ చట్టం క్రింద నిబంధనలు తయారుచేయవచ్చును.

2. పై అధికారమునకు భిన్నము కాకుండా అట్టి నిబంధనలు ఈ దిగువ సూచించిన అన్నీ లేక కొన్ని అంశములకు సంబంధించి ఉండవచ్చును.

ఎ) సెక్షన్ 6 సబ్‌సెక్షన్ (2) (సి) క్రింద రాష్ట్రీయ అథారిటీ యొక్క ఇతర సభ్యుల సంఖ్య, అనుభవము, అర్హతలు.

బి) సెక్షన్ 6 సబ్‌సెక్షన్ (3) క్రింద రాష్ట్రీయ అథారిటీ మెంబర్ – సెక్రటరీ యొక్క అధికారాలు మరియు విధులు.

సి) సెక్షన్ 6 సబ్‌సెక్షన్ (4) క్రింద రాష్ట్రీయ అథారిటీ యొక్క మెంబర్ – సెక్రటరీ మరియు సభ్యుల పదవీకాలము మరియు ఉద్యోగ నిబంధనలు.

డి) సెక్షన్ 6 సబ్‌సెక్షన్ (5) క్రింద రాష్ట్ర అథారిటీ క్రింద పనిచేయు అధికారులు మరియు ఇతర సిబ్బంది సంఖ్య.

ఇ) సెక్షన్ 6 సబ్‌సెక్షన్ (6) క్రింద రాష్ట్రీయ అథారిటీలో పనిచేయు అధికారుల మరియు ఇతర సిబ్బంది యొక్క ఉద్యోగ నిబంధనలు, జీతము మరియు అలవెన్సులు.

యఫ్) సెక్షన్ 8(ఎ) సబ్‌సెక్షన్ (3) క్రింద హైకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి యొక్క అనుభవము మరియు అర్హతలు.

జి) సెక్షన్ 8(ఎ) సబ్‌సెక్షన్ (5) క్రింద హైకోర్టు న్యాయసేవల కమిటీ ఆధీనములో పనిచేయు అధికారుల మరియు ఇతర ఉద్యోగుల సంఖ్య మరియు అదే సెక్షన్ లోని సబ్‌సెక్షన్ (6) క్రింద తెలుపబడిన వారి ఉద్యోగ నిబంధనలు, జీతము మరియు అలవెన్సులు.

హెచ్) సెక్షన్ 9 సెక్షన్ 2(బి) క్రింద జిల్లా అథారిటీ సభ్యుల సంఖ్య, అనుభవము మరియు అర్హతలు.

ఐ) సెక్షన్ 9 సబ్ సెక్షన్ (5) క్రింద జిల్లా అథారిటీలోని అధికారుల మరియు ఇతర సిబ్బంది యొక్క సంఖ్య.

జె) సెక్షన్ 9 సబ్ సెక్షన్ (6) క్రింద జిల్లా అథారిటీ యొక్క అధికారుల ఉద్యోగ నిబంధనలు, ఇతర ఉద్యోగుల జీతము, అలవెన్సులు.

కె) సెక్షన్ 11ఎ సబ్ సెక్షన్ (2) (బి) క్రింద తాలూకా న్యాయసేవల కమిటీ సభ్యుల సంఖ్య, అనుభవము మరియు అర్హతలు.

ఎల్) సెక్షన్ 11ఎ సబ్ సెక్షన్ (3) క్రింద తాలూకా న్యాయసేవల కమిటీ యొక్క అధికారుల మరియు ఇతర ఉద్యోగుల సంఖ్య.

ఎమ్) సెక్షన్ 11ఎ సబ్ సెక్షన్ (4) క్రింద తాలూకా న్యాయసేవల కమిటీ యొక్క అధికారుల మరియు ఇతర సిబ్బంది యొక్క ఉద్యోగ నిబంధనలు, జీతము మరియు అలవెన్సులు.

ఎన్) సెక్షన్ 12 (హెచ్) క్రింద సుప్రీంకోర్టు తప్ప ఇతర కోర్టుల ఎదుట విచారణలో ఉన్న వ్యాజ్యమునకు సంబంధించి ఉచిత న్యాయసేవలు పొందు అర్హత కొరకై వ్యక్తి సాలీనా ఆదాయము యొక్క గరిష్ట పరిమితి.

ఒ) సెక్షన్ 19 సబ్ సెక్షన్ (4) క్రింద తెలుపబడిన వారు కాకుండా ప్రజాకోర్టులలోని ఇతర సభ్యుల అనుభవము మరియు అర్హతలు.

పి) నిర్దేశింపబడిన ఇతర అంశములు.

29. కేంద్రీయ అథారిటీకి నిబంధనలు చేయు అధికారము :

1. ఈ చట్టములోని వివిధ అంశములను త్వరితముగా మరియు పటిష్టముగా అమలు చేయుటకు, వాటికి మరియు ఈ చట్టము క్రింద చేయబడిన నియమములకు వ్యతిరేకము కానటువంటి నిబంధనలను కేంద్రీయ అథారిటీ తయారుచేసి ప్రకటించవచ్చును.

2. క్రింద వుదహరించిన అన్నిటికీగానీ, లేదా కొన్నింటికి గానీ నిబంధనలను సూచించే అధికారం.

ఎ) సెక్షన్ 3ఎ (1) క్రింద సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీ యొక్క అధికారములు, కర్తవ్యములు.

బి) సెక్షన్ 3ఎ (4) క్రింద సుప్రీంకోర్టు న్యాయసేవల కమిటీ సభ్యులు మరియు కార్యదర్శి యొక్క పదవీ కాలము ఉద్యోగ నిబంధనలు, షరతులు.

29ఎ) రాష్ట్రీయ అథారిటీకి నిబంధనలు చేయు అధికారము :

1. ఈ చట్టములోని వివిధ అంశములను త్వరితముగా మరియు పటిష్టముగా అమలు చేయుటకు, వాటికి మరియు ఈ చట్టము క్రింద చేయబడిన నియమములకు వ్యతిరేకము కానటువంటి నిబంధనలను రాష్ట్రీయ అథారిటీ తయారుచేసి ప్రకటించవచ్చును.

2. పైన ఉదహరించిన అధికారభావనకు వ్యతిరేకముకాని నిబంధనలు ఈ దిగువ పేర్కొన్న అన్నీ లేక కొన్ని విషయములకు పరిమితమై ఉండును.

ఎ) సెక్షను 7 సబ్ సెక్షన్ 2 (డి) క్రింద రాష్ట్రీయ అథారిటీ నిర్వహించవలసిన కర్తవ్యములు.

బి) సెక్షన్ 8ఎ సబ్ సెక్షన్ (1) క్రింద హైకోర్టు న్యాయసేవల కమిటీ అధికారములు మరియు కర్తవ్యములు.

సి) సెక్షన్ 8ఎ సబ్ సెక్షన్ (2) (బి) క్రింద హైకోర్టు న్యాయసేవల కమిటీ సభ్యుల సంఖ్య, వారి అనుభవము మరియు అర్హతలు.

డి) సెక్షన్ 8ఎ సబ్ సెక్షన్ (4) క్రింద హైకోర్టు న్యాయసేవల కమిటీ సభ్యుల మరియు కార్యదర్శి యొక్క పదవీకాలము షరతులు మరియు నిబంధనలు.

ఇ) సెక్షన్ 9 సబ్‌సెక్షన్ (4) క్రింద జిల్లా అథారిటీలోని సభ్యులు మరియు కార్యదర్శి యొక్క పదవీకాలము ఉద్యోగషరతులు మరియు నిబంధనలు.

ఎఫ్) సెక్షన్ 8ఎ సబ్ సెక్షన్ 2(బి) క్రింద హైకోర్టు న్యాయ సేవల కమిటీ సభ్యుల సంఖ్య, వారి అనుభవము మరియు అర్హతలు.

జి) సెక్షన్ 10 సబ్‌సెక్షన్ 2 (సి) క్రింద జిల్లా అథారిటీ నిర్వహించవలసిన ఏవైనా కర్తవ్యములు.

హెచ్) సెక్షన్ 11ఎ సబ్ సెక్షన్ (3) క్రింద తాలూకా న్యాయసేవల సభ్యుల మరియు కార్యదర్శి యొక్క పదవీ కాలము, ఉద్యోగషరతులు మరియు నిబంధనలు.

30. నియమ నిబంధనలు రూపొందించుట :

1. కేంద్ర ప్రభుత్వము చేసిన ప్రతి నియమము కేంద్రీయ అథారిటీ చేసిన ప్రతి నిబంధన వీలైనంత త్వరలో పార్లమెంటు ఉభయసభల ముందుంచవలెను. అట్టి చర్య పార్లమెంటు సమావేశమైన మొదటి 30 రోజులలో, అనగా ఒక సమావేశములో కానీ, తదుపరి సమావేశములో కానీ తీసికొనవచ్చును. పార్లమెంటు అట్టి నియమ నిబంధనలతో ఏకీభవించని యెడల అవి రద్దు కాగలవు లేక వాటిని పార్లమెంటు సవరించినచో అట్టి సవరణలతో అవి అమలులోనికి వచ్చును. అయిననూ అట్టి సవరణలు ఇంతకు ముందు పార్లమెంటు చేసిన నిర్ణయాలకు వ్యతిరేకము కాకూడదు.

2. ఈ చట్టం క్రింద రాష్ట్ర ప్రభుత్వము చేసిన ప్రతి నియమములు మరియు రాష్ట్రీయ అథారిటీ చేసిన ప్రతి నిబంధన వీలైనంత త్వరగా రాష్ట్ర శాసనసభ ముందుంచవలెను.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవల అధికార నియమాలు, 1995

న్యాయసేవల అధికార చట్టము, 1987 లోని సెక్షన్ 28 లో పొందుపరచిన అధికారాలు వినియోగించి, తదుపరి సవరించబడిన న్యాయ సేవల (సవరణ) చట్టం, 1994 (నం. 59, సం॥ 1994) ప్రకారం, మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యీ క్రింది నియమాలను చేసింది.

నియమాలు

1. పేరు మరియు అమలుతేది :

i) ఈ నియమాలు "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవల అథారిటీ నియమాలు, 1995" గా పిలువబడతాయి.

ii) ఈ నియమాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజపత్రంలో ముద్రించిన తేదీ నుండి అమల్లోకి వస్తాయి.

2. నిర్వచనాలు :

ఈ నియమాలలో, సందర్భం వేరే విధంగా లేనంత వరకూ

ఎ) "చట్టం" అంటే, న్యాయసేవల అధికార చట్టం, 1987 (నం. 39, సం॥ 1987)

బి) "చైర్మన్" అంటే రాష్ట్ర అథారిటీ "నిర్వహణాధ్యక్షులు" హైకోర్టు న్యాయసేవల కమిటీ అధ్యక్షులు, లేక జిల్లా న్యాయ సేవల అథారిటీ మరియు సందర్భాన్ని బట్టి మండల న్యాయసేవల సంఘాధ్యక్షులు

సి) "సభ్యుడు/సభ్యురాలు" (మెంబర్) అంటే సెక్షన్ 6 క్రింద సబ్‌సెక్షన్2 లోని 'సి' నిబంధన, సెక్షన్ 8ఎ క్రింద సబ్ సెక్షన్ (2) లోని (బి) నిబంధన మరియు సెక్షన్ 11 ఎ క్రింద సబ్ సెక్షన్ (బి) లో నిబంధన క్రింద నియమించబడిన వ్యక్తి.

డి) "సెక్రటరీ" అంటే చట్టంలోని సెక్షన్ 6 క్రింద సబ్ సెక్షన్ (3) ను బట్టి యేర్పడ్డ రాష్ట్ర న్యాయసేవల అథారిటీ యొక్క మెంబరు సెక్రటరీ, లేక సందర్భాన్ని బట్టి, సెక్షన్ 8ఎ క్రింద సబ్ సెక్షన్ (3) ప్రకారం యేర్పడ్డ హైకోర్టు న్యాయసేవల సంఘమెంబరు సెక్రటరీ, లేక సెక్షన్ (9) క్రింద సబ్ సెక్షన్ (3) ప్రకారం యేర్పడ్డ జిల్లా న్యాయసేవల అథారిటీ చేత నియమించబడ్డ సెక్రటరీ.

ఇ) 'మండల న్యాయసేవల సంఘం' అంటే, చట్టంలోని సెక్షన్ 11ఎ ప్రకారం యేర్పాటైన సంఘం.

యఫ్) ఈ నియమాలలో వాడబడ్డ మరియు నిర్వచింపబడని మాటలు గాని, ప్రకటితాలకు చట్టంలో యివ్వబడ్డ అర్థాలే వర్తిస్తాయి.

3. రాష్ట్ర అథారిటీ యేర్పాటు మరియు దాని వివరాలు :

i) ఎ) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాష్ట్ర అథారిటీకి ప్యాట్రన్-యిన్-చీఫ్‌గా వుంటారు.

బి) పదవిలో వున్న/రిటైరయిన హైకోర్టు న్యాయమూర్తి ఒకరు ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వుంటారు.

ii) ఈ క్రిందివారు రాష్ట్ర అథారిటీలో ఎక్స్‌అఫీషియో మెంబర్లుగా వుంటారు.

ఎ) రాష్ట్ర అడ్వకేట్ -జనరల్.

బి) ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ.

సి) లా సెక్రటరీ.

డి) హోం సెక్రెటరీ.

ఇ) షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు జాతుల కమీషన్ చైర్మన్.

యఫ్) హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వం చేత నామినేట్ చేయబడ్డ యిద్దరు జిల్లా అథారిటీల చైర్మన్లు.

iii) రూలు (3) క్రింద సబ్‌రూలు (iv) ప్రకారం అనుభవం, అర్హతలు వున్న యితర మెంబర్లను, రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి నామినేట్ చేయవచ్చు. (7 గురు ఎక్స్‌అఫీషియో మెంబర్లు 15కు మించకూడదు).

iv) రాష్ట్ర అథారిటీ చేత మెంబరుగా నామినేట్ చేయబడటానికి కావలసిన అర్హతలు:

ఎ) షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు జాతుల మరియు యితర బలహీన వర్గాల ప్రజల, స్త్రీల, పిల్లల మరియు గ్రామీణ/పట్టణ కార్మిక వర్గాలను ఉద్ధరించడానికి కష్టపడిన సమర్థులైన సంఘు సేవకులుగాని,

బి) న్యాయరంగంలో సామర్థ్యం వున్నవారు గాని,

సి) న్యాయసేవల పథకాల అమలులో మిక్కిలి ఆసక్తి కలిగి వున్న ప్రముఖ వ్యక్తి.

4. రాష్ట్ర అథారిటీ మెంబరు సెక్రటరీ అధికారాలు మరియు విధులు :

ఎ) అర్హులైన బలహీన వర్గ వ్యక్తులకు ఉచిత న్యాయ సేవలందించడం.

బి) రాష్ట్ర అథారిటీ ఆమోదించిన న్యాయసంబంధ సేవల పథకాలు, కార్యక్రమాలు అమలు చేయడానికి వీలయిన పద్ధతులలో వాటిని సక్రమంగా సమర్థవంతంగా అజమాయిషీ చేయడం.

సి) ఒక శాఖాధికారిగా తనకున్న అధికారాలను, పరిపాలన, పరిశుభ్రత మరియు ఆర్థిక విషయాలలో సక్రమంగా వినియోగించడం.

డి) రాష్ట్ర అథారిటీకి సంబంధించిన ఆస్తులను, రికార్డులను మరియు సొమ్మును నియంత్రించడం.

ఇ) రాష్ట్ర అథారిటీకి సంబంధించిన జమా ఖర్చుల లెక్కలను సరిగా చూడటం, తనిఖీ చేయడం వగైరా.

యఫ్) రాష్ట్ర అథారిటీకి సంబంధించిన జమాఖర్చుల తాలూకు ఏటా బ్యాలెన్సు షీటు తయారుచేయటం.

జి) సాంఘిక కార్యాచరణ సంఘాలతోనూ, జిల్లా మరియు మండల స్థాయి అథారిటీలతో సంబంధాలు వుంచుకోవడం.

హెచ్) న్యాయసంబంధ సేవల తాలూకు కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన గణాంక సమాచార సేకరణ, సాధించిన అభివృద్ధిని యెప్పటికప్పుడు సమీక్షించడం.

ఐ) ఆర్థిక సహాయానికి సంబంధించిన ప్రతిపాదనలను చేయడం మరియు సరియగు వినియోగం గురించిన ధృవీకరణ పత్రాలు జారీ చేయడం.

జె) రాష్ట్ర అథారిటీ చేత ఆమోదింపబడ్డ న్యాయ సంబంధ సేవల కార్యక్రమాలను నిర్వహించడం, సమావేశాలకు సంబంధించిన రిపోర్టులను సిద్ధం చేయడం, తగిన చర్యలు తీసికోవడం వగైరా.

కె) న్యాయసంబంధ సేవల గురించిన కార్యక్రమాల మీద, డాక్యుమెంటరీలు, వీడియో చిత్రాలు, సాహిత్యం మరియు యితర ప్రచురణల ద్వారా సామాన్య ప్రజలకు తెలియబర్చటం.

ఎల్) గ్రామీణ సంబంధ తగాదాలు పరిష్కరించే విషయం మీద ఎక్కువ శ్రద్ధ చూపి, వాటి సత్వర పరిష్కారాలకై ప్రజల యిండ్ల ముందే ప్రభావవంతమైన మరియు అర్థవంతమైన పద్ధతులు రూపొందించటం.

ఎమ్) సెక్షన్ 4 క్రింద నిబంధన (బి) ప్రకారం పొందుపరచిన పథకాలకు సంబంధించిన విధులను సక్రమంగా నిర్వర్తించడం మరియు

ఎన్) రాష్ట్ర అథారిటీకి సంబంధించిన యితర విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం.

5. సెక్షన్ 6 క్రింద సబ్‌సెక్షన్ (4) ప్రకారం సభ్యుల మరియు మెంబర్ సెక్రటరీల పదవీకాలం మరియు వాటికి సంబంధించిన నిబంధనలు:

ఎ) రూలు 3 క్రింది సబ్‌రూలు (iii) ను బట్టి రాష్ట్ర ప్రభుత్వం చేత రాష్ట్ర అథారిటీకి నామినేట్ చేయబడ్డ మెంబరు పదవీకాలం 2 సంవత్సరాలు. వీరిని మరల నామినేట్ చేయవచ్చు.

బి) రూలు 3 క్రింది సబ్ రూలు (iii) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం చేత నామినేట్ చేయబడిన మెంబరును కొనసాగనీయడం మంచిదిగాదని రాష్ట్ర ప్రభుత్వం అనుకుంటే, అట్టి మెంబరును తొలగించవచ్చు.

సి) రూలు 3 క్రింది సబ్‌రూలు (iii) ప్రకారం రాష్ట్ర అథారిటీకి నామినేట్ చేయబడ్డ మెంబరు యే కారణంగా గాని పదవిలో లేకున్నట్లయితే, సదరు మెంబరు స్థానంలో మరల వేరే వ్యక్తి యథాప్రకారంగా నామినేట్ చేయబడి, మిగతా పదవీకాలం పూర్తి చేయగలరు.

డి) రూలు 3 క్రింది సబ్‌రూలు (iii) ప్రకారం నామినేట్ కాబడిన మెంబర్లందరూ రాష్ట్ర అథారిటీకి సంబంధించిన విధులు నిర్వర్తించడానికి వారు చేసే ప్రయాణాలకు, 'ఏ' గ్రేడ్ ఆఫీసర్లకు వర్తించే ప్రయాణ ఖర్చులు, రోజువారీ ఖర్చులు వర్తిస్తాయి.

ఇ) నామినేట్ చేయబడ్డ మెంబరు ప్రభుత్వోద్యోగి అయితే తన డిపార్టుమెంటు నుండి, రాష్ట్ర అథారిటీ నుండి గాని ప్రయాణఖర్చులు మరియు రోజువారీ భత్యం పొందవచ్చు.

యఫ్) రాష్ట్ర అథారిటీ మెంబరు సెక్రెటరీ పూర్తికాల ఉద్యోగిగా వుంటూ, ఆ పదవిలో 5 సంవత్సరాలు మించకుండా కొనసాగుతారు.

జి) మెంబరు సెక్రటరీకి సంబంధించిన పదవీ విరమణ వయస్సు, జీతభత్యాలు యితర సదుపాయాలు, అర్హతల వంటి విషయాలు మరియు క్రమశిక్షణకు సంబంధించిన విషయాలు రాష్ట్ర ప్రభుత్వ నియమాను సారంగా వుంటాయి. మరియు సదరు మెంబరు సెక్రెటరీ రాష్ట్ర అథారిటీకి డెప్యుటేషన్ పద్ధతి మీద కొనసాగుతారు.

6. సెక్షన్ 6 క్రింద సబ్‌సెక్షన్ (5) ప్రకారం రాష్ట్ర అథారిటీ అధికారుల మరియు యితర ఉద్యోగుల సంఖ్య:

ఈ నియమాలతో జతపర్చిన షెడ్యూలు ప్రకారం లేదా యెప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రాష్ట్ర అథారిటీ విధులను నిర్వర్తించేందుకు అవసరమైన సెక్రటేరియట్ పనులకు మరియు దైనందిన విధులను నిర్వర్తించడానికి అవసరమైన అధికారుల మరియు యితర ఉద్యోగుల సంఖ్య వుంటుంది.

7. సెక్షన్ 6 క్రింద సబ్‌సెక్షన్ (6) ప్రకారం రాష్ట్ర అథారిటీలో పనిచేసే అధికారుల మరియు ఇతర ఉద్యోగుల సేవా నిబంధనలు మరియు వేతనాలు, అలవెన్సులు :

i) ఈ నియమాలతో జతపర్చిన షెడ్యూలులో సూచించిన విధంగా, రాష్ట్ర అథారిటీ అధికారులు, యితర ఉద్యోగుల వేతనాలు, అలవెన్సులు వుంటాయి. లేదా రాష్ట్ర ప్రభుత్వంలో తమకు సమానమైన స్థాయిలో పనిచేసే అధికారులకు, ఉద్యోగులకు లభించే వేతనాలు, అలవెన్సులు వీరికి లభిస్తాయి.

ii) రాష్ట్ర అథారిటీలోని అధికారుల యితర ఉద్యోగుల సేవా నిబంధనలు, వేతనాలు, అలవెన్సులు, యితర సౌలభ్యాలు, పదవీ విరమణ వయస్సుకు సంబంధించిన విషయాలలో రాష్ట్ర ప్రభుత్వంలో తమ హోదాలో పనిచేసే వారికి వర్తించే నిబంధనలే వర్తిస్తాయి.

iii) రాష్ట్ర అథారిటీలోని అధికారులు మరియు యితర ఉద్యోగులు రాష్ట్రప్రభుత్వంలో వారి సమాన హోదాల్లో పనిచేస్తున్న వారికి వర్తించే సౌకర్యాలు సౌలభ్యాలు అలవెన్సులు మొదలైన వాటికి యోగ్యులు.

8. హైకోర్టు న్యాయసేవల సంఘానికి సెక్షన్ 8 క్రింద సబ్‌సెక్షన్ (3) ప్రకారం నియమింపబడే సెక్రెటరీకి వుండవలసిన అర్హతలు, అనుభవం:

"హైకోర్టులో ఒక అధికారిగా అంటే జాయింట్ రిజిస్ట్రార్ హోదా కన్న తక్కువ హోదాలో వున్నవారు హైకోర్టు న్యాయసేవల సంఘానికి సెక్రెటరీగా పనిచేయడానికి అర్హులుకారు".

9. సెక్షన్ 8ఎ క్రింది సబ్‌సెక్షన్ (5) ప్రకారం హైకోర్టు న్యాయ సేవల కమిటీలో పనిచేయు అధికారుల మరియు యితర ఉద్యోగుల సంఖ్య మరియు వారి సేవా నిబంధనలు, వేతనాలు, అలవెన్సులు సబ్ సెక్షన్ (6) ప్రకారం వుంటాయి:

i) హైకోర్టు న్యాయసేవల కమిటీకి సంబంధించిన దైనందిన కార్యక్రమాలకు కావలసిన సెక్రెటరియల్ పనులకు అవసరమైన అధికారులు, యితర ఉద్యోగుల సంఖ్య, యీ నియమాలతో జతపరచిన షెడ్యూలు ప్రకారం గాని, రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రకటించే విధంగానూ వుంటుంది.

ii) హైకోర్టు న్యాయసేవల కమిటీలో అధికారులు, యితర ఉద్యోగులు యీ నియమాలతో జతపర్చిన షెడ్యూలులో యిచ్చిన విధంగా ఒక్కొక్క ఉద్యోగానికి యెదురుగా సూచించిన వేతన స్కేళ్ళు, అలవెన్సులకు గాని, రాష్ట్ర ప్రభుత్వంలో తత్సమాన హోదాల్లో పనిచేసే వాళ్ళకు వర్తించే వేతనాలకు, అలవెన్సులకు యోగ్యులు.

10. సెక్షన్ 9 క్రింది సబ్‌సెక్షన్ (2) లోని నిబంధన ప్రకారం జిల్లా అథారిటీ మెంబర్ల సంఖ్య, అర్హతలు, అనుభవం:

i) జిల్లా అథారిటీలో 8 మంది కన్న ఎక్కువ మెంబర్లు వుండరు.

ii) ఈ క్రింద తెలుపబడిన వారు జిల్లా అథారిటీలో ఎక్స్ ఆఫీషియో మెంబర్లుగా వుంటారు.

ఎ) జిల్లా మేజిస్ట్రేటు.

బి) జిల్లా ఎస్పి.

సి) చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు, మరియు

డి) జిల్లా ప్రభుత్వ ప్లీడరు.

iii) రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి, యీ క్రింది సబ్‌రూలు (iv) ప్రకారం అర్హతలు, అనుభవం వున్నవారి నుండి యితర మెంబర్లుగా నామినేట్ చేయవచ్చు.

iv) ఏ వ్యక్తియైనా, యీ క్రింద తెలుపబడిన విధంగా లేనిపక్షంలో, జిల్లా అథారిటీలో మెంబర్లుగా నామినేట్ కావటానికి అర్హులు కారు.

ఎ) షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు జాతుల మరియు యితర బలహీన వర్గాల ప్రజల, స్త్రీల, పిల్లల మరియు గ్రామీణ/పట్టణ కార్మిక వర్గాల నుద్ధరించడానికి కష్టపడ్డ సమర్థులైన సంఘసేవకులు గాని,

బి) న్యాయరంగంలో సామర్థ్యం వున్న వారుగాని,

సి) న్యాయసేవల పథకాల అమలులో మిక్కిలి ఆసక్తి కలిగివున్న ప్రముఖ వ్యక్తి.

11. సెక్షన్ 9 క్రింద సబ్‌సెక్షన్ (5) ప్రకారం జిల్లా అథారిటీ అధికారుల మరియు యితర ఉద్యోగుల సంఖ్య:

"ఈ నియమాలతో జతపర్చిన షెడ్యూలు ప్రకారం లేదా యెప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా జిల్లా అథారిటీ విధులను నిర్వర్తించేందుకు అవసరమైన సెక్రెటేరియల్ పనులకు మరియు దైనందిన విధులను నిర్వర్తించడానికి అవసరమైన అధికారుల మరియు యితర ఉద్యోగుల సంఖ్య వుంటుంది."

12. సెక్షన్ 9 క్రింది సబ్‌సెక్షన్ (6) ప్రకారం జిల్లా అథారిటీలోని అధికారుల, యితర ఉద్యోగుల సేవా నిబంధనలు, జీతభత్యాలు :

i) ఈ నియమాలతో జతపర్చిన షెడ్యూలులో సూచించిన విధంగా జిల్లా అథారిటీ అధికార్ల మరియు ఇతర ఉద్యోగుల జీతభత్యాలు వుంటాయి. లేదా రాష్ట్ర ప్రభుత్వంలో తమ స్థాయిలో పనిచేసే వారికి లభించే జీత భత్యాలు వుంటాయి.

ii) జిల్లా అథారిటీలోని అధికారుల యితర ఉద్యోగుల సేవా నిబంధనలు, క్రమశిక్షణా విషయాలు, వేతనాలు, అలవెన్సులు, యితర సౌలభ్యాలు, పదవీ విరమణ వయస్సుకు సంబంధించిన విషయాలలో రాష్ట్ర ప్రభుత్వంలో తమ హోదాలో పనిచేసేవారికి వర్తించే నిబంధనలే వర్తిస్తాయి.

13. సెక్షన్ 11ఎ క్రింద సబ్‌సెక్షన్ (2) లోని నిబంధన (బి) ప్రకారం మండల న్యాయసేవల కమిటీ మెంబర్ల సంఖ్య, అర్హతలు, అనుభవం:

i) మండల న్యాయసేవల కమిటీలో 5 గురికి మించి మెంబర్లు వుండరు.

ii) ఈ క్రింద తెలుపబడినవారు మండల న్యాయసేవల కమిటీలో ఎక్స్ ఆఫిషియో మెంబర్లుగా వుంటారు.

ఎ) సబ్ డివిజనల్ ఆఫీసర్.

బి) సబ్–డివిజనల్ పోలీస్ ఆఫీసర్.

iii) రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి, యీ క్రింది సబ్–రూలు (iv) ప్రకారం అర్హతలు, అనుభవం వున్నవారి నుండి యితర మెంబర్లను నామినేట్ చేయవచ్చు.

iv) ఏ వ్యక్తియైనా, యీ క్రింద తెలుపబడిన విధంగా లేనిచో మండల న్యాయసేవల కమిటీలో మెంబరుగా నామినేట్ కావడానికి అర్హులు కాదు.

ఎ) షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు జాతుల, మరియు యితర బలహీన వర్గాల ప్రజల, స్త్రీల పిల్లల మరియు గ్రామీణ/పట్టణ కార్మిక వర్గాల నుద్ధరించడానికి కష్టపడ్డ సమర్థులైన సంఘ సేవకులుగాని,

బి) న్యాయరంగంలో సామర్థ్యంవున్న వారుగాని,

సి) న్యాయసేవల పథకాల అమలులో మిక్కిలి ఆసక్తి కలిగివున్న ప్రముఖవ్యక్తి.

14. మండల న్యాయసేవల కమిటీలో సెక్షన్ 11ఎ లోని సబ్‌సెక్షన్ (3) ప్రకారం, అధికారుల మరియు యితర ఉద్యోగుల సంఖ్య :

ఈ నియమాలలో జతపర్చిన షెడ్యూలులో సూచించిన విధంగా మండల న్యాయసేవల కమిటీలోని అధికారుల మరియు యితర ఉద్యోగుల సంఖ్య వుంటుంది.

15. సెక్షన్ 11ఎ క్రింద సబ్‌సెక్షన్ (4) ప్రకారం, మండల న్యాయసేవల కమిటీలోని అధికారుల, యితర ఉద్యోగుల సేవా నిబంధనలు, జీత భత్యాలు:

i) ఈ నియమాలతో జతపర్చిన షెడ్యూలులో సూచించిన విధంగా మండల న్యాయసేవల కమిటీలోని అధికార్ల మరియు యితర ఉద్యోగుల జీతభత్యాలు వుంటాయి. లేదా రాష్ట్ర ప్రభుత్వంలో తమ సమానస్థాయిలో పనిచేసే వారికి లభించే జీతభత్యాలు వుంటాయి.

ii) మండల న్యాయసేవల కమిటీలోని అధికారుల, మరియు యితర ఉద్యోగుల సేవా నిబంధనలు, క్రమశిక్షణా విషయాలు, వేతనాలు, అలవెన్సులు, యితర సౌలభ్యాలు, పదవీ విరమణ వయస్సుకు సంబంధించిన, విషయాలలో రాష్ట్ర, ప్రభుత్వంలో పనిచేస్తున్న తమకు సమాన హోదాలలో వున్నవారికి వర్తించే నిబంధనలే వర్తిస్తాయి.

16. సుప్రీంకోర్టు మినహాయించి, యేకోర్టులోనైనా న్యాయసేవలకు సంబంధించిన కేసులు సెక్షన్ 12 లోని క్లాజు (హెచ్) ననుసరించి వ్యక్తికి వుండవలసిన గరిష్ట ఆదాయపరిమితి:

ఏ భారతీయ పౌరుడైనా తన వార్షికాదాయం రూ. 1,00,000/– కు మించకుండా (అన్ని వనరులు కలిపి) వున్నా లేదా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రకటించిన విధంగా వుంటే, సదరు వ్యక్తి సెక్షన్ 12 లోని క్లాజు (హెచ్) ప్రకారం న్యాయసేవలనందుకోవటానికి అర్హులు.

17. సెక్షన్ 19ఎ లోని సబ్‌సెక్షన్ (4)లో ఉదహరించిన ప్రజాకోర్టు సభ్యులకు వుండవలసిన అర్హతలు, అనుభవం– ఒకవ్యక్తి ప్రజాకోర్టు ధర్మాసనంలో వుండాలంటే యీ క్రింద అర్హతలు వుండాలి :

ఎ) బలహీన వర్గాలు అనగా షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల, స్త్రీల పిల్లల మరియు గ్రామీణ/పట్టణ కార్మికుల ఉద్ధరణకై పనిచేస్తున్న సమర్థులైన సంఘసేవకులు గాని,

బి) సమర్థులైన న్యాయవాదిగాని,

సి) న్యాయసేవల పథకాల మరియు కార్యక్రమాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వున్న ప్రముఖవ్యక్తి.

18. విచారణలో వున్న కేసులు, విచారించబోవు కేసులకు సంబంధించి ప్రజాకోర్టు తీర్పుల అమలు :

ప్రజాకోర్టు ఇచ్చుతీర్పులు అంతకు ముందు ఏ కోర్టులో అయితే ఈ కేసులు విచారణలో వున్నవో ఆ కోర్టులో అమలు పర్చాలి. విచారణ జరిపించు కేసుల తీర్పులను సంబంధిత జిల్లా న్యాయాధికారి అమలు చేయాలి.

i) చెల్లించిన కోర్టు ఫీజులను అర్హులైన వ్యక్తులకు తిరిగి చెల్లించుట కొరకు ప్రజాకోర్టుకు ఆ కేసును బదలాయించిన కేసు వారు ధృవపత్రాన్ని అందించెదరు.

ii) ఆంధ్రప్రదేశ్ కోర్టు ఫీజు మరియు సూట్ వాల్యుయేషన్ చట్టం 1956 ప్రకారం జిల్లా కలెక్టరు లేదా సంబంధిత రెవెన్యూ అధికారి ధృవపత్రం ఆధారంగా కోర్టు ఫీజులను తిరిగి చెల్లిస్తారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవల అధికారిక నిబంధనలు, 1996

న్యాయసేవల అథారిటీల చట్టం, 1987 లోని సెక్షన్ 29ఎ ద్వారా ప్రదానం చేయబడిన అధికారాలు వినియోగించి, మరియు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని అవసరమైన చోట సంప్రదించి ఆంధ్రప్రదేశ్ న్యాయసేవల అథారిటీ యీ క్రింది నిబంధనలను రూపొందించింది.

అధ్యాయం - I

1. పేరు మరియు అమలు తేది :

ఈ నిబంధనలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవల అధికారిక నిబంధనలు అని పిలువబడతాయి మరియు రాష్ట్ర అథారిటీ నిర్ధారించిన తేదీ నుండి యీ నిబంధనలు అమలులోకి వస్తాయి.

2. నిర్వచనాలు:

ఈ నిబంధనలలో సందర్భం మారనంత వరకు

ఎ) 'చట్టం' అనగా న్యాయసేవల అథారిటీల చట్టం 1987 (నెం.39 – 1987)

బి) 'రాష్ట్ర అథారిటీ' అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవల అథారిటీ.

సి) 'హైకోర్టు కమిటీ' అనగా 'ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయసేవల కమిటీ'.

డి) 'జిల్లా అథారిటీ' అనగా న్యాయసేవల అధికార చట్టంలోని సెక్షన్ 9 ప్రకారం యేర్పాటు చేయబడినది మరియు దానితో మెట్రోపాలిటన్ న్యాయసేవల అథారిటీ మరియు సిటీసివిల్ కోర్టు న్యాయసేవల అథారిటీలు కూడా కలిసి వున్నవి.

ఇ) 'తాలూకా కమిటీ' అనగా న్యాయసేవల అథారిటీస్ చట్టంలోని సెక్షన్ 11ఎ ప్రకారం యేర్పాటు చేయబడినది.

యఫ్) 'నియమాలు' అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవల అథారిటీ నియమాలు, 1995.

జి) 'లీగల్ ప్రాక్టీషనర్' అనగా అడ్వకేట్స్ యాక్టు, 1961 లో వ్యక్తపరచిన అర్థము.

హెచ్) 'మెంబర్' అనగా సందర్భానుసారం, రాష్ట్ర అథారిటీ, హైకోర్టు అథారిటీ, జిల్లా అథారిటీ లేక తాలూకా కమిటీకి చెందిన మెంబరు.

ఐ) 'నామినేటెడ్ మెంబర్' అనగా రాష్ట్ర అథారిటీ, హైకోర్టు అథారిటీ జిల్లా అథారిటీ లేక తాలూకా లేక కమిటీకి నామినేటు చేయబడిన మెంబరు.

జె) ఈ నిబంధనల్లో నిర్వచించబడిన అన్ని పదాలు మరియు వ్యక్తీకరణలు యాక్టు మరియు తత్సంబంధిత నియమాలలో పొందుపరిచిన అర్థాలే కలిగి వుంటాయి.

అధ్యాయం - II

3. కార్యనిర్వాహణాధికార నిహితము:

రాష్ట్ర అథారిటీకి సంబంధించిన కార్యనిర్వహణాధికారం తన నియంత్రణలో వుండే మెంబరు సెక్రెటరీ ద్వారా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కలిగి వుంటారు. కానీ, నిర్ణయాలు తీసుకొనే విషయంలో ప్యాట్రన్ యిన్ చీఫ్

అవసరమనిపించిన సందర్భాలలో తన సలహా యివ్వవచ్చు. జిల్లా అథారిటీకి సంబంధించిన కార్య నిర్వహణాధికారం, కార్యాచరణాధికారం తన నియంత్రణలో పనిచేసే సెక్రెటరీ ద్వారా చైర్మన్ కలిసి వుంటారు.

తాలూకా కమిటీకి సంబంధించిన కార్యనిర్వహణాధికారం దాని చైర్మన్ కలిగి వుంటారు లేదా తత్కార్య నిమిత్తం ఎన్నుకొన్న వ్యక్తి ద్వారా వినియోగిస్తారు.

అధ్యాయం - III

రాష్ట్ర అథారిటీ

రాష్ట్ర అథారిటీ నిర్వర్తించవలసిన యితర విధులు:

(యాక్టులోని సెక్షన్ 7(డి) ప్రకారం సెంట్రల్ అథారిటీని సంప్రదించిన పిదప తగిన మార్పులతో అమలులోకి వస్తుంది)

4. యాక్టులోని సెక్షన్ 7(1) మరియు 7(ఎ), (బి), (సి)లలో వుదహరించిన విధులే కాకుండా, రాష్ట్ర అథారిటీ యీ క్రింది పనులను కూడా నిర్వర్తించవచ్చు:

1. రాష్ట్రంలో యెక్కడైనా గాని సామాన్య జనానికి ప్రత్యేకించి కొండజాతులు, గ్రామీణ జనాభాలు, స్త్రీలు, పిల్లలు, వికలాంగులు, అశక్తులైన వారు మరియు బలహీన వర్గాలకు చెందిన వారిలో న్యాయసంబంధ సహాయ సేవల గురించి వారి న్యాయసంబంధ హక్కుల గురించి మరియు పౌరులుగా వారి బాధ్యతల గురించిన జ్ఞానమును, చైతన్యాన్ని కలిగించడానికై న్యాయ సంబంధిత జ్ఞాన శిబిరాలు యేర్పాటు చేయవచ్చు.
2. రాష్ట్ర అథారిటీ దృష్టిలో ప్రజాహితార్థమైన వివాదాలుగా కనిపించిన వివాదాలు పరిష్కారం నిమిత్తం, తమ పేదరికం, నిరక్షరాస్యత మరియేయితర కారణాలవల్లగాని, చట్టంద్వారా తమకు తాముగా పరిష్కరింప చేయించుకోలేని వారి వుపయోగార్థం, సంబంధిత కోర్టుల ద్వారా అటువంటి వివాదాల విషయంలో ఆర్థికంగా చొరవతీసుకోవచ్చు.
3. న్యాయశాస్త్ర విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల మరియు యితర సంఘ సేవా సంస్థలతో కలిపి రాష్ట్ర అథారిటీ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో 'న్యాయ సలహా శిబిరాలు' యేర్పాటు చేయవచ్చు.
4. కోర్టుల్లో విచారణలో వున్నా లేకున్నా లేక కోర్టుల ముందుకు రాబోయే వివాదాలైనా కాకపోయినా, తగాదాలలో వ్యక్తుల మధ్య సామరస్యంతో వివాదాల పరిష్కారానికై అనువైన విధంగా, రాష్ట్రంలోని వివిధ కేంద్రాల్లో శాశ్వత మౌలిక సదుపాయాలు కలిగించేందుకు జిల్లా అథారిటీని ఆదేశించిగాని, నేరుగాగాని రాష్ట్ర అథారిటీ 'సమాధాన పరచే సంఘాల'ను స్థాపించవచ్చు. ఇటువంటి 'సమాధాన పరిచే సంఘాలు/ సమితులు' యేర్పాటు చేసే విషయంలో రాష్ట్ర అథారిటీకిగాని, జిల్లా అథారిటీకిగాని, న్యాయ సంబంధ సహాయ కార్యాల్లో ఆసక్తి వున్న సంఘ సేవా సంస్థల సహాయ సహకారాలు తీసికొనే స్వేచ్ఛ వుంది.
5. జిల్లా అథారిటీలు తిరస్కరించిన కేసులను, దరఖాస్తు ఆధారంగా రాష్ట్ర ఆథారిటీ సమీక్షించవచ్చు.

అధ్యాయం - IV

హైకోర్టు న్యాయసేవల కమిటీ విధులు, అధికారాలు

5. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయసేవల కమిటీ స్థాపన, దాని విధులు మరియు అధికారాలు:

రాష్ట్ర అథారిటీ ప్యాట్రన్ యిన్ చీఫ్ నామినేటు చేసిన పదవిలో వున్న ఒక హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షులుగా వుండగా, యీ క్రింద చూపబడిన ఎనిమిది మంది మెంబర్లు గూడా ప్యాట్రన్ యిన్ చీఫ్ చేత నియమించ బడతారు.

i) ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘాధ్యక్షులు.

ii) ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం నుండి 15 సంవత్సరాలకు తక్కువ లేకుండా అనుభవం వున్న మెంబరు (న్యాయవాది).

iii) ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం నుండి 5 సంవత్సరాల పైన 15 సంవత్సరాల లోపు అనుభవం వున్న మెంబరు.

iv) ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్త్రీ న్యాయవాదుల సంఘం నుండి 10 సంవత్సరాలపైన అనుభవం గల సభ్యురాలు.

v) ఒక విశ్వవిద్యాలయం నుండి – పనిచేస్తున్న లేదా పదవీ విరమణ చేసిన సమర్థులైన న్యాయశాస్త్రాధ్యాపకులు.

vi) షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు జాతుల, స్త్రీల, పిల్లల మరియు గ్రామీణ కార్మికుల వంటి బలహీన వర్గాల ప్రజల వున్నతికై పాటుపడిన ఒక సమర్థులైన సంఘసేవకులు.

vii) న్యాయ శాస్త్రరంగంలో అనుభవం వున్న ప్రముఖ వ్యక్తి.

viii) న్యాయ సంబంధ సహాయ సేవల పథకాలలో ప్రత్యేకాసక్తి వున్న ఒక ప్రముఖ వ్యక్తి.

6. హైకోర్టు న్యాయసేవల కమిటీ మెంబర్ల మరియు సెక్రెటరీల పదవీకాలం:

1. హైకోర్టు న్యాయసేవల కమిటీ యొక్క సెక్రెటరీ మరియు మెంబర్లు ప్యాట్రన్ యిన్ చీఫ్ తొలగించే వరకు 2 సంవత్సరాల కాలం పదవిలో వుంటారు. సెక్రెటరీ తప్ప అందరు మెంబర్లు గౌరవ హోదాలో వారి విధి నిర్వహణ చేస్తారు.

2. ఏ కారణం చేతైనా యే మెంబరైనా పదవిలో కొనసాగని పక్షంలో ఆ స్థానాన్ని మరల యథా ప్రకారం నామినేషన్ పద్ధతి ద్వారా భర్తీ చేయవచ్చు. ఈ విధంగా నామినేటు చేయబడ్డ అధ్యక్షులు గాని మెంబర్లు గాని, మిగిలిన పదవీకాలం పదవి వదలిన వారి స్థానంలో కొనసాగవచ్చు.

7. కొన్ని పరిస్థితుల్లో అధ్యక్షులు కాకుండా హైకోర్టు న్యాయసేవల కమిటీ మెంబర్ల తొలగింపు :

1. ప్యాట్రన్ యిన్ చీఫ్, ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులను సంప్రదించి, సెక్షన్ 8ఎ(2)(బి) ప్రకారం హైకోర్టు కమిటీకి నామినేటు చేయబడిన యే మెంబరునైనా, యీ క్రింది పరిస్థితులలో తొలగించవచ్చు.

   ఎ) కమిటీ సమావేశాలకు వరుసగా మూడుసార్లు హాజరుకాకపోయినా;

బి) దివాళాతీసినట్టుగా తీర్మానించబడినా, లేక

సి) రాష్ట్ర అథారిటీ ప్యాట్రన్ యిన్ చీఫ్ వుద్దేశ్యంలో, యేదైనా నేరం చేసినట్లు నిరూపించబడినట్లయితే, అనగా నీతిబాహ్యమైన నేరం; లేదా

డి) శారీరకంగా గాని, మానసికంగాగాని మెంబరుగా పనిచేయలేకపోయినా లేదా

ఇ) తమ పదవిలో కొనసాగటం ప్రజాహితంగాని విధంగా తమ పదవిని దుర్వినియోగపరచినా

2. పై నిబంధనల (1) ననుసరించి ఆయా పరిస్థితుల్లో యే మెంబరుకైనా సంజాయిషీ చెప్పుకోవడానికి తగినంత అవకాశం యివ్వకుండా తొలగించడం జరగదు.

3. ఏ సభ్యులైనా తన రాజీనామాను, ప్యాట్రన్ యిన్ చీఫ్‌కు హైకోర్టు కమిటీ అధ్యక్షుల చేత రాష్ట్ర అథారిటీ అధ్యక్షుల ద్వారా సమర్పించవచ్చు. సదరు రాజీనామా, ప్యాట్రన్ యిన్ చీఫ్ ఆమోదించబడిన తేదీ నుండి అమల్లోకి వస్తుంది.

8. హైకోర్టు కమిటీ అధికారాలు మరియు విధులు :

రాష్ట్ర అథారిటీ యొక్క అజమాయిషీ నియంత్రణలో, హైకోర్టు కమిటీ ఈ క్రింది అధికారాలు వినియోగిస్తూ తన విధులను నిర్వర్తిస్తుంది.

ఎ) పేదరికం వల్ల, నిరక్షరాస్యత మూలంగా తమకు తాము చట్టం ద్వారా పరిష్కారం పొందలేని బహుళ ప్రజాహిత వివాదాల పరిష్కారం నిమిత్తం హైకోర్టులో పరిష్కారం కొరకు, హైకోర్టు కమిటీ రాష్ట్ర కమిటీకి సిఫార్సు చేయవచ్చు.

బి) హైకోర్టు కేసులకు సంబంధించి ప్రజాకోర్టులను క్రమబద్ధంగా యేర్పాటు చేసి సమావేశపరచవచ్చు.

సి) హైకోర్టు కేసులకు సంబంధించిన న్యాయసేవల కొరకు దరఖాస్తులను స్వీకరించవచ్చు.

డి) ప్రతి దరఖాస్తుదారుని కేసును నిర్ణీత కాలంలో పరిష్కరించవచ్చు.

ఇ) తన ముందుకు న్యాయసేవల కొరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి యెంతవరకు న్యాయ సంబంధ సేవలనందించవచ్చునో అనే విషయం మీద నిర్ణయం తీసికోవచ్చు.

యఫ్) వివాదంలోని పార్టీల మధ్య అన్ని ప్రయత్నాలు చేసి సామరస్యంతో సరియైన పరిష్కారం కుదర్చవచ్చు. ఒక వేళ దరఖాస్తుదారుమూలంగా సమాధాన ప్రయత్నం విఫలమైందని తలిస్తే న్యాయ సంబంధ సేవలందించడానికి నిరాకరించవచ్చు.

జి) తగాదాలను, వీలయినంత వరకు సమాధాన పరిచే విధానంతో పరిష్కారానికై ప్రోత్సహించి ఆ పద్ధతినే అనుసరించడం మరియు పెంపొందించడం.

హెచ్) ఒక వ్యక్తికి న్యాయ సంబంధ సేవలందించినప్పుడు, పరిష్కారం నిమిత్తం అయిన ఖర్చును తిరిగి రాబట్టుకోవడానికి తగిన చర్య తీసికోవచ్చు.

ఐ) ఈ నిబంధనల విషయంలో రాష్ట్ర, అథారిటీకి తగు సిఫారసులు చేయడం మరియు మెరుగుదలకు సూచన లివ్వడం.

జె) రాష్ట్ర అథారిటీ కోరిన విధంగా నివేదికలు, సకాలంలో గణాంకం లేక సమాచారం సిద్ధం చేసి సమర్పించడం.

కె) రాష్ట్ర అథారిటీ యెప్పటికప్పుడు నిర్ణయించిన నిబంధనల ననుసరించి యితర విధులను నిర్వర్తించడం మరియు అధికారాలు వినియోగించడం.

అధ్యాయం - V

9. జిల్లా అథారిటీ:

జిల్లా అథారిటీ మెంబర్ల పదవీకాలం :

1. జిల్లా అథారిటీ సభ్యులు ఎవరైనా యే కారణంచేతనైనా పదవిలో కొనసాగని పక్షంలో సదరుసభ్యుల స్థానంలో యథావిధిగా మరొక సభ్యులను నామినేటు చేయవచ్చు.
2. జిల్లా అథారిటీ సభ్యులెవరైనా యే కారణంచేతనైనా పదవిలో కొనసాగని పక్షంలో సదరు సభ్యుల స్థానంలో యథావిధిగా మరొక సభ్యులను నియమించి మిగిలిన పదవీకాలం పూర్తి చేయవచ్చు.
3. జిల్లా అథారిటీ సభ్యులెవరైనా వ్రాతపూర్వక రాజీనామాను జిల్లా అథారిటీ అధ్యక్షుల చేత రాష్ట్ర అథారిటీ అధ్యక్షులను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించవచ్చు. అట్టి రాజీనామా ఆమోదించబడిన తేదీన లెక్కకు వస్తుంది.

10. కొన్ని పరిస్థితులలో సభ్యులను పదవి నుండి తొలగించడం :

1. ఈ క్రింది పరిస్థితుల్లో నామినేటు చేయబడ్డ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ రాష్ట్ర అథారిటీ అధ్యక్షులతో సంప్రదించిన మీదట ప్యాట్రన్ యిన్ చీఫ్ సిఫారసుల ననుసరించి తొలగించవచ్చు.

   ఎ) జిల్లా అథారిటీ సమావేశాలకు వరుసగా మూడుసార్లు హాజరుకాని యెడల;

   బి) దివాళా తీసినట్టు నిర్ధారించబడినప్పుడు;

   సి) ముఖ్యపోషక కర్తదృష్టిలో, నీతిబాహ్యమైన నేరం చేసినట్లు నిర్ధారింపబడినట్లయితే;

   డి) సభ్యులుగా కొనసాగటానికి శారీరకంగాని, మానసికంగాగాని అసమర్థులైతే;

   ఇ) జిల్లా అథారిటీ సభ్యులుగా కొనసాగటం ప్రజాహితానికి మంచిదిగాని విధంగా పదవీ దుర్వినియోగం చేసినా;

(2) పైన (1) క్రింది సూచించిన పరిస్థితుల్లో యే సభ్యులనైనా తొలగించడానికి సిఫార్సు చేయబడినా, సదరు సభ్యులకు సంజాయిషీ యిచ్చుకోవడానికి తగినంత అవకాశం యివ్వకుండా తొలగించడం జరగదు.

11. జిల్లా అథారిటీ యొక్క అదనపు విధులు :

చట్టం మరియు నియమాలననుసరించి పొందుపరచిన విధులుగాక, జిల్లా అథారిటీ, రాష్ట్ర అథారిటీ యొక్క సాధారణ పర్యవేక్షణలో మరియు నియంత్రణ క్రింద యీ క్రింది విధులను నిర్వర్తిస్తుంది.

1. కేంద్ర అథారిటీ లేక రాష్ట్ర అథారిటీ యెప్పటికప్పుడు వ్రాతపూర్వకంగా యిచ్చే నిర్దేశాలననుసరించి మరియు యెప్పటికప్పుడు రాష్ట్ర అథారిటీ పొందుపరిచిన నిబంధనలననుసరించి, వేరే విధులను

నిర్వర్తించవలసి ఉంటుంది.

2. రాష్ట్రంలో నిర్వహింపబడే న్యాయ సంబంధ సేవల పథకాల గురించిన పరిజ్ఞానాన్ని అందించే వుద్దేశ్యంతోనూ లేక పౌరులు ప్రత్యేకించి కొండ జాతుల మరియు గ్రామీణ జనాభా, స్త్రీలు, పిల్లలు, మరియు వికలాంగులకు తమకు గల న్యాయ సంబంధ హక్కులు మరియు విధుల గురించిన స్పృహను విస్తరింపజేయడానికై, జిల్లాలో పలుచోట్ల న్యాయ పరిజ్ఞాన శిబిరాలను యేర్పాటు చేయడం.

3. న్యాయశాస్త్ర విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల మరియు యితర సేవా సంస్థల సహకారంతో, జిల్లాలో పలుచోట్ల న్యాయ సంబంధ సహాయ శిబిరాలు నడిపించడం.

4. జిల్లాలోని తాలూకా కమిటీ యొక్క పనితీరును పర్యవేక్షించడం, నిర్దేశించడం మరియు మార్గదర్శక సూచకాలు చేయడం.

5. రాష్ట్ర అథారిటీకి అవసరమైన విధంగాగాని, తనకు తోచిన విధంగా గాని, తాలూకా కమిటీ నుండి ఎప్పటికప్పుడు నివేదికలు, వివరణలు మరియు యితర గణాంకములు లేక సమాచారం కొరకు అడగటం.

6. రాష్ట్ర అథారిటీ కోరిన విధంగా నివేదికలను తయారు చేయడం, ఏకీకృతం చేయడం మరియు సమర్పించడం.

7. న్యాయ సంబంధ సేవలకై వచ్చు దరఖాస్తులనందుకోవడం మరియు ప్రతి దరఖాస్తును తగు సమయం లోపల కార్యసరళిలోకి తెచ్చి క్రమపద్ధతిలో పరిష్కరించబడేటట్లుగా తగు జాగ్రత్తలు తీసికోవడం.

8. తగాదాల పూర్వపు విషయాలతో కలిపి న్యాయసంబంధ సేవలకై తను ముందుకు వచ్చిన కేసులను పరిశీలించి ఆయా కేసులలో యెంతవరకు న్యాయ సంబంధ సేవలందించవచ్చునో నిర్ణయించడం.

9. వివాదంలోని యిరుపక్షాల వారిని తన యెదుట హాజరుకావటానికి ప్రోద్బలం చేసి, యిద్దరి మధ్య ఒక న్యాయసమ్మతమైన పరిష్కారం కోసం అన్ని యత్నాలు చేయడం, మరియు అవసరమైతే దరఖాస్తుదారుని తప్పుడు కారణంగా సామరస్య ప్రయత్నాలు విఫలమైనట్లు అనిపిస్తే అడిగిన న్యాయ సంబంధ సేవలు తిరస్కరించడం.

10. అన్ని న్యాయ సంబంధ విషయాల్లో – వివాద పూర్వపు విషయాలు గూడా – సామరస్యంతో సమాధాన పరిచే విధానంతో పరిష్కరించే పద్ధతి అవలంబించడం, ఆ పద్ధతిని ప్రోత్సహించడం మరియు పెంపొందించడం.

11. ఒక వ్యక్తికి న్యాయ సంబంధ సేవలందించినప్పుడు వారి వివాద పరిష్కారానికై ఖర్చులను రాబట్టుకొనడానికి తగిన చర్య తీసికొనడం.

12. దరఖాస్తు అందిన మీదట న్యాయసంబంధ సేవలను తాలూకా కమిటీ నిరాకరించిన కేసులను సమీక్షించడం.

అధ్యాయం - VI

12. తాలూకా న్యాయసేవల కమిటీ :

తాలూకా కమిటీ మెంబర్ల పదవీకాలం మరియు యితర నిబంధనలు :

1. తాలూకా కమిటీ మెంబర్ల పదవీ కాలం 2 సంవత్సరాలు.
2. ఏ కారణం చేతనైనా, యే సభ్యులైనా పదవిలో కొనసాగని పక్షంలో, సదరు సభ్యుల స్థానంలో యథావిధిన మరొక సభ్యులను నియమించడం జరుగుతుంది. ఆ విధంగా నియమించిన సభ్యులు మిగిలిన పదవీకాలం పూర్తి చేయగలరు.
3. ఏ సభ్యులైనా పదవీ విరమణ చేయదల్చుకుంటే, తన రాజీనామా గురించి తాలూకా కమిటీ అధ్యక్షులకు సమాచారం యిచ్చి రాష్ట్ర అథారిటీ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులకు జిల్లా అథారిటీ అధ్యక్షుల ద్వారా సదరు రాజీనామాను సమర్పించాలి. అట్టి రాజీనామా రాష్ట్ర అథారిటీ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుల ఆమోదించిన తేదీ నుండి లెక్కలోకి వస్తుంది.

13. కొన్ని పరిస్థితులలో సభ్యులను పదవి నుండి తొలగించుట:

తగిన సంజాయిషీ చెప్పుకొనుటకు అవకాశము ఇచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అథారిటీ కార్యనిర్వాహక అధ్యక్షుల ఫిర్యాదుపై రెగ్యులేషన్ 10 (1) (ఎ నుండి ఇ వరకు) చెప్పిన ఆధారములపై తాలూకా కమిటీ యొక్క నామినేట్ చేయబడిన సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం పదవీచ్యుతలను చేయవచ్చును.

14. తాలూకా కమిటీ యొక్క అదనపు విధులు:

జిల్లా మరియు రాష్ట్ర అథారిటీల పర్యవేక్షణ క్రింద తాలూకా కమిటీలు చట్టాల్లోనూ, నియమనిబంధనల్లో పేర్కొన్న విధులనే కాక ఈ దిగువ చెప్పబడిన విధులను కూడా నిర్వర్తించవలెను.

1. తాలూకా కమిటీ పరిధిలో ఉన్న అన్ని కోర్టులలో కావలసిన న్యాయ సేవలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించుట.
2. ప్రతీ దరఖాస్తుదారుల కేసులనూ, తగు శ్రద్ధతో పరిశీలించి పరిష్కారము చేయించుట.
3. న్యాయసేవల కొరకై కమిటీకి పెట్టుకొన్న దరఖాస్తులను, కేసునకు ముందు వీలుపడే పరిష్కారములతో సహా ఆలోచించి దరఖాస్తుదారునికి ఎంత వరకు న్యాయసేవలు అందింపవచ్చునో నిర్ణయించుట.
4. న్యాయసమ్మతమైన రాజీ కుదుర్చుకొనుటకు వాది ప్రతివాదులను ప్రోత్సహించుచూ, వారిలో ఎవరైనా సహకరింపనిచో వారికి న్యాయసేవలను నిరాకరించుట.
5. సాధ్యమైనంత వరకూ రాజీమార్గమున వివాదములను పరిష్కరించుకొనుటకు ప్రోత్సహించుచూ కేసులు కోర్టుకు వెళ్లకముందే పరిష్కార మార్గములను కనుగొనుట.
6. న్యాయసేవలు స్వీకరించిన వాదులకు కానీ, ప్రతివాదులకు కానీ కోర్టు వారు ఖర్చులను మంజూరు చేసిన యెడల వారి వద్ద నుండి న్యాయసేవలకైన ఖర్చులను వసూలు చేయుట.
7. జిల్లా లేక రాష్ట్ర అథారిటీలు అప్పగించిన ఇతర విధులను నిర్వర్తించుట.

అధ్యాయం - VII

కార్య నిర్వహణ

15. సమావేశాలు :

రాష్ట్ర అథారిటీ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుల ఆమోదంలో రాష్ట్ర అథారిటీ మెంబర్ సెక్రెటరీ, వీలయినంత తరచుగా, కనీసం నెలకు ఒక్కసారైనా రాష్ట్ర అథారిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. ఆయా స్థాయిల అధ్యక్షుల ముందస్తు ఆమోదంతో సంబంధిత సెక్రెటరీలు వీలయినంత తరచుగా, కనీసం 2 నెలల కొక్కసారైనా ఆయా కమిటీల సమావేశాల్ని ఏర్పాటు చేయవలసి వుంటుంది.

ఆయా కమిటీల అధ్యక్షులు సమయానికి లేనప్పుడు, మెంబర్లందరు ఎన్నుకొన్న ఎక్స్ అఫీషియో మెంబర్లలో ఒకరు ఆయా కమిటీల సమావేశాలకు అధ్యక్షత వహించవచ్చును.

16. సమావేశాల కార్య వివరణలు:

ఆయా కమిటీల సెక్రెటరీలు, తమ తమ సమావేశాల్లో జరిపిన/చర్చించిన అంశాల గురించిన కార్య వివరణలను (మినిట్స్ ఆఫ్ మీటింగ్స్), సమావేశాలయిన తర్వాత, వీలయినంత త్వరగా సిద్ధంచేసి, తమ తమ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుల ఆమోదంతో సభ్యులందరికీ పంపించాలి. సమావేశానంతరం, వారం రోజుల్లోపల కమిటీ మెంబర్ల నుండి సమావేశాలకు సంబంధించిన చర్చాంశాలు గల కార్య వివరణల మీద తమ తరపునుండి ఎటువంటి అభ్యంతరాలు గాని, మార్పులకు సూచనలు గాని తెలుపని పక్షంలో కమిటీల ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులు తుది ధృవీకరణ చేసినట్లుగా తమ తమ సంతకాలు చేయాలి. ఏవైనా అభ్యంతరాలు వుంటే, వాటిని సరిగా పరిశీలించి ఆయా కమిటీల అధ్యక్షులు, సమావేశాలకు సంబంధించిన కార్యవివరణలలో తమకు సరియని తోచిన రీతిలో మార్పులు, చేర్పులు చేసి మరల ధృవీకరించి సంతకం చేయాలి. తాలూకా స్థాయి కమిటీల సమావేశాల్లో చర్చించిన కార్యవివరణ, దాన్ని అధ్యక్షుల నిర్దేశంతో తయారు చేయాలి. అట్టి కార్యవివరణ గల పత్రాన్ని అందరు సభ్యులకు పంపించడం, తర్వాత వాటి ధృవీకరణ వగైరాలు, హైకోర్టు మరియు జిల్లా కమిటీలలో చేసిన విధంగా చేయాలి.

17. తీర్మానాల ద్వారా నిర్ణయాలు :

ఆయా కమిటీల నిర్ణయాలు సమావేశాలలోని తీర్మానాల రూపంలో వుండాలి. ఒక వేళ తీర్మానాలకు సంబంధించిన భేదాభిప్రాయాలు వుండినట్లయితే, ఆయా కమిటీల అధ్యక్షులు/ కార్యనిర్వాహక అధ్యక్షుల తుది నిర్ణయమౌతుంది. పైన పేర్కొనబడిన విషయాలలో ఆయా కమిటీల అధ్యక్షుల ఆదేశానుసారం రాష్ట్ర హైకోర్టు / జిల్లా / తాలూకా కమిటీల నిర్ణయాలు అందరికీ తెలియపరచాలి.

18. సమావేశాల ఖర్చు :

ఎ) రాష్ట్ర అథారిటీ మెంబర్ – సెక్రెటరీకి ప్రతి సమావేశానికి రూ. 500/–లు మించకుండా ఖర్చుచేయడానికి అధికారం యివ్వబడింది. మరియు సబ్–కమిటీల సమావేశాలకు రూ. 300/– లు మించకుండా ఖర్చు చేయాలి. ఈ ఖర్చులను న్యాయ సహాయనిధి నుండి ఖర్చు చేయాలి.

బి) హైకోర్టు కమిటీ సమావేశాలకు, సెక్రెటరీ అభ్యర్థన మీద ఒక్కొక్క కమిటీ సమావేశానికి రూ. 500/–

ల చొప్పున మెంబరు–సెక్రెటరీ మంజూరు చేయవచ్చును.

సి) జిల్లా కమిటీ అధ్యక్షులు ఒక సమావేశానికి రూ. 300/–లు మించకుండా ఖర్చుపెట్టవచ్చు.

డి) జిల్లా కమిటీ అధ్యక్షులు తాలూకా కమిటీ సమావేశాలకై, ఒక్కొక్క సమావేశానికి రూ. 200/–లు మించకుండా జిల్లా న్యాయసేవల నిధి నుండి మంజూరు చేయవచ్చు.

అధ్యాయం - VIII

19. న్యాయసేవల కొరకు దరఖాస్తుల స్వీకరణ :

న్యాయసేవలు కోరే వ్యక్తి, హైకోర్టు న్యాయసేవల కమిటీ/జిల్లా అథారిటీ/ తాలూకా కమిటీకి తన కేసు గురించి క్లుప్తంగా వ్రాసి తాను, చట్టంలోని సెక్షన్ 12 (హెచ్) పరిధిలోకి వచ్చినట్లయితే తనకు వున్న ఆస్తులు మరియు అన్ని వనరుల నుండి వచ్చే ఆదాయం గురించి వ్రాసి, ఒక ప్రమాణ పత్రము (అఫిడవిట్) క్రింద దరఖాస్తును పంపించాలి.

20. దరఖాస్తుల పరిశీలన :

స్వీకరించిన దరఖాస్తులను హైకోర్టు కమిటీ/ జిల్లా అథారిటీ సెక్రెటరీలు/ తాలూకా కమిటీ అధ్యక్షులు పరిశీలించి యోగ్యతలను బట్టి న్యాయసేవల అనుమతి అవసరం మేరకు యిస్తారు.

అనుమతి నిరాకరిస్తే అట్టి ఆదేశాలను అధ్యక్షులు ఆదేశానుసారం మాత్రమే పంపించడం జరుగుతుంది.

న్యాయ సంబంధ సేవల గురించి అనుమతికి ఆదేశాలు గూడా ఆయా కమిటీల అధ్యక్షుల నియంత్రణలో మరియు తగు మార్పులతో యివ్వబడతాయి.

21. న్యాయవాదుల జాబితాల తయారీ :

హైకోర్టు కమిటీ/జిల్లా అథారిటీ మరియు తాలూకా కమిటీకి వచ్చే న్యాయసేవలకు సంబంధించిన కేసుల నప్పగించడానికి న్యాయవాదుల జాబితాలు ఈ క్రింది విధంగా తయారుచేయబడతాయి.

i) స్వచ్ఛందంగా న్యాయసంబంధ సేవలను ఉచితంగా అందించే న్యాయవాదులు.

ii) ముఖ్యమైన కేసులు అప్పగించడానికి, 15 సంవత్సరాల కన్నా ఎక్కువ అనుభవం వున్న న్యాయవాదులు.

iii) కేసులు అప్పగించడానికి బార్‌లో 5 సంవత్సరములు మరియు 15 సంవత్సరాల మధ్య అనుభవం కలిగిన యోగ్యులైన న్యాయవాదులు.

రాష్ట్ర అథారిటీ/ హైకోర్టు కమిటీ జిల్లా అథారిటీ / తాలూకా కమిటీలలో మెంబర్లుగా వున్న న్యాయవాదులు న్యాయ సంబంధ సేవలు ఉదారంగా అందించడానికి ఎల్లప్పుడు ముందుకు రావచ్చు.

అంతేగాకుండా జాబితాల తయారీ విషయంలో న్యాయసేవల సంబంధిత పథకాల అమలు విషయంలో ఆసక్తి వున్న మరియు ప్రముఖులైన న్యాయవాదులను జాబితాలో చేర్చేట్టుగా జాగ్రత్త వహించాలి.

22. న్యాయవాదులకు ఫీజులో కొంత మొత్తం చెల్లింపు :

యుక్తమైన కేసులలో న్యాయవాదులకు కేసుల ప్రారంభంలోగాని, మధ్యలో గాని 1/3వ వంతు ఫీజు చెల్లించవచ్చును.

23. డ్యూటీ కౌన్సెల్:

హైకోర్టు కమిటీ, జిల్లా అథారిటీ మరియు తాలూకా కమిటీలు రిటైరైన న్యాయాధికారులను లేక ప్రముఖులైన న్యాయవాదులను గుర్తించగా డ్యూటీ కౌన్సెల్‌గా వారి విధులను కార్యకలాపాలను, రాష్ట్ర అథారిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు నిర్ధారిస్తారు.

24. కోర్టు తీర్పు యిచ్చిన తర్వాత తీసికొనవలసిన చర్య న్యాయవాద విధి:

కోర్టులో కేసు తేలిన తర్వాత, న్యాయసేవలు పొందిన వ్యక్తి తరపున, న్యాయవాది, తీర్పు మరియు డిక్రీ తాలూకు కాపీ కొరకు దరఖాస్తు చేసి కాపీలు అందిన వెంటనే తన వ్యాఖ్యానాలతో తనను నియమించిన కమిటీకి సంస్థకు సమర్పించాలి. తాలూకా, జిల్లా అథారిటీ/హైకోర్టు కమిటీ న్యాయసేవలకైన ఖర్చులను, కక్షిదారుకు కోర్టు ప్రదానం చేసిన నష్టపరిహారంలో మినహాయించి వసూలు చేయాలి. ఈ కమిటీ/ సంస్థలు, అవసరమైన చోట అప్పీలు, రివిజన్ పిటీషన్, రిట్ పిటిషన్‌ను, యీ క్రింది పరిస్థితుల్లో దాఖలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.

i) దరఖాస్తుదారైన వ్యక్తికి ప్రతికూలంగా కేసు నిర్ణయించబడినా,

ii) పై కోర్టుకు వెళ్ళడానికి సరైన ఆధారులున్నా;

iii) సహాయం పొందిన వ్యక్తి తగిన ప్రత్యామ్నాయ మార్గాలకై న్యాయసేవల కోసం దరఖాస్తు పెట్టుకొన్నా;

తాలూకా కమిటీ, జిల్లా అథారిటీ, హైకోర్టు కమిటీల వుద్దేశ్యంలో న్యాయసేవలు మంజూరైన తర్వాత, పరిస్థితుల్లో మార్పు వచ్చిందనిపిస్తే తప్ప చట్టంలోని సెక్షన్12 (హెచ్) ప్రకారం యోగ్యత గురించి మరల కొత్తగా దర్యాప్తు చేయనవసరం లేదు.

25. న్యాయసంబంధ సేవలు మరియు సలహా పద్ధతులు :

ఈ నిబంధనలననుసరించి అందించగలిగిన న్యాయసంబంధ సేవలు, యీ క్రింది వాటిలో ఒకటిగాని అన్ని పద్ధతుల్లోగాని వుంటాయి.

ఎ) న్యాయ సంబంధ సలహా:

తాలూకా కమిటీ/ జిల్లా అథారిటీ / హైకోర్టు కమిటీ లేదా రాష్ట్ర అథారిటీ ప్రోత్సహించిన యే ఇతర స్వచ్ఛంద సంస్థగాని కలిగి వున్న న్యాయవాదుల జాబితాలోని ఒక న్యాయవాది యివ్వవచ్చు.

బి) న్యాయసంబంధ సేవలు యీ క్రింది రూపాల్లో వుంటాయి.

i) న్యాయ సంబంధ కార్యసరళిలో, జాబితాలోని ఒక న్యాయవాది ప్రాతినిధ్యంతో,

ii) యోగ్యుడైన వ్యక్తిగాని, అతని తరుపున గాని యీ క్రింద వాటి చెల్లింపులు.

ఎ) కోర్టు ఫీజు;

బి) ప్రాసెస్‌ఫీజు, మరియు సాక్షుల కొరకైన ఖర్చులు;

సి) కాగితాలు, పుస్తకాల తయారీ ఖర్చులు, ప్రింటింగ్ మరియు అనువాదానికయ్యే ఖర్చులతో సహా;

డి) జడ్జిమెంట్లు, డిక్రీల ఆర్డర్ల మరియు యితర పత్రాల కాపీల సరఫరా కయ్యే ఖర్చులు;

ఇ) సంబంధిత యితర రొఖ్ఖం ఖర్చు బాపతు.

26. న్యాయసేవలందుకొన్న వ్యక్తి నుండి న్యాయవాది డబ్బు తీసికొనడం నిషేధం:

ఈ నిబంధనల ననుసరించి న్యాయసంబంధ సేవలందుకొన్న వ్యక్తి నుండి యే న్యాయవాదైనా యెటువంటి పారితోషికం తీసికొనగూడదు.

27. ఒప్పందం :

తాలూకా కమిటీ/ జిల్లా అథారిటీ/ హైకోర్టు కమిటీ న్యాయసేవలందుకొంటున్న వ్యక్తి నుండి వివాద పరిష్కార సంబంధమైన కార్య సరళి మొదలు పెట్టక మునుపే, వివాద సంబంధిత ముఖ్యాంశాలు, పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పొందుపరిచిన నిబంధనలతో కూడిన ఒక ఒప్పందాన్ని తీసికొనాలి.

పై ఒప్పందంలో, తప్పనిసరిగా యీ క్రింది నిబంధనలుండాలి;

"దరఖాస్తుదారు, తాను న్యాయ సంబంధ సేవలందుకొన్నందుకు, తన కేసు పరిష్కారమై తాను ఆశించిన ఫలితం పొందినప్పుడు అటువంటి ఫలితంగాని, డబ్బుగాని, తన కేసు కొరకైన ఖర్చుకన్నా ఎక్కువగా వున్న పక్షంలో ఆ ఖర్చులను తాలూకా కమిటీ / జిల్లా అథారిటీకి/ హైకోర్టు కమిటీకి తిరిగి చెల్లించగలందులకు గాను ఒప్పుకోవడమైనది.

28. ఆర్థిక సహాయ పరిమితులు :

ఈ నిబంధనలలో యిచ్చిన షెడ్యూలులో వున్న విధంగా, దరఖాస్తుదారునకు, న్యాయవాది కివ్వవలసిన ఫీజు – తాలూకా కమిటీ/జిల్లా అథారిటీ/హైకోర్టు కమిటీ వారు మంజూరు చేయవచ్చును.

ముందుగా రాష్ట్ర అథారిటీ యొక్క అనుమతి;

ఒకే రకమైన సామూహిక వివాదాల కేసులు వాదించడానికి గాను, రాష్ట్ర అథారిటీ నుండి ముందుగా అనుమతి తీసికొని, న్యాయవాదిని నియమించవచ్చు. ఈ సందర్భంలో అన్ని కేసులకు కలిపి ఫీజు ఒకే మొత్తంగా రోజువారీగా గాని, నెలసరి గాని చెల్లించబడుతుంది.

హైకోర్టు కమిటీ మంజూరు చేసిన సొమ్ము రాష్ట్ర అథారిటీ చేత రాష్ట్ర న్యాయ సహాయ నిధి నుండి చెల్లించబడుతుంది. తాలూకా కమిటీ మంజూరు చేసిన సొమ్ము జిల్లా న్యాయసహాయనిధి నుండి జిల్లా అథారిటీ చేత చెల్లింపబడుతుంది.

అధ్యాయం - IX

ప్రజాకోర్టులు

29. ప్రజాకోర్టులను యేర్పాటు చేసే పద్ధతి:

1. హైకోర్టు కమిటీ సెక్రెటరీగాని, జిల్లా అథారిటీ అధ్యక్షులు గాని తాలూకా కమిటీ అధ్యక్షులు గాని నిర్ణీత సమయాలలో ప్రజాకోర్టులను యేర్పాటు చేస్తారు. సెక్రెటరీగాని జిల్లా అథారిటీ/ తాలూకా కమిటీ అధ్యక్షులుగాని యిట్టి ప్రజాకోర్టులను చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం తమకు పంపబడిన వివాదాల సంఖ్య 30కి చేరుకోగానే యేర్పాటు చేయాలి.

2. హైకోర్టు కమిటీ, జిల్లా అథారిటీల సెక్రెటరీలు, తాలూకా కమిటీ అధ్యక్షులు న్యాయవాదులకు, కళాశాల విద్యార్థులకు, సంఘ సేవాసంస్థలకు, ధర్మాదాయ మరియు లోకోపకార సేవా సంస్థలకు మరియు యితర సంస్థలకు కూడా ప్రజాకోర్టులలో పాత్రవహించేట్లుగా చేయవచ్చును.

30. రాష్ట్ర అథారిటీకి వర్తమానం:

1. ప్రజాకోర్టులను యేర్పాటు చేసేందుకు ముందుగా హైకోర్టు కమిటీ/ జిల్లా అథారిటీ సెక్రెటరీగాని తాలూకా కమిటీ అధ్యక్షులు గాని, రాష్ట్ర అథారిటీకి,తత్సంబంధమైన ప్రతిపాదన గురించి వర్తమానం పంపించాలి. సమాచారాన్ని రాష్ట్ర అథారిటీకి యివ్వాలి.

   i) ప్రజాకోర్టును యేర్పాటు చేయడానికి ప్రతిపాదించిన స్థలము, మరియు తేది.

   ii) పైన 29(2) లో సూచించిన విధంగా యే సంస్థనైనా ప్రతిపాదించిన ప్రజాకోర్టుతో సాహచర్యానికి ఒప్పుకొన్నాయా;

   iii) ప్రజాకోర్టు ముందుంచడానికి ప్రతిపాదించబడిన కేసుల స్థాయి, వర్గీకరణ మరియు వాటి స్వభావాలు, అనగా విచారణలో వున్న కేసులా లేక కేసుకు అనుకూలమైనవా లేక రెండు రకాలూనా;

   iv) ప్రజాకోర్టు ముందుకు తేవడానికి ప్రతిపాదించబడిన కేసుల సంఖ్య;

   v) ప్రజాకోర్టు యేర్పాటుకు సంబంధించిన యితర సమాచారమేదైనా.

31. సంబంధిత కక్షిదారులకు నోటీసులు :

ప్రజాకోర్టును యేర్పాటు చేసిన హైకోర్టు కమిటీ/జిల్లా అథారిటీ సెక్రెటరీగాని, తాలూకా కమిటీ అధ్యక్షునిగాగాని, సంబంధిత ప్రతి కక్షిదారునకు తాను ప్రజాకోర్టుకు సిద్ధంగావటానికి తగినంత ముందుగా నోటీసు జారీ చేయాలి.

32. ప్రజాకోర్టు యేర్పాటు:

1. హైకోర్టు స్థాయిలో – హైకోర్టు కమిటీ సెక్రెటరీ ప్రజాకోర్టును యేర్పాటు చేస్తే యీ క్రింద పేర్కొనబడిన వారిలో యిద్దరు లేక ముగ్గురితో కూడిన ఒక ధర్మాసనాన్ని నియమిస్తారు.

   i) పదవిలో వున్న లేక రిటైరైన ఒక హైకోర్టు న్యాయమూర్తి.

   ii) న్యాయవాద వృత్తిలోని ఒక అనుభవజ్ఞులైన న్యాయవాది, మరియు

   iii) షెడ్యూల్డు కులాల, జాతుల, స్త్రీల, బాలల గ్రామీణ మరియు పట్టణ కార్మిక వర్గ మరియు యితర బలహీన వర్గాలకు చెందిన వారి అభ్యున్నతికై పాటు బడుతూ, న్యాయ సంబంధ సేవల పథకాల అమలులో మిక్కిలి ఆసక్తి కలిగి వున్న మరియు పేరు గల ఒక సంఘసేవకుడు/ సేవకురాలు.

2. జిల్లా స్థాయిలో – ప్రజాకోర్టు యేర్పాటు చేసినప్పుడు, జిల్లా అథారిటీ సెక్రెటరీ, యీ క్రింద వారిలో యిద్దరు లేక ముగ్గురితో కూడిన ఒక ధర్మాసనాన్ని నియమిస్తారు.

i) పనిచేస్తున్న లేక రిటైరైన ఒక న్యాయ శాఖాధికారి.

ii) స్థానిక న్యాయవాదుల సంఘంలోని ఒక సీనియర్ న్యాయవాది.

iii) షెడ్యూల్డు కులాల/జాతుల, స్త్రీల, బాలల గ్రామీణ మరియు పట్టణ కార్మిక వర్గాల మరియు యితర బలహీన వర్గాలకు చెందినవారి అభ్యున్నతి కోసం పాటుపడుతూ, న్యాయసంబంధ సేవల పథకాల అమలులో మిక్కిలి ఆసక్తి కలిగి వున్న మరియు పేరుగల ఒక సంఘ సేవకుడు/ సేవకురాలు

3. తాలూకా స్థాయిలో :

తాలూకా కమిటీ అధ్యక్షులు యీ క్రింద తెలుపబడిన వారిలో యిద్దరు లేక ముగ్గురితో కూడిన ఒక ధర్మాసనాన్ని నియమిస్తారు.

ఎ) పనిచేస్తున్న /రిటైరైన ఒక న్యాయశాఖాధికారి.

బి) స్థానిక న్యాయవాద సంఘములోని ఒక సీనియర్ మెంబరు.

సి) షెడ్యూల్డు కులాల / జాతుల, స్త్రీల, పిల్లల, గ్రామీణ పట్టణ కార్మిక వర్గ మరియు యితర బలహీన వర్గాలకు చెందిన వారి అభ్యున్నతికై పాటుబడుతున్న న్యాయ సంబంధ సేవల పథకాల అమలులో మిక్కిలి ఆసక్తి గల్గిన స్థానిక ప్రముఖ సంఘ సేవకుడు/సేవకురాలు.

4. హైకోర్టు కమిటీ అధ్యక్షులు, జిల్లా అథారిటీ అధ్యక్షులు మరియు తాలూకా కమిటీ అధ్యక్షులు ఆయా అథారిటీలు యేర్పాటు చేసిన ప్రజాకోర్టులను నేరుగా పర్యవేక్షింపవచ్చును.

33. ప్రజాకోర్టు నిర్వహించడంలో వుండవలసిన శ్రద్ధ:

ప్రతి ప్రజాకోర్టు, కోర్టుకు సంబంధించిన శ్రద్ధాభావంతో నడుపబడుతుంది. మరియు అర్భాటం లేకుండా చూడాలి.

34. ప్రజాకోర్టుకయ్యే ఖర్చు:

ప్రజాకోర్టును యేర్పాటు చేయడానికి, ప్రచారానికి కూడా కలుపుకొని మొత్తం ఖర్చు రూ. 1000/–లు మించకూడదు.

ప్రతిపాదించబడిన ప్రజాకోర్టు గురించిన ప్రచారం నిమిత్తం పత్రికల, రేడియో మరియు టెలివిజన్ వంటి ప్రచారసాధనాల ద్వారా అవసరమైన సహాయం తీసికొనవచ్చు.

రాజకీయేతర మరియు స్వచ్ఛంద సేవాసంస్థలు, ప్రజాకోర్టు ముందు హాజరైన జన సమూహానికి ఉచితంగా ఆహార పంపిణీ చేయడం ద్వారా, ప్రజాకోర్టు నిర్వహణలో భాగం పంచుకోవచ్చు.

35. రికార్డులను తెప్పించడం మరియు వాటి భద్రత గురించిన బాధ్యత:

1. ప్రజాకోర్టుకు చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం సూచింపబడిన విధంగా అపరిష్కృత కేసులకు సంబంధించిన రికార్డుల నిమిత్తం సంబంధిత న్యాయస్థానాలకు హైకోర్టు కమిటీ, జిల్లా అథారిటీ సెక్రెటరీ మరియు తాలూకా కమిటీ అధ్యక్షులను అడగవచ్చు.

2. దావా స్థాయికి చేరని కేసులేవైనా ప్రజాకోర్టుకు సూచించబడి వుంటే, హైకోర్టు కమిటీ జిల్లా అథారిటీ సెక్రెటరీ, తాలూకా కమిటీ అధ్యక్షులు ప్రజాపార్టీ ముందుంచడానికి, ప్రతికక్షిదారు నుండి వాంగ్మూలాన్ని తీసికొనాలి.

3. హైకోర్టు కమిటీ, జిల్లా అథారిటీ సెక్రెటరీ, తాలూకా కమిటీ అధ్యక్షులు సంబంధిత న్యాయస్థానాల నుండి తెప్పించుకొన్న రికార్డుల భద్రత గురించి మరియు తిరిగి వాటిని పంపే వరకు బాధ్యులు.

4. ప్రతి ఒక్క న్యాయాధికారి కోర్టుల రికార్డుల కదిలికల విషయంలో సహకారమందించాలి.

5. కేసుపరిష్కారమైనా కాకపోయినా, ప్రజాకోర్టు, ఆయాకేసులకు సంబంధించిన రికార్డులను, కేసుల ఫలితాలను తెలుపుతూ పది రోజులలో వాపసు చేయాలి.

36. ప్రజాకోర్టుల యొక్క పనితీరు:

1. ప్రజాకోర్టు యొక్క ఒక్కొక్క ధర్మాసనానికి హైకోర్టు కమిటీ/జిల్లా అథారిటీ సెక్రెటరీ / తాలూకా కమిటీ అధ్యక్షుల నిర్దిష్టమైన కేసులను అప్పగిస్తారు.

2. ప్రజాకోర్టు యొక్క ఒక్కొక్క ధర్మాసనానికి హైకోర్టు కమిటీ/జిల్లా అథారిటీ సెక్రెటరీ /తాలూకా కమిటీ అధ్యక్షులు కేసు లిస్టులను సిద్ధంచేసి ప్రజాకోర్టు ఏర్పాటుకు కనీసం రెండు రోజుల ముందు సంబంధిత వ్యక్తులకు వర్తమానం పంపించాలి.

3. ప్రజాకోర్టు యొక్క ప్రతి ధర్మాసనం తన ముందుంచిన ప్రతికేసులోనూ ఎటువంటి వత్తిడి కల్పించకుండా, ఎటువంటి బెదిరింపులుగాని, ప్రభావంగాని వుపయోగించకుండా ప్రలోభానికి లోనుకాకుండా మరియు తప్పుడు సమాచారం లేకుండా చూసి నిజాయితీగా సామరస్య పరిష్కారం కోసం ప్రయత్నాలు చేయాలి.

37. ప్రజాకోర్టును ఏర్పాటు చేయడం:

ఎ) ప్రజాకోర్టును యేర్పాటు చేసే హైకోర్టు కమిటీ/జిల్లా అథారిటీ సెక్రెటరీ / తాలూకా కమిటీ అధ్యక్షులు వారికి సబబు అని తోచిన విధంగా వీలైన సమయంలో, వీలయిన స్థలంలో ప్రధానంగా శనివారాలు, ఆదివారాలు, సెలవు దినాలలో నిర్వహిస్తారు.

బి) ప్రజాకోర్టు సాధారణంగా ప్రజలు యెక్కువగా చేరే స్థలంలో యేర్పాటు చేయబడుతుంది. (పబ్లిక్ ప్లేస్).

38. ప్రజాకోర్టు ద్వారా – రాజీగాని, పరిష్కారంగాని తేవడానికి అనుసరించాల్సిన పద్ధతి:

1. ప్రజాకోర్టు యిచ్చిన ప్రతి తీర్పు – సభ్యులందరి చేత సంతకం చేయబడాలి.

2. అసలు తీర్పు న్యాయశాఖ రికార్డులో ఒక భాగం అవుతుంది. దాని ప్రతులను ప్రజాకోర్టు సభ్యులచేత ధృవీకరణ అయిన తర్వాత సంబంధిత కక్షిదారులకు యివ్వాలి.

39. తీర్పు ఖచ్చితంగానూ, తేట తెల్లంగానూ వుండవలసిన అవసరం :

1. ప్రజాకోర్టు యొక్క ప్రతి తీర్పు స్థానిక కోర్టులలో వాడబడే భాషా సరళిలో ప్రస్ఫుటంగానూ మరియు ఖచ్చితంగానూ వుండాలి. తీర్పులు ఇంగ్లీషులో గాని, ప్రాంతీయ భాషలో గాని వుండవచ్చు.

2. ప్రజాకోర్టు యిచ్చిన తీర్పు మీద తగాదాలోని కక్షిదార్లు తమ తమ సంతకాలు చేయాలి. లేక వేలిముద్ర వేయాలి.

40. ఫలితాల వివరం:

హైకోర్టు కమిటీ/జిల్లా అథారిటీ సెక్రెటరీ / తాలూకా కమిటీ అధ్యక్షులు ప్రజాకోర్టు కార్యకలాపాల ముగింపు సమయంలో కేసుల ఫలితాల కూర్పును రాష్ట్ర అథారిటీకి సమర్పించడానికి సిద్ధం చేయాలి.

41. ప్రజాకోర్టు న్యాయమూర్తుల జాబితా నిర్వహణ:

హైకోర్టు కమిటీ / జిల్లా అథారిటీ సెక్రెటరీ / తాలూకా కమిటీ అధ్యక్షులు చట్టంలోని సెక్షన్ 28(0) ప్రకారం ప్రజాకోర్టులో పనిచేయు న్యాయమూర్తుల, న్యాయవాదుల, సంఘసేవకుల మొదలైన వారి నిర్ణీత విద్యార్హతలు మరియు అనుభవం, వివరాలతో వున్న జాబితాను నిర్వహించాలి.

42. ప్రజాకోర్టు న్యాయమూర్తులకు, మెంబర్లకు పారితోషికం :

1. పదవీ విరమణ చేసిన న్యాయాధికారి, ప్రజాకోర్టు న్యాయమూర్తికి యితర మెంబర్లకు వారి నివాసం నుండి ప్రజాకోర్టు స్థలం వరకు వాహనంగాని లేక రానుపోను అయ్యే ప్రయాణఖర్చులు.
2. i) ప్రజాకోర్టు జిల్లా లేక తాలూకా స్థాయిలో వుంటే, దాని నిర్వహణాధికారి పనిచేస్తున్న న్యాయాధికారి అయినట్లయితే, గౌరవ పారితోషికం రూ. 200/– రోజుకు చెల్లించబడుతుంది.

   ii) ఇతరమెంబర్లు జిల్లా మరియు తాలూకాల్లో ప్రజాకోర్టులు నిర్వహించినట్లయితే రోజుకు గౌరవవేతనం రూ. 125/– చెల్లించబడుతుంది.

   iii) హైకోర్టు స్థాయి ప్రజాకోర్టు నిర్వహణాధికారి – న్యాయమూర్తి ఇవ్వబడును. పదవిలో లేకున్నచో గౌరవ వేతనం రోజుకు మొత్తం మీద రూ. 300/–

   iv) హైకోర్టు స్థాయి ప్రజాకోర్టులోని యితర సభ్యులకు రోజుకు మొత్తం మీద రూ. 300/– గౌరవ పారితోషికం ఇవ్వబడును.

43. సెక్షన్ 20 క్రింద కేసులకు సంబంధించిన రికార్డులను నిర్వహించాల్సిన పద్ధతి:

1. హైకోర్టు కమిటీ సెక్రెటరీ లేక జిల్లా అథారిటీ సెక్రెటరీ లేక తాలూకా కమిటీ అధ్యక్షులు ప్రజాకోర్టుకు సూచించబడిన కేసుల వివరాలు యీక్రింద వివరణతో ఒక రిజిస్టర్‌లో పొందుపర్చాలి.

   i) స్వీకరించిన తేది.

   ii) కేసు యొక్క స్వభావం.

   iii) ఇంకా ఏమైనా అవసరమైన వివరాలు.

   iv) పరిష్కారమైన తేదీ మరియు కేసు తాలూకు ఫైలును తిరిగి పంపిన తేది

2. ప్రజాకోర్టు ఆఖరుగా కేసు ముగింపు అయిన తేదీని రిజిష్టరులో వ్రాయాలి.

44. బడ్జెట్:

1. హైకోర్టు కమిటీ/ జిల్లా అథారిటీ ప్రజాకోర్టుకు సంబంధించిన వార్షిక బడ్జెట్ ప్రతిపాదనకు రాష్ట్ర అథారిటీకి సమర్పిస్తారు.

2. ప్రజాకోర్టు పథకం యొక్క ఖర్చుల్లో నాన్‌ప్లాన్ ఖర్చులు వుండవచ్చు. వీటిని వారికి అందిన విధుల నుంచి ఖర్చుపెట్టుకొనవచ్చు.

45. జమా ఖర్చుల వివరణ:

1. హైకోర్టు జిల్లా, తాలూకా, కమిటీ అధ్యక్షులకు వారి సంస్థల జమాఖర్చులపై పూర్తి నియంత్రణ ఉంటుంది.
2. హైకోర్టు లేక జిల్లా కమిటీల కార్యదర్శులు వాస్తవికమైన జమాఖర్చుల వివరణను రాష్ట్ర అథారిటీకి ప్రతి మూడునెలలకు ఒకసారి పంపవలెను.
3. తాలూకా కమిటీ అధ్యక్షులు వారి అథారిటీ యొక్క జమాఖర్చులను ప్రతి నెలా అథారిటీకి పంపవలెను.

46. నిధుల ఏర్పాటు :

1. హైకోర్టు కమిటీ / జిల్లా అథారిటీ / తాలూకా కమిటీ వారి అభ్యర్థన మేరకు ప్రజాకోర్టు ఏర్పాటు మరియు నిర్వహణ నిమిత్తం రాష్ట్ర అథారిటీ ప్రత్యేక నిధులు విడుదల చేస్తుంది.

47. ఇతరములు:

1. పార్టీల తరపున ప్రజాకోర్టు ముందుకు వచ్చిన న్యాయవాది అభ్యంతర పెట్టబడగూడదు.
2. ప్రజాకోర్టు ముందుకు వచ్చిన కేసులకు సంబంధించిన పార్టీలు ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదు.
3. హైకోర్టు కమిటీ/ జిల్లా అథారిటీ సెక్రెటరీ / తాలూకా కమిటీ అధ్యక్షులు ప్రజాకోర్టుకు అవసరాన్ని బట్టి పూర్తి సహాయాన్ని అందించాలి.
4. ప్రతి ప్రజాకోర్టు ధర్మాసనం తన ముందున్న కార్య సరళి గురించి తన స్వంత పద్ధతినవలంబిస్తూ, సహజ న్యాయసూత్రాలను పాటించాలి. ఈ ప్రజాకోర్టు కార్యసరళి సివిల్ ప్రొసీజర్ కోడ్‌గాని, ఎవిడెన్స్ యాక్టు యొక్క పరిధిలో నిబద్ధమై వుండాల్సిన అవసరం లేదు.

48. నిరంతర అడ్వాన్సు:

1. రాష్ట్ర అథారిటీ జిల్లా న్యాయసేవా అథారిటీ వద్ద నిరంతరం రూ.5000/-లను అనుమతించబడిన ఖర్చుల నిమిత్తం అడ్వాన్సు రూపంలో వుంచుకొనుటకు అవకాశం కల్పించింది. ఈ ధనాన్ని ఎప్పటికప్పుడు జిల్లా న్యాయసహాయ నిధి నుంచి వాడుకునే అవకాశం కలిపిస్తుంది.
2. రాష్ట్ర అథారిటీ మండల న్యాయసేవాకమిటీ వద్ద నిరంతరం రూ.2500/-ను అనుమతించబడిన ఖర్చుల నిమిత్తం అడ్వాన్సు రూపంలో వుంచుకొనుటకు అవకాశం కల్పించింది. ఈ ధనాన్ని ఎప్పటికప్పుడు జిల్లా న్యాయసహాయ నిధి నుంచి వాడుకునే అవకాశం కలిపిస్తుంది.

*****

11. ఆంధ్రప్రదేశ్ దేవదాసీ (సమర్పణను నిరోధించు) చట్టం 1988

ఈ చట్టం స్త్రీలను దేవదాసీలుగా మార్చుటను నిరోధించడం కోసం మన రాష్ట్రంలో రూపొందించడమైనది. మన రాష్ట్రంలోని కొన్ని ప్రదేశాలలో స్త్రీలను హిందూ దేవతలకు, విగ్రహాలకు ఆరాధించే వస్తువులుగా దేవాలయాలలో మరియు ఇతర మత పరమైన ప్రదేశాలలో దేవదాసీలుగా సమర్పిస్తుంటారు. ఈ అలవాటు చాలా పురాతనమైనప్పటికీ, చాలామంది స్త్రీలను వ్యభిచారం మరియు ఇతర హీనమైన పనులకు బలవంతంగా నెట్టడం అనే ఈ హేయమైన చర్యను తుదముట్టించాల్సిన అవసరం వుంది.

1. 1. ఈ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ దేవదాసీ (సమర్పణను నిరోధించు) చట్టం 1988 అని పిలవవచ్చు.

2. ఈ చట్టం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికి వర్తిస్తుంది.

3. ఈ చట్టం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజపత్రంలో ముద్రించిన నాటినుండి అమలులోకి వస్తుంది.

2. ఈ చట్టంలో సందర్భానుసారం, ఏమైనా మార్పులుంటే తప్ప.

ఎ. 'సమర్పించు' అనగా స్త్రీలను హైందవ దేవతలకు ఏదొక ఆచారం పేరుమీద సమర్పించడం. స్త్రీలను విగ్రహాలుగా లేదా దేవాలయాల్లో ఇతర పూజా స్థలాల్లో పూజించేవస్తువుగా మార్చడం, స్త్రీలను గరుడ స్థంభంకి పూలదండతో కట్టివేయడం, ధారణ మరియు దీక్షను నిర్వహించడం.

బి. 'దేవదాసీ' అనగా ఎవరైనా స్త్రీని పైన ఉదహరించిన రీతిగా సమర్పించిన వారిని బసివి, జోగినీ, పార్వతి, మాతమ్మ, తైయమ్మగా పిలుస్తారు.

సి. 'ప్రభుత్వం' అనగా రాష్ట్ర ప్రభుత్వం.

డి. 'ప్రకటన' అనగా ఆంధ్రప్రదేశ్ రాజపత్రం ద్వారా ప్రకటించడం.

ఇ. 'స్త్రీ' అనగా వయస్సుతో నిమిత్తం లేని ఆడమనిషి

3. 1. ఈ చట్టం అమలులోనికి రాకమునుపు గానీ, వచ్చాక గానీ ఏ స్త్రీని అయినా ఆమె ఇష్టంతో సంబంధం లేకుండా దేవదాసీగా సమర్పించినట్లయితే అది చట్టవిరుద్ధం, మరియు చెల్లదు. దేవదాసీగా సమర్పించబడిన ఏ స్త్రీ అయినా వివాహానికి చెల్లదనడం చట్టరీత్యా నేరం.

2. హిందూ సమాజంలో అమలులో వున్న బోగం, కళావంతులు, సాని, నాగవాసులు, దేవదాసీ, కుర్మాపులు, బసివి, జోగిని, పార్వతి మరియు ఇతర ఆచారాల ద్వారా స్త్రీలతో నృత్యం చేయించుట లేదా వూరేగింపుల్లో ఇటువంటి నాట్యాలు చేయించుట ద్వారా ఆమెను వ్యభిచారిగా ప్రకటిస్తూ వివాహానికి అనర్హురాలు అని చేసే ఏ ఆచారమైన ఈ చట్టం అమలులోనికి రాకమునుపు లేదా అమలు లోనికి వచ్చిన తరువాత అయినా చట్టవిరుద్ధం మరియు చెల్లదు. దీనికి సంబంధిత స్త్రీయొక్క అభిప్రాయంతో పనిలేదు.

4. ఈ ఆచారం ద్వారా లేదా వాడుక ద్వారా మరియు చట్టానికి అనుగుణంగానయినా గాని దేవదాసీలకు జరుగు ఏవివాహమయినా చట్టబద్ధమే. తద్వారా కలిగే పిల్లలు కూడా సక్రమంగా కలిగిన పిల్లలుగా పరిగణించబడతారు.

5. ఏ వ్యక్తి అయినా ఒక స్త్రీని దేవదాసీగా సమర్పించుటకు సంబంధించి ఏ కార్యక్రమాన్ని నిర్వహించినా లేదా బలవంత పెట్టినా శిక్షకు పాత్రులు. అలాంటి వారికి 2 నుండి 3 సం॥ల వరకు జైలు శిక్ష మరియు రూ.2 వేల నుండి 3 వేల వరకు జరిమానా. పైన ఉదహరించిన రీతిలో ప్రవర్తించిన వ్యక్తి దేవదాసీగా చేయబడిన స్త్రీకి తండ్రి లేదా సంరక్షకుడు లేదా బంధువు అయిన ఎడల అట్టి వ్యక్తికి 2 సం॥ల నుండి 5 సం॥ ల వరకు జైలుశిక్ష మరియు 2 వేల నుంచి 5 వేల వరకు జరిమానా.

6. ఎవరైతే ఈ ఆచారాన్ని అనగా స్త్రీని దేవదాసీగా సమర్పించడాన్ని ప్రచారం చేస్తారో అట్టి వ్యక్తికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు వెయ్యి రూపాయల నుండి 2 వేల వరకు జరిమానా.

7. ఈ చట్టాన్ని అమలు అయ్యేటట్టు చూసే అధికారం ప్రభుత్వం కలెక్టర్‌కు, లేదా రెవెన్యూ శాఖలోని కనీస అధికారి అయిన మండల రెవెన్యూ అధికారికి అప్పగించడమైనది. సంబంధిత అధికారుల పరిధిలో ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయుట కొరకు వీరికి అధికారం కల్పించింది.

8. ఈ చట్టం అమలులోనికి వచ్చిన తర్వాత సెక్షన్ 7 ప్రకారం వీరి పరిధిలో దేవదాశీ వ్యవస్థ ఎక్కడైనా ఆచరణలో వున్నట్లు తెలిస్తే ఆ వ్యవస్థను తుదముట్టించాల్సిన చర్యలు సంబంధిత అధికారులు చేపట్టాలి.

9. ప్రభుత్వం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లకు,జ్యుడీషియల్ మొదటి తరగతి లేదా రెండవ తరగతి మేజిస్ట్రేట్ హోదాను కలిపిస్తూ వారు ఈ చట్టం క్రింద జరిగే నేరాలను విచారణ చేపట్టే అధికారాలను కూడా కల్పించింది. అట్టి అధికారాలు పొందిన ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సిఆర్‌పిసి 1973 ప్రకారం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా పరిగణించబడతారు.

10. ఈ చట్టం క్రింద ప్రతినేరం విచారించదగినది మరియు నాన్ బెయిలబుల్.

11. ఎ) ప్రభుత్వం ఈ చట్టం కొరకు నియమాలను తయారుచేసి ప్రకటన చేయాల్సిన అవసరముంది.

బి) ఈ చట్టంకింద చేసిన ప్రతి నియమాన్ని ఆ వెంటనే రాష్ట్ర శాసన సభ ముందు 14 రోజుల పాటు ఒకే సమావేశంలో గానీ, లేక రెండు అంతకుమించిన సమావేశాల్లోగానీ వుంచాలి. ఒక సమావేశం తరువాత రెండవ సమావేశం ముగిసేముందు, లేక ముందు చెప్పిన వరుస సమావేశాలు ముగిసేముందు సభ ఒక నియమాన్ని సవరించాలని గానీ, లేక అసలు ఆ నియమం వుండకూడదని కానీ నిర్ణయించిన పక్షంలో ఆ నియమం ఆ నిర్ణయం ప్రకారం సవరించిన రూపంలో అమలవుతుంది లేక రద్దయిపోతుంది. అయితే ఆ విధమైన సవరణ గానీ, రద్దు గానీ ఆ నియమం కింద అంతకుముందు చేసిన పనులపై ప్రభావం చూపించరాదు.

*****

12. సఫాయి కర్మచారులకు పని కల్పించడం, మట్టిదొడ్ల నిర్మాణ నిషేధ చట్టం 1993

సఫాయి కర్మచారీ వృత్తిని మరియు మట్టిదొడ్ల నిర్మాణాన్ని నిషేధించి సెప్టిక్ దొడ్ల నిర్మాణం, క్రమబద్ధీకరణ మరియు నిర్వహణకు అవకాశం కల్పించేందుకు ఏర్పడిన చట్టం.

రాజ్యాంగంలో పొందుపరచిన విధంగా వ్యక్తుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యతను ఈచట్టం గుర్తిస్తుంది.

అధ్యాయం - 1

ప్రాథమికం

1. చట్టం పేరు, పరిధి, అమలుతేది :

ఎ. ఈ చట్టాన్ని సఫాయి కర్మచారులకు పని కలిపించడం, మట్టిదొడ్ల నిర్మాణ నిషేధ చట్టం 1993గా పిలవవచ్చు.

బి. ఈ చట్టం ఆంధ్రప్రదేశ్, గోవా, కర్నాటక, మహారాష్ట్ర, త్రిపుర, పశ్చిమ బెంగాల్ మరియు అన్ని కేంద్ర పాలిత ప్రాంతాలు మరియు రాజ్యాంగంలోని 252 అధికరణం (1) ప్రకారం తీర్మానం చేస్కున్న ఇతర రాష్ట్రాలలో వర్తిస్తుంది.

సి. కేంద్ర ప్రభ్వుత్వం నోటిఫికేషన్ ద్వారా ప్రకటించిన తేదీనుంచి ఆంధ్రప్రదేశ్, గోవా, కర్నాటక, మహారాష్ట్ర, త్రిపుర, పశ్చిమ బెంగాల్, అన్ని కేంద్రపాలిత ప్రాంతాలు మరియు రాజ్యాంగంలోని 252 అధికరణం (1) ప్రకారం తీర్మానం చేసుకున్న రాష్ట్రాల్లో సంబంధిత తేదీల నుండి అమలులోకి వస్తుంది.

2. నిర్వచనాలు : సందర్భాన్ని బట్టి యితర అర్థం అవసరం అయితే తప్ప మిగతా అన్ని సందర్భాలలోనూ దిగువనిచ్చిన అర్థంలోనే చట్టం ఈ పదాలను వుపయోగిస్తుంది.

ఎ) ప్రాంతం – ఈ చట్టంలోని ఏ అంశంలోనైనా ప్రాంతం అంటే ఆయా అంశాలకు సంబంధించి అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా గుర్తించిన ప్రాంతం.

బి) భవనం – ఇల్లు, అవుట్ హౌస్, మరుగు దొడ్డి, మూత్రశాల, రేకులయిల్లు, గుడిసె, గోడ (ప్రహరీ గోడకాదు) లేదా సిమెంటు, యిటుకలు, చెక్క, లోహం తదితరాలతో నిర్మించిన ఏ కట్టడమైనా.

సి) డ్రై లెట్రిన్ – వాటర్ సీల్ లెట్రిన్ కాని లెట్రిన్‌లు.

డి) వాతావరణం – నీరు, గాలి, భూమి, మనుషులతో వాటి సంబంధం, యితర జీవులు, మొక్కలు, జీవరాశులు ఆస్తులు.

ఇ) వాతావరణాన్ని కలుషితం చేసేది – వాతావరణానికి హాని కల్పించే స్థాయిలో వున్న లేదా ప్రమాదం కల్పించే అవకాశం ఉన్న ఘన, ద్రవ, వాయు పదార్థం.

ఎఫ్) వాతావరణ కాలుష్యం – వాతావరణంలో కలుషిత పదార్థాలుండడం.

జి) కార్యనిర్వాహక అధికారి – సెక్షన్ 5 లోని 1వ సబ్‌సెక్షన్ ప్రకారం నియమితులైన కార్యనిర్వాహక అధికారి.

హెచ్) హడ్కో – హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్. ఇది 1956 కంపెనీల చట్టం కింద నమోదైన ప్రభుత్వ కంపెనీ.

ఐ) లెట్రిన్–మల విసర్జన కోసం – మలాన్ని సేకరించి ఎత్తిపోయడంకోసం సదుపాయాలున్న నిర్మాణం.

జె) సఫాయి కర్మచారి – చేతులతో మలాన్ని ఎత్తివేసే పనిలో నిమగ్నమైన లేదా నియమితమైన వ్యక్తులు. మాన్యువల్ స్కావెంజింగ్ అన్న పనిని కూడా పై విధంగానే అర్థం చేసుకోవాలి.

కె) నోటిఫికేషన్ – అధికారిక రాజపత్రంలో ప్రచురితమైన ప్రకటన

ఎల్) నిర్దేశిత – ఈ చట్టం ప్రకారం చేసిన నిబంధనలు

ఎమ్) రాష్ట్ర ప్రభుత్వం – కేంద్రపాలిత ప్రాంతాల రాజ్యాంగంలోని 239వ అధికరణం కింద నియమితమైన అధికారి.

ఎన్) వాటర్ సీల్ లెట్రిన్ – నీళ్ళతో శుభ్రం చేయగలిగిన శానిటరీ లెట్రిన్ – కనీసం 20 మిల్లీమీటర్ వ్యాసం కలిగిన రంధ్రం గుండా నీళ్ళను కొట్టడం ద్వారా మలాన్ని లోపలికి పంపించే అవకాశాలున్న లెట్రిన్.

అధ్యాయం - 2

3. సఫాయి కర్మచారులను పనిలో పెట్టుకోవడం నిషేధం :

1. ఈ చట్టంలోని (2) వ సబ్‌సెక్షన్, చట్టంలోని యితర అంశాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిన తేదీనుండి ఏ వ్యక్తి అయినా

   ఎ) చేతులతో మలాన్ని మోసేందుకు యితర వ్యక్తిని పనిలో పెట్టుకోవడం, నియమించడం, లేదా పనిలో పెట్టుకోవడానికి అనుమతినివ్వడం చేయరాదు.

   బి) మట్టిదొడ్లను నిర్మించడంగానీ, నిర్వహించడంగానీ చేయరాదు.

2. కింది పరిస్థితుల్లో తప్ప రాష్ట్ర ప్రభుత్వం (1) వ సబ్‌సెక్షన్ క్రింద నోటిఫికేషన్ జారీ చేయరాదు.

   i) పని చేయదలచుకొన్నట్టు 90 రోజులకు తక్కువ కాకుండా నోటీసును నోటిఫికేషన్ ద్వారా ఇచ్చి వుండాలి.

   ii) ఆ ప్రాంతంలో వాటర్ సీల్ లెట్రిన్‌ల వినియోగానికి తగినన్ని సదుపాయాలు వుండాలి.

   iii) ఆ ప్రాంతపు వాతావరణాన్ని, ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించి పెంపొందించడానికి యిలా చేయడం అవసరం.

4. మినహాయించే అధికారం :

ఏదైనా ప్రాంతాన్ని గానీ, భవనాల వర్గాన్ని కానీ, వ్యక్తుల సముదాయాన్ని గానీ ఈ చట్టం నుండి, లేదా చట్టంలోని ఏదైనా అంశం, నియమం నుండి గానీ, వాటికి అనుగుణంగా జారీచేసిన రూల్, ఉత్తర్వుల, నోటిఫికేషన్, పథకం నుండి మినహాయించిన అవసరం వుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తే ఒక సాధారణ లేదా ప్రత్యేకమైన ఉత్తర్వు ద్వారా మినహాయింపును యివ్వవచ్చు.

అధ్యాయం - 3

అమలు చేసే అధికారులు - పథకాలు

5. కార్యనిర్వహణ అధికారుల నియామకం – వారి అధికారాలు – బాధ్యతలు :

1. అధికారిక గజిట్‌లో ప్రచురితమైన వుత్తర్వు ద్వారా జిల్లా మెజిస్ట్రేట్‌ను లేదా సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్‌ను ఆ వుత్తర్వులు పేర్కొన్న ప్రాంతంలో కార్యనిర్వాహక అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించవచ్చు. ఆ ఉత్తర్వులో ఆ అధికారి బాధ్యతలు, అధికారాలను పేర్కొనాలి. ఆ విధంగా నియమితులైన అధికారులు పేర్కొన్న ప్రాంతంలో తమ అధికారాలను, బాధ్యతలను నిర్వర్తిస్తారు.
2. సబ్ సెక్షన్ (1) ప్రకారం నియమితులైన కార్యనిర్వాహక అధికారి యితర అధికారులు ఆచరణ యోగ్యమైన మేరకు ఆ ప్రాంతంలో సఫాయి కర్మచారులకు పునరావాసం కల్పించడానికి వారి సంక్షేమాన్ని మెరుగుపర్చడం కోసం పనిచేయాలి.

6. పథకాలను రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం :

1. డ్రై లెట్రిన్‌లను వాటర్ సీల్ లెట్రిన్‌లుగా మార్చడానికి, వాటర్ సీల్ లెట్రిన్‌లను నిర్మించి నిర్వహించడానికీ, సఫాయి పనిలో ఉన్న వ్యక్తులకు పునరావాసం కల్పించడానికీ ఒకటి కానీ ఎక్కువగానీ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించవచ్చు. సెక్షన్ 3 సబ్ సెక్షన్ (1) కింద జారీ అయిన నోటిఫికేషన్ ప్రకారం వివిధ ప్రాంతాలకు సంబంధించి, చట్టంలోని వివిధ ప్రయోజనాలకు సంబంధించి ప్రత్యేక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించవచ్చు. హడ్కో ఆర్థిక సహాయం అవసరం లేని పథకాలను హడ్కోతో సంప్రదించకుండానే రూపొందించవచ్చు.

2. అటువంటి పథకాలు

సాధారణ అధికారానికి ఏ విధమైన ఆటంకం లేకుండానే కింద పేర్కొన్న అంశాలను నిర్దిష్టంగా పేర్కొనవచ్చు.

ఎ. డ్రై లెట్రిన్‌లను వాటర్ సీల్ లెట్రిన్‌గా మార్చడానికి నిర్దిష్ట కాలపరిమితిగల కార్యక్రమాన్ని రూపొందించడం.

బి. స్థానిక సంస్థలకు, ఏజెన్సీలకు తక్కువ ఖర్చుతో మరుగు సదుపాయాలను కలిగించడానికి సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని అందించడం.

సి. సామూహిక మరుగుదొడ్లను నిర్మించి వాటి వినియోగదారుల నుండి రుసుము వసూలు చేసే విధంగా నిర్వహించడం.

డి. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన తరగతుల వారికోసం ఉమ్మడి మరుగుదొడ్లను నిర్మించి నిర్వహించడం.

ఇ. సఫాయి కర్మచారుల నమోదు, పునరావాసం.

ఎఫ్. సెప్టిక్ దొడ్ల నిర్మాణం యొక్క విధి విధానాలు రూపొందించడం.

జి. మట్టి దొడ్లను సెప్టిక్ దొడ్లుగా మార్చుట కొరకు విధానాలను రూపొందించడం.

హెచ్. సామూహిక లేదా ఉమ్మడి మరుగుదొడ్లలో రుసుము వసూలు చేయడానికి లైసెన్సులు యివ్వడం.

7. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలనిచ్చే అధికారం :

ఈ చట్టం నుండి సంక్రమించిన బాధ్యతలు, అధికారాలను వినియోగించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఏ వ్యక్తికైనా, అధికారులు, స్థానిక అధికారులకు రాత పూర్వకమైన నిర్దేశాలను యివ్వవచ్చు. ఆ వ్యక్తి లేదా అధికారి లేదా స్థానిక అధికారి ఆ నిర్దేశాలకు కట్టుబడి పనిచేయాలి. ఈ చట్టంలోని యితర అంశాలు మినహా మరే చట్టంలోని అంశాలు దీనికి ఆటంకంగా వుండవు.

8. కార్యనిర్వాహక అధికారులు, ఇన్స్పెక్టర్లు, అధికారులు, యితర ఉద్యోగులు, ప్రజాసేవకులుగా వుండాలి :

కార్యనిర్వాహక అధికారులందరూ, మిగతా అధికారులు, సెక్షన్ (5) లోని సబ్ సెక్షన్ (1) ప్రకారం నిష్ణాతులైన నిర్దిష్ట అధికారాలున్న యితర ఉద్యోగులు సెక్షన్ 9 సబ్ సెక్షన్ (1) ప్రకారం నియమితులైన ఇన్స్పెక్టర్లు లేదా ఈ చట్టం ప్రకారం రూపొందించిన పథకాన్నీ, ఉత్తర్వులను అమలు చేయడానికి నియుక్తులైన అధికారులు ఈ చట్టంలోని అంశాలనూ, పథకాలనూ, ఉత్తర్వులనూ అమలు చేసేటప్పుడు భారత శిక్షాస్మృతి (ఐ.పి.సి. 45 ఆఫ్ 1860) లోని 21వ సెక్షన్‌లో పేర్కొన్న అర్థంలో ప్రజాసేవకులు (ఉద్యోగులు) గా పరిగణించబడతారు.

9. ఇన్స్పెక్టర్ల నియామకం ప్రవేశ, పర్యవేక్షణ అధికారాలు :

1. ఈ చట్టాన్ని అమలు చేయడానికి తగిన వారిని రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఇన్స్పెక్టర్‌గా నియమించి వారి అధికార పరిధులను నిర్వచిస్తుంది.
2. కార్యనిర్వాహక అధికారి పరిధిలో నియమితులయ్యే ఇన్స్పెక్టర్లందరు ఆ అధికారి కింద పనిచేసే ఉద్యోగులు.
3. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టం ప్రకారం చేసిన నిబంధనలకు అనుగుణంగా ఇన్స్పెక్టర్లు తమ పరిధిలోని ఏ ప్రదేశంలోనైనా సహేతుకమైన సమయంలో ఈ కింది విధుల నిర్వహణ కోసం హాజరవ్వవచ్చు.

   (అ) కార్యనిర్వాహక అధికారి తనకు అప్పజెప్పిన కర్తవ్యాలను నిర్వర్తించడానికి

   (ఆ) అటువంటి కర్తవ్యాల నిర్వహణ జరుగుతుందా, జరిగితే ఏ విధంగా జరుగుతున్నాయి, ఈ చట్టంలోని అంశాలు, లేదా నిబంధనలు, ఉత్తర్వులు, పథకాలు లేదా నోటీసు, నిర్దేశాలు, మొదలైనవి అమలవుతున్నాయా అని ధృవపర్చుకోడానికి

   (ఇ) ఈ చట్టం ప్రకారం లేదా నిబంధనలు, పథకాలు, ఉత్తర్వులకు భిన్నంగా ఏదైనా నేరం జరిగినప్పుడు, జరుగుతున్నప్పుడు, జరగబోతున్నదని తెలిసినప్పుడు ఏ భవనంలోకైనా ప్రవేశించి పర్యవేక్షించే అధికారం ఇన్స్పెక్టర్లకు వుంది. అదేవిధంగా వాతావరణ కాలుష్యాన్ని నిరోధించడానికి కూడా భవనాల, లెట్రిన్‌ల పర్యవేక్షణ చేయాలి.

10. నిర్దిష్టమైన కేసుల్లో వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ఎగ్జిక్యూటివ్ (కార్య నిర్వాహక) అధికారికి వున్న అధికారాలు :

(1) సెక్షన్ 3 లోని అంశాల ప్రకారం కాలుష్యం జరుగుతోందని ఎవరి ద్వారానైనా తెలిసినా, ఇన్స్పెక్టర్

నివేదిక అందినా లేదా ఫిర్యాదులు అందినా లేదా యితర విధాలుగా తెలుసుకున్న సందర్భాలలో ఎగ్జిక్యూటివ్ అధికారి ఆ ఆవరణ యజమాని లేదా ఆక్రమణదారును నిర్ధిష్ట కాలపరిమితిలో కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకొనవలసినదిగా ఆదేశించవచ్చు. ఆ యజమాని గానీ, ఆక్రమణదారుగానీ తన స్వంత ఖర్చు పైన నివారణ, నిరోధక చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేయవచ్చు.

(2) సబ్ సెక్షన్ (1) లో పేర్కొన్న నివారణ చర్యల నిమిత్తం ఎగ్జిక్యూటివ్ అధికారి ఏమైనా ఖర్చు చేస్తే ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రోజు నుండి వడ్డీతో సహా యజమాని, లేదా ఆక్రమణదారు నుండి వసూలు చేయాలి. భూమి శిస్తును వసూలు చేసినట్టుగానే దీన్నీ వసూలు చేయాలి.

11. నిర్ధిష్టమైన సందర్భాలలో హడ్కో విధులు :

(1) హడ్కో నియమ నిబంధనలు, దాని అధికరణలతో సంబంధం లేకుండానే లేదా నగరాభివృద్ధి పథకాలతో సంబంధం లేకుండానే అర్హత వున్న కేసుల్లో వాటర్ సీల్ లెట్రిన్ నిర్మాణానికి సెక్షన్ 6 ప్రకారం రూపొందించే పథకాలకు తగిన ధనసహాయం చేయడం హడ్కో విధి.

(2) సబ్ సెక్షన్ (1) లో పేర్కొన్న ధన సహాయాన్ని హడ్కో నిర్దిష్ట షరతులతో (సులభ, రాయితీలతో కూడిన వడ్డీ వంటివి) అందించవచ్చు.

12. రుసుము వసూలు చేసే అధికారం :

ఈ చట్టంకింద ప్రభుత్వం రూపొందించే పథకాలకు చట్టంలో స్పష్టంగా, నిర్దిష్టంగా పేర్కొనక పోయినప్పటికీ కింద సందర్భాలలో రుసుము వసూలు చేసే అధికారం ప్రభుత్వానికి వుంది.

అ) రుసుము చెల్లించి వుపయోగించుకొనే ప్రాతిపదికన నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు

ఆ) ఉమ్మడి మరుగుదొడ్లు

ఇ) డాక్యుమెంట్లు, ఉత్తర్వులు, ఉల్లేఖనాల ప్రతులను సరఫరా చేసేటప్పుడు లేదా

ఈ) వాటర్ సీల్ లెట్రిన్‌ల నిర్మాణానికి కాంట్రాక్టర్లకు లైసెన్స్ యిచ్చేటప్పుడు

ఉ) అధికారులు, కమిటీలు అందించే సేవల సందర్భంలో అవసరమైనదిగా భావించిన అంశాలకు ప్రజా ప్రయోజనం రీత్యా అవసరమని రాష్ట్ర ప్రభుత్వం భావించిన సందర్భాలలో అధికారిక గజిట్‌లో సాధారణ, లేదా ప్రత్యేక ఉత్తర్వు ద్వారా రుసుము చెల్లింపునకు మినహాయింపును ప్రకటించవచ్చు.

13. కమిటీల ఏర్పాటు :

(1) కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా కింది కమిటీలను ఏర్పాటు చేయవచ్చు.

అ) దేశంలో వాటర్ సీల్ లెట్రిన్‌ల నిర్మాణం కోసం పథకాలను రూపొందించేందుకు ఒకటి గానీ అంతకన్న ఎక్కువగానీ ప్రాజెక్టు కమిటీలను ఏర్పాటు చేయవచ్చు.

ఆ) పథకాల అమలును పర్యవేక్షించడానికి పర్యవేక్షక కమిటీ (ఒకటి గానీ అంతకన్నా ఎక్కువ గానీ) లను ఏర్పాటు చేయవచ్చు.

ఇ) చట్టంలోని నిర్ధిష్ట అంశాల కోసం యితర కమిటీలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. దానికి తగిన పేరు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించవచ్చు.

(2) కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీల అధికారులు, విధులు సభ్యుల నియామకానికి సంబంధించిన నియమ నిబంధనలు కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న పద్ధతిలోనే వుంటాయి.

(3) సబ్ సెక్షన్ (1) ప్రకారం ఏర్పడిన కమిటీ సభ్యులకు సమావేశాలకు హాజరు అయ్యేందుకు అలవెన్సులు, చెల్లించడాన్ని నిర్ణయించవచ్చు.

(4) రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా కింది కమిటీలను ఏర్పాటు చేయవచ్చు.

అ) సెక్షన్ 3 లోని సబ్ సెక్షన్ (1) ప్రకారం రాష్ట్రంలో వాటర్‌సీల్ లెట్రిన్ నిర్మాణానికి సఫాయి కర్మచారుల పునరావాసానికీ రూపొందించిన పథకాల అమలు సమన్వయం చేయడానికీ, పర్యవేక్షించడానికి రాష్ట్ర సమన్వయ కమిటీలను ఒకటి గానీ అంతకన్నా ఎక్కువ గానీ ఏర్పాటు చేయవచ్చు.

ఆ) అవసరమైన యితర కమిటీలను అవసరమైన పేర్లతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు.

(5) రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీలు వాటి అధికారులు, సభ్యుల నియామకానికి సంబంధించిన నియమ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తుంది.

(6) సబ్ సెక్షన్ 4 ప్రకారం ఏర్పాటైన కమిటీ సభ్యులు సమావేశాలకు హాజరయ్యేందుకు అలవెన్సులను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించవచ్చు.

అధ్యాయం - 4

శిక్షలు, చర్యలు

14. ఈ చట్టంలోని అంశాలను, నిబంధనలను, ఉత్తర్వులను, పథకాలను ఉల్లంఘిస్తే శిక్షలు :

ఈ చట్టంలోని అంశాలను, నిబంధనలను రూపొందించిన పథకాలను, ఉత్తర్వులు, నిర్దేశాలను ఉల్లంఘిస్తే ఒక సంవత్సరం జైలు శిక్షగాని లేదా రెండువేల రూపాయల వరకూ జరిమానా కాని లేదా జైలు, జరిమానా రెండింటికి శిక్షార్హులు. శిక్షపడిన తర్వాత కూడా ఉల్లంఘన యింకా కొనసాగుతుంటే కొనసాగినంతకాలం ప్రతిరోజుకు వందరూపాయలు అదనపు జరిమానా చెల్లించాలి.

15. కంపెనీల ద్వారా నేరాలు :

(1) ఈ చట్టం ప్రకారం ఏదైనా కంపెనీ ద్వారా నేరం జరిగితే ఆ కంపెనీ ఇన్‌ఛార్జి నేరం జరిగినప్పుడు కంపెనీ వ్యవహారాల నిర్వహణకు బాధ్యులైన వ్యక్తులు చట్టబద్ద చర్యలకు, శిక్షకు అర్హులు. ఆ వ్యక్తి తనకు తెలియకుండా ఈ నేరం జరిగిందని రుజువు చేసుకొంటే లేదా అటువంటి నేరం జరగకుండా వుండడానికి అన్ని చర్యలూ చేపట్టామని రుజువు చేసుకొంటే ఈ శిక్షల నుండి మినహాయింపు యివ్వవచ్చు.

(2) ఈ చట్టం ప్రకారం ఏదైనా నేరానికి ఏదైనా కంపెనీ పాల్పడితే ఆ నేరం డైరెక్టర్, మేనేజర్, మేనేజింగ్ ఏజెంట్, లేదా యితర అధికారిక సమ్మతంతో, లేదా తెలిసి లేదా నిర్లక్ష్యం కారణంగా జరిగిందని రుజువైతే ఆ అధికారి నేరస్తుడు. ఆ అధికారి విచారణకు శిక్షకు అర్హుడు.

వివరణ : ఇక్కడ "కంపెనీ" అంటే ఏదైనా కార్పొరేట్ నిర్మాణం, ఒక ఫర్మ్‌గానీ లేదా వ్యక్తుల సంఘంగానీ కంపెనీయే. డైరెక్టర్ అంటే ఫర్మ్‌కు సంబంధించి ఆ ఫర్మ్ భాగస్వామి.

16. శిక్షించదగిన నేరాలు :

1973 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌తో సంబంధం లేకుండా ఈ చట్టం ప్రకారం జరిగిన నేరాలన్నీ శిక్షంచదగిన నేరాలే.

17. నేర విచారణ పరిధి :

(1) మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, లేదా ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు తక్కువ హోదా కలిగిన ఏ కోర్టు ఈ చట్టం కింద జరిగిన నేరాలను విచారించకూడదు.

(2) ఈ చట్టం ప్రకారం జరిగిన నేరాలపైన విచారణను ఎగ్జిక్యూటివ్ అధికారి ద్వారా మాత్రమే నిర్వహించాలి.

(3) ఈ చట్టం ప్రకారం జరిగిన ఏ నేరాన్నైనా ఎగ్జిక్యూటివ్ అధికారి సాధారణ, లేదా ప్రత్యేకంగా ఆథరైజ్ చేసిన ఫిర్యాదును ఆయా వ్యక్తుల నుండి అందుకోకుండా గర్తింపునకు ఏ కోర్టు స్వీకరించరాదు.

18. నేర విచారణ పరిమితి :

ఈ చట్టం ప్రకారం నేరం జరిగిన లేదా ఫిర్యాదుదారుకి నేరం జరిగినట్లు తెలిసిన 3 నెలలలోపు చేసిన ఫిర్యాదులనే కోర్టు గుర్తింపులోకి తీసుకోవాలి.

అధ్యాయం - 5

యితరములు

19. సమాచారం, నివేదికలు లేదా బదులు :

ఈ చట్టానికి సంబంధించిన విధులను గురించి ఎప్పటికప్పుడు ఏ వ్యక్తినుండైనా, అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం నుండైనా ఏదైనా నివేదిక, గణాంకాలు, బదులు, లెక్కలు యితర సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వం అడగవచ్చు. ఆ వ్యక్తులు, అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం లేదా యితర అధికారి అందుకు కట్టుబడి వుండాలి.

20. సరైన చర్య అని నమ్మి చేసిన దానికి రక్షణ :

ఈ చట్టం ప్రకారం రూపొందించిన పథకాలను అమలుచేసే విషయంలో, చట్టం ప్రకారం రూపొందిన నిబంధనలు, పథకాలను అమలు చేస్తున్న సందర్భంగా చేసిన లేదా చేయాలనుకున్న పనులకు సంబంధించి (చట్టాన్ని దాని ప్రకారం రూపొందిన పథకాలు, నిబంధనలను అమలు చేయడంలో సరైన చర్య అని నమ్మి చేసిన పనులకు సంబంధించి) ప్రభుత్వం, లేదా ఎవరైనా అధికారి, ప్రభుత్వ ఉద్యోగి లేదా ఈ చట్టం ప్రకారం రూపొందిన యితర అధికారిక వ్యవస్థలపైన ఎటువంటి కేసు, లేదా యితర చట్టబద్ధ చర్యలు చేపట్టరాదు.

21. ఈ చట్టానికి భిన్నంగా వుండే యితర చట్టాలు, ఒప్పందాల ప్రభావం:

(1) రెండవ సబ్‌సెక్షన్ ప్రకారం ఈ చట్టంలోవున్న అంశాలు, నిబంధనలు దీని ప్రకారం రూపొందించిన పథకాలు, ఉత్తర్వులపైన మరే యితర చట్టాల ప్రభావము ఉండదు. ఆచారాలు, సంప్రదాయాలు, ఒప్పందాలు, కాంట్రాక్టులు లేదా యితర అంశాలు చెల్లవు. ఈ చట్టంలో వున్న అంశాలతో యితర చట్టాల్లో వుండే అంశాలు భిన్నంగా వుంటే ఈ చట్టంలోని అంశాలనే పరిగణలోకి తీసుకోవాలి.

(2) ఏదైనా ఒక చర్య ఈ చట్టం ప్రకారం కూడా శిక్షార్హమైన నేరం అయినప్పుడు, అదే సమయంలో యితర చట్టాల ప్రకారం కూడా శిక్షార్హమైన నేరం అయినప్పుడు, ఆ నేరానికి సంబంధించి ముద్దాయి నేరస్తుడిగా రుజువైతే ఆ వ్యక్తిపైన ఈ చట్టం ప్రకారం కాక యితర చట్టం ప్రకారం శిక్షను విధించాలి.

22. నిబంధనలను రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వ అధికారం :

(1) ఈ చట్టంలోని అంశాలను అమలుచేయడానికి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా నిబంధనలను రూపొందిచవచ్చు.

(2) సాధారణ అధికారాలకు భంగం వాటిల్లకుండా కింది అంశాలకు సంబంధించి నిబంధనలు చేయవచ్చు.

i) ప్రాజెక్టు కమిటీలు, పర్యవేక్షణ కమిటీలు, యితర కమిటీలను కేంద్ర ప్రభుత్వం 13వ సెక్షన్‌లోని 1వ సబ్ సెక్షన్ ప్రకారం ఏర్పాటు చేయడం, వాటి అధికారాలు, విధులు, సభ్యుల సంఖ్య, వాని నియామకానికి నియమ నిబంధనలు యితర సంబంధిత అంశాలు.

ii) 13వ సెక్షన్‌లోని 1వ సబ్ సెక్షన్ ప్రకారం ఏర్పాటైన కమిటీల సభ్యులకు చెల్లించవలసిన అలవెన్సులు యితర చెల్లింపులు.

(3) ఈ చట్టానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతి రూల్‌ను దాన్ని రూపొందించిన వెంటనే 30 రోజులకు తక్కువ కాకుండా సెషన్స్ జరుగుతున్నప్పుడు పార్లమెంటు ఉభయ సభల ముందు ఈ నిబంధనలను వుంచాలి. పార్లమెంటు ఉభయ సభలు ఆ నిబంధనలను సవరించడానికి గానీ లేదా అమలు చేయకుండా వుండడానికి గానీ ఆమోదించాలి. ఆనాటి నుండి నిబంధన సవరించిన రూపంలో అమలులోకి వస్తుంది. అయితే అటువంటి సవరణ జరగకముందు ఈ నిబంధన ప్రకారం జరిగిన వాటిపైన సవరణ ప్రభావం వుండదు.

23. రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను రూపొందించే అధికారం :

(1) ఈ చట్టంలోని అంశాలను అమలు చేయడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా నిబంధనలను రూపొందించవచ్చు.

(2) కింద పేర్కొన్న అంశాలపై నిబంధనలను రూపొందించవచ్చు.

(i) రాష్ట్ర సమన్వయ కమిటీలు, యితర కమిటీలు సెక్షన్ 13లో సబ్ సెక్షన్ (4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం, ఆ కమిటీల అధికారాలు, విధులు, ఆ కమిటీల్లో సభ్యుల సంఖ్య, సభ్యుల నియామకానికి సంబంధించిన నియమ నిబంధనలు గురించి

(ii) సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4) ప్రకారం ఏర్పాటైన కమిటీల సభ్యులకు అలవెన్సులు చెల్లించే విషయంపైన

(iii) ఇతర అవసరమైన అంశాలు.

(3) ఈ చట్టం ప్రకారం రూపొందించిన ప్రతి నిబంధనను, పథకాన్ని దాన్ని రూపొందించిన వెంటనే రాష్ట్ర శాసనసభ ముందుంచాలి.

24. అవరోధాలను తొలగించే అధికారం :

(1) ఈ చట్టాన్ని అమలు చేసే విషయంలో ఏదైనా సమస్య తలెత్తితే ఆ సమస్యలను తొలగించడానికి ఈ చట్టంలోని అంశాలకు భంగం వాటిల్లకుండా తగిన అధికారాలను కేంద్ర ప్రభుత్వం అధికారిక గజిట్‌లో ఉత్తర్వు ప్రచురించడం ద్వారా కల్పించవచ్చు. ఈ చట్టం ఒక రాష్ట్రంలో అమలులోకి వచ్చిన 3 సంవత్సరాల తర్వాత ఆ రాష్ట్రానికి సంబంధించిన ఏ ఉత్తర్వు చేయరాదు.

(2) ఈ సెక్షన్ ప్రకారం చేసిన ఉత్తర్వులను వెంటనే పార్లమెంటు ఉభయ సభల ముందుంచాలి.

*****

13. అనైతిక కార్యకలాపాలపై వ్యక్తుల తరలింపు నిషేధ చట్టం 1956

21వ శతాబ్దం తొలి రోజుల్లో ఐరోపా దేశాల్లో ప్రధానంగా ఇంగ్లాండ్‌లో సోషల్ ప్యూరిటి ఉద్యమం జరిగింది. ఐరోపా ఏమనుకుంటే మిగిలిన ప్రపంచమంతా అదే అనుకోవాల్సిన రోజులవి. ఈ సోషల్ ప్యూరిటి ఉద్యమంలో భాగంగానే 1950 వ దశకంలో స్త్రీలు, బాలికల 'అనైతిక' తరలింపును అరికట్టాలనే ఆలోచన మొదలైంది. 1950 సంవత్సరంలో ఒక అంతర్జాతీయ ఒప్పందం కుదిరింది. భారత్ కూడా అందులో భాగస్వామి అయిన సందర్భంగా వ్యక్తుల అనైతిక తరలింపు చట్టం, 1956 ని రూపొందించారు. ఈ చట్టం అమల్లోకి వచ్చే నాటికి దేవదాసీ వ్యవస్థ, బోగం వృత్తి వంటి వ్యవస్థలు, ఆచారాలకు వ్యతిరేకంగా సంఘ సంస్కరణ ఉద్యమం మన దేశంలో కూడా జరిగింది. అయితే దాన్ని వ్యభిచారమనండి, సెక్స్ వర్క్ అనండి మరింకా ఏ పేరైనా పెట్టండి అది ఆ నాటికి చట్ట విరుద్ధం కాదు. ఆయా ప్రాంతాల్లో దేవదాసీ వ్యవస్థను, వేశ్యల రాకపోకలను నియంత్రించే ప్రాంతీయ శాసనాలు కొన్ని మాత్రమే ఉండేవి. వ్యక్తుల అనైతిక తరలింపు నివారణ చట్టం, 1956 రూపంలో మొదటిసారి దేశమంతటికి వర్తించే శాసనం ఒకటి వచ్చి కూర్చుంది. ఈ చట్టాన్ని 1978, 1986 లలో రెండుసార్లు సవరించారు. 1986 సవరణ వచ్చేంతవరకు స్త్రీలు, బాలికల తరలింపును మాత్రమే నేరంగా గుర్తించేది ఈ చట్టం. ఈ సవరణ తర్వాత స్త్రీ పురుషులు ఇరువురి తరలింపుని నేరంగా పరిగణిస్తారు.

ఈ చట్టం వ్యభిచారాన్ని సంపూర్ణంగా నిషేధించదు. కేవలం బహిరంగ ప్రదేశాల్లో వ్యభిచారాన్ని నిషేధిస్తుంది. సెక్షన్ 7 కింద బహిరంగ ప్రదేశానికి కనుచూపు మేరలో వ్యభిచారం చేయడం నేరం. సెక్షన్ 8 విటులను ఆకర్షించే ఉద్దేశంతో బహిరంగ ప్రదేశంలో తచ్చట్లాడే స్త్రీలపై చర్య తీసుకుంటుంది. ఈసెక్షన్లు కింద 'బహిరంగ ప్రదేశం' అనే పదాన్ని అనేక రకాలుగా నిర్వచించవచ్చు. కోర్టులు కూడా తమకు నచ్చిన విధంగా ఆ పదాన్ని నిర్వచిస్తూ వచ్చాయి. ఇక ఈ చట్టం కింద అత్యధికం కేసులను సెక్షన్ 7, 8 ల కిందే నమోదు చేస్తున్నారు. వ్యభిచారం ద్వారా స్త్రీల దోపిడీని అరికట్టడానికి ఉద్దేశించిన ఈ చట్టం అంతిమంగా వారినే నేరస్తులుగా గుర్తించి శిక్షార్హులను చేస్తోంది.

ఈ చట్టంలో సెక్షన్ 3 వేశ్యాగృహం నడిపే వారిని, సెక్షన్ 4 ఒక వేశ్యపై ఆధారపడి బ్రతికే వారిని, సెక్షన్ 5 వేశ్యావృత్తిలో దింపడానికి వ్యక్తులను సేకరించే వారిని, సెక్షన్ 6 వేశ్యా వృత్తిలో దింపే ఉద్దేశంతో ఒక వ్యక్తిని నిర్బంధించే వ్యక్తిని నేరస్తులుగా గుర్తించి శిక్షలు విధిస్తుంది. అవడానికి ఇవి ట్రాఫికింగ్‌కి పాల్పడే వారిపై శిక్షలు విధించే అంశాలు. కాని వాటి కింద కూడా బాధితులు, బాధితుల పిల్లల్ని నేరస్తులుగా పరిగణించి శిక్షలు విధించేస్తున్నారు. ఉదాహరణకు సెక్షన్ 4 కింద తన ఆదాయంపై తాను ఆధారపడినందుకు సెక్స్ వర్కర్‌కి శిక్ష విధించిన సందర్భాలున్నాయి. అదే విధంగా 18 ఏళ్ల నిండిన ఆమె పిల్లలపై కూడా ఈ సెక్షన్‌ని ప్రయోగించారు.

వ్యభిచారంలో చిక్కుకుని పోయిన స్త్రీల రక్షణ కోసం ఈ చట్టం ఒక వ్యవస్థను రూపొందించింది. వారిని రక్షణ గృహాల్లో, దిద్దుబాటు సంస్థల్లో నిర్బంధించడం ఒకానొక పరిష్కారంగా భావిస్తుంది. తార్పుడు గాళ్లు, వేశ్యా గృహాలు నడిపేవారు, బ్రోకర్లు మొదలైన వారిని 'సంస్కరించే' కంటే ఆ స్త్రీలను నిర్బంధించి 'సంస్కరించే' పనికి పూనుకుంది ఈ చట్టం. గ్రామస్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు పకడ్బందీగా పనిచేసే

ప్రమాదకరమైన ట్రాఫికింగ్ నెట్‌వర్క్‌ని పైపైన తడిమే ప్రయత్నం కూడా ఈ చట్టం చేయలేదు. అటువంటి బడా మాఫియాలను వదిలేసి ఈ చట్టాన్ని కూటికి గతిలేక ఒళ్లు అమ్ముకు బ్రతికే వారిపై ప్రయోగిస్తున్నారు. ఇంతకంటే విషాదం ఇంకేమైనా ఉంటుందా?

అనైతిక తరలింపు (నిషేధ) చట్టం 1956

(1956 సం॥లో 104వ చట్టం) (డిసెంబరు 30, 1956)

లక్ష్యం, కారణాల ప్రకటన

1. వ్యక్తుల అనైతిక తరలింపు, ఇతరులతో వ్యభిచారం చేయించే దోపిడీ విధానాన్ని అణిచివేయడానికి కుదుర్చుకున్న అంతర్జాతీయ ఒప్పందాన్ని భారత ప్రభుత్వం 1950 లో ఆమోదించింది. మానవుల తరలింపును రాజ్యాంగంలోని 23వ అధికరణ నిషేధిస్తుంది. ఈ నిషేధ ఉల్లంఘన నేరం, శిక్షార్హం. రాజ్యాంగం అమలైన వెనువెంటనే పార్లమెంటు ఆమేరకు ఒక చట్టాన్ని తీసుకురావాలని 35 వ అధికరణ తెలుపుతుంది.

2. అనైతిక తరలింపు అణచివేతకు సంబంధించి కొన్ని రాష్ట్రాల్లో శాసనాలు ఉన్నాయి. కాని ఈ శాసనాలన్నీ ఒకే విధంగా లేవు. అవి అంత ఉపయోగకరంగా కూడా లేవు. కొన్ని రాష్ట్రాల్లోనైతే ఈ అంశంపై ఎటువంటి ఆంక్షలూ లేవు.

3. ఈ పరిస్థితుల్లో అంతటా ఒకే విధానాన్ని ప్రవేశపెట్టాలని అది మరింత కట్టుదిట్టంగా కఠినంగా ఉండాలనే ఉద్దేశంతో ఒక కేంద్ర చట్టాన్ని అమల్లోకి తేవడం ఎంతో అవసరం.

   అనైతిక తరలింపు నిషేధం కోసం కుదిరిన అంతర్జాతీయ ఒప్పందంలో న్యూయార్కులో 1950 మే 9 న భాగమైన సందర్భంగా ఆ లక్ష్యసాధన కోసం ఏర్పడిన చట్టమిది.

గణతంత్ర భారత్ ఏడవ సంవత్సరంలో పార్లమెంటు ఈ విధంగా శాసించింది.

1. క్లుప్త శీర్షిక, పరిమితి, ఆవిష్కరణ :

1) ఈ చట్టాన్ని అనైతిక తరలింపు (నిషేధ) చట్టం, 1956 గా పేర్కొనాలి.

2) ఇది భారతదేశమంతటా వర్తిస్తుంది.

3) చట్టంలోని ఈ సెక్షన్ వెంటనే అమల్లోకి వస్తుంది. చట్టంలోని మిగిలిన అంశాలు కేంద్రప్రభుత్వం ఒక తేదీని నిర్ణయించి దాన్ని అధికార గెజిట్‌లో ప్రకటించిన రోజున అమలుల్లోకి వస్తాయి.

2. నిర్వచనాలు :

ఆయా సందర్భాల్లో మినహాయించి సాధారణంగా ఈ చట్టం ప్రకారం,

1) "వేశ్యాగృహం" (బ్రోతల్) అనే పదంలో మరొకరి లాభార్జన కోసం జరిగే లైంగిక దోపిడీ, అత్యాచారానికి ఉపయోగపడే, లేదా ఇద్దరు వేశ్యలు లేదా ఇద్దరికంటే ఎక్కువ మంది వేశ్యలు పరస్పర లాభార్జన కోసం వాడుకునే ఇల్లు, గది, వాహనం లేదా ఒక ఇల్లు, గది, వాహనంలోని ఒక భాగం ఇమిడుంది;

   ఎ) "బాల/బాలిక" అంటే 16 సంవత్సరాలు నిండని వ్యక్తి;

బి) "దిద్దుబాటు సంస్థ" అంటే దిద్దుబాటు అవసరమైన వ్యక్తులను ఈ చట్టం కింద నిర్బంధించడానికి సెక్షన్ 21 కింద స్థాపించిన లేదా లైసెన్సు పొందిన సంస్థ. దాని పేరు ఏమైనా కావచ్చు. ఈ చట్టం కింద విచారణ కొనసాగుతున్న ఖైదీలను (అండర్ ట్రయిల్స్) నిర్బంధించే నివేశన స్థలం కూడా ఇందులో భాగమే;

సి) "మెజిస్ట్రేట్" అంటే ఆయా సెక్షన్ల ప్రకారం, మరియు షెడ్యూల్లోని ఒకటవ కాలమ్లో స్పష్టం చేసిన విధంగా అధికారాలను వినియోగించుకునే అర్హత ఉన్న షెడ్యూలులోని రెండవ కాలంలో పేర్కొన్న మేజిస్ట్రేట్ అని అర్థం;

సిఎ) "మేజర్"అంటే 18 సంవత్సరాలు నిండిన వ్యక్తి;

సిబి) "మైనర్" అంటే 16 సంవత్సరాలు నిండిన, 18 సంవత్సరాలు నిండని వ్యక్తి;

డి) "సూచించిన" అంటే ఈ చట్టం క్రింద రూపొందించిన నియమాలు సూచించినవి అని అర్థం.

యఫ్) "వ్యభిచారం" అంటే వ్యాపార నిమిత్తం వ్యక్తులపై జరిగే లైంగికదోపిడీ, హింస, 'వ్యభిచారి' అనే పదాన్ని కూడా ఆ మేరకే అర్థం చేసుకోవాలి;

జి) "రక్షణ గృహాలు" అంటే సంరక్షణ, పరిరక్షణ అవసరమైన వ్యక్తులను ఉంచేందుకు వీలుగా నిపుణులు, పరికరాలు, ఇతర వసతులున్న సంస్థలు (సెక్షన్ 21 కింద స్థాపించిన, లేదా లైసెన్సు పొందిన సంస్థలు) వాటి పేరు ఏమైనా కావచ్చు. కాని ఇందులో కింద పేర్కొన్న సంస్థ భాగం కావు.

i) విచారణ జరుగుతున్న ఖైదీలను ఈ చట్టం ప్రకారం నిర్బంధించిన గృహం, లేదా

ii) దిద్దుబాటు సంస్థలు,

హెచ్) "బహిరంగ ప్రదేశం" అంటే ప్రజల అవసరాలకు ఉపయోగపడే లేదా వారు సందర్శించగలిగే ఏ ప్రాంతమైనా, ప్రజా వాహనాలు కూడా అందులో భాగమే;

ఐ) "ప్రత్యేక పోలీసు అధికారి" అంటే ఈ చట్టం కోసం ఆయా ప్రత్యేక ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన లేదా దాని తరపున పోలీసు విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారి.

జె) "తరలింపు పోలీసు అధికారి" అంటే సెక్షన్ 13 సబ్సెక్షన్ (4) కింద కేంద్ర ప్రభుత్వం నియమించిన పోలీసు అధికారి.

2ఎ) జమ్మూ, కాశ్మీర్కి ఈ చట్టం వర్తించదనే అంశాన్ని అర్థం చేసుకోవడానికి పాటించాల్సిన నిర్వచన నియమం:

జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రంలో అమల్లో లేని చట్టం ప్రస్తావన ఈ శాసనంలో చేసుంటే ఆ రాష్ట్రంలో సమాంతర చట్టమేదైనా వుంటే దాన్ని ప్రస్తావించినట్లుగా భావించాలి.

3. వ్యభిచార గృహం నడుపుతున్నందుకు, లేదా వ్యభిచార గృహం నడుపుకోవడానికి ఆవాసం కల్పించినందుకు శిక్ష :

1. ఏ వ్యక్తయినా ఒక వ్యభిచార గృహం నడుపుతున్నా యాజమాన్యం వహిస్తున్నా, లేదా దాన్ని నడపడానికి, యాజమాన్యం వహించడానికి పనిచేస్తున్నా, సహకరిస్తున్నా మొదటి దఫా శిక్ష పడితే ఒక ఏడాది తక్కువ కాకుండా మూడేళ్లకు మించకుండా కఠిన కారాగారం, మరియు రెండు వేల రూపాయిల్లోపు జరిమానాకు, రెండు లేదా మరిన్ని సార్లు శిక్షపడినప్పుడు రెండేళ్లు తక్కువ కాకుండా ఐదేళ్లు మించకుండా కఠిన కారాగారశిక్ష మరియు రెండు వేల రూపాయిల్లోపు జరిమానాకు శిక్షార్హులవుతారు.

2. ఏ వ్యక్తయినా

   ఎ) కౌలుదారుడు, అద్దెకుంటున్న వ్యక్తి, ఆక్రమితుడు, ఒక చోటుపై అజమాయిషీ చేసే వ్యక్తి అయి వుండి తెలిసి తెలిసి వేరే వ్యక్తిని ఆ చోటులో లేదా దానిలోని కొంతభాగంలో వ్యభిచార గృహం నడుపుకోవడానికి అనుమతిస్తే లేదా

   బి) ఒక చోటు యజమాని, అద్దెకిచ్చే వ్యక్తి, లేదా భూస్వామి అయివుండి, లేదా యజమాని, అద్దెకిచ్చే వ్యక్తి లేదా భూస్వామి ప్రతినిధి అయివుండి ఆ ప్రదేశాన్ని, లేదా దానిలో కొంత భాగాన్ని వ్యభిచార గృహం నడుపుకోవడానికి ఉద్దేశించి వాడబోతున్నారని తెలిసి దాన్ని అద్దెకిస్తే, లేదా ఆ చోటుని, లేదా దానిలో కొంత భాగాన్ని వ్యభిచార గృహం నడపడంలో తానూ తెలిసి తెలిసి భాగస్వామైతే

మొదటిసారి రెండేళ్ళు తగ్గకుండా కారాగార శిక్ష మరియు రెండు వేల రూపాయిల వరకు జరిమానా, రెండు లేదా మరిన్ని సార్లు శిక్షపడితే ఐదేళ్ళ వరకు కఠినకారాగార శిక్ష మరియు జరిమానాకు శిక్షార్హులవుతారు.

2 1) సబ్‌సెక్షన్ (2) అవసరార్థం సాక్ష్యాధారాలతో నిరూపిస్తే తప్ప తక్కిన సందర్భాలన్నింటిలో ఆ సబ్‌సెక్షన్‌లోని క్లాజ్ (ఎ), లేదా క్లాజ్ (బి) లోని వ్యక్తి తెలిసి తెలిసి ఆ చోటుని, లేదా దానిలో కొంతభాగాన్ని వ్యభిచార గృహంలో వాడుకోవడానికి అనుమతించారని, లేదా ఆ చోటుని, దానిలో కొంత భాగాన్ని వ్యభిచార గృహానికి వాడుతున్న విషయం వారికి తెలిసినట్లు ఈ సందర్భంగా భావించాల్సి వుంటుంది.

   ఎ) ఈ శాసనం కింద సోదా చేసినపుడు ఆ చోటుని, దానిలో కొంత భాగాన్ని వ్యభిచారం కోసం వాడుతున్నట్లు ఆ వ్యక్తి నివసిస్తున్న ప్రాంతంలో పంపిణీ అయ్యే దినపత్రికలో నివేదిక ప్రచురించినా; లేదా

   బి) క్లాజ్ (ఎ)లో ఉదహరించిన సోదాలో దొరికిన వస్తువుల జాబితా ప్రతిని ఆ వ్యక్తికి ఇచ్చినా

3. అమల్లో వున్న ఇతర చట్టాల్లో ఏమున్నప్పటికీ ఒక చోటు, లేదా దానిలో కొంతభాగానికి సంబంధించి ఒక వ్యక్తికి సబ్‌సెక్షన్ (21) లోని క్లాజ్ (ఎ) లేదా క్లాజ్ (బి) కింద శిక్ష విధించినపుడు నేరం జరిగినప్పుడు ఆ చోటుని బాడుగకు, లేదా ఆక్రమించుకోవడానికి కుదుర్చుకున్న బాడుగ, ఇతర ఒప్పందం శిక్షపడిన రోజు నుండి రద్దయిపోతుంది, నిర్వీర్యమైపోతుంది.

4. వ్యభిచారం ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడే వారికి విధించే శిక్ష :

1. వ్యభిచారం చేసే మరో వ్యక్తి ఆదాయంపై పూర్తిగా, లేక పాక్షికంగా తెలిసి తెలిసి ఆధారపడి బతికే 18 ఏళ్ళ పైబడిన వ్యక్తి రెండేళ్లలోపు కారాగార శిక్ష లేదా రెండు వేల రూపాయిల వరకు జరిమానా, లేదా రెంటికి శిక్షార్హులవుతారు. అది కనుక ఒక బాల/బాలిక, లేదా మైనర్ ఆదాయానికి సంబంధించినట్లయితే ఏడేళ్లకు పైగా, పది సంవత్సరాల్లోపు కారాగార శిక్షకు అర్హులవుతారు.

2. **18 ఏళ్ళ పైబడిన వ్యక్తి కింద పేర్కొన్న విధంగా వున్నట్లు రుజువైతే :**

ఎ) ఒక వ్యభిచారితో కలిసి జీవిస్తుంటే లేదా తరచు ఆమె సాంగత్యంలో వుంటే; లేదా

బి) ఒక వ్యభిచారి నడవడికలపై పెట్టే అదుపాంక్షలు, ప్రభావాన్ని బట్టి ఆమె వ్యభిచరించడానికి దోహద పడుతున్నట్లు, ప్రేరేపిస్తున్నట్లు లేదా బలవంతపెడుతున్నట్లు స్పష్టమైతే

సి) వ్యభిచారి తరపున బేరగాడిలా లేదా తార్చుడు గాడిలా వ్యవహరించితే

ఇతర సాక్ష్యాధారాలు లేని పక్షంలో ఆ వ్యక్తి తెలిసి తెలిసి మరో వ్యక్తి వ్యభిచారం ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడి బ్రతుకుతున్నట్లుగా భావించాల్సి వుంటుంది.

5. వ్యభిచార నిమిత్తం ఒక వ్యక్తిని వశీకరించడం లేదా రాబట్టడం :

1. ఏ వ్యక్తయినా

ఎ) వ్యభిచారం నిమిత్తం ఒక వ్యక్తి అనుమతించినా, అనుమతించకపోయినా ఆ వ్యక్తిని వశీకరించుకుంటే లేక వశీకరించే ప్రయత్నం చేస్తే; లేదా

బి) ఒక వ్యక్తితో వ్యభిచారం చేయించే ఉద్దేశ్యంతో ఆ వ్యక్తిని ఒక ప్రాంతం నుండి వెళ్లి ఒక వ్యభిచార గృహంలో చేరమని, లేదా తరచు వెళ్తూ ఉండమని ప్రభావితం చేస్తే; లేదా

సి) ఒక వ్యక్తి వ్యభిచారం చేయడం కొనసాగించడానికి లేదా వ్యభిచారం చేయించేందుకు తోడ్కొనిపోవాలనే ఉద్దేశంతో ఆ వ్యక్తిని రాబట్టగా, లేక ఆ ప్రయత్నం చేసినా, లేక రాబట్టేందుకు కారకులైనా, లేదా

డి) ఒక వ్యక్తి వ్యభిచారం చేయడానికి కారకులైనా, లేక ప్రభావం చూపినా,

మూడేళ్లకు తగ్గకుండా ఏడేళ్లకు మించకుండా కఠిన కారాగారశిక్షకు రెండు వేల రూపాయిల జరిమానాకు కూడా శిక్షార్హులవుతారు. ఆ వ్యక్తికి ఇష్టం లేకుండా ఈ సబ్‌సెక్షన్ కింద నేరం చేసుంటే శిక్షాకాలం ఏడేళ్లకు పైగా 14 ఏళ్ల లోపు వుంటుంది.

i) బాల/బాలికైతే ఈ సబ్ సెక్షన్ కింద ఏడేళ్ల నుండి జీవితకాలం వరకు కారాగార శిక్ష విధించవచ్చు; మరియు

ii) మైనరైతే, ఈ సబ్‌సెక్షన్ కింద ఏడేళ్ల నుండి 14 ఏళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించవచ్చు.

3. ఈ సెక్షన్ కింద జరిగిన నేరాన్ని విచారించాల్సింది :–

ఎ) ఆ వ్యక్తిని వశీకరించుకున్న, ప్రభావితం చేసిన, రాబట్టిన, లేక వశీకరించే, ప్రభావితం చేసే,

రాబట్టే ప్రయత్నం చేసిన చోటు; లేదా

బి) ప్రభావితం చేయడం వల్ల, లేక రాబట్టడం వల్ల లేక రాబట్టే ఉద్దేశ్యంతో వెళ్లడం వల్ల లేక రాబట్టే ప్రయత్నంలో భాగంగా ఆ వ్యక్తి చేరిన చోటు.

6. వ్యభిచారం జరిగే చోట ఒక వ్యక్తిని నిర్బంధించడం :

1) ఒక వ్యక్తి అనుమతించినా, అనుమతించకపోయినా ఆ వ్యక్తిని

ఎ) వ్యభిచార గృహంలో, లేదా

బి) భార్యో/భర్తో కాని వ్యక్తితో లైంగిక సంబంధం కల్పించే ఉద్దేశ్యంతో ఒక వ్యక్తిని ఏదొక ప్రదేశంలో లేదా దాని లోపల

నిర్బంధిస్తే ఆ వ్యక్తికి శిక్షపడిన ఎడల ఏడేళ్లకు తగ్గకుండా జీవిత కారాగారం లేదా పదేళ్ల కారాగారశిక్ష, మరియు జరిమానాకి కూడా శిక్షార్హులవుతారు:

అయితే చెప్పుకోదగ్గ ఇతర ప్రత్యేక కారణాలు ఏమైనా వుంటే వాటిని తీర్పులో వెల్లడిస్తూ కోర్టు ఏడేళ్లకు తక్కువ కారాగార శిక్ష విధించవచ్చు.

2. ఒక వ్యభిచార గృహంలో ఎవరైనా వ్యక్తి ఒక బాల/బాలికతో వున్నట్లు కనపడితే సాక్ష్యాధారాలతో రుజువు అయితే తప్ప ఆ వ్యక్తి సబ్‌సెక్షన్ (1) కింద నేరం చేసినట్లు భావించాల్సి వుంటుంది.

2ఎ) వ్యభిచార గృహంలో దొరికిన ఒక బాల/బాలికపై కాని, మైనర్‌పై కాని జరిపిన వైద్య పరీక్షలో లైంగిక హింస జరిగినట్లు నిర్ధారణైతే సాక్ష్యాధారాలతో రుజువు చేయని ఎడల ఆ బాల/బాలికను, లేదా మైనర్‌ను వ్యభిచారం కోసం కాని, లేదా పరిస్థితిని బట్టి వ్యాపార నిమిత్తం లైంగిక దోపిడీకి గురిచేసినట్లు భావించాల్సి వుంటుంది.

3. ఒక స్త్రీపై లేదా అమ్మాయిపై కాని వత్తిడి తేవాలనీ లేదా ప్రభావితం చేయాలనే ఉద్దేశ్యంతో

ఎ) ఆభరణాలు, దుస్తులు, డబ్బు, ఇత్యాది విలువైన వస్తువులను తమ వద్ద వుంచుకుని లేదా

బి) ఆ వ్యక్తి అరువిచ్చిన లేదా సరఫరా చేసిన లేక ఆదేశాల మేరకు ఆమె కలిగున్న ఆభరణాలు, దుస్తులు, డబ్బు ఇత్యాది విలువైన వస్తువులను ఆమె తీసుకుని వెళ్తే న్యాయపరమైన చర్య తీసుకుంటామని బెదిరించి ఆమెను చట్టపరంగా భర్తకాని వ్యక్తితో లైంగిక సంబంధం కల్పించడానికి, ఆమెను ఒక వ్యభిచార గృహంలోనో మరోచోట నిర్బంధించినట్లు భావించాల్సి వుంటుంది.

4. ఇతర చట్టాల్లో ఏమున్నప్పటికీ, ఆభరణాలు, దుస్తులు ఇత్యాది ఆస్తులను నిర్బంధంలో వున్న స్త్రీకి కాని, అమ్మాయికి అరువిచ్చామని, సరఫరా చేశామని, తాకట్టు పెట్టామని, లేదా ఆమెకు డబ్బు ఇచ్చామని ఆరోపిస్తూ ఆమెను నిర్బంధించిన వ్యక్తి వాటిని తిరిగి రాబట్టుకోవడానికి, ఆ స్త్రీపై, అమ్మాయిపై దావాకాని, నేరారోపణకాని, ఇతర న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి వీలులేదు.

7. బహిరంగ ప్రదేశాల దరిదాపుల్లో వ్యభిచారం :

1. వ్యభిచారం చేస్తున్న వ్యక్తి, లేదా ఎవరితోనైతే వ్యభిచరిస్తున్నారో ఆ వ్యక్తి

ఎ) సబ్‌సెక్షన్ (3) కింద నోటిఫై అయిన ప్రాంతంలో లేదా లోపల, లేదా

బి) ఒక బహిరంగ మతప్రార్థనాలయం, విద్యాసంస్థ,హాస్టల్, ఆస్పత్రి, నర్సింగ్‌హోమ్, పోలీసు కమీషనర్ కాని, మేజిస్ట్రేటు కాని ఆ మేరకు నోటిఫై చేసిన ప్రాంతానికి రెండు వందల మీటర్ల దూరంలోపు

వ్యభిచారం చేస్తే మూడు నెలల వరకు కారాగార శిక్ష విధించవచ్చు.

1ఎ) సబ్ సెక్షన్ (1) కింద జరిగిన నేరం ఒక బాల/బాలిక లేక మైనర్‌కి సంబంధించిందైతే నేరం చేసిన వ్యక్తికి ఏడేళ్లకు తగ్గకుండా జీవితకాలం కాని పదేళ్లు కాని కారాగార శిక్ష మరియు జరిమానా విధించాలి.

అయితే సరైన, ప్రత్యేక కారణాలు వుంటే వాటిని తీర్పులో వెల్లడించి కోర్టు ఏడేళ్లకు తక్కువ కారాగారాన్ని విధించవచ్చు.

2. ఏ వ్యక్తయినా –

ఎ) ఒక బహిరంగ ప్రదేశ కాపరి ఆ ప్రదేశంలో తెలిసి తెలిసి వ్యభిచారులను వ్యాపారం చేయించుకోనిచ్చినా, లేక వారిని అక్కడ ఉండనిచ్చినా; లేదా

బి) సబ్‌సెక్షన్(1) లో పేర్కొన్న ప్రదేశం కౌలుదారులు, అద్దెకుంటున్నవారు, ఆక్రమితులు లేదా అజమాయిషీ చేసే వ్యక్తయినా తెలిసి ఆ ప్రదేశాన్ని, లేక అందులో కొంతభాగాన్ని వ్యభిచారం చేసుకోవడానికి అనుమతించినా లేదా

సి) సబ్‌సెక్షన్ (1) లో పేర్కొన్న ప్రదేశం తాలూకు ఆసామి, యజమాని, భూస్వామి లేదా ఆసామి, యజమాని, భూస్వామి ప్రతినిధి అయి వుండి ఆ ప్రదేశాన్ని లేదా అందులో కొంతభాగాన్ని తెలిసి వ్యభిచారం చేసుకోవడానికి అనుమతించినా లేక తాను కూడా అందులో షరీకైనా

మొదటిసారి శిక్ష పడినప్పుడు మూడు నెలల కారాగారం, లేదా రెండు వందల రూపాయిల జరిమానా, లేదా రెంటికి రెండు లేదా మరిన్ని మార్లు శిక్షపడినప్పుడు శిక్షాకాలం ఆరు నెలల వరకు పొడిగించవచ్చు. దానితో పాటు రెండు వందల రూపాయిల వరకు జరిమానా కూడా విధించే అవకాశముంది. ఆ బహిరంగ ప్రదేశం లేదా ప్రాంతం ఒక హోటల్ అయితే అటువంటి హోటల్ వ్యాపారం కొనసాగించడానికి ఏదైనా చట్టం కింద మంజూరు చేసిన లైసెన్సును మూడు నెలల నుండి ఏడాది వరకు సస్పెండ్ చేయాలి. అయితే ఈ సబ్‌సెక్షన్ కింద నేరం ఒక బాల/బాలికకు,మైనర్‌కు సంబంధించిందైతే అటువంటి హోటల్ లైసెన్సును రద్దు కూడా చేయాల్సి వుంటుంది.

వివరణ : ఈ సబ్‌సెక్షన్‌లో 'హోటల్' అనే పదం అర్థం హోటల్ రసీదుల పన్ను చట్టం, 1980 (1980లోని 54వ చట్టం) సెక్షన్ 2 క్లాజ్ (6) లో పేర్కొన్న విధంగా వుంటుంది.

3. రాష్ట్రంలోని ఒక ప్రదేశానికి, లేక ప్రదేశాలకు ఎటువంటి వ్యక్తులు తరచు వెళ్తున్నారు, ఆ ప్రాంతం జనాభా స్వభావం, సాంద్రతలను, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రదేశంలో కాని ప్రదేశాల్లో కాని వ్యభిచారం కొనసాగించడానికి వీల్లేదని అధికార గెజిట్‌లో నోటిఫికేషన్ ద్వారా నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా ఆదేశాలు జారీ చేయవచ్చు.

4. ఒక ప్రాంతానికి లేదా ప్రాంతాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సబ్‌సెక్షన్ (3) కింద నోటిఫికేషన్ జారీ చేస్తే ఆ ప్రాంతం లేదా ప్రాంతాల హద్దులను సహేతుకమైన నిర్దిష్టతతో నోటిఫికేషన్ వెల్లడించాల్సి వుంటుంది.

5. నోటిఫికేషన్ జారీ చేసిన రోజు నుండి 90 రోజుల గడువు పూర్తయ్యే వరకే నోటిఫికేషన్ అమల్లో వుంటుంది.

8. వ్యభిచారం కోసం లోబర్చుకోవడం, బేరసారాలు చేయడం :

ఎవరైనా ఒక బహిరంగ ప్రదేశంలో కాని, దాని కనుచూపు మేరలో కాని, లేదా ఒక బహిరంగ ప్రదేశం నుండి చూడటానికి, వినడానికి వీలుగా ఉండే ఒక భవనం లోపల కాని ఇంటిలోపల కాని ఇతర చోటు కాని వ్యభిచార నిమిత్తం.

ఎ) మాటల ద్వారా, హావ భావాల ద్వారా, తన శరీరాన్ని ఇచ్ఛాపూర్వకంగా ప్రదర్శిస్తే (అది ఒక భవనం, లేదా ఇంటి కిటికీలోనో వసారాలోనో కూర్చునో, మరో విధంగానో) కవ్విస్తే, లేక కవ్వించే ప్రయత్నం చేస్తే, లేదా వారి దృష్టి ఆకర్షిస్తే, లేక ఆకర్షించే ప్రయత్నం చేస్తే; లేదా

బి) వ్యభిచారం నిమిత్తం ఏ వ్యక్తితో నైనా బేరసారాలు చేసినా, లైంగికదాడికి పాల్పడినా, లేదా తచ్చట్లాడుతున్నా, లేదా స్థానికంగా నివసించే వారికి కాని, దారినపోయే వారికి అవాంతరం కలిగించే విధంగా ఇబ్బంది పెట్టే విధంగా ప్రవర్తిస్తున్నా, లేదా ప్రజలకు అమర్యాదగా అనిపించే విధంగా అనిపించినా,

మొదటిసారి శిక్షపడినప్పుడు ఆరు నెలల వరకు కారాగార శిక్ష లేదా ఐదువందల రూపాయిల జరిమానా, లేదా ఆ రెండింటికి, రెండు లేదా మరిన్నిసార్లు శిక్ష పడినప్పుడు ఏడాది వరకు కారాగార శిక్ష మరియు ఐదు వందల జరిమానాకు శిక్షార్హులవుతారు.

అయితే ఈ నేరానికి ఒక మగవాడు పాల్పడితే 7 రోజులు తగ్గకుండా మూడు నెలల వరకు కారాగార శిక్ష విధించవచ్చు.

9. కస్టడీలో వున్న వ్యక్తిని లోబర్చుకోవడం :

తన అదుపులో (కస్టడీలో) లేదా తన అజమాయిషీలో లేదా సంరక్షణలో, లేదా తన అధికార దర్పాన్ని ప్రదర్శించే స్థితిలో ఉన్న వ్యక్తిని వ్యభిచరించడానికి, లోబర్చుకోవడానికి కారకులైనా, సహకరించినా, లేక ప్రేరేపించినా అటువంటి వ్యక్తికి శిక్ష పడినప్పుడు ఏడేళ్లకు తగ్గకుండా జీవిత కాలం కాని పదేళ్ల కారాగార శిక్ష మరియు జరిమానా విధించాలి.

అయితే సరైన ప్రత్యేక కారణాలున్న ఎడల ఆ విషయాన్ని కోర్టు తన తీర్పులో పేర్కొని ఏడేళ్ల లోపు శిక్ష విధించవచ్చు.

10. దిద్దుబాటు సంస్థల్లో నిర్బంధం :

1) ఎక్కడైనా –

ఎ) సెక్షన్ 7 లేదా సెక్షన్ 8 కింద నేరానికి పాల్పడినట్లు నిర్ధారణైన మహిళా నేరస్తురాలు; మరియు

బి) ఆ నేరస్తురాలి వ్యక్తిత్వం, ఆరోగ్యస్థితి, మానసిక స్థితిని బట్టి ఆ వ్యక్తి సరిదిద్దుకునేందుకు అనుకూలమైనంత కాలం నిర్బంధించడం, శిక్షణ ఇవ్వడం, క్రమశిక్షణ నేర్పడం సముచితం అనిపించినప్పుడు

కోర్టు కారాగార శిక్ష విధించే బదులు, ఆమెను ఒక దిద్దుబాటు సంస్థలో రెండేళ్లకు తగ్గకుండా ఐదేళ్లకు మించకుండా నిర్బంధాన్ని విధిస్తూ, కోర్టుకి ఏది సరైనది అనిపిస్తే ఆమేరకు ఆదేశాలు జారీ చేసేటప్పుడు

i) ఇటువంటి సంస్థల్లో తాము ఎదుర్కోబోయే దిద్దుబాటు చర్యలు తమకు నప్పుతాయా లేదా అనే విషయం తెలిపేందుకు, ప్రాతినిధ్యం వహించేందుకు కోర్టు వారికి అవకాశమివ్వాలి. నేరస్తుల ప్రొబేషన్ చట్టం, 1958 (1958లో 20వ చట్టం) కింద నియమితులైన ప్రొబేషన్ అధికారి నివేదిక తీసుకోవాలి; మరియు

ii) నేరస్తురాలి వ్యక్తిత్వం, ఆరోగ్యస్థితి, మానసికస్థితి, ఇతర పరిస్థితుల దృష్ట్యా ఈ విధమైన శిక్షణ, క్రమశిక్షణ నేరస్తురాలికి ఉపయోగకరంగా వుంటుందనే విషయాన్ని కోర్టు రికార్డు చేయాలి.

2. సెక్షన్ (1) కింద జారీ చేసిన నిర్బంధం ఉత్తర్వుపై అప్పీల్‌కి వెళ్లాలంటే సబ్‌సెక్షన్ (3)కి లోబడి అప్పీల్, రెఫరెన్స్, రివిజన్‌కి సంబంధించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లోని అంశాలు, అప్పీలు చేయడానికి కాలపరిమితి పాటించాల్సివస్తే పరిమితిచట్టం, 1963లోని అంశాలు వర్తిస్తాయి. ఈ విషయంలో నిర్బంధ కాలాన్ని కారాగారశిక్ష కాలంగా పరిగణించాలి.

3. దిద్దుబాటు సంస్థల్లో నిర్బంధంలో వున్న నేరస్తురాలు ప్రయోజనకరంగా కష్టపడి జీవిస్తారనే సహేతుకమైన అవకాశముందని తృప్తి చెందితే రాష్ట్ర ప్రభుత్వం కాని అధికారి కాని ఆ విషయంలో రూపొందించిన నియమాలకు లోబడి నిర్బంధ ఉత్తర్వు జారీ చేసిన రోజు నుండి ఆరు నెలల తర్వాత ఎప్పుడైనా ఆ నేరస్తురాలిని బేషరతుగా కాని, లేదా తనకు సరైనదిగా అనిపించిన షరతులు విధిస్తూ కాని విడుదల చేయవచ్చు. ఆమెకు ఇందుకు రూపొందించిన పద్ధతిలో రాతపూర్వకమైన లైసెన్సు మంజూరు చేయవచ్చు.

4. సబ్‌సెక్షన్ (3) కింద నేరస్తురాలిని విడుదల చేసేటప్పుడు విధించే షరతుల్లో నేరస్తురాలు నివాసానికి సంబంధించిన ఏర్పాట్లు, ఆమె కార్యకలాపాలు, కదలికలపై కన్ను వేయడం మొదలైన అంశాలు వుంటాయి.

11. పూర్వం శిక్షపడిన నేరస్తుల చిరునామా ప్రకటన :

1) ఏ వ్యక్తయినా

ఎ) ఈ చట్టం కింద కాని, భారత శిక్షాస్మృతిలోని (1860లో 45వ చట్టం) సెక్షన్ 363, సెక్షన్ 365, సెక్షన్ 366, సెక్షన్ 366 ఎ, సెక్షన్ 366 బి, సెక్షన్ 367, సెక్షన్ 368, సెక్షన్ 370, సెక్షన్ 371, సెక్షన్ 372 లేదా సెక్షన్ 373 కింద భారతదేశంలోని కోర్టు ఆ వ్యక్తిపై రెండేళ్లు లేదా పైబడి కారాగారశిక్ష విధించివుంటే లేదా

బి) భారతదేశంలో ఈ చట్టం కింద కాని, పైన పేర్కొన్న సెక్షన్ల కింద ఆవిధమైన కారాగార శిక్ష పడే నేరం చేయడం వల్ల ఏ ఇతర దేశం కోర్టు లేదా ట్రిబ్యునల్ ఆ వ్యక్తిపై శిక్ష విధించివుంటే కారాగారం నుండి విడుదలైన ఐదేళ్ల లోపు ఆవ్యక్తికి మళ్లీ ఈ చట్టం కింద కాని, పైన పేర్కొన్న సెక్షన్ల కింద కాని చేసిన ఏ నేరానికైనా రెండు సంవత్సరాలు లేదా ఆపైన శిక్షవిధించే కోర్టు ఆ వ్యక్తిపై కారాగార శిక్ష విధించేటప్పుడు సరైనదని భావిస్తే ఆవ్యక్తి విడుదలైన రోజు నుండి ఐదేళ్ల వరకు తన నివాసం వివరాలు, అందుకు సంబంధించిన మార్పులు, నివాసం నుండి గైర్హాజరీ వివరాలు సెక్షన్ 23 కింద రూపొందించిన నియమాల ప్రకారం నోటిఫై చేస్తూ వుండాల్సిన ఆదేశాలు జారీ చేయవచ్చు.

2. అప్పీల్‌లో లేదా ఇతరత్రా శిక్షను రద్దు చేస్తే ఈ ఆదేశం రద్దయిపోతుంది.

3. ఈ సెక్షన్ కింద ఒక అప్పెలెట్ కోర్టు కాని, రివిజన్ కోర్టు కాని, రివిజన్ అధికారాన్ని వినియోగించుకునేప్పుడు హైకోర్టు కాని ఈ ఆదేశాలు జారీ చేయవచ్చు.

4. సబ్‌సెక్షన్ (1) కింద రూపొందించిన నియమాలను ఉల్లంఘించారనే ఆరోపణ ఎదుర్కుంటున్న వ్యక్తిపై విచారణను ఆఖరుగా ఆవ్యక్తి నోటిఫై చేసిన నివాసమున్న జిల్లాలో సామర్థ్యం గల మేజిస్ట్రేటు జరపాలి.

12. 1) 26.1.1987లో అమల్లోకి వచ్చిన స్త్రీలు, బాలికల అనైతిక తరలింపు అణచివేత (సవరణ) చట్టం, 1987 సెక్షన్ 13 ఈ సెక్షన్ 12ని తొలగించింది.

13. ప్రత్యేక పోలీసు అధికారి, సలహా సంస్థ :

1) రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ప్రాంతానికి సంబంధించి ఆ ప్రాంతంలో ఈ చట్టం కింద జరిగే నేరాలపై చర్య తీసుకోవడానికి గాను ఒక ప్రత్యేక పోలీసు అధికారిని తాను గాని తన తరఫున కాని నియమిస్తుంది.

2) ఈ ప్రత్యేక పోలీసు అధికారి ఇన్‌స్పెక్టర్ ర్యాంకుకి దిగువ ర్యాంకు వారు కాకుండా వుండాలి.

2ఎ) జిల్లా మేజిస్ట్రేటుకి సముచితం, అవస్యమనిపిస్తే కొన్ని ప్రత్యేక కేసులు, కొన్ని వర్గాల కేసులు, లేదా సాధారణంగా కేసులన్నింటికీ సంబంధించి ఈ చట్టం ప్రత్యేక అధికారికి కల్పించిన అధికారాలను ఒక రిటైరైన పోలీసుకి కాని మిలిటరీ అధికారికి కాని కల్పించవచ్చు.

అయితే ఇటువంటి అధికారాలు కల్పించాలంటే

ఎ) ఆ రిటైరైన పోలీసు అధికారి పదవీ విరమణ నాటికి ఇన్‌స్పెక్టర్ ర్యాంకు దిగువ ర్యాంకు కాకుండా వుండాలి.

బి) ఆ రిటైరైన మిలటరీ అధికారి పదవీ విరమణ నాటికి కమీషన్ అధికారి ర్యాంకు దిగువ ర్యాంకు కాకుండా వుండాలి.

3. ఈ చట్టంలోని నేరాలకు సంబంధించి సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలంటే –

ఎ) ఒక ప్రాంతంలోని ప్రత్యేక పోలీసు అధికారికి సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సముచితం అనుకున్నంత మంది కింది స్థాయి పోలీసు అధికార్లను (అవకాశమున్న చోట్ల మహిళా పోలీసు అధికార్లు సహా) నియమించాలి; మరియు

బి) ఈ చట్టం పనితీరుకి సంబంధించిన ప్రధానాంశాలపై సలహా ఇవ్వడానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పోలీసు అధికారికి ఒక అనధికార సలహా సంస్థని జత చేయవచ్చు. ఈ సంస్థలో ఆ ప్రాంతంలో ప్రముఖులైన ఐదుగురు సాంఘిక సంక్షేమ కార్యకర్తలు (వారిలో అవకాశమున్న చోటల్లా మహిళా సాంఘిక సంక్షేమ కార్యకర్తలు) వరకు ఉండొచ్చు.

4. ఒకటికిపైగా రాష్ట్రాల్లో ఈ చట్టం కింద జరిగే నేరంపై కాని, లైంగిక దోపిడీకి సంబంధించి అమల్లో వున్న ఇతర చట్టాల కింద కాని జరిగే నేరంపై దర్యాప్తు జరపడానికి కేంద్ర ప్రభుత్వం కొంతమంది పోలీసు అధికార్లను ట్రాఫికింగ్ పోలీసు అధికార్లగా నియమించవచ్చు. ఈ చట్టం కింద ప్రత్యేక పోలీసు అధికారి అనుభవించే అధికారాలు, నిర్వర్తించే విధులు ఈ ట్రాఫికింగ్ పోలీసు అధికార్లకు కూడా వర్తిస్తాయి. అవి వారి విషయంలోనైతే దేశమంతటా వర్తిస్తాయనేది మార్చబడింది.

14. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లో (1974 లో 2వ చట్టం) ఏమున్నప్పటికీ ఈ చట్టం కింద శిక్షార్హమైన నేరాలన్నింటిని ఆ కోడ్ కింద కాగ్నిజబుల్ నేరంగా భావించాలి :

అయితే కోడ్‌లో ఏ విధంగా ఉన్నప్పటికీ :

i) వారెంట్ లేకుండా అరెస్టు చేయాలంటే ప్రత్యేక అధికారి సమక్షంలో కాని, ఆయన ఆదేశం మేరకు కాని, ఆయన ఆధ్వర్యంలో కాని ఆయన అనుమతితో కాని మాత్రమే జరగాలి.

ii) ప్రత్యేక పోలీసు అధికారి ఈ చట్టం కింద ఒక నేరానికి సంబంధించి తన సమక్షంలో కాకుండా తన కింది అధికారిని వారెంటు లేకుండా అరెస్టు చేయమని పురమాయించినప్పుడు, అతను అరెస్టు చేయవల్సిన వ్యక్తిని, ఏ నేరం కింద అరెస్టు చేయాల్సింది తెలుపుతూ వ్రాతపూర్వకంగా ఆ క్రింది అధికారికి ఆదేశం ఇవ్వాలి; ఆ కింది అధికారి అరెస్టు చేసేటప్పుడు ఆ వ్యక్తికి ఆ ఆదేశంలోని అంశాలను తెలపాలి. ఆ వ్యక్తి కోరితే ఆ ఆదేశాన్ని చూపెట్టాలి.

iii) ప్రత్యేక పోలీసు అధికారి నియమించిన సబ్‌ఇన్స్‌పెక్టర్ కింది స్థాయి కాని పోలీసు అధికారికి ప్రత్యేక పోలీసు అధికారి ఆదేశాలు అందడంలో జరిగే ఆలస్యం వల్ల ఈ చట్టం కింద జరిగిన నేరానికి సంబంధించిన విలువైన సాక్ష్యాన్ని ధ్వంసం చేస్తారనో, కప్పిపుచ్చుతారనో భావిస్తే, లేదా నేరానికి పాల్పడిన లేదా అనుమానించబడ్డ వ్యక్తి పారిపోతాడని భావిస్తే, లేదా ఆ వ్యక్తి పేరు, చిరునామా తెలియకపోయినా, లేదా తప్పు పేరు, చిరునామా ఇచ్చారనే అనుమానం కలిగినా ఆ వ్యక్తిని అటువంటి ఆదేశం లేకుండా అరెస్టు చేయవచ్చు. కాని ఆ విధంగా చేసినప్పుడు ఆ అధికారి వీలైన వెంటనే ప్రత్యేక పోలీసు అధికారికి అరెస్టు గురించి, అరెస్టు చేసిన పరిస్థితుల గురించి నివేదిక ఇవ్వాల్సుంటుంది.

15. వారెంటు లేకుండా సోదా :

1. అమల్లో వున్న ఇతర చట్టాల్లో ఏమున్నప్పటికీ, ఒక ప్రత్యేక పోలీసు అధికారికి కాని ట్రాఫికింగ్ అధికారికి కాని ఒక ప్రదేశంలో నివసిస్తున్న వ్యక్తికి సంబంధించి ఈ చట్టం కింద శిక్షార్హమైన నేరం జరిగిందని, జరుగుతోందని, వారెంటు తీసుకుని సోదా చేయడం వల్ల అవాంఛనీయ జాప్యం జరుగుతుందని సహేతుకమైన కారణాల చేత అనిపిస్తే, ఆ అధికారి తనకు కలిగిన భావనకు గల కారణాలను నమోదు చేసి ఆ ప్రదేశంలోకి వారెంటు లేకుండా ప్రవేశించి సోదా చేయవచ్చు.

2. సబ్‌సెక్షన్ (1) కింద సోదా చేసేటప్పుడు ప్రత్యేక పోలీసు అధికారి కాని ట్రాఫికింగ్ పోలీసు అధికారి కాని పరిస్థితిని బట్టి సోదా జరిపే ప్రదేశమున్న పరిసరప్రాంతాల్లో నివసించే ఇద్దరు లేదా మరింత మంది గౌరవప్రదమైన వ్యక్తులను (అందులో కనీసం ఒకరైనా స్త్రీ అయి వుండాలి) పిలిచి వారిని సోదాకి హాజరై సాక్షిగా వ్యవహరించమని అడగొచ్చు. వారికి లేదా వారిలో కొంతమందికి ఆ మేరకు వ్రాతపూర్వకంగా ఆదేశం జారీ చేయవచ్చు.

అయితే సోదా ప్రదేశం పరిసర ప్రాంతాల్లో గౌరవప్రదమైన నివాసితులు హాజరై సోదాకి సాక్షిగా ఉండాలనే నిబంధన స్త్రీలకు వర్తించదు.

3. సోదాకి హాజరై సాక్షిగా ఉండమని ఒక వ్యక్తికి వ్రాతపూర్వకంగా ఇచ్చిన ఆదేశాన్ని ఆ వ్యక్తి సహేతుక కారణం లేకుండా నిరాకరించినా లేదా నిర్లక్ష్యం చేసినా ఆ వ్యక్తి భారత శిక్షాస్మృతి (1860 లోని 45 వ చట్టం) సెక్షన్ 187 కింద నేరం చేసినట్లు భావించాల్సి వుంటుంది.

4. సబ్‌సెక్షన్ (1) కింద ఒక ప్రదేశంలో ప్రవేశించిన పోలీసు అధికారికి లేదా ట్రాఫికింగ్ అధికారికి పరిస్థితిని బట్టి అక్కడున్న వారందర్ని తొలగించే అధికారముంది.

5. ప్రత్యేక పోలీసు అధికారి కాని ట్రాఫికింగ్ పోలీసు అధికారి కాని సబ్‌సెక్షన్ (4) కింద ఆ వ్యక్తిని తొలగించిన తర్వాత పరిస్థితిని బట్టి సంబంధిత మేజిస్ట్రేటు ముందు ప్రవేశపెట్టాలి.

5ఎ) సబ్‌సెక్షన్ (5) కింద మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చిన వ్యక్తి వయస్సు నిర్ధారించడానికి, లేదా లైంగిక హింస జరిగిందా అనే విషయాన్ని తేల్చుకోవడానికి, లేదా సుఖవ్యాధులున్నాయా అనే విషయం తెలుసుకోవడానికి ఆ వ్యక్తిపై రిజిస్టర్డ్ వైద్యుని చేత పరీక్ష జరిపించాలి.

వివరణ : ఈ సబ్‌సెక్షన్‌లో 'రిజిస్టర్డ్ వైద్యుడు' అంటే భారతవైద్య మండలి చట్టం, 1956 (1956లో 102వ చట్టం) కిందున్న అర్థం.

6. ప్రత్యేక అధికారిపై కాని ట్రాఫికింగ్ పోలీసు అధికారిపై కాని సోదాకి హాజరై సాక్షిగా వ్యవహరించిన వ్యక్తిపై కాని సోదా జరిపేటప్పుడు చట్టబద్ధంగా తీసుకున్న చర్యల విషయమై వారిపై ఎటువంటి సివిల్ లేదా క్రిమినల్ న్యాయ చర్యలు తీసుకోడానికి వీల్లేదు.

6ఎ) ప్రత్యేక పోలీసు అధికారి కాని ట్రాఫికింగ్ పోలీసు అధికారి కాని ఈ సెక్షన్ జరిపేటప్పుడు కనీసం ఇద్దరు మహిళా పోలీసు అధికార్లను తోడ్కొని వెళ్లాలి. సబ్‌సెక్షన్ (4) కింద ఒక స్త్రీని కాని అమ్మాయిని కాని ప్రశ్నించాల్సి వుంటే ఆ పని ఒక మహిళా పోలీసు అధికారి చేయాలి. మహిళా పోలీసు అధికారి లేని పక్షంలో ఆమెను ప్రశ్నించడం అనేది గుర్తింపు పొందిన సంక్షేమ సంస్థకి కాని, సంఘానికి కాని చెందిన మహిళా సభ్యురాలి సమక్షంలో చేయాలి.

వివరణ : ఈ సబ్ సెక్షన్ కింద, సెక్షన్ 17ఎ కింద "గుర్తింపు పొందిన సంస్థ లేదా సంఘం" అంటే రాష్ట్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందిన సంస్థ లేక సంఘం.

7. సోదాలకి సంబంధించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లోని అంశాలు ఏ మేరకు వర్తిస్తాయంటే కోడ్‌లో సెక్షన్ 94 కింద వారెంటు పొంది సోదా జరపడానికి ఉన్న అంశాలే ఈ సెక్షన్ కింద సోదా జరపడానికి వర్తిస్తాయి.

16. ఒక వ్యక్తిని కాపాడటం :

1. ఒక వ్యక్తి వ్యభిచారగృహంలో వ్యభిచారం చేసి జీవనం సాగిస్తున్నదని, లేదా కొనసాగిస్తోందని, లేదా చేయించబడుతోందని ఒక మేజిస్ట్రేట్‌కి పోలీసులు కాని, లేదా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వ్యక్తి కాని, మరేవిధంగానైనా సమాచారం అంది నమ్మకం కలిగితే ఆయన సబ్‌ఇన్స్‌పెక్టర్ హోదా తక్కువ కాని పోలీసు అధికారిని ఆ వ్యభిచార గృహంలో ప్రవేశించి ఆ వ్యక్తిని అక్కడ నుంచి తొలగించి తన ముందు హాజరుపర్చమని ఆదేశించవచ్చు.

2. ఆవిధంగా తొలగించిన వ్యక్తిని పోలీసు అధికారి తదుపరి ఆదేశాలు జారీ చేసిన మేజిస్ట్రేటు ముందు హాజరుపర్చాలి.

17. సెక్షన్ 15 కింద తరలించిన లేదా సెక్షన్ 16 కింద కాపాడిన వ్యక్తుల మధ్యంతర నిర్బంధం :

1. సెక్షన్ 15 సబ్‌సెక్షన్ (4) కింద ప్రత్యేక పోలీసు అధికారి ఒక వ్యక్తిని తొలగించి లేదా సెక్షన్ 16 సబ్ సెక్షన్ (1) కింద పోలీసు అధికారి ఒక వ్యక్తిని కాపాడి ఆ వ్యక్తిని సెక్షన్ 15 సబ్ సెక్షన్ (5) కింద సంబంధిత మేజిస్ట్రేటు ముందు కాని సెక్షన్ 16 సబ్‌సెక్షన్ (2) కింద ఆదేశం జారీచేసిన మేజిస్ట్రేట్ ముందు ఏదైనా కారణంచేత హాజరు పర్చలేకపోతే, అప్పుడు అతను ఆ వ్యక్తిని దగ్గరలోని ఏ తరగతికి చెందిన మేజిస్ట్రేటు అయినప్పటికీ వారి ముందు హాజరుపర్చాలి. సంబంధిత మేజిస్ట్రేటు లేదా పరిస్థితిని బట్టి ఆదేశాలు జారీ చేసిన మేజిస్ట్రేటు ముందు ఆ వ్యక్తిని హాజరుపరిచే వరకు ఆ వ్యక్తిని సురక్షిత నిర్బంధానికి గురి చేస్తూ ఆ మేజిస్ట్రేటు తగిన విధంగా ఆదేశాలు జారీ చేయాలి.

అయితే ఏ వ్యక్తయినా –

i) ఈ సబ్ సెక్షన్ కింద నిర్బంధించిన వ్యక్తిని ఆదేశాలు జారీ చేసిన పది రోజులకు మించి నిర్బంధించకూడదు.

ii) ఆ వ్యక్తిపై హానికారక ప్రభావం చూపే వ్యక్తి ఆధీనంలో ఆ వ్యక్తిని తిరిగి అప్పజెప్పడం కాని సంరక్షణలో వుంచడం కాని చేయకూడదు.

2. సెక్షన్ 15 సబ్‌సెక్షన్ (5) కింద సంబంధిత మేజిస్ట్రేట్ ముందు కాని సెక్షన్ 16 సబ్‌సెక్షన్ (2) కింద మేజిస్ట్రేట్ ముందు కాని ఒక వ్యక్తిని హాజరు పర్చినపుడు సెక్షన్ 16 సబ్‌సెక్షన్ (1) కింద ఆ వ్యక్తి సమాధానం చెప్పుకునేందుకు అవకాశాలిచ్చిన తర్వాత తనకు అందిన సమాచారం సరైనదా, ఆ వ్యక్తి వయస్సు, వ్యక్తిత్వం, ఆ వ్యక్తిపూర్వాపరాలు, తల్లిదండ్రులు, సంరక్షకులు లేదా భర్త సంరక్షించడం సబబుగా వుంటుందా లేదా, ఇంటికి తిరిగి పంపిస్తే ఇంట్లో పరిస్థితులు ఆ వ్యక్తిపై ఎటువంటి ప్రభావం చూపుతాయి అనే అంశాలపై విచారణ జరపాలి. ఇందుకు అతను ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం, 1958 (1958 లోని 20 వ చట్టం) కింద నియమితులైన ప్రొబేషన్ అధికారిని పైన పేర్కొన్న అంశాలపై, ఆ వ్యక్తి వ్యక్తిత్వంపై, పునరావాసానికున్న అవకాశాలపై విచారణ జరపమని ఆదేశించవచ్చు.

3. సబ్‌సెక్షన్ (2) కింద విచారణ జరుగుతున్న కాలంలో ఆ వ్యక్తిని సంరక్షిత నిర్బంధంలో వుంచుతూ మేజిస్ట్రేట్ తగిన ఆదేశాలు జారీచేయవచ్చు.

అయితే సెక్షన్ 16 కింద ఒక బాల/బాలికను కాని మైనర్‌ను కాని రక్షించుంటే మేజిస్ట్రేట్ ఆ బాల/బాలికను కాని మైనరును కాని బాలల సురక్షిత నిర్బంధం కోసం ఏదొక రాష్ట్రంలో బాలల చట్టం కింద స్థాపించిన, లేదా గుర్తింపు పొందిన సంస్థలో ఉంచవచ్చు.

అయితే ఈ ఆదేశం జారీ చేసిన రోజు నుండి మూడు వారాల కాలం మించి ఏ వ్యక్తిని నిర్బంధంలో ఉంచకూడదు. ఏ వ్యక్తిని తనకు హానికారక ప్రభావం చూపే వ్యక్తి సంరక్షణలో ఉంచకూడదు.

4. సబ్‌సెక్షన్ (2) కింద విచారణ జరిగిన తర్వాత మేజిస్ట్రేటు కనుక ఈ విధంగా సంతృప్తి చెందితే

ఎ) తనకు అందిన సమాచారం సరైనది; మరియు

బి) ఆ వ్యక్తికి సంరక్షణ, రక్షణ అవసరం.

మేజిస్ట్రేటు సబ్‌సెక్షన్ (5) కి లోబడి ఆ వ్యక్తిని ఏడాదికి పైగా మూడేళ్లలోపు ఒక రక్షక గృహంలో కాని లేదా తనకు సబబుగా అనిపించిన సంరక్షకుల వద్ద కాని నిర్బంధిస్తూ ఆదేశాలు జారీ చేయవచ్చు. అటువంటి సంరక్షకుల వద్ద నిర్బంధించడం సబబు అనిపించడానికి గల కారణాలను కూడా ఆయన తన ఉత్తర్వులో పేర్కొనాలి.

అయితే అటువంటి సంరక్షకులకు కాని, సంరక్షణ సంస్థకి కాని ఉండే మతవిశ్వాసాలు నిర్బంధంలో వున్న వ్యక్తికి ఉండే వాటికి భిన్నంగా ఉండకూడదు. అటువంటి సంరక్షకులు కాని సంరక్షణ సంస్థ కాని ఆ వ్యక్తికి నిర్బంధ కాలంలో సరైన సంరక్షణ, విద్య, శిక్షణ, వైద్యసహాయం, మానసిక వైద్య సహాయం వంటి విషయాల్లో అవసరమైన మేరకు, అవకాశమున్న మేరకు చర్యలు తీసుకుంటామని బాండ్ ఇవ్వాల్సి ఉండొచ్చు. ఇవన్నీ కోర్టు నియమించిన వ్యక్తి ఆధ్వర్యంలో జరగాలి. ఈ బాండు మూడేళ్ల వరకు అమల్లో ఉంటుంది.

5. సబ్‌సెక్షన్ (2) కింద విధులు నిర్వర్తించేటప్పుడు మేజిస్ట్రేటు ఐదుగురు మర్యాదస్తులైన వ్యక్తులు గల పేనల్‌ను సమన్ చేయవచ్చు. ఆ ఐదుగురులో అవకాశమున్న చోట్ల ఆయన ముగ్గురు స్త్రీల సహకారం కోరవచ్చు. ఇందుకు గాను వ్యక్తుల అనైతిక తరలింపు అణచివేత రంగంలో పనిచేస్తున్న అనుభవజ్ఞులైన సామాజిక సంక్షేమ కార్యకర్తలు, ముఖ్యంగా మహిళా సామాజిక సంక్షేమ కార్యకర్తల జాబితాని ఆయన తన వద్ద ఉంచుకోవాలి.

6. సబ్‌సెక్షన్ (4) కింద ఇచ్చిన ఆదేశంపై అప్పీలు సెషన్స్ కోర్టులో దాఖలు చేయాలి. అప్పీల్‌లో ఇచ్చిన తీర్పు తుది తీర్పు అవుతుంది.

17ఎ. సెక్షన్ 16 కింద వ్యక్తులను తల్లిదండ్రులు లేదా సంరక్షకుల ఆధీనంలో ఉంచేటప్పుడు పరిశీలించాల్సిన విషయాలు :

సెక్షన్ 17 సబ్‌సెక్షన్ (2) లో ఏమున్నప్పటికీ, సెక్షన్ 17 కింద విచారణ జరుపుతున్న మేజిస్ట్రేటు సెక్షన్ 16 కింద కాపాడిన వ్యక్తిని తన తల్లిదండ్రులు, సంరక్షకులు లేదా భర్తకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసే ముందు ఒక గౌరవప్రద సంక్షేమ సంస్థ లేదా సంఘం ద్వారా ఆ తల్లిదండ్రులు, సంరక్షకులు లేదా భర్త సామర్థ్యాన్ని వారి విశ్వసనీయతను తెలుసుకోవడానికి దర్యాప్తు జరిపించి సంతృప్తి చెందాలి.

18. వ్యభిచార గృహం మూసివేత, ఆ ప్రదేశం నుండి నేరస్తుల తొలగింపు:

1. సెక్షన్ 7 సబ్‌సెక్షన్ (1) లో పేర్కొన్న బహిరంగ ప్రదేశానికి రెండు వందల మీటర్ల దూరంలోపు వున్న ఇల్లు, గది, ప్రదేశం లేదా అందులో కొంతభాగంలో ఎవరైనా వ్యభిచార గృహం నడుపుతున్నారనో, లేదా వ్యభిచార గృహంగా వాడుతున్నారనో, లేదా కొంతమంది వ్యభిచారులు తమ వ్యాపారం కొనసాగించడానికి దాన్ని ఉపయోగించుకుంటున్నారనో పోలీసులు ద్వారా కాని ఇతరత్రా కాని మేజిస్ట్రేటుకి సమాచారం అందితే ఆయన ఆ ఇల్లు, గది, ప్రదేశం లేదా అందులో కొంతభాగం తాలుకు యజమాని, ఆసామి, భూస్వామి, లేదా కౌలుదారుడు, అద్దెకుంటున్న వ్యక్తి, ఆక్రమితుడు లేదా ఆ ఇల్లు, గది, ప్రదేశం లేదా అందులో కొంత భాగంపై అజమాయిషీ చేసే వ్యక్తికి ఆ ప్రదేశాన్ని అక్రమ పద్ధతిలో వాడుతున్నందుకు గాను ఆ స్థలాన్ని ఎందుకు జప్తు చేసుకోకూడదో కోరుతూ ముందస్తు సంజాయిషీ నోటీసు జారీ చేయవచ్చు. ఆ సంజాయిషీ నోటీసు అందిన ఏడురోజుల లోపు ఆ వ్యక్తి సంజాయిషీ ఇవ్వాలి. ఆ వ్యక్తిని విచారించిన తర్వాత ఆ ఇంటిని, గదిని, జాగాని, లేదా దానిలో కొంత భాగాన్ని వ్యభిచార గృహంగా లేదా వ్యభిచారం కొనసాగించడానికి వాడుతున్నారని మేజిస్ట్రేటు సంతృప్తి చెందితే అప్పుడు ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేయవచ్చు.

   ఎ) ఇల్లు, గది, జాగా, లేదా భాగంలో నుండి ఆక్రమితుడు ఏడు రోజులలోపు ఖాళీ చేయాలని ఆదేశించవచ్చు.

   బి) ఆసామి, యజమాని, భూస్వామి లేదా ఆసామి, యజమాని, భూస్వామి ప్రతినిధి ఆ ఇల్లు, గది, జాగా, లేక భాగాన్ని ఏడాది కాలంలో అద్దెకు ఇచ్చే ముందు (ఆ ఇల్లు, గది, జాగా లేదా భాగంలో సెక్షన్ 15 కింద సోదా చేసినప్పుడు ఒక బాల/బాలిక కాని, మైనర్ కాని దొరికిన పరిస్థితుల్లోనైతే మూడేళ్లకాలం) మేజిస్ట్రేటు అనుమతి పొందాలి. అయితే ఈ ఇల్లు, గది, జాగా, లేదా భాగం కాని దుర్వినియోగం అవుతుందని ఆసామి, యజమాని, భూస్వామి లేదా వారి ఏజెంటుకి కాని తెలియకపోయివుంటే మేజిస్ట్రేటు తిరిగి వారికి ఆ ఇంటిని, గదిని, జాగాని, లేదా భాగాన్ని తిరిగి అప్పగించవచ్చు. ఆ విధంగా అప్పగించేటప్పుడు ఆ ఇల్లు, గది, జాగా లేదా భాగాన్ని దుర్వినియోగం చేసిన వ్యక్తులకు అద్దెకు ఇవ్వడం కాని, స్వాధీనపర్చడం కాని, వారికి ప్రయోజనం చేకూర్చడం కాని చేయకూడదని ఆ మేరకు మేజిస్ట్రేటు వారికి ఆదేశాలు జారీ చేయవచ్చు.

2. సెక్షన్ 3, లేదా సెక్షన్ 7 కింద ఒక వ్యక్తికి శిక్ష విధిస్తే మేజిస్ట్రేటు సంజాయిషీ కోరుతూ నోటీసు జారీ చేయకుండానే సబ్‌సెక్షన్ (1) కింద ఉత్తర్వు జారీ చేయవచ్చు.

3. సబ్‌సెక్షన్ (1) లేదా సబ్‌సెక్షన్ (2) కింద మేజిస్ట్రేటు కాని కోర్టుకాని జారీ చేసిన ఉత్తర్వుపై అప్పీల్‌కి వెళ్ళడానికి అస్కారం లేదు. ఆ ఉత్తర్వుని నిలుపుదల చేయాలని, కొట్టేయాలని ఎటువంటి సివిల్ లేదా క్రిమినల్ కోర్టులు ఉత్తర్వులు జారీ చేయడానికి లేదు. ఈ ఉత్తర్వులు చెల్లుబాటు కాలం పరిస్థితిని బట్టి ఏడాది నుండి మూడేళ్ల వరకు వుంటుంది.

సెక్షన్ 3 లేదా సెక్షన్ 7 కింద శిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పుని ఆ ఇల్లు, గది, జాగా లేదా భాగాన్ని వ్యభిచార గృహంగా వాడటం లేదని, వ్యభిచారులు దాన్ని తమ వ్యాపారార్థం వాడటం లేదనే కారణం చేత విచారణ కోర్టు ఇచ్చిన తీర్పుని అప్పీల్‌లో కొట్టేస్తే విచారణ జరిపిన కోర్టు సబ్‌సెక్షన్ (1) కింద ఇచ్చిన ఉత్తర్వులను కూడా కొట్టేసినట్లే.

4. అమల్లో వున్న ఇతర చట్టాల్లో ఏమున్నప్పటికీ, సబ్‌సెక్షన్ (1) లేదా సబ్‌సెక్షన్ (2) కింద మేజిస్ట్రేట్ ఒక ఉత్తర్వు జారీ చేస్తే ఆ కాలంలో ఆ ఇల్లు, గది, జాగా, లేక భాగం ఆక్రమించుకునేందుకు కుదుర్చుకున్న అద్దె లేదా ఒప్పందాలు రద్దయిపోతాయి. నిర్వీర్యమైపోతాయి.

5. ఒక ఆసామి, యజమాని లేదా భూస్వామి సబ్‌సెక్షన్ (1) క్లాజ్ (బి) కింద ఇచ్చిన ఆదేశాలను పాటించకపోతే అతను ఐదు వందల రూపాయిల వరకు జరిమానా చెల్లించాల్సి వుంటుంది.ఆ సబ్‌సెక్షన్ లోని అంశాల కింద జారీ చేసిన ఆదేశాలను పాటించకపోతే అతను సెక్షన్ 3 సబ్‌సెక్షన్ (2) లేదా సెక్షన్ 7 లోని సబ్‌సెక్షన్ (2) లోని క్లాజ్ (సి) కింద నేరం చేసినట్లు భావించాలి. అందుకు శిక్షార్హుడవుతాడు.

19. రక్షణ గృహంలో కాని కోర్టు సంరక్షణలో కాని ఉంచమని కోరుతూ దరఖాస్తు చేయడం :

1. వ్యభిచారం చేస్తున్న లేదా చేయించబడుతున్న వ్యక్తి తాను వ్యభిచారం చేస్తున్న, లేదా చేయించబడుతున్న ప్రాంతం ఏ మేజిస్ట్రేట్ పరిధిలోకి వస్తే ఆ మేజిస్ట్రేటుకి ఈ విధమైన ఉత్తర్వు జారీ చేయమని దరఖాస్తు చేయవచ్చు:

   ఎ) రక్షణ గృహంలో ఉంచాలి, లేదా

   బి) సబ్‌సెక్షన్ (3) లో పేర్కొన్న విధంగా కోర్టు సంరక్షణలో ఉంచాలి.

2. సబ్‌సెక్షన్ (3) కింద విచారణ జరుగుతున్న కాలంలో ఆ వ్యక్తిని పరిస్థితులను బట్టి ఎవరి సంరక్షణలో ఉంచితే మంచిదని భావిస్తారో వారి సంరక్షణలో ఉంచమని ఆదేశించవచ్చు.

3. దరఖాస్తుదారుని వేదనలు విన్న తర్వాత, దరఖాస్తుదారుని వ్యక్తిత్వం, ఇంట్లో పరిస్థితులు, ఆమెకు పునరావాసం కల్పించడానికి వున్న అవకాశాలపై ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం, 1958 కింద నియమితులైన ప్రొబేషన్ అధికారితో విచారణ జరిపించడంసహా అవసరమైన విధంగా విచారణ జరిపి సంతృప్తి చెందిన ఎడల ఈ సెక్షన్ కింద ఉత్తర్వు జారీ చేయవచ్చు. కారణాలను పేర్కొంటూ మేజిస్ట్రేటు దరఖాస్తుదారుని ఈ విధంగా అదుపులో ఉంచాలని ఉత్తర్వు జారీ చేయవచ్చు.

   i) రక్షణ గృహంలో; లేదా

   ii) దిద్దుబాటు సంస్థలో; లేదా

   iii) ఉత్తర్వులో పేర్కొన్న కాలంలో మేజిస్ట్రేట్ నియమించిన వ్యక్తి ఆధ్వర్యంలో.

20. ఓ ప్రాంతం నుండి వ్యభిచారి తొలగింపు :

1. తన పరిధిలోని ప్రాంతంలో నివసించే లేదా సంచరించే వ్యక్తి వ్యభిచారి అనే సమాచారం అందిన మీదట మేజిస్ట్రేట్ ఆ సమాచార సారాంశాన్ని రికార్డు చేసుకుని ఆ వ్యక్తిని తన ముందు హాజరుకమ్మని,

ఆ ప్రాంతం నుండి తనని ఎందుకు తొలగించకూడదో, అక్కడ అతని పునఃప్రవేశాన్ని ఎందుకు నిషేధించకూడదో సంజాయిషీ కోరుతూ నోటీసు జారీ చేయవచ్చు.

2. సబ్‌సెక్షన్ (1) కింద జారీ చేసే నోటీసుతో పాటు పైన పేర్కొన్న రికార్డు ప్రతిని జతపరచి, నోటీసుతో పాటు ఆ ప్రతిని నోటీసు ఎవరిపై జారీ చేశారో వారికి ఇవ్వాలి.

3. సబ్‌సెక్షన్ (2) కింద నోటీసు జారీ చేసిన తర్వాత మేజిస్ట్రేటు తనకు అందిన సమాచారం వాస్తవికతను నిర్ధారించుకోడానికి విచారణ జరపాలి. ఆ వ్యక్తి సాక్ష్యం ప్రవేశపెట్టడానికి అవకాశం కల్పించాలి. అవసరమని భావిస్తే మరింత సాక్ష్యం సేకరించవచ్చు. ఈ విధమైన విచారణ జరిగిన తర్వాత ఆ వ్యక్తి వ్యభిచారని అతనికి అనిపిస్తే, మరియు సాధారణ ప్రజల ప్రయోజనం దృష్ట్యా ఆ వ్యక్తిని అక్కడ నుండి తొలగించడం అవసరమని, లేదా అతని పునఃప్రవేశాన్ని నిషేధించడం అవసరమనిపిస్తే, మేజిస్ట్రేటు ఆ వ్యక్తికి వ్రాతపూర్వకమైన ఉత్తర్వు అందేట్టు చూసి, ఆ వ్యక్తి ఉత్తర్వు జారీ చేసిన ఏడు రోజుల లోపు ఒక తేదీ (తేదీని ఉత్తర్వులో ప్రస్తావించాలి) నుండి తన పరిధిలో కాని ఇతరత్రకాని ఏదైనా ప్రదేశం నుండి మరో ప్రదేశానికి ఫలానా దారంట లేదా దారుల వెంట, ఉత్తర్వులో పేర్కొన్న సమయానికి వెళ్లిపోవాలని, తన పరిధిలోని ప్రాంతంలో పునఃప్రవేశించాలంటే వ్రాతపూర్వకంగా మేజిస్ట్రేటు అనుమతి తీసుకోవాలని ఆ ఉత్తర్వులో పేర్కొనవచ్చు.

4. ఎవరైనా –

   ఎ) ఈ సెక్షన్ కింద జారీ అయిన ఉత్తర్వును నిర్దేశించిన కాలంలో పాటించడంలో విఫలమైతే లేదా పునఃప్రవేశాన్ని నిషేధిస్తూ అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఉల్లంఘించి అనుమతి లేకుండా పునఃప్రవేశిస్తే; లేదా

   బి) ఈ సెక్షన్ కింద ఒక వ్యక్తిపై ఆ ప్రదేశంలో ఉండకూడదనే ఆదేశాలున్నాయని తెలిసి, అతను పునఃప్రవేశించడానికి పొందాల్సిన అనుమతి పొందలేదని తెలిసి కూడా ఆ ప్రాంతంలో ఆ వ్యక్తి ఆశ్రయమిచ్చినా లేదా దాచినా

రెండు వందల రూపాయిల వరకు జరిమానాకు శిక్షార్హులవుతారు. ఆ నేరాన్ని కొనసాగిస్తూ పోతే నేరం చేయడం మొదలెట్టిన రోజు నుండి ప్రతి రోజుకి ఇరవై రూపాయిల చొప్పున అదనపు జరిమానా విధించాల్సి వుంటుంది.

21. రక్షణ గృహం :

1. రాష్ట్ర ప్రభుత్వం తన విచక్షణ మేరకు ఈ చట్టం కింద తనకు సముచితం అనిపించినన్ని రక్షణ గృహాలు, దిద్దుబాటు సంస్థలు స్థాపించవచ్చు. ఆ విధంగా స్థాపించినప్పుడు వాటిని తగు నిబంధనల ప్రకారం నడపాలి.

2. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కాకుండా ఏ వ్యక్తి, సంస్థ రక్షణ గృహాలు, దిద్దుబాటు సంస్థలు స్థాపించడానికి, నడపడానికి లేదు. ఏ వ్యక్తయినా, సంస్థయినా రక్షణ గృహాన్ని, దిద్దుబాటు సంస్థను కాని స్థాపించాలంటే లేదా నడపాలంటే ముందుగా ఈ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే లైసెన్సులోని షరతులకు లోబడి అందుకు అనుకూలంగా వ్యవహరించి తీరాలి.

3. ఒక రక్షణ గృహం కాని దిద్దుబాటు సంస్థ కాని స్థాపించడానికి కాని నడపడానికి కాని ఏ వ్యక్తయినా, అధికార సంస్థయినా దరఖాస్తు పెట్టుకుంటే రాష్ట్ర ప్రభుత్వం తగిన రూపంలో ఆ రక్షణ గృహం కాని దిద్దుబాటు సంస్థ స్థాపించడానికి మరియు నడపడానికి కాని లేదా పరిస్థితిని బట్టి నడపడానికి లైసెన్సు జారీ చేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విధమైన లైసెన్సు జారీ చేసేటప్పుడు చట్టం కింద రూపొందించిన నిబంధనల ప్రకారం షరతులు విధించవచ్చు.

అయితే సాధ్యమైన చోట్ల ఈ రక్షణ గృహాలు లేదా దిద్దుబాటు సంస్థల యాజమాన్యాన్ని స్త్రీలకు అప్పగించాలనే షరతు విధించవచ్చు.

స్త్రీలు, బాలికల అనైతిక తరలింపు (సవరణ) చట్టం, 1978 (1978లో 46వ చట్టం) అమల్లోకి వచ్చిన నాటికి ఏ వ్యక్తయినా, సంస్థయినా ఏదైనా దిద్దుబాటు సంస్థను నడుపుతుంటే ఆ వ్యక్తి కాని, సంస్థ కాని ఈ సవరణ చట్టం అమల్లోకి వచ్చిన ఆరునెలల్లోపు లైసెన్సు కోసం దరఖాస్తు పెట్టుకోవాలి.

4. లైసెన్సులు జారీ చేసే ముందు రాష్ట్ర ప్రభుత్వం అందుకు అందిన దరఖాస్తుపై సంపూర్ణ కూలంకషమైన దర్యాప్తు జరపడానికి ఒక అధికారిని కాని ఒక అధికార సంస్థని కాని నియమించాలి. దర్యాప్తు ఫలితాన్ని నివేదిక రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలి. ఆయా అధికారి, అధికార సంస్థ దర్యాప్తు చేయడానికి తగిన నిబంధనలను పాటించాలి.

5. లైసెన్సు ముందుగా రద్దు చేయని ఎడల లైసెన్సులో పేర్కొన్న కాలమంతటా అది అమల్లో వుంటుంది. లైసెన్సు కాలం పూర్తయ్యే తేదీకి ముప్పయి రోజులలోపు దరఖాస్తు పెట్టుకుంటే తగిన కాలానికి పొడిగించే అవకాశముంది.

6. ఈ చట్టం కింద మంజూరైన లేదా పునః మంజూరైన లైసెన్సును వేరే వారి పేరిట మార్చడానికి లేదు.

7. ఈ చట్టం కింద లైసెన్సు పొందిన వ్యక్తి కాని, సంస్థ కాని, లేదా వారి ఏజెంటు కాని, ఉద్యోగి కాని చట్టం కింద పెట్టిన షరతులను కాని, ఈ చట్టం కింద రూపొందించిన నియమాలను కాని ఉల్లంఘించినా లేదా ఆ రక్షణ గృహం కాని దిద్దుబాటు సంస్థ పని తీరు, యాజమాన్యం, లేదా నిర్వహణ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి అసంతృప్తిగా అనిపించినా ఈ చట్టం కింద ఇతరత్రా శిక్ష విధించే విషయంలో సంబంధం లేకుండా లైసెన్సును రద్దు చేస్తూ వ్రాతపూర్వకంగా ఉత్తర్వు జారీ చేయవచ్చు. అందులో రద్దు చేయడానికి గల కారణాలను పేర్కొనాలి.

అయితే లైసెన్సు ఎందుకు రద్దు చేయకూడదని లైసెన్సు దారునికి సంజాయిషీ చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా ఇటువంటి ఉత్తర్వు జారీ చేయకూడదు.

8. పై సబ్‌సెక్షన్ కింద రక్షణ గృహానికి కాని దిద్దుబాటు సంస్థకు కాని సంబంధించి లైసెన్సు రద్దయితే అటువంటి రక్షణ గృహం రద్దయిన తేదీ నుండి పని చేయడానికి వీల్లేదు.

9. ఈ విషయంలో చేసే నియమాలకు లోబడి రాష్ట్రప్రభుత్వం ఈ చట్టం కింద జారీ చేసిన లేదా కొనసాగిస్తున్న లైసెన్సును మార్చడం లేదా సవరించడం కూడా చేయవచ్చు.

9 ఎ) రాష్ట్ర ప్రభుత్వం కాని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అధికారి కాని ఈ విషయంలో రూపొందించిన

నియమాలకు లోబడి ఒక వ్యక్తి వ్యవహార శైలిని దృష్టిలో పెట్టుకుని, అతనికి ఎటువంటి శిక్షణ అవసరమో, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని ఆ బందీని ఒక రక్షణ గృహం నుండి మరో రక్షణ గృహానికి కాని దిద్దుబాటు సంస్థకి కాని, దిద్దుబాటు సంస్థ నుండి మరో దిద్దుబాటు సంస్థకు కాని రక్షణ గృహానికి కాని బదిలీ చేయవచ్చు.

అయితే ఇందుకు :

ఎ) ఈ సబ్‌సెక్షన్ కింద బదిలీ అయిన వ్యక్తి తాను ఉండాల్సిన గృహంలో లేదా సంస్థలో ఎంత కాలం ఉండాలో అంతకు మించిన కాలం బదిలీ అయిన గృహంలో కాని సంస్థలో కాని ఉండాల్సిన అవసరం లేదు.

బి) ఈ సబ్‌సెక్షన్ కింది జారీ చేసిన ప్రతి ఉత్తర్వులో కారణాలను నమోదు చేయాలి.

10. ఈ సెక్షన్‌లోని అంశాలకు భిన్నంగా ఎవరైనా ఒక రక్షణ గృహాన్ని కాని దిద్దుబాటు సంస్థను కాని స్థాపించినా, నడిపినా మొదటిసారి నేరానికి పాల్పడితే వేయి రూపాయిల వరకు జరిమానాకి, రెండవ లేదా మరిన్ని దఫాలు నేరానికి పాల్పడితే ఏడాది వరకు కారాగార శిక్ష లేదా రెండు వేల రూపాయిల జరిమానా లేదా రెండింటికి శిక్షార్హులవుతారు.

21ఎ) రికార్డులు చూపడం :

సెక్షన్ 21 సబ్‌సెక్షన్ (3) కింద రక్షణ గృహం లేదా దిద్దుబాటు సంస్థ స్థాపన కోసం లేదా నడపడం కోసం ఆయా సందర్భాల్లో నడపడం కోసం లైసెన్సు పొందిన ఏ వ్యక్తయినా, సంస్థయినా కోర్టు అడిగినప్పుడల్లా అటువంటి గృహానికి లేదా సంస్థకు చెందిన రికార్డులను మరియు ఇతర దస్తావేజులను కోర్టు ముందు హాజరుపర్చాలి.

22. విచారణ : సెక్షన్ 3, సెక్షన్ 4, సెక్షన్ 5, సెక్షన్ 6, సెక్షన్ 7 లేదా సెక్షన్ 8 కింద జరిగిన నేరాన్ని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు లేదా ఒకటవ తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కంటే తక్కువ హోదాకాని కోర్టు విచారించాలి.

22ఎ. ప్రత్యేక కోర్టులు స్థాపించే అధికారం :

1. ఈ చట్టం కింద జరిగే నేరాల సత్వర విచారణ నిమిత్తం ఆయా జిల్లాల్లో లేదా మెట్రోపాలిటన్ ప్రాంతంలో అవసరాన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును సంప్రదించి అధికార గెజిట్‌లో, నోటిఫికేషన్ జారీ చేసి ఆ జిల్లాలోని మెట్రోపాలిటన్ ప్రాంతంలో కాని ఒకటి లేదా అంతకు మించిన ఒకటవ తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులు లేదా అవసరాన్ని బట్టి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులను స్థాపించవచ్చు.
2. హైకోర్టు కనుక ఇతరత్రా ఏమీ ఆదేశాలు జారీ చేయని ఎడల సబ్‌సెక్షన్ (1) కింద స్థాపించిన కోర్టులకు కేవలం ఈ చట్టం కింద నేరాలను విచారించే అధికారముంటుంది.
3. సబ్‌సెక్షన్ (1) కింద స్థాపించిన కోర్టులకు సారధ్యం వహించే అధికారికి వుండే పరిధి, అధికారాలు సబ్‌సెక్షన్ (2) కి లోబడి జిల్లా లేదా ఆయా మెట్రోపాలిటన్ ప్రాంతమంతటా వ్యాపించి వుంటుంది.

4. సబ్‌సెక్షన్ (1) కింద ఏదైనా జిల్లా లేదా మెట్రోపాలిటన్ ప్రాంతంలో స్థాపించబడిన కోర్టుని పైన పేర్కొన్న అంశాలకు లోబడి సెక్షన్ 11 సబ్‌సెక్షన్ (1) కింద లేదా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లోని సెక్షన్ 16 సబ్‌సెక్షన్ (1) కింద స్థాపించిన కోర్టుగా భావించాల్సి వుంటుంది. ఈ కోర్టులకు సంబంధించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని అంశాలు వర్తిస్తాయి.

వివరణ : ఈ సెక్షన్‌లో "హైకోర్టు" అంటే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లోని సెక్షన్ 2 క్లాజ్ (ఇ)లో ఇచ్చిన అర్థం మాదిరిగానే వుంటుంది.

22ఎఎ) ప్రత్యేక కోర్టులు స్థాపించడానికి కేంద్ర ప్రభుత్వానికి వుండే అధికారం :

1. ఈ చట్టం కింద వివిధ రాష్ట్రాల్లో జరిగే నేరాల సత్వర విచారణ కోసం అవసరమని భావిస్తే కేంద్ర ప్రభుత్వం సంబంధిత హైకోర్టుని సంప్రదించి అధికార గెజిట్‌లో నోటిఫికేషన్ జారీ చేసి అటువంటి నేరాల విచారణ కోసం ఒకటి లేదా మరిన్ని ఒకటవ తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేటు లేదా మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులను స్థాపించవచ్చు.
2. సెక్షన్ 22ఎ కింద స్థాపించిన కోర్టులకు ఏయే అంశాలు వర్తిస్తాయో అవి సబ్‌సెక్షన్ (1) కింద స్థాపించిన కోర్టులకి కూడా వర్తిస్తాయి.

22బి. సంక్షిప్త విచారణ జరపడానికి కోర్టుకి ఉండే అధికారం :

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 లో ఏమున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సరైనదిగా భావిస్తే ఈ చట్టం కింద జరిగే నేరాలపై మేజిస్ట్రేటు (సెక్షన్ 22 ఎ సబ్‌సెక్షన్ (1) కింద స్థాపించిన కోర్టుకి సారధ్యం వహించే అధికారి సహా) సంక్షిప్త విచారణ జరపాలని ఆదేశించవచ్చు. ఇటువంటి విచారణలో వీలైనంత వరకు కోడ్‌లోని సెక్షన్ 262 నుండి సెక్షన్ 265 (ఆ రెండింటిని కలుపుకుని) లోని అంశాలు వర్తిస్తాయి. ఇదిలా వుండగా ఈ సెక్షన్ ప్రకారం సంక్షిప్త విచారణ జరిపిన మొదట శిక్ష పడిన ఎడల మేజిస్ట్రేటు ఒక ఏడాది మించకుండా కారాగార శిక్ష విధించడం న్యాయసమ్మతమౌతుంది.

ఈ సెక్షన్ కింద సంక్షిప్త విచారణ ప్రారంభించేటప్పుడు కాని, ఆ తర్వాత క్రమంలో కాని కేసు స్వభావాన్ని బట్టి ఏడాదికి మించిన కారాగార శిక్ష విధించే పరిస్థితి వుందని కాని, లేకపోతే మరే ఇతర కారణాల చేతనైనా విచారణ సంక్షిప్త రూపంలో జరపడానికి సబబు కాదని మేజిస్ట్రేట్‌కి అనిపిస్తే ఆయన ఇరుపక్షాల వారి వాదనలు విన్నతర్వాత ఆ మేరకు ఉత్తర్వులను రికార్డు చేయాలి. ఆ తర్వాత క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ని అనుసరించి అప్పటికే విచారించిన సాక్షిని తిరిగి కోర్టుకి రప్పించి, విచారణ జరపడం కాని, పునఃవిచారణ జరపడం కాని చేయవచ్చు.

23. నియమాలు రూపొందించే అధికారం :

1. ఈ చట్టం ఉద్దేశాలను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అధికార గెజిట్ నోటిఫికేషన్ ద్వారా నియమాలు జారీ చేయవచ్చు.
2. పైన పేర్కొన్న అధికారాలకు సాధారణ రూపంలో కాని, నిర్దిష్టరూపంలో కాని భిన్నంగా వుండని నియమాలను ఇందుకోసం రూపొందించవచ్చు.

ఎ) ఏదైనా ఒక ప్రదేశాన్ని బహిరంగ ప్రదేశంగా ప్రకటించడం;

బి) సెక్షన్ 17 సబ్‌సెక్షన్ (1) కింద భద్రమైన సంరక్షణ ఉత్తర్వులు పొందిన వ్యక్తుల సంరక్షణార్థం, వారి పోషణార్థం తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలు;

బిబి) సెక్షన్ 10ఎ సబ్‌సెక్షన్ (3) కింద దిద్దుబాటు సంస్థ నుండి నేరస్తుని విడుదల చేయడానికి నేరస్తునికి మంజూరు చేయాల్సిన లైసెన్సు రూపొందించడానికి;

సి) ఈ చట్టం కింద వ్యక్తులను రక్షణ గృహాల్లో, ఆయా పరిస్థితులను బట్టి దిద్దుబాటు సంస్థల్లో నిర్బంధించడం, వారిని వాటిలో వుంచడం, మరియు వారి పోషణకు సంబంధించి;

డి) సెక్షన్ 11 లోని అంశాలను అమలు చేసేందుకు గాను విడుదలైన ఖైదీల ఇంటి చిరునామా, దానిలో జరిగిన మార్పులు లేదా గైర్హాజరీకి సంబంధించి ఇవ్వాల్సిన నోటిఫికేషన్ గురించి;

ఇ) సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (1) కింద ప్రత్యేక పోలీసు అధికారికి అప్పగించాల్సిన అధికారాలు గురించి;

ఎఫ్) సెక్షన్ 18 లోని అంశాలను అమల్లోకి తెచ్చేందుకు గాను;

జి) i) సెక్షన్ 21 కింద రక్షణ గృహాలు, దిద్దుబాటు సంస్థలను స్థాపించడం, నడపడం, వాటి యాజమాన్యం వాటిపై అజమాయిషీ, మరియు ఆ గృహాలు సంస్థల్లో పనిచేసే వ్యక్తుల నియామకం, వారికిచ్చే అధికారాలు వారు నిర్వర్తించాల్సిన విధులు గురించి;

ii) లైసెన్సు కోసం దరఖాస్తు పెట్టుకోవాల్సిన విధానం, ఆ దరఖాస్తులో ఉండాల్సిన వివరాలు;

iii) లైసెన్సులు మంజూరు చేయడానికి లేదా పొడిగింపుకు అనుసరించే విధానం, లైసెన్సు కోసం లేదా పొడిగింపు కోసం దరఖాస్తు ఎప్పటిలోపు పెట్టుకోవాలి, మరియు లైసెన్సు కోసం పెట్టుకున్న దరఖాస్తుపై సంపూర్ణ, కులంకష దర్యాప్తు జరపడానికి అనసరించాల్సిన విధానం;

iv) లైసెన్సు ఉండాల్సిన రూపం, అందులో పెట్టాల్సిన షరతులు;

v) రక్షణ గృహాలు, దిద్దుబాటు సంస్థల ఆదాయవ్యయాలకు సంబంధించి లెక్కలను రాసుకోవడంలో పాటించాల్సిన విధానం, వాటిని ఆడిట్ చేసే విధానం;

vi) లైసెన్సు మంజూరు చేసే వారు ఏ విధంగా రిజిస్టర్లు ప్రకటనలు రూపొందించాలి, భద్రపర్చాలి. అవి ఉండాల్సిన రూపం.

vii) రక్షణ గృహాల్లో, దిద్దుబాటు సంస్థల్లో ఉండే వారి సంరక్షణ,పోషణ, శిక్షణ, చికిత్స, బోధన, అదుపు మరియు క్రమశిక్షణ;

viii) అటువంటి వ్యక్తులను కలుసుకోవడం, వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం గురించి;

ix) రక్షణ గృహాలు లేదా దిద్దుబాటు సంస్థల్లో నిర్బంధించాలని శిక్షపడిన వారిని అటువంటి రక్షణ గృహాలు లేదా సంస్థలకు పంపించే ఏర్పాట్లు చేసేంతవరకు తాత్కాలిక నిర్బంధంలో ఉంచడం గురించి;

x) ఒక బందీని ఈ విధంగా బదిలీ చేయాల్సి వచ్చినప్పుడు –

ఎ) ఒక రక్షణ గృహం నుండి మరో దానికో లేక ఒక దిద్దుబాటు సంస్థకో;

బి) సెక్షన్ 21 సబ్‌సెక్షన్ (9ఎ) కింద ఒక దిద్దుబాటు సంస్థ నుండి మరో దానికో లేక రక్షణ సంస్థకో;

xi) కోర్టు ఉత్తర్వు మేరకు రక్షణ గృహంలో కాని దిద్దుబాటు సంస్థలో కాని చెడు ప్రభావం చూపుతున్నారనో, ఇబ్బందికరంగా ఉంటున్నారనే కారణంచే ఆ వ్యక్తి రక్షణ గృహం నుండి కాని దిద్దుబాటు సంస్థ నుండి ఖైదుకు బదిలీ చేయడం గురించి, ఖైదులో నిర్బంధ కాలం గురించి;

xii) సెక్షన్ 7 లేదా సెక్షన్ 8 కింద శిక్ష పడిన వారిని రక్షణ గృహంలో కాని దిద్దుబాటు సంస్థలో ఉంచడం గురించి, వారు ఆ గృహం లేదా సంస్థలో ఉండాల్సిన కాలం గురించి

xiii) రక్షణ గృహం నుంచి కాని దిద్దుబాటు సంస్థ నుంచి బందీలను బేషరతుగా కాని, షరతులతో కాని విడుదల చేయడం గురించి మరియు షరతులు ఉల్లంఘించినప్పుడు వారిని అరెస్టు చేయడం గురించి

xiv) కొద్దిపాటి కాలం కోసం బందీలను గైర్హాజరు కావడానికి అనుమతించడం గురించి

xv) వ్యక్తులను వుంచే, నిర్బంధించే, బాగోగులు చూసుకునే రక్షణ గృహాలు, దిద్దుబాటు సంస్థలు, ఇతర సంస్థల తనిఖీల గురించి;

హెచ్) అవసరమైన మరియే ఇతర అంశాలపై నిబంధన అవసరమైనప్పుడు

3. సబ్‌సెక్షన్ (2) క్లాజ్ (డి) లేదా క్లాజ్ (బి) కింద రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నియమాన్ని ఉల్లంఘిస్తే అందుకు రెండు వందల యాభై రూపాయిల వరకు జరిమానాకు శిక్షార్హులవుతారు.

24. ఈ చట్టం కొన్ని ఇతర చట్టాలను తూలనాదేదిగా ఉండదు :

బాల నేరస్తులకు సంబంధించి సంస్కరణ పాఠశాలల చట్టం, 1897 (1897 లోని 8వ చట్టం) కి చెందిన అంశాలను కాని, ఈ చట్టాన్ని మారుస్తూ రూపొందించిన రాష్ట్ర శాసనాలను కాని ఈ చట్టంలోని అంశాలు తూలనాడే విధంగా వున్నాయని భావించాల్సిన అవసరం లేదు.

25. శాసనాల రద్దు, వాటి కింద తీసుకున్న చర్యల రక్షణ :

1. వ్యక్తుల అనైతిక తరలింపు అణచివేత కోసం, లేదా నివారణ కోసం వున్న అన్ని రాష్ట్ర శాసనాలు ఈ చట్టంలోని సెక్షన్ 1 కింద కాకుండా ఇతరత్రా ఆ రాష్ట్రంలో అమల్లోకి వచ్చినప్పుడు అమల్లోకి వచ్చిన తేదీ నుండి అవి రద్దయిపోతాయి.
2. సబ్‌సెక్షన్ (1) లో పేర్కొన్న చట్టం కాని రాష్ట్ర శాసనం కాని రద్దయినప్పటికీ ఆయా రాష్ట్ర శాసనం కింద చేసిన పనులు, లేదా తీసుకున్న చర్యలు (ఆదేశాలు ఇవ్వడం, రిజిస్టర్లు, భద్రపరచడం, నియమాలు రూపొందించడం, ఉత్తర్వులు జారీ చేయడం, ఆంక్షలు విధించడం మొదలైనవి) ఈ చట్టానికి భిన్నంగా లేనంత వరకు ఆ పనులను, చర్యలను ఆనాటి నుండి చట్టం కింద తీసుకున్న చర్యలుగానే భావించాల్సి వుంటుంది. ఈ చట్టం కింద ఆ చర్యలను అధిగమించే అంశాలు అమల్లోకి వచ్చే వరకు ఆ చర్యలు కొనసాగుతాయి.

వివరణ : ఈ సెక్షన్‌లో "రాష్ట్ర శాసనం" అనే పద ప్రయోగంలో "ప్రాంతీయ శాసనం" కూడా ఇమిడుంది.

పట్టిక

(సెక్షన్ 2 (సి) చూడండి)

సెక్షన్	అధికారాలను వినియోగించే సమర్థతున్న మేజిస్ట్రేటు
7(1)	జిల్లా మేజిస్ట్రేటు
11(4)	మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు కాని ఒకటవ తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేటు
15(5)	మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు, ఒకటవ తరగతి జ్యుడీషయల్ మేజిస్ట్రేటు, జిల్లా మేజిస్ట్రేటు లేదా సబ్ డివిజనల్ మేజిస్ట్రేటు
16	మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు, ఒకటవ తరగతి జ్యుడీషయల్ మేజిస్ట్రేటు, జిల్లా మేజిస్ట్రేటు లేదా సబ్ డివిజనల్ మేజిస్ట్రేటు
18	జిల్లా మేజిస్ట్రేటు లేదా సబ్ డివిజనల్ మేజిస్ట్రేటు
19	మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు, ఒకటవ తరగతి జ్యుడీషయల్ మేజిస్ట్రేటు, జిల్లా మేజిస్ట్రేటు లేదా సబ్ డివిజనల్ మేజిస్ట్రేటు
20	జిల్లా మేజిస్ట్రేటు లేదా సబ్ డివిజనల్ మేజిస్ట్రేటు లేదా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారాలిచ్చిన ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు
22బి	మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు, ఒకటవ తరగతి జ్యుడీషయల్ మేజిస్ట్రేటు.

*****

14. పూర్వ గర్భధారణ మరియు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994

(PNDT ACT)

జన్యు లోపాలు లేదా జీవక్రియల సంబంధిత వ్యాధులు లేదా క్రోమోజోముల వైపరీత్యాలు లేదా కొన్ని పుట్టుకతోనే సంక్రమించే వ్యాధులు లేదా సెక్స్ సంబంధిత వ్యాధులను గుర్తించేందుకు నిర్వహించే ప్రసవ పూర్వ పరీక్షలను మరియు గర్భధారణకి ముందు లేదా గర్భం దాల్చిన తర్వాత లింగ ఎంపికకు నిర్వహించే పరీక్షలను ఈ చట్టం నిషేధిస్తుంది. భ్రూణ హత్యలు మరియు వాటికి సంబందించిన ఇతర సమస్యలకు దారి తీసే లింగ నిర్ధారణ కోసం పైన పేర్కొన్న పరీక్షలను నివారించడం ఈ చట్టం యొక్క లక్ష్యం.

అధ్యాయం - I

ప్రాథమికం

1. ఈ చట్టం పేరు, పరిధి, మరియు అమలులోకి వచ్చే తేది :

1. ఈ చట్టాన్ని పూర్వ గర్భధారణ మరియు ప్రసవ పూర్వ పరీక్షల (లింగ ఎంపిక నిషేధ) చట్టం, 1994 అనవచ్చు.
2. జమ్మూ కాశ్మీర్ మినహా ఈ చట్టం భారతదేశం అంతటా వర్తిస్తుంది.
3. కేంద్ర ప్రభుత్వం, రాజపత్రంలో ప్రకటించిన తేదీ నుండి ఈ చట్టం అమలులోకి వస్తుంది.

2. నిర్వచనాలు : సందర్భం వేరే రకంగా ఉంటే తప్ప ఈ చట్టంలో

ఎ) "సముచిత అధికారి" అంటే సెక్షన్ 17 క్రింద నియమితుడైన సముచిత అధికారి.

బి) "బోర్డు" అనగా సెక్షన్ 7 క్రింద కేంద్ర పర్యవేక్షక ఏర్పరచబడిన బోర్డు.

బిఎ) "కన్‌సెప్టస్ :" అనగా అండం ఫలదీకరణ తర్వాత ప్రసవం వరకు ఉత్పన్నమైన అన్ని నిర్మాణాలు – పిండం, పింద బాహ్యత్వచాలు మొదలైనవి.

బిబి) "పిండం" అనగా ఫలదీకరణ జరిగిన తర్వాత మొదటి ఎనిమిది వారాలు గర్భంలో పెరుగుతున్న జీవకణజాలాన్ని పిండం అంటారు.

బిసి) "భ్రూణం" : ఫలదీకరణ జరిగిన ఎనిమిది వారాల నుంచి గర్భం వరకు ఉన్న ఏ దశనైనా భ్రూణం అంటారు. (పెరుగుదల ఆగిపోయిన దశని మినహాయించి)

సి) రోగులకు జన్యు సంబంధిత సలహాలు ఇచ్చే ఏదైనా సంస్థ, ఆసుపత్రి, నర్సింగ్‌హోమ్ చోటుని జన్యు సలహా కేంద్రం అంటారు.

డి) గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు వినియోగించే క్లినిక్ సంస్థ, ఆసుపత్రి, నర్సింగ్‌హోమ్ లేదా చోటుని "జన్యు క్లినిక్" అంటారు.

వివరణ : భ్రూణ యొక్క లింగ నిర్ధారణకై వినియోగించే అల్ట్రాసౌండ్ యంత్రం, ఇమేజింగ్ యంత్రం లేదా స్కానర్ లేదా ఇతర పరికరాలు కలిగి వాహకాన్ని కూడా "జన్యు క్లినిక్" అంటారు. గర్భధారణకి ముందు, లింగ నిర్ధారణకి, గర్భం దాల్చిన, తర్వాత లింగ ఎంపికకి వాడబడే పోర్టబుల్ పరికరాలను కూడా "జన్యుక్లినిక్" గా పరిగణించాలి.

ఇ) ఈ గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్ష కోసం జన్యు క్లినిక్ నుండి సేకరించిన నమూనాలను పరీక్షించి, విశ్లేషించేందుకు వాడే ప్రయోగశాల మరియు అటువంటి సదుపాయాలను అందించే చోటును "జన్యు ప్రయోగశాల" అంటారు.

వివరణ: ఈ క్లాజ్ ప్రయోజనాల రీత్యా, భ్రూణం యొక్క లింగనిర్ధారణకై వినియోగించగలిగిన ఆల్ట్రా సౌండ్ యంత్రం, ఇమేజింగ్ యంత్రం లేదా స్కానర్ లేదా ఇతర పరికరాలను కలిగిన ఉన్న చోటును "జన్యు ప్రయోగశాల" అంటారు. గర్భధారణకి ముందు లింగనిర్ధారణకి, గర్భం దాల్చిన తర్వాత లింగ ఎంపికకు వాడే పోర్టబుల్ పరికరాలను కూడా "జన్యు ప్రయోగశాల" అంటారు.

యఫ్) "గైనకాలజిస్ట్" (స్త్రీ సంబంధ వ్యాధి నిపుణులు) అనగా స్త్రీ సంబంధ వ్యాధుల శాస్త్రం మరియు ప్రసూతి వైద్య శాస్త్రాలలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అర్హత కలిగిన వ్యక్తి.

జి) "వైద్య జన్యు శాస్త్రవేత్త" అనగా జన్యు శాస్త్రంలోని లింగ ఎంపిక మరియు గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలలో డిగ్రీ లేదా డిప్లొమా పొందిన వ్యక్తి లేదా ఈ రంగాలలో కనీసం రెండు సంవత్సరాల అనుభవం కలిగిన వ్యక్తి అయితే అనుభవంతో పాటు అతడు క్రింది అర్హతలు కలిగి ఉండాలి.

i) భారత వైద్య కౌన్సిల్ చట్టం, 1956 (102 of 1956) క్రింద ఏదైనా వైద్య పట్టాలు పొంది ఉండాలి.

ii) జీవశాస్త్రాలలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ కలిగి ఉండాలి.

హెచ్) "పిడియాట్రీషియన్" (చిన్నపిల్లల వైద్య నిపుణులు) అనగా చిన్న పిల్లల వైద్యశాస్త్రంలో పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీ కలిగి ఉండాలి.

ఐ) ప్రసవ పూర్వ పరీక్షల నిర్ధారణ ప్రక్రియలు అనగా అల్ట్రాసోనోగ్రఫీ, ఫీటోస్కోపి, ఉమ్మనీరు నమూనాలు తీసుకోవటం లేక తీసివేయడం, గర్భకోశ చూషకాలు, పిండం, రక్తం మరే ఇతర కణజాలం లేదా పురుషుడి ద్రవం లేదా గర్భధారణకి ముందు లేక తర్వాత స్త్రీ యొక్క ద్రవాన్ని జన్యు పరిశోధనశాల లేక జన్యుక్లినిక్‌కి, విశ్లేషణ లేక గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నిమిత్తం గర్భధారణకి ముందు లేక తర్వాత దాని లింగ ఎంపికకై పంపితే అటువంటి స్త్రీ సంబంధ వ్యాధులు, ప్రసూతి సంబంధిత లేక వైద్య ప్రక్రియ లన్నింటినీ "గర్భస్థ శిశు నిర్ధారణ ప్రక్రియలు" అంటారు.

జె) గర్భస్థ శిశు నిర్ధారణ పద్ధతులు అన్ని గర్భస్థ శిశు నిర్ధారణ ప్రక్రియలు మరియు గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలను కలిగి ఉంటాయి.

కె) "ప్రసవ పూర్వ నిర్ధారణ పరీక్ష" అనగా ఉమ్మనీరు, గర్భకోశ చూషకాలు, రక్తం లేదా కణజాలం లేదా గర్భిణీ స్త్రీ యొక్క ద్రవాలు లేదా జన్యు లేక జీవప్రక్రియల సంబంధ వ్యాధులు లేక క్రోమోజోముల

వైకల్యాలు లేక పుట్టుకతో సంక్రమించే వ్యాధులు లేక హిమోగ్లోబిన్ సంబంధిత వ్యాధులు లేక సెక్స్ సంబంధ వ్యాధులు విశ్లేషణకై చేసే పరీక్ష.

యల్) "నిర్ణీతమైన" అనగా ఈ చట్టం క్రింద నిర్ణయించబడిన

యమ్) "నమోదు చేసుకోబడిన వైద్యుడు" అనగా భారత వైద్య కౌన్సిల్ చట్టం, 1956 (102 of 1956) సెక్షన్ 2 క్లాజ్ (హెచ్) క్రింద గుర్తించబడిన వైద్య అర్హతను కలిగి ఉన్న వైద్యుడు. అతడి పేరు రాష్ట్ర వైద్య రిజిష్టర్‌లో నమోదై ఉండాలి.

యన్) "నియంత్రణలు" అనగా ఈ చట్టం క్రింద బోర్డు ద్వారా రూపొందించబడిన నియంత్రణలు.

ఒ) పిండం ఒక ఖచ్చితమైన లింగానికి చెందినది అని నికరం చేసుకునేందుకు లేదా సంభావ్యతను పెంచేందుకు చేసే పరీక్షలు, చికిత్సలు, ప్రక్రియలు "లింగ ఎంపిక" క్రిందకు వస్తాయి.

పి) "సోనోలాజిస్ట్ లేదా ఇమేజ్ స్పెషలిస్ట్" అనగా భారత వైద్య కౌన్సిల్ చట్టం, 1956 క్రింద వైద్య పట్టాలు పొందిన వ్యక్తి లేదా అల్ట్రాసోనోగ్రఫీ, ఇమేజింగ్ సాంకేతిక ప్రక్రియలలో లేదా రేడియోలజీలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అర్హత కలిగిన వ్యక్తి.

క్యూ) "రాష్ట్రబోర్డు" అనగా సెక్షన్ 16ఎ క్రింద ఏర్పాటు చేయబడ్డ రాష్ట్ర పర్యవేక్షక బోర్డు లేదా కేంద్ర పాలిత ప్రాంత పర్యవేక్షక బోర్డు.

ఆర్) కేంద్ర పాలిత ప్రాంతానికి సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం అంటే రాజ్యాంగంలోని 239 వ అధికరణం క్రింద రాష్ట్రపతిచే నియమించ బడిన పరిపాలనాధికారి.

అధ్యాయం - II

జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు మరియు జన్యు క్లినిక్‌ల నియంత్రణ

3. జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు మరియు జన్యుక్లినిక్‌ల నియంత్రణ :

1. ఈ చట్టం క్రింద నమోదైతే తప్ప జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు లేదా జన్యు క్లినిక్‌లు గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు జరపటం కాని, జరిపేందుకు తోడ్పడటం కాని చెయ్యకూడదు.
2. నిర్ణీత అర్హతలు లేని వ్యక్తిని ఉద్యోగిగా జీతం పద్ధతిలో కానీ లేదా గౌరవ వేతనం ఇచ్చే పద్ధతిలో కాని జన్యు సలహా కేంద్రం లేదా జన్యు ప్రయోగశాల లేదా జన్యు క్లినిక్‌లలో నియమించకూడదు.
3. ఈ చట్ట క్రింద నమోదైన చోట తప్ప మరే ఇతర చోట గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలను వైద్యజన్యు శాస్త్రవేత్త, స్త్రీ సంబంధిత వ్యాధుల డాక్టరు, చిన్న పిల్లల వైద్యుడు, నమోదు చేసుకున్న వైద్యుడు లేదా మరే ఇతర వ్యక్తి స్వయంగా లేదా ఇతర వ్యక్తుల ద్వారా ఈ పరీక్షలు నిర్వహించకూడదు.

3ఎ) సెక్స్ ఎంపిక నివారణ :

సంతాన సాఫల్యానికి సంబంధించిన కేంద్రాలలో నిపుణులు లేదా నిపుణుల బృందం స్త్రీ లేదా పురుషుల లేదా ఇద్దరిపైనా లేదా కణజాలం లేదా పిండం తదితరాలపై లింగ నిర్ధారణ పరీక్షలు జరపటం లేదా ప్రోత్సహించటం చేయగూడదు.

3బి) ఈ చట్టం క్రింద నమోదు అవ్వని వ్యక్తులకు, ప్రయోగశాలలకు, క్లినిక్‌లకు అల్ట్రాసౌండ్ యంత్రం వగైరాలను అమ్మటం మీద నిషేధం :

ఈ చట్టం క్రింద నమోదు కాని జన్యుసలహా కేంద్రం, జన్యు ప్రయోగశాల, జన్యు క్లినిక్ లేదా ఇతర వ్యక్తికి, పిండం యొక్క లింగ నిర్ధారణకు వినియోగించే ఆల్ట్రా సౌండ్ యంత్రం లేదా ఇమేజింగ్ యంత్రం లేదా స్కానర్ లేదా సాంకేతిక పరికరాలను అమ్మరాదు.

అధ్యాయం - III

గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నియంత్రణ

4. గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షల నియంత్రణ :

ఈ చట్టం అమలురోజు వచ్చిన తేదీ నుండి

1. జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగశాలలు లేదా జన్యు క్లినిక్‌లు నమోదు చేయబడినవైనా క్లాజ్ (2) (3) లో పేర్కొన్న పరిస్థితులలో మాత్రమే లింగ నిర్ధారణ పరీక్షలు జరపాలి. అందుకు భిన్నంగా పరీక్షలు జరిపేందుకు పైన పేర్కొన్న వాటిని ఉపయోగించకూడదు లేదా ఉపయోగపడేలా ప్రోత్సహించకూడదు.
2. ఈ క్రింద పేర్కొన్న వ్యాధుల నిర్ధారణకు తప్ప మరే ఇతర ప్రయోజనాల నిమిత్తం గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదు.
   i) క్రోమోజోముల వైపరీత్యాలు.
   ii) జన్యుపరమైన మెటాబాలిక్ వ్యాధులు.
   iii) హిమోగ్లోబిన్ సంబంధిత వ్యాధులు.
   iv) లింగ సంబంధమైన జన్యుపరమైన వ్యాధులు.
   v) పుట్టుకతోనే సంక్రమించే వ్యాధులు.
   vi) కేంద్రపర్యవేక్షక బోర్డు పేర్కొనే ఇతర వైకల్యాలు లేదా వ్యాధులు

3. శిశు నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి అర్హత కలిగిన వ్యక్తి ఆ పరీక్షలు జరపడం అవసరమని సంతృప్తి చెందిన తర్వాత ఈ క్రింద చెప్పిన షరతులలో ఏదైనా ఒకటి నెరవేరేలా వ్రాత పూర్వకంగా ఆ కారణాలను రికార్డు చేయవలసి ఉంటుంది.

   i) గర్భవతిగా ఉన్న మహిళ వయస్సు 35 కంటే ఎక్కువ ఉంటే
   ii) ఆమెకు ఇంతకు ముందే 2 లేక అంతకన్నా ఎక్కువసార్లు అబార్షన్లు లేదా పిండనష్టం జరిగితే
   iii) గర్భవతిగా ఉన్న మహిళ కేన్సర్ కారక మందులు, రేడియేషన్ వ్యాధి కారక క్రిములు లేక రసాయనాల ప్రభావాలకి లోనైతే

iv) గర్భవతి కాని లేదా ఆమె భర్తకు సంబంధించిన కుటుంబంలో వారు కానీ బుద్ధిమాంద్యం లేదా కండరాల బిగుతు వ్యాధి లాంటి శారీరక వైకల్యాలు కలిగి ఉన్న మరే ఇతర జన్యుపర వ్యాధులు కలిగి ఉన్నా

v) బోర్డు పేర్కొన్న మరే ఇతర పరిస్థితుల్లోనైనా మాత్రమే ఆ పరీక్షలు జరపాలి.

అయితే గర్భవతిపై అల్ట్రా సోనోగ్రఫీ పరీక్ష నిర్వహించే వ్యక్తి క్లినిక్‌లో ఆ పరీక్షకు సంబంధించిన పూర్తి రికార్డును నియమిత రీతిలో ఉంచాలి. అలా రికార్డు ఉంచటంలో ఎటువంటి లోపం జరిగినా, రికార్డులో తప్పులు దొర్లినా, అది 5, 6 సెక్షన్ల ఉల్లంఘన అవుతుంది. అలాంటి ఉల్లంఘన జరగలేదని ఆ పరీక్ష నిర్వహించిన వ్యక్తి రుజువు చేయవలసి ఉంటుంది.

4. గర్భవతి బంధువు కానీ లేదా భర్త కానీ క్లాజు (2) లో పేర్కొన్న ప్రయోజనాలు కాక వేరే కారణాల కోసం ఎటువంటి గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు నిర్వహణకై ప్రోత్సహించకూడదు.

5. గర్భవతి బంధువు లేదా భర్త కానీ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్ష ఆమె మీద కాని, ఆమె భర్త మీద కానీ లేదా ఇరువురి మీద జరపమని కోరడం లేదా జరిపేందుకు ప్రోత్సహించడం చేయకూడదు.

5. గర్భవతి నుండి వ్రాతపూర్వక అనుమతి తీసుకోవడం, మరియు గర్భస్థ శిశువు లింగాన్ని తెలియజెప్పడాన్ని నిషేధించడం :

1. సెక్షన్ (3) క్లాజు (2) లో పేర్కొన్న ఏ వ్యక్తీ కూడా ఈ క్రింది పరిస్థితులలో తప్ప గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలను మరే ఇతర పరిస్థితిలోనూ జరుపకూడదు.

ఎ) ఈ పరీక్ష మూలంగా తనకు తెలిసిన దుష్ఫలితాలన్నింటినీ ఆమెకు వివరించాలి.

బి) అటువంటి పరీక్ష చేయించుకోవడానికి గర్భవతి నుండి ఆమె అర్థం చేసుకోగలిగిన భాషలో వ్రాతపూర్వకంగా అనుమతి తీసుకోవాలి.

సి) అలా తీసుకున్న అనుమతి కాపీని క్లాజు (బి) ప్రకారం ఆమెకు ఇవ్వాలి.

2. గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్ష నిర్వహించిన వ్యక్తితో సహా ఏ వ్యక్తీ పరీక్ష చేయించుకుంటున్న ఇతర వ్యక్తికి గర్భస్థ శిశువు లింగాన్ని మాటలతో గాని, సంజ్ఞలతో గాని మరే ఇతర పద్ధతిలోనూ తెలియజేయకూడదు.

6. లింగనిర్ధారణ నిషేధం :

ఈ చట్టం అమలులోకి వచ్చిన తేదీ నుండి.

ఎ) ఏ జన్యు సలహాకేంద్రం లేక జన్యు ప్రయోగశాలల లేక జన్యు క్లినిక్, అల్ట్రా సోనోగ్రఫీతో సహా మరే ఇతర గర్భస్థ శిశు పరీక్షను గర్భస్థ శిశువు లింగాన్ని నిర్ధారించేందుకు నిర్వహించరాదు. అటువంటి పరీక్షలు జరిపేందుకు తోడ్పడకూడదు.

బి) ఏ వ్యక్తీ అల్ట్రా సోనోగ్రఫీతో సహా ఏ ఇతర పరీక్ష గర్భస్థ శిశువు లింగాన్ని నిర్ధారించేందుకు నిర్వహించరాదు. అటువంటి పరీక్షలు జరిపేందుకు తోడ్పడకూడదు.

సి) ఏ వ్యక్తీ గర్భధారణకి ముందు గాని తర్వాత గానీ లింగ ఎంపిక ప్రక్రియలు పాటించరాదు.

అధ్యాయం - IV

కేంద్ర పర్యవేక్షక బోర్డు

7. కేంద్ర పర్యవేక్షక బోర్డు ఏర్పాటు :

1. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం క్రింద ఇవ్వబడిన అధికారాలు మరియు విధులు నిర్వర్తించేందుకు కేంద్ర పర్యవేక్షక బోర్డును ఏర్పాటు చెయ్యాలి.

2. ఎ) బోర్డు ఈ క్రింది వారితో ఉండాలి: కుటుంబ సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జ్ మంత్రి లేదా శాఖ అధికారి ఛైర్మన్ ఉంటారు.

   బి) భారత ప్రభుత్వంలో కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వైస్ ఛైర్మన్‌గా ఉంటారు.

   సి) సభ్యులుగా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, న్యాయవ్యవహారాలు శాఖ, లేదా న్యాయ మంత్రిత్వ శాఖలోని శాసన విధాన శాఖ మరియు భారత వైద్య, హోమియోపతి శాస్త్రాల వ్యవస్థల మంత్రిత్వ శాఖలను కేంద్ర ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ముగ్గురు సభ్యులను నియమించాలి.

   డి) కేంద్ర ప్రభుత్వం యొక్క ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్‌ను ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా నియమించాలి.

   ఇ) కేంద్ర ప్రభుత్వం పదిమంది సభ్యులను నియమించాలి.

ఈ క్రింది పేర్కొన్న విభాగాలలో ఇద్దరిని ఒక్కొక్క విభాగం నుంచి తీసుకోవాలి.

   i) పేరొందిన వైద్య, జన్యు శాస్త్రవేత్తలు

   ii) పేరొందిన స్త్రీ సమస్యలు మరియు ప్రసూతి వైద్యశాస్త్రాల డాక్టర్లు లేదా నిపుణులు

   iii) పేరొందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు.

   iv) పేరొందిన సామాజిక శాస్త్రవేత్తలు

   v) స్త్రీ సంక్షేమ సంస్థల ప్రతినిధులు

   యఫ్) లోక్‌సభ ఎన్నుకున్న పార్లమెంటు సభ్యులలో నుండి ఇద్దరు స్త్రీలను మరియు రాజ్యసభ ఎనుకున్న వారిలో ఒక పార్లమెంటు సభ్యురాలిని మొత్తం ముగ్గురిని ఎన్నుకోవాలి.

   జి) కేంద్ర ప్రభుత్వం రొటేషన్ పద్ధతిలో నలుగురు సభ్యులను రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించేందుకు నియమించాలి. అందులో ఇద్దరిని అక్షర క్రమంలో మరో ఇద్దరిని రివర్స్ అక్షర క్రమంలో నియమించాలి. అయితే ఈ క్లాజు క్రింద చేయబడే నియామకాలు రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర పాలిత ప్రాంతాల సూచనల మేరకే జరగాలి.

   హెచ్) కేంద్ర ప్రభుత్వంలో జాయింట్ సెక్రటరీ లేదా అందుకు సమానమైన ర్యాంకులో కుటుంబ సంక్షేమశాఖకి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఆఫీసరును ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నియమించాలి.

8. సభ్యుల కాలపరిమితి :

1. బోర్డు సభ్యులు కాక మిగతా సభ్యులు ఈ క్రింది కాలపరిమితిని కలిగి ఉంటారు

   ఎ) సెక్షన్ 7, సబ్ సెక్షన్ (2) క్లాజు (ఇ) లేదా క్లాజ్ (యఫ్) క్రింద నియమితులైతే 7 సంవత్సరాలు, అయితే వీరి కాలపరిమితి మంత్రి లేదా, రాష్ట్రమంత్రి లేదా డిప్యూటీ మంత్రి లేదా స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్ లేదా రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ పదవికాలం అయిన వెంటనే ముగిసిపోతుంది. లేదా పార్లమెంటు సభ్యుడిగా కొనసాగకపోయినా అతడి కాలపరిమితి ముగిసిపోతుంది.

   బి) ఈ సబ్‌సెక్షన్‌లోని క్లాజు (జి) క్రింద నియమించబడితే ఒక సంవత్సరం వరకు సభ్యుడిగా కొనసాగవచ్చు.

2. మరణం, రాజీనామా లేదా విధుల నిర్వహణలో ఆరోగ్యం సహకరించక లేక మరే ఇతర అసమర్థత వలన విధులు నిర్వహించలేకపోవటం వలన ఏర్పడిన ఖాళీలను కేంద్ర ప్రభుత్వం కొత్తగా భర్తీ చెయ్యాలి. అలా నియమితులైన సభ్యులు ఎవరి స్థానాల్లో నియమించబడ్డారో వారి కాలపరిమితిలో మిగిలిన సమయం వరకు సభ్యులుగా కొనసాగుతారు.

3. ఛైర్మన్ సమయానుసారంగా, వైస్ ఛైర్మన్ ఇచ్చే బాధ్యతలను వైస్ ఛైర్మన్ నిర్వర్తించాలి.

4. విధుల నిర్వహణల సభ్యులు నిర్ణీత ప్రక్రియని పాటించాలి.

9. బోర్డు సమావేశాలు :

1. బోర్డు నియంత్రణల ప్రకారం వ్యాపార లావాదేవీలకు అవసరమైన నియమాలను పాటిస్తూ అవసరమైన సమయం, ప్రదేశంలో ఏర్పాటు చేస్తుంది.

   అయితే బోర్డు కనీసం 6 నెలలకు ఒక్కసారైనా సమావేశమవ్వాలి.

2. ఛైర్మన్ ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. ఆయన లేని పక్షంలో వైస్ ఛైర్మన్ ఈ బాధ్యతలను నెరవేరుస్తారు.

3. ఏ కారణం చేతనైనా ఛైర్మన్ లేదా వైస్ ఛైర్మన్ బోర్డు సమావేశాలకు హాజరు అవ్వలేని పరిస్థితి ఉంటే, సమావేశానికి హాజరైన సభ్యులు ఎన్నుకున్న సభ్యులు అధ్యక్షత వహిస్తారు.

4. బోర్డు సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలను ఆ సమావేశానికి హాజరైన సభ్యుల వోట్ల మెజారిటీ ఆధారంగా నిర్ణయం తీసుకోబడుతుంది. ఓట్లు సమానంగా వచ్చిన సందర్భంలో, ఛైర్మన్ లేదా ఆయన గైర్హాజరైన పక్షంలో అధ్యక్షత వహిస్తున్న వ్యక్తి తనకున్న రెండో వోటు వేయాలి.

5. పదవీరీత్యా సభ్యులు మినహా ఇతర సభ్యులు బోర్డు నిర్ణయానుసారం భత్యాలను పొందుతారు.

10. ఖాళీలు వగైరా బోర్డు ప్రొసీడింగ్స్‌ని (కార్యవ్యవహారాలను) చెల్లనిదిగా చెయ్యవు.

కేవలం ఈ క్రింది కారణాల రీత్యా బోర్డు యొక్క కార్యవ్యవహారాలను చెల్లనివిగా చెయ్యలేము.

ఎ) బోర్డులో ఏదైనా ఖాళీ ఉన్నా లేదా బోర్డు ఏర్పాటులో లోపం ఉన్నా లేదా

బి) బోర్డు సభ్యుడి ఎంపికలో ఏదైనా లోపం ఉన్నా

సి) కేసు యోగ్యతలను ప్రభావితం చెయ్యకుండా బోర్డు కార్యవ్యవహారాలలో క్రమారాహిత్యం (అవకతవకలు) ఉన్నా బోర్డు కార్యవ్యవహారాలు చెల్లుతాయి.

11. ప్రత్యేక లక్ష్యాల కోసం బోర్డుతో తాత్కాలికంగా అనుబంధం కలిగిన వ్యక్తులు :

1. ఈ చట్టంలో ఉన్న నిబంధనలను అమలు పరిచేందుకుగాను ఎవరైనా వ్యక్తి సహకారం లేదా సలహాలు అవసరమని బోర్డు భావిస్తే బోర్డు వారితో నియంత్రణల కనుగుణంగా ఒక ప్రత్యేక పద్ధతిలో, ప్రత్యేక లక్ష్యాల కోసం అనుబంధం ఏర్పరచుకోవచ్చు.
2. ఏదైనా ఒక లక్ష్యంకోసం సబ్‌సెక్షన్ (1) క్రింద బోర్డుతో అనుబంధం ఏర్పరచుకున్న వ్యక్తికి ఆ లక్ష్యానికి సంబంధించిన చర్చలలో పాల్గొనే హక్కు ఉంటుంది. కాని బోర్డు సమావేశంలో ఓటు వేసే హక్కు కాని సభ్యుడిగా వ్యవహరించే హక్కు ఉండదు.

12. ఆఫీసర్లు మరియు బోర్డు ఉద్యోగస్తుల నియామకం :

1. ఈ చట్టం క్రింద బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు గాను, ఇందుకు చేయబడిన నియంత్రణలను ఉల్లంఘించ కుండా బోర్డు (డిప్యూటేషన్ మీద గాని లేదా మరే రకంగానైనా) అవసరమైనంత మంది ఆఫీసర్లను మరియు ఉద్యోగులను నియమించవచ్చు. అయితే అటువంటి ఆఫీసర్ల నియామకం, ఇందుకు చేయబడ్డ నియంత్రణలు మరియు కేంద్ర ప్రభుత్వ ఆమోదం మీద ఆధారపడి ఉంటుంది.
2. బోర్డు నియమించిన ఏ ఆఫీసరైనా లేదా ఇతర ఉద్యోగియైనా సర్వీసు నిబంధనలకు కట్టుబడి ఉండాలి. ఇందుకు చేయబడ్డ నియంత్రణలలో పేర్కొన్నంత పారితోషికం అందుకుంటారు.

13. ఉత్తర్వుల ప్రామాణికత మరియు బోర్డు యొక్క ఇతర దస్తావేజులు :

బోర్డు యొక్క ఉత్తర్వులు మరియు నిర్ణయాలన్నింటి మీద ఛైర్మన్ సంతకం కానీ లేదా ఇందుకు బోర్డు, అధికారాలను ఇచ్చిన వ్యక్తి సంతకం ఉంటేనే అవి ప్రామాణికతను సంతరించు కుంటాయి. బోర్డు జారీ చేసిన మిగతా అన్ని దస్తావేజుల మీద సెక్రటరీ సభ్యుడి లేదా బోర్డు ఇందుకు అధికారం ఇచ్చిన వ్యక్తిగానే పై విధంగా సంతకం చెయ్యాలి.

14. సభ్యులు నియామకానికి అనర్హత :

ఈ క్రింద పేర్కొన్న పరిస్థితులలో ఒక వ్యక్తి బోర్డు సభ్యులుగా ఎంపిక కావటానికి అనర్హులు :

ఎ) కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యంలో అతడు గనుక ఏదైనా నేరం, కారాగారశిక్షను అనుభవించినట్లయితే, అటువంటి నేరం నైతిక దిగజారుడుతనాన్ని కలిగి ఉంటే

బి) అతడు విమోచన పొందని దివాలాదారుడైతే

సి) అధికారపరిధి కలిగిన కోర్టు అతడిని మతిస్థిమితం లేని వ్యక్తిగా ప్రకటిస్తే

డి) ప్రభుత్వ సర్వీసు నుండి లేదా కార్పొరేషన్ నడుపుతున్న సంస్థ నుండి గాని లేద ప్రభుత్వ నియంత్రణలో నడుస్తున్న సంస్థ నుండి గాని ఉద్యోగంలో నుంచి తొలగించినా లేదా తీసివేసిన (డిస్‌మిస్) వ్యక్తియైతే

ఇ) బోర్డులో ఆర్థిక లేదా ఇతర ప్రయోజనాలు ఉండటం వల్ల సభ్యుడిగా తన బాధ్యతలు నిర్వర్తించే క్రమంలో ప్రతికూల ప్రభావం ఉంటుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తే,

యఫ్) అతడు లింగనిర్ధారణ కోసం పరీక్షలను కానీ మరే ఇతర పరీక్షలు గానీ నిర్వహిస్తున్నాడని కానీ, లేదా ప్రచారం చేస్తున్నాడని కేంద్ర ప్రభుత్వం భావిస్తే.

15. పునర్నియామకానికి అర్హత కలిగిన సభ్యుడు :

సర్వీసు, ఇతర నిబంధనలు షరతులకు కట్టుబడి, ఏ వ్యక్తియైనా సభ్యుడిగా విరమించినట్లయితే అతడు తిరిగి సభ్యుడిగా నియమితుడవుతాడు.

అయితే ఎక్స్ అఫీషియో సభ్యుడు మినహా మరే ఇతర సభ్యుడు వరుసగా రెండు సార్లు కంటే ఎక్కువసార్లు నియమితుడవ్వడానికి వీలులేదు.

16. బోర్డు యొక్క కర్తవ్యాలు :

బోర్డు ఈ క్రింది కర్తవ్యాలనీ నెరవేర్చాలి.

i) గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు, లింగ పరీక్షలు మరియు వాటి దురుపయోగానికి సంబంధించిన విధాన విషయాలలో కేంద్ర ప్రభుత్వానికి సలహాలు ఇవ్వటం,

ii) ఈ చట్టం క్రింద పేర్కొన్న నియమాల సమీక్ష మరియు వాటిని అమలు చేయటాన్ని పర్యవేక్షించాలి. ఈ చట్టంలో నియమాలలో ఏవైనా మార్పులు అవసరమైతే సిఫార్సు చేయాలి.

iii) ఫలదీకరణకు ముందే లింగ ఎంపిక మరియు పిండం దశలో గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు జరపడం, బ్రూణ హత్యలకు దారితీస్తాయని ప్రజలలో వీటి మీద అవగాహన కల్పించాలి.

iv) జన్యు సలహా కేంద్రాలలో, జన్యు ప్రయోగశాలలో మరియు జన్యు క్లినిక్‌లలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రవర్తనా నియమావళిని రూపొందించాలి.

v) ఈ చట్టం క్రింద స్థాపించబడిన వివిధ విభాగాల పనితీరును పర్యవేక్షించడం అవి సరిగ్గా సమర్థవంతంగా పనిచేయటానికి తగిన చర్యలు చేపట్టాలి.

vi) ఈ చట్టంలో పేర్కొన్న ఇతర కర్తవ్యాలను కూడా నిర్వర్తించాలి.

16 ఎ.రాష్ట్ర పర్యవేక్షక బోర్డు మరియు కేంద్రపాలిత ప్రాంతం యొక్క పర్యవేక్షక బోర్డు :

1. ప్రతి రాష్ట్రము మరియు కేంద్రపాలిత ప్రాంతము, రాష్ట్ర పర్యవేక్షక బోర్డు లేదా కేంద్రపాలిత పర్యవేక్షక బోర్డును స్థాపించాలి. ఆ బోర్డు ఈ క్రింది కర్తవ్యాలను నెరవేర్చాలి.

   i) ఫలదీకరణకు ముందే లింగ ఎంపిక మరియు పిండం యొక్క లింగ నిర్ధారణ పరీక్షలు వంటివి ఆచరించడం లాంటివి రాష్ట్రంలో బ్రూణ హత్యలకు దారితీస్తుందని ప్రజలలో అవగాహన కలిగించాలి.

   ii) రాష్ట్రంలో పనిచేస్తున్న సముచిత అధికారులు యొక్క కార్యకలాపాలను సమీక్షించడం మరియు పైన పేర్కొన్న ఆచారాలకు వ్యతిరేకంగా తగిన చర్యలు తీసుకోవాలి.

iii) ఈ చట్టం యొక్క నియమ నిబంధనలు అమలు అయ్యేలా పర్యవేక్షించాలి. మరియు బోర్డుకు దీనికి సంబంధించి తగిన సిఫార్సులు చేయాలి.

iv) బోర్డుకు మరియు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను క్రోడీకరించిన రిపోర్టులు పంపించాలి.

v) ఈ చట్టంలో పేర్కొన్న ఇతర కర్తవ్యాలను నెరవేర్చాలి.

2. రాష్ట్ర బోర్డు ఈ క్రింది సభ్యులను కలిగి ఉండాలి.

ఎ) రాష్ట్రంలోని ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి మంత్రిని ఛైర్‌పర్సన్‌గా నియమించాలి.

బి) ఆరోగ్య మరియు కుటుంబ విభాగానికి ఎక్స్ అఫీషియో సెక్రటరీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన ఆఫీసర్‌ని వైస్ ఛైర్మన్‌గా నియమించాలి.

సి) స్త్రీ మరియు బాలల అభివృద్ధి విభాగం, సామాజిక సంక్షేమ విభాగం, న్యాయ మరియు భారత వైద్య ఆరోగ్యశాస్త్రాల విభాగాలలో ఎక్స్ అఫీషియో ఇన్‌ఛార్జి సెక్రటరీలు లేదా కమీషనర్లు పనిచేసిన వారిని సభ్యులుగా నియమించాలి.

డి) రాష్ట్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ లేదా భారత వైద్య హోమియోపతి వ్యవస్థ డైరెక్టర్‌గా పనిచేసిన వారిని ముగ్గురు మహిళా శాసనసభ లేదా విధాన సభ సభ్యులు.

యఫ్) 10 మంది సభ్యులలో క్రింద పేర్కొన్న విభాగాలలో ఇద్దరి ఇద్దరినీ ఒక్కో విభాగం నుంచి నియమించాలి.

i) పేరొందిన సామాజిక శాస్త్రవేత్తలు మరియు న్యాయనిపుణులు.

ii) స్వచ్ఛంద సంస్థలలో పనిచేసే పేరొందిన మహిళా కార్యకర్తలు.

iii) పేరొందిన స్త్రీ వ్యాధి మరియు ప్రసూతి వైద్య నిపుణులు.

iv) పేరొందిన చిన్నపిల్లల వైద్యులు లేదా జన్యు శాస్త్రవేత్తలు.

v) పేరొందిన రేడియోలజిస్టులు లేదా సోనోలజిస్ట్‌లు.

3. బోర్డు కనీసం నాలుగు నెలల కొకసారి సమావేశమవ్వాలి.

4. అఫీషియో సభ్యుడు గాక మిగతా సభ్యులు 3 ఏళ్ళ కాలపరిమితిని కలిగి ఉంటారు.

5. ఏదైనా ఖాళీ అయితే క్రొత్తగా సభ్యులను ఆ స్థానాలలో నియమించాలి.

6. వీరి కాలపరిమితి మంత్రి లేదా రాష్ట్రమంత్రి లేదా డిప్యూటి మంత్రి లేదా స్పీకర్ లేదా డిప్యూటి స్పీకర్ లేదా రాజ్యసభ డిప్యూటి ఛైర్మన్ అయిన వెంటనే ముగిసిపోతుంది. లేదా అతడు సభ్యుడిగా కొనసాగకపోయినా అతడి కాలపరిమితి ముగిసిపోతుంది.

7. మొత్తం సభ్యులు 1/3వ వంతు రాష్ట్ర బోర్డు "కోరమ్" అవుతుంది.

8. రాష్ట్రబోర్డు అవసరమైనప్పుడు సభ్యుడిని కోఆప్ట్ చేసుకోవచ్చు. అయితే వీరి సంఖ్య మొత్తం బోర్డు సంఖ్యలో 4/3వ వంతు దాటకూడదు.

9. కోఆప్ట్ సభ్యులకు కూడా ఇతర సభ్యులకు ఉన్న అధికారాలు, విధులే ఉంటాయి. అయితే వోటు వేసే హక్కు మాత్రం ఉండదు. ఇతర సభ్యుల మాదిరే నియమనిబంధనలను పాటించాలి.

10. ఈ సెక్షన్‌లో పేర్కొన్న విషయాలలో, రాష్ట్రబోర్డు తగిన ప్రక్రియలు, షరతులను పాటించాలి.

అధ్యాయం - V

సముచిత అధికారి మరియు సలహాదారులు

17. సముచిత అధికారి మరియు సలహా కమిటి :

1. కేంద్ర ప్రభుత్వం రాజపత్రంలో ప్రకటన ద్వారా ఈ చట్టం ప్రకారం ఒకటి లేదా అంతకంటే ఎక్కువమంది సముచిత అధికారులను ప్రతి కేంద్ర పాలిత ప్రాంతంలోను నియమించాలి.

2. ఈ చట్టం యొక్క ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం గర్భస్థ శిశు లింగనిర్ధారణ పరీక్షలు, బ్రూణ హత్యలకు దారితీస్తున్న సమస్యల యొక్క తీవ్రతని దృష్టిలో పెట్టుకుని, రాజపత్రంలో ప్రకటన ద్వారా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సముచిత అధికారులను నియమించాలి.

3. సబ్‌సెక్షన్ (1) లేదా సబ్‌సెక్షన్ (2) క్రింద నియమితులైన సముచిత అధికారులు.

ఎ) రాష్ట్రం మరియు కేంద్రపాలిత ప్రాంతమంతటికీ ఆఫీసర్లుగా నియమితులైన వారు ఈ క్రింది పేర్కొన్న విధంగా ముగ్గురు సభ్యులను కలిగి ఉంటారు.

i) ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ హోదా లేదా అంతకంటే ఎక్కువ ర్యాంకు కలిగి ఉన్న ఛైర్‌పర్సన్

ii) మహిళా సంఘం యొక్క ప్రతినిధిగా ఉన్న ప్రఖ్యాత మహిళ

iii) సంబంధిత రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంతంలో న్యాయవిభాగ ఆఫీసరు అయ్యి ఉండాలి.

అయితే గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు (నియంత్రణ మరియు దుర్వినియోగం నివారణ) సవరణ చట్టం, 2002 అమలులోకి వచ్చిన మూడు నెలల లేదా రాష్ట్ర లేదా కేంద్రపాలిత స్థాయిలో సముచిత కమిటీలను ఏర్పరచవలసిన బాధ్యత రాష్ట్ర మరియు కేంద్ర పాలిత ప్రభుత్వాలదే.

అంతేగాక ఈ స్థానాలకి ఖాళీలు అయితే కనుక మూడు నెలలు తిరగక ముందే వాటిని భర్తీ చేయాలి.

బి) రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వాలు సముచితంగా భావిస్తే, వేరే ర్యాంకు కలిగిన వారిని కూడా రాష్ట్ర లేక క్రేంద్ర పాలిత ప్రాంతంలో నియమించవచ్చు.

4. సముచిత అధికారి ఈ క్రింది కర్తవ్యాలను నెరవేర్చాలి.

ఎ) ఒక జన్యు సలహా కేంద్రం, జన్యు ప్రయోగశాల లేదా జన్యు క్లినిక్‌ల రిజిస్ట్రేషన్‌ని మంజూరు చేయడం, సస్పెండ్ లేదా రద్దు చెయ్యాలి.

బి) జన్యు సలహాకేంద్రం జన్యు ప్రయోగశాల మరియు జన్యు క్లినిక్‌ల ప్రమాణాలను మెరుగుపర్చాలి.

సి) ఈ చట్టంలోని నియమాలు లేక నిబంధనల ఉల్లంఘన తాలూకు ఫిర్యాదులను పరిశోధించి సత్వర చర్యలు చేపట్టాలి.

డి) రిజిస్ట్రేషన్ అప్లికేషన్‌కు సంబంధించి మరియు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని సస్పెండ్ చేయాలని వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన సలహాలను సలహా కమిటీ నుంచి పొందాలి.

ఇ) ఏ వ్యక్తి యైనా ఎక్కడైనా లింగ ఎంపిక పరీక్షలు జరుపుతున్నాడని సముచిత అధికారి తనంతట తాను తెలుసుకున్న లేక తన దృష్టికి తీసుకురాబడినా తగిన చట్టబద్ధ చర్యలు తీసుకోవాలి మరియు స్వతంత్ర దర్యాప్తులు జరిపేందుకు ముందుకురావాలి.

యఫ్) లింగ ఎంపిక లేదా గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం కలిగించాలి.

జి) ఈ చట్టంలోని నియమ నిబంధనలు అమలు అయ్యే విధంగా పర్యవేక్షించాలి.

హెచ్) మారుతున్న సాంకేతికత మరియు సామాజిక పరిస్థితుల కనుగుణంగా నియామాలలో అవసరమైన మార్పులు తెచ్చేందుకు బోర్డుకు మరియు రాష్ట్ర బోర్డులకు సిఫార్సు చేయాలి.

ఐ) రిజిస్ట్రేషన్‌ని రద్దు లేదా సస్పెండ్ చేయాలని వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం సలహా కమిటీ చేసే సిఫార్సులను అమలు పరచాలి.

5. కేంద్ర లేక రాష్ట్ర ప్రభుత్వం, ప్రతి సముచిత అధికారి ఒక సలహా కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటి సముచిత అధికారి తన కర్తవ్యాలను నెరవేర్చేందుకు గాను సలహాను ఇవ్వాలి మరియు తోడ్పాటును అందించాలి.

6. సలహా కమిటి ఈ క్రింది వారిని కలిగి ఉండాలి.

ఎ) గైనకాలజిస్ట్, చిన్న పిల్లల వైద్య నిపుణులు మరియు మెడికల్ జన్యుశాస్త్రవేత్తలలో ఏ ముగ్గురినైనా కలిగి ఉండాలి.

బి) ఒక న్యాయ నిపుణులు వుండాలి

సి) రాష్ట్ర లేక కేంద్ర పాలిత ప్రాంతం యొక్క సమాచారం మరియు ప్రచార విభాగానికి ప్రాతినిధ్యం వహించే ఒక ఆఫీసరు.

డి) ముగ్గురు సామాజిక కార్యకర్తలతో కనీసం ఒక్కరినైనా మహిళా సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారి నుండి తీసుకోవాలి.

7. గర్భస్థ నిర్ధారణ పరీక్షల నిర్వహణ లేదా ప్రచార అంశాలతో ముడిపడి ఉన్న ఏ వ్యక్తినీ సలహా కమిటీ సభ్యుడిగా తీసుకోరాదు.

8. సలహా కమిటి అవసరమని భావించినపుడు సమావేశ మవ్వచ్చు. లేదా సముచిత అధికారికి రిజిస్ట్రేషన్ రద్దు లేదా సస్పెండ్ చేయాలని కోరుతూ వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి మరియు సలహాలు ఇవ్వమని కోరినప్పుడు సమావేశమవ్వచ్చు.

అయితే ఏ రెండు సమావేశాల మధ్య కాలవ్యవధి నిర్ణీత కాలవ్యవధిని మించరాదు.

9. నియమ నిబంధనలకు కట్టుబడి సలహాకమిటీతో ఒక వ్యక్తిని నియమించవచ్చు. ఆ కమిటీ తన కర్తవ్యాలను నెరవేర్చేటప్పుడు నిర్ణీత పద్ధతినే అనుసరించాలి.

17ఎ) సముచిత అధికారి యొక్క అధికారాలు :

ఈ క్రింది విషయాలలో సముచిత అధికారికి అధికారాలు ఉంటాయి.

ఎ) ఈ చట్టంలోని నియమ నిబంధనలు ఉల్లంఘనకు సంబంధించిన సమాచారాన్ని కలిగి ఉన్న వ్యక్తిని పిలపించేందుకు

బి) క్లాజు (ఎ)కి సంబంధించిన ఏ దస్తావేజుని కాని, వస్తు సామాగ్రిని దాఖలు చేసేందుకు

సి) లింగ ఎంపిక పరీక్షలు లేదా గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారని అనుమానించిన చోట శోదా చేసేందుకు వారంటును జారీ చెయ్యాలి.

డి) నిర్ణయించబడిన మరే ఇతర విషయంలోను అధికారాలు కలిగి వుంటారు.

అధ్యాయం - VI

జన్యు సలహా కేంద్రాలు, జన్యు పరిశోధన శాలలు మరియు జన్యు క్లినిక్‌లు యొక్క రిజిస్ట్రేషను

18. జన్యు సలహా కేంద్రాలు, జన్యు పరిశోధన శాలలు మరియు జన్యు క్లినిక్‌ల రిజిస్ట్రేషన్:-

1. ఏ వ్యక్తి కూడా జన్యు సలహా కేంద్రం జన్యు పరిశోధనశాల లేదా జన్యు క్లినిక్‌ని గాని అల్ట్రాసౌండ్ లేదా ఇమేజింగ్ యంత్రాన్ని కాని లేదా స్కానర్‌ని కాని లేదా పిండం యొక్క లింగనిర్ధారణకి అవసరమైన ఇతర సాంకేతిక కానీ లేదా గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు (నియంత్రణ మరియు నిరుపయోగ నివారణ) సవరణ చట్టం,2002 అమలు అయిన తర్వాత తెరవకూడదు. అయితే ఈ చట్టం క్రింద సక్రమంగా రిజిష్టర్ చేయబడిన సెంటర్, లేబరేటరి లేదా క్లినిక్‌గాని పైన పేర్కొన్న పరిస్థితులతో తెరవవచ్చు.
2. సబ్ సెక్షన్ (1) క్రింద రిజిస్ట్రేషన్ కోరుతూ సముచిత అధికారికి నిర్ణీత పద్ధతి రూపంలో అప్లికేషన్ పెట్టుకోవాలి. దీనితో పాటు నిర్ణీత రుసుం కూడా చెల్లించాలి.
3. ఈ చట్టం అమలులోకి రావటానికి క్రొద్ది ముందే (immediately) సలహాలు ఇవ్వటానికి (counselling) లేదా గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు జరపటానికి ప్రతి జన్యు సలహాకేంద్రం జన్యు ప్రయోగశాల లేదా జన్యు క్లినిక్ పూర్తిగాలేదా పాక్షికంగా పని చేస్తునట్లైతే ఈ చట్టం అమలులోకి వచ్చిన 60 రోజులలోపే రిజిస్ట్రేషన్‌కి అప్లికేషన్ పెట్టుకోవాలి.
4. సెక్షన్ 6 నిబంధనలకు కట్టుబడి, ప్రతి జన్యు సలహా కేంద్రం జన్యు ప్రయోగశాల లేదా జన్యుక్లినిక్ కౌన్సిలింగ్ లేదా గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు జరుపుతున్నట్లైతే ఈ చట్టం అమలులోకి వచ్చిన తేది నుండి 6 నెలల వ్యవధి ముగిసిన తర్వాత అటువంటి కార్యక్రమాలు ఆపివేయాలి. అయితే అటువంటి సెంటర్, ప్రయోగశాల లేదా క్లినిక్ గనుక రిజిస్ట్రేషన్‌కి అప్లికేషన్ పెట్టుకున్నా విడిగా రిజిస్ట్రేషన్ చేసుకున్నా లేదా ఉమ్మడిగా అప్లికేషన్ ఒక కొలిక్కి వచ్చేదాకా వీటిలో ఏది ముందు జరిగిన సెంటర్‌ని ప్రయోగశాలని లేదా క్లినిక్‌ని మూయవలసిన అవసరం లేదు.

5. సముచిత అధికారికి ఫలానా సెంటర్, ప్రయోగశాల లేదా క్లినిక్ అవసరమైన సదుపాయాలను అందించగలదు. అవసరమైన పరికరాలను, మరియు ప్రమాణాలను పాటించగలదు అని సంతృప్తి చెందితేనే ఏ జన్యు సలహా కేంద్రమైనా జన్యు ప్రయోగశాలయైనా లేదా క్లినిక్‌యైన నమోదు చేయబడుతుంది.

19. రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ :-

1. సముచిత అధికారి ఈ చట్టంలోని నియమ నిబంధనలన్నీ నెరవేరాయని దర్యాప్తు ద్వారా తెలుసుకుని సంతృప్తి చెందిన తర్వాతే ఆమేరకు సలహా కమిటీ సలహాలను ఆ దృష్టిలో ఉంచుకొని నిర్ణీత రూపంలో లేదా ఉమ్మడి రిజిస్ట్రేషన్ మంజూరు చేస్తూ ప్రత్యేక జన్యు సలహా కేంద్రంకు, ప్రయోగశాలలకు లేదా జన్యుక్లినిక్‌లలో ధృవపత్రం ఇవ్వాలి.
2. సముచిత అధికారి దర్యాప్తు చేసిన తర్వాత మరియు ఆభ్యర్థికి చెప్పుకొనే అవకాశం కల్పించిన తర్వాత మరియు సలహా కమిటీ సూచనల మేరకు అతడు ఈ చట్టం లోని నియమ నిబంధనలను పాటించలేదని భావిస్తే ఆ కారణాలను వ్రాతపూర్వకంగా నమోదు చేసి, రిజిస్ట్రేషన్ అభ్యర్థనని త్రోసిపుచ్చాలి.
3. ప్రతి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ నిర్ణీత పద్ధతిలో కాలవ్యవధిలో నిర్ణీత రుసుం చెల్లించి పునరుద్ధరించవచ్చు.
4. రిజిస్ట్రేషన్ ధృవపత్రం జన్యు సలహాకేంద్రం జన్యు ప్రయోగశాల లేదా జన్యు క్లినిక్‌లలో గుర్తించదగిన స్థలంలో ప్రదర్శించబడాలి.

20. రిజిస్ట్రేషన్ యొక్క రద్దు లేక సస్పెన్షన్

1. సముచిత అధికారి తనకుతానుగా కాని లేదా ఫిర్యాదు ఆధారంగా కానీ, జన్యు సలహాకేంద్రం, జన్యు ప్రయోగశాల లేదా జన్యు క్లినిక్ నోటిసులో పేర్కొన్న కారణాల ఆధారంగా క్లినిక్ యొక్క రిజిస్ట్రేషన్‌ని ఎందుకు రద్దు చేయకూడదు లేద సస్పెండ్ చేయకూడదు కారణాలు చూపమని అడగవచ్చు.
2. జన్యు సలహా కేంద్రానికి, జన్యు ప్రయోగశాలకి లేదా జన్యు క్లినిక్‌కి విన్నవించుకొనే అవకాశం కల్పించిన తర్వాత సలహా కమిటీ సలహాల అధారంగా ఈ చట్టంలోని నియమ నిబంధనలు ఉల్లఘించబడ్డాయని భావిస్తే సదరు సెంటర్, ప్రయోగశాల లేదా క్లినిక్‌కి వ్యతిరేకంగా క్రిమినల్ చర్యలు చేపట్టడటమే గాక దాని రిజిస్ట్రేషన్‌ని రద్దు చేయటం లేదా సస్పెండ్ చేయటం చేయవచ్చు.
3. సబ్‌సెక్షన్ (1) మరియు సబ్‌సెక్షన్ (2) లకు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ సముచిత అధికారి గనుక ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ఏదైనా జన్యు సలహాకేంద్రాన్ని జన్యు ప్రయోగశాలను లేదా జన్యు క్లినిక్ యొక్క రిజిస్ట్రేషన్‌ని సస్పెండ్ చేయడం అవసరమని భావిస్తే నోటిసు ఇవ్వకుండానే సస్పెండ్ చేయవచ్చు అయితే ఇందుకు గల కారణాలను వ్రాతపూర్వకంగా నమోదు చెయ్యాలి.

అప్పీల్: సెక్షన్ 20 క్రింద సముచిత అధికారి రిజిస్ట్రేషన్‌ని రద్దు చేస్తూ లేదా సస్పెండ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను అందుకొన్న తేదీ నుండి 30 రోజుల లోగా ఆ ఉత్తర్వులకు వ్యతిరేకంగా అప్పీలు చేసుకోవాలి లేదా

i) అప్పీలు గనుక కేంద్ర సముచిత అధికారికి వ్యతిరేకంగా అయితే కేంద్రప్రభుత్వానికి

ii) రాష్ట్ర సముచిత అధికారికి వ్యతిరేకంగా అయితే రాష్ట్ర ప్రభుత్వానికి నిర్ణీత పద్ధతిలో అప్పీలు చేసుకోవాలి.

అధ్యాయం - VII

అపరాధాలు మరియు శిక్షలు

పూర్వ ఫలదీకరణ మరియు గర్భస్థ శిశు దశలలో లింగ నిర్ధారణ పరీక్షల గురించిన ప్రచారం మీద నిషేధం మరియు ఉల్లంఘించినందుకు శిక్ష:-

1. ఏ వ్యక్తి , సంస్థ జన్యు సలహాకేంద్రం, జన్యు ప్రయోగశాల లేదా జన్యు క్లినిక్ అల్ట్రాసౌండ్ యంత్రం ఇమేజింగ్ యంత్రం లేదా స్కానర్ లేదా పిండం యొక్క లింగ నిర్ధారణకి లేదా లింగ ఎంపికకి అవసరమైన సాంకేతికతను కలిగి ఉండి సదుపాయాలు తమ వద్ద లభ్యమవుటానికి వ్యాపార ప్రకటన పంచటం సమాచారం అందించటం లేదా అందుకు ఏ ఇంటర్‌నెట్‌తో సహా ఏ నేరం రూపంలోనైనా తోడ్పడటం నేరం.
2. ఏ వ్యక్తి జన్యు సలహా కేంద్రం జన్యు ప్రయోగశాల లేదా జన్యు క్లినిక్‌లతో సహా ఏ సంస్థయైనా లింగ ఎంపికకి అవసరమైన గర్భానికి పూర్వం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల వ్యాపార ప్రకటనని ప్రచురించటం పంపిణీ చేయటం ఇతరులతో చేయబడతాయ్యని తెలియపరచటం లేదా అందుకు తోడ్పడటం చేయకూడదు. ఆ ప్రచారం శాస్త్రీయంగా ఉన్నా మరే పద్ధతిలో ఉన్నా అది చట్టానికి విరుద్ధమే.
3. పైన పేర్కొన్న సబ్‌సెక్షన్ (1) లేదా సబ్‌సెక్షన్ (2)లోని నిబంధనలను ఏవ్యక్తియైనా ఉల్లంఘిస్తే అతడు మూడు సంవత్సరాల వరకు జైలుశిక్ష మరియు రూ.10000/- వరకు అపరాధ రుసుముతో శిక్షంచబడతాడు.

వివరణ:- ఈ సెక్షన్ ప్రకారం "వ్యాపారప్రకటన" అంటే ఏదైనా నోటీసు, సర్క్యులర్, లేబిల్ (విషయసూచన) రాపర్ లేదా మరే ఇతర పత్రం ఇంటర్‌నెట్ లేదా మరే ఇతర మాధ్యమం ద్వారా ఎలక్ట్రానిక్ లేదా ప్రింట్ మాధ్యమంలో విడుదలైన ప్రకటన, హోర్డింగ్, వాల్‌పెయింటింగ్, సంజ్ఞ కాంతి, శబ్దం, పొగ లేదా ఆయువు ద్వారా కనిపించే రూపంలో చేసే ప్రకటన కూడా ఈ సెక్షన్ క్రింద "వ్యాపారప్రకటన"గా పరిగణించబడుతుంది.

23. నేరాలు మరియు శిక్షలు:

1. జన్యు సలహా జన్యు పరిశోధనాలయం లేదా జన్యు క్లినిక్ యొక్క యజమాని లేదా ఉద్యోగియైన మెడికల్ జన్యుశాస్త్రవేత్త గైనికాలజిస్ట్ నమోదు చేసుకున్న మెడికల్ ప్రాక్టీషనర్ లేదా మరే ఇతర వ్యక్తియైన తన వృత్తిపర లేదా సాంకేతిక సేవలను ఆయా క్లినిక్, పరిశోధనాలయం మరియు సెంటర్‌కు అందజేయకూడదు. అతడు ఆ సేవలను గౌరవార్ధముగా అందజేసినా ఈ చట్టంలోని నియమ నిబంధనలను ఉల్లంఘించినా 3 నెలల వరకు కారాగార శిక్ష మరియు రూ.10000/- వరకు అపరాధ రుసుముతో శిక్షంచబడతాడు. తరువాత శిక్షగా 5 ఏళ్ళ వరకు జైలు శిక్ష మరియు రూ.50000/- వరకు అపరాధ రుసుము చెల్లించాలి.

2. సముచిత అధికారి నమోదు చేసుకున్న వైద్యుని పేరు రాష్ట్ర వైద్య కౌన్సిల్‌కి రిపోర్టు చేసి తగిన చర్యలు అనగా ఆ వైద్యుని రిజిస్ట్రేషన్‌ని రద్దు చేయవచ్చు. అయితే అలా చేయడానికి కోర్టులో అతని నేరం రుజువవ్వాలి. అది మొదటి నేరం అయిన పక్షంలో 5 సంవత్సరాలు, తదుపరి నేరం అయితే శాశ్వతంగాను అతడి రిజిస్ట్రేషన్‌ని రద్దు చేయవచ్చు.

3. ఏ వ్యక్తియైనా జన్యు సలహాకేంద్రం, జన్యు ప్రయోగశాల, జన్యు క్లినిక్‌ల లేదా అల్ట్రాసౌండ్ క్లినిక్ లేదా ఇమేజింగ్ క్లినిక్‌ల లేదా తోడ్పాటుతో వైద్య జన్యుశాస్త్రవేత్త, గైనకాలజిస్ట్, సోనోలజిస్ట్ లేదా ఇమేజింగ్ స్పెషలిస్ట్ లేదా నమోదు చేయబడిన వైద్యుడు అయ్యి ఉండి గర్భిణీస్త్రీ మీద గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు సెక్షన్ 4(2)లో పేర్కొన్న కారణాల చేత కాక వేరే కారణాల నిమిత్తం చేస్తే అతడికి మూడేళ్ళ జైలు శిక్ష మరియు రూ. 50,000/-లు అపరాధరుసుము మొదటి నేరం క్రింద విధించబడుతుంది. తదుపరి నేరం క్రింద ఐదు సంవత్సరాలు మరియు లక్షరూపాయిల వరకు జరిమాన విధించబడుతుంది.

4. తన అంగీకారం లేకుండా బలవంతంగా ఈ పరీక్షలు చేయించుకోవలసి వచ్చిన మహిళకి సబ్‌సెక్షన్ వర్తించదు.

24. గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు నిర్వహించే కేసులో పురోభావన:

భారత సాక్ష్యాధారాల చట్టం 1872 (1 ఆఫ్ 1872) లో ఏమి ఉన్నప్పటికీ అందుకు వ్యతిరేకంగా రుజువైతే తప్ప గర్భిణి స్త్రీని గర్భస్థ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని ఆమె భర్త లేదా బంధువులు సెక్షన్‌లోని సబ్‌సెక్షన్ (2) పేర్కొన్న ప్రయోజనాల కోసం కాక వేరే ప్రయోజనాల కోసం బలవంతం చేసారని కోర్టు భావిస్తుంది. సెక్షన్ 2(3) క్రింద ఆ వ్యక్తి సదరు గర్భిణిని నేరానికి పురికొల్పినందుకుగాను అదే సెక్షన్‌లో నేరానికి పేర్కొన్న శిక్ష విధించబడాలి.

25. ఈ చట్టంలోని నియమ నిబంధనలను ఉల్లంఘించినందుకు మరెక్కడా నిర్దిష్టంగా ఎటువంటి శిక్ష నిర్ధేశించకపోతే వేసే శిక్ష.

ఎవరైతే ఈ చట్టంలోని నియమ నిబంధనలను ఉల్లంఘిస్తారో అవి ఉల్లంఘించినందుకు గాను ఈ చట్టంలో మరెక్కడా శిక్ష నిర్ధేశించి ఉండకపోతే అతడు 3 నెలల వరకు జైలు శిక్ష లేదా రూ. 1000/- వరకు అపరాధ రుసుము లేదా ఈ రెంటిని శిక్షగా అనుభవించాలి. ఉల్లంఘన కొనసాగిస్తూ ఉన్న పక్షంలో అదనంగా 500/- ల చొప్పున మొదటిసారి శిక్ష పడిన తేదీ నుండి ఉల్లంఘన కొనసాగుతున్న తేదీ వరకు అపరాధ రుసుము చెల్లించాలి.

26. కంపెనీలు ద్వారా చేయబడే నేరాలు:

1. ఈ చట్టం క్రింద శిక్ష వేయదగిన నేరానికి ఏదైనా కంపెనీ పాల్పడితే ఆ నేరం చేసేప్పుడు ఏ వ్యక్తియైతే కంపెనీ వ్యాపారం నడిపేందుకు గాను బాధ్యులుగా లేక ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారో వారు దోషిగా పరిగణించబడుతారు. వారికి వ్యతిరేకంగా కేసు నడపవచ్చు మరియు తదనుగుణంగా శిక్షించవచ్చు.

అయితే వారు ఈ నేరం తనకి తెలియకుండా జరిగిందని లేదా ఈ నేరాన్ని ఆపటానికి తగిన శ్రద్ధ తీసుకున్నారు అని రుజువు చేస్తే ఈ సబ్‌సెక్షన్‌లో ఉన్నదేదీ వారిని శిక్షార్హులు చేయలేదు.

2. ఈ చట్టం క్రింద శిక్షించబడే నేరంగా పరిగణించబడే ఏ నేరాన్నైనా ఒక కంపెనీ చేస్తే పైగా ఆ కంపెనీ డైరెక్టర్ మేనేజర్, సెక్రటరీ లేదా ఆఫీసరు యొక్క అంగీకారంతో, లేదా రహస్య సమ్మతితో లేదా వారి నిర్లక్ష్యం వల్ల ఈ నేరం జరిగిందని రుజువైతే వారు ఈ నేరం క్రింద శిక్షార్హులు వారికి వ్యతిరేకంగా కేసులు పెట్టి తదనుగుణంగా శిక్షించాలి.

వివరణ: ఈ సెక్షన్ ప్రయోజనాల నిమిత్తం

ఎ) "కంపెనీ" అనగా కార్పొరేట్ సంస్థ వ్యాపారసంస్థ లేదా వ్యక్తుల యొక్క సంఘం మరియు

బి) వ్యాపారసంస్థ యొక్క డైరెక్టర్ అనగా వ్యాపారసంస్థలో భాగస్వామి

27. విచారణయోగ్యమైన, జామీను ఇవ్వదగని మరియు రాజీకి వీలుకాని నేరాలు :

ఈ చట్టం క్రింద ప్రతినేరం విచారణయోగ్యమైనది, జామీను ఇవ్వదగినది మరియు రాజీకి వీలుకానిది.

28. విచారణయోగ్యమైన నేరాలు:

1. ఈ క్రింద పేర్కొన్న వ్యక్తులు ఫిర్యాదు చేస్తే తప్ప కోర్టులో ఏ నేరాన్నీ విచారించరాదు.

   ఎ) సంబంధిత సముచిత అధికారి లేదా కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాల అధికారాన్ని ఇచ్చిన ఆఫీసరు లేదా

   బి) ఆరోపించబడిన నేరం గురించి సముచిత అధికారికి నిర్ణీత పద్ధతిలో 15 రోజులకు తక్కువ కాకుండా నోటీసు ఇచ్చిన వ్యక్తి ఇలా ఫిర్యాదు ఇవ్వటానికి గల ఉద్దేశ్యం ఆ ఫిర్యాదు పత్రంలో పేర్కొనాలి.

వివరణ: ఈ క్లాజ్ ప్రకారం "సామాజిక సంస్థ కూడా "వ్యక్తి" గా పరిగణించబడుతుంది.

2. ఈ చట్టం పరిధిలోని నేరాలను మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ లేదా మొదటి తరగతి జుడీషియల్ మెజిస్ట్రేట్ కాక మరే ఇతర కోర్టు శిక్షించడానికి వీలు లేదు.

3. సబ్‌సెక్షన్ (1) క్లాజ్ (బి) క్రింద ఫిర్యాదు చేసిన వ్యక్తి డిమాండ్ మేరకు కోర్టు తన స్వాధీనంలో ఉన్న సంబంధిత రికార్డుల కాపీలను సదరు వ్యక్తికి అందించేందుకు సముచిత అధికారికి నిర్దేశించాలి.

29. రికార్డుల నిర్వహణ:

1. ఈ చట్టం మరియు నియమాల ప్రకారం నిర్వహించవలసిన అన్ని రికార్డులు, చార్టులు, పత్రాలు, రిపోర్టులు, అంగీకారపత్రాలు మరియు అన్ని దస్తావేజులు రెండు సంవత్సరాల వరకు లేదా నిర్ణీత సమయం వరకు కాపాడాలి. అయితే ఏదైనా జన్యు సలహాకేంద్రం జన్యు ప్రయోగశాల లేదా జన్యుక్లినిక్ కి వ్యతిరేకంగా క్రిమినల్ లేదా ఇతర ప్రోసీడింగ్స్ మొదలుపెట్టినట్లైతే, ఆ సెంటర్ ప్రయోగశాల లేదా క్లినిక్ కి సంబంధించిన రికార్డులు మరియు ఇతర డాక్యుమెంట్లు ఆ ప్రోసీడింగ్స్ యొక్క తుది నిర్ణయం వరకు కాపాడాలి.

2. సముచిత అధికారి ఇందుకుగాను నియమించిన వ్యక్తిని తనిఖీ చేసేందుకు వీలుగా అందుబాటులో ఉంచాలి.

30. రికార్డులను వెతకడం మరియు స్వాధీనం చేసుకొనే అధికారం:

ఏదైనా జన్యు సలహాకేంద్రంలో జన్యు ప్రయోగశాలలో జన్యుక్లినిక్‌లో లేదా ఏ ఇతర చోటైనా నేరం జరుగుతుంది అని సముచిత అధికారి నమ్మేందుకు తగిన కారణాలు ఉంటే నిర్ణీత నియమాలకు కట్టుబడి సదరు వ్యక్తి అవసరమని భావిస్తే సబబైన వేళల ప్రవేశించవచ్చు లేదా వెతకవచ్చు. జరిగిన నేరానికి ఈ చట్టం క్రింద సాక్ష్యంగా ఉపయోగపడుతుంది అనుకుంటే ఏ రికార్డునైనా రిజిష్టరునైనా పత్రాన్నైనా పుస్తకాన్నైనా కరపత్రాన్నైనా వ్యాపారప్రకటననైనా లేదా మరే ఇతర వస్తు పరికరమైనా దొరికితే దాన్ని స్వాధీనం చేసుకొని సీల్ చేయవచ్చు.

31. ధర్మ సమ్మతమైన నమ్మకంతో తీసుకున్న చర్య యొక్కరక్షణ:

ఈ చట్టంలోని నిబంధనలను అమలు పరిచేందుకు సదుద్దేశంతో చేసిన లేక చేయదలుచుకున్న చర్యకి వ్యతిరేకంగా లేదా రాష్ట్ర ప్రభుత్వాలు అభియోగం లేదా సముచిత అధికారి లేదా కేంద్ర రాష్ట్ర లేదా సముచిత అధికారికి నియమించిన ఆఫీసరుకి వ్యతిరేకంగా దావా లేదా అభియోగం లేదా న్యాయ కార్యవ్యవహారాలని నడపకూడదు.

31ఎ. ఆటంకాలు తొలగింపు:

1. గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు (నియంత్రణ మరియు దుర్వినియోగ నివారణ) సవరణ చట్టం 2002 యొక్క నిబంధనలను అమలు పరచటానికి ఏదైనా ఆటంకం కలిగితే కేంద్ర ప్రభుత్వం రాజ్యాధికార పత్రంలో ఉత్వర్వుని ప్రచురించడం ద్వారా ఈ చట్టం అమలుకు తొడ్పడే నిబంధనలు ఈ చట్టానికి అనుగుణమైనవిగా చేయవచ్చు. అయితే అటువంటి నిబంధనలు ఈ చట్టం అమలు పరిచేందుకు శ్రీఘంగా తోడ్పడతాయని కేంద్ర ప్రభుత్వం భావించాలి.

అయితే పైన చెప్పిన ఉత్తర్వును ఈ చట్టం అమలులోకి వచ్చిన 3 సంవత్సరాలలోపే జారీ చేయాలి.

2. ఈ సెక్షన్ క్రింద ఉత్తర్వును జారీ చేసిన వెంటనే ఉభయసభలు ముందు ఆమోదానికి తప్పక ఉంచాలి.

32. నియమాలు చేసే అధికారం:

1. ఈ చట్టంలోని నిబంధనల అమలుకు కేంద్ర ప్రభుత్వం నియమాలను చేయవచ్చు.
2. ప్రత్యేకంగా పూర్వ అధికారం పట్ల ఎటువంటి ప్రతికూలత లేకుండా చేయబడిన నియమాలు ఈ క్రింది వాటిని కలిగి ఉంటాయి.
   i) సెక్షన్ 3 (2) క్రింద నమోదు చేయబడిన జన్యు సలహా కేంద్రం, జన్యు ప్రయోగశాల లేదా జన్యు క్లినిక్‌లలో నియమించే వ్యక్తులు కనీస అర్హతలు.
   iఎ) సెక్షన్ 4 (3) యొక్క మినహాయింపు నిబంధన ప్రకారం గర్భిణీ స్త్రీ మీద అల్ట్రాసోనోగ్రఫీ పరీక్షలు జరిపిన వ్యక్తి ఆ పరీక్షలు జరిపే తీరును నమోదు చేయాలి.

ii) సెక్షన్ 5 క్రింద ఆమె అంగీకారాన్ని ఏ రూపంలో పొందాలి

iii) సెక్షన్ 8 (4) క్రింద కేంద్ర పర్యవేక్షక బోర్డు సభ్యులు విధులు నిర్వర్తించేందుకు పాటించవలసిన ప్రక్రియ.

iv) సెక్షన్ 9 (5) క్రింద ఎక్స్ అఫిషియో సభ్యులు కాక ఇతర సభ్యుల బత్యాలు.

iva) సెక్షన్ 16 (iv) క్లాజ్ క్రింద కేంద్ర పర్యవేక్షక బోర్డు జన్యు సలహా కేంద్రాలు జన్యు ప్రయోగశాలలు మరియు జన్యుక్లినిక్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులు పాటించవలసిన ప్రవర్తనా నియమావళి.

ivb) సెక్షన్ 16 ఎ(i) (iv) క్లాజ్ క్రింద రాష్ట్రంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన రాష్ట్ర మరియు కేంద్ర పాలిత పర్యవేక్షక బోర్డులు రిపోర్టు తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి అందించాలి.

ivc) సెక్షన్ 17ఎ (d) క్రింద మరే విషయంలోనైనా సముచిత అధికారికి అధికారాలు ఇవ్వటం.

v) సెక్షన్ 17 (8) యొక్క మినహాయింపు నిబంధన క్రింద ఏదైనా రెండు సలహా కమిటి సమావేశాలు మధ్య ఉండవలసిన వ్యవధి.

vi) సెక్షన్ 17 (9) క్రింద సలహా కమిటీలో సభ్యులను నియమించే నిబంధనా పద్ధతులను మరియు ఆ సభ్యులను నియమించేందుకు సలహా కమిటీ పాటించే ప్రక్రియ.

vii) సెక్షన్ 18 (2) ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం అర్జీ పెట్టుకోవాల్సిన రూపం మరియు పద్ధతి కట్టవలసిన రుసుము.

viii) సెక్షన్ 18 (5) క్రింద జన్యు సలహా కేంద్రం,జన్యు ప్రయోగశాల లేదా జన్యు క్లినిక్‌లలో అందించవలసిన సదుపాయాలు, ఉండవలసిన పరికరాలు మరియు ఉంచవలసిన ప్రమాణాలు

ix) సెక్షన్ 19 (1) క్రింద రిజిస్ట్రేషన్ ధృవపత్రం జారీ చేయవలసిన నమూనా.

x) సెక్షన్ 19 (3) ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ఏ పద్ధతిలో మరియు ఎంతకాలం తర్వాత పునరుద్ధరించాలి మరియు అందుకు గాను ఎంత రుసుం చెల్లించాలి.

xi) సెక్షన్ 21 ప్రకారం అప్పీలు చేసే విధానం

xii) సెక్షన్ 29 (1) క్రింద రికార్డులను చార్ట్‌లు వగైరా పొందుపరచవలసిన కాల వ్యవధి.

xiii) ఏ వ్యక్తి నుండైతే దస్తావేజులు రికార్డులు లేదా వస్తువులు స్వాధీనం చేసుకున్నారో వారు అవి స్వాధీనపరచుకున్న వాటి యొక్క పట్టిక ఏవిధంగా తయారుచేయాలి, అసలు ఆ దస్తావేజులు రికార్డులు లేదా వస్తువులు సెక్షన్ 30 (1) ప్రకారం ఎలా స్వాధీన పరచుకోవాలో పేర్కొనాలి.

xiv) నిర్ణయించవలసిన లేదా నిర్ణయించదగిన ఇతర విషయాలు.

33. నియంత్రణలు రూపొందించే అధికారం:

బోర్డు కేంద్ర ప్రభుత్వం యొక్క పూర్వామోదం రాజపత్రంలో ప్రకటన ద్వారా ఈ చట్టంలోని నిబంధనలు మరియు నియమాలతో పొసగని నియంత్రణలను ఈ క్రింది విషయాలలో చేయవచ్చు.

ఎ) బోర్డు సమావేశాలకు జరపవలసిన సమయం మరియు చోటు మరియు ఆ సమావేశాలలో కార్య వ్యవహారాలను నడపడానికి పాటించవలసిన ప్రక్రియ మరియు సెక్షన్ 9 (1) క్రింద ఉండవలసిన కనీస సభ్యులు సంఖ్య.

బి) సెక్షన్ 11 (1) క్రింద ఒక వ్యక్తి తాత్కాలికంగా అనుబంధం కలిగి ఉండవలసిన విధానం.

సి) సెక్షన్ 12 క్రింద నియమితులైన ఆఫీసర్లు మరియు ఉద్యోగుల నియామక విధానం సర్వీసు షరతులు మరియు జీతాలు మరియు భత్యాలు.

డి) బోర్డు వ్యవహారాలను సమర్ధవంతంగా నడిపేందుకు నియమాలు.

34. పార్లమెంటులో ప్రవేశపెట్టవలసిన నియమాలు మరియు నియంత్రణలు:

ఈ చట్టం క్రింద చేయబడే ప్రతి నియమ నిబంధన పార్లమెంటు ముందు ఆమోదానికి ఉంచాలి. పార్లమెంట్ సమావేశాలు 30 రోజులపాటు జరిగినపుడుగానీ వరసగా రెండుసార్లు 30 రోజుల వ్యవధి పూర్తయినపుడు గాని పార్లమెంట్ ముందు ఉంచాలి. పార్లమెంట్‌లో చేయబడిన మార్పుల కనుగుణంగా నిబంధనలను మార్చి దానిని అమలు చేయ్యాలి. ఏ మార్పూ చేయకపోతే యధావిధిగా అమలు చెయ్యాలి. అయితే ఈ నియమాలకు ముందు చలామణిలో ఉన్న నియమాలు, నియంత్రణలను కొత్తగా చేయబడిన నియమాలు చెల్లనివిగా చేయకూడదు.

*****

15. వైద్య పర్యవేక్షణలో చేయబడే గర్భవిచ్ఛిత్తి చట్టం 1971

నమోదైన వైద్యుడి పర్యవేక్షణలో గర్భవిచ్ఛిత్తి చేసేందుకు మరియు అందుకు సంబంధించిన విషయాలను నియంత్రించేందుకు ఈ చట్టం చేయబడింది.

1. ఈ చట్టం పేరు, పరిధి మరియు అమలులోకి వచ్చే తేది :

1. ఈ చట్టాన్ని వైద్యుడి పర్యవేక్షణలో చేయబడే గర్భ విచ్ఛిత్తి చట్టం అనవచ్చు.
2. జమ్మూ, కాశ్మీర్ మినహా ఈ చట్టం భారతదేశం అంతటికీ వర్తిస్తుంది.
3. కేంద్ర ప్రభుత్వం రాజ్యాధికార పత్రంలో ప్రకటించిన తేదీ నుండి ఈ చట్టం అమలులోకి వస్తుంది.

2. నిర్వచనాలు : సందర్భం వేరే రకంగా ఉంటే తప్ప, ఈ చట్టంలో

a) "సంరక్షకుడు" అనగా ఒక మైనర్ లేదా మానసిక రోగిని సంరక్షించేవాడు అని అర్థం.

b) "మానసిక రోగి" అనగా మానసిక అవ్యవస్థ కారణంగా వైద్యం పొందవలసిన ఆవశ్యకతని కలిగి ఉన్న వ్యక్తి. బుద్ధి మాంద్యత ఉన్న వ్యక్తిని ఈ చట్టం "మానసిక రోగి" గా పరిగణించదు.

c) "మైనర్" అనగా భారత మెజారిటీ చట్టం, 1875 (9 of 1875) నిబంధనల ప్రకారం మెజారిటీ పొందనివాడు.

d) "నమోదైన వైద్యుడు" అనగా భారత వైద్య కౌన్సిల్ చట్టం, 1956 (102 of 1956) క్రింద గుర్తింపు పొందిన వైద్య డిగ్రీని పొందినవాడు. అతడి పేరు రాష్ట్ర వైద్య రిజిష్టరులో నమోదై ఉండాలి. ఈ చట్టంలోని నియమాల ప్రకారం స్త్రీ వైద్యశాస్త్రం మరియు ప్రసూతి వైద్యశాస్త్రంలో అనుభవం లేదా ట్రైనింగ్ పొందినవాడై ఉండాలి.

3. నమోదైన వైద్యుడు ఏ సందర్భాలలో గర్భవిచ్ఛిత్తి చేయవచ్చు :

1) భారత శిక్షాస్మృతి (45 of 1860) లో ఏమి పేర్కొన్నప్పటికీ నమోదైన వైద్యుడు ఈ చట్టం క్రింద కానీ మరే ఇతర చట్టం క్రిందకాని నిబంధనల ప్రకారం గర్భ విచ్ఛిత్తి చేసినట్లైతే అతడిని దోషిగా పరిగణించకూడదు.

2) సబ్‌సెక్షన్ (4) లోని నిబంధనల ప్రకారం, నమోదైన వైద్యుడు ఈ క్రింద పేర్కొన్న సందర్భాలలో గర్భవిచ్ఛిత్తి చేయవచ్చు.

a) గర్భం దాల్చి, 12 వారాలు మాత్రమే అయితే, లేదా

b) ఒకవేళ ఈ 12 వారాల గడువు దాటినా 21 వారాలకంటే ఎక్కువ దాటకపోతే

అయితే ఇందుకు గాను కనీసం ఇద్దరు నమోదైన వైద్యులు ఈ క్రింది విషయాలను నిర్ధారించుకోవాలి.

i) గర్భధారణని కొనసాగిస్తే, గర్భిణీ స్త్రీ జీవితానికి హాని జరుగుతుంది. లేదా ఆమె శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది అని వైద్యులు భావిస్తే

ii) ఒకవేళ బిడ్డ జన్మించినా, శారీరక లేదా మానసిక వైకల్యాలకు గురయ్యే అవకాశం ఉంటుందని భావిస్తే

వివరణ I : గర్భిణీ స్త్రీ తను గర్భం దాల్చడానికి రేప్‌ని కారణంగా చూపిస్తే, అలా గర్భవతి కావడము తన మానసిక ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది అని అనిపిస్తే వైద్యుడు గర్భవిచ్ఛిత్తి చేయవచ్చు.

వివరణ II : కుటుంబ నియంత్రణా పద్ధతులు విఫలమవ్వటం వలన వివాహిత గర్భవతి అయితే, అలా వద్దనుకున్న గర్భం ఆమె మానసిక ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది అనుకుంటే వైద్యుడు గర్భవిచ్ఛిత్తి చేయవచ్చు.

3) సబ్ సెక్షన్ (2) ప్రకారము గర్భధారణని కొనసాగిస్తే, ఆరోగ్యానికి హాని జరుగుతుందో లేదో నిర్ధారించేటప్పుడు గర్భిణీ స్త్రీ ఎంతవరకు ముందుచూపుతో వ్యవహరించింది, లేక వ్యవహరించ గలదు అనేది పరిగణలోకి తీసుకోవాలి.

4) (a) 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు లేదా మానసిక స్థితి సరిగా లేని ఏ స్త్రీకి కూడా ఆమె సంరక్షకుడు వ్రాత పూర్వకముగా తన అంగీకారాన్ని తెలిపితే తప్ప గర్భవిచ్ఛితి చేయరాదు.

b) క్లాజ్ (a) లో పేర్కొన్న సందర్భంలో మినహా మరే ఇతర సందర్భాలో గర్భిణీ స్త్రీ అంగీకారం లేకుండా గర్భవిచ్ఛితి చేయరాదు.

4) గర్భవిచ్ఛిత్తి జరిపేచోటు :

ఈ చట్టప్రకారం, ఈ క్రింది పేర్కొన్న చోట్లలో తప్ప మరే ఇతర చోట గర్భ విచ్ఛిత్తి చేయకూడదు.

a) ప్రభుత్వం స్థాపించి, నిర్వహిస్తున్న ఆసుపత్రి లేదా

b) ఈ చట్టం కోసం ప్రభుత్వం తాత్కాలికంగా అంగీకరించిన చోటు లేదా చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కమిటీ అంగీకరించిన చోటులో గర్భవిచ్ఛిత్తి చేయవచ్చు. జిల్లా ఆరోగ్య ఆఫీసర్‌ను ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా నియమించవచ్చు.

అయితే ఈ జిల్లాస్థాయి కమిటీ చైర్‌పర్సన్‌తో సహా ముగ్గురికి తగ్గకుండా ఐదుగురికి మించకుండా, సభ్యులను కలిగిఉండాలి.

5) సెక్షన్లు 3 మరియు 4 ఎప్పుడు వర్తించవు :

1) వైద్యుడు గర్భిణీ స్త్రీ జీవితాన్ని కాపాడటానికి గర్భవిచ్ఛిత్తి అత్యవసరం అని భావిస్తే, అలాంటి సందర్భాలలో సెక్షన్ 3 లో సబ్ సెక్షన్ (2) మరియు సబ్ సెక్షన్ (2) లో పేర్కొన్నట్లు గర్భవిచ్ఛిత్తికి 12 వారాల గర్భధారణ మించకపోవటం మరియు కనీసం ఇద్దరు వైద్యులు యొక్క అభిప్రాయాలు ఉండితీరాలి, అన్న నియమాలు పాటించవలసిన అవసరం లేదు.

2) భారత శిక్షాస్మృతి (45 of 1860) లో ఏమి పేర్కొన్నప్పటికీ నమోదైన వైద్యుడు గాక మరే ఇతర వ్యక్తియైనా గర్భవిచ్ఛిత్తి చేస్తే, అతడికి 2 సంవత్సరాల నుండి 7 సంవత్సరాల వరకు జైలుశిక్ష విధించబడుతుంది. దీనికి అనుగుణంగా భారతశిక్షాస్మృతి కూడా సవరించబడినట్లుగా పరిగణించాలి.

3) సెక్షన్ (4) లో పేర్కొన్న చోట కాక మరే ఇతర చోటైనా గర్భవిచ్ఛిత్తి చేస్తే, ఆ వ్యక్తికి రెండు సంవత్సరాల నుండి 7 సంవత్సరాల వరకు జైలుశిక్ష విధించబడుతుంది.

4) సెక్షన్ (4) క్లాజ్ (బి) ప్రకారము ఆమోదించబడినచోటు యొక్క యజమానికి 2 నుండి 7 సంవత్సరాల వరకు జైలుశిక్ష విధించబడుతుంది.

వివరణ I : "యజమాని" అనగా ఒక ఆసుపత్రి యొక్క పరిపాలనాధికారి లేదా ఆసుపత్రి యొక్క పనితీరు లేదా నిర్వహణ బాధ్యతలను చూసే వ్యక్తి

వివరణ II : సెక్షన్ (2) క్లాజ్ (డి) ప్రకారము గైనకాలజిస్ట్, మరియు ప్రసూతి వైద్య నిపుణులకు అనుభవం ఉండాలి లేదా ట్రైనింగ్ అయ్యి ఉండాలి, అన్న నిబంధనలు ఈ సెక్షన్‌కి వర్తించవు.

6. నియమాలు చేసే అధికారం :

1) ఈ చట్టంలోని నిబంధనల అమలుకు కేంద్ర ప్రభుత్వం రాజ్యపత్రం ప్రకటన ద్వారా నియమాలు చేయవచ్చు.

2) పూర్వాధికారాలను ఉల్లంఘించకుండా, ఈ క్రింద పేర్కొన్న అన్ని లేక కొన్ని విషయాలలో నియమాలు చేయవచ్చు.
   a) ఈ చట్టం ప్రకారం గర్భవిచ్ఛిత్తి చేయటానికి వైద్యునికి ఉండవలసిన అనుభవం లేక ట్రైనింగుకు సంబంధించిన అంశాలు మరియు
   b) అవసరమైన ఇతర అంశాలు

3) ఈ చట్టం క్రింద చేయబడిన ప్రతి నియమాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాలు 30 రోజులు వరకు జరుగుతున్నప్పుడు ఆమోదానికి ఉంచాలి. ఆ 30 రోజుల వ్యవధిలో ఒకటి లేదా రెండు సమావేశాల్లో పూర్తియైనా లేదా రెండు వరుస సమావేశాలలోనైనా పూర్తికావచ్చు. ఉభయ సభలు ఒక నియమానికి మార్పులు చేయాలి అని లేదా చెయ్యకూడదు అని అంగీకరించినట్లైతే తదనుగుణంగా ఆ నియమంలో మార్పులు చెయ్యాలి. అప్పటినుండి ఆ నియమం అమలులోకి వస్తుంది. అయితే అటువంటి మార్పులు పూర్వం చేయబడిన నియమాల చెల్లుబాటుని అడ్డుకోకూడదు.

7. నియంత్రణలు చేసే అధికారం :

1) నియంత్రణలు రూపొందించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రింది వాటిని చేయవచ్చు.
   a) సెక్షన్ 3 సబ్ సెక్షన్ (2) క్రింద నమోదైన వైద్యుడు లేక వైద్యుల అభిప్రాయాన్ని ధృవీకరించమని అడగవచ్చు. ఆ అభిప్రాయం ఏ రూపంలో ఉండాలో నియంత్రణల ద్వారా అడగవచ్చు. ఆ ధృవపత్రాలను పొందుపరచడానికి లేదా తీసివేయడానికి కూడా నియంత్రణలు చేయవచ్చు.
   b) గర్భవిచ్ఛిత్తి చేసే వైద్యుడు గర్భవిచ్ఛిత్తి చేస్తున్నట్లు సమాచారం అందించడం, దానికి సంబంధించిన వివరాలను తెలియచేయడం చేయవచ్చు.
   c) అలా తెలియచేసే సమాచారం లేదా వివరాలు సదరు వ్యక్తులకు తప్ప మరే ఇతర వ్యక్తులకు తెలుపకూడదు.

2 సబ్‌సెక్షన్ (1) క్లాజ్ (b) ప్రకారం అందించవలసిన సమాచారాన్ని రాష్ట్ర చీఫ్ మెడికల్ ఆఫీసర్‌కి తెలియపర్చాలి.

2A) ఈ చట్టం క్రింద రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రతి నియమం రాష్ట్ర శాసనసభ ముందు ఆమోదానికి ఉంచాలి.

3) సబ్‌సెక్షన్ (1) క్రింద చేయబడిన నియంత్రణల ఆవశ్యకతలను ఏ వ్యక్తియైనా నెరవేర్చకపోతే లేదా వాటికి విరుద్ధంగా వ్యవహరిస్తే అతడికి 1000 రూ॥లు వరకు అపరాధ రుసుం విధించబడుతుంది.

8. సద్భావనతో తీసుకొన్న చర్య యొక్క రక్షణ :

ఈ చట్టం క్రింద సద్భావనతో చేసిన చర్య వలన నష్టం వాటిల్లినా లేదా వాటిల్లే అవకాశం ఉన్నా నమోదైన వైద్యుడికి వ్యతిరేకంగా ఎటువంటి దావాని న్యాయవ్యవహారాలను నడపడానికి వీలులేదు.

*****

16. హిందు వివాహ చట్టం 1955

(1955 లోని 25వ చట్టం)

హిందువుల మధ్య వివాహానికి సంబంధించిన చట్టాన్ని సవరించడానికి, క్రోడీకరించడానికే ఈ చట్టం. (18 మే, 1955)

గణతంత్ర భారత్ ఆరవ సంవత్సరంలో పార్లమెంటు ఈ విధముగా శాసనం చేసింది.

ప్రాథమికాంశం

1. క్లుప్త శీర్షిక మరియు విస్తారం :

1. ఈ చట్టాన్ని హిందు వివాహ చట్టం, 1955 గా పలకాలి.
2. జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రం మినహాయించి భారతదేశమంతటా అది చలామణవుతుంది. భారత భూభాగం వెలుపల భూభాగాల్లో స్థిరపడిన హిందువులకు కూడా ఈ చట్టం వర్తిస్తుంది.

2. ఈ చట్టం వర్తింపు : 1) ఈ చట్టం వర్తించేది :

ఎ) వీరశైవులు, లింగాయత్లు, బ్రహ్మ, ప్రార్థనా లేదా ఆర్య సమాజ అనుచరులు సహా ఏదొక రీతిలో, ఏదొక స్థాయిలో హిందుమతస్తులైన ప్రతి ఒక్కరికీ;

బి) మతపరంగా బౌద్ధులు, జైనులు, సిక్కులైన ప్రతి ఒక్కరికి, మరియు

సి) ఈ చట్టం ఆమోదం కాక మునుపు ఈ అంశాలపై హిందుచట్టం, సంప్రదాయం, లేదా వాడుకలకు లోబడిలేమని నిరూపించుకోలేని వారు ఎవరైన మతపరంగా మహమ్మదీయులు, క్రై స్తవులు, పార్సీలు లేదా యూదులు కాని వారు ఏ ఒక్కరైనా ఈ భూభాగంలో స్థిరపడిపోయి ఉంటే వారికి ఈ చట్టం వర్తిస్తుంది.

వివరణ : పరిస్థితులకు అనుసారంగా క్రింద వ్యక్తులు మతపరంగా హిందువులు, బౌద్ధులు, జైనులు లేదా సిక్కులు :

ఎ) తల్లిదండ్రులు ఇరువురు మతపరంగా హిందువులు, బౌద్ధులు, జైనులు లేదా సిక్కులైన వారి సంతానం అది సక్రమమైనా, అక్రమమైనా;

బి) తల్లిదండ్రులలో ఒకరు మతపరంగా హిందువులు, బౌద్ధులు, జైనులు లేదా సిక్కులై ఉండి ఆ సంతానాన్ని ఆ వ్యక్తి తన తెగ, కులం, వర్గం లేదా కుటుంబంలోని సభ్యునిగా పెంచితే ఆ సంతానం; అది సక్రమమైనా, అక్రమమైనా; మరియు

సి) మతం మార్చుకుని హిందు, బౌద్ధ, జైన లేదా సిక్కు మతస్తులైన వారు, లేదా తిరిగి ఈ మతాన్ని మళ్లీ స్వీకరించిన వారు.

2. సబ్సెక్షన్ (1) లో ఏమున్నప్పటికి కేంద్ర ప్రభుత్వం అధికార గెజిట్లో నోటిఫికేషన్ ద్వారా ఆదేశాలు ఇవ్వని ఎడల రాజ్యాంగంలోని 366 అధికరణ క్లాజు (25) ప్రకారం షెడ్యూల్డు తెగల సభ్యులైన వారు ఎవరికి ఈ చట్టంలోని అంశాలు వర్తించవు.

3. ఈ చట్టంలోని ఏ భాగంలోనైనా 'హిందు' అనే పదప్రయోగం జరిగితే అది ఈ సెక్షన్లో పేర్కొన్న అంశాల ఆధారంగా హిందు మతస్తులు కాని వారికి కూడా వర్తిస్తుంది.

3. నిర్వచనాలు :

ఇతర సందర్భాల్లో తప్పితే ఈ చట్టం ప్రకారం :

ఎ) 'సంప్రదాయం', 'వాడుక' అనే పదాలు సుదీర్ఘకాలం, నిరాటంకంగా, క్రమబద్ధంగా ఒక స్థానిక ప్రాంతం, తెగ, కులం, వర్గం లేదా కుటుంబానికి చెందిన హిందువులు అనుసరిస్తున్న నియమాలను అమల్లో ఉన్న చట్టంగా భావిస్తే;

అయితే ఆ నియమం కచ్చితంగా, న్యాయసమ్మతంగా, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకం కాకుండా ఉండాలి; మరియు అది కుటుంబానికి సంబంధించిన నియమమైతే దాన్ని ఆ కుటుంబం విడనాడి ఉండకూడదు.

బి) "జిల్లాకోర్టు" అంటే ఒక ప్రాంతంలో సిటీ సివిల్ కోర్టు ఉంటే ఆ కోర్టు, ఇతర ప్రాంతాల్లో ఒరిజినల్ జ్యూరిస్‌డిక్షన్ ఉన్న ప్రిన్సిపల్ సివిల్ కోర్టు, ఈ చట్టంలోని అంశాలపై పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికార గెజిట్‌లో జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న కోర్టు;

సి) "సంపూర్ణ రక్త సంబంధీకులు" మరియు "అర్ధ రక్త సంబంధీకులు" – ఒకే పూర్వీకుని భార్య ద్వారా కలిగిన వారసుల్లోని ఇద్దరు వ్యక్తులను సంపూర్ణ రక్త సంబంధీకులు అంటారు. ఒకే పూర్వీకుని అనేక భార్యల ద్వారా కలిగిన వారసులను అర్ధ రక్త సంబంధీకులు అంటారు;

డి) "యోనిజ రక్త సంబంధీకులు" – ఒకే పూర్వీకురాలికి అనేక భర్తల ద్వారా కలిగిన వారసుల్లో ఇద్దరు వ్యక్తుల మధ్య ఉన్న సంబంధాన్ని యోనిజ రక్త సంబంధం అంటాం.

వివరణ : క్లాజు (సి) మరియు (డి) లో 'పూర్వీకుడు' అనే పదంలో తండ్రి, 'పూర్వీకురాలు' అనే పదంలో తల్లి ఇమిడుంది;

ఇ) 'సూచించిన' అంటే ఈ చట్టం కింద రూపొందించిన నియమాల్లో సూచించిన విధంగా అని అర్థం;

యఫ్) i) "సపిండ బాంధవ్యం" లో ఒక వ్యక్తిని ఒక తరం అనుకోగా ఆ వ్యక్తి తల్లి వైపు పూర్వీకుల్లో మూడు తరాలను (మూడోతరాన్ని కలుపుకుని), తండ్రివైపు పూర్వీకుల్లో ఐదు తరాలను (ఐదవ తరాన్ని కలుపుకుని) లెక్కకట్టాలి;

ii) ఒక వ్యక్తి మరో వ్యక్తికి సపిండ బాంధవ్య పరిధిలో నేరుగా పూర్వీకులైతే, లేదా ఒకే పూర్వీకుడు/పూర్వీకురాలి ద్వారా సపిండ బాంధవ్య పరిధిలో బాంధవ్యం కలిగుంటే ఆ ఇద్దరు వ్యక్తులను "సపిండులు" అంటారు.

జి) "నిషేధిత సంబంధ పరిధి" – ఇద్దరు వ్యక్తులు "నిషేధిత సంబంధ పరిధి" లో ఉన్నారని ఎప్పుడు అంటారంటే–

i) వారిలో ఒకరు రెండవ వారికి నేరుగా పూర్వీకులైనప్పుడు; లేదా

ii) వారిలో ఒకరు రెండవ వారి పూర్వీకుని/పూర్వీకురాలి లేదా వారసుని / వారసురాలి భార్య లేదా భర్త అయినప్పుడు; లేదా

iii) వారిలో ఒకరు సోదరుని భార్య లేదా; తల్లి లేదా తండ్రి సోదరుడు; లేదా తాత, లేదా అమ్మమ్మ నాయనమ్మల సోదరుడు అయినప్పుడు;

iv) వారిద్దరు సోదరసోదరీలు అయినప్పుడు లేదా పెద్ద నాన్న / బాబాయి / మామ మరియు సోదర సంతానం / కోడలు / అల్లుడు అయినప్పుడు; లేదా పిన్ని / పెద్దమ్మ / మేనత్త మరియు సోదర సంతానం / కోడలు / అల్లుడు అయినప్పుడు; లేదా సోదర సోదరీమణుల / సోదరుల సంతానం అయినప్పుడు

వివరణ : క్లాజు (యఫ్) మరియు (జి) లో 'సంబంధం' అనే పదంలో కింద బాంధవ్యాలు కూడా ఇమిడున్నాయి:

i) సంపూర్ణ, అర్ధ, యోనిజ రక్త సంబంధీకులు;

ii) అక్రమ, సక్రమ రక్త సంబంధీకులు;

iii) రక్త సంబంధమే కాదు దత్తత ద్వారా సంబంధీకులు కూడా.

ఈ క్లాజులోని బాంధవ్యాలన్నింటిని ఆ విధంగానే పరిగణించాలి.

4. ఇతర చట్టాలపై ఈ చట్టం చెలామణి :

ఈ చట్టంలో కచ్చితంగా వ్యక్తీకరించని ఎడల

ఎ) ఈ చట్టంలో ప్రస్తావించిన ఏదైనా అంశంపై ఈ చట్టం అమల్లోకి రాకమునుపు ఏదైనా గ్రంథంలోని నియమం లేదా హిందూ శాసన నిర్వచనం, ఏదైనా సంప్రదాయం, లేదా వాడుక అమల్లో ఉన్న చట్టంగా చెలామణి అవుతుంటే అది ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత చెల్లుబాటు కాదు;

బి) ఈ చట్టం అమల్లోకి రాకముందు చెలామణిలో ఉన్న చట్టమేదైనా ఈ చట్టంలోని అంశాలకు విరుద్ధంగా ఉంటే అది విరుద్ధమైన మేరకు చెల్లుబాటు కాదు.

హిందు వివాహాలు

5. హిందు వివాహాలకు సంబంధించిన షరతులు :

కింద పేర్కొన్న షరతులకు లోబడే ఇద్దరు హిందువులు వివాహం చేసుకోవచ్చు. అవి ఏమిటంటే :

i) వివాహ సమయానికి ఇరువురిలో ఎవరికీ సజీవ జీవన భాగస్వామి (భార్య/భర్త) ఉండకూడదు;

ii) వివాహ సమయానికి, ఇరువురిలో ఎవరు –

ఎ) మతి స్థిమితం లేని కారణంగా సరైన అనుమతి తెలిపే స్థితిలో లేకుండా ఉండకూడదు; లేదా

బి) సరైన అనుమతి తెలిపే స్థితిలో ఉన్నా వివాహానికి, సంతానం ప్రాప్తికి పనికి రాకుండా పోయే మానసిక వ్యాధితో బాధపడకూడదు, లేదా

సి) మధ్య మధ్యలో మతిస్థిమితం కోల్పోకూడదు;

iii) వివాహ సమయానికి వరుడికి ఇరవై ఒక్క సంవత్సరాలు, వధువుకి పద్దెనిమిది సంవత్సరాలు నిండి ఉండాలి;

iv) ఆ ఇరువురి మధ్య వివాహాన్ని అనుమతించే సంప్రదాయానికో, వాడుక్కో వారు కట్టుబడి ఉండని పక్షంలో వారు నిషేధిత బాంధవ్య పరిధిలో ఉండకూడదు;

v) ఆ ఇరువురి వివాహాన్ని అనుమతించే సంప్రదాయానికో, వాడుక్కో వారు కట్టుబడి లేని పక్షంలో వారు ఒకరికి ఒకరు సపిండులు కాకూడదు.

6. వివాహంలో సంరక్షణ :

(బాల్య వివాహ నిరోధ (సవరణ) చట్టం, 1978 (1978 లోని 2వ చట్టం) సెక్షన్ 6, మరియు షెడ్యూలు ద్వారా తొలగించబడింది. (1-10-1978 నాటి నుండి ఈ తొలగింపు వర్తిస్తుంది))

7. హిందు వివాహ కార్యం :

1. వధువరులలో ఎవరో ఒకరు ఆచరించే సాంప్రదాయక కార్యాలు, వేడుకల ద్వారా హిందు వివాహం పూర్తవుతుంది.
2. ఆ కార్యాల్లో, వేడుకల్లో సప్తపది (పవిత్ర హోమం సమక్షంలో వధువరులు కలిసి ఏడు అడుగులు వేయడం) లో ఏడవ అడుగు వేయడంతో వివాహం పూర్తయినట్లు ఇద్దరు దానికి కట్టుబడినట్లు.

8. హిందు వివాహాల రిజిస్ట్రేషన్ :

1. హిందు వివాహాల నిరూపణ సులభతరం చేయడం కోసం హిందు వివాహ రిజిస్టరులో వధూవరులు తమ వివాహం తాలుకు వివరాలను నమోదు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమాలను రూపొందించవచ్చు. ఆ విధంగా నమోదు చేయడానికి కొన్ని షరతులు విధించవచ్చు.
2. సబ్‌సెక్షన్ (1) లో ఏమున్నప్పటికీ, అవసరాన్ని బట్టి లేదా పరిస్థితులను బట్టి సబ్‌సెక్షన్ (1) కింద నమోదు చేయాల్సిన వివరాలను రాష్ట్రమంతటా, లేదా ఏదైనా ఒక ప్రాంతంలో తప్పనిసరిగా నమోదు చేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తే ఆ విధంగా చేయవచ్చు. ఇది అన్ని సందర్భాల్లో లేదా పేర్కొన్న కొన్ని సందర్భాల్లో చేయాల్సి ఉంటుంది. ఈ విధమైన ఆదేశముండి ఏ వ్యక్తయినా ఆ నియమాన్ని ఉల్లంఘించుంటే ఆ వ్యక్తికి పాతిక రూపాయిల వరకు జరిమానా విధించాలి.
3. ఈ సెక్షన్ కింద రూపొందించిన నియమాలను సత్వరం రాష్ట్ర శాసనసభ ముందు ప్రవేశపెట్టాలి.
4. హిందు వివాహ రిజిష్టరుని తనిఖీ చేసేందుకు న్యాయసమ్మతమైన అన్ని వేళలు అందుబాటులో ఉంచాలి. అందులోని ప్రకటనలను సాక్ష్యం రూపాలలో కోర్టులో ప్రవేశపెట్టవచ్చు. దరఖాస్తు పెట్టుకుని సూచించిన రుసుము కట్టిన మీదట రిజిస్ట్రార్ అందులోని భాగాల సర్టిఫైడ్ ప్రతులను ఇవ్వాలి.
5. ఈ సెక్షన్‌లో ఏమున్నప్పటికీ, రిజిస్టరులో నమోదు చేయనంత మాత్రాన హిందు వివాహ చెల్లుబాటుకి అది అడ్డంకి కాజాలదు.

సహజీవన హక్కుల పునరుద్ధరణ మరియు న్యాయపరమైన వేర్పాటు

9. సహజీవన హక్కుల పునరుద్ధరణ:

భార్యాభర్తల్లో ఎవరైనా న్యాయ సమ్మతమైన కారణం లేకుండా అవతలి వారి సాంగత్యం నుండి దూరమైతే బాధితులు తమ సహజీవన హక్కుని పునరుద్ధరించాలని కోరుతూ జిల్లా కోర్టుకి దరఖాస్తు పెట్టుకోవచ్చు. పిటిషన్‌లో ప్రకటించిన అంశాలు నిజమని దరఖాస్తును స్వీకరించడానికి ఎటువంటి న్యాయపరమైన అవాంతరాలు లేవని కోర్టు సంతృప్తి చెందిన ఎడల తదనుగుణంగా సహజీవన హక్కుల పునరుద్ధరణ డిక్రీ మంజూరు చేయొచ్చు.

వివరణ: అవతల వారి సాంగత్యం నుండి దూరమవ్వడానికి న్యాయసమ్మతమైన కారణాలు ఉన్నాయనే ప్రశ్న తలెత్తితే, న్యాయసమ్మతమైన కారణాలు ఉన్నాయని రుజువు చేయాల్సిన బాధ్యత సాంగత్యం నుండి దూరమైన వ్యక్తిపై ఉంటుంది.

10. న్యాయపరమైన వేర్పాటు :

1. ఈ చట్టం అమల్లోకి రాక మునుపు, అమల్లోకి వచ్చిన తర్వాత వివాహమైన వారిలో ఎవరైనా విడాకులు పొందడానికి కారణాలైన సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (1) లోని కారణాలలో దేన్నయినా, భార్యయితే సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (2) లోని కారణాలలో దేన్నయినా కారణంగా పేర్కొంటూ న్యాయపరమైన వేర్పాటు డిక్రీ మంజూరు చేయవలసిందిగా కోరుతూ దరఖాస్తు పెట్టుకోవచ్చు.
2. న్యాయపరమైన వేర్పాటు డిక్రీ జారీ అయిన తర్వాత ప్రతివాదితో కలిసుండాల్సిన బాధ్యత వాదికి ఉండదు. కాని ఇరువురిలో ఎవరైనా కోర్టులో పిటిషను పెట్టుకుని, పిటిషనులో ప్రకటించిన అంశాలతో సంతృప్తి చెందిన ఎడల కోర్టు న్యాయసమ్మతమని భావిస్తే ఆ డిక్రీని వెనక్కి తీసుకోవచ్చు.

చెల్లని వివాహం మరియు విడాకులు

11. చెల్లని వివాహం :

ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జరిగిన వివాహంలో సెక్షన్ 5 క్లాజులు (i), (iv), (v) లోని షరతులను ఉల్లంఘించుంటే ఆ వివాహం అసలు చెల్లనే చెల్లదు. ఇరువురిలో ఎవరైనా అవతలి వారికి వ్యతిరేకంగా పిటీషన్ దాఖలు చేస్తే ఆ వివాహం చెల్లదని ప్రకటిస్తూ డిక్రీ జారీ చేయాల్సి ఉంటుంది.

12. చెల్లనిదిగా అనగలిగే వివాహాలు :

1. ఈ చట్టం అమల్లోకి రాక మునుపు, అమల్లోకి వచ్చిన తర్వాత జరిగిన వివాహం కింద పేర్కొన్న కారణాల్లో దేనివల్లనైనా చెల్లని వివాహం అనగలిగే వివాహం అవుతుంది. ఆ వివాహమే చెల్లదని డిక్రీ మంజూరు చేయొచ్చు. ఆ కారణాలు ఏమిటంటే :
   ఎ) ప్రతివాది నపుంశకత్వం వల్ల వివాహంలో భార్యభర్తల మధ్య లైంగిక సంబంధం ఏర్పడకపోవడం; లేదా
   బి) ఆ వివాహం సెక్షన్ 5 (క్లాజు (ii) లో పేర్కొన్న షరతుకు విరుద్ధంగా జరిగింది; లేదా
   సి) పిటీషనర్ అనుమతి లేదా బాల్య వివాహ నిరోధ (సవరణ) చట్టం, 1978 (1978 లోని 2వది) అమల్లోకి రాకముందు సెక్షన్ 5 లో ఉన్నట్లుగా పిటీషనరు సంరక్షకుని అనుమతి పొందడంలో బలప్రయోగం జరిగినా లేదా వివాహ కార్యానికి సంబంధించి, ఇతర భౌతిక వాస్తవాలకు సంబంధించి, లేదా ప్రతివాదికి సంబంధించిన అంశాలకు సంబంధించి మోసానికి పాల్పడినా; లేదా
   డి) వివాహ సమయానికి పిటీషనర్ ద్వారా కాక మరొకరి వల్ల ప్రతివాది గర్భం దాల్చి ఉంటే;

2. సబ్‌సెక్షన్ (1) లో ఏమున్నప్పటికీ, వివాహాన్ని చెల్లదని ప్రకటించమని కోరే ఏ పిటీషనుని :

ఎ) సబ్‌సెక్షన్ (1) క్లాజు (సి) కారణం కింద సమర్పించి ఉంటే ఈ కారణం ఆధారంగా స్వీకరించరు.

i) బలప్రయోగం ఆగిపోయిన ఏడాది గడిచిన తర్వాత పిటీషను దాఖలు చేసుంటే, లేదా సందర్భాన్ని బట్టి మోసం బైటపడ్డ ఏడాది తర్వాత దాఖలు చేసుంటే; లేదా

ii) బలప్రయోగం ఆగిపోయిన తర్వాత, లేదా ఆయా పరిస్థితుల్లో మోసం బైటపడ్డ తర్వాత పిటిషనరు తన పూర్తి అనుమతితో వివాహంలోని అవతలి పార్టీ అయిన భార్యతో కాని భర్తతో కాని కలిసి జీవిస్తే;

బి) సబ్‌సెక్షన్ (1) క్లాజు (డి) కారణం కింద కోర్టు ఈ విషయాల్లో సంతృప్తి చెందకపోతే పిటిషనుని స్వీకరించదు:

i) ఆరోపించిన వాస్తవాలు వివాహ సమయానికి పిటిషనరుకి తెలియదు;

ii) ఈ చట్టం అమల్లోకి రాకముందు జరిగిన వివాహమైతే చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోపు పిటీషను దాఖలు చేసుండాలి. చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జరిగిన వివాహమైతే వివాహం జరిగిన ఏడాదిలోపు పిటిషన్ దాఖలు చేసుండాలి; మరియు

iii) ఆ కారణం ఉందని పిటిషనరు గుర్తించిన తర్వాత పిటిషనరు అనుమతితో వారి మధ్య వైవాహిక లైంగిక సంబంధం ఏర్పడ కూడదు.

13. విడాకులు :

1. చట్టం అమల్లోకి రాకముందు, లేదా తర్వాత జరిగిన వివాహాన్ని ఈ కారణాలచే రద్దు చేస్తూ విడాకుల డిక్రీ మంజూరు చేయవలసిందిగా కోరుతూ భార్య లేదా భర్త పిటిషను సమర్పించవచ్చు.

అవతలి వ్యక్తి –

i) వివాహమైన తర్వాత తన భార్యగాని, భర్తగాని కాని వ్యక్తితో స్వచ్ఛందంగా లైంగిక సంబంధం ఏర్పర్చుకుంటే; లేదా

iA) వివాహం అయిన తర్వాత పిటిషనరుతో క్రూరంగా ప్రవర్తిస్తే; లేదా

iB) పిటిషను దాఖలు చేయడానికి ముందు రెండేళ్లపాటు నిరాఘాటంగా పిటిషనరుని వదిలేసి ఉంటే; లేదా

ii) మరో మతం స్వీకరించి హిందువు కాకుండా పోయుంటే; లేదా

iii) నయం కాని విధంగా మతిస్థిమితం కోల్పోయి వుంటే లేదా ప్రతివాదితో కలిసి బ్రతకడం అసాధ్యమనిపించేంతగా మానసిక వ్యాధికి లోనయివుంటే, అది ఎడతెరిపి లేకుండా అయినా కావచ్చు. తెరిపిచ్చేదయినా కావచ్చు.

వివరణ : ఈ క్లాజులో

ఎ) 'మానసిక వ్యాధి' అంటే మానసిక రోగం, మెదడు ఎదుగుదల ఆగిపోవడం లేక అసంపూర్ణంగా ఉండటం మెదడులోని లోపం వల్ల కలిగే వ్యాధి, మరే రకమైన మానసిక వ్యాధయినా, వైకల్యమైనా, షిజోఫ్రేనియా కూడా అందులో భాగమే;

బి) 'మెదడులోని లోపం వల్ల కలిగే వ్యాధి' అంటే నిరాటంకంగా కొనసాగే మానసిక వ్యాధి లేదా వైకల్యం (తెలివితేటలు తగ్గిపోవడం అందులో భాగం కావచ్చు, కాకపోవచ్చు). ఈ వ్యాధి వల్ల అవతలి

వారిపై అసహజంగా కోపోద్రిక్తులు కావడం లేదా వారి పట్ల చాలా బాధ్యతారహితంగా ప్రవర్తించడం జరుగుతుంది. వైద్యపరమైన చికిత్సకు ఈ వ్యాధి లొంగుతుందా లేదా అనేది అప్రస్తుతం; లేదా

iv) అంటుకునే విధమైన నయంకాని కుష్టు వ్యాధితో బాధపడుతుంటే; లేదా

v) అంటుకునే విధమైన సుఖవ్యాధితో బాధపడుతుంటే; లేదా

vi) సంసారాన్ని త్యజించి ఏదైనా మతాచారం ప్రకారం సన్యసిస్తే; లేదా

vii) ఒక వ్యక్తి బతికుంటే ఆచూకి సహజంగా తెలుసుకోగలిగే అవకాశమున్న వ్యక్తులకు ఆ వ్యక్తి బతికున్నది లేనిది ఏడు సంవత్సరాలు పైగా తెలియకపోతే;

వివరణ : ఈ సబ్‌సెక్షన్‌లో 'వదిలేయడం' అంటే అవతలి వ్యక్తి న్యాయసమ్మతమైన కారణం లేకుండా, పిటిషనరు అనుమతి లేకుండా, అభిష్టానికి వ్యతిరేకంగా వదిలేయడం. వైవాహిక బంధంలోని అవతలి వ్యక్తి పిటిషనరుని కావాలని నిర్లక్ష్యం చేస్తే అది కూడా ఇందులో భాగమే. వేరే పద ప్రయోగం చేసినా దాని భావాన్ని బట్టి వాడిన సందర్భాన్ని బట్టి ఇందులో భాగమనుకోవాలి.

1ఎ) ఈ చట్టం అమలుల్లోకి రాకముందు లేదా వచ్చిన తర్వాత వివాహంలో ఇరుపక్షాలు ఈ కారణంగా వివాహాన్ని రద్దు చేస్తూ విడాకుల డిక్రీ మంజూరు చేయమని పిటిషను దాఖలు చేయవచ్చు–

i) ఇరుపక్షాలకు సంబంధించిన కేసులో న్యాయపరమైన వేర్పాటు డిక్రీ మంజూరైన ఏడాది, లేదా ఆపై కాలం తర్వాత కూడా ఇరుపక్షాలు కలసి సహజీవనం కొనసాగించక పోయుంటే; లేదా

ii) ఇరుపక్షాలకు సంబంధించిన కేసులో సహజీవన హక్కుల పునరుద్ధరణ డిక్రీ మంజూరైన ఏడాది, లేదా ఆపై కాలం తర్వాత కూడా ఇరుపక్షాలు కలిసి సహజీవనం కొనసాగించక పోయుంటే; లేదా

2. ఈ కారణం కింద వివాహాన్ని రద్దు చేస్తూ విడాకుల డిక్రీ మంజూరు చేయమని భార్య పిటిషను దాఖలు చెయ్యొచ్చు.

i) చట్టం అమల్లోకి రాకముందు జరిగిన వివాహమైతే చట్టం అమల్లోకి రాక ముందు భర్త మరో వివాహం చేసుకుంటే, లేదా పిటిషనరుని వివాహం చేసుకునే నాటికి చట్టం అమల్లోకి రాకముందు భర్త చేసుకున్న మరో వివాహం తాలూకు భార్య బ్రతికుంటే;

ఈ రెండు సందర్భాల్లోనూ పిటీషను దాఖలు చేసే నాటికి మరో భార్య బ్రతికుండాలి; లేదా

ii) భర్త వివాహమైన తర్వాత లైంగిక అత్యాచారానికి, అసహజ లైంగిక నేరానికి లేదా పాశవికమైన లైంగిక నేరానికి పాల్పడి నేరం రుజువైతే; లేదా

iii) హిందు దత్తత, మనోవర్తి చట్టం, 1956 సెక్షన్ 18 కింద వేసిన దావాలో కాని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 సెక్షన్ 125 (లేదా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1898 సెక్షన్ 488) కింద జరిగిన కేసులో భార్య విడిగా ఉంటూ కూడా మనోవర్తికి అర్హురాలని భర్తకు వ్యతిరేకంగా డిక్రీ లేదా ఉత్తర్వు జారీ అయిన ఏడాది తర్వాత కూడా ఇరువురు కలిసి కాపురం చేయలేకపోతే; లేదా

iv) ఆమెకు పదిహేనేళ్లు నిండక ముందు జరిగిన వివాహాన్ని (కార్యం జరిగినా జరగకపోయినా) ఆమె పద్దెనిమిదేళ్లు దాటక ముందే కాదనుకుంటే;

వివరణ: ఈ క్లాజు వివాహ చట్టాల (సవరణ) చట్టం, 1976 అమల్లోకి రాకముందు, ఆ తర్వాత జరిగిన వివాహానికి వర్తిస్తుంది.

13ఎ. విడాకుల కేసుల్లో ప్రత్యామ్నాయ ఉపశమనం :

ఈ చట్టం కింద జరిగే విచారణలో సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (1) లోని క్లాజులు (ii), (vi), (vii) లను మినహాయించి ఇతర కారణాలపై ఆధారపడి వివాహాన్ని రద్దు చేస్తూ విడాకుల డిక్రీ మంజూరు చేయాలని పిటిషను దాఖలైతే పరిస్థితులను బట్టి న్యాయమనిపిస్తే కోర్టు విడాకుల బదులు న్యాయపరమైన వేర్పాటు డిక్రీ మంజూరు చేయొచ్చు.

13బి) పరస్పర అంగీకారంతో విడాకులు :

1. ఈ చట్టంలోని అంశాలకు లోబడి వివాహంలోని ఇరుపక్షాలు కలిసి వివాహాన్ని రద్దు చేస్తూ విడాకుల డిక్రీ మంజూరు చేయాలని జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేయవచ్చు. ఆ వివాహం వివాహ చట్టాల (సవరణ) చట్టం, 1976 (1976 లోని 68 వది) అమల్లోకి రాక మునుపు, ఆ తర్వాత జరిగినప్పటికీను దాఖలు చేయవచ్చు. తాము ఏడాదిపైగా విడిగా ఉంటున్నామని, కలిసి ఉండటం సాధ్యం కావడం లేదని, వివాహాన్ని రద్దు చేయడానికి పరస్పర అంగీకారానికి వచ్చామనే కారణం చూపుతూ ఈ పిటిషను దాఖలు చేయాల్సి ఉంటుంది.

2. సబ్‌సెక్షన్ (1) కింద కోర్టుని ఆశ్రయించి పిటిషను దాఖలు చేసిన రోజు నుండి ఆరు నెలలు తర్వాత పద్దెనిమిది నెలల్లోపు ఇరుపక్షాలు ఆ పిటిషన్ను వెనక్కి తీసుకోకుండా ఇరువురూ కోర్టులో ఆ ప్రస్తావన తీసుకువస్తే ఇరుపక్షాల వాదనలు విని, వివాహం జరిగిన మాట వాస్తవమేనా, పిటిషనులోని అంశాలు నిజమేనా అనే విషయంలో తగిన విచారణ జరిపి సంతృప్తి చెందిన మీదట కోర్టు డిక్రీ జారీ చేసిన రోజు నుండి వివాహం రద్దు చేస్తూ జారీ చేసిన విడాకుల డిక్రీ అమల్లోకి వస్తుంది.

14. వివాహమైన ఏడాదిలోపు విడాకుల పిటిషను దాఖలు చేయకూడదు:

1. ఈ చట్టంలో ఏమున్నప్పటికీ, వివాహమైన రోజు నుండి ఏడాది గడిచేలోపు వివాహాన్ని రద్దు చేస్తూ విడాకుల డిక్రీ మంజూరు చేయమంటూ కోరే పిటీషన్ని స్వీకరించే అర్హత ఏ కోర్టుకీ లేదు.

అయితే పిటిషనరు ప్రతివాది వల్ల విపరీతమైన ఇబ్బందులకు, లేదా పాశవికత్వానికి గురైతే వివాహమైన రోజు నుండి ఏడాది గడవకముందే, దాఖలైన పిటిషన్ను కోర్టు అనుమతించవచ్చు. అది హైకోర్టు రూపొందించిన నియమాలకు లోబడి దరఖాస్తు చేయాల్సుంటుంది. అయితే బూటకపు ప్రకటనలు చేసి, లేదా కేసు స్వభావాన్ని కప్పిపుచ్చి కోర్టు అనుమతి పొంది పిటిషను దాఖలు చేశారని విచారణ జరిపిన మీదట కోర్టుకి అనిపిస్తే ఏడాది కాలం పూర్తయ్యే వరకు డిక్రీ అమల్లోకి రాదనే షరతు విధించవచ్చు, లేదా ఏడాది గడిచిన తర్వాత అవే విషయాలను, లేదా అలాంటి విషయాలనే ప్రస్తావిస్తూ మరో పిటిషను దాఖలు చేసుకోవడానికి అభ్యంతర పెట్టకుండా పిటిషన్ని కొట్టేయవచ్చు.

2. వివాహమైన ఏడాదిలో విడాకులు పిటిషను అనుమతించాలని ఈ సెక్షను కింద కోరుతూ దాఖలయ్యే పిటిషనుపై తీర్పు చెప్పేటప్పుడు ఈ వివాహంలో కలిగిన సంతానం ప్రయోజనాల గురించి మరియు ఏడాది గడిచేలోపు ఇరుపక్షాల మధ్య రాజీ కుదిరే అవకాశాల గురించి కోర్టు దృష్టి సారించాలి.

15. విడాకులు పొందిన వ్యక్తులు ఎప్పుడు పెళ్లి చేసుకోవచ్చు :

వివాహాన్ని రద్దు చేస్తూ విడాకుల డిక్రీ మంజూరైన తర్వాత అప్పీల్ చేసుకునే హక్కు లేనప్పుడు, లేదా అప్పీల్ చేసుకునే హక్కున్నా అప్పీల్ చేసుకోవడానికి గల గడువు పూర్తయిపోతే, లేదా అప్పీల్ కొట్టివేయబడితే వివాహంలోని ఇరుపక్షాలు చట్టపరంగా మరో వివాహం చేసుకోవచ్చు.

16. చెల్లని, చెల్లనిదిగా అనగలిగే వివాహాల్లోని పిల్లలు సక్రమం :

1. సెక్షన్ 11 కింద ఒక వివాహం చెల్లనప్పటికీ, అటువంటి వివాహంలో పుట్టిన సంతానం, అది వివాహ చట్టాల (సవరణ) చట్టం 1976 (1976 లో 68 వది) అమల్లోకి రాకముందు, లేదా తర్వాత పుట్టిన సంతానమైనా కావచ్చు, ఒక వేళ చెల్లే వివాహంలో పుట్టి సక్రమ సంతానం అనిపించుకునే స్థితి ఉంటే ఇటువంటి వివాహాల్లో పుట్టినప్పటికీ వారు సక్రమ సంతానం అనిపించుకుంటారు. ఈ చట్టం కింద వివాహాన్ని రద్దు చేస్తూ డిక్రీ జారీ అయ్యిందా లేదా, ఈ చట్టం కింద పిటిషను దాఖలు చేస్తే తప్ప ఆ వివాహం చెల్లనిదిగా గుర్తించడానికి లేదనే అంశాలు ఈ విషయంలో అప్రస్తుతం.
2. సెక్షన్ 12 ప్రకారం చెల్లనిదిగా అనగలిగే వివాహాన్ని చెల్లనిదిగా గుర్తిస్తూ డిక్రీ మంజూరైన వివాహంలో డిక్రీ మంజూరు కాక ముందు పుట్టిన లేక గర్భస్థ శిశువైన బిడ్డయితే డిక్రీ నాటికి ఆ వివాహం చెల్లనిది కాక రద్దయి వుంటే సక్రమమైన సంతానంగా భావించే స్థితి ఉంటే చెల్లని వివాహం డిక్రీ పొందినప్పటికి అటువంటి బిడ్డను సక్రమ సంతానంగా భావించి తీరాలి.
3. సబ్‌సెక్షన్ (1) లేదా సబ్‌సెక్షన్ (2) లో ఏమున్నప్పటికీ చెల్లని వివాహంలో పుట్టిన సంతానం లేదా సెక్షన్ 12 కింద వివాహం చెల్లదని డిక్రీ జారీ అయిన వివాహంలోని సంతానానికి ఈచట్టం ప్రవేశపెట్టకపోయివుంటే తన తల్లిదండ్రుల సక్రమ సంతానం కాని కారణంగా హక్కులు పొందని, పొందడం సాధ్యం కాని స్థితి ఉంటే అటువంటి సంతానానికి తమ తల్లిదండ్రుల ఆస్తిలో మినహాయించి తల్లిదండ్రులు కాని వారి ఆస్తులలో ఎటువంటి హక్కులూ సంక్రమించవు.

17. బహు భార్యత్వం / బహు భర్తృత్వానికి పాల్పడినందుకు శిక్ష :

ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఇరువురు హిందువుల మధ్య వివాహం జరిగే నాటికి వారిలో ఒకరికి భార్య కాని భర్త కాని బ్రతికుంటే ఆ వివాహం చెల్లదు. వారికి భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 494, 495 వర్తిస్తుంది.

18. హిందు వివాహానికి సంబంధించి కొన్ని ఇతర షరతుల ఉల్లంఘనకు పాల్పడితే పడే శిక్ష :

సెక్షన్ 5 లోని క్లాజులు (iii), (iv), (v) లో పేర్కొన్న షరతులను ఉల్లంఘించి వివాహం చేసుకునే ఏ వ్యక్తయినా ఈ శిక్షకు అర్హులు :

ఎ) సెక్షన్ 5 క్లాజు (iii) కింద పేర్కొన్న షరతు ఉల్లంఘనైతే రెండేళ్ల కఠిన కారాగారం, లేదా లక్షరూపాయిల వరకు జరిమానా, లేదా ఆ రెండూను;

బి) సెక్షన్ 5 క్లాజు (iv) లేదా (v) కింద పేర్కొన్న షరతు ఉల్లంఘనకు పాల్పడితే నెలరోజుల పాటు సాధారణ కారాగారం, లేదా వెయ్యిరూపాయిల వరకు జరిమానా లేదా ఆ రెండూనూ;

పరిధి, మరియు అనుసరించే విధానం

19. పిటీషను సమర్పించాల్సిన కోర్టు :

ప్రతి పిటీషన్ని ఏ జిల్లా కోర్టులో సమర్పించాలంటే దాని ఒరిజినల్ సివిల్ జ్యూరిస్‌డిక్షన్ ప్రాంతీయ పరిధిలో

i) వివాహం జరిగుంటే, లేదా

ii) పిటిషను సమర్పించేనాటికి ప్రతివాది అక్కడ నివసిస్తుంటే, లేదా

iii) వివాహంలోని ఇరుపక్షాలు ఆఖరుసారిగా కలిసి నివసించిన ప్రాంతం, లేదా

iiiఎ) పిటిషనరు భార్య అయితే, పిటిషను దాఖలు చేసే నాటికి ఆమె నివసించే ప్రాంతం, లేదా

iv) ప్రతివాది ఈ చట్టం వర్తించని ప్రాంతంలో నివసిస్తున్నా లేక ఆ వ్యక్తి బ్రతికున్నదీ లేనిది సహజంగా తెలిసే అవకాశమున్నా వ్యక్తులకు ఏడేళ్లపాటు తెలియక పోతే పిటిషనరు నివసించే ప్రాంతం.

20. పిటిషనులోని అంశాలు, ధృవీకరణ :

1. ఈ చట్టం కింద సమర్పించే ప్రతి పిటిషనులో కోరే పరిష్కారానికి తగిన వాస్తవాలను స్పష్టంగా పేర్కొనాలి. సెక్షన్ 11 కింద దాఖలయ్యే పిటిషనులో మినహాయించి ఇతర అన్ని పిటిషనులో పిటిషనరు, వివాహంలోని ప్రత్యర్థ పక్షం వారు కుమ్మక్కు కాలేదనే విషయాన్ని స్పష్టంగా పేర్కొనాలి.
2. ఈ చట్టం కింద దాఖలైన పిటిషనులోని ప్రకటనలను చట్టప్రకారం ప్లెయింటులను ధృవీకరించినట్లుగానే పిటిషనరు కాని లేదా మరో అర్హత గల వ్యక్తి కాని ధృవీకరించాలి. విచారణ సమయంలో దాన్ని ఒక సాక్ష్యంగా భావించవచ్చు.

21. 1908 లోని 5వ చట్టం వర్తింపు :

ఈ చట్టంలోని అంశాలకు, హైకోర్టు ఈ విషయంలో రూపొందించిన నియమాలకు లోబడి ఈ చట్టం కింద జరిగే అన్ని రకాల విచారణల్లో వీలైనంత మేరకు సివిల్ ప్రొసీజర్ కోడ్ 1908 (1908 లోని 5వ చట్టం) వర్తిస్తుంది.

21ఎ) కొన్ని సందర్భాల్లో పిటిషన్లను మరో కోర్టుకి బదిలీ చేసే అధికారం :

1. ఎప్పుడైతే
   ఎ) ఈ చట్టం కింద సెక్షన్ 10 కింద న్యాయపరమైన వేర్పాటు డిక్రీ కోసం లేదా సెక్షన్ 13 కింద విడాకుల డిక్రీ కోరుతూ వివాహంలోని ఒక పక్షం పరిధి గల జిల్లా కోర్టులో పిటిషను దాఖలు చేసుంటే; మరియు

బి) ఈ చట్టం కింద సెక్షన్ 10 కింద న్యాయపరమైన వేర్పాటు డిక్రీ కోసం లేదా సెక్షన్ 13 కింద విడాకుల డిక్రీ కోరుతూ వివాహంలో అవతలి పక్షం వారు అదే జిల్లా కోర్టులో కాని అదే రాష్ట్రంలోని, లేదా మరో రాష్ట్రంలోని జిల్లా కోర్టులో మరో పిటిషను దాఖలు చేసుంటే ఆ పిటిషన్ల విషయంలో సబ్‌సెక్షన్ (2) లో పేర్కొన్న విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

2. సబ్‌సెక్షన్ (1) వర్తించే కేసుల్లో –

ఎ) పిటిషన్లు ఒకే జిల్లా కోర్టులో దాఖలై ఉంటే రెంటినీ కలిపి విచారించాల్సి ఉంటుంది.

బి) పిటిషన్లు భిన్నమైన జిల్లా కోర్టులో దాఖలై ఉంటే తర్వాత దాఖలైన పిటిషన్ను ఆ జిల్లా కోర్టు నుండి మొదటి పిటిషను దాఖలైన జిల్లా కోర్టుకి బదిలీ చేసి ఆ రెండు పిటిషన్లను మొదట పిటిషను దాఖలైన జిల్లా కోర్టు కలిపి విచారించి తీర్పు చెప్పాల్సి వుంటుంది.

3. సబ్‌సెక్షన్ (2) లోని క్లాజ్ (బి) వర్తించే కేసులో మొదట పిటిషను దాఖలైన జిల్లా కోర్టుకి ఒక దావాని లేదా కేసుని పిటిషను తర్వాత దాఖలైన జిల్లా కోర్టు నుండి బదిలీ చేసేటప్పుడు పరిస్థితులను బట్టి సివిల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం అర్హత్తున్న కోర్టు కాని ప్రభుత్వం కాని కోడ్ కింద ఉన్న అధికారాలను ఉపయోగించవచ్చు.

21బి. ఈ చట్టం కింద విచారణ జరిపి పిటిషన్లపై తుది తీర్పు చెప్పే విషయంలో అనుసరించే ప్రత్యేక విధానం :

1. ఈ చట్టం కింద విచారణ జరిపేటప్పుడు సాధ్యమైనంత మేరకు న్యాయ ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటూ కేసు విచారణ పూర్తయ్యే వరకు వాయిదాలు ఒకరోజు తర్వాత మరో రోజు వేయాలి. మర్నాడు కాకుండా మరో రోజు విచారణను వాయిదా వేస్తే ఏ కారణం చేత ఆరకంగా వాయిదా వేయాల్సి వచ్చిందో రికార్డు చేయాలి.

2. ఈ చట్టం కింద దాఖలైన పిటిషన్ని వీలైనంత త్వరగా విచారించాలి. పిటిషనులోని ప్రతివాదికి నోటీసు అందిన ఆరునెలల్లోపు వీలైనంత వరకు విచారణ పూర్తి చేసెయ్యాలి.

3. ఈ చట్టం కింద దాఖలైన అప్పీల్‌ని వీలైనంత త్వరగా వినాలి. అప్పీల్‌లోని ప్రతివాదికి నోటీసు అందిన మూడు నెలల్లోపు వీలైనంత వరకు అది పూర్తి చేసెయ్యాలి.

21సి. డాక్యుమెంటరీ సాక్ష్యం:

ఇతర చట్టాల్లో అందుకు విరుద్ధంగా ఏమి ఉన్నప్పటికీ ఈ చట్టం కింద ఒక డాక్యుమెంటుకి సరైన విధంగా స్టాంపు చెల్లించలేదనో, రిజిస్టరు చేయలేదనే కారణం చూపి ఆ డాక్యుమెంటుని సాక్ష్యంగా ప్రవేశపెట్టడానికి వీల్లేదనడానికి లేదు.

22. రహస్య విచారణ మరియు దాన్ని ముద్రించడానికి, ప్రచురించడానికి లేదు –

1. ఈ చట్టం కింద ప్రతి విచారణ రహస్యంగా జరగాలి. ఇందుకు సంబంధించిన ఏ అంశాన్నయినా ఏ వ్యక్తయినా ముద్రించడం, లేదా ప్రచురించడం చట్టవిరుద్ధం. అయితే హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ముందస్తు అనుమతి తీసుకుని ఆ కోర్టులు జారీ చేసే తీర్పులను ముద్రించవచ్చు లేదా ప్రచురించవచ్చు.

2. సబ్‌సెక్షన్ (1) ని ఉల్లంఘించి ఏ వ్యక్తయినా ఈ అంశాలను ముద్రించినా లేదా ప్రచురించినా ఆ వ్యక్తికి వెయ్యి రూపాయిల వరకు జరిమానా విధించవచ్చు.

23. ఈ కేసుల్లో డిక్రీలు :

ఈ చట్టం కింద జరిగిన విచారణలో, ఆయా పార్టీలు తమని తాము సమర్థించుకుంటూ వాదించుకున్నా, వాదించుకోకపోయినా కోర్టు కనుక ఈ విషయాల్లో సంతృప్తి చెందితే –

ఎ) పరిష్కారం మంజూరు చేసే కారణాల్లో ఏదొకటి ఉన్నది. సెక్షన్ 5 క్లాజు (ii) లోని సబ్–క్లాజు (ఎ), సబ్‌క్లాజు (బి) లేదా సబ్ క్లాజు (సి) కింద కారణాలను చూపుతూ కోరే పరిష్కారంలో మినహాయించి ఏ ఇతర పరిష్కారాన్ని కోరేటప్పుడైనా తాను చేసిన తప్పునే లేదా తనలోని లోపాన్నే తనకు అనుకూలంగా వాడుకోలేదు, మరియు

బి) సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (1) లోని క్లాజు (i) కింద కారణాలను చూపుతూ దాఖలైన పిటిషనులో పిటిషనరు ఫిర్యాదు చేస్తున్న చర్య, లేదా చర్యలు జరగడానికి ఏ విధంగానైనా తానే దోహదపడలేదు, లేదా లాలూచీ లేదు, లేదా మాఫీ చేయలేదు. పిటిషనులో పేర్కొన్న కారణం క్రూరత్వమైతే ఆ క్రూరత్వాన్ని పిటిషనరు ఏ విధంగాను మాఫీ చేయలేదు, మరియు

బిబి) పరస్పర అంగీకారం కారణంగా తీసుకుంటున్నప్పుడు ఆ అంగీకారం పొందడానికి బలప్రయోగం, మోసం లేదా అవసరానికి మించిన ప్రభావం చూపడం జరగలేదు, మరియు

సి) సెక్షన్ 11 కింది దాఖలైన పిటిషను మినహాయించి మిగిలిన కేసుల్లో ప్రతివాదితో కుమ్మక్కయి దాఖలు చేసింది లేదా విచారణ కొనసాగించింది కాదు, మరియు

డి) కేసు దాఖలు చేయడంలో అనవసరమైన లేదా తగని జాప్యం జరగలేదు; మరియు

ఇ) పరిష్కారం మంజూరు చేయడానికి మరే ఇతర చట్టపరమైన అవరోధం లేదన్నప్పుడు, అటువంటి సందర్భాల్లో మాత్రమే కోర్టు తగిన విధంగా అటువంటి పరిష్కార డిక్రీ మంజూరు చేస్తుంది.

2. ఈ చట్టం కింద పరిష్కారం మంజూరు చేసే ముందు, మొదటి దఫా విచారణ జరిపిన కోర్టు కేసు స్వభావం, పరిస్థితులకు అనుగుణంగా సాధ్యమైన చోట్లల్లా ఇరుపక్షాల మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నం చేసి తీరాలి. అది కోర్టు బాధ్యత.

అయితే సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (1) లోని క్లాజు (ii), క్లాజు (iii), క్లాజు (iv), క్లాజు (v), క్లాజు (vi) లేదా క్లాజు (vii) కింద పేర్కొన్న కారణాలను చూపుతూ కోరే పరిష్కారాల విషయంలో ఈ సబ్‌సెక్షన్‌లోని అంశాలు వర్తించవు.

3. అటువంటి రాజీ కుదర్చడానికి కోర్టుకి సహకారం కావాల్సి వస్తే, ఇరుపక్షాలు కోరుకుంటే, లేదా కోర్టు న్యాయసమ్మతం, తగినదని భావిస్తే, పదిహేను రోజులు మించకుండా కేసుని తగిన కాలంపాటు వాయిదా వేసి, ఇరుపక్షాల వారు కోరుకున్న వ్యక్తి వద్దకు ఈ విషయాన్ని పంపించవచ్చు లేదా అటువంటి వ్యక్తి పేరు చెప్పలేని స్థితిలో వాదప్రతివాదులు ఉంటే కోర్టు నియమించిన వ్యక్తి వద్దకు పంపించవచ్చు. అలా పంపేటప్పుడు రాజీ చేయడానికి అవకాశాలు ఉన్నాయా, లేదా రాజీ కుదిరిందా అనే విషయాన్ని వారు కోర్టుకి తెలియజేయాలని కోర్టు ఆదేశాలు కూడా జారీ చేయొచ్చు. కేసులో తుది తీర్పు ఇచ్చేటప్పుడు ఈ నివేదికకు కోర్టు తగిన గుర్తింపుని ఇస్తుంది.

4. విడాకుల డిక్రీ మంజూరై వివాహం రద్దయిన ప్రతి కేసులో కోర్టు ఇరుపక్షాల వారికి ఉచితముగా డిక్రీ ప్రతులు ఇవ్వాలి.

23ఎ. విడాకులు, ఇతర కేసుల్లో ప్రతివాదులు కోరే పరిష్కారం :

విడాకులు, న్యాయపరమైన వేర్పాటు లేదా సహజీవన హక్కుల పునరుద్ధరణ కోరుతూ దాఖలైన కేసుల్లో ప్రతివాదులు బహుభార్యత్వం / బహుభర్తృత్వం, క్రూరత్వం లేదా వదిలేయడం వంటి పిటిషనరు చేసే ఆరోపణలను వ్యతిరేకించడమే కాదు ఈ చట్టంలోని ఏ కారణం కిందనైనా పరిష్కారం కోరుతూ కౌంటర్ క్లెయిమ్ చేయవచ్చు. పిటిషనరు బహుభార్యత్వం / బహుభర్తృత్వం, క్రూరత్వం, లేదా వదిలేయడం వంటి చర్యలకు పాల్పడినట్లు రుజువైతే ప్రతివాది కనుక ఈ చట్టం కింద పేర్కొన్న కారణాలను చూపుతూ ఏదైనా పరిష్కారం కోరుతూ పిటిషను దాఖలు చేసుంటే ఏ విధమైన పరిష్కారం చేసేవారో ఆ విధంగా చేయొచ్చు.

24. మధ్యంతర మనోవర్తి, కేసుకి అయ్యే ఖర్చు :

ఈ చట్టం కింద విచారించే కేసుల్లో పరిస్థితులను చూస్తే అందులో భార్యకి కాని భర్తకి కాని తమను తాము పోషించుకోవడానికి సరిపడా స్వతంత్రమైన ఆదాయం లేదని, కోర్టు కేసు ఖర్చు భరాయించే స్తోమత లేదని కోర్టుకి అనిపిస్తే, భర్త కాని భార్య కాని అందుకు అర్జీ పెట్టుకుంటే పిటిషనరుకి అయ్యే కోర్టు ఖర్చులు భరించమని, పిటిషనరు స్వంత ఆదాయం, ప్రతివాది ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని కోర్టులో కేసు విచారణ జరిగినంత కాలం ప్రతివాది తగిన మొత్తాన్ని నెలనెలా పిటిషనరుకి ఇవ్వాలని కోర్టు ఆదేశాలు జారీ చేయొచ్చు. కోర్టులో విచారణ జరుగుతున్న కాలంలో కోర్టు ఖర్చుల నిమిత్తం, ఇటువంటి నెలసరి మొత్తం కోసం అర్జీ పెట్టుకుంటే వీలైనంత వరకు నోటీసు అందిన అరవై రోజులలోపు కోర్టు ఆ ఆర్జీపై తుది నిర్ణయం తీసుకోవాలి.

25. శాశ్వత మనోవర్తి :

1. ఈ చట్టం కింద అధికారమున్న ఏ కోర్టయినా, డిక్రీ ఇచ్చేటప్పుడు కాని ఆ తర్వాత కాలంలో కాని ఆయా పరిస్థితుల్లో భార్య కాని భర్త కాని అర్జీ పెట్టుకుంటే ప్రతివాది స్వంత ఆదాయం, ఏమైనా ఇతర ఆస్తులుంటే అవి, అర్జీదారుని ఆదాయం, ఆస్తుల పార్టీల వ్యవహారశైలి, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రతివాది అర్జీదారుని పోషణ నిమిత్తం మొత్తం ఒక్కసారి లేదా నెలవారీ, లేదా అర్జీదారుని జీవితకాలం మించకుండా కాలానుగుణ కిస్తీల వారీగా రుసుము చెల్లించమని ప్రతివాదిని ఉద్దేశిస్తూ ఆదేశాలు జారీ చేయొచ్చు. అవసరమైతే ప్రతివాది స్థిరాస్తులను చార్జ్ రూపంలో రుసుము రాబట్టే ఏర్పాటు చేయొచ్చు.
2. సబ్‌సెక్షన్ (1) కింద ఆదేశాలు జారీ చేసిన తర్వాత ఎప్పుడైనా వాద ప్రతివాదులు ఎవరి విషయంలోనైనా పరిస్థితుల్లో మార్పు వచ్చిందని వారిలో ఎవరైనా ఆ విషయం కోర్టు దృష్టికి తీసుకుని వెళ్తే కోర్టు ఆ విషయమై సంతృప్తి చెంది అటువంటి ఆదేశాన్ని తనకు సరైనదనిపించే విధంగా మార్చవచ్చు, సవరించవచ్చు లేదా వెనక్కి తీసుకోవచ్చు.

3. కోర్టు ఆదేశాలు ఎవరికి అనుకూలంగా జారీ చేసిందో ఆ వ్యక్తి పునర్వివాహం చేసుకుంటే, లేదా ఆ వ్యక్తి భార్య అయివుండి ఆమె నడవడిక సరిగా లేకపోతే లేదా ఆ వ్యక్తి భర్త అయి వుండి వివాహం వెలుపల ఎవరైనా స్త్రీతో లైంగిక సంబంధం ఏర్పర్చుకున్నాడని అవతలి వ్యక్తి కోర్టు దృష్టికి తీసుకుని వెళ్తే ఆ విషయంలో కోర్టు సంతృప్తి చెందిన మీదట తగిన విధంగా ఆదేశాన్ని మార్చవచ్చు, సవరించవచ్చు లేదా వెనక్కి తీసుకోవచ్చు.

26. పిల్లల కస్టడీ :

ఈ చట్టం కింద జరిగే ఏ కేసులోనైనా కోర్టు మైనర్ బాలబాలికల అభిష్టానుసారం వారి కస్టడీ, పోషణ, విద్యాభ్యాసం గురించి తగిన న్యాయం చేకూర్చేందుకు గాను ఎప్పటికప్పుడు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవచ్చు. డిక్రీలో అందుకు తగిన ఏర్పాటు చేయవచ్చు. డిక్రీ జారీ అయిన తర్వాత అటువంటి పిల్లల కస్టడీ, పోషణ, విద్యాభ్యాసం నిమిత్తం పిటిషను ద్వారా అర్జీ పెట్టుకుంటే డిక్రీ పెండింగ్‌లో ఉండగా ఏ విధంగా డిక్రీ ద్వారా కాని మధ్యంతర ఉత్తర్వుల ద్వారా కాని ఏర్పాటు చేసుందేదో ఆ రకంగానే చేయొచ్చు. కోర్టు ఎప్పటికప్పుడు గతంలో ఇచ్చిన ఆదేశాలను, చేసిన ఏర్పాట్లను వెనక్కి తీసుకోవచ్చు, సస్పెండ్ చేయొచ్చు లేదా మార్చవచ్చు.

మైనర్ బాలబాలికల పోషణ, విద్యాభ్యాసానికి సంబంధించి పెట్టుకున్న అర్జీ డిక్రీ రాకముందు పెండింగ్‌లో ఉంటే దానిపై వీలైనంత వరకు ప్రతివాదికి నోటీసు అందిన అరవై రోజుల లోపు తుది నిర్ణయం తీసుకోవాలి.

27. ఆస్తులపై నిర్ణయం :

ఈ చట్టం కింద విచారణ జరుగుతున్న కేసుల్లో వివాహ సమయంలో లేదా అందుకు ముందూ వెనుక భార్యాభర్తలు ఇరువురికి బహుకరించిన ఆస్తులు, అవి ఉమ్మడి ఆస్తికావచ్చు వాటికి సంబంధించి న్యాయోచితంగా డిక్రీలో ప్రస్తావన చేయవచ్చు.

28. డిక్రీలు, ఉత్తర్వుల నుండి అప్పీళ్లు :

1. ఈ చట్టం కింద ఏ కేసుల్లోనైనా కోర్టు సబ్‌సెక్షన్ (3) కి లోబడి డిక్రీలు జారీ చేస్తే వాటిని ఒరిజినల్ సివిల్ జ్యూరిస్‌డిక్షన్‌ని ఉపయోగించుకున్న అప్పీల్ చేయగల కోర్టు డిక్రీలుగా భావించాల్సి వుంటుంది. అటువంటి అప్పీలు సాధారణంగా ఒరిజినల్ సివిల్ జ్యూరిస్‌డిక్షన్‌ని ఉపయోగించు కున్న కోర్టు తీర్పులపై అప్పీలు ఏ కోర్టులో దాఖలు చేయాలో అందులో దాఖలు చేయాల్సి ఉంటుంది.
2. ఈ చట్టం కింద విచారణ జరుగుతున్న కేసులో సెక్షన్ 25 లేదా సెక్షన్ 26 కింద ఉత్తర్వులు జారీ చేసుంటే సబ్‌సెక్షన్ (3) కి లోబడి అవి మధ్యంతర ఉత్తర్వులు కాని ఎడల వాటిపై అప్పీలు చేసుకోవచ్చు. ఆ కోర్టు ఒరిజినల్ సివిల్ జ్యూరిస్‌డిక్షన్ కింద కోర్టు తీసుకున్న తుది నిర్ణయంపై అప్పీల్ ఏ కోర్టుకి వెళ్తుందో ఈ విషయంలో కూడా అప్పీల్ ఆ కోర్టుకే వెళ్తుంది.
3. ఈ సెక్షన్ కింద ఖర్చులకు సంబంధించిన అంశాలపై అప్పీల్ ఉండదు.
4. ఈ సెక్షన్ కింద ప్రతి అప్పీల్‌ని డిక్రీ లేదా ఉత్తర్వు జారీ చేసిన 90 రోజులలోపు దాఖలు చేయాలి.

28ఎ. డిక్రీలు, ఉత్తర్వుల అమలు :

ఈ చట్టం కింద జరిగే విచారణలో కోర్టు జారీ చేసిన డిక్రీలను, ఉత్తర్వులను ఆ కోర్టు తన ఒరిజినల్ సివిల్ జ్యూరిస్‌డిక్షన్ పరిధిలో జారీ చేసిన డిక్రీలను, ఉత్తర్వులను ఏ విధంగా అమలు చేస్తుందో ఆ రకంగా చేయాల్సి ఉంటుంది.

పరిరక్షణ మరియు రీపీల్స్

29. పరిరక్షణ :

1. ఇద్దరు హిందువుల మధ్య ఈ చట్టం అమల్లోకి రాకముందు జరిగిన వివాహం ఇతరత్రా చెల్లుబాటైతే, ఇరుపక్షాలు ఒకే గోత్రానికో, ప్రవరానికో చెందినవారని, భిన్నమతాలకు, కులాలకు, కులంలోని ఉపకులాలకు చెందినవారనే కారణం చేత ఆ వివాహం చెల్లనిదిగా పరిగణించడానికి వీల్లేదు.

2. ఈ చట్టం అమల్లోకి రాకముందు కాని తర్వాత కాని హిందు వివాహాన్ని రద్దు చేయడానికి సంప్రదాయం గుర్తించే హక్కుపై, లేదా ఒక ప్రత్యేక చట్టం కల్పించిన హక్కుపై ఈ చట్టంలోని అంశాల ప్రభావం ఉండదు.

3. ఈ చట్టం అమల్లోకి వచ్చే సమయానికి ఏదైనా చట్టం కింద వివాహాన్ని చెల్లనిదిగా ప్రకటించడానికి కాని విడాకులు మంజూరు చేయమనడానికి కాని న్యాయపరమైన వేర్పాటు కోసం కాని కేసు పెండింగ్‌లో ఉండుంటే ఈ చట్టంలో ఏమున్నప్పటికి అటువంటి కేసుల్లో విచారణ ఈ చట్టం లేదని భావించి కొనసాగించాలి, తుది నిర్ణయం తీసుకోవాలి.

4. ఈ చట్టం అమల్లోకి రాక ముందు లేదా తర్వాత ప్రత్యేక వివాహ చట్టం, 1954 (1954 లోని 43 వది) కింద హిందువుల వివాహం జరిగితే ఈ చట్టం ప్రభావం ప్రత్యేక వివాహ చట్టం, 1954 పై ఏ విధంగా పడదు.

30. రీపీల్స్ :

(రీపీలింగ్ మరియు సవరణ చట్టం, 1960 (1960 లోని 58 వది) సెక్షన్ 2, ఒకటవ షెడ్యూలు ద్వారా రీపీల్ అయింది. (26.12.1960న))

*****

17. కుటుంబ న్యాయస్థానాల చట్టం (ఫ్యామిలీ కోర్టులు) 1984

అధ్యాయం - I

1. ఈ చట్టం పేరు, పరిధి అమలులోనికి వచ్చే సమయం :

1. ఈ చట్టాన్ని "కుటుంబ న్యాయస్థానాల చట్టం" 1984 అనవచ్చు.
2. జమ్ము-కాశ్మీర్ మినహా భారతదేశం యావత్తూ ఈ చట్టం వర్తిస్తుంది.
3. కేంద్ర ప్రభుత్వం నిర్ణయానుసారంగా రాజపత్రంలో ప్రకటించిన తేదీ నుంచి ఈ చట్టం అమలులోనికి వస్తుంది.

2. నిర్వచనాలు : ఈ చట్టంలో, సందర్భం వేరే రకంగా ఉంటే తప్ప-

ఎ) "జడ్జి" అనగా న్యాయమూర్తి లేదా ప్రిన్సిపల్ న్యాయమూర్తి, అదనపు ప్రిన్సిపల్ న్యాయమూర్తి లేదా ఫ్యామిలీ కోర్టు యొక్క న్యాయమూర్తి.

బి) "నోటిఫికేషన్" అనగా రాజపత్రంలో ప్రచురించబడిన ప్రకటన.

సి) "ప్రిస్క్రైబ్డ్" అనగా ఈ చట్టం క్రింద నియమాల ద్వారా పేర్కొనబడినవి.

డి) "ఫ్యామిలీ కోర్టు" అనగా సెక్షన్ 3 క్రింద స్థాపించబడిన ఫ్యామిలీ కోర్టు

ఇ) ఈ చట్టంలో వాడిన నిర్వచనం ఇవ్వని పదాలు మరియు అభిప్రాయాలు సివిల్ విచారణ స్మృతి, 1908 (5 of 1908) లో కలిగిన అర్థాలను కలిగి ఉంటాయి.

అధ్యాయం - II (ఫ్యామిలీ కోర్టులు)

3. ఫ్యామిలీ కోర్టుల యొక్క స్థాపన :

1. ఈ చట్టం ద్వారా ఫ్యామిలీ కోర్టుకు ఇచ్చిన అధికారాలు మరియు అధికార పరిధిని వినియోగించు కునేందుకు గాను, రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును సంప్రదించిన తర్వాత, అధికారిక ప్రకటన ద్వారా

   ఎ) ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో, పట్టణమైనా లేదా నగరమైనా పదిలక్షలకు మించిన జనాభాని కలిగి ఉన్న ప్రాంతంలో వీలైనంత త్వరగా ఫ్యామిలీ కోర్టును స్థాపించి తీరాలి.

   బి) అవసరానుగుణంగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో ఫ్యామిలీ కోర్టులను స్థాపించవచ్చు.

2. రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టును సంప్రదించిన తర్వాత, అధికారిక ప్రకటన ద్వారా, ఫ్యామిలీ కోర్టు యొక్క అధికార పరిధి ఏ ప్రాంతాలకు విస్తరించాలో తెలియపర్చాలి. మరియు ఎప్పుడైనా ఆ అధికార పరిధి హద్దులను పెంచటం, తగ్గించటం లేదా మార్చటం చేయవచ్చు.

4. జడ్జిల నియామకం :

1. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు యొక్క అంగీకారంతో ఒకరు, లేదా ఇద్దరు వ్యక్తులను ఫ్యామిలీ కోర్టు యొక్క జడ్జి లేదా జడ్జీలుగా నియమించవచ్చు.

2. ఒక ఫ్యామిలీ కోర్టు ఒకరి కంటె ఎక్కువ జడ్జీలను కలిగి ఉంటే

ఎ) ప్రతి యొక్క జడ్జి ఈ చట్టం లేదా అందించిన న్యాయ అధికారాలలో అన్నింటిని లేదా కొన్నింటినీ వాడుకోవచ్చు. లేదా ఆ సమయంలో అమలులో ఉన్న చట్టం ఇచ్చే అధికారాలను వాడుకోవచ్చు.

బి) రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు యొక్క అంగీకారంతో, ఆ జడ్జీలలో ఎవరినైనా ఫ్యామిలీ కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా మరియు వేరొకరిని అదనపు ప్రధాన న్యాయమూర్తిగా నియమించవచ్చు.

సి) ప్రధాన న్యాయమూర్తి సమయానుసారంగా కోర్టు వ్యవహారాలను న్యాయమూర్తులకు పంచేందుకు తగిన ఏర్పాట్లు చేయవచ్చు.

డి) ప్రధాన న్యాయమూర్తి సెలవు వలన గాని, అనారోగ్యం లేదా ఇతర ఏ కారణం చేతనైనా తన విధులను నిర్వహించలేని పక్షంలో అదనపు ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలను ప్రధాన న్యాయమూర్తి నిర్వహించవచ్చు.

3. ఒక వ్యక్తి న్యాయమూర్తిగా నియమితుడవ్వాలంటే అతడు;

ఎ) భారతదేశంలో కనీసం 7 సంవత్సరాలు న్యాయాధిపతిగా పనిచేసి ఉండాలి. లేదా ట్రిబ్యునల్‌లో పదవి కలిగి ఉండాలి, లేదా కేంద్ర లేక రాష్ట్ర ప్రభుత్వాలలో న్యాయ పరిజ్ఞానం అవసరమయ్యే ఉద్యోగంలో పనిచేసి ఉండాలి లేదా

బి) హైకోర్టు న్యాయవాదిగా కనీసం 7 సంవత్సరాలు పనిచేసి ఉండాలి. లేదా 2 అంతకంటే ఎక్కువ కోర్టులలో వరుసగా అంతేకాలం పనిచేసి ఉండాలి.

4. న్యాయమూర్తుల పదవుల ఎంపిక ప్రక్రియలో :

ఎ) వివాహ వ్యవస్థను కాపాడేందుకు మరియు సంరక్షించేందుకు ప్రయత్నించే వ్యక్తులను మరియు పిల్లల సంక్షేమమును పెంపొందించేందుకు పనిచేసిన వారిని మరియు రాజీ పద్ధతిలో మరియు సలహా ద్వారా వివాదాలను పరిష్కరించ గలిగే అనుభవం, నైపుణ్యంతో కూడిన అర్హత కలిగి ఉన్న వ్యక్తులను ఎన్నుకునేందుకు అవసరమైన ప్రతి ప్రయత్నం చేసి తీరాలి.

బి) స్త్రీలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

5. 62 సం॥లు పైబడిన ఏ వ్యక్తిని కూడా ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తిగా నియమించకూడదు.

6. జీతం లేదా ఉపకార వేతనం మరియు ఇతర భత్యాలు; మరియు ఆ న్యాయమూర్తి సర్వీసుకు సంబంధించిన నిబంధనా షరతులను రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును సంప్రదించి నిర్ణయించాలి.

5. సాంఘిక సంక్షేమ సంస్థలతో కలిసి పనిచేయడం :

రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుతో సంప్రదించి కుటుంబ న్యాయస్థానం ఈ క్రింది సంస్థలతో, వ్యక్తులతో కలిసి పనిచేసేందుకు తగు నిబంధనలు రూపొందించవచ్చు.

ఎ) సామాజిక సంక్షేమం కోసం పనిచేసే సంస్థలు వారి ప్రతినిధులు.

బి) కుటుంబ సంక్షేమం గురించి పనిచేస్తున్న నిపుణులు.

సి) సామాజిక సంక్షేమంకై పాటు పడే వ్యక్తులు

డి) ఈ చట్టం ఉద్దేశాలు నెరవేర్చేందుకు కుటుంబ న్యాయస్థానానికి ఉపయోగపడే వ్యక్తులు.

6. సలహాదార్లు, ఆఫీసర్లు మరియు ఫ్యామిలీ కోర్టులో పనిచేస్తున్న ఇతర ఉద్యోగస్తులు:

1. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుని సంప్రదించిన తర్వాత సలహాదార్లు, ఆఫీసర్లు, ఇతర ఉద్యోగుల సంఖ్యను నిర్ధారించవచ్చు. ఫ్యామిలీ కోర్టు తన కర్తవ్యాలను నెరవేర్చేందుకు తోడ్పడే అటువంటి సలహాదార్లను, ఆఫీసర్లను మరియు ఇతర ఉద్యోగస్తులను నియమించవచ్చు.

2. సబ్‌సెక్షన్ (1)లో పేర్కొన్న సలహాదార్ల సంఘం యొక్క నిబంధనా షరతులు మరియు ఆఫీసర్లు, ఇతర ఉద్యోగస్తుల సర్వీసు షరతులను రాష్ట్ర ప్రభుత్వం తన నియమాల కనుగుణంగా రూపొందించవచ్చు.

అధ్యాయం - III

అధికార పరిధి

7. అధికార పరిధి:

1. ఈ చట్టంలోని మిగతా నిబంధనలకు కట్టుబడి, ఫ్యామిలీ కోర్టు

ఎ) జిల్లా కోర్టు లేదా ఏదేని కింది సివిల్ కోర్టుల మాదిరిగా ఆ సమయంలో తాత్కాలికంగా అమలులో ఉన్న ఏదైనా చట్టం ప్రకారం కలిగి ఉన్న అధికార పరిధిని ఫ్యామిలీ కోర్టు కూడా కలిగి ఉంటుంది. వివరణలో పేర్కొన్న దావాలు మరియు ఇతర ప్రొసీడింగ్స్ విషయాలలో ఈ అధికారాలను వినియోగించాలి.

బి) అటువంటి అధికార పరిధిని అలాంటి చట్టం ప్రకారం వినియోగించేందుకు ఆ జిల్లా కోర్టు లేదా కింది కోర్టు ఫ్యామిలీ కోర్టు అధికార పరిధిని కలిగి ఉన్న ప్రాంతంలోనే వినియోగించాలి.

వివరణ : ఈ సబ్‌సెక్షన్‌లో పేర్కొన్న దావాలు మరియు ప్రొసీడింగ్స్ ఈ క్రింది విధంగా ఉండాలి.

ఎ) వివాహ రద్దు తీర్పుకై (వివాహం చెల్లదు అని ప్రకటించడం గాని లేదా వివాహాన్ని రద్దు చేయటం) లేదా దాంపత్య హక్కుల పునఃస్థాపనకై లేదా కోర్టు ద్వారా దంపతుల వేర్పాటుకు లేదా విడాకుల డిక్రీ ద్వారా వివాహం రద్దుకై ఇరుపక్షాల మధ్య నడుస్తున్న దావా

బి) వివాహం చెల్లుబడికై లేదా ఒక వ్యక్తి యొక్క వైవాహిక హోదా వెల్లడికై వేసే దావా లేదా ప్రొసీడింగ్.

సి) ఒక వివాహబంధంలో తమ ఆస్తి కోసం లేదా వారిరువురిలో ఏదేని పక్షం యొక్క ఆస్తి కోసం వేసే దావా లేదా ప్రొసీడింగ్.

డి) వైవాహిక బంధంలో కొన్ని పరిస్థితుల కారణంగా ఉత్తర్వుల కోసం లేదా నిషేధ ఉత్తర్వుల కోసం వేసే దావా లేదా ప్రొసీడింగ్.

ఇ) ఏదైనా వ్యక్తి తను న్యాయసమ్మతి కలిగినవాడు అనే ప్రకటన కోసం వేసే దావా లేదా ప్రొసీడింగ్.

యఫ్) మనోవర్తి కోసం వేసే దావా లేదా ప్రొసీడింగ్.

జి) ఒక వ్యక్తి యొక్క సంరక్షణకి, ఆధీనతకి లేదా ఎవరైనా మైనర్ వ్యక్తి సంరక్షణ కొరకు వేసే దావా లేదా ప్రొసీడింగ్.

2. ఈ చట్టంలోని మిగతా నిబంధనలకి కట్టుబడి ఒక ఫ్యామిలీ కోర్టు ఈ క్రింది అధికారాలను కలిగి ఉంటుంది.

ఎ) భారత నేర విచారణ స్మృతిలోని అధ్యాయం IX క్రింద ఫస్ట్ క్లాసు మేజిస్ట్రేట్ కలిగి ఉన్న అధికార పరిధిని ఫ్యామిలీ కోర్టు కలిగి ఉంటుంది.

బి) మరే ఇతర చట్టం వలన ఫ్యామిలీ కోర్టుకు కలిగిన అధికారాలు.

8. అధికార పరిధి మినహాయింపు మరియు పెండింగ్ ప్రొసీడింగ్స్ :

ఏదేని ప్రాంతంలో ఫ్యామిలీ కోర్టు గనుక స్థాపించినట్లయితే

ఎ) సెక్షన్ 7 (1) లో పేర్కొన్న ఏ జిల్లా కోర్టు కాని లేదా క్రింద స్థాయి సివిల్‌కోర్టు కాని ఆ ప్రాంతానికి సంబంధించి ఆ సబ్‌సెక్షన్ యొక్క వివరణలో పేర్కొన్న దావా లేదా ప్రొసీడింగ్ సంబంధిత అంశాలలో అధికార పరిధిని వినియోగించకూడదు.

బి) అధ్యాయం IX నేర విచారణ స్మృతి, 1973 క్రింద ఏ మేజిస్ట్రేట్ కూడా ఆ ప్రాంతానికి సంబంధించి ఎటువంటి అధికారపరిధిని కలిగి ఉండరు.

సి) నేర విచారణ స్మృతి, 1773 (2 of 1974) లోని అధ్యాయం IX క్రింద సెక్షన్ 7 (1) యొక్క వివరణలో పేర్కొన్న ప్రతి దావా లేదా ప్రొసీడింగ్

i) ఫ్యామిలీ కోర్టు స్థాపించటానికి ముందు ఏదైనా జిల్లా కోర్టు లేదా క్రింది కోర్టులో పెండింగ్‌లో ఉంటే లేదా నేర విచారణ స్మృతి క్రింద ఏదైనా మేజిస్ట్రేట్ ముందు పెండింగ్‌లో ఉంటే

ii) ఆ దావా లేదా ప్రొసీడింగ్ ఫ్యామిలీ కోర్టు స్థాపించిన తేదీన బదిలీ చేయాలి.

అధ్యాయం - IV

ప్రక్రియ

9. దావాలు పరిష్కారం కోసం ప్రయత్నం చేసే బాధ్యత:

1. ఫ్యామిలీ కోర్టు ప్రతి దావా లేదా ప్రొసీడింగ్‌లో, ప్రప్రథమంగా ఎక్కడ వీలవుతుందో అక్కడ కేసు యొక్క స్వభావం, పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ఒక పరిష్కారానికి వచ్చేందుకు వీలుగా కేసులోని ఇతర పక్షాల వారికి ఫ్యామిలీ కోర్టు తోడ్పడాలి. దీని కోసం ఫ్యామిలీ కోర్టు, హైకోర్టు నియమాలకు భంగం కలిగించకుండా తగిన విధానాన్ని అనుసరించాలి.

2. ఏదైనా ఫ్యామిలీ కోర్టు దావా లేదా ప్రొసీడింగ్‌లో గనుక, ఏ దశలోనైనా, రెండు పార్టీల మధ్య పరిష్కారం సాధ్యమయ్యే అవకాశం కన్పిస్తే ప్రొసీడింగ్‌లను పరిష్కార ప్రయత్నాలకు అనుకూలించే సమయం వరకు వాయిదా వేయవచ్చు.

3. సబ్‌సెక్షన్ (2) లో పొందుపరిచిన అధికారం, ఫ్యామిలీ కోర్టు ఇతర అధికారాలకు అదనంగా మాత్రమే ఉంటుంది కాని ఆ కోర్టు గౌరవాన్ని తగ్గించే విధంగా ఉండదు.

10. సాధారణ ప్రక్రియ :

1. ఈ చట్టంలోని నియమాలు మరియు నిబంధనలకు కట్టుబడి, ఫ్యామిలీ కోర్టుకు సంబంధించిన దావాలు మరియు ప్రొసీడింగ్స్‌కు సివిల్ విచారణ స్మృతి, 1908 (5 of 1908) నియమాలు మరియు ఆ సమయంలో వాడుకలో ఉన్న ఏదేని న్యాయము వర్తిస్తుంది.
2. ఈ చట్టంలోని ఇతర నిబంధనలు మరియు నియమాలకు కట్టుబడి నేరవిచారణ స్మృతి, 1973 (2 of 1974) నిబంధనలు లేదా దాని క్రింద చేయబడ్డ నియమాలు ఆ కోడ్‌లోని అధ్యాయం– IX కి సంబంధించిన ప్రొసీడింగ్స్‌కు వర్తిస్తుంది.
3. దావాలోని విషయానికి సంబంధించి లేదా ప్రొసీడింగ్స్‌కు సంబంధించి లేదా వాస్తవాలను ఒక పార్టీ ఆరోపించటం మరొక పార్టీ నిరాకరించటానికి సంబంధించి ఫ్యామిలీ కోర్టు ఒక పరిష్కారాన్ని కనుగొనే ఉద్దేశ్యంతో తన స్వంత విధానాన్ని అనుసరించటాన్ని సబ్‌సెక్షన్ (1) లేదా సబ్‌సెక్షన్ (2) లో ఉన్న నిబంధనలేవీ అడ్డుకోవు.

11. ప్రొసీడింగ్స్‌ని గోప్యంగా నడపడం :

ఈ చట్టం క్రింద జరిగే ప్రతి దావా లేదా అన్ని ప్రక్రియలను ఫ్యామిలీ కోర్టు గోప్యంగా నడపాలనుకుంటే ఆ విధంగా చేయవచ్చు. రెండు పార్టీలలో ఏదొక పార్టీ అలా చేయాలనుకుంటే తప్పకుండా అలా చేయవచ్చు.

12. మెడికల్ మరియు సంక్షేమ నిపుణుల తోడ్పాటు :

ప్రతి దావా లేదా ప్రొసీడింగ్స్‌లో, ఫ్యామిలీ కోర్టు వైద్య నిపుణులు లేదా అటువంటి వ్యక్తి (స్త్రీలకి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది) యొక్క సేవలను పొందవచ్చు. సదరు నిపుణులు రెండు పార్టీలలో ఏదొక పార్టీకి చెందిన వారైనా, ఇంకా చెప్పాలంటే వృత్తిరీత్యా ఆ కుటుంబం యొక్క సంక్షేమం చూసుకునే వారైనా ఫ్యామిలీ కోర్టు బాధ్యతలను నెరవేర్చేందుకు తోడ్పడేటట్లయితే వారి సేవలను వినియోగించుకోవాలి.

13. న్యాయ సేవా హక్కు :

ఏ చట్టంలో ఏమి పేర్కొన్నప్పటికీ, ఫ్యామిలీ కోర్టులో వేయబడిన దావా లేదా ప్రొసీడింగ్స్‌కు సంబంధించిన ఏ పార్టీకి కూడా న్యాయవాదిని తన ప్రతినిధిగా పొందే హక్కు లేదు.

అయితే ఫ్యామిలీ కోర్టు న్యాయాన్ని అందించేందుకు గాను న్యాయశాస్త్ర నిపుణుల సేవలను కోరవచ్చు.

14. భారత సాక్ష్యాధారాల చట్టం, 1872 యొక్క వర్తింపు :

ఒక వివాదాన్ని సమర్థవంతంగా పరిష్కరించేందుకు గాను ఒక ఫ్యామిలీ కోర్టు ఏదైనా రిపోర్టును, వాంగ్మూలాన్ని సాక్ష్యం కింద చూపే పత్రాలను, సమాచారాన్ని లేదా విషయాన్ని సాక్ష్యాలు స్వీకరించవచ్చు. అటువంటి సాక్ష్యాలుగా భారత సాక్ష్యాధార చట్టం, 1872 కి సంబంధించినదియైనా, కాకపోయినా పరిగణించవచ్చు.

15. మౌఖిక సాక్ష్యం యొక్క నమోదు :

ఫ్యామిలీ కోర్టుకు సంబంధించిన దావాలు మరియు ప్రొసీడింగ్స్‌లలో, సాక్ష్యాలను పూర్తిగా నమోదు చేయాల్సిన అవసరం లేదు. కానీ న్యాయమూర్తి ప్రతి సాక్ష్యాన్ని పరిశీలించే క్రమంలో, ఆ సాక్షి ఇచ్చే వాంగ్మూలం యొక్క సారాంశాన్ని రికార్డు చేయటంగానీ లేక రికార్డు చేయించటం కానీ చేయాలి. ఆ

సారాంశం మీద సాక్ష్యులు, మరియు న్యాయమూర్తి సంతకాలు చేయాలి. ఆ పత్రాన్ని రికార్డుగా పొందుపరచాలి.

16. క్రమపద్ధతిలో సాక్ష్యం :

1. మామూలుగా సాక్ష్యం ఇవ్వడంలా కాకుండా ఎవరైనా వ్యక్తి ఒక పద్ధతిగా సాక్ష్యం ఇవ్వాలనుకుంటే అది అఫిడవిట్ రూపంలో ఇవ్వచ్చు. అటువంటి సాక్ష్యాన్ని కుటుంబ న్యాయస్థానం పరిశీలనలో వున్న దావాలో సాక్ష్యంగా తీసుకోవచ్చు.
2. ఇరుపక్షాల్లో ఎవరైనా కోరితే కోర్టు సమ్మతితో సదరు అఫిడవిట్ ఇచ్చిన వ్యక్తిని కోర్టుకు పిలిచి అఫిడవిట్‌లోని అంశాలపై విచారించవచ్చు.

17. తీర్పు :

ఫ్యామిలీ కోర్టు యొక్క తీర్పు, కేసు యొక్క సంక్షిప్త వివరణ, నిర్ధారించవలసిన అంశం, నిర్ణయం మరియు ఆ నిర్ణయానికి గల కారణాలను కలిగి ఉండాలి.

18. ఉత్తర్వులు మరియు తీర్పుల యొక్క అమలు :

1. సివిల్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వు ఎటువంటి ప్రభావాన్ని కలిగి ఉంటుందో, ఫ్యామిలీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వు కూడా అదే ప్రభావాన్ని కలిగి ఉంటుంది. కాని న్యాయ విచారణ స్మృతి, 1973 (2 of 1974) కింద అధ్యాయం IX ప్రకారం జారీ చేసిన ఉత్తర్వు మాత్రం ఇటువంటి ప్రభావాన్ని కలిగి ఉండదు. సివిల్ కోర్టు ఉత్తర్వులు ఏ విధంగా అమలు చేయబడతాయో ఫ్యామిలీ కోర్టు ఉత్తర్వులు కూడా అదే విధంగా అమలు చేయాలి.
2. న్యాయవిచారణ స్మృతి, అధ్యాయం IX కింద ఫ్యామిలీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వు అదే స్మృతిలో ఏ విధంగా అమలు చేయాలి అని వ్రాసి వుందో అదే విధంగా అమలు చేయాలి.
3. ఫ్యామిలీ కోర్టు కనుక ఆ ఉత్తర్వుని జారీ చేస్తే, అదే కోర్టు దానిని అమలు చేయాలి. లేదా ఆ ఉత్తర్వుని అమలు చేయాలని మరే ఇతర ఫ్యామిలీ కోర్టు లేదా సాధారణ సివిల్ కోర్టుకి పంపిన యెడల సదరు కోర్టు దానిని అమలు చేయాలి.

అధ్యాయం - V
అప్పీలు, రివిజన్

19. అప్పీలు :

1. కుటుంబ న్యాయస్థానం యొక్క ఉత్తర్వులపై అప్పీలుకు హైకోర్టుకు వెళ్ళవచ్చు.
2. ఇరుపక్షాల ఒప్పందంపై కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీలు చేయటానికి లేదు. అయితే ఈ చట్టం అమలులోనికి రాకముందు వేయబడ్డ అప్పీలు కొనసాగుతాయి.
3. కుటుంబ న్యాయస్థానం నుండి అప్పీళ్ళు 30 రోజులు గడువులోగా వేసుకోవాలి.
4. హైకోర్టు తనంతటతానే కుటుంబ న్యాయస్థానాల కేసులను తప్పించుకొని అవి సమంజసంగా ఉన్నవో, లేవో పరిశీలించవచ్చు.

5. పైన చెప్పిన విధానంలో కాక మరే ఇతర అప్పీలు లేదా రివిజన్ ఉండదు.

6. పైన (1) లో చెప్పిన అప్పీలు హైకోర్టులో ఇద్దరు లేక అంతకంటే ఎక్కువ జడ్జీలచే విచారించబడాలి.

అధ్యాయం - VI

20. త్రోసిపుచ్చే ప్రభావం కలిగిన చట్టం :

ఈ చట్టంలో ఉన్న నిబంధనలు ఆ సమయంలో అమలులో ఉన్న మరే ఇతర చట్టాలలోని అంశాలకు విరుద్ధంగా ఉన్నా, లేదా మరే ఇతర చట్టం వల్లనైనా ఏదైనా పత్రం ప్రభావం కలిగి ఉన్నా, ఈ చట్టంలో ఉన్న నిబంధనలే వర్తిస్తాయి.

21. హైకోర్టు యొక్క నియమాలు రూపొందించే హక్కు :

1. హైకోర్టు నియమానుసారంగా రాజపత్రంలో ప్రకటన ద్వారా ఈ చట్టం యొక్క ఉద్దేశ్యాలని నెరవేర్చేందుకు అవసరమైన నియమాలను రూపొందించవచ్చు.

2. ప్రత్యేకంగా మరియు సదరు నియమాల పట్ల ప్రతికూల ప్రభావం లేకుండా, ఆ నియమాలు ఈ క్రింది వాటిలో అన్ని లేదా కొన్ని విషయాలను కల్పించాలి.

   ఎ) ఫ్యామిలీ కోర్టు యొక్క సాధారణ పనిగంటలు మరియు సాధారణ పనిగంటల తర్వాత కూడా సమావేశాలు ఏర్పాటు చేయటానికి, సెలవుదినాలలో సమావేశాలు ఏర్పాటు చేయటానికి నియమాలు చేయవచ్చు.

   బి) సాధారణంగా ఫ్యామిలీ కోర్టు సమావేశాలు జరిగే చేటు కాక ఇతర చోట్ల కూడా సమావేశాలను ఏర్పాటు చేయటానికి

3. కేసులోని రెండు పార్టీలను పరిష్కార దిశగా ప్రోత్సహించేందుకు చేసే ప్రయత్నాలకు మరియు విధానమునకు ఫ్యామిలీ కోర్టు నియమాలను రూపొందించవచ్చు.

22. కేంద్ర ప్రభుత్వం యొక్క నియమాలను రూపొందించే హక్కు :

1. భారత ప్రధాన న్యాయమూర్తి సమ్మతితో కేంద్ర ప్రభుత్వం, ప్రకటన ద్వారా సెక్షన్ 4 (3) (సి) క్రింద న్యాయమూర్తులను నియమించేందుకు నియమాలు మరియు ఇతర అర్హతలను రూపొందించవచ్చు.

2. ఈ చట్టం క్రింద చేయబడిన ప్రతి నియమాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు ముందు ఆమోదానికి వుంచాలి. పార్లమెంటు మొత్తం 30 రోజులు సెషన్‌లో ఉన్నప్పుడే ఈ నియమాన్ని ఆమోదానికి ఉంచాలి. ఉభయసభలు ఆ నియమం చేయాలనిగాని, చేయకూడదు అని గాని ఆమోదిస్తే తదనుగుణంగా ఆ నియమం అమలులోకి రావడమో లేదా రాకపోవడమో జరుగుతుంది. ఆ నియమానికి ఏవైనా మార్పులు చేయాలని ప్రతిపాదిస్తే, తదనుగుణంగా మార్చిన నియమాన్ని అమలు పరచాలి.

23. రాష్ట్ర ప్రభుత్వం యొక్క నియమాలు రూపొందించే హక్కు :

1. హైకోర్టుని సంప్రదించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం, ప్రకటన ద్వారా ఈ చట్టంలోని ఉద్దేశ్యాలను నెరవేర్చేందుకు నియమాలను రూపొందించవచ్చు.

2. ప్రత్యేకంగా, మరియు సదరు నియమాల పట్ల ప్రతికూల ప్రభావం లేకుండా, ఆ నియమాలు ఈ క్రింది వాటిలో అన్ని లేదా కొన్ని విషయాలకు వర్తిస్తాయి.

ఎ) సెక్షన్ 4 (6) ప్రకారం న్యాయమూర్తుల నియమ నిబంధనలు, జీతము లేదా గౌరవ వేతనము మరియు ఇతర భత్యాలు

బి) సలహాదార్ల సంఘం యొక్క నిబంధనలూ, షరతులు సెక్షన్ 6 లో పేర్కొన్న ఇతర ఉద్యోగుల నిబంధనలు, షరతులు

సి) సెక్షన్ 12 క్రింద మెడికల్ మరియు ఇతర నిపుణుల ఫీజు మరియు ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం నుండి ఇవ్వాలి.

డి) రాష్ట్ర ప్రభుత్వం యొక్క రెవెన్యూల నుండి సెక్షన్ 13 క్రింద న్యాయ పరామర్శిగా నియమితుడైన న్యాయవాది యొక్క ఖర్చులు మరియు రుసుములు చెల్లించుట మరియు అటువంటి రుసుములు, ఖర్చుల యొక్క జాబితా తయారు చేయుట.

ఇ) నియమాల ద్వారా రూపొందించాల్సిన ఏ విషయమైనా,

3. ఈ చట్టం క్రింద రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేయబడిన ఏ నియమమైనా వీలైనంత త్వరగా రాష్ట్ర శాసనసభ ముందు ఉంచాలి.

*****

18. ప్రత్యేక వివాహ చట్టం 1954

(1954 లోని 43 వ చట్టం) (9 అక్టోబరు, 1954)

కొన్ని సందర్భాలలో ప్రత్యేక వివాహపద్ధతి కల్పించడానికి, అటువంటి మరియు ఇతర వివాహాల రిజిస్ట్రేషన్ కోసం, మరియు విడాకుల కోసమున్న చట్టం.

గణతంత్ర భారత్ ఐదవ సంవత్సరంలో పార్లమెంటు ఈ విధంగా శాసించింది.

అంకం - I

ప్రాథమికాంశం

1. క్లుప్త శీర్షిక, అమలు :

1. ఈ చట్టాన్ని ప్రత్యేక వివాహ చట్టం, 1954 అని పిలవవచ్చు.
2. జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రం మినహాయించి భారత దేశమంతటా ఇది వర్తిస్తుంది. జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రం సైతం ఈ చట్టం వర్తించే భూభాగంలో స్థిరపడిన భారత పౌరులకు ఇది వర్తిస్తుంది.
3. కేంద్ర ప్రభుత్వం నియమించిన తేదీన అధికార గెజిట్‌లో నోటిఫికేషన్ ఇవ్వడం ద్వారా ప్రకటించబడి ఈ చట్టం అమల్లోకి వస్తుంది.

2. నిర్వచనాలు :

ఎ) సందర్భం మరో విధంగా ఉంటే తప్ప ఈ చట్టం ప్రకారం –

బి) "నిషేధిత బాంధవ్యాల పరిధి" ఒక పురుషునికి, మొదటి షెడ్యూలు మొదటి భాగంలో పేర్కొన్న వ్యక్తికి మధ్య, ఒక స్త్రీకి మొదటి షెడ్యూలు రెండవ భాగంలోని వ్యక్తికి మధ్య నుండే సంబంధం నిషేధిత బాంధవ్య పరిధిలో ఉంది;

వివరణ I: ఈ బాంధవ్యంలో ఇమిడుండేది.

ఎ) అర్ధ, లేదా యోనిజ మరియు సంపూర్ణ రక్త సంబంధీకులు;

బి) అక్రమ మరియు సక్రమ రక్త సంబంధీకులు;

సి) దత్తత మరియు రక్త సంబంధీకులు;

ఈ చట్టంలోని అన్ని బాంధవ్యాలను ఈ విధంగానే భావించాల్సి ఉంటుంది.

వివరణ II : 'సంపూర్ణ రక్త సంబంధీకులు', 'అర్ధ రక్త సంబంధీకులు' – ఇద్దరు వ్యక్తులు సంపూర్ణ రక్త సంబంధీకులని ఎప్పుడు అంటామంటే వారు ఒకే పూర్వీకుని భార్య ద్వారా సంక్రమించిన వారసులైతే. ఒక పూర్వీకుని విభిన్న భార్యల ద్వారా సంక్రమించిన వారసులను 'అర్ధ రక్త సంబంధీకులు' అంటారు.

వివరణ III: – 'యోనిజ రక్త సంబంధీకులు' ఒకే పూర్వీకురాలికి విభిన్న భర్తల ద్వారా సంక్రమించిన వారసులైన ఇద్దరు వ్యక్తులను యోనిజ రక్త సంబంధీకులు అంటారు.

వివరణ IV-: వివరణ II, III లలో 'పూర్వీకులు' అనే పదంలో తండ్రి, 'పూర్వీకురాలు' అనే పదంలో తల్లి ఇమిడుంది.

డి) 'జిల్లా' వివాహ అధికారికి సంబంధించి, అంటే సెక్షన్ 3 సబ్‌సెక్షన్ (1) లేదా సబ్‌సెక్షన్ (2) కింద ఏ ప్రాంతానికైతే ఒక వివాహ అధికారిని నియమిస్తారో ఆ ప్రాంతం;

ఇ) 'జిల్లా కోర్టు' అంటే సిటీసివిల్ కోర్టు ఉన్న ప్రాంతమైతే ఆ కోర్టు, ఇతర ప్రాంతాల్లోనైతే ఒరిజినల్ జ్యూరిస్‌డిక్షన్ కలిగిన ప్రిన్సిపల్ సివిల్ కోర్టు, లేదా ఈ చట్టంలోని అంశాలపై వ్యవహరించడానికి రాష్ట్ర ప్రభుత్వం అధికార గెజిట్‌లో పేర్కొన్న విధంగా ఇతర సివిల్‌కోర్టులు ఏదైనా;

యఫ్) 'సూచించిన' అంటే ఈ చట్టం కింద రూపొందించిన నియమాల కింద సూచించిన;

జి) 'రాష్ట్ర ప్రభుత్వం' కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించి, అంటే అక్కడ పాలనా యంత్రాంగం.

3. వివాహ అధికార్లు :

1. ఈ చట్టం నిమిత్తం, రాష్ట్ర ప్రభుత్వం, అధికార గెజిట్‌లో ఇచ్చే నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రమంతటికి లేక ఏదైనా ఒక ప్రాంతానికి ఒకరు లేదా మరింత మంది వివాహ అధికార్లను నియమించ వచ్చు.

2. ఈ చట్టం నిమిత్తం, ఈ చట్టం వర్తించే భారత పౌరులు జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రంలో స్థిరపడివుంటే వారి కోసం కేంద్ర ప్రభుత్వం, అధికార గెజిట్ నోటిఫికేషన్ ద్వారా కొంతమంది అధికార్లను, ఆ రాష్ట్రానికి లేదా అందులో ఏదైనా ఒక భాగానికి వివాహ అధికార్లుగా పేర్కొనవచ్చు.

అంకం - II

ప్రత్యేక వివాహాలు చేసే విధానం

4. ప్రత్యేక వివాహాలు చేసుకోవడానికి సంబంధించిన షరతులు

వివాహాలు జరిపే విషయానికి సంబంధించి అమల్లో ఉన్న ఇతర చట్టాల్లో ఏమున్నప్పటికీ, ఈ చట్టం కింద ఇద్దరు వ్యక్తులకు వివాహం చేయాలంటే వివాహ సమయానికి కింది షరతులు పాటించి తీరాలి. అవేమిటంటే

ఎ) ఇరువురిలో ఎవరికి భాగస్వామి (భార్య /భర్త) బ్రతికుండకూడదు;

బి) ఇరువురిలో ఎవరు

i) మతిస్థిమితం కోల్పోయిన కారణంగా సరియైన అంగీకారం తెలిపలేని స్థితిలో ఉండకూడదు,

ii) సరైన అంగీకారం తెలిపే స్థితిలో ఉన్నా వివాహానికి, సంతానప్రాప్తికి పనికి రాకుండా పోయే మానసిక వ్యాధితో బాధపడకూడదు; లేదా

iii) మధ్య మధ్యలో మతిస్థిమితం కోల్పోకూడదు;

సి) పురుషునికి ఇరవైయొక్క సంవత్సరాలు, స్త్రీకి పద్దెనిమిది సంవత్సరాలు నిండాలి;

డి) ఇరుపక్షాలు నిషేధిత బాంధవ్యాల పరిధి లోపల లేరు.

అయితే వారు నిషేధిత బాంధవ్యాల పరిధి లోపల ఉన్నప్పటికీ ఇరువురిలో ఏ ఒకరికైనా వర్తించే సంప్రదాయం అటువంటి వివాహాలను అనుమతిస్తే అటువంటి వివాహం చేయొచ్చు.

ఇ) వివాహం జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రంలో జరిగితే, ఇరువురు భారత పౌరులై ఉండి ఈ చట్టం వర్తించే ప్రాంతంలో స్థిరపడి వుండాలి.

వివరణ : ఒక తెగ, కులం, వర్గం లేదా కుటుంబానికి చెందిన వ్యక్తికి సంబంధించిన 'సంప్రదాయం' అంటే ఒక తెగ, కులం, వర్గం లేదా కుటుంబ సభ్యులకు వర్తిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అధికార గెజిట్ నోటిఫికేషన్

ద్వారా వెల్లడించే ఒక నియమం ఏదైనా. అయితే ఏదైనా తెగ, కులం, వర్గం లేదా కుటుంబ సభ్యులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాల్లో సంతృప్తి పడితే తప్పితే ఇటువంటి నోటిఫికేషన్ జారీ చేయదు.

i) ఆ సభ్యులు సుదీర్ఘకాలం ఇటువంటి నియమాన్ని నిరాటంకంగా, క్రమం ప్రకారం అనుసరిస్తూ వచ్చారు;

ii) ఇటువంటి నియమం కచ్చితమైనది, న్యాయ సమ్మతమైనది, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకం కానిది; మరియు

iii) ఈ నియమం ఒక కుటుంబానికి వర్తించేదైతే ఆ కుటుంబం దాన్ని విడనాడలేదు.

5. జరుగబోయే వివాహం నోటీసు :

ఈ చట్టం కింద పెళ్ళి చేసుకోవాలనుకుంటే, పెళ్లి చేసుకోవాలనుకున్న వారు ఇరువురిలో ఒకరు నివసించే జిల్లాకి చెందిన వివాహ అధికారికి రెండవ షెడ్యూల్లో పేర్కొన్న విధంగా రాతపూర్వకమైన నోటీసు ఇవ్వాలి. ఆ వ్యక్తి నోటీసు ఇచ్చిన తేదీకి ముందు కనీసం ముప్ఫయి రోజులకు పైగా ఆ ప్రాంతంలో నివసించాలి.

6. వివాహ నోటీసు పుస్తకం మరియు ప్రచురణ :

1. సెక్షన్ 5 కింద ఇచ్చిన అన్ని నోటీసులను వివాహ అధికారి తన కార్యాలయం రికార్డులతో పాటు ఉంచాలి. ప్రతి నోటీసు ప్రతిని ఇందుకోసం ఏర్పాటు చేసిన పుస్తకంలో కూడా భద్రపర్చి తీరాలి. ఆ పుస్తకాన్ని వివాహ నోటీసు పుస్తకం అనాలి. ఇటువంటి పుస్తకాన్ని తనిఖీ చేయదలచిన వాళ్లు తనిఖీ చేసుకోవడానికి వీలుగా సబబైన అన్ని వేళలా అందుబాటులో ఉంచాలి.
2. ప్రతి నోటీసు ప్రతిని తన కార్యాలయంలో ఏదైనా కొట్టొచ్చినట్లు కనిపించే ప్రాంతంలో అంటించడం ద్వారా దాని ప్రాచుర్యం జరిగే ఏర్పాటుకు వివాహ అధికారి పూనుకోవాలి.
3. వివాహం చేసుకోవాలనుకుంటున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు సెక్షన్ 5 కింద నోటీసు ఇచ్చిన వివాహ అధికారి జిల్లా పరిధిలో శాశ్వతంగా నివసించకపోతే, ఆ వివాహ అధికారి ఆ నోటీసు ప్రతిని ఆ వ్యక్తి శాశ్వతంగా నివసించే ప్రాంతానికి, జిల్లాకి చెందిన వివాహ అధికారి పంపించే ఏర్పాటు చేయాలి. ఆ వివాహ అధికారి తన కార్యాలయంలో కొట్టొచ్చినట్లు కనిపించే చోట ఆ నోటీసు ప్రతిని అంటించేట్టు ఏర్పాటు చేయాలి.

7. వివాహానికి అభ్యంతరం :

1. ఏ వ్యక్తయినా సెక్షన్ 6 సబ్‌సెక్షన్ (2) కింద నోటీసు ప్రచురణ జరిగిన తేదీ నుండి ముప్ఫయి రోజుల్లోపు సెక్షన్ 4 లో పేర్కొన్న షరతుల ఉల్లంఘన జరిగిందనే కారణంగా వివాహానికి అభ్యంతరం పెట్టవచ్చు.
2. సెక్షన్ 6 సబ్‌సెక్షన్ (2) కింద నోటీసు ప్రచురణ జరిగిన తేదీ నుండి ముప్ఫయి రోజులు గడిచిన తర్వాత ఆ వివాహం చేయొచ్చు. అయితే సబ్‌సెక్షన్ (1) కింద అందుకు ఎవరూ అభ్యంతరం పెట్టకపోయి ఉండాలి.

3. అభ్యంతర స్వభావాన్ని వివాహ అధికారి వివాహ నోటీసు పుస్తకంలో రాతపూర్వకంగా రికార్డు చేసి అభ్యంతరం వ్యక్తం చేసిన వ్యక్తికి దాన్ని వినిపించి, అవసరమైతే వివరించి, అతను లేదా అతని తరఫున ఎవరైనా సంతకం చేయాలి.

8. అభ్యంతరం అందుకున్నప్పుడు అనుసరించాల్సిన విధానం :

1. జరగబోయే వివాహం గురించి సెక్షన్ 7 కింద అభ్యంతరం వ్యక్తమైతే ఆ అభ్యంతరానికి సంబంధించిన అంశాలపై విచారణ జరపకుండా, అది వివాహం జరపడానికి ఆటంకం కాదని అతను సంతృప్తి చెందకుండా, లేదా అభ్యంతరాన్ని ఆ వ్యక్తి వెనక్కి తీసుకునే వరకు వివాహ అధికారి ఆ వివాహాన్ని జరుపకూడదు. అయితే వివాహ అధికారి ఆ అభ్యంతరముపై అభ్యంతరం అందిన తేదీ నుండి ముప్ఫయి రోజుల్లోపు దానిపై విచారణ జరిపి ఒక నిర్ణయానికి రావాలి.

2. అభ్యంతరం సరైనదేనని భావించి వివాహ అధికారి వివాహం జరపడానికి నిరాకరిస్తే వివాహం చేసుకోవాలనుకుంటున్న వారిలో ఎవరైనా వివాహ అధికారి నిరాకరించిన తేదీ నుండి ముప్ఫయి రోజుల్లోపు జిల్లా కోర్టుకి అప్పీలు చేసుకోవచ్చు. అటువంటి అప్పీల్‌లో జిల్లా కోర్టు ఇచ్చినది తుది తీర్పు అవుతుంది. కోర్టు తీర్పుకి అనుగుణంగా వివాహ అధికారి వ్యవహరించాలి.

9. విచారణల విషయంలో వివాహ అధికార్లకుండే అధికారాలు:

1. సెక్షన్ 8 కింద విచారణ జరిపేటప్పుడు వివాహ అధికారికి కింద పేర్కొన్న అంశాల్లో సివిల్ ప్రొసీజర్ కోడ్, 1908 (1908 లో 5 వది) ప్రకారం సివిల్ కోర్టుకి ఉండే అధికారాలన్నీ ఉంటాయి. అవి ఏమిటంటే–

   ఎ) సాక్షులను సమన్ చేయడం, హాజరయ్యేట్టు చూడటం; ప్రమాణంపై ప్రశ్నించడం;

   బి) కనుగొనడం మరియు తనిఖీ;

   సి) డాక్యుమెంట్లు ప్రవేశపెట్టేందుకు వత్తిడి చేయడం;

   డి) అఫిడవిట్లు రూపంలో సాక్ష్యం స్వీకరణ; మరియు

   ఇ) సాక్షులను ప్రశ్నించేందుకు కమీషన్లు నియమించడం;

మరియు వివాహ అధికారి ముందు జరిగే విచారణ భారత శిక్షాస్మృతి (1860 లోని 45 వది) లోని సెక్షన్ 193 లో ఉన్న మాదిరిగా న్యాయవిచారణగా భావించబడుతుంది.

వివరణ : సాక్ష్యం కోసం ఒక వ్యక్తిని రప్పించడానికి ఒక వివాహ అధికారి ప్రాంతీయ పరిధి అతని జిల్లా ప్రాంతీయ పరిధి అవుతుంది.

2. జరగబోయే వివాహంపై వ్యక్తం చేసిన అభ్యంతరం సబబైనది కాదని, సదుద్దేశంతో చేసింది కాదని వివాహ అధికారికి అనిపిస్తే అభ్యంతరం వ్యక్తం చేసిన వ్యక్తిపై వెయ్యి రూపాయిలలోపు నష్టపరిహారం రూపంలో ఖర్చులు విధించి, దాన్ని మొత్తంగా కాని అందులో కొంత భాగాన్ని కాని పెళ్లి చేసుకోబోయే వారికి ఇవ్వొచ్చు. వివాహ అధికారి పనిచేసే కార్యాలయం ఏ జిల్లా కోర్టు ప్రాంతీయ పరిధిలోకి వస్తుందో ఆ కోర్టు తన డిక్రీని ఎలా అమలు చేసుకుంటుందో అదే విధంగా వివాహ అధికారి ఖర్చులకు సంబంధించి తాను జారీ చేసిన ఉత్తర్వును అమలు చేయవచ్చు.

10. విదేశీ వివాహ అధికారికి అభ్యంతరాలు ముట్టినప్పుడు అనుసరించాల్సిన విధానం :

జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రంలోని వివాహ అధికారికి సెక్షన్ 7 కింద అభ్యంతరం అందితే, ఆ వివాహ అధికారి తనకు సరైనదనిపించే విధంగా విచారణ జరిపిన తర్వాత కూడా అనుమానం తలెత్తితే, అతను ఆ వివాహం చేయకుండా ఆ ప్రకటనతో కూడిన రికార్డుని కేంద్ర ప్రభుత్వానికి పంపించాలి. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో విచారణ జరిపి, దానికి తగినదనిపించే సలహా తీసుకుని వివాహ అధికారికి తన నిర్ణయం రాతపూర్వకంగా తెలియజేయాలి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి వివాహ అధికారి వ్యవహరించాలి.

11. వధూవరులు, సాక్షుల ప్రకటన :

వివాహం జరిగే ముందు వధూవరులు, మరియు ముగ్గురు సాక్షులు వివాహ అధికారి సమక్షంలో ఈ చట్టంలోని మూడవ షెడ్యూల్లో పేర్కొన్న విధంగా ఉన్న ప్రకటనపై సంతకాలు చేయాలి. వివాహ అధికారి కూడా వాటిని గుర్తిస్తూ సంతకం చేయాలి.

12. వివాహ ప్రదేశం, చేసే విధానం :

1. వివాహం వివాహ అధికారి కార్యాలయంలో కాని వధూవరుల ఇష్టానుసారం అనువైన దూరంలో ఉన్న మరో ప్రాంతంలో కాని చేయవచ్చు. ఆ విధంగా వేరే చోట పెళ్లి చేసినప్పుడు వధూవరులు సూచించిన విధంగా అదనపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది.
2. వధూవరులకు నచ్చిన పద్ధతిలో వివాహం జరుపుకోవచ్చు.

అయితే వధూవరులు ఇద్దరూ ఒకరితో మరొకరు వివాహ అధికారి, ముగ్గురు సాక్షుల సమక్షంలో ఇద్దరికీ అర్థమయ్యే భాషలో, 'నేను (ఎ) నిన్ను (బి) చట్టపరమైన భార్య (లేదా భర్త) గా స్వీకరిస్తున్నాను' అని అంటే తప్ప ఆ వివాహం పూర్తయినట్లు కాదు. దానికి వారు కట్టుబడినట్లు కాదు.

13. వివాహ సర్టిఫికెట్ :

1. వివాహం అయిన తర్వాత వివాహ అధికారి నాల్గవ షెడ్యూల్లో పేర్కొన్న విధంగా ఒక పుస్తకంలో సర్టిఫికెట్‌ను నమోదు చేయాలి. ఇందుకోసమే ఉన్న ఆ పుస్తకాన్ని వివాహ సర్టిఫికెట్ పుస్తకం అనాలి.అటువంటి సర్టిఫికెట్‌పై వధూవరులు, ముగ్గురు సాక్షులు సంతకాలు చేయాలి.
2. వివాహ అధికారి వివాహ సర్టిఫికెట్ పుస్తకంలో సర్టిఫికెట్‌ని నమోదు చేయడంతో ఈ చట్టం కింద వివాహమైందని, ఇందుకు సాక్షుల సంతకాలకు సంబంధించిన అన్ని పనులు పూర్తయ్యాయనే విషయాలకు సంబంధించి ఆ సర్టిఫికెట్‌ని నిర్ధారిత సాక్ష్యంగా భావించాలి.

14. మూడు నెలల్లోపు వివాహం చేసుకోకపోతే కొత్త నోటీసు :

సెక్షన్ 5 కింద వివాహ అధికారికి నోటీసు ఇచ్చిన రోజు నుండి మూడు క్యాలెండర్ నెలల్లోపు, లేదా సెక్షన్ 8 లోని సబ్‌సెక్షన్ (2) కింద దాఖలైన అప్పీల్ దాఖలై ఆ అప్పీల్‌పై జిల్లా కోర్టు నిర్ణయం తీసుకున్న రోజు నుండి మూడు నెలల్లోపు, లేదా సెక్షన్ 10 కింద కేంద్ర ప్రభుత్వానికి కేసు రికార్డు పంపి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న రోజు నుండి మూడు నెలల్లోపు వివాహం జరక్కపోతే, నోటీసుకి, దాని నుండి తలెత్తే ఇతర వ్యవహారాలకు కాలదోషం పట్టినట్లుగా భావించాల్సి ఉంటుంది. ఈ చట్టం కింద పేర్కొన్న విధంగా కొత్త నోటీసు ఇచ్చే వరకు ఏ వివాహ అధికారి ఆ వివాహం చేయకూడదు.

అంకం - III

ఇతర రూపాల్లో జరిగిన వివాహాల రిజిస్ట్రేషన్

15. ఇతర రూపాల్లో జరిగిన వివాహాల రిజిస్ట్రేషన్ :

ప్రత్యేక వివాహ చట్టం, 1872 కింద (1872 లో III వది) లేదా ఈ చట్టం కింద జరిగిన వివాహం కాకుండా మరే ఇతర వివాహమైనా ఈ చట్టం అమల్లోకి రాకముందు కాని తర్వాత కింద పేర్కొన్న షరతులు పూర్తిగా నెరవేర్చి జరిగుంటే ఈ చట్టం అమల్లో ఉండే ప్రాంతంలోని వివాహ అధికారి ఈ అంకం కింద ఆ వివాహాన్ని రిజిస్టరు చేయవచ్చు.

ఎ) ఇరుపక్షాలు వివాహ కర్మకాండలు పూర్తిచేసుకుని అప్పటి నుంచి భార్యభర్తలుగా కలిసి బ్రతుకుతుండాలి;

బి) ఇరువురిలో ఎవరికి రిజిస్ట్రేషన్ నాటికి ఒకర్ని మించిన సజీవ జీవిత భాగస్వామి (భార్య/భర్త) ఉండకూడదు;

సి) రిజిస్ట్రేషన్ నాటికి వారిలో ఎవరైనా మందబుద్ధి కలవారో మతి చలించిన వారో కాకూడదు.

డి) రిజిస్ట్రేషన్ నాటికి ఇరువురికి ఇరవైయొక్క సంవత్సరాలు నిండి వుండాలి.

ఇ) ఇరుపక్షాలు నిషేధిత బాంధవ్యాల పరిధిలో లేరు.

అయితే అది ఈ చట్టం అమల్లోకి రాకముందు జరిగిన వివాహమైతే, ఈ షరతు ఆ ఇద్దరి మధ్య వివాహాన్ని అనుమతించే చట్టం, సంప్రదాయం లేదా వాడుకలకు లోబడి ఉంటుంది.

యఫ్) వివాహం రిజిష్టరు చేయాలనే అర్జీ పెట్టుకున్న రోజు కంటే ముందు ఆ జంట కనీసం ముప్ఫయి రోజుల పాటు ఆ వివాహ అధికారి జిల్లాలో నివసించి ఉండాలి.

16. రిజిస్ట్రేషన్ చేసే విధానం :

ఈ అంకం కింద తమ వివాహాన్ని రిజిస్టరు చేయాలని అర్జీ అందిన తర్వాత వివాహ అధికారి సూచించిన విధంగా ఒక బహిరంగ నోటీసు ఇవ్వాలి. అభ్యంతరాలు తెలపడానికి ముప్ఫయి రోజులు గడువు ఇవ్వాలి. ఆ గడువులోపు అభ్యంతరాలపై విచారణ జరిపిన తర్వాత సెక్షన్ 15 కింద అన్ని షరతులు నెరవేరాయని సంతృప్తి చెందితే ఐదవ షెడ్యూల్లో ఉన్నవిధంగా వివాహ సర్టిఫికెట్ పుస్తకంలో సర్టిఫికెట్ నమోదు చేయాలి. ఆ సర్టిఫికెట్‌పై వివాహంలోని ఇరుపక్షాల వారు, ముగ్గురు సాక్షులు సంతకాలు చేయాలి.

17. సెక్షన్ 16 కింద జారీ చేసిన ఉత్తర్వులపై అప్పీళ్లు :

ఈ అంకం కింద వివాహం రిజిస్టరు చేయడానికి వివాహ అధికారి నిరాకరిస్తూ ఉత్తర్వు జారీ చేస్తే బాధిత వ్యక్తి ఉత్తర్వు జారీ అయిన ముప్ఫయి రోజుల్లోపు వివాహ అధికారి కార్యాలయం ఏ జిల్లా కోర్టు ప్రాంతీయ పరిధిలో ఉందో ఆ జిల్లా కోర్టులో ఆ ఉత్తర్వుకు వ్యతిరేకంగా అప్పీల్ చేసుకోవాలి. అటువంటి అప్పీల్‌లో వివాహ అధికారి తీసుకునేది తుది నిర్ణయం అవుతుంది. అర్జీ ఏ వివాహ అధికారికి పెట్టుకున్నారో ఆ అధికారి ఆ నిర్ణయానికి కట్టుబడి వ్యవహరించాల్సి ఉంటుంది.

18. ఈ అంకం కింద వివాహ రిజిస్ట్రేషన్ ఫలితం :

సెక్షన్ 24 సబ్‌సెక్షన్ (2) లోని అంశాలకు లోబడి ఈ అంకం కింద వివాహ సర్టిఫికెట్ పుస్తకంలో వివాహ

సర్టిఫికెట్ నమోదైన తర్వాత ఆ వివాహాన్ని, ఆ విధంగా నమోదైన తేదీ నుండి ఈ చట్టం కింద జరిగిన వివాహంగా గుర్తించాల్సి ఉంటుంది. వివాహ కర్మకాండ జరిగిన రోజు తర్వాత పుట్టిన పిల్లల్ని (వారి పేర్లను కూడా వివాహ సర్టిఫికెట్ పుస్తకంలో నమోదు చేయాలి) అన్ని విధాల మొదటి నుండి ఆ తల్లిదండ్రులకు కలిగిన సక్రమ సంతానంగా భావించాల్సి ఉంటుంది.

అయితే ఈ చట్టం రాకముందు తమ తల్లిదండ్రుల సక్రమ సంతానం కాకపోవడం వల్ల హక్కులు పొందని లేదా పొందలేని పిల్లలకి ఈ సెక్షన్ ద్వారా తమ తల్లిదండ్రులు మినహాయిస్తే ఇతర వ్యక్తుల ఆస్తుల్లో హక్కులు లభిస్తాయని అనుకోవడానికి ఆస్కారం లేదు.

అంకం - IV

ఈ చట్టం కింద జరిగిన వివాహ పర్యవసానాలు

19. అవిభాజ్య కుటుంబ సభ్యునిపై వివాహ ఫలితం :

హిందు, బౌద్ధ, సిక్కు లేదా జైనమతాన్ని బోధించే అవిభాజ్య కుటుంబ సభ్యుడు ఈ చట్టం కింద వివాహం చేసుకుంటే తన కుటుంబంలో తన ఉమ్మడి హోదాని తెంచుకున్నట్లుగా భావించాల్సి ఉంటుంది.

20. ఈ చట్టం ద్వారా ప్రభావితం కాని హక్కులు, పరిమితులు :

సెక్షన్ 19 కి లోబడి, ఈ చట్టం కింద వివాహం చేసుకున్న ఏ వ్యక్తయినా ఒక వ్యక్తి ఆస్తిలో వారసత్వ హక్కుకి సంబంధించి కులపరమైన పరిమితుల నిర్మూలన చట్టం, 1850 (1850 లోని 21 వది) కింద ఒక వ్యక్తికి వర్తించే హక్కులే మరియు అదే విధమైన పరిమితులే వర్తిస్తాయి.

21. ఈ చట్టం కింద వివాహం చేసుకున్న వారి ఆస్తులకు సంబంధించిన వారసత్వం :

కొన్ని మతాల వారికి వర్తించే విషయంలో భారత వారసత్వ చట్టం, 1925 (1925 లోని 39 వది) లో ఎటువంటి పరిమితులున్నప్పటికీ, ఈ చట్టం కింద వివాహమైన వారి ఆస్తుల వారసత్వాన్ని, ఈ వివాహంలో కలిగిన పిల్లల ఆస్తుల వారసత్వాన్ని ఆ చట్టంలోని (భారత వారసత్వ చట్టం, 1925) అంశాలు నియంత్రిస్తాయి. ఈ చట్టం ప్రయోజనార్థం ఆ చట్టంలోని ఐదవ భాగంలోని మూడవ అంకాన్ని (విల్లు రాయని వ్యక్తులకు సంబంధించి పార్సీల భాగంలోని ప్రత్యేక నియమాలు) తొలగించినట్లు భావించాల్సి ఉంటుంది.

21ఎ.కొన్ని సందర్భాల్లో ప్రత్యేక నియమం :

ఈ చట్టం కింద హిందు, బౌద్ధ, సిక్కు లేదా జైన మతాన్ని బోధించే వ్యక్తికి హిందు, బౌద్ధ, సిక్కు లేదా జైన మతాన్ని బోధించే మరో వ్యక్తికి మధ్య వివాహం జరిగితే సెక్షన్ 19, సెక్షన్ 21 వర్తించవు. సెక్షన్ 20 సృష్టించే పరిమితి కూడా ఆమేరకు వర్తించదు.

అంకం - V

సహజీవన హక్కుల పునరుద్ధరణ మరియు న్యాయపరమైన వేర్పాటు

22. సహజీవన హక్కుల పునరుద్ధరణ :

భార్యాభర్తల్లో ఎవరైనా న్యాయ సమ్మతమైన కారణం లేకుండా అవతలి వారి సాంగత్యం నుండి దూరమైతే బాధితులు తమ సహజీవన హక్కుని పునరుద్ధరించాలని కోరుతూ జిల్లా కోర్టుకి దరఖాస్తు

పెట్టుకోవచ్చు. పిటిషనులో ప్రకటించిన అంశాలు నిజమని, దరఖాస్తును స్వీకరించడానికి ఎటువంటి న్యాయపరమైన అవాంతరాలు లేవని కోర్టు సంతృప్తి చెందిన ఎడల తదనుగుణంగా సహజీవన హక్కుల పునరుద్ధరణ డిక్రీ మంజూరు చేయొచ్చు.

వివరణ : అవతల వారి సాంగత్యం నుండి దూరమవ్వడానికి న్యాయ పరమైన కారణాలు ఉన్నాయనే ప్రశ్న తలెత్తితే, న్యాయ సమ్మతమైన కారణాలు ఉన్నాయని రుజువు చేయాల్సిన బాధ్యత సాంగత్యం నుండి దూరమైన వ్యక్తిపై ఉంటుంది.

23. న్యాయపరమైన వేర్పాటు :

1. న్యాయపరమైన వేర్పాటు కోసం భర్త కాని భార్య కాని జిల్లా కోర్టులో పిటిషను దాఖలు చేయవచ్చు.
   ఎ) విడాకుల పిటీషను దాఖలు చేయడానికి అవకాశమున్న సెక్షన్ 27 లోని సబ్‌సెక్షన్ (1), సబ్‌సెక్షన్ (1–ఎ) లో పేర్కొన్న ఏ కారణాలపై, లేదా
   బి) సహజీవన హక్కుల పునరుద్ధరణ డిక్రీని అమలు చేయడంలో విఫలమైన కారణాలపై కోర్టు పిటీషన్‌లో పేర్కొన్న అంశాల వాస్తవికతపై సంతృప్తి చెందిన ఎడల, అర్జీని అనుమతించక పోవడానికి ఎటువంటి చట్టపరమైన కారణం లేకపోతే న్యాయపరమైన వేర్పాటు డిక్రీ మంజూరు చేయొచ్చు.
2. న్యాయపరమైన వేర్పాటు డిక్రీ జారీ అయిన తర్వాత ప్రతివాదితో కలసుండాల్సిన బాధ్యత వాదికి ఉండదు. కాని ఇరువురిలో ఎవరైనా కోర్టులో పిటీషను పెట్టుకుని, పిటీషనులో ప్రకటించిన అంశాలతో సంతృప్తి చెందిన ఎడల కోర్టు న్యాయ సమ్మతమని భావిస్తే ఆ డిక్రీని వెనక్కి తీసుకోవచ్చు.

అంకం - VI

చెల్లని వివాహం, విడాకులు

24. చెల్లని వివాహాలు :

1. ఈ చట్టం కింద జరిగిన వివాహం ఎప్పుడు చెల్లని వివాహమౌతుందంటే, మరియు ఇరుపక్షాల్లో ఎవరైనా అవతలి వారికి వ్యతిరేకంగా పిటిషను దాఖలు చేస్తే చెల్లని వివాహం డిక్రీ ఎప్పుడు మంజూరు చేయొచ్చుంటే
   i) సెక్షన్ 4 లోని క్లాజులు (ఎ), (బి), (సి), (డి) లోని షరతులు నెరవేరకపోతే; లేదా
   ii) వివాహం నాటికి, దావా వేసే నాటికి ప్రతివాది నపుంశకత్వంతో బాధపడుతున్నా.
2. ఈ చట్టంలోని సెక్షన్ 18 పరిధిలో అయ్యిందిగా భావించే వివాహాలకు ఈ సెక్షన్‌లోని అంశాలు వర్తించవు. అయితే సెక్షన్ 15 క్లాజులు (ఎ) నుండి (ఇ) లలో పేర్కొన్న షరతులకు విరుద్ధంగా అంకం iii కింద వివాహ రిజిస్ట్రేషన్ జరిగుంటే అటువంటి రిజిస్ట్రేషన్ వల్ల ప్రయోజనం లేదని ప్రకటించవచ్చు.

అయితే సెక్షన్ 17 కింద అప్పీల్‌కి వెళ్లి, జిల్లాకోర్టు తుది నిర్ణయం తీసుకున్న కేసుల్లో ఇటువంటి ప్రకటనలు చేయకూడదు.

25. చెల్లనిదిగా అనగలిగే వివాహాలు :

ఈ చట్టం కింద జరిగిన వివాహాలు చెల్లనిదిగా అనగలిగే వివాహాలుగా ఎప్పుడు అవుతాయంటే, మరియు చెల్లని వివాహాల డిక్రీ ఎప్పుడు మంజూరు చేయొచ్చు అంటే–

i) వివాహంలో లైంగిక సంబంధం ఏర్పడటానికి ప్రతివాది కావాలని నిరాకరించడం వల్ల వివాహంలో లైంగిక సంబంధం ఏర్పడకపోవడం; లేదా

ii) వివాహ సమయానికి ప్రతివాది పిటిషనరు ద్వారా కాక మరెవరి కారణంగానో గర్భం దాల్చి ఉంటే, లేదా

iii) వివాహంలో ఇరుపక్షాల్లో ఒకరు భారత కాంట్రాక్టు చట్టం 1872 లో నిర్వచించినట్లుగా బలప్రయోగానికి, లేదా మోసానికి పాల్పడి అంగీకారం పొందుంటే :

అయితే కోర్టు కింద విషయాల్లో సంతృప్తి చెందని ఎడల క్లాజు (ii) కింద డిక్రీ జారీ చేయకూడదు–

ఎ) ఆరోపించిన వాస్తవాల సంగతి వివాహ సమయానికి పిటిషనరుకి తెలియదు,

బి) వివాహమైన ఏడాది లోపు కేసు నమోదు చేశారు.

సి) డిక్రీ పొందడానికి గల కారణం పిటీషనరుకి తెలిసిన తర్వాత పిటీషనరు అంగీకారంతో వైవాహిక సంబంధం ఏర్పడలేదు.

క్లాజు (iii) కింద పేర్కొన్న సందర్భాల్లో కోర్టు ఇందుకు డిక్రీ మంజూరు చేయదు.

ఎ) బలప్రయోగం ఆగిపోయిన ఏడాది లోపు, లేదా సందర్భాన్ని బట్టి మోసం బైటపడిన ఏడాది లోపు న్యాయపరమైన చర్య తీసుకుని ఉండకపోతే, లేదా

బి) బలప్రయోగం ఆగిపోయిన తర్వాత, లేదా సందర్భాన్ని బట్టి మోసం బైటపడిన తర్వాత పిటిషనరు తన స్వేచ్ఛాయుత అంగీకారంతో వివాహంలోని అవతలి వ్యక్తితో భార్యాభర్తగా కలసి సహజీవనం చేస్తే

26. చెల్లని, చెల్లనిదిగా అనగలిగే వివాహాల్లోని పిల్లలు సక్రమం :

1. సెక్షన్ 24 కింద ఒక వివాహం చెల్లనప్పటికీ, అటువంటి వివాహంలో పుట్టిన సంతానం, అది వివాహ చట్టాల (సవరణ) చట్టం, 1976 (1976 లోని 68 వది) అమల్లోకి రాకముందు, లేదా తర్వాత పుట్టిన సంతానమైనా కావచ్చు, ఒకవేళ చెల్లే వివాహంలో పుట్టి సక్రమ సంతానం అనిపించుకునే స్థితి ఉంటే ఇటువంటి వివాహాల్లో పుట్టినప్పటికీ వారు సక్రమ సంతానం అనిపించుకుంటారు. ఈ చట్టం కింద వివాహాన్ని రద్దు చేస్తూ డిక్రీ జారీ అయ్యిందా లేదా, ఈ కింద పిటిషను దాఖలు చేస్తే తప్ప ఆ వివాహం చెల్లనిదిగా గుర్తించడానికి లేదనే అంశాలు ఈవిషయంలో అప్రస్తుతం.

2. సెక్షన్ 25 ప్రకారం చెల్లనిదిగా అనిపించగలిగే వివాహాన్ని చెల్లనిదిగా గుర్తిస్తూ డిక్రీ మంజూరైన వివాహంలో డిక్రీ మంజూరు కాకముందు పుట్టిన లేక గర్భస్థ శిశువైన బిడ్డయితే, డిక్రీ నాటికి ఆ వివాహం చెల్లనిది కాక రద్దయివుంటే సక్రమమైన సంతానంగా భావించే స్థితి ఉంటే చెల్లని వివాహం డిక్రీ పొందినప్పటికి అటువంటి బిడ్డను సక్రమ సంతానంగా భావించి తీరాలి.

3. సబ్ సెక్షన్ (1) లేదా సబ్‌సెక్షన్ (2) లో ఏమున్నప్పటికీ చెల్లని వివాహంలో పుట్టిన సంతానం లేదా సెక్షన్ 25 కింద వివాహం చెల్లదని డిక్రీ జారీ అయిన వివాహంలోని సంతానానికి ఈ చట్టం ప్రవేశపెట్టకపోయి వుంటే తన తల్లిదండ్రుల సక్రమ సంతానం కాని కారణంగా హక్కులు పొందని, పొందడం సాధ్యం కాని స్థితి ఉంటే అటువంటి సంతానానికి తమ తల్లిదండ్రుల ఆస్తిలో మినహాయించి తల్లిదండ్రులు కాని వారి ఆస్తులలో ఎటువంటి హక్కులూ సంక్రమించవు.

27. విడాకులు :

ఈ చట్టంలోని అంశాలకు, మరియు దాని కింద చేసిన నియమాలకు లోబడి భార్యాభర్తల్లో ఎవరైనా ప్రతివాది ఈ కారణాలకు పాల్పడితే జిల్లా కోర్టులో పిటిషన్

ఎ) వివాహం అయిన తర్వాత తన జీవిత భాగస్వామి (భార్య /భర్త) తో కాకుండా వేరెవరితోనో కావాలని లైంగిక సంబంధం ఏర్పరచు కున్నారు; లేదా

బి) పిటిషను దాఖలు చేయడానికి ముందు రెండేళ్లకు పైగా నిరాటంకంగా పిటిషనరుని వదిలేశారు; లేదా

సి) భారత శిక్షాస్మృతి (1860 లోని 45వది) లో నిర్వచించిన నేరానికి పాల్పడి ఏడేళ్లకు పైగా కారాగార శిక్ష అనుభవిస్తున్నారు; లేదా

డి) వివాహమైనప్పటి నుండి పిటిషనరుతో క్రూరంగా ప్రవర్తిస్తున్నారు;

ఇ) నయం కాని విధంగా మతిస్థిమితం కోల్పోయి వుంటే లేదా ప్రతివాదితో కలసి బ్రతకడం అసాధ్యమనిపించేంతగా మానసిక వ్యాధికి లోనై వుంటే అది ఎడతెరిపి లేకుండా అయినా కావచ్చు, తెరిపిచ్చేదైనా కావచ్చు.

వివరణ : ఈ క్లాజులో

ఎ) 'మానసిక వ్యాధి' అంటే మానసిక రోగం, మెదడు ఎదుగుదల ఆగిపోవడం లేక అసంపూర్ణంగా మిగిలిపోవడం, మెదడులోని లోపం వల్ల కలిగే వ్యాధి, మరే రకమైన మానసిక వ్యాధయినా, వైకల్యమైనా, షిజోఫ్రేనియా కూడా అందులో భాగమే;

బి) 'మెదడులోని లోపం వల్ల కలిగే వ్యాధి' అంటే నిరాటంకంగా కొనసాగే మానసిక వ్యాధి లేదా వైకల్యం (తెలివితేటలు తగ్గిపోవడం అందులో భాగం కావచ్చు కాకపోవచ్చు). ఈ వ్యాధి వల్ల అవతలి వారిపై అసహజంగా కోపోద్రిక్తులు కావడం లేదా వారి పట్ల చాలా బాధ్యతారహితంగా ప్రవర్తించడం జరుగుతుంది. వైద్యపరమైన చికిత్సకు ఈ వ్యాధి లొంగుతుందా లేదా అనేది అప్రస్తుతం; లేదా

సి) అంటుకునే విధమైన సుఖవ్యాధితో బాధపడుతుంటే; లేదా

డి) పిటిషనరు ద్వారా సోకని కుష్టువ్యాధితో బాధపడుతుంటే; లేదా

ఇ) ఒక వ్యక్తి బతికిఉంటే ఆచూకి సహజంగా తెలుసుకోగలిగే అవకాశమున్న వ్యక్తులకు ఆ వ్యక్తి బతికున్నది లేనిది ఏడు సంవత్సరాలుపైగా తెలియకపోతే;

వివరణ : ఈ సెక్షన్‌లో 'వదిలేయడం' అంటే అవతలి వ్యక్తి న్యాయ సమ్మతమైన కారణం లేకుండా,

పిటిషనరు అనుమతి లేకుండా, అభిష్టానికి వ్యతిరేకంగా వదిలేయడం, వైవాహిక బంధంలోని అవతలి వ్యక్తి పిటిషనరుని కావాలని నిర్లక్ష్యం చేస్తే అది కూడా ఇందులో భాగమే. వేరే పదప్రయోగం చేసినా దాని భావాన్ని బట్టి, వాడిన సందర్భాన్ని బట్టి ఇందులో భాగమనుకోవాలి;

1ఎ) భార్య ఈ కారణాల కింద కూడా జిల్లా కోర్టులో విడాకుల పిటిషను దాఖలు చేయవచ్చు:

i) భర్త వివాహమైన తర్వాత లైంగిక అత్యాచారానికి, అసహజ లైంగిక నేరానికి లేదా పాశవిక లైంగిక హింసకు పాల్పడి నేరం రుజువైతే; లేదా

ii) హిందు దత్తత, మనోవర్తి చట్టం, 1956 సెక్షన్ 18 కింద వేసిన దావాలో కాని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 సెక్షన్ 125 (లేదా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1898 సెక్షన్ 488) కింద జరిగిన కేసులో భార్య విడిగా ఉంటూ కూడా మనోవర్తికి అర్హురాలని భర్తకు వ్యతిరేకంగా డిక్రీ లేదా ఉత్తర్వు జారీ అయిన ఏడాది తర్వాత కూడా ఇరువురు కలిసి కాపురం చేయలేకపోతే;

2. ఈ చట్టంలోని అంశాలు, దాని కింద రూపొందించిన నియమాలకు లోబడి ప్రత్యేక వివాహ (సవరణ) చట్టం, 1970 (1970 లోని 29వది) కంటే ముందు కాని తర్వాత కాని వివాహంలోని ఇరుపక్షాలు ఈ కారణం కింద విడాకుల పిటీషను దాఖలు చేయొచ్చు.

i) ఇరుపక్షాలకు సంబంధించిన కేసులో న్యాయపరమైన వేర్పాటు డిక్రీ మంజూరైన ఏడాది, లేదా ఆపై కాలం తర్వాత కూడా ఇరుపక్షాలు కలిసి సహజీవనం కొనసాగించక పోయిఉంటే; లేదా

ii) ఇరుపక్షాలకు సంబంధించిన కేసులో సహజీవన హక్కుల పునరుద్ధరణ డిక్రీ మంజూరైన ఏడాది, లేదా ఆపై కాలం తర్వాత కూడా ఇరుపక్షాలు కలిసి సహజీవనం కొనసాగించకపోయుంటే.

27ఎ. విడాకుల కేసుల్లో ప్రత్యామ్నాయ ఉపశమనం:

ఈ చట్టం కింద జరిగే విచారణలో సెక్షన్ 27 లోని సబ్‌సెక్షన్ (1) క్లాజు (హెచ్) కారణం ఆధారమైన పిటిషన్ మినహాయించి ఇతర కారణాలపై ఆధారపడి వివాహాన్ని రద్దు చేస్తూ డిక్రీ మంజూరు చేయాలనే పిటిషన్ దాఖలైతే పరిస్థితులను బట్టి న్యాయమనిపిస్తే కోర్టు విడాకుల బదులు న్యాయపరమైన వేర్పాటు డిక్రీ మంజూరు చేయొచ్చు.

28. పరస్పర అంగీకార విడాకులు :

1. ఈ చట్టంలోని అంశాలకు లోబడి వివాహంలోని ఇరుపక్షాలు కలిసి వివాహాన్ని రద్దు చేస్తూ విడాకుల డిక్రీ మంజూరు చేయాలని జిల్లా కోర్టులో పిటిషను దాఖలు చేయవచ్చు. తాము ఏడాదిపైగా విడిగా ఉంటున్నామని, కలిసి ఉండటం సాధ్యం కావడం లేదని, వివాహాన్ని రద్దు చేయడానికి పరస్పర అంగీకారానికి వచ్చామనే కారణం చూపుతూ ఈ పిటీషను దాఖలు చేయాల్సి ఉంటుంది.

2. సబ్‌సెక్షన్ (1) కింద కోర్టుని ఆశ్రయించి పిటిషను దాఖలు చేసిన రోజు నుండి ఆరు నెలల తర్వాత పద్దెనిమిది నెలల్లోపు ఇరుపక్షాలు ఆ పిటిషన్ను వెనక్కి తీసుకోకుండా ఇరువురూ కోర్టులో ఆ ప్రస్తావన తీసుకువస్తే, ఇరుపక్షాల వాదనలు విని, వివాహం జరిగిన మాట వాస్తవమేనా, పిటిషనులోని అంశాలు నిజమేనా అనే విషయంలో తగిన విచారణ జరిపి సంతృప్తి చెందిన మీదట కోర్టు డిక్రీ జారీ చేసిన రోజు నుండి వివాహం రద్దు చేస్తూ జారీ చేసిన విడాకుల డిక్రీ అమల్లోకి వస్తుంది.

29. వివాహ సర్టిఫికెట్ పుస్తకంలో వివాహ సర్టిఫికెట్ నమోదైన రోజు నుండి ఏడాది గడిచిన తర్వాత కాని ఆ వివాహాన్ని రద్దు చేయమని జిల్లా కోర్టులో పిటిషను దాఖలు చేయడానికి వీల్లేదు.

అయితే పిటిషనరు ప్రతివాది వల్ల విపరీతమైన ఇబ్బందులకు, లేదా పాశవికతకు గురైతే వివాహమైన రోజు నుండి ఏడాదిలోపు దాఖలైన పిటిషన్ను జిల్లా కోర్టు అనుమతించవచ్చు. అయితే బూటకపు ప్రకటనలు చేసి, లేదా కేసు స్వభావాన్ని కప్పి పుచ్చి కోర్టు అనుమతి పొంది పిటిషను దాఖలు చేశారని విచారణ జరిపిన మీదట జిల్లా కోర్టుకి అనిపిస్తే ఏడాది కాలం పూర్తయ్యే వరకు డిక్రీ అమల్లోకి రాదనే షరతు విధించవచ్చు, లేదా ఏడాది గడిచిన తర్వాత అవే విషయాలను, లేదా అలాంటి విషయాలను ప్రస్తావిస్తూ మరో పిటిషను దాఖలు చేసుకోవడానికి అభ్యంతర పెట్టకుండా పిటిషన్ని కొట్టేయవచ్చు.

2. వివాహమైన ఏడాదిలో విడాకుల పిటిషను అనుమతించాలని ఈ సెక్షన్ కింద కోరుతూ దాఖలైన పిటిషన్పై తీర్పు చెప్పేటప్పుడు ఈ వివాహంలో కలిగిన సంతానం ప్రయోజనాల గురించి మరియు ఏడాది గడిచేలోపు ఇరుపక్షాల మధ్య రాజీ కుదిరే అవకాశాల గురించి కోర్టు దృష్టి సారించాలి.

30. విడాకులు పొందిన వ్యక్తి పునర్వివాహం :

వివాహాన్ని రద్దు చేస్తూ డిక్రీ మంజూరైన తర్వాత అప్పీల్ చేసుకునే హక్కున్నా, అప్పీల్ చేసుకోవడానికి గల గడువు పూర్తయిపోతే, లేదా అప్పీల్ కొట్టి వేయబడితే వివాహంలోని ఇరుపక్షాలు చట్టపరంగా మరో వివాహం చేసుకోవచ్చు.

పరిధి, మరియు అనుసరించే విధానం

31. 1. పిటిషన్ దాఖలు చేయాల్సిన కోర్టు – ఐదవ లేదా ఆరవ అంకం కింద ప్రతి పిటిషన్ని ఏ జిల్లా కోర్టులో దాఖలు చేయాలంటే దాని ఒరిజినల్ సివిల్ జ్యూరిస్ డిక్షన్ ప్రాంతీయ పరిధిలో –

i) వివాహం జరిగుండాలి; లేదా

ii) పిటిషను దాఖలు చేసేనాటికి ప్రతివాది అక్కడ నివసించి ఉండాలి; లేదా

iii) ఆ వైవాహిక జంట ఆఖరుగా కలిసి నివసించి ఉండాలి; లేదా

iiia) పిటిషనరు భార్య అయితే పిటిషను దాఖలు చేసే నాటికి ఆమె నివసించి ఉండాలి; లేదా

iv) ప్రతివాది ఈ చట్టం వర్తించని ప్రాంతంలో నివసిస్తున్నా, లేక ఆ వ్యక్తి బతికున్నదీ లేనిది సహజంగా తెలిసే అవకాశమున్న వ్యక్తులకు ఏడేళ్లపాటు ఆ విషయం తెలియకపోతే పిటిషనరు నివసించే ప్రాంతం.

2. సబ్సెక్షన్ (1) కింద కోర్టు పరిధికి సంబంధించిన అధికారాలను ఏ విధంగానూ కించపర్చకుండా ఈ సబ్సెక్షన్ ఆధారంగా చెల్లని వివాహం లేదా విడాకులకు సంబంధించిన ఈ చట్టం వర్తించే ప్రాంతంలో భార్య స్థిరపడిపోతే, ఆమె అక్కడ పిటిషను దాఖలు చేయడానికి మూడేళ్ల ముందు నుండి సాధారణంగా నివసిస్తూ ఉంటే, భర్త ఆ ప్రాంతంలో నివసించకుండాపోయుంటే జిల్లా కోర్టు ఆమె స్థిరపడిన ప్రాంతంలో పిటిషను స్వీకరించవచ్చు.

32. 1. పిటిషనులోని అంశాలు, ధృవీకరణ – (1) ఐదవ లేదా ఆరవ అంకం కింద దాఖలు చేయాల్సిన ప్రతి పిటిషనులో కోరే పరిష్కారానికి తగిన వాస్తవాలను స్పష్టంగా పేర్కొనాలి. పిటీషనరు, ప్రత్యర్థి పక్షం వారు కుమ్మక్కుకాలేదనే విషయాన్ని స్పష్టంగా పేర్కొనాలి.

2. ఈ చట్టం కింద దాఖలైన పిటిషనులోని ప్రకటనలను చట్టప్రకారం ప్లెయింటును ధృవీకరించి నట్లుగానే పిటిషనరు కాని మరో అర్హత గల వ్యక్తి కాని ధృవీకరించాలి. విచారణ సమయంలో దాన్ని ఒక సాక్ష్యంగా భావించవచ్చు.

33. రహస్య విచారణ, మరియు దాన్ని ముద్రించడానికి, ప్రచురించడానికి లేదు :

1. ఈ చట్టం కింద ప్రతివిచారణ రహస్యంగా జరగాలి. ఇందుకు సంబంధించిన ఏ అంశాన్నయినా ఏ వ్యక్తి ముద్రించడం, లేదా ప్రచురించడం చట్టవిరుద్ధం. అయితే హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ముందస్తు అనుమతి తీసుకుని ఆ కోర్టులు జారీ చేసే తీర్పులను ముద్రించవచ్చు లేదా ప్రచురించవచ్చు.

2. సబ్‌సెక్షన్ (1) ని ఉల్లంఘించిన ఏ వ్యక్తయినా ఈ అంశాలను ముద్రించినా లేదా ప్రచురించినా ఆ వ్యక్తికి వెయ్యి రూపాయిల వరకు జరిమానా విధించవచ్చు.

34. డిక్రీలు జారీ చేయడంలో కోర్టుల బాధ్యత :

1. ఐదవ లేదా ఆరవ అంకం కింద జరిగిన విచారణలో, ఆయా పార్టీలు తమని తాము సమర్థించుకుంటూ వాదించుకున్నా, వాదించుకోకపోయినా కోర్టు కనుక ఈ విషయాల్లో సంతృప్తి చెందితే–

ఎ) పరిష్కారం మంజూరు చేసే కారణాల్లో ఏదొకటి ఉన్నది; మరియు

బి) సెక్షన్ 27 సబ్‌సెక్షన్ (1) క్లాజు (ఎ) కింద కారణాలను చూపుతూ దాఖలైన పిటిషనులో పిటిషనరు ఫిర్యాదు చేస్తున్న చర్య, లేదా చర్యలు జరగడానికి ఏ విధంగానైనా తానే దోహదపడలేదు లేదా లాలూచీ పడలేదు, లేదా మాఫీ చేయలేదు. పిటిషనులో పేర్కొన్న కారణం క్రూరత్వమైతే ఆ క్రూరత్వాన్ని పిటిషనరు ఏ విధంగానూ మాఫీ చేయలేదు; మరియు

సి) పరస్పర అంగీకారం కారణంగా తీసుకున్నప్పుడు ఆ అంగీకారం పొందడానికి బలప్రయోగం, మోసం లేదా అవసరానికి మించిన ప్రభావం చూపడం జరగలేదు; మరియు

డి) పిటిషను ప్రతివాదితో కుమ్మక్కయి దాఖలు చేసింది లేదా విచారణ కొనసాగించింది కాదు; మరియు

ఇ) కేసు దాఖలు చేయడంలో అనవసరమైన లేదా తగని జాప్యం జరగలేదు; మరియు

యఫ్) పరిష్కారం మంజూరు చేయడానికి మరే ఇతర చట్టపరమైన అవరోధం లేనప్పుడు, అటువంటి సందర్భాల్లో మాత్రమే కోర్టు తగిన విధంగా అటువంటి పరిష్కార డిక్రీ మంజూరు చేస్తుంది.

2. ఈ చట్టం కింద పరిష్కారం మంజూరు చేసే ముందు, మొదట దఫా విచారణ జరిపిన కోర్టు కేసు స్వభావం, పరిస్థితులకు అనుగుణంగా సాధ్యమైన చోటల్లా ఇరుపక్షాల మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నం చేసి తీరాలి. అది కోర్టు బాధ్యత.

అయితే సెక్షన్ 27 సబ్‌సెక్షన్ (1) క్లాజు (సి), క్లాజు (ఇ), క్లాజు (ఎఫ్), క్లాజు (జి) మరియు క్లాజ్ (హెచ్) కింద పేర్కొన్న కారణాలను చూపుతూ కోరే పరిష్కారాల విషయంలో ఈ సబ్‌సెక్షన్‌లోని అంశాలు వర్తించవు.

3. అటువంటి రాజీ కుదర్చడానికి కోర్టుకి సహకారం కావాల్సి వస్తే, ఇరుపక్షాలు కోరుకుంటే, లేదా కోర్టు న్యాయసమ్మతం, తగినదని భావిస్తే, పదిహేను రోజులు మించకుండా కేసుని తగిన కాలంపాటు వాయిదా వేసి, ఇరుపక్షాల వారు కోరుకున్న వ్యక్తి వద్దకు ఈ విషయాన్ని పంపించవచ్చు, లేదా అటువంటి వ్యక్తి పేరు చెప్పలేని స్థితిలో వాదప్రతి వాదులు ఉంటే కోర్టే నియమించిన వ్యక్తి వద్దకు పంపించవచ్చు. అలా పంపేటప్పుడు రాజీ చేయడానికి అవకాశాలు ఉన్నాయా, లేదా రాజీ కుదిరిందా అనే విషయాన్ని వారు కోర్టుకి తెలియజేయాలని కోర్టు ఆదేశాలు కూడా జారీ చేయవచ్చు. కేసులో తుది తీర్పు ఇచ్చేటప్పుడు ఈ నివేదికకు కోర్టు తగిన గుర్తింపును ఇస్తుంది.

4. విడాకుల డిక్రీ మంజూరై వివాహం రద్దయిన ప్రతి కేసులో కోర్టు ఇరుపక్షాల వారికి ఉచితంగా డిక్రీ ప్రతులు ఇవ్వాలి.

35. విడాకులు, ఇతర కేసుల్లో ప్రతివాదులు కోరే పరిష్కారం :

విడాకులు,న్యాయపరమైన వేర్పాటు లేదా సహజీవన హక్కుల పునరుద్ధరణ కోరుతూ దాఖలైన కేసుల్లో ప్రతివాదులు బహు భార్యత్వం / బహు భర్తృత్వం, క్రూరత్వం లేదా వదిలేయడం వంటి పిటిషనరు చేసే ఆరోపణలను వ్యతిరేకించడమే కాదు ఈ చట్టంలోని ఏ కారణం కిందైనా పరిష్కారం కోరుతూ కౌంటర్ క్లెయిమ్ చేయవచ్చు. పిటిషనరు బహు భార్యత్వం / బహుభర్తృత్వం, క్రూరత్వం, లేదా వదిలేయడం వంటి చర్యలకు పాల్పడినట్లు రుజువైతే ప్రతివాది కనుక ఈ చట్టం కింద పేర్కొన్న కారణాలను చూపుతూ ఏదైనా పరిష్కారం కోరుతూ పిటిషను దాఖలు చేసుంటే ఏవిధమైన పరిష్కారం చేసేవారో ఆ విధంగా చేయొచ్చు.

36. విచారణ కాలంలో కోర్టు ఖర్చుల నిమిత్తం :

ఐదవ లేదా ఆరవ అంకం కింద జరుగుతున్న కేసులో భార్యకి తనని తాను పోషించుకోవడానికి, కోర్టు ఖర్చులు భరాయించడానికి స్వతంత్రమైన ఆదాయం లేదని జిల్లా కోర్టు భావిస్తే, భార్య అర్జీ పెట్టుకుంటే భర్త ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకుని తగినంత రుసుమును కోర్టు ఖర్చుల నిమిత్తం భర్త వారం వారం కాని, నెలవారీ కాని ఆమెకు చెల్లించాలనే ఉత్తర్వు జారీ చేయవచ్చు.

అయితే ఐదవ లేదా ఆరవ అంకం కింద ఖర్చుల నిమిత్తం వారం లేదా నెలవారీగా రుసుము చెల్లించాలని దాఖలైన అర్జీ విషయంలో వీలైనంత వరకు భర్తకి నోటీసు అందిన అరవై రోజులల్లోపు తేల్చేసి నిర్ణయం తీసుకోవాలి.

37. శాశ్వత మనోవర్తి :

1. ఐదవ లేదా ఆరవ అంకం కింద అధికారమున్న ఏ కోర్టయినా డిక్రీ ఇచ్చేటప్పుడు కాని, తర్వాత కాలంలో కాని ఇందుకోసం అర్జీ పెట్టుకుంటే భార్య పోషణార్థం ఆమెకు అవసరమైతే భర్త స్థిరాస్తులను చార్జ్ రూపంలో రుసుము రాబట్టే ఏర్పాటు చేస్తూ లేదా ఆమె జీవితకాలం మించకుండా నెలవారిగా కాని కాలానుగుణ కిస్తీలవారిగా భర్త రుసుము చెల్లించాలంటూ భార్యకున్న ఆస్తులు, భర్తకేమైనా ఆస్తులు ఉంటే అవి, అతని స్థితిగతులు, ఇరుపక్షాల వ్యవహారశైలి, కేసులోని ఇతర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కోర్టుకి న్యాయ సమ్మతమనిపించిన విధంగా ఆదేశాలు జారీ చేయవచ్చు.

2. సబ్‌సెక్షన్ (1) కింద ఆదేశాలు జారీ చేసిన తర్వాత ఎప్పుడైనా వాద ప్రతివాదుల ఎవరి విషయంలోనైనా పరిస్థితుల్లో మార్పు వచ్చిందని వారిలో ఎవరైనా ఆ విషయం కోర్టు దృష్టికి తీసుకుని వెళ్తే కోర్టు ఆ విషయమై సంతృప్తి చెంది అటువంటి ఆదేశాన్ని తనకు సరైనదనిపించే విధంగా మార్చవచ్చు, సవరించవచ్చు లేదా వెనక్కి తీసుకోవచ్చు.

3. ఈ సెక్షన్ కింద అనుకూల ఆదేశాలు పొందిన భార్య పునర్ వివాహం చేసుకుందనో, లేదా ఆమె నడవడి బాలేదని భర్త కోర్టు దృష్టికి తీసుకుని వెళ్తే జిల్లా కోర్టు తనకు న్యాయ సమ్మతమనిపించిన విధంగా ఉత్తర్వును మార్చవచ్చు, సవరించవచ్చు లేదా వెనక్కి తీసుకోవచ్చు.

38. పిల్లల కస్టడీ :

ఐదవ లేదా ఆరవ అంకం కింద జరిగే ఏ కేసులోనైనా జిల్లా కోర్టు మైనరు బాలబాలికల అభిష్టానుసారం వారి కస్టడీ, పోషణ, విద్యాభ్యాసం గురించి తగిన న్యాయం చేకూర్చేందుకు గాను ఎప్పటికప్పుడు మధ్యంతర ఉత్తర్వులు జారీచేయవచ్చు. డిక్రీ జారీ అయిన తర్వాత అటువంటి పిల్లల కస్టడీ, పోషణ, విద్యాభ్యాసం నిమిత్తం పిటిషను ద్వారా అర్జీ పెట్టుకుంటే డిక్రీ పెండింగ్‌లో ఉండగా ఏ విధంగా డిక్రీ ద్వారా కాని మధ్యంతర ఉత్తర్వుల ద్వారా కాని ఏర్పాటు చేసుండేదో ఆ రకంగానే చేయొచ్చు. కోర్టు ఎప్పటికప్పుడు గతంలో ఇచ్చిన ఆదేశాలను చేసిన ఏర్పాట్లను వెనక్కి తీసుకోవచ్చు, సస్పెండ్ చేయొచ్చు లేదా మార్చవచ్చు.

అయితే ఐదవ లేదా ఆరవ అంకం కింద జరిగే కేసుల్లో మైనర్ బాలబాలికల పోషణ, విద్యాభ్యాసానికి సంబంధించి పెట్టుకున్న అర్జీ డిక్రీ రాకముందు పెండింగ్‌లో ఉంటే దానిపై వీలైనంత వరకు ప్రతివాదికి నోటీసు అందిన అరవై రోజులలోపు తుది నిర్ణయం తీసుకోవాలి.

39. డిక్రీలు, ఉత్తర్వులపై అప్పీళ్లు :

1. ఐదవ లేదా ఆరవ అంకం కింద విచారణ జరిగిన కేసుల్లో కోర్టు సబ్‌సెక్షన్ (3) కి లోబడి డిక్రీలు జారీ చేస్తే వాటిని ఒరిజినల్ సివిల్ జ్యూరిస్‌డిక్షన్‌ని ఉపయోగించుకున్న అప్పీలు చేయగల కోర్టు డిక్రీలుగా భావించాల్సి వుంటుంది. అటువంటి అప్పీల్ సాధారణంగా ఒరిజినల్ సివిల్ జ్యూరిస్‌డిక్షన్‌ని ఉపయోగించు కున్న కోర్టు తీర్పులపై అప్పీల్ ఏ కోర్టులో దాఖలు చేయాలో అందులో దాఖలు చేయాల్సి ఉంటుంది.

2. ఈ చట్టం కింద విచారణ జరుగుతున్న కేసుల్లో సెక్షన్ 37 లేదా సెక్షన్ 38 కింద ఉత్తర్వులు జారీ చేసుంటే సబ్‌సెక్షన్ (3) లోబడి అవి మధ్యంతర ఉత్తర్వులు కాని ఎడల వాటిపై అప్పీలు చేసుకోవచ్చు. ఆ కోర్టు ఒరిజినల్ సివిల్ జ్యూరిస్‌డిక్షన్ కింద కోర్టు తీసుకున్న తుది నిర్ణయంపై అప్పీలు ఏ కోర్టుకి వెళ్తుందో ఈ విషయంలో కూడా అప్పీల్ ఆ కోర్టుకే వెళ్తుంది.

3. ఈ సెక్షన్ కింద ఖర్చులకు సంబంధించిన అంశాలపై అప్పీల్ ఉండదు.

4. ఈ సెక్షన్ కింద ప్రతి అప్పీల్‌ని డిక్రీ లేదా ఉత్తర్వు జారీ చేసిన 90 రోజులలోపు దాఖలు చేయాలి.

39ఎ. డిక్రీలు, ఉత్తర్వుల అమలు :

ఐదవ లేదా ఆరవ అంకం కింద జరిగే విచారణలో కోర్టు జారీ చేసిన డిక్రీలను, ఉత్తర్వులను ఆ కోర్టు తన ఒరిజినల్ సివిల్ జ్యూరిస్‌డిక్షన్ పరిధిలో జారీ చేసిన డిక్రీలను, ఉత్తర్వులను ఏ విధంగా అమలు చేస్తుందో ఆ రకంగా చేయాల్సి ఉంటుంది.

40. 1908 లోని 5వ చట్టం వర్తింపు :

ఈ చట్టంలోని అంశాలకు, హైకోర్టు ఈ విషయంలో రూపొందించిన నియమాలకు లోబడి ఈ చట్టం కింద జరిగే అన్ని రకాల విచారణల్లో వీలైనంత మేరకు సివిల్ ప్రొసీజర్ కోడ్ 1908 (1908 లోని 5వ చట్టం) వర్తిస్తుంది.

40ఎ. కొన్ని సందర్భాల్లో పిటిషన్లను మరో కోర్టుకి బదిలీ చేసే అధికారం:

1. ఎప్పుడైతే

   ఎ) ఈ చట్టం కింద సెక్షన్ 23 కింద న్యాయపరమైన వేర్పాటు డిక్రీ కోసం లేదా సెక్షన్ 27 కింద విడాకుల డిక్రీ కోరుతూ వివాహంలోని ఒక పక్షం పరిధి గల జిల్లా కోర్టులో పిటిషను దాఖలు చేసుంటే; మరియు

   బి) ఈ చట్టం కింద సెక్షన్ 23 కింద న్యాయపరమైన వేర్పాటు డిక్రీ లేదా సెక్షన్ 27 కింద విడాకుల డిక్రీ కోరుతూ వివాహంలో అవతలి పక్షం వారు అదే జిల్లా కోర్టులో కాని అదే రాష్ట్రంలోని, లేదా మరో రాష్ట్రంలోని జిల్లా కోర్టులో మరో పిటిషను దాఖలు చేసుంటే

ఆ పిటిషన్ల విషయంలో సబ్‌సెక్షన్ (2) లో పేర్కొన్న విధంగా చర్యలు తీసుకోవాల్సి వుంటుంది.

2. సబ్‌సెక్షన్ (1) వర్తించే కేసుల్లో –

   ఎ) పిటిషన్లు ఒకే జిల్లా కోర్టులో దాఖలై ఉంటే రెంటినీ కలిపి విచారించాల్సి ఉంటుంది.

   బి) పిటిషన్లు భిన్నమైన జిల్లా కోర్టులో దాఖలై ఉంటే తర్వాత దాఖలైన పిటిషన్ని ఆ జిల్లా కోర్టు నుండి మొదటి పిటిషను దాఖలైన జిల్లా కోర్టుకి బదిలి చేసి, ఆ రెండు పిటిషన్లను మొదటి పిటిషను దాఖలైన జిల్లా కోర్టు కలిపి విచారించి తీర్పు చెప్పాల్సి ఉంటుంది.

3. సబ్‌సెక్షన్ (2) లోని క్లాజు (బి) వర్తించే కేసుల్లో మొదటి పిటిషను దాఖలైన జిల్లా కోర్టుకి ఒక దావా లేదా కేసుని పిటిషను తర్వాత దాఖలైన జిల్లా కోర్టు నుండి బదిలీ చేసేటప్పుడు పరిస్థితులను బట్టి సివిల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం అర్హత్తున్న కోర్టు కాని ప్రభుత్వం కాని కోడ్ కిందున్న అధికారాలను ఉపయోగించవచ్చు.

40బి. ఈ చట్టం కింద విచారణ జరిపి పిటిషన్లపై తుది తీర్పు చెప్పే విషయంలో అనుసరించే ప్రత్యేక విధానం:

1. ఈ చట్టం కింద విచారణ జరిపేటప్పుడు సాధ్యమైనంత మేరకు న్యాయ ప్రయోజనాలు దెబ్బ తినకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటూ కేసు విచారణ పూర్తయ్యే వరకు వాయిదాలు ఒక రోజు తర్వాత మరో రోజు వేయాలి. మర్నాడు కాకుండా మరో రోజు విచారణను వాయిదా వేస్తే ఏ కారణం చేత ఆరకంగా వాయిదా వేయాల్సి వచ్చిందో రికార్డు చేయాలి.

2. ఈ చట్టం కింద దాఖలైన పిటిషన్ని వీలైనంత త్వరగా విచారించాలి. పిటిషన్లోని ప్రతివాదికి నోటీసు అందిన ఆరు నెలల్లోపు వీలైనంత వరకు విచారణ పూర్తి చేసెయ్యాలి.

3. ఈ చట్టం కింద దాఖలైన అప్పీల్ని వీలైనంత త్వరగా వినాలి. అప్పీల్లోని ప్రతివారికి నోటీసు అందిన మూడు నెలల్లోపు వీలైనంత వరకు అది పూర్తి చేసేయాలి.

40సి. డాక్యుమెంటరీ సాక్ష్యం :

ఇతర చట్టాల్లో అందుకు విరుద్ధంగా ఏమి ఉన్నప్పటికీ ఈ చట్టం కింద ఒక డాక్యుమెంటుకి సరైన విధంగా స్టాంపు చెల్లించలేదనో, రిజిస్టరు చెయ్యలేదనే కారణం చూపి ఆ డాక్యుమెంటుని సాక్ష్యంగా ప్రవేశపెట్టడానికి వీల్లేదనడానికి లేదు.

41. విధానాలను నియంత్రించే నియమాలు రూపొందించేందుకు హైకోర్టుకి అధికారం :

1. ఐదు, ఆరు, ఏడవ అంకాల్లోని అంశాలను అమలు చేసేందుకు వీలుగా ఈ చట్టానికి, సివిల్ ప్రొసీజర్ కోడ్, 1908 కు లోబడి హైకోర్టు అధికార గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తగిన నియమాలు రూపొందించవచ్చు.

2. ముందు పేర్కొన్న అంశాల సాధారణ రూపానికి భంగం కలగకుండా ఇందుకై ప్రత్యేకంగా కొన్ని నియమాలు చేయాలి.

   ఎ) బహుభార్యత్వం / బహుభర్తృత్వం కారణం కింద నమోదైన విడాకుల పిటిషనులో భార్య / భర్తతో లైంగిక సంబంధం ఏర్పర్చుకున్న అవతలి వ్యక్తిని పిటిషనరు సహ ప్రతివాదిగా చేర్చడం, మరియు పిటిషనరు అలా చేయనవసరం లేని సందర్భాలు;

   బి) సహ ప్రతివాదులపై నష్టపరిహారం విధించడం;

   సి) ఐదవ లేదా ఆరవ అంకం కింద జరిగే విచారణలో అప్పటికే వాద ప్రతివాదులుగా చేరని వ్యక్తులు జోక్యం చేసుకోవడం;

   డి) చెల్లని వివాహం; విడాకుల పిటిషన్లు రాయాల్సిన విధానం, అందులో ఉండాల్సిన అంశాలు, మరియు పిటిషను దాఖలు చేసిన వారు చెల్లించాల్సిన ఖర్చులు.

   ఇ) ఈ చట్టం కింద ఎటువంటి లేదా సరిపడ సదుపాయాలు కల్పించని అంశాలు, మరియు వాటి కోసం భారత విడాకుల చట్టం, 1869 (1869 లో 4వది) లో కల్పించిన సదుపాయాలు.

అంకం - VIII

42. పరిరక్షణ :

ఈ చట్టంలోని అంశాల కింద జరగని వివాహాల చెల్లుబాటుపై ఈ చట్టంలోని అంశాల ప్రభావం ఏ విధంగానూ ఉండదు; మరియు ఏ పద్ధతిలో జరిగిన వివాహం పైనైనా ఈ చట్టం ప్రభావం ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని పడదు.

43. వివాహమైన వారు ఈ చట్టం కింద మరో వివాహం చేసుకుంటే పడే శిక్ష:

మూడవ అంకంలో ఉన్న మాదిరిగా కాక, అప్పటికే వివాహమైన వ్యక్తి ఎవరైనా ఈ చట్టం కింద మరో వివాహం చేసుకుంటే అతను / ఆమె భారత శిక్షాస్మృతి 1860 (1860 లోని 45వది) లోని సెక్షన్ 494 మరియు సెక్షన్ 495 కింద వివాహమై ఉండి భార్య/ భర్త జీవితకాలంలో మరో వివాహం చేసుకున్న నేరానికి శిక్షార్హులవుతారు. అటువంటి వివాహం చెల్లదు.

44. బహు భార్యత్వం / బహు భర్తృత్వానికి పాల్పడిన వారికి శిక్ష :

ఈ చట్టం కింద వివాహం చేసుకున్నవారు తమ భార్య / భర్త జీవితకాలంలో మరో వివాహం చేసుకుంటే వారు భారత శిక్షాస్మృతి, 1860 (1860 లోని 45వది) లోని సెక్షన్ 494 మరియు 495 కింద వివాహమై ఉండి మరో భార్య / భర్త జీవితకాలంలో వివాహం చేసుకున్న నేరానికి శిక్షార్హులవుతారు. అటువంటి వివాహం చెల్లదు.

45. అబద్ధపు ప్రకటన లేదా సర్టిఫికెట్‌పై సంతకం చేసినందుకు శిక్ష :

ఏ వ్యక్తయినా ఈ చట్టం కింద తనకు తెలిసుండి లేదా అబద్ధమని నమ్మి, లేదా నిజం కాదని నమ్మి అబద్ధపు అంశాలతో కూడిన ప్రకటనను లేదా సర్టిఫికెట్‌ను రూపొందించి లేదా దానిపై సంతకం చేసి లేదా సాక్షి సంతకం చేస్తే ఆ వ్యక్తి భారత శిక్షా స్మృతి సెక్షన్ 199 కింద శిక్షార్హులవుతారు.

46. వివాహ అధికారి తప్పుడు చర్యపై శిక్ష :

ఈ చట్టం కింద వివాహ అధికారి తనకు తెలిసి, కావాలని ఈ విధంగా వివాహం జరిపితే –

1. సెక్షన్ 5 కింద చేయాల్సిన విధంగా వివాహానికి సంబంధించిన నోటీసుని ప్రచురించకపోతే; లేదా
2. వివాహానికి సంబంధించిన నోటీసుని ప్రచురించిన ముప్ఫయి రోజుల్లోపు వివాహం చేస్తే; లేదా
3. ఈ చట్టం కింద మరే ఇతర అంశాలనైనా ఉల్లంఘించి ఉంటే

ఏడాది పాటు సాధారణ కారాగార శిక్ష లేదా ఐదువందల వరకు జరిమానా లేదా రెంటికి శిక్షార్హులవుతారు.

47. వివాహ సర్టిఫికెట్ పుస్తకం తనిఖీకి అవకాశం :

1. ఈ చట్టం కింద ఏర్పాటు చేయాల్సిన వివాహ సర్టిఫికెట్ పుస్తకం సబబైన అన్ని వేళల్లో తనిఖీ చేయటానికి వీలుగా అందుబాటులో ఉంచాలి. అందులోని అంశాలను సాక్ష్యంగా స్వీకరించవచ్చు.

48. వివాహ రికార్డుల్లో భర్తీల ప్రతులను పంపడం :

వివాహ సర్టిఫికెట్ పుస్తకంలోని భర్తీల ప్రతులను రాష్ట్రంలోని వివాహ అధికార్లు అందరూ రాష్ట్ర జనన, మరణాలు, వివాహాల రిజిస్ట్రార్ జనరల్‌కు ఎప్పటికప్పుడు సూచించిన కాలానుగుణంగా, సూచించిన పద్ధతి అనుసారం అంతకు ముందుసారి పంపని వాటిని పంపుతూ ఉండాలి. ఈ చట్టం వర్తించే ఇతర ప్రాంతాల్లోని వివాహ అధికార్లు ఈ భర్తీల ప్రతులను కేంద్ర ప్రభుత్వం ఇందుకై పేర్కొన్న అధికారికి పంపుతూ ఉండాలి.

49. తప్పుల సవరణ :

1. వివాహ సర్టిఫికెట్ పుస్తకంలో భర్తీ చేసిన పద్ధతిలో కాని దాని లోపల అంశాల్లో కాని తప్పు దొర్లినట్లు వివాహ అధికారికి తెలిస్తే, ఆ తప్పు తెలుసుకున్న నెల రోజుల్లోపు వివాహం చేసుకున్న వారి సమక్షంలో లేదా వారు మరణించినా లేక గైర్హాజరైనా ఇద్దరు గౌరవమర్యాదలు గల సాక్షుల సమక్షంలో చేసిన దాని పక్కన అంచున తప్పుని సరిదిద్దాలి. అసలు భర్తీని మార్చకూడదు. అంచున సరిదిద్దిన దగ్గర సంతకం చేసిన, సరిదిద్దిన తేదీని రాయాలి. సర్టిఫికెట్‌లో కూడా వివాహ అధికారి అంచున సరిదిద్దుతూ రాయాలి.

2. ఈ సెక్షన్ కింద ఏ సాక్షుల సమక్షంలోనైతే సరిదిద్దుతారో సరిదిద్దిన దగ్గర వారి చేత సంతకాలు పెట్టించాలి.

3. సెక్షన్ 48 కింద వివాహ అధికారి రిజిస్ట్రారు జనరల్‌కి ఆ వివాహం వివరాల ప్రతిని అప్పటికే పంపించేసి ఉంటే తప్పులున్న వివరాలు గల సర్టిఫికెట్‌పై అంచున సరిదిద్దిన అంశాలు రాసి పంపాలి.

50. నియమాలు చేసే అధికారం :

1. ఈ చట్టం లక్ష్యసాధన కోసం కేంద్ర ప్రభుత్వ అధికార్ల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ఇతర అన్ని సందర్భాల్లో రాష్ట్ర ప్రభుత్వం అధికార గెజిట్‌లో నోటిఫికేషన్ ద్వారా నియమాలు రూపొందించవచ్చు.

2. పైన పేర్కొన్న అధికారాల సాధారణ రూపానికి భంగం కలగకుండా అంశాలన్నింటి కోసం లేదా కొన్ని కోసం ప్రత్యేకించి ఈ నియమాలు రూపొందించవచ్చు.

   ఎ) వివాహ అధికార్ల బాధ్యతలు అధికారాలు. వారు తమ విధులు నిర్వర్తించాల్సిన ప్రాంతం;

   బి) ఈ చట్టం కింద వివాహ అధికార్లు విచారణ నిర్వహించే పద్ధతి, మరియు విధానం;

   సి) ఈ చట్టం ప్రకారం లేక దాని కింద ఏ పుస్తకాన్నయినా చూసుకోవాల్సిన తీరు, విధానం;

   డి) ఈ చట్టం కింద వివాహ అధికారికి అప్పగించిన విధులు నిర్వర్తించడానికి వసూలు చేయగల రుసుము.

   ఇ) సెక్షన్ 16 కింద బహిరంగ నోటీసు ఇవ్వాల్సిన విధానం;

   యఫ్) సెక్షన్ 48 ప్రకారం వివాహ సర్టిఫికెట్ పుస్తకంలోని భర్తీల ప్రతులను పంపించాల్సిన పద్ధతి, పంపించాల్సిన కాలం.

   జి) సూచించాల్సిన అవసరమున్న ఇతర అంశాలు.

3. ఈ చట్టం కింద కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నియమాలను వీలైనంత వరకు ముప్ఫయి రోజుల పాటు సమావేశాలు జరుగుతున్నపుడు ప్రతి పార్లమెంటు సభలో ప్రవేశపెట్టాలి, లేదా రెండు లేదా మరిన్ని సమావేశాల్లో ప్రవేశపెట్టాలి. సమావేశం, లేదా ఆ తదుపరి సమావేశాలు, ముగిసే లోపు ఈ నియమాన్ని సవరించాలని రెండు సభలు అంగీకరిస్తే లేదా ఆ నియమం చేయరాదని రెండు సభలు అంగీకారానికి వస్తే ఆ నియమం పరిస్థితిని బట్టి సవరించిన విధంగా అమల్లోకి వస్తుంది లేదా అసలు పనిచేయకుండా పోతుంది. అయితే ఈ విధమైన సవరణ లేదా చెల్లుబాటుకానితనం ప్రభావం ఈ నియమం కింద అంతకు మునుపు తీసుకున్న చర్యలపై పడదు.

4. ఈ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతి నియమాన్ని వీలైనంత త్వరలో రాష్ట్ర శాసనసభ ముందు ప్రవేశపెట్టాలి.

51. రీపీల్స్, మరియు పరిరక్షణ :

1. ఈ చట్టం అమల్లోకి రాకముందు అమల్లో ఉన్న ప్రత్యేక వివాహ చట్టం, 1872 (1872 లోని 3వది), మరియు పార్ట్ బి రాష్ట్రంలో ప్రత్యేక వివాహ చట్టం, 1872 (1872 లోని 3వది) వంటి మరే చట్టమైనా అమల్లో ఉంటే ఆ చట్టం రీపీల్ చేయబడ్డాయి.

2. ఈ విధంగా రీపీల్ చేసినప్పటికీ :

ఎ) ప్రత్యేక వివాహ చట్టం, 1872 (1872 లోని 3వది) లేదా అటువంటి మరో చట్టం కింద జరిగిన వివాహాలన్నింటిని ఈ చట్టం కింద వివాహాలుగా పరిగణించాల్సి ఉంటుంది.

బి) ఈ చట్టం అమల్లోకి వచ్చిన కాలంలో వివాహాలకు సంబంధించిన వివాదాల విషయంలో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న దావాలు, కేసులను ఈ చట్టం కింద నమోదు చేసినట్లుగా భావించి విచారిస్తారు. నిర్ణయిస్తారు.

3. అటువంటి ఇతర సమాంతర చట్టాన్ని శాసనంగా భావించి అటువంటి చట్టం రీపీల్ కావడానికి వర్తించే జనరల్ క్లాజుల చట్టం, 1897 (1897 లోని 10వది) లోని సెక్షన్ 6 లోని అంశాలకు సబ్‌సెక్షన్ (2) లోని అంశాలు భంగకరం కాదు.

*****

19. వరకట్న నిర్మూలన చట్టం 1961

(20 మే, 1961)

వరకట్నం తీసుకోవటం లేదా ఇవ్వటాన్ని నిర్మూలించే చట్టం

1. సంగ్రహ నామం, పరిధి, అమలులోకి వచ్చే సమయం :

ఈ చట్టం పేరు

1. ఈ చట్టాన్ని వరకట్న నిర్మూలన చట్టం, 1961 అనవచ్చు.
2. జమ్మూ-కాశ్మీర్ మినహా భారతదేశం యావత్తు ఈ చట్టం వర్తిస్తుంది.
3. కేంద్ర ప్రభుత్వం నిర్ణయానుసారంగా రాజపత్రంలో ప్రకటించిన తేదీ నుంచి ఈ చట్టం అమలులోకి వస్తుంది.

2. 'వరకట్నం' యొక్క నిర్వచనం : ఈ చట్టం ప్రకారం "వరకట్నం" అనగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఇచ్చిన లేదా ఇచ్చేందుకు అంగీకరించబడిన ఆస్తి లేదా హామీ విలువ.

a) వివాహ బంధంలో ఒక పక్షంవారు మరొక పక్షంవారికి లేదా

b) వివాహ బంధంలో రెండు పక్షాలలో ఏదో ఒక పక్షం తాలూకా తల్లిదండ్రులు లేదా ఆ పక్షాలకు చెందిన ఎవరో ఒక వ్యక్తి ఇతర పక్షానికి లేదా వేరొక వ్యక్తికి వివాహం జరుగుతున్న సందర్భంలో (కానీ లేదా వివాహానికి ముందుగా కానీ) (వివాహం చేసుకుంటున్న) ఇరుపక్షాలకు సంబంధించి ఇచ్చేది. కానీ ముస్లిం లా వర్తించబడే వ్యక్తులకు ఇచ్చే 'డవర్' కాని 'మెహర్' కానీ వరకట్నంగా ఈ చట్టంలో పరిగణించబడదు.

వివరణ : ఈ చట్టంలో "విలువ గల హామీ" అనే పదం భారతీయ శిక్షాస్మృతి లో సెక్షన్ 30 లో అర్థాన్ని కలిగి ఉంటుంది.

3. వరకట్నం ఇచ్చినందుకు లేదా తీసుకున్నందుకు విధించబడే శిక్ష :

1) ఈ చట్టం అమలులోకి వచ్చిన తరువాత, ఏ వ్యక్తియైనా వరకట్నం ఇచ్చినా లేదా తీసుకున్నా లేదా తీసుకునేందుకు గానీ ఇచ్చేందుకు కానీ ప్రయత్నించినా సదరు వ్యక్తి 5 సంవత్సరాలకు తక్కువ కాకుండా కారాగారం మరియు 15,000 రూపాయలకు తక్కువ కాకుండా ధనము లేదా ఆ వరకట్నం విలువగల డబ్బు ఈ రెంటిలో ఏది ఎక్కువ యైతే అంత మొత్తం జరిమానాగా విధించబడుతుంది. అయితే కోర్టు కొన్ని ప్రత్యేక మరియు తగిన కారణాలు పేర్కొంటే 5 సంవత్సరాలకంటే తక్కువ కారాగార శిక్ష విధించవచ్చు.

2) పై సబ్‌సెక్షన్ ఈ క్రింది వాటికి, లేదా వాటికి సంబంధించిన వాటికి వర్తించదు.

a) వివాహ సమయంలో పెళ్ళికూతురికి (వధువు) కానుకలుగా ఇచ్చినవి (ఎటువంటి డిమాండ్ చేయకుండా ఇచ్చినవి)

b) వివాహ సమయంలో పెళ్ళికొడుకు (వరుడు మాత్రమే) కి కానుకలుగా ఇచ్చినవి (ఎటువంటి డిమాండ్ చేయకుండా ఇచ్చినవి మాత్రమే)

అయితే అలాంటి కానుకలు ఈ చట్టంలో చేయబడిన నియమాల కనుగుణంగా నిర్వహించే జాబితాలో నమోదు చేయబడి ఉండాలి. అంతేగాక వధువుకాని లేదా ఆమె తరపు వారుకానీ లేదా ఆమెకు సంబంధించిన ఏవ్యక్తియైనా పై చెప్పిన విధంగా ఇచ్చే కానుకలు, సాంప్రదాయ బద్ధంగా ఇచ్చేదై ఉండాలి మరియు వాటి విలువ వాడుకలో ఉన్న ఇచ్చేవారి లేదా తీసుకొనేవారి ఆర్థిక పరిస్థితికి మించినదై ఉండకూడదు.

4. వరకట్నం డిమాండు (దబాయించుట) చేసేవారికి శిక్ష :

ఏ వ్యక్తియైనా ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని, వరుడు / వధువు తల్లిదండ్రులు లేదా బంధువులు లేదా వారి సంరక్షకుల నుండి వరకట్నం డిమాండ్ చేస్తే, సదరు వ్యక్తికి 6 నెలలకు తక్కువ కాకుండా, రెండు సంవత్సరముల వరకు కారాగార శిక్ష మరియు రూ। 10,000 వరకు జరిమానా విధించబడుతుంది.

అయితే కోర్టు తగిన మరియు ప్రత్యేక కారణాలు తీర్పులో పేర్కొంటూ 6 నెలలకు తక్కువ కారాగార శిక్ష విధించవచ్చు.

4A. ప్రకటన మీద నిషేధం :

ఏ వ్యక్తియైనా

a) దినపత్రికలో, వార పత్రికలలో లేదా ప్రకటన ద్వారా లేదా మరే మాధ్యమంలోనైనా తన కుమార్తె లేదా కుమారుడి వివాహానికి ప్రతిఫలంగా తన ఆస్తిలో వాటాని, లేదా డబ్బుని, లేదా రెంటిని ఏదైనా వ్యాపారంలో భాగం, లేదా ఇతర ప్రయోజనం ఇవ్వజూపినా,

b) పైన క్లాజ్ (a) లో పేర్కొన్న ప్రకటనని ముద్రించిన, లేదా ప్రచురించిన లేదా సర్క్యులేట్ చేసిన (ప్రచారం చేసినా) సదరు వ్యక్తికి 6 నెలలకు తక్కువ కాకుండా 5 సంవత్సరాల వరకు, కారాగార శిక్ష లేదా 15,000 రూ। వరకు రుసుము విధించటమవుతుంది.

అయితే కోర్టు తగిన మరియు ప్రత్యేక కారణాలు తీర్పులో పేర్కొంటూ, 6 నెలలకంటే తక్కువ కారాగార శిక్ష విధించవచ్చు.

5. వరకట్నం తీసుకొనుటకు మరియు ఇచ్చుటకు చేసుకొనే ఒప్పందం చెల్లదు:

వరకట్నం తీసుకునేందుకు లేదా ఇచ్చేందుకు చేసుకొన్న ఏ ఒప్పందంయైనా చెల్లదు.

6. భార్య లేదా ఆమె వారసుల ప్రయోజనానికి తీసుకొనే వరకట్నం :

1) ఏ స్త్రీ వివాహానికి సంబంధించైతే వరకట్నం తీసుకోబడుతుందో, ఆమెకాక వేరొక వ్యక్తి ఆ వరకట్నం తీసుకొన్నట్లైతే ఆ వ్యక్తి ఈ స్త్రీకి క్రింద పేర్కొన్న వ్యవధిలో వరకట్నాన్ని బదిలీ చేయాలి.

   a) ఒకవేళ వరకట్నం వివాహానికి ముందు తీసుకొన్నట్లైతే, వివాహ తేదీ నుండి మూడు నెలల్లోపు లేదా

   b) వరకట్నం వివాహ సందర్భంలో కానీ లేదా వివాహానంతరం కానీ తీసుకొన్నట్లైతే, అలా తీసుకొన్న తేదీ నుండి మూడు నెలల్లోపు

   c) సదరు స్త్రీ మైనర్ బాలికగా ఉన్నప్పుడు కట్నం తీసుకున్నట్లైతే, ఆమెకు 18 సంవత్సరాలు నిండిన తేదీ నుండి మూడు నెలల్లోపు మరియు వరకట్న బదిలీ గనుక పెండింగ్‌లో ఉంటే, ఆ స్త్రీ ప్రయోజనం కొరకు ధర్మకర్త వద్ద ఉంచబడుతుంది.

2) ఏ వ్యక్తియైనా పైన సబ్ సెక్షన్ (1) లో పేర్కొన్న కాలపరిమితిలోపు ఆస్తిని బదిలీ చేయలేకపోతే, సదరు వ్యక్తికి 6 నెలలకు తక్కువ కాకుండా కానీ రెండేళ్ళ వరకు కానీ కారాగార శిక్ష లేదా అపరాధ రుసుము (5,000 రూ॥ తక్కువ కాకుండా 10,000 రూ॥ వరకు) లేదా రెండూ (అపరాధ రుసుము మరియు కారాగార శిక్ష) విధించటమౌతుంది.

3) ఒకవేళ ఆస్తికి హక్కుదారుయైన స్త్రీ స్వీకరించటానికి ముందే మరణించినట్లైతే, ఆమె వారసులు హక్కుదారులు అవుతారు. తాత్కాలికంగా ఆమె ఆస్తిని పర్యవేక్షిస్తున్న వ్యక్తినుండి వారు ఆ ఆస్తిని పొందవచ్చు.

అయితే సదరు స్త్రీ వివాహానంతరం 7 సం॥లోపు సాధారణ కారణాల వలన కాక అసాధారణ కారణాల వల్ల మరణిస్తే, ఆ ఆస్తి :

a) ఆమెకు సంతానం లేనట్లైతే, ఆమె తల్లిదండ్రులకు చెందుతుంది; లేదా

b) సంతానం ఉన్నట్లైతే, సదరు పిల్లలకు బదిలీ చేయాలి. మరియు బదిలీ గనుక పెండింగ్‌లో ఉంటే, సదరు సంతానం కొరకు ధర్మకర్త వద్ద ఉంచాలి.

3A) పైన సబ్ సెక్షన్ (1) లేదా సబ్ సెక్షన్ (3) ప్రకారం, సబ్ సెక్షన్ (2) క్రింద ఆస్తిని బదిలీ చేయని కారణంగా దోషిగా పరిగణించబడిన వ్యక్తి గనుక సబ్ సెక్షన్ (2) క్రింద దోషిగా పేర్కొనక ముందు ఆ ఆస్తిని హక్కుదారైన ఆ స్త్రీకి గాని లేదా హక్కుదారైన (ఆమె వారసులు, తల్లిదండ్రులు లేదా సంతానం) వారికి నిర్ణీత కాలవ్యవధిలోపు లేదా ఆర్డర్‌లో పేర్కొన్న కాలపరిమితిలోపు బదిలీ చేయనట్లైతే, ఆ ఆస్తి విలువ చేసే మొత్తం ఆ సదరు దోషి వద్ద వసూలు చేయటమౌతుంది. అతడు ఈ మొత్తాన్ని కోర్టు విధించిన అపరాధ రుసుముగా ఆ స్త్రీకి, లేదా ఆమె లేని పక్షంలో ఆమె వారసులు, తల్లిదండ్రులు, సంతానం ఎవరు హక్కుదారులైతే వారికి చెల్లించవచ్చు.

4. ఈ సెక్షన్‌లో పొందుపరచినదేది, సెక్షన్ 3, లేదా సెక్షన్ 4 కు వర్తించదు.

7. నేరాలపై విచారణ :

క్రిమినల్ ప్రక్రియ స్మృతి 1973 (2 of 1974) (code of criminal procedure) లో ఏమి ఉన్నప్పటికీ

a) మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ లేదా ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఈ చట్టం క్రింద నేరాన్ని విచారించాలి. అంతేగానీ పై రెండుకోర్టుల కంటే తక్కువ స్థాయి కోర్టులు నేరాన్ని విచారించకూడదు.

b) ఈ చట్టప్రకారం ఏ కోర్టుయైనా నేరవిచారణ జరపకూడదు. అయితే ఈ క్రింది పరిస్థితులలో విచారణ జరపవచ్చు.

i) ఆ కోర్టు తనంతట తాను ఈ నేరం గురించి తెలుసుకొన్న పక్షంలో లేదా జరిగిన ఘటనల మీద రాసిన పోలీసు రిపోర్టు గనుక నేరాన్ని సూచిస్తే; లేదా

ii) ఆ నేరం వలన నష్టపోయిన వ్యక్తి లేదా అతని తల్లిదండ్రులు గాని లేదా అతనికి సంబంధించిన వ్యక్తిగాని, లేదా ఏదైనా గుర్తించబడిన సంక్షేమ సంస్థ లేదా ఆర్గనైజేషన్ గాని ఫిర్యాదు నమోదు చేస్తే

c) మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ లేదా ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఈ చట్టం క్రింద దోషిగా నిర్ధారించబడిన వ్యక్తిని న్యాయబద్ధంగా శిక్షించాలి.

వివరణ : ఈ సబ్‌సెక్షన్ ఉద్దేశ్యం ప్రకారం గుర్తించబడిన "సంక్షేమ సంస్థ లేదా ఆర్గనైజేషన్" అంటే కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వంచే గుర్తించబడిన సామాజిక సంక్షేమ సంస్థ అని అర్థం.

2) నేరవిచారణ స్మృతి, 1973 (2 of 1974) (crpc) లోని అధ్యాయం XXXVI లో పొందుపరచినదేదీ ఈ చట్టం క్రింద శిక్షించబడే ఏ నేరానికీ వర్తించదు.

3) ప్రస్తుతం ఏ చట్టం అమలులో ఉన్నప్పటికీ, ఆ చట్టంలో ఉన్నదేదీ, ఆ నేరంచే బాధింపబడిన వ్యక్తి సదరు వ్యక్తిని ఈ చట్టంక్రింద అభియోగం నడపకూడదు.

8. కొన్ని ప్రత్యేక ఉద్దేశ్యాల కోసం విచారణ యోగ్యమైన మరియు జామీను ఇవ్వలేని, రాజీకి వీలుకాని నేరాలు :

1) నేరవిచారణ స్మృతి (crpc), 1973 (2 of 1974) ఈ చట్టం క్రింద నేరాలకు విచారణ యోగ్యమైన నేరాలుగా పరిగణించి ఈ క్రింది విధంగా వర్తిస్తుంది.

a) సదరు నేరాలను దర్యాప్తు చేసేందుకు మరియు

b) ఈ క్రింద పేర్కొన్న విషయాల కోసం కాక

i) సెక్షన్ 42, నేరవిచారణ స్మృతి (crpc) కి సంబంధించిన విషయాలు, మరియు

ii) మేజిస్ట్రేట్ ఆర్డర్ లేదా వారెంట్ లేకుండా ఏ వ్యక్తినైనా అరెస్టు చేస్తే

2) ఈ చట్టం క్రింద ప్రతి నేరం జామీను ఇవ్వలేనిది, మరియు రాజీ పడటానికి వీలుకానిది.

8A. కొన్ని కేసులలో రుజువు చేసే భారం :

సెక్షన్ 3 క్రింద ఏ వ్యక్తియైనా వరకట్నం తీసుకొన్నా లేదా తీసుకోవటానికి ప్రయత్నించినా లేదా సెక్షన్ 4 క్రింద వరకట్నం డిమాండ్ చేసినా, ఈ సెక్షన్ల క్రింద నేరం చేయలేదని రుజువు చేయాల్సిన బాధ్యత ఆ వ్యక్తిమీదే ఉంది.

8B. వరకట్న నిర్మూలన ఆఫీసర్లు :

1) రాష్ట్ర ప్రభుత్వం తనకు సమంజసం అనిపించేంత మంది వరకట్న నిర్మూలన ఆఫీసర్లను నియమించి, వారు ఏఏ ప్రాంతాలలో విచారణాధికారం మరియు ఇతర అధికారాలు కలిగి ఉంటారో నిర్దేశించవచ్చు.

2) ప్రతి వరకట్న నిర్మూలనాధికారి ఈ క్రింది అధికారాలను మరియు బాధ్యతలను కలిగిఉంటాడు.

a) ఈ చట్టంలోని అధికరణాలు పాటించబడే విధంగా చూడాలి.

b) వీలైనంత వరకు వరకట్నం తీసుకోకుండా, లేదా తీసుకొనే ప్రయత్నం చేయకుండా లేదా కట్నం డిమాండ్ చేయకుండా నివారించాలి.

c) ఈ చట్టం క్రింద నేరాలకు పాల్పడ్డవారిని ప్రాసిక్యూట్ చేయటానికి అవసరమైన సాక్ష్యాలను సేకరించాలి.

d) రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కాని లేదా ఈ చట్టంలో నిర్దేశించబడిన నియమాల ప్రకారంకాని ఏమైనా అదనపు కర్తవ్యాలు ఇచ్చినయెడల వాటిని కూడా పాటించాలి.

3) రాష్ట్ర ప్రభుత్వం, రాజపత్రంలో నోటిఫికేషన్ ద్వారా వరకట్న నిర్మూలనాధికారికి పోలీసు అధికారాలను ప్రదానం చేయవచ్చు. ఆ ఆఫీసరు ఈ చట్టంలోని నియమాల ద్వారా విధించబడిన పరిమితులు, ఆంక్షల కనుగుణంగా తన అధికారాలను వినియోగించాలి.

4) రాష్ట్ర ప్రభుత్వం ఈ వరకట్న నిర్మూలనాధికారులు ఈ చట్ట ప్రకారం తమ బాధ్యతలు నైపుణ్యంతో నెరవేర్చేందుకు, వారికి సలహాలు మరియు సహాయం అందించేందుకు గాను, ఒక సలహామండలిని నియమించవచ్చు. ఆ బోర్డులో ఐదుగురికి మించకుండా సాంఘిక సంక్షేమ కార్యకర్తలను (అందులో కనీసం ఇద్దరు స్త్రీలు ఉండాలి) ఆ సదరు వరకట్న నిర్మూలనాధికారి సబ్‌సెక్షన్ (1) క్రింద, తన అధికార పరిధిలో ఉన్న ప్రాంతం నుండి నియమించాలి.

9. నియమాలు చేసే అధికారం :

1) కేంద్ర ప్రభుత్వం, రాజ్యాధి పత్రంలో ప్రకటన ద్వారా ఈ చట్టం యొక్క ఉద్దేశ్యాలను నెరవేర్చేందుకు నియమాలను రూపొందించవచ్చు.

2) ప్రత్యేకంగా, మరియు ఇంతకుముందు ఇచ్చిన అధికారాలకు ఎటువంటి ప్రతికూల భావం లేకుండా సదరు నియమాలు ఈ క్రింది విషయాలను సమకూర్చాలి.

   a) ఏ రూపంలో మరియు పద్ధతిలో, మరియు ఏ వ్యక్తుల ద్వారా, సెక్షన్ 3 లోని సబ్‌సెక్షన్ (2) లో ప్రస్తావించిన కానుకలు యొక్క జాబితా మరియు వాటికి సంబంధించిన ఇతర విషయాలు మరియు

   b) ఈ చట్టం యొక్క నిర్వహణకు విధానాలు మరియు కార్యాచరణలను మెరుగ్గా సమన్వయ పరచాలి.

3) ఈ సెక్షన్ క్రింద చేయబడే ప్రతి నియమం వీలైనంత త్వరగా పార్లమెంటు ముందు ఉంచాలి. సదరు సభ మొత్తం 30 రోజులు వరకు సమావేశంలో ఉండాలి. ఈ 30 రోజులు ఒకే సమావేశంలో కాని లేదా రెండు లేదా అంతకంటే ఎక్కువ సమావేశాలలో క్రమానుసారంగా ఉండాలి.

10. రాష్ట్రప్రభుత్వం యొక్క నియమాలు చేసే అధికారం :

1) రాష్ట్ర ప్రభుత్వం, రాజ్యపత్రికలో ప్రకటన ద్వారా, ఈ చట్టం యొక్క ఉద్దేశ్యాలను నెరవేర్చేందుకు నియమాలను రూపొందించవచ్చు.

2) ప్రత్యేకంగా మరియు ఇంతకు ముందు ఇచ్చిన అధికారాలకు ఎటువంటి ప్రతికూలభావం లేకుండా, సదరు నియమాలు ఈ క్రింది విషయాలను సమకూర్చాలి.

   a) సెక్షన్ 8B లోని సబ్‌సెక్షన్ (2) క్రింద వరకట్న నిర్మూలనాధికారి నెరవేర్చవలసిన అదనపు బాధ్యతలు

   b) సెక్షన్ 8B లోని సబ్‌సెక్షన్ (3) ప్రకారం వరకట్న నిర్మూలనాధికారి తన బాధ్యతలు నెరవేర్చవలసిన పరిమితులు మరియు ఆంక్షలు.

3) రాష్ట్ర ప్రభుత్వం ఈ సెక్షన్ క్రింద రూపొందించే ప్రతి నియమం ఎంత వీలైతే అంత త్వరగా రాష్ట్ర శాసనమండలి ముందు ఉంచాలి.

*****

20. విడాకుల చట్టం 1869

(1869 లోని 4వది) (26 ఫిబ్రవరి, 1869)

విడాకులు, వైవాహిక వివాదాలకు సంబంధించిన చట్టాలను సవరించే చట్టమిది.

ఉపోద్ఘాతం : క్రైస్తవుల విడాకులకు సంబంధించి చట్టాన్ని సవరించడానికి, వైవాహిక వివాదాల పరిష్కారానికి కొన్ని రకాల కోర్టులకు అధికారాన్ని ఇవ్వడానికి ఈ విధంగా శాసించడమైనది.

I - ప్రాథమికాంశాలు

1) క్లుప్త శీర్షిక, చట్టం అమల్లోకి వచ్చేకాలం :

ఈ చట్టాన్ని విడాకుల చట్టం అని పిలవాలి. ఇది ఏప్రిల్ 1వ తేదీ, 1869 తేదీన అమల్లోకి వస్తుంది.

2) ఈ చట్టం విస్తృతి : ఈ చట్టం జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రం మినహాయించి భారత భూభాగమంతటా వర్తిస్తుంది.

2ఎ) సాధారణంగా పరిష్కారం మంజూరుచేసే అధికారానికి సంబంధించిన పరిధి :

గతంలో ఏమున్నప్పటికీ ఈ చట్టంకింద ఇకపై కోర్టు ఒక పరిష్కారాన్ని మంజూరు చేయాలంటే పిటిషనరుకాని ప్రతివాది కాని క్రైస్తవ మతాన్ని నమ్మేవారు అయివుండాలి, మరియు వివాహ రద్దు డిక్రీ మంజూరు చేయడానికి పిటిషను దాఖలు చేసేనాటికి భార్యాభర్తలు ఇరువురు భారతదేశంలో స్థిరపడి ఉంటే తప్ప డిక్రీ మంజూరు చేయకూడదు, వివాహం చెల్లదనే డిక్రీ భారతదేశంలో వివాహమై పిటీషను దాఖలయ్యే నాటికి పిటీషనరు భారత దేశంలో నివసిస్తూ ఉంటే కాని డిక్రీ మంజూరు చేయకూడదు.

వివాహం రద్దు చేస్తూ, లేదా చెల్లదని డిక్రీ కాకుండా ఈ చట్టం కింద మరే ఇతర పరిష్కారం కోసం పిటీషను దాఖలు చేసే నాటికి పిటీషనరు భారత దేశంలో నివసిస్తూ ఉంటే తప్ప డిక్రీ మంజూరు చేయకూడదు.

3. నిర్వచనాలు : సందర్భానికి భిన్నంగా ఉంటే తప్ప ఈ చట్టం కింద

1) "హైకోర్టు" అంటే ఒక ప్రాంతానికి సంబంధించిందైతే

ఎ) రాష్ట్రమైతే, రాష్ట్ర హైకోర్టు;

బి) ఢిల్లీ అయితే, ఢిల్లీ హైకోర్టు;

సి) మణిపూర్, త్రిపుర అయితే, అస్సాం హైకోర్టు;

డి) అండమాన్, నికోబార్ దీవులైతే, కలకత్తా హైకోర్టు;

ఇ) లక్షద్వీపాలైతే, కేరళ హైకోర్టు;

ఇఇ) చండీఘర్ అయితే; పంజాబ్, హర్యానా హైకోర్టు

మరియు ఈ చట్టం కింద పిటీషను నిమిత్తం "హైకోర్టు" అంటే భార్య కాని భర్త కాని నివసించే లేదా వారిద్దరూ ఆఖరుగా కలిసి నివసించే ప్రాంతానికి సంబంధించిన హైకోర్టు.

2) "జిల్లా న్యాయమూర్తి" అంటే ఏ విధంగానైనా పిలవబడే ఒరిజినల్ జ్యూరిస్‌డిక్షన్ గల ప్రిన్సిపల్ సివిల్ కోర్టు.

3) "జిల్లా కోర్టు" అంటే ఈ చట్టం కింద పిటీషను నిమిత్తం ఏ జిల్లా న్యాయమూర్తి కోర్టు ఒరిజినల్ జ్యూరిస్‌డిక్షన్ పరిధిలోనైతే వివాహం జరిగిందో, లేదా భర్త మరియు భార్య నివసించే వారో లేదా ఇద్దరూ కలిసి ఆఖరుగా నివసించారో ఆ ప్రాంతానికి సంబంధించిన జిల్లా కోర్టు,

4) "కోర్టు" అంటే సందర్భాన్ని బట్టి హైకోర్టు లేదా జిల్లాకోర్టు

5) "మైనర్ బాలబాలికలు" అంటే ఇక్కడ పుట్టి పెరిగిన స్థానిక తండ్రుల కొడుకులైతే పదహారు సంవత్సరాలు పూర్తికాని వారు, ఇక్కడ పుట్టి పెరిగిన స్థానిక తండ్రుల కూతుర్లైతే పదమూడు సంవత్సరాలు పూర్తికాని వారు. ఇతర అన్ని సందర్భాల్లో దానర్థం పద్దెనిమిది సంవత్సరాలు నిండని అవివాహిత బాలబాలికలు.

6. "మరో స్త్రీతో వివాహం" అంటే తన భార్య బ్రతికుండగా ఒకవ్యక్తి మరొక వ్యక్తి చేసుకునే వివాహం. రెండవ వివాహం భారతదేశం లోపల, వెలుపల ఎక్కడైనా జరగొచ్చు.

7) "వదిలేయడం" అంటే ఆరోపిస్తున్న, అవతలి వారి ఇష్టానికి భిన్నంగా వదిలిపెట్టడం, మరియు

8) "ఆస్తి" అనే పదంలో భార్య విషయానికి వస్తే, మిగిలింది అనుభవించే హోదా రివర్షనర్ లేదా ట్రస్టీ లేదా ఎగ్జిక్యూట్రిక్స్ లేదా అడ్మినిస్ట్రేట్రిక్స్ హోదా ద్వారా ఆమెకు దక్కే ఆస్తి ఇమిడుంది. వీలురాసి, లేక రాయక చనిపోయిన వ్యక్తి చనిపోయిన తేదీ నుండి ఆమె ఎగ్జిక్యూట్రిక్స్ కాని అడ్మినిస్ట్రేట్రిక్స్ హోదా పొందుతారు.

II - పరిధి

4. ఈ చట్టానికి లోబడి వైవాహిక అంశాల్లో తన హైకోర్టు అధికారాన్ని వినియోగించాలి :

విడాకులు, ఇతర వైవాహిక వివాదాలు, దావాలు వైవాహిక విషయాల్లో హైకోర్టుకు ఉన్న అధికారాలను ఈ చట్టంలోని అంశాలకు లోబడి ఆ కోర్టులు, జిల్లా కోర్టులే వినియోగించుకుంటాయి. మరొక రకంగా కాదు అయితే వివాహ లైసెన్సులు మంజూరుకి సంబంధించి ఈ చట్టం లేదనట్టు భావించి మంజూరు చేయాల్సి ఉంటుంది.

5. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు డిక్రీలు లేదా ఉత్తర్వుల అమలు :

కలకత్తా, మద్రాసు, బాంబేలో గతంలో ఉన్న సుప్రీంకోర్టులు తమ ఎక్లెసియాస్టికల్ పరిధిని లేదా హైకోర్టుల్లో ఏవైనా వైవాహిక అంశాలపై తమకున్న అధికారాలను వినియోగించుకుని డిక్రీలు కాని ఉత్తర్వులు కాని జారీ చేసుంటే, ఈ చట్టం కింద మంజూరు చేసిన డిక్రీలను, ఉత్తర్వులను ఏ కోర్టు అమలుచేస్తుందో ఆ కోర్టు, ఏవిధంగా అమలు చేస్తుందో ఆవిధంగా అమలు చేయాలి.

6. పెండింగ్ దావాలు :

ఈ చట్టం అమల్లోకి వచ్చే నాటికి పెండింగ్‌లో ఉన్న దావాలు, వైవాహిక సంబంధిత కేసులను వీలైనంత వరకు ఈ చట్టం కింద దాఖలైనట్లుగా పరిగణించి ఈ కేసులు వ్యవహరించే కోర్టులు వాటిపై విచారణ జరిపి తీర్పు చెప్పాల్సి ఉంటుంది.

7. (భారత విడాకుల (సవరణ) చట్టం - 2001

(2001లోని 51వది) ద్వారా రీపీల్ అయ్యింది)

8. హైకోర్టు ప్రత్యేక పరిధి :

ఈ చట్టం కింద తన ప్రాంతీయ పరిధిలోని జిల్లా న్యాయమూర్తి కోర్టులో దాఖలైన దావాని కాని, కేసుని కాని తనకు సబబనిపిస్తే అక్కడ నుండి తొలగించి తానే ఒరిజినల్ జ్యూరిస్‌డిక్షన్ గల కోర్టుగా వ్యవహరించి విచారణ జరిపి తీర్పు వెల్లడించవచ్చు.

దావాల బదిలీకి ఉన్న అధికారం :

ఈ విధమైన దావాని లేదా కేసుని హైకోర్టు వెనక్కి తీసుకుని మరో జిల్లా న్యాయమూర్తి కోర్టుకి విచారణ, తీర్పు నిమిత్తం బదిలీ కూడా చేయొచ్చు.

9. హైకోర్టు సంప్రదింపు :

ఈ చట్టంకింద జిల్లాకోర్టులో దాఖలైన ఒక దావాలో విచారణ జరగకముందు కాని, దావాలోని తదుపరి దశలోకాని, డిక్రీ లేదా ఉత్తర్వు అమలు చేయాల్సిన దశలోకాని ఒక చట్టానికి లేదా చట్టబద్ధంగా అమల్లో ఉన్న వాడుకకు సంబంధించి ఏదైనా ప్రశ్న తలెత్తితే కోర్టు తనకు తానుగా కాని, వాదప్రతివాదుల్లో ఎవరైనా అర్జీ పెట్టుకుంటే కేసుకి సంబంధించిన ప్రకటనను రూపొందించి, ఇందులో తన అభిప్రాయాలను జతపర్చి హైకోర్టు ఈ విషయంలో తన నిర్ణయాన్ని తెలపాలని కోరవచ్చు.

విచారణ మొదలు కాకముందు లేదా జరుగుతున్నప్పుడు ఈ ప్రశ్న తలెత్తితే జిల్లాకోర్టు హైకోర్టు నిర్ణయం తెలిపేవరకు విచారణను నిలిపేయవచ్చు లేదా హైకోర్టు తీర్పు పెండింగ్‌లో ఉండగా విచారణ కొనసాగించి డిక్రీ హైకోర్టు నిర్ణయానికి లోబడి ఉంటుందని షరతు విధించవచ్చు.

ఒక డిక్రీ కాని ఉత్తర్వుకాని మంజూరు చేసుంటే హైకోర్టు ఈ విషయంలో నిర్ణయం తీసుకునే వరకు దాని అమలును నిలిపేయవచ్చు.

III - వివాహం రద్దు

10. వివాహం రద్దుకి గల కారణాలు :

1. భారత విడాకుల (సవరణ) చట్టం, 2001 అమల్లోకి (3-10-2005 న అమల్లోకి వచ్చింది) రాకముందు, వచ్చిన తర్వాత జరిగిన వివాహంలో ప్రతివాది వివాహమైనప్పటి నుండి కింద పేర్కొన్న చర్యలకు పూనుకున్న కారణంగా వివాహాన్ని రద్దు చేయవలసిందిగా కోరుతూ భార్య కాని భర్త కాని జిల్లా కోర్టులో పిటీషను దాఖలు చేయవచ్చు.
   i) పరస్త్రీ / పరపురుషునితో లైంగిక సంబంధం పెట్టుకున్నారు; లేదా
   ii) క్రైస్తవ మతాన్ని త్యజించి మరోమతం స్వీకరించారు, లేదా
   iii) పిటీషను దాఖలు చేయడానికి రెండేళ్ళకు పైగా నయంకాని విధంగా మతిస్థిమితం కోల్పోయారు, లేదా
   iv) పిటీషను దాఖలు చేయడానికి రెండేళ్ళకు పైగా నయంకాని అంటువ్యాధయిన కుష్టు వ్యాధికి గురయ్యారు, లేదా
   v) పిటీషను దాఖలు చేయడానికి రెండేళ్లకు పైగా అంటువ్యాధయిన సుఖవ్యాధికి గురయ్యారు, లేదా

vi) ప్రతివాది బ్రతికుంటే ప్రతివాది ఆచూకీ సహజంగా తెలిసే వ్యక్తులకు ఏడేళ్లకు పైగా బ్రతికున్నది లేనిదీ తెలియకపోతే, లేదా

vii) వివాహంలో లైంగిక బంధాన్ని కావాలని నిరాకరించడంతో ఆ బంధం ఏర్పడలేదు, లేదా

viii) ప్రతివాదికి వ్యతిరేకంగా వైవాహిక హక్కుల పునరుద్ధరణ డిక్రీ మంజూరైన రెండేళ్లకు కూడా ఆ డిక్రీని అమలు చేయలేదు, లేదా

ix) పిటీషను దాఖలు చేయడానికి ముందు కనీసం రెండేళ్లపాటు పిటీషనరుని వదిలేశారు, లేదా

x) ప్రతివాదితో కలిసుంటే తనకు హానికలుగుతుందనో, తాను గాయపడతాననో ఆలోచన కలిగే విధంగా పిటీషనరు పట్ల ప్రతివాది క్రూరంగా ప్రవర్తిస్తే, లేదా

2. వివాహమైన తర్వాత భర్త లైంగిక అత్యాచారానికి, అసహజ లైంగిక నేరానికి, లేదా పాశవిక లైంగిక అత్యాచారానికి పాల్పడి శిక్షార్హుడయాడనే కారణాన్ని చూపి భార్య వివాహాన్ని రద్దు చేయమని కోరుతూ పిటీషను దాఖలు చేయొచ్చు.

10ఎ. పరస్పర అంగీకారంతో వివాహం రద్దు :

1. ఈ చట్టంలోని అంశాలకు, ఇందుకై రూపొందించిన నియమాలకు లోబడి భారత విడాకుల (సవరణ) చట్టం, 2001 అమల్లోకి రాకముందు, వచ్చిన తర్వాత జరిగిన వివాహంలో భార్యాభర్తలు తాము రెండేళ్లపైగా కలిసి జీవించడం లేదని, తాము కలసి బ్రతకలేకపోయామని, అందుకే వివాహాన్ని రద్దు చేసుకోవాలని పరస్పర అంగీకారానికి వచ్చామనే కారణం చేత తమ వివాహాన్ని రద్దు చేయవలసిందిగా కోరుతూ జిల్లా కోర్టుకి పిటీషను దాఖలు చేయవచ్చు, లేదా

2. సబ్ సెక్షన్ (1) కింద పిటీషను దాఖలు చేసిన ఆరు నెలల తర్వాత, పద్దెనిమిది నెలలలోపు ఇరుపక్షాల వారు తమ పిటీషన్ని వెనక్కి తీసుకోకుండా కోర్టు ముందుకి తమ విషయాన్ని మళ్లీ తీసుకుని వస్తే కోర్టు ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత, వివాహం జరిగిందా, పిటీషనులోని అంశాలు వాస్తవమేనా అనే అంశాలపై విచారణ జరిపి సంతృప్తి చెందితే డిక్రీ జారీ చేసిన రోజు నుండి వివాహం రద్దవుతుందని డిక్రీ జారీ చేయొచ్చు.

11. లైంగిక బంధం ఏర్పర్చుకున్న పరస్త్రీ, పరపురుషుణ్ణి సహప్రతివాదిగా పేర్కొనడం :

తన భార్య / భర్త పరస్త్రీ / పర పురుషునితో లైంగిక సంబంధం పెట్టుకున్నారు కాబట్టి వివాహాన్ని రద్దు చేయాలని భార్య కాని భర్త కాని పిటీషను పెట్టుకుంటే ఈ కింద కారణాలు ఉంటే ఆ పరస్త్రీ / పర పురుషుణ్ణి సహ ప్రతివాదిగా చేర్చకపోయినా కోర్టు ఒప్పుకుంటుంది అవి ఏమిటంటే :

ఎ) ప్రతివాది భార్యయితే ఆమె వేశ్యావృత్తి కొనసాగించడం వల్ల; లేదా ప్రతివాది భర్తయితే అతను అనైతిక జీవన విధానం కొనసాగించడం వల్ల పిటీషనరుకి ఎవరితో సంబంధం పెట్టుకున్నారో తెలియకపోతే;

బి) ఆరోపించబడిన పరస్త్రీ / పరపురుషుని పేరు కనుగొనడానికి తగిన ప్రయత్నాలు చేసిన పిటీషనరు ఆమె / అతడు పేరు కనుక్కోలేకపోతే.

సి) ఆరోపించబడిన పరస్త్రీ / పరపురుషుడు చనిపోయి ఉంటే

12. కుమ్మక్కు కాలేదని కోర్టు సంతృప్తి చెందటం :

ఈ విధంగా పిటీషను దాఖలైనప్పుడు కోర్టు అందులో ఆరోపించిన అంశాలపైనే కాకుండా అందుకు పిటీషనరు వివాహం జరిపించడంలోకాని, పరస్త్రీ / పరపురుషునితో ప్రతివాది సంబంధం ఏర్పర్చుకునే విషయంలోకాని ఏ విధంగానైనా దోహదపడ్డారా లేదా లాలూచీ పడ్డారా, లేదా ఆ చర్యని మాఫీ చేశారా, పిటీషనరుకు వ్యతిరేకంగా చేయబడ్డ ప్రత్యారోపణలు ఏమిటి అనే విషయాలపై కూడా దృష్టిసారించి ఆపై సంతృప్తి చెందాలి.

13. పిటీషను కొట్టివేత :

ఇటువంటి పిటీషనుకి సంబంధించిన సాక్ష్యాధారాలనుబట్టి పిటీషనరు కేసు రుజువు కాలేదని కోర్టు సంతృప్తిచెందితే లేదా ఆరోపించిన విధంగా పరస్త్రీ / పరపురుషునితో లైంగిక సంబంధం ఏర్పడిందని సంతృప్తి చెందకపోతే, లేదా వివాహ కాలంలో పిటీషనరు ఆవిధంగా జరిగిన వివాహానికి కాని పరస్త్రీ / పరపురుషునితో వివాహంలోని అవతలి వారు సంబంధం ఏర్పర్చుకోవడానికి దోహదపడ్డారనో, లేదా లాలూచీ పడ్డారనో, లేదా ఫిర్యాదు చేసిన రంకుతనాన్ని మాఫీ చేశారనో లేదా ప్రతివాదులతో కుమ్మక్కయ్యి పిటీషను దాఖలు చేశారని లేదా కేసు పెట్టారనే విషయం కనుగొంటే అప్పుడు, ఇటువంటి కేసుల్లో కోర్టు పిటీషన్ని కొట్టేయవచ్చు.

14. వివాహాన్ని రద్దుచేస్తూ డిక్రీ జారీ చేయడానికి కోర్టుకున్న అధికారం :

సాక్ష్యాధారాలనుబట్టి పిటీషనరు తన కేసుని రుజువు చేసుకున్నాడని కోర్టు సంతృప్తి చెందితే, మరియు అటువంటి వివాహం జరగడానికి కాని, వివాహంలోని అవతలి వారు పరస్త్రీ / పరపురుషునితో సంబంధం ఏర్పర్చుకోవడానికి కాని పిటీషనరు దోహద పడ్డారనో లేదా లాలూచీ పడ్డారనో లేదా ఫిర్యాదు చేసిన రంకుతనాన్ని మాఫీ చేశారనీ లేదా ప్రతివాదులతో కుమ్మక్కయ్యి పిటీషను దాఖలు చేశారని లేదా కేసు పెట్టారనే విషయం కనుగొనలేకపోతే కోర్టు వివాహాన్ని రద్దు చేస్తూ డిక్రీ జారీ చేయవచ్చు.

అయితే వివాహ కాలంలో పిటిషనరు పరస్త్రీ / పరపురుషునితో సంబంధం ఏర్పర్చుకున్నారని కనుగొంటే, లేదా పిటీషను దాఖలు చేయడంలో లేదా కేసు పెట్టడంలో పిటీషనరు అసంబద్ధమైన ఆలస్యానికి పాల్పడ్డాడని కోర్టు భావిస్తే; లేదా వివాహంలోని అవతలివారి పట్ల క్రూరంగా ప్రవర్తిస్తే,

పరస్త్రీ / పరపురుషునితో ఫిర్యాదు చేసిన సంబంధం ఏర్పడకముందే అవతలి వారిని కారణం లేకుండా వదిలేసి లేదా అతని / ఆమె నుండి కావాలని విడిగా ఉంటే, లేదా అవతలివారి పట్ల కావాలని నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్ల లేదా చెడుధోరణి ప్రదర్శించడం వల్ల వారు పరస్త్రీ / పరపురుషుణ్ణి ఆశ్రయించే విధంగా ప్రవర్తిస్తే కోర్టు అటువంటి డిక్రీని మంజూరు చేయదు.

మాఫీ : వైవాహిక జీవన పునరుద్ధరణ లేదా దాని కొనసాగింపు జరిగేంత వరకు ఈ చట్టం కింద పరస్త్రీ / పరపురుషునితో ఏర్పడిన సంబంధాన్ని మాఫీ చేసినట్లు భావించడానికి లేదు.

15. కొన్ని కారణాల కింద ప్రతిఘటించిన కేసుల్లో పరిష్కారం :

వివాహం రద్దు చేయాలని దాఖలైన దావాలో ప్రతివాదైన భర్త పరస్త్రీతో సంబంధం పెట్టుకున్నాడనో, లేదా క్రూరత్వానికి పాల్పడ్డాడనో లేదా వదిలేశాడనో కారణంగా లేదా ప్రతివాదైన భార్య పరపురుషునితో సంబంధం

పెట్టుకున్నదనో లేదా క్రూరత్వానికి పాల్పడిందనో లేదా వదిలేసిందనో కారణంగా కోరిన పరిష్కారాన్ని ప్రతివాది ప్రతిఘటిస్తే కోర్టు ఆ దావాలోనే ప్రతివాది అటువంటి పరిష్కారాన్ని కోరుకుంటే అర్జీ పెట్టుకుంటే అతను / ఆమె పిటీషను దాఖలు చేస్తే ఏవిధమైన పరిష్కారం మంజూరు చేసేదో కోర్టు ఆవిధమైన పరిష్కారం వారికి మంజూరు చేయొచ్చు. పరస్త్రీ / పరపురుషునితో సంబంధం, క్రూరత్వం లేదా వదిలేయడానికి సంబంధించి సాక్ష్యం ప్రవేశపెట్టడానికి ప్రతివాది అర్హుడు.

16. రద్దు డిక్రీ ఖరారు కావడానికి గడువు :

మొదటిసారి వివాహాన్ని రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన డిక్రీ ని జారీ చేసిన ఆరు నెలలకు తగ్గకుండా హైకోర్టు ఇందుకు సాధారణ రూపంలోకాని ప్రత్యేక ఉత్తర్వురూపంలో కాని ఆదేశించే గడువు వరకు ఖరారు కాదు.

కుమ్మక్కు : ఆ గడువు కాలంలో హైకోర్టు సాధారణ లేక ప్రత్యేక రూపంలో జారీచేసే ఆదేశాల మేరకు డిక్రీ కుమ్మక్కులు పొందిందని లేదా కోర్టు ముందు విలువైన అంశాలను ప్రవేశపెట్టలేదనే కారణం కింద డిక్రీని ఖరారు చేయడానికి ఎందుకు వీల్లేదో చెప్పమని ఏ వ్యక్తయినా ప్రశ్నించడానికి అవకాశముంది.

ఆ విధమైన కారణం చూపినమీదట కోర్టు ఆ డిక్రీని ఖరారు చేయవచ్చు, లేదా డిక్రీ నిసీ తద్విరుద్ధ నిర్ణయానికి రావచ్చు, లేదా మరింత విచారణ అవసరమని భావించవచ్చు లేదా న్యాయోచితమైన విధంగా నిర్ణయం తీసుకోవచ్చు.

ఇటువంటి కారణాలు చూపినప్పుడు న్యాయవాదికి, సాక్షులకు, ఇతరత్రా అయ్యే ఖర్చులను ఇరుపక్షాలు లేదా వారిలో ఒకరు లేదా మరింత మంది, వేరే స్వంతాస్తి ఉంటే భార్య కూడా భరాయించాలని తగిన విధంగా హైకోర్టు ఆదేశాలు జారీ చేయొచ్చు.

డిక్రీ ఖరారు చేయాలని పిటీషనరు సకాలంలో కోరకపోతే హైకోర్టు ఆ దావాని కొట్టేయవచ్చు.

17. కొన్ని దావాలను తరలించడానికి హైకోర్టుకి ఉన్న అధికారాలు :

జిల్లా న్యాయమూర్తి కోర్టులో దావా జరుగుతుండగా విడాకులు పొందడానికి ఇరుపక్షాల్లో ఎవరైన కుమ్మక్కు అయ్యారని ఏ వ్యక్తికైనా అనుమానం కలిగితే హైకోర్టు ఎప్పటికప్పుడు జారీచేసే సాధారణ లేదా ప్రత్యేక ఉత్తర్వులకు లోబడి ఈ కేసుని సెక్షన్ 8 కింద హైకోర్టు ఆ దావాను తొలగించాలని హైకోర్టుకి అర్జీ పెట్టుకోవచ్చు. కోర్టు ఆపై తగినదిగా భావిస్తే కేసుని తొలగించి ఒరిజినల్ జ్యూరిస్‌డిక్షన్ గల కోర్టు హోదాలో తానే దావాపై విచారణ జరిపి తీర్పు చెప్పొచ్చు; మరియు ఈ విధంగా తొలగించబడిన దావాకి సెక్షన్ 16 లోని అంశాలు వర్తిస్తాయి; లేదా ఆరోపించిన కుమ్మక్కుకి సబంధించి తగిన చర్యలు తీసుకోమని జిల్లా న్యాయమూర్తిని ఆదేశించి అతనికి న్యాయోచితంగా డిక్రీ జారీ చేసేందుకు సాధికారిత కల్పించాలి.

17ఎ. (భారత విడాకుల (సవరణ) చట్టం, 2001 (2001లోని 51 వది) ద్వారా రీఫిల్ అయ్యింది)

IV - చెల్లని వివాహంగా ప్రకటన

18. చెల్లని వివాహ ప్రకటనకై పిటీషను :

తన వివాహం చెల్లదని ప్రకటించమని భార్య కాని భర్త కాని జిల్లా కోర్టులో పిటిషను దాఖలు చేయవచ్చు.

19. డిక్రీకి కారణాలు :

అటువంటి డిక్రీలు ఈ కారణాల్లో వేటికిందైనా జారీ చేయవచ్చు :

1) వివాహ కాలం నాటికి, దావా వేసే నాటికి ప్రతివాది నపుంశకత్వంతో బాధపడుతున్నారు,

2) ఇరుపక్షాలు రక్త సంబంధం ద్వారా కాని వివాహ బంధం ద్వారా కాని నిషేధిత బాంధవ్య పరిధిలో ఉన్నారు.

3) వివాహం నాటికి ఇరుపక్షాల్లో ఒక్కర్ని మతిస్థిమితం లేదు లేదా మందబుద్ధిగలవారు

4) వివాహం నాటికి ఇరుపక్షాల్లో ఒకరి మాజీ భార్య లేదా భర్త బ్రతికే ఉండి ఆ మాజీ భార్య లేదా భర్తతో వివాహం చట్టప్రకారం అమల్లో ఉంటే ఇరుపక్షాల్లో ఎవరి అంగీకారమైనా బలప్రయోగం ద్వారా లేదా మోసం ద్వారా పొందడం జరిగిందనే కారణం చేత వివాహాన్ని రద్దు చేయడానికి జిల్లాకోర్టుకి ఉన్న అధికారంపై ఈ సెక్షన్ ప్రభావం ఉండదు.

20. భారత విడాకుల (సవరణ) చట్టం, 2001

(2001లోని 51వది) ద్వారా రీపీల్ చేయబడింది)

21. చెల్లని వివాహాల్లో కలిగిన పిల్లలు :

తన భర్త కాని భార్య కాని చనిపోయారనే నమ్మకంతో వారు బ్రతికుండగానే మరో వివాహం చేసుకుంటే, ఆవిధంగా వివాహం చేసుకున్నారన్న కారణంగా రద్దయిన వివాహాల్లో లేదా మతిస్థిమితం లేని కారణంగా రద్దయిన వివాహాల్లో అది రద్దు కావడానికి ముందు కలిగిన పిల్లల ప్రస్తావన డిక్రీలో ఉండాలి. వివాహాన్ని చేసుకోవడానికి సమర్థులైన తల్లిదండ్రులకు కలిగిన సక్రమ సంతానం తమ తల్లిదండ్రుల ఆస్తులకు ఎలా వారసులవుతారో ఈ వివాహంలో కలిగిన సంతానం కూడా అదేవిధంగా వారి తల్లిదండ్రుల ఆస్తులు పొందడానికి వారసులవుతారు.

V - న్యాయపరమైన వేర్పాటు

22. మెన్సా ఎట్ టోరో విడాకుల డిక్రీ జారీ చేయడానికి వీలులేదు; భార్యా భర్త న్యాయపరమైన వేర్పాటుకి అవకాశం :

ఇకపై మెన్సా ఎట్ టోరో విడాకుల డిక్రీ మంజూరు చేయడానికి వీల్లేదు. అయితే వివాహేతర సంబంధం లేదా క్రూరత్వం లేదా రెండేళ్లపాటు వదిలేయడాన్ని కారణంగా చూపితే భార్యా భర్తల్లో ఎవరైనా న్యాయపరమైన వేర్పాటు డిక్రీ పొందొచ్చు. అటువంటి డిక్రీ ప్రస్తుత చట్టాల్లోని మెన్సా ఎట్ టోరో విడాకుల డిక్రీ పనిచేసిన మాదిరిగానే పని చేస్తుంది. తదానుగుణ న్యాయపరమైన ప్రభావాలు చోటు చేసుకుంటాయి.

1. మెన్సా ఎట్ టోరో విడాకుల డిక్రీ అంటే ఈ విధమైన విడాకుల డిక్రీ కోర్టు మంజూరు చేస్తే భార్యా భర్తలు ఇద్దరూ విడిగా ఉండొచ్చు కాని పునర్ వివాహం చూసుకోకూడదు. వారికి కలిగిన సంతానం సక్రమమే.

23. వేర్పాటు కోసం దాఖలు చేసిన పిటీషను :

పైన పేర్కొన్న కారణాల కింద న్యాయపరమైన వేర్పాటుకోసం జిల్లా కోర్టులో భార్యా భర్తల్లో ఎవరైనా పిటీషను దాఖలు చేయవచ్చు. పిటీషనులో ప్రకటించిన అంశాల వాస్తవికతపై, ఈ కారణం కింద పిటీషన్ను అనుమతించక పోవడానికి న్యాయపరమైన కారణాలు లేవని కోర్టు సంతృప్తి చెందితే అందుకనుగుణంగా న్యాయపరమైన వేర్పాటు డిక్రీ మంజూరు చేయొచ్చు.

24. తర్వాత ఆర్జించిన ఆస్తికి సంబంధించి విడిపోయిన భార్య అవివాహితతో సమానం :

చట్టం కింద న్యాయపరమైన వేర్పాటు మంజూరైన కేసుల్లో డిక్రీ మంజూరైన నాటినుండి తీర్పు చెప్పిన రోజు నుండి వేర్పాటు కొనసాగే వరకు ఆమె తదుపరి ఆర్జించిన, లేదా వంశపారపర్యంగా పొందిన ఆస్తులకు సంబంధించి ఆమెను అవివాహితగా భావించాల్సి ఉంటుంది.

అటువంటి ఆస్తులతో ఆమె అవివాహిత స్త్రీ ఏవిధంగా వ్యవహరిస్తారో ఆరకంగా వ్యవహరించవచ్చు. ఆమె వీలు రాయకుండా మరణిస్తే ఆమెభర్త చనిపోతే ఏవిధంగా వారసత్వంగా వెళ్తుందో ఆవిధంగా వెళ్తుంది. అయితే అటువంటి భార్య తిరిగి భర్త కాపురం చేయడం మొదలెడితే కాపురం చేసేనాటికి ఆమెకు చెందిన అటువంటి ఆస్తిని విడిపోయినప్పుడు భార్యా భర్తల మధ్య జరిగిన రాతపూర్వక ఒప్పందానికి లోబడి ఆమె విడిగా వాడుకోవచ్చు.

25. కాంట్రాక్టులు, వ్యాజ్యం వేయడానికి సంబంధించి విడిపోయిన భార్య అవివాహితతో సమానం :

ఈ చట్టం కింద న్యాయపరమైన వేర్పాటు మంజూరైన కేసుల్లో భార్యలను కాంట్రాక్టులు, వాటి ఉల్లంఘన, నష్టం, అందుకు సివిల్ దావాలు వేయడం, వారిపై దావాలు నడవడం వంటి విషయాల్లో అవివాహిత స్త్రీగా పరిగణించాలి. విడిపోయిన కాలంలో కాంట్రాక్టు, చర్యలు లేదా ఖర్చులకు సంబంధించి చేరిన, చేసిన, చేయని లేదా భరాయించాల్సిన అంశాల విషయంలో భర్తకు ఎటువంటి సంబంధం లేదు. అయితే విడిపోయిన కాలంలో భార్యకు డిక్రీ లేదా ఉతర్వు ద్వారా మంజూరైన భరణాన్ని భర్త తగిన విధంగా చెల్లించకపోతే ఆమెకు నిత్యావసరాలు సమకూర్చాల్సిన బాధ్యత అతనిపై ఉంటుంది. వేర్పాటు కాలంలో తనకి, తన భర్తకి ఇచ్చిన సంయుక్త అధికారాన్ని వినియోగించుకోవడానికి ఎటువంటి అవాంతరాలు ఉండవు.

వేర్పాటు డిక్రీ విరుద్ధ తీర్పు

26. భార్య లేదా భర్త పరోక్షంలో పొందిన డిక్రీ వ్యతిరేక తీర్పు :

తన భార్య లేదా భర్త తన పరోక్షంలో న్యాయపరమైన వేర్పాటు డిక్రీ పొందారని, డిక్రీ పొందడానికి వదిలేయడం కారణమైతే ఆరోపించిన విధంగా వదిలేయడానికి తగ్గ కారణముందనే కారణాలు చూపుతూ భర్త లేదా భార్య జారీ అయిన న్యాయపరమైన వేర్పాటు డిక్రీకి కోర్టు వ్యతిరేకంగా తీర్పు (రివర్స్) జారీ చేయాలని పరిస్థితులను బట్టి కోరుతూ పిటీషను దాఖలు చేయొచ్చు.

ఈ పిటీషనులోని ఆరోపణలు నిజమని సంతృప్తి చెందిన మీదట కోర్టు డిక్రీకి విరుద్ధంగా తీర్పు జారీ చేయొచ్చు. కాని అలా చేసేటప్పుడు ఈ విరుద్ధ డిక్రీ జారీ చేయకపోయుంటే అది జారీ చేయకముందే భార్యకి ఋణాలు, కాంట్రాక్టులు లేదా ఏదైనా చర్యలు తీసుకోవడం వల్ల కొంత మందికి కలిగే హక్కులకు లేదా పరిష్కారాలకు విరుద్ధ తీర్పు అడ్డుపడకూడదు.

VI - రక్షణ - ఉత్తర్వులు

27. వదిలేయబడ్డ భార్య కోర్టులో రక్షణకోసం దరఖాస్తు చేసుకోవచ్చు :

భారత వారసత్వ చట్టం, 1865 (1865 లోని 10వది) లోని సెక్షన్ 4 పరిధిలోకి రాని భార్యలను భర్తలు వదిలేసివుంటే, భర్త తనను వదిలేసిన తర్వాత ఆమెకు సంక్రమించిన లేదా సంక్రమించే ఆస్తిని మరియు వదిలేసిన తర్వాత ఆమె ఆధీనంలోకి వచ్చిన, లేదా ఆధీనంలోకి రాబోయే ఆస్తిని తన భర్త, అతని రుణదాతలు, లేదా అతని ద్వారా ఆమెను కోరే ఎవరి నుండైనా తన ఆస్తిని కాపాడాలని కోరుతూ భర్త వదిలేసిన తర్వాత ఎప్పుడైనా జిల్లా కోర్టులో పిటీషను దాఖలు చేయవచ్చు.

28. కోర్టుచే రక్షణ ఉత్తర్వులు మంజూరు :

ఆవిధంగా వదిలేయడం జరిగిందని, వదిలేయడానికి తగ్గ కారణాలు లేవని, ఆమె కష్టపడి తనని తాను, తన ఆస్తులను కాపాడకునే ప్రయత్నాలు చేస్తోందని కోర్టు సంతృప్తి చెందితే ఆమె ఆదాయాన్ని, ఇతర ఆస్తులను భర్త నుండి, అతని రుణదాతల నుండి, మరియు అతని ద్వారా కోరే ఎవరి నుండైనా కాపాడుతూ ఉత్తర్వులు జారీ చేయొచ్చు. వదిలేయడం ఎప్పటి నుండి ప్రారంభమైందో ఆ ఉత్తర్వులో కచ్చితంగా పేర్కొనాలి. భార్యలతో వ్యవహరించే వ్యక్తులందరికీ సంబంధించి ఆ సమయం ఖరారైనట్లు లెక్క.

29. కోర్టు జారీచేసిన ఈ విధమైన ఉత్తర్వును రద్దుచేయాలని (డిశ్చార్జ్) లేదా మార్చాలని కోరుతూ భర్తకాని రుణదాతలు కాని, లేదా అతని ద్వారా కోరే ఏ వ్యక్తయినా దరఖాస్తు పెట్టుకోవచ్చు. వదిలేయడమన్నది అంతమొందిందనో లేదా మరే ఇతర కారణాల చేతనైనా సరైనదని అనిపిస్తే కోర్టు తగ్గవిధంగా ఉత్తర్వును రద్దు చేయవచ్చు లేదా దాన్ని మార్చవచ్చు.

30. ఉత్తర్వు నోటీసు అందిన తర్వాత భార్య ఆస్తులను లాక్కున్న భర్తపై చర్య:

ఈ విధమైన ఉత్తర్వు నోటీసు అందిన తర్వాత భర్త కాని, అతని రుణదాతలు కాని, అతని ద్వారా కోరే ఇతర వ్యక్తులు కాని ఆమె ఆస్తులను లాక్కుని వాటిని తన ఆధీనంలో ఉంచుకోవడం కొనసాగిస్తే, భార్య దావా వేస్తే (ఆమెకు దావా వేయడానికి ఇకపై అధికారముంది) ఆస్తులను తిరిగి ఆమెకు ఇవ్వడం లేదా అప్పగించడం మాత్రమే కాకుండా ఆ ఆస్తుల విలువకు రెండింతల రుసుమును ఆమెకు ముట్టచెప్పాలి.

31. ఉత్తర్వు అమల్లో ఉన్నంతకాలం చట్టపరంగా భార్య స్థితి :

ఈ విధంగా వదిలేయబడ్డ భార్య ఉత్తర్వులు పొంది అవి అమల్లో ఉన్నంతకాలం ఈ చట్టం కింద ఆమె కనుక న్యాయపరమైన వేర్పాటు డిక్రీ పొందిన మీదట కాంట్రాక్టు, దావాలు వేయడం, వేయించుకునే స్థితిలో ఉండే విషయంలో ఏవిధమైన స్థితిలో ఉండే వారో ఆ స్థితిలోనే ఉంటారు.

VII - వైవాహిక హక్కుల పునరుద్ధరణ

32. వైవాహిక హక్కుల పునరుద్ధరణ పిటీషను :

భర్త కాని భార్య కాని సరైన కారణం లేకుండా తన సాంగత్యాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయి వుంటే అతను కాని ఆమె కాని తమ వైవాహిక హక్కులను పునరుద్ధరించాలని కోరుతూ జిల్లా కోర్టులో పిటీషను దాఖలు చేయొచ్చు. పిటీషనులోని అంశాలు వాస్తవమని, అది మంజూరు చేయడానికి న్యాయపరమైన అవాంతరాలు ఏమీ లేవని కోర్టు సంతృప్తి చెందితే వైవాహిక హక్కుల పునరుద్ధరణ డిక్రీ మంజూరు చేయొచ్చు.

33. పటీషనుకి జవాబు :

న్యాయపరమైన వేర్పాటు డిక్రీ లేదా వివాహం చెల్లదనే డిక్రీ పొందడానికి వేసే దావాల్లో ఉండాల్సిన కారణాలు కాకుండా మరే ఇతర కారణాలను వైవాహిక హక్కుల పునరుద్ధరణ పిటీషనుకి ఇచ్చే జవాబులో పేర్కొనకూడదు.

VIII - పరిహారం మరియు ఖర్చులు

34. (భారత విడాకుల (సవరణ) చట్టం, 2001 (2001 లోని 51 వది) ద్వారా వెనక్కి తీసుకోబడింది)

35. (భారత విడాకుల (సవరణ) చట్టం, 2001 (2001 లోని 51 వది) ద్వారా వెనక్కి తీసుకోబడింది)

IX - భరణం

36. మధ్యంతర భరణం :

ఈ చట్టంకింద భార్య కాని భర్త కాని వేసిన దావాలో ఆమె రక్షణ ఉత్తర్వులు పొందిందా, లేదా అనే దానితో నిమిత్తం లేకుండా దావా కోర్టులో నడుస్తున్న కాలంలో విచారణకయ్యే ఖర్చుల నిమిత్తం ఆమె భరణం నిమిత్తం భార్య పిటీషను దాఖలు చేయొచ్చు.

ఈ పిటీషను గురించి భర్తకి తెలియజేయాలి, కోర్టు పిటీషనులో పేర్కొన్న అంశాలపట్ల సంతృప్తి చెందిన ఎడల భర్త భార్యకు విచారణకయ్యే ఖర్చుల నిమిత్తం, దావా నడుస్తున్న కాలంలో భరణం నిమిత్తం న్యాయసమ్మతమనిపించిన రుసుమును చెల్లించాలని ఉత్తర్వు జారీ చేయవచ్చు. అయితే వీలైనంత వరకు దావా నడుస్తున్న కాలంలో విచారణ ఖర్చులు, భరణాల నిమిత్తం వేసిన పిటీషన్ను భర్తకి నోటీసు అందిన అరవై రోజులలోపు తేల్చాలి.

37. వివాహం రద్దు చేస్తూ డిక్రీ జారీ అయినప్పుడు కాని న్యాయపరమైన వేర్పాటుకు డిక్రీ జారీ అయినప్పుడు కాని జిల్లా కోర్టు భార్యకు గల ఆస్తులను, భర్త స్తోమతను, ఇరుపక్షాల వ్యవహారశైలిని దృష్టిలో ఉంచుకుని తనకు సంతృప్తిగా అనిపించే విధంగా భార్యకు స్థూలంగా కొంత మొత్తాన్ని కాని ఆమె జీవితకాలం మించకుండా ఏటా కొంత మొత్తాన్ని భర్త భార్యకు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయొచ్చు. ఇందుకై అవసరమైతే ఒక తగ్గ అన్ని పక్షాలచే సరైన ఒడంబడిక పత్రాన్ని రాయించవచ్చు.

వారాల వారీ లేదా నెలవారీ చెల్లింపుకై ఉత్తర్వులిచ్చే అధికారం :

ఇటువంటి అన్ని కేసుల్లో భార్య పోషణార్థం భర్త నెలవారీ లేదా వారాల వారీ చెల్లింపులు చేయాలని కోర్టు తగిన విధంగా ఉత్తర్వులు జారీ చేయొచ్చు.

భర్త ఏదైనా కారణం చేత అటువంటి చెల్లింపులు చేయలేని స్థితి తర్వాత ఏర్పడితే కోర్టు ఆ ఉత్తర్వులను రద్దు చేయవచ్చు లేదా సవరించవచ్చు లేదా ఆదేశించిన మొత్తంలో కొంత భాగాన్ని లేదా మొత్తాన్ని తాత్కాలికంగా చెల్లించనవసరం లేదని, ఆ తర్వాత కాలంలో కావాలంటే ఆ కొంత భాగాన్ని లేదా మొత్తాన్ని తిరిగి చెల్లించాలనే ఉత్తర్వులు తగిన విధంగా జారీ చేయొచ్చు.

38. భరణాన్ని భార్యకి కాని ఆమె ట్రస్టీలకు కాని నేరుగా చెల్లించాలని కోర్టు ఆదేశించవచ్చు :

భరణం మంజూరు చేస్తూ కోర్టు డిక్రీ కాని ఉత్తర్వు కాని జారీ చేసిన ప్రతి కేసులో ఆమెకు నేరుగా కాని ఆమె తరపున కోర్టు అనుమతించే ట్రస్టీకి కాని చెల్లించాలనీ ఆదేశించవచ్చు. ఆ విధంగా అనుమతించేటప్పుడు కోర్టు అవసరమైతే కొన్ని షరతులు లేదా నిషేధాలు విధించవచ్చు. అవసరాన్ని బట్టి కాలానుగుణంగా కొత్త ట్రస్టీని నియమించవచ్చు.

X - సెటిల్ మెంట్లు

39. భర్త పిల్లలు ప్రయోజనం నిమిత్తం భార్య ఆస్తుల సెటిల్‌మెంటు ఉత్తర్వులు జారీ చేసే అధికారం :

(భారత విడాకుల (సవరణ) చట్టం, 2001 (2001 లోని 51 వది) ద్వారా తొలగించబడింది)

40. కార్యం ముందు, కార్యం తర్వాత కుదుర్చుకున్న ఒప్పందాలపై విచారణ:

వివాహాన్ని రద్దు చేస్తూ లేదా వివాహాన్ని చెల్లనిదిగా ప్రకటిస్తూ డిక్రీ మంజూరు చేసే ముందు జిల్లా కోర్టు డిక్రీ ఏ వివాహానికి సంబంధించి మంజూరు చేయాలనుకున్నారో అందులో కార్యం జరగకముందు కాని జరిగిన తర్వాత కాని ఏదైనా ఒప్పందం జరిగిందా అనే విషయాన్ని విచారించాలి. భర్త లేదా భార్య, లేదా వివాహంలో (కలిగుంటే) కలిగిన సంతానం, లేదా తల్లిదండ్రులు మరియు పిల్లలు ఇరువురి ప్రయోజనాల నిమిత్తం కుదుర్చుకున్న ఒప్పందం మేరకు మొత్తం లేదా కొంత భాగం ఆస్తికి సంబంధించి తగిన ఉత్తర్వులు జారీ చేయవచ్చు.

అయితే పిల్లల ప్రయోజనాలను దెబ్బ తీసేవిధంగా తల్లిదండ్రుల ప్రయోజనార్థం కోర్టు ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయకూడదు.

XI - పిల్లల కస్టడీ

41. వేర్పాటు కోసం దాఖలైన దావాలలో పిల్లల కస్టడీకి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసే అధికారం :

న్యాయపరమైన వేర్పాటు కోసం దాఖలైన దావాలో కోర్టు అటువంటి డిక్రీ మంజూరు చేసే ముందు అటువంటి వివాహంలోని తల్లిదండ్రులకు కలిగిన మైనర్ బాలబాలికల కస్టడీ, మనోవర్తి, విద్యకు సంబంధించి ఎప్పటికప్పుడు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయొచ్చు లేదా డిక్రీలోనే ఆ అంశాలను పొందుపర్చవచ్చు. అవసరమైతే పిల్లల్ని కోర్టు సంరక్షణలో ఉంచాలనే ఆదేశాలు కూడా జారీ చేయవచ్చు.

అయితే మైనర్ బాలబాలికల మనోవర్తి, విద్యకు సంబంధించిన దావా నడుస్తుండగా దాఖలైన దరఖాస్తును ప్రతివాదికి నోటీసు అందిన అరవై రోజుల్లోపు తేల్చాల్సి వుంటుంది.

42. డిక్రీ మంజూరైన తర్వాత అటువంటి ఉత్తర్వులు జారీ చేసే అధికారం :

న్యాయపరమైన వేర్పాటు డిక్రీ మంజూరైన తర్వాత డిక్రీ ఏ తల్లిదండ్రులను ఉద్దేశించి మంజూరైందో వారి మైనర్ పిల్లల కస్టడీ, మనోవర్తి, విద్యకు సంబంధించి డిక్రీ ఇంకా మంజూరు కానప్పుడు ఏవిధంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తారో ఆవిధంగా ఎప్పటికప్పుడు కోర్టు ఇందుకై ఉత్తర్వులు జారీ చేయవచ్చు.

43. వివాహం రద్దుకై లేదా చెల్లనివిగా కోరే దావాల్లో కలిగిన సంతానం కస్టడీకి సంబంధించి ఉత్తర్వులు జారీ చేసే అధికారం :

జిల్లా కోర్టులో వివాహం రద్దుకై లేదా చెల్లనివిగా కోరే దావాల్లో, ఏ తల్లిదండ్రుల వివాహం గురించి

దావా నడుస్తుందో వారికి చెందిన మైనర్ బాలబాలికల కస్టడీ, మనోవర్తి, విద్యకు సంబంధించి డిక్రీ మంజూరు చేసేలోపు కోర్టు ఎప్పటికప్పుడు తగిన విధంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవచ్చు. అవసరమైతే ఆ పిల్లలను నేరుగా కోర్టు సంరక్షణలో ఉంచాలని కూడా ఆదేశించవచ్చు.

44. డిక్రీ లేదా ఖరారైన తర్వాత అటువంటి ఉత్తర్వులు జారీ చేసే అధికారం:

వివాహం రద్దుకై లేదా చెల్లనిదిగా డిక్రీ మంజూరైనప్పుడు డిక్రీకి సంబంధించిన వివాహంలోని తల్లిదండ్రులకు చెందిన మైనర్ బాలబాలికల కస్టడీ, మనోవర్తి, విద్యకు సంబంధించి పైన పేర్కొన్న విధంగా తుది డిక్రీ, లేదా డిక్రీ (పరిస్థితికి తగినది) లేదా మధ్యంతర ఉత్తర్వులు ఏవిధంగా జారీ చేస్తారో ఆవిధంగా ఎప్పటికప్పుడు ఉత్తర్వులు జారీ చేయవచ్చు.

XII - విధానం

45. సివిల్ ప్రొసీజర్ కోడ్ వర్తింపు :

ఇందులోని అంశాలకు లోబడి ఈ చట్టం కింద ఇరుపక్షాల మధ్య జరిగే అన్ని రకాల చర్యలు సివిల్ ప్రొసీజర్ (1908 లోని 5 వది) కోడ్‌కి అనుగుణంగా జరగాలి.

46. పిటీషన్లు, ప్రకటనలు రూపొందించే విధానం :

ఈ చట్టంలోని షెడ్యూల్లో పేర్కొన్న విధంగా ఆయా పరిస్థితులనుబట్టి మార్పులు చేర్పులు చేసి షెడ్యూల్లో చెప్పిన అవసరాల నిమిత్తం వాడుకొనవచ్చు.

47. కుమ్మక్కవ్వలేదనే విషయం ప్రకటన పిటీషనులో :

ఈ చట్టం కింద వివాహం రద్దుకై లేదా చెల్లనిదిగా కోరే లేదా న్యాయపరమైన వేర్పాటు కోరే పిటీషనులో పిటీషనరు, వివాహంలోని అవతల పక్షం వారు కుమ్మక్కవ్వలేదని, లేదా లాలూచీ పడలేదని ప్రకటించాలి.

ప్రకటనల ధృవీకరణ :

ఈ చట్టం కింద ప్రతి పిటీషనులోని అంశాలను ప్లెయింట్లను ఏవిధంగా ధృవీకరిస్తారో ఆవిధంగా పిటీషనరు కాని లేదా మరే ఇతర సమర్థత గల వ్యక్తికాని ధృవీకరించాలి.

48. మతి స్థిమితం లేని వారి తరపు దావాలు :

ఈ చట్టం కింద ఏ దావాలోనైనా (వైవాహిక హక్కుల పునరుద్ధరణ దావాని మినహాయించి) భర్తకి కాని భార్యకి కాని మతి స్థిమితం లేకపోతే లేక వారు బుద్ధిమాంద్యం గల వారైతే ఆ వ్యక్తి ఏ కమిటీ లేదా వ్యక్తి కస్టడీలో ఉన్నారో వారు ఆమె లేదా అతని తరఫు దావా వేయవచ్చు.

49. మైనర్ల దావాలు :

పిటీషను మైనర్ అయితే కోర్టు అనుమతితో అతను లేదా ఆమె సన్నిహితులు అతని లేదా ఆమె తరపున దావా వేయవచ్చు. ఆ సన్నిహిత వ్యక్తి ఖర్చులు భరిస్తానని రాతపూర్వకంగా ఇవ్వనంత వరకూ ఈ చట్టం కింద మైనర్ తరఫున పిటీషను దాఖలు చేయడానికి లేదు.

50. పిటీషను తాలూకు నోటీసు :

ఈ చట్టం కింద దాఖలైన పిటీషను గురించి ప్రభావితులైన వారందరికీ వారు భారతదేశం లోపల, లేదా

వెలుపలున్నప్పటికీ, హైకోర్టు సాధారణ, లేక ఎప్పటికప్పుడు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా ఇచ్చిన ఆదేశాల మేరకు వారి దృష్టికి తీసుకుని వెళ్లాల్సింది వుంది.

51. సాక్ష్యం తీసుకునే విధానం :

కోర్టుముందు విచారణకు రప్పించగలిగే సాక్షులను మౌఖికంగా ప్రశ్నించాలి. ఏ పక్షమైనా తానే సాక్ష్యం చెబుతానని ముందుకు రావచ్చు. అలా ముందుకొచ్చిన అతన్ని లేదా ఆమెను ఇతర సాక్షులను ప్రశ్నించినట్లే ప్రశ్నించాలి. వారిని క్రాస్ ఎగ్జామిన్, రీ-ఎగ్జామిన్ కూడా చేయవచ్చు.

తమ కేసుకి సంబంధించిన అంశాలను పూర్తిగా లేక కొంత భాగం అఫిడవిట్ రూపంలో దాఖలు చేసే స్వేచ్ఛ పార్టీలకి ఉంది. అయితే అవతలి పార్టీ దరఖాస్తు పెట్టుకున్నా లేదా కోర్టు ఆదేశించినా అటువంటి అఫిడవిట్ ద్వారా సాక్ష్యం చెప్పే వ్యక్తి (డిపోనెంట్) అవతలి పక్షం వారి ద్వారా మౌఖికంగా క్రాస్ అగ్జామినేషన్‌కి గురవ్వాల్సి ఉంటుంది. అటువంటి క్రాస్ అగ్జామినేషన్ అయిన తర్వాత ఆవిధంగా అఫిడవిట్ దాఖలు చేసిన పక్షం వారు ఆ సాక్షిని రీ అగ్జామిన్ చేయవచ్చు.

52. చిత్రహింసలు లేదా వదిలేయడానికి సంబంధించి భర్త, భార్య సాక్ష్యం చెప్పేందుకు అర్హత :

భార్య కాని భర్త కాని వివాహేతర సంబంధం కలిగున్నారని లేదా హింసకు పాల్పడ్డారని లేదా వదిలేసి వెళ్ళిపోయారనే కారణం చేత వివాహాన్ని రద్దు చేయాలని కోరుతూ భర్త కాని భార్య కాని పిటీషను దాఖలు చేస్తే అటువంటి హింసకు లేదా వదిలివేయడానికి సంబంధించి ఆ భర్త లేదా భార్య సాక్ష్యం చెప్పడానికి అర్హులు. వారు సాక్ష్యం చెప్పాలని బలవంత పెట్టవచ్చు.

53. ద్వారాలు మూసే అధికారం :

ఈ చట్టం కింద ఏదైనా విచారణ జరుగుతున్నప్పుడు కోర్టుకి సబబనిపిస్తే విచారణ మొత్తాన్ని, లేదా కొంత భాగాన్ని రహస్యంగా జరపొచ్చు.

54. వాయిదా వేసే అధికారం :

ఈ చట్టం కింద విచారణను కోర్టు ఎప్పటికప్పుడు మరింత సాక్ష్యం అవసరమనిపిస్తే కేసుని వాయిదా వేయవచ్చు.

55. ఆదేశాలు, డిక్రీల అమలు, మరియు వాటి నుండి అప్పీల్ :

ఈ చట్టం కింద ఏదైనా దావాలో లేదా విచారణలో కోర్టు జారీ చేసిన అన్ని డిక్రీలను, ఆదేశాలను ఆ కోర్టు ఒరిజినల్ సివిల్ జ్యూరిస్‌డిక్షన్ పరిధిలో జారీ అయిన డిక్రీ లేదా ఉత్తర్వులు మాదిరిగా అమలు చేయాల్సి వుంటుంది. లేదా అమల్లో ఉన్న చట్టాలు, నియమాలు లేదా ఉత్తర్వులు నుండి ఏవిధంగా అప్పీల్ చేసుకోవచ్చో ఆవిధంగా అప్పీల్ చేసుకోవచ్చు.

ఖర్చులకు సంబంధించిన అప్పీల్ : కేవలం ఖర్చుల గురించి అప్పీల్ చేయడానికి వీల్లేదు.

56. సుప్రీం కోర్టుకి అప్పీల్ :

ఈ చట్టం కింద హైకోర్టు జారీ చేసిన డిక్రీ (డిక్రీ నిసీ మినహాయించి) లేదా ఉత్తర్వుపై, మరియు హైకోర్టు న్యాయమూర్తి ఒరిజినల్ జ్యూరిస్‌డిక్షన్ పరిధిలో లేదా హైకోర్టుకి అప్పీల్ చేసుకోలేని ఏదైనా డివిజనల్ కోర్టు జారీ చేసిన డిక్రీ లేదా ఉత్తర్వు నుండి, అది సుప్రీంకోర్టుకి అప్పీల్ చేయతగ్గ కేసని హైకోర్టు ప్రకటిస్తే, సుప్రీంకోర్టుకి అప్పీల్ చేసుకోవచ్చు.

XIII - పునర్ వివాహం

57. పునర్ వివాహానికి పార్టీలకుండే స్వేచ్ఛ :

వివాహాన్ని రద్దుచేస్తూ, లేదా చెల్లనిదనే డిక్రీ జారీ అయివుండి సుప్రీంకోర్టు సహా ఇతర కోర్టుల్లో అప్పీల్ చేసుకోకుండా అప్పీల్ చేసుకునే గడువు ముగిసినా లేదా అప్పీల్ దాఖలై అది కొట్టివేతకు గురైనా ఆ డిక్రీ లేదా అప్పీల్ కొట్టివేత ఖరారైతే వివాహంలోని ఇరుపక్షాల వారు చట్టబద్ధంగా మరో వివాహం చేసుకోవచ్చు.

58. వివాహేతర సంబంధాల కారణంగా విడాకులు మంజూరైన వ్యక్తుల వివాహం చేయాలని ఆంగ్ల మతగురువులను (క్లర్జీమెన్) వత్తిడి చేయడానికి లేదు :

తన వివాహేతర సంబంధాల కారణంగా వివాహం రద్దయిన వ్యక్తి తన వివాహం చేసి తీరాలని ఆంగ్ల చర్చికి సంబంధించిన మతగురువులను (హోలీ ఆర్డర్‌లోని క్లర్జీమెన్) బలవంత పెట్టడానికి లేదు. ఆ వ్యక్తి వివాహాన్ని నిర్వహించడానికి నిరాకరించిన వారిపై దావా కాని, శిక్ష కాని, మందలించడం కాని చేయడానికి వీల్లేదు.

59. తన చర్చిలో వివాహం జరపడానికి ఆంగ్ల మినిస్టరు నిరాకరణ :

ఒక చర్చిలో లేదా చేపల్‌లో వివాహం జరుపుకోవడానికి అర్హతున్న వ్యక్తుల వివాహం నిర్వహించడానికి ఆ చర్చి లేదా చేపల్ మంత్రి నిరాకరిస్తే ఆ వివాహాన్ని ఆ చర్చి లేదా చేపల్ డయోసిస్ పరిధిలో ఉన్న మరో చర్చి మంత్రి తన చర్చి లేదా చేపల్‌లో నిర్వహించడానికి ఆ మంత్రి అనుమతించవచ్చు.

XIV - ఇతర అంశాలు

60. వేర్పాటు డిక్రీ లేదా రక్షణ ఉత్తర్వులు వెనక్కి తీసుకునే వరకు అవి పొందిన భార్యా సంబంధిత వ్యక్తులకు సంబంధించి వాటి చెల్లుబాటు :

ఈ చట్టం కింద ఒక భార్య తీసుకున్న న్యాయపరమైన వేర్పాటు డిక్రీ లేదా ఆస్తి రక్షణ ఉత్తర్వులను వెనక్కి తీసుకునే వరకు లేక అవి రద్దయిపోయే వరకు అవసరమైనంత మేరకు భార్యకు సంబంధించిన ఏ వ్యక్తినైనా రక్షించడానికి అవి చెల్లుతాయి.

డిక్రీ లేదా ఉత్తర్వులు అమల్లో ఉన్న కాలానికి వాటిని వెనక్కి తీసుకున్న, లేదా రద్దు చేసిన లేదా మార్చిన కాలానికి మధ్య తేదీల్లో భార్యతో కుదుర్చుకున్న ఒప్పందం లేదా ఏదైనా చర్యకు సంబంధించి అటువంటి వ్యక్తికి సంక్రమించిన హక్కు లేదా ఉపశమనం అటువంటి డిక్రీ లేదా ఉత్తర్వు వెనక్కి తీసుకున్నంత మాత్రాన, అది రద్దయినంత మాత్రాన, లేదా మార్పులకు గురైనంత మాత్రాన రద్దయిపోదు.

డిక్రీ లేదా రక్షణ ఉత్తర్వు వెనక్కి తీసుకున్న విషయంలో నోటీసు అందక భార్యకు చెల్లింపులు చేసిన వ్యక్తులకు తిరిగి చెల్లింపు : డిక్రీ లేదా ఉత్తర్వుపై ఆధారపడిన వ్యక్తులు దాన్ని పొందిన భార్యకి ఏవైనా చెల్లింపులు చేసినా లేదా మార్పిడిని అనుమతించినా లేదా ఏదైనా చర్య చేసినా, లేదా చేయాలని చూసినా ఆ డిక్రీ లేదా ఉత్తర్వు వెనక్కి తీసుకోవడమో, రద్దు చేసుకోవడమో లేదా సవరించడమో జరిగినప్పటికీ డిక్రీ లేదా ఉత్తర్వు అమల్లో ఉన్నప్పుడు అది ఎటువంటి మార్పులకు గురికాకుండా ఏవిధంగా చెల్లుబాటులో ఉన్నప్పుడు వేర్పాటు కొనసాగుతుందనే భావనతో,ఏవిధంగా రక్షణకు, తిరిగి చెల్లింపులకు అర్హులవుతారో ఆవిధంగానే ఈ సందర్భంలో కూడా అర్హులవుతారు.

అయితే చెల్లింపులు, లేదా మార్పిడి చేసే లేదా ఏదైనా చర్య తీసుకునే సమయానికి డిక్రీ లేదా ఉత్తర్వు వెనక్కి తీసుకోబడిందని లేదా రద్దు చేయబడిందని లేదా మార్పులకు గురైందని, వేర్పాటు కొనసాగడం లేదనే విషయం అటువంటి వ్యక్తుల దృష్టికి వచ్చుంటే వారికి ఆ అర్హత ఉండదు.

61. క్రిమినల్ కన్వసేషన్ కారణంగా దావా వేయడానికి వీల్లేదు :

ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత సెక్షన్ 2 మరియు సెక్షన్ 10 కింద పిటీషను దాఖలు చేయడానికి అర్హతున్న ఏ వ్యక్తి కూడా తన భార్యతో క్రిమినల్ కన్వర్సేషన్ చేశారనే కారణంగా వేసే దావాలు స్వీకరించబడవు.

62. నియమాలు చేసే అధికారం :

హైకోర్టు ఎప్పటికప్పుడు ఈ చట్టం కింద అవసరమైతే నియమాలు రూపొందించవచ్చు. సవరించవచ్చు, లేదా మరిన్ని జత చేయవచ్చు. అయితే ఈ చట్టం కింద చేసే నియమాలు సివిల్ ప్రొసీజర్ కోడ్, 1908 (1908 లోని 5 వది) కి లోబడి చేయాల్సి ఉంటుంది. ఈ విధమైన నియమాలు, మార్పులు, చేర్పులన్నింటిని అధికార గెజెట్‌లో ప్రచురించాల్సి ఉంటుంది.

*****

21. ముస్లిం వివాహాల రద్దు చట్టం 1939

(1939 లోని 8వది) (17 మార్చి, 1939)

ముస్లిం చట్టం కింద వివాహిత స్త్రీలు వివాహం రద్దు చేసుకోవడానికి వేసుకున్న దావాలకు సంబంధించి ముస్లిం చట్టంలోని అంశాలను క్రోడీకరించడానికి, వాటిని స్పష్టీకరించడానికి, మరియు వివాహ బంధంతో ఒక వివాహిత ముస్లిం మహిళ ఇస్లాం మతాన్ని త్యజించడంతో వచ్చే పర్యవసానానికి సంబంధించి తలెత్తే అనుమానాలను తొలగించడానికి ఈ చట్టం ఉండి, ఈ విధంగా శాసించబడింది.

1. క్లుప్త శీర్షిక, మరియు పరిధి :

1) ఈ చట్టాన్ని ముస్లిం వివాహాల రద్దు చట్టం, 1939 గా పిలవాలి.

2) ఈ చట్టం జమ్మూ, కాశ్మీర్ రాష్ట్రంలో మినహాయించి భారతదేశమంతటా వర్తిస్తుంది.

2. వివాహం రద్దు చేయడానికి గల కారణాలు :

కింద పేర్కొన్న ఒకటి లేదా మరిన్ని కారణాలపై ముస్లిం చట్టం కింద పెళ్లయిన స్త్రీలు తమ వివాహాన్ని రద్దు చేసుకోవడానికి డిక్రీ పొందవచ్చు, అవేమిటంటే –

i) భర్త ఆచూకి నాలుగు సంవత్సరాలుగా తెలియకుండాపోతే;

ii) భర్త తనను రెండు సంవత్సరాల పాటు నిర్లక్ష్యం చేసినా లేదా ఆమెను పోషించడంలో విఫలమైనా;

iii) భర్తకు ఏడు సంవత్సరాలకు పైగా కారాగార శిక్ష విధించబడితే;

iv) భర్త మూడు సంవత్సరాల పాటు సరైన కారణం లేకుండా తన వైవాహిక బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైతే;

v) భర్త పెళ్లయ్యేనాటికి, ఆ తర్వాత నపుంశకుడైతే;

vi) భర్త రెండేళ్లపాటు మతిస్థిమితం కోల్పోయాడు, లేదా కుష్ఠు రోగం, లేదా సుఖవ్యాధులతో బాధపడుతుంటే.

vii) ఆమెకు పదిహేను సంవత్సరాలు నిండక ముందు ఆమె తండ్రి లేదా సంరక్షకుడు ఆమె పెళ్లి చేస్తే, పద్దెనిమిది సంవత్సరాలు నిండక ముందే ఆమె ఆ వివాహాన్ని కాదనుకుంది.

అయితే వివాహం అనంతరం కార్యం జరగలేదు.

viii) భర్త ఆమెపట్ల క్రూరంగా ప్రవర్తిస్తే, అంటే

ఎ) ఆమెను అలవాటు చొప్పున కొట్టడం లేదా తన క్రూరమైన వ్యవహారశైలితో ఆమె బ్రతుకు నరకప్రాయం చేయడం. ఆ వ్యవహారశైలి శారీరక హింసే కానవసరం లేదు, లేదా

బి) అప్రతిష్టపాలైన స్త్రీలతో పొత్తు పెట్టుకున్నా, లేదా భ్రష్ట పట్టిన జీవితం గడుపుతున్నా, లేదా

సి) ఆమెను బలవంతంగా అనైతిక జీవితంలోకి నెట్టేందుకు ప్రయత్నించినా, లేదా

డి) ఆమె ఆస్తిని అమ్మేసినా, లేదా దానిపై ఆమె చట్టపరమైన హక్కులు వినియోగించుకునేందుకు అడ్డుబడినా, లేదా

ఇ) ఆమె మతపరమైన విశ్వాసాలకు లేదా ఆచారాలకు అడ్డుపడ్డా, లేదా

యఫ్) భర్తకు ఒకరికంటే ఎక్కువ మంది భార్యలున్నారు, ఖురాన్ ఆదేశించిన విధంగా ఆమె సమదృష్టితో చూడటం లేదు.

ix) వివాహం రద్దు చేయడానికి ముస్లిం చట్టం గుర్తించే ఇతర ఏ కారణం ఉన్నా, అయితే,

ఎ) శిక్ష విషయంలో తుది తీర్పు జారీ కానిదే (iii) కారణం కింద డిక్రీ మంజూరు చేయకూడదు.

బి) (i) కారణం కింద జారీ అయిన డిక్రీ ఆరునెలల వరకు అమల్లోకి రాదు. ఈ గడువులోపు భర్తకాని, అతను నియమించిన ప్రతినిధి కాని హాజరై తాను సహజీవన బాధ్యతలను నెరవేర్చడానికి సిద్ధమేనని కోర్టుని సంతృప్తి పర్చితే కోర్టు ఆ డిక్రీని పక్కన పెడుతుంది, మరియు

సి) (v) కారణం కింద డిక్రీ జారీ చేసే లోపు భర్త అర్జీ పెట్టుకుంటే తాను నపుంశకత్వం బారి నుండి బైటపడ్డానని ఉత్తర్వు జారీచేసిన ఏడాది లోపు కోర్టుని సంతృప్తి పర్చాలనే ఉత్తర్వు జారీచేయవచ్చు. ఆ గడువులోపు భర్త కోర్టుని ఆవిధంగా సంతృప్తి పర్చగలిగితే ఆ కారణం కింద డిక్రీ జారీ చేయడానికి లేదు.

3. భర్త ఆచూకి తెలియనప్పుడు భర్త వారసులకు నోటీసు జారీ :

సెక్షన్ 2 క్లాజు (i) కింద వేసే దావాకి ఇది వర్తిస్తుంది –

ఎ) ప్లెయింట్ దాఖలు చేసే నాటికి అతను చనిపోయివుంటే ఆనాటికి ముస్లిం మతం ప్రకారం అతని వారసులు ఎవరైతే వారందరి పేర్లు, చిరునామాలు ప్లెయింట్‌లో పేర్కొనాలి,

బి) అటువంటి వ్యక్తులకు దావా నోటీసు అందేట్లు చూడాలి, మరియు

సి) ఈ దావాలో ఆ వ్యక్తులకు తమ వాదనలు చెప్పుకునే హక్కుంటుంది.

అయితే భర్త పెద్దనాన్న / చిన్నాన్నలు, అన్నదమ్ములు అతని వారసులు కాకపోయినప్పటికీ వారిని దావాలో పార్టీలుగా చూపాలి.

4. మతమార్పిడి ప్రభావం :

ఒక ముస్లిం, వివాహిత స్త్రీ ఇస్లాం మతాన్ని వదులుకున్నా లేక ఇస్లాం నుండి మతమార్పిడి చేసుకుని మరో మతం స్వీకరించినా ఆ చర్య ద్వారా దానంతటదే వివాహం రద్దు అయినట్లు కాదు.

అయితే ఈ విధంగా మతాన్ని త్యజించి, లేదా మతమార్పిడి చేసుకున్న స్త్రీ సెక్షన్ 2 కింద పేర్కొన్న కారణాలపై ఆధారపడి తన వివాహాన్ని రద్దు చేసే డిక్రీ పొందడానికి అర్హురాలు.

అయితే మరో మతం త్యజించి ఇస్లాం స్వీకరించి మళ్లీ తిరిగి పూర్వపు మతాన్ని స్వీకరించిన స్త్రీలకు ఈ సెక్షన్ లోని అంశాలు వర్తించవు.

5. మెహెర్‌పై ఆమెకున్న హక్కులపై ప్రభావం ఉండదు:

వివాహం రద్దయితే ముస్లిం చట్టం ప్రకారం వివాహిత స్త్రీకి మెహెర్ లేదా అందులోని భాగం పొందడానికి కలిగే హక్కుపై ఈ చట్టంలోని అంశాల ప్రభావం ఏ విధంగానూ ఉండదు.

వివాహాలు, విడాకులకు సంబంధించి క్రోడీకరించని ముస్లిం చట్టం

సంక్షిప్త వివరణ

ముస్లిం వివాహం ఒక కాంట్రాక్టుని పోలి ఉంటుంది. కాంట్రాక్టులో మాదిరిగానే ఇందులో ఇరుపక్షాలు వివాహానికి తమ సమ్మతి తెలిపే సామర్థ్యం కలిగుండాలి. ఒకరు ప్రతిపాదిస్తే మరొకరు అంగీకారం తెలపాలి. చట్టపరంగా వారి బాంధవ్యానికి ఎటువంటి అడ్డంకులు ఉండకూడదు. వివాహానికి సంబంధించి వీలైనంత మేరకు స్త్రీ పురుషులకు మధ్య సమాన హక్కులు కల్పించే ప్రయత్నం చేశారు మహమ్మద్ ప్రవక్త. వివాహమైనప్పటికీ స్త్రీలు తమ అస్తిత్వాన్ని కోల్పోరు. ఈ చట్టంలో ఉన్న అంశాలను బట్టి స్త్రీలకు స్వతంత్రంగా వారి పేరిట ఆస్తులు ఉండొచ్చు. వారి ఆస్తిహక్కుపై వివాహం ఎటువంటి ప్రభావం చూపదు.

ఇతర మతాల్లో మాదిరిగా ఈ మతంలో వివాహం విడదీయరాని శాశ్వత బంధం కాదు. భార్యాభర్తలు ఇరువురికీ విడాకులు పొందే అవకాశం కల్పించింది ఖురాన్. ఇది శాశ్వత బంధం కాదు కాబట్టి స్త్రీలు ఇందువల్ల ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు గాను ఆమెకు కొంత భద్రత కల్పించాలనే ఉద్దేశంతో వివాహ సమయంలోనే భర్త భార్యకి 'మెహెర్' ఇచ్చే విధానం వచ్చింది. ఇది సాధారణంగా అనుకున్నట్లు క్రయధనం కాదు. ఆమె తనని సమర్పించు కున్నందుకు భర్త భార్యకు ఇచ్చే కానుక. దాన్ని ఏ విధంగా అనుకున్నప్పటికీ అది వివాహంలో స్త్రీలకు ఆర్థికంగా కొంత భద్రత కల్పిస్తుంది. మెహర్‌ని కొంత భాగం వివాహ సమయంలో కాని, కార్యానంతరం కాని ఇస్తారు. మిగిలిన మెహెర్‌ని విడాకులు పొందినప్పుడు కాని భర్త చనిపోయినప్పుడు కాని ఇస్తారు. ఖురాన్ రాసిన నాటికి అరబు ప్రాంతం వారు వర్తకం నిమిత్తం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి సంచరిస్తూ ఉండేవారు. ఒక ప్రాంతంలో వారు స్థిరపడిపోయే అవకాశాలు ఉండేవి కాదు. అందువల్ల ఆ మతంలో విడాకులు పొందిన తర్వాత నెలవారీ లేదా మరో విధమైన పద్ధతిలో మనోవర్తి ఇచ్చే సంప్రదాయం కాని చట్టాలు కాని అభివృద్ధి చెందలేదు.

ముస్లిం చట్టాల ప్రకారం భార్యను వివాహకాలంలో పోషించడం భర్త గురుతర బాధ్యత. విడాకులు పొందిన తర్వాత కూడా ఇద్దత్ కాలంలో ఆమెకు భర్త మనోవర్తి ఇవ్వాలి. భార్యాభర్తలు ఇరువురూ పునర్‌వివాహం చేసుకునే అవకాశం ఈ మతం కల్పిస్తుంది. కనుక పిల్లల తండ్రి ఎవరో తెలుసుకోవడానికి వీలుగా ఈ ఇద్దత్ కాలాన్ని విధించారు. విడాకుల విషయంలో ఇద్దత్ కాలమంటే విడాకులైన తర్వాత వరుసగా మూడు నెలలు. ఆమె గర్భవతి అయితే కాన్పు అయ్యే వరకు ఇద్దత్ కాలం కొనసాగుతుంది. భర్తలు మనోవర్తి ఈ కాలం వరకే భార్యలకు చెల్లించాలి.

వివాహానికి ముందే మెహెర్ ఎంతో నిర్ణయించుకుని అది చెల్లించే పద్ధతిని బహుశా అందుకే అలవర్చుకుని ఉంటారు. ఇది ఆనాటికి స్త్రీలకు భద్రత కల్పించే ఒక అభ్యుదయకర చర్యే. కాని రాను రాను ఆ 'మెహెర్' చెల్లించే విధానాన్ని ఆచరణలో నామమాత్రం చేసేశారు. మెహెర్ ఇవ్వడం వివాహంలో భాగం కనుక మొక్కుబడిగా అతి స్వల్ప రుసుమును ఇవ్వనారంభించారు. ఇటు చట్టప్రకారం హక్కుగా లభించాల్సిన మెహెర్ నామమాత్రమైపోయి అటు మనోవర్తి హక్కు కేవలం ఇద్దత్ కాలం వరకే ఉండటంతో ముస్లిం స్త్రీలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు.

వివాహం

నికాహ్ (వివాహం) చేసుకునే విధానం :

వధువరులలో ఒకరు ఇద్దరు మగసాక్షులు, లేదా ఒక మగసాక్షి, ఇద్దరు స్త్రీ సాక్షుల సమక్షంలో వివాహ ప్రతిపాదన చేయాలి. అదే సమావేశంలో రెండవ వారు ఈ సాక్షుల సమక్షంలో అందుకు తమ అంగీకారం తెలపాలి. మెహెర్ ఎంతో నిర్ణయించుకోవాలి.

వివాహానికి సంబంధించిన షరతులు :

1. వివాహ ప్రతిపాదన, అంగీకారం.

2.. **వివాహం చేసుకోవడానికి సమర్ధత :**

వివాహానికి అంగీకారం తెలిపే వయస్సు వధూవరులకు ఉండాలి. ముస్లిం మతం ప్రకారం రజస్వలైన యువతులకు యవ్వనంలో అడుగుపెట్టి యువకులకు మైనారిటీ తీరినట్లు వారు అంగీకారం తెలపొచ్చు. అలా మైనారిటీ తీరని ఆడపిల్లల వివాహం జరిగితే ఆమె సంరక్షకులు అంగీకారం తెలపాలి.

3. న్యాయపరమైన అవాంతరాలు :

ఇందులో నాలుగు రకాల అవాంతరాలున్నాయి: మొదటిది

I) బొత్తిగా వివాహం చేసుకోవడానికి వీలు లేని అవాంతరాలు

ఎ) కింద పేర్కొన్న రక్త సంబంధీకులు పెళ్లి చేసుకోకూడదు, ఒక పురుషుడు

i) తన తల్లిని లేదా అమ్మమ్మ/ నాయనమ్మలు, వారి పూర్వీకులు;

ii) తన కూతురు, లేదా మనవరాలు, వారి సంతతి,

iii) తన సోదరి, అది సంపూర్ణ, అర్ధ, యోనిజ సంబంధీకులు అయినప్పటికీ

iv) తన సోదర సోదరీల పిల్లలు, వారి సంతానం;

v) తన తల్లిదండ్రుల అక్కచెల్లెళ్ళు, వారి పూర్వీకులు;

బి) వివాహాల ద్వారా బంధువులైన కింద పేర్కొన్న వారిని పెళ్ళి చేసుకోకూడదు.

i) భార్య తల్లి లేదా ఆమె అమ్మమ్మ / నాయనమ్మ, వారి పూర్వీకులు

ii) భార్య కూతురు, లేదా మనవరాలు, ఆమె సంతతి

iii) తండ్రి లేదా తాతల భార్య, వారి పూర్వీకులు

iv) కొడుకు, కొడుకు కొడుకు, కూతురి కొడుకు భార్య వారి సంతతి.

సి) పెంపకానికి సంబంధించిన నిషేధాలు :

తల్లి కాకుండా మరో స్త్రీ ఒక మగశిశువుకి పాలిచ్చి ఉంటే ఆమె అతనికి పెంచిన తల్లి అవుతుంది. ఆ పురుషుడు తన పెంచిన తల్లిని కాని ఆమె కూతుర్ని కాని అంటే ఫోస్టర్ సోదరిని కాని పెళ్లి చేసుకోకూడదు.

(ఎ), (బి), (సి) లలో పేర్కొన్న మూడు రకాల బాంధవ్యాలకు లోబడి పెళ్ళిళ్లు జరగకూడదు.

అలా జరిగిన పెళ్ళిళ్లు చెల్లవు. వాటిని 'బాతిల్' వివాహాలు అంటారు.

II) వివాహం చేసుకోవడానికి (పరిస్థితులను బట్టి) వీలులేని అవాంతరాలు:

ఎ) **చట్ట విరుద్ధమైన బాంధవ్యం :** రక్తసంబంధం లేదా వివాహం ద్వారా పెంపకం ద్వారా కలిగిన బంధుత్వమున్న ఇద్దరు స్త్రీలను ఒక పురుషుడు పెళ్లి చేసుకోకూడదు.

బి) ఒక పురుషునికి నలుగురు భార్యలు ఉండొచ్చు. నలుగురు భార్యలున్న పురుషుడు ఐదవ వివాహం చేసుకోకూడదు.

సి) సాక్షులు లేకుండా వివాహం చేసుకోకూడదు. అటువంటి వివాహాలు అక్రమం కాని చెల్లనివి కావు. షియాల్లోనైతే అటువంటి వివాహాలు కూడా చెల్లుతాయి.

డి) ఇతర మతస్తులతో వివాహం : ఒక మత గ్రంథ ప్రవచనాలపై ఆధారపడిన మతం (క్రైస్తవమతం, జుడాయిజమ్ మొదలైనవి) కి చెందిన వ్యక్తిని, కితాబి (పురుషుడైతే), కితాబియా (స్త్రీయితే) అంటారు. హనాఫీ చట్టం ప్రకారం, ముస్లిం పురుషులు కితాబియాని పెళ్లి చేసుకోవచ్చు. కాని విగ్రహ ఆరాధకులను చేసుకోకూడదు. ముస్లిం స్త్రీలు కితాబీని పెళ్లి చేసుకోకూడదు, విగ్రహ ఆరాధకులనూ చేసుకోకూడదు. షియాలలో స్త్రీ పురుషులు ఎవరూ పరమతస్తులను వివాహం చేసుకోకూడదు.

ఇ) ఇద్దత్ కాలం అనుభవిస్తున్న స్త్రీని వివాహం చేసుకుంటే ఆ వివాహం అక్రమం.

III) నిషేధిత అవాంతరాలు :

ఎ) బహుభార్యత్వం / బహుభర్తృత్వం : ఒక పురుషుడు ఒక వివాహితతో కాని ఒక వివాహిత మరో పురుషుని కాని వివాహం చేసుకుంటే అది చెల్లదు. వారు భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 494 కింద శిక్షార్హులవుతారు.

బి) **ముస్లిమేతరునితో ముస్లిం స్త్రీ వివాహం :** అటువంటి వివాహం చెల్లదు.

IV) ఆదేశిక అవాంతరాలు :

ఎ) ఒక గర్భవతిని పెళ్ళిచేసుకోవడం.

బి) భార్యకు మూడు సార్లు విడాకులిచ్చినట్లు ప్రకటించిన తర్వాత మరో వివాహం చేసుకుని ఆ వివాహ కార్యం అయిన తర్వాత ఆమెతో విడాకులు పొందిన తర్వాత మళ్లీ తన భార్యతో పెళ్లి చేసుకోకూడదు. అలా మధ్యలో మరో వ్యక్తితో వివాహం జరగనిదే తన భార్యను పునర్ వివాహం చేసుకోకూడదు.

సి) తీర్థయాత్రల్లో ఉండగా పెళ్లి చేసుకోకూడదు.

డి) మరణశయ్యపై ఉన్న ఒక వ్యాధిగ్రస్తుణ్ణి ఒక స్త్రీ పెళ్లి చేసుకోకూడదు. అలా చేసుకున్న పెళ్లి అక్రమం. అతను కోలుకుంటే ఆ వివాహం చెల్లుతుంది.

చెల్లుబాటుపై ఆధారపడి వివాహ రూపాలు :

1. బాతిల్ వివాహాలు : ఇవి అసలు చెల్లని వివాహాలు.

2. ఫాసిద్ వివాహాలు : ఇది అక్రమ వివాహాలు.

3. సాహి వివాహాలు : వివాహానికి సంబంధించి అన్ని షరతులకు లోబడి జరిగిన వివాహాలను సాహి

వివాహాలు అంటారు. ఇవి అన్ని విధాలుగా చెల్లే వివాహాలు.

బాతిల్, ఫాసిద్ వివాహాల మధ్య వ్యత్యాసం :

బాతిల్ మరియు ఫాసిద్ వివాహాల మధ్య తేడా ఏమిటంటే బాతిల్ వివాహంలో కలిగిన సంతానాన్ని అక్రమంగా భావిస్తారు. వైవాహిక హక్కులు, బాధ్యతలు అందులో ఉండవు. భార్య మనోవర్తి, మెహెర్‌లకు అర్హురాలు కాదు. ఆమె భర్తకు వారసురాలు కాదు.

ఫాసిద్ వివాహాల్లో భార్యాభర్తలకు మధ్య వైవాహిక సంబంధం ఏర్పడకపోతే బాతిల్ మాదిరిగానే ఇది కూడా చెల్లని వివాహం.

వైవాహిక బంధం ఏర్పడిన ఫాసిద్ వివాహాల్లో

i) విడాకులు పొందినా, భర్త చనిపోయినా మూడు నెలల వరకు ఇద్దత్ పాటించాలి.

ii) ఆమెకు మెహెర్ చెల్లించాలి.

iii) ఈ వివాహాల్లో పిల్లలు సక్రమ సంతానమే.

iv) ఈ వివాహం ద్వారా భార్యాభర్తలు ఒకరు మరొకరి విషయంలో వారసులు కారు.కాబట్టి భర్త / భార్య ఆస్తుల్లో వారసత్వంగా ఏమీ లభించదు.

v) విడాకులు కోర్టు ద్వారా తీసుకోవాలి.

ముతా వివాహాలు :

ముస్లిం చట్టం ప్రకారం తాత్కాలిక వివాహాలు చేసుకునే అవకాశం ఉంది. వాటిని 'ముతా' వివాహాలు అంటాం. ముతావివాహం అన్ని విధాలా సాధారణ వివాహాలను పోలి ఉంటుంది కాని అందులో కచ్చితంగా ఆ వివాహం ఎన్నాళ్లు కొనసాగుతుందనే కాలపరిమితిని పేర్కొంటారు. ఆ కాలపరిమితి అవ్వగానే ఆ వివాహం రద్దయిపోతుంది. వివాహం రద్దయిన తర్వాత భార్య ఇద్దత్ పాటించాలి. ఆమె మెహెర్‌కి అర్హురాలు. వివాహ కాలంలో ఇద్దత్ కాలంలో మనోవర్తికి అర్హురాలు. ఈ వివాహంలో కలిగిన సంతానం సక్రమ సంతానమౌతారు.

విడాకులు

ముస్లిం వివాహాలను రద్దు చేయడానికి అనేక పద్ధతులున్నాయి. అనేక రకాల విడాకులున్నాయి. ఈ మతం కింద ఇందులో కొన్ని రకాల వివాహాలను రద్దు చేసుకోవడానికి కోర్టుకి వెళ్ళనవసరం లేదు. విడాకుల క్రోడీకరణ జరగలేదు. స్త్రీలకు విడాకులు పొందే అవకాశం కల్పిస్తూ ముస్లిం వివాహాల రద్దు చట్టం, 1939 వచ్చింది. ఆ చట్టం ప్రకారం విడాకులు కోర్టు ద్వారా పొందొచ్చు, అది క్రోడీకరించిన చట్టం. ఇక్కడ కేవలం క్రోడీకరించని విడాకులను ప్రస్తావించడం జరిగింది.

విడాకులను తలాక్ అంటారు. వాటిలో కొన్ని కొన్ని వెనక్కి తీసుకోగల్గినవి కొన్ని (తలాక్ ఉల్ రజాయి), ఒక్కసారి ప్రకటించిన తర్వాత వెనక్కి తీసుకోలేనివి కొన్ని (తలాక్ – ఉల్ – బెయిన్). ఈ పద్ధతుల్లో తలాక్ ఇవ్వొచ్చు.

1. **తాలక్–ఉల్–సున్నత్ :** ఇది మహమ్మద్ ప్రవక్త ప్రోత్సహించిన విధానం. వీటిలో రెండు రకాలున్నాయి.

i) అహసన్: భర్త, భార్య నెలసరి కాని 'పవిత్ర' కాలంలో ఒకసారి విడాకుల ప్రకటన చేస్తాడు. ఆ తర్వాత ఇద్దత్ కాలంలో(మూడు మాసాలు) ఆమెతో లైంగిక సంబంధం పెట్టుకోకుండా ఉంటే దానితో వివాహం రద్దవుతుంది.

ii) హాసన్: భర్త మొదటి ప్రకటన భార్య నెలసరి కాని 'పవిత్ర' కాలంలో (దాన్ని టుర్ అంటారు) చేస్తాడు. మరుసటి నెల టుర్ కాలంలో రెండవ ప్రకటన, మూడవ నెల టుర్ కాలంలో మూడవ ప్రకటన చేస్తాడు. ఆ మూడవ ప్రకటనతో వివాహం రద్దయిపోతుంది. ఈ మూడు నెలల్లో వారి మధ్య లైంగిక సంబంధం ఏర్పడ కూడదు.

2. **తలాక్ – ఉల్ – బిద్దత్ :** దీన్ని తలాక్–ఉల్–బెయిన్ అని కూడా అంటారు. ఇది సక్రమ విధానమని ముస్లిం మతస్తులలో ఏ ఒక్క శాఖ అనుకోదు. కాని ఇది ఆచరణలో కొనసాగుతుంది. రెండు రకాలుగా ఈ విడాకులు ప్రకటించవచ్చు.

i) ఒక టుర్ కాలంలో భర్త మూడు సార్లు "నీకు నేను విడాకులిస్తున్నాను" అని ప్రకటించినా లేదా ఒకేసారి మూడు వాక్యాలుగా "నీకు నేను విడాకులిస్తున్నాను. నీకు నేను విడాకులిస్తున్నాను. నీకు నేను విడాకులిస్తున్నాను" అన్నా వివాహం రద్దయిపోతుంది. రెండవ పద్ధతి ఏమిటంటే ఒక టుర్ కాలంలో "నీకు నేను వెనక్కి తీసుకోలేని విడాకులు ఇస్తున్నాను" అని ఒక్కసారి ప్రకటిస్తే చాలు వివాహం రద్దయిపోతుంది.

3. **తలాక్ –ఇ–తఫవీజ్ :** విడాకులిచ్చే అధికారాన్ని భర్త భార్యకి అప్పగించి ఆమె ఆ అధికారాన్ని వినియోగించుకుని విడాకులు తీసుకోవడాన్ని తలాక్–ఇ–తఫవీజ్ అంటారు.

4. **ఖులా :** తనని ఆ వివాహ బంధం నుండి విముక్తి చేయమని భార్య భర్తను కోరి అందుకు ఆమె అతనికి ప్రతిఫలం చెల్లించుకుని, ఆమె ప్రతిపాదనను భర్త అంగీకరిస్తే అది ఖులా పద్ధతిలో విడాకులకు దారితీస్తుంది.

5. **ముబారత్ :** భార్యాభర్తలు ఇరువురు పరస్పరం విడిపోవడానికి అంగీకరిస్తే అది ముబారత్ పద్ధతిలో విడాకులకు దారితీస్తుంది. ఇందులో విడాకుల ప్రతిపాదన ఎవరైనా చేయవచ్చు.

6. **ఇలా :** మైనారిటీ తీరిన భర్త "దేవునిపై ప్రమాణం చేసి నా భార్యని నేను తాకను" అని నాలుగు నెలల పాటు ఆమెతో లైంగిక సంబంధం పెట్టుకోకపోతే అది ఇలా పద్ధతిలో విడాకులు అనిపించుకుంటుంది.

7. **జిహార్ :** భర్త భార్యని తన తల్లితో కాని, నిషేధిత బాంధవ్యాల పరిధిలోని స్త్రీతో కాని పోల్చితే భర్త పాప పరిహారం చేసే వరకు ఆమె అతని నుంచి దూరంగా ఉండొచ్చు. పాప పరిహారమంటే ఒక దాసుణ్ణి విముక్తి చేయడం; రెండు నెలలపాటు ఉపవాసముండటం మరియు అరవై మంది పేదవారికి అన్నదానం చేయడం. భర్త పాపపరిహారం చేసేట్లు లేదా విడాకులు మంజూరు చేసేట్లు డిక్రీ మంజూరు చేయమని భార్య విడాకుల పిటిషను దాఖలు చేయొచ్చు. కాబట్టి భర్త పాపపరిహారం చేసుకోకపోతే ఆమె విడాకులు మంజూరు చేయమని కోర్టుని ఆశ్రయించవచ్చు.

8. **లియాన్ :** భార్య పరపురుషునితో లైంగిక సంబంధం ఏర్పరచుకుందని భర్త అసత్య ఆరోపణ చేస్తే ఆమె కోర్టులో విడాకులు పిటిషను దాఖలు చేసి వివాహాన్ని రద్దు చేసుకోవచ్చు.

ఇవి కాకుండా ముస్లిం వివాహాల రద్దు చట్టం, 1939 కింద పేర్కొన్న కారణాలు ఆధారంగా ముస్లిం వివాహాన్ని రద్దు చేయొచ్చు.

*****

22. భారత క్రైస్తవ వివాహ చట్టం 1872

(1872 లో 15 వది) (18 జూలై 1872)

భారతదేశంలో క్రైస్తవుల వివాహాల నిర్వహణకు సంబంధించిన చట్టాన్ని క్రోడీకరించేందుకు, సవరించేందుకు ఈ చట్టం.

ప్రవేశిక : భారతదేశంలో క్రైస్తవ మతాన్ని ఆచరించే వ్యక్తుల వివాహాల నిర్వహణకు సంబంధించిన చట్టాన్ని క్రోడీకరించేందుకు, సవరించేందుకు ఈవిధంగా శాసించడమైనది.

ప్రాథమికం

1. క్లుప్తశీర్షిక :

ఈ చట్టాన్ని భారత క్రైస్తవ చట్టం, 1872 అని పిలవాలి.

వర్తింపు : నవంబరు 1, 1956 కి ముందున్న ట్రావన్‌కోర్ – కొచిన్, మణిపూర్, జమ్మూ – కాశ్మీర్ రాష్ట్రాల్లో మినహాయించి భారతదేశమంతటా ఈ చట్టం వర్తిస్తుంది.

అమలు : (రీపీలింగ్ చట్టం, 1874 ద్వారా తొలగించబడింది)

ఈ చట్టంలోని ఎటువంటి అంశాలైన పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంలోని రెనాన్‌కాంట్స్‌కు వర్తించవు.

2. (రీపీలింగ్ చట్టం, 1874 ద్వారా రీపీల్ అయ్యింది)

3. నిర్వచనాలు :

సందర్భానికి వ్యతిరేకంకానంత వరకు ఈ చట్టప్రకారం "చర్చి ఆఫ్ ఇంగ్లాండ్' మరియు 'ఆంగ్లికన్' అంటే చట్టప్రకారం స్థాపించిన, చర్చి ఆఫ్ ఇంగ్లాండ్' అని అర్థం చేసుకోవాలి. "చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్" అంటే చట్టప్రకారం స్థాపించిన 'చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్' అని అర్థం చేసుకోవాలి. 'చర్చి ఆఫ్ రోమ్' మరియు 'రోమన్ కాథలిక్' అంటే రోమ్‌లోని పోప్‌ను మతగురువుగా స్వీకరించే చర్చిలని అర్థం. 'చర్చి' అనే పదంలో చేపల్ లేదా క్రైస్తవుల బహిరంగ ప్రార్థనా మందిరం కోసం వాడే భవంతి కూడా ఇమిడున్నాయి.

"భారత్" అంటే ఈ చట్టం వర్తించే ప్రాంతాలు.

"మైనర్" అంటే వితంతువు, విధవరాలు కాని 21 ఏళ్లు నిండిన వ్యక్తి.

'క్రైస్తవులు' అంటే క్రైస్తవ మతాన్ని నమ్మేవారు,

'భారతీయ క్రైస్తవులు' అంటే ఇక్కడ క్రైస్తవ మతం పుచ్చుకున్న స్థానికుల వారసులు మరియు మతం పుచ్చుకున్న వారు;

మరియు "జనన, మరణాలు, వివాహాల రిజిస్ట్రార్ జనరల్" అంటే జనన, మరణాలు మరియు వివాహాల రిజిస్ట్రేషన్ చట్టం, 1886 (1886 లోని 6 వది) కింద నియమించిన జనన, మరణాల, వివాహాల రిజిస్ట్రార్ జనరల్.

ఒకటవ భాగం

వివాహాలు నిర్వహించాల్సిన వ్యక్తులు

4. ఈ చట్ట ప్రకారం వివాహాలు జరగాలి :

ఒక క్రైస్తవునికి మరొకరికీ మధ్య లేదా ఇద్దరు క్రైస్తవులకి మధ్య వివాహం ఈ కింది సెక్షన్‌లో చెప్పిన మాదిరిగా జరగాలి; చట్టంలోని ఈ అంశాల ప్రకారం వివాహాల జరగకపోతే ఆ వివాహం చెల్లదు.

5. వివాహాన్ని నిర్వహించాల్సిన వ్యక్తులు :

భారతదేశంలో వివాహాలను నిర్వహించాల్సింది

1. ఎపిస్కోపల్ ఆర్డినేషన్ పొందిన ఏ వ్యక్తయినా అయితే వారు మినిస్టరైన చర్చి అనుసరించే నియమాలు, కర్మకాండ, వేడుకలు, సాంప్రదాయాలను అనుసరించి వివాహాన్ని నిర్వహించాల్సి ఉంటుంది;
2. చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్‌కి చెందిన క్లర్జీమెన్ అయితే వారు చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్ అనుసరించే నియమాలు, కర్మకాండ, వేడుకలు, సాంప్రదాయాల ప్రకారం వివాహాన్ని నిర్వహించాల్సి ఉంటుంది;
3. వివాహాలు నిర్వహించడానికి ఈ చట్టం కింద లైసెన్సు పొందిన మతగురువులు (మినిస్టర్లు);
4. ఈ చట్టం కింద నియమితులైన వివాహ రిజిస్ట్రార్ ద్వారా లేదా వారి సమక్షంలో;
5. ఈ చట్టం కింద భారతీయ క్రైస్తవుల మధ్య వివాహానికి సంబంధించిన ధృవీకరణ పత్రం జారీ చేయడానికి లైసెన్సు ఉన్న ఏ వ్యక్తియినా.

6. వివాహ నిర్వహణకు లైసెన్సుల జారీ, రద్దు :

రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనకు సంబంధించి తన ఆధీనంలోఉన్న ప్రాంతాల్లో వివాహ నిర్వహణకు మతపరమైన మినిస్టర్లకు లైసెన్సులు జారీ చేస్తూ అధికార గెజిట్‌లో నోటిఫికేషన్ జారీ చేయొచ్చు. అదేవిధంగా లైసెన్సులు రద్దుచేస్తూ కూడా నోటిఫికేషన్ జారీ చేయొచ్చు.

7. వివాహ రిజిస్ట్రార్‌లు :

రాష్ట్ర ప్రభుత్వం తాను పరిపాలిస్తున్న జిల్లాల్లో వివాహ రిజిస్ట్రార్‌గా లేదా వివాహ రిజిస్ట్రార్‌లుగా క్రైస్తవులను వారి పేరిట నియమించడం కాని తాత్కాలికంగా పదవిలో కొనసాగవలసిందిగా కాని నియమించడం కాని చేయవచ్చు.

సీనియర్ వివాహ రిజిస్ట్రార్ : ఒక జిల్లాలో ఒకరికన్నా ఎక్కువ మంది వివాహ రిజిస్ట్రార్‌లుంటే రాష్ట్ర ప్రభుత్వం వారిలో ఒకర్ని సీనియర్ వివాహ రిజిస్ట్రార్‌గా నియమించవచ్చు.

మేజిస్ట్రేట్ ఏ సందర్భంలో వివాహ రిజిస్ట్రార్ అవుతారు :

ఒక జిల్లాలోని ఏకైక వివాహ రిజిస్ట్రార్ జిల్లా నుండి గైర్హాజరైనా లేదా జబ్బుపడినా లేదా ఆ పదవిని తాత్కాలికంగా భర్తీ చేయలేకపోయినా ఆ గైర్హాజరీ, అనారోగ్యం లేక తాత్కాలిక ఖాళీ ఏర్పడిన కాలంలో ఆ జిల్లా మేజిస్ట్రేటు వివాహ రిజిస్ట్రార్‌గా వ్యవహరించాల్సి ఉంటుంది.

8. (రీపీల్ అయ్యింది)

9. భారతీయ క్రైస్తవుల మధ్య వివాహ ధృవీకరణ పత్రం మంజూరు చేసే వ్యక్తులకు లైసెన్సులు :

భారతీయ క్రైస్తవుల మధ్య వివాహ ధృవీకరణ పత్రం మంజూరు చేసేందుకు పేరు రీత్యా కానీ ఆకాలంలో హోదా రీత్యా కాని ఒక క్రైస్తవునికి రాష్ట్ర ప్రభుత్వం లైసెన్సు జారీ చేయొచ్చు.

రెండవ భాగం

వివాహాన్ని నిర్వహించాల్సిన స్థల కాలాలు

10. వివాహం నిర్వహించాల్సిన సమయం :

ఈ చట్టం కింద ప్రతి వివాహాన్ని ఉదయం 6 గంటలకి సాయంత్రం 7 గంటలకి మధ్య నిర్వహించాలి.

మినహాయింపులు : అయితే ఈ సెక్షన్‌లోని అంశాలు ఈ సందర్భాల్లో వర్తించవు.

1. చర్చి ఆఫ్ ఇంగ్లాండ్‌కి చెందిన క్లర్జీమాన్ ఆయన డయోసీస్ ఆంగ్లికన్ బిషప్ లేదా ఆయన కామిస్సరీ ఆదేశాల మేరకు ప్రత్యేక లైసెన్సు కలిగుంటే ఉదయం 6 గంటలకి సాయంత్రం 7 గంటల మధ్య కాకుండా మరెప్పుడైనా నిర్వహించవచ్చు.
2. చర్చి ఆఫ్ రోమ్‌కి చెందిన క్లర్జిమాన్‌కి ఆయన నిర్వహించాల్సిన వివాహానికి సంబంధించిన డయోసీస్ లేదా వికెరేట్ రోమన్ కాథలిక్ బిషప్ కాని అటువంటి బిషప్ అందుకు సాధికారత ఇచ్చిన వ్యక్తి కాని సాధారణ లేదా ప్రత్యేక లైసెన్సు మంజూరు చేసుంటే వివాహాన్ని సాయంత్రం 7 గంటలకి ఉదయం 6 గంటలకి మధ్య నిర్వహించవచ్చు.
3. చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్‌కి చెందిన క్లర్జీమాన్ చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్ నియమాలు, కర్మకాండ, వేడుకలు, సాంప్రదాయాలకు అనుగుణంగా వివాహాన్ని నిర్వహించవచ్చు.

11. వివాహం నిర్వహించాల్సిన ప్రదేశం :

చర్చి ఆఫ్ ఇంగ్లాండ్‌కి చెందిన క్లర్జీమాన్ చర్చి ఆఫ్ ఇంగ్లాండ్ నియమాల ప్రకారం ఎక్కడ ప్రార్థనలు జరిపే చర్చీలో మినహాయించి మరెక్కడా వివాహాన్ని నిర్వహించకూడదు.

అయితే ఆ ప్రదేశంలోని అత్యంత దగ్గర దారిగుండా వెళ్లినా ఐదు మైళ్ల వరకు చర్చి లేక పోయినా లేదా డయోసీస్ ఆంగ్లికన్ బిషప్ కాని ఆయన కామిస్సరీ కాని అతనికి అధికారికంగా ప్రత్యేక లైసెన్సు మంజూరు చేసుంటే మరెక్కడైనా వివాహాన్ని నిర్వహించవచ్చు.

ప్రత్యేక లైసెన్సు కోసం రుసుము :

అటువంటి ప్రత్యేక లైసెన్సు కోసం బిషప్ ఎప్పటికప్పుడు అంగీకరించిన అదనపు రుసుమును డయోసీస్ రిజిస్ట్రార్ వసూలు చేయవచ్చు.

మూడవ భాగం

ఈ చట్టం కింద లైసెన్సు పొంది మతపరమైన మినిస్టరుచే వివాహ నిర్వహణ

12. జరగబోయే వివాహం తాలూకు నోటీసు :

చట్టం కింద మతపరమైన మినిస్టరు వివాహాన్ని నిర్వహించాలంటే – వివాహం చేసుకోదలచిన వారిలో ఎవరో ఒకరు అవతలి వారిని వివాహం చేసుకోదలిచాననే కోరికను ఒకటవ షెడ్యూల్లోని ఫారం ప్రకారం కాని ఆమేరకు మరో విధంగా కాని మతపరమైన మినిస్టరుకి రాతపూర్వకంగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. అందులో ఉండాల్సిన అంశాలు.

ఎ) వివాహం చేసుకోదలచిన వ్యక్తుల పేర్లు, ఇంటి పేర్లు, వృత్తి, పరిస్థితులు;

బి) వారు నివసించే ప్రదేశం;

సి) వారు ఆ ప్రదేశంలో ఎప్పుడు నివసించింది.

డి) వివాహం ఏ చర్చిలో లేదా వ్యక్తిగత నివాసంలో నిర్వహించాల్సి ఉంది.

అయితే ఇరువురిలో ఒకరు నోటీసులో పేర్కొన్న విధంగా ఆ ప్రదేశంలో నెల రోజులకంటే ఎక్కువ కాలం నివసించి ఉంటే అతను కాని ఆమె కాని నెలరోజులపైన అక్కడ నివసించినట్లు భావించాల్సి ఉంటుంది.

13. నోటీసు ప్రచురణ :

వివాహం ప్రత్యేకంగా ఒక చర్చిలో జరగాలని కోరుకున్న వ్యక్తులు ఆ చర్చికి సారధ్యం వహించే మతపరమైన మినిస్టరుకి నోటీసు ఇచ్చుంటే ఆయన నోటీసుని చర్చిలో అందరికీ కనిపించే ఒక భాగంలో అతికించాల్సి ఉంటుంది.

నోటీసు వెనక్కి ఇవ్వడం లేదా మరో చర్చికి పంపడం :

చర్చికి సారధ్యం వహించడానికి ఒక మినిస్టరుకి అర్హత లేకపోతే అతను తనకు నోటీసు ఇచ్చిన వ్యక్తికి దాన్ని తిరిగి ఇచ్చేయవచ్చు లేదా సారధ్యం వహించడానికి అర్హతున్న మరో మినిస్టరుకి దాన్ని పంపవచ్చు. ఆ విధంగా నోటీసు అందిన మినిస్టరు ఆ నోటీసుని పైన చెప్పిన విధంగా అతికించే ఏర్పాటు చేయాలి.

14. ఒక వ్యక్తిగత నివాసంలో కాబోయే వివాహం నోటీసు :

ఒక వ్యక్తిగత నివాసంలో వివాహం జరుపుకోవాలనుకుంటే, సెక్షన్ 12 కింద మతపరమైన మినిస్టరుకి నోటీసు అందగానే దాన్ని ఆయన జిల్లాలోని వివాహ రిజిస్ట్రార్‌కి పంపించాలి. ఆ విధంగా అందిన నోటీసుని ఆయన తన కార్యాలయంలో అందరికీ కనిపించే ప్రదేశంలో అతికించే ఏర్పాటు చేయాలి.

15. వివాహం చేసుకుంటున్న వారిలో ఒకరు మైనర్ అయితే వివాహ రిజిస్ట్రార్‌కి నోటీసు పంపాలి :

ఒక వ్యక్తి మైనర్‌ని వివాహం చేసుకోదలిస్తే, నోటీసు అందిన ప్రతి మినిస్టరు దాన్ని సెక్షన్ 13 కింద 24 గంటల్లోపు వెనక్కి పంపని పక్షంలో, ఆ నోటీసు ప్రతిని జిల్లా వివాహ రిజిస్ట్రార్‌కి మరియు ఒకరికన్నా ఎక్కువమంది వివాహ రిజిస్ట్రార్‌లుంటే సీనియర్ వివాహ రిజిస్ట్రార్‌కి తపాలా ద్వారా కాని ఇతరత్రా కాని పంపాల్సి ఉంటుంది.

16. నోటీసు ముట్టిన తర్వాత విధానం :

ఇటువంటి నోటీసు అందిన మీదట వివాహ రిజిస్ట్రార్ లేదా సీనియర్ వివాహ రిజిస్ట్రార్ దాన్ని తన కార్యాలయంలో అందరికీ కనిపించే ప్రాంతంలో అంటించే ఏర్పాటు చేయాలి. అదేవిధంగా జిల్లాలోని ఇతర వివాహ రిజిస్ట్రార్‌లకు ఆ నోటీసు ప్రతిని పంపి దాన్ని పైన చెప్పిన విధంగా ప్రచురించే ఏర్పాటు చేయాలి.

17. నోటీసు ధృవీకరణ పత్రం జారీ మరియు ప్రకటన :

పైన చెప్పిన విధంగా వివాహం చేయడానికి అంగీకారం తెలిపిన మతపరమైన మంత్రి ఎవరైనా, లేదా వారి తరఫున నోటీసు ఇవ్వగా మరియు వివాహం చేసుకోదలచిన వారిలో ఒకరు కింద పేర్కొన్న విధంగా ప్రకటన చేస్తే ఆమేరకు సర్టిఫికెట్ జారీ చేయాలి. అయితే

1. మినిస్టరుకి నోటీసు అందిన నాలుగు రోజులు గడిచిన తర్వాతనే అటువంటి ధృవీకరణ పత్రం జారీ చేయాలి.
2. ఆ విషయంలో చట్టపరమైన అవాంతరాలున్నాయని ఆయన సంతృప్తి చెందితే ధృవీకరణ పత్రం మంజూరు చేయకూడదు.
3. కింద పేర్కొన్న విధంగా అటువంటి ధృవీకరణ పత్రం జారీ చేయకూడదని అందుకు అధికారమున్న వ్యక్తి ఆజ్ఞాపించకూడదు.

18. ధృవీకరణ పత్రం జారీ చేయకమునుపు ప్రకటన :

మంత్రి ఎదుట వివాహం చేసుకోదలచిన వారిలో ఒకరు హాజరై ఈ విధంగా ప్రకటించే వరకు సెక్షన్ 17 కింద ధృవీకరణ పత్రం జారీ చేయకూడదు.

ఎ) వివాహ నిర్వహణకు రక్త, వైవాహిక బంధుత్వం లేదా ఇతర చట్టపరమైన అవాంతరమేదీ లేదని ఆమె కాని అతను కాని నమ్ముతున్నారు, మరియు ఆ జంటలో ఒకరు కాని, ఇరువురు కాని మైనర్లయితే

బి) చట్టప్రకారం తీసుకోవాల్సిన అంగీకారం లేదా అంగీకారాలు తీసుకోవడం జరిగింది లేదా ఆ విధంగా అంగీకారం తెలపగలిగే వ్యక్తి భారతదేశంలో నివసించడం లేదు.

19. తండ్రి లేదా సంరక్షకుడు లేదా తల్లి అంగీకారం :

మైనర్ తండ్రి బ్రతికుంటే ఆయన, తండ్రి చనిపోతే మైనర్ సంరక్షకుడు, ఆవిధంగా సంరక్షకుడు లేనప్పుడు అటువంటి మైనర్ తల్లి ఆ మైనర్ వివాహానికి అంగీకారం తెలపొచ్చు. అంగీకారం తెలపాల్సిన వ్యక్తి భారతదేశంలో నివసించకపోతే తప్పితే ఆవిధమైన అంగీకారం అటువంటి వివాహాల్లో అవసరం.

20. ధృవీకరణ పత్రం జారీ చేయడాన్ని నిషేధిస్తూ నోటీసు జారీ చేసే అధికారం:

సెక్షన్ 18 కింద వివాహానికి అంగీకారం అవసరమైన ప్రతి వ్యక్తికి మినిస్టరు ధృవీకరణ పత్రం జారీ చేయడాన్ని నిషేధించే అధికారం ధృవీకరణ పత్రాన్ని జారీ చేసే ముందు వారికుంది. ఆవిధమైన అధికారమున్న వ్యక్తి తన పేరు, నివాసం, వివాహం చేసుకోదలచిన వారితో తనకున్న పరిచయం, ఆ కారణంగా తనకు ఆవిధమైన అధికారం కలిగిన పరిస్థితులను వెల్లడిస్తూ మినిస్టరుకి నోటీసు జారీ చేయాలి.

21. నోటీసు అందినప్పుడు అనుసరించాల్సిన విధానం :

ఈ విధమైన నోటీసు అందిన మీదట అటువంటి మినిస్టరు ధృవీకరణ పత్రం మంజూరు చేయకూడదు. ఆ నిషేధానికి సంబంధించిన అంశంపై విచారించే వరకు మరియు ఆ వ్యక్తికి వివాహాన్ని నిషేధించే చట్టపరమైన అధికారం లేదని సంతృప్తి చెందే వరకు లేదా ఆ వ్యక్తి ఆ నోటీసుని వెనక్కి తీసుకునే వరకు ఆ వివాహాన్ని నిర్వహించకూడదు.

22. మైనారిటీ విషయంలో ధృవీకరణ పత్రం జారీ :

వివాహం చేసుకోవాలనుకుంటున్న వారిలో ఒకరు మైనర్ అయితే సెక్షన్ 19 కింద అనుమతి తెలపాల్సిన వ్యక్తి అనుమతి తెలిపకపోతే ఆ వివాహం నోటీసు అందిన 14 రోజులు గడిచిపోయే వరకు అటువంటి ధృవీకరణ పత్రం మంజూరు చేయకూడదు.

23. భారతీయ క్రైస్తవులకు ధృవీకరణ పత్రం జారీ :

వివాహం చేసుకోబోయే భారతీయ క్రైస్తవుడు మతపరమైన మినిస్టరు వద్దకు వివాహం నోటీసు తెలుసుకు వెళ్తే, లేదా సెక్షన్ 17 కింద అటువంటి మినిస్టరు ధృవీకరణ పత్రం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ పెట్టుకుంటే, అప్పుడు ఆ మినిస్టరు ధృవీకరణ పత్రం మంజూరు చేసే ముందు ఆ నోటీసు లేదా ధృవీకరణ పత్రం పర్యవసానమేమిటో అతనికి / ఆమెకి అర్థమైందా లేదా అనేది తెలుసుకోవాలి. అవసరాన్ని బట్టి ఆ భారతీయ క్రైస్తవునికి అర్థమయ్యే భాషలో ఆ నోటీసు లేదా ధృవీకరణ పత్రాన్ని అనువదించి లేదా అనువదింపచేయాలి. ఆ తర్వాతే అతను ధృవీకరణ పత్రం జారీ చేయొచ్చు.

24. ధృవీకరణ పత్రం ఫారం :

అటువంటి మినిస్టరు జారీ చేసే ధృవీకరణ పత్రం రెండవ షెడ్యూల్లోని ఫారం మాదిరిగా ఉండాలి.

25. వివాహ నిర్వహణ :

మినిస్టరు ధృవీకరణ పత్రం జారీ చేసిన తర్వాత ఆ మినిస్టరు ఎంచుకునే విధానానికి అనుగుణంగా ఆ ఇరువురు వ్యక్తుల వివాహాన్ని నిర్వహించవచ్చు. అయితే ఆ వివాహం నిర్వహించేటప్పుడు కనీసం ఇద్దరు సాక్షులు ఉండాలి.

26. రెండు నెలల్లోపు వివాహం నిర్వహించకపోతే ధృవీకరణ పత్రం రద్దు :

అటువంటి మినిస్టరు ధృవీకరణ పత్రం జారీ చేసిన తేదీ నుండి రెండు నెలల వరకు వివాహం జరగకపోతే అటువంటి ధృవీకరణ పత్రం ఆ తదుపరి చర్యలేమైనా అయితే అవన్నీ రద్దయిపోతాయి. మళ్లీ కొత్త నోటీసు జారీ చేసి, ఆపై ధృవీకరణ పత్రం పొందే వరకు ఆ వివాహాన్ని నిర్వహించే పనికి ఏ వ్యక్తీ పూనుకోకూడదు.

నాల్గవ భాగం

మతపరమైన మినిస్టరు నిర్వహించే వివాహాల రిజిస్ట్రేషన్

27. వివాహాలను ఎప్పుడు రిజస్టరు చేయాలి :

ఈ చట్టంలోని ఐదవ లేదా ఆరవ భాగం కింద నిర్వహించే వివాహాలను మినహాయిస్తే క్రైస్తవ మతాన్ని నమ్మే వ్యక్తుల మధ్య అన్ని వివాహాలను ఈ విధంగా నిర్వహించాలి.

28. చర్చి ఆఫ్ ఇంగ్లాండ్ క్లర్జీమాన్ నిర్వహించే వివాహాల రిజిస్ట్రేషన్ :

చర్చి ఆఫ్ ఇంగ్లాండ్‌కి చెందిన ప్రతి క్లర్జీమాన్ మూడవ షెడ్యూల్లోని పట్టిక రూపంలో వివాహాల రిజిస్టరును మొదలెట్టి ఈ చట్టం కింద తాను నిర్వహించే ప్రతి వివాహాన్ని అందులో నమోదు చేయాలి.

29. ఆర్క్ డెకనరీకి త్రైమాసిక నివేదిక :

చర్చి ఆఫ్ ఇంగ్లాండ్‌కి చెందిన ప్రతి క్లర్జీమాన్ తాను మతగురువైన ప్రాంతంలో నిర్వహించిన వివాహాలను నమోదు చేసిన రిజిస్టరులోని చేర్పుల రెండు నఖళ్ల ప్రతులపై తన సంతకాలు పెట్టి దాన్ని తాను బద్ధుడైన లేదా తన ప్రదేశం ఏ ఆర్క్ డెకనరీ రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో ఉందో ఆ రిజిస్ట్రార్‌కి ఏడాదిలో నాలుగుసార్లు పంపించాలి.

నివేదికలో ఉండాల్సిన అంశాలు :

అటువంటి త్రైమాసిక నివేదికలో ఉండాల్సిన అంశాలు ఏమిటంటే ప్రతి ఏటా జనవరి 1వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు, జూలై 1వ తేదీ నుండి సెప్టెంబరు 30వ తేదీ వరకు, మరియు అక్టోబరు 1వ తేదీ నుండి డిశంబరు 31వ తేదీ వరకు ఆ రిజిస్టరులో నమోదు చేసిన అన్ని వివాహాల పట్టిక ఇటువంటి రిజిస్టర్లను త్రైమాసం అంతమైన రెండు వారాల్లోపు ఆ క్లర్జిమాన్ పంపాల్సి ఉంటుంది.

అలా అందిన ఆ నఖళ్ల ప్రతుల్లో ఒక ప్రతిని ఆ రిజిస్ట్రార్ జనన, మరణ, వివాహాల రిజిస్ట్రార్‌కి పంపాల్సి ఉంటుంది.

30. చర్చి ఆఫ్ రోమ్ క్లర్జీమాన్ నిర్వహించే వివాహాల రిజిస్ట్రేషన్, నివేదికల పంపిణి :

చర్చి ఆఫ్ రోమ్ క్లర్జీమాన్ తాను వివాహాల నిర్వహించే ప్రాంతానికి చెందిన డయోసీస్ లేదా వికరేట్‌కి చెందిన రోమన్ కాథలిక్ బిషపు ఏవిధంగా ఆదేశిస్తారో ఆ విధంగా తాను నిర్వహించే వివాహాలను నమోదు చేయాలి.

ఆ విధంగా నమోదు చేసిన వివాహాల వివరాల త్రైమాసిక నివేదికను ఆ వ్యక్తి ఆ తదుపరి మూడు నెలల్లోపు జనన, మరణ, వివాహాల రిజిస్ట్రార్‌కు పంపించాలి.

31. చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్ నిర్వహించే వివాహాల రిజిస్ట్రేషన్ మరియు నివేదికల సమర్పణ :

చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్‌కి చెందిన ప్రతి క్లర్జీమాన్ వివాహాల రిజిస్టరు తెరవాలి. ఈ చట్టం కింద తాను నమోదు చేసే ప్రతి వివాహాన్ని ఆయన మూడవ షెడ్యూల్లోని పట్టికలో ఉన్న మాదిరిగా నమోదు చేయాలి. సెక్షన్ 29 లో పేర్కొన్న విధంగా తాను నిర్వహించిన అన్ని వివాహాల త్రైమాసిక నివేదికను చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్ సీనియర్ చాప్లన్ ద్వారా జనన, మరణ, వివాహాల రిజిస్ట్రార్‌కి అందజేయాలి.

32. కొన్ని వివాహాలు రెండుమార్లు నమోదు :

చర్చి ఆఫ్ ఇంగ్లాండ్ క్లర్జీమాన్ కాని, చర్చి ఆఫ్ రోమ్ క్లర్జీమాన్ కాని, ఈ చట్టం కింద వివాహాల నిర్వహించడానికి లైసెన్సు పొందిన మతపరమైన మినిస్టరు కాకపోయినప్పటికీ ఎపిస్కోపల్ ఆర్డినేషన్ పొందిన వ్యక్తి ఈ చట్టం కింద నిర్వహించే ప్రతి వివాహాన్ని నాల్గవ షెడ్యూల్లోని పట్టికలో మాదిరిగా తన వద్దనుండే నివేదిక పుస్తకంలో నమోదు చేయాలి. అదేవిధంగా వివాహాల నివేదిక పుస్తకాల్ని జతగా రసీదు మాదిరిగా ఉండే ధృవీకరణ పత్రంలో కూడా దాన్ని నమోదు చేయాలి.

33. అటువంటి వివాహాల చేర్పుపై సంతకాలు, సాక్షి సంతకాలు :

ధృవీకరణ పత్రం, మరియు వివాహ రిజిస్టరు పుస్తకంలో రెంటిలో వివాహాన్ని నమోదు చేసిన దగ్గర వివాహం నిర్వహించే వ్యక్తి, వివాహం చేసుకుంటున్న జంట సంతకం చేయాలి. వివాహం నిర్వహించిన వ్యక్తే కాకుండా ఇద్దరు గౌరవప్రదమైన సాక్షులు వాటిపై సంతకం చేయాలి.

పుస్తకంలో ప్రతి వివాహాన్ని వరుస క్రమంలో మొదటి నుండి చివరి దాకా నమోదు చేయాలి. వివాహ రిజిస్టరు పుస్తకంలో ఆ రకంగా నమోదు చేసినప్పుడు వరుస క్రమంలో అది ఏ నంబరులో నమోదు చేశారో ధృవీకరణ పత్రం కూడా అదే నంబరు కలిగుండాలి.

34. ధృవీకరణ పత్రం వివాహ రిజిస్ట్రార్‌కి పంపడం, దాని ప్రతిని రిజిస్ట్రార్ జనరల్‌కి పంపడం :

వివాహం నిర్వహించిన వ్యక్తి వివాహ రిజిస్టరు పుస్తకం నుండి ధృవీకరణ పత్రాన్ని విడదీసి దాన్ని వివాహం నిర్వహించిన నెల రోజుల్లోపు వివాహం నిర్వహించిన జిల్లాకు చెందిన వివాహ రిజిస్ట్రార్‌కి పంపించాలి, లేదా ఒకరికంటే ఎక్కువ మంది వివాహ రిజిస్ట్రార్‌లు ఉంటే వారిలో సీనియర్ వివాహ రిజిస్ట్రార్‌కి పంపాలి. వారు అందుకు తాము భద్రపర్చే పుస్తకంలో ఆ ధృవీకరణ పత్రంలోని అంశాలను నమోదు చేయాలి. ఒక నెలలో తనకు అందిన ధృవీకరణ పత్రాలకి వరుస క్రమపు నంబర్లు వేసి సంతకాలు పెట్టి వారు జనన, మరణ, వివాహాల రిజిస్ట్రార్ జనరల్‌కి పంపించాలి.

35. ధృవీకరణ పత్రాల ప్రతులు, వాటికి సంఖ్య వేయడం :

ఈ విధమైన ప్రతులను అటువంటి పుస్తకంలో వరుస క్రమంలో మొదటి నుండి చివరి వరకు నమోదు చేయాలి. ధృవీకరణ పత్రంపై ఉన్న నంబరు పుస్తకంలోని వివాహ రిజిస్టరు వివాహాన్ని నమోదు చేసిన దగ్గర వేసిన నంబరు ఒక్కటే అయివుండాలి. ప్రతి ధృవీకరణ పత్రాన్ని అందినవి అందినట్లు ఆయన నమోదు చేయాలి.

36. ధృవీకరణ పత్రం నంబరు నమోదు చేసి రిజిస్ట్రార్ జనరల్‌కి పంపడం :

వివాహ రిజిస్ట్రార్ ధృవీకరణ పత్రంపై పైన చెప్పిన విధమైన నంబరును పుస్తకంలో నమోదు చేసి దానిపై తాను సంతకం చేసి ప్రతి నెలాఖరు దాన్ని జనన, మరణ, వివాహాల రిజిస్ట్రార్ జనరల్‌కి పంపాలి.

37. సెక్షన్ 5 లోని క్లాజులు (1), (2) మరియు (3) లో పేర్కొన్న వ్యక్తి ద్వారా భారతీయ క్రైస్తవుల వివాహ రిజిస్ట్రేషన్ :

ఇద్దరు భారతీయ క్రైస్తవుల మధ్య వివాహాన్ని సెక్షన్ 5 లోని క్లాజులు (1), (2) మరియు (3) లో పేర్కొన్న వ్యక్తి, క్లర్జీమాన్ లేదా మతపరమైన మినిస్టరు సెక్షన్ 28 నుండి 36 (ఆ రెండిటి కలుపుకునే) వరకు చెప్పిన విధంగా కాకుండా వివాహాలు రిజిస్టరు పుస్తకంలో నమోదు చేయాలి. ఆ పుస్తకమంతా రాసేసేంత వరకు లేదా తాను వివాహాలు నిర్వహించే జిల్లాని విడిచిపెట్టి వెళ్లినప్పుడు జిల్లాలో తన స్థానంలో విధులు నిర్వర్తించే వ్యక్తికి అప్పగించేంత వరకు ఆ పుస్తకాన్ని భద్రపర్చాలి.

రిజిస్టరు పుస్తకం భద్రపర్చడం, ఇచ్చేయడం :

నమోదు చేయడంతో నిండిపోయిన పుస్తకాన్ని ఆ వ్యక్తి జిల్లా వివాహ రిజిస్ట్రార్‌కి పంపాలి. ఒక వివాహ రిజిస్ట్రార్ కంటే ఎక్కువ మంది ఉంటే సీనియర్ వివాహ రిజిస్ట్రార్‌కి ఇవ్వాలి. ఆయన దాన్ని జనన, మరణాలు, వివాహాల రిజిస్ట్రార్ జనరల్‌కి పంపించాలి. రిజిస్ట్రార్ జనరల్ మిగిలిన రికార్డులతోపాటు వాటిని కూడా భద్రపర్చాలి.

ఐదవ భాగం

వివాహ రిజిస్ట్రార్ నిర్వహించే లేదా ఆయన సమక్షంలో జరిగే వివాహాలు

38. వివాహ రిజిస్ట్రార్‌కి కాబోయే వివాహ నోటీసు :

వివాహం చేసుకోబోయే జంటలో ఒకరు తమ వివాహాన్ని నిర్వహించే వివాహ రిజిస్ట్రార్ లేదా ఆయన సమక్షంలో జరుపుకోదలిస్తే ఒకటవ షెడ్యూల్లో ఉన్న ఫారంలో మాదిరిగా ఆ రిజిస్ట్రార్‌కి రాతపూర్వకమైన నోటీసు ఇవ్వాలి లేదా తాము నివసించే జిల్లాకి చెందిన ఏదొక వివాహ రిజిస్ట్రార్‌కి ఇవ్వాలి లేదా వారిరువురు వేర్వేరు జిల్లాలో నివసిస్తే వారిరువురూ నివసించే జిల్లాలకి చెందిన వివాహ రిజిస్ట్రార్‌కి నోటీసులు ఇవ్వాలి. అయితే వారు నెల రోజులు పైగా ఆ ప్రాంతంలో నివసిస్తే ఆ మాటే నోటీసులో రాయాలి.

39. నోటీసు ప్రచురణ :

ఈవిధంగా ముట్టిన నోటీసుని వివాహ రిజిస్ట్రార్ తన కార్యాలయంలో అందరికీ కనిపించే చోటు దాని ప్రతిని అతికించే ఏర్పాటు చేయాలి.

వివాహం చేసుకోబోయే వారిలో మైనరు వుంటే ప్రతి వివాహ రిజిస్ట్రార్ ఇరవై నాలుగు గంటల్లోపు ఆ నోటీసు ప్రతిని జిల్లాలోని ఇతర వివాహ రిజిస్ట్రార్‌లకు (ఒకవేళ ఉంటే) వారికి తపాలా ద్వారా కాని ఇతరత్రా కాని పంపించే ఏర్పాటు చేయాలి. వాళ్లు తమ కార్యాలయాల్లో ఆ నోటీసుని తమ కార్యాలయంలో అందరికీ కనిపించే ప్రాంతంలో దాన్ని అతికించే ఏర్పాటు చేయాలి.

40. నోటీసుని ఫైల్లో పెట్టడం, దాన్ని వివాహ నోటీసు పుస్తకంలో నమోదు చేయడం :

ఈ విధమైన నోటీసులన్నిటిని ఫైల్లో పెట్టి వివాహ రిజిస్ట్రార్ వాటిని తన కార్యాలయంలోని ఇతర రికార్డులతోపాటు భద్రపర్చాలి మరియు అటువంటి నోటీసుల వివరాలను ఒక పుస్తకంలోకి ఎక్కించాలి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే ఆ పుస్తకాన్ని 'వివాహ నోటీసు పుస్తకం'గా పిలవాలి. ఈ వివాహ నోటీసు పుస్తకాన్ని తనిఖీ చేయదల్చుకున్న వ్యక్తులకు తగిన వేళ అందుబాటులో ఉంచాలి.

41. నోటీసు ఇచ్చినట్లు ధృవీకరణ పత్రం, ప్రమాణం చేయించడం :

కింద పేర్కొన్న విధంగా ధృవీకరణ పత్రం మంజూరు చేయాలని వివాహ రిజిస్ట్రార్‌ని నోటీసు ఇచ్చిన వ్యక్తి కోరి ఈ కింద పేర్కొన్న విధంగా ప్రమాణం చేస్తే వివాహ రిజిస్ట్రార్ నోటీసు అందినట్లు మరియు ప్రమాణం చేయించినట్లు అధికారికంగా ధృవీకరణ పత్రం జారీ చేయవచ్చు.

అయితే ఇటువంటి ధృవీకరణ పత్రం మంజూరు చేయడానికి ఎటువంటి చట్టపరమైన అవాంతరాలు లేవని, ఇటువంటి ధృవీకరణ పత్రం జారీని ఈ చట్టం కింద అధికారమున్న వ్యక్తి నిషేధించలేదని, నోటీసు ఇచ్చి నాలుగు రోజులు గడిచిందని, మరియు వివాహం చేసుకోదలచిన వారిలో ఒకరు మైనరైనట్లు చేసిన ప్రమాణంబట్టి అనిపిస్తే నోటీసు ఇచ్చి పధ్నాలుగు రోజులు గడిచిందని అనిపిస్తేనే ధృవీకరణ పత్రం జారీ చేయాలి.

42. ధృవీకరణ పత్రం ఇచ్చే ముందు ప్రమాణం :

వివాహం చేసుకోబోయే వ్యక్తుల్లో ఒకరు వివాహ రిజిస్ట్రార్ ముందు హాజరై ఆయన సమక్షంలో ఈ విధంగా ప్రమాణం చేస్తేకాని వివాహ రిజిస్ట్రార్ సెక్షన్ 41 కింద పేర్కొన్న ధృవీకరణ పత్రాన్ని జారీ చేయకూడదు.

ఎ) ఈ వివాహం చేసుకోవడానికి రక్త, వైవాహిక బంధుత్వం ఉండటం వంటి అవాంతరాలు ఏవీ లేవు, మరియు

బి) వివాహం చేసుకోబోయే వారు ఇరువురు లేదా (ఇతర వివాహ రిజిస్ట్రార్‌ల పరిధిలోని జిల్లాలో నివసిస్తే) ప్రమాణం చేస్తున్న వ్యక్తి సాధారణంగా అటువంటి వివాహ రిజిస్ట్రార్ పరిధిలోని ప్రాంతంలో నివసిస్తున్నాడు / నివసిస్తోంది మరియు ఇరువురు లేదా ఇరువురిలో ఒకరు మైనరైనప్పుడు

సి) ఈ వివాహానికి చట్టప్రకారం అనుమతి లేదా అనుమతులు తెలపాల్సిన వారు అనుమతి తెలిపారు లేదా ఈ విధంగా అనుమతి తెలపాల్సిన వ్యక్తి భారతదేశంలో నివసించడం లేదు.

43. పధ్నాలుగు రోజుల్లోపు ధృవీకరణ పత్రం మంజూరు చేయమని హైకోర్టులో పిటీషను :

వివాహం చేసుకునే వారిలో ఇరువురు లేదా ఒకరు మైనరై ఉండి వారు కలకత్తా, మద్రాసు, బొంబాయి నగరాల్లో నివసిస్తూ ఉంటే అటువంటి వారు నోటీసు నమోదు చేసిన పధ్నాలుగు రోజుల్లోపు వివాహం చేసుకోదలిస్తే సెక్షన్ 41 ప్రకారం పధ్నాల్గు రోజులు గడవకముందే ధృవీకరణ పత్రం జారీ చేయమని వివాహ రిజిస్ట్రార్‌కి ఆదేశాలు జారీ చేయమని ప్రార్థిస్తూ హైకోర్టు న్యాయమూర్తికి పిటీషను దాఖలు చేయవచ్చు.

పిటీషనుపై ఉత్తర్వు :

తగిన కారణం వ్యక్తపరిస్తే పధ్నాలుగు రోజుల గడువులోపు సర్టిఫికెట్ జారీ చేయమని అటువంటి న్యాయమూర్తి వివాహ రిజిస్ట్రార్‌కి ఆదేశాలు ఇస్తూ ఉత్తర్వు జారీ చేయవచ్చు.

ఆవిధమైన ఆదేశాలు అందిన మీదట వివాహ రిజిస్ట్రార్ తగిన విధంగా ధృవీకరణ పత్రం మంజూరు చేయవచ్చు.

44. తండ్రి లేదా సంరక్షకుని అనుమతి :

ఈ భాగం కింద జరిగే ప్రతి వివాహంలో జంటలోని ఒకరు మైనరైతే సెక్షన్ 19 లోని అంశాలు వర్తిస్తాయి.

ధృవీకరణ పత్రం జారీకి అభ్యంతరం :

అటువంటి ధృవీకరణ పత్రం మంజూరు చేయకముందు అనుమతి తెలపాల్సిన వాళ్లు తమ అభ్యంతరాన్ని వివాహ నోటీసు పుస్తకంలో ఆ వివాహం నమోదు చేసిన దగ్గర రాతపూర్వకంగా 'సిషిద్ధం' అని రాసి, తన

పేరు, ఉండే ప్రదేశం, వివాహం చేసుకోబోయే వారితో తనకున్న పరిచయం, ఆ పరిచయ కారణంగా అనుమతి, అభ్యంతరం వ్యక్తం చేయడానికి కారణాలు ఏర్పడిన విషయం తెలపాలి.

అభ్యంతరం పర్యవసానం :

ఇటువంటి అభ్యంతరం నమోదైతే వివాహ రిజిస్ట్రార్ అటువంటి అభ్యంతరంపై విచారణ జరిపి ధృవీకరణ పత్రం జారీ చేయడానికి అవి ఆటంకం కాదని సంతృప్తి చెందితే లేదా ఆ అభ్యంతరాన్ని వ్యక్తం చేసిన వ్యక్తి దాన్ని వెనక్కి తీసుకుంటే తప్పితే ధృవీకరణ పత్రం జారీ చేయకూడదు.

45. అనుమతి తెలపాల్సిన వ్యక్తి మతిస్థిమితం కోల్పోతే లేదా అన్యాయంగా అనుమతి నిరాకరిస్తే పిటీషను:

ఈ భాగం కింద అనుమతి తెలపాల్సిన వ్యక్తి మతిస్థిమితం కోల్పోయినా లేదా వ్యక్తి (తండ్రి కాకుండా అటువంటి మరెవరైనా) వివాహానికి అన్యాయంగా అనుమతి నిరాకరించినా వివాహం చేసుకోదలిచిన వారు కలకత్తా, మద్రాసు, బొంబాయిలలో నివసిస్తుంటే హైకోర్టు న్యాయమూర్తికి, ఇతర చోట్ల నివసిస్తుంటే జిల్లా న్యాయమూర్తికి పిటీషను సమర్పించవచ్చు.

పిటీషను దాఖలైన తర్వాత అనుసరించే విధానం :

పిటీషనులోని ఆరోపణలపై హైకోర్టు లేదా జిల్లా కోర్టు న్యాయమూర్తి సత్వర విచారణ జరిపి, విచారణలో వివాహం జరపడం సబబనే భావనకి వస్తే అటువంటి వివాహం సబబని అటువంటి హైకోర్టు లేదా జిల్లా కోర్టు న్యాయమూర్తి ప్రకటించాలి.

అటువంటి ప్రకటన వివాహానికి అనుమతి తెలపాల్సిన వ్యక్తి తెలిపిన అనుమతిగా చెలామణి అవుతుంది మరియు వివాహ రిజిస్ట్రార్ ధృవీకరణ పత్రాన్ని నిషేధించకూడదని ఆయన భావిస్తే ఈ భాగం కింద నిషేధానికి గురికాని ధృవీకరణ పత్రం ఎలా జారీ చేస్తారో అలా ధృవీకరణ పత్రాన్ని జారీ చేయాల్సి ఉంటుంది.

46. వివాహ రిజిస్ట్రార్ ధృవీకరణ పత్రం నిరాకరించినప్పుడు పిటీషను :

ఈ భాగం కింద ధృవీకరణ పత్రం జారీ చేయడానికి వివాహ రిజిస్ట్రార్ నిరాకరిస్తే, వివాహం చేసుకోదలిచిన వారిలో ఒకరు కలకత్తా, మద్రాసు, బొంబాయి నగరాల్లో నివసిస్తే హైకోర్టు న్యాయమూర్తికి, ఈ నగరాల్లో కాకుండా ఇతర జిల్లాల్లో నివసిస్తే ఆయా జిల్లా న్యాయమూర్తికి పిటీషను సమర్పించవచ్చు.

పిటీషను దాఖలైనప్పుడు అనుసరించాల్సిన విధానం : ఆయా హైకోర్టు న్యాయమూర్తి లేదా జిల్లా న్యాయమూర్తి ఆ పిటీషనులోని ఆరోపణలపై సత్వర విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలి.

ఈ విధంగా హైకోర్టు న్యాయమూర్తి లేదా జిల్లా న్యాయమూర్తి తీసుకున్న నిర్ణయం తుది నిర్ణయం అవుతుంది. ధృవీకరణ పత్రం జారీ చేయాల్సిన వివాహ రిజిస్ట్రార్ కోర్టు నిర్ణయానికి కట్టుబడి తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

47. (1950 లోని చట్టం ద్వారా రీపీల్ చేయబడింది)

48. నిషేధించిన వ్యక్తి అధికారాన్ని రిజిస్ట్రార్ శంకిస్తే పిటీషను :

సెక్షన్ 44 కింద విధులు నిర్వర్తిస్తున్న వివాహ రిజిస్ట్రార్‌కి ధృవీకరణ పత్రం జారీ చేయడానికి అభ్యంతరం వ్యక్తం చేస్తున్న వ్యక్తికి చట్టప్రకారం అభ్యంతరం తెలిపే అధికారం లేదనే భావన కలిగితే ఆయన తన జిల్లా కలకత్తా, మద్రాసు, బొంబాయి నగరాల్లో ఉంటే హైకోర్టు న్యాయమూర్తికి, తన జిల్లా నగరాల్లో లేకపోతే సంబంధిత జిల్లా న్యాయమూర్తికి ఆ మేరకు పిటీషను దాఖలు చేయవచ్చు.

పిటీషను దాఖలైన తర్వాత అనుసరించే విధానం : పిటీషనులో కేసు పూర్వపరాలను గురించి తెలపాలి. కోర్టు ఆ విషయమై తగిన ఉత్తర్వులు, ఆదేశాలు జారీ చేయమని ప్రార్థించాలి.

విచారణ జరిపిన మీద ఆ హైకోర్టు లేదా జిల్లా న్యాయమూర్తికి ధృవీకరణ జారీ చేయడాన్ని నిషేధించే అధికారం లేదని ప్రకటించాలి.

ఆపై ధృవీకరణ పత్రాన్ని జారీ చేయాలి. అటువంటి చర్య తీసుకున్నప్పుడు వివాహాన్ని ఎవరూ నిషేధించలేదనట్లు భావించాల్సి ఉంటుంది.

49. ధృవీకరణ పత్రానికి, ఆకతాయి తనంగా అభ్యంతరం తెలపిన వ్యక్తిపై చర్య :

ఈ భాగం కింద వివాహ రిజిస్ట్రార్ జారీచేసే ధృవీకరణ పత్రానికి అభ్యంతరం తెలిపిన వ్యక్తి ఆకతాయి తనంగా అభ్యంతరం వ్యక్తం చేశాడని సెక్షన్ 44 కింద వివాహ రిజిస్ట్రార్, సెక్షన్ 45 లేదా 46 కింద హైకోర్టు లేదా జిల్లా న్యాయమూర్తి ప్రకటించి, అటువంటి ధృవీకరణ పత్రానికి అడ్డుపడాల్సింది కాదని ప్రకటిస్తే ఆ వ్యక్తి కోర్టు ఖర్చులు భరించాల్సి ఉంటుంది. వివాహం చేసుకునే వ్యక్తి ఈ విధంగా (ఆకతాయితనంగా) అభ్యంతరం తెలిపిన వ్యక్తిపై దావా వేయడం ద్వారా నష్టపరిహారం పొందవచ్చు.

50. ధృవీకరణ పత్రం ఫారం :

వివాహ రిజిస్ట్రార్ సెక్షన్ 41 కింద జారీ చేసే ధృవీకరణ పత్రం చట్టానికి అనుబంధంగా ఉన్న రెండవ షెడ్యూల్లో ఇచ్చిన ఫారంలో ఉన్నట్లు, లేదా దాని పోలినట్లు ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం తగినన్ని ధృవీకరణ పత్రం ఫారాలు వివాహ రిజిస్ట్రార్‌కి సరఫరా చేస్తూ ఉండాలి.

51. ధృవీకరణ పత్రం జారీ అనంతరం వివాహ నిర్వహణ :

వివాహ రిజిస్ట్రార్ ధృవీకరణ పత్రం జారీ చేసిన తర్వాత, లేదా ఈ చట్టం కింద వివిధ జిల్లా వివాహ రిజిస్ట్రార్‌లకు నోటీసు ఇవ్వాల్సిన అవసరం ఉండి ఆయా జిల్లాల వివాహ రిజిస్ట్రార్‌లు ధృవీకరణ పత్రాలు జారీ చేసిన తర్వాత ధృవీకరణ పత్రం లేదా పత్రాల్లో వివరించిన విధంగా వివాహం నిర్వహించడానికి చట్టపరమైన అవాంతరాలు ఏమీ లేకపోతే ఆ ఇద్దరికి సరైనదనిపించిన పద్ధతిలో, వేడుకల అనుసారం వివాహం చేయవచ్చు.

అయితే ఇటువంటి వివాహాన్ని వివాహ రిజిస్ట్రార్ ఎవరైనా (వారికి ఆ ధృవీకరణ పత్రాన్ని లేదా పత్రాలను అందజేయాల్సి ఉంది) మరియు వివాహ రిజిస్ట్రార్ కాకుండా ఇద్దరు కంటే ఎక్కువమంది సాక్షుల సమక్షంలో వివాహాన్ని నిర్వహించాల్సి ఉంది. వివాహ వేడుకలో ఏదొక దశలో వధూవరులు ఇరువురు ఈ విధంగా లేదా ఈ మేరకు ప్రకటన చేయాలి. “ఎ.బి. అయిన నేను సి.డి ని వివాహం చేసకోడానికి నాకు తెలిసి చట్టపరమైన అవాంతరాలు ఏమీ లేవని నేను వినమ్రంగా ప్రకటిస్తున్నాను.”

వధూవరులు ఇరువురు ఒకరితో మరొకరి ఈ విధంగా తెలపాలి "మీ సమక్షంలో మీ సాక్షిగా ఎ.బి. అయిన నేను సి.డి.ని నా చట్టపరమైన భార్యగా (లేదా భర్త) స్వీకరిస్తున్నాను."

52. నోటీసు ఇచ్చిన రెండు నెలల వరకు వివాహం జరగక పోతే కొత్త నోటీసు అవసరం :

సెక్షన్ 40 కింద వివాహ రిజిస్ట్రార్‌కి నోటీసు ఇచ్చిన రెండు నెలల గడిచిన తర్వాత కూడా వివాహం జరగకపోతే ఆ నోటీసు, ధృవీకరణ పత్రం, తదుపరి చర్యలన్నీ రద్దయిపోతాయి.

మళ్లీ కొత్త నోటీసు ఇచ్చి, నమోదు చేయించి ధృవీకరణ పత్రం జారీ చేస్తే తప్పిస్తే ఏ ఒక్క వ్యక్తి ఈ వివాహాన్ని నిర్వహించే ప్రయత్నం చేయకూడదు. వివాహ రిజిస్ట్రార్ కూడా వివాహాన్ని నమోదు చేయకూడదు.

53. వివరాలను నమోదు చేయమని వివాహ రిజిస్ట్రార్ అడగొచ్చు :

ఈ భాగం కింద వివాహాన్ని నిర్వహించాల్సిన వివాహ రిజిస్ట్రార్ వివాహం చేసుకునే వారిని వివాహానికి సంబంధించిన వివరాలను నమోదు చేసుకోడానికి వాటిని తెలపమని కోరవచ్చు.

54. ఐదవ భాగం కింద నిర్వహించిన వివాహం రిజిస్ట్రేషన్ :

ఐదవ భాగం కింద వివాహాన్ని నిర్వహించిన తర్వాత దాన్ని నిర్వహించిన వివాహ రిజిస్ట్రార్ వివాహాన్ని కింద పేర్కొన్న విధంగా రెండుసార్లు నమోదు చేయాలి; ఎలా అంటే అనుబంధంగా ఉన్న నాల్గవ షెడ్యూలు ప్రకారం వివాహ రిజిస్టరు పుస్తకంలోనూ మరియు ఆ వివాహ రిజిస్టరు పుస్తకానికి జతగా ఉన్న ధృవీకరణ పత్రంలోను. ఆ ధృవీకరణ పత్రం, మరియు వివాహ రిజిస్టరు పుస్తకంలో అటువంటి వివాహాన్ని నమోదు చేసిన దగ్గర వివాహాన్ని నిర్వహించిన లేదా ఎవరి సమక్షంలోనైతే వివాహం జరిగిందో ఆ వ్యక్తి సంతకం చేయాలి. మరియు వివాహ రిజిస్ట్రార్ ఆ వివాహాన్ని నిర్వహించినా, నిర్వహించకపోయినా ఆయన కూడా సంతకం చేయాలి. వివాహం చేసుకున్న జంట, మరియు వివాహ రిజిస్ట్రార్, వివాహాన్ని నిర్వహించిన వ్యక్తి కాకుండా ఇద్దరు గౌరవప్రదమైన సాక్షులు సంతకాలు చేయాలి.

ఆ పుస్తకంలో ఈ విధంగా నమోదు చేయడం మొదటినుండి ఆఖరు వరకు వరుస క్రమంలో చేయాలి. నమోదు చేసిన దగ్గర వేసిన సంఖ్య ధృవీకరణ పత్రంపైనున్న సంఖ్య ఒకటై ఉండాలి.

55. ధృవీకరణ పత్రాన్ని ప్రతినెలా రిజిస్ట్రార్ జనరల్‌కి పంపాలి :

ధృవీకరణ పత్రాన్ని విడదీసి వివాహ రిజిస్ట్రార్ ప్రతి నెలాఖరు వివాహ రిజిస్టరు పుస్తకాన్ని జనన, మరణాలు, వివాహాల రిజిస్ట్రార్ జనరల్‌కి పంపాలి.

రిజిస్టరు పుస్తకం కస్టడీ : వివాహ రిజిస్ట్రార్ అటువంటి రిజిస్టరు పుస్తకం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచాలి. అది నిండిపోయిన తర్వాత జనన, మరణాలు, వివాహాలు రిజిస్ట్రార్ జనరల్‌కి దాన్ని పంపించాలి. రిజిస్ట్రార్ జనరల్ తన కార్యాలయంలోని మిగిలిన రికార్డులతోపాటు రిజిస్టరు పుస్తకాన్ని భద్రపర్చాలి.

56. (1950 చట్టం ద్వారా రీపీల్ చేయబడింది)

57. నోటీసు, ధృవీకరణ పత్రం భారతీయ క్రైస్తవులకు రిజిస్ట్రార్ అర్థమయ్యేట్లు చూడాలి :

వివాహ నోటీసు ఇవ్వబోతున్న లేదా వివాహ రిజిస్ట్రార్ నుండి ధృవీకరణ పత్రం కోరుతున్న వివాహం చేసుకోబోయే భారతీయ క్రైస్తవులకు ఆంగ్లభాష అర్థమౌతుందో లేదో వివాహ రిజిస్ట్రార్ తెలుసుకోవాలి. ఒకవేళ ఆ వ్యక్తికి అర్థం కాకపోతే వివాహ రిజిస్ట్రార్ ఆ నోటీసు లేదా ధృవీకరణ పత్రాన్ని అతను /

ఆమెను అర్థమయ్యే భాషలో అనువదించి లేదా అనువదింపజేయాలి.

లేదా ఆ నోటీసు మరియు సర్టిఫికెట్ సారాంశం ఆ భారతీయ క్రైస్తవునికి అర్థమైన విషయం ఆ వివాహ రిజిస్ట్రార్ రూఢి చేసుకోవాలి.

58. భారతీయ క్రైస్తవులకి ప్రకటన సారాంశం అర్థమయ్యేట్లు చూడాలి :

ఈ భాగం కింద భారతీయ క్రైస్తవులు వివాహం చేసుకున్నప్పుడు, వివాహాన్ని నిర్వహిస్తున్న వ్యక్తి ఆ భారతీయ క్రైస్తవులకు ఆంగ్లభాష అర్థమౌతుందా అనే విషయాన్ని తెలుసుకోవాలి. అర్థం కాకపోతే వివాహం నిర్వహించే వ్యక్తి ఈ చట్టం కింద వివాహ సమయంలో చేసే ప్రకటన్ని వివాహం చేసుకునే వ్యక్తి అర్థమయ్యే భాషలోకి అనువదించి లేదా అనువదింపజేయాలి.

59. భారతీయ క్రైస్తవుల వివాహాల రిజిస్ట్రేషను :

ఈ భాగం కింద భారతీయ క్రైస్తవుల మధ్య వివాహాన్ని సెక్షన్ 37 కింద రూపొందించిన నియమాలకు అనుగుణంగా (అవి వర్తించేంత వరకు) రిజిస్ట్రేషను చేయాలి. మరోవిధంగా చేయకూడదు.

ఆరవ భాగం

భారతీయ క్రైస్తవుల వివాహం

60. భారతీయ క్రైస్తవుల వివాహాన్ని ధృవీకరించడానికి పాటించాల్సిన షరతులు:

ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు పెట్టుకున్న వివాహం చేసుకోబోయే భారతీయ క్రైస్తవులు మూడవ భాగం కింద ఇవ్వాల్సిన ప్రాథమిక నోటీసుని ఇవ్వకుండా కింద పేర్కొన్న షరతులు పాటిస్తే ఈ భాగం కింద ధృవీకరణ పొందవచ్చు. మరో విధంగానైతే కాదు :

1) వివాహం చేసుకోబోయే పురుషుడి వయస్సు ఇరవై ఒక్క సంవత్సరాలు. తగ్గకుండా, వివాహం చేసుకోబోయే స్త్రీ వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు తగ్గకుండా ఉండాలి.
2) వివాహం చేసుకోబోయే వ్యక్తుల్లో ఎవరికి సజీవ భార్య కాని భర్త కాని ఉండకూడదు;
3) సెక్షన్ 9 కింద లైసెన్సు పొందిన వ్యక్తి, ఆ వ్యక్తి కాకుండా కనీసం ఇద్దరు గౌరవప్రద సాక్షుల సమక్షంలో వారిద్దరూ ఈ విధంగా ఒకరితో మరొకరు అనాలి

"దేవుని సమక్షంలో, ఏసు ప్రభువు పేరిట ఎ.బి. అయిన నేను వీరిని సాక్షులుగా ఉండమని కోరుతూ సి.డి అయిన నిన్ను నా చట్టపరమైన భార్య లేదా భర్తగా స్వీకరిస్తున్నాను" లేదా ఈ అర్థమొచ్చే విధంగా అనాలి.

61. ధృవీకరణ పత్రం మంజూరు :

ఈ భాగం కింద వివాహం నిర్వహించినప్పుడు, సెక్షన్ 60 కింద విధించిన షరతులు నెరవేర్చినప్పుడు, ఏ లైసెన్సున్న వ్యక్తి సమక్షంలో ఆ విధమైన ప్రకటన చేశారో ఆయన వివాహం చేసుకున్న వారు అర్జీ పెట్టుకుని ఆరు అణాల రుసుము కడితే ఆ వ్యక్తి వివాహ ధృవీకరణ పత్రం మంజూరు చేయాలి.

లైసెన్సున్న వ్యక్తి ఆ ధృవీకరణ పత్రంపై సంతకం చేయాలి. ఆ వివాహ చెల్లుబాటుని తడుముతూ వేసే దావాలో ఈ ధృవీకరణ పత్రాన్ని రుజువైన సాక్ష్యంగా భావించాల్సి ఉంటుంది.

62. రిజిస్టరు పుస్తకం, దానిలోని భాగాలను రిజిస్ట్రార్ జనరల్ భద్రపర్చాలి :

సెక్షన్ 9 ప్రకారం లైసెన్సు పొందిన వ్యక్తి ఈ భాగం కింద తాను చేసిన వివాహాలను ఆంగ్లంలో కాని వివాహం నిర్వహించిన జిల్లా లేదా రాష్ట్రంలో వాడుకలో ఉన్న భాషలో రాష్ట్ర ప్రభుత్వం విషయంలో

ఎప్పటికప్పుడు ఇచ్చే సూచన మేరకు వివాహాన్ని రిజిస్టరు పుస్తకంలో నమోదు చేయాలి. అలా చేసిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పద్ధతులు, కాలానుగుణంగా ఆ ప్రాంతానికి చెందిన జనన, మరణాలు, వివాహం రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్టరు పుస్తకాన్ని పంపాలి. క్రితంసారి రిజిస్టరు పుస్తకం పంపిన తర్వాత నమోదు చేసిన వివాహాల వివరాలకు సంబంధించిన భాగాలపై తగిన విధంగా ధృవీకరణ చేసి వాటిని కూడా ఆ అధికారికి పంపాలి.

63. రిజిస్టరు పుస్తకాలు, నమోదైన వివాహాల వివరాల సోదాలు :

ఈ చట్టం వివాహాల ధృవీకరణ పత్రాలు మంజూరు చేసే లైసెన్సున్న వ్యక్తి మరియు సెక్షన్ 62 కింద రిజిస్టరు పుస్తకాన్ని భద్రపర్చే వ్యక్తి ఆ పుస్తకాన్ని తగిన వేళల సోదా చేయడాన్ని అనుమతించాలి. అందులో నమోదు చేసిన వివాహాల వివరాల నఖళ్లపై సంతకాలు చేసి వాటి పత్రాలను తగిన రుసుము కట్టినవారికి అందజేయవచ్చు.

64. ఒకటవ లేదా మూడవ భాగం కింద భారతీయ క్రైస్తవుల వివాహాలను నమోదు చేసిన పుస్తకాలు :

సెక్షన్ 62 మరియు 63 కింద రిజిస్టరు పుస్తకాల భాగాలను భద్రపర్చడం, సోదా చేయడం, నఖళ్లు తీసుకోవడంలో ఏ చర్య చేపడతారో సెక్షన్ 37 కింద భద్రపర్చే పుస్తకాలకు సంబంధించి కూడా అదే విధమైన చర్య చేపట్టాలి.

65. ఆరవ భాగం రోమన్ కాథలిక్‌లకు వర్తించదు :

సెక్షన్ 64 లో ఉదహరించిన సెక్షన్ 62 మరియు 63 లకు మినహాయించి ఈ చట్టంలోని ఈ భాగం రోమన్ కాథలిక్‌ల మధ్య జరిగే వివాహాలకు వర్తించదు.

కొన్ని వివాహాల మినహాయింపు : అయితే 23 ఫిబ్రవరి, 1865 తేదీ కంటే ముందు 1864 లో 25 వ చట్టంలోని ఐదవ భాగం కింద జరిగిన రోమన్ కాథలిక్‌ల వివాహాలకు ఈ విషయాలు వర్తించవు.

ఏడవ భాగం

దండన

66. వివాహం చేయడానికి అబద్ధపు ప్రమాణం, ప్రకటన, నోటీసు లేదా ధృవీకరణ పత్రం ఇవ్వడం :

ఏ వ్యక్తయినా వివాహం చేయడానికి లేదా వివాహ లైసెన్సు పొందడానికి ఉద్దేశపూర్వకంగా :

ఎ) ఈ చట్టం కింద లేదా ఏదైనా నియమం కింద లేదా ఆ వివాహం ఏ చర్చి సంప్రదాయం ప్రకారం జరిగిందో (అది చర్చి ఆఫ్ ఇంగ్లాండ్, చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్ లేదా చర్చి ఆఫ్ రోమ్ కావచ్చు) అటువంటి సాంప్రదాయం కింద ప్రమాణం లేదా ప్రకటన చేయాల్సి ఉండి ఎవరైనా అబద్ధపు ప్రమాణం లేదా ప్రకటన చేస్తే, లేదా

బి) ఈ చట్టం కింద నోటీసు లేదా ధృవీకరణ పత్రం ఇవ్వాల్సి ఉండగా అబద్ధపు నోటీసు మీద లేదా ధృవీకరణ పత్రంపై సంతకం చేస్తే భారత శిక్షాస్మృతి, 1860 (1860 లోని 45 వది) లోని సెక్షన్ 193 కింద శిక్షార్హమైన నేరం చేసినట్లు భావించాల్సి ఉంటుంది. అందుకు మూడు సంవత్సరాల వరకు కారాగార శిక్ష, మరియు కోర్టు విచక్షణ మేరకు జరిమానా వర్తిస్తుంది.

67. మరో వ్యక్తిగా నటించి వివాహ రిజిస్ట్రార్ ధృవీకరణ పత్రం జారీని నిషేధిస్తే :

ఏ వ్యక్తయినా వివాహ రిజిస్ట్రార్ ధృవీకరణ పత్రం జారీ చేయడాన్ని నిషేధించేందుకుగాను ఉద్దేశపూర్వకంగా వివాహానికి అనుమతి తెలపాల్సిన వ్యక్తిలా నటిస్తూ, అది అబద్ధమని లేదా నిజం కాదని తెలిసి కూడా

ధృవీకరణ పత్రం జారీని నిషేధిస్తే ఆ వ్యక్తి భారత శిక్షాస్మృతి (1860 లో 45 వది) లోని సెక్షన్ 205 కింద నేరానికి శిక్షార్హుడు.

68. తగిన అధికారం లేకుండా వివాహ నిర్వహణ :

ఈ చట్టంలోని సెక్షన్ 5 కింద వివాహాలు నిర్వహించడానికి అర్హత లేని వ్యక్తి జిల్లాలోని వివాహ రిజిస్ట్రార్ గైర్హాజరీలో ఒక క్రైస్తవుడికి లేదా ఇరువురూ క్రైస్తవులైన వ్యక్తుల మధ్య వివాహాన్ని నిర్వహించినా లేదా నిర్వహిస్తానని బోధించినా పదేళ్ల కారాగార శిక్ష లేదా (ఏడేళ్ల పై కారాగార శిక్ష బదులు) ఏడేళ్ళు తగ్గకుండా పదేళ్లు మించకుండా తరలింపుకి, మరియు జరిమానాకి శిక్షార్హులవుతారు.

69. పాటించాల్సిన వివాహ సమయాన్ని పాటించకుండా లేదా సాక్షులు లేకుండా వివాహాన్ని నిర్వహించడం:

ఒక క్రైస్తవునికి మరొకరికి లేక ఇద్దరు క్రైస్తవులకి మధ్య వివాహం నిర్వహించాల్సిన వారు ఉదయం 6 గంటల, సాయంత్రం 7 గంటల మధ్యకాలంలో కాకుండా మరెప్పుడు వివాహాన్ని నిర్వహించినా లేదా వివాహం నిర్వహించే వ్యక్తి కాకుండా కనీసం ఇద్దరు గౌరవప్రదసాక్షులు లేకుండా వివాహాన్ని నిర్వహిస్తే మూడేళ్ల వరకు కారాగార శిక్ష మరియు జరిమానాకి శిక్షార్హులవుతారు.

ప్రత్యేక లైసెన్సు కింద నిర్వహించే వివాహాలకు మినహాయింపు :

అయితే సెక్షన్ 10 కింద తన డయోసీస్ లేదా కామిస్సరీకి చెందిన ఆంగ్లికన్ బిషపు ప్రత్యేక లైసెన్సు మంజూరు చేసినా లేదా సాయంత్రం 7 గంటల నుండి ఉదయం 6 గంటల మధ్యకాలంలో వివాహాలు నిర్వహించడానికి సాధారణ లేదా ప్రత్యేక లైసెన్సు పొందిన చర్చి ఆఫ్ రోమ్ క్లర్జీమాన్ లైసెన్సు పొందినా వారికి ఈ సెక్షన్ వర్తించదు.

అదే విధంగా చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్ నియమాలు, కార్యాలు, వేడుకలు, సాంప్రదాయాలు ప్రకారం చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్ క్లర్జీమాన్ చేసే వివాహాలకు కూడా ఈ సెక్షన్ వర్తించదు.

70. నోటీసు లేకుండా లేదా మైనరు వివాహానికి 14 రోజుల నోటీసు ఇవ్వకుండా నిర్వహణ :

ఈ చట్టం కింద వివాహాలు నిర్వహించేందుకు లైసెన్సున్న మతపరమైన మినిస్టరు ఎవరైనా రాతపూర్వకమైన నోటీసు లేకుండా, లేదా వివాహం చేసుకునే వారిలో ఒకరు మైనరై ఉండి, ఆ వివాహానికి తల్లిదండ్రులు లేదా సంరక్షకులు అనుమతి తీసుకోవాల్సి ఉండి మూడవ భాగంలో వివాహాలను తెలిసి, కావాలని నోటీసు ఇచ్చిన పద్నాలుగు రోజుల్లోపు వివాహాన్ని నిర్వహిస్తే మూడేళ్ల కారాగార శిక్ష, మరియు జరిమానాకి శిక్షార్హులవుతారు.

71. నోటీసు ప్రకటించకుండా ధృవీకరణ పత్రం జారీ చేయడం లేదా వివాహం చేయడం :

ఈ చట్టంకింద వివాహ రిజిస్ట్రార్ కింద పేర్కొన్న నేరాలకు పాల్పడితే:

1) తెలిసి, కావాలని ఈచట్టం కింద నోటీసు ప్రకటించకుండా వివాహ ధృవీకరణ పత్రం జారీ చేసినా లేదా వివాహాన్ని నిర్వహించినా;

నోటీసు వీగిపోయిన తర్వాత వివాహం చేయడం :

2) వివాహానికి సంబంధించి సెక్షన్ 40 కింద నోటీసు నమోదు చేసి రెండు నెలలు గడిచిపోయిన తర్వాత వివాహాన్ని నిర్వహించినా;

కోర్టు ఉత్తర్వు లేదా నోటీసు ప్రతిని పంపకుండా పధ్నాలుగు రోజుల్లోపు మైనరు వివాహం నిర్వహిస్తే :

3) వివాహం చేసుకునే వారిలో మైనరున్నప్పుడు వివాహానికి సంబంధించిన నోటీసు ముట్టిన పధ్నాలుగు రోజుల్లోపు సమర్థతగల కోర్టు ఉత్తర్వు లేకుండా, లేదా జిల్లాలో ఒకరికంటే ఎక్కువమంది వివాహ రిజిస్ట్రార్‌లుండి తాను సీనియర్ వివాహ రిజిస్ట్రార్ కాకపోయి ఉండి వారిలో సీనియర్ వివాహ రిజిస్ట్రార్‌కి నోటీసు ప్రతిని తపాలా ద్వారా కాని ఇతరత్రా కాని పంపకుండా వివాహాన్ని నిర్వహించినా; ఈ చట్టం కింద ధృవీకరణ పత్రాన్ని నిషేధించే అధికారమున్న వ్యక్తులు నిషేధం విధించినప్పటికీ ధృవీకరణ పత్రం జారీ చేసినా; ఐదేళ్ల వరకు కారాగార, మరియు జరిమానా శిక్షకు అర్హులవుతారు.

72. నోటీసు వీగిపోయిన తర్వాత లేదా మైనరైతే నోటీసు ఇచ్చిన పధ్నాలుగు రోజుల్లోపు, లేదా నిషేధం విధించినా ధృవీకరణ పత్రం జారీ చేస్తే :

పై వివాహ అధికారి ఎవరైనా పైన పేర్కొన్న విధంగా నోటీసు తెలిసి, కావాలని నోటీసు ఇచ్చి రెండు నెలలు గడిచిన తర్వాత, లేదా వివాహం చేసుకునే వారిలో ఒకరు మైనరై ఉండి తెలిసి, కావాలని నోటీసు ఇచ్చిన పధ్నాలుగు రోజుల్లోపు సమర్థతగల కోర్టు ఉత్తర్వు లేకపోయినప్పటికి, లేదా ధృవీకరణ పత్రాన్ని నిషేధించే అధికారమున్న వ్యక్తి దాన్ని నిషేధించినప్పటికీ ధృవీకరణ పత్రం జారీచేస్తే భారత శిక్షాస్మృతి, 1860 (1860 లోని 45 వది) లోని సెక్షన్ 166 కింద నేరం చేసినట్లు భావించాల్సి ఉంటుంది.

73. చర్చి ఆఫ్ ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్ లేదా రోమ్ క్లర్జీ కాకుండా వివాహాన్ని నిర్వహించే అధికారమున్న వ్యక్తులు :

ఈ చట్టం కింద వివాహం నిర్వహించడానికి అధికారమున్న వారు ఎవరైనా, వారు చర్చి ఆఫ్ ఇంగ్లాండ్ క్లర్జీమాన్ కాకుండా తగిన బాన్స్ ప్రకటన చేసిన తర్వాత లేదా డయోసీ లేదా సొరోగేట్‌లకు చెందిన ఆంగ్లికన్ బిషపు ద్వారా లైసెన్సు పొందిన తర్వాత వివాహం నిర్వహిస్తుంటే; లేదా చర్చి ఆఫ్ స్కాట్‌లాండ్‌కి చెందిన క్లర్జీమాన్ కానప్పటికీ ఆ చర్చి నియమాలు, కార్యాలు, వేడుకలు, మరియు సంప్రదాయాలకు అనుగుణంగా వివాహాన్ని నిర్వహిస్తుంటే; లేదా చర్చి ఆఫ్ రోమ్ క్లర్జీమాన్ కానప్పటికీ ఆ చర్చి నియమాలు, కార్యాలు, వేడుకలు, మరియు సంప్రదాయాలకు అనుగుణంగా వివాహాన్ని నిర్వహిస్తుంటే,

నోటీసు ప్రకటించకుండా లేదా ధృవీకరణ పత్రం గడువు పూర్తయిన తర్వాత ధృవీకరణ పత్రం జారీ చేయడం లేదా వివాహం చేయడం :

తెలిసి, కావాలని ఈ చట్టంలోని మూడవ భాగంలో ఆదేశించినట్లు నోటీసు ప్రకటించకుండా లేదా అతికించే ఏర్పాటు చేయకుండా లేదా ధృవీకరణ పత్రం జారీ చేసిన రెండు నెలల గడువు పూర్తయిన తర్వాత ఇద్దరు వ్యక్తుల మధ్య పైన పేర్కొన్న పద్ధతిలో వివాహం నిర్వహిస్తే;

మైనరుతో వివాహాన్ని నోటీసు ఇచ్చిన పధ్నాలుగు రోజుల్లోపు ధృవీకరణ పత్రం జారీ లేదా వివాహ నిర్వహణ:

తెలిసి, కావాలని వివాహం చేసుకునే వ్యక్తుల్లో ఒకరు మైనర్ అయినప్పటికీ నోటీసు ముట్టిన పద్నాల్గు రోజుల్లోపు లేదా నోటీసు ప్రతిని వివాహ రిజిస్ట్రార్‌కి లేదా ఆ జిల్లాలో ఒకరికంటే ఎక్కువ మంది వివాహ రిజిస్ట్రార్‌లు ఉంటే సీనియర్ వివాహ రిజిస్ట్రార్‌కి తపాలా ద్వారా లేదా ఇతరత్రా నోటీసు ప్రతిని పంపకుండా ధృవీకరణ పత్రం జారీ చేసినా లేదా వివాహం నిర్వహించినా;

నిషేధించబడినా ధృవీకరణ పత్రం జారీ చేయడం : తెలిసి, కావాలని వివాహాన్ని నిషేధించే అధికారమున్న వ్యక్తి దాన్ని నిషేధించినప్పటికీ ధృవీకరణ పత్రం జారీ చేసినా నిషేధించబడిన వివాహాన్ని నిర్వహించినా : తెలిసి, కావాలని వివాహాన్ని నిషేధించే అధికారమున్న వ్యక్తి దాన్ని నిషేధించినప్పటికీ వివాహం నిర్వహించినా నాలుగు సంవత్సరాల వరకు కారాగార, మరియు జరిమానాకి శిక్షార్హులవుతారు.

74. లైసెన్సు లేని వ్యక్తి లైసెన్సు ఉన్నట్లు నటించి ధృవీకరణ పత్రం పొందడం:

ఈ చట్టంలోని ఆరవ భాగం కింద వివాహ ధృవీకరణ పత్రం జారీ చేయడానికి లైసెన్సు లేని వ్యక్తి లైసెన్సు ఉన్నట్లు కనిపించే విధంగా నటించి ధృవీకరణ పత్రం జారీచేస్తే ఐదేళ్ల కారాగారం, మరియు జరిమానాకి శిక్షార్హుడవుతాడు.

ఈ చట్టంలోని ఆరవ భాగం కింద వివాహ ధృవీకరణ పత్రం జారీ చేయడానికి లైసెన్సు నుండి అకారణంగా నిరాకరించినా లేదా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసినా లేదా ఈ భాగంలోని విధులను నిర్వర్తించకపోయినా వంద రూపాయిల వరకు జరిమానా శిక్షకు అర్హుడవుతాడు.

75. రిజిస్టరు పుస్తకం ధ్వంసం చేయడం లేదా అబద్ధాలు రాయడం :

ఏ వ్యక్తయినా తనకి తానుగా, లేదా మరొకరి ద్వారా రిజిస్టరు పుస్తకాన్ని కాని, ధృవీకరణ పత్రం కౌంటర్ ఫాయిల్‌ని కాని, ధృవీకరణ పత్రం భాగాన్ని కాని ధ్వంసం చేయడం కాని, పాడు చేయడం కాని చేసినా; లేదా రిజిస్టరు పుస్తకంలో కాని, కౌంటర్‌ఫాయిల్ ధృవీకరణ పత్రంలో కాని అసత్యాలను చొప్పించడం కాని, నకిలీ భాగాన్ని చేర్చడం కాని చేసినా; లేదా కావాలని అటువంటి రిజిస్టరు పుస్తకంలో లేదా కౌంటర్‌ఫాయిల్ ధృవీకరణ పత్రంలో కాని ధృవీకరించిన భాగాల్లో అబద్ధపు ఎంట్రీలు నమోదు చేసినా, ఏడేళ్ల వరకు కారాగార మరియు జరిమానా శిక్షకు అర్హులవుతారు.

76. ఈ చట్టం కింద ప్రాసిక్యూషన్‌కి కాలపరిమితి :

ఈ చట్టం కింద జరిగిన ప్రతి నేరంపై ప్రాసిక్యూషన్ నేరం జరిగిన రెండేళ్లలోపు మొదలెట్టాలి.

ఎనిమిదవ భాగం

ఇతరాంశాలు

77. ఈ చట్టం కింద జరిగిన వివాహాల్లో ఏయే అంశాలను రుజువు చేయాల్సిన అవసరం లేదో :

సెక్షన్ 4 మరియు 5 ప్రకారం ఏదైనా వివాహం జరిగితే కింద పేర్కొన్న అక్రమాల కారణంగా వివాహం చెల్లదనడానికి లేదు. అవి ఏమిటంటే :

1) వివాహం చేసుకున్న వ్యక్తుల నివాసానికి సంబంధించి, లేదా చట్టప్రకారం వివాహానికి ఎవరి అనుమతి అవసరమో ఆ వ్యక్తి అనుమతికి సంబంధించి చేసిన ప్రకటన;

2) వివాహ నోటీసు;

3) ధృవీకరణ పత్రం లేదా దాని అనువాదం;

4) వివాహ నిర్వహణ కాలం, ప్రదేశానికి సంబంధించి;

5) వివాహం రిజిస్ట్రేషన్

78. సవరణలు లేదా తప్పులు :

వివాహాన్ని రిజిస్టరు చేయాల్సిన బాధ్యతగల వ్యక్తి ఎవరైనా వివాహాన్ని నమోదు చేసే విషయంలో రూపంలో కాని సారంలో కాని తప్పు దొర్లిందని కనుగొంటే ఆ తప్పుని కనిపెట్టిన నెల రోజుల్లోపు వివాహం చేసుకున్న వారి సమక్షంలో, లేదా వారు చనిపోయినా, లేదా గైర్హాజరైనా ఇద్దరు గౌరవప్రద సాక్షుల సమక్షంలో ఆ వివాహాన్ని నమోదు చేసిన దాని పక్క మార్జిన్‌లో తప్పుని సరిదిద్దాలి. మొదట నమోదు చేసిన దాన్ని మార్చకుండా ఆ విధంగానే ఉంచేసి దాని పక్క మార్జిన్‌లో సరైన విధంగా నమోదు చేసి మార్జిన్‌లోనే సంతకం చేయాలి. సరిదిద్దిన తేదీని అక్కడ రాయాలి. అదే విధంగా ధృవీకరణ పత్రంలో కూడా మార్జిన్‌లో ఎంట్రీ చేయాలి.

ఈ సెక్షన్ కింద చేసిన ప్రతి ఎంట్రీని సాక్షుల సమక్షంలో చేయాలి. వాటిపై వారు సంతకాలు చేయాలి. అప్పటికే అటువంటి ధృవీకరణ పత్రాన్ని జనన, మరణాలు, వివాహాల రిజిస్ట్రార్ జనరల్‌కి పంపించేసి ఉంటే ఆ వ్యక్తి అదేవిధంగా మరో ధృవీకరణ పత్రంపై మొదట చేసిన తప్పుడు ఎంట్రీలు, ఆ తర్వాత మార్జిన్‌లో సరైన ఎంట్రీలను నమోదు చేసి పంపాలి.

79. సోదాలు, మరియు ఎంట్రీల నఖళ్లు :

ఈ చట్టం కింద వివాహం చేసుకున్న ప్రతి ఒక్కరూ దాన్ని రిజిస్టరు చేసుకోవాలి. మరియు ఈ చట్టం కింద ఆనాటికి వివాహాల రిజిస్టర్లను, ధృవీకరణ పత్రాలను లేదా వాటి డూప్లికేట్లను లేదా ధృవీకరణ పత్రాల ప్రతులను భద్రపర్చే వివాహాల రిజిస్ట్రార్‌లు లేదా జనన, మరణాల, వివాహాల రిజిస్ట్రార్ జనరల్ తగిన రుసుము చెల్లించిన మీదట తగిన వేళల్లో రిజిస్టరు, ధృవీకరణ పత్రాలు, డూప్లికేట్లు లేదా వాటి ప్రతులను తనిఖీ చేయడానికి అవకాశం ఇవ్వాలి. మరియు వాటిలోని ఎంట్రీల నఖళ్లను తన సంతకంతో వారికి అందజేయాలి.

80. వివాహ రిజిస్టరు ఇత్యాదిల సర్టిఫైడ్ కాపీ సాక్ష్యం :

ఈ చట్టంకింద ఎవరైతే వివాహ రిజిస్టరుని లేదా ధృవీకరణ పత్రాన్ని లేదా దాని డూప్లికేట్‌ని భద్రపర్చడం కాని ఇవ్వడంకాని చేయాలో అటువంటి వ్యక్తి ఈ చట్టం కింద రిజిస్టరు పుస్తకంలో కాని, ధృవీకరణ పత్రంలో కాని, డూప్లికేట్‌లో కాని చేసిన ఏదైనా ఎంట్రీ సర్టిఫైడ్ కాపీని సంతకం చేస్తే ఆ వివాహాన్ని నమోదు చేసినట్లుగా లేదా ఆ వాస్తవాన్ని సర్టిఫై చేసినట్లుగా సాక్ష్యంగా స్వీకరించాల్సి ఉంటుంది. అటువంటి రిజిస్టరు, లేదా ధృవీకరణ పత్రం లేదా డ్యూప్లికేట్‌ని లేదా వాటిలోని ఎంట్రీలను లేదా అటువంటి కాపీని మరింతగా రుజువు చేయాల్సిన అవసరం లేదు.

81. కొన్ని వివాహాల ధృవీకరణ పత్రాలను కేంద్ర ప్రభుత్వానికి పంపాలి :

జనన, మరణాలు, వివాహాల రిజిస్ట్రార్ జనరల్ ఏదాదిలో ప్రతి మూడు మాసాలకి ఒకసారి ఆ పక్షంలో తన వద్దకొచ్చిన ధృవీకరణ పత్రాల్లో కొన్నిటి సాక్ష్యం నిమిత్తం ఇంగ్లాండ్‌కి పంపడం సరైనదని తనని నియమించిన ప్రభుత్వానికి అనిపిస్తే ఆయన ఆ ధృవీకరణ పత్రాలను ఎంచి, వాటిపై సంతకం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలి.

82. రాష్ట్ర ప్రభుత్వం రుసుము నిర్ణయిస్తుంది :

ఈ చట్టం కింద వీటి కోసం రుసుము వసూలు చేయాలి–వివాహ నోటీసులు స్వీకరణకి, ప్రచురణకి; వివాహ రిజిస్ట్రార్‌లు వివాహ ధృవీకరణ పత్రాలు జారీ చేయడానికి మరియు ఆ వివాహాన్ని రిజిస్టరు చేయడానికి;

ఆ రిజిస్ట్రార్‌లు ధృవీకరణ పత్రాలపై అభ్యంతరం కాని నిషేధంకాని నమోదు చేయడానికి;

రిజిస్టరు పుస్తకాలు కాని ధృవీకరణ పత్రాలుకాని డూప్లికేట్లు కాని వాటి ప్రతులు కాని తనిఖీ చేయడానికి;

సెక్షన్ 63 మరియు 79 కింద ఆయా ఎంట్రీల నఖళ్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు తగిన రుసుము నిర్ణయించి, ఎప్పటికప్పుడు సాధారణ లేదా ప్రత్యేక కేసుల్లో వాటిని తగిన విధంగా సవరించవచ్చు.

83. నియమాలు రూపొందించే అధికారం :

1) సెక్షన్ 82 కింద వసూలు చేయాల్సిన రుసుము రద్దు గురించి, రిజిస్టరు పుస్తకాల సరఫరా, ఈ చట్టం కింద జరిగిన వివాహాల ఏర్పాటు, రిటర్న్స్ సమర్పణ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం అధికార గెజిట్‌లో ప్రకటన ద్వారా నియమాలు రూపొందించవచ్చు.

2) ఈ సెక్షన్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఈ నియమాలను వాటిని రూపొందించిన తర్వాత వీలైనంత త్వరలో రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టాలి.

84. (1950 చట్టం ద్వారా రీపీల్ చేయబడింది)

85. జిల్లా న్యాయమూర్తి ఎవరో ప్రకటించే అధికారం :

ఈ చట్టం వర్తించే ప్రాంతాల్లో జిల్లా న్యాయమూర్తి ఎవరో రాష్ట్ర ప్రభుత్వం అధికార గెజిట్‌లో నోటిఫికేషన్ ద్వారా ప్రకటిస్తుంది.

86. (1950 చట్టం ద్వారా రీపీల్ చేయబడింది)

87. కాన్సులర్ వివాహాలకి ఈ చట్టం వర్తించదు :

ఇతర దేశాల పౌరుల మధ్య ఆ దేశ చట్టాలను అనుసరించి ఎవరైనా మినిస్టరు, కన్సల్ట్ లేదా కాన్సులర్ ఏజెంటు వివాహాన్ని నిర్వహిస్తే వారికి ఈ చట్టంలోని అంశాలు వర్తించవు.

88. నిషిద్ధ డిగ్రీలలోపు వివాహాలు చెల్లవు :

వివాహం చేసుకునే వారిలో ఎవరికైనా వర్తించే పర్సనల్ చట్టాలు వారి వివాహాన్ని నిషేధిస్తే అటువంటి వారి మధ్య వివాహం ఈ చట్ట ప్రకారం చెల్లుబాటవుతుందని ఏవిధంగానూ భావించడానికి లేదు.

*****

23. బాల్య వివాహాల నిరోధక చట్టం 1929

ప్రపంచ వ్యాప్తంగా కొంతకాలం వరకు బాల్యవివాహాలు జరిగేవి. ఈ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఎంతోమంది సంఘ సంస్కర్తలు బ్రిటీష్ కాలంనాడే ఉద్యమించి బ్రిటీష్ ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి బాల్య వివాహాల నిరోధక చట్టం వచ్చేందుకు దోహదపడ్డారు. సామాజిక ఆలోచనలో మార్పు రాకుండా చట్టం మాత్రం తేవడంవల్ల పెద్దగా ఉపయోగం జరగలేదు. ఈ చట్టం 1929 లో వచ్చినా నేటికీ బాల్యవివాహాలు జరుగుతూనే వున్నాయి. సామాజిక మార్పు, ఆధునికత వచ్చిన ప్రాంతాలలో, కుటుంబాలలో నేడు బాల్యవివాహాలు జరగడంలేదు. కానీ, సామాజికంగా వెనుకబడిన ప్రాంతాలలో, నిరక్షరాస్య, సాంప్రదాయ వాదుల కుటుంబాలలో బాల్యవివాహాలు నేటికీ జరుగుతున్నాయి. గణాంకాల ప్రకారం రాజస్థాన్‌లో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలుస్తుంది. మన రాష్ట్రంలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బాల్యవివాహాలు జరిగిన సంఘటనలు మనకు తెలుసు. అదేవిధంగా రాష్ట్రమంతటా గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది దళిత కులాల్లో 15, 16 సం॥ల లోపులోనే నేటికీ పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి. ఈ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి తెలియజేస్తూ విస్తృతంగా సామాజిక చైతన్యాన్ని తేవలసిన బాధ్యత అందరిపైనా వుంది. చట్టపరంగా చూస్తే బాల్యవివాహాల నిరోధక చట్టం 1929 పెద్దగా మార్పు తేలేకపోయింది. ఈ చట్టం అతి చిన్నది. మొత్తం 12 సెక్షన్లు మాత్రమే ఉన్నాయి.

సెక్షన్ 1 : 1930 ఏప్రిల్ 1 వ తారీఖు నుండి అమలులోనికి వచ్చింది. ఇది జమ్మూ, కాశ్మీర్ మినహా భారత దేశమంతటా వర్తిస్తుంది.

సెక్షన్ 2 :

ఎ. బాలురు అనగా మగపిల్లవాడయితే 21 సంవత్సరములు, బాలిక అయితే 18 సంవత్సరముల వయస్సుగలవారు.

బి. బాల్యవివాహం అనగా వివాహము చేసుకునే వారిలో ఎవరైనా ఒకరు బాల్యములో వున్నవారు.

సి. వివాహమునకు అంగీకరించినవారు అనగా వివాహము చేసుకొనుటకు వచ్చిన ఇరుపక్షాలలో ఒకరు.

డి. మైనరు అనగా ఇద్దరులో ఎవరైనా ఒకరు 18 సం॥ల వయస్సుగలవారు.

సెక్షన్ 3 :

21 సంవత్సరములలోపు మగవ్యక్తి వివాహానికి అంగీకరిస్తే శిక్ష. స్త్రీకి 18 సంవత్సరములు నిండినప్పటికీ 21 సంవత్సరముల లోపు పురుషుడు బాల్యవివాహానికి అంగీకరిస్తే అతనికి వెయ్యిరూపాయల వరకు జరిమానా లేదా 15 రోజుల వరకు సాధారణ జైలుశిక్ష లేదా రెండూ విధించవచ్చు.

సెక్షన్ 4 :

21 సంవత్సరముల పైబడిన పురుషుడికి శిక్ష :

21 సంవత్సరములు పైబడిన పురుషుడు ఒక బాలికను వివాహము చేసుకుంటే అతనికి 3 నెలల వరకు సాధారణ జైలుశిక్షతోపాటు జరిమానా కూడా విధించవచ్చు.

సెక్షన్ 5 :

బాల్య వివాహము జరిపినందుకు శిక్ష :

ఎవరైనా బాల్య వివాహాన్ని జరిపినా, ఆదేశించినా ఆ వ్యక్తికి 3 నెలల వరకు సాధారణ జైలుశిక్ష మరియు జరిమానా విధించవచ్చు.

అయితే సదరువ్యక్తి ఆ వివాహము బాల్యవివాహము కాదని సహేతుకంగా నమ్మివుంటే ఆవ్యక్తికి శిక్షనుండి మినహాయింపు వుంటుంది.

సెక్షన్ 6 :

తల్లిదండ్రులు లేదా సంరక్షకులు బాల్యవివాహము జరిపితే :

1. ఒక మైనర్‌తో బాల్యవివాహము జరిగినప్పుడు ఆ మైనరు తల్లిదండ్రులు, లేదా సంరక్షకులు ఆ వివాహాన్ని జరిపించినా లేదా అనుమతించినా లేదా దాన్ని అడ్డుకోకుండా నిర్లక్ష్యంగా వున్నా వారికి 3 నెలలు సాధారణ జైలు శిక్ష మరియు జరిమానా విధించవచ్చు. అయితే ఈ సెక్షను కింద ఆడవారిని శిక్షించరాదు.
2. ఈ సెక్షనుకు సంబంధించి ఏదైనా బాల్యవివాహము జరిగినప్పుడు ఆ బాలుర సంరక్షకుడు వివాహాన్ని అడ్డుకోకుండా నిర్లక్ష్యంగా వున్నారని భావించాలి. అలాంటి తప్పు తను చెయ్యలేదని నిరూపించుకునే బాధ్యత సదరు సంరక్షకులపై వుంటుంది.

సెక్షన్ 7 :

భారత నేరవిచారణ స్మృతి ప్రకారం ఈ చట్టంలోని నేరాలను కాగ్నిజబుల్ నేరాలుగా పరిగణించాలి.

సెక్షన్ 8 : ఈ చట్టంలోని నేరాలు విచారించే అధికారం మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు మరియు మొదటి శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకు వుంటుంది.

సెక్షన్ 9 :

ఈ చట్టంలోని నేరాలను ఒక సంవత్సరపు కాలం తరువాత విచారించడానికి లేదు.

సెక్షన్ 10 : ప్రాథమిక విచారణ : ఈ చట్టంలోని నేరాలగురించి ఫిర్యాదు అందినపుడు ఆ కోర్టు తనంతట తానుగానీ, తనక్రింది కోర్టును గానీ విచారించమని ఆదేశించవచ్చు.

సెక్షన్ 11 : రద్దు చేయబడినది

సెక్షన్ 12 : ఈ చట్టవ్యతిరేక వివాహాన్ని ఆపేందుకు ఉత్తర్వులు.

1. ఏదైనా బాల్యవివాహం జరగబోతున్నట్టు సమాచారం అందినపుడు ఆ వివాహాన్ని నిలిపివేయాలంటూ సదరు కోర్టు సెక్షన్ 3,4,5,6 లలో వుదహరించబడిన వ్యక్తులకు ఆదేశాలు జారీచేయవచ్చు.
2. పైన చెప్పబడిన ఆదేశాలిచ్చేముందు సంబంధిత వ్యక్తికి సంజాయిషీ ఇచ్చుకునే అవకాశం తప్పనిసరిగా కల్పించాలి.
3. పైన 1లో చెప్పబడిన ఆదేశాలను సంబంధిత వ్యక్తి అర్జీపై కోర్టు రద్దు లేదా మార్పు చేయవచ్చు.
4. అలాంటి అర్జీపెట్టినపుడు సదరు వ్యక్తికి వ్యక్తిగతంగా లేదా లాయరు ద్వారా తన వాదనచెప్పుకునే అవకాశం కల్పించాలి.
5. పైన 1లో చెప్పబడిన ఉత్తర్వులు వచ్చినపుడు తనకు వ్యతిరేకంగా ఉత్తర్వులు వచ్చాయని తెలిసికూడా సదరు వ్యక్తి ఆ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే అతనికి 3 నెలలు కఠిన లేదా సాధారణ జైలుశిక్ష మరియు జరిమానా విధించవచ్చు. అయితే ఈ సెక్షను కింద ఆడవారికి శిక్ష విధించకూడదు.

*****

24. బాల కార్మిక నిషేధం మరియు నియంత్రణ చట్టం 1986

గతంలో వున్నటువంటి బాలకార్మిక చట్టాలను రద్దుచేస్తూ ఈచట్టం రూపొందించబడింది.

ఉద్దేశాలు : కొన్ని వృత్తుల్లో బాలకార్మిక విధానాన్ని నిషేధించడం మరియు కొన్ని వృత్తుల్లో ఆ విధానాన్ని నియంత్రించడానికి మరియు బాలలు నిర్వచనంపై సమగ్రతతేడానికి తదితర ఉద్దేశాలతో ఈచట్టం చేయబడింది.

భాగం 1 : ప్రాథమిక అంశాలు :

సెక్షన్ 1 : ఈ చట్టాన్ని బాలకార్మిక నిషేదపు మరియు నియంత్రణ చట్టమని పిలవవచ్చు. ఇది భారతదేశమంతటా వర్తిస్తుంది.

సెక్షన్ 2 : నిర్వచనాలు :

i. 'సంబంధిత ప్రభుత్వము' అనగా కేంద్ర ప్రభుత్వము, రైల్వేలు, కోర్టులు, గనులు, చమురు ప్రాంతము తదితర కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో వుండేవి మరియు ఇతర రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో వుండేవి.

ii. 'బాలలు' అనగా 14 సంవత్సరములు వయస్సు నిండనివారు.

iii. 'దినము' అనగా అర్ధరాత్రి నుంచి 24 గంటల కాలము.

iv. 'సంస్థ' అనగా దుకాణము, వ్యాపార సంస్థ, వర్క్‌షాపు, హోటళ్ళు, భోజనశాలలు, సినిమా హాళ్ళు, బహిరంగ వినోద ప్రదేశాలు.

v. 'కుటుంబము' అనగా వ్యక్తి మరియు భార్య, భర్త మరియు వారి పిల్లలు, సోదర సోదరీలు.

vi. 'స్థలము స్వాధీనము కలవాడు' అనగా ఆ సంస్థ, వర్క్‌షాప్‌పై ఆధిపత్యము కలవాడు.

vii. 'పోర్టు యాజమాన్యము' అనగా పోర్టును నడుపు యాజమాన్యము.

viii. 'నిర్ధేశించు' అనగా ఈ చట్టంలోని సెక్షన్ 18 అనుగుణంగా చేయబడిన నిబంధనలు.

ix. 'వారము' అనగా శనివారం అర్ధరాత్రి నుంచి మొదలుకొని 7 రోజుల కాలము.

x. 'వర్క్‌షాపు' అనగా యాంత్రిక కార్యకలాపాలు కొనసాగిస్తున్న నిర్ధిష్టప్రాంతం.

రెండవ భాగం

పిల్లలతో పనిచేయించుట నిషేధించబడిన వృత్తులు, పనులు :

సెక్షన్ 3 : పిల్లలతో పని చేయించుట నిషేధించబడిన వృత్తులు, పనులు : ఈ చట్టానికి అనుబంధంగా షెడ్యూలు ఎ లోని వృత్తుల్లో షెడ్యూలు బి లోని పనుల్లో బాలలతో పనిచేయించుట నిషేధించడమైనది.

సెక్షన్ 4 : షెడ్యూలు సవరణ : షెడ్యూలులో పేర్కొనబడ్డ వృత్తులు, పనులను కేంద్ర ప్రభుత్వం సవరణ ద్వారా పెంచవచ్చు.

సెక్షన్ 5

i. కేంద్ర ప్రభుత్వానికి బాల కార్మికుల సాంకేతిక సలహా సంఘాన్ని ఏర్పాటు చేసే అధికారం కలదు.

ii. ఈ సంఘానికి అధ్యక్షులు, 10 మంది మించకుండా సభ్యులు వుంటారు.

iii. ఈ సంఘం ఎప్పుడు, ఎలా కావాలి ? ఏవిధంగా పనిచేయాలి ? అనే విషయాలను నిర్ణయించే అధికారం కలిగియుంటుంది.

iv. ఈ సంఘం తనక్రింద పనిచేసేందుకు ఉపసంఘాలను ఏర్పాటు చేయవచ్చు.

v. ఈ సంఘంలో సభ్యుల నియామకం, వారి వేతనం తదితర విషయాలు నిబంధనల కనుగుణంగా వుంటాయి.

మూడవ భాగం

బాలల పనిపరిస్థితుల నియంత్రణ :

సెక్షన్ 6 : ఈ భాగంలోని సెక్షన్లు మూడవ సెక్షన్‌లో చెప్పబడని పనులకు మాత్రమే వర్తిస్తాయి. సెక్షన్ 3 లో చెప్పబడిన వృత్తులకు, పనులకు ఈ భాగం వర్తించదు.

సెక్షన్ 7 :

1) నిబంధనల్లో సూచించబడిన దానికంటే ఎక్కువ గంటలు బాలలతో పనిచేయించరాదు.

2) రోజులో మూడు గంటల కొకసారి కనీసం గంట విరామం లేకుండా బాలలతో పనిచేయించరాదు.

3) విరామ సమయం పనికోసం వేచివుండే కాలంతో కలిపి రోజుకు ఆరు గంటలు మించి బాలలతో పనిచేయించరాదు.

4) రాత్రి 7 నుంచి ఉదయం 8 గంటల వరకు బాలలతో పని చేయించరాదు.

5) బాలలతో ఎక్కువ సమయం పని చేయించరాదు.

6) ఒకరి దగ్గర పనిచేస్తున్న బాలలెవరినీ కూడా అదే రోజు మరోచోట పనిచేయించరాదు.

సెక్షన్ 8 : బాలలందరికీ వారంలో ఒక నిర్ధిష్టమైనరోజు సెలవుదినముగా ప్రకటించాలి. ఇది అందరికీ తెలియజేయాలి. ఈ సెలవు దినాన్ని మూడు నెలలలోపు ఒకటికంటే ఎక్కువ సార్లు మార్చడానికి లేదు.

సెక్షన్ 9 : ఇన్‌స్పెక్టర్‌కు తెలియచేయుట :

1 బాలలతో పనిచేయిస్తున్న సంస్థల యాజమాన్యం ఆ ప్రాంతపు ఇన్‌స్పెక్టర్‌కు సంస్థ పూర్తి వివరాలను, సంస్థను నడుపుతున్న వ్యక్తి వివరాలు, చిరునామా, అక్కడ జరుగుతున్న పని విధానం తదితర విషయాలు తెలియజేయాలి.

పై విషయాలన్నీ ఈచట్టం వచ్చిన తరువాత 30 రోజుల్లోగా తెలియజేయాల్సిన బాధ్యత సంస్థ యాజమాన్యంపై వున్నది.

అయితే సెక్షన్ 7,8,9 లో చెప్పబడినది ఒక కుటుంబం నడుపుతున్న సంస్థకు లేదా ప్రభుత్వంచే స్థాపించబడిన పాఠశాలకు వర్తించవు.

సెక్షన్ 10 : వయస్సుకు సంబంధించిన వివాదం :

బాలల వయస్సుకు సంబంధించి జనన ధృవీకరణ పత్రం లేకుంటే వైద్య నిపుణుల ద్వారా వయస్సు నిర్ధారించబడుతుంది.

సెక్షన్ 11 : వివరాల పట్టిక :

బాలలతో పనిచేయిస్తున్న సంస్థ బాలలకు సంబంధించిన పుట్టుక తేదీ, పని గంటలు, విరామం, బాలలతో చేయిస్తున్న పని, ఇతర వివరాలు పొందుపర్చిన రిజిస్టరు వుండాలి.

సెక్షన్ 12 : సెక్షన్ 3, 14 లో సంబంధించిన అంశాలను తెలియ పరుస్తున్న నోటీసులు ప్రతి సంస్థ తమ ప్రదేశంలో కనబడేట్టుగా పెట్టాలి.

సెక్షన్ 13 : ఆరోగ్యం, భద్రత : సంబంధిత ప్రభుత్వాలు పిల్లల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన నియమాలు రూపొందించాలి.

అన్ని ముఖ్యమైన విషయాలతో పాటు ఈ క్రింది అంశాలపై నిబంధనలు రూపొందించాలి.

1. పరిశుభ్రత
2. చెత్తను పారవేసే విధానం.
3. గాలి, వెలుతురు, ఉష్ణోగ్రత.
4. దుమ్ము, పొగ
5. యాంత్రికంగా గాలిలో తేమను నిర్ధేశించడం.
6. వెలుతురు
7. త్రాగునీరు
8. మరుగు దొడ్లు
9. ఉమ్మివేయుట
10. యంత్రాల చుట్టూ కంచె
11. కదులుతుండే యంత్రం దగ్గర పనిచేసే విధానం
12. ప్రమాదకరమైన యంత్రాల దగ్గర బాలల నియామకం
13. ప్రమాదకరమైన యంత్రాలవద్ద బాలలకు సంబంధించిన సూచనలు, శిక్షణ, పర్యవేక్షణ
14. విద్యుచ్ఛక్తి ఆపే విధానం
15. తమంత తాము పనిచేసే యంత్రాలు
16. కొత్త యంత్రపరికరాలు
17. మెట్లు, అంతస్థులు, వెళ్ళే విధానం.
18. గుంటలు, సంపులు తదితరాలు
19. అధిక బరువులు
20. నేత్ర సంరక్షణ
21. పేలుడు పదార్థాలు

22. అగ్ని ప్రమాదాల్లో జాగ్రత్తలు
23. భవనాల స్థితిగతుల పర్యవేక్షణ
24. భవనాల, యంత్రాల భద్రత

నాల్గవ భాగం

ఇతరములు :

సెక్షన్ 14 : శిక్షలు :

1. సెక్షన్ 3ను ఉల్లంఘించి బాలలతో పనిచేయించే వారికి 3 నెలలకు తగ్గకుండా సంవత్సరం వరకు శిక్ష 10 వేలకు తగ్గకుండా 20 వేల వరకు జరిమానా లేదా రెండునూ విధించవచ్చు.
2. సెక్షన్ 3 ఉల్లంఘన క్రింద శిక్షపడిన వ్యక్తి మరోసారి అదే నేరానికి పాల్పడితే ఆరునెలలు తగ్గకుండా రెండు సంవత్సరాల వరకు శిక్ష విధించవచ్చు.
3. సెక్షన్ 9 క్రింద తెలియపర్చవలసిన విషయాలు ఉల్లంఘించడం, సెక్షన్ 11 క్రింద రిజిస్టరు ఏర్పాటు చేయకుండా ఉల్లంఘించడం. సెక్షన్ 3, 12 లకు సంబంధించిన నోటీసులు పెట్టకపోవడం. తదితర ఉల్లంఘనలకు పాల్పడినవారికి ఒక నెలవరకు జైలుశిక్ష లేదా పదివేల రూపాయల వరకు జరిమానా లేదా రెండునూ విధించవచ్చు.

సెక్షన్ 15 : ఈ క్రింది చెప్పబడిన చట్టాలను ఉల్లంఘించినవారికి ఆ చట్టాల్లో చెప్పబడిన శిక్షలు కాక, ఈ చట్టంలో సెక్షన్ 14లో నిర్దేశించిన శిక్షలు అమలుచేయాలి.

సెక్షన్ 67 → ఫ్యాక్టరీల చట్టం, సెక్షన్ 40 → గనుల చట్టం, సెక్షన్ 109 → వ్యాపార ఓడ రవాణా చట్టం, సెక్షన్ 21 → మోటారు కార్మికుల చట్టం.

సెక్షన్ 16 :

1. ఏ వ్యక్తి గానీ, పోలీసు అధికారి గానీ, ఇన్‌స్పెక్టరు గానీ ఈ చట్టంలోని నేరాలపై కోర్టుకు ఫిర్యాదు చేయవచ్చు.
2. బాలల వయస్సుకు సంబంధించి వైద్యాధికారి ఇచ్చిన పత్రంతో వయస్సు నిరూపించబడినట్టుగా భావించాలి. దీనిని ప్రశ్నించడానికి లేదు.
3. మొదటి శ్రేణి మేజిస్ట్రేటు కోర్టు కంటే కింది కోర్టులు ఈ చట్టంలోని నేరాలను విచారించడానికి లేదు.

సెక్షన్ 17 : సంబంధిత ప్రభుత్వం ఇన్‌స్పెక్టర్లను నియమించాలి.

సెక్షన్ 18 : సంబంధిత ప్రభుత్వం ఈ చట్టానికి అనుబంధమైన నిబంధనలను రూపొందించాలి. ఆ నిబంధనలు ఈ క్రింది అంశాలపై కూడా వుండవచ్చు.

ఎ. సాంకేతిక సలహాసంఘం సభ్యుల అర్హతలు, వేతనాలు, ఉప సంఘాల సభ్యులకు సంబంధించిన విషయాలు.

బి. సెక్షన్ 7 ప్రకారం బాలల పనిగంటలు

సి. బాలల వయస్సు నిర్ధారణ పత్రాల గురించి, వైద్యాధికారుల గురించిన విషయాలు.

డి. సెక్షన్ 11లో చెప్పబడిన రిజిస్టర్‌లో వుండాల్సిన అంశాల గురించి.

సెక్షన్ 19 : ఈ చట్టానికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే నిబంధనలు పార్లమెంటు, అసెంబ్లీల్లో నివేదించి ఆమోదం పొందాలి.

సెక్షన్ 20 : సెక్షన్ 15కు లోబడి ఈ చట్టంలోని సెక్షన్లు నిబంధనలు ఇతర చట్టాలకు అదనంగా వర్తిస్తాయి.

సెక్షన్ 21 : ఈ చట్టంలోని అంశాలపై సందిగ్ధత వచ్చినపుడు వాటిని పరిష్కరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయవచ్చు.

సెక్షన్ 22 : బాలలతో పనిచేయించు చట్టం 1938 రద్దు చేయబడింది.

సెక్షన్ 23,24,25,26 : ఈ సెక్షన్ల ద్వారా కనీసవేతనాల చట్టం, ప్లాంటేషన్ కార్మికచట్టం, వ్యాపార ఓడ రవాణాచట్టం, మోటారు రవాణా కార్మిక చట్టాలలో వయస్సుకు సంబంధించిన సెక్షన్లు ఈ చట్టానికి అనుగుణంగా సవరించబడ్డాయి.

షెడ్యూలు : (సెక్షన్ 3లో చెప్పబడిన షెడ్యూలు)

పార్ట్ ఎ : వృత్తులు :

i. రైల్వేలో ప్రయాణీకుల, సరుకుల రవాణా

ii. రైల్వే ప్రాంతంలో నిర్మాణ తదితర పనులు

iii. రైల్వేస్టేషన్‌లలో తినుపదార్థాలు అమ్మకానికి సంబంధించిన పనులు

iv. రైల్వేస్టేషన్ నిర్మాణపనులు

v. ఓడరేవుల్లో పనులు

vi. బాణాసంచా దుకాణాలు

vii. జంతు సంహార దుకాణాలు

viii. మోటారు వాహనాల వర్క్‌షాపులు, గ్యారేజీలు

ix. యంత్ర కర్మాగారం

x. విషవాయువులు, పేలుడు పదార్థాలు సంబంధితమైనవి

xi. చేనేత, యంత్రనేత పరిశ్రమలు

xii. గనులు

xiii. ప్లాస్టిక్, గాజు కర్మాగారాలు

xiv. ఇళ్ళల్లో పనివారుగా

xv. రోడ్డు పక్కన హోటళ్ళు, టీ బంకులు

పార్ట్ బి : పనులు :

1. బీడీ
2. కార్పెట్లు
3. సిమెంటు
4. బట్టలపై ప్రింటు, డయింగు
5. అగ్గిపెట్టెలు, బాణాసంచా తయారీ
6. మైకా కోయడం
7. షెల్లాక్ తయారీ
8. సబ్బుల తయారీ
9. తోళ్ళ పరిశ్రమ
10. ఊలు పరిశ్రమ
11. భవన నిర్మాణం, గ్రానైట్ పాలిషింగ్
12. పలకలు, బలపాల తయారీ
13. సీసం, పాదరసం, మాంగనీస్, క్రోమియం, కాడ్మియం తదితర క్రిమి సంహారకాలు
14. ఆస్‌బెస్టాస్ తయారీ
15. ఫ్యాక్టరీల చట్టంలో చెప్పబడిన ప్రమాదకర పనులు
16. ఫ్యాక్టరీల చట్టంలో చెప్పబడిన ముద్రణ కార్యక్రమాలు
17. జీడిపప్పు పరిశ్రమ
18. ఎలక్ట్రానిక్ పరిశ్రమల్లో సోల్డరింగ్
19. అగర్ బత్తీ తయారీ
20. మోటారు వాహన రిపేర్లు, వెల్డింగ్, లేత్ పని తదితరాలు
21. ఇటుకలు, పెంకుల బట్టీలు
22. దూది, జిన్నింగ్ మిల్లులు
23. డిటర్జెంట్ల తయారీ
24. మూసపోసే వస్తువుల తయారీ
25. వజ్రాలు, విలువైన రాళ్ళకోత, మెరుగు
26. క్రోమైటు, మాంగనీసు ఖనిజాలకు సంబంధించిన పనులు

27. నార, పీచు పరిశ్రమ
28. సున్నపు బట్టీలు
29. తాళాలు పరిశ్రమ
30. సీసం, క్లోరైడ్, జింకు తదితర ప్రమాదకర పరిశ్రమలు
31. సిమెంటు పైపులు, ఇతర సిమెంటు ఉత్పత్తులు.
32. గాజు పరిశ్రమ, గాజులతయారీ, బల్బులు తదితరాలు
33. అద్దకం, అద్దకంకి సంబంధించిన ముడిపదార్థాలు
34. క్రిమిసంహారక మందులు తయారీ, ఇతర పనులు
35. విషపదార్థాల, తుప్పు పట్టే గుణమున్న పదార్థాల, ఎలక్ట్రానిక్ పరిశ్రమ తయారీ, ఇతరత్రా పనులు
36. బొగ్గు కాల్చడం, తదితర పనులు
37. ఆటవస్తువుల తయారీ, సింథటిక్ వస్తువులతో పని, రసాయనాలు, తోలు
38. ప్లాస్టిక్, ఫైబర్‌గ్లాసు తయారీ
39. చమురు పరిశ్రమ
40. పేపరు తయారీ
41. సిరామిక్ పరిశ్రమ
42. ఇత్తడి పరిశ్రమ
43. వ్యవసాయ యంత్రాలతో పనులు
44. రంపపు మిల్లులు
45. సెరి కల్చర్
46. తోలు పరిశ్రమ
47. కంకర రాళ్ళ పరిశ్రమ
48. పొగాకు ఉత్పత్తులు
49. టైర్లు సంబంధిత పనులు
50. వంట పాత్రల తయారీ, ఇతర పనులు
51. జరీ తయారీ
52. ఎలక్ట్రో ప్లేటింగ్
53. గ్రాఫైట్ సంబంధిత పనులు
54. లోహాలను అరగదీసే లేక మెరుగుపెట్టే పరిశ్రమలు

55. వజ్రాల మెరుగు, కోత

56. గనుల నుంచి పలకను తీయడం

57. చెత్త నుంచి ఏరుకోవడం, పాకీ పనులు

బాల కార్మిక నిషేధం, నియంత్రణ నిబంధనలు - 1988

బాల కార్మిక నిషేధ, నియంత్రణ చట్టానికి అనుగుణంగా నిబంధనలు చేయబడ్డాయి.

1. ఈ నిబంధనలను బాలకార్మిక, నిషేధ మరియు నియంత్రణ నిబంధనలు 1988 అనవచ్చు. ఇది కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన తేదీ నుంచి అమలులోకి వచ్చింది (10.8.1988 నుంచి అమలులోకి వచ్చింది)

2. నిర్వచనాలు :

   ఎ) చట్టం అనగా బాల కార్మిక నిషేధ మరియు నియంత్రణ చట్టం.

   బి) కమిటీ అనగా బాల కార్మిక సాంకేతిక సలహామండలి.

   సి) అధ్యక్షులు అనగా పైన చెప్పబడిన కమిటీ అధ్యక్షులు

   డి) ఫారం అనగా ఈ నిబంధనలతో పొందుపరచబడిన ఫారం

   ఇ) రిజిస్టరు అనగా సెక్షను 11 ప్రకారం వుండవలసిన రిజిస్టరు.

   ఎఫ్) షెడ్యూలు అనగా చట్టానికి అనుగుణంగా వున్న షెడ్యూలు

   జి) సెక్షను అనగా చట్టంలోని సెక్షను.

3. కమిటీ సభ్యుల కాలపరిమితి : కమిటీ సభ్యులు నియమించబడిన తరువాత సంవత్సర కాలంపాటు కొనసాగుతారు. కాని కేంద్ర ప్రభుత్వం ఈ కాలపరిమితిని మరో రెండు సంవత్సరాలు పొడిగించవచ్చు. వీరిని మళ్ళీ నియమించవచ్చు.

4. భారత ప్రభుత్వంలోని దిగువస్థాయి సెక్రటరీ హోదాగల అధికారిని ఈ కమిటీ కార్యదర్శిగా నియమించవచ్చు.

5. అధికార సభ్యులుకాక ఇతర సభ్యులకు అధ్యక్షునికీ కేంద్ర ప్రభుత్వంలోని రూ॥ 4,500/– వేతనమునకు సరిపడా జీతబత్తెములు ఇవ్వవచ్చు.

6. సభ్యులు తమ రాజీనామా అధ్యక్షులకి సమర్పించవచ్చు. అధ్యక్షులు తన రాజీనామాను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలి.

7. అధ్యక్షులను, సభ్యులను వారు సంజాయిషీ ఇచ్చుకునే అవకాశం కల్పించి కేంద్ర ప్రభుత్వం తొలగించవచ్చు.

8. ఎవరైనా సభ్యులు మూడు సమావేశాలకు వరుసగా హాజరు కాకపోయినా, మానసిక వ్యాధిగ్రస్తులయినా, నీతి బాహ్యమైన నేరాలకు శిక్షపడినా, దివాళా తీసినా వారి సభ్యత్వం రద్దవుతుంది.

9. సభ్యుల్లో ఖాళీలేర్పడితే కేంద్రప్రభుత్వం ఆ ఖాళీలను భర్తీ చేయవచ్చు.

10. కమిటీ సమావేశాలు ఎప్పుడు ఎక్కడ జరగాలో అధ్యక్షులు నిర్ణయిస్తారు.
11. సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలు సంబంధిత విషయాల గురించిన నోటీసును పంపించాల్సిన బాధ్యత కార్యదర్శిపై వుంటుంది.
12. సమావేశాలకు అధ్యక్షులు అధ్యక్షత వహిస్తారు.
13. కనీసం ముగ్గురు సభ్యులతో కోరం వుండాలి.
14. నిర్ణయాలు మెజారిటీ ఓట్లపై ఆధారపడి తీసుకోవాలి.
15. ఉప సంఘాలను కమిటీ సభ్యులతోగాని, ఇతరులతో గాని నియమించవచ్చు.
16. సెక్షన్ 11 ప్రకారం ఉండవలసిన రిజిస్టరు ఫారం ఎ లో సూచించిన విధంగా వుండాలి.
17. బాలల వయస్సు వైద్యులతో ధృవీకరించబడినపుడు ఆ ధృవీకరణ పత్రం ఫారం బి ప్రకారం వుండాలి.

ఆంధ్రప్రదేశ్ బాల కార్మిక నిషేధ నియంత్రణ నిబంధనలు 1995

కేంద్ర ప్రభుత్వపు ఉత్తర్వుల లాగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా బాల కార్మిక చట్టానికి అనుబంధంగా నిబంధనలు తయారు చేసింది. ఈ నిబంధనలు 18.10.1995 నుంచి అమలులోకి వచ్చాయి. బాల కార్మిక చట్టం సెక్షన్ 13, సెక్షన్ 18లలో సూచించిన అంశాలపై వివరణ ఇచ్చే విధంగా ఈ నిబంధనలు రూపొందించబడ్డాయి. ఈ నిబంధనల్లో శుభ్రత ఎలా వుండాలీ, రసాయనాలు ఇతర చెత్తలను ఎలా పారవేయాలీ, గాలి, వెలుతురు, మరుగు దొడ్లు ఎలా వుండాలీ, పిల్లలు బరువుమోసే పనులకు సంబంధించి, వారి నేత్ర రక్షణ, అగ్ని ప్రమాదాల గురించి రక్షణ, పనిగంటలు, సెలవులు, వయస్సు నిర్ణయించే విధానం, ఇన్‌స్పెక్టర్ల నియామకం మరియు అధికారాలు తదితర అంశాలపై వున్నాయి.

*****

25. బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ చట్టం 2005

బాలల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ మరియు రాష్ట్ర కమీషన్లు బాలలపై జరుగుతున్న నేరాలు, బాలల హక్కుల ఉల్లంఘన మరియు ఇతర అంశాల సత్వర పరిష్కారం కోసం బాలల కోర్టులను నెలకొల్పడం కొరకు ఉద్దేశించిన చట్టమిది.

1990 లో జరిగిన ఐక్యరాజ్యసమితి అత్యున్నత సమావేశంలో భారతదేశం కూడా పాల్గొంది. ఈ సమావేశంలో బాలల రక్షణ, అభివృద్ధి, జీవనం సాగింపు అంశాలపై వివిధ దేశాలు చేసిన ప్రకటనలో భారతదేశం కూడా వుంది. భారతదేశం బాలల హక్కుల ఒప్పందాన్ని (CRC) పార్లమెంటులో 11-12-1992 న ఆమోదించింది. బాలల హక్కుల ఒప్పందం నిర్దేశించిన ప్రకారం మరియు ప్రభుత్వ విధానాలకు చట్టబద్ధమైన రూపకల్పన చేయడం కొరకు ఈ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చారు.

అధ్యాయం - 1

ప్రాథమిక అంశాలు

1. పేరు, పరిధి, ప్రారంభ తేదీ :

1. ఈ చట్టాన్ని బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ చట్టం 2005 అని పిలవవచ్చు.
2. ఈ చట్టం భారతదేశం యావత్తూ వర్తిస్తుంది. జమ్మూ, కాశ్మీర్ మినహా.
3. కేంద్రప్రభుత్వం రాజపత్రం ద్వారా ప్రచురించిన నాటినుండి అమలులోకి వస్తుంది.

2. నిర్వచనాలు :

ఈ చట్టంలో సందర్భానుసారం మినహా :

a. 'అధ్యక్షులు' అనగా జాతీయ లేదా రాష్ట్ర కమీషన్ల అధ్యక్షులు.

b. 'బాలల హక్కులు' అనగా ఐక్యరాజ్యసమితి 20 నవంబరు 1989 లో నిర్దేశించిన బాలల హక్కుల ఒప్పందం మరియు 11 డిశంబరు 1992 లో భారత ప్రభుత్వం ధృవపరచిన బాలల హక్కులు.

c. 'కమీషన్' అనగా సెక్షన్ 3 ప్రకారం స్థాపించబడిన జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్.

d. 'సభ్యులు' అనగా జాతీయ మరియు రాష్ట్ర కమీషన్ సభ్యులు మరియు అధ్యక్షులు.

e. 'ప్రకటన' అనగా ప్రభుత్వ రాజపత్రంలో ముద్రించబడిన ప్రకటన.

f. 'నిర్ణయించిన' అనగా చట్టంలోని నియమాలు నిర్ణయించిన ప్రకారం.

g. 'రాష్ట్ర కమీషన్' అనగా సెక్షన్ 17 ప్రకారం ఏర్పాటు చేయబడిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్.

అధ్యాయం - II

జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్

3. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ ఏర్పాటు :

1. ఈ చట్టం నిర్దేశించిన విధులు మరియు అధికారాలు నిర్వర్తించుట కొరకు కేంద్రప్రభుత్వం ఏర్పాటుచేసిన జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ ఈచట్టంలో :

2. కమీషన్‌లో కింద పేర్కొన్న సభ్యులుంటారు. వారు :

a. బాలల సంక్షేమాన్ని పెంపొందించడంలో విశిష్ట కృషి చేసిన ప్రముఖ వ్యక్తిని అధ్యక్షులుగా నియమిస్తారు. మరియు

b. ఆరుమంది సభ్యులు కలిగి వారిలో కనీసం ఇద్దరు మహిళలుండేలా కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. నియమించబడిన సభ్యులకు దిగువన పేర్కొనబడిన అంశాలలో శక్తి సామర్థ్యాలు, అనుభవం, ఐక్యత, కలిసి పనిచేసే స్వభావం :

i. విద్య

ii. బాలల ఆరోగ్యం, శ్రద్ధ, సంక్షేమం లేదా అభివృద్ధి

iii. బాల నేరస్థులకు న్యాయం జరిగేలా, నిరాకరించబడిన, అణగారిన బాలలు, వికలాంగ బాలల కొరకు శ్రద్ధ చూపడం

iv. బాల కార్మికుల నిర్మూలన మరియు వేదనలో వున్న బాలల పట్ల శ్రద్ధ

v. బాలల సామాజిక మరియు మానసిక పరిస్థితులు మరియు

vi. బాలలకు సంబంధించిన చట్టాలు.

3. ఈ కమీషను యొక్క కార్యాలయం న్యూ ఢిల్లీలో వుంటుంది.

4. అధ్యక్షులు మరియు సభ్యుల నియామకం :

కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా అధ్యక్షులు మరియు సభ్యులను నియమిస్తుంది.

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి నియమించిన త్రిసభ్య కమిటీ సూచించిన వ్యక్తిని అధ్యక్షులుగా నియమించడం.

5. అధ్యక్షులు మరియు సభ్యుల ఉద్యోగ కాలపరిమితి మరియు నిబంధనలు:

1. అధ్యక్షులు మరియు సభ్యులు పని ప్రారంభించిన నాటినుంచి 3 సం॥ల వరకు ఆ పదవిలో కొనసాగుతారు.

రెండు దఫాలకంటే ఎక్కువ అధ్యక్షులు లేదా సభ్యులు ఆ పదవిని నిర్వహించరాదు.

అధ్యక్షులు మరియు సభ్యులు ఈ క్రింది పేర్కొన్న సందర్భాలలో వారు పదవీవిరమణ చేయాలి.

a. అధ్యక్షులకు 65 ఏళ్ళు వున్నట్లయితే

b. సభ్యులకు 60 ఏళ్ళు వున్నట్లయితే

2. అధ్యక్షులు లేదా సభ్యులు రాతపూర్వకంగా తాము రాజీనామా చేసినట్లు కేంద్ర ప్రభుత్వానికి తెలియపర్చవచ్చు.

6. అధ్యక్షులు మరియు సభ్యుల జీతబత్యములు :

అధ్యక్షులు మరియు సభ్యుల జీతబత్యాలు మరియు ఇతర ఉద్యోగపరమైన నిబంధనలు కేంద్రప్రభుత్వం నిబంధనలమేరకు వుంటాయి.

7. బాధ్యతల నుంచి తొలగించుట :

1. సబ్ సెక్షన్ (2) ప్రకారం, అధ్యక్షులు తన బాధ్యతలను నిర్వర్తించలేనిపక్షంలో లేదా దుష్ప్రవర్తన చేసారని రుజువయిన పక్షంలో కేంద్రప్రభుత్వం అధ్యక్షులను తొలగించవచ్చు.
2. సబ్ సెక్షన్ (1) ప్రకారం క్రింది పేర్కొన్న సందర్భాలలో కేంద్రప్రభుత్వం అధ్యక్షులు లేదా సభ్యులను వారి పదవిలోనుంచి తొలగించవచ్చు.
   a. దివాళా తీసినట్లయితే
   b. ఈ పదవిని కొనసాగిస్తూ, అదేకాలంలో ఇతర చోట్ల పనిచేస్తూ జీతం పొందినట్లైతే
   c. పనిచేయుటకు నిరాకరించినా లేదా పనిచేసే శక్తి సామర్థ్యాలు లేనట్లైతే
   d. మతి స్థిమితంలేని పరిస్థితులను కోర్టు నిర్ధారించినా
   e. కార్యాలయంలో ప్రవర్తన సరిగాలేని పక్షంగా ప్రజలక్షేమం కోరి బాధ్యతల నుంచి తొలగించుట.
   f. ఏదైనా నేరానికి శిక్ష విధించబడి ఆ తప్పిదం కేంద్రప్రభుత్వం దృష్టిలో నీతి బాహ్యమైనదని భావించినట్లయితే.
   g. మూడుసార్లు వరుస మీటింగులకు అనుమతిలేకుండా హాజరుకాని పక్షంలో.
3. ఏ వ్యక్తినయినా తొలగించాలి అని నిర్ణయించినపుడు ఆ వ్యక్తికి తన వాదనను వినిపించుకునే పూర్తి అవకాశం కల్పించాలి.

8. అధ్యక్షులు లేదా సభ్యుల పదవులకు ఖాళీలు ఏర్పడుట :

1. అధ్యక్షులు లేదా సభ్యులు :
   a. సెక్షన్ 7 లో పేర్కొన్న ప్రకారం ఏదైనా అంశములతో అనర్హులైనట్లయితే, లేదా
   b. సెక్షన్ 5 లో సబ్ సెక్షన్ 2 ప్రకారం తమ పదవికి రాజీనామా చేసినపుడు
2. రాజీనామా ద్వారా గానీ మరణం వల్ల గానీ లేదా మరి ఏ ఇతర కారణాలచేత అధ్యక్షులు లేదా సభ్యుల పదవులలో ఖాళీలు ఏర్పడినట్లయితే సెక్షన్ 4 ప్రకారం 90 రోజులలోపు ఆ పదవులలో కొత్త వ్యక్తులను నియమించాలి. నియమించబడిన వ్యక్తులు సంబంధిత పదవుల కాలపరిమితి వరకే కొనసాగుతారు.

9. ఖాళీలు మరియు ఇతర అంశాలు కారణంగా కమీషన్ నిర్ణయాలకు అడ్డంకి కారాదు :

క్రింద పేర్కొన్న కారణాలచేత కమీషన్ నిర్ణయాలు చెల్లకపోవడం అనేది ఉండదు.

   a. కమీషన్‌లో ఏర్పడ్డ ఖాళీలు కానీ, మరి ఏ ఇతర లోపాలు వలన కానీ, లేదా
   b. అధ్యక్షులు మరియు సభ్యుల నియామకంలో ఏదైనా లోపం వున్నట్లయితే, లేదా
   c. కమీషన్ యొక్క ప్రక్రియ సక్రమంగా లేనప్పటికీ దాని ప్రభావం కమీషన్ తీసుకున్న నిర్ణయంలో లేనట్లయితే.

10. కమీషన్ యొక్క నిర్వహణ ప్రక్రియ :

1. అధ్యక్షులు నిర్వహించిన ప్రకారం ప్రతి మూడు నెలల కొకసారి కమీషన్ల సమావేశాలు నిర్వహిస్తారు.
2. సమావేశంలోని నిర్ణయాలను మెజారిటీ పద్ధతిలో నిర్వహిస్తారు. ఓట్లు సమానంగా వచ్చినప్పుడు అధ్యక్షులు, లేదా ఆ సమావేశానికి అధ్యక్షత నిర్వహిస్తున్నవారు తమ ఓటును వేయవచ్చు.
3. అధ్యక్షులు సమావేశానికి హాజరు కాలేని పక్షంలో సభ్యులు తమలో నుండి ఒకరిని ఆ సమావేశానికి అధ్యక్షులుగా వ్యవహరించేందుకు ఎన్నుకుంటారు.

11. కమీషన్ యొక్క సభ్య కార్యదర్శి, అధికారులు మరియు ఇతర సిబ్బంది:

కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా సహాయ కార్యదర్శి లేదా అదనపు కార్యదర్శి హోదా కలిగిన వ్యక్తిని కమీషన్ సభ్య కార్యదర్శిగా నియమిస్తూ ఆయనకు అందుబాటులో వుండేవిధంగా ఇతర అధికారులను, ఉద్యోగులను నియమిస్తుంది. రోజువారీ కార్యక్రమాల నిర్వహణ మరియు కేంద్రప్రభుత్వం అప్పగించిన ఇతరవిధులను సభ్యకార్యదర్శి నిర్వర్తిస్తారు.

12. జీతబత్యాలు కేంద్రప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం వుంటాయి.

అధ్యాయం - III

కమీషన్ యొక్క విధులు అధికారాలు.

13. కమీషన్ యొక్క విధులు :

1. దిగువన పేర్కొన్న అన్నీ లేదా కొన్ని విధులను కమీషన్ నిర్వర్తిస్తుంది.
   a) బాలల హక్కుల పరిరక్షణ కొరకు చట్టంలోని వివిధ అంశాలను పరీక్షించి మరియు సమీక్షించిన పిదప వాటి నిర్థిష్టమైన అమలు కొరకు అవసరమైన సూచనలు చేయడం.
   b) ఈ చట్టాల అమలు తీరుపై కమీషన్ తనయొక్క వార్షిక నివేదికను అవసరాన్నిబట్టి కాలానుగుణంగా నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది.
   c) బాలల హక్కుల ఉల్లంఘనపై విచారణ చేపట్టి అవసరమైన చర్యలు చేపట్టుట కొరకు సిఫార్సులు చేస్తుంది.
   d) తీవ్రవాదం, మత సంఘర్షణలు, లూటీలు, ప్రకృతి విపత్తులు, కుటుంబ హింస, HIV / AIDS, ఇతర ప్రాంతాలకు అనైతిక తరలింపు, వ్యభిచారం వంటి అంశాల కారణంగా బాలల హక్కులకు భంగం వాటిల్లినట్లయితే అటువంటి పరిస్థితులను చక్కదిద్దేందుకు అవసరమైన సిఫార్సులు మరియు పరిష్కార మార్గాలను సూచిస్తుంది.
   e) ప్రత్యేక అవసరాలున్న బాలల కోసం మరియు వేదనలకు గురైన బాలల కోసం, నిరాకరించబడిన మరియు విపత్కర పరిస్థితుల్లో వున్న బాలల కోసం తగు చర్యలు చేపట్టుటకై సిఫార్సులు చేయుట మరియు పరిష్కారమార్గాలు సూచించుట.

f) అంతర్జాతీయ ఒప్పందాల అధ్యయనం మరియు అమలులోవున్న విధానాలు మరియు ఇతర సంక్షేమ పథకాలను నిర్ధారించబడిన సమయాల్లో సమీక్షిస్తూ వాటి పటిష్ట అమలు ద్వారా బాలలకు మేలుకలిగేలా సిఫార్సులు చేయడం.

g) బాలల హక్కులకు సంబంధించిన పరిశోధనను చేపట్టుట మరియు ప్రోత్సహించుట.

h) బాలల హక్కులపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయుట, సంబంధిత సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళుట.

i) జువినైల్ హోమ్‌లు మరియు కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు బాలల కొరకు నడుపు గృహాలు, మరియు ఇతర గృహాలను తనిఖీ చేయుట. అక్కడ పరిస్థితులు మెరుగుపర్చడం కోసం తగు చర్యలు చేపట్టుట.

j) వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి, ఈ దిగువన ఉదహరించిన అంశాలలో 'సూమోటో' గా చర్యలు చేపట్టుట

i. బాలల హక్కుల నిరాకరణ మరియు ఉల్లంఘన

ii. బాలల రక్షణ మరియు అభివృద్ధి కొరకు వున్న చట్టాలను అమలు చేయకపోవడం

2. రాష్ట్ర కమీషన్ వద్దగానీ చట్టబద్ధమైన మరి ఏ ఇతర కమీషన్ వద్దగానీ విచారణలో వున్న కేసులను జాతీయ కమీషన్ చేపట్టదు.

14. విచారణాధికారాలు :

1. సెక్షన్ 13 లోని సబ్ సెక్షన్ (1) నందుగల క్లాజ్ (j) ప్రకారం విచారణ చేపట్టే సమయాల్లో కమీషన్ CPC 1908 ప్రకారం సివిల్‌కోర్టుతో సమానంగా అధికారాలు కలిగియుంటుంది. క్రింది పేర్కొన్న అంశాలలో:

A. వ్యక్తులను హాజరుపరిచి విచారించడం

B. అవసరమైన పత్రాలను సంపాదించి సమర్పించడం

C. అఫిడవిట్ల ద్వారా సాక్ష్యాలను స్వీకరించడం

D. ప్రభుత్వ కార్యాలయాలనుండి రికార్డులను పొందవచ్చు

E. సాక్ష్యుల విచారణ కొరకు కమీషన్లను జారీచేయుట

2. సిఆర్‌పిసి 1973 లోని సెక్షన్ 346 ప్రకారం కోర్టులకు కేసులు బదిలీ చేసినట్టు కమీషన్ కూడా సంబంధిత కోర్టులకు ఆ కేసులను బదిలీ చేసే అవకాశం వుంది.

15. విచారణ తర్వాత చేపట్టే చర్యలు :

ఈ చట్టంకింద విచారణ పూర్తి చేసిన పిదప కమీషన్ దిగువన పేర్కొనబడిన చర్యలు చేపడుతుంది.

1. కమీషన్ ఏదైనా వ్యక్తి లేదా వ్యక్తులు బాలల హక్కుల వుల్లంఘన చేసారని కమీషన్ భావించినట్లయితే తగు చర్యలు తీసుకోవలసిందిగా సంబంధిత ప్రభుత్వాలు లేదా అధికారులకు కమీషన్ సిఫార్సు చేస్తుంది.

2. అవసరమయిన ఎడల సుప్రీకోర్టునుగాని, హైకోర్టునుగాని ఆశ్రయించి వారివద్ద నుంచి తగు నిర్ణయాలు, ఆదేశాలు రిట్‌లను పొందుతుంది.

3. బాధితుల కుటుంబానికి కమీషన్ అవసరమని భావించినంత నష్టపరిహారాన్ని చెల్లించవలసిందిగా సంబంధిత ప్రభుత్వానికి లేదా అధికారులకు సిఫార్సుచేస్తుంది.

16. కమీషన్ వార్షిక నివేదికలు :

కమీషన్ తన వార్షిక నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి మరియు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పిస్తుంది. కమీషన్ సమర్పించే వార్షిక మరియు ప్రత్యేక నివేదికలను పార్లమెంటులో లేదా రాష్ట్ర శాసన సభలో ప్రవేశపెట్టి వాటి ఆమోదాన్ని పొందుతారు.

అధ్యాయం - IV

బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమీషన్

17. బాలల హక్కుల పరిరక్షణ కొరకు రాష్ట్ర కమీషన్ ఏర్పాటు.

1. ఈ చట్టంలో పేర్కొన్న విధులను మరియు అధికారములను నిర్వర్తించుట కొరకు రాష్ట్ర ప్రభుత్వం బాలల హక్కుల పరిరక్షణ కొరకు రాష్ట్ర కమీషన్‌ను ఏర్పాటుచేస్తుంది.

2. బాలలకు సంబంధించిన వివిధ అంశాలలో విశిష్ట కృషి చేసిన ప్రముఖ వ్యక్తులను కమీషన్ అధ్యక్షులుగానూ, మరియు 6 గురు సభ్యులను రాష్ట్ర కమీషన్‌కు నియమించవచ్చు. సభ్యులలో కనీసం ఇద్దరు మహిళలైవుండాలి.

3. రాష్ట్ర కమీషన్ ప్రధాన కార్యాలయం రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ప్రాంతంలో వుంటుంది.

18. అధ్యక్షులు మరియు సభ్యుల నియామకం :

సంబంధిత శాఖామంత్రి అధ్యక్షులుగా మరియు ఇద్దరు సభ్యులతో కూడుకున్న త్రిసభ్య కమిటీ కమీషన్ అధ్యక్షులను మరియు ఇతర సభ్యులను ఎంపికచేస్తుంది.

19. అధ్యక్షుల మరియు సభ్యుల ఉద్యోగ కాలపరిమితి మరియు నిబంధనలు :

అధ్యక్షులు మరియు సభ్యుల ఉద్యోగ కాలపరిమితి 3 సం॥ లుంటుంది. వీరందరూ కూడా రెండు దఫాలు కంటే ఆ పదవిని నిర్వహించరాదు. అధ్యక్షుల గరిష్ట వయోపరిమితి 65 సం॥లు, సభ్యులకు 60 సం॥లు. వీరి రాజీనామాని రాత పూర్వకంగా తెలియపర్చవచ్చు.

20. అధ్యక్షులు మరియు సభ్యుల జీతబత్యములు :

అధ్యక్షుల మరియు సభ్యుల జీతబత్యాలు మరియు ఉద్యోగ నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు వుంటాయి.

21. కార్యదర్శి, అధికారులు మరియు ఇతర సిబ్బంది నియామకం మరియు జీతబత్యములు :

రాష్ట్ర ప్రభుత్వంలోని కార్యదర్శి స్థాయి అధికారిని కార్యదర్శిగానూ, ఇతర అధికారులను మరియు సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. కమీషన్ యొక్క రోజువారీ కార్యక్రమాల నిర్వహణ మరియు సంస్థాపరమైన

నిర్వహణకు కార్యదర్శి బాధ్యులు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు కార్యదర్శి ఇతర అధికారులు మరియు సిబ్బంది యొక్క జీతబత్యాలుంటాయి.

22. సెక్షన్ 28 లోని సబ్ సెక్షన్ (*l*) లో వుదహరించిన నిధులనుండి సెక్షన్ 21 లో వుదహరించిన విధంగా సిబ్బంది మొత్తానికి జీతబత్యాలు, పింఛన్లు చెల్లిస్తారు.

23. రాష్ట్ర కమీషన్ తమ వార్షిక మరియు ప్రత్యేక రిపోర్టులను తగు చర్యల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఈ నివేదికలను శాసనసభలో పెట్టి వారి ఆమోదం మేరకు తదుపరి చర్యలను చేపడుతుంది.

24. సెక్షన్ 7, 8, 9, 10 సెక్షన్ 13 (*l*), సెక్షన్ 14 మరియు 15 లు రాష్ట్ర కమీషన్‌కి కూడా వర్తిస్తాయి.

అధ్యాయం - V

బాలల కోర్టులు

25. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో చర్చించిన మేరకు బాలలపై జరిగే నేరాలను మరియు వారి హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల సత్వర పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో ఒక కోర్టును మరియు ప్రతి జిల్లాలోను ఒక సెషన్స్ కోర్టును బాలల కోర్టుగా ఏర్పాటుచేసి సంబంధితనేరాలను ఆ కోర్టుల్లో విచారించాలి.

26. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ : బాలల కోర్టుల్లో కేసుల విచారణ కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ని నియమిస్తుంది. లేదా న్యాయవాదిగా 7 సం॥లు అనుభవమున్న న్యాయవాదిని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించి బాలల ప్రత్యేక కోర్టుల్లో కేసులను నిర్వహిస్తుంది.

*****

26. బాలల ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009

ఆరు నుండి పధ్నాలుగు సంవత్సరాల బాలలందరికీ ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించడానికి ఉద్దేశించిన చట్టం ఇది.

అధ్యాయం - I

ప్రాథమికం

1. పేరు, పరిధి, అమలుతేదీ :

1. ఈ చట్టాన్ని బాలల ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 అని పిలవవచ్చు.
2. ఈ చట్టం భారతదేశం యావత్తూ వర్తిస్తుంది. జమ్మూ, కాశ్మీరు మినహా.
3. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన తేదీ 1-4-2010 నుండి అమలులోకి వచ్చింది.

2. నిర్వచనాలు:

సందర్భంలో వేరుగా ఉదహరిస్తే తప్ప చట్టంలోని పదాల అర్థాలు :

ఎ) "సంబంధిత ప్రభుత్వం" అనగా

i) కేంద్ర ప్రభుత్వం ప్రారంభించి దాని యాజమాన్యంలో లేదా నియంత్రణలో ఉన్న పాఠశాలలకు శాసనసభ లేని కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం:

ii) సబ్ క్లాజు (i) లో సూచించిన పాఠశాలలు కాకుండా ఇతర పాఠశాలలు.

1. రాష్ట్రం, రాష్ట్ర ప్రభుత్వం:
2. శాసనసభ ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం, కేంద్ర పాలిత ప్రభుత్వం;

బి) 'తలసరి రుసుం' అనగా పాఠశాల ప్రకటించిన రుసుము కాకుండా ఇతర రూపాలలో ఇచ్చే చందా, విరాళం, చెల్లింపులు.

సి) "బాలలు" అనగా 6-14 సంవత్సరాల బాల, బాలికలు:

డి) "ప్రతికూల పరిస్థితులలో ఉన్న బృందాలకు చెందిన బాలలు" అనగా షెడ్యూల్డు కులం, షెడ్యూల్డు తెగ, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గం, లేదా సంబంధిత ప్రభుత్వం ప్రకటన ద్వారా పేర్కొన్న సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, భౌగోళిక, భాషాపర, లింగ లేదా ఏ ఇతర కారణాల వల్లనైనా గాని ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న ఇతర బృందాలకు చెందిన బాలలు;

ఇ) "బలహీనవర్గాలకు చెందిన బాలలు" అనగా సంబంధిత ప్రభుత్వం ప్రకటన ద్వారా పేర్కొన్న కనీస మొత్తం కంటే తక్కువ వార్షిక ఆదాయం ఉన్న తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు చెందిన బాలలు;

యఫ్) "ఎలిమెంటరీ విద్య" అనగా ఒకటి నుంచి ఎనిమిదవ తరగతి వరకు విద్య:

జి) బాలలకు సంబంధించిన "సంరక్షకులు" అనగా ఆ బాలుడు /బాలిక సంరక్షణ బాధ్యత, కస్టడీ కలిగి ఉన్న వ్యక్తి; వీళ్ళు సహజ సంరక్షకులు కావచ్చు, కోర్టు లేదా చట్టపరంగా ప్రకటించబడిన లేదా నియమించబడిన సంరక్షకులు కావచ్చు;

హెచ్) "స్థానిక ప్రభుత్వం" అనగా నగరపాలకసంస్థ, లేదా నగరపాలక సంఘం లేదా జిల్లా పరిషత్ లేదా నగర పంచాయితీ లేదా పంచాయితీ, ఏ పేరుతో పిలువబడినప్పటికి పాఠశాల మీద పరిపాలనా సంబంధ నియంత్రణ కలిగిన సంస్థని సూచిస్తుంది. లేదా అమలులో ఉన్న చట్టం ప్రకారం ఏదైనా గ్రామ, పట్టణ, నగరంలో స్థానిక ప్రభుత్వంగా పనిచెయ్యడానికి అధికారం పొందిన సంస్థని సూచిస్తుంది;

ఐ) "బాలల హక్కుల సంరక్షణకు జాతీయ కమీషన్" అనగా బాలల హక్కు సంరక్షణకు కమీషన్ల చట్టం, 2005 లోని సెక్షన్ 3 ప్రకారం ఏర్పాటు చేయబడిన బాలల హక్కుల సంరక్షణకు జాతీయ కమీషన్;

జె) "ప్రకటన" అనగా అధికారిక రాజపత్రంలో ప్రచురించిన ప్రకటన;

కె) "తల్లిదండ్రులు" అనగా బాలల సహజ, సవతి లేదా దత్తత తీసుకున్న తల్లి లేదా తండ్రి;

ఎల్) "సిఫారసు చేసిన" అనగా ఈ చట్టం కింద సిఫారసు చేసిన నియమాలు;

ఎమ్) "షెడ్యూల్" అనగా ఈ చట్టానికి అనుబంధంగా ఇచ్చిన షెడ్యూల్;

ఎన్) 'పాఠశాల' అనగా ఎలిమెంటరీ విద్యను అందచేస్తూ ప్రభుత్వంతో గుర్తింపు పొందిన పాఠశాల. మరియు

i) సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించి దాని యాజమాన్యం లేదా నియంత్రణలో ఉన్న పాఠశాల;

ii) తన ఖర్చులో మొత్తం కానీ కొంత భాగంగానీ సహాయంగా సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం నుండి పొందుతున్న ఎయిడెడ్ పాఠశాల;

iii) ప్రత్యేక వర్గీకరణకు చెందిన పాఠశాల, మరియు

iv) తన ఖర్చులకు సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం పొందని అన్ ఎయిడెడ్ పాఠశాల;

ఒ) "ఎంపిక విధానం" అనగా ర్యాండమ్ పద్ధతిని మినహాయించి ఒకరిని కాకుండా వేరొకరిని పాఠశాలలో చేర్చుకోటానికి నిర్వహించే ఎంపిక లేదా ప్రవేశ విధానం;

పి) "ప్రత్యేక వర్గీకరణ" అనగా కేంద్రీయ విద్యాలయ, నవోదయ విద్యాలయ, సైనిక్ పాఠశాల వంటివి లేదా సంబంధిత ప్రభుత్వ ప్రకటన ద్వారా విశిష్ట లక్షణం ఉందని పేర్కొన్న ఇతర పాఠశాలలు.

ఖ్యూ) "బాలల హక్కుల సంరక్షణకు రాష్ట్ర కమీషన్" అనగా బాలల హక్కుల సంరక్షణ కమీషన్ల చట్టం, 2005 లోని సెక్షన్ 3 కింద ఏర్పాటు చేయబడిన బాలల హక్కుల సంరక్షణకు రాష్ట్ర కమీషన్;

అధ్యాయం - II

ఉచిత మరియు నిర్బంధ విద్యా హక్కు

3. 1. ఆరు నుంచి పధ్నాలుగు సంవత్సరాలు ఉన్న బాలలందరికీ పరిసర ప్రాంత పాఠశాలలో ఎలిమెంటరీ విద్య పూర్తి చేసేవరకు ఉచిత, నిర్బంధ విద్య పొందే హక్కు ఉంటుంది.

2. సబ్‌సెక్షన్ (1) లో పేర్కొన్నట్లు ప్రాథమిక విద్యను చేపట్టి పూర్తి చెయ్యటానికి అవరోధకంగా ఉండే ఎటువంటి రుసుము, ఛార్జీలు, ఖర్చులను చెల్లించాల్సిన అవసరం బాలలకు లేదు;

అయితే, సమాన అవకాశాలు, సంరక్షణ, పూర్తి భాగస్వామ్యం చట్టం, 1996 లోని సెక్షన్ 2, క్లాజు (i) నిర్వచించిన ప్రకారం వైకల్యంతో బాధపడుతున్న బాలలు ఆ చట్టంలోని అధ్యాయం v లో పేర్కొన్న ప్రకారం ఉచిత, నిర్బంధ ఎలిమెంటరి విద్యను పొందే హక్కును కలిగి ఉంటారు.

4. ఆరు ఏళ్ళు నిండిన బాలుడు/బాలికను పాఠశాలలో చేర్చకపోయినా, లేదా చేర్చిన తరువాత ప్రాథమిక విద్య పూర్తి చెయ్యలేకపోయినా వారిని వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్చుకోవాలి.

అయితే, తమ వయసుకు తగిన తరగతిలో ప్రవేశం పొందిన బాలలు తోటివారితో సమానంగా ఉండటానికి సిఫారసు చేసిన పద్ధతిలో, సిఫారసు చేసిన కాలపరిధిలో ప్రత్యేక శిక్షణ పొందే హక్కు కలిగి ఉంటారు.

అయితే, ఈ విధంగా ఎలిమెంటరి విద్యలోకి ప్రవేశం పొందిన బాలలు పధ్నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన తరువాత కూడా ఎలిమెంటరి విద్యను పూర్తి చేసేవరకు ఉచిత విద్యను పొందే హక్కు కలిగి ఉంటారు.

5. 1. ఒక పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తిచేసే సదుపాయం లేకపోతే సెక్షన్ 2 క్లాజు (ఎన్) లోని సబ్‌క్లాజులు (iii), (iv) లలో పేర్కొన్న పాఠశాలను మినహాయించి తమ ఎలిమెంటరి విద్యను పూర్తి చెయ్యటానికి ఏ ఇతర పాఠశాలకైనా బదిలీ కోరే హక్కు ఉంటుంది.

2. అదే రాష్ట్రంలో కాని, రాష్ట్రం బయట కాని ఏ కారణం వల్లనైతేనేమి ఒక పాఠశాల నుండి మరొక పాఠశాలకి బాలలు మారవలసి వచ్చినప్పుడు సెక్షన్ 2 క్లాజు (ఎన్) లోని సబ్‌క్లాజులు (iii), (iv) లలో పేర్కొన్న పాఠశాలలను మినహాయించి తమ ఎలిమెంటరి విద్యను పూర్తి చెయ్యటానికి ఏ ఇతర పాఠశాలకైనా బదిలీ కోరే హక్కు ఉంటుంది.

3. ఇలా వేరే పాఠశాలలో ప్రవేశం పొందడానికి అప్పటి వరకు చదివిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా పాఠశాల ఇన్‌చార్జి వెంటనే బదిలీ ధృవీకరణ పత్రాన్ని ఇవ్వాలి;

అయితే, బదిలీ ధృవీకరణ పత్రం ఇవ్వటం ఆలస్యం అయ్యిందన్నది వేరే పాఠశాలలో ప్రవేశం ఇవ్వకపోవటానికి, ఆలస్యంగా చేర్చుకోవటానికి కారణంగా చూపటానికి లేదు;

అయితే ధృవీకరణ పత్రం ఇవ్వటంలో జాప్యానికి కారణమైన ప్రధానోపాధ్యాయులు లేదా పాఠశాల ఇన్‌చార్జి, వారికి వర్తించే ఉద్యోగ నియమాల ప్రకారం క్రమశిక్షణ చర్యలకు బద్ధులౌతారు.

అధ్యాయం - III

సంబంధిత ప్రభుత్వం, స్థానిక ప్రభుత్వం, తల్లిదండ్రుల బాధ్యతలు

6. ఈ చట్టంలోని అంశాలను అమలు చెయ్యటానికి సిఫారసు చేసిన పరిసర ప్రాంత పరిధిలో పాఠశాల లేకపోతే ఈ చట్టం అమలులోకి వచ్చిన మూడు సంవత్సరాలలోపు సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం పాఠశాలని స్థాపిస్తాయి.

7. 1. ఈ చట్టంలోని అంశాలను అమలు చెయ్యటానికి నిధులను సమకూర్చే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమానంగా ఉంటుంది.

2. ఈ చట్టంలోని అంశాలను అమలు చెయ్యటానికి అవసరమయ్యే ఒక్కసారి చేసే పెట్టుబడి ఖర్చులను, ప్రతి సంవత్సరం అయ్యే నిర్వహణ ఖర్చులను కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తుంది.

3. పై సబ్‌సెక్షన్ (2) లో పేర్కొన్న ఖర్చులో కొంత శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి ఎప్పటికప్పుడు నిర్ధారించిన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ ఇన్‌ఎయిడ్‌గా అందచేస్తుంది.

4. చట్టంలోని అంశాలను అమలు చెయ్యటానికి అవసరమయ్యే తన వంతు నిధులను అందచెయ్యటానికి ఏ రాష్ట్ర ప్రభుత్వానికి అయినా అదనపు వనరుల అవసరాన్ని పరిశీలించటానికి ఆర్టికల్ 280 లోని క్లాజు (3), సబ్‌క్లాజ్ (డి) ప్రకారం ఆర్థిక సంఘాన్ని సంప్రదించవలసిందిగా రాష్ట్రపతిని కేంద్ర ప్రభుత్వం కోరవచ్చు.

5. పై సబ్‌సెక్షన్ (4) లో చెప్పిన దానితో సంబంధం లేకుండా సబ్‌సెక్షన్ (3) లో కేంద్ర ప్రభుత్వం అందచేసిన మొత్తాలను, తన ఇతర వనరులను పరిగణనలోకి తీసుకుని ఈ చట్టంలోని అంశాలను అమలు చెయ్యటానికి అవసరమైన నిధులను అందచెయ్యటానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది.

6. కేంద్ర ప్రభుత్వం

ఎ) సెక్షన్ 29 లో పేర్కొన్న అకడమిక్ అథారిటి సహాయంతో జాతీయ పాఠ్యప్రణాళిక చట్రాన్ని తయారు చేస్తుంది.

బి) టీచర్ల శిక్షణకు ప్రామాణికాలను రూపొందించి, అమలు అయ్యేలా చూస్తుంది;

సి) కొత్త ఆవిష్కరణలు, పరిశోధనలు, ప్రణాళిక తయారీ, సామర్థ్యం పెంపుదలను ప్రోత్సహించటానికి రాష్ట్ర ప్రభుత్వాలకు సాంకేతిక మద్ధతును వనరులను అందజేస్తుంది.

8. సంబంధిత ప్రభుత్వం :

ఎ) బాలలందరికి ఉచిత, నిర్బంధ ఎలిమెంటరీ విద్యను అందచేస్తుంది;

అయితే ఎవరైనా తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ బిడ్డను సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించి దాని యాజమాన్యం లేదా నియంత్రణలో లేని పాఠశాలలో కాని, ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ పెద్ద మొత్తంలో నిధులు అందించని పాఠశాలలో కాని చేర్పించినట్లయితే అటువంటి పాఠశాలలో తమ బిడ్డకు ప్రాథమిక విద్య చెప్పించినందుకు పెట్టిన ఖర్చును తిరిగి చెల్లించమని అడిగే హక్కు ఉండదు.

వివరణ : "నిర్బంధ విద్య" అంటే సంబంధిత ప్రభుత్వం కింది వాటికి బాధ్యత వహించటం

i) ఆరు నుంచి పధ్నాలుగు సంవత్సరాల వయస్సు ఉన్న బాలలందరికి ఉచితంగా ప్రాథమిక విద్యను అందించటం.

ii) ఆరు నుంచి పధ్నాలుగు సంవత్సరాల వయస్సు ఉన్న బాలలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్చి, పాఠశాలకు హాజరవుతూ, ప్రాథమిక విద్యను పూర్తి చేసేలా చూడటం;

బి) సెక్షన్ 6 లో పేర్కొన్న విధంగా పరిసర ప్రాంతంలో పాఠశాల అందుబాటులో ఉండేలా చూడడం;

సి) బలహీన వర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు ఏ విధమైన వివక్షతకు గురికాకుండా, ప్రాథమిక విద్యను చేపట్టి, పూర్తి చెయ్యటంలో ఏ కారణంగా కూడా ఆటంకాలు లేకుండా చూడటం;

డి) పాఠశాల భవనం, బోధనా సిబ్బంది, బోధనా పరికరాలతో సహా మౌలిక సదుపాయాలను కల్పించటం;

ఇ) సెక్షన్ 4 లో పేర్కొన్న విధంగా ప్రత్యేక శిక్షణా సౌకర్యాలను కల్పించడం;

యఫ్) ప్రతి ఒక్క బాలుడు లేదా బాలిక పాఠశాలలో ప్రవేశం పొంది, హాజరు అవుతూ, ప్రాథమిక విద్యను పూర్తి చేసేలా పర్యవేక్షించడం.

జి) షెడ్యూలులో పేర్కొన్న నియమాలు, ప్రామాణికాలకు అనుగుణంగా నాణ్యమైన ఎలిమెంటరి విద్య అందుబాటులో ఉండేలా చూడడం;

హెచ్) ఎలిమెంటరి విద్యకు పాఠ్యప్రణాళికను, కోర్సులను సకాలంలో సిఫారసు చేయడం;

ఐ) టీచర్లకు శిక్షణా సౌకర్యం కల్పించటం

9. ప్రతి స్థానిక ప్రభుత్వం :

ఎ) బాలలందరికి ఉచిత, నిర్బంధ ఎలిమెంటరి విద్యను అందచేస్తుంది;

అయితే ఎవరైనా తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ బిడ్డను సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించి దాని యాజమాన్యం లేదా నియంత్రణలో లేని పాఠశాల కాని, ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ పెద్ద మొత్తంలో నిధులు అందించని పాఠశాలలో కాని చేర్పించినట్లయితే అటువంటి పాఠశాలలో తమ బిడ్డకు ఎలిమెంటరి విద్య చెప్పించినందుకు పెట్టిన ఖర్చును తిరిగి చెల్లించమని అడిగే హక్కు ఉండదు.

బి) సెక్షన్ 6 లో పేర్కొన్న విధంగా పరిసర ప్రాంతంలో పాఠశాల అందుబాటులో ఉండేలా చూడడం;

సి) బలహీన వర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు ఏ విధమైన వివక్షతకు గురికాకుండా, ఎలిమెంటరి విద్యను చేపట్టి, పూర్తిచెయ్యటంలో ఏ కారణంగా కూడా, ఆటంకాలు లేకుండా చూడటం;

డి) సిఫారసు చేసిన విధంగా తమ పరిధిలో నివసిస్తున్న పధ్నాలుగు ఏళ్ళ లోపల బాలలందరి రికార్డులను నిర్వహించడం;

ఇ) ప్రతి ఒక్క బాలుడు లేదా బాలిక పాఠశాలలో ప్రవేశం పొంది, హాజరు అవుతూ, ఎలిమెంటరి విద్యను పూర్తి చేసేలా పర్యవేక్షించటం;

యఫ్) పాఠశాల భవనం, బోధనా సిబ్బంది, బోధనా పరికరాలతో సహా మౌలిక సదుపాయాలను కల్పించటం;

జి) సెక్షన్ 4 లో పేర్కొన్న విధంగా ప్రత్యేక శిక్షణా సౌకర్యాలను కల్పించడం;

హెచ్) షెడ్యూలులో పేర్కొన్న నియమాలు, ప్రామాణికాలకు అనుగుణంగా నాణ్యమైన ఎలిమెంటరి విద్య అందుబాటులో ఉండేలా చూడటం;

ఐ) ఎలిమెంటరీ విద్యకు పాఠ్యప్రణాళికను, కోర్సులను సకాలంలో సిఫారసు చేయటం;

జె) టీచర్లకు శిక్షణా సౌకర్యం కల్పించటం;

కె) వలస కుటుంబాల పిల్లలు పాఠశాలలో ప్రవేశం పొందేలా చూడటం;

ఎల్) తమ పరిధిలోని పాఠశాలల పనితీరును పర్యవేక్షించటం;

ఎమ్) విద్యా క్యాలెండరును నిర్ణయించడం;

10. తమ బిడ్డ, లేదా సంరక్షణలో ఉన్న బాలుడు/బాలికను పరిసర ప్రాంతంలోని ఎలిమెంటరి విద్యలో చేర్పించడం ప్రతి తల్లిదండ్రి లేదా సంరక్షకుని బాధ్యత.

11. మూడు సంవత్సరాలు నిండిన బాలలను ఎలిమెంటరి విద్యకు సంసిద్ధులను చెయ్యటానికి, ఆరేళ్ళు నిండే వరకు బాలలందరికీ శైశవ దశ సంరక్షణ, విద్య అందించటానికి ఇటువంటి పిల్లలకు ఉచిత పూర్వ పాఠశాల విద్యను అందించటానికి అవసరమైన ఏర్పాట్లను సంబంధిత ప్రభుత్వం చెయ్యాలి.

అధ్యాయం - IV

పాఠశాలలు మరియు ఉపాధ్యాయుల బాధ్యతలు

12. 1) ఈ చట్టానికి సంబంధించినంత వరకు

ఎ) సెక్షన్ 2, క్లాజు (ఎన్), సబ్ క్లాజు (i) లో పేర్కొన్న పాఠశాలలు ప్రవేశం ఇచ్చిన బాలలందరికీ ఉచిత, నిర్బంధ ఎలిమెంటరి విద్యను అందించాలి;

బి) సెక్షన్ 2 క్లాజు (ఎన్) సబ్ క్లాజు (ii) లో పేర్కొన్న పాఠశాలలు కనీసం 25 శాతానికి తగ్గకుండా ప్రతి సంవత్సరం నిర్వహణకు అయ్యే ఖర్చులో ఎంత శాతం నిధులను వార్షిక ఎయిడ్ లేదా గ్రాంటుగా పొందుతున్నాయో పాఠశాలలో చేర్చుకున్న పిల్లల్లో అంత శాతం మందికి ఉచిత, నిర్బంధ ఎలిమెంటరి విద్యను అందించాలి;

సి) సెక్షన్ 2, క్లాజు (ఎన్), సబ్ క్లాజు (iii) మరియు (iv) లలో పేర్కొన్న పాఠశాలలు పరిసర ప్రాంతాలకు చెందిన బలహీన వర్గాలు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన బాలలకు ఒకటవ తరగతిలోని విద్యార్థుల సంఖ్య 25 శాతం ఇచ్చి ఎలిమెంటరి విద్య పూర్తి చేసేంత వరకు ఉచిత, నిర్బంధ విద్యను అందచేయాలి.

సెక్షన్ 2, క్లాజ్ (ఎన్) లో పేర్కొన్న పాఠశాలల్లో పాఠశాల పూర్తి విద్యను అందచేస్తున్నట్లయితే పైన పేర్కొన్న (ఎ) నుంచి (సి) క్లాజులలోని అంశాలు పూర్వ పాఠశాలలో ప్రవేశానికీ వర్తిస్తాయి.

2. సెక్షన్ 2, క్లాజు (ఎన్) లో సబ్‌క్లాజు (iv) లో పేర్కొన్న పాఠశాలలు సబ్‌సెక్షన్ (1) క్లాజు (సి) లో పేర్కొన్న విధంగా ఉచిత, నిర్బంధ విద్యను అందజేస్తున్నట్లయితే అది చేసిన ఖర్చును తిరిగి పొందవచ్చు; ప్రతి బాలుడు/బాలికపై రాష్ట్రం పెట్టే ఖర్చుకి లేదా వాస్తవంగా విద్యార్థి నుంచి వసూలు చేసిన మొత్తానికి ఏది తక్కువైతే అది, సిఫారసు చేసిన పద్ధతి ప్రకారం లోబడి చెల్లింపులు చేస్తారు;

అయితే సెక్షన్ 2, క్లాజు (ఎన్), సబ్‌క్లాజు (i) లో పేర్కొన్న పాఠశాలలో ఒక బాలుడు/బాలికపై అయిన ఖర్చుకు మించి ఇటువంటి చెల్లింపులు ఉండకూడదు.

అయితే, ఏ పాఠశాల అయినా భూమి, భవనం, పరికరాలు, ఇతర సదుపాయాలను పూర్తి ఉచితంగా కానీ లేదా రాయితీ ధరపై కానీ పొంది ఉండి నిర్ధారిత సంఖ్యలో పిల్లలకు ఉచిత విద్యను అందించాల్సిన బాధ్యత కలిగి ఉంటే ఆ బాధ్యత వర్తించే వరకు చేసిన ఖర్చులకు తిరిగి చెల్లింపులు పొందే అర్హత ఉండదు.

3. సందర్భాన్నిబట్టి సంబంధిత ప్రభుత్వానికి లేదా స్థానిక ప్రభుత్వానికి అవసరమయ్యే సమాచారాన్ని ప్రతి పాఠశాల అందించాలి.

13. 1. బాలుడు/బాలికను పాఠశాలలోకి చేర్చుకోటానికి పాఠశాలగానీ లేదా ఎవరైనా వ్యక్తిగానీ క్యాపిటేషన్ రుసుం వసూలు చెయ్యకూడదు, బాలుడు/బాలికను లేదా వారి తల్లిదండ్రులను లేదా వారి సంరక్షకులను ఎటువంటి ఎంపిక విధానానికి గురి చెయ్యకూడదు.

2. సబ్‌సెక్షన్ (1) లో పేర్కొన్న అంశాలకు విరుద్ధంగా ఏ పాఠశాల అయినా, లేదా వ్యక్తి అయినా

ఎ) క్యాపిటేషన్ రుసుం వసూలు చేస్తే దానికి పదిరెట్ల వరకు జరిమానాతో శిక్షింపబడవచ్చు.

బి) బాలుడు/బాలికను ఎంపిక విధానానికి గురిచేస్తే, మొదటిసారి తప్పుకు 25,000 రూపాయలు, ఆ తరువాత ప్రతిసారి తప్పుకు 50,000 రూపాయిల జరిమానా విధించవచ్చు.

14. 1. జనన, మరణ, వివాహాల నమోదు చట్టం, 1886 లోని అంశాలకు అనుగుణంగా జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం లేదా సిఫారసు చేసిన ఇతర పత్రం ఆధారంగా ప్రాథమిక విద్యలో ప్రవేశానికి బాలుడు/బాలిక వయస్సును నిర్ధారిస్తారు.

2. వయస్సు నిర్ధారణ చెయ్యలేదన్న కారణంతో ఏ బాలుడు/ బాలికను పాఠశాలలో ప్రవేశాన్ని తిరస్కరించకూడదు.

15. విద్యా సంవత్సరం మొదలు అయినప్పుడు లేదా సిఫారసు చేసిన గడుపు పెంచిన కాలం లోపు బాలలను పాఠశాలలో చేర్చుకోవాలి.

అయితే, పెంచిన గడువు తరువాత బాలుడు/బాలిక ప్రవేశం కోరితే దానిని తిరస్కరించకూడదు;

అయితే, గడువు తరువాత ప్రవేశం పొందిన బాలలు సంబంధిత ప్రభుత్వం సిఫారసు చేసిన విధంగా తమ చదువును పూర్తి చెయ్యాలి.

16. పాఠశాల ప్రవేశం పొందిన బాలలను ఎలిమెంటరి విద్య పూర్తి అయ్యే వరకు ఏ తరగతిలోనైనా మళ్లీ కొనసాగించకూడదు, పాఠశాల నుంచి తీసివెయ్యకూడదు.

17. 1. ఏ బాలుడు/బాలికను కూడా శారీరక శిక్షకూ, మానసిక వేధింపులకు గురి చెయ్యకూడదు.

2. పై సబ్‌సెక్షన్(1) లోని అంశాలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారు ఆ వ్యక్తికి వర్తించే ఉద్యోగ నియమాల ఆధారంగా క్రమశిక్షణ చర్యకు గురౌతారు.

18. 1. ఈ చట్టం అమలులోకి వచ్చిన తరువాత సంబంధిత ప్రభుత్వం, లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించి దాని యాజమాన్యంలో లేదా నియంత్రణలో నడిచే పాఠశాల తప్పించి సిఫారసు చేసిన విధంగా,

పద్ధతిలో దరఖాస్తు చేసుకుని సంబంధిత అధీకృత సంస్థ నుంచి గుర్తింపు ధృవీకరణ పత్రం పొందకుండా ఏ ఇతర పాఠశాల స్థాపించకూడదు, పనిచెయ్యకూడదు.

2. సిఫారసు చేసిన విధంగా తగిన విధంలో, నిర్ణీత గడువులో తగిన పద్ధతులలో షరతులు విధిస్తూ గుర్తింపు ధృవీకరణ పత్రాన్ని సబ్ సెక్షన్(1) ప్రకారం అధీకృతమైన సంస్థ జారీ చేస్తుంది.
అయితే సెక్షన్ 19 లో నిర్దేశించిన నియమాలు, ప్రామాణికాలను పూర్తి చేసే వరకు పాఠశాలకు ఇటువంటి గుర్తింపు జారీ చెయ్యకూడదు.

3. గుర్తింపు ఇస్తూ విధించిన షరతులను ఉల్లంఘిస్తే సంబంధిత అధీకృత సంస్థ లిఖిత పూర్వక ఆదేశాల ద్వారా గుర్తింపును ఉపసంహరించు కోవచ్చు.
అయితే, గుర్తింపు రద్దు చేస్తున్న పాఠశాలలో చదువుతున్న బాలలను ఏ పరిసర ప్రాంత పాఠశాలలో చేర్చుకోవాలో ఆ ఆదేశాలలో పేర్కొనాలి.
అయితే, గుర్తింపు రద్దు చెయ్యబోయే పాఠశాల వాదనను సిఫారసు చేసిన విధంగా, సిఫారసు చేసిన పద్ధతిలో వినకుండా గుర్తింపును రద్దు చెయ్యకూడదు.

4. సబ్‌సెక్షన్ (3) కింద గుర్తింపు రద్దు అయిన తేదీ నుండి ఆ పాఠశాల పనిచెయ్యకూడదు.

5. గుర్తింపు ధృవీకరణ పొందకుండా ఏ వ్యక్తి అయినా పాఠశాల స్థాపించినా, నడిపినా లేదా గుర్తింపు రద్దు అయిన తరువాత కూడా పాఠశాల నడిపినా లక్షరూపాయల వరకు జరిమానా విధించవచ్చు. ఒక వేళ ఉల్లంఘన ఇంకా కొనసాగుతున్నట్లయితే అలాంటి కాలానికి ప్రతిరోజుకి పదివేల రూపాయల వరకు జరిమానా విధించవచ్చు.

19. 1. షెడ్యూలులో పేర్కొన్న నియమాలు, ప్రామాణికాలు పూర్తి చెయ్యకుండా సెక్షన్ 18 కింద ఏ పాఠశాలని ఏర్పాటు చెయ్యకూడదు, గుర్తింపును ఇవ్వకూడదు.

2. ఈ చట్టం ఏర్పడక ముందే స్థాపించబడి, నిర్వహింపబడుతున్న పాఠశాల షెడ్యూల్‌లో పేర్కొన్న నియమాలు, ప్రామాణికాలను పూర్తి చెయ్యకపోతే చట్టం అమలులోకి వచ్చిన తేది నుంచి మూడు సంవత్సరాలలోపు ఈ నియమాలు, ప్రామాణికాలను పూర్తి చెయ్యడానికి తన సొంత ఖర్చులతో చర్యలు చేపట్టాలి.

3. సబ్‌సెక్షన్ (2) కింద పేర్కొన్న గడువు లోపల నియమాలు, ప్రామాణికాలను పాఠశాల పూర్తి చెయ్యటంలో విఫలమయితే సెక్షన్ 18, సబ్‌సెక్షన్ (3) కింద పేర్కొన్న పద్ధతిలో, సబ్‌సెక్షన్ (1) లో పేర్కొన్న సంబంధిత అధీకృత సంస్థ ఆ పాఠశాలకి జారీచేసిన గుర్తింపును రద్దు చెయ్యాలి.

4. సబ్‌సెక్షన్ (3) ప్రకారం గుర్తింపు రద్దు చేసిన తేదీ నుంచి ఆ పాఠశాల పని చెయ్యకూడదు.

5. గుర్తింపు రద్దు అయిన తరువాత కూడా ఏ వ్యక్తి అయినా పాఠశాల నడిపితే లక్షరూపాయల వరకు జరిమానా విధించవచ్చు. ఒకవేళ ఉల్లంఘన ఇంకా కొనసాగుతున్నట్లయితే అలాంటి కాలానికి ప్రతిరోజుకి పదివేల రూపాయిల వరకు జరిమానా విధించవచ్చు.

20. కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా నియమాలు, ప్రామాణికాలలోంచి ఏదైనా తొలగించడం లేదా కొత్తగా చేర్చటం ద్వారా షెడ్యూలుని సవరించవచ్చు.

21. 1. సెక్షన్ 2, క్లాజు (ఎన్) సబ్ క్లాజు (iv) లో పేర్కొన్న పాఠశాలలను మినహాయించి మిగిలిన పాఠశాలలన్నీ స్థానిక ప్రభుత్వానికి ఎన్నికయిన ప్రజా ప్రతినిధులతో, ఆ పాఠశాలలో చదువుతున్న బాలల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు, ఉపాధ్యాయులతో పాఠశాల యాజమాన్య సంఘాన్ని ఏర్పాటు చెయ్యాలి.

అయితే, ఇటువంటి సంఘంలో నాల్గింట కనీసం మూడు వంతుల సభ్యులు తల్లిదండ్రులు, లేదా సంరక్షకులు అయి ఉండాలి:

అయితే, బలహీనవర్గాలు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాల పిల్లల తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు దమాషా పద్ధతిలో ప్రాతినిధ్యం కల్పించాలి.

అయితే, ఈ సంఘ సభ్యులలో 50 శాతం మహిళలు ఉండాలి.

2. పాఠశాల యాజమాన్య సంఘం ఈ క్రింది విధులను నిర్వర్తిస్తుంది.

ఎ) పాఠశాల పనితీరును పర్యవేక్షించడం;

బి) పాఠశాల అభివృద్ధి ప్రణాళికను తయారు చేసి, సిఫారసు చేయటం;

సి) సంబంధిత ప్రభుత్వం, లేదా స్థానిక ప్రభుత్వం లేదా ఏ ఇతర వనరులనుంచి అయినా అందిన నిధుల వినియోగాన్ని పర్యవేక్షించడం;

డి) సిఫారసు చేసిన ఇతర విధులను నిర్వర్తించటం.

22. 1. సెక్షన్ 21, సబ్‌సెక్షన్ (1) ప్రకారం ఏర్పడిన ప్రతి పాఠశాల యాజమాన్య సంఘం సిఫారసు చేసిన విధంగా పాఠశాల అభివృద్ధి ప్రణాళికను తయారు చేయాలి.

2. సందర్భాన్ని బట్టి సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం రూపొందించే ప్రణాళికలకు, అందించే గ్రాంట్లకు సబ్‌సెక్షన్ (1) ప్రకారం తయారు చేసిన పాఠశాల అభివృద్ధి ప్రణాళిక ఆధారం అవుతుంది.

23. 1. కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా అధీకృతం చేసిన అకడెమిక్ సంస్థ నిర్ధారించిన కనీస అర్హతలు ఉన్న ఏ వ్యక్తి అయినా టీచరుగా నియమింపబడటానికి అర్హులు.

2. టీచర్ల శిక్షణలో కోర్సులు లేదా శిక్షణలు అందించే సంస్థలు తగినన్ని లేని రాష్ట్రాలు గానీ, సబ్‌సెక్షన్ (1) లో నిర్ధారించిన కనీస అర్హతలు ఉన్న టీచర్లు తగినంత సంఖ్యలో అందుబాటులో లేనప్పుడు కానీ అవసరమనుకుంటే కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా టీచరుగా నియమింపబడటానికి కనీస అర్హతలకు మినహాయింపులను ఇవ్వవచ్చు. ఆ ప్రకటనలో పేర్కొన్న కాలానికి లోబడి అయిదేళ్ళకు మించి ఈ మినహాయింపులు ఉండవు.

అయితే, ఈ చట్టం అమలులోకి వచ్చే తేదీ నాటికి సబ్‌సెక్షన్ (1) లో నిర్ధారించిన కనీస అర్హతలు లేని టీచరు అయిదు సంవత్సరాలలోపు కనీస అర్హతలను పొందాలి.

3. టీచర్లకు చెల్లించాల్సిన జీత భత్యాలు వారి ఉద్యోగ షరతులు, నిబంధనలు సిఫారసు చేసిన విధంగా ఉంటాయి.

24. 1. సెక్షన్ 23 సబ్ సెక్షన్ (1) ప్రకారం నియమితులైన టీచర్లు ఈ క్రింద పేర్కొన్న విధులను నిర్వర్తించాలి:

ఎ) పాఠశాల హాజరు కావటంలో సమయాన్ని, క్రమబద్ధతనీ పాటించాలి;

బి) సెక్షన్ 29 సబ్‌సెక్షన్ (2) లోని అంశాల ప్రకారం పాఠ్యాంశాలను చేపట్టి, పూర్తి చెయ్యాలి;

సి) నిర్ధారిత సమయంలోపు పాఠ్యాంశాలన్నింటినీ పూర్తి చెయ్యాలి.

డి) ప్రతి బాలుడు/బాలిక నేర్చుకునే సామర్థ్యాన్ని అంచనా వేసి, అవసరమైతే దానికి అనుగుణంగా అదనపు బోధనను అందించాలి;

ఇ) తల్లిదండ్రులు, సంరక్షకులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి బాలల హాజరీలో క్రమబద్ధత, వారు నేర్చుకునే సామర్థ్యం, నేర్చుకోవడంలో వారి ప్రగతి, వారికి సంబంధించిన ఇతర సమాచారాన్ని పంచుకోవాలి.

యఫ్) సూచించిన ఇతర విధులను నిర్వర్తించటం.

2. సబ్ సెక్షన్ (1) లో పేర్కొన్న విధులను నిర్వర్తించటంలో టీచరు విఫలమయితే వారికి వర్తించే ఉద్యోగ నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యకు గురౌతారు;

అయితే, ఇటువంటి క్రమశిక్షణ చర్య తీసుకునే ముందు ఆ టీచరు తన వాదన వినిపించటానికి న్యాయమైన అవకాశాన్ని ఇవ్వాలి.

3. టీచర్లకు ఉండే ఏ సమస్యలనైనా సూచించిన పద్ధతిలో పరిష్కరిస్తారు.

25. 1. చట్టం అమలులోనికి వచ్చిన ఆరు నెలలలోపు షెడ్యూలులో నిర్ధారించిన విద్యార్థులు – టీచర్ల నిష్పత్తి ప్రతి పాఠశాలలలోనూ ఉండేలా సంబంధిత ప్రభుత్వం, లేదా స్థానిక ప్రభుత్వం చూడాలి.

2. సబ్‌సెక్షన్ (1) లో పేర్కొన్న విద్యార్థి – టీచర్ల నిష్పత్తి ఉండేలా చూడటానికి ఒక పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చిన టీచరును సెక్షన్ 27 లో పేర్కొన్న అంశాలకు మినహాయించి ఇతర పాఠశాలలలో కానీ, కార్యాలయంలో కాని పనిచేయించకూడదు, విద్యేతర పనుల మీద పంపించగూడదు.

26. సంబంధిత ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం స్థాపించి, దాని యాజమాన్యం లేదా నియంత్రణలలో ఉన్న పాఠశాలలలో, లేదా ప్రత్యక్షంగా, పరోక్షంగా నిధులను సమకూర్చే పాఠశాలలలో ఆమోదం పొందిన మొత్తం టీచర్ల సంఖ్యలో ఖాళీల సంఖ్య పదిశాతానికి మించకుండా చూడాలి.

27. పది సంవత్సరాలకి ఒకసారి జరిగే జనాభా గణన, వైపరీత్యాలలో సహాయ విధులు, లేదా పార్లమెంటు, రాష్ట్రశాసన సభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబంధించిన విధులను మినహాయించి టీచర్లను ఏ ఇతర విద్యేతర పనులకు పంపకూడదు,

28. ఏ టీచరు కూడా ప్రైవేటు ట్యూషన్లను, ప్రైవేటు బోధనా పనులను చేపట్టగూడదు.

అధ్యాయం - V

పాఠ్య ప్రణాళిక, ప్రాథమిక విద్యను పూర్తి చేయటం

29. 1. సంబంధిత ప్రభుత్వం ప్రకటన ద్వారా అధీకృతం చేసిన అకడమిక్ సంస్థ ప్రాథమిక విద్యకు పాఠ్య ప్రణాళిక, మూల్యాంకన విధానాన్ని నిర్ధారిస్తుంది.

2. సబ్‌సెక్షన్ (1) ప్రకారం పాఠ్యప్రణాళికను, మూల్యాంకన విధానాన్ని నిర్ధారించేటప్పుడు, అధీకృత అకడమిక్ సంస్థ ఈ క్రింది అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది.

ఎ) రాజ్యాంగంలో పొందు పరిచిన విలువలకు అనుగుణంగా ఉండాలి.

బి) బాలల సర్వతోముఖాభివృద్ధి జరగాలి;

సి) బాలల జ్ఞానం, సామర్థ్యాలు, నైపుణ్యాలను పెంపొందించాలి;

డి) బాలల పూర్తి సామర్థ్యం మేరకు శారీరక, మానసిక శక్తులు అభివృద్ధి చెందాలి;

ఇ) పిల్లలను కేంద్రంగా చేసుకుని వారికి అనువైన విధానాల్లో కార్యక్రమాలు, పరిశోధన, కనుగొనటం ద్వారా నేర్చుకోవాలి;

యఫ్) ఆచరణకు సాధ్యమైనంత వరకు బోధనా మాధ్యమం బాలల మాతృభాషగా ఉంటుంది.

జి) భయం, ఆందోళన వంటి వాటి నుంచి బాలలను విముక్తం చేసి వారు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించటంలో సహాయపడాలి;

హెచ్) జ్ఞానాన్ని బాలలు అర్థం చేసుకున్న విధానం, దానిని అన్వయించే సామర్థ్యాలపై నిరంతర, సమగ్ర మూల్యాంకన.

30. 1. ప్రాథమిక విద్య పూర్తి అయ్యే వరకు బాలలు ఎటువంటి బోర్డు పరీక్షకు హాజరు కావలసిన అవసరం లేదు.

2. బాలుడు లేదా బాలిక ప్రాథమిక విద్య పూర్తి చేసిన తరువాత సూచించిన ప్రకారం వారికి తగిన విధానం, పద్ధతిలో ధృవీకరణ పత్రం జారీ చేస్తారు.

అధ్యాయం - VI

బాలల హక్కుల సంరక్షణ

31. 1. బాలల హక్కుల సంరక్షణ కమీషన్ల చట్టం, 2005 లోని సెక్షన్ 3 క్రింద ఏర్పడిన బాలల హక్కుల సంరక్షణ జాతీయ కమీషన్ లేదా సందర్భాన్ని బట్టి సెక్షన్ 17 కింద ఏర్పడిన బాలలహక్కుల సంరక్షణ రాష్ట్ర కమీషన్ ఆ చట్టంలో కేటాయించిన విధులకు అదనంగా ఈ దిగువ పేర్కొన్న విధులు కూడా నిర్వర్తిస్తాయి.

ఎ) ఈ చట్టం కింద లేదా దానికి అనుగుణంగా ఇచ్చిన హక్కులను పరిశీలించి, వాటిని కాపాడే ఏర్పాట్లను సమీక్షించి, ఇవి సమర్థంగా అమలు అయ్యేందుకు చర్యలను సిఫారసు చెయ్యటం;

బి) ఉచిత, నిర్బంధ విద్యకు బాలలకున్న హక్కుపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరపటం;

సి) పైన పేర్కొన్న బాలల హక్కుల సంరక్షణ కమీషన్ల చట్టంలోని సెక్షన్ 15 & 24 లకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవటం.

2. పైన పేర్కొన్న సబ్‌సెక్షన్ (1) క్లాజు (సి) కింద ఉచిత, నిర్బంధ విద్యకు బాలలకున్న హక్కుకు సంబంధించి ఏ అంశంలోనైనా విచారణ జరుపుతున్నపుడు ఆయా కమీషన్లకు బాలల హక్కుల సంరక్షణ కమీషన్ల చట్టంలోని సెక్షన్ 14 & 24 ల ప్రకారం వారికి ఇచ్చిన అధికారాలు ఇక్కడ కూడా వర్తిస్తాయి.

3. ఏదైనా రాష్ట్రంలో బాలల హక్కుల సంరక్షణకు రాష్ట్ర కమీషన్‌ను ఏర్పాటు చేసి ఉండకపోతే పైన పేర్కొన్న సబ్‌సెక్షన్ (1) లోని (ఎ) నుంచి (సి) క్లాజులలో పేర్కొన్న విధులను నిర్వర్తించటానికి సూచించిన నిబంధనలు, షరతులకు లోబడి సూచించిన విధంగా పనిచెయ్యటానికి ఒక అథారిటీని సంబంధిత ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు.

32. 1. సెక్షన్ 31 లో పేర్కొన్న దానితో సంబంధం లేకుండా ఈ చట్టం కింద బాలలకున్న హక్కుకి సంబంధించి ఏ వ్యక్తికైనా ఏదైనా ఫిర్యాదు ఉంటే సంబంధిత స్థానిక ప్రభుత్వానికి లిఖిత పూర్వకంగా తెలియచెయ్యవచ్చు.

2. సబ్‌సెక్షన్ (1) కింద ఫిర్యాదు అందుకున్న తరువాత సంబంధిత పార్టీల వాదనలు వినటానికి న్యాయమైన అవకాశాలు కల్పించిన తరువాత 3 నెలలలోపు నిర్ణయం తీసుకోవాలి.

3. ఈ విషయంలో స్థానిక ప్రభుత్వ నిర్ణయంతో బాధకు గురైన ఏవ్యక్తి అయినా సందర్భాన్ని బట్టి బాలల హక్కుల సంరక్షణ రాష్ట్ర కమీషన్‌కి గాని, లేదా సెక్షన్ 31, సబ్‌సెక్షన్ (3) కింద పేర్కొన్న అధారిటీకి గాని అప్పీలు చేసుకోవచ్చు.

4. సబ్‌సెక్షన్ (3) కింద చేసిన ఇటువంటి అప్పీలుపై సందర్భాన్ని బట్టి బాలల హక్కుల సంరక్షణ రాష్ట్ర కమీషన్‌గాని, సెక్షన్ 31, సబ్‌సెక్షన్ (3) కింద పేర్కొన్న అథారిటీ గాని సెక్షన్ 31, సబ్‌సెక్షన్ (1), క్లాజు (సి) ప్రకారం నిర్ణయం చెప్పాలి.

33. 1. ప్రకటన ద్వారా పదిహేను మందికి మించకుండా అవసరమనిపించి నంత మందితో జాతీయ సలహా సంఘాన్ని ఏర్పాటు చేసి, ప్రాథమిక విద్య, బాలల అభివృద్ధిలో జ్ఞానం, వాస్తవిక అనుభవం ఉన్న వ్యక్తుల నుంచి సభ్యులను కేంద్ర ప్రభుత్వం నియమించాలి.

2. జాతీయ సలహా సంఘం తన విధులలో భాగంగా ఈ చట్టంలోని అంశాలను సమర్థంగా అమలు చేసే విధానాలపై కేంద్ర ప్రభుత్వానికి సలహాలు ఇస్తుంది.

3. జాతీయ సలహా సంఘం సభ్యుల నియామకపు షరతులు, నిబంధనలు, వారికి వర్తించే భత్యాలు సూచించిన దానికి అనుగుణంగా ఉండవచ్చు.

34. 1. ప్రకటన ద్వారా పదిహేను మందికి మించకుండా అవసరమనిపించి నంత మందితో రాష్ట్ర సలహా సంఘాన్ని ఏర్పాటుచేసి, ప్రాథమిక విద్య, బాలల అభివృద్ధిలో జ్ఞానం, వాస్తవిక అనుభవం ఉన్న వ్యక్తుల నుంచి సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించాలి.

2. రాష్ట్ర సలహా సంఘం తన విధులలో భాగంగా ఈ చట్టంలోని అంశాలను సమర్థంగా అమలు చేసే విధానాలపై రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు ఇస్తుంది.

3. రాష్ట్ర సలహా సంఘం సభ్యుల నియామకపు షరతులు, నిబంధనలు, వారికి వర్తించే భత్యాలు సూచించిన దానికి అనుగుణంగా ఉండవచ్చు.

అధ్యాయం - VII

ఇతరములు

35. 1. ఈ చట్టంలోని అంశాలను అమలు చెయ్యటం కోసం తగినట్లుగా సందర్భాన్ని బట్టి సంబంధిత ప్రభుత్వానికి లేదా స్థానిక ప్రభుత్వానికి మార్గదర్శక సూత్రాలను కానీ, ఆదేశాలను కానీ కేంద్ర ప్రభుత్వం జారీ చేయవచ్చు.

2. ఈ చట్టంలోని అంశాలను అమలు చెయ్యటం కోసం తగినట్లుగా సందర్భాన్ని బట్టి స్థానిక ప్రభుత్వానికి లేదా పాఠశాల యాజమాన్య సంఘానికి మార్గదర్శక సూత్రాలను కానీ, ఆదేశాలను కానీ సంబంధిత ప్రభుత్వం జారీ చేయవచ్చు.

3. ఈ చట్టంలోని అంశాలను అమలు చెయ్యటం కోసం తగినట్లుగా పాఠశాల యాజమాన్య సంఘానికి మార్గదర్శక సూత్రాలను కానీ, ఆదేశాలను కానీ స్థానిక ప్రభుత్వం జారీ చేయవచ్చు.

36. సెక్షన్ 13 సబ్ సెక్షన్ (2) కింద, సెక్షన్ 18, సబ్‌సెక్షన్ (5) కింద, సెక్షన్ (19), సబ్‌సెక్షన్ (5) కింద శిక్షార్హమైన నేరాలకు సంబంధిత ప్రభుత్వం ప్రకటన ద్వారా ఆధీకృతం చేసిన అధికారి ఆమోదం పొందిన తరువాతే ప్రాసిక్యూషన్ చేపట్టాలి.

37. ఈ చట్టం లేదా తదనుగుణంగా చేసిన నియమాలు, ఆదేశాల అమలులో సదుద్దేశంతో చేపట్టిన చర్యలకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, బాలల హక్కుల సంరక్షణకు జాతీయ కమీషన్, బాలల హక్కుల సంరక్షణకు రాష్ట్ర కమీషన్, స్థానిక ప్రభుత్వం, పాఠశాల యాజమాన్య సంఘం, లేదా ఏ వ్యక్తిపైన కూడా దావా లేదా చట్టపర ప్రాసీడింగ్ చేపట్టడానికి లేదు.

38. 1. ఈ చట్టంలోని, అంశాలను అమలు చెయ్యటానికి సంబంధిత ప్రభుత్వం ప్రకటన ద్వారా నియమాలు రూపొందించవచ్చు.

2. ఇంతకు ముందు పేర్కొన్న అధికారాలకు భంగం కలగకుండా ఈ క్రింది వాటికి నియమాలు రూపొందించాలి.

ఎ) సెక్షన్ 4 లోని మొదటి అంశం ప్రకారం ప్రత్యేక శిక్షణ ఇచ్చే విధానం, దానికి నిర్ధారించిన గడువు;

బి) సెక్షన్ 6 కింద పరిసర ప్రాంత పాఠశాలని ఏర్పాటు చెయ్యటానికి నిర్దేశించిన పరిధులు లేదా ప్రాంతం;

సి) సెక్షన్ 9 కింద క్లాజు (డి) ప్రకారం పధ్నాలుగు సంవత్సరాల వరకు బాలలకు సంబంధించి రికార్డులు నిర్వహించవలసిన విధానం;

డి) సెక్షన్ 12 సబ్‌సెక్షన్ (2) కింద ఖర్చులో తిరిగి చెల్లించే మొత్తం, ఆ విధానం;

ఇ) సెక్షన్ 14 సబ్‌సెక్షన్ (1) కింద బాలల వయస్సును నిర్ధారించటానికి ఇతర పత్రం;

యఫ్) పాఠశాలలో ప్రవేశం ఇవ్వటానికి సెక్షన్ 15 కింద పెంచిన గడువు పరిధి, ఆ రకంగా ప్రవేశం పొందినప్పుడు చదువును పూర్తిచేసే విధానం;

జి) సెక్షన్ 18 సబ్‌సెక్షన్ (1) ప్రకారం గుర్తింపు ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకునే విధానం, పద్ధతి, అట్టి దరఖాస్తును తీసుకునే అథారిటీ;

హెచ్) సెక్షన్ 18 సబ్‌సెక్షన్ (2) ప్రకారం గుర్తింపు ధృవీకరణ పత్రాన్ని జారీ చేసే విధానం, పద్ధతి, షరతులు, కాలపరిమితి;

ఐ) సెక్షన్ 18 సబ్‌సెక్షన్ (3) ప్రకారం తమ వాదనను వినిపించటానికి అవకాశమిచ్చే విధానం;

జె) సెక్షన్ 21 సబ్‌సెక్షన్ (2) క్లాజు (డి) ప్రకారం పాఠశాల యాజమాన్య సంఘం నిర్వర్తించాల్సిన ఇతర విధులు;

కె) సెక్షన్ 22 సబ్‌సెక్షన్ (1) ప్రకారం పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తయారు చేసే విధానం;

యల్) సెక్షన్ 23 సబ్‌సెక్షన్ (3) ప్రకారం టీచర్ల ఉద్యోగ నిబంధనలు, షరతులు, వారికి చెల్లించాల్సిన జీతభత్యాలు;

యమ్) సెక్షన్ 24 సబ్‌సెక్షన్ (1) క్లాజు (యఫ్) ప్రకారం టీచర్లు నిర్వర్తించాల్సిన విధులు;

యన్) సెక్షన్ 24 సబ్‌సెక్షన్ (3) ప్రకారం టీచర్ల ఫిర్యాదులను పరిష్కరించాల్సిన విధానం;

ఒ) సెక్షన్ 30 సబ్‌సెక్షన్ (2) ప్రకారం ఎలిమెంటరి విద్యను పూర్తి చేసిన పిమ్మట ధృవీకరణ పత్రాన్ని జారీ చేసే విధానమూ, పద్ధతి;

పి) సెక్షన్ 31 సబ్‌సెక్షన్ (3) ప్రకారం ఏర్పాటు చెయ్యవలసిన అధారిటీ; అది ఏర్పడే విధానం, దాని షరతులు, నిబంధనలు;

క్యూ) సెక్షన్ 33 సబ్‌సెక్షన్ (3) ప్రకారం జాతీయ సలహా సంఘ సభ్యుల నియామకం, వారికి షరతులు, నిబంధనలు; వారికి చెల్లించాల్సిన భత్యాలు.

ఆర్) సెక్షన్ 34 సబ్‌సెక్షన్ (3) ప్రకారం రాష్ట్ర సలహా సంఘ సభ్యుల నియామకం, వారికి షరతులు, నిబంధనలు; వారికి చెల్లించాల్సిన భత్యాలు.

3. ఈ చట్టం కింద కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతి నియమాన్ని, సెక్షన్ 20 & 23 ల ప్రకారం జారీ చేసిన ప్రకటనలను అవి రూపొందించిన వెంటనే పార్లమెంటు ఉభయసభలు సమావేశాల్లో ప్రవేశపెట్టి 30 రోజుల పాటు ఉంచాలి. ఇందుకు అవసరమైతే ఒక సమావేశంలో గానీ లేదా దాని తరువాత వెంటనే జరిగే రెండు అంతకుమించి సమావేశాలలో గానీ ఉంచాలి. నియమాలు, ప్రకటనలలో మార్పులు చేసి ఆమోదించటానికి గానీ, లేదా అవి చెయ్యకూడదని గానీ ఉభయ సభలు అంగీకరించిన తరువాత మాత్రమే అవి సందర్భాన్ని బట్టి మార్పులతో అమలులోకి వస్తాయి, లేదా అమలులోకి రావు. అయితే ఈ చట్టం కింద అంతకు ముందే చేసిన నియమాలు, ప్రకటనలకు ఇప్పటి నియమాలు, ప్రకటనలలో మార్పులు లేదా అసలు అమలు పరచకపోవటం అన్నవి అవరోధంగా ఉండవు.

4. ఈ చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం చేసే ప్రతి నియమాన్ని, ప్రకటననీ దానిని రూపొందించిన వెంటనే రాష్ట్రసభల ముందు ఉంచాలి.

షెడ్యూలు

సెక్షన్లు 19 మరియు 25

పాఠశాలకు నియమాలు, ప్రామాణికాలు

క్ర.సం.	అంశం	నియమాలు, ప్రామాణికాలు	
1.	టీచర్ల సంఖ్య		
	ఎ) ఒకటి నుంచి అయిదవ తరగతి వరకు	**చేర్చుకున్న పిల్లల సంఖ్య**	**టీచర్లసంఖ్య**
		అరవై వరకు	ఇద్దరు
		అరవై ఒకటి నుంచి తొంభై వరకు	ముగ్గురు
		తొంభై ఒకటి నుంచి నూట ఇరవై వరకు	నలుగురు
		నూట ఇరవై ఒకటి నుంచి రెండు వందల వరకు	అయిదుగురు
		నూట యాభైకి మించి	అయిదుగురు + ఒక హెడ్‌మాస్టర్
		రెండు వందలకు మించి	ప్రధానోపాధ్యాయులు కాకుండా విద్యార్థి – టీచర్ల నిష్పత్తి నలభైని మించకూడదు
	బి) ఆరు నుంచి ఎనిమిదవ తరగతి వరకు	1. ప్రతి తరగతికి ఒక టీచరు ఉండి, కింది అంశాలకు కనీసం ఒక టీచరు ఉండాలి. i) విజ్ఞాన శాస్త్రం మరియు లెక్కలు ii) సామాజిక శాస్త్రం; iii) భాషలు 2. ప్రతి ముప్పై అయిదు మంది విద్యార్థులకు కనీసం ఒక టీచరు. 3. చేర్చుకున్న పిల్లలసంఖ్య వందకు మించి ఉన్నట్లయితే i) పూర్తికాల ప్రధానోపాధ్యాయులు; ii) కింది అంశాలకు పార్ట్‌టైమ్ బోధకులు A) చిత్రకళ B) ఆరోగ్యం, వ్యాయామ విద్య, C) వృత్తి విద్య	
2.	భవనం	అన్ని కాలాలకు అనువైన భవనంలో i) ప్రతి టీచరుకు కనీసం ఒక తరగతి గది, కార్యాలయం + గోదాము + ప్రధానోపాధ్యాయుల గది ii) వికలాంగుల ప్రవేశానికి అనువుగా ఉండాలి. iii) ఆడపిల్లలు, మగపిల్లలకు వేరుగా మరుగుదొడ్లు; iv) పిల్లలందరికీ సరిపోయేటంత రక్షిత మంచినీటి సౌకర్యం; v) పాఠశాలలో మధ్యాహ్నపు భోజనం వండటానికి వంటగది; vi) ఆటస్థలం; vii) సరిహద్దుగోడ లేదా కంచెతో పాఠశాల భవనానికి భద్రత ఏర్పాట్లు	

క్ర.సం.	అంశం	నియమాలు, ప్రామాణికాలు
3.	విద్యా సంవత్సరంలో కనీస పనిదినాలు/ బోధనాగంటల సంఖ్య	i) ఒకటి నుంచి అయిదవ తరగతి వరకు రెండువందల పనిదినాలు; ii) ఆరు నుంచి ఎనిమిదవ తరగతి వరకు రెండువందల ఇరవై పనిదినాలు; iii) ఒకటి నుంచి అయిదవ తరగతి వరకు ఒక విద్యా సంవత్సరంలో ఎనిమిది వందల బోధనా గంటలు; iv) ఆరు నుంచి ఎనిమిదవ తరగతి వరకు ఒక విద్యా సంవత్సరంలో వెయ్యి బోధనా గంటలు
4.	టీచర్లకు వారానికి కనీస పనిగంటలు	బోధన మరియు బోధనాంశాలు సిద్ధం చేసుకొనుటకు 40-45 గంటలు
5.	బోధనా పరికరాలు	ప్రతి తరగతికి అవసరం మేరకు అందచెయ్యాలి
6.	గ్రంథాలయం	దినపత్రిక, పత్రికలు, అన్ని పాఠ్య విషయాలపై పుస్తకాలు, కథల పుస్తకాలు అందించే గ్రంథాలయం ప్రతి పాఠశాలలో ఉండాలి.
7.	ఆటల, క్రీడలకు సంబంధించిన సామగ్రి	ప్రతి తరగతికి అవసరం మేరకు అందచెయ్యాలి.

విద్యా హక్కు చట్టం 2009

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నియమాలు - 2010

1. ఆరు నుండి పధ్నాలుగు సంవత్సరాల బాలలందరికీ ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించుట కొరకు భారత పార్లమెంటు బాలల ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 ని రూపొందించినది.
2. చట్టం మరియు న్యాయమంత్రిత్వశాఖ 16.2.2010 న జారీ చేసిన భారత ప్రభుత్వ రాజపత్రం ద్వారా బాలల ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009, 1.4.2010 నుంచి అమలులోనికి వస్తుందని తెలియపర్చడమైనది.
3. బాలల ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 లోని నిబంధనలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బాలల ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కు నియమాలు 2010 ని రూపొందించడ మైనది.
4. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజపత్రం ద్వారా 5.3.2011 నుంచి ఈ నియమాలు అమలులోకి వస్తాయి.

ప్రకటన

బాలల ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 లోని సెక్షన్ 38 సబ్ సెక్షన్ (1) ప్రకారం ఈ నియమాలను ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రూపొందించడమైనది.

1. పేరు :

ఈ నియమాలను 'ఆంధ్రప్రదేశ్ బాలల ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కు నియమాలు 2010' గా పిలవవచ్చు.

2. ఈ నియమాలను 1.4.2010 నుంచి అమలులోనికి వచ్చినట్లు భావించవచ్చు.

3. నిర్వచనాలు:

సందర్భంలో వేరుగా ఉదహరిస్తే తప్ప చట్టంలోని పదాల అర్థాలు :

1. 'చట్టం' అనగా బాలల ఉచిత మరియు నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009.
2. 'అంగన్‌వాడీ' అనగా భారతప్రభుత్వం వారి స్త్రీ మరియు శిశు సంక్షేమ మంత్రిత్వశాఖలోని సమగ్ర శిశు అభివృద్ధి పథకం ద్వారా ఏర్పడిన అంగన్ వాడీ కేంద్రం.
3. 'బాలలు' అనగా 6–14 సంవత్సరాల మధ్య వయస్సు గల ఆడ, మగ పిల్లలు పాఠశాలలో చేరే విద్యా సంవత్సరానికి అనగా సెప్టెంబరు 1 కి 5 సంవత్సరాలు నిండిన వారు కూడా బాలలే.
4. 'సామాజికంగా ప్రతికూల పరిస్థితుల్లో వున్న బృందాల పిల్లలు' అనగా షెడ్యూల్డు కులాల షెడ్యూల్డు తెగల పిల్లలు, అనాధ బాలలు, వలస బాలలు, వీధిబాలలు, ప్రత్యేక అవసరాలు కలిగిన బాలలు, హెచ్.ఐ.వి. సోకిన లేదా బాధపడుతున్న పిల్లలు.
5. 'బలహీన వర్గాలకు చెందిన బాలలు' అనగా వెనుకబడిన తరగతులకు చెందినవారు, మైనారిటీలు మరియు రూ.60,000/–లు కంటే తక్కువ వార్షిక ఆదాయం కలిగిన ఇతర కులాల బాలలు.

6. 'కలెక్టర్' అనగా జిల్లా పౌర, రెవెన్యూ మరియు పరిపాలనాధికారి.
7. 'కార్పొరేటర్' అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్ లేదా గ్రేటర్ హైదరాబాద్ వార్డు సభ్యులు.
8. 'కౌన్సిలర్' అనగా పట్టణ స్థానిక సంఘాలకు ఎన్నిక కాబడిన వార్డు సభ్యులు.
9. 'జిల్లా' అనగా రాష్ట్రంలోని ఒక రెవెన్యూ జిల్లా.
10. 'జిల్లా విద్యాధికారి' (DEO) అనగా జిల్లా స్థాయిలో ఎలిమెంటరీ విద్యా కార్యక్రమాలను అమలుచేసే మరియు బాధ్యత వహించే అధికారి.
11. 'ECE' అనగా మూడు నుండి 5 ఏళ్ళ లోపు బాలలకు పాఠశాల ఆవరణలో గాని మరి ఏ ఇతర ప్రాంతాల్లో గాని విద్యాభాసానికి ముందు (Pre school education) సర్వశిక్ష అభియాన్‌వారు నెలకొల్పిన బాలల సంరక్షక కేంద్రాలు.
12. 'ఎలిమెంటరీ పాఠశాల' అనగా ఒకటి నుంచి 8వ తరగతి వరకు బోధించు పాఠశాల. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు హైస్కూలులన్ని ఈ పరిధిలోనికే వస్తాయి.
13. 'ఉచితవిద్య' అనగా ఎలాంటి రుసుము వసూలు చేయకుండా బాలలకు ప్రాథమికవిద్యను అందించుట. పేపర్లు మరియు పెన్నులకయ్యే ఖర్చును తల్లిదండ్రులు భరించాలి. ప్రభుత్వం నడిపే పాఠశాలల్లో ప్రభుత్వమే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశానికి ఒక్కొక్కదానికి ఒక్కొక్క వ్రాత పుస్తకం, మధ్యాహ్న భోజనం మరియు యూనిఫామ్‌లు సమకూరుస్తుంది.
14. 'గ్రామపంచాయితీ' అనగా ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994 ప్రకారం ఏర్పాటు చేయబడిన గ్రామపంచాయితీ.
15. 'స్థానిక అధికారం' అనగా ఆయాప్రాంతాల్లో వున్నటువంటి మండల పరిషత్‌లు, జిల్లాపరిషత్‌లు మరియు పురపాలక సంఘాలు.
16. 'మండల విద్యాశాఖాధికారి (MEO)' అనగా మండలస్థాయిలో ప్రాథమిక విద్యా కార్యక్రమాలను అమలు పరిచే బాధ్యతగల అధికారి.
17. 'మండల రిసోర్స్ పర్సన్' (MRP) అనగా కొన్ని పాఠశాలల్లో విద్యాకార్యక్రమాలను సమన్వయ పరిచే అధ్యాపకులు,
18. 'పాఠశాల పరిసరప్రాంతాలు' అనగా ప్రాథమిక స్కూలుకు ఒక కిలోమీటరు క్షేమకరమైన కాలిబాట కలిగిన నివాసప్రాంతాలు, ప్రాథమికోన్నత లేదా హైస్కూలులకు 3 కి.మీ. క్షేమకరమైన కాలిబాట కలిగిన నివాస ప్రాంతాలు.
19. 'పాఠశాలల్లో లేని బాలలు' అనగా 6-14 వయస్సు మధ్య ఉన్న బాలలు ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తి చేయనివారు. (పాఠశాలలో పేరు నమోదు కాని వారు లేదా చదువును మధ్యలో ఆపేసినవారు). ఒక నెలకంటే ఎక్కువ పాఠశాలకు హాజరుకాని బాలలు కూడా పాఠశాలల్లో లేని బాలలు గానే పరిగణించబడతారు.

20. 'ప్రాథమిక పాఠశాల' అనగా 1–5 తరగతుల వరకు విద్యాభ్యాసం బోధించు పాఠశాలలు.

21. 'సర్పంచ్' అనగా గ్రామపంచాయితీకి ఎన్నికకాబడిన పెద్ద.

22. 'పాఠశాల విశ్లేషణ' అనగా పాఠశాల పరిధి, సామాజిక అడ్డంకులు, నివాస ప్రాంతాలకు వున్న దూరం, పాఠశాలలో ప్రమాణాల ప్రకారం విద్యాబోధకున్న సదుపాయాలు, ఇతర సదుపాయాలు, ఉపాధ్యాయులు మరియు ఆంధ్రప్రదేశ్ రాజీవ్ విద్యామిషన్ (SSA) వారు భౌగోళిక సమాచార పద్ధతి (GIS) ద్వారా గుర్తించిన పాఠశాలలు.

23. 'రాష్ట్రం' అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

24. 'రాష్ట్ర ప్రభుత్వం' అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం.

25. 'ప్రత్యేక తరగతికి చెందిన పాఠశాలలు' అనగా కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు (KGBV), మరియు ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సంఘం (APREIS) వారు నిర్వహించే అల్పసంఖ్యాక రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ వసతి విద్యా సంస్థల సంఘం (APSWREIS), ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ వసతి విద్యా సంస్థల సంఘం (APTWREIS), సమీకృత గిరిజన అభివృద్ధి మండలులు (ITDA) వారు నిర్వహించు ఆశ్రమ పాఠశాలలు, ఆంధ్రప్రదేశ్ ఆటల సంఘం (SAAP) వారు నిర్వహించే పాఠశాలలు, ఇవి కాకుండా చట్టంలోని సెక్షన్ 2 నందు గల క్లాజ్ (ఎన్) లోని సబ్ క్లాజ్ (III) ప్రకారం ఏర్పాటు చేయబడిన కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు మరియు సైనిక పాఠశాలలు కూడా వస్తాయి.

26. ఈ చట్టం క్రింద 'విద్యా అధికారం' అంటే రాష్ట్ర విద్యాపరమైన పరిశోధన మరియు శిక్షణా మండలి, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్.

27. 'ఈ చట్టాన్ని అమలుచేసే అధికారం' అనగా రాష్ట్ర ప్రాజెక్టు అధికారి, సర్వశిక్ష అభియాన్ మరియు పాఠశాల విద్యకు సంబంధించిన కమీషనర్ & డైరెక్టర్.

28. 'నడిచే దూరం' అనగా బాలలు ఇంటి నుండి పాఠశాలకు నడిచే దూరం.

29. 'వార్డు సభ్యులు' అనగా గ్రామ పంచాయితీలోని వార్డుకు ఎన్నిక కాబడిన వ్యక్తి.

4. పాఠశాలకు హాజరు కాని బాలలకు ప్రత్యేక శిక్షణలు.

1. పాఠశాల యాజమాన్య కమిటీ మరియు స్థానిక అధికారులు ప్రత్యేక శిక్షణలు అవసరమైన పిల్లలను గుర్తించి వారికి ఈ క్రింద వుదహరించిన రీతిలో శిక్షణలు నిర్వహించవలెను.

   ఎ) చట్టంలోని సెక్షన్ 29 (1) లో నిర్వచించిన ప్రకారం బాలల వయస్సును బట్టి నిర్ధారించిన ప్రకారం నేర్చుకోదగిన అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.

   బి) ఈ తరగతులను పాఠశాల ఆవరణలోగానీ, మరి ఏ ఇతర రక్షణకరమైన ప్రదేశాలలో నిర్వహించాలి.

   సి) ఈ శిక్షణలు పాఠశాలలోని ఉపాధ్యాయులు ద్వారా కానీ, లేదా ఈ శిక్షణల నిమిత్తం ఎంపిక కాబడిన ప్రత్యేక ఉపాధ్యాయులతో గానీ నిర్వహించాలి.

డి) ఈ శిక్షణల కాలపరిమితి మూడు నెలల నుండి రెండు సంవత్సరాల వరకు వుండవచ్చు. వారి శక్తి సామర్థ్యాలను దశలవారీగా అంచనావేస్తూ శిక్షణాకాలాన్ని నిర్వహించాలి.

2. ఈ ప్రత్యేక శిక్షణలు పూర్తయిన తరువాత బాలల వయస్సును బట్టి పాఠశాలల్లోని తరగతుల్లో చేర్పించి, సంబంధిత బాలల మీద ప్రత్యేక శ్రద్ధ చూపించాలి.

3. పాఠశాలకు హాజరుకాని బాలలను గుర్తించడంలోను, సమీకరించడంలోనూ పాఠశాల యాజమాన్య సంఘం పౌరసంఘాల మరియు స్వయం సహాయక సంఘాల తోడ్పాటును తీసుకోవాలి.

5. ఈ చట్టం కింద విద్యా సౌకర్యాలను అందుబాటులోనికి తేవడం:

1. ఈ దిగువన వుదహరించిన రీతిగా రాష్ట్ర ప్రభుత్వం నివాస పరిసరప్రాంతాల్లో పాఠశాలలను నెలకొల్పాలి.

ఎ) 1 నుంచి 5వ తరగతి వరకు నిర్వహించే పాఠశాలలు నివాస ప్రాంతాలకు 1 కి.మీ లోపు వుండాలి.

బి) 6 నుంచి 8వ తరగతి వరకు నిర్వహించే పాఠశాలలు నివాస ప్రాంతాలకు 3 కి.మీ. లోపు వుండాలి.

2. అవసరాన్ని బట్టి 1 నుండి 5 తరగతుల వరకు నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలలను అవసరానుగుణంగా 6 నుంచి 8 తరగతులకు పెంచడం మరియు 1 నుండి 7 వరకు తరగతులు నిర్వహిస్తున్న ప్రాథమికోన్నత పాఠశాలలకు 8వ తరగతి జోడిస్తూ తగు చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలి.

3. పాఠశాల నిర్వహించుటకు వీలుకాని, రోడ్డు వసతి లేని, వరదలు, ప్రకృతి బీభత్సాలకు అవకాశం వుండి, చిన్న పిల్లలకు ప్రమాదంగా వుండే ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వం/ స్థానిక ప్రభుత్వం అట్టి ప్రమాదాన్ని తొలగించే విధంగా సబ్‌రూల్ (1) లో తెలిపిన పరిమితిని కుదించి అయినాసరే చర్యలు చేపట్టాలి.

4. రాష్ట్ర ప్రభుత్వం / స్థానిక ప్రభుత్వం గుర్తించిన కుగ్రామాలకు చెందిన బాలలకు పైన తెలిపిన సబ్‌రూల్ (1) ప్రకారం పరిసర ప్రాంతాలలో పాఠశాల అందుబాటులో లేకపోతే, రాష్ట్ర ప్రభుత్వం / స్థానిక ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం, నివాస సౌకర్యం మరియు ఇతర సౌకర్యాలు కల్పించి ప్రాథమికవిద్యను అందించాలి. ఇందుకు గాను సబ్‌రూల్ (1) లో తెలిపిన దూరంకు సంబంధించిన పరిమితిని సడలించాలి.

5. ఎక్కువ జనసాంద్రత గల ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వం / స్థానిక ప్రభుత్వం అవసరాలను బట్టి 1 కంటే ఎక్కువ సమీప ప్రాంత పాఠశాలలను 6–14 సంవత్సరాల వయస్సు మధ్య గల పిల్లల కోసం ఏర్పాటు చేయాలి.

6. స్థానిక ప్రభుత్వం అట్టి సమీప పాఠశాలలను గుర్తించి, బాలలను ఆ పాఠశాలలో చేర్పించుటకు గాను తమ పరిధిలోని అన్ని ఆవాస ప్రాంతాలలో అట్టి సమాచారమును బహిరంగ పర్చాలి.

7. అంగవైకల్యం వలన అందుబాటులోని పాఠశాలకు హాజరు కాలేని బాలల కొరకు రాష్ట్ర ప్రభుత్వం / స్థానిక ప్రభుత్వం ప్రయాణ ఏర్పాట్లను చేసి వారి ఎలిమెంటరీ విద్య పూర్తగుటకు ప్రయత్నించాలి.

8. రాష్ట్ర /స్థానిక ప్రభుత్వం సాంఘిక, సాంస్కృతిక కారణాల వలన పిల్లలు పాఠశాలలకు హాజరు కాలేక పోయే పరిస్థితి కలగకుండా చూడాలి. ఈ పిల్లలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం కొరకు పరిస్థితులను అధిగమిస్తూ సామాజికంగా వెనుకబడిన బాలల కొరకు ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయడాన్ని ప్రోత్సహించరాదు.

9. అశాంతి మరియు క్లిష్ట పరిస్థితుల్లో వున్న పాఠశాలల్లోని బాలలు వారి విద్యను కొనసాగించే రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించాలి.

6. రాష్ట్ర / స్థానిక ప్రభుత్వాల విధులు :

1. సెక్షన్ 2 లోని క్లాజ్ (ఎన్) కి చెందిన సబ్‌క్లాజ్ (I) లో తెలిపినట్లు రాష్ట్ర ప్రభుత్వం / స్థానిక ప్రభుత్వం నిర్వహించే పాఠశాలలు మరియు సబ్‌క్లాజ్ (III) లో ఉదహరించిన పాఠశాలలు (ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సంఘం, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ వసతి విద్యా సంస్థల సంఘం, ప్రభుత్వ విద్యాలయాల సంఘంచే నిర్వహించబడుతున్న గురుకుల పాఠశాలల్లో) సెక్షన్ 12 లోని సబ్‌సెక్షన్ (1) లోని క్లాజ్ (బి) మరియు సబ్‌సెక్షన్ (II) ప్రకారం హాజరయ్యే బాలలందరూ అచ్చు పుస్తకాలు, వ్రాతకు ఉపయోగించే సామాగ్రి, యూనిఫాం పొందుటకు అర్హులు. అంగవికలాంగులైన బాలలకు ఉచిత ప్రత్యేక అభ్యసనానికి సంబంధించి కావలసిన సామాగ్రిని అందించవలెను.

వివరణ : సెక్షన్ 12 లోని సబ్‌సెక్షన్ (1) ప్రకారం క్లాజ్ (బి) (సి) ప్రకారం ప్రవేశం పొందిన బాలురకు సెక్షన్ 2 లోని క్లాజ్ (ఎన్) సబ్‌క్లాజ్ (2) (3) మరియు (4) ప్రకారం ఏర్పాటు చేసిన పాఠశాలలు వారికి ఉచితంగా అవసరమైన అన్ని సౌకర్యాలను అందించుటకు బాధ్యత వహించాలి.

2. పరిసర ప్రాంతం పాఠశాలలను నిర్ణయించుటకు, ఏర్పర్చుటకు గాను రాష్ట్ర ప్రభుత్వం / స్థానిక ప్రభుత్వం కుగ్రామాలలోని బాలలు, అంగవైకల్యం గల బాలలు, వెనుకబడిన వర్గాల, బలహీనవర్గాలకు చెందినవారు మరియు సెక్షన్ (4) లో పేర్కొన్న వారినందరినీ పరిగణనలోనికి తీసుకోవాలి. నిర్ణయించిన తేదీ నుండి ఒక సంవత్సరంలోపు మరియు ఆ తర్వాత ప్రతి సంవత్సరం కూడా అట్టి పాఠశాలలను ఏర్పరచాలి.

3. రాష్ట్ర ప్రభుత్వం / స్థానిక ప్రభుత్వం లేదా ప్రైవేటు యాజమాన్యం నిర్వహించే పాఠశాలల్లో ఏ ఒక్క బాలలు కూడా కులం, పేద, వర్గ, మత, లింగ మరియు ఏ ఇతర అంశాలలోను వివక్షతకు లోను కాకుండా తగు జాగ్రత్తలు తీసుకొనవలెను. అలాగే పై కారణాల వలన ఏ బాలలు కూడా పాఠశాలల్లో ప్రవేశానికి నిరాకరించరాదు.

4. సెక్షన్ 8 లోని క్లాజ్ (సి) మరియు సెక్షన్ 9 లోని క్లాజ్ (సి) ల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం / స్థానిక ప్రభుత్వం బలహీనవర్గాల వెనుకబడిన వర్గాల పిల్లలను తరగతి గదుల్లో గానీ, మధ్యాహ్న భోజన పథకమందు గానీ, ఆటస్థలంలో గానీ, సామూహికంగా మంచినీరు త్రాగుప్రదేశం వద్దగానీ, మూత్రశాలలు వుపయోగించు కొనునప్పుడుగానీ, తరగతి గదులను, మరుగు దొడ్లను శుభ్రపరచుటలో గానీ వివక్ష చూపకుండా తగు చర్యలు చేపట్టాలి.

7. పిల్లల రికార్డులను స్థానిక అధిపతి నిర్వహించాలి:

1. స్థానిక అధికారి తన పరిధిలోని అందరు బాలల రికార్డులను, ఇంటింటి సర్వే ఆధారంగా పుట్టిన బిడ్డ నుండి 14 సంవత్సరాల వయస్సుకు చేరిన వారి వరకు నమోదు చేసి రికార్డును నిర్వహించాలి. వీరిని నిరంతరం పర్యవేక్షించుట కొరకు ప్రత్యేకమైన కోడ్‌ను కలిగి ఉండాలి. ఇంటింటి సర్వే చేయునపుడు వలస బాలలను గుర్తించి వారు పనిచేసే ప్రాంతాలను మరియు నివాస ప్రాంతాలను గుర్తించాలి.
2. పై సబ్‌రూల్(1) లో తెలిపినట్టి రికార్డులను ప్రతి సంవత్సరం పరిశీలించాలి.
3. పై సబ్‌రూల్ (1) లో తెలిపిన రికార్డును ఎప్పుడూ పారదర్శకంగా వుంచాలి. ప్రజలందరికీ అందుబాటులో వుండి సెక్షన్ 9 లోని క్లాజ్ (ఇ) అవసరం తీర్చునట్లుగా వుండాలి.
4. సబ్‌రూల్ (1) లో పేర్కొనిన రికార్డు ఈ దిగువ తెలిపిన బాలలతో సహా ప్రతి ఒక్కరికి సంబంధించినది.

   ఎ) పేరు, లింగము, పుట్టినతేది, జన్మస్థలం.

   బి) తల్లిదండ్రులు లేదా సంరక్షకుల పేరు, చిరునామా, వృత్తి.

   సి) ఏ ప్రాథమిక పాఠశాలకు ముందు / అంగన్‌వాడీ కేంద్రంలో (ఆరు సంవత్సరాల వరకు) హాజరైనవారు, హాజరవుతున్నవారు.

   డి) బాలలు చేరిన పాఠశాల.

   ఇ) బాలల ప్రస్తుత చిరునామా.

   యఫ్) బాలలు ప్రస్తుతం ఏ తరగతిలో చదువుతున్నారు. (6 నుంచి 14 సంవత్సరాల వయస్సు మధ్య) ఆ ప్రాంత పరిధిలో చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి అందుకు గల కారణాలను నమోదు చేయాలి.

   జి) చట్టంలోని సెక్షన్ 2 లోని క్లాజ్ (ఇ) ప్రకారం బలహీన వర్గాలకు చెందినవారు అవునా, కాదా అనే విషయం నమోదు చెయ్యాలి.

   హెచ్) బాలలు నిరాకరించబడిన తరగతులకు చెందినవారా, కాదా.

   ఐ) ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సంబంధించిన ఈ దిగువ తెలిపిన వివరాలను నమోదు చెయ్యాలి.

తల్లిదండ్రులు వలస వచ్చినట్లయితే అవసరమైన నివాససౌకర్యం, వయస్సుకు తగ్గ తరగతిలో ప్రవేశం మరియు అంగవైకల్యము నమోదు చెయ్యాలి.

5. స్థానిక ప్రభుత్వం తన పరిధిలోని పాఠశాలలో నమోదైన మొత్తం విద్యార్థుల సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో వుండునట్లు అన్ని పాఠశాలల్లో జాబితాను ఏర్పాటు చేయాలి.
6. పాఠశాల విద్యా కమీషనర్ డైరెక్టర్ మరియు రాజీవ్ విద్యామిషన్ (సర్వశిక్ష అభియాన్) రాష్ట్ర ప్రాజెక్టు అధికారితో సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వం బాలల విద్యాప్రగతి, కొనసాగింపు, బదిలీ మరియు వలసలను నమోదు చేసే ప్రక్రియను ఏర్పాటుచేయాలి.

7. ఒక జిల్లా నుండి వేరొక జిల్లాకు వలసలు, మన రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు వలసలు, మరియు ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి వలస వచ్చే బాలల జాబితాను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ వారి విద్యను (ప్రాథమిక) కొనసాగించేలా చర్యలు చేపట్టాలి.

8. తల్లిదండ్రులు వలసలు వెళ్లే సమయాల్లో బాలల విద్యకు ఆటంకం కలుగకుండా ఆయాసమయాల్లో స్థానికంగా వసతి గృహాలను ఏర్పాటుచేసి బాలలు వారి విద్యను కొనసాగించేలా చర్యలు చేపట్టాలి.

9. ఇతర రాష్ట్రాల నుంచి వలసకు వచ్చిన బాలలకు వారి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి వారి మాతృభాషలో విద్యాభ్యాసాన్ని అందించుటకు పనిచేసే ప్రాంతంలోనే పాఠశాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలి.

8. వెనుకబడిన, బలహీన వర్గాలకు చెందిన బాలలకు ప్రవేశము :

1. సెక్షన్ 2 లోని క్లాజ్ (ఎన్) కి చెందిన 3, 4 సబ్‌క్లాజ్‌ల ప్రకారం సెక్షన్ 12 లోని సబ్‌సెక్షన్ (1) క్లాజ్ (సి) ప్రకారం తమ విద్యను కొనసాగించుట కొరకు చేరిన బాలలను ఎట్టిపరిస్థితులలోనూ వేరుగా చూడడం గానీ, వేరు సమయాల్లో లేదా వేరు ప్రాంతాల్లో గానీ వివక్షతతో తరగతులు నిర్వహించుట చేయరాదు.

2. ఈ చట్టంలోని సెక్షన్ 2 క్లాజ్ (ఎన్) లోని సబ్‌క్లాజులు 3, 4 ప్రకారం మరియు చట్టంలోని సెక్షన్ 12 (1) లోని క్లాజ్ సి ప్రకారం ప్రవేశం పొందిన బాలలను అచ్చు పుస్తకాలిచ్చే విషయంలో గానీ, కంప్యూటర్ల సౌకర్యాలు కల్పించుటలో గానీ, ఆటలు ఆడించటంలో గానీ, యూనిఫాంలు కల్పించడంలోగానీ, లైబ్రరీ సౌకర్యాలు కల్పించడంలో గానీ మరి ఏ ఇతర సౌకర్యాలు కల్పించడంలో గాని వివక్ష చూపరాదు.

9. నివాస స్థల ధృవీకరణ:

1. స్థానిక నివాస ప్రాంతానికి చెందిన బాలలు అవునా, కాదా అని నిర్ధారించు కొనుటకు ఈ దిగువన వుదహరించిన ధృవపత్రాలను సేకరించవలెను.

   ఎ) రేషన్ కార్డు.

   బి) పట్టాదారు పాస్ పుస్తకం.

   సి) కరెంటు బిల్లు.

   డి) ఇంటిపన్ను రశీదు లేదా గ్రామపంచాయితీ / మున్సిపాలిటీ / కార్పొరేషన్ వారు నిర్వహించు రిజిస్టరులో నమోదయిన పత్రం.

   ఇ) ఏ శాఖకు చెందిన టెలిఫోను రశీదుగానీ, లేదా కాలానుగుణంగా ప్రభుత్వం నిర్ణయించిన మరే పత్రమయినా.

2. పాఠశాలకు సంబంధించిన పరిసర ప్రాంతాలను ఉద్దేశించిన నియమం 5 లోని సబ్‌రూలు (1) మరియు చట్టంలోని సెక్షన్ 12 సబ్‌సెక్షన్ (1) క్లాజు (సి) ప్రకారం ప్రవేశములను నిర్వహించాలి. తగుశాతంలో బాలలు చేరని పక్షంలో చట్టంలోని సెక్షన్ 12 సబ్‌సెక్షన్ (1) క్లాజ్ (సి) ప్రకారం ఈ

పరిధిని 3 కి.మీ. వరకు పెంచుకొనవచ్చును. సెక్షన్ 12 (1) క్లాజ్ (సి) ప్రకారం జిల్లా విద్యాధికారి ముందస్తు అనుమతితో పరిధిని ఇంకా పెంచవచ్చును. ఈ పరిధిలను పెంచకమునుపు ఆప్రాంతంలో వున్న ప్రభుత్వ పాఠశాలల్లో నిర్దేశించబడిన శాతం పిల్లలు వుండునట్లు మండల విద్యాధికారి నిర్ధారించుకోవాలి.

3. పాఠశాల యాజమాన్య సంఘం యొక్క అధ్యక్షులు తమ వద్ద తమ గ్రామ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో గానీ మరియు ప్రత్యేకించబడిన పాఠశాలల్లో చదువుతున్న బలహీన వర్గాలు మరియు వెనుకబడిన వర్గాల పిల్లల జాబితాను కలిగి వుండాలి.

4. చట్టంలోని సెక్షన్ 12 సబ్‌సెక్షన్ (1) క్లాజ్‌లు (బి) (సి) ప్రకారం బాలల ప్రవేశం సెక్షన్ 2 క్లాజ్ (ఎన్) లోని సబ్‌క్లాజులు II, III, IV లోని పాఠశాలలో ప్రవేశం ఈ క్రింది విధంగా వుండాలి.

ఎ) నిరాకరించబడిన తరగతుల వారు (disadvantaged groups):

అనాథలు, వికలాంగులు మరియు హెచ్.ఐ.వి. బాధితులు = 5%

షెడ్యూల్డు కులాలు = 10%

షెడ్యూల్డు తెగలు = 4%

బి) బలహీన వర్గాలు అనగా బిసీలు, అల్పసంఖ్యాకులు మరియు వార్షిక ఆదాయం 60,000 కంటే తక్కువ వున్న ఇతర కులాల వారు = 6%

మొత్తం = 25%

10. ఒక్కొక్క విద్యార్థికి అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి :

1. రాష్ట్ర ప్రభుత్వం ఒక సంవత్సరంలో పాఠశాల నిర్వహించుటకయ్యే మొత్తం ఖర్చును అట్టి పాఠశాలల్లో చేరిన మొత్తం విద్యార్థులతో భాగించగా వచ్చిన ఖర్చు ఒక్కొక్క విద్యార్థిపై ఆ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చుగా భావించబడుతుంది. ఇట్టి ఖర్చులో రాష్ట్ర ప్రభుత్వపు స్వంత నిధులు, కేంద్ర ప్రభుత్వం నుండి పొందిన నిధులు లేదా తగు అధికారుల నుండి పొందిన నిధుల మొత్తం చేరి వుంటుంది.

వివరణ : 1. ఒక్కొక్క విద్యార్థి ఖర్చును నిర్ణయించుటకు సెక్షన్ 2 (ఎన్) క్లాజులోని సబ్‌క్లాజ్ (II) లో తెలిపిన పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వం చేసిన ఖర్చు లెక్కించబడదు.

2. సెక్షన్ 2 లోని క్లాజ్ (ఎన్) యొక్క 4 క్లాజుల్లో పేర్కొనిన ప్రతి పాఠశాల, సెక్షన్ 12 సబ్‌సెక్షన్ (2) ప్రకారం పొందిన రీయింబర్స్‌మెంటుకు ప్రత్యేక బ్యాంక్ అకౌంట్లను నిర్వహించవలెను.

3. చట్టంలోని సెక్షన్ 12 సబ్‌సెక్షన్ 2 ప్రకారం రాష్ట్రం మరియు స్థానిక అధికారులు విద్యార్థులపై పెట్టిన ఖర్చును అంచనా వేయుటకు మరియు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించుట కొరకు రాష్ట్ర స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలో ప్రిన్సిపల్ సెక్రటరీ ఫైనాన్స్, ప్రిన్సిపల్ సెక్రటరీ పాఠశాలవిద్య, కమీషనర్ పాఠశాల విద్య, రాజీవ్ విద్యామిషన్ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి, ప్రైవేటు పాఠశాలల రాష్ట్రస్థాయి కమిటీ నుండి ఒక ప్రతినిధి మరియు ప్రభుత్వం నిర్ణయించిన రెండు స్వచ్ఛందసంస్థలు.

4. పైన ఉదహరించిన కమిటీని ఏర్పాటు చేసిన 3 నెలలలోపు నిర్వహించాలి. మరియు ప్రతిసంవత్సరము డిసెంబరు మాసంలో రాబోయే విద్యాసంవత్సరానికి ఒక్కొక్క విద్యార్థికి అయ్యే ఖర్చును అంచనా వెయ్యాలి.

5. చట్టంలోని సెక్షన్ 12 లోని సబ్‌సెక్షన్ (8) (9) ప్రకారం ప్రభుత్వం తిరిగి చెల్లించే ఖర్చును కమిటీ నిర్ణయించిన ప్రకారం ఆ సమాచారాన్ని రాజీవ్ విద్యామిషన్ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి, జిల్లా విద్యాశాఖాధికారులకు తెలియపరుస్తారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఉచిత విద్యను అందించవలసిన పాఠశాలలకు ఇది వర్తించదు.

6. కమిటీ నిర్ణయించిన మొత్తాన్ని రెండు వాయిదాల్లో చెల్లిస్తారు. మొదటి వాయిదా సెప్టెంబరులో, రెండవ వాయిదా జనవరిలో ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఆ పాఠశాల ప్రత్యేకంగా నిర్వహించు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు.

7. చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం జూలై చివరినాటికి ప్రవేశం పొందిన విద్యార్థుల జాబితాను స్కూలు యాజమాన్యం జిల్లా విద్యాశాఖాధికారికి తిరిగి చెల్లింపుల కొరకు సమర్పిస్తుంది. ఈ జాబితాను సరైనదని నిర్ధారించుకున్నాక ఆ జిల్లా విద్యాశాఖాధికారి మొదటి వాయిదాను సెప్టెంబరు మాసంలో విడుదల చేస్తారు. తదుపరి రెండవ వాయిదాను జనవరి నెలలో విద్యార్థుల హాజరు కనీసం 80% వుందని మరియు వారి విద్యాప్రమాణాలు ఆశించిన మేరకు వున్నాయనీ నిర్ధారించుకున్న తరువాత చివరి వాయిదాను జనవరి నెలలో విడుదల చేస్తారు.

8. సెక్షన్ 12 ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో మరియు నిర్ధారించబడిన పాఠశాలల్లో పాఠశాలల వారీగా విద్యార్థుల జాబితాను రూల్‌నెం. 9 లోని సబ్‌రూల్ (3) ప్రకారం ఏర్పాటయిన కమిటీవారు నిర్ణయించిన ప్రకారం మరియు ఎలక్ట్రానిక్ రూపంలో పొందుపర్చాలి.

11. జనన ధృవీకరణ పత్రం :

పాఠశాలలో ప్రవేశం కొరకు జనన ధృవీకరణ పత్రం జనన మరియు మరణాల నమోదు చట్టం 1969 ప్రకారం జారీచేయబడినది కాని పక్షంలో ఈ కింద వుదహరించిన పత్రములను పరిగణించవచ్చు.

ఎ) వైద్యశాల లేదా ఎఎన్ఎమ్‌ల రికార్డు.

బి) అంగన్‌వాడీల రికార్డు.

సి) తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఇచ్చిన స్వయం ధృవీకరణ పత్రం.

12. పాఠశాలలో ప్రవేశం కొరకు నిర్ధారిత సమయం:

పాఠశాలలో ప్రవేశం కొరకు నిర్ధారించబడిన సమయం జూన్ 12 నుంచి ఆగష్టు 31 వరకు. ఈ తేదీ కంటే ముందు చేసిన ప్రవేశములు కానీ లేదా ఆ విద్యా సంవత్సరానికి ప్రభుత్వం నిర్ణయించిన మరి ఏ ఇతర తేదీ అయినా కానీ వర్తిస్తుంది.

13. ప్రవేశం కొరకు పొడిగించబడిన సమయం:

1. పైన పేర్కొన్న ముగింపు తేదీ అనగా ఆగష్టు 31 నుంచి మూడు నెలలు వరకు ప్రవేశ అవకాశమును పొడిగించవచ్చు.

2. పొడిగించిన కాలము తర్వాత బాలలు ప్రవేశము పొందినట్లయితే, అలాంటి బాలలు ప్రధానోపాధ్యాయులు నిర్ణయించిన ప్రకారం ప్రత్యేక శిక్షణ సహాయంతో తన చదువును పూర్తి చేయవచ్చును.

14. పాఠశాలల గుర్తింపు :

1. కేంద్ర, రాష్ట్ర మరియు స్థానిక ప్రభుత్వాలచే స్థాపించబడని ప్రతి పాఠశాల, ఈ చట్టం రాకముందు ఏర్పరచిన ప్రతిపాఠశాల ఈ చట్టం అమలులోకి వచ్చిన 7 నెలల లోపు ఫామ్ నెం. 1 లో సంబంధిత విద్యా శాఖాధికారికి, చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం గుర్తింపు కొరకు దరఖాస్తు చేసుకొనవలెను. చట్టంలోని సెక్షన్ 12 సబ్‌సెక్షన్ 2 క్లాజ్ (సి) ప్రకారం ఆ పాఠశాల పరిసర నివాస ప్రాంతాలను అర్జీలో తెలియపర్చాలి.

2. చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం జిల్లా విద్యాధికారి ఆ పాఠశాలను సందర్శించి గుర్తింపుకు అవసరమైన నిబంధనలు మరియు ప్రమాణాలను పాటిస్తున్నారా, లేదా అని తనిఖీ చేసి నిర్ధారించుకున్న పిదప గుర్తింపును మంజూరు చేస్తారు.

3. జిల్లా విద్యాశాఖాధికారి సూచనల మేరకు మండల విద్యాశాఖాధికారి లేదా వారి బృందం గుర్తింపు కొరకు దరఖాస్తు చేసుకున్న పాఠశాలలను తనిఖీ చేసి అర్జీ సమర్పించిన వారంలోపు జిల్లా విద్యాశాఖాధికారికి తమ రిపోర్టును సమర్పించవలెను.

4. చట్టంలోని సెక్షన్ 25 మరియు 19 ప్రకారం పాఠశాలకు వుండవలసిన ప్రమాణాలను నిర్ధారించుకున్నాక ఫామ్ నెంబర్ 2 లో గుర్తింపు పత్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి జారీ చేస్తారు.

ఈ గుర్తింపు మూడు సంవత్సరాల కాలం వరకు వర్తిస్తుంది. మరియు గుర్తింపు కొరకు అర్జీ అందచేసిన రోజు నుంచి 30 రోజుల్లోపు గుర్తింపును మంజూరు చేయాలి.

15. తాత్కాలిక ధృవపత్రం :

1. చట్టంలోని సెక్షన్ 25 లో వివరించిన విద్యార్థుల, ఉపాధ్యాయుల నిష్పత్తి లేనిచో జిల్లా విద్యాశాఖాధికారి ఫామ్ నెంబరు 3 లో తాత్కాలిక ధృవపత్రాన్ని మంజూరు చేస్తారు. ఈ మంజూరు సమయం 6 నెలలు. ఆ తరువాత పాఠశాలలో చట్టంలో పేర్కొన్న ప్రకారం విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల నిష్పత్తి కలిగి వుండాలి.

2. చట్టంలోని సెక్షన్ 25 లో వున్న ప్రమాణాలను ఆ పాఠశాల కలిగి యుండి మరియు ఇతర ప్రమాణాలు కలిగి వుండని పక్షంలో జిల్లా విద్యాశాఖాధికారి మూడు సంవత్సరాల వరకు తాత్కాలిక ధృవపత్రాన్ని ఫామ్ నెంబరు 4 లో మంజూరు చేస్తారు.

3. చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం చట్టం అమలులోనికి వచ్చిన తరువాత గుర్తింపు పత్రం పొందకముందు పాఠశాలను నిర్వహించకూడదు.

4. గుర్తింపు జారీచేయు అధికారులు గుర్తింపుకు అవసరమైన షరతులు పాటిస్తున్నారా, లేదా అని నిర్ధారించుకొనుటకు ప్రతి ఏటా తనిఖీలు నిర్వహించవచ్చు.

16. పాఠశాల గుర్తింపు ఉపసంహరించుకొను విధానం :

చట్టం ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాల షరతులను పాటించని ఎడల సంబంధిత అధికారి ఆపాఠశాలకు గుర్తింపు ఉపసంహరణ కొరకు షోకాజ్ నోటీసు జారీ చేస్తారు. ఈ నోటీసుకు ఆపాఠశాల నెలలోపు సమాధానం ఇవ్వాల్సి వుంది. ఆ సమాధానంపై తృప్తి చెందని ఎడల వారి వాదనలను వినుట కొరకు గుర్తింపు ఉపసంహరణలకు ముందు మరొక అవకాశం కలిపిస్తారు. గుర్తింపు ఉపసంహరణ ఆర్డరు రాత పూర్వకంగా తెలియపరుస్తారు. ఈ ఉపసంహరణ రాబోవు విద్యా సంవత్సరం నుండి వర్తిస్తుంది.

17. పై అధికారికి విన్నవించుకోవడం :

సబ్‌రూల్ (5) లేదా సబ్‌రూల్ (8) క్రింద జారీ చేయబడిన ఉత్తర్వులపై 15 రోజులలోపు జిల్లా కలెక్టరుకు విన్నవించుకోవచ్చు. కలెక్టరు దాని పూర్వాపరాలు పరిశీలించి విన్నవించుకున్న విషయాన్ని స్వీకరిస్తారు. కలెక్టరు ఇచ్చే ఉత్తర్వు తుది నిర్ణయమవుతుంది. ఉభయపక్షాల వాదనలు విన్న తర్వాత రెండు నెలలలోపు కలెక్టరు నిర్ణయిస్తారు. తుది ఉత్తర్వులు వెలువడే వరకు జిల్లా విద్యాధికారి జారీచేసిన ఉత్తర్వులు నిలిపి వేయబడతాయి.

18. పునఃపరిశీలన:

ఎ) గుర్తింపు ఉపసంహరణ కొరకు కలెక్టరు జారీ చేసిన ఆదేశాలపై పునఃపరిశీలన అధికారాలను పాఠశాల విద్యాశాఖ కమీషనర్ కలిగి ఉంటారు.

బి) పునఃపరిశీలన కొరకు కలెక్టరు ఉత్తర్వులు జారీ అయిన 30 రోజుల్లోపు అర్జీపెట్టుకోవచ్చు.

సి) పాఠశాలల గుర్తింపు సమాచారాన్ని స్థానిక సంస్థలు అనగా పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలైతే పురపాలక సంఘాలకు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే పాఠశాల వున్న గ్రామ పంచాయితీకి ఆ పాఠశాల యొక్క గుర్తింపు సమాచారాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియపర్చుట కొరకు సమాచారాన్ని అందిస్తారు.

19. పాఠశాల యాజమాన్య కమిటీ :

1. చట్టం అమలులోనికి వచ్చిన 6 నెలలలోపు ప్రతి ప్రభుత్వ పాఠశాల్లో మరియు ఎయిడెడ్ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీని ఏర్పాటు చేయాలి. ప్రతి 2 సంవత్సరములకు ఈ కమిటీలను పునరుద్ధరించాలి.
2. కమిటీని ఈ దిగువన ఉదహరించిన ప్రకారం ఏర్పాటు చేయాలి.
   ఎ) ప్రాథమిక పాఠశాల యాజమాన్య కమిటీలో మొత్తం 27 మంది సభ్యులుంటారు. వీరిలో నుంచి 24 మంది విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు అయి వుండాలి. గ్రామపంచాయితీ నుంచి ఒక సభ్యులు గ్రామ మహిళా సమాఖ్య నుంచి ప్రతినిధి మరియు ప్రధానోపాధ్యాయులు మరియు ఎక్స్‌అఫీషియో మెంబరు కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.
   బి) మిగిలిన 24 మందిని ఈ దిగువన ఉదహరించిన రీతిలో ఎంపిక చేసుకోవాలి.
      i) గత ఏడాది 1, 2, 3, 4 తరగతుల్లో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులయ్యి వుండాలి.

ii) గత ఏడాది 1, 2, 3, 4 తరగతుల్లో చివరి ర్యాంకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు అయ్యి వుండాలి.

iii) గత ఏడాది 1, 2, 3, 4 తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన తరగతులు మరియు అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు అయ్యి వుండాలి.

iv) పాఠశాల వున్న ప్రాంతంలోని కార్పొరేటర్ / కౌన్సిలర్ / వార్డు మెంబర్లు కమిటీ సభ్యులుగా వుంటారు.

v) పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా ఇన్‌చార్జ్ ప్రధానోపా ధ్యాయులు మెంబరు కన్వీనర్‌గా వుంటారు.

vi) పాఠశాల వున్న ప్రాంతంలోని ప్రముఖ విద్యావేత్తగాని, తత్తవేత్తగాని పాఠశాలకు సహకారమందించే వ్యక్తి గానీ, ప్రముఖ స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధిగానీ పాఠశాల యాజమాన్య కమిటీ కమిటీలోనికి తీసుకోవచ్చు.

vii) ఈ కమిటీ నందు కనీసం ఇద్దరు విద్యార్థులుండాలి. బాల, బాలికలు కలిసి వున్న పాఠశాలలయితే ఒకరు బాలిక అయ్యి వుండాలి. వీరు ప్రత్యేక ఆహ్వానితులుగా వుంటారు. స్కూలు యాజమాన్య కమిటీలో 50% మహిళలుండాలి.

సి) ప్రాథమికోన్నత పాఠశాల అయినట్లయితే;

పైన పేర్కొన్న వివరాలకు అదనంగా ఈ క్రింది వుదహరించిన మిగిలిన సభ్యులను ఎంపిక చేస్తారు.

i) 5 మరియు 6 తరగతుల్లో గత సంవత్సరం మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు.

ii) 5 మరియు 6 తరగతుల్లో గత సంవత్సరంలో చివరి ర్యాంకు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు.

iii) 5, 6 తరగతుల్లో గత సంవత్సరం షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన తరగతులు మరియు అల్పసంఖ్యాక తరగతుల్లోని బాలలలో అత్యధికమార్కులు సాధించినవారి తల్లిదండ్రులు.

3. గ్రామపంచాయితీ అయితే సర్పంచ్, పట్టణాల్లో అయితే కౌన్సిలర్ / కార్పొరేటర్ పాఠశాల యాజమాన్య కమిటీకి అధ్యక్షులుగా వ్యవహరిస్తారు.

i) సభ్యులలో నుండి ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. అధ్యక్షులు షెడ్యూల్డు కులాలు, తెగలు, లేదా ఇతర వెనుకబడిన తరగతులవారు కానట్లయితే ఉపాధ్యక్షులను ఈ కులాల నుండి ఎన్నుకోవలెను.

4. ఉపాధ్యక్షులుగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఎన్నుకోవాలి. స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రధానోపాధ్యాయులకు ఎన్నికల్లో పాల్గొనే లేదా ఓటు వేసే హక్కు వుండదు.

5. పాఠశాల యాజమాన్య కమిటీ కనీసం నెలలో ఒకసారి సమావేశాలు నిర్వహించి ఆ సమావేశాల్లో జరిగిన చర్చలను రాతపూర్వకంగా భద్రపర్చి అందరికీ అందుబాటులో వుంచాలి.

6. పాఠశాల యాజమాన్య కమిటీ సెక్షన్ 21 లోని సబ్‌సెక్షన్ రెండు నందు గల క్లాజులు ఎ నుండి డి వరకు వున్న విధులతో పాటు ఈ దిగువన వుదహరించిన విధులను నిర్వర్తించాలి.

ఎ) చదువులోను, వ్రాయటలోనూ, లెక్కలలోనూ మరియు ఇతరము లన్నింటిలోనూ పిల్లలు సాధించిన ప్రగతిని ప్రదర్శిస్తూ హాజరుకాని విద్యార్థులు మరియు ఉపాధ్యాయులపై దృష్టి కేంద్రీకరించి అందరూ సక్రమంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలి. ప్రత్యేకించి పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలి.

బి) సంబంధిత గ్రామంలోని నివాస ప్రాంతాల్లోని ఆరునుంచి 14 సం॥లు వయస్సు కలిగిన పిల్లల జాబితాను తయారు చేసి పాఠశాలకు రాని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

సి) సెక్షన్ 28 మరియు సెక్షన్ 24 లోని క్లాజులు ఎ మరియు ఇ అమలయ్యేట్లు చూసుకోవాలి.

డి) పాఠశాల పరిసర ప్రాంతాల్లోని బాలలందరూ పాఠశాలలో చేరేటట్లు మరియు వారు క్రమం తప్పకుండా హాజరయ్యేట్టు తగు జాగ్రత్తలు చేపట్టాలి.

ఇ) షెడ్యూలులో వుదహరించిన రీతిగా పాఠశాలలో తగు ప్రమాణాలను పాటించే విధంగా పర్యవేక్షణ చేయాలి.

యఫ్) సెక్షన్ 3 లోని సబ్‌సెక్షన్ 2 ప్రకారం బాలలకు అందవలసిన హక్కు బుక్కులు, మరియు బాలల హక్కులు ప్రత్యేకంగా మానసికంగా, శారీరకంగా బాధించుట, పాఠశాలల్లో ప్రవేశాన్ని నిరాకరించుట మొదలగు ప్రమాణాలలో ఎటువంటి వ్యత్యాసమున్నా స్థానిక అధికారుల దృష్టికి తీసుకుని రావాలి.

జి) అవసరాలను గుర్తించి, ప్రణాళికలను తయారు చేసుకొనుట మరియు సెక్షన్ 4 లోని సౌకర్యాలను అమలు చేసేటట్లు పర్యవేక్షించాలి.

హెచ్) ప్రత్యేక ప్రతిభ కలిగిన పిల్లలను గుర్తించడం, పాఠశాలల్లో చేరేట్లు చూడడం, వారికి కావలసిన సదుపాయాలు అందేట్టు చూడడం, వారి భాగస్వామ్యాన్ని పెంచుతూ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకునే విధంగా పర్యవేక్షించుట.

i) పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకం యొక్క అమలుని పర్యవేక్షించుట.

ii) వార్షిక జమా ఖర్చుల నివేదికను తయారుచేయుట.

7. పాఠశాలకు వచ్చిన నిధులన్నీ పాఠశాల యాజమాన్య కమిటీ బ్యాంకు ఖాతాలో జమచేయాలి. ఆ బ్యాంకు ఖాతాను అధ్యక్షులు మరియు కన్వీనర్ నిర్వహిస్తారు. ఆ ఎకౌంట్‌ను తనిఖీ కొరకు ఎల్లవేళలా అందుబాటులో వుంచాలి. ప్రతి ఏడాది చివర నిధుల వాడకంపై సంబంధిత అధికారులకు నివేదిక సమర్పించాలి.

8. ఈ కమిటీ తమ జమాఖర్చులను చార్టర్డ్ అకౌంటెంట్ లేదా స్థానిక నిధుల ఆడిటర్ లేదా సహకార శాఖకు చెందిన ఆడిటర్ చేత ఆడిట్ చేయించవలయును.

20. పాఠశాల అభివృద్ధి ప్రణాళిక రూపొందించుట :

1. పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతి ఏడాది నవంబరు నెలలో గ్రామసభకు పిలుపునిచ్చి ఆ గ్రామ సభలో పాఠశాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలి.
2. ఈ ప్రణాళికలో దిగువ అంశాలు వుండాలి.
   ఎ) ప్రతి సంవత్సరము తరగతుల వారీ పాఠశాలలో చేరే బాలల అంచనాలు వుండాలి.
   బి) షెడ్యూలులో తెలిపిన నిబంధనల ప్రకారం 1 నుండి 5 మరియు 6 నుండి 8 తరగతులకు విడివిడిగా కావలసిన అదనపు ఉపాధ్యాయులు, సబ్జక్టు టీచర్లు, తాత్కాలిక టీచర్లు, ప్రధానోపాధ్యాయులతో సహా నియమించుటకు అవసరమగు సంఖ్యను తెలపాలి.
   సి) షెడ్యూలులో తెలిపిన విధముగా స్థిరమైన భౌతిక వనరులను సౌకర్యములను సరిపడా లెక్కించి అవసరములను ప్రణాళికలను సూచించవలెను.
   డి) పాఠశాలకు సంబంధించిన పారిశుద్ధ్యం, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, అంగవైకల్యాన్ని ప్రాథమిక దశలో గుర్తించుట మరియు ప్రణాళికను రూపొందించుటలో ప్రత్యేక దృష్టి సారించాలి.
   ఇ) ఈ చట్టం కింద పిల్లలకు అందించవలసిన హక్కుబుక్కులు అనగా ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు మొదలగునవి, సెక్షన్ 4 ప్రకారం ప్రత్యేక శిక్షణ సౌకర్యం పైన ఉదహరించిన బి మరియు సి లకు అవసరమయ్యే అదనపు ఆర్థిక సహాయం, మరియు ఇతర అదనపు ఆర్థిక అవసరాలు.
3. పాఠశాల అభివృద్ధి ప్రణాళికపై అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కన్వీనర్ సంతకము చేసి తయారు చేసిన తరువాత ఆ ఆర్థిక సంవత్సరంలోనే స్థానిక అధికారులు లేదా రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలి.

21. ప్రైవేటు అన్ ఎయిటెడ్ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల యొక్క జీతభత్యాలు మరియు ఉద్యోగపరమైన నిబంధనలు :

అమలులో వున్న చట్టాలు మరియు నిబంధనలకు అనుగుణంగా ఆ పాఠశాల యాజమాన్యమే ఉపాధ్యాయులకు సంబంధించిన జీత భత్యాలు మరియు ఉద్యోగపరమైన నిబంధనలను ఖరారు చేయాలి.

22. ఉపాధ్యాయుల విధులు :

1. చట్టంలోని సెక్షన్ 24 సబ్‌సెక్షన్ (1) లో ఉదహరించిన విధులు మరియు సెక్షన్ 29 సబ్‌సెక్షన్ 2 క్లాజ్ (హెచ్) లోని అవసరాలను నెరవేర్చవలెను.
2. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి యొక్క రికార్డులను భద్రపరుస్తారు. సామర్థ్యాలను అభివృద్ధి చేసుకునే కార్యక్రమాలు మరియు అమలులో ఉన్న ఇతర కార్యక్రమాలను ఆధారం చేసుకుని చట్టంలోని సెక్షన్ 30 సబ్‌సెక్షన్ (2) ప్రకారం విద్యను పూర్తిచేసుకున్న సర్టిఫికెట్‌కు దోహదపడేలా విద్యార్థుల రికార్డులను భద్రపర్చాలి.
3. చట్టంలోని సెక్షన్ 24 సబ్‌సెక్షన్ (1) లోని క్లాజులు ఎ నుండి ఇ వరకు ఉదహరించిన విధులతో పాటు ప్రతి ఉపాధ్యాయులు కూడా ఈ దిగువన ఉదహరించిన విధులను తన రోజువారీ బోధనకు భంగం కలగకుండా నిర్వర్తించాలి.

ఎ) శిక్షణలలో పాల్గొనడం.

బి) పాఠ్య ప్రణాళిక రూపకల్పనలో, సిలబస్‌ను మెరుగుపరుచుటలో, శిక్షణ దీపికలను అచ్చుపుస్తకములను తయారు చేయుటలో పాల్గొనవలెను.

23. ఉపాధ్యాయుల సమస్యలు తెలుపుకొనుటకు అవకాశం :

1. సెక్షన్ 21 ప్రకారం ఏర్పాటు చేయబడిన పాఠశాల యాజమాన్య కమిటీ ఉపాధ్యాయుల సమస్యలను ప్రాథమిక స్థాయిలో పరిష్కరించాలి. పాఠశాల యాజమాన్య కమిటీ పరిష్కరించలేని పక్షంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (MPDO) అధ్యక్షతన మండల స్థాయిలో వున్న కమిటీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి.
2. జిల్లా స్థాయి కమిటీ ఉపాధ్యాయుల సమస్యలను జిల్లా స్థాయిలో పరిష్కరించాలి.
3. జిల్లా కమిటీకి జిల్లా కలెక్టర్ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. జిల్లా విద్యాశాఖాధికారి కన్వీనర్‌గా వుంటారు. మరియు ఇతర సభ్యులుగా జిల్లా యస్.పి, సి.ఇ.ఒ జిల్లాపరిషత్, జిల్లా వైద్య మరియు ఆరోగ్యాధికారి, జిల్లా కేంద్రంలో పురపాలక సంఘ కమీషనర్, గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు వుంటారు.
4. ఈ కమిటీని 3 నెలల కొకసారి సమావేశపర్చాలి.
5. రాష్ట్ర ప్రభుత్వ లేదా స్థానిక అధికారులు నిర్వహించే పాఠశాలల్లోని ఉపాధ్యాయులు తమ యొక్క సమస్యలను రాత పూర్వకంగా కమిటీ కన్వీనర్‌కు తెలియపర్చాలి. లేదా రాజీవ్ విద్యామిషన్ వారు పాటించే విధానంలో పంపించవచ్చు. కమిటీ తగు విచారణ జరిపిన తరువాత చేసిన నిర్ణయాన్ని కన్వీనర్ సంబంధిత ఉపాధ్యాయులకు తెలియపరుస్తారు.
6. కమిటీ ఉపాధ్యాయుల వద్ద నుండి వచ్చిన సమస్యలను పరిష్కరించడమే కాకుండా తమంతట తాము ఉపాధ్యాయుల ఎస్.పి.ఉద్యోగాలకు సంబంధించిన వివిధ అంశాలను పునఃపరిశీలించవచ్చు.
7. ప్రైవేటు పాఠశాలలు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తమ సొంత పద్ధతులను రూపొందించుకోవాలి.

24. ప్రతి పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల నిష్పత్తిని కాపాడుకోవాలి:

1. ఈ చట్టం అమలులోకి వచ్చిన మూడు నెలలలోపు విద్యాశాఖ డైరెక్టర్ రాజీవ్ విద్యామిషన్ వారిని సంప్రదించి ప్రతి ప్రభుత్వ పాఠశాలకు మంజూరైన ఉపాధ్యాయుల సంఖ్యను రాత పూర్వకంగా ఉత్తర్వులను జారీ చేస్తారు. ఈ ఉత్తర్వులు వచ్చిన ఆరు నెలలలోపు సబ్‌రూల్ (1) ప్రకారం మంజూరైన ఉపాధ్యాయుల కంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నచో వేరొక చోటకు బదిలీ చేస్తారు.
2. విద్యాశాఖ కమీషనరు, రాజీవ్ విద్యామిషన్ వారు కలిసి ప్రతి విద్యా సంవత్సరానికి ముందు ఉపాధ్యాయుల స్థితిని పునఃపరిశీలిస్తారు.
3. ప్రతి పాఠశాలలోని ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది. సకాలంలో ఖాళీలను భర్తీ చేయని పక్షంలో పాఠశాల యాజమాన్య కమిటీ అర్హులైన వారిని తాత్కాలికంగా తాము నిర్ణయించిన వేతనానికి ప్రభుత్వం భర్తీ చేసే వరకు నియమించ వచ్చు.

4. వేరే సంస్థలకు డిప్యుటేషన్‌పై వెళ్ళిన ఉపాధ్యాయుల జీతాలను ఆ పాఠశాలే (డెప్యూట్ చేసిన పాఠశాల) భరించిన పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం అటువంటి డిప్యుటేషన్లను నిలిపివేస్తుంది.
5. సెక్షన్ 25 లోని సబ్‌సెక్షన్ (2) లో ఉదహరించిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలకు చెందిన ఏ వ్యక్తైనా ఉల్లంఘించినట్లయితే వారు క్రమశిక్షణా చర్యకు బద్ధులవుతారు.

25. పాఠ్యప్రణాళిక మరియు మూల్యాంకన ప్రక్రియను విద్యా ప్రమాణి కాధికారం నిర్ణయించిన:

1. చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం విద్యా ప్రమాణికాధికారం అనగా రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణా మండలి (SCERT).
2. సబ్‌రూలు (1) ప్రకారం ధృవీకరించబడిన విద్యా ప్రమాణాధికారం రాజీవ్ విద్యామిషన్‌తో సంప్రదింపులు జరిపి రాష్ట్ర పాఠ్యప్రణాళికను తయారుచేయడం, పాఠశాలల మూల్యాంకన పద్ధతి మరియు పాఠశాలల్లోని బాలలను నిరంతరం సమగ్ర మూల్యాంకనం చేయడంతో పాటు
   ఎ) వయస్సును ఆధారం చేసుకుని సంబంధిత పాఠ్యపుస్తకాలు, నేర్చుకునే ఇతర అంశాలను రూపొందిస్తారు.
   బి) ఉపాధ్యాయులకు శిక్షణలు రూపొందిస్తారు.
   సి) నిరంతర సమగ్ర మూల్యాంకనము అమలు పరచుటకు అవసరమగు మార్గదర్శకాలను రూపొందించవలెను.
   డి) విద్యార్థులు నేర్చుకున్న స్థాయిని అంచనా వేయుట కొరకు, జవాబుదారీ తనం మొదలగు అంశాలకు సంబంధించిన సూచకలను రూపొందించుట.
   ఇ) వ్యక్తులు మరియు సంస్థల పనితీరును కాలానుగుణంగా అంచనావేయుట.
   యఫ్) విద్యార్థులకు సంబంధించిన బోధనా ఫలితాలు పాఠ్యప్రణాళిక పాలసీల అధ్యయనం / పరిశోధనను జరిగించుట.
3. సబ్‌రూల్ (1) ప్రకారం ప్రమాణికాధికారం పాఠశాలల పనితీరును అంచనా వేయుటకు కార్యక్రమాన్ని రూపొందించి దానిని అమలుచేస్తుంది. చట్టంలోని సెక్షన్ 2 సబ్‌సెక్షన్ (ఎన్) లోని క్లాజ్ (IV) లో ఉదహరించిన అన్ని పాఠశాలలను క్రమం ప్రకారం వాటి పనితీరును అంచనా వేస్తుంది.

26. ప్రాథమిక విద్యను పూర్తి చేసిన పిదప సర్టిఫికెట్‌ను జారీ చేయుట:

1. ప్రాథమిక విద్య పూర్తయిన నెలలోపు ఆ పాఠశాల ప్రధా నోపాధ్యాయులు ఫామ్-5 లో సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ప్రైవేటు పాఠశాల అయినచో సర్టిఫికెట్‌పై పాఠశాల గుర్తింపు నంబరును ముద్రించవలెను.
2. సబ్‌రూల్ (1) లో పేర్కొన్న పత్రములు
   ఎ) చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం నిర్ధారించిన అన్ని కోర్సులను పూర్తిచేసినట్లు ధృవీకరించవలెను.
   బి) ఆ ధృవీకరణ పత్రంలో విద్యార్థి సమగ్ర అభివృద్ధితో పాటు సంగీతం, నృత్యం, సాహిత్యం, ఆటల వంటి నిర్దిష్ట కోర్సుకు సంబంధం లేని అంశాలతో చూపిన ప్రతిభను కూడా పొందుపరచాలి.

27. విద్యాహక్కు రక్షణ సంస్థ ఏర్పాటు, విధులు :

1. రాష్ట్ర ప్రభుత్వం విద్యాహక్కు రక్షణ సంస్థను (REPA) చట్టం వచ్చిన ఆరు నెలలలోపు ఏర్పాటుచేయాలి.
2. విద్యాహక్కు రక్షణ సంస్థలో వీరు ఉంటారు.

i) అధ్యక్షులు ఈ దిగువ ఉదహరించిన వారై ఉండాలి.

ఎ) విద్యారంగంలోని ప్రముఖ వ్యక్తి.

బి) హైకోర్టు న్యాయమూర్తి అయి ఉండాలి.

సి) బాలల హక్కులను పెంపొందించుటలో విశిష్టమైన కృషి చేసి ఉండాలి మరియు

ii) నలుగురు సభ్యులలో ఇద్దరు మహిళలై ఉండాలి. క్రింద ఉదహరించిన అంశాలలోంచి

ఎ) విద్యారంగం.

బి) బాలల ఆరోగ్యం మరియు బాలల అభివృద్ధి.

సి) బాలల న్యాయస్థానం లేదా సమాజంలో అణగదొక్కబడిన, చిన్నచూపు చూపబడిన బాలలు లేదా అంగవైకల్యం కలిగిన బాలల సంరక్షణలో ప్రతిభ.

డి) బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లేదా అనాథలు, బాలలతో పనిచేసిన అనుభవం.

ఇ) బాలల మనస్తత్వం లేదా సామాజిక శాస్త్రం.

యఫ్) న్యాయవృత్తి

iii) నిబంధనలు 2006 ప్రకారం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ (NCPCR) మరియు బాలల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులకు వర్తించే నియమ నిబంధనలు విద్యాహక్కు రక్షణ సంస్థ (REPA) సభ్యులు మరియు అధ్యక్షులకు వర్తిస్తాయి.

iv) రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం ఏర్పడిన వెంటనే విద్యాహక్కు రక్షణ అధికారం తమ రికార్డులను, ఆస్తులను రాష్ట్ర బాలల పరిరక్షణ సంఘానికి బదిలీచేయాలి.

v) రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ మండలి లేదా విద్యాహక్కు రక్షణ అధికారం తమవిధులను నిర్వహిస్తూ రాష్ట్ర సలహా మండలి అప్పగించిన విషయాలను కూడా పరిశీలిస్తుంది.

vi) రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ మండలి లేదా విద్యాహక్కు రక్షణ అధికారం ఈ చట్టప్రకారం నిర్వర్తించవలసిన విధులకు సహాయపడేందుకు ఒక విభాగాన్ని నెలకొల్పడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిస్తుంది.

28. రాష్ట్ర సలహామండలి ఏర్పాటు, విధులు :

1. రాష్ట్ర సలహా మండలిలో ఒక అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మరియు పదమూడు మంది సభ్యులుంటారు.

2. ఈ మండలికి ప్రాథమిక విద్యాశాఖామంత్రి ఎక్స్‌అఫీషియో అధ్యక్షులుగా ఉంటారు. విద్యాశాఖామంత్రి ఎక్స్ అఫీషియో ఉపాధ్యక్షులుగా ఉంటారు.

3. మండలి సభ్యులుగా ప్రాథమిక విద్యారంగం మరియు బాలల అభివృద్ధిలో ప్రత్యక్ష అనుభవం, విజ్ఞానం కలిగిన వారిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఈ కింద ఉదహరించిన రీతిలో

ఎ) వీరిలో కనీసం నలుగురు ఎస్సీ, ఎస్టి, మైనార్టీల వారికి చెందిన వారై ఉండాలి.

బి) వికలాంగులైన బాలల విద్యలో విజ్ఞానం, ప్రత్యేక నైపుణ్యం గల వారినుండి కనీసం ఒక సభ్యుల్ని నియమించాలి.

సి) ప్రాథమిక విద్యకు ముందు నైపుణ్యం, విజ్ఞానం గల వారి నుండి కనీసం ఒక్కరిని సభ్యులుగా నియమించాలి.

డి) ఉపాధ్యాయ విద్యలో నైపుణ్యం, జ్ఞాన సముపార్జన చేసిన వారి నుండి కనీసం ఇద్దరిని సభ్యులుగా నియమించాలి.

4. 50% సభ్యులు అనగా ఆరుగురు సభ్యులు మహిళలై ఉండాలి.

5. ఈ మండలి కన్వీనర్‌గా ప్రాథమిక విద్య మరియు SSA ప్రిన్సిపల్ సెక్రటరీ ఉంటారు. పాఠశాల విద్యా కార్యదర్శి కో-కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ, బి.సి.సంక్షేమ, మైనార్టీ సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ HM & FW మరియు పంచాయితీ రాజ్ కార్యదర్శులు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. ఉమ్మడి సిబ్బంది మండలి సభ్యులైనటువంటి గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు.

6. మండలి యొక్క పనితీరు కింద ఉదహరించిన రీతిగా ఉంటుంది.

i) మండలి సమావేశాన్ని మూడు నెలలకొకసారి నిర్వహించాలి.

ii) కనీసం 50% సభ్యులు హాజరైన పక్షంలో మండలి సమావేశానికి కోరం ఉన్నట్లు భావించవచ్చు.

7. మండలి సభ్యుల నియామక నిబంధన, షరతులు :

ఎ) ప్రతిసభ్యులు నియమితులైన దగ్గర నుంచి రెండు సంవత్సరాలు పదవిలో ఉంటారు.

బి) రాష్ట్ర ప్రభుత్వం తన ఉత్తర్వులు ద్వారా ఎవరైనా సభ్యులను వారి దుష్ప్రవర్తన, అసమర్థత లేదా దిగువ తెలిపిన కారణాల వల్ల తొలగించవచ్చును.

i) దివాళా కోరుగా నిర్ణయించబడినప్పుడు.

ii) సరిగా నడుచుకొనుటకు తిరస్కరించిన లేదా నడుచుకొన లేకపోయినప్పుడు.

iii) మానసికంగా సరిగా లేనప్పుడు, సరిగా లేదని సంబంధిత న్యాయస్థానం తీర్పు చెప్పినప్పుడు.

iv) ప్రజా ప్రయోజనాల రీత్యా సంబంధిత సభ్యులు ఆ కార్యా లయంలో కొనసాగుట తగదని భావించినపుడు.

v) న్యాయస్థానంచే దోషిగా తీర్పు చెప్పబడినపుడు.

vi) సెలవు పొందకుండా వరుసగా రెండు కౌన్సిల్ సమావేశాలకు హాజరు కానప్పుడు.

సి) సభ్యుని మరణం వలన గాని, రాజీనామా వలన గాని మరేవిధంగా నైనా ఖాళీ ఏర్పడినచో అట్టి ఖాళీ ఏర్పడిన తేదీ నుండి 120 రోజులలో సబ్‌రూలు (3) లో తెలిపిన ప్రకారం సదరు ఖాళీలో మరో సభ్యుని నియమించుట ద్వారా భర్తీ చేయవలెను.

29. తీసివేయుట మరియు ఉంచుట :

1. విద్యాశాఖ కమీషనర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నియమ నిబంధనలు ఈ చట్టం యొక్క నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లయితే తీసివేయబడతారు.

2. ఈ నిబంధనలు అమలులోకి రాకముందు వీటిని పాటించినప్పటికి వారు కొనసాగుతారు.

*****

27. బాలల న్యాయ (సంరక్షణ మరియు రక్షణ) చట్టం 2000

పిల్లల హక్కుల విశ్వ తీర్మానంపై భారతదేశం సంతకం చేసింది. అంటే ఈ తీర్మానంలోని అన్ని హక్కులు అందజేస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది.

అంటే ఆనందకరమైన, ఆరోగ్యకరమైన, హింసాత్మకమైన భవిష్యత్ సమాజాన్ని అందించడమే....

నేపథ్యం

బాలల న్యాయచట్టం రూపొందడంలోని కీలక అంశాలు :

1989 ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల సదస్సులో రూపొందించిన ఒప్పందంపై భారతదేశం సంతకం చేసింది. అంటే ఆ ఒప్పందంలోని అంశాలన్నింటికి హామీనివ్వటమే ముఖ్యంగా 1, 2, 3, 5, 6, 11, 12, 18, 32, 37, 39, 40 ఆర్టికల్స్‌లోని అంశాలు ఈ చట్టం ఏర్పాటుకు కీలక అంశాలయ్యాయి. ఇంకా 1985 (బీజింగ్ నియమాలు) 1990 (రక్షణ నిలయాలు) మొ॥నవి కూడా దోహదపడ్డాయి. అలాగే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 15(30), 21, 21(ఎ), 23, 24, 39(ఇ), 39(ఎఫ్), 45, 46, 47 మొ॥నవి. ఈ చట్ట రూపకల్పనకు ముఖ్య ఆధారాలు.

ఆవిర్భావం :

సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వశాఖ, 30 డిసెంబర్ 2000 నాడు బాలల న్యాయ (సంరక్షణ మరియు రక్షణ చట్టం 2000ను పార్లమెంటులో ప్రవేశపెట్టబడి ఆమోదించబడింది. దీంతో 1986 బాలనేరస్థుల న్యాయచట్టము స్థానంలో ఏప్రిల్ 1న, బాలల న్యాయ (సంరక్షణ మరియు రక్షణ) చట్టం 2006 అమలులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2001, జూన్‌లో ఈ చట్టానికి నిబంధనలను రూపొందించింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టానికి తగిన రాష్ట్ర నిబంధనలను రూపొందించాలని ఆశించడమైనది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన నిబంధనలు 2003 లో రూపొందించడం జరిగింది.

ఆశయాలు :

పిల్లల ఉత్తమ ప్రయోజనాల కోసం, పిల్లలతో స్నేహంగా దగ్గరై పని చేయడం.

18 సం॥ల లోపు పిల్లలందరికీ ఒక ఉమ్మడి న్యాయవ్యవస్థ

చట్టంతో విబేధం ఉన్న పిల్లల్ని మరియు ఆదరణ రక్షణ అవసరమైన పిల్లల్ని వేరు చేయడం.

పిల్లలపై నేరస్థుల ముద్ర వేయకపోవడం మరియు వయోజనులైన నేరస్తుల నుండి విడదీయడం.

దోపిడీ, చిత్రహింసలకు గురియైన పిల్లలకు సత్వర పునరావాసం.

పిల్లలకు ఆదరణ, రక్షణ చికిత్స అభివృద్ధి పునరావాసాలపై దృష్టి పెట్టడం.

పిల్లలకోసం ప్రత్యేకంగా నిర్దేశించబడిన "ప్రత్యేక జువెనైల్ పోలీస్ యూనిట్" నిర్వహణ.

మౌలిక విలువలు:

ఆదరణ రక్షణ అవసరం గల పిల్లలు మరియు చట్టంతో విబేధం ఉన్న పిల్లల, వయసు పరిగణన, కుటుంబాల బాగోగులు, పిల్లలు తిరిగి కుటుంబాలతో కలిసి సాధారణ జీవితం గడిపే అవకాశం కల్పించడం

మరియు దీర్ఘకాల న్యాయ వివాదాలలో చిక్కుకోకుండా నివారించడానికి అవసరమైన పిల్లలందరికీ పునరావాసం కల్పించడానికి సామాజిక వనరులను నేర్పుగా వినియోగించడం.

అధ్యాయం - 1

ప్రాథమిక సూత్రాలు

సెక్షన్ : 1. చట్టం శీర్షిక, దాని పరిధి, అమలు

1. ఈ చట్టాన్ని బాలల న్యాయ (సంరక్షణ మరియు రక్షణ) చట్టం, 2000 అని పిలువబడును.
2. ఈ చట్టం జమ్మూ కాశ్మీర్‌కు తప్ప భారతదేశమంతటా వర్తిస్తుంది.
3. కేంద్ర ప్రభుత్వ గెజిట్లో నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించిన తేదీ నుండి ఈ చట్టం అమలులోకి వస్తుంది.
4. ప్రస్తుతం అమలులో ఉన్న ఇతర చట్టాల్లో కనబరచిన అంశాలకు అతీతంగా ఈ చట్టంలోకి అంశాలు, "చట్టంతో విరోధంలో ఉన్న బాలలకు" విధించే నిర్బంధము లేక విచారణ, శిక్ష లేక కారాగారవాసము మొదలైన వాటికి సంబంధించిన అన్ని విషయాలకు చట్టం వర్తిస్తుంది.

సెక్షన్ : 2. నిర్వచనాలు: సందర్భమునకు అనుగుణంగా, అవసరమైతే తప్ప, ఈ చట్టం ప్రకారం,

ఎ) 1. "సలహామండలి" అనగా, సెక్షన్ 62 కింద ఏర్పరచిన కేంద్ర లేక రాష్ట్ర సలహా మండలి లేక జిల్లా మరియు పట్టణస్థాయి సలహామండలి.

2. "దత్తత" అనగా జన్మనిచ్చిన తల్లిదండ్రులనుండి శాశ్వతంగా వేరు చేయబడి, ఆ బంధానికి సంబంధించిన సంపూర్ణహక్కుల, బాధ్యతల, రాయితీలతో దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు చట్టబద్ధమైన పిల్లలుగా గుర్తింపునివ్వడం.

బి) "భిక్షాటన" అనగా ఏదో ఒక కారణం చేత

1. బహిరంగ ప్రదేశాలలో భిక్షకోసం అడగడం లేక భిక్షను స్వీకరించడం లేక ఒక వ్యక్తికి సంబంధించిన ఆవరణలో ప్రవేశించి భిక్ష కోసం బ్రతిమాలటం లేక భిక్షను స్వీకరించడం.

2. భిక్షను పొందాలని లేక బలవంతంగా రాబట్టుకోవాలనే ఉద్దేశ్యంతో తనదైనా లేక ఇతర వ్యక్తులవైనా లేక ఒక జంతువుదైనా ప్రణాలను, దెబ్బలను, గాయాలను, వికారరూపాన్ని లేక వ్యాధులను బయటకు చూపడం లేక ప్రదర్శించడం.

సి) "బోర్డు" అనగా సెక్షన్ 4 కింద రూపొందించబడిన బాలల న్యాయమండలి.

డి) "సంరక్షణ మరియు రక్షణ అవసరమైన పిల్లలు" అనగా,

1. ఇల్లు లేదా స్థిర ప్రదేశము లేనివారు, ఎటువంటి నివాసము లేకుండా వీధిపాలైన పిల్లలు, తగిన జీవనాధారం లేక వదలివేయబడ్డ పిల్లలు.

1ఎ)వీధిపిల్లలు గానీ, పనిచేసే పిల్లలు గాని యాచకవృత్తిలో కనుగొన్నప్పుడు.

2. ఒక వ్యక్తితో (ఆ వ్యక్తి పిల్లల సంరక్షకుడు / రాలు కావచ్చు లేదా వేరెవరైనా కావచ్చు) కలిసి జీవిస్తూ వారి చేత.

2ఎ) చంపుతానని లేక గాయపరుస్తాననే బెదిరింపులకు గురైన పిల్లలు, ఆ బెదిరింపులు జరిగే అవకాశం ఉందని అనిపించినప్పుడు, అటువంటి పిల్లలు.

2బి) ఇతర బిడ్డ లేదా బిడ్డలను ఆ వ్యక్తులు ఇదివరలో చంపినా లేదా గాయపరచినా గాని, నిర్లక్ష్యం చేసినట్టు బుజువయినా, ఇప్పుడు సంరక్షణలో ఉన్న బిడ్డ / బిడ్డలకు కూడా అలాగే జరిగే అవకాశం ఉందని అనిపించినప్పుడు

3. శారీరక / మానసిక వికలాంగులైన పిల్లలు, నయము కాని వ్యాధులతో బాధపడుతున్న పిల్లలు, చివరి దశలో ఉన్న జబ్బులతో బాధపడే పిల్లలు – వీరందరూ ఇంకా ఏవిధమైన ఆధారము, దిక్కులేని వారై ఉన్నా – అటువంటి పిల్లలు.

4. తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఉండి కూడా వారు పిల్లల్ని చూసుకోవడానికి అనర్హులు లేదా అశక్తులు అయినప్పుడు అటువంటి పిల్లలు.

5. తల్లిదండ్రులు లేని పిల్లలు, ఇతరత్రా ఎవరూ "సంరక్షణ" బాధ్యత తీసుకోవడానికి ఇష్టపడక వదలివేయబడ్డ పిల్లలు, తల్లిదండ్రులు విడిచిపెట్టేసిన పిల్లలు, ఇంటి నుండి తప్పిపోయిన లేదా పారిపోయిన పిల్లలు, సరియైన విచారణ తరువాత కూడా తల్లిదండ్రులకు దొరకని పిల్లలు.

6. లైంగిక దుర్వినియోగం కోసం తీవ్రంగా హింసకు, దోపిడీకి గురవుతారనే భయం ఉన్న పిల్లలు, చట్టవిరుద్ధమైన చర్యలకోసం దుర్వినియోగానికి గురవుతున్న / గురవుతారనే అనుమానం ఉన్న పిల్లలు.

7. ప్రమాదపు అంచున ఉన్న పిల్లలు, మత్తు పదార్థాల దొంగ రవాణా కోసం గాని, వాటి వినియోగం కోసం గాని దుర్వినియోగం చేయబడతారనే అనుమానం ఉన్న పిల్లలు.

8. అక్రమ లాభార్జన కోసం దుర్వినియోగానికి గురైన / గురవుతారనే అనుమానం ఉన్న పిల్లలు.

9. సాయుధ పోరాటాలు, పౌర సంక్షోభం, ప్రకృతి విపత్తులలో బాధితులైన పిల్లలు.

ఇ) "బాలల సదనము" అనగా సెక్షన్ 34 కింద రాష్ట్ర ప్రభుత్వంతో గాని స్వచ్ఛంద సంస్థచే గాని స్థాపించబడినది. మరియు ప్రభుత్వంచే ధృవపరచబడిన ఏ సంస్థ అయినా.

ఎఫ్) "కమిటీ" అనగా సెక్షన్ 29 కింద రూపొందించబడిన "బాలల సంక్షేమ సమితి" (సి.డబ్ల్యూ.సి)

జి) "సముచిత అధికారి" (కాంపిటెంట్ అథారిటీ) అనగా సంరక్షణ మరియు రక్షణ అవసరమైన పిల్లలకు సంబంధించిన ఒక సమితి, మరియు చట్టంతో విబేధించిన బాలలకు సంబంధించిన ఒక మండలి.

హెచ్) "యోగ్యత గల సంస్థ" (ఫిట్ ఇన్‌స్టిట్యూషన్) అనగా, ప్రభుత్వానికి సంబంధించిన లేదా గుర్తింపు పొందిన ప్రభుత్వేతర సంస్థ లేదా పిల్లల సంరక్షణ బాధ్యత తీసుకోవడానికి ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థ అయి ఉండాలి. ఇది "సముచిత అధికారి" చే అర్హత కలిగినదిగా, సిఫారసు చేయబడి రాష్ట్ర ప్రభుత్వముచే గుర్తింపు పొందినదై ఉండాలి. ఉన్న పిల్లలు, చట్టవిరుద్ధమైన చర్యల కోసం దుర్వినియోగానికి గురవుతున్న / గురవుతారనే అనుమానం ఉన్న పిల్లలు.

ఐ) "యోగ్యత ఉన్న వ్యక్తి" (ఫిట్ పర్సన్) అనగా, ఆ వ్యక్తి సామాజిక కార్యకర్తగాని పిల్లల బాధ్యత తీసుకోవడానికి ఒప్పుకున్న ఇతర వ్యక్తి గాని అయి ఉండాలి. ఆ వ్యక్తి "సముచిత అధికారి" తో ఆమోదం పొంది ఉండాలి.

జె) "సంరక్షకులు" అనగా పిల్లలకు సంబంధించిన సహజమైన సంరక్షకులు (నేచురల్ గార్డియన్స్) లేదా పిల్లల బాధ్యత కలిగిన ఏ ఇతర వ్యక్తి మరియు "సముచిత అధికారి" తో ఆమోద ముద్ర పొందినవారై ఉండాలి.

కె) "జువెనైల్" లేదా "పిల్లలు" అనగా పద్దెనిమిదవ సంవత్సరం పూర్తి చేయని వ్యక్తులు (18 సం॥ లు) నిండని పిల్లలు.

ఎమ్) "స్థానిక అధికారి" అనగా గ్రామస్థాయిలో పంచాయితీలు మరియు జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్ కాకుండా ప్రభుత్వంచే స్థానిక అధికారిగా విధి నిర్వహించడానికి చట్టబద్దమైన హక్కు కలిగిన మున్సిపల్ కమిటీ లేక కార్పొరేషన్ లేక కంటోన్మెంట్ బోర్డు లేక అటువంటి ఇతర సంస్థలు కూడా ఉంటాయి.

ఎన్) 2006 కింద తొలగించబడిన నార్కోటిక్ డ్రగ్స్ మరియు మత్తుమందుల మాదక ద్రవ్యాలకు సైకోట్రోఫిక్ సబ్‌స్టాన్సస్ యాక్ట్,1985 (61 ఆఫ్ 1985) లో క్రమానుసారంగా ఆపాదించబడి ఉంటుంది.

ఓ) "పరిశీలనా సదనం" అనగా రాష్ట్ర ప్రభుత్వం చేతగాని, స్వచ్ఛంద సంస్థ చేత గాని స్థాపించబడిన గృహము. సెక్షన్ 8 కింద చట్టంతో విరోధంలో ఉన్న బాలల కోసం కేటాయించిన గృహము మరియు పరిశీలక సదనంగా రాష్ట్ర ప్రభుత్వముచే ధృవీకరించబడినది.

పి) "సురక్షిత స్థలము" అనగా పిల్లలను తాత్కాలికంగా స్వీకరించడానికి వారిని జాగ్రత్తగా చూసుకోవడానికి అంగీకరించిన వ్యక్తి ఆధ్వర్యంలో ఉన్న స్థలము లేక సంస్థ (పోలీస్ లాకప్ గాని, జైలు గాని కాకుండా) మరియు సముచిత అధికారి పిల్లలు సురక్షితంగా ఉండదగిన స్థలమని భావించిన ప్రదేశము.

ఆర్) "నిర్దేశించిన" అనగా ఈ చట్ట ప్రకారం ఆదేశించబడిన సూత్రాలు.

ఎస్) "ప్రొబేషన్ అధికారి" అనగా రాష్ట్ర ప్రభుత్వముచే ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ యాక్ట్, 1958 (20 ఆఫ్ 1958) క్రింద నియమించబడిన ప్రొబేషన్ అధికారి.

టి) "బహిరంగ స్థలము" అనగా ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) యాక్ట్, 1956 (104 ఆఫ్ 1956) ప్రకారం నిర్వచించిన స్థలము.

యు) "ఆశ్రయ సదనం (షెల్టర్ హోమ్)" అనగా సెక్షన్ 37 క్రింద చెప్పబడిన నివాసము లేదా పిల్లలను తాత్కాలికంగా విడిచిపెట్టు కేంద్రము.

వి) "ప్రత్యేక సదనము" (స్పెషల్ హోమ్) అనగా రాష్ట్ర ప్రభుత్వం లేక స్వచ్ఛంద సంస్థ స్థాపించిన సంస్థ ఇది సెక్షన్ 9 క్రింద ప్రభుత్వంచే ధృవీకరించబడినది.

డబ్ల్యూ) ప్రత్యేక జువెనైల్ పోలీస్ యూనిట్ అనగా సెక్షన్ 63 ప్రకారం పిల్లల కొరకై ప్రత్యేకంగా నిర్దేశించబడిన రాష్ట్ర పోలీస్ యూనిట్

ఎక్స్) "రాష్ట్ర ప్రభుత్వం" అనగా కేంద్ర పాలిత ప్రాంతం దృష్ట్యా కార్యనిర్వహణకై రాష్ట్రపతిచే రాజ్యాంగంలోని ఆర్టికల్ 239 అధికరణం ప్రకారం నియమించబడిన అధికారి.

వై) ఈ చట్టంలో నిర్వచనం ఇవ్వకుండా వాడిన మాటలు, పద సము దాయాలను, నేర విచారణ స్మృతి 1973 (2 ఆఫ్ 1974) ప్రకారం ఆయా మాటలకు, పద సముదాయాలకు ఇవ్వబడిన నిర్వచనాల ప్రకారం అర్థం చేసుకోవాలి.

సెక్షన్ : 3. 18 సం॥లు నిండిన బాలలకు సంబంధించి విచారణ కొనసాగింపు:

చట్టంలో విరోధంలో ఉన్న జువెనైల్ సంరక్షణ మరియు రక్షణ అవసరమైన పిల్లలపైన విచారణ మొదలై, అది జరుగుతున్న క్రమంలో ఆ పిల్లలు పిల్లలుగా ఉండటం ఆగిపోయినప్పుడు, ఆ సమయంలో అమలులో ఉన్న ఈ చట్టంలో లేక ఏ ఇతర శాసనంలో ఏమి ఉన్నప్పటికీ ఆ వ్యక్తి ఇంకా బాలుడుగా / బాలికగా ఉన్నట్లుగా భావించి, ఆ వ్యక్తికి సంబంధించిన విచారణను కొనసాగించి, ఉత్తర్వులను జారీ చేయాలి.

అధ్యాయం - 2

చట్టంతో విరోధంలో ఉన్న బాలలు

సెక్షన్ : 4. బాలల న్యాయ మండలి :

ఓ) "పరిశీలనా సదనం" అనగా రాష్ట్ర ప్రభుత్వం చేతగాని, స్వచ్ఛంద సంస్థ చేత గాని స్థాపించబడిన గృహము. సెక్షన్ 8 కింద చట్టంతో విరోధం

1. **నేర విచారణ స్మృతి :**1973 (2 ఆఫ్ 1974) ప్రకారం ఆదేశసూత్రాలు ఏవిధంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అఫీషియల్ గెజిట్‌లో నోటిఫికేషన్ ద్వారా, ఒక జిల్లాకు కాని లేక కొన్ని జిల్లాలకు కలిపి కాని ఒకటి అంతకంటే ఎక్కువ బాలల న్యాయమండలులను ఏర్పాటు చేయాలి. ఈ మండలికి చట్టంతో విరోధంలో ఉన్న బాలలకు సంబంధించి నిర్వహించవలసిన విధులు బాలల న్యాయచట్టాన్ని అనుసరించి ఉంటాయి. అలాంటి బాలల న్యాయమండలులు తమపై విధించిన అధికారాన్ని వినియోగించాలి మరియు విధులను నిర్వర్తించాలి.
2. మండలి, మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ లేక ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ మరియు సందర్భానుసారంగా ఇద్దరు సంఘసేవకులతో ఒక బెంచ్‌గా ఏర్పడాలి. ఈ ఇద్దరు సంఘ సేవకులలో ఒకరు తప్పనిసరిగా స్త్రీ అయి ఉండాలి. ఇలాంటి ప్రతీ ఒక్క బెంచ్‌కు నేరవిచారణ స్మృతి 1973 (2 ఆఫ్ 1974) లేక జిల్లా మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ లేక ఆ సందర్భానుసారంగా ఫస్ట్‌క్లాసు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ద్వారా అధికారాలు లభిస్తాయి. ఈ బోర్డులో ఉన్న మేజిస్ట్రేట్, ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్‌గా పదవిని చేపడతారు.
3. పిల్లల మానసిక శాస్త్రంలో లేక బాలల సంక్షేమంలో ప్రత్యేకమైన పరిజ్ఞానము లేక శిక్షణ కలిగిన మేజిస్ట్రేట్‌లను మాత్రమే మండలి సభ్యులుగా నియమించాలి. కనీసం ఏడు సంవత్సరాలుగా పిల్లలకు సంబంధించిన ఆరోగ్యం, విద్య లేక సంక్షేమ కార్యక్రమంలో ఉన్న సంఘసేవకులను మాత్రమే మండలి సభ్యులుగా నియమించాలి.

4. మండలి సభ్యుల నిర్ణీత పదవీకాలము మరియు ఆ సభ్యులు పదవీ విరమణ చేయుటకు పద్ధతి నిర్ణయించిన విధంగానే ఉంటుంది.
5. రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపిన తర్వాత మండలి సభ్యత్వాన్ని రద్దు చేయదగిన కారణాలు.
   1. ఈ చట్టము క్రింద కల్పించిన హక్కును దుర్వినియోగపరచిన నేరంలో దొరికితే.
   2. నీతి బాహ్యతతో కూడిన నేరాలతో ప్రమేయం కలిగి శిక్షార్హులై ఉంటే, అలాంటి శిక్షను వెనుకకు తీసుకోకపోతే లేక ఆ వ్యక్తికి నేరానికి సంబంధించి పూర్తి మాఫీ మంజూరు చేయకపోతే.
   3. వారు వరుసగా మూడు నెలలు మండలిలో ప్రొసీడింగ్స్‌ను సరియైన కారణం లేకుండా హాజరు కావడంలో విఫలం అయితే వారు సమావేశాలలో నాలుగింట మూడు వంతులు కూడా హాజరు కావడంలో విఫలమయితే.

విభాగం : 5. మండలికి సంబంధించిన పద్ధతి మొదలగునవి :

1. మండలి, నిర్ణయించిన సమయాల్లో కలుసుకొని, తన సమావేశాల్లో వ్యవహార లావాదేవీలకు సంబంధించి నిర్ణయించిన కార్య విధాన నియమావళిని పాటించాలి.
2. మండలి సమావేశాలు లేని సమయంలో చట్టంతో విరోధంలో ఉన్న బాలలను మండలిలోని ఏ ఒక్క సభ్యుని ముందయినా ప్రవేశపెట్టవచ్చు.
3. మండలిలోని ఏ సభ్యుడు / సభ్యురాలు హాజరు కాలేకపోయినప్పటికీ మండలి పని చేయవచ్చు. మరియు ప్రొసీడింగ్స్ జరిగిన ఏ దశలోనైనా ఏ సభ్యుడు / సభ్యురాలు కేవలం హాజరు కాలేక పోయారనే ఒకే ఒక కారణం చేత మండలి చేసిన ఉత్తర్వులు చెల్లకుండా ఉండరాదు.

అయితే, కేసు తుది పరిష్కార సమయంలో మాత్రం ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్‌తో సహా కనీసం ఇద్దరు సభ్యులు తప్పనిసరిగా ఉండాలి.

4. మధ్యంతర లేక తుది పరిష్కారాలు చేసేటప్పుడు మండలి సభ్యుల మధ్య ఏవైనా అభిప్రాయ బేధాలు కలిగిన సందర్భాలలో, మెజారిటీ అభిప్రాయం అమలవుతుంది. కాని, అలాంటి మెజారిటీ ఏదీ లేనప్పుడు ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ అభిప్రాయం అమలవుతుంది.
   1. ఒక జిల్లాకు గాని కొన్ని జిల్లాలకు కలిపి మండలి ఏర్పాటు చేయబడినప్పుడు ఆ మండలి అప్పటికి అమలులో ఉన్న శాసనాలు ఏవిధంగా ఉన్నప్పటికీ, ఈ బాలల న్యాయ చట్టం సాయంలో "చట్టంతో విరోధం ఉన్న బాలల" కు సంబంధించిన అన్ని వ్యవహారాల్లో కలుగజేసుకోవడానికి ప్రత్యేక అధికారాలు కలిగి ఉంటుంది.
   2. అప్పీలు, రివిజన్ లేక ఇతర విధంగా ప్రొసీడింగ్స్ తమ ముందుకు వచ్చినప్పుడు, ఈ చట్టం క్రింద లేక ఈ చట్టం ద్వారా మండలికి ఇవ్వబడిన అధికారాలను హైకోర్టు మరియు సెషన్స్ కోర్టులు కూడా వినియోగించుకోవచ్చు.

సెక్షన్ : 7. ఈ చట్టం క్రింద అధికారం ఇవ్వబడిన మేజిస్ట్రేట్ అనుసరించాల్సిన పద్ధతి :

1. ఈ చట్టం క్రింద మండలి యొక్క అధికారాలను వినియోగించే అధికారం ఇవ్వబడిన ఏ మేజిస్ట్రేట్ అభిప్రాయంలోనయినా ఈ చట్టంలోని ఏ నిబంధనల క్రిందయినా తన ముందుకు తీసుకుని రాబడిన వ్యక్తి (సాక్ష్యం ఇచ్చే ఉద్దేశ్యంతో తప్పితే) బాలుడు / బాలిక అనిపిస్తే, అతను / ఆమె ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, ఆ అభిప్రాయాన్ని నమోదు చేసి ఆ బాలుడు / బాలికను అప్పటివరకు నమోదు చేసిన ప్రొసీడింగ్స్‌ను వాటిపైన అధికార పరిధి కలిగిన "సముచిత అధికారికి" పంపించాలి.
2. సబ్‌సెక్షన్ (1) క్రింద ప్రొసీడింగ్స్ పంపబడిన "సముచిత అధికారికి" బాలుడు / బాలికను మొదటి నుండి తన ముందుకు తీసుకువచ్చినట్టుగానే విచారణను నిర్వహించాలి.

సెక్షన్ : 8. పరిశీలక సదనాలు :

1. చట్టంతో విరోధంలో ఉన్న బాలలకు సంబంధించిన విచారణ ఇంకా జరుగుతున్నప్పుడు వారిని తాత్కాలికంగా ఉంచడానికి అవసరమైన విధులుగా ఈ చట్టం క్రింద ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా ప్రతీ జిల్లాలో లేక కొన్ని జిల్లాలకు కలిపి కాని, తనకు తానుగా కాని లేక స్వచ్ఛంద సంస్థలతో ఒక అంగీకారంతో కాని పరిశీలన గృహాలను నెలకొల్పి నిర్వహించాలి.
2. సబ్‌సెక్షన్ (1) క్రింద నెలకొల్పబడిన లేక నిర్వహింపబడుతున్న సదనాలు తమ ఏఏ ఇతర సదనాలైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం వస్తున్న చట్టం ప్రకారం, చట్టంతో విరోధంలో ఉన్న బాలలను ఉంచవచ్చని అభిప్రాయపడితే, అక్కడికి వారిని పంపాలనుకుంటే ఈ చట్టం ప్రయోజనాలు నెరవేరేందుకై అటువంటి సదనాలను ప్రత్యేక సదనాలుగా ధృవీకరించవచ్చు.
3. ఈ చట్టం క్రింద రూపొందించిన నియమాల ద్వారా ప్రత్యేక సదనాల యాజమాన్యానికి సంబంధించిన నిబంధనలతో సహా ప్రయాణాలు మరియు బాలల పునర్ సామాజికీకరణకు వారు అందజేయాల్సిన అవసరమైన వివిధ రకాల సేవలు మరియు ఒక పరిశీలక సదనానికి ధృవీకరణ ఏ పరిస్థితులలో మరియు ఏ పద్ధతులలో మంజూరు చేయాలో లేక ఉపసంహరించుకోవాలో తెలిపే నిబంధనలు ఉంటాయి.

సెక్షన్ : 9. ప్రత్యేక సదనాలు :

1. ఏదేని రాష్ట్ర ప్రభుత్వం తనంతట తానుగా కానీ లేక స్వచ్ఛంద సంస్థలతో ఒప్పందంతో కానీ ప్రతీ జిల్లాకు లేక కొన్ని జిల్లాలకు కలిపి కాని ఈ చట్టం క్రింద, చట్టంతో విరోధంలో ఉన్న బాలలను ఉంచుకోవడానికి, వారి పునరావాసానికి అవసరమైన ఆశ్రమ సదనాలను స్థాపించాలి.
2. సబ్‌సెక్షన్ (1) క్రింద కాకుండా వేరేవిధంగా స్థాపించబడిన ఏ సంస్థ అయినా ఈ చట్టం క్రింద చట్టంతో విరోధంలో ఉన్న బాలలను ఉంచుకోవడానికి యోగ్యమైనవిగా రాష్ట్ర ప్రభుత్వం భావించినప్పుడు ఈ చట్టం ప్రయోగం కోసం అలాంటి సంస్థను ప్రత్యేక సదనంగా ధృవీకరించవచ్చు.
3. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టం క్రింద రూపొందించిన నియమాల ద్వారా ప్రత్యేక సదనాల నిర్వహణ కోసం బాలల యొక్క సామాజిక పునరీకరణ కోసం వారు అందించవలసిన వివిధ రకాల సేవలు

మరియు ప్రమాణాలతో సహా, ఆశ్రయ సదనాల నిర్వహణ కోసం కూడా ఈ చట్టం క్రింద నియమాలను రూపొందించాలి. ఆశ్రయ సదనాలకు పరిస్థితులను బట్టి ధృవీకరణను ఇవ్వడం, ఆ ఇచ్చే పద్ధతి రద్దు చేసే పద్ధతికి సంబంధించిన నియమాలను కూడా పొందుపరచాలి.

4. ఈ చట్టంలోని సబ్‌సెక్షన్ (3) ద్వారా చట్టంతో విరోధంలో ఉన్న బాలల వయసు మరియు వారు చేసిన నేరాల స్వభావం మరియు అతని / ఆమె శారీరక, మానసిక స్థితి ఆధారంగా వర్గీకరణకు మరియు వేర్పాటుకు సంబంధించిన నియమాలను రూపొందించ వచ్చు.

సెక్షన్ : 10. చట్టంతో విరోధంలో ఉన్న బాలలను నిర్బంధించడం :

1. చట్టంతో విరోధంలో ఉన్న బాలలను పోలీసులు నిర్బంధించిన వెంటనే, ఆ బాలలు లేక నియమించబడిన పోలీసు అధికారి బాధ్యతలో ఉంచాలి. వారు వెంటనే ఈ విషయాన్ని మండలి సభ్యునికి / సభ్యురాలికి నివేదించాలి.

2. రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టానికి అనుగుణంగా ఉండేవిధంగా ఈ క్రింది నియమాలను రూపొందించవచ్చు.

   ఎ) చట్టంతో విరోధంలో ఉన్న బాలలను మండలి ముందు హాజరు పరచడానికై వ్యక్తులను (గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థలతో సహా) ఏర్పాటు చేయాలి.

   బి) బాలల పరిశీలన గృహానికి పంపే పద్ధతిని తయారు చేయాలి.

సెక్షన్ : 12. బాలలకు జామీను :

1. ఎవరైనా వ్యక్తి జామీను ఇవ్వదగిన నేరంలోకానీ, లేక జామీను ఇవ్వదగని నేరంలోకాని నిందితుడయినప్పుడు అతను బాలుడు / బాలికగా కనిపిస్తే అతను ఆమె అరెస్టు చేయబడినప్పుడు లేక హాజరయినప్పుడు లేక మండలి ముందుకు తీసుకొని వచ్చినప్పుడు అలాంటి వ్యక్తిని నేరవిచారణ స్మృతి, 1973 (2 ఆఫ్ 1974) లేక ఆ సమయంలో అమలులో ఉన్న ఏ ఇతర చట్టాలలో ఏమి ఉన్నప్పటికీ, పూచీలతో కాని లేక పూచీ లేకుండా కానీ జామీను పైన విడుదల చేయాలి. కానీ విడుదల చేయడం వలన ఆ వ్యక్తి తిరిగి తెలిసిన నేరస్థుని సహవాసంలోనికి తీసుకొని పోబడతాడని అనిపించినప్పుడు లేక అతను నైతిక, శారీరక, మానసిక ప్రమాదాలకు లోనవుతాడని అనిపించినప్పుడు అతనిని విడుదల చేయకూడదు. అటువంటి వ్యక్తి బాధ్యత కలిగిన పోలీసు అధికారి ద్వారా సెక్షన్ (1) క్రింద జామీను పైన విడుదల చేయబడినప్పుడు ఆ పోలీసు అధికారి మండలి ముందుకు తీసుకుని రాగలిగేవరకు నిర్ణయించిన పద్ధతిలో పరిశీలక సదనంతో మాత్రమే ఉంచాలి.

సెక్షన్ :13. తల్లికి లేక తండ్రికి, సంరక్షకుడికి / సంరక్షకురాలికి లేక ప్రొబేషన్ అధికారికి సమాచారం ఇవ్వడం.

బాలలు అరెస్టు చేయబడి పోలీస్ స్టేషన్‌లో బాధ్యత కలిగిన అధికారి వద్దకు లేక ప్రత్యేక జువెనైల్ పోలీస్ యూనిట్ ముందుకు తీసుకొని వచ్చినప్పుడు వారు అరెస్ట్ చేసిన వెంటనే సాధ్యమైనంత త్వరగా.

ఎ. అతనికి ఆ అరెస్ట్ గురించి తెలిసిన వెంటనే, ఆ అరెస్ట్ గురించి అతని తల్లికి లేక తండ్రికి లేక సంరక్షకులకు సమాచారాన్ని అందించి వారిని, బాలలు హాజరయ్యే మండలి సమక్షంలో హాజరు అవ్వాలని నిర్దేశించాలి.

బి. ఆ బాలల యొక్క పూర్వ చరిత్రను మరియు కుటుంబ నేపధ్యానికి సంబంధించిన సమాచారానికి సంబంధించిన ప్రొబేషన్ అధికారికి సమాచారాన్ని అందజేయాలి.

సెక్షన్ :14. జువెనైల్‌కు సంబంధించి మండలి ద్వారా విచారణ :

అపరాధం చేసాడని ఆరోపించబడిన జువెనైల్‌ను మండలి ముందుకు ప్రవేశపెట్టబడినప్పుడు ఈ చట్టంలోని నిబంధనలను అనుసరించి మండలి విచారణను నిర్వహించాలి. ఆ బాలలకు సంబంధించి, ఉచితమని భావించిన ఉత్తర్వును ఇవ్వాలి.

అయితే మండలి కేసు యొక్క పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మరియు కొన్ని ప్రత్యేక కేసులలోను సమయం పొడిగింపుకు లిఖిత పూర్వక కారణాలు నమోదు చేసి ఆ సమయాన్ని పొడిగిస్తే తప్ప, ఈ విభాగం క్రింద ప్రారంభించబడిన తేదీనుండి నాలుగు నెలలలోపల తప్పనిసరిగా విచారణను పూర్తి చేయాలి.

సెక్షన్ : 15. బాలలకు సంబంధించి జారీ చేయగలిగే ఉత్తర్వులు :

1. బాలలు నేరం చేసారని, మండలి నిర్ధారించినప్పుడు ఆ సమయంలో అమలులో ఉన్న ఏ ఇతర శాసనంలో ఏమి ఉన్నప్పటికీ, సరియైనదని భావించిన ఈ క్రింది ఉత్తర్వులను జారీ చేయవచ్చు.

   ఎ. ఆ బాలలను సలహా ఇచ్చిన తర్వాత లేక మందలించిన తర్వాత ఇంటికి తిరిగి వెళ్లేందుకు అనుమతించాలి. అయితే వెంటనే దీనిని అనుసరించి సరియైన విచారణ జరిపిన తర్వాత ఆ బాలలతో తల్లిదండ్రులతో లేక సంరక్షకులతో మరియు బాలలతో కౌన్సిలింగ్ నిర్వహించవచ్చు.

   బి. సామూహిక కౌన్సిలింగ్ సంప్రదింపులతో లేక అలాంటి కార్యకలాపాలలో పాల్గొనమని బాలలను ఆదేశించవచ్చు.

   సి. ప్రజాసేవ చేయమని ఆదేశించవచ్చు.

   డి. జరిమానా చెల్లించమని బాలల తల్లిదండ్రులను ఆదేశించవచ్చు. ఒకవేళ ఆ బాలలు పధ్నాలుగు సంవత్సరాలు దాటి, సంపాదనాపరులై ఉంటే ఆ బాలలనే స్వయంగా జరిమానా చెల్లించమని ఆదేశించవచ్చు.

   ఇ. ఆ బాలలను మంచి ప్రవర్తనపై విడుదల చేసి అతని / ఆమె తల్లిదండ్రులు లేక సంరక్షకులు లేక ఇతర అర్హులైన వ్యక్తుల సంరక్షణలో ఉంచాలి. అంటే సమితి ఏవిధంగా కోరితే ఆవిధంగా మూడు సంవత్సరాల వరకు ఆ బాలలనుండి ప్రవర్తన, శ్రేయస్సు కొరకు హామీ కోసం బాండు వ్రాసి ఇవ్వాలి.

   ఎఫ్. ఆ బాలలను పరిశీలనా కాలంలో మంచి ప్రవర్తనపై విడుదల చేసి ఇంకా మూడు సంవత్సరాల వరకు అతని / ఆమె మంచి ప్రవర్తన మరియు శ్రేయస్సు కోసమైనా ఏదైనా యోగ్యత కలిగిన సంస్థ సంరక్షణలో ఉంచాలి.

   బి) 1. పదిహేడు సంవత్సరాలు దాటి, పద్దెనిమిది సంవత్సరాల లోపు బాలలను రెండు సంవత్సరాలకు తక్కువ కాకుండా

2. ఇతర బాలల విషయంలోనయితే అతను / ఆమె బాలలు ఆగిపోయేంతకాలం వరకు, ప్రత్యేక సదనంలో ఉంచడానికై ఉత్తర్వులు జారీ చేయాలి.

   అయితే నేర స్వభావానికి, ఆ కేసు పరిస్థితులకు సంబంధించిన విషయాల్లో సంతృప్తి చెందిన తరువాత, ఆ ప్రయోజన ఆవశ్యకతను బట్టి, అవి ఉచితమని భావిస్తే ఆ కారణాలను నమోదు చేసి, సదనంలో ఉంచాల్సిన కాలపరిమితిని తగ్గించవచ్చు.

2. ప్రొబేషన్ అధికారి ద్వారా కాని లేక గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థల ద్వారా కానీ, లేక ఇతర విధానాలుగానయినా ఆ జువెనైల్‌కు సంబంధించిన సామాజిక దర్యాప్తు నివేదికను పొందాలి. ఉత్తర్వులను జారీ చేసే ముందు ఆ నివేదికలోని పరిశీలనను పరగణనలోకి తీసుకోవాలి.

3. సబ్‌సెక్షన్ (1) లోని క్లాజు (డి) క్లాజు (ఎఫ్) క్రింద ఉత్తర్వులు జారీ చేసినప్పుడు ఆ బాలల మరియు ప్రజల ప్రయోజనార్థం, ఆ ఆవశ్యకతల కోసం సమితి అవసరమని అభిప్రాయపడినప్పుడు చట్టంతో విరోధంలో ఉన్న బాలలను ఉత్తర్వులో పేర్కొన్న ప్రొబేషన్ అధికారి పర్యవేక్షణలో 3 సంవత్సరాలు మించకుండా నిర్దిష్టపరచిన కాలపరిమితి వరకు ఉండాలని అదనంగా జారీ చేయాలి. చట్టంతో విరోధంలో ఉన్న బాలలపై తగిన పర్యవేక్షణ ఉండడానికి అవసరమని భావించిన షరతులను విధించాలి.

   అయితే ప్రొబేషన్ అధికారి నుండి కాని లేక ఇతర విధంగా కాని సమితి ఎప్పుడైనా నివేదికను అందుకుంటే ఆ నివేదికను పరిశీలించిన తర్వాత పర్యవేక్షణలో ఉన్నంతకాలం చట్టంతో విరోధంలో ఉన్న బాలలు మంచి ప్రవర్తనతో లేరని లేక యోగ్యత గల సంస్థ యొక్క సంరక్షణలో ఉంచబడిన బాలలు మంచి ప్రవర్తతో ఉంటారనే నమ్మకాన్ని కలిగించలేకపోతున్నారని అనిపిస్తే, అలాంటి విచారణ తర్వాత, అతని / ఆమె శ్రేయస్సు కొరకై ప్రత్యేక సదనానికి పంపించాలి.

4. సమితి సబ్‌సెక్షన్ 3, క్రింద పర్యవేక్షణ ఉత్తర్వులను జారీ చేస్తున్నప్పుడు ఆ సందర్భానుసారంగా, జువెనైల్‌కు కాని, తల్లిదండ్రులకు కాని, సంరక్షకులకు కాని లేక ఇతర యోగ్యత కలిగిన వ్యక్తులకు లేక సంస్థలకు కాని, అంటే ఎవరి సంరక్షణ క్రింద ఆ బాలలు ఉంచబడుతున్నారో వారికి ఉత్తర్వులలోని నియమ నిబంధలను వివరించాలి. పర్యవేక్షణ ఉత్తర్వును బాలలకు తల్లిదండ్రులకు, సంరక్షకులకు లేక ఇతర యోగ్యత పొందిన సంస్థలకు సందర్భాన్ననుసరించి ఎవరైనా పూచీలు ఉంటే వారికి మరియు ప్రొబేషన్ అధికారికి వెంటనే ఇవ్వాలి.

సెక్షన్: 16. బాలల విషయంలో జారీ చేయకూడని ఉత్తర్వులు :

ఆ సమయంలో అమలులో ఉన్న ఏ ఇతర శాసనాలలో అందుకు వ్యతిరేకంగా ఏమి ఉన్నప్పటికీ ఏ బాలలు అయినా జరిమానా కట్టలేకపోతే లేక హామీలు ఇవ్వలేకపోతే కూడా మరణశిక్ష లేక జీవిత ఖైదును విధించకూడదు.

సెక్షన్ :17. నేర విచారణ స్మృతిలోని అధ్యాయము 8 క్రింద జరిగే ప్రొసీడింగ్స్‌కు బాలలకు సంబంధించిన విషయాలతో వ్యవహరించడానికి సమర్థత లేదు :

నేర విచారణ స్మృతి 1973 (2 ఆఫ్ 1974) అందుకు వ్యతిరేకంగా ఏమి ఉన్నప్పటికీ నేర విచారణ స్మృతిలోని, అధ్యాయం క్రింద ఏ బాలలపైన అయినా ఎటువంటి ప్రొసీడింగ్స్‌ను ప్రవేశపెట్టకూడదు. ఎలాంటి ఉత్తర్వులను జారీచేయకూడదు.

సెక్షన్ :18. బాలలు మరియు వయోజనులైన వ్యక్తులతోనైనా కలిసి సంయుక్త కార్య వ్యవహారాలు ఉండకూడదు.

1. నేర విచారణ స్మృతి, 1973 (2 ఆఫ్ 1974) లేక ఆ సమయంలో అమలులో ఉన్న ఏ ఇతర శాసనంలో ఏమి ఉన్నప్పటికీ, ఏ బాలలను కూడా బాలలు కాని వ్యక్తితో కలిపి వారిపై నేరం మోపడం కాని లేక సంయుక్త విచారణలు జరపడం కానీ చేయకూడదు.
2. ఒక వేళ బాలలు ఒక నేరంతో నిందితులైనప్పుడు నేర విచారణ స్మృతి 1973 (2 ఆఫ్ 1974) లోని విభాగం 223 లేక ఆ సమయంలో అమలులో ఉన్న ఏ ఇతర శాసనం కోసమైనా, ఉప విభాగం (1) క్రింద నిషేధం ఉన్నందున బాలలు మరియు బాలలు కాని వ్యక్తులతో కలిసి నేరం ఆరోపించడం, విచారణలు చేయడం జరిగినప్పుడు మండలి ఆ నేరాన్ని విచారణ యోగ్యమైనదిగా తీసుకొని ఆ బాలల్ని మరియు ఇతర వ్యక్తులకు సంబంధించి విచారణలను విడివిడిగా జరపాలని నిర్దేశించాలి.

సెక్షన్ :19. నేరము మోపడానికి జతపడిన అనర్హతను తొలగించుట :

1. ఏ ఇతర శాసనంలో ఏమి ఉన్నప్పటికీ నేరం చేసిన బాలలు ఈ చట్టంలోని నిబంధనలను అనుసరించి వ్యవహరించినప్పుడు ఆ చట్టం క్రింద నేరం మోపడంతో జతపడకుండా ఉండడానికి అనర్హత ఉండకూడదు.
2. అప్పీలు చేసుకునేందుకై సమయం గడచిపోయిన తర్వాత లేక ఆ సందర్భానుసారంగా నియమాలలో నిర్ణయించిన సముచితమైన సమయంలో నేరం మోపబడిన కేసుకు సంబంధించిన రికార్డులను తొలగించాలని మండలి ఉత్తర్వులను జారీ చేయాలి.

సెక్షన్ : 20. పెండింగ్ కేసులకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు :

బాలలకు సంబంధించిన ప్రొసీడింగ్స్ అన్నీ ఈ చట్టం ఆ ప్రాంతంలో అమలులోనికి వచ్చిన తేదీ నాటికి ఏదేని న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నప్పుడు ఈ చట్టం ఏమి చెప్పినప్పటికీ ఇంకా ఈ చట్టం అమలులోనికి రానట్లేనని భావించి అదే న్యాయస్థానంలో కొనసాగాలి. ఒకవేళ ఆ న్యాయస్థానం బాలలు నేరం చేసారని కనుగొనినప్పుడు తన పరిశీలనలన్నిటిని నమోదు చేసి, శిక్షను విధించకుండా ఆ బాలల్ని సమితికి పంపించాలి. ఆ సమితి ఈ చట్టం క్రింద జరిగిన విచారణలో బాలలు నేరం చేసారని తెలిసి సంతృప్తి పడినట్లుగానే భావించి, ఉత్తర్వులను జారీ చేయాలి.

సెక్షన్ :21. ఈ చట్టం క్రింద ఏదేని ప్రొసీడింగ్స్‌లో ఉన్న బాలల పేరు మొదలగు వాటి ప్రచురణలపై నిషేధం :

దినపత్రికలలో కాని ఇతర పత్రికలలో కాని వార్తాలేఖలో కానీ లేక దృశ్య ప్రచార సాధనాలలో కానీ చట్టంతో విరోధంలో ఉన్న బాలలకు సంబంధించిన దర్యాప్తు రిపోర్టులలో, బాలల పేర్లను, చిరునామా లేక పాఠశాల లేక ఆ బాలల్ని గుర్తించేందుకు ఉపయోగపడతాయనే ఏ విధమైన వివరాలను వెల్లడించకూడదు. ఆ బాలల యొక్క చిత్రాల్ని ప్రచురించకూడదు.

సెక్షన్ : 22. పారిపోయిన బాలలకు సంబంధించిన నిబంధనలు :

ఆ సమయంలో అమలులో ఉన్న ఏ ఇతర చట్టంలో వ్యతిరేకంగా ఏమి ఉన్నప్పటికీ ప్రత్యేక సదనము లేక పరిశీలక సదనము లేక ఈ చట్టం క్రింద ఎవరి దగ్గరయితే ఉంచబడినాడో ఆ వ్యక్తి సంరక్షణ నుండి

పారిపోయిన చట్టంతో విరోధంలో ఉన్న బాలల యొక్క బాధ్యతను ఏ పోలీసు అధికారి అయినా తీసుకొని వారెంటు లేకుండా, ఆ సందర్భాన్ననుసరించి ప్రత్యేక సదనానికి కాని, లేక పరిశీలన సదనానికి గానీ లేక ఆ వ్యక్తి వద్దకు కాని తిరిగి పంపవచ్చును. పారిపోయిన కారణంగా ఆ బాలలపైన ఎటువంటి ప్రొసీడింగ్స్‌ను ప్రారంభించకూడదు. కానీ, ఏ సమితి ద్వారా అయితే బాలలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయబడినాయో, దానికి సమాచారం ఇచ్చిన తర్వాత, ఆ ప్రత్యేక సదనము లేక పరిశీలక సదనము లేక ఆ వ్యక్తి గాని ఈ చట్టంలోని నిబంధనలకు అనుసరించి ఆ బాలలకు సంబంధించి అవసరమని భావించిన చర్యలను తీసుకోవచ్చు.

సెక్షన్ : 23. పిల్లలపై క్రూరత్వాన్ని చూపించినందుకు శిక్ష :

పిల్ల / పిల్లవానిపై బాధ్యత కలిగిన ఏ వ్యక్తి అయినా ఆ బాలలకు అవసరమైన శారీరక, మానసిక బాధ కలిగే విధంగా దౌర్జన్యం చేసినా, వదలిపెట్టినా లేక కావాలనే నిర్లక్ష్యం చేసినా లేక ఆవిధంగా దౌర్జన్యం చేయబడటానికి, వదలిపెట్టబడడానికి, ప్రదర్శింపబడటానికి లేక నిర్లక్ష్యం చేయబడడానికి కారణమైనా లేక ఆవిధంగా అయ్యేట్లుగా వ్యవహరించినా, వారికి ఆరు నెలల వరకు జైలుశిక్ష లేక జరిమానా లేక రెండూ విధించబడతాయి.

సెక్షన్ : 24. బాలల్ని లేక పిల్లలను భిక్షమెత్తుకోవడానికి నియమించడం :

1. ఏ వ్యక్తి అయినా బాలల్ని భిక్షమెత్తించే ఉద్దేశ్యంతో నియమించినా లేక ఉపయోగించినా లేక భిక్షమెత్తడానికి కారణమైన వారికి మూడు సంవత్సరాల వరకూ జైలు శిక్ష మరియు జరిమానా కూడా విధించబడుతుంది.
2. పిల్ల / పిల్లవాని బాధ్యత లేక నియంత్రణ కలిగి ఉన్న ఏ వ్యక్తి అయినా సబ్‌సెక్షన్ (1) క్రింద శిక్షార్హత కలిగిన నేరాన్ని చేయడానికి ప్రోత్సాహించినా సంవత్సరం వరకు జైలుశిక్ష మరియు జరిమానా విధించబడుతుంది.

సెక్షన్ : 25. పిల్లలకు మత్తుపానీయాలు లేక మత్తుమందులు లేక సైకోట్రాపిక్ పదార్థాలు ఇచ్చినచో జరిమానా :

ఏ వ్యక్తి అయినా పిల్లలకు బహిరంగ ప్రదేశాలలో మత్తుపానీయాలు లేక మత్తుమందు లేక సైకోట్రాపిక్ పదార్థాలు ఇచ్చినా లేక ఇవ్వడానికి కారణమైనా వారికి మూడు సంవత్సరాల వరకు జైలుశిక్ష మరియు జరిమానా కూడా విధించబడుతుంది. అర్హత కల వైద్యుల నిర్ణయం మేరకు లేక ఏదైనా వ్యాధి ఉన్న సందర్భంలో ఇది వర్తించదు.

సెక్షన్ :26. పిల్లలను ఉద్యోగంలో పెట్టుకుని వారి శ్రమను దోపిడీ చేయడం:

ఏ వ్యక్తి అయినా పిల్ల / పిల్లవాడిని ప్రమాదకరమైన పనులలో ఉంచి వెట్టి చాకిరీ చేయించుకుంటూ మరియు వారికి జీతం ఇవ్వకుండా ఆపి లేక వారి సంపాదనను తన సొంతానికి ఉపయోగించుకుంటే 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష మరియు జరిమానా కూడా విధించబడుతుంది.

సెక్షన్ :27. ప్రత్యేక నేరాలు :

సెక్షన్స్ 23, 24, 25 మరియు 26 క్రింద శిక్షార్హమైన నేరాలు విచారణ యోగ్యమైనవి.

సెక్షన్ : 28. ప్రత్యామ్నాయ శిక్షలు :

ఏదేని చర్య చేయడం వలన గాని ఆచర్య లోపం వలన గాని, ఈ చట్టం క్రింద నేరంగా పరిగణించబడితే లేదా వేరేదైనా కేంద్ర లేక రాష్ట్ర ప్రభుత్వం చట్టాల క్రింద నేరంగా లెక్కలోకి వస్తే, ఇతర చట్టాలలో ఏమున్నప్పటికీ, నేటి నిరూపణ అయిన అపరాధి శిక్షార్హుడు. అయితే ఏ చట్టం క్రింద తీవ్రతరమైన శిక్ష వేయబడుతుందో అది మాత్రమే ఇటువంటి సందర్భాలకు వర్తిస్తుంది.

అధ్యాయం - 3

సంరక్షణ మరియు రక్షణ అవసరమైన బాలలు

సెక్షన్ : 29. బాలల సంక్షేమ సమితి :

1. అఫీషియల్ గెజిట్‌లో నోటిఫికేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం, ఒక జిల్లా లేదా కొన్ని జిల్లాలకు కలిపి అందులో అంటే, నోటిఫికేషన్‌లో తెలిసిన విధంగా ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ మంది బాలల సంక్షేమ సమితులను ఏర్పరచవచ్చు. ఇవి నిర్వర్తించవలసిన విధులు, వీటికి ఉండే అధికారాలు, ఈ చట్టంలో చెప్పినవిధంగా ఉంటాయి.
2. ఈ సమితిలో ఒక అధ్యక్షుడు నలుగురు సభ్యులు ఉంటారు. ఈ పదవులకి అర్హులని భావించి నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. అందులో కనీసం ఒక స్త్రీ సభ్యురాలు మరియు పిల్లల వ్యవహారాలలో నిపుణులైన ఒక వ్యక్తి సభ్యులుగా ఉండాలి.
3. సమితి సభ్యుల అర్హత మరియు నిర్ణీత పదవీకాలం నిర్ణయించిన విధంగానే ఉంటుంది.
4. తగిన విచారణ తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఏ సభ్యులకైనా పదవి నుండి తీసివేయడానికి కారణాలు:
    1. ఈ చట్టం క్రింద లభించిన అధికారాలను దుర్వినియోగం చేసినట్లయితే.
    2. నీతి బాహ్యతతో కూడిన నేరాలతో ప్రమేయం కలిగి శిక్షార్హులై ఉంటే, అటువంటి శిక్షను వెనుకకు తీసుకోకపోతే లేక ఆ వ్యక్తి నేరానికి సంబంధించి పూర్తి మాఫీ మంజూరు కాకపోతే.
    3. సమితి కార్యక్రమాలకు వరుసగా మూడు నెలలపాటు హాజరు కాకుండా ఉంటే లేదా సంవత్సరంలో నాలుగింట మూడు వంతులు సమితి సమావేశాలలో పాల్గొనకపోతే, అటువంటి సభ్యుని పదవినుండి తొలగించవచ్చు.
5. ఈ సమితి మేజిస్ట్రేట్ బెంచ్‌గా వ్యవహరిస్తూ నేరవిచారణ స్మృతి 1973 (2, 1974) ప్రకారం ఒక మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ లేదా సందర్భానుసారంగా ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు ఉండే అధికారాలను కలిగి ఉంటుంది.

సెక్షన్ : 30. సమితికి సంబంధించిన పద్ధతి మొదలగునవి :

1. సమితి, నిర్ణీత సమయాల్లో కలుసుకొని, ఆ సమావేశాలలో వ్యవహార లావాదేవీలకు సంబంధించి

నిర్ణీత కార్యవిధాన నియమావళిని పాటించాలి.

2. సమితి సమావేశాలలో లేనప్పుడు, సంరక్షణ మరియు రక్షణ అవసరమైన పిల్లలను సురక్షితమైన ప్రదేశంలో ఉంచడానికి, సమితిలోని ఏ ఒక్క సభ్యుని ముందైనా ప్రవేశపెట్టవచ్చు.

3. మధ్యంతర లేక తుది పరిష్కారాలు చేసేటప్పుడు సమితి సభ్యుల మధ్య ఏమైనా అభిప్రాయ బేధాలు కలిగిన సందర్భాలలో మెజారిటీ అభిప్రాయం అమలవుతుంది. అటువంటి మెజారిటీ లేనప్పుడు, అధ్యక్షుని అభిప్రాయం ఖరారు అవుతుంది.

4. సబ్‌సెక్షన్ (1) లోని నిబంధనలకు లోబడి సమితిలోని ఏ సభ్యుడు / సభ్యురాలు హాజరు కాలేకపోయినప్పటికీ సమితి పని చేయవచ్చు. ప్రొసీడింగ్స్ జరిగిన ఏ దశలోనైనా ఏ సభ్యుడు / సభ్యురాలు కేవలం హాజరు కాలేకపోయారనే ఒకే ఒక కారణం చేత సమితి చేసిన ఉత్తర్వులు చెల్లకుండా ఉండరాదు.

సెక్షన్ : 31. సమితి అధికారాలు :

1. పిల్లల కనీస అవసరాలు తీర్చి, వారి హక్కులను కాపాడుతూ వారికి సంబంధించిన సంరక్షణ, రక్షణ, ఆదరణ, పురోభివృద్ధి మరియు పునరావాసము వంటి విషయాలపై కడపటి నిర్ణయం సమితిదే.

2. ఒక ప్రాంతానికి ఏర్పాటు చేయబడిన సమితికి, ఈ చట్టంతో స్పష్టంగా విబేధించినప్పుడు తప్ప, ఆ సమయంలో అమలులో ఉన్న ఏ ఇతర శాసనంలో ఏమి ఉన్నప్పటికీ, పిల్లల రక్షణ మరియు సంరక్షణకు సంబంధించిన అన్ని వ్యవహారాలను పరిశీలించడానికి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.

సెక్షన్ : 32. సమితి ముందు హాజరు పరచడం :

1. క్రింద పేర్కొనబడిన ఏ వ్యక్తి అయినా, రక్షణ మరియు సంరక్షణ అవసరమైన పిల్లలను సమితి ముందు హాజరు పరచవచ్చు

   ఎ. ఎవరైనా పోలీసు అధికారి లేదా ప్రత్యేక జువెనైల్ పోలీస్ యూనిట్ లేదా, నిర్దేశించబడిన పోలీస్ అధికారి.

   బి. ప్రభుత్వ ఉద్యోగి.

   సి. చైల్డ్‌లైన్ లేదా రిజిష్టర్ చేయబడిన స్వచ్ఛంద సంస్థ లేక రాష్ట్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థ లేక ఏ ఇతర సంస్థ అయినా,

   డి. ఎవరైనా సామాజిక కార్యకర్తగాని, సామాజిక స్పృహ ఉన్న పౌరుడు గాని, రాష్ట్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందినవారు.

   ఇ. ఆ పిల్ల / పిల్లవాడు స్వయంగా ఆ సమితి ముందుకు రావచ్చు.

2. విచారణ జరిగే / జరుగుతున్న సమయంలో పోలీసులకు నివేదించవలసిన విధము గురించి, సమితికి తెలుపవలసిన పద్ధతి, సంబంధిత పిల్లలను బాలల సదనాలకు పంపవలసిన విధానము గురించి ఈ చట్టానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నియమాలను రూపొందించాలి.

సెక్షన్ : 33. విచారణ :

1. విభాగం 32 క్రింద నివేదిక అందగానే, సమితి కాని, పోలీసు అధికారి కానీ, ప్రత్యేక జువెనైల్ పోలీస్ యూనిట్ కానీ, నియమింపబడిన పోలీస్ అధికారి కాని, నిర్దేశించిన విధంగా విచారణ చేయాలి. సమితి తనంతట తానుగా కాని లేదా విభాగం 32 లోని ఉపవిభాగం (1) క్రింద చెప్పబడిన ఏ వ్యక్తి లేదా ఏ ప్రతినిధి ద్వారా వచ్చిన నివేదిక ఆధారంగా ఆ పిల్ల లేక పిల్లవానిని బాలలు సదనమునకు పంపేందుకు సామాజిక కార్యకర్తచే కాని బాలల సంక్షేమ అధికారిచే కాని విచారణ జరిపించడానికి ఉత్తర్వులు జారీ చేయవచ్చు.
2. ఈ సెక్షన్ క్రింద విచారణ నివేదిక అందిన నాలుగు నెలల లోపున లేదా సమితి నిర్ణయించిన ఇంకా తక్కువ కాల పరిమితిలో పూర్తికావాలి. అయితే ఈ విచారణ నివేదికను సమర్పించే గడువు కాలాన్ని సమితి పరిస్థితులను ఆ కారణాలను లిఖిత పూర్వకంగా నమోదు చేసిన తర్వాత నిర్ధారించవచ్చు.
3. విచారణ పూర్తయిన తరువాత, సంబంధిత కాలానికి గాని బాలికకు గాని కుటుంబం లేక ఇతర ఆధారాలు లేవని, సమితి అభిప్రాయపడినప్పుడు ఆ పిల్లలను బాలల సదనంలో కాని ఆశ్రయ సదనంలో గాని ఉండేందుకు సమ్మతించవచ్చు. అయితే ఈ గడువు వారికి ఇతర పునరావాసం లభించే వరకైనా లేదా వారికి పద్దెనిమిది సంవత్సరాలు వచ్చే వరకైనా మాత్రమే వర్తిస్తుంది.

సెక్షన్ : 34. బాలల సదనాలు :

1. రాష్ట్ర ప్రభుత్వం తనంత తానుగా గాని, ఇతర స్వచ్ఛంద సంస్థల సహాయంతో గాని బాలల సదనాలను ఒక జిల్లాలో గాని కొన్ని జిల్లాలకు కలిపి గాని స్థాపించి, నిర్వహించుకోవచ్చు. ఇవి విచారణ జరుగుతున్న సమయంలో పిల్లల రక్షణ, విచారణ పూర్తయిన తరువాత వారి సంక్షేమం, విద్య, పునరావాసం కొరకు పనిచేయాలి.
2. ఈ చట్టాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం బాలల సదనాలను ఒక జిల్లాలో గాని కొన్ని జిల్లాలకు కలిపి గాని స్థాపించి, నిర్వహించవచ్చు ఇవి విచారణ జరగుతున్న సమయంలో పిల్లల రక్షణ, విచారణ పూర్తయిన తరువాత వారి సంక్షేమ, విద్య, పునరావాసం కొరకు పని చేయాలి.
3. ఈ చట్టాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం బాలల సదనాల నిర్వహణ వాటి ప్రమాణాలు, అవి అందించవలసిన సేవల గురించి నియమాలను రూపొందించుకోవాలి. అదేవిధంగా బాలల సదనాలకు ఇచ్చిన యోగ్యతా పత్రాన్ని రద్దు చేయడానికి లేదా స్వచ్ఛంద సంస్థకు ఇచ్చిన గుర్తింపును తొలగించడానికి నియమావళిని తయారు చేయాలి.

సెక్షన్ : 35. తనిఖీ :

1. రాష్ట్ర ప్రభుత్వం బాలల సదనాల తనిఖీ నిమిత్తం సమితులను నియమించవచ్చు. (ఇక ముందు వీటిని సమితులు అని వ్యవహరిస్తారు) ఇవి మొత్తం రాష్ట్రానికి గాని, ఒక జిల్లా లేదా పట్టణానికి గాని, సందర్భానుసారంగా, నిర్ణయించిన కాలానికి కొన్ని ప్రయోజనాల కొరకు పని చేస్తాయి.
2. రాష్ట్రానికి లేక జిల్లాకు లేక పట్టణానికి సంబంధించిన ఈ తనిఖీ సమితిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, స్థానిక అధికారులు, సమితి లేక స్వచ్ఛంద సంస్థల వ్యక్తులు మరియు వైద్య నిపుణులు గాని సామాజిక కార్యకర్తలు గాని నిర్ణయించిన విధంగా సభ్యులూ ఉంటారు.

సెక్షన్ : 36. సామాజిక తనిఖీ :

కేంద్ర ప్రభుత్వం గాని, రాష్ట్ర ప్రభుత్వం గాని బాలల సదనాల పనితీరును నిర్ణీత సమయాల్లో నిర్ధేశించబడిన వ్యక్తులతో మరియు సంస్థలతో పరిశీలించాలి.

సెక్షన్ : 37. ఆశ్రయ సదనాలు :

1. సమర్ధత ఉండి, గుర్తింపు, పేరు ఉన్న స్వచ్ఛంద సంస్థలకు, పిల్లలకు రక్షణ కల్పించే నిమిత్తం ఆశ్రయ సదనాలు నిర్మించడానికి ప్రభుత్వం సహాయం అందించవచ్చు.
2. సబ్‌సెక్షన్ 1 లో ఆశ్రయ సదనాలు శీఘ్రంగా సహాయం కావలసిన పిల్లలకు తాత్కాలికంగా వదలివెళ్ళే కేంద్రంగా వ్యవహరించవచ్చు. సెక్షన్ 32 లోని ఉప విభాగం (1) చెప్పబడిన ఏ వ్యక్తి అయినా ఈ సత్వర సహాయం కోసం పిల్లలను ఆశ్రయ సదనాలకు తీసుకురావచ్చు.
3. నియమాలు నిర్ధేశించిన ప్రకారం కావలసిన సదుపాయాలన్నీ ఈ ఆశ్రయ సదనాలలో ఉండాలి.

సెక్షన్ : 38. బదిలీ :

1. విచారణ సమయంలో సంబంధిత బాలుడు / బాలిక గాని సమితి అధికార పరిధికి బయటనున్న ప్రాంతానికి చెందినవారని తెలిస్తే సమితి ఆ బాలుడు / బాలికకు చెందిన వ్యవహారాలను సముచిత అధికారికి బదిలీ చేయవచ్చు.
2. ఈ విధంగా బదిలీ చేయబడ్డ బాలుడు / బాలికను తాత్కాలికంగా నివసించిన సదనంలోని ఉద్యోగులే సంబంధిత సదనానికి తోడ్కొని వెళ్లాలి.
3. రాష్ట్ర ప్రభుత్వం బదిలీ కోసం కావలసిన మొత్తం సొమ్మును సంబంధిత బాలుడు / బాలికను ఇవ్వడానికి తగిన నిబంధనలను రూపొందించాలి.

సెక్షన్ : 39. యధాస్థితికి చేర్చడం :

1. ఏదేని బాల సదనంగాని, ఆశ్రయ సదనం ప్రధాన లక్ష్యం. పిల్లలను జాగ్రత్తగా కాపాడటం, వారిని పూర్వస్థితికి చేర్చడం.
2. బాలల సదనం గాని ఆశ్రయ సదనం గాని తమ ఆశ్రయంలో ఉన్న కుటుంబ వాతావరణం తాత్కాలికంగా కాని, శాశ్వతంగా కాని కోల్పోయిన పిల్లలకు, సంరక్షణ, పూర్వస్థితి కల్పించటం కోసం ప్రయత్నించాలి.
3. సంరక్షణ, ఆశ్రయం అవసరం ఉన్న పిల్లలను తిరిగి వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వద్దకు గాని, యోగ్యుడైన ఇతర వ్యక్తికి గాని, యోగ్యత ఉన్న సంస్థకు గాని అప్పగించడానికి, వారికి భవిష్యత్తుకు తగిన సూచనలు ఇవ్వడానికి సమితికి అధికారాలు ఉంటాయి.

అధ్యాయం - 4

పునరావాసం మరియు సామాజిక పునరేకీకరణ

బాలల సదనాలు లేక శరణాలయాల ముఖ్యోద్దేశ్యము వారి వద్ద ఉన్న పిల్లల సంరక్షణ మరియు వారిని స్వంత తల్లిదండ్రుల వద్దకు గాని, దత్తత తీసుకున్న తల్లిదండ్రుల దగ్గరకు కాని పెంపుడు తల్లిదండ్రుల వద్దకు గాని చేర్చడం.

సెక్షన్ : 40. పునరావాసము మరియు సామాజిక పునరేకీకరణ ప్రక్రియ

పిల్లల పునరావాసము వారిని బాలల సదనము కాని ప్రత్యేక హోమ్‌లలో చేర్చినప్పటి నుండి మొదలవుతుంది. ఈ కార్యక్రమము కొనసాగించడానికి చేపట్టే ప్రక్రియలు (1) దత్తత (2) పెంపకానికి ఇవ్వడం (3) సంరక్షకులను నియమించడానికి ప్రయత్నించడం మరియు (4) పిల్లలను హోమ్‌ల నుండి భవిష్యత్తు రక్షణకై ఇతర సంస్థలకు పంపించటం వంటి కార్యక్రమాల ద్వారా ముందుకు సాగుతుంది.

సెక్షన్ : 41. దత్తత :

1. పిల్లలకు సంరక్షణ మరియు రక్షణ కల్పించడం వారి కుటుంబాల ప్రాథమిక బాధ్యతగా ఉండాలి.
2. అనాధలు, విడిచి పెట్టబడ్డ పిల్లలు, సంస్థల పద్ధతుల వలన గాని సంస్థేతర విధానాల వలన గాని నిర్లక్ష్యం లేదా దుర్వినియోగానికి గురయిన పిల్లల పునరావాసం కొరకు దత్తత అవలంబించాలి.
3. దత్తత స్వీకరించడం పైన రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేసిన వివిధ మార్గదర్శక సూత్రాలలోని నిబంధనలను దృష్టిలో ఉంచుకొని మండలికి పిల్లలను దత్తతకు ఇవ్వడానికి, అవసరమైన దర్యాప్తు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేసిన మార్గదర్శక సూత్రాలను అనుసరించాలి.
4. అనాధ బాలల సదనాలు గాని ప్రభుత్వం అనాధ పిల్లల కోసం నడిపే సంస్థలు గాని సబ్‌సెక్షన్ (3) క్రింద జారీ చేయబడిన మార్గదర్శక సూత్రాలననుసరించి దత్తత కేంద్రాలుగాను, అనాధ బాలల దత్తత కొరకై సూక్ష్మముగా పరిశీలించి నిర్ణయాలు చేసే కేంద్రాలుగాను వ్యవహరిస్తాయి.
5. పిల్లలను దత్తతకు ఇవ్వడానికి వీలులేని పరిస్థితులు.
   ఎ. వదలివేయబడ్డ పిల్లల విషయంలో, కమిటీలోని ఇద్దరు సభ్యులు వారు దత్తతకు చట్టప్రకారం ఎటువంటి అడ్డంకులు లేకుండా స్వతంత్రులుగానే ఉన్నారని ప్రకటించేవరకు.
   బి. అప్పగించబడిన పిల్లల విషయంలో తల్లిదండ్రులు పునరాలోచనకు నియంత్రించబడ్డ రెండు నెలల గడువు తీరేవరకు, మరియు
   సి. అర్థం చేసుకుని సమ్మతిని తెలియజేయగలిగే పిల్లల విషయంలో వారి అంగీకారం లేని పక్షంలో.
6. పిల్లలను దత్తతకు ఇవ్వడానికి మండలి అంగీకరించే పరిస్థితులు
   ఎ. ఒంటరిగా జీవిస్తున్న తల్లి లేక తండ్రికి దత్తత ఇవ్వడం.
   బి. అదే లింగానికి చెందిన స్వంత కూతుళ్ళు గాని, కొడుకులు గాని ఎంతమంది ఉన్నా తల్లిదండ్రులు కోరినట్లయితే అదే లింగానికి చెందిన పిల్లలను దత్తత ఇవ్వడం.

సెక్షన్ : 42. తాత్కాలిక సంరక్షణ :

1. చివరకు దత్తత కోసం నిర్ణయించిన శిశువులకు తాత్కాలిక ఆవాసం కోసం సంరక్షకుల రక్షణ కోరవచ్చు.
2. సంరక్షకుల వద్ద పిల్లలను కొంత కాలం గాని, ఎక్కువకాలం గాని పరిస్థితులను బట్టి ఉంచవచ్చు. ఇక్కడ పిల్లల స్వంత తల్లిదండ్రులు వారిని చూచి వెళ్ళవచ్చు. పునరావాసం తరువాత ఈ పిల్లలు తమ స్వంత ఇళ్లకు కూడా వెళ్ళవచ్చు.
3. ఈ రక్షణ కొరకై రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలను రూపొందించవచ్చు.

సెక్షన్ : 43. పిల్లల భవిష్యత్తు కొరకు బాధ్యత వహించే వ్యక్తులు / సంస్థలను గుర్తించడం.

1. బాధ్యత తీసుకునే కార్యక్రమాలు పిల్లల జీవన ప్రమాణాలను పెంపొందించే దృష్టితో కుటుంబాలకు, బాలల సదనాలకు మరియు ప్రత్యేక హోమ్‌లకు అనుబంధ సహకారాన్ని అందిస్తాయి. ఇది పిల్లల వైద్య, పోషకాహార అవసరాలు, విద్య మరియు ఇతర సౌకర్యాలు కలిగించడానికి ఉపయోగిస్తాయి.
2. పిల్లల భవిష్యత్తు బాధ్యత తీసుకొనే కార్యక్రమాలను వ్యక్తుల ద్వారా గాని, సంస్థల ద్వారా గాని, సంఘాల ద్వారా గాని చేపట్టడానికి పథకాలను రూపొందించే ఆదేశ సూత్రాలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించవచ్చు.

సెక్షన్ : 44. భవిష్యత్తు రక్షణకై నియుక్తమైన సంస్థలు :

రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టం క్రింద రూపొందించిన నియమాల ద్వారా.

ఎ) భవిష్యత్తు రక్షణ కోసం ఉద్దేశించబడిన సంస్థలు, వాటి బాధ్యతలు, ఆ సంస్థలు గుర్తింపు కోసం ఆదేశ సూత్రాలను తయారు చేయవచ్చు.

బి) పరిణతి చెందని బాలలు లేదా పిల్లలు బాలల సదనాలు లేదా ప్రత్యేక హోమ్‌ల నుండి బయటకు వచ్చిన తర్వాత వారు భవిష్యత్తులో నిజాయితీగా, కష్టపడి పనిచేస్తూ సంఘానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దగల సామర్థ్యంతో, తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ సంస్థలు, పథకాలు రూపొందించడానికి అవసరమైన నిబంధనలను ఈ చట్టం ద్వారా రూపొందించవచ్చు.

సి) ప్రభుత్వం నియమించిన ప్రొబేషన్ అధికారి గాని ఏ ఇతర అధికారి గాని బాలల సదనాలు లేక ప్రత్యేక హోమ్‌ల నుండి బయటకు వచ్చిన ప్రతి పిల్లగాని, పిల్లవాడి ప్రత్యేక అవసరాలను బట్టి వారి భవిష్యత్‌కు అవసరమయ్యే సంరక్షణ గురించి నివేదిక తయారు చేయడానికి మరియు భవిష్యత్తు రక్షణకై ఉద్దేశించిన సంస్థలలో చేరిన తర్వాత ఆ పిల్ల / పిల్లవాడి ప్రగతి ఏవిధంగా ఉన్నది, సంరక్షణ ఎట్లా ఉన్నది అన్న విషయాలపై నివేదిక తయారుచేయడానికి ఈ చట్టంలోని నియమాలు తోడ్పడతాయి.

డి) పైన చెప్పిన సంస్థలు నడపవలసిన ప్రమాణాలు, అవి అందించవలసిన సేవలు, వాటికి సంబంధించిన సూత్రాలను ఈ చట్టం ద్వారా ప్రభుత్వం రూపొందించవచ్చు.

ఇ) బాలలు భవిష్యత్తు కొరకు అవసరమైన ఏ ఇతర విషయాల గురించైనా ఆదేశసూత్రాలు ఈ చట్టం ద్వారా తయారుచేయవచ్చు. అయితే ఇటువంటి భవిష్యత్తు రక్షణకు ఉద్దేశించిన సంస్థలలో పిల్లలు మూడు సంవత్సరాలకు మించి ఉండకూడదు. ఇంకా పదిహేడేళ్ళు దాటి, పద్దెనిమిదేళ్ళకు మించని పిల్లలు ఈ సంస్థలలో ఇరవై సంవత్సరాలు వచ్చేవరకు ఉండవచ్చు.

సెక్షన్ : 45. అనుసంధానాలు మరియు సమన్వయం :

పిల్లల యొక్క పునరావాసం మరియు సామాజిక పునరేకీకరణ సులభతరం చేయడానికి వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర, కార్పొరేట్ మరియు ఇతర ప్రజాసంస్థల సమర్థవంతమైన అనుసంధానం ఏర్పడేందుకై రాష్ట్ర ప్రభుత్వం నియమాలను రూపొందించాలి.

అధ్యాయం - 5

సెక్షన్ : 46. పిల్లల తల్లిదండ్రులు లేక సంరక్షకుల హాజరు :

ఈ చట్టంలోని ఏదైనా నిబంధనల క్రింద, సముచిత అధికారి ముందుకు పిల్లలను తీసుకుని వచ్చినప్పుడు వారికి సంబంధించిన ప్రొసీడింగ్స్ జరిగేటప్పుడు, పిల్లల యొక్క బాధ్యత కలిగిన తల్లిదండ్రుల లేక సంరక్షకుల హాజరు అవసరమని భావించినప్పుడు అందుకై ఆదేశించవచ్చు.

సెక్షన్ : 47. పిల్లల హాజరు కానవసరం లేని వీలు కల్పించడం :

విచారణ జరుగుతున్న ఏ దేశంలోనైనా, సంబంధిత పిల్లలు హాజరు కానవసరం లేదని, సముచిత అధికారి భావించినప్పుడు, వారికి ఆ వీలు కల్పించి, విచారణ కొనసాగించవచ్చు.

సెక్షన్ :48. ప్రమాదకరమైన వ్యాధితో బాధపడుతున్న పిల్లలను లేదా జువెనైల్‌ను ఆమోదిత స్థలంలో నిర్బంధించడం మరియు భవిష్యత్తులో వారి దావా పరిష్కారం :

1. ఈ చట్టం క్రింద సముచిత అధికారి సమక్షానికి తీసుకురాబడిన పిల్లలు దీర్ఘకాలిక వైద్యం అవసరమైన వ్యాధితో బాధపడుతున్నారని తెలిసినా లేక చికిత్స ద్వారా నయమయ్యే శారీరక లేక మానసిక సమస్యలతో బాధపడుతున్నారని అనిపిస్తే ఈ చట్టం క్రింద రూపొందిన నియమాల ప్రకారం ఆమోదిత స్థలంగా గుర్తింపు పొందిన చోటుకి, చికిత్స జరుగుతున్నంత కాలం వారిని పంపించాలి.
2. కుష్ఠువ్యాధి, లైంగికంగా సంక్రమించే వ్యాధులు, హెపటైటిస్ బి, నిర్ధారింపబడిన టి.బి ఇంకా ఇతర వ్యాధులు, లేక మతిస్థిమితం లేకపోవడం వంటి వాటితో బాధపడుతున్న పిల్లలతో, వివిధ ప్రత్యేక నిర్దేశక సేవా సంస్థల ద్వారా లేక సంబంధిత చట్టాల క్రింద ప్రత్యేకంగా వ్యవహరించాలి.

సెక్షన్:49. వయసుకు సంబంధించిన భావన (కాదని ఋజువగువరకు) మరియు నిర్ధారణ :

1. ఈ చట్టంలోని నిబంధనల క్రింద సముచిత అధికారి ముందుకు తీసుకొని వచ్చిన వ్యక్తి (సాక్ష్యం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో వచ్చిన వ్యక్తి తప్ప) బాలలు అని ఆ అధికారికి అనిపిస్తే, ఆ వ్యక్తి వయసుకు సంబంధించి తగిన విచారణ జరపాలి. దానికోసమై అవసరమైన సాక్ష్యాన్ని తీసుకొని (అఫిడవిట్ కాకుండా) ఆ వ్యక్తులు బాలలా కాదా అనే పరిశీలనలను నమోదు చేసి వారి వయస్సు సుమారుగా ప్రకటించాలి.
2. సముచిత అధికారి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత, సంబంధిత వ్యక్తి బాలలు కారని, సాక్ష్యాల ద్వారా తెలిసినప్పుడు ముందు ఇచ్చిన ఉత్తర్వులు చెల్లకుండా ఉండకూడదు. సముచిత అధికారి సమక్షంలో నమోదు చేసిన వయస్సు, ఈ చట్ట ప్రయోజనాల కోసం ఆ వ్యక్తి నిజమైన వయస్సుగా పరిగణించబడుతుంది.

సెక్షన్ : 50. అధికార పరిధి బయట ఉన్న బాలుడు / బాలికను పంపుట :

సముచిత అధికారి ముందు ప్రవేశపెట్టబడిన పిల్లలు ఆ అధికారి పరిధిలో లేకుంటే, వారు తగిన విచారణ తరువాత ఉచితమని భావిస్తే ఆ బాలుడు / బాలికను వెనుకకు తీసుకోవడానికి అంగీకరించిన చుట్టము దగ్గరకు గాని, వారి బాధ్యత వహించడానికి ఇష్టపడ్డ ఏ ఇతర వ్యక్తి ఇంటికి గాని, వారు ఆ పిల్లలకు కావలసిన సంరక్షణ మరియు రక్షణ అందించగలరని సంతృప్తి చెందితే, అటువంటి వ్యక్తులు ఆ సముచిత అధికారి పరిధిలోకి రాకున్నా సరే ఆ పిల్లలను అక్కడికి పంపే అధికారం ఆ అధికారికి ఉంటుంది. మరియు ఆ విధంగా పంపబడిన పిల్లలు లేదా జువెనైల్‌లకు సంబంధించి తరువాత ఏ విషయాలు పరిశీలించాలన్నా అక్కడి పరిధికి నియుక్తమైన అధికారికి సమానమైన అధికారాలు అంటే ముందు జారీ చేసిన ఆజ్ఞ వారి ఆధ్వర్యంలోనే అన్న విధంగా ఉంటుంది.

సెక్షన్ : 51. నివేదికలను రహస్యంగా ఉంచుట :

సముచిత అధికారి పరిశీలనలో ఉన్న ప్రొబేషన్ అధికారి నివేదిక గాని, సామాజిక కార్యకర్త నివేదిక గాని, రహస్యంగా ఉంచాలి. అయితే సముచిత అధికారి ఉచితమని భావిస్తే ఆ నివేదికలోని విషయాలను పిల్లలకు, లేదా వారి తల్లిదండ్రులకు గాని సంరక్షకులకు గాని తెలియపరచి వారి నుండి ఆ పిల్లలు లేదా వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు ఆ నివేదికలోని విషయాలపై సాక్ష్యాధారాలు చూపించడానికి అవకాశం ఇవ్వవచ్చు.

సెక్షన్ : 52. అప్పీళ్ళు :

1. ఈ విభాగంలోని ఏర్పాట్లకు అనుగుణంగా, సముచిత అధికారి జారీ చేసిన ఆజ్ఞల వలన నష్టపడిన ఏ వ్యక్తి అయినా ఆజ్ఞ జారీ చేసిన 30 రోజుల లోపున సెషన్స్ కోర్టులో అప్పీలు వేసుకోవచ్చు.

అయితే 30 రోజుల గడువు దాటిన తరువాత కూడా సెషన్స్ కోర్టు విజ్ఞప్తిదారు తగిన కారణాల వలనే గడువు లోపల అప్పీలు వేయలేకపోయాడని భావిస్తే అటువంటి అప్పీలును అంగీకరించవచ్చు.

2. అప్పీలుకు వెళ్ళకూడని సందర్భాలు
   ఎ. నేరం చేసాడని ఆరోపించబడిన బాలలను మండలి నిర్దోషిగా నిర్ణయించి విడుదల ఉత్తర్వులు జారీ చేసినప్పుడు
   బి. సమితి పరిశీలనలో ఒక వ్యక్తి నిర్లక్ష్యం చేయబడిన వారు బాలలు కారని తేలినప్పుడు ఆవిధంగా ఉత్తర్వులు జారీ చేసినప్పుడు
   సి. సెషన్స్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై ఈ విభాగం క్రింద రెండవ అప్పీలు ఉండదు.

సెక్షన్ : 53. పునర్విమర్శ :

ఏ సమయంలోనైనా హైకోర్టు స్వయంగా కానీ, ఆ విషయంపై అందిన దరఖాస్తు ననుసరించి గాని, ముందు జరిగిన ప్రొసీడింగ్స్ (వ్యవహారాలు) నివేదికను, దాని చట్టబద్ధత, యుక్తత పరిశీలించడానికి అటువంటి నివేదిక ఆధారంగా సముచిత అధికారి గానీ, సెషన్స్ కోర్టు గాని అప్పటికీ ఆజ్ఞలు జారీ చేసినప్పటికీ అదే విషయమై హైకోర్టు అర్హమని భావించిన విధంగా ఆజ్ఞలు జారీచేయవచ్చు. అయితే హైకోర్టు అటువంటి ఆజ్ఞలు, ఈ విభాగాన్ని అనుసరించి, ఏ వ్యక్తికైనా హానికరంగా ఉండేదైతే వారికి వారి పక్షమున విన్నవించడానికి తగిన ఆవకాశము ఇవ్వకుండా జారీ చేయరాదు.

సెక్షన్ : 54. విచారణలకు, అప్పీళ్ళకు, పునర్విమర్శకు పద్ధతులు :

1. విచారణలు జరిగే హాజరు కావడానికి సమన్లు గురించి నేర శిక్షాస్మృతి, 1973 (2 ఆఫ్ 1974) లో నిర్వహించిన విధి విధానమునే, సముచిత అధికారి ఈ చట్టం ఏర్పాట్ల ప్రకారం విచారణ నిర్వహించే సమయంలో అనుసరించాలి. ఈ పద్ధతి చట్టంలో ప్రత్యేకంగా వేరేవిధంగా తప్ప అన్ని సందర్భాలకు వర్తిస్తుంది.
2. ఈ చట్టంలో వేరేవిధంగా పేర్కొంటే తప్ప, అప్పీళ్ళు గాని పునర్విమర్శకు గాని అనుసరించవలసిన విధి విధానం, సాధ్యమైనంతవరకు, నేర శిక్షాస్మృతి, 1973 (2 ఆఫ్ 1974) లో చెప్పిన విధంగా ఉండాలి.

సెక్షన్ : 55. ఉత్తర్వులు సవరించడానికి అధికారాలు :

1. ఈ చట్టం క్రింద పొందుపరచిన అప్పీలు, పనర్విమర్శలకు హాని కలుగకుండా సముచిత అధికారి దరఖాస్తు అందిన మీదట, ముందు ఒక వ్యక్తి లేదా సంస్థకు, సంరక్షణ మరియు రక్షణ కోసం బాలల న్యాయ చట్టం క్రింద సంబంధిత పిల్లలను అప్పగిస్తూ జారీ చేసిన ఆజ్ఞలను సవరించవచ్చు. అయితే సవరణలు చేస్తూ కొత్త ఆజ్ఞలను జారీ చేయడానికి విచారణ జరుగుతున్నప్పుడు కనీసం ఇద్దరు సభ్యులు, కక్షిదారులు, ప్రతివాదులు హాజరవ్వాలి. వారి సమక్షంలోనే సవరణ ఆజ్ఞల జారీ జరగాలి.
2. సముచిత అధికారి ఆమోదంతో జారీ చేసిన ఉత్తర్వులలో వ్రాతపూర్వకమైన తప్పులుగాని, పొరపాటున ఏవైనా విడిచిపెట్టడం గాని, జరిగితే ఆ పొరబాట్లు అధికారి స్వయంగా కాని, ఆ విషయమై పెట్టుకున్న దరఖాస్తుకు జవాబుగా కాని ఏ సమయంలోనైనా సరిదిద్దుకోవచ్చు.

సెక్షన్:56. పిల్లల విడుదల మరియు బదిలీ విషయాలలో సముచిత అధికారికి ఉండే అధికారాలు:

సముచిత అధికారి లేదా స్థానిక అధికారి ఈ చట్టంలో ఏమి ఉన్నప్పటికీ సంరక్షణ మరియు రక్షణ అవసరమైన పిల్లలు గాని చట్టంతో విరోధంలో ఉన్న పిల్లలను ఏసమయంలోనైనా, బాలల సదనం నుండి గాని ప్రత్యేక సదనం నుండి గాని, సందర్భానుసారం వెంటనే విడుదల గాని, బదిలీ గాని చేయడానికి ఉత్తర్వులు జారీ చేయవచ్చు. ఈ చర్య పిల్లల సంక్షేమాన్ని వారు మొదట నుండి నివసించిన స్థలాన్ని దృష్టిలో ఉంచుకొని, సంపూర్ణముగా కాని పరిస్థితుల దృష్ట్యా గాని, కొన్ని షరతులపై గాని చేపట్టడం జరుగుతుంది.

సెక్షన్ : 57. ఈ చట్టానికి లోబడిన బాలల సదనాల మధ్య బదిలీలు మరియు భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో ఇదే మాదిరిగా ఉన్న బాలల సదనాల మధ్య బదిలీలు :

రాష్ట్ర ప్రభుత్వం గాని, స్థానిక అధికారి గాని రాష్ట్రం వెలుపల ఉన్న ఒక బాలల సదనం లేదా ప్రత్యేక సదనం నుండి ఏ పిల్లలనైనా వేరే బాలల సదనం లేదా ప్రత్యేక సదనం లేదా అదే మాదిరిగా ఉన్న ఏదేని సంస్థకు, బదిలీ చేయడానికి నిర్దేశించవచ్చు. ఇరు సంబంధిత స్థానిక సమితి లేదా మండలికి, సందర్భానుసారం ముందే తెలియజేయవలెను. తరువాత ఆ ఉత్తర్వులు పిల్లలను బదిలీ చేసిన ప్రాంతపు సముచిత అధికారికి అందజేయవలెను.

సెక్షన్: 58. మానసిక రుగ్మతతో బాధపడుతున్న లేదా కుష్ఠువ్యాధితో బాధపడుచున్న లేదా మాదకద్రవ్యాలకు అలవాటుపడిన పిల్లలను బదిలీ చేయుట:

ఒక ప్రత్యేక సదనం, బాలల సదనం, ఆశ్రయ సదనం లేక ఈ చట్టానికి లోబడిన ఏ ఇతర సంస్థలోని పిల్లలు కుష్ఠుతో బాధపడుతున్నా లేదా వారికి మానసిక రుగ్మతలు ఉన్నా, వారు మత్తు మందులకు లేక సైకోట్రాపిక్ పదార్థాలకు బానిసలైనా సంబంధిత సముచిత అధికారి, ఆ పిల్లలను కుష్ఠువ్యాధి కేంద్రానికి లేక మత్తుమందు అలవాటును మాన్పే కేంద్రాలకు గాని, ఏ ఇతర సురక్షిత స్థలానికైనా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయవచ్చు. అయితే పిల్లలను పైన చెప్పిన ప్రదేశాలలో సముచిత అధికారి నిర్దేశించిన సమయం వరకు మాత్రమే ఉంచాలి. లేదా వారికి పూర్తి చికిత్స జరిగే వరకు సమయం పొడిగించడానికి సంబంధిత వైద్య నిపుణుల అభిప్రాయం అవసరమవుతుంది.

సెక్షన్ :59.పిల్లల విడుదల, సెలవు మంజూరు మరియు పురోభివృద్ధికి ఉద్యోగ ఏర్పాట్లు :

1. ఒక బాలల సదనంలోగాని, ప్రత్యేక సదనంలోని పిల్లలను, సంబంధిత ప్రొబేషన్ అధికారి లేదా సామాజిక కార్యకర్త లేదా ప్రభుత్వ లేక స్వచ్ఛంద సంస్థల కార్యకర్తల నివేదికపై ఆధారపడి, సముచిత అధికారి సందర్భానుసారం పిల్లలను విడుదల చేయుటకు లేదా తల్లిదండ్రులు / సంరక్షకుల వద్దకు తిరిగి పంపించివేయడానికి లేదా ఆ పిల్లలను ఇష్టపూర్వకంగా తీసుకొని వారి బాధ్యత వహిస్తూ వారికి విద్య, పురోభివృద్ధి, ఉద్యోగావకాశాలను కల్పించే ఏ ఇతర వ్యక్తి వద్దకైనా పంపించడానికి ఆలోచించవచ్చు.
2. సముచిత అధికారి పిల్లలకు, ప్రత్యేక సందర్భాలలో అంటే పరీక్షలు, చుట్టాల పెళ్ళిళ్ళు, దగ్గర బంధువుల మరణాలు లేక ఆకస్మాత్తుగా జరిగిన ప్రమాదంలో లేదా తల్లిదండ్రులకు తీవ్రంగా జబ్బు చేస్తే ఇతర ఆపత్సమయాల్లో సెలవు మంజూరు చేయవచ్చు. అయితే ఈ సెలవు తగిన తనిఖీలో ఏడు రోజులకు మించకుండా ప్రయాణపు సమయం తీసివేసి మాత్రమే ఉంటుంది.
3. ఈ అనుమతి వెనుకకు తీసుకోవడం జరిగినా లేక పొరపాటున పోగొట్టుకున్నా సంబంధిత పిల్లలు తిరిగి రావలసిన సదనం లేదా స్థలానికి రాకుంటే, అవసరమైతే సమితి వారిని బలవంతంగా తీసుకొని వారు ముందున్న సదనం లేదా స్థలానికి చేర్చవచ్చు.
4. సదనం నుండి అనుమతిపై సెలవు తీసుకున్న సమయం, సంబంధిత పిల్లలు మొత్తంగా సదనంలో ఉండే కాలంలో భాగంగానే లెక్క చేయబడుతుంది. అయితే, అనుమతి ఉపసంహరించడం లేదా పొరపాటున పోగొట్టుకున్న పిల్లలు వెంటనే సదనానికి వెనుకకు రాకపోతే వారు సదనంలో ఉండని దినాలు, వారు మొత్తంగా ఉండవలసిన సమయంలో భాగంగా పరిగణించబడవు.

సెక్షన్: 60. తల్లిదండ్రులు ఇవ్వవలసిన సహాయం :

1. పిల్లలను బాలల సదనానికి గాని, ప్రత్యేక సదనానికి గాని పంపడానికి ఉత్తర్వులు ఇచ్చిన సముచిత అధికారి, సంబంధిత పిల్లల తల్లిదండ్రులు లేక సంరక్షకులు లేక అర్హులైన వ్యక్తి / సంస్థను, ఆ పిల్లల పోషణకు వారి ఆదాయమును బట్టి ఇవ్వవలసిన మొత్తాన్ని నిర్దేశించవచ్చు.

2. సముచిత అధికారి అవసరమైతే, సదనంలోని పిల్లల తల్లిదండ్రులు ఖర్చులు భరించలేనప్పుడు వారికి మాత్రమే గాని, వారిద్దరికీ కలిపి గాని ఇంటికి వెళ్ళి రావడానికి కావలసిన మొత్తం ఇవ్వవలసినదిగా సంబంధిత సదనం సూపరింటెండెంట్ లేదా ప్రాజెక్టు అధికారిని ఆదేశించవచ్చు.

సెక్షన్: 61. నిధి :

1. స్థానిక అధికారి లేదా రాష్ట్ర ప్రభుత్వం, పిల్లల సంక్షేమం మరియు పునరావాసానికి అనగా ఈ చట్టం క్రింద పేర్కొనబడిన పిల్లల కోసం, ఒక నిధిని తాను తలచిన పేరుతో స్థాపించవచ్చు.
2. ఈ నిధిలో స్వచ్ఛంద దానాలు, ఇతర చందాలు లేక సహాయాల నుండి లభించిన డబ్బును, ఒక వ్యక్తి లేదా సంస్థాపరంగా వచ్చిన ధనమైనా సరే జమ చేయబడుతుంది.
3. సబ్ సెక్షన్ (1) క్రింద స్థాపించబడిన నిధి రాష్ట్ర సలహామండలి ఆధ్వర్యంలో నిర్దేశించిన విధంగా, నిర్దేశించిన ప్రయోజనాల కోసం నిర్వహించబడుతుంది.

సెక్షన్: 62. కేంద్ర, రాష్ట్ర జిల్లా మరియు పట్టణ సలహా మండలులు :

1. కేంద్ర సలహామండలిని సందర్భానుసారంగా నెలకొల్పవచ్చు. ఈ సలహామండలి, సంరక్షణ మరియు రక్షణ అవసరమైన పిల్లలు మరియు చట్టంతో విరోధంలో ఉన్న పిల్లల సహాయార్థం నడుపుతున్న సదనాలు స్థాపించడం వాటిని నడపడం గురించి సలహాలు ఇవ్వవచ్చు. ఆ సదనాల కోసం కావలసిన ఇతర ఆధారాలను కూడగట్టడం పిల్లల విద్య మరియు వృత్తి కోసం శిక్షణ మరియు వారి పునరావాసం గురించిన అంశాలపై ఈ సలహా మండలి తగిన సూచనలు ఇవ్వవచ్చు. ఇతర ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల మధ్య సమన్వయం కోసం తగిన సలహాలను కూడా ఇవ్వవచ్చు.
2. కేంద్ర లేక రాష్ట్ర సలహా మండలిలో సభ్యత్వం, ఆయా ప్రభుత్వాలు ఉచితమని తలచిన వ్యక్తులకు ఇవ్వవచ్చు. ఇందులో పేరు పొందిన సామాజిక కార్యకర్తలు, బాలల సంక్షేమం కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యావేత్తలు, వైద్యనిపుణులు మరియు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ శాఖ ప్రతినిధులు ఉండవచ్చు.
3. సెక్షన్ 35 క్రింద ఏర్పడిన జిల్లాల లేక పట్టణ సమితులు, ఈ చట్టం ప్రకారం జిల్లా లేక పట్టణ సలహా మండలుల క్రింద కూడా వ్యవహరించవచ్చు.

సెక్షన్ : 62ఎ.

చట్టం అమలుకు పిల్లల సంరక్షణ విభాగం ఏర్పాటు ప్రతి రాష్ట్ర ప్రభుత్వం రక్షణ సంరక్షణ పొందిరని పిల్లల కొరకు మరియు చట్టంతో విబేధించిన పిల్లల కొరకు మరియు రాష్ట్రస్థాయిల్లో ప్రత్యేక రక్షణ విభాగాలను ఏర్పాటు చేయవచ్చును. పిల్లలు పునరావాస కేంద్రాల పర్యవేక్షణ వీరి పునరావాసానికి సంబంధిత అధికారుల జాబితా విడుదల చేయటం మరియు పిల్లల సంబంధిత వివిధ శాఖలు అధికార అనధికార సంస్థల మధ్య సమన్వయం.

సెక్షన్ : 63. ప్రత్యేక జువెనైల్ పోలీస్ యూనిట్ :

1. తరచుగా బాలల సంబంధిత విషయాలను పరిశీలించే పోలీసు అధికారుల లేదా కేవలం చట్టంతో

విబేధించిన పిల్లల వ్యవహారాలతోనే సంబంధం గల పోలీసు అధికారులు లేక ముఖ్యంగా పిల్లలలో నేరప్రవృత్తిని నివారించడం కోసం పనిచేసే పోలీసు అధికారులు లేక ఈ చట్టాన్ని అనుసరించి పిల్లల వ్యవహారాలు చూసే అధికారులకు వారి విధులను మరింత బాగా నిర్వర్తించేందుకు వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

2. ప్రతి పోలీసు స్టేషన్‌లో కనీసం ఒక అధికారి కావలసిన శిక్షణ మరియు సరియైన దృక్పధంతో ఉండి, పిల్లల సంక్షేమ అధికారిగా ప్రత్యేకంగా వ్యవహరించాలి. ఇతర పోలీసులతో సమన్వయంలో ఈ అధికారి పిల్లల విషయాలను పరిశీలించాలి.

3. పైన చెప్పబడిన ప్రత్యేక పోలీసు అధికారులతో కూడిన ఒక ప్రత్యేక జువెనైల్ పోలీసు యూనిట్ ప్రతి జిల్లాలో మరియు ప్రతి పట్టణంలో పిల్లలకోసం ఉండాలి. ఈ యూనిట్ పోలీసులలో సమన్వయమే కాకుండా వారు పిల్లల పట్ల ప్రవర్తించే తీరులో పరివర్తన తీసుకురావాలి.

సెక్షన్: 64. చట్టం అమలులోకి వచ్చేసరికి శిక్షను అనుభవిస్తున్న చట్టంతో విరోధంలో ఉన్న బాలలు :

ఈ చట్టం అమలులోకి వచ్చిన ఏ ప్రాంతంలోనైనా, అక్కడి రాష్ట్ర ప్రభుత్వం గాని, స్థానిక ప్రభుత్వం గాని అప్పటికే శిక్షను అనుభవిస్తున్న చట్టంతో విరోధంలో ఉన్న బాలలను ఈ శిక్షకు బదులు ఒక ప్రత్యేక సదనంలో గాని, అర్హత గల ఏ ఇతర సంస్థలో గాని ఉంచవచ్చని నిర్ణయించవచ్చు. వారి పూర్తి శిక్షాకాలం ఆ సదనంలోనే లేక సంస్థలో గడపవచ్చని కూడా నిర్దేశించవచ్చు. ఈ విధంగా సదనంలోకి గాని, సంస్థలోకి గాని వచ్చిన బాలలకు ఈ చట్ట పరిధిలోని సూత్రాలన్నీ వారు మామూలుగా మండలి ఆదేశాలపై సదనంలోగాని సంస్థలో చేరినప్పుడు ఏ విధంగా ఉంటాయో లేక సందర్భానుసారంగా రక్షణ కోసం సెక్షన్ 16 లోని సబ్‌సెక్షన్(2) లో చెప్పిన రీతిలో ఆ సదనంకు గాని, సంస్థకు గాని వచ్చినప్పుడు ఆ చట్టంలోని ఆదేశసూత్రాలు అదేవిధంగా వర్తిస్తాయి.

సెక్షన్ : 65. జామీను ఇచ్చుటకు పద్ధతి :

ఈ చట్టం క్రింద జామీను ఇచ్చేటప్పుడు, నేరశిక్షాస్మృతి. 1973, (2 ఆఫ్ 1974) లోని 33 వ అధ్యాయంలోని ఆదేశాలు ఆ జామీనుకి వర్తిస్తాయి.

సెక్షన్ : 66. అధికారాలను ఇతరులకి ఇవ్వడం :

సామాన్య ఉత్తర్వుల ద్వారా, రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టం క్రింద తనకున్న అధికారాలు, తగిన పరిస్థితులలో మరియు సందర్భాలలో ఉత్తర్వులు నిర్దేశించిన విధంగా ఎవరైనా అధికారి అనగా, రాష్ట్ర ప్రభుత్వం లేక స్థానిక ప్రభుత్వం లేక స్థానిక ప్రభుత్వ అధికారానికి లోబడి పని చేస్తున్న ఉద్యోగికి ఇవ్వవచ్చు..

సెక్షన్ : 67. తగిన విశ్వాసంతో తీసుకున్న చర్యలను కాపాడుట :

రాష్ట్ర ప్రభుత్వం గాని స్వచ్ఛంద సంస్థ గాని సదనం నిర్వహిస్తున్న సంస్థ లేక ఈ చట్టం అమలుకి వినియోగించిన ఇతర ఉద్యోగులు కాని తగిన విశ్వాసంతో ఈ చట్టం అమలుకు తీసుకున్న చర్యలపై లేక, ఈ చట్టానికి అనుగుణంగా జారీ చేసిన ఉత్తర్వులు లేదా ఆదేశించిన సూత్రాల ఆధారంగా వారిపై ఎటువంటి వ్యాజ్యము లేదా చట్టబద్దమైన చర్యలు తీసుకొనవీలులేదు.

సెక్షన్ : 68. నిర్దేశిక సూత్రాలు తయారుచేయడానికి ఆధారాలు :

1. అఫీషియల్ గెజిట్‌లో నోటిఫికేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం, ఈ చట్ట ప్రయోజనాలు సాధించటం కోసం మార్గదర్శక సూత్రాలను తయారుచేయవచ్చు.
2. అటువంటి మార్గదర్శక సూత్రాలు, సామాన్యంగా ఇతర అధికారాలకు హానికరం కాకుండా క్రింద పేర్కొనే అన్ని లేదా కొన్ని విషయాలకు సంబంధించినవై ఉండాలి.
   1. మండలి సభ్యుల పదవీకాలం వారు పదవీ విరమణ చేసే పద్ధతి, సెక్షన్ 4 లోని సబ్‌సెక్షన్ (4) లో చెప్పిన విధంగా ఉండాలి.
   2. మండలి సమావేశ సమయాలు, సమావేశాలలో నిర్వహించ వలసిన వ్యవహారాలు అవి అందించవలసిన సేవలు మరియు ఆ సదనాలకు గుర్తింపు లభించే విధానం, అదే గుర్తింపు రద్దు చేయడం లేదా కొట్టి వేయడానికి అవలంబించే విధివిధానాలు సెక్షన్ 8లో చెప్పిన విధంగా ఉంటాయి.
   3. పరిశీలక సదనాల కార్యనిర్వహణ వాటికి ఉండవలసిన ప్రమాణాలు, అవి అందించవలసిన సేవలు మరియు ఆ సదనాలకు గుర్తింపు లభించే విధానం, అదే గుర్తింపు రద్దు చేయడం లేదా కొట్టి వేయడానికి అవలంబించే విధివిధానాలు సెక్షన్ 8 లో చెప్పిన విధంగా ఉంటాయి.
   4. ప్రత్యేక సదనాల కార్యనిర్వహణ వాటికి ఉండవలసిన ప్రమాణాలు, అవి అందించవలసిన సేవలు మరియు ఆ సదనాలకు గుర్తింపు లభించే విధానం, అదే గుర్తింపు రద్దు చేయడం లేదా కొట్టి వేయడానికి అవలంబించే విధివిధానాలు సెక్షన్ 9 లో చెప్పిన విధంగా ఉంటాయి.
   5. చట్టంలో విరోధంలో ఉన్న పిల్లలను మండలి ముందు ప్రవేశపెట్టేతీరు, వారిని పరిశీలక సదనాలకు పంపే తీరు సెక్షన్ 10 లోని సబ్‌సెక్షన్(2) లో చెప్పిన రీతిలో ఉంటుంది.
   6. నేర నిరూపణ జరిగిన బాలలకు ఉండే అనర్హతలకు తొలగించే విషయాలు సెక్షన్ 19 లో పేర్కొన్న విధంగా ఉంటాయి.
   7. అధ్యక్షుని మరియు సభ్యుల అర్హతలు, వారి పదవీకాలము, సెక్షన్ 29 లోని సబ్‌సెక్షన్ (3) లో చెప్పిన విధంగా ఉంటాయి.
   8. సమితి సమావేశ సమయాలు, ఆ సమావేశాల కార్యనిర్వహణ పద్ధతులు సెక్షన్ 30 లోని సబ్‌సెక్షన్ (1) లో చెప్పిన విధంగా ఉంటాయి.
   9. విచారణ జరిగే / జరుగుతున్న సమయంలో పోలీసులకు నివేదిక అందించవలసిన విధానం మరియు సమితికి కూడా నివేదిక ఇవ్వవలసిన తీరు, విచారణ పూర్తయ్యేవరకు పిల్లలను బాలల సదనంలో సంరక్షణ కొరకు ఉండే తీరు, సెక్షన్ 32 లోని సబ్‌సెక్షన్ (2) లో పేర్కొన్న విధంగా ఉంటాయి.
   10. బాలల సదనాలు నిర్వహించే తీరు వాటికి ఉండవలసిన ప్రమాణాలు, అవి అందించవలసిన సేవలు మరియు ఆ సదనాలకు గుర్తింపు లభించే విధానం అదే గుర్తింపు రద్దు చేయడం లేదా కొట్టివేయడం, విధి విధానాలు సెక్షన్ 34 లోని సబ్‌సెక్షన్ (2) లో సంస్థల నమోదు, విధానం సబ్‌సెక్షన్ (3) లో ఉంటుంది.

11. బాలల సదనాల కొరకు తనిఖీ సమితిలను ఏర్పాటు చేయడం వాటి పదవీకాలం, ప్రయోజనాలు వంటి ఇతర విషయాలు సెక్షన్ 35 లో ఉంటాయి.

12.ఎ. ఆశ్రయ సదనాలు కల్పించవలసిన సౌకర్యాలు సెక్షన్ 37 లోని సబ్‌సెక్షన్ 93 ప్రకారం ఉండాలి.

బి. సెక్షన్ 4 క్రింద సబ్‌సెక్షన్ (1) లో పునరావాస యంత్రాంగాన్ని దత్తత నిమిత్తం ఎంచుకోవడం, సబ్‌సెక్షన్ (2) నోటిఫికేషన్ సంబంధిత మార్గదర్శకాలను పొందపరచడం సబ్ సెక్షన్ (3) క్రింద దత్తత నిమిత్తం ప్రత్యేక శిక్షణ పొందిన సంస్థలను గుర్తించడం.

13. తాత్కాలిక పెంపకం కోసం పిల్లలని పంపించే కార్యక్రమ విధి విధానం సెక్షన్ 42 లోని సబ్‌సెక్షన్ (3) లో చెప్పినవిధంగా ఉంటాయి.

14. పిల్లల గురించి బాధ్యత వహించే వివిధ కార్యక్రమాలు, సెక్షన్ 43 లోని సబ్ సెక్షన్ (2) ప్రకారం ఉండాలి.

15. పిల్లల భవిష్యత్తు రక్షణ కోసం నిర్దేశించిన సంస్థల వ్యవహారాలు సెక్షన్ 44 లో పొందుపరచబడ్డాయి.

16. వివిధ సంస్థల మధ్య ప్రయోజనకారిగా ఉండే సమన్వయం, పిల్లల పునరావాసము, సామాజిక పునరేకీకరణ సవ్యంగా జరిగేందుకు ఉపయుక్తమగు విధివిధానాలు సెక్షన్ 45 లో ఉంటాయి.

17. విధి నిర్వహించే తీరు, దాని ప్రయోజనాలు సెక్షన్ 61 లోని సబ్‌సెక్షన్ (3) ప్రకారం ఉండాలి.

18. అవసరమైన ఏ ఇతర విషయమైన లేదా నిర్దేశించిన విషయమైనా ఉచిత రీతిలో నిర్వహించవలెను.

3. ఈ చట్టం క్రింద ప్రభుత్వం రూపొందించిన ఏ మార్గదర్శక సూత్రమైనా, చేసిన వెంటనే లేదా వీలైనంత త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ముందు ఉంచాలి.

సెక్షన్ : 69.రద్దు మరియు మినహాయింపులు :

1. జువెనైల్ న్యాయచట్టం, 1986 (53 ఆఫ్ 1986) ఇక మీదట రద్దు చేయబడినది.

2. ఈ రద్దు విషయం ఏమైనప్పటికీ పూర్వపు చట్టం ప్రకారం తీసుకున్న ఎటువంటి చర్య అయినా, దానికి అనుగుణమైన సూత్రాల క్రింద క్రొత్త చట్ట ప్రకారం తీసుకున్న చర్యగానే పరిగణించబడుతుంది.

సెక్షన్ : 70. ఇబ్బందులను తొలగించు అధికారాలు :

1. ఈ చట్టంలోని సూత్రాలను అమలు చేయడంలో ఏమైనా ఇబ్బందులు వస్తే, కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్వుల ద్వారా అనగా ఈ చట్ట పరిధులకు లోబడే ఆ ఇబ్బందులను తొలగించవచ్చు.

అయితే అటువంటి ఉత్తర్వు ఏది ఈ చట్టం ప్రారంభం అయినప్పటి నుండి రెండు సంవత్సరాల సమయం తరువాత తీసుకొని ఉండకూడదు.

2. అయితే ఈ విభాగం క్రింద చేసిన ఏ ఉత్తర్వు అయినా జారీ చేసిన వెంటనే పార్లమెంటు ఉభయసభల ముందు ఉంచబడుతుంది.

బాలల న్యాయ (సంరక్షణ మరయు రక్షణ) చట్టము, 2000 ప్రకారం చేయదగినవి – చేయదగనివి :

1. **రూల్ 6 (9) :** పోలీసు అధికారులు పిల్లవాణ్ని అదుపులోకి తీసుకునేటప్పుడు తప్ప, పిల్లవానితో వ్యవహరించు మిగతా అన్ని సమయాల్లో యూనిఫామ్ కాకుండా సాధారణ దుస్తులు ధరించాలి.

2. **రూల్ 6 (11) :** ఎట్టి పరిస్థితుల్లోనూ బాలలకు సంకెళ్ళు వేయరాదు.

3. **రూల్ 6 (12) :** ఏ పోలీసు అధికారి అయినా ఈ చట్టం అమలులో ఉన్నప్పుడు బాలలను శారీరకంగా, మానసికంగా హింసించినట్లు అయితే అట్టి అధికారిని ప్రాసిక్యూట్ చేయడంతో పాటు సర్వీసు నుంచి తొలగించవచ్చును.

4. **రూల్ 11 (7) :** బాలికలను ఒక ప్రదేశం నుంచి వేరొక ప్రదేశానికి తరలించేటప్పుడు వారి వెంట వుండు ఎస్కార్టులలో ఖచ్చితంగా ఒక స్త్రీ ఉండాలి.

5. **సెక్షన్ 10 రూల్ (6) :** చట్టంతో విరోధంలో ఉన్న బాలుణ్ని అదుపులోనికి తీసుకున్న వెంటనే పోలీసులు ఆ బాలుణ్ని ప్రత్యేక జువెనైల్ పోలీసు విభాగము లేదా నియమించబడిన పోలీసు అధికారి బాధ్యతలో వుంచి, 24 గంటల లోపు ఈ విషయాన్ని బాలల న్యాయ మండలికి తెలియజేసి బాలుణ్ని మండలి ఎదుట హాజరు పరచాలి. మండలిలో ప్రవేశపెట్టనంత వరకు బాలుణ్ణి పోలీసు స్టేషన్‌లో సురక్షిత స్థలంలో ఉంచాలి. ఎట్టి పరిస్థితుల్లో లాకప్‌లో ఉంచరాదు.

6. **సెక్షన్ 13 :** ప్రత్యేక జువెనైల్ పోలీసు విభాగము బాలుని నిర్బంధం గురించి బాలుని తల్లిదండ్రులకు తెలయజేయాలి. మరియు ప్రొబేషన్ అధికారికి బాలుని కుటుంబ పరిస్థితులను సేకరించడానికి సమాచారము అందజేయాలి.

7. బాలుని నిర్బంధంలోనికి తీసుకునేటప్పుడు అతని వద్ద ఏమైనా విలువైన వస్తువులు కాని, డబ్బులు కాని వుంటే, వాటిని రికార్డులలో నమోదు చేసి జాగ్రత్త పరచాలి. బాలికలను స్త్రీలతోనే తనిఖీ చేయించాలి.

8. బాలుర కనీస అవసరాల విషయంలో పరిశీలక సదనాలకు పంపేంతవరకూ ప్రత్యేక జువెనైల్ పోలీస్ విభాగము / పోలీసువారే బాధ్యత వహించాలి.

9. **సెక్షన్ 17:** నేర విచారణ స్మృతి 1973 లో వ్యతిరేకంగా ఏమి ఉన్నప్పటికీ చాప్టర్ క్రింద జువెనైల్స్‌పై ఎటువంటి ప్రొసీడింగ్స్ ప్రవేశపెట్టకూడదు. ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకూడదు.

10. **సెక్షన్ 21 :** దినపత్రికలలో గాని, దృశ్య ప్రచార సాధనాలలో గాని ఎటువంటి ఇతర పత్రికలలో గాని, మాధ్యమాలలో గాని, చట్టంతో విరోధంలో ఉన్న బాలల ఫోటోలు గాని, చిరునామా గాని, వారు చదువుచున్న పాఠశాల పేరు గాని, వారిని గుర్తించుటకు సహకరించు ఎటువంటి సమాచారాన్నీ ప్రచురించరాదు. దీనిని అతిక్రమించిన వారికి 25వేల రూపాయల వరకు జరిమానా విధించవచ్చును.

11. **సెక్షన్ 22 :** ప్రత్యేక సదనము నుంచి గాని, పరిశీలక సదనము నుంచి గాని పారిపోయిన పిల్లల బాధ్యతను వారెంటు లేకుండా ఏ పోలీసు అధికారి అయినా తీసుకొని ప్రత్యేక సదనానికి గాని, పరిశీలక సదనానికి గాని పంపవచ్చును. పారిపోయిన కారణంగా ఆ పిల్లలపై ఎటువంటి ప్రొసీడింగ్స్ ప్రారంభించకూడదు.

12. ఎట్టి పరిస్థితుల్లోనూ, బాలలను బాలలు కాని నేరస్థులతో కలిపి ఉంచకూడదు.

13. బాలలకు ఇబ్బందికరమగు 'అరెస్టు : 'కమిటల్', అక్యూస్డ్:, 'చార్జీషీట్', 'ట్రయల్', 'ప్రాసిక్యూషన్', 'వారెంట్', 'సమన్స్', 'కన్విక్షన్', 'డెలిక్వెంట్' (నేరస్థుడు), 'నెగ్లెక్టెడ్' (నిర్లక్షితుడు) వంటి పదములు వాడకూడదు.

14. **సెక్షన్ 24(1):** ఎవరైనా బాలలను భిక్షాటన కోసం ఉపయోగించినా లేక భిక్షాటనకు కారణమైనా, అట్టివారికి 3 సంవత్సరాల వరకు, జైలుశిక్ష మరియు జరిమానా విధించబడుతుంది.

15. అర్హత గల వైద్యుని నిర్ణయం మేరకు ఏదైనా వ్యాధి వున్న సందర్భంలో తప్ప, ఎవరైనా బాలలకు మత్తు పానీయాలు గానీ, మత్తుమందు గానీ, సైకోట్రాపిక్ పదార్థాలు గానీ, ఇచ్చినా లేక ఇవ్వడానికి కారణమైనా అటువంటి వారికి 3 సంవత్సరముల వరకు జైలు శిక్ష మరియు జరిమానా విధించబడుతుంది.

16. ఏ వ్యక్తి అయినా బాలలను ప్రమాదకరమైన పనులలో వుంచి వెట్టి చాకిరీ చేయించుకుంటూ, వారికి జీతం ఇవ్వకుండా వారి సంపాదనను తమ సొంతానికి వాడుకుంటే, వారికి మూడు సంవత్సరముల వరకు జైలుశిక్ష మరియు జరిమానా విధించబడుతుంది.

17. ఎట్టి పరిస్థితుల్లోనూ, బాలల్ని పోలీసు స్టేషన్‌లో వుంచరాదు. సాధ్యమైనంత తొందరగా పరిశీలక గృహాలకు పంపే ఏర్పాటు చేయాలి.

*****

28. ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్థల్లో వేధింపు (ర్యాగింగ్) నిరోధక చట్టం 1997

1. 1. ఈ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిరోధక చట్టం 1997 అని పిలవవచ్చు.

2. ఇది రాష్ట్రమంతటా వర్తిస్తుంది.

3. ఈ చట్టం జూలై 4, 1997 నుంచి అమలులోకి వచ్చింది.

2. ఈ చట్టంలోని పదాలకు ఈ క్రింది అర్థాలు వర్తిస్తాయి.

ఎ) 'చర్య' అనగా నోటిమాటగా గాని, రాత పూర్వకంగా గాని, సైగల ద్వారా గాని, శబ్దాల ద్వారాగాని కంటికి కనబడే ఇతర ఏ విధంగా నైనాగాని చేసిన పనులను చర్యలుగా పరిగణించాలి.

బి) 'విద్యాసంస్థ' అనగా కళాశాలగాని, ఇతర ఏ పేరుతో వున్న విద్యాబోధన జరిగే సంస్థలు. అనాథ శరణాలయాలు, భోజన వసతిగృహాలు, ఇతర వసతి గృహాలు, ట్యుటోరియల్ సంస్థలు కూడా ఈ నిర్వచనం కిందకే వస్తాయి.

సి) ప్రభుత్వమనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము.

డి) ప్రకటన అనగా ఆంధ్రప్రదేశ్ గజిట్‌లో ప్రకటించబడిన అని అర్థం.

ఇ) వేధింపు (ర్యాగింగ్) అనగా ఏ చర్య ద్వారా అయినా ఒక విద్యార్థిని అవమానించడం, ఆందోళన కలిగించడం, భయం కలిగించడం, బెదిరించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం లేదా గాయపర్చడం.

ఎఫ్) విద్యార్థి అనగా విద్యాసంస్థల్లో చేరి హాజరు పట్టీలో నమోదైన వ్యక్తి.

జి) పైన చెప్పబడిన నిర్వచనాలు కాక ఇతర పదాలకు ఆంధ్రప్రదేశ్ విద్యాచట్టం 1982 లేదా భారత శిక్షాస్మృతి 1860 ల లోని అర్థాలు వర్తిస్తాయి.

3. విద్యా సంస్థల్లో వేధింపు నిషేధించబడింది :

4. ఏ వ్యక్తి అయినా వేధించాలనే ఉద్దేశ్యంతోగాని తన చర్యలు వేధింపుకు కారణమవుతాయని తెలిసి ప్రవర్తిస్తే అది వేధింపుగా పరిగణించబడుతుంది. తన చర్యల ద్వారా :

i) ఇబ్బందికి గురి చేసినా లేదా అవమానించినా సదరు విద్యార్థికి ఆరు నెలల వరకు జైలుశిక్ష లేదా వెయ్యి రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చు.

ii) దౌర్జన్యం చేసినా, నేరపూరిత భౌతిక శక్తిని ఉపయోగించినా, బెదిరించినా, సదరు విద్యార్థికి సంవత్సరం వరకు జైలుశిక్ష లేదా రెండువేల రూపాయలవరకు జరిమానా లేదా రెండునూ విధించవచ్చు.

iii) చట్టవిరుద్ధంగా నిరోధించినా, లేదా బంధించినా లేదా గాయపరచినా రెండు సంవత్సరాలవరకు జైలుశిక్ష లేదా 5000 రూ॥ ల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చు.

iv) తీవ్రంగా గాయపరచినా, అపహరించినా, బలవంతంగా ఎత్తుకెళ్ళినా, అత్యాచారం చేసినా, ప్రకృతి విరుద్ధ లైంగిక చర్యచేసినా సదరు విద్యార్థికి 5 సం॥ల వరకు జైలుశిక్ష మరియు 10 వేల రూపాయల వరకు జరిమానా విధించవచ్చు.

v) మరణానికి కారణమైన లేదా ఆత్మహత్యకు ప్రేరేపించినా యావజ్జీవ కారాగారం లేదా 10 సంవత్సరాలవరకు జైలుశిక్ష మరియు 50 వేల రూపాయలవరకు జరిమానా విధించవచ్చు.

5. i) పైన చెప్పబడిన సెక్షన్ 4 క్రింద ఏదైనా శిక్షకు గురైన విద్యార్థిని విద్యా సంస్థ నుంచి బహిష్కరించాలి.

ii) పైన చెప్పబడిన సెక్షన్ 4 క్రింద ఆరు నెలలకు పైబడిన జైలు శిక్షకు గురైన విద్యార్థికి ఏ విద్యాసంస్థలోనూ ప్రవేశం ఇవ్వరాదు.

6. i) ఎవరైనా విద్యార్థి వేధింపు గురించి ఫిర్యాదు చేస్తే ఆ విద్యాసంస్థ అధిపతి లేదా యాజమాన్యం ఆ ఫిర్యాదుపై వెంటనే విచారణ జరిపించి ఫిర్యాదు ప్రాథమికంగా వాస్తవమని తేలితే వేధింపు చేసిన విద్యార్థులను సస్పెండ్ చెయ్యాలి.

ii) పై విషయంలో విద్యాసంస్థ అధిపతి లేదా యాజమాన్యం వారి నిర్ణయమే తుది నిర్ణయం.

7. i) పైన సెక్షన్ 6(1) లో చెప్పినట్లుగా విద్యాసంస్థ అధిపతి లేదా యాజమాన్యం చర్యలు తీసుకోకపోయినా లేక నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఆ నేరాన్ని వారు ప్రేరేపించినట్టుగా పరిగణించబడి ఆ నేరానికి నిర్దేశించబడిన శిక్షకు శిక్షార్హులౌతారు.

ii) ఎవరైనా విద్యార్థి వేధింపు కారణంగా ఆత్మహత్యకు పాల్పడితే సదరు వేధింపుచేసిన వ్యక్తి ఆ ఆత్మహత్యను ప్రేరేపించినట్లుగా పరిగణించాలి.

8. ఇంత వరకు అమలులోవున్న చట్టాలకు బదులుగా కాక ఈ చట్టం అదనంగా వర్తిస్తుంది.

9. i) ఈ చట్టంలోని ఉద్దేశాలు అమలుపరిచేందుకు ప్రభుత్వం ఒక ప్రకటన ద్వారా తగు నిబంధనలను తయారు చేయవచ్చు.

ii) ప్రభుత్వం పైన చెప్పిన నిబంధనలను తయారు చేసినపుడు వాటిని శాసన సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందాలి.

10. ఈ చట్టం రావడంతో ఇంతకు ముందున్న ఆర్డినెన్స్ రద్దవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లోని విద్యాసంస్థల్లో వేధింపు నిరోధక నియమావళి 2002

సెక్షన్ 9 ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిరోధక చట్టం ద్వారా సంక్రమించిన అధికారాలకు అనుగుణంగా ఈ క్రింది నిబంధనలు రూపొందించబడ్డాయి.

1. పేరు : ఈ నిబంధనలను విద్యాసంస్థల్లో వేధింపు (ర్యాగింగ్) నిరోధక నియమావళి 2002 అని పిలవవచ్చు.

2. నిర్వచనాలు :

(ఎ నుండి ఎఫ్) వరకు చట్టంలో చెప్పబడినవి.

3. వేధింపు (ర్యాగింగ్) నిషేధము :

ఎ) రాష్ట్రంలోని విద్యాసంస్థలలోపల, వెలుపల వేధింపు నిషేధించడమైనది.

బి) కళాశాల ప్రిన్సిపల్ లేదా అధిపతి విద్యార్థులు సంస్థలో ప్రవేశం తీసుకున్నపుడు సంస్థలోపల, వెలుపల ఎటువంటి వేధింపులకు పాల్పడను, అని హామీ పత్రం తీసుకోవాలి.

సి) వేధింపులకు గల శిక్షల గురించి సర్క్యులర్‌ల ద్వారా, పోస్టర్ల ద్వారా కళాశాలల్లో, వసతి గృహాల్లో విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత కళాశాల అధిపతి, యాజమాన్యంపై వుంది.

డి) కళాశాల అధిపతి, యాజమాన్యం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కూడిన వేధింపుల వ్యతిరేక దళాలను ఏర్పరచి వేధింపులను నిరోధించాలి.

ఇ) సంస్థ అధిపతి వేధింపులకు పాల్పడిన విద్యార్థులపై క్రిమినల్ కేసుపెట్టి తద్వారా వేధింపు నిరోధక చట్టంలోని చర్యలు తీసుకోవాలి.

ఈ నిబంధనలకు అనుబంధంగా మార్గదర్శక సూత్రాలు ఇవ్వబడినవి.

4. సంస్థ అధిపతి బాధ్యతలు :

1) విద్యా సంస్థ ఆరంభానికి ముందు సీనియర్ ఉపాధ్యాయులతో, వసతి గృహ వార్డన్లతో మరియు బాధ్యతాయుతమైన సీనియర్ విద్యార్థులతో కలిపిన ఒక కమిటీని ఏర్పర్చాలి.

   ఎ) ఈ కమిటీ వేధింపులను నిరోధించేందుకై నిఘా పెట్టాలి.

   బి) ఈ కమిటీ వేధింపు సంఘటనలు తమ దృష్టికి వచ్చినపుడు వెంటనే తప్పుచేసిన వారిని శిక్షించడం లేదా శిక్షించమని తగు అధికారికి సిఫార్సు చేయాలి.

2) స్థానిక ప్రజానీకానికీ, విద్యార్థులకు వేధింపుల యొక్క అమానవీయ ప్రభావం గురించి తెలియజెప్పాలి. అందుకై నోటీసులు, పోస్టర్ల ద్వారా ప్రచారం చేయాలి.

3) వేధింపులు నిరోధించడంలో వైఫల్యం చెందితే అది కళాశాల ప్రిన్సిపల్, యాజమాన్యపు నిర్లక్ష్యంగా భావించి బాధ్యులను చేయాలి. హాస్టల్ వార్డన్లు, సూపర్‌వైజర్లుపై కూడా ఇలాంటి బాధ్యతే వుంటుంది.

4) ఎవరైనా విద్యార్థి వేధింపు గురించి ఫిర్యాదు చేస్తే కళాశాల అధిపతి లేదా యాజమాన్యం దానిపై వెంటనే విచారణ జరిపి ఆ ఫిర్యాదు ప్రాథమికంగా వాస్తవమని తేలితే వేధింపుకు పాల్పడ్డ విద్యార్థిని తగినంత కాలం సస్పెండ్ చేయాలి.

5) పైన చెప్పబడిన విషయంలో సంస్థ అధిపతి నిర్ణయమే తుది నిర్ణయం.

6) ఏదైనా సంస్థ వేధింపు నిరోధించడంలో వైఫల్యం చెందితే ఆ సంస్థకు ఇస్తున్న నిధులను ఆపివేయాలి. అదేవిధంగా అది అనుబంధ కళాశాల గనుక అయితే దాని అనుమతిని విశ్వ విద్యాలయం వారు రద్దుచేసే విషయం పరిశీలించాలి. విశ్వ విద్యాలయాలు తమ ఆధీనంలోని విద్యాసంస్థలన్నింటికీ ఈ మార్గదర్శకాలను పంపిణీ చేసి ప్రసార సాధనాల ద్వారా విస్తృత ప్రచారాన్ని కల్పించాలి.

5. వేధింపుకు శిక్ష :

1) ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వేధింపుకు పాల్పడినా లేదా వేధింపుకు పాల్పడతారని తెలిసినా, ప్రేరేపించినా లేదా ప్రోత్సహించినా ఆం.ప్ర. వేధింపు చట్టం (1997) (1997 నాటి 26వ చట్టం) ప్రకారం శిక్షార్హులు.

2) ఆం.ప్ర. వేధింపు చట్టం (1997) (1997 నాటి 26వ చట్టం) లోని సెక్షన్ 4 ప్రకారం నేరం చేసి శిక్ష పొందిన విద్యార్థి, జైలుశిక్షకు గురైతే సంస్థ నుండి డిస్మిస్ అవుతారు.

3) ఆం.ప్ర. వేధింపు చట్టం (1997) లోని సెక్షన్ 4 ప్రకారం నేరం చేసి శిక్ష పొందిన విద్యార్థి ఆరు నెలలకు మించి జైలు శిక్ష విధింపుకు గురైతే ఏ ఇతర విద్యా సంస్థలోనూ ప్రవేశం ఇవ్వటానికి లేదు.

4) ఏ విద్యార్థి అయినా కళాశాల నుంచి వేధింపు వల్ల డిబార్ అయిన పక్షంలో ఆ విద్యార్థికి రాష్ట్రంలోని ఏ విశ్వ విద్యాలయం / కళాశాలలో ఏ ఇతర కోర్సులోనూ ప్రవేశానుమతి లభించదు.

5) విద్యార్థులు వేధింపులో పాల్గొంటే వారి మార్క్స్ పట్టికలలో ఇతర విద్యా ధ్రువపత్రాలలో పెద్దక్షరాలతో చెరపలేని / తొలగించలేని విధంగా వేధింపులో పాల్గొన్నారని, విద్యార్థి లక్షణాలు లేవనీ ఉబ్బెత్తుగా ముద్రవేసి తెలుపుతారు.

అనుబంధ మార్గదర్శకాలు

దిగువ సూచించిన మార్గదర్శకాలు అన్ని రకాల రూపాలలో ఉన్న వేధింపును నిరోధించేందుకు నిర్దేశించడం జరిగింది. సీనియర్లను 'సర్' అని పిలవడం, మాస్ డ్రిల్స్ ఆచరించడం, సీనియర్లకు నోట్సును కాపీ చేయడం, వివిధ పనులకు పురమాయించడం, అథమమైన పనులు అప్పచెప్పడం, బట్టలు ఉతికించడం, చవకబారు ప్రశ్నలు అడగడం / సమాధానాలు చెప్పించడం, అమాయకత్వాన్ని చెడగొట్టేలా బూతు బొమ్మల్ని చూపించడం, మత్తు పానీయాలను బలవంతంగా తాగించడం, టీ మొదలైన వేడి పదార్థాలను మీదపోసి గాయపరచడం, శృంగారపరమైన అధిక చర్యలు చేయడం, ఏకలింగపరమైన చర్యలతో శారీరక / మానసిక చిత్రవధ చేయడం లేదా మరణానికి తలపడటం, ఇతరంగా అసహ్యకరమైన ప్రవర్తనలు మొ॥ వేధింపుకు వివిధ రూపాలు.

వేధింపు అన్నది అపసవ్యమైన ప్రవర్తన. ఇందులో మౌఖిక వ్యవహారం, లేదా లేఖన వ్యవహారం, పరిహాసం, అవహేళన, మొరటు ప్రవర్తన, రౌడీలా ప్రవర్తించడం లేదా క్రమశిక్షణారహిత కార్యకలాపాలుండవచ్చు. వీటివల్ల అవమానం, అవహేళన కలుగుతుంది. కారిన్యం లేదా మానసికంగా గాని లేదా భయం లేదా అభిమానం దెబ్బతింటుంది. జూనియర్లను సాధారణంగా చేయని విధంగా చేయని పనులను చేయమనడం ద్వారా ఇబ్బంది కలిగి వారి వ్యక్తిత్వం లేదా మానసిక వికాసం దెబ్బతింటుంది. వేధింపుకు పాల్పడటం సీనియర్ల పీడన, వినోదం లేదా అధికార ప్రదర్శన, ఆధిక్యం, బల ప్రదర్శన వారికి జూనియర్ల పట్ల ఉన్న అభిప్రాయాన్ని తెలియజేస్తుంది.

పైవన్నీ సీనియర్లు ప్రదర్శించే విపరీత చర్యలు. వేధింపును వివరించే నామమాత్ర చర్యలేకాని సంపూర్ణం కావు. ఇతర సంబంధిత చర్యలు వేధింపు కోవకే చెంది శిక్షార్హులు అవుతారు.

1. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పడే సమీక్షా సంఘం వేధింపు చర్యలను గమనిస్తుంది. ఈ సంఘం ఈ విధంగా ఉంటుంది.

i) కలెక్టర్ – అధ్యక్షులు

ii) సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ – ఉపాధ్యక్షులు

iii) ఎ) రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్స్

బి) సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్స్ – సభ్యులు

సి) కళాశాల ప్రిన్సిపాల్స్

ఈ సంఘం విద్యా సంవత్సరం ఆరంభానికి ముందు రెండుసార్లు, విద్యా సంవత్సరంలో రెండుసార్లు సమావేశమై ఉన్న స్థితిని సమీక్షిస్తుంది. వేధింపును సమర్థవంతంగా ఎదుర్కొనే విధానాలు రూపొందిస్తుంది.

2. సమీక్షా సంఘంతోపాటు ప్రతి విద్యా సంస్థలోనూ అదనంగా మరో సంఘం ఏర్పాటు చేయాలి. ఈ సంఘంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు సభ్యులుగా ఉండాలి. వారితోపాటు ఇద్దరు విద్యార్థులు విద్యార్థి యూనియన్ ప్రతినిధులుగా ఉండాలి. ప్రిన్సిపాల్, బోధనా సిబ్బంది తరపున ప్రతినిధులుగా ఉపాధ్యాయులు సభ్యులుగా ఉండాలి. వీరితో ఏర్పడిన సంఘం క్రమం తప్పక సమావేశం అయి అదుపు తప్పి ప్రవర్తించిన విద్యార్థికి వ్యతిరేకంగా ఏ చర్య చేపట్టాలో యాజమాన్యానికి సూచిస్తుంది. సదరు యాజమాన్యం తప్పనిసరిగా నిరోధ విధానాలు త్వరితంగా అమలుచేసి తల్లిదండ్రుల సంఘం ప్రతిపాదించిన తేదీ నుంచి నాలుగు వారాల లోపల చర్య తీసుకోవాలి.

3. ప్రవేశం / నమోదు దరఖాస్తు ఫార్మ్‌లో విద్యార్థికి, సంస్థకు ఉండే వేధింపు దృక్పథం, ఒకవేళ వేధింపు నేరం చేసినట్లయితే బాధ్యత వహిస్తాననే ధ్రువపత్రం ముద్రించాలి. అట్లాగే విద్యార్థి తల్లిదండ్రుల / సంరక్షకుల హామీని కూడా జతపరచాలి.

4. సంస్థ జారీ చేసిన గుర్తింపు కార్డును విద్యార్థి ఎప్పుడూ దగ్గర ఉంచుకోవాలి. సంస్థ అధికారులు లేదా హాస్టల్ ఉద్యోగులు లేదా సంస్థ ఉద్యోగులు లేదా హాస్టల్‌లో గుర్తింపు ధ్రువీకరణకు ఏర్పరచిన అధికారి కోరినప్పుడు గుర్తింపు కార్డును చూపాలి.

5. హాస్టళ్లు, మెస్సులు, ఖాళీ తరగతి గదులు, క్యాంటీన్, స్టేడియమ్, లేదా ఆటస్థలం, విద్యార్థి కార్యకలాపాల కేంద్రాలు, బస్‌స్టాండ్లు మొ॥ వేధింపు చేయడానికి వీలున్న కొన్ని స్థలాలు. కఠినమైన పర్యవేక్షణను ఈ స్థలాల్లో ఏర్పాటు చేసి వేధింపు నిరోధించాల్సి ఉంటుంది.

6. యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది కొత్తగా వచ్చిన విద్యార్థులతో అంతశ్చర్చలు జరిపి వారిలో విశ్వాసం పెంపొందించి హక్కులు, విధులు తెలియజేసి వేధింపుకు వ్యతిరేక పోరాటం చేసేలా తయారు చేసి, ఒకవేళ ఎప్పుడయినా వేధింపు ఎదురయితే ధైర్యంగా ఎదుర్కొనేలా చేయాలి. ఆ సంఘటనలు వీరి దృష్టికి తేవాలి. ఆ ఫిర్యాదు దార్లకు రక్షణ కల్పించి వేధింపుదార్ల నుంచి ఎదురయ్యే ఇబ్బందులను తొలగించాలి. ఇందుకై సంస్థ అధిపతి లేదా ఉన్నతాధికారి అధ్యాపకుల తల్లిదండ్రుల, విద్యార్థుల సమూహాల సమావేశాలను నిర్వహించడం మంచిది.

7. విశ్వ విద్యాలయాలు, సంస్థలు విద్యా సంవత్సరం ఆరంభానికి ముందు తగిన సమయంలోనూ అవసరమయితే తరచుగా విధానాలకు అనుకూలంగా, నిర్మాణాత్మక కార్యకలాపాలలో జూనియర్లు, సీనియర్లు ఇమిడిపోయేలా చూడాలి. వారి మధ్య ఆరోగ్యకర, స్నేహపూరిత వాతావరణం కల్పించి సంస్థలో కుటుంబ సభ్యుల్లా మెలిగేలా చేయాలి. సీనియర్లు లేదా జూనియర్లు వారి ప్రతిభను ప్రదర్శించేందుకు తగిన అవకాశాలు కల్పించి వారిలో ఉండే మానసిక అపోహలను తొలగించాలి.

8. చేరిన ప్రతి కొత్తవారికి ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, విభాగాధిపతుల, సీనియర్ విద్యావేత్తల / పరిపాలనాధికారుల, వార్డెన్ల, డిప్యూటీ వార్డెన్ల ఫోన్ నెంబర్లిచ్చి ఎప్పుడు వేధింపు ఘటనలెదురయినా తక్షణమే సమాచారం అందించేందుకు వెనకాడకూడదని చెప్పాలి. అవసరమయితే ఆకాశరామన్నగానైనా తెలియజేస్తే వారు తక్షణ చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది.

9. ప్రతి ఏడూ జూలై, ఆగస్టు నెలల్లో ప్రసార మాధ్యమాలు ద్వారా తగినంత ప్రచారం చేసి వేధింపు వ్యతిరేక ఫలితాలను తెలియజేయాలి. అప్పుడే ప్రజల్లో అవగాహన పెరిగి, వేధింపు పట్ల అసహ్యం ఏర్పడుతుంది.

10. మొదటి సంవత్సరం క్లాస్ షెడ్యూల్‌ను నిదానించాలి. జూనియర్లు తొందరగా వచ్చి, తొందరగా వెళ్ళాలి. సీనియర్లకు ఈ షెడ్యూలు వ్యతిరేకంగా ఉండాలి.

11. మొదటి సంవత్సరం తరగతుల అధ్యాపకులు మరో పిరియడ్ అధ్యాపకుడు వచ్చిన తరవాతే వదిలి వెళ్ళాలి.

12. హాస్టల్స్ / వసతి గృహాల్లో కొత్తవారిని ఉంచినచోట జాగ్రత్తగా సంరక్షించాలి. అవసరమైతే సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి. వార్డెన్ / సూపరింటెండెంట్‌గా ఉన్నవారు అదే హాస్టల్‌లో నివసించాలి. అక్కడికి సీనియర్ల, బయటి వాళ్ళ రాకపోకలను రాత్రిపూట నిర్ణీత సమయం తరువాత నిషేధించాలి. మరీ అవసరమైతే ఇన్‌ఛార్జి అధికారి అనుమతితో అనుమతించాలి. ఇతర సమయాల్లో ప్రవేశాన్ని క్రమబద్ధీకరించాలి. సాధ్యమైతే కొత్తవారినందరినీ ఒకేచోట విడి భవనంలో ఉంచాలి. అ భవనం సీనియర్ల వసతి గృహాలకన్నా దూరంగా ఉంటే మంచిది.

13. సంస్థ ప్రిన్సిపాల్ ముందస్తు అనుమతి లేనిదే సదరు సంస్థ విద్యార్థి కాని వ్యక్తిని సంస్థలోకి, హాస్టల్ ఆవరణలోకి ప్రవేశించనీయకూడదు. తల్లిదండ్రులకు లేదా సంరక్షకులకు సంస్థ, హాస్టల్ ఆవరణల్లో ప్రవేశించడానికి ఎటువంటి లిఖితపూర్వక అనుమతి అక్కర్లేదు.

14. సంస్థలో చదవని వ్యక్తిని సదరు సంస్థ విద్యార్థి హాస్టల్‌లోకి ప్రవేశించేందుకు అనుమతించకూడదు. హాస్టల్ వార్డెన్ లిఖిత అనుమతితో మటుకు అనుమతించవచ్చు. అయితే బాలికల హాస్టల్ విషయంలో విద్యార్థులనెవరినీ (మగవారిని) అనుమతించకూడదు. ఒకవేళ అనుమతించిన పక్షంలో ఆడవారి హాస్టల్ కేర్‌టేకర్ సమక్షంలోనే కలిసేందుకు అనుమతించాలి. ఇందుకు వార్డెన్ నుంచి ముందస్తు అనుమతి పొందాలి.

15. వ్యక్తిగత పనిమీద విద్యార్థిని తన హాస్టల్ ఆవరణను వదిలిపెట్టిపోతే రాత్రి 9 గంటలకల్లా హాస్టల్‌కు వచ్చేయాలి. ఒకవేళ ఆలస్యంగా వస్తే కేర్‌టేకర్‌కు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలి. అప్పుడు కేర్‌టేకర్

అనుమతితో తన స్థానానికి తను వెళ్ళవచ్చు. మరుసటి రోజు ఉదయం 9 కల్లా ఈ వివరణను కేర్‌టేకర్ హాస్టల్ వార్డెన్‌కు పంపాలి.

16. రాత్రి ఏ సమయంలోనైనా హాస్టల్ ప్రాంతాన్ని అధ్యాపక సిబ్బంది వార్డెన్ తనిఖీ చేయవచ్చు.

17. రహస్య విద్యార్థి నిఘా సంఘాలను ఏర్పరచాలి. కళాశాల లోపల బయట జరిగే వేధింపు సంఘటనలను ఈ సంఘం వేధింపు వ్యతిరేక సంఘం దృష్టికి తెస్తుంది.

18. కళాశాలలో రహస్య పేటికలనుంచి జూనియర్ విద్యార్థుల నుంచి వేధింపు సంఘటనల ఫిర్యాదులను స్వీకరించాలి.

19. సంస్థ జారీ చేసిన మైగ్రేషన్ ధ్రవపత్రాల ద్వారా ప్రవేశం లభించినా సాధారణ ప్రవర్తన, నడవడికల ద్వారా వేధింపుకు శిక్ష పొందాడా లేదా అన్న విషయం తెలుస్తుంది.

20. అధ్యాపకుల్లో, తల్లిదండ్రుల్లో, విద్యార్థుల్లో అవగాహన పెంచి వేధింపును ఆపవచ్చు. వేధింపు గర్హనీయ చర్య అనీ దానివల్ల ఎటువంటి మంచీ ఎవరికీ జరగదనీ, ఇందుకు బదులుగా క్రమశిక్షణ నెలకొల్పి వేధింపుకు సంబంధించిన ఏ ఘటనా తప్పిపోకూడదనీ, చేసినవారు శిక్షింపబడకుండా పోకూడదనీ తెలియజెప్పాలి.

21. ఎవరైనా విద్యార్థి వేధింపు కార్యకలాపంలో పాల్గొన్నాడని తెలిస్తే తక్షణమే సంస్థ ప్రిన్సిపాల్ సంతకంతో సమాచారం పంపి సస్పెండ్ చేయాలి. సదరు విద్యార్థిని సంస్థ ఆవరణలోకి లేదా హాస్టల్‌లోకి రానీయకూడదు. ఒకవేళ వస్తే సంస్థ అధికారికి వివరణ ఇవ్వడానికి లేదా తల్లిదండ్రుల సంఘం ముందు వివరణ ఇవ్వడానికి లేదా తన కేసు వివరణకే రావాలి.

22. ప్రవేశ ప్రకటన చేసిన సమయం నుంచే సంస్థ వేధింపు వ్యతిరేక ఉద్యమాన్ని ప్రోత్సహించాలి. ప్రాస్పెక్టస్‌లో ప్రవేశ దరఖాస్తులోనే సంస్థలో వేధింపు నిషేధమనీ, వేధింపులో పాల్గొంటే సముచిత శిక్ష తప్పదనీ – శిక్షతో సంస్థ నుంచి బహిష్కారం, సస్పెన్షన్ లేదా తరగతులనుంచి పరిమిత వ్యవధికి వెలి లేదా బహిరంగ క్షమాపణతోపాటు అపరాధ రుసుము విధింపు ఉంటుందని తెలియజెప్పాలి.

శిక్ష ఈ విధంగా ఉండవచ్చు.

ఎ) ఉపకార వేతనాలు / ఫెలోషిప్స్ నిలిపివేత

బి) ఉత్సవాల / ఈవెంట్స్ ప్రాతినిధ్యం నుంచి వెలివేయడం.

సి) ఫలితాల నిలిపివేత

డి) ప్రయాణ రాయితీ, క్యాంపస్ ఎంపికల వంటి ప్రయోజనాలు నిలిపివేయడం.

ఇ) హాస్టల్ లేదా మెస్, ఇతరాల నుంచి వెలి లేదా సస్పెన్షన్.

23. ప్రాథమిక సాక్ష్యాలున్న వేధింపు చేసే విద్యార్థుల ఫోటోలను బహిరంగ ప్రదేశాల్లో నోటీసు బోర్డుమీద ఉంచాలి. వాటిని వార్తా పత్రికల్లోనూ ప్రచురించాలి. అదనంగా విద్యార్థులను హెచ్చరిస్తూ వేధింపువల్ల భవిష్యత్తు ఉండదనీ పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయితే లేదా విద్యా విషయిక రికార్డులలో కళంకంగా నమోదయితే విదేశాలకు వెళ్ళేందుకు పాస్‌పోర్టు, వీసాలు లభించవనీ తెలపాలి.

24. నేరం తీవ్రమయినదయితే సదరు వ్యక్తిని జాతీయ, అంతర్జాతీయ మీట్స్‌కు, టోర్నమెంట్లకు, యువజనోత్సవాలకు, క్విజ్‌లకు వెళ్ళనివ్వకూడదు.

25. వేధింపు నిరోధించడంలో విఫలం కావడం యాజమాన్యం నిర్లక్ష్యాన్ని, సంస్థ క్రమ శిక్షణారాహిత్యాన్ని ప్రిన్సిపాల్, సంస్థ అధికారుల వైఫల్యాన్ని సూచిస్తుంది. అటువంటి బాధ్యతే వార్డెన్ / సూపరింటెండెంట్‌లపైనా ఉంది.

26. వేధింపును నిరోధించే విధానాలను చురుగ్గా అమలు చేసేవారికి ప్రోత్సాహకాలను, ఉత్తేజితాలను ఇవ్వాలి. నేరస్తులకు శిక్షతోనూ, వేధింపుకు పాల్పడని వారికి సత్కారాలతోనూ, సత్కరిస్తే వేధింపు పీడ తొలగింపుకు సహాయకారిగా ఉంటుంది.

27. వేధింపు అనేది ఆం.ప్ర. వేధింపు నిషేద చట్టం (1997) లోని సెక్షన్ 4 ప్రకారం శిక్షార్హమైన నేరం మాత్రమే కాకుండా భారతీయ శిక్షాస్మృతి (1860) (1860 నాటి 45వ చట్టం)లోని వివిధ సెక్షన్ల ప్రకారం దండనార్హం. నిర్దిష్ట నిర్దేశాల ప్రకారం పోలీసు అధికారులు అటువంటి నేరాల పరిశీలనను గుర్తింపు కలిగి పోలీసు విభాగం ద్వారా ఆయా సమయాల్లో ఆపాదించిన అధికారాల ద్వారా నేర కార్యకలాపాలను గమనించాలి.

28. వేధింపు అనేది విచారణ యోగ్యమైన నేరం. కాబట్టి దాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలి. సంస్థ అధిపతి సమక్షంలో పోలీసు అధికారులకు ఆవరణలో ప్రవేశించనివ్వాలి. పోలీసులు కూడా విద్యార్థులతో సన్నిహితంగా వ్యవహరిస్తున్నామని, నేరస్తులతో కాదన్న విషయం గుర్తుంచుకోవాలి. పోలీసుల చర్యలు హింసాత్మకంగా కాకుండా సరిచేసే దృక్పథంతో ఉండాలి.

29. పై మార్గదర్శక సూత్రాలు కేవలం వివరణాత్మకమైనవి. సంస్థలు, అధికారులు వేధింపుకు రూపొందించుకొనే మార్గాలకు, విధానాలకు అదనంగా వర్తిస్తాయే తప్ప ఇవేవీ ఆటంకంగా పరిణమించవు.

*****

29. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005

గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల అదనపు పని దినాలను కల్పిస్తూ జీవన భద్రత నిమిత్తం ఈ చట్టం చేయబడింది.

అధ్యాయం - I

ప్రాథమికం

1. 1. ఈ చట్టాన్ని మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 గా పిలవవచ్చు.

2. భారతదేశమంతా ఈ చట్టం వర్తిస్తుంది. జమ్మూ, కాశ్మీరు మినహా.

3. ఈ చట్టం యొక్క అమలును కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన ద్వారా తెలియజేస్తుంది. రాష్ట్రాలకు, రాష్ట్రాలలోని ప్రాంతాలకు వేరు వేరు అమలు తేదీలను ప్రకటించవచ్చు.

చట్టం చేసిన తేదీ నుండి 5 సంవత్సరాల లోపు దేశమంతటా ఈ చట్టం అమలులోకి వస్తుంది.

2. చట్టంలోని పదాలకు నిర్వచనాలు :

ఎ) 'పెద్దలు' అనగా 18 సం॥లు వయస్సు నిండినవారు.

బి) 'అర్జీదారులు' అనగా కుటుంబపెద్ద, లేదా పని కోసం దరఖాస్తు చేసుకున్న ఇతర పెద్దలు.

సి) 'బ్లాకు' అనగా జిల్లాలోని సామాజిక అభివృద్ధి ప్రాంతం.

డి) 'కేంద్రమండలి' అనగా సెక్షన్ 10 లోని సబ్‌సెక్షన్ (1) ప్రకారం ఏర్పాటు చేయబడిన కేంద్ర ఉపాధి హామీ సంఘం.

ఇ) 'జిల్లా కార్యక్రమ సమన్వయ కర్త' అనగా సెక్షన్ 14 సబ్‌సెక్షన్ (1) ప్రకారం జిల్లాలోని కార్యక్రమాలను అమలు చేయుట కొరకు నియమించబడిన రాష్ట్ర ప్రభుత్వ అధికారి.

యఫ్) 'కుటుంబం' అనగా రక్త సంబంధం, వివాహం, దత్తత ద్వారా కలిసి ఉంటున్న వ్యక్తులు, వీరు ఒకే చోట ఉంటూ ఒకే రేషన్ కార్డు కలిగి వుండాలి.

జి) 'అమలు చేసే సంస్థ' అనగా పథకం కింద ఏదైనా పనిని అమలు చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖలు,జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయితీ, లేదా ప్రభుత్వ రంగసంస్థలు, లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధీకృతం చేసిన స్వచ్ఛంద సంస్థలు;

హెచ్) 'కనీస వేతనం' అనగా కనీస వేతన చట్టం, 1948 లోని సెక్షన్ 3 కింద రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాంతంలో వ్యవసాయ కార్మికులకు వర్తించేలా నిర్దేశించిన కనీస వేతనం.

ఐ) 'జాతీయ నిధి' అంటే సెక్షన్ 20, సబ్‌సెక్షన్ (1) కింద ఏర్పాటు చేసిన జాతీయ ఉపాధి హామీ నిధి;

జె) 'ప్రకటన' అనగా ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురించిన ప్రకటన;

కె) 'ప్రాధాన్యత గల పని' అనగా పథకం కింద అమలులో ప్రాధాన్యతనిచ్చి చేసే పని;

ఎల్) 'సూచించిన' అనగా చట్టానికి అనుగుణంగా తయారయిన నియమాలు

ఎమ్) 'కార్యక్రమ అధికారి' అనగా సెక్షన్ 15, సబ్ సెక్షన్ (1) ప్రకారం కార్యక్రమాన్ని అమలు చెయ్యటానికి నియమింపబడిన అధికారి;

ఎన్) 'పథకం' అనగా దరఖాస్తుదారులకు ఉపాధి కల్పించటానికి పథకం కింద చేపట్టిన పని;

ఓ) 'గ్రామీణ ప్రాంతం' అనగా రాష్ట్రంలో పురపాలక సంస్థ, లేదా సైనిక ప్రాంతం పరిధిలో లేని ప్రాంతం.

పి) 'పథకం' అంటే సెక్షన్ 4, సబ్‌సెక్షన్ (1) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పథకం;

క్యూ) 'రాష్ట్రమండలి' అనగా సెక్షన్ 12, సబ్ సెక్షన్ (1) ప్రకారం ఏర్పాటు అయిన రాష్ట్ర ఉపాధి హామీ సంఘం

ఆర్) 'నైపుణ్యత అవసరం లేని పనులు' అనగా ఎటువంటి ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం లేకుండానే ఎవరైనా పెద్దలు చేయుపనులు.

ఎస్) 'వేతనం' అనగా సెక్షన్ 6 లో పేర్కొన్న వేతనం.

అధ్యాయం - II
గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ

3. 1. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రాంతాలలో పని చెయ్యటానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన పెద్దలు ఉన్న ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో వంద రోజులకు తగ్గకుండా రాష్ట్ర ప్రభుత్వం పని కల్పించాలి.

2. పథకంలో పనిచేసిన ప్రతి ఒక్కరికి నిర్ధారించబడిన రేటు ప్రకారం ప్రతి రోజుకీ వేతనం చెల్లించాలి.

3. పని చేసిన తరువాత (వారం రోజులకు ఒకసారి వేతనం చెల్లిస్తారు, ఎటువంటి పరిస్థితులలోనైనా) ఇది 15 రోజులకు మించకూడదు.

4. రాష్ట్ర ప్రగతి, ఆర్థికస్థోమత దృష్టిలో పెట్టుకుని అవసరమనుకుంటే సబ్ సెక్షన్ (1) లో పేర్కొన్న పరిధికి మించి కుటుంబంలోని పెద్దలందరికి పని కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

అధ్యాయం - III
ఉపాధి హామీ పథకాలు, నిరుద్యోగ భృతి

4. 1. సెక్షన్ -3 లో పేర్కొన్న అంశాలను ఆచరణలోకి తీసుకురావటానికి చట్టం అమలుకు వచ్చిన ఆరు నెలలలోగా స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకున్న వాళ్ళందరికీ చట్టం పరిమితులకు లోబడి ఒక ఆర్థిక సంవత్సరంలో వందరోజులకు తక్కువ కాకుండా వేతన ఉపాధి కల్పించేలా ప్రతి రాష్ట్ర ప్రభుత్వం ఒక పథకాన్ని తయారు చేయాలి.

ఇలా పథకం తయారు చేసే లోపు ఆ ప్రాంతంలో సంపూర్ణ గ్రామీణ రోజ్‌గారియోజన (ఎస్.జి.ఆర్.వై) లేదా జాతీయ పనికి ఆహార పథకాల (ఎస్ఎఫ్ఎఫ్‌డబ్ల్యుపి) వార్షిక కార్యాచరణ ప్రణాళిక/ సమగ్ర

ప్రణాళిక ఈ చట్టం కింద కార్యాచరణ ప్రణాళికగా పరిగణింపబడుతుంది.

2. రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన పథకం యొక్క సారాంశాన్ని కనీసం రెండు స్థానిక దినపత్రికలలో ప్రచురించాలి. వాటిల్లో ఒకటి స్థానిక భాషలో ఉండి సంబంధిత ప్రాంతాలలో అందుబాటులో ఉండాలి.

3. సబ్ సెక్షన్ (1) ప్రకారం రూపొందించిన పథకం షెడ్యూల్ 1 లో పేర్కొన్న అంశాలు కలిగి ఉండాలి.

5. 1. షెడ్యూల్ II లో పేర్కొన్న అంశాలకు భంగం కలగకుండా చట్టం కింద ఉపాధి కల్పించటానికి షరతులను రాష్ట్ర ప్రభుత్వాలు పేర్కొనవచ్చు.

2. ఈ చట్టం కింద ఏ పథకంలోనైనా ఉపాధి పొందే వ్యక్తి షెడ్యూలు II లో పేర్కొన్న వాటికి తగ్గకుండా సౌకర్యాలను పొందే హక్కు ఉంటుంది.

6. 1. కనీస వేతన చట్టం, 1948 లో పేర్కొన్న వాటితో సంబంధం లేకుండా ఈ చట్టం కింద చెల్లించే కూలీ రేట్లను కేంద్రప్రభుత్వం ప్రకటించవచ్చు. వేరు వేరు ప్రాంతాలకు వేరు వేరు రేట్లు ప్రకటించవచ్చు. ప్రకటన ద్వారా ఎప్పటికప్పుడు వెలువరించే ఈ రేటు రోజుకి 60 రూపాయలకు తక్కువగా ఉండకూడదు.

2. ఒక రాష్ట్రంలో ఒక ప్రాంతానికి కేంద్ర ప్రభుత్వం కూలీరేటు ప్రకటించేంతవరకు కనీస వేతన చట్టం, 1948 లోని సెక్షన్ 3 ప్రకారం వ్యవసాయ కార్మికులకు, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వేతనం అమలులో ఉంటుంది.

7. 1. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి 15 రోజుల లోపుగా గాని, లేదా ముందుగా ఇచ్చిన దరఖాస్తులో పేర్కొన్న తేదీకి గాని పని కల్పించకపోతే ఏది తర్వాత తేదీ అయితే ఆ తేదీ నుంచి ఈ సెక్షన్ ప్రకారం రోజువారీ నిరుద్యోగ భృతి చెల్లించాలి.

2. రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసే అర్హతలు, దాని ఆర్థిక పరిస్థితికి లోబడి రాష్ట్ర సంఘంతో సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే నిరుద్యోగ భృతిని చెల్లించాలి. ఒక ఆర్థిక సంవత్సరంలోని మొదటి ముప్పై రోజులకి వేతనంలో 25 శాతానికి, మిగిలిన రోజులకి 50 శాతానికి ఈ నిరుద్యోగ భృతి తగ్గకూడదు.

3. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి చెల్లించావసరం లేని పరిస్థితులు.

ఎ) పనికి హాజరుకమ్మని దరఖాస్తుదారుని గ్రామపంచాయితీ లేదా కార్యక్రమ అధికారి కోరినప్పుడు;

బి) దరఖాస్తుదారు కోరుకున్నన్ని రోజులు పని కల్పించిన తరువాత వారు కాని, వారి కుటుంబ సభ్యులు కానీ హాజరుకానపుడు;

సి) ఒక ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తుదారుని కుటుంబంలోని పెద్దలందరికీ కలిపి కనీసం వందరోజుల ఉపాధి కల్పించినప్పుడు;

డి) ఒక ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తుదారుని కుటుంబానికి వేతనం ద్వారా, నిరుద్యోగ భృతి ద్వారా మొత్తం వందరోజుల వేతనం ముట్టినట్లయితే;

4. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా బాధ్యత కల కార్యక్రమ అధికారి, స్థానిక ప్రభుత్వ సంస్థ (జిల్లా / మండల / గ్రామస్థాయి) కలిసి ఈ నిరుద్యోగ భృతిని ఆమోదించి, చెల్లిస్తారు.

5. సబ్ సెక్షన్ (1) కింది చెల్లించే నిరుద్యోగ భృతిని 15 రోజులలోపు చెల్లించాలి.

6. ఈ చట్టం కింద నిరుద్యోగ భృతిని చెల్లించే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం సూచించవచ్చు.

8. 1. సకాలంలో నిరుద్యోగ భృతిని చెల్లించలేకపోయినా, లేదా తన పరిధిలో లేని కారణాల వల్ల అసలే చెల్లించలేకపోయినా ఆ విషయాన్ని జిల్లా కో–ఆర్డినేటర్‌కి కార్యక్రమ అధికారి తెలియ చెయ్యాలి. ఆయా కారణాలను ఒక ప్రకటనలో తెలియచేస్తూ దానిని వారి నోటీసు బోర్డు, గ్రామ పంచాయితీ నోటీస్‌బోర్డు, అవసరమనుకున్న ఇతర ప్రముఖ స్థలాల్లో ఉంచాలి.

2. నిరుద్యోగ భృతిని చెల్లించని, ఆలస్యంగా చెల్లించిన సందర్భాలనన్నింటినీ వాటికి గల కారణాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే వార్షిక నివేదికలో జిల్లా కోఆర్డినేటర్ పేర్కొనాలి.

3. సబ్ సెక్షన్ (1) లో పేర్కొన్న నిరుద్యోగభృతిని ఆయా కుటుంబాలకు సాధ్యమయినంత త్వరగా చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకోవాలి.

9. నిరుద్యోగ భృతికి అనర్హులయ్యే సందర్భాలు : దరఖాస్తుదారు–

ఎ) ఒక పథకం కింద ఆ కుటుంబానికి కేటాయించిన ఉపాధిని స్వీకరించకపోయినా;

బి) కార్యక్రమ అధికారి లేదా అమలుచేసే సంస్థ పనికి హాజరుకమ్మని చెప్పిన 15 రోజులలోపు హాజరు కాకపోయినా;

సి) సంబంధిత అమలు చేసే సంస్థ అనుమతి లేకుండా వరుసగా వారం రోజుల పాటు హాజరు కాకపోయినా, లేదా ఒక నెలలో వారం రోజులకు పైగా హాజరు కాకపోయినా,

ఈ చట్టం కింద మూడు నెలల వరకు నిరుద్యోగ భృతిని కోరే అధికారం ఉండదు, కాని పథకంలో పని కల్పించమని ఎప్పుడైనా అడగవచ్చు.

అధ్యాయం - IV
అమలు చేసే, పర్యవేక్షించే సంస్థలు

10. 1. ఈ చట్టం కింద అప్పగించే బాధ్యతలు నిర్వర్తించటానికి కేంద్ర ఉపాధి హామీ సంఘం పేరుతో ఒక సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. ఇది ఏ తేదీ నుంచి పనిచేస్తుందో కేంద్ర ప్రభుత్వం తెలియ చేస్తుంది.

2. కేంద్ర సంఘంలో ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉండవలెను.

3. కేంద్ర సంఘంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా నియమితులయ్యే ఈ క్రింది సభ్యులు ఉంటారు.

ఎ) అధ్యక్షులు

బి) సంయుక్త కార్యదర్శికి తక్కువ కాని హోదాలోని ప్రణాళిక సంఘం ప్రతినిధులు, కేంద్ర మంత్రివర్గం ప్రతినిధులు, వీరి సంఖ్యను కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది;

సి) కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంఖ్యకు లోబడిన రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు;

డి) 15 కి మించకుండా పంచాయితీ రాజ్ సంస్థలు, కార్మిక సంఘాలు, ఇతర నిరాకరించబడిన అధికారులు కాని ప్రతినిధులు.

వీరిలో సంవత్సర కాలం చొప్పున రొటేషన్ పద్ధతిపై కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లు ఇద్దరు ఉండాలి.

ఇలా నామినేట్ చేసిన సభ్యులలో 33 శాతానికి తగ్గకుండా మహిళలు ఉండాలి. అంతేకాకుండా ఇలా నామినేట్ చేసిన సభ్యులలో 33 శాతానికి తగ్గకుండా షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, ఇతర వెనుకబడిన వర్గాలు, అల్ప సంఖ్యాక వర్గాల సభ్యులు ఉండాలి;

ఇ) కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంఖ్యకు లోబడి రాష్ట్రాల ప్రతినిధులు;

ఎఫ్) కేంద్ర ప్రభుత్వానికి చెందిన సంయుక్త కార్యదర్శి హోదాకి తక్కువ కాని సభ్య కార్యదర్శి.

4. కేంద్ర సంఘం అధ్యక్షులు, సభ్యుల నియమ నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సిఫారసు చేస్తుంది. అదే విధంగా సమావేశాలు ఎక్కడ, ఎప్పుడు, ఎలా (కోరం వంటి వాటితో సహా) జరగాలి అన్న అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం సూచిస్తుంది.

11. 1. కేంద్ర సంఘం ఈ కింద పేర్కొన్న విధులు, బాధ్యతలు నిర్వహిస్తుంది.

ఎ) మూల్యాంకనం, పర్యవేక్షణలకు కేంద్ర వ్యవస్థను ఏర్పాటు చేయటం;

బి) చట్టం అమలుకు సంబంధించి అన్ని విషయాలలో కేంద్ర ప్రభుత్వానికి సలహాలు;

సి) పర్యవేక్షణ, సమస్యల పరిష్కార విధానాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అభివృద్ధి కొరకు సిఫారసు చేయడం;

డి) ఈ చట్టం కింద రూపొందిన పథకాలను సాధ్యమైనంతగా ప్రచారం చేయడం;

ఇ) ఈ చట్టం అమలును పర్యవేక్షించడం;

యఫ్) ఈ చట్టం అమలుపై పార్లమెంటు ముందు కేంద్ర ప్రభుత్వం ఉంచే వార్షిక నివేదికలను తయారు చేయడం;

జి) కేంద్ర ప్రభుత్వం అప్పగించే ఇతర ఏ బాధ్యతలైనా నిర్వర్తించడం;

2. ఈ చట్టం కింద చేపట్టిన వివిధ పథకాలను మూల్యాంకనం చేసే అధికారం కేంద్ర సంఘానికి ఉంటుంది. దీని కోసం పథకాల అమలు, గ్రామీణ ఆర్థిక పరిస్థితికి సంబంధించిన గణాంకాలను సేకరించవచ్చు/ సేకరింప చేయవచ్చు.

12. 1. రాష్ట్రస్థాయిలో ఈ చట్టం అమలును క్రమం తప్పకుండా సమీక్షించటానికి, పర్యవేక్షించటానికి రాష్ట్ర ఉపాధిహామీ సంఘం పేరుతో ఒక సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. దీనికి చైర్‌పర్సన్, అధికార ప్రతినిధులు, 15 కి మించకుండా రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసిన పంచాయితీరాజ్ సంస్థలు, కార్మిక సంఘాలు, ఇతర నిరాకరించబడిన బృందాల నుంచి అధికారులు కాని ప్రతినిధులు ఉంటారు.

అధికారులు కాని ప్రతినిధులలో అధికారులు కాని సభ్యులలో 33 శాతానికి తగ్గకుండా మహిళలు ఉండాలి.

అంతేగాకుండా వీరిలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన వర్గాలు, అల్పసంఖ్యాక వర్గాల వారు 33 శాతానికి తగ్గకుండా ఉండాలి.

2. రాష్ట్ర సంఘం చైర్‌పర్సన్, సభ్యుల నియమ, నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేస్తుంది. అదే విధంగా సమావేశాలు ఎక్కడ, ఎప్పుడు, ఎలా (కోరం వంటి వాటితో సహా) జరగాలి అన్న అంశాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం సూచిస్తుంది.
3. రాష్ట్ర సంఘం ఈ క్రింద పేర్కొన్న విధులను నిర్వర్తిస్తుంది.
   ఎ) చట్టం అమలుకు సంబంధించి అన్ని విషయాలలో రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు;
   బి) ప్రాధాన్యత పనులను నిర్ణయించడం;
   సి) పర్యవేక్షణ, సమస్యల పరిష్కార విధానాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అభివృద్ధి కొరకు సిఫారసు చేయడం;
   డి) ఈ చట్టం, దీని కింద రూపొందిన పథకాలను సాధ్యమైనంత ఎక్కువగా ప్రచారం చేయడం;
   ఇ) ఈ చట్టం పథకాల అమలును రాష్ట్రంలో పర్యవేక్షిస్తూ కేంద్ర సంఘంతో సమన్వయపరచటం.
   ఎఫ్) ఈ చట్టం అమలుపై రాష్ట్ర శాసనసభ ముందు రాష్ట్ర ప్రభుత్వం ఉంచే వార్షిక నివేదికను తయారుచేయడం.
   జి) రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర సంఘం అప్పగించే ఇతర ఏ బాధ్యతలైనా
4. ఈ చట్టం కింద రాష్ట్రంలో చేపట్టిన వివిధ పథకాలను మూల్యాంకనం చేసే అధికారం రాష్ట్ర సంఘానికి ఉంటుంది. దీని కోసం పథకాల అమలు, గ్రామీణ ఆర్థిక పరిస్థితికి సంబంధించిన గణాంకాలను సేకరించవచ్చు/ సేకరింప చేయవచ్చు.

13. పథకాల తయారీ అమలుకు బాధ్యత వహించే అధికారులు :

1. ఈ చట్టం కింద పథకాలను తయారుచేయడం, అమలు చేయడానికి జిల్లా, మండల, గ్రామ పంచాయితీ ప్రధాన సంస్థలుగా ఉంటాయి.
2. జిల్లా పంచాయితీ విధులు:
   ఎ) పథకం కింద చేపట్టే మండల వారీ ప్రాజెక్టులను ఖరారు చేసి, ఆమోదించటం.
   బి) జిల్లా స్థాయిలో, మండల స్థాయిలలో చేపట్టిన ప్రాజెక్టులను పర్యవేక్షించటం;
   సి) రాష్ట్ర సంఘం ఎప్పటికప్పుడు అప్పగించే ఇతర బాధ్యతలు.
3. మండల పరిషత్ విధులు :
   ఎ) మండల స్థాయి ప్రణాళికను ఆమోదించి జిల్లా పంచాయితీకి తుది ఆమోదం నిమిత్తం పంపించటం.
   బి) గ్రామపంచాయితీ, మండల పరిషత్ స్థాయిలలో చేపట్టిన ప్రాజెక్టులను పర్యవేక్షించడం;

సి) రాష్ట్ర సంఘం ఎప్పటికప్పుడు అప్పగించే ఇతర బాధ్యతలు,

4. ఈ చట్టం కింద జిల్లా పరిషత్ తన విధులను నిర్వర్తించడంలో జిల్లా కోఆర్డినేటర్ సహాయపడతారు.

14. 1. జిల్లాలో పథకాన్ని అమలు చేయటానికి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిని కానీ, జిల్లా కలెక్టరు కానీ, తగిన హోదా కలిగిన ఏ ఇతర జిల్లా అధికారిని గానీ జిల్లా కోఆర్డినేటర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది.

2. ఈ చట్టం తదనుగుణంగా రూపొందిన నియమాల ప్రకారం ఈ పథకాన్ని జిల్లాలో అమలు చేసే బాధ్యత జిల్లా కోఆర్డినేటర్‌ది.

3. జిల్లా కోఆర్డినేటర్ విధులు :

ఎ) ఈ చట్టం, దానికింద తయారయిన పథకాల అమలులో తన విధులను నిర్వర్తించడంలో జిల్లా పరిషత్‌కి సహాయం చేయడం;

బి) మండలాల వారీగా ప్రణాళికలను, ఇతర అమలు చేసే సంస్థలు తయారు చేసిన ప్రతిపాదనలను క్రోడీకరించటం, జిల్లా పరిషత్ ఆమోదం నిమిత్తం వాటిని దాని ముందు ఉంచటం;

సి) అవసరమైన సందర్భాలలో పరిపాలన పరమైన ఆమోదాన్ని ఇవ్వడం;

డి) చట్టం ఇచ్చిన హక్కులకు అనుగుణంగా దరఖాస్తుదారులకు ఉపాధి దొరికేలా తన పరిధిలోని అమలు చేసే సంస్థలు, కార్యక్రమ అధికారులతో సమన్వయం;

ఇ) కార్యక్రమ అధికారుల పనితీరును సమీక్షించటం, పర్యవేక్షించటం;

ఎఫ్) అమలులో ఉన్న పనులను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం;

జి) దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించడం

4. ఈ చట్టం క్రింద తన విధులను నిర్వర్తించడానికి అవసరమయ్యే పరిపాలన, ఆర్థిక సంబంధ అధికారాలను జిల్లా కోఆర్డినేటర్‌కి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుంది.

5. సెక్షన్ 15, సబ్‌సెక్షన్ (1) కింద నియమితులైన కార్యక్రమ అధికారులు, జిల్లాలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ, స్థానిక ప్రభుత్వ సంస్థల అధికారులు ఈ చట్టం, దాని కింద రూపొందిన పథకాల అమలులో జిల్లా కోఆర్డినేటర్‌కి సహాయపడాలి.

6. ప్రతి డిసెంబరు నెలలో రానున్న ఆర్థిక సంవత్సరానికి జిల్లా కోఆర్డినేటర్ బడ్జెట్ తయారు చేయాలి. దీంట్లో నైపుణ్యత లేని పనికి గల డిమాండు, పథకంలోని పనుల కింద కార్మికులకు పని కల్పించే వివరాలు ఉండాలి. దీనిని జిల్లా పరిషత్ స్థాయి సంఘానికి అందజేయాలి.

15. 1. ప్రతిమండల పరిషత్‌కి ఒక కార్యక్రమ అధికారిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. వీరు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన తగిన అర్హతలు, అనుభవాలు కలిగి ఉండి మండల అభివృద్ధి అధికారి హోదాకు తక్కువ కాకుండా ఉండాలి.

2. ఈ చట్టం దాని కింద తయారయిన పథకాల అమలులో తన విధులను నిర్వర్తించడంలో మండల పరిషత్‌కి కార్యక్రమ అధికారి సహాయం చేస్తారు.
3. తన పరిధిలో పనికి ఉన్న డిమాండును, చేపట్టే ప్రాజెక్టులలో పని కల్పించటానికి గల అవకాశాలను సమన్వయ పరచడం కార్యక్రమ అధికారి బాధ్యత.
4. గ్రామపంచాయితీ, మండల పరిషత్‌ల నుంచి అందిన ప్రతిపాదనల ఆధారంగా కార్యక్రమ అధికారి ఆ మండలానికి ప్రణాళిక తయారు చెయ్యాలి.
5. కార్యక్రమ అధికారి విధులు :
   ఎ) మండలంలో గ్రామపంచాయితీలు, ఇతర అమలు చేసే సంస్థలు చేపట్టిన ప్రాజెక్టుల పర్యవేక్షణ;
   బి) అర్హులైన కుటుంబాలకు నిరుద్యోగ భృతిని ఆమోదించి, చెల్లించడం;
   సి) మండలంలో చేపట్టిన పథకాలను కార్మికులందరికీ వెంటనే, సక్రమంగా వేతనం చెల్లించేలా చూడటం;
   డి) గ్రామపంచాయితీ పరిధిలో జరిగే అన్ని పనులను గ్రామసభ సామాజిక తనిఖీ చేసేలా చూసి, అందులో వ్యక్తమైన అభ్యంతరాలకు సంబంధించి వెంటనే చర్యలు తీసుకునేలా చూడటం;
   ఇ) మండలంలో పథకం అమలుకు సంబంధించి వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించటం;
   ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వం, లేదా జిల్లా కోఆర్డినేటర్ అప్పగించే ఇతర పనులు.
6. జిల్లా కోఆర్డినేటర్ ఆదేశాలు, నియంత్రణ, పర్యవేక్షణలకు లోబడి కార్యక్రమ అధికారులు పనిచేస్తారు.
7. కార్యక్రమ అధికారి నిర్వర్తించే అన్నీ లేదా కొన్ని విధులను గ్రామపంచాయితీ లేదా ఇతర స్థానిక ప్రభుత్వ సంస్థలు నిర్వర్తించేలా బాధ్యతలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయవచ్చు.

16. గ్రామ పంచాయతీల బాధ్యతలు :

1. గ్రామసభ, వార్డుసభల సిఫారసులకు అనుగుణంగా ఈ పథకం కింద గ్రామ పంచాయితీ పరిధిలో ప్రాజెక్టులు గుర్తించటానికి, ఈ పనుల అమలు పర్యవేక్షణకు గ్రామ పంచాయితీ బాధ్యత వహిస్తుంది.
2. కార్యక్రమ అధికారి ఆమోదం ప్రకారం గ్రామ పంచాయితీ పరిధిలో ఏ పథకాన్నయినా గ్రామ పంచాయితీ చేపట్టవచ్చు.
3. గ్రామసభ, వార్డు సభల సిఫారసులను పరిగణనలోకి తీసుకుని ప్రతి గ్రామ పంచాయితీ ఒక అభివృద్ధి ప్రణాళికను తయారు చేయాలి. పనికి డిమాండు ఏర్పడినపుడు ఈ పథకం కింద చేపట్టటానికి పనుల జాబితాను తయారు చేసుకుని ఉంచుకోవాలి.
4. అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రతిపాదనలను వాటి ప్రాధాన్యతలతో సహా కార్యక్రమ అధికారికి తనిఖీ, ప్రాథమిక ఆమోదం నిమిత్తం అమలు సంవత్సరం మొదలు కాక ముందే గ్రామపంచాయితీ అందచేస్తుంది.

5. ప్రాజెక్టులపై ఖర్చు చేసే మొత్తం కనీసం 50 శాతం పనులు గ్రామపంచాయితీ ద్వారా అమలు చెయ్యటానికి కార్యక్రమ అధికారి కేటాయిస్తారు.

6. ప్రతి గ్రామపంచాయితీకి కార్యక్రమ అధికారి ఈ క్రింది వాటిని అందజేయాలి :

   ఎ) గ్రామ పంచాయితీ ద్వారా అమలుకు ఆమోదించిన పనుల నిమిత్తం హాజరు పట్టిక

   బి) గ్రామపంచాయితీ వాస్తవ్యులకు ఇతర ప్రాంతాలలో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల జాబితా.

7. దరఖాస్తుదారుల మధ్య ఉపాధి అవకాశాలు కేటాయించి పనికి హాజరుకమ్మని గ్రామ పంచాయితీ అడుగుతుంది.

8. ఒక పథకం కింద గ్రామ పంచాయితీ అమలు చేసే పనులు సాంకేతిక ప్రామాణికాలు, కొలతల కనుగుణంగా ఉండాలి.

17. 1. గ్రామపంచాయితీ పరిధిలో అమలు అవుతున్న పనులను గ్రామసభ పర్యవేక్షిస్తుంది.

2. గ్రామ పంచాయితీ పరిధిలోని అన్ని ప్రాజెక్టులకు సంబంధించి క్రమం తప్పకుండా సామాజిక తనిఖీని గ్రామసభ నిర్వహిస్తుంది.

3. గ్రామ సభ సామాజిక తనిఖీని నిర్వహించేలా హాజరు పట్టికలు, బిల్లులు, ఓచర్లు, కొలతల పుస్తకాలు, ఆమోద ప్రతులు, ఇతర సంబంధిత పుస్తకాలు, జమా ఖర్చు లెక్కలు, కాగితాలు వంటి పత్రాలన్నింటినీ గ్రామ పంచాయితీ అందుబాటులో ఉంచుతుంది.

18. పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం :

కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చెయ్యటానికి అవసరమైన సిబ్బందిని, సాంకేతిక సహాయాన్ని జిల్లా కోఆర్డినేటర్లు, కార్యక్రమ అధికారులకు అందుబాటులో రాష్ట్ర ప్రభుత్వం ఉంచుతుంది.

19. ఫిర్యాదుల పరిష్కార విధానం :

పథకం అమలుకు సంబంధించి ఎవరి ఫిర్యాదులనయినా, మండల, జిల్లా స్థాయిలో సేకరించే పద్ధతిని నియమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తెలియచేస్తుంది. వాటి పరిష్కారానికి విధానాలను రూపొందిస్తుంది.

అధ్యాయం - V

జాతీయ, రాష్ట్రస్థాయి ఉపాధి హామీ నిధుల ఏర్పాట్లు, జమా ఖర్చుల తనిఖీ

20. 1. ఈ చట్టం కింద జాతీయ ఉపాధి హామీ నిధి పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా ఒక నిధిని ఏర్పాటు చేస్తుంది.

2. ఈ జాతీయ నిధికి అవసరమైన డబ్బులను పార్లమెంటులో ఆమోదం పొందిన మీదట అప్పు లేదా గ్రాంటు రూపంలో సమకూరుస్తుంది.

3. కేంద్ర ప్రభుత్వం సూచించిన షరతులు, నియమాలకు లోబడి జాతీయ నిధిని ఉపయోగిస్తారు.

21. 1. ఈ పథకం అమలు కోసం రాష్ట్ర ఉపాధి హామీ నిధి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా

ఒక నిధిని ఏర్పాటు చేస్తుంది.

2. చట్టం దాని కింద పథకాల అమలుకు సంబంధించి పరిపాలన సంబంధ ఖర్చుల నిమిత్తం రాష్ట్ర నిధిని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన షరతులు, నియమాలకు లోబడి ఖర్చు చేస్తారు.

3. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన సంస్థ ఈ రాష్ట్ర నిధిని రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహిస్తుంది.

22. 1. తయారు చేసిన నియమాలకు లోబడి కేంద్ర ప్రభుత్వం ఈ దిగువ ఖర్చులను భరిస్తుంది.

ఎ) పథకం కింద నైపుణ్యత అవసరం లేని కూలీలకయ్యే ఖర్చు :

బి) షెడ్యూలు 2 లోని అంశాలకు లోబడి నైపుణ్యత, కొంత నైపుణ్యత గల కూలీలతో సహా ముడి సరుకులకు అయ్యే మొత్తం ఖర్చులో 75 శాతం;

సి) పరిపాలన సంబంధ ఖర్చులలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వాటా, కార్యక్రమ అధికారులు, వారి సహాయక సిబ్బంది జీత, భత్యాలు, కేంద్ర సంఘం యొక్క పరిపాలన సంబంధ ఖర్చులు, షెడ్యూలు 2 లో పేర్కొన్న సదుపాయాలకయ్యే ఖర్చులు, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ఇతర ఖర్చులు ఇందులో ఉంటాయి.

2. రాష్ట్ర ప్రభుత్వం ఈ కింది ఖర్చులను భరిస్తుంది :

ఎ) పథకం కింద చెల్లించవలసిన నిరుద్యోగ భృతి;

బి) షెడ్యూలు 2 లోని అంశాలకు లోబడి నైపుణ్యత, కొంత నైపుణ్యత గల కూలీలతో సహా ముడి సరుకులకు అయ్యే మొత్తం ఖర్చులో 25 శాతం.

సి) రాష్ట్రమండలికి అయ్యే పరిపాలన సంబంధ ఖర్చులు.

23. పారదర్శకత, జవాబుదారీ తనం :

1. పథకం అమలు కోసం సమకూర్చిన నిధులను సక్రమంగా వినియోగించటానికి, నిర్వహించటానికి జిల్లా కోఆర్డినేటరు, జిల్లాలోని అన్ని అమలు చేసే సంస్థలు బాధ్యత వహించాలి.

2. చట్టం కింద అమలు చేసే పథకాలలో కూలీలకు కల్పించిన ఉపాధి, చేసిన ఖర్చులకు సంబంధించి సక్రమంగా వివరాలు నమోదు చేసేలా పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేస్తుంది.

3. అన్ని స్థాయిలలో పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీ తనం ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం నియమాలను, ఏర్పాట్లను రూపొందిస్తుంది.

4. ముందుగా ప్రకటించిన తేదీలలో, గ్రామప్రజల సమక్షంలో నగదు రూపంలో ఇచ్చే కూలీ, నిరుద్యోగ భృతిని నేరుగా సంబంధిత వ్యక్తులకు చెల్లిస్తారు.

5. గ్రామ పంచాయితీ పథకాన్ని అమలు చేయటంలో ఏదైనా వివాదం ఏర్పడినా, ఫిర్యాదులు వచ్చినా వాటిని కార్యక్రమ అధికారికి నివేదించాలి.

6. కార్యక్రమ అధికారి ఒక ఫిర్యాదుల పుస్తకాన్ని పెట్టుకుని ప్రతి ఫిర్యాదును అందులో నమోదు చేయాలి. ఫిర్యాదు అందిన వారం రోజుల లోపు దానిని పరిష్కరించాలి. అది వేరొకరి పరిధిలోని

అంశమయితే ఆ ఫిర్యాదును వారికి పంపించి, ఈ విషయం ఫిర్యాదు దారునికి తెలియచేయాలి.

24. జమా, ఖర్చుల తనిఖీ :

1. పథకం అన్ని స్థాయిలలో జమా, ఖర్చుల తనిఖీకి భారత కంట్రోలర్, ఆడిటర్ జనరల్‌తో సంప్రదించి కేంద్ర ప్రభుత్వం అనువైన విధానాలను రూపొందించాలి.
2. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా పథకం కింద జమా, ఖర్చు లెక్కలను నిర్వహించాలి.

అధ్యాయం - VI
వివిధ అంశాలు

25. ఉల్లంఘనకు శిక్ష :

చట్టంలోని అంశాలను ఉల్లంఘించిన వారి యొక్క నేర నిరూపణ జరిగితే వెయ్యి రూపాయల వరకు జరిమాన విధించవచ్చు.

26. అధికార వికేంద్రీకరణ :

1. నియమాలను రూపొందించే అధికారం మినహాయించి తాను నిర్వహించే అధికారాలను పేర్కొన్న షరతులు, పరిస్థితులకు లోబడి రాష్ట్ర ప్రభుత్వంగానీ, లేదా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వముల క్రింద పనిచేసే అధికారులు గానీ నిర్వర్తించేలా పేర్కొంటూ కేంద్రం ప్రకటన జారీ చేయవచ్చు.
2. నియమాలు, పథకాలను రూపొందించే అధికారాలు మినహాయించి తాను నిర్వహించే అధికారాలను పేర్కొన్న షరతులు, పరిస్థితులకు లోబడి తనకింద పనిచేసే అధికారులు నిర్వర్తించేలా వారిని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన జారీ చేయవచ్చు.

27. కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసే హక్కు :

1. చట్టంలోని అంశాలను సమర్థంగా అమలు చేయటానికి అవసరమయ్యే ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం జారీ చేయవచ్చు.
2. సబ్‌సెక్షన్ (1) లో పేర్కొన్న అంశాలకు భంగం కలగకుండా, ఈ చట్టం కింద కేటాయించిన నిధుల దుర్వినియోగం, ఇతర అంశాలకు సంబంధించి ఫిర్యాదులంది, దాంట్లో నిజముందని ప్రాథమికంగా తేలితే ఈ విషయంలో విచారణ జరపటానికి కేంద్రప్రభుత్వం ఒక సంస్థను నియమించవచ్చు. అవసరమయితే నిధుల విడుదలను ఆపేయవచ్చు. సక్రమ అమలు కోసం అనువైన చర్యలను సకాలంలో చేపట్టేలా చేయవచ్చు.

28. ఇతర చట్టాలతో సంబంధం లేదు :

ఇతర చట్టాలలోని అంశాలతో సంబంధం లేకుండా ఈ చట్టంలోని అంశాలు, దీని కింద తయారయిన పథకాలు అమలులోకి వస్తాయి.

ఈ చట్టం కింద హామీ ఇచ్చిన ఉపాధి, సౌకర్యాలకు తక్కువ కాకుండా గ్రామీణ ప్రాంత కుటుంబాలలోని నైపుణ్యత లేని కూలీలకు హామీ ఇచ్చే రాష్ట్ర చట్టం ఉంటే ఆ చట్టాన్ని రాష్ట్రం ప్రభుత్వం అమలుచేయవచ్చు.

ఇటువంటి పరిస్థితులలో కేంద్ర చట్టం అమలులో ఉండి ఉంటే ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అందే నిధులను మించకుండా కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు కూడా నిధులు అందిస్తుంది.

29. షెడ్యూళ్ళలో మార్పుకు అధికారం :

1. షెడ్యూల్ 1, షెడ్యూల్ 2 లకు సవరణ చేయాల్సిన అవసరం ఉందనుకుంటే ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా సవరణలు చేయవచ్చు.
2. సబ్‌సెక్షన్ (1) ప్రకారం చేసిన సవరణల ప్రతులను సాధ్యమైనంత వెంటనే పార్లమెంటు ఉభయసభలలో ఉంచాలి.

30. సదుద్దేశంతో చేసిన చర్యలకు రక్షణ :

ఈ చట్టం కింది విధులు నిర్వర్తించే జిల్లా కోఆర్డినేటర్, లేదా కార్యక్రమ అధికారి, లేదా భారత శిక్షాస్మృతిలోని 21 సెక్షన్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగిపై వారు సద్బుద్ధితో ప్రవర్తించినంతమేరకు ఎటువంటి దావాలు, చట్టపరమైన కేసులు ఉండవు.

31. కేంద్ర ప్రభుత్వానికి నియమాలు తయారుచేసే అధికారం :

1. ఈ చట్టంలోని అంశాలను అమలు చెయ్యటానికి నియమాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటన ద్వారా తెలియచేయాలి.
2. పైన ఉదహరించిన అధికారమునకు భంగం కాకుండా ఈ క్రింది అంశములపై కేంద్ర ప్రభుత్వం నియమావళులను చేయవచ్చు.
   ఎ) సెక్షన్ 10 లోని సబ్‌సెక్షన్ (3) కింద క్లాజ్ (ఇ) ప్రకారం ఉండాల్సిన రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధుల సంఖ్య;
   బి) సెక్షన్ 10, సబ్‌సెక్షన్ (4) ప్రకారం కేంద్ర సంఘం చైర్‌పర్సన్, ఇతర సభ్యుల నియామకానికి సంబంధించిన షరతులు, నియమాలు, కేంద్ర సంఘ సమావేశాలు ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరగాలి (ఇటువంటి సమావేశాలకు కోరంతో సహా) వంటి నియమాలు;
   సి) సెక్షన్ 20, సబ్‌సెక్షన్ (3) ప్రకారం జాతీయ నిధిని ఉపయోగించే విధానం, షరతులు, పరిమితులు;
   డి) సెక్షన్ 22, సబ్‌సెక్షన్ (1) కింద కొన్ని అంశాలకు అయ్యే ఖర్చులకు నిధులు సమకూర్చటానికి సంబంధించిన నియమాలు;
   ఇ) కేంద్ర ప్రభుత్వం నియమాల ద్వారా సిఫారసు చేయవలసిన ఇతర అంశాలు ఏవైనా.

32. నియమాలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారాలు :

1. ఈ చట్టంలోని అంశాలను అమలు చెయ్యటానికి, కేంద్ర ప్రభుత్వ నియమాలకు లోబడి రాష్ట్ర ప్రభుత్వం నియమాలను ప్రకటనల ద్వారా తెలియచేయాలి.
2. పైన ఉదహరించిన అధికారమునకు భంగం కాకుండా ఈ క్రింది అంశములపై రాష్ట్ర ప్రభుత్వం నియమావళులను చేయవచ్చు.

ఎ) సెక్షన్ 7, సబ్‌సెక్షన్ (2) కింద నిరుద్యోగ భృతికి అర్హతకు సంబంధించి నియమ నిబంధనలు;

బి) సెక్షన్ 7, సబ్‌సెక్షన్ (6) క్రింద నిరుద్యోగ భృతి చెల్లించే విధానం;

సి) సెక్షన్ 12, సబ్‌సెక్షన్ (2) ప్రకారం రాష్ట్ర సంఘం చైర్‌పర్సన్, ఇతర సభ్యుల నియామకానికి సంబంధించిన షరతులు, నియమాలు, రాష్ట్ర సంఘ సమావేశాలు ఎప్పుడు, ఎక్కడ, ఎలా జరగాలి (ఇటువంటి సమావేశాలకు కోరంతో సహా) వంటి నియమాలు;

డి) సెక్షన్ 19 ప్రకారం మండల, జిల్లా స్థాయిలలో సమస్యల పరిష్కారానికి ఉండే విధానం;

ఇ) సెక్షన్ 21, సబ్‌సెక్షన్ (2) ప్రకారం రాష్ట్ర నిధిని ఉపయోగించే విధానం, షరతులు, నియమాలు;

ఎఫ్) సెక్షన్ 21, సబ్‌సెక్షన్ (3) కింద రాష్ట్రనిధిని నిర్వహించే సంస్థ, వినియోగించే విధానం;

జి) సెక్షన్ 23, సబ్‌సెక్షన్ (2) కింద చేసిన ఖర్చు, కూలీలకు కల్పించిన ఉపాధి వివరాలు తెలియ చేసే పుస్తకాల నిర్వహణ విధానం;

హెచ్) సెక్షన్ 23, సబ్‌సెక్షన్ (3) ప్రకారం పథకాల సక్రమ అమలుకు అవసరమయ్యే ఏర్పాట్లు;

ఐ) సెక్షన్ 24, సబ్‌సెక్షన్ (2) ప్రకారం పథకం కింద జమా ఖర్చు లెక్కలు నిర్వహించే విధానం;

జె) రాష్ట్ర ప్రభుత్వం నియమాల ద్వారా సిఫారసు చేయవలసిన ఇతర అంశాలు ఏవైనా

33. నియమాలు, పథకాలను పార్లమెంటు ముందు ఉంచటం :

1. ఈ చట్టం కింద కేంద్ర ప్రభుత్వం తయారు చేసే ప్రతి ఒక్క నియమాన్ని పార్లమెంటు సమావేశాలు జరుగుతుండగా 30 రోజుల పాటు ఉభయ సభల ముందు ఉంచాలి. ఈ నియమాలకు ఉభయసభలూ ఏవైనా మార్పు చేసినచో ఆ మార్పులు ఆ తరువాత తేదీ నుంచే అమలుకు వచ్చును. ఈ లోపల మొదటి నియమావళి ప్రకారం ఏమైనా చర్యలను చేపట్టిన యెడల అవి రద్దు అవవు.
2. ఈ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం చేసే నియమాలను, పథకాలను అవి రూపొందించిన వెంటనే శాసనసభ, విధానమండలి ముందు ఉంచాలి.

34. అవాంతరాలు తొలగించే అధికారం :

1. ఈ చట్టం అమలులో ఎటువంటి అవాంతరాలు వచ్చినా వీటిని అధిగమించటానికి చట్టంలోని అంశాలకు విరుద్ధంగా లేని విధంగా కేంద్ర ప్రభుత్వం అధకారిక గెజెట్టులో ప్రచురించటం ద్వారా జారీ చేయవచ్చు.

అయితే ఈ చట్టం చేసిన మూడు సంవత్సరాల తరువాత ఈ సెక్షన్ కింద ఎటువంటి ఆదేశాలు జారీ చేయకూడదు.

2. ఈ సెక్షన్ కింద జారీ చేసిన అన్ని ఆదేశాలను సాధ్యమైనంత త్వరగా పార్లమెంటు ఉభయసభల ముందు ఉంచాలి.

షెడ్యూల్ - I

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉండాల్సిన కనీస అంశాలు

1. ఈ దిగువ పేర్కొన్న పనులపై వరసక్రమంలో పథకం దృష్టి కేంద్రీకరిస్తుంది.

i) వీటి సంరక్షణ, వాన నీటి నిల్వ,

ii) కరువు నుంచి రక్షణ నిచ్చే పనులు (చెట్లు నాటడంతో సహా).

iii) సాగునీటి కాలువలు, చిన్న సూక్ష్మస్థాయి సాగునీటి పనులతో సహా;

iv) షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డు తెగలు లేదా భూ సంస్కరణల ఫలితంగా భూమి పొందిన వారు లేదా కేంద్ర ప్రభుత్వ ఇందిరా ఆవాస్ యోజన లబ్దిదారులు పొందిన భూమికి సాగునీటి సదుపాయాల కల్పన;

v) సాంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ, చెరువుల పూడిక తీయటం;

vi) భూ అభివృద్ధి;

vii) వరద నియంత్రణ, రక్షణ పనులు, నీరు నిలబడిపోయే ప్రాంతాలలో మురుగునీరు తీసేసే పనులు;

viii)గ్రామీణ ప్రాంతాలకు అన్ని కాలాలలో అనువైన రోడ్ల సదుపాయం;

ix) రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ఇతర పనులు

2. చిరకాలం నిలబడే ఆస్తుల ఏర్పాటు, గ్రామీణ పేదల జీవనోపాధికి అవసరమైన వనరులను బలపరచటం పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యంగా ఉంటుంది.

3. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాలలోనే పనులు చేపట్టాలి.

4. చిరకాలం నిలబడే ఆస్తుల ఏర్పాటు చేయగల సామర్థ్యం బట్టి వివిధ ప్రాంతాలకు రాష్ట్ర సంఘం ప్రాధాన్యతతో కూడిన పనుల జాబితాను రూపొందిస్తుంది.

5. పథకం కింద ఏర్పాటయిన ప్రజా ఆస్తుల సక్రమ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నియమాలకు లోబడి ఇది ఉంటుంది.

6. ప్రకటించిన వేతనం కంటే తక్కువ మొత్తాన్ని కార్మికులకు ఎట్టి పరిస్థితులలోను చెల్లించకూడదు.

7. చేసిన పనిని బట్టి వేతనం చెల్లించే పక్షంలో రాష్ట్ర సంఘంతో సంప్రదించి ప్రతి సంవత్సరం వివిధ పనులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే రేట్ల ఆధారంగా వేతనం చెల్లించాలి.

8. పని చేసే వ్యక్తి ఏడు గంటల పాటు పనిచేస్తే ప్రకటించిన వేతనం మొత్తం వచ్చేలా నైపుణ్యత లేని పనులకు రేట్ల షెడ్యూలును నిర్ణయించాలి.

9. ప్రాజెక్టుకు అయ్యే ఖర్చు మొత్తంలో నైపుణ్యత, కొంత నైపుణ్యత గల కూలీలతో సహా ముడిసరుకులకు అయ్యే ఖర్చు 40 శాతానికి మించకూడదు.

10. ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులను పనికి హాజరుకమ్మని ఆదేశించే బాధ్యత కార్యక్రమ అధికారి, గ్రామ పంచాయితీలపై ఉంటుంది.

11. ప్రాజెక్టుల అమలుకు కాంట్రాక్టర్ల నియామకాన్ని పథకం ఒప్పుకోదు.

12. పథకం ప్రకారం చేపట్టిన పనులు సాధ్యమైనంత వరకు వ్యక్తులతోనే చెయ్యాలి గాని యంత్రాలను ఉపయోగించకూడదు.

13. పథకం అమలు అయ్యే అన్ని స్థాయిలలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా ఏర్పాట్లు ఉండాలి.

14. పథకం కింద చేపట్టిన పనులు నాణ్యతగా ఉండేలా, చేసిన పని, దాని నాణ్యతకు అనుగుణంగా కార్మికులకు మొత్తం వేతనం లభించేలా చూడటానికి క్రమం తప్పకుండా పనుల పర్యవేక్షణ, తనిఖీ జరిగేలా ఏర్పాట్లు ఉండాలి.

15. పథకం అమలుకు సంబంధించి తమ పరిధిలో సాధించిన ప్రగతిని తెలియచేసే గణాంకాలు, వివరాలతో జిల్లా కోఆర్డినేటర్ కార్యక్రమ అధికారి, గ్రామ పంచాయితీ ప్రతి సంవత్సరం ఒక నివేదిక తయారు చేయాలి. ప్రజలు కోరిన మీదట పథకంలో పేర్కొన్న రుసుం వసూలు చేసి వాటి ప్రతులను అందచేయాలి.

16. పథకానికి సంబంధించిన అన్ని రికార్డులు, జమా, ఖర్చు లెక్కలు ప్రజలు చూడటానికి అనువుగా అందుబాటులో ఉంచాలి. ఎవరికైనా వాటి ప్రతులు కావలసి వుంటే పథకంలో పేర్కొన్న రుసుము తీసుకుని వాటిని అందచేయాలి.

17. పథకంలో పేర్కొన్న రుసుం చెల్లించిన మీదట ఆసక్తి వున్న ఏ వ్యక్తి అయిన చూడటానికి పథకం కింద ప్రతి ప్రాజెక్టుకి సంబంధించిన హాజరు పట్టిక ప్రతులు కార్యక్రమ అధికారి, గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో ఉండాలి.

షెడ్యూల్ - II

గ్రామీణ ఉపాధి హామీకి సంబంధించిన షరతులు, కూలీల కనీస హక్కులు

1. ప్రతి ఇంటిలోని పెద్దలు

i) గ్రామీణ ప్రాంతంలో ఉంటూ;

ii) నైపుణ్యత లేని పని చెయ్యటానికి సిద్ధంగా ఉంటే;

తమ పేరు, వయసు, ఇంటి చిరునామా వివరాలను సంబంధిత గ్రామ పంచాయితీకి ఇచ్చి తమ కుటుంబాన్ని నమోదు చేసుకుని పని పత్రాన్ని పొందవచ్చు.

2. అవసరమనుకుంటే తగిన విచారణ జరిపిన మీదట కుటుంబాన్ని నమోదు చేసి, పని పత్రం జారీ చేయటం గ్రామ పంచాయితీ బాధ్యత, పని పత్రంలో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్న విధంగా కుటుంబంలోని పెద్దవాళ్ళందరి పేర్లు, వారి ఫోటోలు ఉండాలి.

3. పేరా 2 ప్రకారం చేసిన నమోదు కాలం అయిదు సంవత్సరాలకు తక్కువ కాకుండా పథకంలో పేర్కొన్న ప్రకారం ఉండాలి, దీనిని ఎప్పటికప్పుడు పునరుద్ధరించాలి.

4. నమోదు చేసుకున్న కుటుంబ పని పత్రంలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకం కింద నైపుణ్యత లేని కూలి పని కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

5. ఒక కుటుంబం కింద నమోదు చేసుకున్న వ్యక్తులందరికీ కలిపి చట్టానికి లోబడి ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం వందరోజుల పని దొరికేలా ప్రతి వ్యక్తి దరఖాస్తు చేసుకున్నన్ని రోజులకు పని ఇవ్వాలి.

6. పనికి దరఖాస్తు చేసుకున్న 15 రోజులలో, లేదా ముందుగానే దరఖాస్తు చేసుకుంటే కోరిన తేదీ నుంచి పేరా 5 లో పేర్కొన్న ప్రతి దరఖాస్తు దారునికి పని కేటాయించేలా కార్యక్రమ అధికారి చూడాలి;

పని కల్పించటంలో మహిళలకు ప్రాధాన్యత నివ్వాలి. పని కోసం నమోదు చేసుకుని, పని కోరిన మహిళలు కనీసం 33 శాతం ఉండాలి.

7. కనీసం 14 రోజుల పాటు వరుసగా పనిచేసేలా పనికి దరఖాస్తు చేసుకోవాలి.

8. కుటుంబానికి ఉన్న హక్కుకు లోబడి ఒక వ్యక్తి ఎన్ని రోజుల పనికయినా దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి ఎన్ని రోజులైనా పని కల్పించవచ్చు.

9. పథకంలో పేర్కొన్న ప్రకారం పని కోసం లిఖిత పూర్వక దరఖాస్తుని గ్రామ పంచాయితీకి గాని, కార్యక్రమ అధికారికి గాని అందచేయాలి.

10. సరిగా ఉన్న దరఖాస్తులను గ్రామ పంచాయితీ లేదా కార్యక్రమ అధికారి తప్పనిసరిగా తీసుకోవాలి. అందిన తేదీని పేర్కొంటూ దరఖాస్తు ముట్టినట్లు రశీదు ఇవ్వాలి. బృందంవారీగా కూడా దరఖాస్తులను అందచేయవచ్చు.

11. పనిపత్రంలో పేర్కొన్న చిరునామాకి పంపిన ఉత్తరం ద్వారా దరఖాస్తుదారునికి పని కేటాయించిన విషయం తెలియచేయాలి. గ్రామపంచాయితీ, లేదా మండల/జిల్లా పరిషత్ కార్యాలయాలలో ఈ నోటీసును ఉంచాలి.

12. సాధ్యమైనంత వరకు దరఖాస్తు చేసుకున్న సమయంలో ఆ వ్యక్తి ఉంటున్న గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలోపు పనిని కల్పించాలి.

13. పథకం కింద కొత్త పని మొదలు పెట్టాలంటే

ఎ) దానికి కనీసం 50 మంది కూలీలు అందుబాటులో ఉండాలి;

బి) ప్రస్తుత పనిలో కూలీలకు ఉపాధి దొరకకుండా ఉండాలి.

కొండ ప్రాంతాలు, చెట్లు నాటడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కొత్త పనులకు ఇది వర్తించదు.

14. 5 కిలోమీటర్లకు మించిన దూరంలో పని కల్పించినట్లయితే అది మండల పరిధిలోనే వుండాలి. ఇందుకు గాను అయ్యే అదనపు రవాణా ఛార్జీలు, ఖర్చుల నిమిత్తం కూలీరేటులో 10 శాతం అదనంగా చెల్లించాలి.

15. వారంలో ఆరు రోజులకు మించకుండా వరుసగా కనీసం 14 రోజుల పాటు పని కల్పించాలి.

16. నిరుద్యోగభృతి చెల్లించిన, చెల్లించాల్సి ఉన్న అన్ని సందర్భాలలో దరఖాస్తుదారులకు పని కల్పించలేకపోవటానికి కారణాలు ఏమిటో తెలియచేస్తూ లిఖిత పూర్వకంగా జిల్లా కోఆర్డినేటర్‌కి కార్యక్రమ అధికారి తెలియచెయ్యాలి.

17. నిరుద్యోగ భృతి చెల్లించిన సందర్భాలలో పని కల్పించలేక పోవటానికి కారణాలను వార్షిక నివేదికలో పేర్కొంటూ రాష్ట్ర సంఘానికి జిల్లా కోఆర్డినేటర్ తెలియచేయాలి.

18. ఈ పథకం కింద ముందుగానే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. అంటే ఫలానా తేదీ నుంచి పని కావాలని ముందుగానే దరఖాస్తు ఇవ్వవచ్చు.

19. ఈ పథకం కింద వేరు వేరు సమయాలలో పని కోరుతూ ఒకే వ్యక్తి అనేక దరఖాస్తులను అందచేయవచ్చు.

20. పథకంలో సూచించిన విధంగా జారీ చేసిన పని పత్రాలు, పాస్ పుస్తకాల వివరాలు కుటుంబ పెద్ద పేరు, వయస్సు, చిరునామా, గ్రామపంచాయితీతో నమోదు చేసుకున్న కుటుంబంలోని పెద్దవాళ్ళు వివరాలతో కూడిన రిజిస్టర్లు, వోచర్లు, ఇతర పత్రాలను గ్రామపంచాయితీ తయారు చేసి, నిర్వహించాలి, లేదా ఈ పనిని ఇతరులతో నిర్వహించాలి.

21. సంబంధిత కార్యక్రమ అధికారికి పథకంలో పేర్కొన్న మాదిరిగా క్రమం తప్పకుండా తమ వద్ద నమోదు చేసుకున్న పెద్దవాళ్ళ వివరాలు, కుటుంబాలు, వాటి చిరునామాతో పాటు ఇతరత్రా సమాచారాన్ని గ్రామ పంచాయితీ అందచేయాలి.

22. ఉపాధి కల్పించిన వ్యక్తుల జాబితాను గ్రామ పంచాయితీ, కార్యక్రమ అధికారి కార్యాలయాలలోనూ, కార్యక్రమ అధికారి అవసరమనుకున్న ఇతర ప్రదేశాలలోనూ నోటీసు బోర్డులో ఉంచాలి. ఈ జాబితా రాష్ట్ర ప్రభుత్వం గాని, ఆసక్తి ఉన్న ఏ వ్యక్తి అయినా గాని తనిఖీ చెయ్యటానికి వీలుగా అందుబాటులో ఉండాలి.

23. పేరును నమోదు చేసుకున్న వ్యక్తి తప్పుడు సమాచారం ఇచ్చాడని ఏ సమయంలోనైనా గ్రామ పంచాయితీకి నిర్ధారితమయితే వారి పేరును రిజిస్టరు నుంచి తొలగించమని కార్యక్రమ అధికారికి సూచనలిచ్చి పనిపత్రాన్ని తిరిగి ఇవ్వమని ఆ వ్యక్తిని గ్రామ పంచాయితీ ఆదేశించవచ్చు.

24. పథకం కింద పనిచేస్తున్న సమయంలో ప్రమాద కారణంగా గాయమైతే పథకంలో పొందుపరిచిన విధంగా ఉచిత వైద్య సదుపాయం అందచేయాలి.

25. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రిలో చేర్పించాల్సి వస్తే ఆసుపత్రి ఖర్చు, వైద్యం మందుల ఖర్చుతో పాటు కూలీరేటుతో 50 శాతం తగ్గకుండా చెల్లించాలి.

26. పనిచేస్తున్న సమయంలో ప్రమాదకారణంగా చనిపోయినా, తీవ్ర అంగవైకల్యం సంభవించినా అమలు చేసే సంస్థ ఆ వ్యక్తికి 25000 రూపాయిలు, లేదా కేంద్ర ప్రభుత్వం కేటాయించిన మొత్తాన్ని ఎక్స్‌గ్రేషియోగా చెల్లించాలి. అవసరమైన సందర్భంలో ఈ మొత్తాన్ని చట్టబద్ద వారసులకి చెల్లించాలి.

27. పనిజరుగుతున్న ప్రదేశంలో శుభ్రమైన తాగునీరు, పిల్లలకి ఆశ్రయం, విశ్రాంతి సమయంలో నీడ, చిన్న చిన్న దెబ్బలకు అత్యవసర చికిత్సకు ప్రధమ చికిత్స పెట్టె ఉండాలి.

28. పనిచేస్తున్న మహిళలతో పాటు ఆరు సంవత్సరాలలోపు పిల్లలు అయిదుగురు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, ఇటువంటి పిల్లల సంరక్షణకు మహిళా కూలీలలో ఒకరిని నియమించే ఏర్పాటు చేయాలి.

29. 28 లో పేర్కొన్న పని అప్పగించిన వ్యక్తికి ఆ రోజుకి కూలీ చెల్లించాలి.

30. పథకంలో పేర్కొన్న సమయంలోపు కూలీ చెల్లించకపోతే కూలీ చెల్లింపు చట్టం 1936 (4 ఆఫ్ 1936) ప్రకారం నష్టపరిహారం పొందే హక్కు ఉంటుంది.

31. పథకం కింద కూలీని మొత్తంగా నగదు రూపంలోగానీ, లేదా నగదు, బియ్యం, రూపంలోగాని చెల్లించాలి. అయితే నగదు మొత్తం 25 శాతానికి తగ్గకూడదు.

32. నగదుగా చెల్లించే మొత్తం నుంచి పని జరుగుతున్న సమయంలో కొంత ప్రతిరోజూ చెల్లించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వం సూచించవచ్చు.

33. ఒక వ్యక్తితో పాటు వచ్చిన బాలుడు / బాలికకు ప్రమాదం జరిగితే పథకంలో పేర్కొన్న ప్రకారం ఉచిత చికిత్స జరిపించాలి. చనిపోయినా, తీవ్ర అంగవైకల్యం సంభవించినా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి.

34. పథకం కింద చెల్లించే పనిలో లింగ ఆధారంగా ఎటువంటి వివక్షతకు గురి చెయ్యకూడదు, సమాన వేతన చట్టం, 1976 (25 ఆఫ్ 1976) ప్రకారం సమాన వేతనాలు చెల్లించాలి.

*****

30. మరణ వాంగ్మూలం

ఒక వ్యక్తి మరణకారణం విచారణా అంశం అయినప్పుడు, ఆ మరణించిన వ్యక్తి తన మరణానికి గల కారణాన్ని గానీ లేదా ఆ మరణానికి దారితీసిన పరిస్థితుల్నిగానీ వివరించే ప్రకటనే మరణ వాంగ్మూలమని సెక్షన్ 32(1) భారతీయ సాక్ష్యాధారాల చట్టం వివరిస్తుంది.

మరణించే మనిషి చనిపోయేముందు అబద్దం చెప్పడు అన్న సూత్రం ఆధారంగా ఈ మరణ వాంగ్మూలాన్ని ఆమోదిస్తారు. ఈ వాంగ్మూలాన్ని ఎవరైనా నమోదు చేయవచ్చు. మేజిస్ట్రేటు అందుబాటులో ఉన్నప్పుడు, తప్పనిసరిగా మేజిస్ట్రేటు మాత్రమే సాక్ష్యాన్ని నమోదు చెయ్యాలి. అలా వీలు కానిపక్షంలో పోలీసు అధికారి నమోదు చేయవచ్చు. సాక్షి సమక్షంలో ఈ సాక్ష్యాన్ని తీసుకోవాలి. మరణవాంగ్మూలం ఇచ్చినవ్యక్తి మరణించినప్పుడే ఈ వాంగ్మూలం సెక్షన్ 32 (1) భారతీయ సాక్ష్యాధారాల చట్టం ప్రకారం ప్రజాకోర్టులు ఆమోదిస్తాయి. వాంగ్మూలం ఇచ్చే వ్యక్తి పరిస్థితి తీవ్రంగా వుండి మాట్లాడే పరిస్థితిలో లేనప్పుడు వారి సైగల ద్వారా సాక్ష్యాన్ని తీసుకోవచ్చు. తదనంతరం వాంగ్మూలం ఇచ్చిన వ్యక్తికి చదివి వినిపించివారిచేత సంతకం తీసుకోవాలి. చేయలేని పరిస్థితుల్లో వున్నట్లయితే వేలిముద్ర తీసుకోవాలి. నమోదు చేసిన వాంగ్మూలాన్ని మేజిస్ట్రేట్ కోర్టుకు పంపాలి.

మరణ వాంగ్మూలం నమ్మశక్యంగా వున్నప్పుడు కోర్టులు వాటిని అవసరార్థం స్వీకరించి శిక్షలను విధిస్తాయి. ఎక్కువ శాతం వరకట్నచావుల్లాంటి కేసుల్లో ముద్దాయిలకు వ్యతిరేకంగా మనకు లభించే సాక్ష్యం మరణ వాంగ్మూలం.

ఈ మరణ వాంగ్మూలాన్ని కోర్టులు ఎలాంటి ప్రమాణం, ప్రతివాదం లేకుండా ఆమోదిస్తాయి.

మరణానికి ముందు రాసిన వుత్తరాలు కాలపరిమితితో సంబంధం లేకుండా పరిస్థితులను బట్టి కోర్టు పరిగణనలోకి తీసుకుని మరణ వాంగ్మూలంగా ఆమోదించవచ్చు.

మరణ వాంగ్మూలం ఇచ్చేవ్యక్తి సరైన మానసిక స్థితిలో వున్నారా అనే విషయం చాలా ప్రధానం. దీన్ని రాత పూర్వకంగా నమోదు చేసినపుడు ఆ స్టేట్‌మెంటు మేజిస్ట్రేటు రికార్డు చేస్తే దానికి విలువ ఎక్కువగా వుంటుంది. స్టేట్‌మెంట్ ఇచ్చినవ్యక్తి సరైన మానసిక స్థితిలో వున్నారా లేరా అనే విషయాన్ని మేజిస్ట్రేటు ధృవీకరించి వీలైతే డాక్టరు సమక్షంలో సాక్ష్యం నమోదు చేస్తే మంచిది. మానసిక యోగ్యతను కలిగి ఉన్నారనే అంశాన్ని మేజిస్ట్రేటు తెలపడం చాలా ముఖ్యం. మరణ వాంగ్మూలం మౌఖికంగా గానీ, రాత పూర్వకంగా గానీ, గుర్తులు, భావ సూచనల రూపంలో గానీ వుండవచ్చు.

మరణ వాంగ్మూలాన్ని పరిస్థితులనుబట్టి మేజిస్ట్రేట్ గానీ, డాక్టరుగానీ, పోలీసు అధికారులు గానీ లేక ఇతర వ్యక్తులెవరైనా నమోదు చేయవచ్చు. తప్పనిసరి పరిస్థితుల్లోనే పోలీసు అధికారులు నమోదుచేయాలి. అయితే అన్నిటికంటే మేజిస్ట్రేటుకిచ్చిన వాంగ్మూలానికే ఎక్కువ విలువ వుంటుంది.

*****